C

శ్రీనాథ విరచిత

శ్రీ కాశీఖండము

(మణికర్ణికా వ్యాఖ్యాన సహితము)

వ్యాఖ్యాత :

శ్రీ మల్లంపల్లి శరభేశ్వర శర్మ

894.827131
శ్రీనా - - కా
76278

తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాదు
1992

శ్రీనాథ విరచిత

శ్రీ కాశీఖండము

(మణికర్ణికా వ్యాఖ్యాన సహితము)

వ్యాఖ్యాత :

శ్రీ మల్లంపల్లి శరభేశ్వర శర్మ

తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాదు

1992

SRINATHA'S SRI KASI KHANDAMU

Commentary by

SRI MALLAMPALLY SARABHESWARA SARMA

C-23552

తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ సంఖ్య : 116

హైదరాబాదు-500 004

మొదటి ముద్రణ : జనవరి 1992

ప్రతుల సంఖ్య : 1000

వెల : రూ. 45-00

ప్రతులకు :

తెలుగు విశ్వవిద్యాలయం

లలిత కళాక్షేత్రం

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు - 500 004.

ముద్రణ :

బి. వి. అండ్ కో. ప్రెస్.

టి. నగర్,

రాజమండ్రి-533 101.

894.827137
శ్రీనా - - కా

సుందరయ్య గ్రంథాలయ సంచిక
A C. No. 76278
హైదరాబాద్-500 044.

భూమిక

తెలుగుభాషా సాహిత్య కళాసంస్కృతుల సర్వతోముఖ వికసనానికీ, వికసనానికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ చేసిన చట్టప్రకారం 1985 డిసెంబరు 2వ తేదీన రూపుదాల్చిన విశిష్ట విద్యాసంస్థ తెలుగు విశ్వవిద్యాలయం. బోధన, పరిశోధన, ప్రచురణలతోపాటు విస్తరణసేవ, రాష్ట్రేతరాంధ్రులకూ, విదేశాంధ్రులకూ సహాయ సహకారాల కల్పన వంటి బహుముఖీన కార్యక్రమాలనుకూడా ఈ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్నది. పూర్వంవున్న అకాడమీలు, తెలుగు భాషాసమితి, అంతర్జాతీయ తెలుగు కేంద్రం విలీనం కావడంతో విశ్వవిద్యాలయం పీఠాలు, కేంద్రాలు, విభాగాల సమాహారంగా వ్యవహరిస్తున్నది.

తెలుగుజాతి వైభవోన్నతులకు అద్దంపట్టే గ్రంథాల ప్రచురణ విశ్వవిద్యాలయ ప్రధానాశయాల్లో ఒకటి. విశ్వవిద్యాలయంలో విలీనం అయిన అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అవిశ్రాంత కృషిద్వారా దేశ సాహిత్యరంగంలో విశిష్టస్థానం సముపార్జించుకుంది. 1957 ఆగస్టు 7వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైన ఈ అకాడమి దేశం మొత్తంమీద ప్రప్రథమ రాష్ట్రీస్థాయి అకాడమి కావడం విశేషం. ఈ అకాడమి ప్రామాణికమైన నిఘంటువులు, పదకోశాలు, కావ్యాలు, ప్రబంధాలు, వ్యాసాలు, విమర్శలు, కల్పనాసాహిత్యం, పరిశోధనాత్మక గ్రంథాలు, జీవితచరిత్రలు, అనువాదాలు మొదలైనవి 163 గ్రంథాలు ప్రచురించింది.

తెలుగు విశ్వవిద్యాలయం ఈ ప్రచురణ సత్సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఇప్పటివరకు 124 గ్రంథాలను వెలువరించింది.

ప్రాచీనాంధ్ర సాహిత్య వైభవానికి మణిదర్పణాలుగా భాసించే ఆంధ్ర మహాభారతం, శ్రీమదాంధ్ర మహాభాగవతం, పారిజాతాపహరణం, పండితారాధ్య చరిత్ర, గోపీనాథ రామాయణం, రంగనాథ రామాయణం, సారంగధరీయం, ముకుంద విలాసం, విజయవిలాసం_ లాంటి గ్రంథాలు తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణల్లో చోటుచేసుకున్నాయి.

ప్రస్తుత గ్రంథం శ్రీనాథుని 'కాశీఖండం'. ఇ
ఖండానికి తెనుగుసేత. కాశీక్షేత్ర మహాత్మ్యం దీనికి క ప్రెగడ
'నృసింహపురాణం' తెలుగులో మొట్టమొదటి క్షేత్రమాహా త్మ్య అని చెప్ప
వచ్చు. ఇది కేవలానువాదం కాదు. నృసింహావతార కథను ఆధారం చేసుకుని క్షేత్ర
దైవత మాహాత్మ్యాలను కవి దీనిలో అభివర్ణించాడు. పురాణం అని వ్యవహరించినా
వాస్తవానికి ఇది క్షేత్ర మాహాత్మ్య కావ్యం. శ్రీనాథుడుకూడా కాశీఖండాన్ని కావ్యం
గానే మలిచాడు. తెలుగు విశ్వవిద్యాలయం కొత్తగా చేపట్టిన 'వ్యాఖ్యాస్రవంతి'
పథకం కింద వ్యాఖ్యాన సహితంగా ఈ మహాగ్రంథాన్ని తెలుగు పాఠకలోకానికి
అందిస్తున్నాం. సుప్రసిద్ధ పండితులు శ్రీ మల్లంపల్లి శరభేశ్వరశర్మగారు దీక్ష
దక్షతలతో వ్యాఖ్యానం సమకూర్చారు. వారికి మా ధన్యవాదాలు.

యథాపూర్వంగా ఈ ప్రచురణకూడా అందరి ఆదరాభిమానాలు చూరగొం
టుందని విశ్వసిస్తున్నాను.

హైదరాబాదు
తేది 21-1-92

ఆచార్య సి. నారాయణరెడ్డి
ఉపాధ్యక్షులు
తెలుగు విశ్వవిద్యాలయం.

1

దర్శనము

ఎచ్చట మొదలైనదో ; ఎచ్చటికి పోవుచున్నదో ; ; ఈ కాలవాహిని తిరిగిన మలుపులవంటి సన్నివేశములు కొన్ని నాటికి యాదృచ్ఛికము లనిపించి కాలాంతరమునకు తమలో గర్భితమైయున్న ఒక నియతిరహస్యమునకు క్రమముగా వెలువరించి_ ఆశ్చర్య మాపహిల్లజేయుచుండును.

తెలుఁగులో కాశీఖండావతరణ మొకటి యట్టిది. ఆంధ్రమహాభారతము అవతరించిన నాలుగువందల యేండ్లకు మరల గోదావరి యొడ్డుననే కాశీఖండము పుట్టినది.

అజ్ఞేయమైన నియతిరహస్యము. ఈ ప్రయోజనసిద్ధికే కొండవీటినుండి శ్రీనాథుని రాజమహేంద్రమునకు తీసికొని వచ్చి పరమ మాహేశ్వరుఁడైన వీరభద్రారెడ్డి ఆస్థానమధ్యమందు నెలకొల్పియుండును.

కొండవీటిరెడ్డి రాజ్యము అస్తమించినది. తత్కీర్తిపతాక శృంగారనైషధము వాఙ్మయాకాశవీథియందు వెలుఁగులు చిమ్ముచున్నది. రాజమహేంద్రవరములోని రెడ్డిరాజ్యముకూడ అంతర్హితమై పోయినది. వాఙ్మయక్షేత్రమునందు సుప్రతిష్ఠితమైన తత్కీర్తిస్తంభము శ్రీనాథుని కాశీఖండము దేశకాలముల ఎల్లలను చూచుచున్నది.

ఇచ్చటి యీ మృత్తికకు_ కాశీక్షేత్రమందలి మృత్తికకు ఏదియో సాజాత్యము ఉండి తీరవలెను. లేనిచో_ ఆ క్షేత్రానుభవము అజరామరమైన ఆంధ్ర కావ్యముగా ఇచ్చటి నేలలో మొలిచి చెట్టుకట్టి ఆంధ్రజాతికి అవిరళముగా అవిముక్తక్షేత్రసేవాఫలమును ప్రసాదించుచుండుట తటస్థించదు. శ్రీనాథుని కాశీఖండమును చదివికొనియే మన పూర్వులు కాశీక్షేత్ర యాత్రాఫలమును పొందియుందురు. ఆ దినములలో కాశీయాత్రకు పోవుట కష్టసాధ్యమైన విషయము. 'కాశికి పోయినవారు కాటికి పోయినవారు సమము' అన్న సామెత యీనాటిది కాదు.

ఈ సందర్భములో ప్రస్తావింపఁదగిన యనుభవ మొకటి యున్నది. ఇచ్చటినుండి కాశికి పోయి. ఆచ్చట కొన్నాళ్ళుండి తిరిగి యిచ్చటికి రాగా. ఈ రాజమహేంద్రవరము కాశివలెనే కనిపింపఁదొడఁగెను. కొన్నాళ్ళవఱకు ఆ దర్శన మట్లే

వెన్నాడుచుండెను. కాళి అద్దములోవలె కనిపించుచుండెను. ఎచ్చటనో ఉత్తరాపథములో నున్న ఆ మహాక్షేత్ర మెక్కడ ? దక్షిణాపథములోని ఈ రాజమహేంద్రవర మెక్కడ ? ఈ దిగ్భ్రమకు కారణమేమై యుండును ?

అద్దములో పడిన ప్రతిబింబములో కుడివైపు ఎడమవైపునకు, ఎడమవైపు కుడివైపునకు మారి కనిపించును. అర్ధనారీశ్వరునిలోని శివభాగము, శక్తిభాగమునకు శక్తిభాగము, శివభాగమునకు వలె !

నదీతటముల పొడుగునా తీరగసాగియున్న యీ పురాణనగరముల సన్నివేశ మొక్క తీరుగనే యున్నది.

వీనిని ఈరీతిగా ఎవ్వరు నిర్మించియుందురు ? అచ్చట గంగ, దక్షిణమునుండి ఉత్తరవాహినియై ప్రవహించుచున్నది. ఇచ్చట గోదావరి ఉత్తరమునుండి దక్షిణము వైపునకు ప్రవహించుచున్నది.

ఈ నదీప్రవాహ గతులను ఈ రీతిగా ఎవ్వరు తీర్చియుందురో ?

అచ్చట గంగయొడ్డున శ్రీ విశ్వేశ్వర జ్యోతిర్లింగము ; ఇచ్చట గోదావరి యొడ్డున శ్రీ మార్కండేయేశ్వర శివలింగము ; ఆ క్షేత్రములో నారుమడి పోసినట్లు కోట్లకొలది శివలింగములు ; ఇచ్చట కోటిలింగాల క్షేత్రము !

ఈ విధమైన బింబ ప్రతిబింబ భావన నిరంతరమై ఇది కలయో, నిజమో తెలియుటలేదు. ఈ స్ఫురణకు మూలకారణము లీలగా తోచుచున్నది. ఆది శ్రీనాథుని కాశీఖండమే అయియుండును. దేశగతమైన యీ యింద్రజాల మిట్లుండగా. ఇచ్చట కాశీఖండము పుట్టిన కాలకళలలో శివచైతన్యము జాగరితమై యున్నట్లు పొడకట్టుచున్నది.

గోదావరీ నదీగర్భములోన్న శ్రీ పట్టిసాచలశిఖరముపైన- నాడు 'ఘోడె రాయాంక' శివగురు పరంపరకు జెందిన గొప్ప శైవాచార్యపీఠము మహావైభవ ముతో నెలకొనియున్నది.

రెడ్డి రాజ్యముతోబాటు శ్రీపర్వతమునకు సోపానశ్రేణిని నిర్మించిన ప్రోలయ వేమభూపాలునినాటినుండి రెడ్డిరాజుల- ఐహికాముష్మికాభ్యుదయ వల్లికలన్నియును ఆ గురుపీఠమునకే అల్లికొని యున్నవి. కాశీఖండము పుట్టునాటికి- ఆ పీఠమును- అధిష్ఠించియున్న గురుస్వామి శ్రీ భీమేశ్వరుడు !

'ఘోడెరాయాంక సద్గురురాయ భీమేశ్వరస్వామి పదసమారాధనము' తన సాహిత్య సౌష్ఠవ ప్రభవ కారణములలో- ఒక్కటి యని- కాశీఖండ పీఠికలో

శ్రీనాథుఁడు పేర్కొనియున్నాడు. నాఁడు రాజమహేంద్రవరమును ఏలుచున్న అల్లీయవేమ, వీరభద్రభూపాలుఁడు- ఆ భీమేశ్వర గురుస్వామి పదపద్మానుధ్యాతలైన పరమ శివభక్తులు. త్రికాల శివపూజానిరతులు. ఆ ప్రభువుల యేలుబడిలో-

"ధరియింప నేర్చిరి దర్భవెట్టిన వ్రేళ్ళ
లీల మాణిక్యాంగుళీయకములు
కల్పింపనేర్చిరి గంగ మట్టియమీఁదఁ
గస్తూరికా పుండ్రకంబు నొసల
సవరింపనేర్చిరి జన్నిదమ్ముల మ్రోలఁ
దారహారములు ముత్యాలసరులు
చేర్పంగ నేర్చిరి శిఖలనెన్నడు ములఁ
గమ్మని క్రొత్త చెంగల్వ విరులు
తే॥ ధామములి వెండి పసిఁడియుఁ దడఁబడంగ
బ్రాహ్మణోత్తము లగ్రహారములయందు
వేమ భూపాలుఁ డనుజన్ము వీరభద్రు
ధాత్రి నేలింప గౌతమీ తటమునందు"

—కాశీఖండ పీఠిక

సింహవిక్రమపురము నుండి చిలక సముద్రమువఱకు తూర్పుసముద్ర తీరమును వ్యాపించియున్న రెడ్డిరాజ్యమును రాజమహేంద్రమునుండి యొక ఖండముగాఁ జేసి కుమారగిరి ప్రభువు తన బావగారైన కాటయ వేమారెడ్డిగారికి పారితోషికముగా నిచ్చెను. శ్రీనాథుఁడు కాశీఖండ పీఠికలో ఆ కాటయ వేమారెడ్డి 'మనుతుల్యు' డని కీర్తించియుండెను.

కాటయవేముని కూఁతురు అనితల్లి కాశీఖండ కృతి నాయకుఁడైన వీరభద్రారెడ్డి పట్టమహిషి ; ఆమెకు-తండ్రి యిచ్చిన అరణము. సింహాద్రిపర్యంత సీమయైన రాజమహేంద్రవర రాజ్యలక్ష్మికూడ స్వయంవరవధువై వీరభద్రారెడ్డినే వరించినది. శ్రీనాథుఁడు వీరభద్రారెడ్డిని-

'శ్రీ రాజమహేంద్రవర మ
హారాజ్యశ్రీ స్వయంవరాధీశ్వర ;'

అని సంబోధించి యున్నాఁడు. అందువల్లనే తాను జ్యేష్ఠుఁడై యున్నను వేమారెడ్డి అనుజన్ముఁడైన వీరభద్రునిచేత ధాత్రి నేలించుట. తమ్ముని హృదయములోని అభిలాష యెటీఁగియున్న వేమారెడ్డి-

"నైషధాది మహాప్రబంధములు పెక్కు-
చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడవనఘ !
యిపుడు నెప్పుఁడొడంగిన యీ ప్రబంధ
మంకితము సేయు వీరభద్రయ్యవేర"

అని-వినయ ప్రాభవప్రియములతో శ్రీనాథకవిసార్వభౌముని-అభ్యర్థించియున్నాఁడు. కాశీమహాక్షేత్ర మహిమను కీర్తించిన జిహ్వతో శ్రీనాథుఁడు ఈ వేమ, వీరభద్రుల శివపూజావిరతిని వాయార వర్ణించినాఁడు.

"ప్రకట శాఖోపశాఖలఁ బంటవంశ
ముద్ధరించిన వేమేంద్రుఁ డుదయవేళ
శివు విశాఖుని తండ్రిఁ బూజించు భక్తి
లలిత బిల్వ త్రిశాఖ పలాశములను-

త్ర్యంబకాచల కన్యకాంబు పూరంబున
నఘమర్షణ స్నాన మాచరించి
విద్దమైన మడుంగు సీర్కావి ధోవతిఁ
గనకమేఖల తోడఁ గటి ఘటించి
మూలమంత్రాక్షరంబుల భూతి మంత్రించి
పుండ్రికంబొగి ఫాలమున ధరించి
కొత్త ముత్తెములతో రుద్రాక్షమాలిక
లష్టోత్తర శతంబు లలుతఁదాల్చి
తేఁ పుండరీకాజినమునఁ గూర్చుండి శంభు
నర్చనము . జేయునపుడు మహాప్రమథుఁడు
చాల నొప్పారు రెండవ శంభునట్లు
వీరనారాయణుం డల్ల వేమవిభుఁడు."

వ్యాఘ్రాజినముపైనఁ గూర్చుండి శివార్చనము చేయుచున్న వేమారెడ్డి మహా ప్రమథుఁడు. వీరనారాయణుఁడు రెండవ శంభుడు ; 'నాఒరుద్రోరుద్ర మర్చయేత్'

-అని సంప్రదాయము. రెండవ శంభుఁడు కనుకనే తన తమ్ముని పేర- కాశీఖండ మంకితము సేయుమని యడుగఁ గలిగిన అధికారము।

ఆయన్నకుఁ దమ్ముఁడు-కాశీఖండపుఁ బెండ్లికొడుకు- శ్రీ వీరభద్రుని ।వ పూజాపరాకాష్ఠ-

"గోదావరీ పావనోదకంబుల హేమ
కలశీ శతంబుల జలక మార్చుఁ
గర్పూర కస్తూరికా కుంకుమంబులఁ
గలపంబుఁ గూర్చి శ్రీగంధములఁదు
సప్తగోదావర స్వర్ణ పుష్కర హేమ
సౌగంధికముల నర్చనము సేయుఁ
గలధౌత పాత్రలఁ గాలాగురుచ్ఛేద
బహుళ ధూపంబులు పరిఢవించుఁ

తే॥ వేనవేలు నివాళులు వి సరించు
నమృత దివ్యాన్నముల నుపహారమిచ్చు
సంఘటించు నశేషోపచారములను
బ్రమథ నాయకునకు వీరభద్ర విభుఁడు

విలసిత కీర్తిశాలియగు వీరమహేశ్వరు గేహరంబు శ్రీవిలయమునన్ ప్రతి సంధ్యమును నిర్మలసౌధ సుపర్ణ జాలకంబుల వెడలున్ గిరీశగళ మూల హలాహల కాంతిఁ బోలి, గుగ్గులు మహిసాక్షి కాసనలఁ గ్రొవ్విన మంగళ ధూపధూముల్. వల్లకి చక్కి రాహళము వంశము ధక్కి హుడుక్కి ఝర్ఝరుల్ ఝల్లరి యాదిగాఁ గలఁగు శబ్ద పరంపర తాళబద్ధమై యుల్లసిత ప్రబంధముల కొప్పుగనాడుదురగ్ని వేదిపై పల్లవపాణి వీశ్వరునిఁ బంట మహీశులు పూజసేయఁగన్.'

ఏనాటి మంగళహర్య శబ్ద పరంపరలు। దివ్య నీరాజనములు। పుణ్యధూప వాసనలు।-శ్రీనాథుని వాణియందు- నేటికిని ప్రతిధ్వనించు చున్నవి। ప్రతిబింబించు చున్నవి। అలముకొని వాసన లీనుచున్నవి.

ఆ ప్రభువు-అంతటి శివభక్తుఁడు కనుకనే శ్రీనాథుఁ డంతటివాఁడు-ఇంత సంబరపడిపోయెను.

కలిగెఁ బదియాఱు వన్నె బంగారమునకుఁ
బద్మరాగంబుతోడి సంపర్క- లబ్ధిఃకాశికాఖండమను మహాగ్రంథమునకు
నాయకుఁడు వీరభద్ర్ భూనాథుఁ డగుట-

ఇట్టి పరమ మాహేశ్వరుఁడైన వీరభద్రారెడ్డికి - కాశీక్షేత్ర్ వైభవముతో అవినాభవమైన శాశ్వత స్థితిని తెనుఁగుభాషయున్నన్ని నాళ్ళు శ్రీనాథుఁడు కల్పించెను. తన కృతిపతులలో వీరభద్రారెడ్డి మీఁదనున్నంత మక్కువ శ్రీనాథున కితరులపై లేదు. తాను 'వీరభద్రారెడ్డి విద్వాంసుఁడ' నని చెప్పికొనెను, మతీయును కాశీఖండముచివర -

కర్ణాటక్షితిపాల మౌక్తికసభాగారాంతరాకల్పిత
స్వర్ణ స్నాన జగత్ప్ర్సిద్ధ కవిరాట్సంస్తుత్యచారిత్రఃదుర్గ్రాహ్యాగభీరఃపార్శ్వముఖమదాహ్నోపరాహ్ణార్చితా
పర్ణా వల్లభఃరాజశేఖరమణిఃపంటాన్వయం గ్రామణిఃఅనినెనరార-నోరార-పిలిచి-పేరొక్కనెను.

శ్రీనాథుని యశోమూర్తి-తలఁపునఁ బొటినంతనే--తెరలు తెరలుగాఁకస్తూరికా వాసనల వలె వచ్చి- తెలుఁగు భాష పరిమళములు చిత్తమును పరవశింపఁ జేయుచుండును.

తల్లి భీమాంబ ఆంతర్వత్నియైన నాఁడే గర్భములోనున్న ఆశిశువు అంతర్వాణియైయుండును, విద్యారాజీవభవుఁడు-మారయ గారాబు కొడుకు జిహ్వాగ్రము, పైన ప్రాక్తనజన్మ విద్యలు వచ్చి చిందులు త్రొక్కియుండును. కమలనాభునిగాఁది లిమనుమఁడు చిన్నారి పొన్నారి చిఱుత కూఁకటినాఁడే అద్భుత కథాసనాథమైన మరుత్తరాట్చరిత్రముతో కావ్య వసంత సమయమునకు-తొలిమొగ్గ తొడిగెను. పలుకుల కన్నె తొక్కుపలుకులైన ప్రాకృతవు నుడిపొలములలో శాలివాహనుఁడు పరిగయేరిన నూఁగు కంకులను, నూనూఁగు మీసాల నూత్నయౌవనవేశ, శ్రీనాథుఁడు తెలుఁగు పొలములో నూర్పిడి పెట్టెను.

బ్రాహ్మ దత్త వరప్ర్సాదుఁడై నిఖిలవిద్యాసనాథుఁ డయ్యెను, లోలోన-ప్రజ్ఞా విశేషమగు 'ఋతంభర' యుదయించినది:

కొండవీటి విదత్ప్రభువుల ఆస్థానములో 'విద్వాధికారి' పదవి నలంకరించెను. విద్వాపరీక్షణవేళలయందు బహుదేశబుధులతో భాషించి, ప్రభువుచేత వారి కగ్రహారము లిప్పించి శాసన కావ్యములు వ్రాసి చెక్కించెను. గాఢపాకమైన హర్ష నైషధకావ్యమును ఆంధ్రభాషలో కరఁగించి ఆచ్చులు పోఁతపోసెను. కీర్తికర్పూర ఖండములను దిశాంగణములయందు వెదఁజల్లెను. వేమభూపాలునకు నిఖిల పురాణ విద్యాగమములు వినిపించెను బ్రహ్మాండాది మహాపురాణముల తాత్పర్యార్థములను నిర్ధారణచేసి బ్రహ్మమును స్వానుభవములోనికి, తెచ్చికొని యీశ్వరార్చనానందమునందు సమాహితుఁడయ్యెను.

కర్ణాటదేశ కటక కమల వనములకు, ఉదయహేళి యయ్యెను. అచ్చట, ఉద్భట వినాద ప్రౌఢి యందు, గౌఢదేశీయుడైన అరుణగిరి నాథుని జయించి ఆతని బిరుద లాంఛనమైన కాంస్య డిండిమమును పగులఁగొట్టించెను. చండ్రికేశ్వర క్రియాశక్తి రాయల సన్నిధియందు–సార్వభౌమ బిరుదమునందు సంప్రతిష్ఠితుఁడయ్యెను. కర్ణాటక్షితిపాలుని ముత్యాలశాలయందు స్వర్ణాభిషేకమునొంది జగత్ప్రసిద్ధుఁడయ్యెను. ఆయన భాగ్యము అనన్యసామాన్యము, మఱీయును, దృష్టభోగముల ఎల్లలను చూచెను. ఐరావత సన్నిభుఁడు, మహారాజులు కాని. ఆయన దినవెచ్చమును తీర్పలేరు. కస్తూరి లేక పూటగడవదు. దానికై రాజుల నాజ్ఞాపించును. రత్నాంబరములు కాని కట్టఁడు, హేమపాత్రములోఁ గాని ఆరగింపఁడు, రాజులతో మంత్రులతో కోటికి పడగలెత్తిన వణిక్ప్రఖామణులతో మైత్రి. ఏవం విధమైన సంపన్న జీవితమేకాదు. నిరుపేఁద బ్రదుకులు కూడ–ఆయన కన్నారఁ జూచెను, నానాదేశములు పర్యటించి లోకము పూర్తిగా నెఱిఁగియుండెను.

కాలినడకతో పలనాటి పల్లెటూళ్ళు తిరిగి. ఆకలి దప్పికల కలరూపు నిక్కలగాఁ దెలిసియుండెను. జొన్నన్నము, జొన్నకలి, జొన్నంబలి - ఆహారముగా మొఱటు మానుజుల మధ్య తిరిగి పడరాని పాటులు పడెను. తాను చూచిన స్త్రీ పురుషుల వేషభాషలు, స్వరూపస్వభావములు, ఆచారములు, చాటువులుగాఁ జాటెను. తరతరముల నుండి యవి జనుల నాలుకలపై శిలాక్షరములుగా చెక్కుచెదరక నిలిచిపోయెను.

ప్రౌఢ ప్రబంధములు పలికిన నోటనే దేశీయములైన వీరగాథలను. దేశిచ్ఛందములో పాడి ప్రజాహృదయములను పరశింప జేసెను. ఆంధ్రప్రజాహృదయములలో నింతగా హత్తుకొనిపోయిన యింకొక తెలుఁగుకవియుండఁడు.

ఇంతటి జీవితయాత్ర చేసి- అలసి- రాజమహేంద్రవరము చేరి, కాలు నిలిపి శ్రీనాథుడు సింహావలె వెనుతిరిగి తన జీవితమును చూచెను.

ఆ సింహావలోకనములో- చిన్ననాటి మరుత్తరాట్చరిత్రము నుండి- నిన్నటి భీమఖండము వఱకు కడచిపోయిన ఆ వయోదశలు- వానితో తిరిగిరాని ఆ జీవిత వైశాల్యము ఒక్క-సారి కన్నులముందాడి. అది యింతకు మించి కైవ్రాలకముండే కాశీఖండము తెలుఁగుచేయవలయునన్న సన్నాహము కనిపించుచున్నది.

-నానాశాస్త్రము లభ్యసింపఁగ ననంతద్రవ్యమార్జింప, సం
తానంబుం బడయంగఁ బుత్త్రిలకు నర్థంబుల్ విభాగించి యాఁ
బోనఃపుణ్యమునన్ సుఖంబనుభవింపన్ బోయె కాలంబు; గౌ
రీనాథున్ భజియింపనేరనయితిన్ శ్రీకాశికా వల్లభున్.

అన్న శివశర్మ విచారసరణిలోని నిర్వేదము కొంత తొంగి చూచుచున్నది.

వీరాద్భుతములకు నిలయమైన ఆ మరుత్తుని చరిత్ర, బాల్యదశలోని యుత్సాహమునకు. ఆ శాలివాహన సప్తశతి కొలిపాయములోని నులివెచ్చని తలఁపులకు. శృంగారరస సముద్రమునకు పూర్ణిమాతిథి వంటి ఆ హర్షనైషధము. నిండు జవ్వనమునకు అనురూపములై యున్నవి. ఇవి యన్నియు ఒక యెత్తు. ప్రౌఢ నిర్భర వయఃపరిపాక దశలో తాను కొనియాడిన-ఆ భీమనాయకుని మహిమ యొక్కటియు ఒక యెత్తు. నిజమున కది భీమనాయకుని మహిమ కానేకాదు. మఱి మదనాంతకుఁడై నవానిని మదనునకు మాలిమి చేయఁగలిగిన ఆ దక్షారామస్థల మహిమ; అది ప్రౌఢము, నిర్భరమును. ప్రౌఢ-నిర్భరతలు తన వయఃపరిపాకము లోనివిమాత్రమే కాదు. భీమఖండమునందలి ఆ వచఃపరిపాకములోనివి కూడ. ప్రౌఢమైన శృంగారము. నిర్భరమైన శివభక్తి-సమాన స్కంధములై అచ్చట దర్శన మిచ్చును.

షోడశకళాపరిపూర్ణమై కవితామయమైన శ్రీనాథుని సమగ్రమూర్తి వైభవము ఒక్క భీమఖండమునందే సంపూర్ణావ్యక్తిని పొందియున్నవి. కవి జీవలక్షణము ఉద్వేల సముద్రమై పరమ శివునిఁగూడఁ దనలో ముంచివైచికొని, శృంగారరస నాయకునిఁగా పైకెత్తి చూపినది. నింగినిండిన నిబ్బరమైన పున్నమవెన్నెల అచ్చట నేల చఱచి కాసినది; నూటికి నూరుపాళ్ళు అది దక్షారామ మహిమయే. ఏమి దక్షవాటి; ఏమి దక్షవాటి;

"అప్సరఃస్త్రీసహస్ర ధవళతర దీర్ఘదృక్పుట ధాళధళ్య
సమ్మిళద్ధీమనాథ భూషాశశాంక తరళదీధితి పరిపాటిః"

'గరళకూట విసీలకంఠాయ శంభవే
మదనాంతకాయోం నమశ్శివాయ'

అన్న వెంటనే. ఆ స్థలములో-

'కుంభినీధరసుతా కుచకుంభ పరిరంభ
మహలోలుపాయాం నమశ్శివాయ'

అనకుండ మిన్నకుండుటకు సాధ్యముకాని క్షేత్రము: మందరాచల మంథాన మధ్యమాన కల్లోలమాలికలు పొంగిన పాలసముద్రము భీమఖండము:

పరమశివుఁడు కాలకూట సంరంభమును తన కంఠసీమలో-ఆదిమినపిమ్మట- అమృతోదయమై స్తిమితపడిన క్షీరసముద్రము కాశీఖండము:

భీమఖండము నాటికే శ్రీనాథుని ప్రతిభలో గర్భితమై కాశీఖండమున్నది. లోపలనున్న ఆ కాశి వెలుఁగే భీమఖండమునందు ప్రతిఫలించి- దక్షారామమును దక్షిణకాశిగా భాసింపఁజేసినది. భీమఖండము ద్వితీయాశ్వాసములోనికి బాహాటముగా- కాశియే త్రోపికొని వచ్చినది. కాశినుండి వచ్చిన వ్యాసుఁడు కనిపించినంతనే అగస్త్యుని గుండెలో నిండియున్న కాశీమీది తొలినాటి బెంగ యంతయును మరల- పొంగి వచ్చినది-

'ఆ మందాకిని: ఆ త్రివేణి వలనం: బా బాహ్యకక్ష్యాస్థలం:
బా మధ్యాంతర కక్ష్య: లా విమల దివ్యజ్యోతి రుజ్జృంభిత
శ్రీమద్విశ్వపతీశలింగము: మదించింతింపఁ గాశీమహా
గ్రామంబిప్పుడు నాకనుంగవకు సాక్షాత్కారముం గైకొనున్-

ఆనందంబున నర్తరాత్రములఁ జంద్రాలోకముల్ కాయఁగా
నానాసైకత వేదికాస్థలములన్ నల్దిక్కులన్ శంభుఁ గా
శీనాథున్ దరుణేందు శేఖరు శివున్ శ్రీకంఠునింబాడుదున్
మేనెల్లం బులకాంకుర ప్రకరముల్ నిండార మిన్నేటిలోన్-

కాశీ నందన కంతే
కాలుర శిరములకు విరులు గల్పించునొకో:

లీలావనాంతరములను
మాలోపాముద్ర యిడిన మల్లీవల్లున్ ;"

భీమఖండము_ కాశీఖండ చంద్రోదయారంభ పూర్వవేళయందలి సముద్ర వేల ; మన దృష్టిని కాశీనగర గోపురముల వైపునకుఁ దిప్పెడు దిక్సూచి ;

వాస్తవమునకు_ కాశీఖండ రచనాధికారమునకై శ్రీనాథుఁడు చేసిన సాధనయే భీమఖండ రచన. దక్షివాటియందు తన భావనచేత_ కాశికాస్థలమును ఆవహింపఁ జేయుచున్నాఁడు_

"భీమేశ్వరేశ్వర శ్రీమహాదేవుండు
హిమధామ మౌళి విశ్వేశ్వరుండు
సప్తగోదావర సలిలప్రవాహంబు
సాక్షాత్కరించిన జహ్నుకన్య
తిరుచుట్టు మాలెలోఁ దిరమైన గణపతి
యేకాంత డుంఠి విఘ్నేశ్వరుండు
దక్షిణంబున నున్న దండపాణీశుఁ డూ
హింపంగ దండపాణీశ్వరుండు
తే॥ భైరవస్వామి శ్రీకాలభైరవుండు
నంది నందీశ్వరుం డేమి సందియంబు
దక్షివాటంబు కాశికాస్థలమ కాదె ;"

స్వస్థాన వేషభాషలయందు మక్కువకల శ్రీనాథునకు_ భావనాసిద్ధిచేత కాశీ నగరమే జన్మభూమియై పోయి మిగిలినవి పరభూములుగా పరిణమించినవి.

ఆ మచ్చిక. యాచనవా
ప్రేమాతిశయంబు విస్తరింపఁగ వశమే
భూమండల తిలకమ ; పర
భూమికి విన్నెట్లు విడిచిపోవుదుఁ గాశీ ;

అని అగస్త్యునితోఁ గలిసిపోయి దగ్గుత్తిక పెట్టుచున్నాఁడు.

ఈ రీతిగా_ నేల, ప్రొద్దు, ప్రాయము, పరిపాకము, ప్రభువు, అన్నియును శివసంకల్పముచేతఁ గలిసిరాఁగా_ శ్రీనాథుఁడు కాశీఖండమును తెనుఁగు కావ్యము చేయుటకు సమకట్టెను.

'స్కందపురాణసీరధికి ఖండము లేఁబది వానిలోన నా
నందవనానుభావ కథనంబున వక్తకు శ్రోతకున్ శుభా
నంద పరంపరావహము నై జగుణంబునఁ గాఖండ; మా
కందువ నేనెఱింగి సమకట్టితిఁ గావ్యముగా నొనర్పఁగన్.'

ఈ ప్రేరణకు పూర్వరంగభూతమైన కవి మనఃస్థితి 'ఇట్టిదియై' యుండునవి కొంత విచారసరణి కందుచున్నది-

"అనంతశాస్త్రం బహువేదితవ్యం
స్వల్పశ్చకాలో బహవశ్చవిఘ్నాఃl
ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం
యత్ సారభూతం తదుపాసితవ్యమ్"

ఈ యాఘోషణమునకుఁ ద్వరపడి- పురాణగహనమునందు సారగ్రహణము నకై శ్రీనాథుఁ డుద్యోగించుచుండఁగా మఱల- ఇంకొక యాఘోషణ మీరీతిగా వినఁబడఁజొచ్చెను-

"జరయా పరిభూతా యేయేవ్యాధి వికలీకృతాఃl
యేషాంక్వాపి గతిర్నాస్తి తేషాం వారాణసీగతిఃl"

సంసార భయభీతా యేయేబద్ధాఃl కర్మబంధనైఃl
యేషాంక్వాపి గతిర్నాస్తి తేషాం వారాణసీగతిఃl
శ్రుతిస్మృతి విహీనాయే శౌచాచార వివర్జితాఃl
యేషాంక్వాపి గతిర్నాస్తి తేషాం వారాణసీగతిఃl
భర్జ్యంతే కర్మబీజాని యత్ర విశ్వేశవహ్నినా
అతో మహాశ్మశానం తదగతీనాం పరాగతిఃll
మరణం మంగళం యత్ర విభూతిశ్చ విభూషణం
కౌపీన మపి కౌశేయం సాకాశీ కేనమీయతే?"

తత్క్షణమే మిగిలిన వాఙ్మయమంతయు- తత్సారమును తెలుఁగులో కావ్య రూపముగా నొనర్చుటకు సమకట్టి యుండును.

మూలము- పూర్వోత్తర భాగములుగా- భాగమునకు 50 అధ్యాయములుగా వెరసి 100 అధ్యాయములను పండ్రెండువేల శ్లోకముల పరిమితిగల గ్రంథము.

శ్రీనాథుని తెలుఁగు కావ్యము ఏడాశ్వాసములు. మూలపస్తువు 1786 గద్య పద్యములలో సంగ్రహింపఁబడియున్నది. అవతారిక 70 పద్యములు, ఆశ్వాసాద్యంత పద్యములు 27 ను, వెరసి 97 పద్యములను విడిచి. 1689 గద్యపద్యములు నికర మైన లెక్క. మూలగ్రంథ భాగములు రెండును సమప్రమాణము గలవి. శ్రీనాథుని గ్రంథము మొదటి 5 ఆశ్వాసములు, పూర్వార్ధమునకు, చివరి రెండాశ్వాసములు, ఉత్తరార్ధమునకు- తెలుఁగుసేత :

దీనినిఁబట్టి- ఈ తెలుఁగుసేఁత సమవిభక్తముగా సాఁగియుఁడలేదని- తేట పడుచున్నది.

ఇందుకు- కారణములను పరిశీలింపవలసియున్నది. బహుశః పూర్వాంధ్ర కవులు తమ తెలుఁగు కావ్యములను మూలగ్రంథములతోఁ బోల్చి కాక దంతపరీక్ష చేయఁగల కాల మొకటి రాఁగలదని యూహించి యుండరు. అది యట్లుండునుగాక. ఇచ్చట మునుముందు విచారణ చేయవలసిన విషయ మొకటి యున్నది.

కాశీఖండ పీఠికలో శ్రీనాథుఁడు-

(1) "కాశికాఖండ మను మహాగ్రంథమేను దెనుఁగు చేసెదను" అని-

(2) "అ కందువ నేనెటింగి సమకట్టితిఁ గావ్యముగా నొనర్పఁగన్" అని యును- తన రచనాస్వరూపమును రెండు విధములుగా నిర్దేశించియున్నాఁడు.

మొదటిది- కాశికా ఖండము సంస్కృత భాషలో మహాగ్రంథము. దానిని నేను 'తెనుఁగు చేసెదను'- ఉన్నాఁడు.

ఇచ్చట- ఒకటి గమనింపవలయును.

'తెనుఁగు చేయుట' అనఁగా అనువాదము చేయుట కాదు. నన్నయాదులైన పూర్వాంధ్రకవులు కూడ భారతాదులను అనువాదము చేయలేదు. తెనుఁగు చేసినారు.

(1) మహాభారత శుద్ధ నిరూపితార్థమేర్పడఁ దెనుఁగున రచియింపుము.

(నన్నయ)

(2) 'తెనుఁగుబాస వినిర్మింపఁ దివురుట.' (తిక్కన)

(3) 'వ్యాసముని ప్రణీత పరమార్థము తెల్లము చేసినట్టి'- (ఎఱ్ఱన)

ఈ శతాబ్దిలోని కొందఱు భారతాదిగ్రంథములకు అనువాదములు చేసిరి. నన్నయాదులవలె తెనుఁగు చేయలేదు.

రెండింటికి భేదము :

మూలగ్రంథ గత పరమార్థమును లెస్సగా భావించి_ దానిని తమదిగాఁ జేసికొని_ ఆ పరమార్థమును తెనుఁగుభాష స్వరూప స్వభావ మర్యాదలకు పొందిపొసఁగియుండునట్లు తమ కవితారీతిలో స్వతంత్ర కావ్య మనిపించినట్లు తిరిగి నిర్మించుట_ తెనుఁగుచేయుట.

మూలశ్లోకార్థమును యథాతథముగా_ తెనుఁగు పద్యములో వ్రాసికొనిపోవుట_ అనువాదము చేయుట.

తెనుఁగు చేసెడు కవి స్వతంత్రుఁడు.
అనువాదకుఁడు పరతంత్రుఁడు.

రెండవది : 'సమకట్టితిఁ గావ్యముగా నొనర్పఁగన్' తాను పురాణమును పురాణముగా రచించుటలేదు. కావ్యముగా నొనర్చుటకు సమకట్టినాఁడు. కావున దానిని కావ్యముగానే చూడవలసి యుండును. పురాణమును పురాణముగా వ్రాయుటకు సమకట్ట నవసరములేదు. సమకట్టుట_ఉద్యమించుట.

ఇట్టి తెలుఁగు చేసిన కావ్యములను_ అవిరచింపఁబడిన ప్రయోజనమును దృష్టియందుంచుకొని చూడవలెను. ఇవి స్వతంత్రకావ్యములన్న దృష్టితోఁ జూచినప్పుడే వాని నిజస్వరూపము వెల్లడియగును.

కేవలము అనువాదదృష్టితోఁ జూచిన నెట్లుండునో దిఙ్మాత్రములైన యుదాహరణములు రెండు;

మూలము :

(1) ''దూరంమే మరణం యువాహ మధునాఽఽర్యం నచిత్తేత్వితి
శ్రోతవ్యో నిభృతం కృతాంత మహిషగ్రైవేయ ఘంటారవః
నైకట్యాత్: ప్రకటోత్కట శ్రమఘటా మప్రాప్యహితా ద్రుతం
జీర్ణాం పర్ణకుటీం తతః పటుమతిర్గచ్ఛేత్పురీం ధూర్జటీఃఁ'

తాత్పర్యము :

'దగ్గఱలో నాకు మరణములేదు. అది చాల దూరములో నున్నది. నేనిప్పుడు పిన్నవాఁడను' అని_ మనసులో ఏమరుపాటు పనికిరాదు. కృతాంత మహిషగ్రైవేయ

ఘంటారవమును చేరువగా వినుచుండవలయును. ఆధివ్యాధులకు– అగ్గపడకముందే బుద్ధిమంతుఁడు జీర్ణకుటీరమును విడిచి– త్వరగా కాశికిఁ జేరుకొనవలెను.'

తెనుఁగు :

"అర్ణోరాశిపరీత భూభువనమధ్య స్వర్ణఖండంబు సం
పూర్ణైశ్వర్యసమృద్ధి కాశి, కృతపాపుండైన. తత్పట్టణా
భ్యర్ణక్షోణుల నైదుక్రోశములఁ ప్రాణాంతంబునన్ మర్త్యుఁడా
కర్ణింపండు కృతాంతవాహ మహిష గ్రైవేయ ఘంటాధ్వనుల్"

తాత్పర్యము :

సముద్రములమేర వఱకు– ఈ భూమి కంతటికి– సంపూర్ణైశ్వర్య నిలయమైన కాశి స్వర్ణఖండము ; ఎన్ని పాపములు చేసినను మర్త్యుఁడు అనగరము పొలిమేరలలో– అయిదు కోసులవఱకు– ప్రాణములుపోవు వేళలలో కృతాంతవాహ మహిష గ్రైవేయ ఘంటాధ్వనులను వినఁడు. (యముని వాహనమైన యెనుబోతు మెడ వట్టెడలో మ్రోగుచున్న గంటల ఘణ ఘణలను వినఁడు)

మూలము : 'శ్రోతవ్యః' – వినితీరవలయు ననుచున్నది.

తెలుఁగు : 'వినఁడు' విననే వినఁడనుచున్నది.

ఈ రెండు ఉత్తరధ్రువము–దక్షిణధ్రువముగా నున్నవి.

ఇంత అడ్డగోలుగా శ్రీనాథుఁడు తెనుఁగు చేయునా ? అనిపించుచున్నది. విచారించి చూడఁగా– ఈ విరోధము ఆభాసయే యని తేలిపోవుచున్నది.

ఒకే విషయమును ఒక కోణమునుండి సంస్కృతము, ఇంకొక కోణమునుండి తెనుఁగు, చెప్పుచున్నవి.

'గిట్టుటకే పుట్టియున్నవాఁడు– ఎన్నఁడును– ఏమరియుండరాదు. యమ మహిష ఘంటా ఘణంగణలు చేరువలో వినిపించినట్లు– వెంటనే యిల్లు విడిచి, అభయస్థానమైన కాశికిఁ జేరుకొనవలయును.' అనుటలో– భయంకరములైన యా ఘంటానిర్ఘోషమునుండి కూడ– కాశియొక్క 'అభయస్థితి'యే మాఱుమ్రోఁగుచున్నది.

ఆ పట్టణము అయిదు కోసుల మేరలో ప్రాణము పోవునప్పుడు మర్త్యుఁడు– ఆ ఘంటాధ్వనులను వినఁడు– అనుటలో– కాశియొక్క 'అభయస్థితి' నిబ్బరముగా విరూపితమగుచున్నది.

ఏ పదబంధములోని ఘణంఘణలు మూలములో భయోద్వేగము పుట్టించు చున్నవో. ఆ పదబంధములోని- ఆ ధ్వనులే తెలుఁగులో కాళియందలి అభయస్థితిని- అప్రతిద్వంద్వముగా ప్రతిష్ఠించుచుండుట ఆశ్చర్యముగా నున్నది.

ఒక కోణమునకు అభిముఖమైనపుడు భయమును పుట్టించుచున్న మూలగత శబ్దశక్తిని- మఱియొక కోణమునకు మార్చి శ్రీనాథుఁడు- అభయమును ప్రతిష్ఠించు చున్నాఁడు.

ఏది మేలో విచారశీలురకుఁ దెలియును. ఇట్లు చూడఁగలిగినచో శ్రీనాథుని తెనుఁగుసేతలోని మౌలికత తెలియును. తెనుఁగు చేసిన కావ్యములను చూడవలసిన త్రోవయును దేటపడును. ఇట్లుకాక- అనువాదదృష్టినే పెట్టుకొని చూచినచో- శ్రీనాథునకు మూలతాత్పర్యము తెలియలేదనిపించును- ఆ రీతిగా- అనుకొన గలుగు టకు మాత్రము నిబ్బరమైన గుండె యుండవలెను.

మూ ల ము :

(2) "పాణిభ్యాం సుదృఢం ప్రపీడ్య పరితో నిష్పేత్య నిష్పేత్యచ
బ్రహ్మాండం సకలం పచేళి మరసాలోచ్చైఃఫలాభం ముహుఃఃపాయం పాయ మపాయ త్రిజగతీమున్మత్త నత్తైరసైఃనృత్యం స్తాండవడంబరేణ విధినాపాయాన్మహాభైరవఃఃః

విధినా' అన్న యంశము మిగిలిపోయినది. దానికై ప్రత్యేకముగా శ్రీనాథుఁ డొక మత్తేభమునే యెత్తుకొనెను.

"క్షయకాలంబున సీధుసాగర రసాస్వాదాతిరేకంబునన్
నయనాబ్జంబులు ఘూర్ణితంబులుగ సంధ్యా కాళరాత్రీకర
ద్వయతాళాను గతిప్రకారమున నవ్వారిన్ మహోన్మత్తముం
బ్రియమొప్పారఁగ నాడు భైరవుఁడు కల్పించున్ మహైశ్వర్యముల్"

కాని ఇంతమాత్రమున ఆ ప్రళయభైరవుని తాండవ సంరంభము తీరదు. దానికై మూలములో లేకపోయినను శ్రీనాథుఁడు ఇంకొక ప్రసక్తి కల్పించి.

"పాదాహతిని సప్తపాతాళములతోడ
నుర్వీకటాహ మట్టూఁతలూ గ
నిర్ఝరతర జటా నికురుంబకంబులు
చెదరి బ్రహ్మాండంబు చెంపవెట్ట
బాహార్గళాస్తంభ పరివర్తనంబుల
దిక్చక్రవాళంబు త్రెవ్విపడఁగ
వితత నిశ్శ్వాస మారుత నరనంబులఁ
బృథ్వీధరంబులు పెల్లగిల్ల

తే॥ డమరు ధ్వానాదముల సముద్రములు కలఁగ
నారభటి వృత్తిఁ దాండవం బవధరించెఁ
బ్రళయవేళ మహాకాలభైరవుండు
కాళరాత్రి కుచంబులు గగురుపొడవ"

అనునంతవఱకు భైరవుని తాండవ సంరంభమే కాదు. కవి వర్ణనాసంరంభము కూడ ఉపశమింపనేరదు. మూలనిరపేక్షములై ముక్తకప్రాయములైన యిట్టి పద్యములు కాశీఖండములో లెక్కకు మిగిలియున్నవి. కాశీఖండ వైశిష్ట్యమునకు అవి మూలస్తంభములు!

అగాధములు గహనములునైన దార్శనికవిషయములతోఁబాటు పరమాద్భుతములైన కావ్యవర్ణనములు మూలములో సమ్మిళితముగా నున్నవి. ఆ వర్ణనాధోరణులు, అలంకారములు అపూర్వములై బాణుఁడు మొదలైన సంస్కృత మహాకవులకు వరవడులు తీర్చుచున్నట్లుండును. శ్రీనాథుఁడు తన కావ్యోభకై వానిపై నంతగా

ఆధారపడియున్నట్లు తోఁచదు. అట్టి వర్ణనలన్నింటికిని ఒక నమస్కారము చేసి శ్రీనాథుఁడు తన శక్తి ప్రకాశించుటకు వీలైన సందర్భములు కొన్ని తానే కల్పించి కొని స్వేచ్ఛగాఁ దన మార్గమునఁ దాను నడచెను.

దశహరాస్తోత్రము, గంగాసహస్రము మొదలైన స్తోత్రములను. విశ్వేశ్వరుని కాశీవిప్రలంభము మొదలైన పెక్కు సందర్భములను శ్రీనాథుఁడు వదలి పెట్టెను. అవి యన్నియును శరీరము గగుర్పొడిపించెడి కావ్యధర్మము కలవి. వేదములను లౌకిక సంస్కృతములోనికిఁ గరఁగించి పోసినట్లుండును. శ్రవణ మాత్రముచేతనే జన్మజన్మాంతరానుగతములైన పాపములన్నియును చెల్లాచెదరై పోవుచున్న యనుభూతిని కలిగించి తీరును. కాశీఖండ సంస్కృతమునందలి ఆ విధమైన శబ్దశక్తిని మఱియొక భాషలోనికిఁ దెచ్చుట బ్రహ్మతరముకాదు. భగీరథుఁడు కనుక ఆకాశగంగను భూమిపైనఁ బ్రవహింపఁజేయఁ గలిగినాఁడు. ఈ రహస్యము శ్రీనాథునకుఁ దెలియును. తెనుఁగు భాషయొక్క ప్రాణము, త్రాణయుఁ దెలియును. అది మోయలేని బరువు దానిపై మోపి తాను భంగపడెడివాఁడు కాఁడు. 'అలవికాని చోట. అధికుఁడ ననఁడు.

మూల కాశీఖండము అగాధమైన మహాసముద్రము.

శ్రీనాథుని తెనుఁగు కావ్యము ఒకప్రహ్లాదము.

సంస్కృత కాశీఖండము చదువలేని వారిని, కాశికిఁ బోలేనివారిని. శ్రీనాథుని కాశీఖండముతరింపఁ జేయఁగలదు. కాశికివెళ్ళి గంగలోమునుఁగ లేనివారిని_కలశములలోనికిఁ బట్టి స్వదేశమునకుఁ దెచ్చి తలపైఁ జల్లిన గంగవలెఁ

పరమేశ్వరుఁడు పార్వతితో - ఆనుచున్నాఁడు_

'అప్రాప్య కాశీం కొదేవి! నిరంతర సుఖం లభేత్!
బ్రహ్మాద్యాః ప్రాకృతైః పాశైర్యతోబద్ధా నిరంతరం
చతుర్వింశతిభిః పాశైస్త్రిగుణైః క్రియయా దృఢైః
'కంతే బద్ధా విముచ్యంతే కథం కాశీం వినాజనాః?'

ఇంత సులభముగా స్ఫటికస్వచ్ఛముగా దర్శనసారమును మహర్షి వాణియే చెప్పగలదు. వేఱొక మాట యనుట ఆంధ్రకవులయెడ అపచారముచేయుట.

''స్థిరాపాయం కాయఁజనన మరణక్లేశ నిలయమ్
విహాయాస్యాం కాశ్యా మహహ! పరిగృహ్ణీత నకుతః!

వపు స్తేజో రూపం స్థిరతర పరానంద సదనం
విమూఢోఽసౌ జంతుః స్ఫుటితమివకాంస్య వినిమయన్.

"నా స్తీహ దుష్కృత కృతాం సుకృతాత్మనాంనా
కాచిద్విశేషగతి రంత కృతాం హి కాళ్యామ్
బీజావి కర్మ జనితాని యదూషరాయాం
నాం కూరయంతి హరదృగ్జ్వలితానివేషామ్"

యేతు వర్షేషవో రుద్రా దివి దేవ ప్రకీర్తితాః
వాతేషవోఽంతరిక్షేయే యేభువ్యన్నేషవః ప్రియేః
రుద్రా దశదశ ప్రాచ్యవాచీ ప్రత్యగుదక్ స్థితాః
ఊర్ధ్వ దిగ్స్థాశ్చ యేరుద్రాః పశ్యంతే వేదవాదిభిః
అసంఖ్యాతా స్సహస్రాణి యేరుద్రా అధిభూతలే
తత్పర్వేభ్యోధికాః కాళ్యాంజంతవో రుద్రరూపిణః
రుద్రావాస స్తతః పోక్త మవిముక్తం ఘటోద్భవః
యస్మాత్సమర్చ్య కాశీస్థాన్ వర్ణాన్ వర్ణేతరాశ్రమాన్
శ్రిద్ధయేశ్వర బుద్ధ్యా చ రుద్రార్చా ఫలభాగ్నరః
శ్మశబ్దేన శవః ప్రోక్తః కానంశయున ముచ్యతే
విర్వచంతి శ్మశానార్థం మునేః శబ్దార్థకోవిదాః
మహాంత్యపిచ భూతాని పృథయే సముపస్థితే
శేరతేఽత్రశవా భూత్వా శ్మశానంతు తతో మహత్"

ఆప్పు భూరిహ లయేలయం వ్రజే
దాప ఔర్వ వదనోగ్ని కందరే
మాతరిశ్వని మహాతనూనపాత్
వ్యోమ్ని సంక్షయతివై సదాగతిః
వ్యోమచాపి లయ మేత్యహంకృతౌ
సాఽపిషోడశ వికార సంయుతా
లీయతే మహతి బుద్ధి సంజ్ఞకే
హాః మహాన్ ప్రకృతి మధ్యగోభవేత్
సా గుణత్రయ మయీచ నిర్గుణం
తంపు మాంస మవ గుహ్యతిష్ఠతి

పంచ వింశతి తనుః పరఃపుమాన్
దేహగేహ పతిరేషజీవకః
ప్రాకృతః ప్రళయ ఏష ఉచ్యతే
హంసయాన హరి రుద్ర వర్జితః
కాలమూర్తి రథతంచ పూరుషం
హేలయా కలయతీశ్వరః పరః
పవై మహావిష్ణు రితీర్యతే బుధై
స్తంవై మహాదేవ ముదాహరం
సోంతాది మధ్యైః పరివర్జితః శివః
స శ్రీపతి సోఽపిహి పార్వతీ పతిః
దైనందినేఽథ ప్రళయే త్రికూల
కోటౌ సముత్థిప్య పురీం హరః స్వామ్
బిభక్తి సంవర్త మహాస్థి భూషణః
తతో హి కాశీ కలికాల వర్జితాః'

ఇట్టిఘట్టములను పెక్కింటిని శ్రీనాథుఁడు వదలిపెట్టెను. ఇట్టివే మఱికొన్ని ఘట్టములను తెనుఁగుచేసెను చేసినచోట్ల సార్వభౌముని వలె చేయును. పరతంత్రుని వలెఁ జేయడు.

"అంబుజాసను నాయు రవసానమునయందు
గ్రస్త సమస్తలోక ప్రపంచ
యై మాయ నిర్వికల్పాకారమునఁ దను
నాశ్రయింపఁగఁ బరమాత్మయుండె
విస్తరంగ సముద్ర నిభమై నిరస్త స
మస్తావధికమయి ప్రాణికర్మ
పరిపాక కాలంబు ప్రాప్తమయ్యెడు నంత
దాఁక; నవ్వేళ విధాతృసృష్టి

తే॥ గగన మొక్కండు చిక్కంగఁ గ్రాఁగిపోవ
వంధకారంబు నీరంధ్రిమగుచుఁ బ్రిబలె

నత్తను నసత్తు నదసత్తు రిత్తయయ్యె
నెఱుకపడదయ్యె నేమియు నేమిచెప్ప

వ॥ అనర్క చంద్ర గ్రహ తారకానక్షత్రం బనహోరాత్రం బనగ్ని భూసలిల మారుతం బభ్రధానం బశబ్దస్పర్శం బగంధం బరూపం బదిజ్మాఖం బై భువన ప్రపంచం బంధ కారావశేషంబై యుండ బ్రహ్మాండంబు నిష్పంచ కంబై కేవలత్వంబు భజియింప .... పరబ్రహ్మంబు నిరుద్యోగియై తూష్ణింభావంబుఁ గైకొని నిష్కలంబై విహరించుచు లీలా కైవల్యంబున లోక మర్యాద యాదరించి నిజశరీరంబున నొక్క శక్తిం గల్పించె. ఆ శక్తి ప్రకృతి రూపంబ వగు నీవ. ఆ పరబ్రహ్మంబు పురుష రూపుండైన యేను. కల్యాణి! నాటికాలంబునందు.

ఉండఁ జోటొక్కడను లేక యుత్పలాక్షి!
మనము చేరితి మవిముక్త మండలంబు
వాఁడు మొదలుగ నిపుడు నున్నార మిందుఁ
గాశికా పుర శుభ సంజ్ఞ కంబునందు!

సీ॥ అనిశంబు మనచేత నవిముక్తమై యున్క
ముగ్ధాక్షి! యది యవిముక్తమయ్యె
మవకు నానందంబు నొనరించుఁ గావున
నానంద విపినాభి ధానమయ్యె
సంవసింతు మహాశ్మశానభూములఁగాన
వేనుంటను మహాశ్మశానమయ్యె
నోరంత ప్రొద్దును నుందు రుద్రుండనే
వటుగాన రుద్రగేహాఖ్యమయ్యె

తే॥ నసియు వరణయుఁ గూడుట నక్షరములి
సరవితో వారణాసియన్ సంజ్ఞయయ్యెఁ
'గాశృ దీప్తౌ' వనంగ విఖ్యాతమైన
ధాతువున గాశియయ్యె భూతలమునందు॥

నక్షత్ర గ్రహతారకంబులు నరణ్యంబుల్ నదుల్ వార్ధి వి
శ్వక్షోణీధ్రములున్ ఝిళల్ వసుమతీ చక్రంబు కాలంబుచేఁ
బ్రక్షీణత్వముఁ బొందియున్న యెడ, విశ్రాంతిన్ సుఖంబుండ గా
శీక్షేత్రంబిది యంబుజాక్షి, మనకున్ సిద్ధించె నెక్కాలమున్'

మూఁడు నాలుగధ్యాయములలో-మూలమునందు విస్తరించి యున్న వైవిధ్యమును శ్రీనాథుఁ డింత పొందికగా సంగ్రహించి యుండెను.

ఖగోళము, యోగము, మొదలైన వైజ్ఞానిక విషయములను సంగ్రహించెను. కొన్నింటిని విడిచెను. ధ్రువుని కథను మిక్కిలి పంగ్రహించుటలో పెక్కు యోగశాస్త్ర విషయములు జాటిపోయెను. దండపాణి కథను రెండే సీసపద్యములలో సంగ్రహించెను కాశీలో-కాలభైరవుని పిమ్మట దండపాణి యంతటివాఁడు; క్షేత్రవాసులకు నన్నవస్త్రము లిచ్చువాఁడు. చరమాలంకారమును విరచించువాఁడు. సంత్ర మోద్రృములాయన కింకరులు. కమ్రవినతలకథ కాశీఖండములో వేఱొక విధముగానున్నది. దానిని వదలి శ్రీనాథుఁడు భారతములోనున్న కథనే యనుసరించెను. సదాచార ప్రకరణమును తగ్గించుటలో-అల్పవిషయములకు-అధిక ప్రాధాన్యము, మహావిషయములను పూర్తిగావిడుచుటయు జరగినది. కృత్యాకృత్య ప్రకరణమును అసలు స్పృశింపనేలేదు. దైనందిన జీవితమునకు మిక్కిలి యావశ్యకమైన ధర్మశాస్త్రవిజ్ఞాన ముపేక్షింపఁబడినది. ఆది మూలములో దాదాపు వేయి శ్లోకముల గ్రంథము. కుమారస్వామి చెప్పిన యోగదర్శన విషయమును శ్రద్ధగా వివరించి యుండలేదు. మూలములోని సర్వవిషయములును ప్రధాన వస్తువైన కాశీమహిమతో గాఢనిబంధనముకలవే. అప్రసక్తమైనది-ఒక్కటియును లేదు, మఱి యిన్నింటిని విడుచుటకు-తానుద్దేశించిన కావ్యపరిమితియే కారణమై యుండునని సమాధానపడవలసి యుండును.

మూలములోనున్న వానిని విడుచుటతోఁబాటు-లేనివానిని. ఇతర సంహితలనుండి తెచ్చి చేర్చుట కూడ శ్రీనాథుని గ్రంథములో గోచరించుచున్నది.

అనంతమైన ఆగమవిజ్ఞానమునకు విధానము శ్రీనాథుఁడు! అయన గ్రంథములో సాహిత్యాంశములవలెనే. మూలములో లేని శాస్త్రవిషయములుకూడ సందర్భమునానుసరించి గుంఫితము లగుచుండుట స్వాభావికమైన విషయము.

"సహోవాచేతి జాబాలి రారుణే!ఽసిరిడా మవా
వరణా పింగళా నాడీ తదం స్త్వవిముక్తకమ్
సానుషుమ్నాపరా నాడీత్రియం వారాణసీత్వసౌ
తదత్రోత్క్రమణే సర్వ జంతూనాం హ్రియతౌహరః
తారక బ్రహ్మవ్యాచష్టే తేనబ్రహ్మభవంతిహ
ఏవంశ్లోకో భవత్యేష ఆహూర్వేదవాదినః"

వేదనిగదితమవి-మిక్కిలి - సంగ్రహముగా మూఁడుశ్లోకములలోఁ జెప్పఁబడిన-ఈ-'అభ్యంతర-అవిముక్త' తత్త్వమును తెనుఁగు కాశీఖండము విపులముగా వివరించుచున్నది.

'భ్రూఘ్రాణంబుల సంధి యవిముక్త స్థానంబు. అది అభ్యంతర తీర్థంబు. తీర్థంబులు బాహ్యాభ్యంతర భేదంబున ద్వివిధంబులైయుండు.

"ఎల్లవియు బాహ్యతీర్థంబులిందు వదనః
యరయ బాహ్యాంబులయ్యు నాభ్యంతరములు
కాశికాతీర్థ మాదిగాఁ గలవు కొన్ని
వాని వినిపింతుఁ బరిపాటి వనిత! వినుము."—

'శీర్షంబునందలి శ్రీశైల తీర్థంబు
మల్లికార్జునదేవు మనికి పట్టు
ఫాలభాగము నందుఁ బ్రాలేయ మయమైన
విమలకేదారతీర్థము వసించు
కుచ చూచుకములందుఁ గురుజాంగ లమ్మిలి
తీర్థరాజము సంప్రతిష్ఠ నొందు
భ్రూవల్లరీ యగ్గమునకు మధ్యంబున
నానంద వన తీర్థ మధివసించు
తే॥ నంతరంగంబునఁ బ్రయాగ మాశ్రయించు
నిమ్మహా తీర్థములు పార్వతీశ్వరునకు
విహరణస్థానములు వేద విశ్రుతములు
వెలుపలను లోపలను నుండుఁ దలిరుబోఁడి!

వ॥ బాహ్యాభ్యంతరంబులయందును నవిముక్త తీర్థంబు త్తమోత్తమంబు. అట్టి తీర్థంబున నుండి యఖండంబు సచ్చిదానందైకరసంబు నద్వితీయంబు నగు

నిష్కలస్వరూపంబును, నర్ధనారీశ్వరాది రూపంబైన సకల స్వరూపంబును నగు విశ్వనాథు నుపాసింప నొడఁగూడదయ్యెం గావున- నింక నేను భావతీర్థంబువన యా భర్గు నుపాసించెద. సంసారసాగరంబుఁ దరియింప సాధనంబగుటంజేసి తీర్థం బయ్యె. ఆభ్యంతరంబైన యవిముక్తతీర్థంబు బ్రహ్మవిష్ణుమహేశ్వరుల కుపలబ్ధి స్థానంబగుటం బ్రిమూర్తులకు సాధారణంబయ్యును మహేశ్వరునకుఁ బ్రధాన స్థానంబై యుండు."

ఇట్లు- శ్రీశైల. కేదార, కురుక్షేత్ర, ప్రయాగములతోఁ గలిపి- కాశీక్షేత్రము యొక్క- ఆభ్యంతరస్థానము మానవశరీరమందు భ్రూమధ్యమని- అది యుపాసనా స్థానమని- నిర్దేశించుచున్నది.

అసి-ఇడానాడికి, వరణ-పింగళానాడికి, గంగ-సుషుమ్నానాడికి, సంకేతము లని- తత్తదధిదేవతలతోసహా వివరించి. అసి వరణలు- గంగానదితోఁ గలియు మధ్యసీమయే 'వారణాసి' యని. అది మానవశరీరమందు భ్రూమధ్యమని. నిర్దేశించి- 'వారణాసి' పదమును నిర్వచించి- ఇడాపింగళాసుషుమ్నల స్వరూపమును సమగ్రముగ నిరూపించుటతోఁబాటు బ్రహ్మాండ కుండలినిని, పిండాండమైన మానవ శరీరమునందు సమన్వయించుటలో- కుండలినీయోగ స్వరూపమునంతయు వివరించు చున్నది.

మఱియును- ప్రాణపవనమే సూర్యచంద్రులని. దాని ఆసారప్రసారము లలో నేర్పడుచున్న దివారాత్ర స్వరూపమును ఉత్తరాయణ దక్షిణాయన స్వరూపము లను. అమావాస్య. గ్రహణము, విషువములు. సంక్రమణములు. వీని స్వరూప ములగూడ- తెనుఁగు కాశీఖండము వివరించుచున్నది.

ఇవి యేవియును మూలములో లేవు. అ రీతినే ద్వితీయాశ్వాసము 143వ వచనములో- పాతంజల యోగదర్శన విషయములైన క్లేశపంచకము, కర్మాశయము, జాత్యాయుర్భోగముల స్వరూపమును వివరించుచున్నది.

తృతీయాశ్వాసము 50వ వచనములో- పరాపశ్యంతీ, మధ్యమా, వైఖరీ. దశలయందలి వాగ్దేవతాస్వరూపతత్త్వమును విపులముగా నిరూపించుచున్నది. వీని ప్రసక్తి మూలములో లేదు. సూతసంహితనుండి- దానికి శ్రీవిద్యారణ్యులు వ్రాసిన వ్యాఖ్య తత్త్వదీపికనుండి- యీ విషయములను యథాతథముగఁ తీసికొని తన గ్రంథమునందు శ్రీనాథుఁడు నిక్షిప్తము చేసెను.

షష్ఠాశ్వాసము 82వ వచనములోని బౌద్ధదర్శనములకు సంబంధించిన ద్వాదశాయతన ప్రసక్తి. నైయాయిక, వైశేషిక. సాంఖ్య. శైవదర్శనముల ప్రసక్తి. మూలగ్రంథములో గానరావు ఇట్లనేక శాస్త్ర విషయములను శ్రీనాథుడు తన గ్రంథములో జొప్పించెను.

శ్రీనాథుడు స్వతంత్రుడు. ఒకరికి ఒదిగియుండుట ఆయన స్వభావములో లేదు. కావ్యజీవితమందుగూడ. ఆ లక్షణమంతే. సార్వభౌముడు గదా!

కాశీఖండము కథాప్రధానముకాక. తత్త్వవిషయ ప్రధానమై క్షేత్రమహిమయగుట శ్రీనాథుని. ఆ లక్షణమునకు మిక్కిలి యనుకూలించినది. ఆద్యంతము ప్రతిపాద్యవిషయము ఒక్క క్షేత్రమహిమయే కనుక. తనకు రుచించినదానిని విస్తరించవచ్చును. రుచించనిదానిని వదలివేయవచ్చును. కావలసిన దానిని యితరత్రతెచ్చికొనవచ్చును. ఇది యిట్లేల చేసితివని యడిగెడువాడు లేడు. నన్నయగారి నియమము. తిక్కనగారి దీక్ష యీయనలో లేవు. వారివలె. పురాణమంతయును దెనిగించు భారము పైనబెట్టుకొనలేదు. తనకు నచ్చిన కాశీఖండమునే తీసికొనెను. దానిలోగూడ వస్తుమాత్రమే తీసికొని తన రచన తాను స్వేచ్ఛానుసారము చేసికొనుచు బోయెను.

ఆ వస్తువు కాశీక్షేత్ర మహిమ. క్షేత్రముల-అనుభావము మూడింటియందు-స్వతః అవిభక్తమే యైనను విభక్తమై యున్నట్లు భాసించుచుండును. దైవము. క్షేత్రము, తీర్థము- అను మూడింటిలో క్షేత్ర తీర్థములు రెండును దైవమునకు ప్రతిరూపములు. క్షేత్రమునకు- ఆ క్షేత్రమందలి దైవమునకు భేదములేదు. అట్లే ఆ క్షేత్రమందలి తీర్థమునకు దైవమునకు భేదములేదు. తీర్థదైవతములు రెంటికి క్షేత్రమాధారము. దైవము చైతన్యము. క్షేత్రము స్థలవిశేషము. తీర్థము, ఆ స్థలవిశేషమందలి జలము.

క్షేత్రతీర్థములు- నేలయు నీరును కంటికి కనిపించుచుండును. ఆ రెంటిని-అచ్చటి తేజోవాయ్వాకాశములను నిండి దైవతముండును.

చైతన్యము-పరిపూర్ణము, ఏకము, అచలము. జ్యోతిర్మయము, వ్యాపకము. అయ్యును-ఒకానొక స్థలవిశేషమందు-అచ్చటి తీర్థవిశేషమందు సవిశేషముగసన్నిధి చేసియుండును. జీవచైతన్యము సర్వశరీరమునందు-అభివ్యాప్తమై యున్నను సకల

జ్ఞానేంద్రియములకు - అధిష్ఠానమైన యుత్తమాంగమునందు సవిశేషముగ సన్నిధి చేసియున్నట్లు.

వివిధస్థలములయందు వివిధనామములతో వివిధలింగముల యందుశివుఁడు సన్నిధిచేసియున్నాఁడు. అనేకభూముల యందు గంగానది ప్రవహించుచున్నది. కాని - కాశీస్థలవిశేషము వల్లనే - అచ్చటిశివునకు, తీర్థములకు ప్రాధాన్యముకలుగు చున్నది. ఇందువలన-తీర్థదైవతములకంటె స్థలమహిమయేసమధిక మని యేర్పడు చున్నది.

అచ్చట శ్రీ విశ్వేశ్వర జ్యోతిర్లింగమేలేనినాఁడు - గంగయే ప్రవహించని నాఁడు-ఆస్థలప్రాశస్త్య మెట్టిది? అన్నప్రశ్న యుదయించుట సహజము.

ప్రాణనిర్యాణ వేళయందు-కుడిచెవి మీఁదుచేసి - నేలపై వ్రాలియున్న సకల జీవకోటికి-పరిణామోపదేశముచేసి-జీవభావమునుండి విముక్తికలిగించి శివుఁడు స్వస్వ రూపమును అనుగ్రహించుట యన్నది-ఒక్క-ఆస్థలమందే జరుగును గావున క్షేత్ర మునకే ప్రాధాన్యమని నిరూపిత మగుచున్నది.

'కింకుర్వాణ పురందరాదిక మహాగీర్వాణకోటీ కిరీ
టాంకస్థాపిత నూత్న రత్నరుచిధారాశ్లేశకిమ్మీరపత్
పంకేజుండు హరుండు జంతు తతికిం బ్రాణాంతకాలంబునం
దోంకారాక్షర మంత్రరాజముచెవిన్ యోజించుఁ గాశీస్థలిన్'

"పాలిండ్లు కదలంగఁ బనపుఁ బయ్యెద వీచు
నచలాధిపతి కూర్మియాడు బిడ్డ
భూత్కార మొనరించి తొండంబు ముక్కున
శీకరాసారంబుఁ జిలుకు డుంఠి
ప్రత్యక్షమైవచ్చి భాగీరథీ గంగ
మృదుల హస్తముసాచి మేను నివురుఁ
బ్రమథోత్తముఁడు భృంగి భయరక్షణార్థమై
ఫాలాగ్రమునఁ దీర్చు భసితరేఖ

తే॥ దక్షిణ శ్రుతి మీఁదుగా ధరణిఁ దెగ్గిల్లి
పెద్ద నిద్రికు ప్రాఁగన్ను పెట్టు వేళఁ

బంచ జనులకుఁ దారక బ్రహ్మవిద్య
యభవుఁడుపదేశ మొనరించునపుడు కాశీ'

ఓహో? మరణమన్నది యిట్టిదియే యైనచో దానికన్న సంస్పృహణీయమేదీ
వాస్తవమునకు-విశ్వేశ్వరుఁడని-కాశియని - గంగయని వేఱువేఱుగా-అను
కొనుటయేకాని-అదియొక పిడఁదీయరాని సమాహారము. ముప్పేటగా-అల్లకొనిపో
యున్న ఒకే ఒకతత్త్వము:

కాశికి-వారణాసి, అవిముక్తము, ఆనందకాననము, మహాశ్మశానము, రుద్రా
వాసము-అని నామాంతరములు.

కలి, కాలము, కర్మము, అనుమూడింటికిఁ - కంటకమైయున్న పరమశివుని
త్రిశూలాగ్రమునందు నెలకొని - కల్పాంత ప్రళయములయందు కూడ వినాశము
లేక-ప్రకాశించునది కావున - కాశి: ఆక్షేత్రమునకు - తూర్పుదిశయందు దక్షిణము
నుండి యుత్తరమునకుఁ బ్రవహించుచున్న గంగానదిలో - దక్షిణమున, 'అసి'
యును, ఉత్తరమున 'వరణ'యును, పొలిమేరలై కలియుచున్నవికావున-ఆమధ్యలో
పంచక్రోశపరిమితమైయున్న సీమ "వారణాసి".

ఎన్నఁడును విడువక శివుఁడు-ఆక్షేత్రమందు నివసించును. కావున - 'అవి
ముక్తము'. శాశ్వతానందమునకు విహార వనము కావున - 'ఆనందకాననము'
ప్రళయకాలములయందు భస్మావశిష్టములై మహాభూతము లచ్చట శయనించును
గావున 'మహాశ్మశానము' రుద్రునకు ఆ వాసము కావున 'రుద్రావాసము'.

కాశీనగర సన్నివేశమును-ఒక రేఖాచిత్రముగాగీసి తెనుఁగు కాశీఖండము
నందు శ్రీనాథుఁడు చూపియున్నాఁడు.

"కాశినగరి ధనుర్వల్లి: గంగనారి
కోటి యుగ్మంబు లోలార్క-కుధర ధరులు;
వృషము బాణంబు; లక్ష్యంబు వృజినరాశి;
విశ్వనాథుండు ధన్వి: పృథ్వీకళత్ర:'

అవిముక్తము బాహ్యతీర్థమే కాదు. ఆభ్యంతరతీర్థముకూడ. వెలుపలనే కాదు- మన
లోపలను, అవిముక్తమున్నది. అది- ఇడయైన అసి, పింగళయైన వరణ, సుషుమ్న
యైన గంగతోఁ గలియు స్థానము. అదియే భ్రూమధ్యము. అచ్చట మనఃప్రాణము

లను కుదురుకొలిపి- ఆత్మ నుపాసింపవలయునని- అత్రికి యాజ్ఞవల్క్య దుపదే శించెను.

సంసారదోషము వారించునది వరణ. వరణయే వారణ. ఇంద్రియదోషము లను ఖండించునది అసి. వెరసి వారణాసి. ఇడా పింగళలయందు ప్రవేశనిర్గమములు చేయుచున్న ప్రాణపవనమును భ్రూమధ్యమందు సుషుమ్నలో బ్రవేశింపఁజేయఁ గల యోగులకు ఆభ్యంతరమైన 'అవిముక్త' దర్శనము సిద్ధించునని తెలిసిన పెద్ద లందురు. బ్రహ్మప్రాప్తికి ద్వారమగుటవలన సుషుమ్నకు 'బ్రహ్మనాడి' యని పేరు.

ఇట్టి తత్త్వముగల అవిముక్తస్థానముయొక్క బాహ్యాభ్యంతరములయందలి అనుభవనిరూపణమే కాశీఖండమందలి వస్తువు. ఈ వస్తువు కావ్యరూపమునందు తీర్పఁబడిన విధానమునకు దిఙ్మాత్రమైన నిర్దేశము.

అహంకారము కొండవలె మిన్నుముట్టినప్పుడు ఊర్ధ్వలోకమునుండి ప్రస రించుచున్న వెలుఁగున కడ్డువచ్చును. అప్పుడు సంసరణమగ్నులైన జీవులు- కటిక చీఁకటిలో కొట్టుమిట్టాడుచుందురు. ఇదియే- వింధ్యము పెరిగి సూర్యుని తోవ కడ్డు వచ్చుటగాఁ జూపింపఁబడినది. భూమ్యాకాశములు పట్టని- ఆ యహంకారము సిద్ధ పురుషులైన మహాత్ముల సమావేశమువలనఁగాని- ఉపశమింపదు. ఇదియే- అగస్త్య మహాముని సందర్శనమువలన వింధ్యపర్వతము అణఁగిపోవుటగా- చూపింపబడినది. ముక్తిసౌధారోపణమునకు- అహంకారము- ఉపశమించుటయే తొలి మెట్టు. అది- ఎప్పటికైనను- తిరిగి తలయెత్తెడి యవకాశము లేకపోలేదు. ఆ యవకాశము కలుగనీయకుండుటకే అగస్త్యమహాముని తిరిగి రాలేదు.

ఈ వింధ్యవృత్తాంత మను గడప దాఁటినంతటనే కాశీక్షేత్ర వస్తువనెడి మహాసౌధము సాక్షాత్కరించును. ఆ మహాసౌధమునకు- ఆధారభూతములైన స్తంభములు రెండు. మొదటి స్తంభము శివశర్మ కథ. రెండవ స్తంభము దివో దాసుని కథ.

"శ్రీశైలే శిఖరందృష్ట్వా పునర్జన్మ నవిద్యతే'- అని యగస్త్యమహాముని చెప్పఁగా వెంటనే- లోపాముద్ర- ఇదమేవహి సత్యంచేత్ కిమర్థం కాశిరిష్యతే?" దీనికి శ్రీనాథుని తెనుఁగు పద్యము-

"శిఖర మీక్షించునంతన చేరునట్టి
ముక్తి జంతువులకు? జీవములు దొరంగఁ

జచ్చినప్పుడుగాని మోక్షంబులేని
కాశి కరుగంగ నేటికిఁ గాళ్ళజాలి ?"

అని ప్రశ్నించెను. ఆమె ప్రశ్నకు ముని- శ్రీశైలాదులు మోక్షకారణము లనుట లోని తాత్పర్యము- కాశీప్రాప్తి ద్వారమున పరంపరాసంబంధముచేత- అవి మోక్ష కారణములనియును కాశి సాక్షాన్మోక్షకారణమనియును వివరించుచు దీనికి దృష్టాంత ముగా శివశర్మ కథ చెప్పెను.

కర్మబద్ధులై సృష్టియాత్రయందు గతాగతములు చేయుచున్న జీవకోటులకు శివశర్మ ప్రతినిధి. మోక్షస్థానమైన కాశికి వచ్చియును శివశర్మ కర్మానుసారిణియైన బుద్ధివశమున- అచ్చట-కాలు నిలువక- సప్తపురి యాత్రికని బయలుదేరి- అది పూర్తి చేసికొని- అధ్వాంతరముగ మాయాపురిలో మరణించెను. సప్తపురీయాత్రా సుకృ తానుభవమునకై శివశర్మను వైకుంఠమునకు విమానముతో విష్ణుకింకరులు వచ్చిరి. యాత్రలో శివశర్మకు వారు బ్రహ్మలోకమువఱకుఁ గల ఊర్ధ్వభువనముల నన్నింటినిఁ జూపి చెప్పిరి. ఆ లోకములన్నియును పునరావృత్తి కలవి. వారు బ్రహ్మవిష్ణు లోకములనుగూడఁ జూపిరి. అపునరావృత్తియైన శాశ్వతకైవల్యము, ఆ లోకము లలో లేదు. కాశియందు దేహ త్యాగమాత్రముననే యది సిద్ధించును. ఈ విషయ మును ప్రతిపాదించుచు శివశర్మ కథ- అనాదియైన సంసారస్వరూపమును, గహ నములైన కర్మగతులను, కర్మప్రాప్యములైన లోకములను. వాని అశాశ్వతత్వమును, ప్రదర్శించుచున్నది. మఱియును- ఆ యా లోకాధిపత్యములకు హేతుభూతములైన తపోవిశేషములను, దిక్పాల పూర్వజన్మములను వివరించుచు- ఏతాదృశమైన అభ్యు దయమునకు కాశియందలి శివలింగ ప్రతిష్ఠారూపమైన శివార్చనమే కారణమని విద్వేషించుటద్వారా బ్రహ్మాండపరివ్యాప్తమైన కాశీక్షేత్ర మహానుభావమును పరోక్ష ముగా నిరూపించుచున్నది.

ఋషులు, దేవతలు, దిక్పాలురు సూర్యాదిగ్రహములు, నక్షత్రములు, ధ్రువుఁడు, బ్రహ్మవిష్ణువులు- అందఱును కాశీక్షేత్రమునందు తమతమ పేర్లతో లింగప్రతిష్ఠలు చేసినవారే. వారి పూర్వజన్మములన్నియును ఆ మహాక్షేత్రముతో ముడిపడియున్నవే యని శివశర్మ కథవలన తేటపడుచున్నది.

పుణ్యము పరిక్షీణమగు వఱకు వైకుంఠములో నుండి శేషపుణ్యముతో శివ శర్మ కర్మభూమియందు వృద్ధకాలుఁడను రాజై పుట్టి. రాజ్యసుఖము లనుభవించి-

ప్రబుద్ధప్రాక్తన స స్కారుఁడై భార్యతోసహ కాశికి వచ్చి- తనపేర వృద్ధకాలేశ్వర లింగమును ప్రతిష్ఠించి- స్వప్రతిష్ఠిత లింగగర్భమునందు సశరీరముగ లీనమై కైవల్యమును పొందెను.

ఇట్లు శివశర్మ కథాసూత్రమునందు బ్రహ్మాండభువనము లన్నియును గుంఫిత ములై కర్మస్వరూపము సోదాహరణముగ ప్రదర్శింపఁబడి- కైవల్యసిద్ధికి కాశికన్న శరణ్యము లేదన్న పరమార్థమును పరోక్షముగ నిరూపించుచున్నది.

సూతముని సంవాదముగ మొదలైన ఈ కాశీఖండము శివశర్మ కథనుండి లోపాముద్రాగస్త్య సంవాదముగ సాఁగి- అచ్చటనుండి కుమారాగస్త్య సంవాదమై ప్రత్యక్షముగ కాశీక్షేత్ర స్వరూపమును వర్ణించుచున్నది.

ప్రళయస్వరూపము, కాశియొక్క- అవినాశస్థితి, అది- అనాదినుండి- శివశక్తి నివాసమగుట, కాశీపర్యాయనామ నిర్వచనము, విష్ణుప్రాదుర్భావము, ఆయన తపస్సు; చక్రపుష్కరిణీ మణికర్ణికగా మాఱుట, గంగ, కాలభైరవుఁడు, దండపాణి, జ్ఞానవాపిక, బిందుమాధవుఁడు మొదలైన అనాదియైన కాశీపరివార వృత్తాంతములు, కాశీప్రాప్తిక నియతమైన సదాచార స్వరూపము, వర్ణధర్మములు, ఆశ్రమధర్మములు, స్త్రీలక్షణము, కాశియొక్క యోగస్వరూపము, కాలజ్ఞానము మొదలైన ప్రధాన విషయములన్నియును ప్రస్తావింపఁబడినవి. ఇది కాశియొక్క ప్రాచీనస్వరూపము.

కాశీఖండ వస్తుసౌధమున కాధారమై కాశితో ప్రత్యక్షసంబంధముగల ద్వితీయ స్తంభము దివోదాసుని కథ: 'కాశీ మాహాత్మ్యమునకు దివోదాసుని కథ అధికారికము. తక్కినవి అనుషంగికములు' అని శ్రీనాథుఁడే చెప్పియున్నాఁడు, దివోదాసుని కథతోఁగాని, కాశీక్షేత్రముయొక్క సమగ్ర స్వరూపము అభివ్యక్తము కాదు. దివోదాసుని కాలమందే కాశీమహాక్షేత్రము పంచాయతనముగా విస్తరించినది.

ఇది కాశియొక్క అర్వాచీనస్వరూపము. వియోగవేళయందుకాని ప్రియతమ వస్తువుయొక్క గుణములు సమగ్రముగా అనుభవములోనికి రావు. శ్రీ విశ్వేశ్వరుని కాశికా విప్రలంభమే దివోదాసుని కథయందలి వస్తువు. కాశియొక్క నిజస్వరూపము శ్రీ విశ్వేశ్వరుని విరహావహ్నియందు క్రాఁగి దేదీప్యమానముగ ప్రకాశించుచున్నది. దీనికి ప్రస్తావనాప్రాయముగనే కాశీ విరహస్వరూపము పరమపాఱుపతుఁడైన అగస్త్యునియందు ప్రప్రథమముగా వర్ణింపఁబడియున్నది.

దివోదాసునివలన శ్రీ విశ్వేశ్వరునకు కాశికానగరముతో విప్రలంభము సంభవించినది. అది యెట్లనఁగా-

మనువంశ ప్రభవుఁడైన రిపుంజయుఁడను రాజర్షి శివయోగి. కాశిలో తపస్సు చేసికొనుచుండెను. ఆకాలములో భూమిపై భయంకరమైన క్షామము సంభవించెను. మనుష్యులను మనుష్యులే తినివేయుచుండిరి. క్షామములు పెక్కువిధములై సంభవించుచుండును. ఇది వానికిఁ బరాకాష్ఠ ; ఆఁకలితో వేలకొలఁది జీవములు మరణించుచుండెను. కారుణికుఁడైన సృష్టికర్త దీనిని నివారించుటకై రిపుంజయునిఁ బిలిచి, భూమిని పాలింపుమని కోరెను. ఆ రాజు సృష్టికర్తను ఒక వ్యవస్థను కోరెను.

"దేవతలు, భోగులు. భూమిని విడిచి స్వస్థానములకు వెళ్ళిపోవలయును. ఆ పక్షముననే నిరుపద్రవముగ భూమిని పాలించుట కుదురును. లేనిచో- బహు నాయకమైన రాజ్యము పదిలపడనేరదు."

ఆ రిపుంజయుఁడే దివోదాసుఁడు ; ఇది యా రాజు బిరుదనామము. ఆ రాజుతో సృష్టికర్త యిట్లనెను-

"దివోఽపి దేవాదాస్యంతి రత్నాని కుసుమానిచ
ప్రజాపాలన సంతుష్టా మహారాజ ; ప్రతిక్షణమ్ ;
'దివోదాస' ఇతిఖ్యాత మతోనామ త్వమాప్స్యసి
మత్ప్రభావాచ్చ నృపతే ; దివ్యం సామర్థ్యమస్తుతే-"

దివోదాసుఁడు కోరిన యీ వ్యవస్థవలన మునుముందుగా శ్రీ విశ్వేశ్వరుఁడే కాశిని విడువవలసివచ్చెను. పార్వతితో, ప్రమథగణములతో, శివుఁడు జంబూద్వీపమును విడిచి ద్వీపాంతరములోనున్న మందరపర్వతమునకు వలస వెళ్ళిపోయెను. ఇఁక మిగిలినవారి మాట ఏమి ?

శివస్థలములు, విష్ణుస్థలములు- అన్నింటను మూలవిరాట్టులు అంతర్ధానమై శూన్యాలయములు మిగిలెను.

"అపుడు జంబూతరుద్వీప విపులయందు
వాసికెక్కిన యద్దివోదాసు నాజ్ఞ
గొంది సందిని నొక కుంటి, కుదిపి. పేఁద,
యనబూతంబు నిల్వనీరైరి భటులు-

కోయిలఁ దిరుమలఁ బెరుమా
కోయిలఁ దిరుపతులఁ గుంభఘోణాదికది
వ్యాయనంబుల మాయం
బై యెక్కడఁ బోయెనొకో ; మురాంతకు ప్రతిమల్ ;
మోసపోక ముసానమ్మ ముద్దరాలు
తారె సడి సప్పులేక పాతాళమునకుఁ
దాను గొడుకులు; నొక్కింత తడసెనేనిఁ
గుతిలపఱుపరె నృపుబంట్లు గుదెలవారు ;''

శ్రీనాథుఁడు- ఈ కథను ఇప్పుడు మన కండ్లముందు జరుగుచున్నదా ; అన్నంత స్వాభావికముగాఁ జిత్రించెను.

వలసలు పోవునపుడు మనుష్యులు పడెడి కడగండ్లే దేవతలును పడినట్లు చమత్కరించెను. ఇరుకు పరిస్థితులలో దేవతలును ఒదిగియుండిరి.

ఇంద్రాదులు బృహస్పతిని మధ్యపెట్టుకొని కార్యాలోచన సభ తీర్చిరి. "సామాన్య మానవుని కింతటి యహంకారమా ; వీనికి బుద్ధి చెప్పవలయును" అని నిర్ణయించి- ఆ రాజు రాజ్యములో అగ్నిదేవుఁడు నిజస్వరూపమును ఉపసంహరించునట్లు చేసిరి. యజ్ఞ క్రియలు నిలిచిపోయెను. ఇండ్లలో వంటలు లేవు. రెండుజాములు దాఁటిపోయినను భోజనశాలనుండి రాజునకు పిలుపులేదు. వంటలవారు చేతులు పిసికికొనుచు వచ్చి రాజున కిట్లు విన్నవించిరి-

'అంబుజ బాంధవాన్వయ నృపాగ్రణిఁ బోనము నేఁడు' సూర్యసా
కంబున నాయితంబయిన కజ్జము; భోజనశాలలోనఁ బ
క్యం బిడినాదు పంకజదళాక్షులు; రెండవజాముగంట వ్రే
యంబడె, నారగింప సమయంబని చెచ్చెర విన్నవించిరిన్॥'

ఆఁకలితో అల్లాడిపోవుచున్న ప్రజలు గుంపులుగా వచ్చిరాజుతో మొఱపెట్టుకొనుటకు మొగసాలలో నిలిచి యుండిరి.

అభయమిచ్చి ప్రజలనుపంపి-రాజు-తానే అగ్నిదేవతా స్వరూపము ధరించి- యజ్ఞపాకాదిక్రియలు-అవిచ్ఛిన్నముగా కొనఁసాగించి పాలించెను.

దేవతలు మఱల - ఆరాజురాజ్యములో వరుణదేవత అంతర్హితమై పోవునట్లు చేసిరి. రాజు యోగశక్తి నాదేశించి తానే వరుణదేవతయై వానలు కురియించి-ఇట్లు కాదని యీరీతిగా ప్రతిజ్ఞలు చేసెను.

"దహన స్వరూపంబుఁ దాల్చి యేఁగై కొందు
హవ్య కవ్యాహుతు లధ్వరములఁ
బర్జన్యమూర్తిఁ జేపట్టి యేవర్షింతు
సలిల ధారలు సస్యములు ఫలింప
శశిదివాకరుల వేషంబులఁ దాల్చి యే
ఖండింతు గాఢాంధకార పటలిఁ
బవను నాకారంబు భరియించి యేను బ్రా
ణ్యంతబహిర్వ్యాప్తి నాచరింతు

తే॥ వేల్పులందఱు నేనయై వివిధగతుల
విశ్వలోకంబు రక్షింతు వేయునేల?
యింక నౌదాని కీట నేన యేలువాఁడ
నాగలోకంబు నాకంబు యోగశక్తి."

ఈరీతిని-సకలదేవతా స్వరూపములను-తనయందే - ఆవిష్కరించి లోక వ్యవస్థ నిరుపద్రవముగ-నిరపాయముగ-పరిపాలించుచున్న దివోదాసుని దేవతలు తేఱిచూడలేరయిరి.

'రాజా దిక్పాలకాంశావతీర్ణుఁడు. నాఁడవిష్ణుఃపృథివీపతిఃʻ అన్నమాటలలోని యాథార్థ్యమునకు-సకల పురాణేతిహాసములయందును దివోదాసునికన్న వేఱొక దృష్టాంతములేదు. ఆయన రాజ్యములో నెచ్చటను ధర్మలోపములేదు. ఈరీతిగా దేవతలను పదిచెరువుల నీళ్ళు త్రాగించి - దివోదాసుఁడు-ఎనుబదివేలయేండ్లు-కాశీ నగరము రాజధానిగా జంబూ ద్వీపమును పరిపాలించెను.

మందర పర్వత భూములలో వలసలోనున్న శ్రీవిశ్వేశ్వరునకు కాశికావిరహము దుర్భరమై క్షణమొక యుగముగాఁ గడచుచుండెను. ఈకాశికా విప్రలంభమును వర్ణించుచు మూలములో-అద్భుతమైన ఒక సర్గయున్నది. (అది తెనుఁగునకు రాలేదు.)

ధర్మలోపమును నిరూపించికాని-దివోదాసునకుఁ గాశినుండి యుద్వాసము చెప్పుటకు శివునికైనను దారిలేదు. ధర్మబలమే రాజుబలము.

ఆరాజునందు-ఆరాజు ప్రజలయందు-నెరసు కనిపెట్టుటకై శివుఁడు మొట్ట మొదటగా చతుష్షష్టి యోగినీగణమును-కాశికిఁ బంపెను. వివిధరూపములతో వారు కాశీ వీథులలోఁ దిరుగుచు నెరసులకై శృంగాటకములలోఁ గూర్చుండి జల్లెడలు పట్టుచుండిరి.

రాజులోఁగాని-ప్రజలలోఁగాని-ఒక్కనెరసైనను వారికండ్లకుఁ బొడఁగాన రాలేదు. చేయునదిలేక-శివలింగములు ప్రతిష్ఠించికొని-వారు కాశియందేకాఁపురమై పోయిరి.

శివుఁడు-కర్మసాక్షియైన సహస్రకిరణునిఁ గాశికిఁబంపెను. ఆ సూర్యుఁడు-వివిధరూపములలో శోధించి శోధించి-విఫల ప్రయత్నుఁడై-కాశిని విడిచిపోలేక-లోలార్కుఁడు మొదలైన పండ్రెండు రూపములతో-శివలింగములను ప్రతిష్ఠించి శివార్చన చేయుచుఁ గాశియందే నిలిచిపోయెను.

శివుఁడు-పరమాప్తులైన ప్రమథులను గణములు-గణములుగా కాశికిఁ బంపెను. వారును నిష్కర్మయులై తమతమపేరులతో శివలింగములను ప్రతిష్ఠించి కాశిని విడిచి శివునియొద్దకుఁ బోలేక యందే నిలిచిపోయిరి.

శివుఁడు-బ్రహ్మను పంపెను. ఆ బ్రహ్మకాశిలో దశాశ్వమేధములుచేసి-దశాశ్వమేధేశ్వర లింగమును ప్రతిష్ఠించి కాశియందే-'స్థిరోభవ' యైపోయెను.

చెరువు వెడుకఁబోయిన తామర పూవులవలె - దేవతలందఱును నిశ్చింతులై వికాసభాసుర వదనములతో-దామువచ్చినపనియే మఱచి కాశిని విడిచి వెనుకకుఁ బోలేక - అందే నిలిచిపోయిరి. కాశియందున్న తమపై శివునకుఁ గోపమురాదన్న రహస్యమువారందఱకును దెలియును

నాటికిని-నేటికిని-ఆ కాశీనగరముయొక్క ఆలక్షణమే యట్టిది; అది తన్ను జేరిన జీవులయొక్క సకల సంస్కారములను జీర్ణపర్ణములవలెఁ దమయంతట తామే రాలిపడిపోవునట్లు చేయుచుండును.

పరమాద్భుతమై-ఏవంవిధమైన కాశియొక్క అనుభావమును స్ఫురింపఁ జేయుట యందే కాశీఖండమునందలి దివోదాసుని కథ చరితార్థ మగుచున్నది.

శివుఁడుకూడ-ఒకవిధముగా సమాధానము కుదిర్చికొనెను. ఒక్క-రొక్కరుగా-తన పరివారమంతయును గాశికిఁ జేరుకొనుచున్నది. ఏనాటికో ఒకనాటికిఁ దాను గూడఁ గాశికిఁ జేరుకొనవచ్చును. అదియే తనకు పదివేలు!

పరమేశ్వరుఁడు కూడ – అఁటావాదియే.

చివరకు – శివుఁడు తన పెద్దకొడుకు – కాశీయువరాజును విఘ్నేశ్వరునిఁ బంపెను. ఆయన పొట్టివాఁడు. అఘటన ఘటనాసమర్థుఁడు!

ఆయన–డుంఠిభట్టారకుఁడను పేరుపెట్టుకొని – కాశీనగరవీథులలో గునగునఁదిరుగుచు – పలుపోకలు పోవుచు – తనమంత్ర తంత్ర ప్రజ్ఞలతో – కాశీయంతయును ఒక కొలికికి. దెచ్చుచు ప్రజలఁదఱు కథలు కథలుగాఁ జెప్పినట్లు చేసి – రాజాంతఃపురమ్ములోనికి వార్తలు ప్రాఁకించి – పిలుపు తెప్పించికొని-అంతఃపుర ప్రవేశముచేసి రాణివాసమునకు గురువై కూర్చుండెను.

కాశికానగరముయొక్క సప్తావరణములలో-అవరణమొక్క దానికి-ఎనిమిదేసి రూపములతో–వెరసి యేఁబదియాఱు రూపములతో స్థావరమేర్పఱిచికొనెను.

శివుఁడు విఘ్నేశ్వరునకుఁదోడు విష్ణువును గూడఁ బంపెను.ఆ విష్ణువు బౌద్ధవేషముధరించి – 'విజ్ఞాన కౌముది' యైన లక్ష్మితో, "వినయకీర్తి" యను శిష్యుఁడైన గరుడునితో, కాశియందుఁ బ్రవేశించి – పురుషులలోఁ దానును, స్త్రీలలోలక్ష్మియును ప్రచారముచేసి–క్రమముగా రాజుమనస్సునందు విరక్తి పుట్టించి – రాజు తనఁతట తానే రాజ్యము విడుచునట్లు చేసెను.

దివోదాసుఁడు తన సర్వసమృద్ధిని వెచ్చించి 'భూపాలశ్రీ' అను మహాప్రాసాదమును నిర్మించి – అందు దివోదాసేశ్వర లింగమును ప్రతిష్ఠించి దివ్యవిమానారూఢుఁడై సశరీరముగఁ గైలాసమునకుఁ బోయెను. దివోదాసుని కథ యీరీతిగా–కాశీక్షేత్రముతో-అవినాభావమును పొంది శాశ్వత మయ్యెను.

శ్రీవిశ్వేశ్వర జ్యోతిర్లింగముతోఁబాటు కాశియందు సుప్రసిద్ధలింగములు. ఓంకారేశ్వరుఁడు, త్రివిష్టపేశ్వరుఁడు, వీరేశ్వరుఁడు, కృత్తివాసేశ్వరుఁడు, కేదారేశ్వరుఁడు, ధర్మేశ్వరుఁడు, విశ్వకర్మేశ్వరుడు. మొదలైనవి పదునాలుగు కలవు.

రత్నేశ్వరుఁడు, శైలేశ్వరుఁడు, దక్షేశ్వరుఁడు. సతీశ్వరుఁడు, నర్మదేశ్వరుఁడు, అమృతేశ్వరుఁడు. నిగూఢలింగములనేకములు కలవు. దధీచి. గౌతముఁడు. దుర్వాసుఁడు. జైగీషవ్యుఁడు, మొదలైన మహర్షులు-అష్టదిక్పాలకులు. నవగ్రహములు. నక్షత్రములు, అప్సరసలు, ధ్రువుఁడు - మొదలైనవారు. అసంఖ్యాకులైన పర్వతములు-ప్రతిష్ఠించిన లింగములుకలవు. సిద్ధలింగములు స్వయం భూలింగములు. పెక్కుగలవు.

ఇవికాక - కోటాన కోట్ల లింగములుగలవు. గంగాగర్భమునందుఁ గలవు. నూవుగింజంత మేరయైన శివలింగములేని చోటు కాశిలోలేదు. కాశియే మహా లింగము :

'భూమి తిలమాత్రమును నుడివోవకుండ
నమ్మిత లింగంబు లర్బుద న్యర్బుదములు
కలవు తీర్థరాజంబులు కాశియందు
మహిమ కావాస మవిముక్త మండలంబు'

'వేయునేటికిఁ నానంద విపిన భూమి
నడుమ శశిఖండకోటీర. నాగకటక.
నిటల లోచన. గిరీశ. ధూర్జటులు హరులు
నారువోసిన చందాన నాటి యుంద్రు॥'

కాశియందలి తీర్థములెన్నివిధములో నాలుక కసటుదీర శ్రీనాథుఁ డీతీరుగా వర్ణించి యున్నాఁడు.

"మందాకినీ వారి, మణికర్ణికాంబువు,
వాపికాకూప పల్వల జలంబు,
కుండికా సలిలంబు, కుల్యాప్రపూరంబు,
సెలయేటి పాథస్సు. చెలమ నీరు.
ధారా కృపీటంబు. తమ్మిబావి పయస్సు.
కాసార నీరంబు. క్రయ్య. తోయ,
మూఁట కాండము. బుగ్గయుదకంబు. జల.
పుష్కరము. నదహ్రద కంబరంబు లివియు.

తే॥ మొదలుగా సర్వ సర్వతోముఖము కాశీ
దీర్థరాజంబులుగ సమర్థించు శ్రుతులు.

అచ్చట ప్రతి జలబిందువు తీర్థమే యని వేదములు చెప్పుచున్నవి. స్కాందాది మధ్యమునుండి ప్రభవించిన శ్రీ కాశీఖండ కల్పద్రుమమునకు ఆలవాలము అగస్త్యుడు. అగస్త్యుని కాశీవిరహమే కాండము. స్కంధము లోపాముద్ర సంప్రశ్నము. శాఖలు– శివశర్మ కథ, దివోదాసుని కథ. వీనిలో అవాంతరములైన ఉపాఖ్యానములు ఉపశాఖలు. చిన్నకథలు, చిలవలు పలవలు. చివురుజొంపములు: తీర్థములు కుసుమములు, శివలింగములు ఫలములు:

ఋషులు, దేవతలు, మానవుల మాట యట్లుంచి– ఉత్తరాదిత్య కుండిక యొడ్డున గరికపరకలు మేయుచున్న ఆ మేకపిల్ల. త్రివిష్టపేశ్వర గోపురమునైన కాపురమున్న ఆ పావురముల జంట, సరస్సులో పడి కలహంసలైన ఆ కాకులు, ఒలికిన పూజాక్షతలను, తిలలను తినుటకై శివలింగముచుట్టును తిరుగుచున్న ఆ చిట్టెలుక, ప్రొద్దుననే ముంగిటి కసవుగాండ్ర, చిమ్ముచు జేతి చీపురుకట్టతో సహ ఓంకారేశ్వర లింగగర్భములోనికి జొఱబాటిన అగర్భదాసి, వెన్నంటి తఱుముకొని వచ్చుచున్న కాకికి వెఱచి ఓంకారేశ్వరుని గుడిచుట్టును ప్రదక్షిణము తిరుగుచున్న ఆ కప్ప– కాశీ మహానుభావమున కెత్తిన పతాకలు:

అగస్త్యుడు కాశిని విడిచిపోవుచున్న ఘట్టమునందు మూలనిరపేక్షముగా శ్రీనాథుడే మన కన్నులకు గట్టును. గుణనిధి కథ. కళావతి కథ, వ్యాసనిష్క్రమము– మూలమును తలపోయకుండ జదివికొనవలసిన భాగములు.

శ్రీనాథుడు స్వభావసిద్ధముగ ముక్తక కవి: రచనాసౌందర్యముచేత లోక సమ్మోహనములైన, కాశీఖండమునందలి యసంఖ్యాకములైన సీసపద్యములకు, పెక్కు వృత్తములకు మూలములని చెప్పదగిన శ్లోకములు కానరావు. అవి యన్నియు శ్రీనాథుని స్వోపజ్ఞములే. శ్రీనాథుని రచనలో ఇది తెనుగు చేసిన పద్యము– ఇది స్వతంత్రము అని మేర లేర్పఱించుట విఫలప్రయాసము. అన్నింటియందును ఒక శ్రీనాథముద్ర యుండి స్వతంత్రములుగానే భాసించును గనుక:

"ఏవిక మోము బూమియ వహించి చరించుచునుండు కామధు
గ్ధేనువు డుంఠి కాళి; నిదితెల్లము; వేలుపుగిడ్డి కానినా

డీనునె మోక్షతర్జకము ; నిచ్చునె కాంక్షితదుగ్ధధార ; దూ
ర్వానవ పల్లవావలులు వైచినమాత్రన భక్తకోటికిన్''

ఇది మూలములేని తెనుఁగు పద్యములలో నొకటి.

'పూర్వకవి ముఖ్యరచితా పూర్వ కావ్య భావ రస సుధాచర్వణ ప్రౌఢుఁ
డైన' శ్రీనాథునికి - రసపారవశ్యస్థితిలో స్వపరభేదము కరఁగిపోవును. మయూ
రుఁడు, బాణుఁడు, భవభూతి, కాళిదాసు మొదలైన సంస్కృత మహాకవుల పద
బంధములు, సమాసములు, ఉక్తివిశేషములు మొదలైనవి- భూద్రపద గోదావరివంటి
శ్రీనాథుని వాక్ప్రవాహములో అవశములై కొట్టుకొని వచ్చుచుండును. అది- అశక్తి
కృతమని తలంచునంతటి అమాయికు లెవ్వరు సుండరు. శ్రీనాథుని ప్రాణశక్తి
అగాధమైనది. ఆయన సందర్భములోని గుంఫితములైన ఆ పూర్వకవుల పదబంధ
ములలోనికిఁగూడ ఒక వినూతన ప్రాణశక్తి ప్రసరించుచుండును. శ్రీనాథుఁడు
స్వీకరించుటయే వారిని గౌరవించుట ;

శ్రీనాథునకు తెనుఁగుభాష జీవనాడి తెలియును. ఉన్న బలమంతయును-ఆ
'పలుకు నుడికారము' లోనే యున్నది. సమాసప్రౌఢిలో నున్నట్లు భాసించును.
ఒక్క-జాతీయముతో, క్రియావిన్యాసమందలి ఒకవిచ్ఛిత్తితో,ఎంతటి గాఢసంస్కృత
మందైనను శ్రీనాథుఁడు తన ముద్రవైచి దానిని తనది చేసికొనుట అనితర సాధా
రణమైన యీ లక్షణముమీఁదనే సార్వభౌమమైన ఆయన కవితా వ్యక్తిత్వమాధార
పడియున్నది. ఆయన వాణిని ఉత్తేజపఱిచిన సంస్కృతాంధ్ర కవులు పెక్కునుందిఁ
ఆయన వాణివలన - ఉత్తేజితమైన కవి పరంపరనాటి నుండి కొనసాఁగుచునే
యున్నది. ముందును కొనసాఁగును. శ్రీనాథుడు తన పూర్వులనుండి యెంతతీసి
కొనెనో అంతకు పదింతలు తన తరువారికిచ్చిపోయెను.

శ్రీనాథుని పరిణత ప్రజ్ఞనుండి పండిన కాశీఖండము తెనుఁగు వాఙ్మయము
నకును, తెనుఁగు జాతికివి-ఆమృతత్వమును ప్రసాదించుచున్నది-

''జిలుగు సంధ్యారాగ చీనాంబరముగట్టి
కుసుమగర్భముగఁ గీలొక్కపు దుటిమి
కస్తూరి మెదిచిన గంధసారమలంది
ముత్యాల తాటంకములు ధరించి

సీమంత పథమునఁ జేర్చుక్క సవరించి
కురులపై జిన్ని పూఁగుత్తరించి
శ్రీపాదముల హేమ నూపురంబులు దాల్చి
కటి మీఁద పఱ్ఱాల కమరు నిలిపి

తే॥ యన్నపూర్ణ విశాలాక్షి యనెడి పేళ్ల
గాశికామధ్య శృంగాటకముల యందు
విశ్వపతిదేవి మధ్యాహ్నవేళ బెట్టు
నమృతపాయస దివ్యాన్న మనుదినంబు."

"శివుని నివాళించు శేషాహి నడురేయి
బహుఫణారత్న దీపములచేత
నంతర్గతంబులై యర్చించు నీశాను
ఫలపుష్పములఁ గల్పపాదపములు
కామధేనువులిందు, ఖండేందు శేఖరు
నూధన్య ధరల నోలలార్చు
నిధులు తొమ్మిదియుఁ గంకేకాలునకనిచ్చు
నిర్మలమణులు కానికలుగాఁగఁ

తే॥ గాశికాపట్టణంబు శంకరుని నెలవు
కలిప్రవేశింపదానంద కాననమున
శ్రీనివాసంబు వారణసీ పురంబు
ముక్తిసంధాయకం బవిముక్తపురము."

సర్వం శివమ్

ఓం తత్సత్

కృతజ్ఞతలు

కాశీఖండమునకు వ్యాఖ్యానము రచించి శ్రీనాథుని ఋణమును కొంత తీర్చు కొను నవకాశము నాకు కల్పించిన తెలుగు విశ్వవిద్యాలయమువారికి మునుముందుగా కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నాను. శ్రీనాథుడు నడయాడిన రాజమహేంద్రవరములో స్థిరనివాసమేర్పరచుకొనిన నాకు ఇదొక అపూర్వావకాశము. ఈ తీరున తెలుగు విశ్వవిద్యాలయమునకు ఋణపడితి ననుకొందును.

వ్యాఖ్యాస్రవంతి అను ప్రణాళికను రూపొందించి అందు నన్ను భాగస్వామిని చేసి అనుదినము నుత్సాహపరచిన చిరంజీవి బేతవోలు రామబ్రహ్మమునకు ఆశీస్సులు పల్కుటకు ఆనందించుచున్నాను.

కాశీఖండమునందు పాఠభేదములు అనేకములు ఉన్నవి. వానినెల్ల ఎత్తి వ్రాసికొని ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు ప్రత్యేకముగా ఒక "బైండును" తయారుచేసికొన్నారు. దానిని నాకు ఇచ్చి కొండంత ఉపకారము చేసిరి. వారు చేసిన మేలు మరువరానిది.

కలిసినప్పుడెల్ల క్రొంగ్రొత్త సూచనలతో సహకరించిన సర్వశ్రీ తుమ్మపూడి కోటేశ్వరరావు, కేతవరపు రామకోటిశాస్త్రి, కోవెల సంపత్కుమారాచార్య ప్రభృతులకు కూడ ఇదే సందర్భమున కృతజ్ఞతలు తెలియజేయుచున్నాను.

ప్రమోదూత
విజయదశమి

—మల్లంపల్లి శరభేశ్వరశర్మ
29-9-1990.

విషయసూచిక

పీఠిక

విషయము				పుట
ఇష్టదేవతా ప్రార్థనాదికము	....	....	....	1
కృతిపతి వంశావతారము	....	....	....	28
షష్ట్యంతములు	....	....	....	67
ప్రథమాశ్వాసము				
పురాణ ప్రశంస	....	....	....	73
నైమిశశబ్ద నిర్వచనము	....	....	....	79
కాశీఖండ ప్రశంస	....	....	....	83
నారదుండు వింధ్యమున కేతెంచుట	....	....	....	86
వింధ్య వర్ణనము	....	....	....	91
సూర్యోదయ వర్ణనము	....	....	....	119
ఆశ్వాసాంతము	....	....	....	144
ద్వితీయాశ్వాసము				
దేవతలును, మునులును బ్రహ్మకడ కేగి స్తుతించుట			....	148
బ్రహ్మదేవతలకును, మునులకును గోబ్రాహ్మణ ప్రభావంబు చెప్పుట				160
దేవర్షులు బ్రహ్మనియోగమున నవిముక్తంబున కేతెంచి యగస్త్యుని దర్శించుట				177
బృహస్పతి అగస్త్యునితో సంభాషించుట		....	....	217
బృహస్పతి లోపాముద్రతో పతివ్రతా ధర్మంబులు ప్రస్తావించుట				219
బృహస్పతి యగస్త్యునితో దమ వచ్చిన కార్యంబు నెఱిగించుట				239
అగస్త్యుండు కాశీవియోగంబునకు బరితపించుట			....	248

విషయము				పుట
వింధ్య గర్వాపహరణము	....	....	....	298
ఆశ్వాసాంతము	....	....	....	305

తృతీయాశ్వాసము

అగస్త్యుండు దక్షిణ కాశికిం బోవుట		....	....	318
అగస్త్యుండు కొల్లాపురంబున కేఁగుచు మార్గమున వీరభద్రేశ్వరుని దర్శించుట				333
అగస్త్యుండు లక్ష్మిని స్తోత్రము చేయుట		....	....	341
అగస్త్యుండు శ్రీశైలంబున కేతెంచుట		....	....	356
అగస్త్యుండు లోపాముద్రకు బాహ్యాభ్యంతర తీర్థమాహాత్మ్యంబుఁ జెప్పుట				372
శివశర్మోపాఖ్యానము	....	....	....	383
సప్తపురీ ప్రశంస	....	....	....	391
పిశాచలోకము	....	....	....	429
అప్సరోలోకము	....	....	....	451
సూర్యలోకము	....	....	....	455
స్వర్గలోకము	....	....	....	477
అగ్నిలోకము	....	....	....	487
వైశ్వానర మాహాత్మ్యము	....	....	....	490
వీరేశ్వర ప్రభావ వర్ణనము	....	....	....	516
ఆశ్వాసాంతము	....	....	....	539

గద్య పద్య సూచిక

...o...

Bn

శ్రీ కాశీ ఖండము

(మణికర్ణికా వ్యాఖ్యానము)

❋ పీఠిక ❋

— ఇష్టదేవతా ప్రార్థనాదికము —

శ్రీ కాశీనగరాధి రాజ్యపదవీ సింహాసనాధ్యాసి లో
కైక గ్రామణి విశ్వనాథుఁడు విశాలాక్షీ మనోభర్త సు
శ్లోకుం దొడ్డయ యల్ల భూవరతనూజున్ వీరభద్రేశ్వర
శ్మాకాంతున్ జగనొబ్బగండని మహైశ్వర్యాన్వితున్ జేయుతన్ ॥ 1

అర్థము :- 'శ్రీ కాశీ నగరాధిరాజ్యపదవీ సింహాసనాధ్యాసి'. శ్రీ=కైవల్య లక్ష్మీస్వరూపమైన, కాశీ='కాశి' యను పేరుగల, నగర=పట్టణముయొక్క, ఆధిరాజ్య=అధి రాజత్వమునకు, ఆధిపత్యమునకుఁ జెందిన, (అధికుఁడగు రాజు-అధి రాజు, అధిరాజు యొక్క లక్షణము ఆధిరాజ్యము). పదవీ=స్థానవివేక విశిష్టమైన, జ్ఞానమయమైన, సింహాసన=(సింహ+అసన=సింహాసన) భద్రపీఠమును, అధ్యాసి=అధిష్ఠించి యున్నవాఁడు, 'లోకైకగ్రామణి' (లోక+ఏక=లోకైక), లోక=దృశ్యమైన సకల విశ్వమునకు, ఏక=ఆద్వితీయుఁడైన, గ్రామణి=ప్రభువు, (గ్రామమును నడిపించువాఁడు గ్రామణి; అగ్రిణి, సేనాని, శబ్దములవంటిది) 'విశాలాక్షీ మనో భర్త'. విశాలాక్షీ=విశాలాక్షి అను వ్యవహారముగల పార్వతీదేవియొక్క, మనో భర్త=(మనః+భర్త=మనోభర్త). మనస్సునకు అధిపతియైన, విశ్వనాథుఁడు=విశ్వ నాథుఁడను వ్యవహారముగల శివుఁడు, సుశ్లోకున్=మంచి కీర్తిగలవాఁడును, 'దొడ్డయ యల్లభూవర తనూజున్'- దొడ్డయ = దొడ్డారెడ్డి కొడుకైన, అల్లభూవర=అలాద ప్రభువుయొక్క, తనూజున్=కుమారుని, జగనొబ్బగండని='జగనొబ్బగండఁ డను' బిరుదముగల 'వీరభద్రేశ్వరక్ష్మాకాంతున్' వీరభద్రేశ్వర='వీరభద్రారెడ్డి' యనెడు, క్ష్మాకాంతున్=భూవల్లభుని 'మహైశ్వర్యాన్వితున్' మహత్=దొడ్డదైన, ఐశ్వర్య=ఈశ్వర లక్షణముతో-ప్రభుత్వ లక్షణముతో, అన్వితున్ = కూడినవానినిఁగా, చేయు తన్=చేయునుగాక. (ఈశ్వర లక్షణము-నిగ్రహానుగ్రహ సామర్థ్యము.)

తాత్పర్యము:- కైవల్య లక్ష్మీనిలయమైన కాశికానగర మహారాజ్య సింహాసనము నధిష్ఠించి సకల విశ్వమును ఏకభోగ గ్రామముగా నేలుకొనుచున్న శ్రీ విశాలాక్షీ సమేతుఁడైన శ్రీ విశ్వనాథుఁడు-దొడ్డారెడ్డి మనుమఁడు, అల్లాడరెడ్డి కుమారుఁడు, 'జగనొబ్బ గండ' డను అనువంశికమైన బిరుదలాంఛనము గల-వీరభద్రేశ్వరుఁ డను భూమికాంతుని (వీరభద్రారెడ్డిని) మహైశ్వర్యముతోఁగూడిన వానినిఁగాఁ జేయునుగాత!

విశేషములు:- కృతినాయకుఁడైన వీరభద్రారెడ్డికి ఆశీర్వాదరూపములోనున్న యీ మంగళాచరణ పద్యమునందు క్షేత్ర, తదధిదేవతారూపమైన కావ్యవస్తువు గూడ నిర్దేశింపఁబడి యున్నది;

'కాశృదీప్తౌ' కాశృధాతువునకు 'ప్రకాశించుట' అని అర్థము. 'కాశతే ఇతి కాశీ'. 'కాశి అనఁగా-ప్రకాశించునది. కల్పాంతసమయములయందుఁ గూడ నాశము లేనిదై పరమశివుని త్రిశూలము కొనపై నిలిచి వెలుఁగునది;

'కల్పాంతరేఽపిన వినశ్యతి వారణాశీ'

బ్రహ్మనుండి కీటము వరకు సకల జీవులకు శరీరమును వదలినంతనే శివత్వసిద్ధిని ప్రసాదించు మహిమ గల క్షేత్రము. కైవల్య నిలయము. క్షేత్రాకృతినిఁదాల్చిన శివయోగము-శివజ్ఞానము-ఆనంద కాననము-కాశి.

'వసుధ' మొదలుకొని 'శివుని'తో ముగియు ముప్పదియాఱు తత్త్వములకు-'విశ్వ' మని సంజ్ఞ; అట్టి 'విశ్వమునకు నాథుఁడు విశ్వనాథుఁడు-విశ్వేశ్వరుఁడు. ప్రణమోపదేశముచేత-ఈ విశ్వమును తెఱదీసినట్లు-తిరిగి శివమయము చేయు జ్ఞానాకృతి; కేవలుఁడు; జ్యోతిర్లింగము;

విశాలములైన అక్షులు (కన్నులు) కలది విశాలాక్షి; ఆమె విశాలములైన తన కన్నులు తెఱచినంతనే- ఇట్టి యనంత విశ్వము లుదయించుచున్నవి మూసినంతనే లయించుచున్నవి.

ఆమె- 'ఉన్మేషనిమిషోత్పన్న విపన్న భువనావళి';

విశాలములైన అక్షములు-ఇంద్రియ వృత్తులు. అనఁగా- లోపలి యింద్రియములైన (అంతఃకరణము) మనస్సులయొక్క, వెలుపలి యింద్రియములైన (బాహ్య

కరణములు) కన్ను మొదలగు వానియొక్క- వ్యాపారములను ప్రపంచింపఁజేయునది కనుక- 'విశాలాక్షి'.

ప్రమాణ, విపర్యయ, వికల్ప, నిద్రా, స్మృతు లను చిత్తవృత్తులు (చిత్త వ్యాపారములు)- విశ్వము నింతటి విశాలముగా ప్రపంచించుచున్నవి. కావున ఆ విశాలాక్షి మహా మాయాస్వరూపిణి. పరబ్రహ్మమహిషి. కేవలమైన శివ తత్త్వమును విశ్వముగా మనము భ్రమించునట్లు చేయుచున్నది. ఆ మాయనుండి మనస్సు అను దినుసు పుట్టుచున్నది. మనస్సునుండి యీ విశ్వ ముదయించుచున్నది. తిరిగి- ఈ విశ్వము, మనస్సు, మాయ, శివునియందు విలీనమైపోవుటయే కైవల్యము. అట్టి కైవల్యపదవిని ప్రసాదించు పీఠము-క్షేత్రము కాశి.

'పదం వేదయతి-ఇతి పదవీ' అను వ్యుత్పత్తి ననుసరించి పదవి అనఁగా జ్ఞానము. ఈ భూతముల ఉత్పత్తి వినాశములు-గమనాగమనములు-ఏ స్థానమునుండి కలుగుచున్నవో, ఆస్థానమును దెలియఁజేయుచున్నది కావున పదవీశబ్దము జ్ఞాన వాచకము కూడ నగును.

పదవీ సింహాసనము - జ్ఞాన సింహాసనము. దానిని అధిష్ఠించి యున్నవాఁడు శివుఁడు. 'యస్య జ్ఞానమయం తపః'.

ఆ శివుఁడు-మాయకును, మనస్సునకును, నియామకుఁడు. అవి రెండు తన అధీనములో నున్నవాఁడు శివుఁడు. ఆ రెండింటి అధీనములో నున్నవాఁడు జీవుఁడు.

'మాయాంతు ప్రకృతిం విద్యాన్మాయినంతు మహేశ్వరం' (శ్వేతాశ్వతరము)

ఈ పద్యములోని శ్రీ విశ్వనాథుని విశేషణములు సాభిప్రాయములై కృతిపతికి ఐహికాముష్మిక శ్రేయోరూపమైన చతుర్విధ పురుషార్థ ఫలసిద్ధిని సూచించుచున్నవి కనుక 'పరికరము' అను నలంకారము.

'అలంకారః పరికరస్సాభిప్రాయ విశేషణైః'.

శ్రీ, కాశీ, ఇత్యాది ప్రథమ విశేషణములోని శ్రీ, కాశీ, పదములు-కైవల్య లక్ష్మీ-ప్రకాశ, రూపమైన ఆముష్మికశ్రేయమును, అధిరాజ్య, సింహాసన, పదములు-అఖండ సామ్రాజ్యాధిపత్య లక్షితమైన 'యువాస్యాత్ సాధుయువాఽధ్యాయికః.... తస్యేయం పృథివీ విత్తస్య పూర్ణాస్యాత్' ఇత్యాది తైత్తిరీయానందవల్లీ ప్రోక్తమైన ఐహికశ్రేయమును సూచించుచున్నవి.

'లోకైక గ్రామణీ' అను రెండవ విశేషణము - ఏకచ్ఛత్రాధిపత్యమును తదుపలక్షితమైన ధర్మార్థ సమృద్ధిని సూచించుచున్నది.

'విశాలాక్షీ మనోభర్త్రీ' అను తృతీయ విశేషణము తృతీయ పురుషార్థసిద్ధిని. అందును మనఃశబ్దిప్రయోగము సకల మనోఽభీప్సిత సిద్ధిని సూచించుచున్నది. అవి దిఙ్మాత్రముగా ఊహింపదగును.

సీ॥ కంఠాగ్ర కరిరాజు డుంఠి విఘ్నేశుండు
వడఁకు గుబ్బలి కూఁతు కొడుకు గుబ్బి
ఆకాశమండలంబను నల్ల గలుఁవకు
నకరు వాద్యుండు లోలార్క మూర్తి
గోపాల భామల గుబ్బచన్నుల మెచ్చు
గీర్వాణవంద్యుండు కేశవుండు
కట్టి ప్రీడాశూన్యకటి గోపురద్వార
పరిరక్షకుండు కాలభైరవుండు

తే॥గీ॥ కాలకంఠుని శిరసుపూ గగనగంగ
కాశికాక్షేత్రమున కేడు గడయునైన
యిందఱును నిత్తురెల్లప్పు డిష్టితమ్ము
లల్లి భూపాలు వీరభద్రాధిపునకు ॥ 2

అర్థము :- 'కంఠాగ్ర కరిరాజు' - కంఠ=కంఠమునొక్క, అగ్ర=పై భాగము నుండి, కరిరాజు = ఏనుఁగైన - (కుంభములు, దంతము, తొండము, చేటచెవులు ఈ లక్షణములతో కరిరాజు స్వరూపమైనవాఁడు), డుంఠి విఘ్నేశుండు='డుంఠి' అను పేరుతో కాశీనగర ప్రథమావరణముఁ నున్న గణపతులలో ఐదవవాఁడై వాయవ్య విదిగ్భాగమును పరిపాలించుచుండువాఁడు (ఈయన కాశికానగరమునకు యువరాజు). 'వడఁకు గుబ్బలి కూఁతు కొడుకు గుబ్బి' - వడఁకు గుబ్బలి = వణఁకించు కొండ - (వడఁకు-వడఁకించు అంతర్భావిత ప్రేరణార్థకము. వణఁకుచున్న కొండ మాత్రము కాదు.) మంచుకొండయొక్క, కూఁతు=కూఁతురైన పార్వతీదేవి యొక్క, కొడుకు గుబ్బి=గారాబు కొడుకు; విఘ్నేశ్వరస్వామి.

(ఒక్కొక్క ఆవరణమునకు ఎనమండుగురుగా ఏడు ఆవరణములలో కాశీ మహాక్షేత్రమును గాచి యుండెడివారు మొత్తము ఏఁబది యాఱుగురు గణపతులలో ముఖ్యుఁడు. దిమోదాస నిర్వాసన నాటకమునకు సూత్రధారుఁడు.)

'ఆకాశమంచలం బను నల్ల కలువకున్' ఆకాశమండలం బను=వలయముగాఁ గనిపించుచున్న యాకాశ మనెడు, నల్లకలువకున్=ఇందీవరమునకు, (నింగి నీల వర్ణము కనుక 'నల్లకలువ' యనుట.) అకరువు=కర్ణిక-దుద్దు, (కర్ణిక నంటియున్న కింజల్కము-అని. శ.ర.) ఆదిత్యుండు=కాశీలో నున్న ద్వాదశాదిత్యులలో మొదటి వాఁడు, లోలార్క-మూర్తి='లోలార్కుఁ' డను పేరుగల సూర్యుఁడు: (ఈయన కాశికి దక్షిణ దిశలో 'అసి' నది గంగానదిలో గలియు చోట నెలకొనియున్నవాఁడు.) 'గోపాల భామల గుబ్బచన్నుల మెచ్చు' గోపాల భామల = గొల్లభామలయొక్క, గుబ్బచన్నులన్=స్తనమండలములను, మెచ్చు=ప్రియపడెడి, గీర్వాణవంద్యుండు='గీర్వాణ వంద్యుండు' గీర్వాణ=దేవతలకు (గీః బాణః యేషాం తే గీర్బాణాః తఏవ గీర్వాణాః వబయోరభేదః. మాటయే బాణముగాఁ గలవారు.) వంద్యుండు=నమస్కరింపఁదగినవాఁడు-స్తుతింపఁదగినవాఁడు, ('వది' అభివాదన స్తుత్యోః) కేశవుండు=ఆదికేశవస్వామి. (కాశికి మొదట వచ్చిన విష్ణువు. ఈయన కాశికి ఉత్తర దిశలో 'వరణా' నది గంగానదికోఁ గలియు చోట నెలకొనియున్నవాఁడు.)

కట్టి=నల్లని వర్ణము గలవాఁడు, వ్రీడాభూన్య=సిగ్గెఱుఁగని, కటి=కటి మండలముగల, గోపురద్వార=గవని వాఁకిలికి, పరిరక్షకుఁడు=కావలియైన, కాలభైరవుండు=కాలభైరవస్వామియును, (ఈయన కాశీనగర క్షేత్రపాలకుఁడు.) 'కాలకంఠుని శిరసుపూ' కాలకంఠుని=నల్లని కాంతిగల, శివునియొక్క, శిరసుపూ=సిగపూవైన, గగనగంగ=ఆకాశమునుండి భూమికి దిగివచ్చి భాగీరథి యను పేరు దాల్చిన మందాకిని: (కాశికిఁ చూర్పు దిక్కున దక్షిణమునుండి యుత్తరమునకుఁ బ్రవహించుచు నుత్తరవాహిని యని ప్రసిద్ధి నొందినది.) కాశికాక్షేత్రమునకున్=కాశీ మహాక్షేత్రమునకు, ఏడుగడయునైన = సప్తవిధ సంరక్షయైన: (గురువు, తల్లి, తండ్రి, విద్య, దైవము, దాత, పురుషుఁడు-అను నీ యేడుగురును గలిసి ఏడుగడ.) 'అళ్లభూపాలు వీరభద్రాధిపునకున్' అళ్లభూపాలు=అళ్లాడరెడ్డి కుమారుఁడైన, వీరభద్ర+అధిపునకున్=వీరభద్ర భూపాలునకు, ఇందఱును గూడి=వీరందఱుమ గలిసి, ఈప్సితములఁ=కోరిన కోరికలు, ఎల్లప్పుడున్-ఎల్ల + అప్పుడున్-ఎల్లప్పుడున్=ఎల్లకాలమును, ఇత్తురు=ఇచ్చుచుందురు.

తాత్పర్యము:- శ్రీ విశాలాక్షీ విశ్వేశ్వరులతోసహ - అనాదినుండి కాశీక్షే గాఢాచులైన వీరందఱు గంగానదితోసహ కాశీక్షేత్రమునందువలెనే యీ పద్యము నందు సన్నిధి చేసియున్నారు. వీరందఱును గాశికాక్షేత్రమున కేడు గడయైనవారు. ఆళ్లాడరెడ్డి కొడుకైన వీరభద్రారెడ్డికి వీరందఱును గలిసి కోరిన కోరికల నిచ్చు చుందురు.

విశేషము:- ఆశీరర్థక క్రియకు మాఱు 'ఇత్తురు' అను తద్ధర్మార్థక క్రియను వాడుటలోని యాశయము - కాశిక్షే గాపాడుచున్నట్లే కాశీఖండ కృతిపతియైన వీర భద్రారెడ్డిని - ఆయన యశోమూర్తిని. ఎల్లకాలము గాపాడుచుండుట వీరందఱికి నైసర్గిక ధర్మమని సూచించుట కొఱకు.

సీ॥ కబరికా భారంబు కైపెక్కి విరులతో
నవటు భాగంబుపై నత్తమిల్ల
నలతిలేఁ జెమరుచే నసలుకొన్న లలాట
కుంకుమంబునఁ జిన్నికురులు మునుఁగఁ
బసిఁడి కుండలఁ బోలు పాలిండ్ల భరమున
సన్నపుఁ గౌఁదీఁగ జలదరింపఁ
దరళతాటంక రత్నప్రభారించోళి
గండ స్థలంబులఁ గౌఁగిలింపఁ

తే॥గీ॥ గాశికారామ కల్పవృక్షముల నీడఁ
గుతప వేళలయందు నాఁకొన్నవారి
కమృత దివ్యాన్న మిడు విశాలాక్షి గౌరి
శాశ్వతైశ్వర్యములు కృతిస్వామి కొసఁగు ॥ 4

అర్థము:- కబరికా భారంబు=ధమ్మిల్ల భరము. వేనలి బరువు. విరులతోన్=అంతఃకుసుమ సౌరభములతో, కైపెక్కి=పరపఱించి-మత్తిల్లి, అవటుభాగంబుపైన్=మెడ ముచ్చిలిగుంట మీఁద, అత్తమిల్లన్ = ఒరగియుండఁగా. వ్రాలియుండఁగా; 'అలఁతి లేఁజెమరుచేన్' అలఁతి అల్పమైన, లేఁజెమరుచేన్ = (లేత+చెమరు-లేఁజెమరు.) లేఁతయైన శ్రమజలముచేత-(వడ్డన సమయమందు కలిగినది) అసలు

కొన్న=పంకిలమైన చెదుకెక్కిన. అలాట కుంకుమంబునన్=నొసలి కుంకుమబొట్టి ద్రవమునందు. చిన్నికురులు = అందమైన ముంగురులు. మునుఁగన్=చెదరక. అంటుకొనిపోఁగా; 'పసిఁది కుండలఁబోలు పాలిండ్ల భరమునన్' పసిఁది కుండలన్= బంగారు బిందెలను. పోలు పోలఁచున్న. పాలిండ్ల = (పాలు+ఇండ్లు-పాలిండ్లు) పయోధరములయొక్క. భరమునన్ = బరువుచేత. 'సన్నపుఁ గౌఁదీఁగ' = (కొను+ తీఁగ=కౌఁదీఁగ.) (సన్నము+కౌఁదీఁగ-సన్నపుఁ గౌఁదీఁగ) సన్నని తీఁగవంటి నడుము, జలదరింపన్ = కంపము నొందఁగా; 'తరళ తాటంక రత్నప్రభారించోళి' తరళ=కదలుచున్న, తాటంక=చెవి కమ్మలయందలి. రత్న=నవరత్నములయొక్క. (రత్నములు రెండు విధములు; పచ్చ, కెంపు, వజ్రము మొదలైనవి - అశ్మజాతి. ముత్యము, పగడము, మొదలైనవి - అనశ్మజాతి.) ప్రభా = కాంతులయొక్క. రించోళి=గుంపు. గండస్థలంబులన్=చెక్కిలి తావులను. కౌఁగిలింపన్ =అల్లుకొని పోఁగా-పైన వైచికొనగా. (కొను + కీలించు-కౌఁగిలించు) 'కాళికా రామ కల్ప వృక్షముల నీడన్' కాళికా=కాళికానగరి యందలి. ఆరామ=తోఁటలలోని. కల్ప వృక్షముల=హరిచందన, మందార, పారిజాత, సంతానక, కల్పవృక్షములయొక్క. నీడన్=నీడయందు. కుతపవేళలన్=పగటి రెండుజాముల వేళలయందు. 'ఆఁకొన్న వారికిన్' (ఆఁకలి+కొను ఆఁకొను) క్షుధార్తులకు. 'అమృత దివ్యాన్నము' అమృత= అమృత స్వరూపమైన, దివ్యాన్నము=దివ్యమైన యన్నమును. ఇడు=పెట్టునట్టి. విశాలాక్షి=విశాలాక్షి యనెడి, గౌరి=పార్వతీదేవి. 'శాశ్వతైశ్వర్యములు' శాశ్వత= నిత్యములైన, ఐశ్వర్యములు=ఐశ్వర్యములను, కృతిస్వామికిన్=కృతినాయకునకు, ఒసఁగున్=ఇచ్చును.

అవతారిక:- కైవల్యమునకువలె అతిధేయమునకును అనాదినుండి కాణాచియైన కాశీ వైశిష్ట్యమునకు మూలకారణమైన విశాలాక్షియొక్క యను భావమున ప్రత్యక్షీకరింపఁబడుచున్నది;

తాత్పర్యము:- ఆమె కబరీభరము అంతఃకుసుమ సౌరభములచేత మత్తిల్లినట్లు మెడ వెనుకతట్టున ఆత్తమిల్లియున్నది. వడ్డన అలసటచేత-లేఁత చెమటపోసి- నొనలి కుంకుమ బొట్టు కరఁగిపోఁగా- ఆ, తడికి నంటుకొనిపోయి చిన్ని కురులు చెదరుటలేదు. జంట పసిఁది బిందెలను బోలియున్న చనుదోయి బరువోపలేక- ఆమె సన్నని నడుము జవ్వాడుచున్నది. కదలుచున్న చెవి కమ్మలయందలి రత్నకాంతులు

గుంపులు కట్టి యామె చెక్కిళులపై జొరకించుచున్నవి. కాశికానగరములోని తోటలలో-కల్పవృక్షముల నీడలలో-పగటి రెండుజాముల వేళలలో- క్షుధార్తులైన ప్రాణి సంతతుల నరసి-అమృత స్వరూపమైన దివ్యాన్నమును కడపార బెట్టెడి యా విశాలాక్షి యనెడి గౌరీమహాదేవి యీ కృతినాయకునకు శాశ్వతైశ్వర్యములను బ్రసాదించునుగాక.

విశేషము:- సంస్కృత కాశీఖండములో 'అన్నపూర్ణా' శబ్ద మెందును గానరాదు. 'భవాని' అనియే సర్వత్ర గోచరించును. లోకములో 'అన్నపూర్ణా భవాని' అను వాడుక ప్రసిద్ధము. కాశిలో నిరువురి యాలయములును, విడివిడిగా నున్నవి. కాని- యిరువురు నొక్కరే. అన్నపూర్ణ గుడిలో జనముల సందడి యెక్కువ. విశా లాక్షి గుడి పరమైకాంతముగా నుండును. విశాలాక్షి పార్వతీదేవి యొక్క తపో మూర్తి యనియును- అన్నపూర్ణ ప్రసాదమూర్తి యనియు నందురు.

ఉ॥ పాయక నిర్ణిరోధ నిరపాయ సమగ్ర కృపాగుణైక పా
రాయణతా విలాసము తిరంబుగ నంబుజసూతి వీరనా
రాయణు దానవైభవ ధురంధరు సంగర సవ్యసాచి, దీ
ర్ఘాయురుపేతు జేయుత నృపాగ్రణి నల్లయ వీరభద్రునిన్ ॥ 4

అర్థము :- పాయక=విడువక, నిర్ణిరోధ నిరపాయ.....విలాసము' నిర్ణిరోధ=అడ్డులేని, నిరపాయ=తొలగుటలేని, సమగ్ర=సంపూర్ణమైన, కృపా గుణ=దయాగుణముయొక్క, ఏక=అద్వితీయమైన, పారాయణతా=పరాయణత్వము నకు సంబంధించిన, విలాసము = విలసనము, తిరంబుగన్=సుస్థిరమగునట్లుగా, అంబుజసూతి=పద్మగర్భుడైన బ్రహ్మదేవుడు, వీరనారాయణున్=వీరనారాయణు డను బిరుదము గలవాడును, 'దానవైభవ ధురంధరున్' దాన=వితరణముయొక్క, వైభవ=విభుత్వముయొక్క, ధురంధరున్=భారవహన సామర్థ్యము గలవాడును, 'సంగర సవ్యసాచిన్' సంగర=యుద్ధములయందు, సవ్యసాచిన్=అర్జునునివంటి వాడును, నృపాగ్రణిన్ = (నృప+అగ్రణి-నృపాగ్రణి) నృప=నృపాలురలలో, అగ్రణిన్=అగ్రేసరుడైన, అల్లయ వీరభద్రునిన్=అల్లాడరెడ్డి కుమారుడైన వీర భద్రారెడ్డిని, దీర్ఘాయురుపేతున్ = (దీర్ఘాయుః + ఉపేతుడు-దీర్ఘాయురుపేతుడు.) దీర్ఘాయుః = దీర్ఘాయుర్దాయముతో, ఉపేతున్ = కూడినవానినిగా, చేయుతన్ = చేయునుగాత.

తాత్పర్యము :- అన్ని భాగ్యములకు ఆధారమైనది అయుర్భాగ్యము. ఆయుర్భాగ్యము నిచ్చువాఁడు బ్రహ్మ. అట్టి బ్రహ్మ యెల్లకాలము విడువని-అడ్డు లేని-తొలఁగని-నిండైన కృపాగుణమునందు నిలకడగలవాఁడై 'వీరనారాయణ'. 'సంగర సవ్యసాచి' బిరుదములు గలవాఁడును. సంపూర్ణములైన వితరణ. వైభవ లక్షణములు గలవాఁడును. అల్లయకుమారుఁడు నైన వీరభద్ర నృపాగ్రణిని దీర్ఘాయుష్మంతునిఁగాఁ జేయునుగాక.

తే॥గీ॥ కంఠపీఠిక నో కారఘంట మొరయఁ
జెలఁగుఁ గావుత మన్మనఃక్షేత్రసీమఁ
గవి కుటుంబంబు పాలిటి దివిజ సురభి
జలజ సంభవుబోఁటి భాషావధూటి ॥ 5

అర్థము :- కంఠపీఠికన్=కంఠ మను పీటయందు. ఓంకార ఘంట=ప్రణవ మనెడు ఘంట. మొరయన్=నందించుచుండఁగా. 'కవి కుటుంబంబు పాలిటి దివిజ సురభి' కవి=వ్యాస. వాల్మీకి ప్రభృతులైన కవులయొక్క. కుటుంబంబు పాలిటి= వంశము యొక్క భాగధేయమునకు. దివిజ సురభి=సురధేనువైన-కామధేనువైన. 'జలజసంభవుబోఁటి' జలజసంభవు=పద్మమునుండి పుట్టిన బ్రహ్మయొక్క, బోఁటి= భార్యయైన. భాషావధూటి=సరస్వతీదేవి. 'మన్మనఃక్షేత్రసీమన్' మత్=నాయొక్క. మనః=మనస్సనెడు. క్షేత్ర=పొలముయొక్క. సీమన్=పొలిమేరయందు. చెలఁగుఁ గావుతన్=ఉల్లసిల్లునుగాత ! - శబ్దించునుగాత !

తాత్పర్యము :- కంఠనాళమునందు ప్రణవ మను ఘంట నినదించు చుండఁగా. కవికులము పాలిటి కామధేనువైన బ్రాహ్మి-సరస్వతీదేవి నా మనస్సనెడు పొలము పొలిమేరలో నుత్సాహముతో సంచరించుచుండునుగాక.

విశేషము :- కవులకుఁ గావలసినవి- శబ్దములు. అర్థములు. గుణములు. అలంకారములు. ధ్వనులు. రసములు. భావములు. కల్పనలు మొదలైన సామగ్రి. ఆ సామగ్రి యంతయును- తలంచినంతనే సరస్వతీదేవి వారికి సమకూర్చిపెట్టును. కావున ఆమె వారి పాలిటికి కామధేనువు ! ఆ కామధేనువు కంఠసీమయం దొక ఘంట యున్నది. అది ప్రణవ మను ఘంట. ధేనువు కదలినపుడెల్ల ఘంట శబ్దించును. ఘంట శబ్దించిన కొలఁది ధేనువు పరవళ్ళ త్రొక్కును. ఆ ధేనువు పద

విన్యాస సందర్భములయందెల్ల ఆ ఘంటానాదమే వినిపించుచుండును. అనఁగా శబ్దరాశి యంతయును ప్రణవము నుండియే ఆవిర్భవించినది. కావున శబ్దప్రపంచ మందంతటను- అంతర్లీనమై ప్రణవమే నినదించు ననుట. అది ప్రాకృతధేనువు కాదు-వాగ్ధేనువు. అది లోహఘంట కాదు - ఓంకార ఘంట. 'ధేనుర్వాగస్మాను పసుష్టుతైతు' అని శ్రుతి. ఇచ్చట ఓంకారము 'మొరయుట' యను క్రియోపయోగము వలె ఘంటగాఁ బరిణమించినది కావున- పరిణామాలంకారము 'మన్మనః క్షేత్రసీమ' రూపకము.

వ. అని సముచితప్రకారంబునఁ బూజ్య పూజాతత్పరుండనై యొక్క నాఁ డాత్మగతంబున నిట్లని వితర్కించితి. 6

అర్థము :- అని=ఈరీతిగా. 'సముచితప్రకారంబునన్' సముచిత=(సమ్+ఉచిత_సముచిత.) తగిన. ప్రకారంబునన్=విధముగా. 'పూజ్య పూజాతత్పరుండనై' పూజ్య=పూజింపఁదగినవారి యొక్క. పూజా=పూజయందు. తత్పరుండనై=శ్రద్ధా తాత్పర్యము కలవాఁడనై. ఒక్కనాఁడు=ఒక దినము. ఆత్మగతంబునన్=మనస్సు లోపల, ఇట్లని=చెప్పఁబోవు విధముగా, వితర్కించితిన్=పర్యాలోచన చేసితిని.

తాత్పర్యము :- ఈ రీతిని పూజ్యులను పూజించుటయందు తగిన శ్రద్ధా తాత్పర్యములు గలవాఁడనై యొకనాఁడు మనస్సులో నిట్లు పర్యాలోచన చేసితిని.

విశేషము :- పూజ్యులకు, మనము పూజించనందువలన గలిగెడి క్షతి ఏమియు నుండదు మనకుఁ గలుగవలసియున్న మేలునకు మాత్రము ప్రతిబంధ మేర్పడి తీరును. అందువలన- పూజ్యులను బూజింపవలయును.

'ప్రతిబధ్నాతిహి శ్రేయః పూజాపత్యతిక్రమః' కాళిదాసు.

సీ॥ చిన్నారి పొన్నారి చిఱుత కూఁకటినాఁడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర
మూనూఁగు మీసాల నూత్నయౌవనమున
శాలివాహన సప్తశతి నొడివితి
నంతరించితి నిండు జవ్వనంబున యంము
హర్షనైషధ కావ్య మాంధ్రభాషఁ

ప్రౌఢ నిర్ఝర వయఃపరిపాకమునఁ గొని
యాడితి భీమనాయకుని మహిమఁ

తే॥గీ॥ ప్రాయమింతకు మిగులఁ గైవ్రాలకుండఁ
గాశికాఖండ మను మహాగ్రంథమేను
దెనుఁగుఁ జేసెదఁ గర్ణాటదేశ కటక
పద్మవనహేళి శ్రీనాథభట్ట సుకవి ॥

అర్థము :- 'చిన్నారి పొన్నారి చిఱుత కూఁకటినాఁడు' చిన్నారి పొన్నారి= మిక్కిలి ముద్దుగొలిపెడు, చిఱుత=చిన్న, కూఁకటినాఁడు. పిల్లజుట్టుగల యీడుననే, మరుత్తరాట్చరిత్ర=మరుత్తుఁ డను రాజుయొక్క కథను, రచియించితిన్=కావ్యముగా రచించితిని, 'నూనూఁగుమీసాల నూత్నయౌవనమునన్' నూనూఁగు=(నూఁగు+ నూఁగు-నూనూఁగు) నూఁగు నూఁగుగా నేర్పడుచున్న మీసములుగల, నూత్న యౌవనమునన్=క్రొత్త జవ్వనమునందు 'శాలివాహన సప్తశతిన్' శాలివాహనుఁ డను రాజు సంకలనము చేసిన గాథాసప్తశతి యను ప్రాకృతభాషాకావ్యమును, నొడివితిని=పలికితిని (తెనుఁగు చేసితిని), నిండుజవ్వనంబునయందున్=నిండారిన జవ్వనమునందు-యౌవనమందు, హర్షనైషధ కావ్యము=శ్రీహర్షుఁడు సంస్కృత భాషలో రచించియున్న నైషధ మను ప్రౌఢ కావ్యమును, ఆంధ్రభాషన్=ఆంధ్ర భాషయందు, సంతరించితిన్=రచించితిని, 'ప్రౌఢ నిర్ఝర వయఃపరిపాకమునన్' ప్రౌఢ=ప్రగల్భము, నిర్ఝర=పరిపూర్ణమునైన, వయఃపరిపాకమునన్=పదనునందు, భీమనాయకుని మహిమన్=దక్షారామ భీమేశ్వరునియొక్క మహిమను కొనియాడితిన్=కీర్తించితిని, ప్రాయము=వయస్సు. ఇంతకున్= ప్రకృత వయస్సుకంటె. మిగులన్ మిక్కిలి. కైవ్రాలకుండన్=వ్రాలిపోకుండ, కాశికాఖండ మను=కాశీఖండ మనెడు. మహాగ్రంథము=గొప్ప గ్రంథమును. 'కర్ణాటదేశ కటక పద్మ వనహేళిన్' కర్ణాటదేశ=కన్నడదేశమునకు, కటక=రాజధాని యైన విజయనగరమే యనెడి, పద్మవన=తామరపూల తోఁటకు, హేళిన్=సూర్యుఁడ నైన. శ్రీనాథభట్ట సుకవిన్ = శ్రీనాథభట్ట = 'శ్రీనాథభట్టు' అనెడి. సుకవిన్= సత్కవిని. (షట్శాస్త్రపండితుఁడనైన శ్రీనాథుఁ డనెడి సత్కవిని, భట్టఃషట్శాస్త్ర పండితః) ఆఱు శాస్త్రములలో పండితుఁడైనవానిని భట్ట బిరుదముతో వ్యవహరింతురు. 'భట్టహర్షుఁడు', 'భట్టబాణుఁడు' మొదలైనవి. నన్నయభట్టు, శ్రీనాథభట్టు,

నిట్టివారే. 'భట్ట' పదము వృద్ధాదులలోఁ జేర్పవలసినది. (భట్ట శబ్దము యావద్భారత విద్వత్సాధారణము. కర్ణాట దేశమునకే పరిమితము కాదు)

తాత్పర్యము :- బాల్యము మొదలు ఆ యా వయోదశలలో అనేక కావ్యములు రచించితిని. ప్రస్తుతము ప్రౌఢవయస్సు జాటిపోనున్నది. మిక్కిలి ముదుసలితనము రాకముందే 'కాశీఖండ' మను మహాగ్రంథమును దెనుఁగు చేయఁబోవుచున్నాను. నేను కర్ణాట రాజధానియైన విజయనగర మను పద్మవనమునకు సూర్యుఁడను. 'శ్రీనాథభట్టు అనెడి సుకవిని.

విశేషములు :- ఈ చివరి విశేషణముచేత కర్ణాటరాజు ముత్యాల కొలువు కూటములోఁ దనకు జరిగిన కనకాభిషేక మహోత్సవము. డిండిమభట్టును జయించుట. కంచు ఢక్కా పగులఁగొట్టించుట, మున్నగు పాండిత్య శౌర్యాపదానములు అచిరప్రవృత్తములని తెలియుచున్నది. డిండిమభట్ట విజయచిహ్నముగా 'భట్ట' బిరుదమును దాను గైకొన్నట్లుకూడ స్ఫురించుచున్నది. బాల్యము మొదలు- అంతదఱకు ప్రాసిన కావ్యములు- ఆ యా వయోదశలకుఁ దగినట్లు త్రివర్గమునకు సంబంధించినవి. కాశీఖండము అపవర్గమునకు సంబంధించినది. పుట్టువునకుఁ గృతార్థతను గలిగించునది. కావున 'మహాగ్రంథ'ము. ప్రాయపుఁ బ్రొద్దు ప్రాలిపోనున్న సమయములో జరమమైన పరమ పురుషార్థ ఘంటాపథములో నధ్వసీను;డను కాఁబోవుచున్నానని యాశయము.

ఉ॥ స్కాందపురాణ నీరధికి ఖండము లే బది; యందులోన నా
నంద వనానుభావ కథనంబున వక్తకు శ్రోతకున్ శుభా
నంద పరంపరాస్పదమునై జగుణంబునఁ గాశిఖండ; మా
కంఠవయే నెఱింగి సమకట్టితిఁ గావ్యముగా నొనర్పఁగన్॥ 8

అర్థము :- 'స్కాందపురాణ నీరధికిన్' స్కాందపురాణ=స్కాందప్రోక్తమైన పురాణ మనెడి-(స్కాందపురాణము). నీరధికిన్ = సముద్రమునకు, ఖండములు= కేదారాది ఖండములు, ఏఁబది=అర్ధశతము; అందులోనన్ =ఆస్కాందమునందు, 'ఆనందవనానుభావ కథనంబునన్' ఆనందవన='ఆనందకాననము' అను నామాంతరముగల, కాశీక్షేత్రముయొక్క, అనుభావ=మహిమకు సంబంధించిన, కథనంబువన్ =ప్రవచనముగల దగుటచేత, కాశిఖండము=కాశీఖండము, నైజగుణంబునన్ =

స్వభావగుణముచేతనే. వక్తకున్=చెప్పెడివానికిని, శ్రోతకున్ = వినెడువానికిని. శుభానందపరంపరావహము శుభ = ఐహిక కల్యాణములయొక్క, ఆనంద= ఆముష్మిక సుఖములయొక్క. పరంపరా = ఎడతెగని వరుసలను, ఆవహము = ఆవహిల్లఁజేయునది; ఆకందువ=ఆ రహస్యమును. ఏనెఱింగి=నేను తెలిసికొని. కావ్యముగాన్=ఆ పురాణాంశమును కావ్యస్వరూపముగల దానినిఁగా. ఒనర్పఁగన్= చేయుటకు. సమకట్టితిన్=ఉద్యమించితిని-పూనుకొంటిని.

తాత్పర్యము :- స్కాందపురాణము సముద్రము వంటిది అపారమగుటయే కాక. అనేక ద్వీపములకు, అనంత రత్నములకును, సముద్రము నిలయమైనట్లే స్కాందపురాణమును అనేక సంహితలకు. అనేక ఖండములకు ఆకరము. అందులో నేఁబది ఖండములు గలవు. వానిలో- కాశీఖండము -'ఆనందకానన' మను నామాంతరముగల కాశీక్షేత్రముయొక్క మహిమానుభావ కథనముగల దగుటచేత స్వభావ గుణముచేతనే చెప్పెడివానికిని, వినెడివానికిని, ఐహిక శుభపరంపరలను, ఆముష్మికానందపరంపరలను -ఆవహిల్లఁజేయు సామర్థ్యము గలది. ఆ రహస్యమును నే నెఱిగి యా పురాణాంశమును కావ్యస్వరూపముగల దానినిఁగాఁ జేయుటకై సమకట్టితిని.

విశేషములు:- స్కాందపురాణమునందు సంహితలు-ఆఱున్నవి. ఖండములేబది యున్నవి. సనత్కుమార సంహిత. సూత సంహిత మొదలైన సంహితలు. కేదార ఖండము, హాలాస్య ఖండము, బ్రహ్మోత్తర ఖండము, దేవా ఖండము, కాశీఖండము మొదలైనవి ఖండములు. ఈ ఖండములు ఆ సంహితలలో నంతర్భూతములై యుండనగును. ఏ యే సంహితలలో ఏ యే ఖండములున్నవో పరిశోధింపవలసి యున్నది.

వ. ఇమ్మహా ప్రబంధ ప్రారంభంబు కర్ణాకర్ణికా వశంబున నాకర్ణించి కర్ణాంత విశ్రాంత నేత్రుండును, పటవంశకమల మిత్రుండును, నశ్రాంత విశ్రాణన క్రీడాపరాయణుండును, వీరనారాయణుండును, నిత్యసత్యుండును, బల్లవాదిత్యుండును, భూభువన భార భరణ దీక్షాదక్ష దక్షిణ భుజాభుజంగుండును, రాయవేశ్యా భుజంగుండును, గీర్తి గంగా తరంగిణీ పవిత్రిత స్వర్గ మర్త్య

పాతాళుండును, జగదగోపాలుండును, విమల ధర్మశీలుండును, సంగడి రక్షాపాలుండును నగు నల్లయ వీరభద్ర భూపాలుం డొక్కనాడు. 9

అర్థము :- 'ఇమ్మహాప్రబంధ ప్రారంభంబున్' ఇమ్మహాప్రబంధ = ఈ గొప్ప గ్రంథముయొక్క. ప్రారంభంబున్ = రచనా ప్రారంభమునుగూర్చి, కర్ణ కర్ణికావశంబునన్=ఆ చెవినుండి. యీ చెవిగా వచ్చిన వార్తయొక్క, వశంబునన్= వాలుగా, ఆకర్ణించి = విని, కర్ణాంత విశ్రాంత విశాల నేత్రుండును - కర్ణాంత = చెవులకు దగ్గఱగా, విశ్రాంత=నిలిచిపోయిన. విశాల = పెద్దవియైన, నేత్రుండును= కన్నులు గలవాడును, పంటవంశ కమల మిత్రుడును-పంటవంశ = పంటరెడ్డి కుల మనెడి, కమల-పద్మమునకు, మిత్రుండును=సూర్యుడును, అశ్రాంత విశ్రాణన క్రీడాపరాయణుండును. అశ్రాంత=విడుమర యెఱుగని, విశ్రాణనక్రీడా=వితరణ కేళియందు-దానకేళియందు, పరాయణుండును = తదేకాసక్తి గలవాడును, వీర నారాయణుండును = వీరనారాయణుడను బిరుదు గలవాడును, నిత్యసత్యం డును-నిత్యసత్యవ్రతము గలవాడును, పల్లవాదిత్యుండును = పల్లవాదిత్యుడను బిరుదు గలవాడును, 'భూభవన భార భరణ దీక్షా దక్ష దక్షిణ భుజాభుజంగుండును' భూ భువన=భూలోకమునొయక్క, భారభరణ=బరువు మోయుట యనెడి, దీక్ష-నియమముతో గూడిన పూనికయందు, దక్ష=సమర్థమైన, దక్షిణభుజా=కుడిచేయి యనెడి, భుజంగుండును = శేషుడు గలవాడును, రాయవేశ్యాభుజంగుండును= రాయవేశ్యాభుజంగుడను బిరుదు గలవాడును, 'కీర్తి గంగాతరంగిణీ ప్రవాహ పవిత్రిత స్వర్గ మర్త్య పాతాళుండును' కీర్తి=కీర్తియే యనెడి, గంగాతరంగిణీ= గంగానదియొక్క, ప్రవాహ=పారుదలచేత, పవిత్రిత=పవిత్రీకరింపబడిన స్వర్గ= స్వర్గలోకము, మర్త్య = మనుష్యలోకము, పాతాళుండును = పాతాళ లోకముగల వాడును. (గంగ త్రిభువన పావని; స్వర్గములో మందాకిని; భూమిపై భాగీరథి; పాతాళములో భోగవతి.) జగదగోపాలుండును=జగదగోపాలుడను బిరుదు గల వాడును, 'విమల ధర్మశీలుండును, విమల ధర్మ-నిర్మల ధర్మమే. శీలుండును= స్వభావముగా గలవాడును, సంగడి రక్షాపాలుండును = 'సంగడిరక్షపాలు' డను బిరుదు గలవాడును, అగు=అయిన, వీరభద్ర భూపాలుండు=వీరభద్రారెడ్డి యనెడి ప్రభువు, ఒక్కనాడు=ఒక దినమునందు-

తాత్పర్యము :- ఈ కాశీఖండ రచనా ప్రారంభమును కర్ణాకర్ణికగా విని. ఇట్టి గుణములు, ఇట్టి బిరుదములు గల వీరభద్రారెడ్డి యొకనాఁడు.

విశేషము :- ప్రభువుయొక్క- ఆ యా గుణములకు ఆ యా బిరుదములు అనుప్రాసాలంకారముగా నమర్పఁబడుట యొక రచనావిశేషము.

సీ॥ త్రైలోక్య విజయాభిధంబైన సౌధంబు
చంద్రశాలా ప్రదేశంబునందు
సచివ సైన్యాధీశ సామంతనృపవార
సీమంతినీ జనశ్రేణి గొలువ
శాస్త్ర మీమాంసయు సాహిత్యగోష్ఠియు
విద్వత్కవీంద్రులు విస్తరింపఁ
గర్పూర కస్తూరికా సంకుమదగంధ
సారసౌరభము దిక్పూరితముగ

తే॥గీ॥ నిజభుజా విక్రమంబున నిఖిల దిశలు
గెలిచి తను రాజ్యపీఠ మెక్కించినట్టి
యన్న వేమేశ్వరుని యంక మాశ్రయించి
నిండుకొలువు డేఁ గన్నులపండు వగుచు ॥ 10

అర్థము :- త్రైలోక్య విజయాభిధంబైన సౌధంబు' త్రైలోక్య విజయ మను పేరుగల మేడయొక్క, చంద్రశాలా ప్రదేశంబునందున్=శిలో గృహభాగమునందు, 'సచివ సైన్యాధీశ సామంత నృపవార సీమంతినీ జనశ్రేణి' సచివ = మంత్రులు. సైన్యాధీశ = (సైన్య + అధి + ఈశ_సైన్యాధీశ) సేనాధిపతులు. సామంతనృప= సామంతరాజులు, వార సీమంతినీ జన=వార వనితాజనమయొక్క. శ్రేణి=వరుస, కొలువన్=సేవించి యుండఁగా, 'శాస్త్రమీమాంసయున్'_శాస్త్ర వ్యాకరణాది శాస్త్ర ములయొక్క, మీమాంసయున్=వాక్యార్థ విచారణయును, సాహిత్య గోష్ఠియున్= కావ్య నాటకాది సాహిత్య ప్రసంగమును, 'విద్వత్కవీంద్రులు' విద్వత్=విద్వాంసు లును, కవీంద్రులు=(కవి+ఇంద్రులు_కవీంద్రులు) కవీశ్వరులును, విస్తరింపన్= ప్రపంచించుచుండఁగా, 'కర్పూర కస్తూరికా సంకుమద గంధసార సౌరభము'

కర్పూర=పచ్చకప్పురము, కస్తూరికా=మృగమదము, సంకుమద=జవ్వాది, గంధ సార=శ్రీగంధము-వీనియొక్క. సౌరభము=నెత్తావి, దిక్కూరితముగన్=దిక్కులయందు నిండిపోఁగా. 'నిజభుజావిక్రమంబునన్' నిజ=తనయొక్క. భుజావిక్రమంబునన్-బాహువిక్రమముచేత, నిఖిల దిశలు = అన్ని దిక్కులు, గెలిచి = జయించి. తనున్=తన్ను. రాజ్యపీఠము=సింహాసనమును, ఎక్కించినట్టి=ఆరోహింపఁజేసినట్టి. అన్న=అన్నయైన, 'వేమేశ్వరుని యంకము' వేమభూపాలుని సమీప ప్రదేశమును ఆశ్రయించి = అండఁగొని, కన్నులపండువగుచున్ = కన్నులవిందగుచు, నిండు కొలువు=నిండోలగమునందు ఉండెన్=ఉండెను.

తాత్పర్యము :- 'త్రైలోక్య విజయ' మను పేరుగల రాజసౌధముయొక్క శిరోగృహభాగమునందు, మంత్రులు, సామంతులు, సేనాధిపతులు, వారవనితలు వరుసలు దీరి కొలిచియుండఁగా, విద్వాంసులు శాస్త్రార్థ విచారమును, కవీంద్రులు సాహిత్య ప్రసంగమును ప్రపంచించుచుండఁగా, పచ్చకప్పురము, కస్తూరి, జవ్వాది, శ్రీచందనము మొదలైన సుగంధ ద్రవ్యముల పరిమళములతో దిక్కులు పిక్కటిలు చుండఁగా, బాహువిక్రమముచే సకల దిక్కులు గెలిచి తన్ను సింహాసన మెక్కించిన తన యన్న వేమభూపాలుని యండఁ గొని కన్నులపండువగా నిండోలగము దీర్చి యుండెను.

వ. అప్పుడు నన్నుం బిలువంబంచి సముచితాసనంబునం గూర్చుండ నియమించి యున్న యవసరంబున. 11

అర్థము :- అప్పుడు=ఆ సమయమునందు, నన్నున్=నన్ను, పిలువన్=పిలచుటకు, పంచి=ఆంపించి (దూతలను పంపి). 'సముచితాసనంబునన్' సముచిత=అర్హమైన, ఆసనంబునన్=ఆసనమునందు, కూర్చుండన్=ఉపవిష్టుఁడ నగుటకు, నియమించి = ఆనతి యిచ్చి, ఉన్న యవసరంబునన్ = రాజప్రసాదానుకూలమైన వేళయందు.

తాత్పర్యము :- ఆ సమయమునందు నన్ను-బిలువనంపించి యర్హాసనమునందుఁ కూర్చుండఁబెట్టి, రాజప్రసాదానుకూలమైన వేళయందు-

తే॥గీ॥ రాయవేశ్య భుజంగ సంగ్రామ పార్థ
గాయ గోవాళ వేమన క్ష్మావరుండు

గూర్మి యను జన్మ హృదయంబు కోర్కి యెఱిఁగి
యర్థి ననుఁ జూచి యిట్లని యానతిచ్చె ॥ 12

అర్థము :- 'రాయవేశ్యాభుజంగ', 'సంగ్రామపార్థ', 'గాయగోవాళ' అనెడి బిరుదాంకములు గల, వేమన క్ష్మావరుండు=వేమభూపాలుఁడు. 'కూర్మి యను జన్మ హృదయంబు కోర్కి' కూర్మి యనుజన్మ = గారామైన తమ్మునియొక్క, హృదయంబు కోర్కి=హృదయగతమైన మనోరథమును, ఎఱిఁగి=తెలిసికొని, అర్థిన్=ప్రీతితో, ననుఁ జూచి=నన్నుఁ జూచి, ఇట్లని=ఈ రీతిగా, ఆనతిచ్చెన్ = ఆనతియిచ్చెను-సెలవిచ్చెను.

తాత్పర్యము :- ప్రభువులు తమ మనసులోని మాటను దాముగా వెలువరించరు. అది ప్రభులక్షణము కాదు. మంత్రులచేతఁ జెప్పింతురు. ఇచ్చట వీరభద్రారెడ్డికి ఏడుగడయైన వేమారెడ్డి తమ్ముని మనసులోని మనోరథ మెఱిఁగి శ్రీనాథ కవిసార్వభౌమునివంకఁ జూచి ప్రస్తుతాంశమునకుఁ బ్రస్తావనగా నిట్లను చున్నాఁడు.

కే॥ వచియింతు వేములవాడ భీమన భంగి
నుద్దండ లీల నొక్కొక్క మాటు
భాషింతు నన్నయభట్టు మార్గంబున
నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాక్రుత్తు తిక్కయజ్వ ప్రకారము రసా
భ్యుచిత బంధముగ నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని తేవ
నూక్తివై చిత్రి నొక్కొక్కమాటు

తే॥గీ॥ నైషధాది మహాప్రబంధములు పెక్కు-
చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడ వనఘ!
యిపుడు చెప్పఁదొడంగిన యీ ప్రబంధ
మంకితము సేయు వీరభద్రయ్యపేర ॥ 13

అర్థము :- వేమలవాడ భీమన భంగిన్='ఇతఁడు వేములవాఁడ భీమనయా!' యనిపించునట్లు. ఉద్దండలీలన్=సమున్నతమైన వచో విలాసముతో. ఒక్కొక్క మాటు=ఒక్కొక్క పర్యాయము. వచియింతువు=పలుకుదువు -నన్నయభట్టు మార్గంబునన్ = నన్నయభట్టు నడిచిన మార్గములో. 'ఉభయ వాక్ప్రౌఢిన్' ఉభయవాక్ = సంస్కృతాంధ్రము లనెడి. శాస్త్రకావ్యము లనెడి. రెండవ యవయువు గల. వాక్=రసవృత్తియైన శబ్దముయొక్క. ప్రౌఢిన్ = విపులమైన అర్థమును కుదించి చెప్పునేర్పుతో. ఒక్కొక్కమాటు=ఒక్కొక్క పర్యాయము. భాషింతువు=సొష్ఠవముగా పలుకుదువు. తిక్కయజ్వ!ప్రకారము = తిక్కన సోమయాజివలెనే. 'రసాభ్యుచిత బంధమునగన్' (రస+అభి+ఉచిత_రసాభ్యుచిత). రస=వీర. రౌద్ర. భయాన.కాదులైన ఉద్ధత రసములకు_శృంగార. కరుణ. శాంతా.దులైన సుకుమార రసములకు-అభ్యుచిత=పొంది పొసఁగియున్న. బంధమునగన్ = కట్టుబడి కలిగియుండువట్లుగా. ఒక్కొక్కమాటు=ఒక్కొక్కసారి. వాక్రుత్తువు=హృదయమునకు హత్తుకొనునట్లు పలుకుదువు. 'ప్రబంధ పరమేశ్వరునివేవన్'=ప్రబంధ పరమేశ్వరుఁడని యెన్నిక గన్న ఎట్టాప్రెగ్గడయొక్క. వేవన్ = ఒప్పిదముతో. 'సూక్తివైచిత్రిన్' సూక్తి=అలంకారములయొక్క. వైచిత్రిన్=శబలత్వమును. పరిఢవింతువు=నడిపింతువు. 'నైషధాది మహాప్రబంధములు' నైషధ=నైషధము. ఆది=మొదలుగాఁగల. మహాప్రబంధములు=మహా కావ్యములు. పెక్కు=పెక్కింటిని. చెప్పినాఁడవు=చెప్పినవాఁడవు. మాకున్ = రాజమహేంద్రవర ప్రభువులమైన మాకు. ఆశ్రితుఁడవు = చేరికయై యున్నవాఁడవు. అనఘ!=ఆర్య-అయ్యా!. ఇపుడు=ప్రస్తుతము. 'చెప్పఁ దొడంగిన' యీ ప్రపంధము చెప్పదొడంగిన=రచింపమొదలిడిన. ఈ ప్రబంధము=ఈ కాశీఖండమును. వీరభద్రయ్య పేరన్=మా వీరభద్రయ్య పేరుతో. అంకితము సేయుము=చిహ్నితమైన దానిగా జేయుము.

తాత్పర్యము :- ఒక్కొక్కమాఱు నీవు పలికెడు లీల వేములవాడ భీమనవలె సమున్నతమై యుండును. ఒక్కొక్కమాఱు ఇది సంస్కృతము- ఇది తెనుఁగు- అని భేదము తోఁచనీయని రసైకవృత్తి గల విపులార్థబోధకములైన పరిమితాక్షర రచనతో నన్నయభట్టు మార్గమును దలపించుచుండును. ఒక్కొక్కమాఱు-వీర, రౌద్రాదులైన యుద్ధత రసములకు, శృంగార కరుణాదులైన సుకుమార రసములకు, పొందిపొసఁగియున్న కట్టుబడితో- తిక్కన సోమయాజివలెనే హృదయమునకు హత్తుకొని పోవునట్లు పలుకుదువు. ఒక్కొక్కమాఱు ప్రబంధ పరమే

శ్వరుని యొప్పిదముతో అలంకార శబలత్వమును నడపింతువు. నైషధాది మహా ప్రబంధములు పెక్కింటిని జెప్పియున్నవాఁడవు. రాజమహేంద్రవర పురాధీశ్వరులలైన మాకుఁ జేరికలై యున్నవాఁడవు. అయ్యా! ప్రస్తుతము చెప్ప మొదలిడిన యీ ప్రబంధమును (కాశీఖండమును) మా వీరభద్రయ్యపేర హత్తింపుము. (అంకితము సేయుము).

విశేషములు :- ఈ మాటలు వేమారెడ్డివిగాఁ గూర్పఁబడియున్నను వాస్తవమునకుఁ దన కవిత్వమునుగూర్చి యివి సూత్రప్రాయములైన శ్రీనాథుని యభిప్రాయములని గమనింపవలసి యున్నది. వీనివలన- ఆయన పూర్వాంధ్ర కవీశ్వర వాక్ప్రయోగదక్షత మాత్రమే తెలియఁదగును. సంస్కృతకవుల వాసనలు వేఱే యున్నవి. ఇది తెనుఁగు కవులకు మాత్రమే పరిమితమని గుర్తుంచుకొనవలయును - మఱీయును - ఈ చెప్పిన లక్షణములు - ఎవరివి వారివి విడఁదీసినచో- శ్రీనాథుఁడు 'సున్నకు సున్న'-హళ్ళికి హళ్ళి' మాత్రము అయిపోఁడు - గంగాప్రవాహమువలె ఉదగ్ర రమణీయమైన శ్రీనాథుని వాక్ప్రవాహములోనివి యన్నియును- కొట్టుకొని వచ్చుచుండునని మాత్రమే గ్రహింపవలయును. వీని నన్నింటిని అంతర్భూతము చేసికొనియున్న శ్రీనాథుని శైలీపరిణాహము-వాల్మీకి వర్ణించినట్లు

'క్వచిదా భోగపులినాం క్వచిన్నిర్మల నాలుకాం
క్వచిత్ స్తిమిత గంభీరాం క్వచిద్వేగజలాకులాం
క్వచిద్వేణీకృత జలాం క్వచిదావర్త శోభితాం
క్వచిద్గంభీరనిర్ఘోషాం క్వచిద్భైరవ నిస్వనాం'

గంగాప్రవాహముయొక్క 'ఆ భోగలక్షణ'ముతో నథవ్యాప్తమైయుండును.

శా॥ ఈక్షోణిక నినుబోలు సత్కవులు లేరీ నేటి కాలంబునన?
దక్షారామ చాళుక్య భీమవర గంధర్వాప్సరో భామినీ
వక్షోజద్వయ గంధసార ఘుసృణ ద్రవ్యరాజ్య భారంబు న
ధ్యక్షించున్ గవిసార్వభౌమ! భవదీయప్రౌఢ సాహిత్యమున్॥ 14

అర్థము :- కవిసార్వభౌమ! = ఓ కవిలోకసార్వభౌముఁడా!. (సర్వభూమి యందును విదితుఁడైనవాఁడు సార్వభౌముఁడు; కవిగా సర్వదేశములయందు, సర్వ

కాలములయందును, అద్వితీయుఁడుగా - ప్రసిద్ధుడైనవాఁడు - కవిసార్వభౌముఁడు.) 'భవదీయ ప్రౌఢసాహిత్యమున్' భవదీయ=నీయవియే యైన. ప్రౌఢ = 'ప్రౌఢి' యను లక్షణముతో నిండారియున్న. సాహిత్యముల్ = సంస్కృతాంధ్ర భాషా సంవలితములైన కావ్యరచనలు. 'దక్షిరామ. చళుక్యభీమవర. గంధర్వాప్సరోభామినీవక్షోజద్వయ గంధసార. ఘుస్మృణ. ద్వైరాజ్యభారంబున్'=దక్షిరామ (దక్షి+ఆరామ-దక్షిరామ.) దక్షి ప్రజాపతి యజ్ఞభూమియైన దక్షిరామగ్రామమునందలి. 'చళుక్య భీమవర=చళుక్యభీమునిపేర-ప్రసిద్ధమైన కుమారామమునందలి. గంధర్వ చిత్రసేనాది గంధర్వజాతికి. అప్సరః = ఊర్వశీరంభాదులైన-అప్సరసల కోవలకు. సంబంధించిన. భామినీ=కామినులయొక్క. [రతివేళయందు హర్షరోష, అక్రు. వ్యతికరమైన 'కిలకించిత' మను శృంగారలీలను వెలువరించు స్త్రీ. 'భామిని'] వక్షోజద్వయ= స్తన ద్వయమునందలి. గంధసార = మలయజముయొక్క. [చందనము] ఘుస్మృణ = కాశ్మీరజము యొక్క. (కుంకుమ) ద్వైరాజ్య రెండు రాజ్యములకు సంబంధించిన. భారంబున్=అధికార భారమును. అధ్యక్షించున్=అధిష్ఠించి-పర్యవేక్షించును - [పరిపాలించును] ఈక్షోణిన్=ఈవిశాలక్షోణీతలమునందు. ఈనాఁటికాలంబునన్=ఈనాఁటి కాలమునందు. నినుఁబోలుసత్కవులు = నిన్నుపోలఁగలిగిన సత్కవులు-సుకవీశ్వరులు. లేరు=లేరు.

తాత్పర్యము :- ఓ కవిలోక సార్వభౌముఁడా! ప్రౌఢి లక్షణపరిపూర్ణములైన నీ సంస్కృతాంధ్రభాషా సాహిత్యములు (కావ్యరచనలు) దక్షిరామమునందలి. కుమారామమునందలి. గంధర్వాప్సరోజాతులకుఁ జెందిన శృంగార లీలావతులైన భామినులయొక్క స్తనద్వయమునందలి మలయజ. కాశ్మీరజములనెడు సుగంధద్రవ్యముల ఉభయసామ్రాజ్యములయొక్క అధికార భారమును-అధిష్ఠించి పర్యవేక్షించుచున్నవి -పరిపాలించుచున్నవి;

విశేషములు :- ఇది ప్రౌఢోక్తి. కొంతసూక్ష్మ పరిశీలనము చేయవలసినది. ఇచ్చట.అధ్యక్షించునవి శ్రీనాథుని ప్రౌఢసాహిత్యములు. శ్రీనాథుఁడుకాఁడు; సర్వసాధారణముగా లోకములో - అందఱికిని తెలిసినట్లే యుండి పరమార్థతః తెలియనివి రెండు;

మొదటిది - కవిత్వము.

రెండవది - శృంగారము.

ఆ రెండును _ ఈ పద్యమునందు మేళవింపఁబడి యున్నవి. ఆ రెండింటి తత్త్వమును గుఱించి అభిజ్ఞులిట్లనఁ చున్నారు.

'అధరస్యమధురిమాణం కుచకాఠిన్యం దృశోశ్చాంచల్యంచ
కవితాయాఃపరిపాకం అనుభవరసికోవిజానాతి?'

అనఁగా _ వీని తత్త్వము తనంతట తెలియవలసినది. ఒరులు చెప్పినచోఁ దనకుఁ దెలియునది _ తాను చెప్పినచో _ ఒరులకుఁ దెలియునదియును గాదు. అభిజ్ఞులకుఁ జెప్పనవసరములేదు. అనభిజ్ఞులకుఁ జెప్పి ప్రయోజనములేదు.

ఉభయాభిజ్ఞుఁడైన వేమారెడ్డి ఇట్లనుచున్నాఁడు;

"ఓ కవిసార్వభౌమా! నీ యొక్కనివేయైన ప్రౌఢములైన సంస్కృతాంధ్ర సాహిత్యములు దక్షిరామ. కుమారారామముల యందలి గంధర్వాప్సరోభామినుల వక్షోజద్వయము మీఁది గంధసార, ఘుస్మణములనెడి _ రెండు మహాసామ్రాజ్యములను ఏలుకొనుచున్నవి. ఈ విశాలకోణి యందు నేటి కాలములో నిన్ను బోలఁగల సత్కవులెచ్చట నున్నారు?'

గంధసారము _ చందనము మలయపర్వతమునందు పుట్టినది. ఘుస్మణము_ కుంకుమము కాశ్మీరదేశమునందు పుట్టినది. ఈరెండును ఆ గంధర్వాప్సరోభామినుల స్తనద్వయముమీఁద _ అనులిప్తములైనపుడు _ ఆ స్తనద్వయము సామ్రాజ్యద్వయ ముపలె భాసిల్లును.

ఒకటి దక్షిణాపథము (మలయజానులిప్తము)
రెండు ఉత్తరాపథము (కాశ్మీరజానులిప్తము)

నీ ప్రౌఢసాహిత్యములు _ ఆ రెండు సామ్రాజ్యములను ఏలుకొనుచున్నవి. ఇచ్చట; విమర్దజనితమైన మలయజపరిమళము పరిసరములకేకాక సుదూరములకు ప్రసరించును. కావున 'ధ్వని' వంటిది.

నిర్మృష్టమైన కొలఁది కాశ్మీరజము (కుంకుమము) దేదీప్యమానమగుచుండును. కావున 'దీప్తి' వంటిది.

మొదటిది _ ఆత్మ.

రెండవది _ శరీరము.

సుందరయ్య గ్రంథాలయ సంచిక
ACC No. 7628
హైదరాబాద్-500 044.

గంధసారము మలయజము, మలయపర్వతము దక్షిణాపథములోనిది. దక్షిణా పథ భాషలలో సుప్రసిద్ధమైనది తెనుఁగు. కనుక - ఇచ్చటి గంధసారశబ్దమును తెనుఁగుభాషకు సంకేతముగా గ్రహింప వలయును.

ఘుసృణము కాశ్మీరజము - కాశ్మీరము హిమాలయము దగ్గఱది, దేవభాషకు పుట్టిల్లు. కనుక ఇచ్చటి ఘుస్మృణశబ్దమును సంస్కృతభాషకు సంకేతముగా గ్రహింపవలయును.

సర్వభూమియందును దెలియఁబడినవాఁడు సార్వభౌముఁడు. ధ్వని, దీప్తి. అను రెండును కావ్యమునకు, ఆత్మ, శరీరమును: శ్రీనాథుని సాహిత్యములయం దలి ధ్వని-మలయమునుండి-హిమాలయము వఱకును, దీప్తి-హిమాలయమునుండి మలయమువఱకును, ప్రసరించు లక్షణము కలవి కావున అవి ప్రౌఢములు. సర్వ భూమియందును విదితములు.

శ్రీనాథునివలె సంస్కృతాంధ్రభాషాప్రభుత్వ లక్షణముగల కవి వేఱొకఁడు లేఁడు, కావున-ఆయన కవిసార్వభౌమత్వము నాఁటి కాలమునందేకాదు-నేఁటికాలము నందును - ఎల్లకాలమునందును అవ్యాహతముగా చెల్లుబడి యగుచుండును.

వ : అని యనంతరంబ కర్పూర వసంతరాయండు వీరభద్రేశ్వరుండు
కర్పూరతాంబూల సహితంబుగా జాంబునదాంబరాభర
ణంబు లిచ్చినంబరిగ్రహించి. 5

అర్థము:- అని=ఇట్లుపలికి. అనంతరంబ = వెంటనే, కర్పూరవసంతరా యండు = 'కర్పూరవసంతరాయఁడు' అను ఆనువంశిక బిరుదముగల, వీరభద్రేశ్వ రుండు = వీరభద్రభూపాలుఁడు, 'కర్పూర తాంబూల సహితంబుగాన్' కర్పూర తాంబూల = పచ్చకప్పురపు వీడియములోఁ గూడి, యుండునట్లుగా, 'జాంబున దాంబరాభరణంబులు' జాంబునద = బంగరుజరీకల, అంబర = వస్త్రములు, ఆభర ణంబులు = బంగరునగలు, ఇచ్చినన్ = ఇయ్యఁగా, పరిగ్రహించి=స్వీకరించి-

తాత్పర్యము:- అని పలికి కర్పూర వసంతరాయఁడైన వీరభద్రారెడ్డి పచ్చకప్పురపు తాంబూలముతో బంగారు వలువలు, బంగారునగలు సమర్పణచేయఁగా స్వీకరించి.

విశేషములు:- రెడ్డిరాజులలో వసంతోత్సవములు మొదలుపెట్టినవాఁడు అన వేమారెడ్డి. 'కర్పూరవసంతరాయలు' అను బిరుదు ఆయన అన్న అనపోతారెడ్డి కొడుకు కుమారగిరిరెడ్డికి వచ్చినది. కుమారగిరిరెడ్డి నుండి యా బిరుదు రాజమహేంద్రవర రాజ్యముతోసహ కాటయవేమారెడ్డికి అతిదేశింపఁబడినది. ఆ పిమ్మట కాటయవేమారెడ్డి కూఁతురు, రాజమహేంద్రవర రాజ్యలక్ష్మి-'అనితల్లి'తో సహ వీరభద్రారెడ్డికి దఖలు పడినది. వసంతోత్సవములను నిర్వహించుట రెడ్డిరాజులందఱికిని-కులక్రమాగతమైన యాచారము.

సీ॥ ఆంధ్ర క్షమా మండలాఖండలుండైన
వేమభూపతి కృపావీక్షణాంబు
ఘోడెరాయాంక సద్గురురాయ భీమేశ్వర
స్వామి పదసమారాధనంబు
కమలాద్రి నిలయ మార్కండేయ శివమౌళి
చంద్రాంశు నవసుధాఽసారధార
వేదాద్రి నరసింహవిపుల వక్షస్థలీ
కల్హార మాలికా గంధలహరి

తే॥గీ। కారణంబులు నుద్బోధకములుగాఁగ
సంభవించిన సాహిత్య సౌష్ఠవమున
వీరభద్రేశ్వరు ప్రబంధ విభునిఁజేసి
కాశికాఖండమునఁ దెనుంగుగానొనర్తు॥ 16

అర్థము:- 'ఆంధ్ర క్షమామండలాఽఖండలుండైన' ఆంధ్ర=ఆంధ్ర మను పేరుగల. క్షమామండల=భూమండలమునకు, ఆఖండలుండైన=మహేంద్రుఁడైన, వేమభూపతి=అల్లయ వేమారెడ్డియొక్క. కృపా=నెనరుతోఁగూడిన, వీక్షణంబు=చూడ్కియును. 'ఘోడెరాయాంక సద్గురురాయ భీమేశ్వరస్వామి' ఘోడెరాయ='ఘోడెరాయలను' అంక=బిరుదముగల, సద్గురురాయ=సద్గురుప్రభువైన. భీమేశ్వరస్వామి=భీమేశ్వరస్వామియొక్క. పద=చరణములయొక్క. సమారాధనంబు=సమర్చనమును; 'కమలాద్రినిలయ మార్కండేయ శివమౌళి చంద్రాంశు నవసుధాఽసారధార' కమలాద్రి కమలాచల మను పేరుగల. మార్కండేయశివ=మార్కండ

76278

డేయ మహాముని ప్రతిష్ఠించిన, శివ=శివునియొక్క. మౌళి=జటాకిరీటమునందలి, చంద్ర=చంద్రునియొక్క, అంశు కిరణములనుండి జాలువాఱుచున్న, నవ=నిత్య నూతనమైన, సుధా = అమృతముయొక్క, ఆసార = జడివానయొక్క, ధార = సోనయును, 'వేదాద్రి నరసింహ విపుల వక్షస్థలీ కల్హారమాలికా గంధ లహరి' వేదాద్రి='వేదాద్రి' యని పేరుగల కోరుకొండ శిఖరముపై విచ్చేసియున్న, నర సింహ=నరసింహస్వామి యొక్క, విపుల=విశాలమైన, వక్షస్థలీ=వక్షః ప్రదేశము నందలి, కల్హారమాలికా = సౌగంధిక మాలయొక్క (ఎఱ్ఱకలువల దండయొక్క). గంధ=నెత్తావియొక్క, లహరి=తెరలు తెరలుగా వచ్చెడి అలయును, కారణంబులు= విమిత్తకారణము, ఉపాదానకారణము మొదలైన కారణములును, 'ఉద్బోధకములున్= ఉద్బోధక సామగ్రిని' (మేలుకొలుపునవియును). కాఁగన్ = అగుచుండఁగా, సంభవించిన=ఆవిర్భవించిన, 'సాహిత్య సౌష్ఠవమునన్' సాహిత్య=సంస్కృతాంధ్ర సాహిత్యము యొక్క, సౌష్ఠవమునన్ = సుష్ఠుభావముతో-నిండుదనముతో, పరి పుష్టితో-వీరభద్రేశ్వరున్=వీరభద్ర భూపాలుని, ప్రబంధవిభునిన్ = కృతినాయకు నిఁగా, చేసి = ఒనర్చి, కాశికాఖండమున్ = కాశీ ఖండమును, తెనుంగుగాన్= తెనుఁగుగా-తెనుఁగు భాస యగునట్లుగా, ఒనర్తున్ - చేయుదును.

తాత్పర్యము:- ఆంధ్ర మహీమండలమునకు మహేంద్రుఁడైన అల్లయ వేమారెడ్డి నెనరు చూడ్కియును, పంటరెడ్డి వంగడమునకు-కులగురువైన ఘోడె రాయ భీమేశ్వరస్వామి చరణ సమర్చనమును, కమలాద్రిపై నెలకొనియున్న మార్కండేయ శివుని జటాకిరీటముపై నున్న నెల వెన్నెలలనుండి జాలువాఱుచున్న అమృతపు సోనయును, వేదాద్రి శిఖరముపై వేంచేసియున్న నరసింహస్వామి యొక్క విశాల వక్షస్థలముపై ప్రేలాడుచున్న సౌగంధిక మాలనుండి తెరలు తెరలుగా ప్రసరించుచున్న పరిమళ తరంగిణియును కారణములును-ఉద్బోధకములునై యావిర్భవించిన సంస్కృతాంధ్ర సాహిత్య సౌష్ఠవముతో వీరభద్ర భూపాలునిఁ బ్రబంధాధిపుని గా జేసి-కాశీఖండమును దెనుఁగు భాషగాఁ జేసెదను.

తే॥గీ॥ కలిగె బదియాఱు వన్నె బంగారమునకుఁ
బద్మరాగంబుతోడి సంపర్క లబ్ధి
కాశికాఖండ మను మహాగ్రంథమునకు
నాయకుఁడు వీరభద్ర భూనాథుఁడగుట ॥ 17

అర్థము :- కాశికాఖండ మను మహాగ్రంథమునకున్=కాశీఖండ మను గొప్ప గ్రంథమునకు, నాయకుఁడు = కృతినాయకుఁడు, వీరభద్ర భూనాథుఁ డగుటన్ = వీరభద్ర మహీపతి యగుటచేత, పదియాఱు వన్నె బంగారమునకున్=పదియాఱవ వన్నె గల మేలిమి బంగారమునకు, 'పద్మరాగంబుతోడి సంపర్క్ లబ్ధి' పద్మరాగ మణితోనైన, సంపర్క్=విడఁదీయుటకు వీలులేనట్లుగా-అతికికొనిపోవుట యనెడి, లబ్ధి = లాభము, కలిగెన్ = ఒదవెను.

తాత్పర్యము :- కాశీఖండ మను గొప్ప గ్రంథమునకు-కృతినాయకుఁడు వీరభద్ర భూపాలుఁ డగుటచేత-పదియాఱవ వన్నె బంగారమునకు పద్మరాగమణితో సంపర్క్ము అఱించుట కలిగినది. అలంకారము నిదర్శనము. 'వాక్యార్థయో స్సదృశయో రైక్యారోపో నిదర్శనం' సమానములైన రెండు వాక్యముల యర్థములకు నైక్యారోపము నిదర్శనాలంకారము.

విశేషములు :- మేలిమి బంగారము కాంతి పసుపు పచ్చనిది. పద్మరాగమణి కాంతి ఎఱనిది. బంగారములో పొదిగినప్పుడు పచ్చని బంగరుకాంతి పద్మరాగముపైఁ బడును. ఎఱ్ఱని పద్మరాగమణి కాంతి బంగారముపైఁ బడును. ఆ పరస్పర కాంతి సంవలనము కన్నులకు పండువుగా నుండును.

వీరభద్రారెడ్డి అఖండ శివపూజా ధురంధరుఁడై పరమ మాహేశ్వర తేజము గలవాఁడు. కాశీఖండము కాశీక్షేత్రానుభావ సుషమ కలది ఆ తేజముపై-ఈ సుషమ, ఈ సుషమపై ఆ తేజము ప్రసరించినపుడు అది పరస్పర శోభావహ మగును.

ఇట్టి సమగుణయోగము సృష్టికి ఆనందహేతువు.

వ. అని తన్మహా ప్రబంధ కల్పనా కుతూహలాయత్త చిత్తుండనై. 18

అర్థము :- అని=ఇట్లు పలికి, తత్=ఆ, మహాప్రబంధ = గొప్ప గ్రంథము యొక్క, కల్పనా=విరచనమునందలి, కుతూహల = ఉబలాటమునకు, ఆయత్త= అధీనపడియున్న, చిత్తుండనై = మనస్సు గలవాఁడనై.

తాత్పర్యము :- ఇట్లు సదృశగుణయోగమును ప్రశంసించి ఆ మహాగ్రంథ నిర్మాణమునందలి కుతూహలమునకు పరవశమైన అంతఃకరణ ప్రవృత్తి కలవాఁడనై.

సీ॥ బాదరాయణు పాదపద్మంబులకు ప్రొక్కి
ప్రాచే వసుని మనః పదవి నిలిపి
భట్టబాణ మయూర భవభూతి శివభద్ర
కాళిదాసుల మహాకవులఁ గొలిచి
రాజశేఖరుని భారవి మాఘుఁగీర్తించి
ప్రవరసేనుని దండి భాసుఁ దలఁచి
హర్షబిల్హణుని మల్హణుఁ జోరుఁగొనియాడి
క్షేమేంద్రు వేడుకఁ జిత్తగించి

తే॥గీ॥ శబ్దశాసను నన్నపాచార్యుఁ దలఁచి
సత్కవిశ్రేష్ఠుఁ దిక్కయజ్వను భజించి
సత్ప్రబంధ మహేశ్వరు శంభుదాసు
నధిక సద్భక్తి సంయుక్తి నాదరించి॥ 19

అర్థము :- 'బాదరాయణు పాదపద్ములకున్' బాదరాయణు = వేదవ్యాస మహర్షియొక్క, పాదపద్మంబులకున్ = పదపద్ములకు, ప్రొక్కి = ప్రణమిల్లి. ప్రాచేతసున్ = వాల్మీకి మహర్షిని. మనఃపదవిన్ = మనఃపీఠమునందు, నిలిపి = ప్రతిష్ఠించి, 'భట్టబాణ. మయూర. భవభూతి. శివభద్ర, కాళిదాసులన్' భట్టబాణ = బాణభట్టును, మయూర = మయూరుని, భవభూతి = భవభూతిని, శివభద్ర = శివభద్రుని, కాళిదాసులన్ = కాళిదాసులనెడు మహాకవులను. కొలిచి = సేవించి. రాజశేఖరునిన్ = రాజశేఖరుని, భారవిని, మాఘున్ = మాఘుని. కీర్తించి= కొనియాడి ప్రవరసేనునిన్ = ప్రవరసేనుని. దండిన్ = దండిని, భాసున్ =భాసుని, తలఁచి = భావించి. హర్షున్ = శ్రీహర్షుని, బిల్హణునిన్ = బిల్హణుని. మల్హణున్ = మల్హణుని. చోరున్ = చోరకవిని, కొనియాడి = కీర్తించి, క్షేమేంద్రున్ = క్షేమేంద్రుని. వేఁడుకన్ = ఉల్లాసముతో. చిత్తగించి = చిత్తమునందు నిలిపి. శబ్ద శాసనున్ = నాగనుశాసనుఁడైన, నన్నపాచార్యున్ = ఆచార్యుఁడైన, నన్నయ భట్టును. తలఁచి = ధ్యానించి. సత్కవిశ్రేష్ఠున్ =సత్కవులలో శ్రేష్ఠుఁడైన. తిక్కయజ్వను = తిక్కన సోమయాజిని. భజించి=సేవించి. సత్ప్రబంధమహేశ్వరున్ ప్రబంధపరమేశ్వరుఁడైన. శంభుదాసునిన్ = శంభుదాస మహాకవిని (ఎట్టాప్రైగ

తను) అధిక సద్భక్తియుక్తిన్ = సమధికమైన భక్తి సంయోజనముతో. ఆదరించి = సమాదరముచేసి.

తాత్పర్యము :- వ్యాసవాల్మీకి ప్రభృతులైన దేవభాషాకవులను. నన్నయాదులైన తెనుఁగు కవులను ప్రణామ పూర్వకముగ సేవించి.

తే॥గీ॥ మత్పితామహుఁ గవి పితామహునిఁ దలఁతుఁ
గలితకావ్యకళాలాభుఁ గమలనాభుఁ
జంద్ర చందన మందార సదృశకీర్తి
సరస సాహిత్య సామ్రాజ్య చక్రవర్తి॥ 20

అర్థము :- సరస సాహిత్య సామ్రాజ్య చక్రవర్తిన్.సర = రసభరితమైన సాహిత్య సామ్రాజ్య = సాహిత్యమనెడు సామ్రాజ్యమునకు, చక్రవర్తిన్ = చక్రవర్తియును, 'చంద్ర చందన మందారసదృశ కీర్తిన్' చంద్ర=చంద్రునితో.చందన= చందనముతో, మందార = మందారములతో (కల్పవృక్షములైదింటిలో నొక్కటియైన తెల్లని దని కవి సమయము. కల్పవృక్షములైదింటికిని వెల్లనిమాకులనిప్రసిద్ధి) సదృశ = సమానమైన, కీర్తిన్ = కీర్తిగలవానిని, 'కలితకావ్యకళాలాభున్' కలిత= రమ్యమైన, కావ్యకళా = కావ్యకళయొక్క, లాభున్ = ప్రాప్తిగల, కమలనాభున్= కమలనాభామాత్యుఁడైన, మత్పితామహున్ = మాతాతగారైన, కవి బ్రహ్మను. తలఁతున్ = స్మరింతును,

తాత్పర్యము :- నాపితామహుడు నాకుమాత్రమే పితామహుఁడు కాఁడు. కవిలోక పితామహుఁడు. 'కవిబ్రహ్మ' తనవంటి కవిని సృష్టించినవాఁడు కావున: (కమలనాభుఁడు పద్మపురాణమును తెనుంగుచేసినవాఁడు) ఆయన కేవలము బ్రహ్మమాత్రుఁడే కాఁడు: కమలనాభుఁడు: బ్రహ్మకుఁ గూడఁ దండ్రియైన విష్ణువు: ఆయన నుండియే నాకుఁ గావ్యకళ లభించినది. ఆయన చంద్ర చందన మందార సదృశకీర్తి: సరససాహిత్య సామ్రాజ్యచక్రవర్తి:

విశేషములు :- ఆయన కమల నాభుఁడు.

తాను శ్రీనాథుఁడు.

ఆయన సరససాహిత్యసామ్రాజ్య చక్రవర్తి! తానుకవి సార్వభౌముఁడు.

* కృతి పతి వంశావతారము *

సీ॥ కలశాబ్ధి కన్యకా కర పల్లవ ద్వయీ
సంవాహన క్రియా సముచితంబు
నిఖిల వేదాంత వాణీ వధూ ధమ్మిల్ల
బహుళ పుష్పామోదవాసితంబు
ప్రణత నానా సంపర్వ కిరీట సంఘాత
రత్నాంకురాజి నీరాజితంబు
సనకాది సన్మునీశ్వర మనోమందిరా
భ్యంతర రత్న దీపాంకురంబు

తే॥గీ॥ పతగకేతను శ్రీపాదపంకజంబు
కారణంబుగ జన్మించె భూరి మహిమ
గంగ సైదోడు రిపుకోటి గళముత్రాడు
నాలుగవజాతి సమధి కోన్నత విభూతి!

22

అర్థము :- 'కలశాబ్ధి కన్యకా కరపల్లవద్వయీ సంవాహన క్రియాసముచితంబు' కలశాబ్ధి=(కలశ=అబ్ధి-కలశాబ్ధి). పాలసముద్రముయొక్క. (అమృతకలశము వెలువడిన సముద్ర మగుటచేత-పాలసముద్రమునకు 'కలశాబ్ధి' అని వ్యవహారము). కన్యకా=కూఁతురైన శ్రీ మహాలక్ష్మియొక్క. కరపల్లవ = చిగురుటాకులవంటి చేతులయొక్క. ద్వయీ=దోయిచేత-జంటచేత, సంవాహన=ఒత్తుట యనెడి, క్రియా-ఉపచార క్రియకు, సముచితంబు మాలిమియైనది;

నిఖిల వేదాంతవాణీ వధూధమ్మిల్ల బహుళ పుష్పామోద వాసితంబు' నిఖిల=అశేషములైన, వేదాంత=వేదశిఖలలోని-ఉపనిషత్తులలోని. వాణీ=వాక్కులే యనెడి, వధూ=జవరాండ్రయొక్క. ధమ్మిల్ల =కబరీభరములయందలి. బహుళ=చిక్కని, పుష్ప=పూవులయొక్క. ఆమోద=అత్యంత మనోహరమైన నెత్తావిచేత. వాసితంబు = 'పూవుకట్ట' బడినది. (పూవులు మొదలైనవాని సౌరభమును, వస్త్రాదికమునందు సంక్రమింపఁజేయు ప్రక్రియకు-'పూవు కట్టుట' అనిపేరు. అధివాసనము-వాసనము-వాసితము) ప్రణతనానా సుపర్వ కిరీట సంఘాత రత్నాంకురాజి నీరాజితంబు'

ప్రణత=ప్రణమిల్లిన. నానాసుపర్వ=వివిధ దేవతల యొక్క. కిరీట సంఘాత=కిరీట సమూహములయందలి. రత్న = రత్నములయొక్క. అంశు = కిరణముల యొక్క. రాజి=వరుసలచేత. నీరాజితంబు=నివాళింపబడినది. 'సనకాది సన్మునీశ్వర మనోమందిరాభ్యంతర రత్నదీపాంకురంబు' సనకాది = సనక. సనంద నాదులైన. సన్మునీ=సన్మునీశ్వరుల యొక్క. 'మనోమందిర' (మనః మందిర_మనోమందిర) మనస్సులే యనెడి మందిరములయొక్క, అభ్యంతర=(అభి+అంతర_అభ్యంతర) లోపలి ప్రదేశములయందలి. 'రత్నదీపాంకురంబు' (రత్నదీప+అంకురము_రత్న దీపాంకురము). రత్నమయమైన దీపపు మొలకయైన. 'పతగకేతను శ్రీపాద పంకజంబు' పతగకేతను=గరుడకేతనుడైన శ్రీమహావిష్ణువు యొక్క. శ్రీపాద పంకజంబు = శ్రీనిలయమైన పాదపద్మము. కావణంబుగన్ = ప్రభవస్థానముగ. భూరి మహిమన్ గొప్ప మహిమయందు. గంగ నైదోడు = గంగానదికి దోడుట్టువు. రిపుకోటిగళము త్రాడు = శత్రుకోటికి కంఠపాశమై. సమధికోన్నత విభూతిన్ _ సమధిక=అత్యధికము, ఉన్నత=సమున్నతమునైన, విభూతిన్ = ఐశ్వర్యముతో. నాలుగవజాతి=నాలుగవ వర్ణము_శూద్రకులము, జన్మించెన్=పుట్టెను.

తాత్పర్యము :- 'పద్భ్యాగ్ం శూద్రోఽజాయత' (పురుష సూక్తము.). చతుర్థ వర్ణమునకు విరాట్పురుషుడైన శ్రీమహావిష్ణువుయొక్క పాదము ప్రభవ స్థానము. ఆ శ్రీపాద వైభవ మిందు వర్ణితము.

క్షీరాబ్ధికన్యక యైన శ్రీమహాలక్ష్మి తన చిగురుచేతులతో మెత్తమెత్తగ నా పాదము నొత్తుచుండును. సకలోపనిషద్వాక్కు లనెడి సీమంతినులయొక్క ధమ్మిల్ల కుసుమసౌరభములతో_ఆ పాదము 'పువ్వుకట్టి' నట్లుండును. వరుసలు వరుసలుగా వచ్చి ప్రణమిల్లుచున్న వివిధ దేవతల కిరీట రత్నకిరణములు ఆపాదమునకు నివ్వాళు లెత్తుచుండును సనక సనందాది యోగీంద్రుల హృదయమందిరాంతరాళములలో. ఆ పాదము రత్నదీపాంకురమై వెలుగొందుచుండును. అట్టి గరుడకేతనుని శ్రీపాద పంకజము కారణముగా. గంగానదికి తోడుట్టువును శత్రుకోటికి గళపాశమునైన నాలుగవ వర్ణము సమధికైశ్వర్యముతో జన్మించెను.

శా॥ ఆవర్ణంబున నుద్భవించి గుణరత్నాగ్ర్యో నిధానంబు (శ్రీ
దూపూరం బెరుమాళ్లు రెడ్డి యభివృద్ధుల్ గాంచె మృత్యుంజయ

గ్రీవాశ్వేళ కళంక పంకహరణ క్రీడాకళా గర్వితా
ద్యావా పృథ్వ్యవకాశపేశల యశోధారా నభస్సింధువై ॥ 23

అర్థము :- ఆవర్ణంబునన్ = అట్టి నాలుగవ వర్ణమునందు. ఉద్భవించి = ఉదయించి. 'గుణరత్నార్ణో నిధానంబు' గుణరత్న=గుణములే యనెడి రత్నములకు. అర్ణోనిధానంబు (అర్ణన్ + నిధానము-అర్ణోనిధానము). అర్ణస్ = జలములకు, నిధానంబు=విధియైన-జలనిధియైన. పెరుమాళ్ళరెడ్డి = పెరుమాళ్ళరెడ్డి యను నతఁడు. శ్రీ చూపూరన్ = సంపన్నిలయమైన దువ్వూరునందు, 'మృత్యుంజయ గ్రీవాశ్వేళ కళంక పంక హరణక్రీడా కళాగర్వితద్యావా పృథ్వ్యవకాశపేశల యశోధారా నభస్సింధువై' మృత్యుంజయ = మృత్యువును జయించిన శివునియొక్క. గ్రీవా = కంఠమునందలి. శ్వేళా=కాలకూటమువలన నేర్పడిన, కళంక=మచ్చ యనెడి. పంక=బురదను. హరణ=హరించుట యనెడి. క్రీడా=ఖేలనమునందలి. కళా = నేర్పుచేత, గర్విత=గర్వించినదియై. ద్యావా = ఆకాశముయొక్క. పృథ్వీ=భూమి యొక్క. అవకాశ=అంతరాళమునందు. పేశల=హాససుందరమైన. యశోధారా= యశోధారల రూపమైన. నభస్సింధువై = ఆకాశగంగ కలవాఁడై. అభివృద్ధుల్ = పుత్త్రిపౌత్త్రి పరంపర, భోగభాగ్యములు మొదలైన అభ్యుదయములను. కాంచెన్ = పొందెను.

తాత్పర్యము :- అట్టి చతుర్థవర్ణమందు పుట్టి గుణరత్నరత్నాకరుఁడైన శ్రీ పెరుమాళ్ళరెడ్డి దువ్వూరను గ్రామమునందు-అఖండ కీర్తివైభవముతో, భోగ భాగ్యములతో, పుత్త్రిపౌత్త్రి పరంపరలతో నభ్యుదయముల నొందెను.

విశేషము :- శివుఁడు కాలకూట విషమును మ్రింగక-కక్కక-యట్లే కంఠము నందు నిలిపెను. మ్రింగినచో లోపలి లోకములు-కక్కినచో వెలుపలి లోకములు కాలిపోవును. ఆ కాలకూట విషాగ్నివలన మల్లికాధవళమై శివుని కంఠసీమపై భువన భయ భంగ చిహ్నముగా ఒకనల్లని మచ్చయేర్పడి నాటినుండి యుండెను. నేఁటికి-ఈ పెరుమాళ్ళరెడ్డి కీర్తి గంగ శివుని కంఠమునందలి యా మచ్చను మ్రింగి పైచి-ఆకాశగంగ చేయలేని దానిని తాను చేసినందువల్ల గర్వించి పగలఁబడి నవ్వెను. ఆ నవ్వుతో - ఆకాశ భూమధ్యభాగమంతయును ధగధగ మెఱసిపోయెను.

తే॥గీ॥ అతని యర్ధాంగలక్ష్మి శ్రీ యన్నమాంబ
కాంచెఁ దనయుల నర్థార్థి కల్పతరుల
నళ్ళయాధీశ పెదకోటయాన్నప్రోల
కువలయేశ దొడ్డయ పిన్నకోటవిభుల॥ 24

అన్వయము :- అతని యర్ధాంగలక్ష్మి = ఆ పెరుమాళ్ళరెడ్డి యర్ధాంగి. శ్రీ యన్నమాంబ = అన్నమాంబిక, అర్థార్థికల్పతరులన్ - అర్థార్థి = ధనార్థులకు, కల్పతరులన్ - కల్పవృక్షములైనవారిని, అళ్లయాధీశ = అళ్లాడరెడ్డి. పెదకోటయ = పెదకోటరెడ్డి. అన్నప్రోల కువలయేశ దొడ్డయ పిన్నకోట విభులన్ = అన్నప్రోల రెడ్డి దొడ్డయరెడ్డి. పిన్నకోటరెడ్డి యనెడి, తనయులన్ = కొడుకులను, కాంచెన్= కాంచెను.

తాత్పర్యము :- ఆ పెరుమాళ్ళరెడ్డి యర్ధాంగలక్ష్మియైన యన్నమాంబ - అర్థార్థులకుఁ గల్పవృక్షముల వంటి వారైన యైదుగురు కుమారులను గాంచెను. వారు వరుసఁగా-అళ్లాడరెడ్డి, పెదకోటరెడ్డి, అన్నప్రోలరెడ్డి, దొడ్డయరెడ్డి. పిన్నకోటరెడ్డి. కల్పవృక్షములైరి. వీరును-ఐదుగురు.

సీ॥ అతని భారధురీణతాధరీకృత మహా
కోడ ప్రధానుఁ డల్లాడ నృపతి
ధాటీ సమాటీక నాటోప విధ్వస్త
కుటిలాహితుఁడు పెదకోట శౌరి
పంటాన్వయక్షీరపాథోధి సంపూర్ణ
పూర్ణిమావిధు డన్న ప్రోల విభుఁడు
ప్రోద్దామదోః ప్రతాపోదయ వ్యతికర
చ్ఛాయాధిపుండు దొడ్డాయ నృపతి

తే॥గీ॥ హాటకాచల ధైర్యుండు మేటి బిరుదు
పాటి గలవాఁడు కరహాటలాట భోట

గౌడ కర్ణాటదేశ రాట్కటక సుకవి
కోటి నుత కీర్తి శ్రీ పిన్నకోటరెడ్డి॥ 25

అర్థము :- అళ్లాడరెడ్డి = ఆ యైదుగురిలో పెద్దయైన అళ్లాడరెడ్డి, 'అవని భారధురీణవాధరీకృత మహాక్రోడప్రధానుఁడు' అవనిభార = భూభరమ యొక్క, ధురీణతా = బరువు మోసెడు సామర్థ్యముచేత, అధరీకృత = క్రిందుపఱుపఁబడిన, మహత్ = గొప్పదియైన, క్రోడప్రధానుఁడు = ఆదివరాహము కలవాఁడు;

పెదకోటశౌరి = రెండవవాఁడైన పెదకోటరెడ్డి, 'ధటీ సమాటీకనాటోప విధ్వస్త కుటిలాహితుఁడు' ధటీ = దండును, సమాటీకన = నడిపించుటయందలి, ఆటోప = వేగముచేతనే, విధ్వస్త = చెల్లాచెదరు చేయఁబడిన, కుటిల = వక్ర స్వభావముగల, అహితుఁడు = శత్రువులు గలవాఁడు;

అన్నప్రోలవిధుఁడు = మూఁడవవా డైన అన్నప్రోలారెడ్డి. పటాన్వయ క్షీరపాథోధి సంపూర్ణ పూర్ణిమావిధుఁడు' పంటాన్వయ = పంటరెడ్డి కులమనెడి, క్షీర పాథోధి = పాలవెల్లికి, సంపూర్ణ పూర్ణిమా = నిండుపున్నమినాఁటి. విధుఁడు = చంద్రుఁడు;

దొడ్డాయనృపతి=నాలఁగవవాఁడైన దొడ్డరెడ్డి. 'ప్రోద్దామదోః ప్రతాపోదయ వ్యతికచ్ఛాయాధిపుండు' (ప్రోద్దామ = ప్ర + ఉద్దాను-ప్రోద్దామ) ప్రోద్దామ = మిక్కిలి విజృంభణముగల. దోః = బాహువులయొక్క, ప్రతాప = ప్రతాపము యొక్క, ఉదయ = ఉదయమునొక్క-ఉదయకాలమునొక్క, వ్యతికర = సంసర్గముగల. ఛాయాధిపుఁడు = (ఛాయా + అధిపుఁడు-ఛాయాధిపుఁడు.) ఛాయాదేవి భర్తయైన సూర్యుఁడు గలవాఁడు;

శ్రీ పిన్నకోటరెడ్డి = ఐదవవాఁడైన శ్రీ పిన్నకోటరెడ్డి = హాటకాచల ధైర్యుండు-హాటకాచల = మేరుపర్వతము వంటి, ధైర్యుండు = నిశ్చలలక్షణము గలవాఁడు, పాటిగలవాఁడు = న్యాయముగలవాఁడు, 'కరహాటలాట, భోట, గౌడ, కర్ణాటదేశరాట్' కరహాట దేశాధీశ్వరునియొక్క, లాట = లాటాధిపతియొక్క, భోట = భోటాధిపతియొక్క కర్ణాటదేశరాట్=కర్ణాటదేశాధీశ్వరునియొక్క, కటక = రాజధానుల యందలి. సుకవికోటి = సుకవిశ్రేణులచేత, నుత = నుతింపఁబడిన కీర్తి = కీర్తిగలవాఁడు.

తాత్పర్యము :- పెరుమాళ్ళరెడ్డి యైదుగురు కొడుకుల విశేషములు సీస పద్యము నాలుగు చరణములలో- క్రింది గీత పద్యములో విడివిడిగా వర్ణింపఁబడినది.

తే॥గీ॥ పంటకులరాజు దొడ్డ భూపాలునకును
బరమ కళ్యాణి యన్నమాంబకును సుతులు
ప్రోల భూపతియును గోట భూపతియును
భువన నుతకీర్తి యల్లాడ భూపతియును ॥ 26

అర్థము :- పంట కులరాజు=పంట కులమునకు చంద్రునివంటివాఁడైన, దొడ్డ భూపాలునకును (పెరుమాళ్ళరెడ్డి యైదుగురు కొడుకులలో నాల్గవవాఁడైన) దొడ్డ రెడ్డికిని, పరమకల్యాణి=పరమ మంగళ స్వభావయైన, అన్నమాంబకును=అన్న మాంబకును (ఈమె పేరుకూడ అన్నమాంబయే), సుతులు=కుమారులు, ప్రోల భూపతియును=ప్రోలారెడ్డియును, కోటభూపతియును=కోటరెడ్డియును, భువన నుత కీర్తి=లోకములచేత వినుతింపఁబడిన కీర్తి గల, అల్లాడ భూపతియునున్ = అల్లాడ రెడ్డియును;

తాత్పర్యము :- పెరుమాళ్ళరెడ్డి యైదుగురు కొడుకులలో నాల్గవవాఁడు దొడ్డారెడ్డి. ఆయన భార్యయును అన్నమాంబయే. ఆ దంపతులకు ప్రోలరెడ్డి, కోట రెడ్డి, అల్లాడరెడ్డి- అని మువ్వురు కొడుకులు.

వ॥ అందు 27

అర్థము :- అందున్ = ఆ మువ్వురిలో-

సీ॥ కుటిలారి రాట్కంఠకుహరాంతములఁగాని
క్రీడింపనీఁడు కొక్షేయకాహి
హరిదంత సౌధ శృంగాగ్ర వీథులఁ గాని
తిలకింప నీఁడు కీర్తి ధ్వజంబు
నాశ్రిత బంధుమిత్రాగారాములఁ గాని
సాగనీఁడు కృపావసంతలక్ష్మి
హరిణ భృన్నార్ధన్య చరణాబ్జములఁ గాని
మరుగనీఁడు నిజాత్మ మధులిహంబు

తే॥గీ॥ ప్రళయ సంరంభ శుంభధ్వారభటి పటిమ
భయద ఫాలాక్షభావ సంభవదభంగ
దహన మహనీయ దివ్యప్రతాప విసర
దతుల జయహారి దొడ్డయ యల్లశౌరి ॥ 28

అర్థము :- ప్రళయ సంరంభ=ప్రళయ సమయ సంరంభమువంటి సంరంభముతో, శుంభత్=విజృంభించుచున్న, ఆరభటి పటిమ=ధ్వని పాటవముచేత. భయద=భయంకరమైన, ఫాలాక్షభావ=రుద్రభావమునుండి. సంభవత్ - పుట్టుచున్న, అభంగ=అడ్డులేని, దహన=అగ్నివంటిదియును, మహనీయ=గొప్పదియు, దివ్య=దివ్యమునైన. ప్రతాప=ప్రతాపముతోసహ, విసరత్=వ్యాపించుచున్న, జయ=విజయముల చేత, హారి=మనస్సు నాకర్షించునట్టి-ప్రకాశించునట్టి, దొడ్డయ యల్లశౌరి=దొడ్డయ కుమారుఁడైన, అల్లాపరెడ్డి:

(1) కౌషేయకాహిన్ - కౌషేయక = ఖడ్గమే యనెడి, అహిన్=సర్పమును. 'కుటిలారి రాట్కంత కుహరాంతములఁగాని' కుటిల = కుటిల స్వభావముగల, అరి రాట్ = శత్రురాజుల యొక్క, కంతకుహర = కంతము లనెడి గుహలయొక్క, అంతములఁగాని=లోపలి ప్రదేశములలోఁగాని, క్రీడింపనీఁడు=ఆడనీయఁడు.

(2) కీర్తిధ్వజంబున్ = కీర్తిపతాకను, 'హరిదంత సౌధ శృంగాగ్ర వీథులఁగాని' హరిదంత = (హరిత్+అంత=హరిదంత) హరిత్ = దిక్కుల, అంత = అంచులే యనెడి, సౌధ=మేడలయొక్క, శిఖ=శిఖరములయొక్క, అగ్రవీథులఁగాని=అగ్ర ప్రదేశములయందుఁగాని, తిలకింపనీఁడు=అలంకరింపనీయఁడు - కనిపింపనీయఁడు.

(3) 'కృపావసంత లక్ష్మిన్' కృపా=కృపయే యనెడి, వసంతలక్ష్మిన్ = వసంతమాస శోభను, 'ఆశ్రిత, బంధు మిత్రారామములఁగాని' ఆశ్రిత=ఆశ్రితులు, బంధు=చుట్టములు, మిత్ర=మిత్రులు ననెడి, ఆరామములఁగాని = తోఁటలయందుఁగాని, సాగనీఁడు=ప్రసరింపనీయఁడు.

(4) 'నిజాత్మ మధులిహంబున్' నిజ తనయొక్క ఆత్మ=మనస్సే యనెడి' మధులిహంబున్ = తుమ్మెదను, 'హరిణభృన్మూర్ధన్యచరణాబ్జములఁగాని' హరిణ భృత్ = హరిణాంకుఁడు [చంద్రుఁడు], మూర్ధన్య = శిరోభూషణముగాఁ గల శివునియొక్క, చరణాబ్జములఁగాని = పాదపద్మములయందుఁగాని, మరుఁగనీఁడు=పరవశింపనీయఁడు.

తాత్పర్యము :- ప్రళయ రుద్రుని నిటలాగ్నివలె ప్రసరించుచున్న తన ప్రతాపముతోసహ వ్యాపించుచున్న అవ్యాహతములైన విజయపరంపరలుగల అల్లాడ రెడ్డి - తన ఖడ్గమను సర్పమును శత్రుకంఠ గుహాలయందుఁ గాని-సంచరింపనీయుఁడు; తన కీర్తిపతాకను దిగాంతసౌధశిఖర సీమలయందుఁగాని-కనిపింపనీయుఁడు; తన కృపావసంతలక్ష్మిని ఆశ్రితులు, బంధువులు, మిత్రులు. అనెడి తోఁటలలోఁ గాని-ప్రసరింపనీయుఁడు; తన చిత్తభృంగమును శివచరణారవిందముల యందుఁ గాని పరవశింపనీయుఁడు;

కాకేయవాహిని శత్రు కంఠగుహలలో.
కీర్తిధ్వజము దిగంతసౌధ శృంగముల మీఁద.
కృపావసంతలక్ష్మి ఆశ్రిత. బంధు. మిత్రా. రామములలో.
చిత్తభృంగము శివ చరణాబ్జములయందు.

అనుభయ అభేదరూపకము.

మ॥ జయధాటీ సమయంబులన్ విలయ ఝుంఝూ మారుతాడంబర
స్మయహారి ప్రవిజృంభమాణఘన నిస్సాణోగ్ర భేరీ స్వనం
బయి రెఁ ద్దాది భయంకరోద్ధమరశౌర్యంబైన శ్రీరెడ్డి దొ
డ్డయ యల్లాడ నృపాలు వాలునకు బిట్టల్లాడుదిక్చక్రముల్॥ 29

అర్థము :- 'జయధాటీ సమయంబులన్' జయ = జయార్థమైన, ధాటీ = దండు వెడలెడి, సమయంబులన్ = వేళలయందు. (జైత్రయాత్రారంభములందు) విలయ = ప్రళయసమయమునందలి. ఝుంఝూమారుత = హోరుగాలియొక్క. ఆడంబర = ఘీంకారముల. స్మయహారి = గర్వమునపహరించుచున్నదియై, ప్రవి జృంభమాణ = మిక్కిలి విజృంభించుచున్న. ఘన = కంచుధక్కలయొక్క. నిస్సాణ = చర్మవాద్యములయొక్క. భేరీ = భేరీలయొక్క - దుందుభులయొక్క. స్వనంబయి = ధ్వనులుకలదియై. 'ఒద్దాది భయంకరోద్ధమరశౌర్యంబైన' ఒద్దాది= ఓడ్రదేశమునకు. భయంకర = భయావహమైన. ఉద్ధమర = (ఉత్ + దమర=ఉద్ధ మర)గొప్పయుపద్రవముతోఁ గూడిన. లేక గొప్ప కొల్లతోఁగూడిన. శౌర్యంబై = శౌర్యము కలదియైన. 'శ్రీ రెడ్డి దొడ్డయ యల్లాడ నృపాలువాలునకున్' శ్రీ రెడ్డి దొడ్డయ = శ్రీ దొడ్డారెడ్డికొడుకైన. యల్లాడ నృపాలు=అల్లాడ భూపాలునియొక్క.

వాలనకున్ = ఖడ్గమునకు, దిక్చక్రముల్ = దిశావలయములు, బిట్టు = మిక్కిలి, అల్లాడున్ = [ఆడు + ఆడు-అల్లాడు] కంపించిపోవును.

తాత్పర్యము :- దండు నడపెడు సమయములలో-ప్రళయ సమయముల లోని హోరుగాలుల ఘీంకార గర్వము నణంచుచు విజృంభించుచున్న కంచు ఢక్కలు, చర్మవాద్యములు, దుందుభులు మొదలైనవాని ప్రచండ ధ్వనులతో, ఓడ్రదేశమునకు 'దడ' పుట్టించుచు, గొల్లలాడుచున్న అల్లాడరెడ్డి ఖడ్గమునకు దిశావలయములన్నియును నల్లాడిపోవును.

విశేషము :- రౌద్రభయానక వ్యంజకమైన శబ్దసంఘటనతో - ఈ పద్యము అరభటీ వృత్తిలో సాగినది.

మ॥ లలితాహంకృతి దొడ్డ భూవిభుని యల్లాడ క్షమానాథు నా
జుల మార్కొన్న వినోధిరాజు లమరస్తుత్య ప్రతాప ప్రభా
కలిత శ్రీయుతులై సుఖింతురెలమిన్ గల్యాణశైలంబుపై
గలధౌతామల హర్మ్యరేఖల మరుత్కాంతా కుచాగ్రంబులన్ ॥ 30

అర్థము :- 'దొడ్డ భూవిభుని యల్లాడక్షమానాథున్' దొడ్డభూవిభుని కుమారుడైన యల్లాడరెడ్డిని, ఆజులన్ = యుద్ధములయందు, మార్కొన్న విరోధిరాజులు = ప్రతిఘటించిన శత్రురాజులు, అమరస్తుత్య ప్రతాపప్రభాకకలిత శ్రీయుతులై' ఆమరస్తుత్య = దేవతలచేత స్తుతిచేయదగిన, ప్రతాప = ప్రతాపముయొక్క, ప్రభా = తేజముచేత, కలిత = రమ్యమైన, శ్రీ = శోభతో, యుతులై = కూడినవారై, లలితాహంకృతిన్ = లలితమైన యహంకారముతో, కల్యాణశైలంబుపైన్ = కనకశైలముపైన, [కల్యాణము = బంగారము] 'కలధౌతామలహర్మ్యరేఖలన్' కలధౌత = వెండివలె, అమల = తెల్లనైన, హర్మ్యరేఖన్ = మేడలవరుసలపైన, మరుత్కాంతా కుచాగ్రంబులన్ - మరుత్కాంతా = దేవకాంతలయొక్క, కుచ = స్తనములయొక్క, అగ్రంబులన్ = పైభాగములయందు, ఎలమిన్ = ఉల్లాసముతో, సుఖింతురు = ఆనందించెదరు.

తాత్పర్యము :- అల్లాడరెడ్డిని యుద్ధభూములలో నెదిరించిన శత్రురాజులు దేవతలస్తుతింపదగిన ప్రతాపదీప్తితో మేరుపర్వతము మీద వెండివలె తెల్లనైన

మేడలమీఁద, అప్సరఃస్త్రీల స్తనమండలములపైన లలితమైన యహంకారముతో హాయిగా సుఖించెదరు.

విశేషములు :- రణమరణము నొందినవారికి వీరస్వర్గము ప్రాప్తించును. ఆ స్వర్గము అమరస్త్రీ భోగమును గలిగించును. వారు యుద్ధములో నిహతులైనను. వారి యహంకారము దేవకాంతల స్తన కుంభములపై కొనసాగుచునే యున్నది. కావున - లలితాహంకారము.

మ॥ అనవేమ క్షితిపాలు పౌత్రి యగు వేమాంబామహాదేవికిన్
ఘనుఁ డయ్యల్లన భూమిపాలునకు సంగ్రామస్థలీగాండివుల్
తనయు ల్వేమవిభుండు వీరవసుధాధ్యక్షుండు దొడ్డప్రభుం
డునునన్నయ్యయు బాహువిక్రమకళాటోప ప్రతాపోద్ధతుల్॥ 81

అర్థము :- 'అనవేమక్షితిపాలపౌత్రియగు వేమాంబా మహాదేవికిన్' అన వేమ క్షితిపాలు = అనవేమారెడ్డి విభునకు, పౌత్రియగు = మనుమరాలైన, వేమాంబామహాదేవికిన్ = వేమాంబకును, ఘనుఁడు = గొప్పవాఁడైన, అయ్యల్లన భూమిపాలునకున్ = అయల్లాడరెడ్డికిని, 'బాహువిక్రమకళాటోపప్రతాపోద్ధతుల్' బాహువిక్రమ = బాహుపరాక్రమమునకు సంబంధించిన, కళా = విద్యయందలి, ఆటోప = విజృంభణముచేతను. ప్రతాప = ప్రతాపముచేతను, ఉద్ధతుల్ = ఉదటు గలవారును, 'సంగ్రామస్థలీగాండివుల్' సంగ్రామస్థలీ = యుద్ధభూములయందు, గాండివుల్ = అర్జునునివంటివారైన, వేమవిభుండు=వేమారెడ్డియును, వీరవసుధాధ్యక్షుండు = వీరభద్రభూపాలుఁడును, దొడ్డప్రభుండున్ = దొడ్డారెడ్డియును, అన్నయ్యయున్ = అన్నారెడ్డియును, తనయుల్ = కుమారులు.

తాత్పర్యము :- కొండవీటి ప్రభువైన అనవేమపాలుని (ఈయన ప్రోలయవేముని కొడుకులలో - అనపోతారెడ్డి పిమ్మట కొండవీటి రాజ్యమును పరిపాలించిన ప్రభువు. వసంతోత్సవమునీయనయే ప్రారంభించెను. కుమారగిరిరెడ్డికి పినతండ్రి. ఈయన పిమ్మటనే కుమారగిరిరెడ్డి రాజ్యమునకు వచ్చెను,) మనుమరాలైన వేమాంబకును-ఆయల్లాడ రెడ్డికిని నలుగురు కొడుకులు. వారు : వేమారెడ్డి, వీరభద్రారెడ్డి (రాజమహేంద్రవరప్రభువు, కాటయవేమారెడ్డికుమార్తయైన 'అనితల్లి' యీయన భార్య. కాశీఖండ మీయనకే అంకితముగా రచింపఁబడినది.) దొడ్డారెడ్డి, అన్నారెడ్డి, అనువారు.

అర్థము :- అందున్ = ఆనలువురిలో, అగ్రజుండు = పెద్దయైనవేమారెడ్డి.

తాత్పర్యము:- వారిలో పెద్దవాడైన వేమారెడ్డి;

ము॥ కొనియెం 'గంచుకముల్' సముద్భట నటద్ఘోటీభటప్రౌఢిఁ;గై
కొనియె న్వేఁడుకఁ 'జీడికాడ' యహిత క్ష్మోణీశులల్లాడఁ: జే
కొనియెన్ 'మాకవరంబు' వీఁక మదవద్ఘోరారిసంహారియై
ఘనుఁ డల్లాడ మహీశు వేమన నిరాఘాటైక ధాటీగతిన్ ॥ 33

అర్థము :- ఘనుఁడు = గొప్పవాఁడైన, అల్లాడ మహీశువేమన = అల్లాడ మహీపాలుని పెద్దకొడుకైన వేమారెడ్డి. 'నిరాఘాటైకధాటీగతిన్' నిరాఘాట - అడ్డ మాఁకలులేని. ఏక = హాటాహాటియైన. ధాటీ = దండయాత్రయొక్క. గతిన్ = మార్గముగా, 'సముద్భటనటద్ఘోటీభటప్రౌఢిన్' సముద్భట = మిక్కిలి యుదటు గలవియై. నటత్ = అదనుద్రొక్కుచును, ఘోటీ = ఆడుగుట్టములమీఁది. భట = సుభటులయొక్క. ప్రౌఢిన్ = ప్రాగల్భ్యముచేత, కంచుకముల్ = 'కంచుకము' లను పరగణాలను; కొనియెన్ = లోఁబఱిచికొనెను, అహితక్ష్మోణీశులు = శత్రు రాజులు, అల్లాడన్ = వణఁకిపోవునట్లుగా, వేఁడుకన్ = అవలీలగా, చీడికాడ = 'చీడికాడ' యనుసీమను, కొనియెన్ = లోఁగొనెను, 'మదవద్ఘోరారిసంహారియై' మదవత్ = మదశాలులై, ఘోర=భయంకరులైన, అరి = శత్రువులను, సంహా రియై = సంహరించినవాఁడై, వీఁకన్ = పరాక్రమముతో, మాకవరంబున్ = 'మాకవరము' అను దుర్గమును, చేకొనియెన్ = కైవసముచేసికొనెను . హస్త గతము చేసికొనెను.

తాత్పర్యము ;- శౌర్యఘనుఁడైన యల్లయవేమారెడ్డి . అడ్డమాఁకలులేని హాటాహాటిదండయాత్రలో 'కంచుకములు' అనుసీమలను ఆక్రమించుకొనెను. శత్రురాజులల్లాడిపోవునట్లు- 'చీడికాడ' అనుప్రాంతమును లోఁబఱిచికొనెను. మదో ద్ధతులైన విరోధి రాజులను సంహరించి 'మాకవర' మను దుర్గమును హస్తగతము చేసికొనెను.

సీ॥ సప్తమాడియ రాయచంద్ర బింబాననా
చికుర వల్లరులపైఁ జిన్నిపువ్వు
ఱూడె జంతుర్నాటి జననాథ శుద్ధాంత
కుచకుంభములమీఁది కుంకుమంబు
బారహదొంతి భూపాలలీలావతీ
గండస్థలంబులఁ గలికి నవ్వు
కలువపల్లొడ్డాది కటకాధిపతి వధూ
సీమంత పీఠులఁ జేరుచుక్క

తే॥గీ॥ యల్లడాధీశ వేమక్షమాధినాథ
భూరి నిష్ఠురధాటీ విహారచటుల
సైన్య నాసీర తుక్కార శఫపుటోత్థ
వింధ్యపార్శ్వ వసుంధరా విపులధూళి॥ 84

అర్థము :- 'అల్లాడాధీశ వేమక్షమాధినాథ భూరి నిష్ఠురధాటీ విహార చటుల సైన్యనాసీర తుక్కార శఫపుటోత్థవింధ్య పార్శ్వ వసుంధరా విపులధూళి'

అల్లడాధీశ = అల్లాడవిభునికొడుకైన, వేమక్షమాధినాథ = వేమభూపాలుని యొక్క. భూరి = గొప్పదియును. నిష్ఠుర = తీవ్రమునైన, ధాటీ = దండయాత్ర యొక్క. విహార = స్వేచ్ఛాయానమునందు. చటుల = కదలుచున్న. సైన్య = సేనలయొక్క, నాసీర = అగ్రభాగములయందలి, తుక్కార = గుట్టములయొక్క. శఫపుట = రింఖాపుటములనుండి - గిట్టలనుండి. ఉత్థ = పైకెగసిన. వింధ్య పార్శ్వ = వింధ్యపర్వత ప్రాంతమునందలి. వసుంధరా = భూమియొక్క. విపుల= విస్తారమైన. ధూళి = దుమారము.

'సప్తమాడియరాయంచ చంద్రబింబాననాచికురవల్లరులపైన్' సప్తమాడియ= ఏడు మాడియములు గల దేశమునకు (మల-మాళియ-మాడియ-కళింగములోని మన్యపుఁ ప్రాంతము-కొండలుగల దేశము). రాయ=ప్రభువులయొక్క. చంద్ర బింబాననా = చంద్రబింబమువంటి మోములుగల-అంతఃపుర స్త్రీలయొక్క. చికుర వల్లరులపైన్=తీఁగలవలె వలయములు తిరిగిన ముంగురులపైన, చిన్నిపువ్వు= 'చిన్నిపువ్వు' అనెడి నాఁటిపూలు ధరించెడి ఒకానొక నగ;

'ర్యూడె జంతుర్నాటి జననాథ కుద్ధాంతకుచ కుంభములమీఁది కుంకుమంబు' ర్యూడె='ర్యూడె' అను సంజ్ఞకల. జంతుర్నాటి జననాథ=జంతుర్నాటి రాజులయొక్క. (నేఁటి శృంగవరపుఁకోట ప్రాంతదేశమునకు-నాఁటి వ్యవహారము 'జంతుర్నాడు' అని రెడ్డిరాజ్యముల చరిత్రములలో శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు తెలిపి యున్నారు.) కుద్ధాంత=రాణివాసములయొక్క. కుచకుంభములమీఁది=స్తనకుంభముల పైన నలఁదిన, కుంకుమంబు=కుంకుమ పరాగము;

'బారహదొంతి భూపాల లీలావతీ గండస్థలంబులన్' బారహ=పండ్రెండు సంఖ్య గలిగి. దొంతి=వరుసగానున్న మన్యపు రాజ్యములకుఁ జెందిన. భూపాల=రాజులయొక్క. లీలావతీ = విలాసవతులయొక్క. గండస్థలంబులన్=చెక్కిళుల యందలి. కలికి నవ్వు = అందమైన నవ్వు; 'కలువపల్లొ య్యడ్డాది కటకాధిపతి వధూ సీమంత వీథులన్' కలువపల్లి. ఒడ్డాది. కటకము-ఈ దేశాధిపతులయొక్క. వధూ=అంతఃపుర వధువులయొక్క. సీమంత వీథులన్=కేశవీథులయందు-పాపట తెరువుల యందు. చేరుచుక్క=చుక్కకు-పైన-చేరువగా నుండు వేఱొక చుక్క;

తాత్పర్యము :- అల్లయవేముని దండయాత్రలలో సేనలముందు నడచు దొక్కుచున్న గుట్టపుదండు గిట్టలనుండి రేఁగిన - వింధ్య పార్శ్వ సీమలయందలి కెందూళులు 'మాడెము' తేలుకొండ మన్నింద్ర జవరాంద్ర ముంగురులపైన-'చిన్ని పువ్వు'లను జెక్కుచున్నవి; 'జంతుర్నాటి' జనపతుల రాణివాసముల స్తనకుంభముల మీఁదఁ గుంకుమమఁ లందుచున్నవి. దొంతిగానున్న పండ్రెండు మన్యపు రాజ్యముల నేలచున్న దొరల నగళ్ళలోవి చెలువల చెక్కిళ్ళపైనఁ గలికి నవ్వులుగా ముద్దు లొలుకుచున్నవి; కలువపల్లి. ఒడ్డాది, కటకాధిపతుల సీమంతినుల పాపటలమీఁదఁ జేర్చుక్కలను జేర్చుచున్నవి.

విశేషము :- భంగ్యంతరముగా వేముఁడీ దేశముల నన్నింటిని గెలిచెనని చెప్పుట. పర్యాయోక్తము-ఉల్లేఖము. ఉత్ప్రేక్షయును, అలంకారముల సంసృష్టి.

'భయోత్సృష్ట విభూషాణాంతేన కేరళ యోషితాం
అలకేషు, చమూరేణు ర్భూచ్ఛర్లప్రతినిధీకృతః'

అని కాళిదాసు రఘువంశములోఁ జూపిన మార్గమును శ్రీనాథుఁడీ పద్యములోఁ బరిష్కృతము చేసెను. భయోద్విగ్నలైన ఆ స్త్రీలకు ఇంత వన్నెలు చిన్నెలుగా నలంక

రించికొను స్తిమిత మెక్కడిది; సేనాపరాగమే ఆయా నైపథ్య విధానమును నెఱపు చున్నదని చమత్కరించుట.

సీ॥ పండువా సురధాని పావడం బంపిన
భద్రేభములు విధిఁ బాళెముండు
నొడ్డె ధాత్రీనాథుఁ డుపదఁ బుత్తెంచిన
బింబాధరోష్ఠి సంబెళ వహించు
కర్ణాట భూపతి కానుక యనిపిన
ముక్తాతపత్రంబు గ్రమోల మెఱయు
యవనాధిపతి యుపాయనముగా నొసఁగిన
పాగాహయంబులు వాగె వచ్చు

తే॥గీ॥ దూర మంతంత బారహాదొంతి మన్నె
స్తమాడియ రాజన్యసమితి గ్రమొక్కు-
రాయవేశ్యా భుజంగ సంగ్రామ పార్థ
గాయ గోవాళ వేమన క్ష్మాధవునకు ॥ 85

అర్థము :- 'రాయవేశ్యాభుజంగ సంగ్రామపార్థ గాయగోవాళ వేమన క్ష్మాధవు నకున్'-'రాయవేశ్యాభుజంగ', 'సంగ్రామపార్థ', 'గాయగోపాళ' బిరుదములు గల, వేమన క్ష్మాధవునకున్=వేమ భూపాలునకు, 'పండువా సురధాణి' 'పండువా'=దేశపు సులతాను, పావడంబు=కానుకగా, అంపిన=పంపిన, భద్రేభములు=భద్ర=ఇభములు-భద్రేభములు)=భద్రజాతి యేనుఁగులు, వీధిన్=రాజవీధియందు, పాళెముండున్=పాళియముండును - విడసియుండును; ఒడ్డె ధాత్రీనాథుఁడు = ఓడ్రదేశపు రాజు, ఉపదపుత్తెంచిన = ఉపాయనముగా పంపియున్న, బింబాధరోష్ఠి=దొండపండు వలె ఎఱ్ఱని పెదవిగల అందక త్తె, సంబెళన్=అడపమును-తాంబూలకరండమును, వహించున్=తాల్చును; కర్ణాటభూపతి = కన్నడరాయలు, కానుక యనిపిన=ఉడుగరగాఁ బంపిన, ముక్తాతపత్త్రంబు-(ముక్తా + ఆతపత్త్రంబు) = ముత్యాల చేరులు గల గొడుగు, గ్రమోలన్=పార్శ్వమునందు, మెఱయున్=మెఱయుచుండును; యవనాధిపతి-యవనవంశ్యుఁడైన రాజు, ఉపాయనముగాన్ = 'నజరాణ'గా, ఒసఁగిన = ఇచ్చిన, 'పాగా హయంబులు'-పాగా=అశ్వాలలోని, హయంబులు=గుఱ్ఱములు,

వాగె వచ్చున్ = కళ్ళెపు బగ్గమునకు లోనై వచ్చును; దూరము = దూరముగా, అంతంతన్ = అచ్చటచ్చటనే. 'బారహదొంతి మన్నె సప్తమాడియ రాజన్యసమితి' బారహ=పండ్రెండు సంఖ్యగల, దొంతి=వరుసగా నున్న, మన్నె, పర్వతారణ్య దేశముల రాజులును, సప్తమాడియ ఏడు మాడెములకు (కొండలకు) సంబంధించిన, రాజన్య=రాజశ్రేష్ఠులయొక్క, సమితి=సమూహము మ్రొక్కన్ = మోకరిల్లును.

తాత్పర్యము :- రాయవేశ్యభుజంగ, సంగ్రామపార్థ, గాయగోవాళ-ఇత్యాది బిరుదములు గల యల్లయ వేమ భూపతికి-పండువా సులతాను కానుకగా బంపిన భద్రజాతి యేనుగులు రాజవీధిలో విడిసియుండును; ఓఢ్రదేశపు రాజు కానుక పంపిన బింబోష్ఠి తాంబూల కరండము దాల్చియుండును; కన్నడ రాయడు కానుకగా బంపియున్న ముత్యాల గొడుగు మ్రోలనే మెఱయుచు నుండును; యవన రాజు ఉపాయనముగా బంపిన హయశాలలోని గుఱ్ఱములు కళ్ళెపుబగ్గమునకు లోనై వచ్చుచుండును; బారహదొంతి మన్యముల మస్నీంద్రును, ఏడు మాడెముల కొండ దొరలును, దూరమునందే నిలిచి-అంతంతటనే మోకఱిల్లుచుందురు;

కం॥ చటులత నల్లయవేమన । పటుఢాటీ విజయభేరి భాంకృతి
మొరయున్
కిటిసామజ హోసమధిక । కటుకంఠ గభీర కుహర కహ
కహారవమై ॥ 86

అర్థము :- అల్లయవేమన = అల్లయవేముని యొక్క, 'పటుఢాటీ విజయభేరి భాంకృతి'-పటు=పాటవముగల, ఢాటీ జైత్రయాత్ర యందలి, విజయభేరి = విజయ దుందుభి యొక్క, భాంకృతి = భాంకారము, 'కిటిసామజ హోసమధిక కటుకంఠ గభీర కుహర కహకహారవమై కిటి=ఆదివరాహము యొక్క, సామజ=అష్టదిగ్గజ ముల యొక్క, హో=సింహముయొక్క (నృహో?), సమధిక=ఎక్కువయైన, కటు=తీవ్రమైన, కంఠకుహర=కంఠగుహ యందలి, కహకహారవమై=కహకహ ధ్వని కలదియై, మొరయున్=మ్రోగుచుండును, చటులతన్=తీవ్రతతో.

తాత్పర్యము :- అల్లయవేముని జైత్రయాత్రా దుందుభి భాంకారము-ఆది వరాహ, అష్టదిగ్గజ, సింహముల యొక్క కంఠగుహల నుండి లోతుగా వినవచ్చు చున్న కహకహ ధ్వనివంటి కహకహ ధ్వని కలదియై మ్రోగుచుండును.

సీ॥ ధరియింపనేర్చిరి దర్భవెట్టడు ప్రేళ్ళ
లీల మాణిక్యాంగుళీయకములు
కల్పింపనేర్చిరి గంగమట్టియ మీఁదఁ
గస్తూరికా పుండ్రకంబు నొసల
సవరింపనేర్చిరి జన్నిదంబుల ప్రోలఁ
దారహారములు ముత్యాలసరులు
చేర్పంగనేర్చిరి శిఖల నెన్నడుములఁ
గమ్మని క్రొత్త చెంగల్వవిరులు

తే॥ ధామముల వెండి పైఁడియుఁ దడఁబడంగ
బ్రాహ్మణోత్తము లగ్రహారములయందు
వేమ భూపాలుఁ డనుజన్ము వీరభద్రు
ధాత్రి యేలింప గౌతమీ తటములంను ॥ 37

అర్థము :- వేమభూపాలుఁడు=అల్లయవేమారెడ్డి. గౌతమీతటములందున్=గౌతమియొడ్డులందు. అనుజన్మున్=తమ్ముఁడైన. వీరభద్రున్=వీరభద్రుని. ధాత్రి యేలింపన్=పుడమి యేలించుచుండఁగా. అగ్రహారములయందున్=అగ్రహారముల లోపల. బ్రాహ్మణోత్తములు=బ్రాహ్మణశ్రేష్ఠులు. ధామములన్=(తమ) ఇండ్ల లోపల. వెండి=వెండియును. పైఁడియున్=బంగారమును, తడఁబడంగన్=తొట్రు పడుచుండఁగా; దర్భవెట్టెడు ప్రేళ్ళన్=పవిత్ర గ్రంధిని ధరించెడి ప్రేళ్ళయందు. మాణిక్యాంగుళీయకములు=కెంపులు పొదిగిన పసిఁడి యుంగరములను. లీలన్=విలాస ముట్టిపడునట్లుగా, ధరియింప నేర్చిరి=పెట్టుకొనుట నేర్చిరి; నొసలన్=ఫాలస్థలమునందు, గంగ మట్టియమీఁదన్=గంగ మృత్తికపైన. 'కస్తూరి కాపుండ్ర కంబున్ కస్తూరి గీఱునామమును. కల్పింపనేర్చిరి-దిద్దుకొనుటనేర్చిరి; జన్నిదంబుల ప్రోలన్=జన్నిదములప్రక్క, తారహారములు=రజతహారములను. ముత్యాలసరులన్=ముత్యాల దండలను, సవరింపనేర్చిరి=సవరించుట నేర్చుకొనిరి; శిఖల నెన్నడుములన్=శిఖా మధ్యభాగములయందు, కమ్మని=సౌరభముగల. క్రొత్త చెంగల్వవిరులు=సద్యోవికసితములైన సౌగంధికములను. చేర్పంగనేర్చిరి=తుఱుముట=నేర్చుకొనిరి;

తాత్పర్యము :- వేమారెడ్డి తన తమ్ముఁడు వీరభద్రునిచేత - పుడమి యేలించుచుండగా గౌతమి యొడ్డులయందు- అగ్రహారములలోని బ్రాహ్మణోత్త ములు తమ యిండ్లలో వెండి బంగారములు తడఁబడుచుండఁగా- అంతకుమునుపు దర్భముడులు చుట్టుకొనెడి తమ వ్రేళ్ళకు మాణిక్యములు పొదిగిన యుంగరములను విలాసముగ- పెట్టుకొనుట నేర్చిరి; నొసట-గంగ మృత్తికపై కస్తూరి గీఅనామమును దీర్చు హొయలు నెఱిఁగిరి; యజ్ఞోపవీతముల ప్రక్క-నే రజతహారములు, ముత్యాల దండలు, సవరించుకొనెడి యొయ్యారము నెఱిఁగిరి; తమ సిగల నెన్నడుమ చెంగల్వ విరులు దుఱిమికొనెడి విలాసముల నెఱిఁగిరి;

విశేషము :- పంచమేఽహని షష్ఠేవా శాకం పచతిస్వేగృహే' అను రీతిని గౌతమీ తీరాగ్రహారములలో నిత్యసంతుష్టులై స్వకర్మనిరతులై కాలము వెళ్ళించు బ్రాహ్మణోత్తములకు- అల్లయ వేమారెడ్డిగారు తన తమ్మునిచేత- పుడమి యేలించు చుండఁగా నిట్టి సిరి యెత్తుకొన్నది. అయినను వారు స్వకర్మభ్రష్టులు కాలేదు. దర్భ పెట్టిన వ్రేళ్ళకే లీలగా మాణిక్యాంగుళీయకములు తొడిగిరి. గంగ మట్టిమీఁదనే కస్తూరి గీఅనామమును దీర్చిరి. జన్నిదముల మ్రోలనే ముత్యాలసరులు సవరించిరి. పిగలయందే చెంగలువలు దుఱిమిరి.

తే॥గీ॥ ప్రకట శాఖోపశాఖలఁ బంట వంశ
ముద్ధరించిన వేమేంద్రుఁ డుదయవేళ
శివు విశాఖుని తండ్రిఁ బూజించు భక్తి
లలిత బిల్వ త్రిశాఖ పలాశసమితి ॥ 88

అర్థము :- పంట వంశము = పంటరెడ్డి కులమును, 'ప్రకటశాఖోపశాఖలన్' ప్రకట = ప్రసిద్ధములైన; శాఖ = కొమ్మలును. ఉపశాఖలన్ = రెమ్మలునుగా. ఉద్ధరించిన = అభ్యుదయమునకుఁ దెచ్చిన, వేమేంద్రుఁడు = వేమభూపాలుడు. ఉదయవేళన్ = సూర్యోదయవేళయందు. విశాఖుని తండ్రిన్ = శాఖలు లేనివాని తండ్రిని-కుమారస్వామి తండ్రిని (విశాఖుఁడు-కుమారస్వామి). శివునిన్ శివుని. భక్తిన్=భక్తితో, 'లలితబిల్వ త్రిశాఖ పలాశసమితిన్' లలిత = సుందరములైన. బిల్వ = మారేడుచెట్టుయొక్క. త్రిశాఖ = మూఁడు శాఖలుగల. పలాశసమితిన్= దళ కదంబములతో. పూజించున్ = అర్పించును.

తాత్పర్యము :- శాఖోపశాఖలుగా- పంటరెడ్డి కులమును- పెంపొందించిన వేమారెడ్డి యుదయకాలములయందు విశాఖుని తండ్రియైన శివుని భక్తితో- త్రిశాఖములైన లలితబిల్వ దళములతో నర్చించును.

సీ॥ త్ర్యంబకాచలకన్యకాంబుపూర-బున
నఘమర్షణ స్నానమాచరించి
నిద్దమైన మడుంగు నీర్కా-వి దోవతి
కనక మేఖలతోడఁ గటి ఘటించి
మూలమంత్రాక్షరంబుల భూతి మంత్రించి
పుండ్రకంబుగ ఫాలంబున ధరించి
క్రొత్త ముత్తెములతో రుద్రాక్షమాలిక
లష్టోత్తర శతంబు లమితఁ దాల్చి

తే॥గీ॥ పుండరీక-జనమునఁ గూర్చు-డి శంభు
నర్చనము చేయునపుడు మహాప్రమథుఁడు
చాల నొప్పారు రెండవ శంభునట్లు
వీరనారాయణుండల్ల వేమవిభుఁడు ॥ 89

అర్థము :- 'త్ర్యంబకాచల కన్యకాంబు పూరంబునన్' త్ర్యంబకాచల = త్రియంబక పర్వతముయొక్క-. కన్యకా = కూఁతురైన గోదావరీ నదియొక్క-. అంబు పూరంబునన్ = ప్రవాహ జలమునందు. 'అఘమర్షణ స్నానము' అఘమర్షణ = పాపములను దుడిచిపెట్టెడి-హిరణ్యశృంగం వరుణం ప్రపద్యే' ఇత్యాది వేదమంత్ర పూర్వకమైన. స్నానము = స్నానమును. ఆచరించి = శ్రద్ధాతిశయముతో నిర్వర్తించి 'నిద్దమైన మడుంగు నీర్కా-వి దోవతిన్' నిద్దమైన = నునుపైన, మడుంగు = ఉదికిన. నీర్కా-వి-(నీరు + కావి = నీర్కావి) ప్రతి దినము తడుపుటచేత ఎఱ్ఱఁబాఱిన. దోవతిన్ = వస్త్రమును, కనక మేఖలతోడన్ = బంగారు మొలత్రాటితో, కటిన్ = మొలయందు. ధరించి = తాల్చి. 'మూలమంత్రాక్షరంబులన్' మూల మంత్ర = పంచాక్షరీ మంత్రముయొక్క-. అక్షరంబులన్ = అక్షరములను వ్రాయుట చేత. భూతిన్ = విభూతిని. మంత్రించి = అభిమంత్రించి. పుండ్రకంబుగన్ = త్రిపుండ్రకముగా. ఫాలమునన్ = ఫాలస్థలమునందు. ధరించి = ధరణచేసి. క్రొత్త

ఁమున్తెములతోన్ = క్రొత్త ముత్యాలతో. రుద్రాక్షమాలికలు = రుద్రాక్షమాలలను. ఁఅష్టోత్తరశతంబున్ = నూట యెనిమిదింటిని. అఱుతన్ = కంఠమునందు, తాల్చి = ధరించి. 'పుండరీకాజినమునన్' పుండరీక = పెద్దపులియొక్క. అజినమునన్ = చర్మమునందు—వ్యాఘ్రాజినముపైన—కూర్చుండి = ఉపవిష్టుఁడై, శంభున్ = శివుని. అర్చనముసేయునపుడు = అర్చించు వేళయందు. మహాప్రమథుఁడు = మహాప్రమథాంశకలవాఁడును, వీరనారాయణుండు = వీరనారాయణుఁడైన, అల్ల వేమవిభుఁడు= అల్లయ వేమారెడ్డి. రెండవ శంభునట్లు = ద్వితీయ శంభునివలె, చాలన్ = మిక్కిలి యును, ఒప్పారున్ = తేజస్వియై యుండును.

తాత్పర్యము :- త్ర్యంబికాచల నందినియైన గౌతమియొక్క ప్రవాహ జలములలో. ప్రాతఃకాలమునందు అఘమర్షణ మంత్రపూతమైన స్నానవిధిని శ్రద్ధాతిశయముతో నిర్వర్తించి. నునుపును. ఉదికి యాఱవేసినదియును. నీరుకావి పట్టినదియు, నైన దోవతిని బంగారు మొలత్రాడుతోఁ గటి ప్రదేశమునందు ఘటియించి. మూలమంత్రాక్షరములతో. అభిమంత్రితమైన భూతి త్రిపుండ్రమును ఫాలమునందు ధరించి. కొత్త ముత్యములు. ఎడపెట్టి గ్రుచ్చిన అష్టోత్తర శతసంఖ్యగల రుద్రాక్షమాలలను. కంఠసీమయందుఁ దాల్చి. వ్యాఘ్రాజినముపైఁ గూర్చుండి మహాప్రమథుల యంశముగలవాఁడును, వీరనారాయణుఁడైన, అల్లయ వేమారెడ్డి శివార్చనము చేయు సమయమునందు రెండవ శివునివలె మిక్కిలియును తేజస్వియై దర్శనీయుడై యుండును.

విశేషములు:- కాశీఖండమును గృతి యందుకొనుటకుఁ బరిపూర్ణమైన యర్హతకల రాజమహేంద్రవరపు రెడ్డిరాజుల వంగసమునందలి శివపూజానిరతియును, పరమ మాహేశ్వరమైన యను భావమును. ఇందు వేమారెడ్డిగా మూర్తీభవించినది. ఆయన మహాప్రమథుఁడు. వీరనారాయణుఁడు. అనఁగా. నారాయణునివలె ప్రథమ పాశుపతుఁ డగుట; శివార్చనావేళయందు సాక్షాత్తుగా రెండవ శంభుఁడు; ఈమాట. 'నాఒరుద్రోరుద్రమర్చయేత్' అనెడి వైదిక సంప్రదాయమును స్ఫురింపఁ జేయుచున్నది. ఆ రాజులందఱును ఘోడెరాయ భీమేశ్వరగురు సంప్రదాయమునకుఁ జెందిన పరమ మహేశ్వరులు;

శా॥ చంచల్లీలల హస్తకంకణ మణిచ్ఛాయల్ పిసాళింపఁ, బూ
జించున్ వేమమహీ విభుండు నవరాధీపంబులన్ గల్వలన్

ప్రాంచత్కాంచన పుష్పకేసరములన్ ప్రాసాదపంచాక్షరిన్
మంచుంగొండ యనుంగుఁ బెండ్లికొడుకున్ మధ్యాహ్న
కాలంబునన్ ॥ 40

అర్థము :- వేమ మహీవిభుండు = వేమ భూపాలుడు, మధ్యాహ్నకాలంబునన్ = మధ్యాహ్న సమయమునందు, చంచత్ = మిఱుమిట్లు గొలుపుచున్న, లీలన్ = విలాసములతో, 'హస్తకంకణ మణీచ్ఛాయల్' హస్తకంకణ = హస్తాభరణములైన 'సింహతలాట'ములయందు పొదిగిన మణి = నవరత్నముల యొక్క, ఛాయల్ = కాంతులు, పిసాళింపన్ = ఒక రత్నకాంతి. మఱియొక రత్నకాంతితో మేలమాడుచు ప్రసరించుచుండఁగా, ప్రాసాద పంచాక్షరిన్ = ప్రాసాద పంచాక్షరీ మంత్రముతో సంయోజనము చేసి, నవరాజీవంబులన్-నవ = అప్పుడే వికసించిన, రాజీవంబులన్ = తామరపూవులతోను, కల్వలన్ = కలువపూవులతోను, 'ప్రాంచత్కాంచన పుష్పకేసరములన్' ప్రాంచత్-(ప్ర+అంచత్ =ప్రాంచత్) = మిక్కిలి ప్రకాశించుచున్న, కాంచనపుష్ప = దేవకాంచన పుష్పములతోను, కేసరములన్ = పొగడపూలతోను, 'మంచుంగొండ యనుంగు పెండ్లికొడుకున్' మంచుంగొండ = హిమాలయపర్వతము యొక్క, అనుంగు = గారామైన, పెండ్లికొడుకున్ = అల్లుని, (పెండ్లినిమిత్తముగా-కుమారునివంటి వాఁడైనాఁడు కావున, పెండ్లికొడుకు-అల్లుఁడు) శివుని, పూజించున్ = అర్చించును.

తాత్పర్యము :- చేతులఁ దాల్చిన 'సింహతలాట'ములలో- పొదిగిన, నవ రత్నకాంతులు- ఒకదానితో-ఒకటి పరిహాసమాడుచున్నట్లు ప్రసరించుచుండఁగా- వేమారెడ్డి మధ్యాహ్న వేళలయందు ప్రాసాద పంచాక్షరీ మహామంత్ర సంయోజనముతో, మంచుగొండ యల్లుఁడైన శివుని- క్రొందామరలతో, కలువలతో, దేవకాంచనములతో, పొగడలతో- పూజించుచుండును.

విశేషములు :- ప్రాతః, సంగవ, మధ్యాహ్న, అపరాహ్ణ, ప్రదోష, నిశీథము లాఱును శివపూజా సమయములు. ఇందు మధ్యాహ్న శివపూజ వర్ణింపఁబడినది.

వ. తదనుసంభవుండు. 41

అర్థము :- తత్ = ఆ వేమారెడ్డి యొక్క, అనుసంభవుండు = తరువాతఁబుట్టినవాఁడు-తమ్ముఁడు -

ఉ॥ రాజశశాంక శేఖరుఁడు రాజకిరీటవతంస, మష్టది
గ్రాజ మనోభయంకరుఁపు రాజులదేవర రాజరాజు శ్రీ
రాజమహేంద్ర భూభువన రాజ్య రమారమణీ మనోహరుం
డాజికిరీటి కీర్తినిధి యల్లయ వీరన రేంద్రుఁ డున్నతిన్ ॥ 42

అర్థము :- కీర్తినిధి = కీర్తికి విధానమైన, అల్లయ వీరనరేంద్రుఁడు = అల్లయ కుమారుఁడైన వీరభద్రభూపాలుఁడు. ఉన్నతిన్=ఔన్నత్యమునందు, రాజ శశాంక శేఖరుఁడు-రాజులలో- చంద్రశేఖరునివంటివాఁడు. రాజపరమేశ్వరుఁడు, రాజకిరీట వతంసము-రాజ = రాజులయొక్క, కిరీట = కిరీటములయందలి వతం సము = భూషణము; లేక. రాజకిరీట = చంద్రకిరీటుఁడైన శివుఁడే. వతంసము= శిరోభూషణముగాఁ గలవాఁడు. (పరమ శివభక్తుఁడనుట). అష్టదిక్ = ఎనిమిది దిక్కులయందలి, రాజ = రాజులయొక్క, మనః = మనస్సునకు.భయంకరుఁడు = భయము గలిగించువాఁడు. రాజులదేవర = రాజులకు దేవుఁడు, రాజరాజు = రాజు లకు రాజు లేక. కుబేరునివంటివాఁడు. శ్రీ = లక్ష్మినిలయమైన. రాజమహేంద్ర= రాజమహేంద్ర మనెడి, భూభువనరాజ్యరమా = భూలోక రాజ్యలక్ష్మియే యనెడి. రమణీ = రమణికి. మనోహరుండు = మనోవల్లభుఁడు. ఆజికిరీటి-ఆజి = యుద్ధ ములయందు, కిరీటి = అర్జునునివంటివాఁడు-'సంగ్రామపార్థుఁడు'.

తాత్పర్యము :- సుగమము. ఇది నన్నయ్యగారి 'రాజకులైకభూషణుఁడు' అన్న పద్యము పోలికగా. కావలెననియే రచించిన పద్యము. వీరభద్రారెడ్డి రాజరాజు తరువాత రాజరాజంతటివాఁడని సూచించుటకు పద్యములో 'రాజరాజు' అవి యుండనే యున్నది.

మ॥ మను తుల్యుండగు కాటభూవిభుని వేమ క్ష్మాతలాధీశు నం
దనఁ బాణిగ్రహణంబు చేసెఁ బ్రియమొందన్ వీరభద్రేశ్వరుం
డని తల్లిన్ వనితామతల్లి, మదయాస్తాద్రీంద్ర సీమావసు
ఘనసామ్రాజ్య సమర్థన ప్రతిమ సాకొందిందికాదేవతన్. 43

అర్థము :- వీరభద్రేశ్వరుండు = వీరభద్రభూపాలుఁడు, మనుతుల్యుండగు= వైవస్వతాది మనువులతో సమానుఁడైన, 'కాట భూవిభుని వేమక్ష్మతలాధీశునంద నన్' కాటభూవిభుని = కాటయరెడ్డి కొడుకైన. వేమక్ష్మవలాధీశు=వేమారెడ్డియొక్క,

వేందనన్ = కుమారికను, ఉదయ = ఉదయపర్వతము, అస్తాద్రీంద్ర = అస్తమయ పర్వతము, సీమా = సరిహద్దుగా గల, అవనీ = భూమికి సంబంధించిన, ఘన= గొప్పదియైన, సామ్రాజ్య సమర్థన = సామ్రాజ్య నిర్వహణమే, ప్రతిమ = రూపమును దాల్చిన, సాక్షాత్ = ప్రత్యక్షమైన, ఇందిరాదేవతన్ = లక్ష్మీదేవి యైన, వనితామతల్లిన్ = స్త్రీరత్నమైన, అనితల్లిన్ = అనితల్లిని, ప్రియమొందన్ = ప్రియమొప్పారగా, పాణిగ్రహణంబు చేసెన్ = పెండ్లియాడెను, కరగ్రహణము చేసెను.

తాత్పర్యము :- ఆ వీరభద్ర భూపాలుడు మనుసన్నిభుడైన కాటయ వేమభూపాలుని పుత్రిక సాక్షాత్కరించిన సామ్రాజ్యలక్ష్మియే యనదగిన, 'అనితల్లి' యనెడి వనితామతల్లిని పెండ్లియాడెను.

విశేషము :- కాటయవేముని కొడుకు 'కుమారగిరిరెడ్డి' యను నతడు పోయినందువలన, కూతురైన 'అనితల్లి' యే సింహాద్రి పర్యంతమైన రాజమహేంద్ర వరము రెడ్డి సామ్రాజ్యమునకు - 'ఔరసు' రాలయ్యెను. ఆమెను పెండ్లియాడి నందువల్లనే వీరభద్రారెడ్డి రాజమహేంద్రవర రాజ్యమునకు రాజయ్యెను, అన్నవేమా రెడ్డి ఆయనకు ఏడుగడ;

తే॥గీ॥ అట్టి యనితల్లి పుణ్యగుణాభిరామ
తనకు బట్టంపు దేవిగా ధన్యలీల
వసుధయెల్ల నేకాతపవారణముగ
నేలు నల్లయ వీరభద్రేశ్వరుండు॥ 44

అన్వయము :- పుణ్యగుణాభిరామ = పుణ్యగుణములతో ప్రకాశించెడి, అట్టియని తల్లి = అటువంటి - 'అనితల్లి' తనకున్ = తనకు, పట్టంపుదేవి = పట్టమహిషి, కాన్ = కాగా - (అగుటవలన) అల్లయవీరభద్రేశ్వరుండు = అల్లయవీరభద్రుడు, వసుధయెల్లన్ = ఎల్లవసుధను, 'ఏకాతపవారణముగన్' (ఏక + ఆతప వారణము - ఏకాతపవారణము.) ఏకచ్ఛత్రముగా, ధన్యలీలన్ = అదృష్టవిలసనముతో-కృతార్థతతో, ఏలున్ = పరిపాలించుచున్నాడు.

తాత్పర్యము :- అట్టి పుణ్యగుణాభిరామయైన అనితల్లి తనకు పట్టపుదేవి యైనందు వల్లనే అల్లయవీరభద్రునకు ఎల్లవసుధను ఏకచ్ఛత్రముగానేలు ధన్యత చేకూరినది.

సీ॥ మకర కుండల దివ్యమాణిక్య దీప్తులు
చెక్కుటద్దములపై జీరువాలి
డాకాలి గండపెండారంబు డాపున
బొమ్మలై వైరి భూభుజులు వ్రేలఁ
గమియంగ నలఁదిన కస్తూరి నెత్తావి
యష్టదిక్కులయందు నవఘుళింప
మొగము చూచిన మాత్ర మూర్ధాభిషిక్తులు
మోడ్పుఁ జేతులు మస్తముల ఘటింప

తే॥గీ॥ మెఱుఁగుఁ దీఁగెలఁబోలు భామినులు గొలువ
నిండు కొలువుండుఁ గన్నుల పండువగుచు
రాయవేశ్యా భుజంగ వీరప్రతాప
విభవుఁడల్లాడ భూపతి వీరవిభుఁడు॥ 45

అరము :- 'మకర కుండల దివ్యమాణిక్యదీప్తులు' మకర = మొసలియాకారము గల, కుండల = కుండలములయందు పొదిగిన, దివ్యమాణిక్య = ప్రకాశమానములైన కెంపులయొక్క, దీప్తులు = ప్రభలు, 'చెక్కుటద్దములపైన్' (చెక్కు + అద్దము = చెక్కుటద్దములు) అద్దములవంటి చెక్కిళ్ళపైన, జీరువాలన్ = జీరాడుచుండఁగా;

'డాకాలి గండపెండారంబుడాపునన్' డాకాలి = ఎడమకాలిపై నున్న, గండపెండారంబు = బిరుదుటందియయొక్క, డాపునన్ = పార్శ్వమునందు, బొమ్మలై = ప్రతిమలై, వైరిభూభుజులు = శత్రురాజులు, వ్రేలన్ = వ్రేలాడుచుండఁగా;

కమియంగన్ = సర్వాంగీణముగా, అలఁదిన = పూసిన, కస్తూరి = కస్తూరియొక్క నెత్తావి = (నెఱ + తావి=నెత్తావి,) మేలైన పరిమళము, అష్టదిక్కులయందున్ = ఎనిమిది దిక్కులయందును, అవఘుళింపన్ = వ్యాపింపఁగా;

మొగముచూచినమాత్రన్ = మోముచూచినంతనే, మూర్ధాభిషిక్తులు = రాజన్యులు, మోడ్పుచేతులు = మొగిచిన చేతులు, మస్తములన్ = శిరస్సులయందు, ఘటింపన్ = తాల్పఁగా; మెఱుఁగుదీఁగెలఁబోఁ భామినులు = విద్యుల్లతలవంటి స్త్రీలు.

కొలువన్ = సేవింపఁగా. రాయవేళ్యా భుజంగ = 'రాయవేళ్యా భుజంగ' బిరుదు గలవాఁడు, వీరప్రతాప విభవుఁడు = వీర ప్రతాప విభవుఁడునైన, అల్లాడ భూపతి వీరవిభుఁడు = అల్లయ వీరభద్రభూపాలుఁడు, కన్నుల పండువగుచున్ = నేత్రోత్సవ మగుచు, నిండు కొలువుండున్ = నిండోలగము దీర్చును;

తాత్పర్యము :- మకరాకార కుండలములలోనపొదిగిన మాణిక్యపుప్రభలు చెక్కిళ్లపైన జీరాడుచుండఁగా, ఎడమకాలి బిరుదుటండియ ప్రక్కన, ప్రతిమలై శత్రిరాజులు వ్రాలి యుండఁగా, సర్వాంగీణముగా అలఁదిన కస్తూరి భుగభుగలు ఎనిమిది దిక్కులను అలఁకొనిఁగా. మోముచూచినంతనే మూర్ఛిష్క్తుయి పొదలలపై మోడ్పుచేతులు చేర్పఁగా, విద్యుల్లతా విగ్రహులైన స్త్రీలు ఉభయ పార్శ్వముల యందును గొలిచి యుండఁగా కన్నులపండువుగా వీరభద్రభూపాయఁడు నిండు కొలువు దీరి యుండును.

విశేషము :- శిలకంపెను శాశ్వతమైన అక్షరమునందు నాఁటి అఖండవైభవము నిత్యనూతనముగా గండఁపఁబడియున్నది. కవి ఋణము రాజు తీర్చలేఁడు.

ప్రద్ధర: జంభారాతీభశోభాచకచక నిభముల్ శాంభవీయాట్టహాసా
రంభావష్టంభ రేఖారభటిలటహముల్ రాజరాజాద్రి తేడ
స్సంభార భ్రాంతిదంబుల్ సకలభువన వీక్షాకరంభంబులయ్యున్
జృంభించుక్ వీరభద్రక్షితిరమణ యశఃశ్రీ వధూ
విభ్రమంబుల్ 46

అర్థము :- 'వీరభద్ర క్షితి రమణ యశఃశ్రీవధూవిభ్రమంబుల్' వీరభద్ర క్షితిరమణ = వీరభద్ర భూపాలునియొక్క. యశఃశ్రీ=యశోలక్ష్మియనెడు. వధూ = జవరాలియొక్క. విభ్రమంబుల్ = విలాసములు. 'జంభారాతీభగోభాచకచక నిభముల్' జంభారాతీభ = [జంభ + అరాతి + ఇభ -జంభారాతీభ] జంభాసురుని సంహరించిన యిం దుని యేనుఁగైన యైరావతముయొక్క. శోభా = శోభయందలి. చక చక నిభముల్ = చకచకలతో సమానమైనవి. (ఐరావతము తెల్లఁగా నుండునని కవిసమయము. 'చకచకలు' కాంతి - అనుకరణశబ్దము - 'ధగధగలు' 'తళతళలు' వంటిది.) "శాంభవీయాట్టహాసారంభావష్టంభ రేఖారభటిలటహముల్" శాంభవీయ = శంభునికి సంబంధించిన, అట్టహాసారంభ = తాండవావసానమందలి

76278

పెద్దనవ్వు ప్రారంభమునందలి, అవష్టంభరేఖా = గర్వరేఖతో గూడిన. ఆరభటీ= పౌ్రఢివలె, లటహాముల్ = సుందరములు, 'రాజరాజాద్రితేజస్సంభార భ్రాంతిదంబుల్' రాజరాజ = కుబేరునియొక్క. అద్రి = కొండయైన కైలాసముయొక్క, తేజస్సంభార = వెలుగుల రాశి యనెడి భ్రాంతిదంబుల్ = భ్రాంతి కలిగించునవి యును, సకల భువన వీక్షికరంభంబులయ్యున్_సకల భువన = సకల లోకముల యొక్క. వీక్ష = చూడ్కులకు, కరంభంబులయ్యున్ = పెరుగుతో గలిసిన పేల పిండి ముద్దలనై, జృంభించున్ = విజృంభించును.

తాత్పర్యము :- వీరభద్ర భూపాలుని యశోవధూవిలాసములు. ఐరావత శోభాచకచకనిభములు. శివుని పెద్దినవ్వులు. కైలాసకాంతి భ్రాంతివి గల్పించునట్టివి. సకల భువన చక్షుఃకరంభములు.

విశేషములు :- తెల్లని పదార్థములతో గీర్తిని బోల్చుట కవి సమయ ప్రసిద్ధము. ఈ చెప్పిన వానిలో ఉపమేయమగు కీర్తితోసహా, ఏయొక్క యుపమానము మన కంటికి గోచరించునది కాదు.

కం॥ వేరీ ధరణీపు లల్లయ
వీరక్ష్మాపతికి సాటి? వితరణగరిమన్
ధారాధర ధారాధర
ధారాధరవాహ దానధారా నిధికిన్ ॥ 47

అర్థము :- 'ధారాధర ....ధారానిధికిన్' ధారాధర = మేఘమునకువలె, ధారాధర = రోహణ పర్వతమునకువలె, ధారాధరవాహ జీమూతవాహనునికివలె, దానధారా = దానధారలకు నిధికిన్ = నిధానమైన, అల్లయ వీరక్ష్మాపతికిన్ = అల్లయ వీరభూపతికి, వితరణగరిమన్ = దానవైభవమునందు, సాటి = సాటియైన, ధరణీపులు = రాజులు, వేరీ = ఎచ్చట నున్నారు?

తాత్పర్యము :- మేఘమునకు వలె, రోహణపర్వతమునకు వలె, జీమూత వాహనునికి వలె, దానధారా నిధియైన, దాతృత్వ ప్రసిద్ధిగల యల్లయ వీరభద్రునికి వితరణ వైభవమునందు సాటియైన రాజు లెచ్చట నున్నారు?

సీ : గోదావరీ పాదనోదకంబుల హేమ
కలశీ శతంబుల జలకమార్చు
గయ్యార కస్తూరికా కుంకుమం బులఁ
గలపంబుఁ గూర్చి శ్రీగంధమలఁదు

సప్తగోదావర స్వర్ణపుష్కర హేమ
సౌగంధికముల నర్చనము సేయుఁ
గలధౌత పాత్రలఁ గాలాగురుచ్ఛేద
బహుళ ధూపంబులు పరిఢవించు

తే॥గీ॥ వేనవేలు నివాళులు విస్తరించు
నమృత దివ్యాన్నముల నుపహారమిచ్చు
సంఘటించు నశేషోపచారములను
బ్రమథ నాయకునకు వీరభద్రనృపతి॥ 48

అర్థము :- వీరభద్ర నృపతి = వీరభద్ర భూపాలుఁడు, ప్రమథనాయకున కున్ = ప్రమథపతియైన శివునకు. 'గోదావరీ పావనోదకంబులన్' గోదావరీ = గోదావరీనదియొక్క. పావనోదకంబులన్ = (పావన + ఉదకంబులు - పావనోద కంబులు) పావనజలములతో. 'హేమకలశతంబులన్' హేమ = స్వర్ణవికార ములైన, కలశ శతంబులన్ = శతకలశములతో, జలకమార్చున్ = జలక మాడించును - అభిషేక మాడించును: కర్పూర కస్తూరికా కుంకుమంబులన్ = పచ్చకప్పురము, కస్తూరి. కుంకుమము. అనుసుగంధద్రవ్యములతో. కలపంబుఁ గూర్చి = అనులేపనద్రవ్యమును సిద్ధపఱిచి. (అంగరాగమును-మైపూఁతను) శ్రీగం ధము = శ్రీచందనమును, అలఁదున్ = పూయును: సప్తగోదావర = 'సప్తగోదా వర' మను దక్షిరామసరస్సులో వికసించిన. స్వర్ణపుష్కర = బంగారుతామరపూ మాలతోను - కెందామరలతోను. హేమసౌగంధికములన్ = చెంగలువలతోను. అర్చనము సేయున్ = పూజచేయును: కలధౌతపాత్రలన్ = వెండిపాత్రలలో. కాలా గురుచ్ఛేద = కాలాగురుఖండములయొక్క. బహుళ = సాంద్రములైన. ధూపంబు లన్ = ధూపములను. పరిఢవించున్ = వ్యాపింపఁజేయును - ప్రసరింపఁజేయును: వేనవేలు = (వేలు + వేలు - వేనవేలు.) వేలకొలఁది, నివాళులు = నీరాజనము లను - ఆరాత్రికములను. విస్తరించున్ = విస్తరింపఁజేయును: అమృతదివ్యాన్న ములన్ = అమృతమువలె దివ్యములైన యన్నములతో, ఉపహారమిచ్చున్ = నైవే ద్యము నిచ్చును: అశేషోపచారములను = అఖిలోపచారములను, సంఘటించున్ = ఒన గూర్చును:

తాత్పర్యము:- వీరభద్రభూపతి ప్రమథపతికి ప్రతిదినము వందలకొలఁది బంగారు బిందెలలో గోదావరీ పుణ్యజలములనునింపి యభిషేక మాచించును. అభిషే కానంతరము కర్పూర కస్తూరికాకుంకుమలతో మేళగించిన శ్రీచందనాంగరాగముతో మేదించును దక్షారామ సప్తగోదావర హ్రదమునుండి తెప్పించిన కెందామరలతో, చెంగలువలతో, అర్చనముసేయును. వెండి పాత్రలయందు - కాలాగురుఖండములు వింపి ముమ్మరముగా ధూపములు ప్రరింపఁ జేయును. వేనకుషేలు నివ్వాళులెత్తును. అమృతదివ్యాన్నములు నివేదించును. సమస్తోపచారములును ఒనఁగూర్చును.

విశేషములు :- కాశీఖండమునకుఁ గృతిపతియగుట-ఈవిధమైన అఖండ శివపూజాఫలమే. అభిషేక, గంధ, కుసుమ ధూప దీప, నైవేద్యములు శివపూజాంగ ములు. అఖండ ఫలప్రదములు.

'యద్ద్వారే మత్తమాతంగాః వాయువేగా స్తురంగామాః
చంద్రబింబాననా నార్యః శివపూజాఫలంహి తత్'

చ : విలసితకీర్తిశాలి యగు వీరమహేశ్వరు గేహరంబు (శ్రీ
నిలయమునన్ ద్రిసంధ్యమును నిర్మలసౌధ సువర్ణజాలకం
బుల వెడలున్ గిరీశగళమూల హలాహల కాంతిఁ బోలి, గు
గ్గులు మహిసాక్షి వాసనలఁ గ్రొవ్విన మంగళధూప
ధూమములో. 49

అర్థము :- విలసితకీర్తిశాలియగు = విలసిల్లిన కీర్తిచే నొప్పారెడి. 'వీర మహేశ్వరు గేహరంబు శ్రీనిలయమునన్' వీర = వీరభద్రారెడ్డి యనెడి. మహే శ్వరు = మహేశ్వరునియొక్క. (మహేశ్వర ఏవ మాహేశ్వరః) గేహరంబు=నివాస గేహమునకుఁ జేరియున్న, శ్రీనిలయమునన్ = పూజామందిరమునందు. త్రిసంధ్య మును = మూఁడు సంధ్యలయందును, నిర్మలసౌధ సువర్ణజాలకంబులన్' నిర్మల = తెల్లనైన, సౌధ = మేడయొక్క. సువర్ణజాలకంబులన్ = బంగారు సోరణగండ్ల నుండి, 'గిరీశగళమూలహలాహల కాంతిఁబోలి' గిరీశ=శివునియొక్క, గళమూల= కంఠమూలమునందలి, హలాహల = హాలాహలముయొక్క, కాంతిన్ = కాంతిని, పోలి=అనుకరించి, 'గుగ్గులు.మహిసాక్షి, వాసలన్' గుగ్గుళు.మహిసాక్షి, యనుధూప ద్రవ్యములయొక్క. వాసనలన్=సౌరభములతో, క్రొవ్విన=మదించిన, మంగళధూప=

మంగళ ధూపములకు సంబంధించిన, ధూమసుల్ = పొగలు, వెడలున్ = నిర్గమించుచుండును - వెలువడుచుండును.

తాత్పర్యము ;- కీర్తినిధియును పరమమాహేశ్వరుఁడునైన వీరభద్రారెడ్డి రాజసౌధమునకుఁ జేరియున్న పూజామందిరము బంగారుసోరణగండ్లనుండి-మూఁడు సంధ్యలయందును, గగ్గు, మహినాక్షి, మున్నగు ధూపద్రవ్యముల సువాసనలతో మదించిన మంగళధూపధూమములు - శ్రీ నీలకంఠుని కంఠమూలమునందలి హలాహలకాంతివలెఁ బ్రసరించుచుండును.

ఉ॥ ఈశ్వరుఁ డింటివేల్పు, జగదేక గురుండగు ఘోడెరాయ భీ
మేశ్వరుఁ డాత్మవంశగురుఁడీఁగులు నిత్యవినోదకృత్యముల్
శాశ్వత ధర్మకీర్తులు దలంపఁగ నమ్మిన సొమ్ము, లాదిగ
ర్భేశ్వరుఁ డౌటనైజ, మెనయే నృపులల్లయ వీరశౌరికిన్ ? 50

అర్థము :- ఈశ్వరుఁడు = శివుఁడు: ఇంటివేల్పు = కులదైవము; జగదేక గురండగు = (జగత్ = ఏకగురుండు-జగదేక గురుండగు.) లోకైకగురుఁడైన, ఘోడెరాయ భీమేశ్వరుఁడు = ఘోడెరాయలను బిరుదుగల భీమేశ్వరస్వామి, ఆత్మవంశగురుఁడు = కులగురుఁడు; ఈఁగులు = దానములు, 'నిత్యవినోదకృత్యముల్' నిత్య = దైనందినములైన, వినోదకృత్యముల్ = వినోదవ్యాపారములు; 'శాశ్వతధర్మకీర్తులు' శాశ్వత = చెడనివియైన, ధర్మ = ధర్మము: కీర్తులు = కీర్తులు, తలంపఁగన్ = విచారింపఁగా, నమ్మినసొమ్ములు = విశ్వసించినధనములు: ఆదిగర్భేశ్వరుఁడౌట = ఆగర్భ శ్రీమంతుఁడగుట. నైజము = స్వభావసిద్ధము: నృపులు = ఇతరరాజులు, అల్లయవీరశౌరికిన్ = అల్లయవీరభద్ర భూపాలనకు, ఎనయే = సాటియా ?

తాత్పర్యము :- శివు డు కులదైవము; జగదేకగురుఁడైన ఘోడెరాయభీమేశ్వరుఁడు కులగురువు; వితరణములు దైనందిన వినోదకృత్యములు: చెడనిధర్మము, చెడనికీర్తి, అను రెండును నమ్మినధనములు; ఆగర్భ శ్రీమంతుఁడగుట, స్వతసిద్ధము: ఇతరరాజులు - అల్లయ వీరభద్రునకు సాటియా?

త్రెంచు నెవ్వని హేతి దృప్తారి నరవర
గ్రైవేయ పరిల సత్కంధరముల
ముంచు నెవ్వని కీర్తి ముగ్ధేందుధరకంఠ
కాకోల విషమషీ కాళిమంబుఁ

బెంచు నెవ్వని బుద్ధి పంచాస్త్ర పరిపంథి
పాదపాథోజ తాత్పర్య చర్య
మించు నెవ్వని మూర్తి మీనచిహ్నజయంత
నల నలకూబరాదుల జయించి

తే॥గీ॥ యతఁడు పొగడొందు రాయవేశ్యాభుజంగుఁ
డవధి మహిధర చరమ గాఢాంధకార
ధట్ట ఘట్టఁలటహ ప్రతాప తపనుఁ
డల్ల నరనాథు దొడ్డ భూవల్లభుండు ॥ 51

అర్థము :- ఎవ్వనిహేతి = ఎవ్వని ఖడ్గము. 'దృప్తారి.....కంధరములు' దృప్త = దర్పించిన. అరినరవర = శత్రురాజుల యొక్క. గ్రైవేయ = కంఠహార ములతో. పరిలసత్ = ప్రకాశించుచున్న. కంధరములన్ = కంఠములను. త్రెంచున్ = త్రెంచునో. ఎవ్వని కీర్తి = ఎవ్వని యశస్సు. 'ముగ్ధేందుధర .... కాళిమంబున్' ముగ్ధేందుధర = బాలచంద్రుని ధరించిన శివునియొక్క. కంఠ = కంఠమునందలి. కాకోలవిష = కాలకూట విషమునకు సంబంధించిన. కాళిమం బున్ = నల్లఁదనమును. ముంచున్ = ముంచునో, ఎవ్వని బుద్ధి = ఎవ్వని బుద్ధి. 'పంచాస్త్ర.....చర్య' పంచాస్త్ర = ఐదు బాణములు గల మన్మథునకు. పరిపంథి= శత్రువైన శివునియొక్క. పాద = పాదములే యనెడి. పాథోజ = అంబుజముల యందలి. తాత్పర్య = తత్పర భావములోగూడిన. చర్యన్ = వర్తనమును. పెంచున్ = పెంచునో. ఎవ్వని మూర్తి = ఎవ్వని యాకృతి. 'మీన ....నలకూబ రాదులన్' మీనచిహ్న = మీనకేతనుఁడైన మన్మథుని. జయంత = జయంతుని. నల = నలమహారాజును. నలకూబరాదులన్ = నలకూబరుఁడు మొదలైనవారిని. జయించి = గెలిచి. మించున్ = మించునో, అతఁడు = అట్టివాఁడైన. రాయ వేశ్యాభుజంగుఁడు = 'రాయవేశ్యాభుజంగు' డను బిరుదు గలట్టియు. 'అవధి....

తపనుఁడు' అవధి మహీధర = చక్రవాళ పర్వతముయొక్క, చరమ = చరమ భాగమునందలి. గాఢ = దట్టమైన, అంధకారధట్ట = చీఁకట్ల గుంపును, ఘట్టన = భేదించుటయందు, లటహ = సుందరమైన. ప్రతాప = ప్రతాపమే యనెడి, తప నుఁడు = సూర్యుఁడు గల, అల్లనరనాథు = అల్లాడరెడ్డి కొడుకైన. దొడ్డ భూవల్లభుండు = దొడ్డారెడ్డి, పొగడొందును = పొగడ్త కెక్కును. (పొగడు + ఒందును).

తాత్పర్యము :- ఎవ్వని ఖడ్గము కంఠహారములతో సహ సమద శత్రు వృపకఁఠనాళములను ద్రెంచునో. ఎవ్వని కీర్తి తరుణ శశిమౌళి కంఠమూలము నందలి కాకోల విషముయొక్క మచ్చను ముంచునో. ఎవ్వని బుద్ధి మదనాంతకుని పాదపద్మములయందలి తత్పరభావముతోఁ గూడిన ప్రవర్తనను బెంచుచో. ఎవ్వని యాకృతి కంతు. జయంత. నల, నలకూబరాదులను జయించి మించునో. అట్టి యవధి మహీధర చరమాంధకారధట్ట ఘట్టన లటహ ప్రతాప తపనుఁడును రాయ వేశ్యాభుజంగుఁడు నైన అల్లయ దొడ్డారెడ్డి పొగడ్త కెక్కును.

శా॥ జొరా! యల్లయరెడ్డి దొడ్డి వసుధాధ్యక్షుండు ధాటీచమూ
భేరీభాంకృతి ఘోరఘోషమున నిర్భేదించె నొడ్డాది శృం
గారం కోటయు లోతుగడ్డయును నుద్ఘాటించె నత్యుద్ధతిన్
కీరాంభోధి తటంబునన్ నిలిపె దిక్సీమా జయస్తంభముల్॥52

అర్థము :- 'అల్లయ....అధ్యక్షుండు' అల్లయరెడ్డి = అల్లయరెడ్డి కుమారుఁ డైన, దొడ్డ = దొడ్డారెడ్డి యనెడి, వసుధాధ్యక్షుండు = (వసుధా + అధ్యక్షుండు) భూపాలుఁడు. 'ధాటీ.... ఘోషమునన్' ధాటీ = దండయాత్రల యందలి. చమూ = సేనలకు సంబంధించిన, భేరీ = భేరులయొక్క-(దుందుభులయొక్క). భాంకృతి= 'భాం'కారములకు సంబంధించిన. ఘోర = భయంకరమైన. ఘోషమునన్ = హోరుచేతనే. ఒడ్డాదిన్ = ఒడ్డాదిని, నిర్భేదించెన్ = బ్రద్దలు చేసెను, శృంగారం కోటయున్ = శృంగవరపుకోటయును, లోతుగడ్డయున్ = లోతుగడ్డయును. ఉద్ఘా టించెన్ = ప్రక్కలు చేసెను. అత్యుద్ధతిన్ (అతి + ఉద్ధతిన్) = అధికమైన గర్వముతో, కీరాంభోధి (కీర + అంభోధి) = చిలుక సముద్రముయొక్క, తటంబు నన్ = ఒడ్డునందు, దిక్సీమా (దిక్ + సీమా) = దిక్కుల సరిహద్దుల యందలి,

జయ స్తంభముల్ = జయచిహ్నములైన స్తంభములను. నిలిపెన్ = నాటెను.
పొరా ! = ఆశ్చర్యము.

తాత్పర్యము :- అల్లాడరెడ్డి మూడవ కుమారు డైన దొడ్డారెడ్డి ప్రతాప మీ పద్యమునందు వర్ణింప బడుచున్నది. దండయాత్రలయందు సేనలలో ముందు నడచుచున్న భేరీ ఢాంకారముల హోరుచేతనే యీ దొడ్డారెడ్డి 'ఒడ్డాదిని' భేదించెను. 'శృంగవరపు' కోట యును, 'లోతుగడ్డ'యును ప్రక్కలు చేసెను. సమధికమైన జయగర్వముతో 'చిలుక సముద్రము' యొక్క యొడ్డునందు జయస్తంభములను నాటించెను. ఎంత ఆశ్చర్యము !

మ॥ హరి దాఁటించెఁ బురోపకంఠమున వాహ్యాళి ప్రదేశంబునం
దర శే! యల్లయరెడ్డి నందనుఁడు దొడ్డయ్య క్షమాధీశ్వరుం
డిరువైనాలుగు మూళ్ళ మేరనని గోసెక్కింపఁగానేల ? య
ద్ధరణీనాథుని కీర్తి దాఁటెఁ. గడు నుద్దండించి బ్రహ్మాండముల ॥౬౫॥

అర్థము :- అల్లయరెడ్డి నందనుఁడు = అల్లాడరెడ్డి కొడుకైన, దొడ్డయ్య క్షమాధీశ్వరుండు = దొడ్డారెడ్డి ప్రభువు. పురోపకంఠమునన్ (పుర + ఉపకంఠము నన్) = పుర సమీపమునందలి, వాహ్యాళి ప్రదేశంబునన్ = స్వారీచేయు స్థలము నందు హరిన్ = గుఱ్ఱమును, ఇరువైనాలుగు మూళ్ళ మేరన్ = ఇరువదినాలుగు మూరల ప్రమాణము గల హద్దునకు, దాఁటించెన్ = దూఁకునట్లు చేసెను, అని = పలికి, గోసు = అపయశస్సును, ఎక్కింపఁగాన్ = అలోపింపఁగా, ఏల ? = ఎందులకు, అద్ధరణీనాథుని కీర్తి (ఆ + ధరణీనాథుఁడు) = ఆ రాజుయొక్క కీర్తి, కడున్ = మిక్కిలియును, ఉద్దండించి = పొడవుగా, ఎగిసి, బ్రహ్మాండముల్ = బ్రహ్మాండములను, దాఁటెన్ = లంఘించెను.

తాత్పర్యము :- పుర సమీపమునందలి 'స్వారీ' చేయు ప్రదేశములో అల్లయ దొడ్డారెడ్డి తన గుఱ్ఱమును ఇరువదినాలుగుమూరల మూరము దాఁటించెనని ఆనాటి జనులు అది యొక విశేషముగా జెప్పికొనుచుండిరి. నిజమునకు అది అప కీర్తిగాని కీర్తికాదు. ఏలయన - ఆరాజుకీర్తి మిక్కిలి పొడవైన బ్రహ్మాండములను అంతకుమునుపే దాఁటి యున్నది.

విశేషము :- అతనికీర్తి బ్రహ్మాండములనే దాటియుండగా - అతని గుఱ్ఱము, ఒక ఇరువదినాలుగు మూరలదూరమును దాటెనని ఆదియొక ప్రశంసగా జెప్పుకొనుట అపకీర్తియేకాని కీర్తికాదు. సముద్రమునే దాటిన ఆంజనేయుని ఒక మడుగు దాటెనని ప్రశంసింప బూనుట యెట్టివంటిదో ఇదియును అట్టివంటిదే యనుట;

మ. సరివేరీ? జలరాశివేష్టిత మహీచక్రంబునన్ విక్రమా
పరగాండీవికిఁ జక్రవాళమహీభృత్పర్యంత విశ్వంభరో
ద్ధరణప్రౌఢ భుజాభుజంగమునకున్ ధాత్రీశు; లల్లాడ భూ
వరు నన్నయ్య, కకుంఠ వాఙ్మయకళా వైకుంఠరాట్మయ్యకున్ ॥ 54

అర్థము :- 'విక్రమాపరగాండీవికిన్' విక్రమ = పరాక్రమమునందు, అపర = వేఱొక, గాండీవికిన్ = అర్జునునకు, 'చక్రనాళ.... ....భుజంగమునకున్' చక్రవాళ = "లోకాలోక" మనెడి, మహీభృత్ = కొండయొక్క, పర్యంత = ప్రాంతమువఱకుఁగల, విశ్వంభరా = భూమియొక్క, ఉద్ధరణ = మోయుటయందు, ప్రౌఢ = సమర్థమైన, భుజా = బాహువేయనెడి, భుజంగమునకున్ = సర్పము (శేషుఁడు) గలట్టియు, అకుంఠ .... శయ్యకున్ అకుంఠ = మొక్కఁబోని, వాఙ్మయ = వాఙ్మయముయొక్క--భాషాప్రపంచముయొక్క, కళా = విద్యయందు, వైకుంఠరాట్ = వైకుంఠప్రభువైన శ్రీ మహావిష్ణువుయొక్క, శయ్యకున్ - పాను వైన శేషునకు, అల్లాడ .... అన్నయ్యకున్' అల్లాడభూవరు = అల్లాడరెడ్డి కుమారుఁడైన, అన్నయ్యకున్ =అన్నయరెడ్డికి, 'జలరాశి....చక్రంబునన్, జలరాశి = సముద్రములచేత, వేష్టిత =చుట్టఁబడిన, మహీచక్రంబునన్ = భూవలయమునందు, పరి = సాటియైన, ధాత్రీశులు = రాజులు, వేరీ? = ఎక్కడనున్నారు?

తాత్పర్యము :- పరాక్రమమునందు అపరగాండీవియును, చక్రవాక పర్వత పర్యంతమైన భూమీభరమును మోయుటయందు సమర్థమైన శేషునివంటి బాహువు గలవాఁడును, భాషాపాండిత్యమునందు వైకుంఠనాథశయ్యయైన (శేషుఁడు) అన్నయ్యకు సాటియైన రాజులు-ఈసముద్రవేష్టితమైన భూవలయమునందు ఎచ్చటనున్నారు?

సీ॥ జిష్ణువైభవరేఖఁ జెలువొందుటయకాక
పావక విస్ఫూర్తిఁ బరగు నెట్లు
ధర్మరాజ విభూతి దర్పించుటయకాక
పుణ్యజనోపాఖ్యఁ బూను నెట్లు
మహినిఁ ప్రాచేతస మహిమఁ దాల్చుటెకాక
తగ జగత్ప్రాణాఖ్యఁ దాల్చునెట్లు
ధనదత్వ విఖ్యాతి ఘనతనొందుటె కాక
శంకర సుషమచే జరగునెట్లు

తే॥ తెలిసె దిక్పాలకాంశావతీర్ణుఁ డగుట
భోగమున, శుద్ధి, నూనృతమున, జయమున,
నాజ్ఞ, బలమున, ధనమున, నధిక కరుణ,
నల్లభూపాలనందనుఁ డన్నవిభుఁడు ॥ 55

అర్థము :- 'అల్ల ....అన్నవిభుఁడు' అల్లభూపాల = అల్లాడరెడ్డి యొక్క. నందనుఁడు = కుమారుఁడైన, అన్నవిభుఁడు = అన్నయ భూపాలుఁడు, 'జిష్ణు.... రేఖన్' జిష్ణు = జయశీలమైన (ఇంద్రునియొక్క). వైభవరేఖన్ = వైభవ లక్షణ ముతో. చెలువొందుటయెకాక (చెలువు + ఒందుట) = ప్రకాశించుటయేకాక, 'పావక విస్ఫూర్తిన్' పావక = పవిత్రీకరించునట్టి (అగ్నియొక్క). విస్ఫూర్తిన్ = విశేష స్ఫురణతో. పరగుట = ప్రవర్తించుట. ఎట్లు = ఎట్లు పొసఁగును ? 'ధర్మరాజ విభూతిన్' ధర్మరాజ = ధర్మప్రభు వనెడి (యమధర్మరాజుయొక్క). విభూతిన్ = ఐశ్వర్యముతో. దర్పించుటయెకాక = అతిశయించుటయేకాక, 'పుణ్యజనోపాఖ్యన్' పుణ్యజన = సజ్జనుఁ డనెడి (నిర్ఋతి యనెడి), ఉపాఖ్యన్ = ఉపనామమును, పూనుట = వహించుట. ఎట్లు = ఎట్లు పొసఁగును ? మహినిన్ = భూమియందు. 'ప్రాచేతసమహిమన్' ప్రాచేతస = ప్రశస్తమైన చేతస్సుకలవాఁ డనెడి (వరుణుని యొక్క). మహిమన్ = గొప్పదనమును, తాల్చుటెకాక = ధరించుటయేకాక, తగన్ = సముచితమగునట్లుగా, 'జగత్ప్రాణాఖ్యన్' జగత్ప్రాణ = జగత్తునకు ప్రాణమువంటివాఁ డనెడి (వాయువు). ఆఖ్యన్ = పేరును, తాల్చుట = ధరించుట. ఎట్లు = ఎట్లు పొసఁగును ? 'ధనదత్వవిఖ్యాతిన్' ధనదత్వ = ధనమునిచ్చువాఁ డనెడి

(కుబేరుఁడు). విఖ్యాతిన్ = విశేష ఖ్యాతితో. ఘనతన్ = గొప్పతనమును, ఒందుచె కాక = పొందుటయేకాక. 'శంకరసుఖమచే' శంకర = సుఖకరమైన (ఈశానుఁడు). సుషమచేన్ = పరమశోభచేత, జరగుట = వర్తించుట. ఎట్లు = ఎట్లు పొసఁగును? తెలిసెన్ = కారణము తెలిసినది. భోగమునన్ = భోగలక్షణమునందు. (ఇంద్రుఁడని). శుద్ధిన్ = పావనత్వలక్షణమునందు (అగ్ని యని). సూనృతమునన్ = సత్య ప్రియ వాక్యలక్షణమునందు-ధర్మమునందు (యముఁడని). జయమునన్ = జయ లక్షణమునందు (నిర్ఋతి యని). ఆజ్ఞన్ = ఆజ్ఞాసిద్ధి లక్షణమునందు (వరుణుఁడని), బలమునన్ = బలమునందు (మహాబలుఁడు-వాయువని). ధనమునన్ = ధన సమృద్ధియందు (కుబేరుఁడని). అధిక కరుణన్ = అధికమైన కారుణ్యలక్షణము నందు (శివుఁడని), 'దిక్పాలక....అవతీర్ణుఁడగుట' దిక్పాలక = అష్టదిక్పాలకుల యొక్క. అంశ = అంశలతో. అవతీర్ణుఁడగుట = అవతరించెనన్న వాస్తవము:

తాత్పర్యము :- అల్లయ అన్నభూపాలనియందు అభివ్యక్తములగుచున్న భోగ, పావనత్వ, సూనృత, జయ, ఆజ్ఞా, బల, ధన, కారుణ్యము లనెడి లక్షణములచేత- వరుసగా- అతఁడు- ఇంద్ర, అగ్ని, యమ, నిర్ఋతి, వరుణ, వాయు, కుబేర, ఈశాను లనెడి అష్టదిక్పాలకుల అంశములతో అవతరించినాఁడనెడి వస్తుస్థితి తెలియుచున్నది.

విశేషము :- రాజులో దిక్పాలకుల అంశలన్నియు నుండుననుటకు ప్రమాణము- 'అష్టాభిశ్చసురేంద్రాణాం మాత్రాభిర్నిర్మితోనృపః' అని మనుధర్మశాస్త్రము.

ఉ॥ వల్లకి చక్కి కాహళము వంశము ఢక్కి హుడుక్కి ఝుర్ఝురుల్
ఝుల్లరి యాదిగాఁ గలుగు శబ్దపరంపర తాళబద్ధమై
యుల్లసిత ప్రబంధముల కొప్పగ నాడుదు రగ్రవేదిపైఁ
బల్లవపాణు లీశ్వరునిఁ బంటమహీశులు పూజసేయఁగన్ ॥ 56

అర్థము :- పంట మహీశులు = పంటవంశ ప్రభువులు, ఈశ్వరునిన్ = శివుని, పూజసేయఁగన్ = అర్చించుచుండఁగా, అగ్రవేదిపైన్ = ముందరనున్న రంగస్థలముమీఁద, పల్లవపాణులు = చిగురుటాకులవంటి చేతులు గల దేవదాసికలు, వల్లకి = వీణయును, చక్కి = చక్కి యను వాద్యము, కాహళము = సొన్నాయియు, వంశము = పిల్లనగ్రోవియు, ఢక్కి = ఢక్కియును, హుడుక్కి =

హుడుక్క- యను వాద్యవిశేషమును, ఝుర్ఝురుల్ = ఝుర్ఝురు లను వాద్యములును, ఝుల్లరి = ఝుల్లరి యను వాద్యమును, ఆదిగా గలగు = మొదలైన, శబ్దపరంపర = వాద్యశబ్దముల వరుస, తాళబద్ధమై = తాళమునకు లోబడి, ఉల్లసిత = ప్రకాశితము లైన, ప్రబంధములకున్ = గేయ ప్రబంధములకు, ఒప్పుగన్ = తగునట్లుగా, ఆడుదురు = నృత్తము చేయుదురు.

తాత్పర్యము :- పంటవంశ సంజాతులైన ఆ రెడ్డిప్రభువుల శివార్చనా కాలములయందు సౌకుమార్య నిధులైన దేవదాసికలు- ముందరి వేదికపై నిలిచి- వల్లకి, చక్కి, కాహళము, వంశము, ధక్క, హుడుక్క, ఝుర్జరి, ఝుల్లరి- మొదలైన వాద్య ధ్వనులు తాళబద్ధములై ప్రవర్తిల్లగా- అట్టి తాళమునకు సరియైన పాదన్యాసములతో, గేయప్రబంధములకు అనురూపముగా నృత్తము చేయుచుందురు.

విశేషము :- తాళ లయాన్వితము నృత్తము. పదార్థాభినయము నృత్యము. అవస్థానుకరణము నాట్యము. ఈ పద్యములో 'తాళబద్ధమై' యనుటచేత నృత్తము. 'ప్రబంధముల కొప్పుగ నాడుదురు' అనుటచేత- పదార్థాభినయరూపమైన నృత్యము. అవస్థానుకృతి రూపమైన నాట్యమును గూడ గ్రహింపనగును.

శా॥ మార్కండేయ మహేశ్వరుం డఖిలసామ్రాజ్యంబుఁ బాలింపఁగా
నర్కేందుల్ గల యంతకాలము తదీయాంఘ్రి ద్వయీభక్తి సం
పర్కోదంచిత భాగ్యసంపదల నాయ్మోమండలీ వల్లభుల్
కోర్కుల్ నిండఁగ సేవకత్వమునఁ గైకొండ్రాయు వైశ్వర్యముల్॥

అర్థము :- అఖిల = అశేషమైన, సామ్రాజ్యంబున్ = సామ్రాజ్యమును మార్కండేయ = మార్కండేయేశ్వరుఁడను, మహేశ్వరుండు=శివుఁడు, పాలింపఁగాన్ = కాపాడుచుండఁగా, 'తదీయ.....సంపదలన్' తదీయ = ఆమార్కండేశ్వరస్వామియొక్క, అంఘ్రిద్వయీ = అడుగుగవయందలి - పాదద్వంద్వమునందలి, భక్తిసంపర్క = భక్తిసంస్పర్శచేత, ఉదంచిత = (ఉత్ + అంచిత) మిక్కిలి ప్రకాశించుచున్న, కోర్కుల్ మనోరథములు, నిండఁగన్ = పరిపూర్ణములు కాగా, సేవకత్వమునన్ = సేవకులమను భావముతో, ఆయ్మోమండలీ వల్లభుల్ = ఆపంట రెడ్డి ప్రభువులు, అర్కేందుల్ గలయంతకాలము = సూర్యచంద్రు లున్నంత కాలము, ఆయుర్ఐశ్వర్యముల్ = (ఆయుః +ఐశ్వర్యములు) ఆయుర్దాయమును, ఐశ్వర్యమును, కైకొండ్రు = పొందుచుండుదురు

తాత్పర్యము :- అశేషమైన సామ్రాజ్యమును మార్కండేయ శివుడు పరిపాలించుచుండగా-ఆస్వామియొక్క పాదద్వంద్వమునందలి భక్తిసంస్పర్శచేత పెంపొందుచున్న భాగ్యసంపదలతో, మనోరథములు పరిపూర్ణములగుచుండగా, సేవకులమనుభావముతో ఆ ప్రభువులు సూర్యచంద్రులున్నంతకాలము ఆయురైశ్వర్యాభివృద్ధినొందుదురు.

విశేషము:- శివపాదభక్తి సుస్థిరముగా నున్నంతకాలము ఆయురైశ్వర్యములకు ఎటి కొఅంతయునుండదు.

సీ॥ ఉండు నేవీట మార్కండేయ మునినాథు
సజ్జలింగ మనంగ శాసనుండు
ప్రవహించు నేవీటి పశ్చిమ ప్రాకార
మొరసి గంగమ్మ సాగరముకొమ్మ
యావిర్భవించినాఁ డేవీటి కోటలో
బలభేది మదన గోపాలమూర్తి
పాలించు నేవీటి ప్రాగుదక్కోణంబు
నుమబోఁటి శ్రీముల్లగూరిశక్తి

తే॥గీ॥ ప్రబలధారా సురత్రాణ, భద్రజాతి
కరిఘటా, సైన్యదుస్సాధ కనకలోహ
గోపుర ద్వాఃకవాట ప్రదీపిత మది
సాంద్రవిభవంబు రాజమహేంద్రపుర ము॥ 58

అర్థము :- ఏవీటన్ = ఏనగరమునందు, 'మార్కండేయ.....లింగము' మార్కండేయ = మృకండముని నందనుఁడైన, మునినాథ = మునీశ్వరునియొక్క (మార్కండేయుని యొక్క) సజ్జ = పూజకు ఆయితమైన, లింగము = లింగముగా, అనంగశాసనుండు = మదనాంతకుఁడైన శివుడు, ఉండున్ = ఉండునో, 'ఏవీటి.... ప్రాకారమున్' ఏవీటి - ఏనగరముయొక్క, పశ్చిమ = పడమటిదిక్కునందలి, ప్రాకారమున్ = కోటగోడను, ఒరసి = రాచికొని, సాగరముకొమ్మ = సముద్ర పత్నియైన, గంగమ్మ = గౌతమీగంగ, ప్రవహించున్ = ప్రవహించుచుండునో,

ఏ వీటి కోటలో = ఏ నగరముయొక్క కోటలో. బలభేది = బలాసురుని భేదించిన ('బలభేది' శబ్దము ఇంద్ర పర్యాయము. ఇచ్చట ఉపేంద్రపర్యాయమగుట చింత్యము.) మదనగోపాలమూర్తి=మదనగోపాలుఁడను మూర్తిభేదముగల విష్ణువు. ఆవిర్భవించినాఁడు = వెలసెనో. 'ఏ వీటి....కోణంబున్ ఎ వీటి = ఏ నగరము యొక్క. ప్రాగుదక్ = (ప్రాక్ + ఉదక్) తూర్పునకు-ఉత్తరమునకుమధ్యగల, కోణంబున్ = విదిక్కును - (ఈశాన్యమును) ఉమఁబోటి = ఉమాస్వరూపయైన. శ్రీముల్లగూరిశక్తి = ముల్లగూరిశక్తి -(సోమాలమ్మ?) పాలించున్ = పరిపాలించు చుండునో. అది = ఆ నగరము. 'సాంద్రవిభవంబు'-సాంద్ర = నిబిడమైన, విభవంబు = వైభవము కలదియు, 'ప్రబల.....దీసితము ప్రబల = ప్రకృష్టబలము గల, ధారా = అశ్వగతివిశేషములుగల, ధౌరితిక, ఆస్కందిత, రేచిత, వల్గిత, ప్లుతములు - అశ్వగతివిశేషములు. సురత్రాణ = యవనాశ్వములచేతను, భద్రజాతి= భద్రజాతిగల, కరిఘటా = గజబృందములచేతను, సైన్య = సైన్యములచేతను, దుస్సాధ = సాధించుటకు నలవికాని, కనక = కనక మయములు లోహ = లోహ మయములునైన, గోపురముల యొక్క. ద్వార = ద్వారములకు సంబంధించిన కవాట = బోరుతలుపులచేతను. ప్రదీపితము = ప్రకాశింపఁజేయ బడిన, రాజ మహేంద్రపురము = రాజమహేంద్రమను పత్తనము.

తాత్పర్యము :- కాశిఖండ ప్రసక్తులైన రెడ్డిప్రభువుల రాజధానియైన రాజ మహేంద్రపురముయొక్క ప్రశస్తిని వర్ణించుచున్నాఁడు. ఆ ప్రశస్తియిట్టిది-

1) మార్కండేయ మునినాథుఁడు అర్చన చేసిన శివలింగము ఆనగరములో నెలకొనియుండును.

2) ఆనగరము యొక్క పడమటికోటగోడను ఒరసికొని ఉత్తరమునుండి దక్షిణమువైపుగా సాగరపత్నియైన గౌతమీ గంగ ప్రవహించుచుండును,

3) ఆ వీటి కోటలో బలభేదియైన శ్రీమహావిష్ణువు మదన గోపాలమూర్తియై వెలసియున్నాడు.

4) ఆ నగరముయొక్క ఈశాన విదిక్ కోణమును ఉమాప్రతిరూపయైన శ్రీ ముల్లగూరిశక్తి పరిపాలించుచుండును;

వివిధగతివిశేషములు గల యవనాశ్వములతోను, భద్రజాతి గజఘటల తోను, పదాతిసైన్యములతోను, కనకలోహమయములైన గోపురద్వార కవాటముల

తోను. ఆనగరము శత్రువులకు సాధింపరానిదియై యుండును. ఆ రాజమహేంద్ర పురము అత్యంత వైభవము కలది.

విశేషము :- రాజమహేంద్రపురము అద్దములో ప్రతిబింబించిన కాశీనగరమువలెనే యుండును. అద్దములోని నీడ కుడియెడమగా నుండును. గంగబింబము, గోదావరి ప్రతిబింబము. కాశీపార్శ్వమున దక్షిణమునుండి గంగ ఉత్తరమువైపుగా ప్రవహించుచు నగరమునకు తూర్పువైపున నుండును.

రాజమహేంద్రము పక్కన ఉత్తరమునుండి గోదావరి దక్షిణమువైపుగా నగరమునకు పడమటి వైపునఁ బ్రవహించుచుండును.

అచ్చట విశ్వేశ్వర శివలింగము, ఇచ్చట మార్కండేయేశ్వర శివలింగము. అచ్చట బిందుమాధవస్వామి - ఆదికేశవుఁడు, ఇచ్చట మదన గోపాలమూర్తి-నేటి వేణుగోపాలస్వామి, అచ్చట వికట దుర్గామహాదేవి. ఇచ్చట శ్రీ ముల్లగూరిశక్తి, (సోమాలమ్మ?) ఈ రెండును నదీతీరముల యందు పొడవుగా వ్యాపించిన ప్రాచీన నగరములు. తెనుఁగు కాశీఖండరచన రాజమహేంద్రవరములోనే జరగుటయు, కృతిపతులు రాజమహేంద్రవరము నేలిన రెడ్డిప్రభువులు శివభక్తులగుటయు, ఈ రెండు ప్రాచీన నగరములకుఁ గల బింబప్రతిబింబ భావమును మఱింత విస్పష్టము చేయుచున్నవి.

మ॥ కలపుంసోకిల కంఠకోమల కుహూకారస్ఫుర త్పంచమ
స్ఖలదధ్వన్యములైన కాలముల మార్కండేయ నాథేశ్వరున్
లలితోరస్కుఁడు వీరభూపతి వసంతంబార్చు నవ్వీటి వి
థులఁ గర్పూరహిమాంబు సంకుమద కస్తూరీపటీరంబులన్ ॥ 59

అర్థము :- 'లలితోరస్కుఁడు' (లలిత + ఉరస్కుఁడు) లలిత = సుందరమైన, ఉరస్కుఁడు = ఉరస్స్థలము - (వక్షస్థలము) కల, వీరభూపతి = వీరభద్ర భూపాలుఁడు, మార్కండేయనాథేశ్వరున్ - మార్కండేయనాథ = మార్కండేయనాథుఁడనెడి, ఈశ్వరున్ = శివుని, 'కలపుంసోకిల....కాలములన్' కల = అవ్యక్తమధురములైన, పుంసోకిల = గండుకోయిలలయొక్క, కుహూకార = 'కుహూ' అను ధ్వనులయందు, స్ఫురత్ = అభివ్యక్తమగుచున్న, పంచమ = పంచమ ప్రతిచేత, స్ఖలత్ = తొట్రుపడుచున్న, అధ్వన్యములైన = పాంథులు

(విరహిజనము) గల. కాలములన్ = కాలములయందు-వసంతకాలములయందు. 'అవ్వీటి వీథులన్' అవ్వీటి = ఆ రాజమహేంద్రపురముయొక్క. వీథులన్ = వీధుల యందు, 'కర్పూర ....పటీరంబులన్' కర్పూర = పచ్చకప్పురము. హిమాంబు = పన్నీరు. సంకుమద = పునుఁగు. కస్తూరీ = మృగమదము, పటీరంబులన్ = చందనములతో-ఈ సుగంధ ద్రవ్యములు కలిపిన జలములతో, వసంతంబార్చున్ = వసంతము లాడించును.

తాత్పర్యము :- పుంస్కోకిలల 'కుహూ'కారములలో స్ఫురించుచున్న పంచమ శ్రుతిచేత విరహిజనులు కలగుండు పడెడి కాలములలో (వసంతకాలము లలో) వీరభద్రభూపాలుఁడు రాజమహేంద్ర వీథులలో- కర్పూరము. పన్నీరు. పునుఁగు. కస్తూరి, మంచిగంధము మేళగించిన జలములతో మార్కండేయేశ్వరుని వసంతము లాడించుచుండును.

విశేషము :- మదనాంతకుని కోకిలధ్వని బధిరితములైన వేళలో వసంతము లాడించుట యనునది. రెడ్డిరాజులు వసంతోత్సవములను దేవోత్సవములుగా నిర్వ హించు నాచారము కలవారనుటకు- ఆ స్వామియొక్క భక్తసులభత్వమునకు తార్కాణలు. ఈ వసంతోత్సవములవల్లనే కొండవీటి ప్రభువైన కుమారగిరిరెడ్డికి 'కర్పూరపసంతరాయ' లను బిరుదము వచ్చినది. కాటయ వేమారెడ్డి సంబంధము వలన రాజమహేంద్రవరము రెడ్డిప్రభువులకు ఆ యాచారముతోపాటు- ఆ బిరుదము కూడ దఖలు పడినది.

ఉ॥ ప్రాకట విక్రమస్ఫురణ రాజమహేంద్రము రాజధానిగా
నేక సితాతపత్రముగ నేలెను వీరనృపాలుఁ డుత్తమ
శ్లోకుఁడు వేమశౌరి యనుజుండు సమున్నతవైభవాఢ్యుఁడై
చీకటియున్ గళింగమును జిల్క-సముద్రము సింహశైలమున్॥ 60

అర్థము :- 'ఉత్తమ శ్లోకుఁడు' ఉత్తమ = శ్రేష్ఠమైన, శ్లోకుఁడు = యశస్సు కలవాఁడును, 'వేమశౌరి యనుజుండు' వేమశౌరి = వేమారెడ్డియొక్క, అనుజుండు = తమ్ముఁడును అయిన. వీరనృపాలుఁడు = వీరభద్ర భూపాలుఁడు. 'సమున్నత వైభవాఢ్యుఁడై' సమున్నత = మిక్కిలియు నున్నతమైన. వైభవ=వైభవముతో, ఆఢ్యుఁడై = సంపన్నుఁడై, 'ప్రాకట.... స్ఫురణన్' ప్రాకట = ప్రసిద్ధమైన,

విక్రమ = పరాక్రమముయొక్క, స్ఫురణన్ = అభివ్యక్తితో, రాజమహేంద్రము= రాజమహేంద్రవరము, రాజధానిగా = రాజధానిగా, చీఁకటియున్ = 'చీఁకటి' అను స్థలమును, కళింగమును = కళింగదేశమును, చిల్కసముద్రము = 'చిలుక సముద్ర ము'ను, సింహాచలమున్ = 'సింహాచలము'ను, ఏకసితాతపత్త్రముగన్' ఏక = ఒక్కటియే యైన, సిత = తెల్లని, ఆతపత్త్రముగన్ = గొడుగు కలుగునట్లుగా (ఏకచ్ఛత్త్రాధిపత్యముగా), ఏలెన్ = పరిపాలించెను.

తాత్పర్యము :- వేమారెడ్డి తమ్ముఁడును కీర్తిశాలియు నగు వీరభద్రారెడ్డి ప్రసిద్ధ పరాక్రమముతో తనకు రాజమహేంద్రము రాజధానిగా మహోన్నత వైభవ ముతో 'చీఁకటి', 'కళింగము', 'చిలుక సముద్రము', 'సింహాచలము' అను ప్రసిద్ధ ప్రదేశములు గల దేశమును, ఏకచ్ఛత్త్రముగా (ఇంకొక దొరతనము లేకుండు వట్లుగా) పరిపాలించెను.

షష్ట్యంతములు

కం॥ ఈదృశ గుణగణనిధికిన్ ।
వేదార్థ కవిత్వతత్త్వ విధి విత్పతికిన్
క్ష్మాదివిజ కవిజనాశీ ।
ర్వాద ప్రవితీర్యమాణ వైభవనిధికిన్॥ 61

అర్థము :- 'ఈదృశ....నిధికిని' ఈదృశ = ఈవిధమయిన, గుణగణ = గుణసమూహమునకు, నిధికిని = గనియైనవానికిని, 'వేదార్థ....విధివిత్పతికిన్' 'వేదార్థ = వేదముల యర్థములయొక్క, కవిత్వతత్త్వ = కవితాతత్త్వముయొక్క, విధివిత్ = విధానము నెఱిఁగినవాఁకి, పతికిన్ = పోషకుఁడైనవానికిని, 'క్ష్మాదివిజ.... నిధికిన్' క్ష్మాదివిజ = భూసురులయొక్క, కవిజన = కవీశ్వరులయొక్క, ఆశీర్వాద= ఆశీర్వచనముల కొఱకు, ప్రవితీర్యమాణ = వితరణము చేయఁబడుచున్న, (ఇయ్యఁ బడుచున్న), వైభవ = వైభవములకు, నిధికిన్ = నిధియైనవానికిని.

తాత్పర్యము :- కావ్యమును అంకితము చేయఁబోవునపుడు షష్ఠీవిభక్తి అంతమునందు గల విశేషణములతో కృతిపతి గుణగణములను గీర్తించుట తెనుఁగు కవుల సంప్రదాయము. వీనినే షష్ట్యంతము లందురు- ఈవిధమైన గుణగణములు

గలవాఁడును, వేదార్థ తత్త్వవేత్తలకును, కవిత్వ తత్త్వవేత్తలకును పోషకుఁడైన వాఁడును, బ్రాహ్మణోత్తములయొక్క, కవీశ్వరులయొక్క ఆశీర్వాదముల కొఱకు సమర్పింపఁబడుచున్న వైభవములకు నిధియైనవాఁడును-

క॥ ఝరికాకర బేతాళున ।
కరిభయద భుజాపరాక్రమాభీలుఁకున్
శరణాగత మరుకేరళ ।
కురుభూపాలునకు జగదగోపాలునకున్ ॥ 62

అర్థము :- 'ఝరికాకర బేతాళునకున్' = అట్టి బిరుదులు గలవానికిని 'అరి.... అభీలఁనకున్' అరి = శత్రువులకు, భయద = భయముగొలిపెడి, భుజా=బాహువు యొక్క పరాక్రమ = పరాక్రమముచేత, అభీలునకున్ = బాధకలిగించువానికిని, 'శరణాగత.....భూపాలునకు' శరణాగత = శరణువేఁడివచ్చిన, మరు = మరు దేశములయొక్క, కేరళ = కేరళములయొక్క, కురు = కురుదేశములయొక్క, భూపాలఁనకున్ = రాజులు కలవానికిని, జగదగోపాలునకున్ = 'జగదగోపాలుఁ' డను బిరుదుగలవానికిని,

తాత్పర్యము :- 'ఝరికాకర బేతాళుఁడు' 'జగదగోపాలుఁడు'-ఇవి బిరుదములు. 'శరణ గత' 'ఉత్తర కురుదేశములు' 'దక్షిణకురుదేశములు' ఉన్నవికాని - ఈరెడ్ల రాజ్యమంతవఱకులేదు. సింహాచలము వఱకే యున్నది. అదికాక-కురు కేరళ భూపాలుఁడు రెడ్లకు శరణాగతుఁడైనట్లకు చారిత్రికాధారములేదు. 'అతిశయోక్తి' అలంకారము కావచ్చును.

క॥ అంభోధి వలయితావని।
సంభరణ ప్రౌఢ నిజభుజార్గళయుగళీ
సంభావిత కిటి కచ్ఛప।
కుంభీనససార్వభౌమ కులకు ధరునకున్ ॥ 63

అర్థము :- అంభోధి = సముద్రములచేత, వలయిత = చుట్టబడిన, అవని= భూమియొక్క సంభరణ = వహించుట యందు, ప్రౌఢ = సమర్థములైన, నిజ= తనయొక్క, భుజార్గళ = గడియలవంటి బాహువుల యొక్క, యుగళీ = జంట

చేత; సంభావిత = ఆదరింపఁబడిన, కిటి = ఆదివరాహము, కచ్ఛప=ఆదికూర్మము, కుంభీనససార్వభౌమ = నాగచక్రవర్తియైన ఆదిశేషుఁడు, కులకుధరునకున్ = కుల పర్వతమునకు గల వానికి.

తాత్పర్యము :- సముద్రవలయితమైన సమస్తభూమిని భరించుట యందు తానొక్కఁడే సమర్థమైనందువల్ల - ఈ రాజు భుజాయుగళము-అంతకు మునుపు ఈ భూమిని శ్రమపడి మోయుచున్న ఆదివరాహ, ఆదికూర్మ, ఆదిశేష కులపర్వతాదులకు విశ్రాంతి నొసఁగి మన్నించుచున్నదనుట.

క॥ వేమాధిపానుజునకును।
రామామదనునకు ఘోడెరాయగురు శ్రీ
భీమేశ్వర శిష్యునకున్ ।
వేమాంబాగర్భసలిలనిధి చంద్రునకున్ ॥ 64

అర్థము :- వేమాధిప = వేమభూపాలునకు, అనుజునకును = తమ్ముడైన వానికిని, రామా = రమణులకు, మదనునకును = మన్మథుఁడైన వానికిని, ఘోడెరాయ....శిష్యునకున్' ఘోడెరాయ = 'ఘోడెరాయ' అను-వంశక్రమానుగత బిరుదముగల (ఈ బిరుదముగల గురు పరంపరయే రెడ్డిరాజులందఱికిని కులగురువులు) గురు = గురువైన, శ్రీ భీమేశ్వర = శ్రీ భీమేశ్వరస్వామియొక్క, శిష్యునకున్ = శిష్యుఁడైన వానికిని, 'వేమాంబా... చంద్రునకున్' వేమాంబా = వేమాంబా మహాదేవియొక్క, గర్భ = గర్భమేయనెడి, సలిలనిధి = సముద్రమునకు, చంద్రునకున్ = చంద్రుఁడైన వానికిని-

తాత్పర్యము :- వేమారెడ్డి తమ్ముఁడును, రమణీజన మన్మథుఁడును, ఘోడెరాయ భీమేశ్వరగురువుయొక్క శిష్యుఁడును, వేమాంబాకుమారుఁడునైనవానికి-

క॥ త్రైలోక్యవిజయసాధవి।
శాలమహాచంద్ర చంద్రశాలాసతత
వ్యాలోకిత గాతమక
న్యాలహారీ విరహకాండపాటోపునకున్ ॥ 65

అర్థము :- త్రైలోక్యవిజయ = 'త్రైలోక్యవిజయ' మనెడి, సౌధ = మేడ యొక్క, మహత్ = గొప్పదియైన, చంద్ర = స్వర్ణమయమైన, చంద్రశాలా = శిరోగృహమునుండి, సతత = ఎల్లప్పుడు, వ్యాలోకిత = [వి + ఆలోకిత] విశేషించి చూడఁబడిన, గౌతమకన్యా = గౌతమముని కుమార్తెయైన గోదావరీనది యొక్క, లహరీ = కెరటములేయనెడి. విరహ = సముద్రవిరహముచేతనైన, తాండవ = తాండవముయొక్క నృత్తము యొక్క అటోపనకున్ = వేగిరపాటుగల వానికి.

తాత్పర్యము :- రాజమహేంద్రమునేలిన రెడ్డి ప్రభువుల రాజసౌధము పేరు 'త్రైలోక్యవిజయము', ఆ సౌధముయొక్క శిరోగృహమునుండి సముద్రగామినియై యురవడించుచున్న గోదావరీనది యొక్క తరంగఖేలనమును నిత్యము చూచుచుండుట వీరభద్రారెడ్డికి వినోదమని యీ పద్యమువలనఁ దెలిసికొనుటకు వీలగుచున్నది.

విశేషము :- నదీతరంగ నృత్తమునకు 'విరహము కారణముగా ఉత్ప్రేక్షింపఁ బడినది కావున హేతూత్ప్రేక్ష.

క॥ 'అనితల్లి' వల్లభునకున్ ।
గనకాద్రి వినిద్రకల్పకద్రుమ లీలా
వన, భవన కిన్నరస్త్రీ।
జనతా జేగీయమాన చారిత్రునకున్ ॥ 66

అర్థము :- 'అనితల్లి వల్లభునకున్' అనితల్లి = "అనితల్లికి" (వీరభద్రారెడ్డి పట్టమహిషి; ఈమె కాటయవేమారెడ్డి కుమార్తె, రాజమహేంద్రవర సామ్రాజ్యలక్ష్మీదేవత.) వల్లభునకున్ = ప్రియుఁడైన వానికిని, 'కనకాద్రి .... చారిత్రునకున్' కనకాద్రి = మేరుసర్వతమునందలి, వినిద్ర = వికసించిన, కల్పకద్రుమ = కల్పవృక్షములతో నిండిన, లీలావన = ఉద్యానవనముల యందలి, భవన = భవనములలోనున్న కిన్నరస్త్రీజనతా = కిన్నర స్త్రీసమూహముచేత, జేగీయమాన = బిగరగా పాడఁబడుచున్న చారిత్రునకున్ = చరిత్రగలవానికిని.

తాత్పర్యము :- "అనితల్లి' మహాదేవికి వల్లభుఁడైనవానికిని, మేరుపర్వతమ్మీపై నున్న కల్పకోద్యానభవనములయందలి కిన్నర స్త్రీసంఘములచేత ఉద్గీయమానమైన కీర్తిగలవానికిని.

క॥ నిర్ఘృణ నిర్ఘాతస్ఫుట।
నిర్ఘోష కఠోర ఢాటి నిస్సాణ మహా
దీర్ఘతర ధణధణాంకృతి।
ధూర్ఘటన నిర్దళిత చతుర్దిక్కు-నకున్ ॥ 67

అర్థము :- నిర్ఘృణ = నిర్దయమైన. నిర్ఘాత = పిడుగువలె. స్ఫుట = పరిస్ఫుటమైన. నిర్ఘోష = ధ్వనివలె. కఠోర = కఠినమైన. ఢాటి = దండయాత్రయందలి. నిస్సాణ = భేరీమృదంగాదులైన చర్మవాద్యములయొక్క: మహా దీర్ఘతర = మిక్కిలి పొడవైన. ధణధణాంకృతి = 'ధణ ధణాం' ధ్వనులయొక్క. ధూ = బరువుయొక్క. ఘట్టన = సంఘట్టనముచేత. నిర్దళిత = బ్రద్దలుచేయఁబడిన. చతుర్దిక్కునకున్ = నాలుగు దిక్కులగల వానికిని-

తాత్పర్యము :- పిడుగులధ్వనివలె నిర్దయమును కఠినమునైన దండయాత్రల యందలి భేరీదుందుభి ప్రభృతి చర్మవాద్యములయొక్క. మిక్కిలి పొడవైన 'ధణధణాంకార' శబ్ద సంఘట్టనముచేత బ్రద్దలుచేయబడిన నాలుగుదిక్కులు గల వానికిని-

క॥ హాటక కుభృద్ధనుర్ధర।
జూటీ కోటీ కుటీర సుమన స్తటి నీ
వ్యాటీకితోర్మి సంఘో।
ద్ఘాటవచో వైఖరీ జితద్రుహిణునకున్ ॥ 68

అర్థము :- హాటకకుభృత్ = బంగారుకొండయే యనెడి. ధనుర్ధర = ధనుస్సును ధరించిన వాఁయొక్క. శివునియొక్క. జూటీ=జటాజూటముయొక్క కోటీ = అగ్రిభాగమేయనెడి, కుటీర = కుటీరమునందలి-పర్ణశాలయందలి, సుమన స్తటినీ= సురనది యొక్క-గంగానదియొక్క వ్యాటీకిత=(వి+ఆటీకిత) విశేషముగాఁగదలుచున్న. ఊర్మినంఘ=తరంగసంఘములయొక్క, ఉద్ఘాట=కెరలిపడుటలవంటి. వచో వైఖరీ = వాగ్వైఖరిచేత. జిత = జయింపఁబడిన, ద్రుహిణునకున్ = బ్రహ్మదేవుడు కలవానికిని.

తాత్పర్యము :- మేరుశరాసనుఁడైన పరమశివునియొక్క జటాజూటాగ్రమే యనెడి కుటీరమునందలి యాకాశగంగయొక్క కెరలిపడుచున్న కెరటముల వంటి వాగ్వైఖరిచేత బ్రహ్మను గెలిచినవానికిని-

కం॥ గజదళ విభాళ బిరుదున ।
కజగవధర భక్తి భావితాత్మునకు, సమి
ద్విజయునకు రాయవేశ్యా ।
భుజగునకును వీరభద్ర భూపాలునకున్ ॥ 69

అర్థము :- గజదళ విభాళ బిరుదునకున్ - 'గజదళవిభాళ' అను బిరుదుగల వానికిని. అజగవధర = పినాకధరుఁడైన శివునియందలి. భక్తి=భక్తిచేత. భావిత = భావితమైన. ఆత్మునకున్ = మనస్సుగల వానికి. 'సమిద్విజయునకున్' (సమిత్ + విజయుఁడు) - సమిత్ = సంగ్రామములయందు, విజయునకున్ = అర్జునునివంటి వానికిని. 'సంగ్రామపార్థుఁడు' అని ఆ రాజులకు బిరుదము. రాయవేశ్యాభుజగున కున్ = 'రాయవేశ్యాభుజంగ' బిరుదముగల వానికిని. వీరభద్ర భూపాలునకున్ = వీరభద్రారెడ్డి యనెడి రాజునకు-

తాత్పర్యము :- "గజదళవిభాళ', 'సంగ్రామపార్థ', 'రాయవేశ్యాభుజంగ' బిరుదములుగల వానికిని, శివభక్తి భావితమైన చిత్తవృత్తి కలవానికిని వీరభద్రారెడ్డి యనెడి ప్రభువునకు-

వ॥ అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పంబూనిన కాశీ
ఖండంబు- 70

అర్థము :- అభ్యుదయ = అభ్యుదయములయొక్క, పరంపరా = నైరంతర్యముయొక్క- అభివృద్ధిగా = అభివృద్ధి కలుగునట్లుగా, నా యొనర్పంబూనిన = నేను చేయఁబూనిన, కాశీఖండంబు = కాశీఖండ మను మహాగ్రంథము-

తాత్పర్యము :- సుగమము.

కథా ప్రారంభము

—: పురాణ ప్రశంస :—

సీ॥ పద్మాదికంబులు పదియు నెనిమిదియు
నాదిపురాణంబు, లాపురాణ
జాతంబు నాల్గులక్షల సంఖ్యగల యది
యుపపురాణములం దుద్భవించెఁ,
బదునొకండవదియై బహు సంహితలతోడ
బహుఖండములతోడ బహువిచిత్ర
కథలతో నేకలక్ష గ్రంథ పరిమాణ
కలితమై శ్రీ మహాస్కాందమొప్పు

తే॥గీ॥ నమ్మహాస్కాందమునకు సారాంశ మనఁగ
నాల్గు పురుషార్థములకుఁ దానక మనంగ
బ్రహ్మవిద్యకు నాదికారణ మనంగ
నఖిల ఖండంబులందుఁ బ్రఖ్యాతిఁ బడసె ॥ 71

అర్థము :- 'పద్మాదికంబులు' పద్మ = పద్మపురాణము, ఆదికంబులు = మొదలైనవి, పదియు నెనిమిదియున్ = పదునెనిమిదియును, ఆదిపురాణంబులు = మొదటి పురాణములు - (మహాపురాణములు), ఆ పురాణజాతంబు - ఆ పురాణ = ఆ పురాణములయొక్క, జాతంబు = సమూహము, 'నాల్గులక్షల సంఖ్యగల యది' నాల్గులక్షల = నాలుగు లక్షల, సంఖ్య = శ్లోకముల సంఖ్య కలయది = కలిగినది, ఉపపురాణంబులు = ఉపపురాణములు, అందున్ = ఆ మహాపురాణ కదంబమునుండి, ఉద్భవించెన్ = పుట్టెను, పదునొకండవదియై = పదునొకటవదియై, బహుసంహితల తోడన్ = అనేక సంహితలతోను, బహుఖండములతోడన్ = అనేక ఖండముల తోను, 'బహువిచిత్రకథలతోన్' బహువిచిత్ర = మిక్కిలి విచిత్రములైన, కథల తోన్ = అనేక కథలతో, 'ఏక....కలితమై' ఏకలక్ష = ఒక లక్షయైన, గ్రంథ = అనుష్టుప్ శ్లోకములయొక్క (32 అక్షరములు గల శ్లోకము ఒక గ్రంథము). పరి మాణ = పరిమాణముతో, కలితమై = ఒప్పినదియై, శ్రీ మహాస్కాందము = శ్రీ

మహాస్కాంద పురాణము, ఒప్పున్ = ప్రకాశించును, అమ్మహాస్కాందమునకున్ = ఆ మహాస్కాంద పురాణమునకు, 'సారాంశము సార = సారభూతమైన. అంశ మనఁగన్ = భాగ మనఁగా, నాల్గు పురుషార్థములకున్ = ధర్మార్థ కామ మోక్షము లను నాలుగు పురుషార్థములకును, తానకమనంగన్ = స్థాన మనఁగా, బ్రహ్మవిద్య కున్ = బ్రహ్మమును దెలియఁజేయు విద్యకు– మోక్షవిద్యకు, ఆదికారణమనంగన్= తొలుతటి కారణమనఁగా. అఖిల ఖండంబులందున్ = 'శివరహస్యము' మొదలైన ఆశేష ఖండములయందును, ప్రఖ్యాతిన్ = ప్రకృష్టమైన ప్రసిద్ధిని, పడసెన్ = పొందెను.

తాత్పర్యము:– పద్మపురాణము మొదలైన మహాపురాణములు పదునెనిమిది. అవి వరుసగా. 1) బ్రహ్మపురాణము 2) పద్మపురాణము 3) విష్ణుపురాణము 4) శివపురాణము 5) భాగవతపురాణము 6) భవిష్యపురాణము 7) నారదపురాణము 8) మార్కండేయపురాణము 9) అగ్నిపురాణము 10) బ్రహ్మవైవర్తపురాణము 11) లింగపురాణము 12) వారాహపురాణము 13) స్కాందపురాణము 14) వామనపురాణము 15) కూర్మపురాణము 16) మత్స్యపురాణము 17) గరుడ పురాణము 18) బ్రహ్మాండపురాణము అనునవి. ఈ పురాణములలోని మొత్తము శ్లోకముల సంఖ్య 4 లక్షలు. ఈ మహాపురాణములనుండి 18 ఉపపురాణములు ఉద్భవించెను. మహాపురాణములలో స్కాందము పదునొకండవది. ఇది. అనేక సంహితలతో, అనేక ఖండములతో, అనేక విచిత్ర కథలతో లక్ష శ్లోక పరిమితమై యొప్పుచున్నది. కాశీఖండము ఆ స్కాందమునకు సారాంశము. నాల్గు పురుషార్థము లకు ఆలవాలము. బ్రహ్మవిద్యకు ఆద్యకారణము. ఆన్ని ఖండములలోను మిక్కిలి ప్రఖ్యాతి గలది.

విశేషము :– సూతసంహితలోని అనుక్రమణికను బట్టి స్కాందపురాణము పదుమూఁడవది. ఈ పద్యములో పదునొకండవది యనుట విచార్యము. పురాణ విద్యయొక్క ఆవశ్యకతను గూర్చి సూతసంహిత యిట్లు చెప్పుచున్నది–

"యశ్చతుర్వేద విద్విప్రః పురాణం వేత్తినార్థతః
తందృష్ట్వా భయమాపోతి వేదో 'మాం ప్రతరిష్యతి'
ఇతిహాస పురాణాభ్యం వేదం సముబృంహయేత్
బిభేత్యల్పశ్రుతా ద్వేదో 'మామయం విప్లవిష్యతి'

వేదాః ప్రమాణం ప్రథమం స్వతవీవ తతః పరం
స్మృతయశ్చపురాణాని భారతం మునిపుంగవాః
అన్యాన్యపి మునిశ్రేష్ఠాః శాస్త్రాణి సుబహూనిచ
సర్వంవేదా విరోధేన ప్రమాణం నాన్యవర్త్మనా ॥"

తే॥గీ॥ మూఁడులక్షల బదియేడు ముగిసిపోవఁ
దాఁబ్రవర్తిల్లు లక్షగ్రంథంబుతోడ
సమధిక స్ఫూర్తి నేపురాణములు సాటి
గరిమకందంబునకు నుహాస్కాందమునకు ॥ 72

అర్థము :- మూఁడు లక్షలన్ = మూఁడులక్షల గ్రంథములతో. శ్లోకము లతో, పదియేడున్ = మిగిలిన పద్మాదులైన పదియేడు పురాణములును, ముగిసి పోవన్ = నరిసమాప్తములు గాఁగా, తాన్ = తాను- స్కాందపురాణము ఒక్కటియే, లక్ష గ్రంథంబుతోడన్ = లక్ష శ్లోకములతో. 'సమధికస్ఫూర్తిన్' సమధిక= మిక్కిలి యధికమైన, స్ఫూర్తిన్ = స్ఫురణముతో. ప్రవర్తిల్లున్ = ప్రవర్తించును. గరిమకందంబునకున్ = గొప్పదనమునకు మూలకందమయిన, మహాస్కాందము నకున్ = మహాస్కాంద పురాణమునకు, ఏ పురాణములు = ఏ పురాణములు. సాటి = సాటిరాఁగలవు ?

తాత్పర్యము :- మొత్తము పురాణములలోని గ్రంథ సంఖ్య నాలుగు లక్షలు. మిగిలిన పదియేడు పురాణములు మూఁడు లక్షలలో ముగిసిపోవుచున్నవి. స్కాంద మొక్కటియును లక్ష శ్లోకములు ; గొప్పదనమునకు మూలమైన స్కాందము నకు ఏ పురాణములు సాటివచ్చును ?

తే॥గీ॥ వరుసనెనిమిది యన్యదేవతలఁ దెల్పు
పదిపురాణంబు లీశ్వరుఁ బ్రస్తుతించు
చంద్రమౌళి ప్రభావంబు సమధికముగ
శ్రుతులయట్ల పురాణసంహితల నడుచు ॥ 73

అరము :- వరుసన్ = క్రమముగా. ఎనిమిది = ఎనిమిదిపురాణములు, అన్య దేవతలన్ - విష్ణువు మొదలైన దేవతలను, తెల్పున్ = తెలియఁజేయును, పది

పురాణంబులు = మిగిలిన పదిపురాణములను, ఈశ్వరున్ = శివుని. ప్రస్తుతించున్ = ప్రస్తుతిచేయును. 'చంద్రమౌళి ప్రభావంబు' చంద్రమౌళి = శశిశేఖరునియొక్క. ప్రభావంబు – ప్రభావము. శ్రుతులయట్ల = వేదములయందువలెనే, పురాణసంహితలన్ = పురాణసంహితలయందు కూడ, సమధికముగన్ = మిక్కిలియధికముగా, నడుచున్ = ప్రవర్తిల్లును.

తాత్పర్యము :– మొత్తము పదునెనిమిది పురాణములలో ఎనిమిది యితర దేవతలను గూర్చి తెలుపుచుండగా – పదిపురాణములు శివపారమ్యమును ప్రస్తుతించును. వేదములయందు వలెనే శివపారమ్యము పురాణసంహితలయందు గూడ సమధికముగ ప్రస్తుతింప బడును.

విశేషము :– మొత్తము నాలుగువేదములలో శివపారమ్యమును జెప్పు మంత్రరాశియే యెక్కువగా గోచరించును. ఆ విధముగనే వేదార్థమునను సరించి నడచు పురాణసంహితలయందుగూడ శివపారమ్యమే సమధికముగ గోచరించును.

ఇందుకు ప్రమాణము–సూతసంహిత : ప్రథమాధ్యాయము

'కథ్యతే దశభిర్విప్రాః పురాణైః పర మేశ్వరః
చతుర్భిః కథ్యతే విష్ణుః ద్వాభ్యాం బ్రహ్మప్రకీర్తితః
ఏకేనాగ్ని స్తథై కేన భగవాంశ్చండ భాస్కరః॥'

తే॥గీ॥ సరవి సర్గంబునాఁ బ్రతిసర్గ మనఁగ
వరుసతో వంశ వంశానుచరితములనఁగ
క్రమపరిప్రాప్తి మన్వంతరములనంగ
లలిఁ బురాణంబునకు నైదు లక్షణములు॥ 74

అర్థము :– సరవిన్ = క్రమముగా, సర్గంబునాన్ = సర్గమనఁగా, ప్రతిసర్గమునఁగన్ = ప్రతిసర్గమనఁగా, వరుసతోన్ = 'వంశవంశానుచరితములనన్' వంశ = వంశము, వంశానుచరితమునన్ = వరుసగా వంశానుచరితములనంగా, క్రమపరిప్రాప్తిన్ = క్రమమునుబట్టి వచ్చిన, మన్వంతరములనఁగన్ = మన్వంతరములనఁగా, లలిన్ = రమ్యముగా, పురాణంబునకున్ = పురాణమునకు. ఐదులక్షణములు = అయిదులక్షణములు.

తాత్పర్యము :- సర్గము, ప్రతిసర్గము, వంశము, వంశానుచరితము, మన్వంతరములు - అను అయిదు లక్షణములుకలది పురాణము.

'సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణిచ
వంహానుచరితంచేతి పురాణం పంచలక్షణం.' సూతసంహిత:

విశేషములు :- 'సర్గ మనఁగా సృష్టి. 'ప్రతిసర్గ' మనఁగా-ప్రళయము. 'వంశ మనఁగా - దేవదానవమానవ తిర్యక్ (పశుపక్షులు) తరులతాదుల యుత్పత్తిక్రమము. 'వంశానుక్రమ' మనఁగా సూర్య, చంద్ర. వంశక్రమాగతులైన రాజులచరిత్రము. 'మన్వంతరము' అనఁగా - పదునాలుగురు మనువుల కాలాభివర్ణనము. ప్రతిమన్వంతరమునందు - ఇంద్రుఁడు దేవగణములు ఋషిగణములుమారు చుందురు. సర్గము మహాసృష్టినిగూర్చి. ప్రతిసర్గము మహాప్రళయమునుగూర్చి. చెప్పును. వంశ. వంశానుచరిత మన్వంతరములు 'స్థితి ని గూర్చి చెప్పును. ఈయైదు లక్షణములు సూక్ష్మముగా వేదమునందు - విస్తరముగా పురాణముల యందు వర్ణింపఁబడి యుండును. వేదములో-

''బహుస్యాం ప్రజాయేయ" అనువాక్యము మహాసృష్టిని, "నేహనానాస్తి కించన, అనువాక్యము మహాప్రళయమును జెప్పుచున్నవని - సూతసంహితావ్యాఖ్య-

తే॥గీ॥ గ్రంథపరిసంఖ్య నాల్గులక్షలు పురాణ;
మది చతుర్దశవిద్యలయందుఁ బెద్ద
చాలఁ గర్మార్థ మందానుషంగికమున
నాధికారికమండె బ్రహ్మార్థ గరిమ॥ 75

అర్థము :- "గ్రంథపరిసంఖ్యన్", గ్రంథ = శ్లోకములయొక్క-, పరిసంఖ్యన్ - పరిసంఖ్యచేత, పురాణము = అష్టాదశాత్మకమైన పురాణవిద్య, నాల్గులక్షలు = నాల్గులక్షల పరిమితి కలది. ('గ్రంథ' మనఁగా ముప్పదిరెండక్షరముల పరిమితి గల శ్లోకము. అది అనుష్టుప్పు.) అది = ఆ పురాణవిద్య, చతుర్దశవిద్యలయందున్ = పదునాలుగు విద్యలయందును, చాల పెద్ద = మిక్కిలి పెద్దది (నాలుగు వేదములు, ఆఱంగములు, మీమాంస, న్యాయము, పురాణము, ధర్మశాస్త్రము అని-విద్యలు పదునాలుగు.) అందున్ = ఆ పురాణ విద్యయందు, కర్మార్థము = కర్మ

విషయము-ధర్మవిషయము. ఆనుషంగికము = అనుషంగప్రాప్తమయినది-(అప్రధానము). అనన్ = అనఁగా. బ్రహ్మార్థగరిమ = బ్రహ్మవిషయకమైన జ్ఞానవైభవము. అధికారికమున్ = ప్రధాన విషయత్వమును. అందెన్ = పొందెను.

తాత్పర్యము :- పురాణవిద్య నాలుగులక్షల గ్రంథ పరిమితి గలది. అది చతుర్దశవిద్యా స్థానములలో మిక్కిలి పెద్దది. ఆ పురాణ విద్యలో కర్మవిషయము అనుషంగప్రాప్తమై అప్రధానముగ నుండును. బ్రహ్మవిషయము అధికారికమై ప్రధానముగ నుండును.

విశేషము :- వేదమునందు రెండు భాగములు. 1) కర్మభాగము 2) బ్రహ్మ భాగము. కర్మభాగమును ప్రపంచించునవి స్మృతులు-(ధర్మశాస్త్రములు). బ్రహ్మ భాగమును ప్రపంచించునవి పురాణములు. శివాజ్ఞచేత బ్రహ్మ ధర్మశాస్త్రములను. విష్ణువు వేదవ్యాసుఁడుగా నవతరించి పురాణములను నిర్మించిరి. కర్మ బ్రహ్మ విషయములు అంతర్నిహితములై యున్న వేదరాశిని పరమశివుఁడు చతుర్ముఖ బ్రహ్మను సృష్టించి యిచ్చెను.

'యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యోవై వేదాగ్ంశ్చ ప్రహిణోతి తస్మై'

శ్రుతి-

'బ్రహ్మాణం మునయః పూర్వం సృష్ట్వా తస్మై మహేశ్వర
దత్తవా నఖిలాన్వేదా నాత్మన్యేవ స్థితానిమాన్ ॥
బ్రహ్మా సర్వజగత్కర్తా శివస్య పరమాత్మనః
ప్రసాదాదేవ రుద్రస్య స్మృతీపస్సస్మార సువ్రతాః
విష్ణుర్విశ్వ భగన్నాథో విశ్వేశస్యశి వస్యచ
ఆజ్ఞయా పరయాయుక్తో వ్యాసోజజ్ఞే గురుర్మమ ॥' సూతసంహిత.

ఉ॥ అట్టిదివో పురాణము మహత్త్వము సూతుఁడు తద్విదుండు గాఁ
బట్టి కనిషజన్మునఁ బ్రాకృతుఁడయ్యు, నురుప్రభావుఁడై
నట్టి మహోమునీంద్రులకు నంబుజ సంభవు నంతవారికిఁ
దిట్టతనంబుమీఱ నుపదేశ మొనర్చుచునుండు బ్రహ్మమున్ ॥75

అర్థము :- 'పురాణము మహత్త్వము' పురాణము = పురాణ విద్యయొక్క. మహత్త్వము = గొప్పదనము, అట్టిదివో = అట్టిదిసుమా. సూతుఁడు = రోమహర్షణ

పుత్త్రుఁడైన సూతుఁడు, 'తద్విదుండుగాఁబట్టి' తద్విదుండు = ఆ పురాణవిద్య తెలిసినవాఁడు. కాఁబట్టి = అయినందువల్ల. కనిష్ఠజన్మమునన్ = అవరజన్మముచేత. ప్రాకృతుఁడయ్యున్ = సామాన్యుఁడయ్యును. 'ఉరు .... మునీంద్రులకున్' ఉరు ప్రభావులైనట్టి = గొప్ప ప్రభావముగలవారైన. మహాముునీంద్రులకున్ = మహా ముునీశ్వరులకు. అంబుజసంభవు నట్టివారికిన్ = బ్రహ్మవంటివారికిఁ గూడ. దిట్ట తనంబు మీఱ = స్థైర్యమతిశయించునట్లుగా. బ్రహ్మమున్ = బ్రహ్మతత్త్వమును. ఉపదేశమొసర్చు నుండున్ = ఉపదేశించుచుండును.

తాత్పర్యము :- పురాణవిద్య యొక్క మహిమ యట్టిదికదా! ఆ విద్య తెలిసినవాఁడు కావుననే సూతుఁడు జన్మమునుబట్టి కనిష్ఠుఁడును ప్రాకృతుఁడునైనను మహాప్రభావులును బ్రహ్మసమానులు నైన మహాముునీశ్వరులకు దిట్టదనముతో బ్రహ్మతత్త్వము నుపదేశింపఁగలుగుచుండును.

విశేషము :- పురాణవిద్యా ప్రవర్తమునందు సూతుని అధికారమునకుఁ బ్రమాణవచనము-

"అయం సాక్షాన్మహాయోగీ వ్యాసస్సర్వజ్ఞ ఈశ్వరః
మహాభారత మాశ్చర్యం నిర్మమే భగవాన్ గురుః ॥
తస్య శిష్యా మహాత్మానశ్చత్వారో ముునిసత్తమాః
అభవంత్స ముని స్తేభ్యః పైలాదిభ్యోఽదదాచ్ఛ్రుతిం ॥
తేభ్యోఽధీతా శ్రుతిస్సర్వా సాధ్వీ పాపప్రణాశినీ
తయావర్ణాశ్రమాచారాః ప్రవృత్తా వేదవిత్తమాః ॥
పురాణానాం ప్రవక్తారం సముని ర్మామయోజయత్
తస్మాదేవ ముునిశ్రేష్ఠాః పురాణం ప్రదదామ్యహం ॥" సూతసంహిత-

సీ॥ ఆది మనోమయంబగు నొక్క చక్రంబుఁ
గల్పించె బ్రహ్మ జగద్ధితముగఁ
గల్పించి యాబండికలు డొల్చె సత్యలో
కంబున నుండి యా కమలగర్భుఁ
డది డొల్లఁగిలి విష్టపాంతరంబులు దాఁటి
క్రమముతో భూమిచక్రమున వ్రాలె

వ్రాలి రంహస్ఫూర్తి వచ్చివచ్చి ధరిత్రి
నిమ్నోన్నతుల శీర్ణనేమి యయ్యె

తే॥గీ॥ నేమి విరిసిన కతన నన్నేల నెలవు
నైమిశంబయ్యె నదియతా నైమిశంబుఁ
దన్మహాపుణ్యవనమున ద్వాదశాబ్ది
సత్త్రియాగంబుఁ గావించె శౌనకుండు॥

అర్థము :- ఆదిన్ = ఆదికాలమునందు, బ్రహ్మ = పరమేష్ఠి, జగద్ధితము గన్ = (జగత్ + హితము) లోకహితముకొఱకై, మనోమయంబగు = మనోమయమైన, ఒక్కచక్రంబున్ = ఒకచక్రమును, కల్పించెన్ = కన్పించెను, కల్పించి = నిర్మించి, సత్యలోకంబుననుండి = సత్యలోకమునుండి, ఆకమల గర్భుఁడు = ఆబ్రహ్మ, ఆ బండికలు = ఆ బండిచక్రమును, దొల్చెన్ = దొల్లించెను, అది = ఆ చక్రము, దొల్లఁగిలి = దొరలి, 'విష్టపాంతరంబులు' విష్టప = లోకలములయొక్క, అంతరంబులు = ప్రభేదములను, (అన్యలోకములను) దాఁటి = కటచి, క్రమముతోన్ = వరుసతో, భూమిచక్రమునన్ = భూచక్రమునందు, వ్రాలెన్ = వ్రాలెను, వ్రాలి = వ్రాలి, 'రంహఃస్ఫూర్తిన్' రంహః = వేగముయొక్క, స్ఫూర్తిన్ = స్ఫురణతో, వచ్చివచ్చి = వచ్చివచ్చి, ధరిత్రి = భూమియొక్క, విమ్నోన్నతులన్ = మిట్టపల్లములయందు, 'శీర్ణనేమి' శీర్ణ = శిథిలమైన, నేమి = కమ్మికలది, అయ్యెన్ = అయ్యెను, 'నేమి....కతనన్' నేమి = బండిచక్రపుఁగమ్మి, విరిసినకతనన్ = విచ్చిపోయినందువలన, అన్నేలనెలవు = ఆభూమిభాగము, నైమిశంబయ్యెన్ = నైమిశమయ్యెను, అదియ = ఆ భూభాగముగల ప్రదేశమే, తాన్ = తాను, నైమిశము = నైమిశారణ్యము, 'తన్మహాపుణ్యవనమునన్, తత్ = ఆ, మహాపుణ్య = మహాపవిత్రమైన, వనమునన్=వనమునందు, "ద్వాదశాబ్ది సత్త్రియాగంబున్" ద్వాదశాబ్ది= పండ్రెండుల పరిమితిగల, సత్త్రియాగంబున్ = సత్త్రియాగమును, శౌనకుండు=శౌనకమహాముని, కావించెన్=చేసెను.

తాత్పర్యము :- ఆదికాలమునందు లోకహితార్థమై బ్రహ్మమనోమయమగు నొక చక్రమును గల్పించెను. కల్పించి ఆ చక్రమును సత్యలోకమునుండి దొల్లించెను. ఆ చక్రము దొల్లఁగిలి లోకములన్నియునుదాఁటి భూలోకమునందు వ్రాలెను.

హ్రిలి-అమితవేగముతో వచ్చివచ్చి భూమిమిట్టపల్లములలో చక్రముకమ్మివిచ్చి పోయిన ప్రదేశము 'నైమిశ' మయ్యెను. ఆ ప్రదేశముగల వనముకూడ నైమిశమే అయ్యెను. ఆ మహాపుణ్యవనమునందు శౌనకమహాముని ద్వాదశవర్ష పరిమితమైన సత్త్రియాగముచేసెను.

విశేషము:- ఏకాహములు, అహీనములు, సత్త్రములు, అయనములు-అని-సోమయాగములు నాలుగు విధములు. ఒక్కొక్క దినములో జేయుటకు సాధ్యమైనవి ఏకాహములు : అగ్నిష్టోమము మొదలైనవి.

పదకొండు దినములలో ముగియునవి అహీనములు, అతిరాత్రము మొదలైనవి.

పండ్రెండు దినములు కలవి సత్త్రములు. సంవత్సరసాధ్యములు అయనములు,

అయనములను గూడ సత్త్రములని వ్యవహరించుట కలదు,

'నైమిశే నిమిషేక్షేత్రే ఋషయః శౌనకాదయః
సత్త్రింస్వర్గాయలోకాయ సహస్రసమ మాసత॥'

వ॥ ఆసత్త్రియాగంబునందు శౌనకాది మహాములును సూతాన్వయసంభవుండైన సూతునర్చించి తన్ముఖయంబునం బురాణేతిహాససంహితలు వినిరి. కావున నన్మహా విద్యాస్థానంబు సూతముని సంవాదాత్మకంబు. 78

అర్థము :- ఆ సత్త్రియాగంబునందున్ = ఆద్వాదశవార్షిక సత్త్రియాగమునందు, శౌనకాది మహాములు = శౌనకుడు మొదలైన మహాములు, 'సూతాన్వయ సంభవుండైన ' సూతాన్వయ = సూతవంశమునందు. సంభవుండైన=వుట్టుకగల. సూతున్ = సూతుని, అర్చించి = పూజించి, తన్ముఖంబునన్ = ఆతనివలన, పురాణేతిహాససంహితలు = పురాణసంహితలను, ఇతిహాససంహితలను, వినిరి కావునన్ = విన్నారుకావున, అమ్మహావిద్యాస్థానంబు = ఆ పురాణవిద్యాస్థానము, సూతముని సంవాదాత్మకంబు = సూత, ముని, సంవాదరూపమైనది.

తాత్పర్యము :- సుగమము,

తే॥ గీ॥ స్కాందమున యందు నేఁబది ఖండములకు
బహుకథాసంగతులు సేయ బాగుగాదు
ఖండ ఖండంబులందును గలిగి నట్టి
కథల పరిపాటి సంగతి గ్రహణమునకు। 79

అర్థము :- స్కాందమునయందున్ = స్కాందపురాణమునందలి, ఏఁబది ఖండములకున్ = ఏఁబది ఖండములకును, ఖండ ఖండంబులందును = ఏ ఖండమునకా ఖండమునందు, కలిగినట్టి = ఉన్న, కథల పరిపాటిన్ = కథాక్రమమునుసరించి, సంగతి గ్రహణమునకున్ = విషయమును పరిగ్రహించుటకు, బహు కథా సంగతులు సేయన్ = బహు కథల విషయములను ప్రస్తావించుట బాగుకాదు.

తాత్పర్యము :- తేటపడుటలేదు. కవి చెప్పఁదలచినదేమై యుండునో? ఉన్నపాఠభేదములు . ఉపయోగపడుట లేదు.

వ॥ ఇమ్మహాస్కాందంబున కవయంబు లాఱు సంహితలు. అవి క్రమంబున - సనత్కుమారసంహిత పంచ పంచాత్సహస్రిక, సూతసంహిత షట్సహస్రిక, శాంకరసంహిత త్రింశత్సహస్రిక, వైష్ణవసంహిత పంచసహస్రిక, బ్రహ్మసంహిత త్రిసహస్రిక, సౌరసంహిత యేకసహస్రిక, ఈసంహితలయందు-పంచనాగర ఖండంబు, కమలాలయాఖండంబు, రేవాఖండంబు, ఏక వీరా ఖండంబు, మైలారఖండంబు, గోదావరీ ఖండ బు నాదిగాఁగల పంచాశత్ఖండంబులందు- 80

అర్థము :- ఇమ్మహాస్కాందంబునకున్ = ఈ మహాస్కాందమునకు. అవయవంబులు = అవయవములైన, సంహితలు = గ్రంథభాగములు. ఆఱు = ఆఱు; అవి=ఆ సంహితలు; సనత్కుమారసంహిత - పంచపంచాశత్సహస్రిక = సనత్కుమార సంహిత యనునది - ఏఁబదియైదువేలశ్లోకములుగలది, సూతసంహిత-షట్సహస్రిక = ఆఱువేలశ్లోకములుగలది. శాంకరసంహిత - త్రింశత్సహస్రిక = ముప్పదివేల శ్లోకములు గలది, వైష్ణవసంహిత - పంజసహస్రిక = ఐదువేలశ్లోకములు గలది. బ్రహ్మసంహిత - త్రిసహస్రిక = మూఁడువేల శ్లోకములు గలది.

సౌరసంహిత = సౌరసంహితయనునది. ఏకసహస్రిక = ఒకవే యిశ్లోకములుగలది. ఈసంహితలయందున్ = ఈ సంహితలలో - పంచనాగరఖండము, కమలాలయాఖండము, రేవాఖండము, ఏకవీరాఖండము, మైలారఖండము, గోదావరీ ఖండము, ఆదిగా గల = మొదలుగాఁగల. పంచాశత్ఖండంబులందున్ = ఏఁబది ఖండముల యందును -

తాత్పర్యము :- సుగమము.

విశేషము :- స్కందప్రోక్తము స్కాందము. స్కందుఁడనఁగా కుమారస్వామి. కుమారస్వామికి ఆఱు ముఖములు. కుమారస్వామి చెప్పిన స్కాందపురాణమునకును ఆఱు సంహితలు. అవి- సనత్కుమారసంహిత, సూతసంహిత, శాంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత- అనునవి; ప్రక్షేపము చేయు నవకాశము తొలఁగించుటకై నికరముగా శ్లోక సంఖ్య యీయఁబడినది.

శా॥ ప్రాశస్త్యంబు వహించు ద్వాదశ సహస్ర గ్రంథ సంక్షిప్తి వి
శ్వేశక్షేత్ర వియన్నదీ వటుక డుంఠీశాన సంకీర్తనో
ద్దేశ ప్రక్రమశోభితాద్భుత కథాధిష్ఠానమై శ్రేష్ఠమై
కాశీఖండ మఖండ వైభవమునన్ స్కాందాబ్ధి మధ్యంబునన్ ॥ 81

అర్థము :- 'ద్వాదశ.... సంక్షిప్తిన్' ద్వాదశ సహస్ర = పండ్రెండువేల సంఖ్యగల. గ్రంథ = శ్లోకములయొక్క. సంక్షిప్తిన్ = విరచనతో. 'విశ్వేశ.... కథాధిష్ఠానమై' విశ్వేశ = విశ్వేశ్వరస్వామియొక్క. క్షేత్ర = కాశీక్షేత్రముయొక్క, వియన్న. = గంగానదియొక్క, వటుక = భైరవస్వామియొక్క, డుంఠీశాన = డుంఠీశ్వరునియొక్క (విఘ్నేశ్వరునియొక్క). సంకీర్తనోద్దేశ = సంకీర్తనము చేయుట యనెడి యభిప్రాయముయొక్క, ప్రక్రమ = ఉపక్రమముచేత. శోభిత = ప్రకాశించిన. అద్భుత = ఆశ్చర్యకరములైన. కథా = కథలకు, అధిష్ఠానమై = పీఠమై. శ్రేష్ఠమై = శ్రేష్ఠమై. కాశీఖండము = కాశీఖండము. అఖండ = పరిపూర్ణమైన. వైభవమునన్ = వైభవముతో. 'స్కాందాబ్ధి మధ్యంబునన్' స్కాంద = స్కాందపురాణమే యనెడి. అబ్ధి = సముద్రముయొక్క. మధ్యంబునన్ = మధ్యభాగమునందు. ప్రాశస్త్యంబున్ = ప్రాశస్త్యమును-ప్రశస్తిని, వహించున్ = వహించును.

తాత్పర్యము :- పండ్రెండువేల శ్లోకముల పరిమితిలో శ్రీ విశ్వేశ్వర స్వామియొక్క, కాశీమహాక్షేత్రముయొక్క, గంగానదియొక్క, కాలభైరవునియొక్క, డుంఠి విఘ్నేశ్వరస్వామియొక్క, సంకీర్తనోద్దేశమే ఉపక్రమముగాగల అద్భుతము లైన అనేక కథలకు నెలవై స్కాందపురాణ సముద్ర మధ్యమునందు అఖండ వైభవముతో కాశీఖండము ప్రాశస్త్యము వహించును.

వ11 ఈ కాశీఖండంబు వేదవ్యాస సూత సంవాదాత్మకంబనియునుం గొందఱు చెప్పుదురు. దీనికిం గదానుక్రమణిక- వింధ్య నారద సంవాదంబు, బ్రహ్మలోక ప్రభావంబు, గోదాన మాహా మాహాత్మ్యంబు, వారణాసియం దగస్త్యాశ్రమ వర్ణనంబు, మునిదేవతా సమాగమంబు,పతివ్రతాచరిత్రంబు,కుంభసంభవ ప్రార్థనంబు, తీర్థప్రశంస, శివశర్మోపాఖ్యానంబు, సప్తపురీ ప్రశంస, సంయమనీ ప్రశంస, మహేంద్రలోక దర్శనంబు, వహ్నిసముత్పత్తి, క్రవ్యాద్వ్యరుణ సంభవంబు, గంధవత్యలకా వర్ణనంబు, చంద్రలోకప్రాప్తి, యుడులోక వృత్తాంతంబు, శుక్రసముద్భవంబు, శనైశ్చరలోక వర్ణనంబు, సప్తర్షిలోక ధ్రువలోక వర్ణనంబులు, కుమారాగస్త్య సంవాదంబు, మణి కర్ణికా సముద్భవంబు, గంగామాహాత్మ్యంబు, భైరవావిర్భా వంబు, దండిపాణి జన్మంబు, కళావత్యుపాఖ్యానంబు, సదా చారంబు, బ్రహ్మచారి ప్రకరణంబు, స్త్రీలక్షణంబు, కృత్యా కృత్య ప్రకరణంబు, గృహస్థధర్మంబు, యోగనిరూపణంబు, కాలజ్ఞానంబు, దివోదాసవర్ణనంబు, యోగినీవర్ణనంబు. లోలా ర్కోత్తరార్క- సజ్ఞాదిత్య ద్రుపదాదిత్యారుణాదిత్యా వర్ణ నంబు, దశాశ్వమేధ తీర్థమాహాత్మ్యంబు, పిశాచిమోచనంబు, గణేశ్వర ప్రేషణంబు, గణేశ్వర మాయాప్రపంచంబు, డుంఠి ప్రాదుర్భావంబు, విష్ణుమాయా ప్రపంచంబు, దివోదాస సము చ్చాటనంబు, పంచనదోద్భవత్తి, బిందుమాధవ సంభవంబు,

వైష్ణవతీర్థ మాహాత్మ్యంబు, మందరాచలంబున నుండి యిందు మాళి వారణాసీపురంబున కేచుంచుటయు, జైగీషవ్యోపాఖ్యానంబు, కృత్తివాసస్సముత్పత్తి, దుర్గా మాహాత్మ్యంబు, ఓంకార మాహాత్మ్యంబు, త్రిలోచన సముద్భవంబు, కేదారేశ, ధర్మేశ మాహాత్మ్యంబులు, పక్షి కథ, విశ్వభుజాఖ్యానంబు, దుర్దమ కథ, విశ్వేశ్వరాఖ్యానంబు, కాశీశ్వర, విశ్వకర్మేశ్వర, సతీశ్వరామరేశ్వర వర్ణనంబులు, వ్యాస భుజా స్తంభనంబు, క్షేత్ర తీర్థ కదంబ వర్ణనంబు, ముక్తిమంటప వర్ణనంబు, విశ్వేశ్వరావిర్భావంబు, దేవతాయాత్రా విధానంబు, ననఁబుణ్యాఖ్యానంబు లేకోత్తరశతంబుఁ గలిగి- 82

తాత్పర్యము :- ఈ కాశీఖండము వేదవ్యాస సూత సంవాద రూపమునికూడఁ గొందఱు చెప్పుదురు. ఈ వచనములో స్థూలముగా కాశీఖండమునందలి కథల అనుక్రమణిక యియ్యఁబడినది. ఈ యుపాఖ్యానములు మొత్తము నూట యొక్కటి. తక్కినది సుగమము.

శా॥ ఆశాస్యంబులు సంఘటించును బహూపాఖ్యాన శాఖోపశా
ఖా శోభా సముదంచితాభ్యుదయమై స్కాందాబ్ధిసంజాతమై
యీసానుగ్రహలబ్ధి ముక్తిఫలమై యొక్కాలమున్ శ్రోతకున్
గాశీఖండ మఖండ వైభవమునన్ గల్పద్రుమ ప్రక్రియన్॥ 83

అర్థము :- 'బహూ....అభ్యుదయమై' బహూ=అనేకములైన. ఉపాఖ్యాన = ఉపాఖ్యానములే యనెడి-(కథలే యనెడి). శాఖా = కొమ్మలయొక్క. ఉపశాఖా = రెమ్మలయొక్క. శోభా = శోభచేత. సముదంచిత = మిక్కిలి అందగించిన. అభ్యుదయమై = పెంపుగలదియై. స్కాందాబ్ధిసంజాతమై - స్కాంద = స్కాంద పురాణమే యనెడి. అబ్ధి = సముద్రమునుండి. సంజాతమై = పుట్టినదియై, 'ఈశారాధనలబ్ధి ముక్తిఫలమై' ఈశ = శివునియొక్క. ఆరాధన = సమర్చనముచేత, లబ్ధ = పొందబడిన. ముక్తి = మోక్షమే యనెడి. ఫలమై = ఫలము కలదియై. అఖండ వైభవమునన్ = అఖండ పరిపూర్ణమైన. వైభవమునన్ = వైభవముతో.

శ్రోతకున్ = వినెడివానికి, కాశీఖండము = కాశీఖండము, ఆశాస్యంబులు = శుభము లను. (ఆశీస్సాధ్యములు ఆశాస్యములు సంప్రార్థనీయములైన శుభములు) సమకూర్చును.

వ॥ పూర్వఖండంబున బ్రహ్మర్షి నారదుండు తీర్థయాత్రచరించెనని సూతుండు శౌనకాది మహామునులకుం జెప్పి వారడుగఁ గాశీ వృత్తాంతం బిట్లనిచెప్పందొడంగె. కృష్ణద్వైపాయనుండు ప్రియ శిష్యుఁడైన సూతున కనంతర కథాక్రమంబునం గాశీఖండ కథాకథన ప్రారంభంబున నిట్లనియె. 84

అర్థము :- పూర్వఖండంబునన్ = వెనుకటి ఖండమునందు, బ్రహ్మర్షి = బ్రహ్మర్షియైన. నారదుండు = నారదుఁడు. తీర్థయాత్రన్ = తీర్థయాత్రను చరించెనని = సంచరించెనని, సూతుండు = సూతుఁడు. శానకాది మహాముునులకున్ = శౌనకుఁడు మొదలైన మహాముునులకు. చెప్పి = వివరించి. వారడుగన్ = ఆముును లడుగఁగా. కాశీవృత్తాంతంబు = కాశీవృత్తాంతమును. ఇట్లని = ఈవిధముగా. చెప్పందొండంగెన్ = చెప్పమొదలిడెను. కృష్ణద్వైపాయనుండు = వేదవ్యాసుఁడు. ప్రియశిష్యుఁడైన సూతునకున్ = ప్రియశిష్యుఁడైన సూతునకు. అనంతరకథా క్రమంబునన్ = తరువాతి క్రమముననుసరించి, కాశీఖండ కథాకథన ప్రారంభంబు నన్ = కాశీఖండకథలనుచెప్పుటకు మొదట. ఇట్లనియెన్ = ఇట్లు పలికెను.

తాత్పర్యము :- సుగమము.

- నారదుఁడు వింధ్యమున కేతెంచుట -

తే॥గీ॥ ఇవ్విధంబునఁ దీర్థంబులెల్లనాడి
నర్మదానది నవగాహనం బొనర్చి
దలఁచి గోదావరీ సింధుతటము పట్టి
దంఖకారణ్యవీధి మధ్యంబు దరిసి॥ 85

అర్థము :- ఇవ్విధంబునన్ = ఈరీతిగా. తీర్థంబు లెల్లన్ = ఎల్లతీర్థముల యందు. ఆడి = స్నానముచేసి. నర్మదానదిన్ = నర్మదానదియందు. అవగాహనం బున్ = స్నానమును. ఒనర్చి(దలఁచి = చేయఁదలంచి. గోదావరీ సింధుతటమున్ =

గోదావరీ = గోదావరియనెడి, సింధు = నదియొక్క, తటము = ఒడ్డును, వట్టి = అనుసరించి, దండకారణ్యవీధి మధ్యంబున్ = దండకారణ్య మార్గమధ్యమును, దరసి = సమీపించి.

తాత్పర్యము :- సుగమము.

వ॥ ముందట = అగ్రభాగమునందు- 86

శా॥ కాంచెన్ గాంచన నర్భసంభవుఁడుదగ్రగ్రావ కోటీస్ఖల
చ్చంచన్నిర్ఝర వేణికానివహసంజా తాబ్ధి సాంగత్యమున్
పంచాస్యస్ఫుట కంఠనాథ హత శుంభత్కుంభి దర్పాంధ్యమున్
ప్రాంచాద్ధాటక భూమిభృచ్ఛిఖరగర్వావంధ్యమున్
వింధ్యమున్॥ 87

అర్థము :- 'కాంచనగర్భసంభవుఁడు'- కాంచనగర్భ = హిరణ్యగర్భుఁడు- బ్రహ్మ. సంభవుఁడు=కారణముగాఁ గల నారదుఁడు. 'ఉదగ్ర....సాంగత్యమున్' ఉదగ్ర = ఉన్నతములైన, గ్రావ = శిలలయొక్క, కోటీ = అంచులనుండి, స్ఖలత్ = తొట్రుపడుచున్న, చంచత్ = ప్రకాశించుచున్న, నిర్ఝర = సెలయేళ్ళ యొక్క, వేణికా = ప్రవాహములయొక్క, నివహ = సమూహములచేత, సంజాత = కలిగిన, అబ్ధి = సముద్రముతోనైన, సాంగత్యమున్ = చేరికకలదియును, 'పంచాస్య ..... దర్పాంధ్యమున్' పంచాస్య = సింహములయొక్క (పంచ + అస్యము-విశాలమైన నోరుకలది) స్ఫుట = ప్రకటమైన, కంఠనాద = కంఠధ్వను లచేతనే, హత = నశింపఁజేయఁబడిన, శుంభత్ = ప్రకాశించుచున్న, కుంభి= ఏనుఁగులయొక్క, దర్ప = పొగరేయనెడి, ఆంధ్యమున్ = చీఁకటి కలదియును, 'ప్రాంచత్ .... గర్వావంధ్యమున్' ప్రాంచత్ = (ప్ర + అంచత్) మిక్కిలి మెఱయుచున్న, హాటక భూమిభృత్ = మేరుపర్వతముయొక్క, శిఖర = శృంగము వంటి, గర్వ = గర్వముచేత, అవంధ్యమున్ = సఫలమైన, వింధ్యమున్ = వింధ్య పర్వతమును, కాంచెన్ = చూచెను.

తాత్పర్యము :- ఎత్తైన గండశిలలపై నుండి తొట్రుపడుచుఁ గదలు చున్న సెలయేటి జాలుల మొత్తములతో సముద్రముతోఁ జేతులు కలుపుచున్నదివలె

నున్నదియును సింహముల కంఠధ్వనులచేత విచ్చిపోవుచున్న యేను గుల గర్వాంధ కారములు గలదియును, మేరుశిఖరమువలె సమున్నతమైన గర్వశిఖరముచేత అవంధ్య మైన వింధ్యపర్వతమును బ్రహ్మ మానసపుత్రుడైన నారదమహర్షి చూచెను.

కం॥ రేవాతరంగశీకర ।
సేవా హేవాక పాక శిశిరమరుత్ ప్ర
స్తావ పరికంప్యమాన జ ।
టావలియగుచతఁడు వింధ్యమల్లనఁ జేరెన్ ॥ 88

అర్థము :- రేవా = నర్మదానదియొక్క. తరంగ = కెరటముల యొక్క. శీకర = తుంపరలయొక్క (సూక్ష్మ జలబిందువులు). సేవా = సేవయందలి. హేవాక = ప్రౌఢియొక్క, పాక = పరిపాకముచేత. శిశిర = చల్లనైన మరుత్ = వాయువులయొక్క. ప్రస్తావ = ప్రసక్తిచేత. పరికంప్యమాన = అన్నివైపులనుండి కదలింపఁబడుచున్న. 'జటావళియగుచున్' జటా = జడలయొక్క. ఆవళియగు చున్ = శ్రేణికలవాఁడగుచు. అతఁడు = ఆ నారదుఁడు. వింధ్యమున్ = వింధ్య పర్వతమును. అల్లనన్ = నెమ్మదిగా. చేరెన్ = సమీపించెను.

తాత్పర్యము :- నర్మదానది కెరటములనుండి చింది పడుచున్న జలబిందువు లను సేవించుటచేత మిక్కిలి చల్లనైన వాయువుల ప్రసక్తిచేత నలువైపులనుండి కదలింపఁబడుచున్న జటాభరము కలవాఁడై ఆ నారదమహర్షి వింధ్యపర్వతమును నెమ్మదిగా సమీపించెను.

విశేషము :- నర్మద-శివుని జలమయస్వరూపము. బాణలింగములకు ఖని. దర్శనమాత్రముచేతనే ముక్తి నిచ్చునది. వాయువున కుండవలసిన లక్షణములలో శైత్యము, మాంద్యము నిందు సూచింపఁబడినవి. నర్మదా సమీరములు శివాభిమర్శ నము గలవి.

'ఉల్లల దలకాజలకణ' అను మనుచరిత్రములోని పద్యమునకును, 'పంపా తరంగరింఖణ' అను పాండురంగ మాహాత్మ్యములోని పద్యమునకును, 'చోళీ హల్లకచితకచపాళీ' అను ఆముక్తమాల్యదలోని పద్యమునకును, ఈ శ్రీనాథుని పద్యమే వరవడి।

కం॥ తాపసకులాగ్రగణ్య
శ్రీపాదాంభోజ యుగళ చిహ్నాశ్రేణీ
నైపథ్య పరమపుణ్య శి
లాపట్టంబగుచు నయ్యిలాధర మలరెన్ 89

అర్థము :- తాపసకుల = తాపసుల సమూహమునందు, అగ్రగణ్య = మొదట పరిగణింపఁదగిన నారదునియొక్క, శ్రీపాద = శ్రేయోనిధానములైన పాదములే యనెడి, అంభోజయుగళ = పద్మయుగళముయొక్క--తామరపూవుల జంటయొక్క, చిహ్న = ముద్రలయొక్క, శ్రేణీ = వరుసయే యనెడి, నైపథ్య = అలంకరణముచేత, పరమపుణ్య = పరమపావనములైన, శిలాపట్టంబగుచున్ = శిలాఫలకములుగలది యగుచు, అయ్యిలాధరము (ఆ+ఇలాధరము) = ఆభూధరము, అలరెన్ = ప్రకాశించెను - ప్రహర్షమును పొందెను.

తాత్పర్యము :- తాపసులలో అగ్రగణ్యుఁడైన నారదమునియొక్క శ్రీపాద పద్మ యుగళముద్రలే యనెడి అలంకరణముచేత పరమ పావనములైన శిలాఫలకములతో ఆ వింధ్యపర్వతము మిక్కిలి ప్రకాశించెను.

విశేషము :- 'నరనారాయణ చరణాంబురు హద్వయభద్ర చిహ్న ముద్రిత బదరీ' అను మనుచరిత్ర పద్యముపై- ఈ శ్రీనాథుని పద్యముయొక్క పదచిహ్నములు కలవు.

సీ॥ త్రసరేణు పరిమాణ ధాతుధూళీపాళి
యలకంబులకు వింత చెలువ మొసఁగ
ఘనమైన రారాపు చనుదోయి రాయిడి
నిఱుపేద నడిమికి వెఱపుఁజూపఁ
దొలుకాటు మెఱుఁగుదీఁగెలఁ బోలు కన్నులు
వడఁదాఁకి యొక్కింత వాడఁబాఱి
సిందూర తిలకంబు చెమట చిత్తడిఁ దాఁకి
యలికభాగంబునం దసలుకొనఁగఁ

తే।గీ। గనక మేఖల జఘనచక్రమున జాఱి
నీవి బంధంబు నాభిపై నెమ్మి వదల
మహతి ధరియించి యొక తను మధ్య తన్ను
ననుసరించుచు గాంధర్వ మభ్యసింప ।। 90

అర్థము :- త్రసరేణు = కదలచున్న సూక్ష్మరేణువుల యొక్క, పరిమాణ= పరిమితికల. 'ధాతుధూళీపాళి' ధాతు = జేగురు కొళ్ళయొక్క, ధూళీ = పరాగము యొక్క, పాళి = వరుస, అలకంబులకున్ = ముంగురులకు, వింతచెలువమున్ = క్రొత్త యందమును, ఒసఁగన్ = కల్పింపఁగా. 'ఘనమైన....రాయిడి' ఘనమైన= నిబిడమైన - దట్టమైన. రారాపు (రాపు + రాపు-రారాపు) = పరస్పర సంఘర్షణము గల, చనుదోయి = స్తనద్వయముయొక్క, రాయిడి = ఒరయిక, నిరుపేద నడిమి కిన్ = మిక్కిలి సన్నమైన నడుమునకు, వెఱపుచూపన్ = భయోద్వేగమును గల్పించుచుండఁగా. 'దొలుకాఱు....కన్నులు' తొలుకాఱు = తొలకరియందలి, మెఱుఁగుఁదీగెలన్ = తీఁగెలవంటి మెఱుగులను, పోలు = పోలునట్టి కన్నులు = నయనములు, వడఁదాఁకి = వడతగిలి-శ్రమతగిలి, ఒక్కింత (ఒక్క + ఇంత) = ఇంచుక, వాడఁబాఱన్ = వాడిపోవుచుండఁగా- 'సిందూర తిలకంబు' సిందూర = సిందూరముతోఁ దీర్చిన, తిలకంబు = బొట్టు. 'చెమట చిత్తడిఁ దాఁకి' చెమట = స్వేదముయొక్క. చిత్తడి (చిఱుత + తడి = చిత్తడి) = అల్పమైన ఆర్ద్రత. తాఁకి = తగిలి. అలికభాగంబునందున్ = నొసలి ప్రదేశమునందు. అసలుకొనఁగన్ = ఱదదవలె కాఁగా. కనకమేఖల = బంగారు మొలనూలు. జఘనచక్రమునన్ = జఘన మండలమునుండి. జాఱన్=జాటిపోగా - (స్త్రీ కటిమండలము యొక్క ముందటి భాగము జఘనము. వెనుక భాగము నితంబము), నీవిబంధంబు=పోకముడి. వస్త్రగ్రంధి, నాభిపై = నాభిస్థలముమీఁది, నెమ్మిన్ = నెయ్యమును. వదలన్ = విడువఁగా, మహతిన్ = 'మహతి' అను పేరుగల వీణను (నారదుని వీణపేరు మహతి. సరస్వతి వీణె పేరు కచ్ఛపి), ధరియించి=తాల్చి, ఒక తనుమధ్య = ఒక తరుణి (సన్నని నడుము గలది). తన్నున్ = తన్ను (నారదుని), అనుసరించుచున్ = అనుసరించి వచ్చుచు - వెన్నంటి వచ్చుచు. గాంధర్వమున్ = గాంధర్వ వేదమును, అభ్యసింపన్ = అభ్యాసము చేయుచుండఁగా-

తాత్పర్యము :- అల్పమైన గైరిక పరాగము చెదరిపడి ముంగురుల కొక

వింతయందమును సంతరించుచుండఁగా. నిబిడమై పరస్పరము నొరసికొనుచున్న చనుదోయి బరువుచేత నిరుపేద నడుము జవ్వాడుచుండఁగా, తొలకరి మెఱుపుఁ దీఁగెలవంటి కన్నులు వడతగిలి కొంచెము వాడిపోవుచుండఁగా, చెమటచేత కరఁగిన సింధూరపుబొట్టు నొసలంతయు వ్యాపింపఁగా, బంగరు మొలనూలు జఘనవలయము నుండి జాఱుచుండఁగా, పోకముడి నాభీస్థలమునుండి క్రిందికి జాఱఁగా, 'మహతి'ని మోసికొని ఒక తరుణీ గాంధర్వము నభ్యసించుచుఁ దనవెంట గొలిచిరాఁగా-

విశేషము :- ఈ శిష్యురాలు మూలములో లేదు. పెద్దనాదుల స్త్రీమూర్తి చిత్రణమునకు- ఈమెయే ఆలంబనము. 'చేర్చుక్కగానిడ్డచిన్ని జాబిల్లి' 'తత నితంబా భోగ ధవళాంశుకములోని' మనుచరిత్రము. 'నఖరాగ్రలూనానన స్వేదకోరకం బర్థ కషాయదృగంచలంబు' రామకృష్ణకవి.

— వింధ్యవర్ణనము —

సీ॥ కర్పూరకదళికా కాంతార పవనంబు
లధ్వనీనుల శ్రాంతి నపనయింప
మదురంగఁ బండిన మామూరఫలములు
చెంచుకన్యల కుచశ్రీలఁ జెనయ
నురగవల్లీ గాఢ పరిరంభణంబులఁ
బోక వ్రాఁకుల కిఁపు పురులుకొనఁగఁ
బాటలీవకుళ చంపక సౌరభముతోడ
విచికిలామోదంబు వియ్యమందఁ

తే॥గీ॥ గమియ నామూలచూడంబుగా ఫలించి
యంబరము మోచియున్న యుదుంబరములు
లీల ప్రహ్మాండభాండ మాలికల భూష
లవధరించిన వృషభాంకు ననుకరింప ॥ 91

అర్థము :- 'కర్పూర....పవనంబు' కర్పూరకదళికా = కప్పురపుటనంటి చెట్లయొక్క. కాంతార = జీబుకొనిన యడవులపైనుండి వచ్చిన, పవనంబు =

గాలి, 'అధ్వనీనుల శ్రాంతిన్' అధ్వనీనుల = బాటసారుల యొక్క, శ్రాంతిన్ = బడలికను, అపనయింపన్ = తొలగింపఁగా-

'మదురంగ.... ఫలములు' మదురంగన్ = కమియఁగా - పరిపూర్ణముగా, పండిన = పరిణతములైన, మాలూరఫలములు = మారేడుపండ్లు, చెంచుకన్యల = చెంచుప్రోయాండ్రయొక్క, కుచశ్రీన్ = స్తనశోభలను, చెనయన్ = ఎదిరింపఁగా-పోలఁగా-

'ఉరగవల్లీ గాఢపరిరంభణంబులన్' ఉరగవల్లీ = తమలపాకు తీఁగెలయొక్క, గాఢ = నిబిడమైన, పరిరంభణములన్ = కౌగిలింతలచేత, పోఁకమ్రాకులకున్ = పోఁకచెట్లకు, ఇంపు = సుఖము, పురులుకొన గన్ = క్రమ్మికొనఁగా, పాటలీ = కలిగొట్టుపూవులయొక్క, వకుళ = పొగడపూవులయొక్క, చంపక = సంపెంగ పూవులయొక్క, సౌరభముతోడ=ఘ్రాణతర్పణమైన నెత్తావితో 'విచికిలామోదంబు' విచికిల = మల్లెపూవులయొక్క, ఆమోదంబు = సుదూరమునకు వ్యాపించు పరిమళము, వియ్యమందన్ = సంబంధము కలుపుకొనఁగా, కమియన్ = నిండునట్లు, ఆమూలచూడంబుగా = మొదటినుండి చివరివఱకు - ఆపాదమస్తకముగా, ఫలించి = పండి, అంబరమున్ = ఆకాశమును, మోచియున్న = వహించియున్న - స్పృశించియున్న, ఉదుంబరములు = మేడిచెట్లు, లీలన్ = లీలతో, బ్రహ్మాండభాండ = బ్రహ్మాండములను కుండలయొక్క, మాలికల = మాలికలరూపమైన, భూషలు = నగలను, అవధరించు = అంగీకరించిన, వృషభాంకున్ (వృషభ + అంకు) వృషభధ్వజుఁడైన శివుని, అనుకరింపన్ = అనుకరించుచుండఁగా-

తాత్పర్యము :- కర్పూరపు టరటితోటలమీఁదుగా వచ్చుచున్న వాయువులు గంధ మృదుత్వ శైత్యములచేత బాటసారుల బడలికలు తీర్చుచున్నవి. మదురఁబండిన మారేడుపండ్లు చెంచెతల కఠిన స్థనసౌష్ఠవములతో రాయుచున్నవి. తమలపాకు తీఁగెల దట్టపుఁ కౌఁగిళ్ళలో పోఁకచెట్లు పారవశ్యమును భజించుచున్నవి. కలిగొట్టులు, పొగడలు, సంపెంగలు- ఈ పూవులయొక్క ఘ్రాణతర్పణములైన నెత్తావులు- మిక్కిలి దూరమునకు ప్రసరించుచున్న మల్లెపూవుల వాసనలతో వియ్యమందుచున్నవి. కాండమునుండి చిటారుకొమ్మ వఱకు విరుగఁబడి ఆకసము నంటుచున్న మేడిచెట్లు ఆపాదమస్తకము బ్రహ్మాండభాండ మాలామయములైన భూషణముల నవధరించి నిటారుగా నిలిచియున్న వృషభధ్వజుఁడైన పరమశివుని ననుకరించుచున్నవి.

విశేషము :- గాలులు కర్పూరటరటి తోటలపై నుండి వచ్చుచున్నవి కావున లేతయరటి యాకులు వీవనలని తోచుచున్నవి. మారేడు పండ్లు శబరీ స్తనమండలములతో రాయుచున్నవనుట చేత కాఠిన్యము, సౌష్ఠవము, వర్ణము, సూచితములగుచున్నవి. పాటలీచకుళ చంపక సౌరభములు విచికిలామోదముతో వియ్యమందుచున్న వనుటచేత జన్మాంతరానుగతములైన పుణ్యవాసనలు స్ఫురించు చున్నవి. ఆపాదమస్తకము ఫలించి మిన్నులొరయుచున్న మేడిచెట్లు బ్రహ్మాండ మాలలను ధరించిన వృషభాంకుని ననుకరించుచున్న వనుటచేత 'విశ్వాధికోరుద్రో మహర్షిః' (శ్రుతి) శివుని విశ్వోన్నతత్వమును సూచించుచున్నవి, మేడిచెట్టు 'జంతు ఫలము.. జీవగర్భములైన పండ్లగలది. బ్రహ్మాండభాండములును ప్రాణులుగర్భము కావున మేడిపండ్లకు బ్రహ్మాండములతో పోలిక సాభిప్రాయము.

క॥ దరవికచ వకుళ కురవక
పరిమళ సంభారలోల బంభరమాలా
పరిషత్ఝుంకార ధ్వని
తెరువరులకు మన్మథ ప్రదీపన మొసగన్ ॥ 92

అర్థము :- దర = కొంచెము, వికచ = విరిసిన, (అరవిరిసిన) వకుళ = పొగడపూలయొక్క, కురవక = గోరింటపూవులయొక్క, పరిమళ - నెత్తావుల యొక్క, సంభార = మొత్తములయందు, లోల = ఆసక్తికల, బంభరమాలా = భ్రమర మాలలయొక్క, పరిషత్ = పరిషత్తులయొక్క, గుంపులయొక్క, ఝుంకార ధ్వని = 'జు' మ్మనునాదము, తెరువరులకు = బాటసారులకు-విరహులకు, మన్మథ ప్రదీపనము = కామభావోద్దీపనమును, ఒసగన్ = ఇచ్చుచుండగా.

తాత్పర్యము:- అరవిరిసిన పొగడలయొక్క గోరింటలయొక్క నెత్తావి మొత్తములయందు ఆలోలములైన బంభరమాలా పరిషత్తులయొక్క 'జు'మ్మను నాదము బాటసారులకు మన్మథభావమును ఉద్దీపింపఁ జేయుచుండఁగా-

వ ॥ వెండియుఁ గర్క-రేటు కఠోరతారతరరటనంబును దాత్యూహ వ్యూహకహకహారావ కోలాహలంబును గలకంఠ కంఠకోమల కుహూకారంబును మదకలకలవింక చూంకృతంబును గాక కాకలీ కలకలంబును బుంఖానుపుంఖధ్వనుల్లీ ఝుంకార ధారా

ప్రసారంబును సముద్ధతధ్వాంక్ష నిధ్వానపాటవాటోపంబును
సముత్కటోత్రోక్తశాంత వ్యాళ్ళిసారంభ సంభ్రమంబును
గోయష్టి వదన నిష్ఠ్యూత నిష్ఠురారావ నిష్ఠాసోష్మవంబునుం
గూడి కిటి శరభ గండ వేదండ సింహశార్దూల గవయ సృమర
చమర వాత ప్రవీలులాయ ఖడ్గరురు కురంగ భల్లూకఫేరవ
గోలాంగూలాది నానామృగంబులయెలుఁగులతోడఁ గీడ్పొఱసి
లతాకుడుంగ గర్భంబులం బ్రతిశబ్దంబు లావిర్భవింపఁజేయఁ గిస
లయ ముకుళ కుసుమ శలాటు ఫలభరితంబై బిసరుహ బాంధ
వుని కిరణ విసరంబులను సాగయనీయక మసమసకని యిరుల
సలుకొనుచు నిసుకచల్లివరాలని పసరుడాల వింధ్య వసుంధ
రాధర ప్రాంతకాంతారంబు దఱిసిచనువాఁడు ముందట- 93

అర్థము :- మెండియున్ = మఱియును. 'గర్కరేటు .... రటనంబును' కర్కరేటు=పెద్దకొక్కెరలయొక్క, కఠోర=కర్ణకఠోరమైన, తారతర=తారస్థాయిని మించి యున్న. రటనంబును = కూఁతయును, 'దాత్యూహ .... కోలాహలంబును' దాత్యూహ = 'కూఁతురు గుడ్డంగి పిట్టలయొక్క-వానకోయిలలయొక్క, వ్యూహ= పదువుయొక్క-సమూహముయొక్క,"కహకహ"=కహకహఅనెడి, ఆరావ=ధ్వనుల యొక్క, కోలాహలంబును = సందడియును, 'కలకంఠ .... కుహూకారంబును' కలకంఠ = కోకిలలయొక్క. కంఠ = కంఠధ్వనికి సంబంధించిన, కోమల = సుకుమారమైన, కుహూకారంబును = 'కుహూ' అనుశబ్దమును, 'మదకల....చూం కృతంబును' మద = మదముచేత, కల = అవ్యక్తమధురమైన, కలవింక = పిచ్చి కలయొక్క, చూంకృతంబును = 'చూం' కారధ్వనియును, కాక = అదియేకాక, కాకలీ = అవ్యక్త మధురధ్వనులయొక్క, కోలాహలంబును = కలకలమును, 'పుంఖాను పుంఖ..... ధారా ప్రసారంబును' పుంఖానుపుంఖ = ఎడతెగని,యిల్లీ = కీచురాళ్లయొక్క 'ఝుం' కార ధ్వనులయొక్క, ధారా = అవిచ్ఛిన్నమైన, ప్రసారం బును = ప్రసరణమును, 'సముద్ధత....ఆటోపంబును' సముద్ధత = మిక్కిలిపొగురు గొన్న, ధ్వాంక్ష = కాకులయొక్క. నిధ్వాన = కటుధ్వనులయందలి, పాటవ = పటుత్వముతో, గూడిన, ఆటోపంబును = వేగిరపాటును - సంభ్రమమును, 'సముత్కట....సంభ్రమంబును' సముత్కట = మిక్కిలి మఱించిన, ఉత్రోక్త=

పెన్నడ పక్షులయొక్క కోలాహలముచేత, శాంత = ఉపశమించిన, వ్యాగ్ర = పెద్ద పులులయొక్క, సంరంభ = కోపముయొక్క, సంభ్రమమును = వేగిరపాటు, 'కోయష్టి .... స్ఫోషవంబును' కోయష్టిక = చీకుకొక్కెరలయొక్క, వదన=ముఖ ములనుండి, నిష్ఫ్యాత = వెలువరింపబడిన - (ఉమియబడిన) నిష్ఠుర = తీవ్ర మైన, ఆరావ = ధ్వనులయందలి, నిష్ఠా = శబ్దయొక్క, సౌష్ఠవంబునన్ = సుష్ఠు భావమును-ససితనమును, కూడి = కలసి, (ఇంతవఱకు అడవి పక్షుల ధ్వనులను గూర్చి, ఇకముందు అడవిమృగములను గూర్చి) 'కిరి.... ....యెలుంగులతోడ గీడ్చెరసి' కిరి = వన వరాహములు, శరభ = శరభమృగములు, గండ = ఖడ్గ మృగములు, వేదండ = ఏనుగులు, శార్దూల = పెద్దపులులు, సింహ = సింహ ములు, గవయ = గోసదృశమృగములు, వాతప్రమీ = గాలికెదురుగా బరువెత్తెడి యొకానొక మృగము, లలాయ = దున్నపోతులు, ఖడ్గమృగములు, రురు = ఒక రకపుదిప్పి, కురంగ = వేళ్ళు, భల్లూక = ఎలుగుబంట్లు, ఫేరవ = నక్కలు, గోలాంగూల = కొండముచ్చులు, ఆది = మొదలైన, నానా = అనేకవిధములైన, మృగంబుల = వన్యమృగములయొక్క, యెలుంగులతో, కీడ్చెబసి = సంకీర్ణ ములై, లతాకుడుంగ = లతాగృహములయొక్క, గర్భంబులన్ = లోపలిభాగముల యందు, ప్రతిశబ్దంబులు = పర్తిధ్వనులను, ఆవిర్భవింపంజేయన్ = ఉదయించు నట్లు చేయగా, 'కిసలయ.... భరితంబై' కిసలయ = చిగురుటాకులతో, ముకుళ = మొగ్గలతో, కుసుమ = పువ్వులతో, ఫల = పచ్చికాయలతో, ఫల = 'పండ్లతో, భరితంబై = నిండినదియై, బిసరుహ = పద్మములకు, బాంధవుని = బంధువైన, సూర్యునియొక్క, కిరణ = కిరణములయొక్క, విసరంబులన్ = సమూహములను సొగయనీయక = ప్రవేశింపనీయక, మసమసకని = మసక మసకయైన, ఇరులు = చీకట్లు, ఆసలుకొలుచున్ = పంకిలములగుచు, ఇసుకచల్లినన్ = ఇసుకచల్లినను, రాలని = రేణువులు క్రిందపడని, పసరుడాల = ఆకుపచ్చని కాంతిగల, వింధ్య= వింధ్యమనెడి, వసుంధరాధర = భూధరముయొక్క, ప్రాంత = సమీపమునందలి, కాంతారంబున్ = చొఱకాని యడవిని, దఱిసిచనునాడు = సమీపించివెళ్ళువాడు, ముందటన్ = ఎదుట -

తాత్పర్యము :- పలురకములైన అడవిపక్షుల అడవిమృగముల సంకీర్ణ ధ్వనులు ఇందు వర్ణింపబడి అడవి ప్రయాణమును స్ఫురింపజేయుచున్నవి.

పట్టణములలో పల్లెలలోనుండి మనుష్యుల లోకమునే యెటిఁగియున్న వారికిని యొక విలక్షణమైన అనుభవమును గల్పించును. పశుపక్షుల లోకము, పశుపక్షులది.

విశేషము :- ఈ గద్యములో 'గండ', 'ఖడ్గ' శబ్దములు విడివిడిగా వాడఁబడినవి. నిఘంటువులలో రెండింటికిని ఒకే యర్థము కనిపించుచున్నది. మను చరిత్రములోగూడ. ఈ రెండు శబ్దములు విడివిడిగా వాడఁబడియున్నవి. 'ఉద్దండ గండక వేదండ వరాహ వాహరిపు ఖడ్గవ్యాఘ్రు మిమ్మంచుఁ గొండకు రాఁజెల్లునే'. గండక, ఖడ్గ, మృగములకు, గో, గవయములకు వలెనే సూక్ష్మభేద ముండి యుండ వచ్చును.

మ॥ నలినప్రోద్భవసూతి కన్గొనియె వింధ్యక్ష్మోణిభృత్కందరా
బలవద్గండ శిలాభిఘాత విలుఠత్పాథస్తరంగచ్ఛటా
స్ఖల సంరంభ విజృంభమాణపటు ఝుంకారస్ఫుటాంతర్మదన్
గలనాతత్పర భక్తలోక పరిరక్షాశర్మదన్ నర్మదన్ ॥ 94

అర్థము :- 'వింధ్యక్ష్మోణిభృత్ ....అంతర్మదన్' వింధ్యక్ష్మోణిభృత్ = వింధ్య పర్వతముయొక్క, కందరా = గుహలయందలి, బలవత్ = ప్రబలములైన, గండ శిలా = పెద్ద రాళ్ళయొక్క, అభిఘాత = ఎదురుదెబ్బలచేత, విలుఠత్ = పొరలి పడుచున్న, పాథః = జలములయొక్క, తరంగచ్ఛటా = తరంగ సమూహముల యొక్క, స్ఖల = తొట్రుపాటుతోఁ గూడిన, సంరంభ = వేగిరపాటుతో, విజృంభ మాణ = విజృంభించుచున్న, పటు = సమర్థమైన, ఝుంకార = ఝుంకార ధ్వని చేత, స్ఫుట = పరిస్ఫుటమైన - అభివ్యక్తమైన, అంతర్మదన్ = లోపల మదము గలట్టియు, 'కలనా ....శర్మదన్' కలనా = పూజాచరణమునందు, తత్పర = తదేకా సక్తులైన, భక్తలోక = భక్తలోకముయొక్క, పరిరక్షా = పరిరక్షణరూపమైన, శర్మ దన్ = సుఖము నిచ్చునట్టి, నర్మదన్ = నర్మదానదిని, 'నలినప్రోద్భవసూతి' నలిన ప్రోద్భవ = పద్మమునుండి యుదయించిన బ్రహ్మనుండి, సూతి = పుట్టిన నారదుఁడు, కన్గొనియెన్ = చూచెను.

తాత్పర్యము :- వింధ్యపర్వత ప్రాంత భూములు గుహలు, పెద్దపెద్ద గండ శిలలతో నిండియుండును. ఉరవడితో వచ్చుచున్న నర్మదా ప్రవాహ జలములకు ఆ గండశిలల యెదురుదెబ్బలు తగిలి కెరటములు ఝుంకార ధ్వనులతో పొరలిపడు

చుండును. ఆ తరంగ ఝంకారములలో ఆ నదియొక్క అంతర్మదము అభివ్యక్తమగుచున్నది. ఆ నర్మద పూజాతత్పరమైన భక్తలోకమునకు పరిరక్షా శర్మద పరిరక్షణమైన సుఖమును గల్పించునది.

తే॥గీ॥ దివిజముని నర్మదానదిఁ దీర్థమాడి
విమలభస్మంబు నిఖిలాంగకముల నలఁది
యజుత రుద్రాక్షమాలిక లనువుపఱచి
భవుని నోంకారనాథుని భక్తిఁ గొలిచె ॥ 95

అర్థము :- దివిజముని = దేవమునియైన నారదుఁడు, నర్మదానదిన్ =నర్మదానదియందు, తీర్థమాడి = తీర్థస్నాన మాచరించి, విమల = నిర్మలమైన, భస్మంబున్ = విభూతిని, నిఖిలాంగకములన్ =అన్ని యవయవములయందును, అలఁది = పూసికొని, అజుతన్ = కంఠమునందు, రుద్రాక్షమాలికలు = రుద్రాక్షమాలలను, అనువుపఱచి = అనువుగా ధరించి, ఓంకారనాథుని = 'ఓంకారేశ్వరుఁ'డైన, భవునిన్ = శివుని, భక్తిన్ = భక్తితో, కొలిచెన్ = సేవించెను.

తాత్పర్యము :- దేవర్షియైన నారదుఁడు నర్మదానదియందు తీర్థస్నానమునాచరించి సకలావయవములయందును భస్మానులేపన మొనరించి కంఠసీమయందు రుద్రాక్షమాలలను ధరించి ఓంకారేశ్వర శివలింగమును భక్తితో సేవించెను.

వ॥ అప్పుడు-అప్పుడు = ఆ సమయమునందు, 96

తే॥గీ॥ స్థావరంబైన రూపఁబు జలదవీథి
నావరించుచు మొదల నున్నట్లు యుండ
జంగమంబైన రూపఁబు సవదరించి
యెదురుగా వచ్చె వింధ్య మహీధరంబు ॥ 97

అర్థము :- 'స్థావరంబైన రూపంబు' స్థావరంబైన = పర్వతస్వరూపమైన, రూపంబు = ఆకారము, జలదవీథిన్ = మేఘమార్గమును.ఆకాశమును, ఆవరించుచున్ = ఆచ్ఛాదించుచు మొదలన్ = పూర్వమునందు, ఉన్నట్లయుండన్ =ఉన్నట్లే యుండఁగా, జంగమంబైన రూపంబున్' జంగమంబైన = కరచరణాదులతోఁగూడిన, రూపంబు = ఆకారమును, సవదరించి = ధరించి, వింధ్యమహీధరంబు= వింధ్యపర్వతరాజు, ఎదురుగా వచ్చెన్ = ప్రత్యుద్గమనము చేసెను.

తాత్పర్యము :- పర్వతములు, నదులు, అరణ్యములు మొదలైనవానికి రెండు రూపము లుండును. బాహ్యమైన భౌతికరూప మొకటి. ఆంతరమైన దేవతా రూప మొకటి. మొదటిది స్థావరము. రెండవది జంగమము. స్థావరమైన యాకారము ఆకాశము నావరించి పూర్వ మున్నట్లే యుండఁగా, జంగమరూపముతో వింధ్యపర్వతము దేవర్షియైన నారదునకుఁ బ్రత్యుత్థానము చేసి యెదురు వచ్చెను.

విశేషము :- పెద్దలు వచ్చుచున్నట్లు తెలియఁగనే శ్రేయస్కాముఁడైన వాఁడు ఎదురేగి తీసికొనిరావలయు ననుట శిష్టాచారము.

తే॥గీ॥ అతిథి కడు నల్పుఁడైన నత్యధికుఁడైన
నింటికేతేర బ్రియమందు నెవ్వఁడేని
వాని గౌరవమది గౌరవంబుగాని
కాదు గౌరవ మాకార గౌరవంబు ॥ 98

అర్థము :- అతిథి = గృహాగతుఁడైన యతిథి. కడునల్పుఁడైనన్ = మిక్కిలి కొంచెమువాఁడైనను, అత్యధికుఁడైనన్ = మిక్కిలి గొప్పవాఁడైనను. ఇంటికేతేరన్ (ఇంటికిన్ + ఏతేరన్) = ఇంటికి రాఁగా, ఎవ్వఁడేనిన్ = ఎవ్వఁడయితే, ప్రియమందున్ = సంతోషించునో, ప్రియపడునో, వాని గౌరవము = అట్లు ప్రియమందువానియొక్క గౌరవము, అది = అదియే, గౌరవంబుగాని = గౌరవముకాని, ఆకారగౌరవంబు = ఆకారమందలి గౌరవము, గౌరవము కాదు = గౌరవము కాదు.

తాత్పర్యము :- అతిథి యన్నవాఁడు అత్యల్పుఁడైనను, అత్యధికుడైనను ఇంటికి వచ్చినపుడు తుల్యముగా నెవ్వఁడు ప్రియమందునో అట్టివాని గౌరవము గౌరవముగాని, ఆకారగౌరవము గౌరపము కాదు.

99॥ మొగులు ముట్టిన మహా మూర్ధంబు ధరమోవఁ
బాదాంబుజములకుఁ బ్రణతిఁ జేసి
యంతరంగముకంటె నత్యున్నతంబైన
పృథుహేమపీఠంబు వెట్టఁ బనిచి

దధ్యాజ్యమధుపుష్పదర్భాదికములైన
యష్టాంగములతోడి యర్ఘ్యమిచ్చి
యాత్రాసముత్థితా యాసఖేదము వాయ
నంఘ్రి సంవాహనం బాచరించి

తే॥గీ॥ శ్రాంతి దీఱుట యెఱిఁగి హస్తములు మోడ్చి
వినయ వినమితగాత్రుఁడై విన్నవించెఁ
దన గుహారంధ్రములు ప్రతిధ్వనుల సేన
వేల్పుఁదపసికి నిట్లని వింధ్య శిఖరి ॥ 91

అర్థము :- 'మొగులు ముట్టిన .... ధరమోవన్' మొగులు ముట్టిన=మేఘమును స్పృజించిన మహా మూర్ధంబు = (మహత్ + మూర్ధంబు) మిక్కిలి యెత్తైన శిరస్సు, ధరమోవన్ = భూమిని స్పృశింపఁగా, పాదాంబుజములకున్ = పుప్పులవంటి పాదములకు, ప్రణతిన్ = ప్రణామమును, చేసి = ఆచరించి, అంత రంగముకంపెన్ - హృదయముకంపె = అత్యున్నతంబైన = (అతి + ఉన్నతము) అధికోన్నతమైన, పృథుహోమపీఠంబు-పృథు=పెద్దదియైన, హోమపీఠంబు= స్వర్ణపీఠమును, పెట్టఁబనిచి పెట్టుటకు నాజ్ఞాపించి, "దధ్యాజ్య....దర్భాదికములైన' దధి = పెరుగు, ఆజ్య = ఆవునేయి, మధు = తేనె, పుష్ప = పువ్వులు, దర్భ = కుశలు, ఆదికములైన = మొదలుగాఁగల, అష్టాంగములతోడి = ఎనిమిది యంగములతోడి; అర్ఘ్యము = పూజాయోగ్యములైన ద్రవ్యముల సముదాయమును, ఇచ్చి= సమర్పించి, 'యాత్రా....సముత్థితాయాసఖేదము' యాత్రా=యాత్రవలన, సముత్థిత= ఉదయించిన, ఆయాస = ఆయాసమువల్లనైన, ఖేదము = బడలిక, పాయన్ = తొలఁగిపోవునట్లు, 'అంఘ్రిసంవాహనంబు' అంఘ్రి = పాదములయొక్క, సంవాహనంబు = ఒత్తుటను, ఆచరించి = చేసి, శ్రాంతిదీఱుట = బడలికతీఱుట, ఎఱిఁగి= తెలిసికొని, హస్తములు మోడ్చి = చేతులు మొగిడ్చి, 'వినయ....గాత్రుఁడై' వినయ = వినయముచేత వినమిత = వంగిన, గాత్రుఁడై = శరీరముగలవాఁడై, వేల్పుఁదపసికిన్ = దేవమునియైన నారదునకు, వింధ్యశిఖరి = వింధ్యపర్వతరాజు, 'తన గుహారంధ్రములన్' తన = తనయొక్క, గుహారంధ్రములు = గుహాంతర్భాగములు, ప్రతిధ్వనులన్ = ప్రతిశబ్దములను, ఈనన్ = ప్రసవింపఁగా, ఇట్లని = ఈవిధముగా, విన్నవించెన్ = విన్నపము చేసెను.

తాత్పర్యము :- మేఘమండలమును దాకిన తన మహోన్నత శిరస్సు నేలను దాకునట్లు నారదమహాముని పాదములకు ప్రణమిల్లి, తన హృదయము కంటె అధికోన్నతమైన స్వర్ణమయపీఠమును బెట్ట నాజ్ఞాపించి, పెరుగు నేయి, తేనె, ఆర్ద్రాక్షితలు, ఆర్ద్రదూర్వలు, తిలలు, దర్భలు, పూవులను అష్టాంగములు గల అర్ఘ్యమును సమర్పించి, యాత్రాజనితమైన బడలిక తీఱునట్లు పాదములు పట్టి, బడలిక తీఱుట తెలిసికొని, చేతులు మోడ్చి వినయముచే నొదిగి వింధ్యపర్వతరాజు దేవర్షికి, తన గుహలు ప్రతిధ్వనుల సీనునట్లు ఈవిధముగా విన్నవించెను. (అర్ఘ్యము అష్టాంగము)

విశేషము :- సదధ్నా మధునాజ్యేన నీరాద్రిక్షి తదూర్వయా
తిలైః కుశైః ప్రసూనై స్తు మష్టాంగార్ఘ్యోరపూజయత్ ॥

న॥ మహానుభావా! భవదీయ కృపాకటాక్షవీక్షా సుధారస ప్రవాహంబున రజః ప్రసరంబును ద్వదంఘ్రి నఖచంద్రమండల జ్యోత్స్నా సమున్మేషణాబునం దమఃకాండంబును ఖండింపం బడియె. ఇంతకాలమునకుఁ బ్రాగ్జన్మకృతంబులైన సుకృతంబులు ఫలించె. విశ్వ విశ్వంభరాభరణ దీక్షాధుర ధరంబులగు నాకులంబు వసుంధరాధరంబులలోన మాన్యుండ నైతి. ధన్యుండఁ గృతార్థుండ; భాగ్యవంతుండ; నది యట్లుండె. యుష్మత్పాదారవింద సందర్శనంబునం బ్రభవించిన యానంద ప్రవాహంబు వెల్లివిరిసిన కతంబున నేయర్థంబునకు నవకాశంబు లేదు. ఐనను నొక్క విన్నపంబు. సావధానమతివై యవధరింపుము. నీకు సేవాంజలీపుటంబు. పంచాశత్కోటి విస్తీర్ణంబైన భూమండలంబునందు నీవు చూడనియట్టి మహీధరంబులు లేవ. కొండలు లెక్కకుఁ బెక్కు కలుగుంగాక. ఎనిమిది దిక్కుంజరంబులకు దిక్కె కూర్మంబునకు నర్మిలియై క్రీడాక్రోడంబునకుఁ దోడై పాఁపజేనికిం బ్రాపై యేనుబోలె నెక్కటి యీ సర్వసర్వంసహాచక్రంబును భరియింపంగల

యవియే? మందరంబు మందరశ్మ్మ. నీలంబు నీతీనిలయంబు. అస్తంబస్త వ్యస్తంబు. ఉదయంబ నభ్యుదయంబు. క్రౌంచం బడకించఁడంబు. గంధమాదనంబుపేద. పారియాత్రం బేతన్మా త్రంబు. మలయదగ్దుర త్రికూటంబు లోకపాటివి. మహేంద్ర నిషధ ద్రోణ బులు దరిద్రాణంబులు. హేమకూటంబు కిట కిటన. తక్కుగొండలం బేర్కొనఁ గారణంబేమి? ఇపు డిప్పాట నాతోఁ బ్రతిభటిఁపంగల యది సుర గరుడ ఖచర విద్యాధర యక్ష కిన్నర గంధర్వ దర్వీకరాశ్రయంబును గల్పతరువాటికా కామధుగ్ధేను మండలంబును, విబుధ వేదండ శుండాదండ చుళి కితోద్దీర్ణ స్వర్ణదీకాండ గండూషిత బ్రహ్మాండగోళంబును నగు సుమేరుశైల బ; మా యిద్దఱి తారతమ్యంబు నెఱుంగుదు. నాకు నగ్గిరికి నిప్పుడు కొన్ని వాసరంబులనుండి యీరసంబు పెరుగం గఱకఱి నెట్టుకొని సాగుచున్నది. ఇంక నెట్లుండు? భట్టారకా! మొగమాట యుడిగి పక్షపాతంబు పరిత్యజించి యానతిమ్మ్మ.

అర్థము :- మహానుభావాఃl (మహత్ + అనుభావము.) మహత్ = గొప్పది యైన, అనుభావాఃl = ఆత్మగుణపరిశేషము కలవాఁడా l భవదీయ....ప్రవాహంబు నన్' భవదీయ = నీదియైన, కృపా = కారుణ్యభరితమైన, కటాక్ష = కడగన్ను లతోనైన, వీక్ష = చూచుటయే యనెడి, సుధారస = అమృతరసము యొక్క, ప్రవాహంబునన్ = జాలుచేత, 'రజఃప్రసరంబును' రజఃl = రజోగుణము యొక్క, పరాగము యొక్క, ప్రసరంబును = ప్రసారమును, 'త్వదంఘ్రి....సమున్మేషణంబు నన్' త్వత్ = నీయొక్క, అంఘ్రి = పాదములయొక్క, నఖ = గోరులే యనెడి, చంద్రమండల = చంద్రమండలము యొక్క, జ్యోత్స్న = వెన్నెలల యొక్క, సమున్మేషణంబునన్ = వికాసముచేత, 'తమఃకాండంబును' తమఃl = చీఁకట్ల యొక్క, కాండంబును = సమూహమునుకూడ, ఖండింపబడియెన్ = ముక్కలుగాఁ జేయఁబడినది. ఇఁతకాలంబునకున్ = ఇంతటి దీర్ఘకాలమునకు, ప్రాగ్జన్మ = వెనుకటి జన్మములయందు, కృతంబులైన = చేయఁబడినవియైన, సుకృతంబులు=

సుందరయ్య గ్రంథాలయ
76278
A C. No.....

పుణ్యములు, ఫలించెన్ = పండెను. 'విశ్వ విశ్వంభరా....ధురంధరంబులు' విశ్వ విశ్వంభరా = సమస్త విశ్వమును వహించెడి భూమియొక్క భార = భారమును, భరణ = భరించుటయే యనెడి, దీక్ష = నియమసహితమైన పూనికయొక్క, ధురంధరంబులు = భారమును వహించిన, నా కులంబు = నా పర్వతకులమునకు సంబంధించిన, వసుంధరాధరంబులలోన = భూధరములలో, మాన్యుండనైతిన్ - పూజింపదగిననాడ నైతిని. కృతార్థుండన్ = కృతకృత్యుడను, ధన్యుడను, భాగ్యవంతుండన్ = భాగ్యశాలిని; అది = ఆ విషయము, అట్లుండెన్ = అట్లున్నది. (అట్లుండనిమ్ము) ఐనను = అయినప్పటికిని, ఒక్క విన్నపంబున్ = ఒక విన్నపమును, 'సావధానమతివై' సావధాన = ఎచ్చరికతోఁగూడిన, మతివై = మతికలవాఁడవై. అవధరింపుము = వినుము, నీకున్ = నీకు. 'సేవాంజలీపుటము' సేవా = సేవారూపమైన, అంజలీ=దోసిలియొక్క, పుటము =సంపుటము. 'పంచాశత్కోటి విస్తీర్ణంబైన' పంచాశత్ = ఏఁబది, కోటి = కోట్ల యోజనముల, విస్తీర్ణంబైన= విస్తారముగల, భూమండలంబునందున్ = భూవలయమునందు, నీవు చూడనియట్టి= నీవు చూడనివియైన, మహీధరంబులు = భూధరములు, లేవ=లేనే లేవు, కొండలు= పర్వతములు, లెక్కకున్ = సంఖ్యకు, పెక్కు = అనేకములు, కలుగుంగాక = ఉండునుగాక - ఉండనిమ్ము, ఎనిమిది = ఎనిమిదియైన, దిక్కుంజరములకున్ = (దిక్ + కుంజరములు) దిగ్గజములకు, దిక్కై=శరణ్యమై, కూర్మంబునకున్ = ఆదికూర్మమునకు, అర్మిలియై = ప్రేమాస్పదమై, క్రీడాక్రోడంబునకున్ = క్రీడావరాహమునకు - ఆదివరాహమునకు (క్రీడార్థమై వరాహ రూపమును ధరించిన శ్రీమహావిష్ణువు), తోడై = సాయమై. పాఁపతేనికిన్ = (పాము + తేడు) సర్పరాజునకు-ఆదిశేషునకు, ప్రాపై = ఆలంబనమై, ఏనుబోలెన్ = నావలె, ఎక్కటి= అద్వితీయమై, 'ఈ సర్వ....చక్రంబును' ఈ =దృశ్యమానమైన, సర్వ = అశేషమైన. సర్వంసహా = సర్వమును సహించునది - భూమియొక్క, చక్రంబును = వలయమును, భరియింపంగల యవియే? = భరించుటకు సామర్థ్యము కలవియా? మందరంబు = మందర పర్వతము, మందరశ్మి = మందమైన వెలుఁగు కలది. నీలంబు = నీలాచలంబు, నీలీ = నల్లపువ్వుల గోరింటలకు, నల్ల యాఁగలకు, నిలయము = నివాసము, అస్తంబు = అస్తమయ పర్వతము, అస్తవ్యస్తంబు = వ్యవస్థ లేనిది, ఉదయంబు = ఉదయపర్వతము, అనభ్యుదయంబు = అభ్యుదయము లేనిది, క్రౌంచంబు = క్రౌంచపర్వతము, అకించనంబు = దరిద్రము, గంధమాదనంబు = గంధమాదన పర్వతము, పేద = దుర్బలము, పారియాత్రంబు = పారి

యాత్ర పర్వతము. ఏతన్మాత్రంబు = ఈపాటిది-సాధారణమైనది. మలయ దర్దుర త్రికూటంబులు = మలయ. దర్దుర. త్రికూట పర్వతములు, ఒకపాటివి = ఒకమాత్రమైనవి, మహేంద్ర నిషధ ద్రోణంబులు = మహేంద్ర, నిషధ, ద్రోణ పర్వతములు. దరిద్రాణములు = పేదవి, హేమకూటంబు = హేమకూటపర్వతము, కిటకిటన = శిథిలము - స్థైర్యము లేనిది. తక్కుఁజిఱుకొండలన్ = మిగిలిన చిన్ని కొండలను, పేర్కొనన్ = పరిగణింపఁగా. కారణంబేమి = కారణమేమి గలదు? ఇప్పుడు = ఈ సమయమునందు ఈప్పాటన్ = (ఈ + పాటన్) ఈ పాటుగా, నాతోడన్ = నాతో. ప్రతిభటింపంగల యది = 'ఉజ్జీ' చేయఁగల్గినది - 'సుర.... దర్వీకరాశ్రయంబు' సుర = దేవతలకు, ఖచర = ఖేచరులకు, గరుడ = గరుడులకు. విద్యాధర = విద్యాధరులకు. యక్ష = యక్షులకు. కిన్నర = కిన్నరులకు, గంధర్వ = గంధర్వులకు. దర్వీకర = నాగులకు. ఆశ్రయంబును = ఆధారమును, కల్పతరువాటికా = కల్పవృక్ష వాటికలయందలి. 'కామదుగ్ధేనుమండలంబును' కామధుక్ = మనోరథములను పిదుకునట్టి. ధేను = ఆవులయొక్క - కామధేనువుల యొక్క. మండలంబును = మండలములు-మందలు కలదియును. విబుధ.... బ్రహ్మాండగోళంబును' విబుధవేదండ = సురగజముయొక్క - ఐరావతముయొక్క. శుండాదండ = దండాకారమయిన తొండముచేత, చుళికిత = పీల్చఁబడి, ఉద్గీర్ణ = ఎగఁజిమ్మఁబడిన. స్వర్ణదీ (స్వర్ + నదీ) ఆకాశగంగయొక్క. కాండ = జలములచేత. గండూషిత = పుక్కిలించి యుమియఁబడిన. బ్రహ్మాండగోళంబును = గోళాకారమైన బ్రహ్మాండము గలదియు, అగు = అయిన, సుమేరుశైలంబు = మేరుపర్వత మొక్కటియే; నాకున్ = నాకును. అగ్గిరికిన్ = (ఆ + గిరికిన్) ఆ మేరుపర్వతమునకును. ఇప్పుడు = ప్రస్తుతము. కొన్ని వాసరంబులనుండి = కొన్ని దినములనుండి. ఈరసంబు = కోపము. పెరుగన్ = పెరుగునట్లుగా, కలఁకటి = సంఘర్షము, నెట్టుకొని = అతిశయించి-పూనుకొని. సాగుచున్నది = ప్రవర్తిల్లుచున్నది. ఇంకన్ = ఇఁకమీఁదట, ఎట్లుండున్ = పరిస్థితి యెట్లుండును? భట్టారకా ! = పూజ్యఁడా! మొగమాట = (మొగము + ఓట) మొగము చెల్లని లక్షణము, ఉడిగి = మాని. పక్షపాతంబు + ఒకవైపునకు మొగ్గియుండుట, పరిత్యజించి = విడిచి, ఆనతిమ్మా = (ఆనతి + ఇమ్మా) చెప్పుము!

తాత్పర్యము :- సుగమము.

విశేషము :- ఈ వింధ్యుని ప్రసంగము మొట్టమొదట దేవముని యను భావ సంసర్గ ప్రభావమువలన మిక్కిలి సాత్వికమై అటుపిమ్మట కందళించిన రజో

గుణము కలదియై క్రమ క్రమముగా ఆత్మస్తుతి, పర, పరివాదరూపమై, లోకములోని అనాత్మజ్ఞులై గర్వితులైన ధూర్తుల స్వభావమునకుఁ గ్రమోన్మీలనముగా నున్నది. భారతము విదురనీతిలో పేర్కొనఁబడిన 'కోపము నుబ్బును గర్వము నాపోవక యునికియును దురభిమానము నిర్వ్యాపారత్వము' అను కాపురుషలక్షణము లన్ని యును నిందు రాశి పోసినట్లున్నవి.

అంతేకాక- అప్పటి వింధ్యుని మానసిక పరిస్థితి- 'ఒరుల ధనమునకు విద్యా పరిణతికిని, తేజమునకు, బలమునకు మనం బెరియఁగ నసహ్యపడు నన్నరుఁడు తెవులులేని వేదనంబడు' అన్న దానికి సమగ్రమైన లక్ష్యముగా గోచరించుచున్నది.

తే॥గీ॥ అనియవష్టంభ సంరంభ మతిశయిల్లఁ
బలుకుటయు నాత్మ గర్వించి నలువపట్టి
యొండనాక యొక్కింతసే పూరకుండి
యుస్సురనుచును వేఁడి నిట్టూర్పు పుచ్చి ॥ 101

అర్థము :- అని = ఈరీతిగా, అవష్టంభ = గర్వముయొక్క, సంరంభము = వేగిరపాటు, అతిశయిల్లన్ = అతిశయింపఁగా, పలుకుటయున్ = పలుకఁగా, ఆత్మన్ = మనస్సునందు, గర్వించి = ఏవగించికొని, నలువ = చతుర్వదనుని యొక్క-బ్రహ్మయొక్క, (నాలుగు + వాయి - నలువ), పట్టి = కుమారుఁడు-నారదుఁడు, ఒండు = వేఱొక పలుకు, అనాక = అనక-పలుకక, ఒక్కింతసేవు = (ఒక్క + ఇంత) ఇంచుకకాలము, ఊరకుండి = (ఊరక + ఉండి) మిన్నక యుండి, ఉస్సురనుచును = 'ఉస్' అనుచు, 'వేఁడినిట్టూర్పు' వేఁడి = వెచ్చనైన, నిట్టూర్పు = (నిడుద + ఊర్పు) దీర్ఘ విశ్వాసమును, పుచ్చి + విడిచి.

తాత్పర్యము :- ఇట్లు గర్వాటోపముతో పెచ్చుపెరిగి వింధ్యపర్వతము నోటికి వచ్చినట్లెల్ల ప్రేలుచుండఁగా మనస్సులో నేవగించుకొని యింకొక మాట మాటాడక నారదుఁడు కొంచెముసేపు మిన్నకుండి పిమ్మట 'ఉస్' అని యొక వేఁడి యైన నిడుదయూరుపు విడిచి-

వ॥ పదంపడి నిలింప మౌని కలహప్రియుండు గావునఁ ద్రిభువనోప
ద్రవ కారణంబైనను నమ్మహీధరంబుల సంఘర్షణంబునకు
సమ్మతించి శక్తి సంధుక్షణార్థంబు వింధ్యంబున కిట్లనియె- 102

అర్థము :- పదంపడి = పిమ్మట, నిలింపమౌని = దేవమౌని, 'కలహ ప్రియుండు కలహ = పోరులకు, ప్రియుండు = ఇష్టపడెడివాఁడు కావునన్ = కాఁబట్టి. 'త్రిభువనోపద్రవకారణంబైనను' త్రిభువన = మూఁడులోకములయొక్క. ఉపద్రవ = ఒడిదుడుకునకు - హావడికి, కారణంబైనను = హేతువైనను - మూలమైనను, అమ్మహీధరంబుల = (ఆ + మహీధరంబులు) ఆ పర్వతములయొక్క. సంఘర్షణంబునకున్ = రాయిడికి. సమ్మతించి = అంగీకరించి. 'శక్తిసంధుక్షణార్థంబు' శక్తి = శక్తియొక్క, సంధుక్షణార్థంబు = (సంధుక్షణ + అర్థంబు) ఎగసన ద్రోయుటకొఱకు - (ఎక్కఁవేయుట కొఱకు-రెక్కొఁలుపుట కొఱకు). వింధ్యంబునకున్ = వింధ్యపర్వతమునకు. ఇట్లనియెన్ = ఇట్లు పలికెను.

వ॥ వింధ్యము గర్వప్రలాపములు వస్తుతః నారదున కేవగింపునే కలిగించెను. స్వభావమునుబట్టి ఆయన కలహ వినోది కావున ముల్లోకములకు నుపద్రవకారణమే అయినను ఆ పర్వతముల సంఘర్షణమునకు సమ్మతించి వింధ్యపర్వతము యొక్క శక్తిని రెక్కొఁలుపుటకై యిట్లనెను.

శా॥ నాతో నీవిపు డెట్లులాడితి ప్రధానత్వం బపేక్షించి ప్ర
స్ఫీతాటోప మహాప్రతాప గుణగంభీరార్థ యుక్తంబుగా
నాతో నట్లన యాడె మేరువు ప్రధానత్వం బపేక్షించి ప్ర
స్ఫీతాటోప మహాప్రతాప గుణగంభీరార్థ యుక్తంబుగన్ ॥ 103

అర్థము :- ప్రధానత్వంబు = ప్రాధాన్యమును, అపేక్షించి = కోరికొని. 'ప్రస్ఫీత....అర్థయుక్తంబుగన్' ప్రస్ఫీత = మిక్కిలి విస్తరించిన. ఆటోప = వేగిరపాటును, మహాప్రతాప = గొప్ప ప్రతాపమే యనెడి, గుణ = లక్షణముతోఁ గూడిన, గంభీర = లోతైన. అర్థయుక్తంబుగా = అర్థము కలిగియుండునట్లుగా. నాతో = నారదుఁడనైన నాతో. నీవు = నీవు. ఇపుడు = ఇప్పుడు ఎట్టులాడితివి = ఎట్లు పలికితివో. ప్రధానత్వంబు = ప్రాధాన్యమును. అపేక్షించి = కోరికొని. 'ప్రస్ఫీత....అర్థయుక్తంబుగన్' ప్రస్ఫీత = మిక్కిలి విస్తరించిన. ఆటోప = వేగిరపాటును, మహాప్రతాప = గొప్ప ప్రతాపమే యనెడి, గుణ = లక్షణముతోఁ గూడిన, గంభీర = లోతైన, అర్థయుక్తంబుగన్ = అర్థము కలిగియుండునట్లుగా,

నాతోన్ = నారదుఁడనైన నాతో, మేరువు = మేరుపర్వతము, అట్లన = ఆవిధము గానే, ఆడెను = పలికెను.

తాత్పర్యము :- ప్రాధాన్యము నపేక్షించి అతిశయించిన గర్వాబోపము. మహాప్రతాపలక్షణము, అర్థగాంభీర్యము కలిగి యుండునట్లుగా ఇప్పుడు నాతో నీవెట్లు మాటాడితివో. ప్రాధాన్యము నపేక్షించి అతిశయించిన గర్వాటోపము, మహాప్రతాప లక్షణము, అర్థగాంభీర్యము కలిగి యుండునట్లుగా ఇంతకుముందు నాతో మేరువు కూడ సరిగా అట్లే మాటాడియుండెను.

విశేషము :- మేరువుపై నీకెంత స్పర్ధ యున్నదో, నీపై మేరువునకుఁ గూడ నంతే స్పర్ధ యున్నదన్న విషయమును బింబప్రతిబింబ భావము గల యీ పద్య రచనయందలి పూర్వాపరార్థములు కొట్టవచ్చినట్లుగా స్ఫురింపఁజేయుచు మేరువుపై వింధ్యమునకుఁ గల ప్రతిద్వంద్విత్వమును రెచ్చఁగొట్టుచున్నది. అంతేకాని వింధ్య మడిగిన ప్రశ్నమునకు నారదుఁ డేవిషయమును దేల్చి చెప్పఁడు. ఆయన స్వభావ మదియే.

తే॥గీ॥ నీవెఱుంగుదు నీలావు నిక్క-వముగ
నెఱుఁగు దనలావు తానమ్మహీధరంబు
తప్పకుండ మీ యిద్దఱ తారతమ్య
మెంతవారును దెలియంగ నెంతవారు? 104

అర్థము :- నిక్క-వముగన్ = ఉన్నదున్నట్లుగా, నీలావు = నీ బలమును, నీవెఱుంగుదువు = నీవు తెలియుదువు, తనలావు = తన బలమును, అమ్మహీధరంబు = ఆ మేరుపర్వతము, తానెఱుంగును = తానెఱుఁగును, తప్పకుండన్ = పొరపాటు లేకుండునట్లుగా, మీ యిద్దఱ = మీ యిరువురియొక్క, తారతమ్యము = తరతమభావమును, ఎంతవారును = ఎంతటివారైనను, ఎఱుగంగన్ = తెలిసికొను టకు, ఎంతవారు? = ఎంత సామర్థ్యము గలవారు?

తాత్పర్యము :- వాస్తవముగా నీ బలము నీ వెఱుఁగుదువు, ఆ మేరువు తన బలము తానెఱుఁగును. తూఁచినట్లు మీ యిద్దఱి తారతమ్యము దెలియుటకు ఎంతవారైనను ఎంతటివారు?

విశేషము : లోకములో ఇరువురిమధ్య స్పర్ధను పెంచు మాటలు సరిగా విన్పి యుండును. పైకి గమ కేమియు పట్టనట్లు మాత్రము తోచును. వాస్తవమునకు ఇట్టి సందర్భములలో హితైషులైనవారు మందలించి బుద్ధి చెప్పుదురు. దేవముని అదియే చేయుచున్నాఁడు.

వ॥ శ్రీశైల వేంకటాహోబల శోణాద్రి సాలగ్రామాది పర్వతంబులు మహానుభావంబున మీ యిద్దఱకంటె నధికంబులు. మీ గర్వాలాపంబులు విని యోర్వవచ్చునే? మిమ్మ్ నేమన వచ్చు? హెచ్చుకుం దాడనేరక విషాదంబున నిట్టూర్పు నిగుడించితి. మముబోటి తీర్థయాత్రాపరులకు నిది యేటి చింత? మీకు మేలయ్యెడుఁ బోయివచ్చెద నని నారదుం డెందేనియుం జనియెఁ దదనంతరంబ. 105

అర్థము :- 'శ్రీశైల....పర్వతంబులు' శ్రీశైల = శ్రీశైలము, వేంకట = వేంకటాచలము, అహోబల = అహోబలాచలము, శోణాద్రి = శోణాచలము, సాలగ్రామ = సాలగ్రామాచలము, ఆది = మొదలైన, పర్వతములు = కొండలు, మహానుభావంబునన్ = గొప్పదియైన యనుభావమునందు, మీ యిద్దఱకంటెన్ = మీరువుకంటె, కీకంటెకూడ, అధికంబులు = గొప్పవి. 'మీ గర్వాలాపంబులు' మీ = మీయొక్క, గర్వాలాపంబులు = (గర్వ + ఆలాపంబులు) గర్వపు మాటలు, విని = ఆలకించి, ఓర్వవచ్చునే ? = సహింపవచ్చునా ?, మిమ్మున్ = మీ యిరువురను, ఏమనవచ్చును ? = ఏమి యనుటకు వీలున్నది ?, హెచ్చుకుందు = ఎక్కువ తక్కువ మాటలను, ఆడనేరక = పలుకలేక, విషాదంబునన్ = విషాదముచేత, నిట్టూర్పు నిగుడించితిని = నిట్టూర్పు విడిచితిని, మముబోటి = మావంటి, తీర్థయాత్రాపరులకున్ = తీర్థయాత్రలు చేయువారలకు, ఇది = ఈ తారతమ్య విచారము, ఏటిచింత ? = ఎందుకు పనికివచ్చు ఆలోచన ? (వ్యర్థమనుట), మీకున్ = మీ యిరువురకును, మేలయ్యెడున్ = మేలు కలుగుగాత, పోయివచ్చెదన్ = వెళ్ళివచ్చెదను, అని = అని పలికి, నారదుండు = నారదమహర్షి, ఎందేనియున్ = తనయిచ్చవచ్చిన చోటికి, చనియెన్ = వెళ్ళెను, తదనంతరంబ = (తత్ + అనంతరంబ) ఆ వెనువెంటనే.

తాత్పర్యము :- శ్రీశైల వేంకటాచల కోణాచల సాలగ్రామాది పర్వత ములు మీ యిద్దఱికంటె అనుభావ విశేషమునుబట్టి మిక్కిలి గొప్పవి, మీ మిడిసి పాటు మాటలు విని సహింపవచ్చునా ? మి మ్మేమి యనవచ్చును ? హెచ్చుతగ్గుల పలుకలేక విచారముతో నిట్టూర్పు విడిచితిని. అదిగాక మావంటి తీర్థయాత్రాపరులకు ఇది దేనికి వచ్చిన విచారము ? మీకు మేలయ్యెడుగాత మని నారదమహర్షి యథేచ్ఛముగా నేగెను.

విశేషము :- మీకంటె గొప్ప పర్వతము లెన్నో యున్నవి. అవి మీవలె తగవులాడికొనుటలేదు. మీలో మీరిట్లు వివాదపడుటయే మీ యల్పత్వమునకు తార్కాణ. మావంటి వారితో మీ రిట్టి ప్రస్తావనయే చేయరాదు. మీకు సద్బుద్ధి కలుగుగాక. మా కీది విచారవిషయము కాదు అని పలికి నారదుఁడు వింధ్యము యొక్క ప్రతివచనమును వినకయే అచ్చట నిలువక వెంటనే వెళ్ళిపోయెను.

తే॥గీ॥ విబుధముని మాట చెవికిఁ గ్రొవ్వేడి యగుడు
వంధ్య గర్వోదయుండైన వింధ్యశిఖరి
చాల నుద్వేగమంది విచారపరత
నాత్మగతమునఁ దాను నిట్లనుచునుండె ॥ 106

అర్థము :- విబుధముని మాట = దేవమునియైన నారదుని మాట, చెవికిన్ = చెవికి. క్రొవ్వేఁడి = (క్రొత్త + వేఁడి) క్రొత్త సంతాపమును గలిగించునది- (అసూయా మాత్సర్యములవలని సంతాప మంతకుఁ బూర్వమే కలదనుట), అగుడున్ = కాఁగా, 'వంధ్యగర్వోదయుండైన' వంధ్య = వ్యర్థమైన, గర్వ = గర్వము యొక్క, ఉదయుఁడు = ఆవిర్భావముగల, (తా ననుకున్నట్లు నారదునినుండి ప్రతిస్పందనము రానందువలన) వింధ్యశిఖరి = వింధ్యపర్వతము, చాలన్ = మిక్కిలి యును, ఉద్వేగమంది = అలజడిపడి, 'విచారపరతన్' విచార = చింతకు, పరతన్ = లోఁబడినందువలన, ఆత్మగతమునన్ = తనలో, తాను = తానే. ఇట నుకొనుచునుండెన్ = ఇటనుకొనుచుండెను.

తాత్పర్యము :- వింధ్యమునకు నారదునినుండి తాను ఎదురుచూచిన విధముగా ప్రతివచనము రాకపోఁగా, వచ్చిన ప్రతివచనము నూత్నసంతాపమును గలిగించునదిగా నుండెను. ఇన్నాళ్ళును తనలో అంతర్గతమైయున్న మేరువునందలి

మాత్సర్యము నారదునియెదుట బయటపడిపోయెను. తాను నారదునినుండి యాశించిన ప్రోత్సాహము లభింపలేదు. పైగా మందలింపులు పడవలసివచ్చెను. మనసులోని వెనుకటి మాత్సర్య సంతాప మట్లే యుండెను. దాని కిది తోడయ్యెను. ఇట్లు పొంగు క్రుంగిన వింధ్యము మిక్కిలి యుద్వేగమును పొంది చింతాపరవశమై పోయెను. తనలో దాను మాటాడికొనుట చింతయొక్క యనుభావము.

తే॥గీ॥ శాస్త్ర మాచార్య సన్నిధి జదువ డేని
నిద్ధ బోధంబు మది సంగ్రహింపడేని
తెగువమీఱి ప్రతిజ్ఞ సాధింపడేని
జ్ఞాతి జయమందడేని తజ్జనుడు జనుడె? 107

అర్థము :- శాస్త్రము = శాస్త్రమును, ఆచార్య సన్నిధిన్ = గురుసన్నిధి యందు, చదువడేని = చదువనివాడైనచో, ఇద్ధ = ప్రదీప్తమైన, బోధంబున్ = జ్ఞానమును, మదిన్ = మతియందు, సంగ్రహింపడేని = పదిలపఱిచికొననివాడైనచో, తెగువమీఱి = సాహస మతిశయించి, ప్రతిజ్ఞన్ = ప్రతిజ్ఞను, సాధింపడేని = తీర్చికొననివాడైనచో జ్ఞాతిజయము = జ్ఞాతులపై విజయమును-గెలుపును, అందడేని = పొందనివాడైనచో, తజ్జనుడు = (తత్ + జనుడు) ఆ జనుడు, జనుడె? = జన్మయెత్తినవాడా?

తాత్పర్యము :- గురు సన్నిధియందు శాస్త్రమును జదువనినాడు, ప్రదీప్తమైన జ్ఞానమును మతియందు నిలిపికొననినాడు, తెగువతో ప్రతిజ్ఞ సాధించనినాడు. జ్ఞాతిజనమును గెలువనినాడు, ఆ జనుడు జన్మించియును జన్మించనియట్లే.

ఉ॥ కంటికి నిద్రవచ్చునె? సుఖంబగునే రతికేళి? జిహ్వకున్
వంటక మిచ్చునే? యితర వైభవముల్ పదివేలు మానసం
బంటునె? మానుషంబుగల యట్టి మనుష్యున కెట్టివానికిన్
గంటకుడైన శాత్రవు డొకండు తనంతటివాడు గల్గినన్॥ 108

అర్థము :- 'కంటకుడైన శాత్రవు డొకండు' కంటకుడైన = ముల్లువలె బాధించు లక్షణముగల, శాత్రవుడు = శత్రుత్వలక్షణముగల, ఒకండు = ఒకానొకడు, తనంతటివాడు = తనయంతటివాడు, కల్గినన్ = కలిగియున్నచో,

'మానుషంబుగల యట్టి మనుష్యునకున్' మానుషంబు = పౌరుషము, కలయట్టి = కలిగినట్టి, మనుష్యునకున్ = పురుషునకు, ఎట్టివానికిన్ = ఎటివంటివానికైనను, కంటికిన్ = కంటికి, నిద్రవచ్చునే ? = నిద్రవచ్చునా ?, రతికేళి = రతిక్రీడ, సుఖంబగునే ? = సుఖావహమగునా ?, జిహ్వకున్ = నాలుకకు, వంటకము = పాకము, ఇంచునే ? = రుచించునా ?, యితర వైభవముల్ = మిగిలిన వైభవములు, పదివేలు = పదివేలైనను, మానసంబు = మనస్సును, అంటునే ? = స్పృశించునా ?

తాత్పర్యము :- మానుషముగల మనుష్యునకు వాడెట్టివాడైనను వానికి తన యంతటి శత్రు వొకడున్నచో ఆ శత్రువు ముల్లువలె బాధించుచుండును. ముల్లు, గ్రుచ్చుకున్నప్పుడు మాత్రమే బాధించును. శత్రువు (శత్రువును గూర్చిన తలంపు) సర్వకాల సర్వావస్థలయందును ముల్లు గ్రుచ్చుకున్నట్లే బాధించుచుండును. కంటికి నిద్ర రానీయడు. రతికేళియందుగూడ వాడే గుర్తుకువచ్చి ఆ సుఖమును వికల మొనరించుచుండును. భోజనవేళలో పదార్థముల రుచి నాలుకకు దెలియనీయడు. మిగిలిన వైభవములు పదివేలు ఉన్నను ఏ యొక్కటియును మనస్సునకు అంటనీయడు.

విశేషము :- ఆహార నిద్రా మైథునాములు సర్వజంతువులకును స్వాభావికములైన సుఖములు. ఆ సుఖములనుగూడ మనస్సునకు అంటనీయకపోవుటలోనే శత్రువుయొక్క విజమైన శత్రుత్వమున్నది. వాడు చేయు నపకారములలోగాదు.

కం॥ ఎవ్వానితో నెచ్చోటను
జివ్వకుఁ జేసాచవలదు చేసాచినచో
నివ్వల నవ్వల నెవ్వరు
నవ్వక యుండంగఁ బగసనన్ దీర్వనగున్ ॥ 109

అర్థము :- ఎవ్వానితోన్ = ఎవ్వనితోడను, ఎచ్చోటను = ఏ ప్రదేశమువందును - ఏ సందర్భమునందును, చివ్వకున్ = కలహమునకు, చేసాచవలదు = చేయి సాచవద్దు, చేసాచినచోన్ = చేయి సాచినచో, ఇవ్వలన్ = (ఈ + వలనన్) ఈ పైపునందు, అవ్వలన్ = (ఆ + వలనన్) ఆ పైపునందు, ఎవ్వరున్ =

ఎవ్వడును, నవ్వకయుండంగన్ = అపహసింపక యుండునట్లుగా, పగ = శత్రుత్వము, చనన్ = తుదిముట్టునట్లుగా - నిశ్శేషముగా, తీర్పనగున్=తీర్పవలయును.

తాత్పర్యము:- మొదట ఎవ్వనితోడను ఏ పరిస్థితియందును గలహము నకుఁ జేయి సాచనేరాదు. ఒకవేళ చేయి సాచినచో, స్వపక్షమునందును పరపక్షమునందును ఏ యొక్కరును అపహసింపకుండునట్లు తుదిముట్టునట్లు నిశ్శేషముగా పగదీర్పవలసి యుండును.

విశేషము:- 'అగ్నేః శేషం ఋణాచ్ఛేషం శత్రోఃశేషం నశేషయేత్' అగ్నిశేషమును, ఋణశేషమును, శత్రుశేషమును మిగుల్పఁగూడదు.

శా॥ ఆ చందంబున నంతరంగమున కత్యంతంబుఁ దీవ్ర వ్యథా
ప్రాచుర్యంబు ఘటింపజాలఁ దతిఘోరంబైన దావానలం
బేచందంబున నంతరంగమున కిట్లీ జ్ఞాతి భూభృజ్జిగీ
షా చింతాభర మావహించు నతి దుఃసాధవ్యథాభారమున్ ॥ 110

అర్థము:- ఏచందంబునన్ = ఏవిధముగా, అంతరంగమునకున్ = మనస్సునకు, ఇట్లు = నే ననుభవించుచున్నరీతిగా, ఈ = ఈ, జ్ఞాతి = శత్రువైన, భూభృత్ = భూభృత్తుయొక్క - పర్వతముయొక్క, జిగీషా = జయింపవలె ననుకోరికకు సంబంధించిన, చింతా = చింతయొక్క, భరము = భారము, అతి = మిక్కిలి, దుఃసాధ = ఓర్వనలవికాని, వ్యథా = బాధయొక్క, భారమున్ = భారమును, ఆవహించున్ = ఆవహింపఁజేయునో, ఆ చందంబునన్ = ఆ విధముగా, అతిఘోరంబైన = అతిభయంకరమైన, దావానలంబు = (దావ+అనలము) అరణ్యాగ్ని - కార్చిచ్చు, అత్యంతంబు = మిక్కిలి, తీవ్ర = దుస్సహమైన, వ్యథా = బాధయొక్క, ప్రాచుర్యంబున్ = ముమ్మరమును - సాంద్రతను, ఘటింపన్ = కలిగించుటకు, చాలదు = సమర్థము కాదు.

తాత్పర్యము:- మనస్సునకు ఈ జ్ఞాతిని జయింపవలెనను ఇచ్ఛను పట్టియేర్పడిన చింతాభరము ఏవిధమైన దుఃసహబాధను ఆవహింపఁజేయుచున్నదో, ఆవిధమైన బాధను అతిభయంకరమైన దావానలముకూడఁ గలిగింపఁజాలదు.

అలంకారము దృష్టాంతము.

సీ॥ భేషజం బెద్దాని భేదింపఁజాలదు
లంఘనంబున నెద్ది లావు చెడకు
తఱిగించు బుద్ధి నిద్రా మహోత్సాహ తేజ
స్సాకార బలాది నెద్ది
నాసత్యచరక ధన్వంతరి ప్రభృతి వై
ద్యులకు నసాధ్యమై యుండు నెద్ది
దివసంబు లీరేడతిక్రమించిన యప్డు
జీర్ణత్వదశ నధిష్ఠింప దెద్ది

తే॥గీ॥ ప్రత్యహంబు నవత్వంబు పడయు నెద్ది
యట్టి చింతాజ్వరంబు తన్నలముకొనియె
నేమి సేయుదు నింక నేనెచటఁ జొత్తు
నెట్టు నిర్జింతు మేరు మహీధరంబు ॥ 111

అర్థము :- భేషజంబు = ఔషధము, ఎద్దానిని = ఏ చింతాజ్వరమును, భేదింపఁజాలదు = పోఁగొట్టఁజాలదో, ఎద్ది = ఏది, లంఘనంబునన్ = లంకణము చేత (జ్వరము వచ్చినప్పు డేమియును తినకుండ దినమును దాటఁబెట్టుట), లావు చెడదు = బలము కోలుపోఁదో, ఎద్ది = ఏది, బుద్ధి = బుద్ధి, నిద్రా = నిద్ర, మహోత్సాహ = గొప్ప యుత్సాహము, తేజః = తేజస్సు, బల = బలము, ఆదిన్ = మొదలైనదానిని, తఱిగించున్ = తఱిగిపోవునట్లు చేయునో, ఎద్ది = ఎది, నాసత్య = అశ్వినీదేవతలు, చరక = చరకమహర్షి, ధన్వంతరి = ధన్వంతరి, ప్రభృతి = మొదలైన, వైద్యులకున్ = వైద్యులకుఁగూడ, అసాధ్యమైయుండున్ = సాధింపరానిదై యుండునో, ఎద్ది = ఏది, దివసంబులు = రోజులు, ఈరేడు = (ఇరు + ఏడు) పదునాలుగు, అతిక్రమించిన యప్పున్ = కడచిపోయిన యప్పుడుకూడ, జీర్ణత్వదశన్ = పక్వదశను, అధిష్ఠింపదు = పొందదో, ఎద్ది = ఏది, ప్రత్యహంబున్ = ప్రతిదినము, నవత్వంబు = నూతనత్వమును, పడయును = పొందునో, అట్టి = అటువంటి, చింతాజ్వరంబు = చింతయే యనెడి జ్వరము, ఆధి = మానసిక వ్యాధి, తన్ను = నన్ను, అలమికొనియెన్ = చుట్టుకొనెను, ఏమిసేయుదున్ = ఏమి చేయుదును, ఇంకన్ = ఇఁకమీఁదట, నేను = నేను, ఎచటఁజొత్తున్ =

ఎచ్చట ప్రవేశింతును. మేరుమహీధరంబున్ = మేరుపర్వతమును, ఎట్లు నిర్జింతున్ = ఎట్లు గెలుతును ?

తాత్పర్యము :- జ్వరముకంటె చింతాజ్వరము విలక్షణమైనది. జ్వరము శరీరమునకు సంబంధించినది. చింతాజ్వరము మనస్సునకు సంబంధించినది. మొదటిది 'వ్యాధి', రెండవది 'ఆధి'. వ్యాధికి మందులుండును. ఆధికి లేవు. 'మనో వ్యాధికి మందు లేదు' అని లోకవ్యవహారము ఏ చింతాజ్వరమును ఔషధము లుపశమింపఁజేయఁజాలవో, లంఘనములవలన (లంకణములు) దేని బలము తగ్గదో, బుద్ధిని, నిద్రను, ఉత్సాహమును, ఆఁకలిని, ఆకారమును, తేజమును, బలమును ఏది క్రమక్రమముగా క్షీణింపఁజేయుచుండునో, అశ్వినీదేవతలు, చరకమహర్షి, ధన్వంతరి మొదలైన మహావైద్యులకుఁగూడ ఏది అసాధ్యమై యుండునో, పదువాలుగు దినములు గడచినను ఏది జీర్ణదశను పొందదో, నానాటికిని ఏది నవనవత్వమును పొందుచుండునో అట్టి చింతాజ్వరము నన్ను చుట్టుకొన్నది. ఏమి చేయుదును? ఎచ్చటికిఁ బోవుదును ? మేరువు నెట్లు గెల్తును ?

కం॥ ఉప్పర మెగసి యజాండము
చిప్పలు రాలంగ మేరుశిఖరంబులపైఁ
గుప్పించి దాఁటుకొందునొ
తప్పక నా మనసులోని తహతహ తీఱన్ ॥ 112

అర్థము :- తప్పక = తప్పనిసరిగా, నా మనసులోని = నా మనసులోనున్న, తహతహ = ఉత్కంఠ, తీఱన్ = తీఱునట్లుగా, ఉప్పరమెగసి = ఆకాశమున కెగిరిపోయి, అజాండము చిప్పలు = బ్రహ్మాండముయొక్క పై డిప్పలు, రాలంగన్ = రాలి పడునట్లు, మేరుశిఖరంబులపైన్ = మేరుపర్వత శిఖరములపై, కుప్పించి = ఊపిరి బిగపట్టి, దాఁటు = లంఘనమును, కొందునొ = తీసికొందునో ?

తాత్పర్యము :- తప్పనిసరిగా నా మనస్సులోని యుత్కంఠ తీఱునట్లుగా బ్రహ్మాండము పైకప్పులు రాలిపడునట్లుగా మేరుపర్వత శిఖరములపై నొక్కసారి కుప్పించి దాఁటు తీసికొందునా ?

ఉ॥ ఒక్కఁడు మాకులంబున సముద్ధతిఁ జూపిన జాతరోషుఁ డై
పెక్కలు ద్రెంచి వేలుపుల వేఁడుట పాపము చేసెగాక; యీ
పెక్కలు నేఁడు గల్గిన నెటింగగనంబునఁ బాఱి తెంచి బి
ట్టొక్క నె కూటకోటి తటులెల్లను నుగ్గులుగాఁగ మేపువున్ ॥ 113

అరము:- మా కులంబునన్ = మా వంశమునందు, ఒక్కఁడు = ఒకొ
నొకడు, సముద్ధతిన్ = గర్వమును, చూపినన్ = ప్రదర్శింపఁగా, 'జాతరోషుఁడై'
జాత = పుట్టిన, రోషుఁడై = రోషము కలవాఁడై, పెక్కలు = పర్వతముల
పెక్కలను, ద్రెంచి = నఱికి, వేలుపుల వేఁడు = దేవతలకు రాజైన యింద్రుఁడు,
అటు = అవిధముగా, పాపము చేసెఁగాక = ద్రోహము చేసెనుగాని, ఆ పెక్కలు =
ఆనాటి పెక్కలు, నేఁడు = ఈనాఁడు, కల్గినన్ = ఉండియున్నచో, నెటిన్ =
అందముగా, గగనంబునన్ = ఆకాశమునందు, పాఱుదెంచి = పరుపెత్తికొని వచ్చి,
'కూట కోటి తటులెల్లను' కూటకోటి = చటియల సమూహముల యొక్క, తటు
లెల్లను = పార్శ్వములన్నియును, నుగ్గులుగాఁగన్ = నుగ్గునుగ్గగునట్లుగా, మేరు
వున్ = మేరుపర్వతమును, బిట్టు = శీఘ్రముగా, ఎక్కనె? = ఆరోహింపనా?

తాత్పర్యము:- మా కులములో ఒకానొకఁడు, గర్వమును ప్రదర్శించి
నంతమాత్రమున రోషించి ఇంద్రుఁడు ఉన్న కొండలన్నింటి పెక్కలు త్రెంచిపెట్టి
అంతటి ద్రోహము చేసెనేకాని నేఁడే ఆపెక్కలుండియున్నచో గగనమార్గమునఁ
బరువెత్తి కూటపార్శ్వము లన్నియును నుగ్గునుగ్గు లగునట్లు మేరువుపై నెక్కి
కూర్చుండి యుండకపోవుదునా?

తే॥గీ॥ అడుసులోపలఁ గాటి పండదిమినట్టి
లమముమునె కాదె పాతాళ మంటికొనఁగ
వేల్పులెల్లను విభ్రాంతి విహ్వలింపఁ
బాదముల మెట్టి నాదాయఁ బసిఁడికొండ ॥ 114

అర్థము:- నా, దాయ=నా శత్రువైన, పసిఁడికొండన్=బంగారు కొండను,
పాదముల మెట్టి=పాదములతో త్రొక్కి, పాతాళ మంటికొనఁగన్ = పాతాళమున
కంటిపోవునట్లు, వేల్పులెల్లను = ఆ మేరువు నాశ్రయించికొనియున్న దేవతలంద

ఱును, విభ్రాంతిన్ = భయవిభ్రాంతితో, విహ్వలింపన్ = అవయవములు పట్టపప్పి విలవిలలాడిపోఁగా, అడుసులోపలన్ = పంకము లోపల, తాటిపండు = తాటి పంటును, అదిమినట్లు = నొక్కినట్లు, అదుముదునె కాదె = అదిమి యుండెడి వాఁడనే కదా!

తాత్పర్యము :- నా పగవాఁడైన మేరుపర్వతమును పాదములతో మెట్టి, ఆ మేరువును ఆశ్రయించికొనియున్న దేవతలందఱు భయభ్రాంతులై విలవిలలాడి పోవునట్లు, పాతాళమున కంటకొని పోవునట్లు బురదలో తాటిపండు నదిమినట్లు అదిమియుండెడివాఁడనే కదా!

విశేషము :- విత్తనము పదునునకై తాటిపండును కొంతకాల మడుసులో నదిమి యుంచెదరు. తాటిపండు తొడిమనుండి క్రిందిభాగము చాలవఱకు బంగారు వన్నెకుఁ దిరిగియుండును.

అగాధమై కూరుకొనిపోవుచుఁ జీకటిమయమైన పాతాళ ముపమేయము. అడుసు ఉపమానము. మేరువు ఉపమేయము. తాటిపండు ఉపమానము. ఉపమాలంకారము.

శా॥ ఈ మైశ్వర్యముఁ జూడఁ జాలుదునె నేనిప్పాట నానాటికిన్
రే యిందుగ్రహతారకంబులు పగల్ నీ రేరుహాప్తుండు సే
వా యోగంబు మెయిన్ ప్రబదక్షిణముగా వర్తిల్లఁగా నిర్భరా
సూయా మానపరీత చేతసుఁడనై శూన్యోద్యమ ప్రక్రియన్ ॥ 115

అర్థము :- 'నిర్భరా....చేతసుఁడనై' నిర్భర = భరింపరాని, అసూయా = అసూయతోను, మాన = క్రోధముతోను. పరీత = అభివ్యాప్తమైన, చేతసుఁడనై = మనస్సు కలవాఁడనై, 'శూన్యోద్యమప్రక్రియన్'- శూన్యోద్యమ = ఉద్యమశూన్యమైన - ప్రతీకారోద్యమము లేని, ప్రక్రియన్ = ప్రకారముగా, ఇప్పాటన్ = (ఈ + పాటన్) ఈవిధముగా, నానాటికిన్ = (నాడు + నాడు) రోజురోజునకు, రేయి = రాత్రి, 'ఇందుగ్రహతారకంబులు' ఇందు = చంద్రుఁడు, గ్రహ = అంగారకుఁడు మొదలైన గ్రహములును, తారకంబులును = తారకలును-నక్షత్రములును, పగల్ = పగలు - దివాభాగమునందు, నీరేరుహాప్తుండు = (నీరేరుహ + ఆప్తుఁడు) పద్మబాంధవుఁడైన సూర్యుఁడును, సేవాయోగంబుమెయిన్ = సేవాయోగమా!

యన్నట్లు, ప్రదక్షిణముగా = మేరువునకు ప్రదక్షిణముగా-కుడివైపునుండి పోవుటగా, వర్తిల్లగాన్ = ప్రవర్తించుచుండఁగా. ఈ యైశ్వర్యము = ఈ మేరుపుయొక్క ప్రాభవమును. నేన్ = నేను, చూడఁజాలుదునె = చూడఁగలనా ?

తాత్పర్యము :- భరింప నలవికాని అసూయాక్రోధములు మనస్సును క్షోభ పెట్టుచుండఁగా, ప్రతీకారోద్యమ శూన్యమైన స్థితితో ఈవిధముగా నానాటికిని, రాత్రి-చంద్రగ్రహ నక్షత్రములు, పగలు-సూర్యుడు సేవాయోగమును వహించి యున్నట్లు, ఈ మేరువును ప్రదక్షిణము చేయుచు (కుడివైపునుండి పోవుచు) ప్రవర్తించుచుండఁగా, ఈ మేరువుయొక్క (శత్రువుయొక్క) ఐశ్వర్య ప్రాభవములను నేను జూడఁజాలుదునా ?

విశేషము :- సూర్య చంద్ర గ్రహ నక్షత్ర తారకారూపములైన తేజోమయ గోళములన్నియును విశ్వాంభోరుహ కర్ణికయైన మేరువునకు ప్రదక్షిణముగాఁ దిరుగుచుండును. అది వింధ్యమునకు దుఃసహముగా నున్నది.

తే॥గీ॥ అడ్డపెట్టెదఁగాక తీవ్రాంశురథము
ప్రహరి తిరుగక యుండంగ భర్మగిరికిఁ
దరతరంబ యజాండ కర్పరముదాఁక
ఘనశిరః శృంగ శృంగాటకములఁ బెంచి ॥ 116

అర్థము :- భర్మగిరికిన్ = బంగారుకొండకు, ప్రహరి తిరుగక యుండంగన్ = ప్రదక్షిణము చేయుటకు వీలు లేకుండునట్లుగా, 'తీవ్రాంశురథమున్' తీవ్రాంశు = (తీవ్ర + అంశు) వేఁడికిరణములుగల వానియొక్క. రథమున్ = రథమును, తరతరంబ = క్రమక్రమముగా. 'అజాండకర్పరము' అజాండ = బ్రహ్మాండముయొక్క. కర్పరమున్ = పైకప్పును, తాఁకన్ = తాఁకునట్లుగా. 'ఘన....శృంగాటకములు' ఘన = ఉన్నతములైన. శిరఃశృంగ = అగ్రశిఖరముల యొక్క, శృంగాటకములన్ = చతుష్కములను . చదుకములను, పెంచి = విస్తరింపఁజేసి, అడ్డపెట్టెదఁగాక = నిరోధించెదనుగాక.

తాత్పర్యము :- చూచుటకు దుఃస్సహముగానున్న యీ ప్రదక్షిణ వ్యాపారమును మునుముందుగా మాన్పింపవలయును. బ్రహ్మాండ కర్పరమును ఒరయునట్లు,

పంగలు చీలి చదుకములుగా నేర్పడియున్న సముస్నత శిరఃశృంగములను బెంచి. మేరువును ప్రదక్షించుట కెడము లేకుండునట్లు సూర్యరథమును నిరోధించెను గాక.

విశేషము :- ఇంద్రుఁడు ఱెక్కలు త్రెంచినందువలన తిర్యగ్గమనము మాత్రమే పోయినది. ఊర్ధ్వగమనమునకు క్షతిలేదు. ఉన్నచోటనే యుండి ఎంత యెత్తైనను పెరుగవచ్చును. తిర్యగ్గమనము పోయినది గావున ఆకాశమార్గమునఁ బోయి మేరువుపైఁ బడి తానో మేరువో తేల్చుకొను నవకాశము లేదు. ఇక పగ యెట్లు తీఱును? ప్రత్యక్షముగాఁ దీఱదు పరోక్షముగాఁ దీర్చికొనవలయును. తన యూర్ధ్వ ప్రసరణ శక్తి దానికిఁ గొంత యుపయోగించునదివలె స్ఫురించెను. దానితో సూర్యరథము ఆపినచో ఈ దినదిన ప్రదక్షిణ మాఁగిపోవును. కొంతకు గొంత కడుపుమంట చల్లారును. ఇది ప్రత్యనీకము. అనఁగా బలవంతుఁడైన శత్రువు నేమియును జేయఁజాలక శత్రుపక్షములోనివారిని చిక్కులు పెట్టుట. వింధ్యము దృష్టిలో మేరువునకు ప్రదక్షిణము చేయుచున్నాఁడు కావున సూర్యుఁడు శత్రుపక్షమే.

వ॥ అని యవష్టంభ సంరంభంబున- 117

అర్థము :- అని = ఇట్లు తలంచి, 'అవష్టంభ సంరంభంబున' అవష్టంభ= గర్వముయొక్క, సంరంభంబునన్ = వేగిరపాటుతో.

తాత్పర్యము :- సుగమము.

మ॥అవరోధించెను వింధ్యభూధరము ప్రధ్వాధ్వంబు దక్పోద్ధుర
వ్యవసాయోద్భటభంగి నింగి నురులింగాకారుఁడై యీశ్వరుం
డవరోధించిన గర్వరేఖ బలిదైత్యధ్వంసి నారాయణుం
డవరోధించిన శేవమూర్థమొగి బ్రహ్మాండంబుతో రాయఁగన్ ॥ 118

అర్థము :- వింధ్యభూధరము=వింధ్యపర్వతము, 'దర్ప....భంగిన్' దర్ప= గర్వముచేత, ఉద్ధుర = బరువైన - నిలుకడగల, వ్యవసాయ = ఉద్యమము యొక్క, ఉద్భట = అధికమైన, భంగిన్ = రీతిగా, 'ఉరులింగాకారుఁడై' ఉరు = గొప్పదియైన, లింగ = లింగముయొక్క, ఆకారుఁడై = ఆకారముగలవాఁడై, ఈశ్వరుండు = శివుఁడు, నింగిన్ = ఆకాశమును, 'అవరోధించిన గర్వరేఖన్' అవరోధించిన = అడ్డగించిన, గర్వరేఖన్ = గర్వముయొక్క పైకొరితోను,

'బలిదైత్యధ్వంసి' బలిదైత్య = 'బలి' అను రాక్షసేంద్రుని. ధ్వంసి = ధ్వంసము చేయువాఁడైన. నారాయణుండు = విష్ణువు (నింగిని), అవరోధించినతేవన్ = అడ్డగించిన విధముగా, మూర్ధము = తనయొక్క శిరస్సు, ఒగిన్ = క్రమముగా, బ్రహ్మాండంబుతోన్ = బ్రహ్మాండ కర్పరముతో, రాయఁగ = ఒరయఁగా, బ్రహ్మధ్వంబున్' బ్రధ్న = ప్రొద్దుయొక్క - సూర్యునియొక్క, అధ్వంబున్ = మార్గమును, అవరోధించెను = అడ్డగించెను.

తాత్పర్యము :- బ్రహ్మ విష్ణువుల నడుమ వివాదము నుపశమింపజేయుటకై పరమశివుఁడు మహాలింగాకారమున ఆవిర్భవించి ఆకాశమును అవరోధించిన రీతిగా, బలి నియమనార్థమై త్రివిక్రమాకారము నవధరించిన శ్రీమన్నారాయణుఁడు ఆకసము నవరోధించిన తీరుగా, తన శిరస్సు బ్రహ్మాండ కర్పరముతో నొరయునట్లు వింధ్య పర్వతము సూర్యుని త్రోవ నడ్డగించెను.

తే॥గీ॥ మేదినీధర మిబ్భంగి మిన్నుముట్టి
నిట్టనిలుచుండి చూచె నిర్నిమిషదృష్టిఁ
దన యనుష్ఠానకాలంబుఁ దప్పకుండ
బ్రాహ్మణుఁడు జేపకడఁబోలె భానుపొడుపు ॥ 119

అర్థము :- ఇబ్భంగిన్ = (ఈ + భంగిన్) ఈవిధముగా, మేదినీధరము = వింధ్య పర్వతము. మిన్నుముట్టి = మిన్నంటి, నిట్టనిలుచుండి = నిట్టనిటారుగా నిలువఁబడి, నిర్నిమిష = ఱెప్పపాటులేని, దృష్టిన్ = చూడ్కితో, తన యనుష్ఠాన కాలంబు = తనయొక్క అనుష్ఠానవేళ, తప్పకుండన్ = కడచిపోకుండునట్లు, బ్రాహ్మణుఁడు = కర్మనిష్ఠుఁడైన బ్రాహ్మణుఁడు, జేపడకవోలె = ప్రాతరారంభమునందువలె, 'భానుపొడుపున్' భాను = సూర్యునియొక్క పొడుపున్ = ఉదయమును, చూచెన్ = చూచెను - ప్రతీక్షించెను.

తాత్పర్యము :- ఈవిధముగా వింధ్యపర్వతము మిన్నంటి నిట్టనిటారుగా నిలుచుండి ప్రాతఃకాలమునందు తన యనుష్ఠానసమయము హెచ్చుతగ్గులు కాకుండ సరిసోవుటకై కర్మనిష్ఠుఁడైన బ్రాహ్మణుఁడు చూచినట్లుగా, ఱెప్పవ్రాల్పక సూర్యోదయ మనకై వార్చియుండెను.

విశేషము :- సూర్యుఁడుదయింపక మునుపు ప్రాతస్సంధ్యను, అస్తమిం పక ముందు సాయంసంధ్యను వార్చవలయును. సరిగా సూర్యబింబ ముదయించు చుండఁగా, క్రుంకుచుండఁగా అర్ఘ్యప్రదానము చేయవలయును. 'వార్చు'ట యనఁగా ప్రతీక్షించుట. 'సంధ్య వార్చుట' - సంధ్యాసమయమును ప్రతీక్షించుట.

వ॥ అంతః. 120

అర్థము :- అంతన్ = అంతట.

సూర్యోదయ వర్ణనము

సీ॥ చిఱుసావఁ బట్టించు చికిలి సేయించిన
గండ్రగొడ్డలి నిశాగహనలతకుఁ
గారొక్కన్న నిబిడాంధకార ధారాచ్ఛటా
సత్త్రివాటికి వితిహోత్ర జిహ్వా
నక్షత్ర కుముదకాననము గిల్లెడు పొంచె
ప్రాచి యెత్తిన హస్తపల్లవాగ్ర
మరసి మింటికి మంటికై క్య సందేహంబుఁ
బరిహరింపంగఁ బాల్పడ్డ యవధి

తే॥గీ॥ స్ఫటికందెఱ తొలుసంజ చెలిమికాఁడు
కుఁటు వినతామహాదేవి కొడుకుఁ గుఱ్ఱ
సవిత్రసారథి కట్టుజ్జుచాయ వేలు,
పరుణుఁడుదయించెఁ బ్రాగ్దిశాభ్యంతరమున॥ 121

అర్థము :- 'నిశాగహనలతకున్' నిశా = రాత్రియేయనెడి, గహనలతకున్= అడవితీఁగెకు, 'చిఱుసానఁబట్టించి చికిలిసేయించిన' చిఱుసానన్ = (చిఱుత+సాన) చిన్నసానయందు-కరసానయందు, పట్టించి = మొక్కలుసరిచేయించి, చికిలిసేయిం చిన = సాన పొడి తుడిచి మెఱుఁగెక్కించిన, గండ్రగొడ్డలి = పెద్దగొడ్డలి;

'కారొక్కన్న .... సత్త్రివాటికి' కారొక్కన్న = (కాఱు + కొన్న) నల్లఁ బాఱిన, నిబిడ = సాంద్రమైన, అంధకార = చీఁకట్లయొక్క, ధారా + చ్ఛటా =

పరంపరాసమూహమే యనెడి, నత్రవాటికిన్ = యజ్ఞవాటికి. 'వీత్నిహోత్రజిహ్వా'-వీతిహోత్ర = అగ్నిదేవునియొక్క, జిహ్వా = నాలుక;

'నక్షత్రకుముదకాననము' నక్షత్ర = నక్షత్రములేయనెడి, కుముద = తెల్ల గలువలయొక్క, కానను = ఆడవిని, గెల్లెడు పొంచెన్ = కోయుటకొఅకు, ప్రాచి = తూర్పుదిక్కనెడి స్త్రీ, ఎత్తిన = పైకెత్తిన, 'హస్తపల్లవాగ్రము' హస్త పల్లవ = పాణితలమే యనెడి చిగురాకుయొక్క, అగ్రము = అగ్రభాగము; అరసి = పరిశీలించి, మింటకి మంటికిన్ = మిన్ను మన్నులకు-ద్వావాపృథ్వులకు, 'ఐక్యసందేహంబున్' ఐక్య = ఏకత్వమునకు సంబంధించిన, సందేహంబున్ = సంశయమును, పరిహరింపంగన్ = తొలగించుటకు, పాల్పడ్డ = పూనికొనిన, అవధి = పరిహద్దు, సృష్టి = జీవసృష్టియొక్క, కందెబ = (కన్ను + తెబ = కందెబ) కంటిపెప్ప, శ.ర. అరుణుడు సృష్టికి పెప్పవిప్పుగానీ-పెప్పగాదు. (కన్ను + తెబపు-కందెఖ) కన్నువిప్పు, వికృతియందాగమాదేశలోపంబులు పెక్కుదెర్గంగులంగానంబడియెడు. 'తొలుసంజ చెలిమికాడు' తొలుసంజ = ప్రాతఃసంధ్యయొక్క, చెలిమికాడు = స్నేహితుడు, కుంటు = పిచ్చుకుంటు-అంగవికలుడు, వినతామహాదేవి = వినతా మహాదేవియొక్క, కొడుకుగుట్టి = ముద్దుగొడుకు, 'సవిత్రసారథి' సవిత్ర = సూర్యునియొక్క, సారథి = రథచోదకుడు, 'కట్టెబచాయవేలుపు' కట్టెబ-(కడు + ఎట్టు-కట్టెబ) మిక్కిలి యెట్టనైన, చాయ = శరీరవర్ణముగల, వేలుపు = దేవత, అరుణుడు = అనూరుడు, 'ప్రాగ్దిశాభ్యంతరమునన్' ప్రాగ్దిశా = (ప్రాక్+దిశా) తూర్పుదిక్కయొక్క, అభ్యంతరమునన్ = లోపలిభాగమందు, ఉదయించెన్ = ఉదయించెను.

తాత్పర్యము :- రాత్రియే యనెడి యరణ్యవల్లిని తెగించుటకు సాన పట్టించి చికిలీ చేయించిన గండ్రగొడ్డలి; కారుకొనిన దట్టపు జీకటిపరివాహసమూహములే యనెడి యజ్ఞవాటికి అగ్నిదేవుని నాలుక; నక్షత్రములేయనెడి తెల్లగలువల తోటను కోయుట కొఅకై తూర్పుదిక్కను జవరాలు మింటికెత్తిన పాణిపల్లవము యొక్క యగ్రభాగము; రోదసియంతయు రాత్రి చీకటి ఒక్కటియేయైపోయినందున ఎక్కడనుండి యాకాశమో, ఎక్కడినుండి భూమియో, యనుసంశయమును దొలగించుటకు పాలుపడిన సరిహద్దు; జీవసృష్టికి పెప్పవిప్పు తొలుసంజకు శాశ్వత

సఖుఁడు; పిచ్చుకుంటు; వినతామహాదేవి ముద్దుకొడుకు; సూర్యునిసారథి; కట్టెబొ చాయవేలుపు; అయిన అరుణుఁడు తూర్పుదిక్కునకిమిభాగము నందుదయించెను.

విశేషము :- ఇక్కడినుండి మయూరుని శ్లోకములకు యథేచ్ఛమైన అనుసరణము. ఒక్క ఉదాహరణము-'తమోఽరణ్యవహ్నిరివార్చిః' అనుమూలమునకు, 'నిబిడాంధకారాచ్ఛటాసత్త్రివాటికి వీతిహోత్రజిహ్వా' అని తెనుఁగు; "తమోఽరణ్యము" రూపకము. "వహ్నిరివార్చిః" ఉత్ప్రేక్ష-కానిచో ఉపమ; ఏమైనను-అది యరణ్యవహ్నియే; మూలములోని 'అరణ్యాగ్ని" తెలుఁగుపద్యములో "యజ్ఞాగ్ని" గా మాఱుట, మెఱుఁగేకాని. 'అంధకారధారాచ్ఛట" సత్త్రివాటిగా రూపితమగుట లోని యౌచిత్యముచింత్యము. అంధకారధారాచ్ఛటలు, హవిస్సులుగా రూపితములు కావలయును. "వీతిహోత్ర జిహ్వా" హవిస్సులనుగ్రసించునుగాని, సత్త్రివాటినే మొత్తముగా గ్రసింపదుగదా; ఈ పద్యమునకు మయూరుని మూలశ్లోకము.

'శాతః శ్యామలతాయాః పరభృరివతమోఽరణ్యవహ్నిరివార్చిః
ప్రాచ్యే వాగ్రేగ్రహీతుం గ్రహకుముదవనం ద్రాగుదస్తోఽగ్రహస్తః
ఐక్యం భిందన్ద్యుభూమ్నోరవధిరివ విధాతేవ విశ్వప్రబోధం
వాహానాంవో విధాతావ్యపనయతు విపన్నామధామాధిపస్య.'

సూర్యశతకము 54

సీ॥ ప్రాలేయ కిరణ బింబంబు వెల్వెలఁ బాతి
యస్తాచలంబుపై నత్త మిల్ల
వరుసతోనోషధీవల్లీ మతల్లుల
కాంతి వైభవలక్ష్మి కచ్చువదల
రవికాంత పాషాణ రత్నంబులందుబ్బి
యగ్ని ప్రత్యుత్థానమాచరింపఁ
ప్రబలాంధకార ధారాచ్ఛటాపటలంబు
పంచ బంగాళమై పాతిపోవ

తే॥గీ॥ నుదయ పర్వత కటక గండోపలములఁ
బటుమూలచ్ఛిదావ్రణ ప్రభవమైన

నెత్తురనియెడు విచికిత్స నివ్వటిల్ల
భానుకిరణంబులొక కొన్ని ప్రాకె నభము॥ 122

అర్థము :- ప్రాలేయకిరణబింబంబు = మంచుకిరణములుగలవాని బింబము (చంద్రబింబము). వెల్వెలఁబాటి = వెలవెలఁబాటి, అస్తాచలంబుపైన్ = అస్త మయపర్వతముమీఁద, అత్తమిల్లన్ = ఒరగిపోఁగా; వరుసతోన్ = క్రమముతో, 'ఓషదీవల్లీమతల్లుల కాంతివైభవలక్ష్మి' ఓషధీ = జ్యోతిర్లతలనెడి, వల్లీమతల్లుల= శ్రేష్ఠములైన తీఁగెలయొక్క, కాంతివైభవ = కాంతివైభవమునకు సంబంధించిన, లక్ష్మి=శోభయొక్క, కచ్చు=గర్వము, వదలన్=శిథిలముకాఁగా; "రవికాంత పాషాణ రత్నంబులందున్' రవికాంత = సూర్యకాంతములనెడి, పాషాణరత్నంబులందున్= శ్రేష్ఠమైన శిలయందు-(సూర్యకాంత మణులయందు), ఉబ్బి=వెలికివచ్చి ,అగ్ని= అగ్నిదేవర, ప్రత్యుత్థానము = (ప్రతి + ఉత్థానము ప్రత్యుత్థానము) ఎదురుకోలను, ఆచరింపన్ = చేయఁగా; 'ప్రబలాంధకార ధారాచ్ఛటాపటలంబు' ప్రబలాంధకార= దట్టపుఁ జీఁకట్లయొక్క, ధారాచ్ఛటా = ధారాసమూహములయొక్క, పటలంబు = పరివారము, (ధారలు కట్టుటకు-చీఁకటి ద్రవద్రవ్యముకాదు-'వర్షతీవ అంజనంనభః లింపతీవతమోఽంగని' ఇత్యాదివర్ణనాసరణినిబట్టి-ఇట్లనుట) పంచబంగాళమైపాటి పోవన్ = చెల్లాచెదరై పలాయనమందికొనఁగా; 'ఉదయ పర్వతకటక గండోపలము లన్' ఉదయపర్వత = పొడుపుకొండయొక్క, కటక = చఱీయలమీఁది, గండోపల ములన్ = (గండోపలములన్ = గండ + ఉపలములన్-గండోపలములన్) పెద్ద బాళ్లయందు, 'పక్షిమూలచ్ఛిద్రావ్రణప్రభవమైన' పక్షిమూల = పెక్కకుదుళ్ల యొక్క, ఛిద్ర = నలుకుటచేతనైన, వ్రణ = గాయములనుండి, ప్రభవమైన = పరిభవించిన, నెత్తురనియెడి = నెత్తురేమోయనెడి, విచికిత్స = సంశయము, నివ్వ టిల్లన్ = ఉదయించఁగా, భానుకిరణంబులు = సూర్యకిరణములు, ఒకకొన్ని = కతిపయ సంఖ్యగలవి, నభము = ఆకాశమునందు, ప్రాఁకెన్ = ప్రసరించెను.

తాత్పర్యము :- చంద్రబింబము వెలువెలఁబాటి అస్తమయపర్వతశిఖరము పైన నత్తమిత్తల్లఁగా; అదికారణముగా,ఓషధీవల్లులయొక్క కాంతి వైభవము క్ర మక్రమముగా సన్నగిల్లిపోఁగా; సూర్యకాంతమణులనుండి యుద్గమించి అగ్నిదేవుఁడు సూర్యునకుఁ బ్రత్యుత్థాన మాచరింపగా; ప్రబలములైన అంధకారపటలములు పంచ బంగళమై పాటిపోవఁగా; ఉదయపర్వత సానుగండ శిలలసందులనుండి-ఇంద్రుఁడు

వజ్రాయుధముతో తెక్కలుదుళ్లను నఱకినందువలన ఏర్పడిన గాయములనుండి స్రవించుచున్న నెత్తురేమో యనెడు సంశయము మొలకెత్తునట్లు కొన్ని సూర్యకిరణము లాకాశమున కెగఁజిమ్మును.

విశేషము :- (1) ఓషధులనఁగా జ్యోతిర్లతలు.అవి పగలు సౌరతేజస్సులో మామూలు తీఁగెలవలెనేయుండును.రాత్రులు మెఱపుతీఁగెలవలె వెలిఁగిపోవుండును. కీటములలో.జ్యోతిరింగణములవలె [మిణుగురు పురువులు] లతలలో జ్యోతిర్లతలు. ఈ జ్యోతిర్లతలు కుమారసంభవములోనిట్లు వర్ణింపఁబడినవి.

'వనేచరాణాంవనితా సఖానాం దరీగృహోత్సంగ నిషక్తభాసః
భవంతి యత్రౌషధయోరజన్యా మతైలపూనాస్సురతప్రదీపాఃʼ

(2) సూర్యుఁడస్తమించునపుడు తన తేజస్సును అగ్నిదేవునియందు న్యాసముంచిపోవును. ఉదయవేళయందు - అగ్ని తనయంచు న్యాసముగా నుంచఁబడిన ఆ సూర్యతేజస్సును మఱల సూర్యున కిచ్చివేయును. అగ్ని కిందువల్లనే 'ఉషర్బుధుఁడనిʼ పేరు. ఉషస్సునందు మేల్కొనువాఁడని యర్థము. దీనికి - 'ఆదిత్యో వాస్తమయన్నగ్నిమనుప్రవిశతి. అగ్నిర్వాదిత్యస్సాయంప్రవిశతిʼ అను వేదవచనము ప్రమాణము.

ఈ పద్యమునకు మూలమైన మయూరుని శ్లోకము :

'వ్యక్కుర్వన్నోషధీశేముషితరుచి శుచేరౌషధీః ప్రోషితాభాఃభాస్వద్గ్రీవోద్గతేన ప్రథమ మివ కృతాభ్యుద్గతిః పావకేన
పక్షచ్ఛేదవ్రణాస్యక్ స్రుత ఇవదృషదోదర్శయన్ ప్రాతరద్రేరాతామ్రస్తీవ్ర భానోరనభిమతనుదేస్తాద్గభస్త్యుద్గమోవఃʼ (సూర్యశతకము 5)

సీ॥ తఱుపి వెన్నెలలోని ధారవళ్య మొకఁ గొంత
నవసుధా కర్దమద్రవము గాఁగఁ
జిన్నారి పొన్నారి చిఱుత చీఁకటి చాయ
యసలు కొల్పిన మషీరసము గాఁగఁ
నిద్రమేల్కాంచిన నెత్తమ్మి మొగడల
పరువంపుఁ బుప్పొళ్ళ హరిదళముగఁ

దొగరు వన్నియ లేఁత తొలుసంజ కెంజాయ
కమనీయ ధాతురాగంబు గాఁగ

తే॥గీ॥ వర్ణములు గూడి యామినీ వ్యపగమమున
జగము చిత్రింపఁ దూలిక చందమైన
కిలకుఁ బ్రాయంపు నూనూఁగు కొదమయెండ
ప్రాచి కభినవ మాణిక్య పదకమయ్యె ॥ 23

అర్థము :- 'తఱపివెన్నెలలోని ధావళ్యము' తఱపి = పరువముగల, వెన్నెల లోని = వెన్నెలయందలి, ధావళ్యము = తెల్లఁదనము, ఒక కొంత = ఒక కొంత భాగము, 'నవసుధా కర్దమద్రవముగాఁగ' నవ = నూతనమైన, సుధాకర్దమ=సున్నపు బురదకు సంబంధించిన, ద్రవము = పలుచని పదార్థము, కాఁగన్ = కాఁగా; చిన్నారి పొన్నారి = మిక్కిలి సుకుమారమైన, చిఱుత చీఁకటి చాయ = లేఁత చీఁకటి వన్నె, 'అసలుకొల్పిన మష్టిరసము' అసలుకొల్పిన = బురదగాఁ జేసిన, మష్టి రసము = వ్రాయుట కుపయోగించు నల్లని ద్రవము (సిరా), కాఁగన్ = కాఁగా; నిద్రమేల్కొంచిన = నిద్రనుండి మేలుకొనిన - వికసించిన, నెత్తమ్మి మొగడల= (నెఱ + తమ్మి) మేలైన తామర మొగ్గలయొక్క, పరువంపుఁ బుప్పొళ్ళు=(పువ్వు+ పొడి) తరుణ పరాగములు, హరిదళముగన్ = హరితాళద్రవ్యము కాఁగా; (పసుపు పచ్చని దినుసు). 'తొగరువన్నియ లేఁత తొలుసంజకెంజాయ' తొగరు వన్నియ= ఎఱ్ఱని వన్నెగల, లేఁత = లేఁతయైన, తొలుసంజ = ఉదయసంధ్యయొక్క, కెంజాయ = (కెంపు + చాయ) అరుణవర్ణము, 'కమనీయధాతురాగంబు గాఁగన్' కమనీయ = అందమైన, ధాతు = గైరికముయొక్క - జేగురుఱాయి యొక్క, రాగంబుగాఁగన్ = వన్నెగాఁగ; వర్ణములుగూడి = రంగులన్నియునుజేరి, యామినీ= రాత్రియొక్క, వ్యపగమమునన్ = (వి + అపగమము) తొలఁగిపోయిన పిమ్మట, జగము = లోకమును, చిత్రింపన్ = చిత్రింపఁగా - తీర్చిదిద్దఁగా, తూలికచంద మైన = కుంచెవంటిదియైన, 'కులుకుఁబ్రాయంపు నూనూఁగు కొదమయెండ' కులుకుఁ బ్రాయంపు = లేఁత వయస్సుగల, నూనూఁగు = (నూఁగు + నూఁగు) నవనవ మైన, కొదమయెండ = తరుణాతపము, ప్రాచికిన్ = తూర్పుదిక్కును జవరాలికి, అభినవ = క్రొత్తగాఁ జేయించిన, మాణిక్యపదకము = కెంపులు పొడిగిన హార మధ్యమునందలి బిళ్ళ, అయ్యెన్ = అయ్యెను.

తాత్పర్యము :- తటపి వెన్నెలలోని తెల్లదన మొక కొంత వేఱుగాఁజేసి అది సున్నపు బురదనీరుగా, మిక్కిలి సుకుమారమైన లేఁతచీఁకటి వన్నె యేర్చి అది పాళముగాఁ జేసిన మషీరసముగా, అప్పుడే విరియుచున్న తామరమొగ్గలలోని తరుణ పరాగములు హారిదళముగా, తొగరు వన్నెగల తొలుసంజయొక్క లేఁత కెంజాయయే అందమైన గైరిక ధాతుద్రవముగా, ఒకే సమయమునందు ఈ వర్ణము లన్నియు సమకూడి, రాత్రి తెల్లవాటిన సిమ్మట జగత్తను చిత్రపటమును దీర్చి దిద్దుటకై సన్నని కుంచెవంటిది యైన తొలుప్రాయముగల నూనూఁగు కొదమయెండ తూర్పు దిక్కును రమణీయొక్క హారమధ్యమునందు కెంపులు పొదిగిన పదకముగా నయ్యేను.

విశేషము :- రాత్రి సమయమంతయును జీఁకటి గవుసెనలోనుండి అవి స్పష్టవర్ణమైన యీ జగత్తును చిత్రపటమును వెలుపలికిఁ దీసి - నానావర్ణములతో మఱలఁ దీర్చిదిద్దుటకు వలసిన ప్రధాన వర్ణములు నాలుగు : అవి తెలుపు, నలుపు, పసపు, ఎఱుపు; నిశావసానమునందు ప్రకృతిలోనివి తమంతటఁ దామే సమకూడి యున్నవి, ఇఁక తీర్చిదిద్దుటకుఁ గుంచె యొక్కటి కావలసియున్నది. ప్రొద్దుటి యీరెండయే ఆ కుంచెయై జగచ్చిత్రమునందు వివిధ వర్ణములను సమున్మీలన మొనరించుచున్నది. అది కుంచెమాత్రమేకాక ప్రాచీ దిగంగనాహార మధ్యమునందు మాణిక్యములు పొదిగిన పతకముకూడ నయ్యేను.

ఈ పద్యమునకు మయూరుని శ్లోకము :

జ్యోత్స్నాంశాకర్ష పాండుద్యుతి, తిమిరమషీశేష కల్మాష, మీష
జ్జృంభోద్భూతేన పింగం సరసిజరజసా, సంధ్యయా, లోణలోచిః
ప్రాతః ప్రారంభకాలే సకలమివ జగచ్చిత్ర మున్మీలయంతీ
కాంతి స్తీక్ష్ణత్విషోఽక్ష్ణం ముదముపనయతాత్తూలికే వాపరానః

సూర్య శతకం-ప్రభావర్ణనం 26

తే॥గీ॥ పాండ్రిశాకాంత నిండు గర్భంబునందు
సూర్యుఁ డుదయింపఁ బ్రొద్దులు చొచ్చియుండ
మొదలఁ దీండ్రించు లేఁత క్రొమ్మొలక యెండ
నింగి యింగిలికాన నభ్యంగమార్చె ॥ 124

అర్థము :- 'ప్రాగ్దిశాకాంత' ప్రాగ్దిశా = తూర్పుదిక్కే యనెడి, కాంత = స్త్రీయొక్క, నిండుగర్భంబునందున్ = పరిపూర్ణ గర్భమునందు, సూర్యుఁడు = సూర్యుఁడు, ఉదయింపన్ = ఉదయించుటకు, ప్రొద్దులు = ప్రసవ దినములు, చొచ్చియుండన్ = ప్రవేశించియుండఁగా, మొదలన్ = ప్రసవమునకు ముందు, తీండ్రించు = ప్రకాశించునట్టి, లేఁత = లేఁతయైన, 'క్రొమ్మొలక యెండ' క్రొమ్మొలక = (క్రొత్త + మొలక) నూత్నాంకురప్రాయమైన, ఎండ = ఎండగల, నింగి= ఆకాశము, ఇంగిలికానన్ = ఇంగిలీకముతో (ఎట్టినిరంగు గల దినుసు), అభ్యంగము = తలంటు, ఆర్చెన్ = ఆడించెను.

తాత్పర్యము :- తూర్పుదిక్కును జవరాలి నిండుగర్భమునందు సూర్యుఁడు ఉదయించుటకు ప్రసవదినములు ఆసన్నము కాఁగా, ఆ ప్రసవమునకు ముందు బాలాతపారుణమైన యాకాశము ఆ చూలాలకి ఇంగిలీకముతో అభ్యంగస్నాన మాడించెను.

విశేషము :- ప్రసవ సమయమునకు ముందు చూలింతలకు అభ్యంగ స్నానము చేయించుట యాచారము.

చం॥కమలము లుల్లసిల్ల రవికాంత శిలాధమనీ లతా సహ
స్రములఁ గృపీటసంభవుఁడు రాజఁగఁ జీఁకటి యూరుసోరుగాఁ
గుముదము నిద్రవోఁ బొడుపుగొండపయిన్ రవియొప్పెఁజూడఁగా
సమధికలీల నింద్రుని హజారపు మేడకుఁ బైఁడికుండలై ॥ 125

అర్థము :- కమలములు = పద్మములు, ఉల్లసిల్లగన్ = ఆనందింపఁగా - వికసింపఁగా, 'రవికాంత ....సహస్రములన్' రవికాంతశిలా = సూర్యకాంత మణుల యొక్క, ధమనీలతాసహస్రములన్ = నాడీ లతాసహస్రములయందు, కృపీట సంభవుఁడు = అగ్ని, ('కృపీట' మనఁగా నీరు. నీటికిఁ గారణమైనది - నిప్పు. అగ్నే రాపః) రాజఁగన్ = ప్రజ్వరిల్లఁగా, చీఁకటి = అంధకారము, ఱొరుసొరుగాన్ = విరిసిపోఁగా, కుముదము = కలువ, నిద్రవోన్ = ముకుళింపఁగా, పొడుపుఁగొండ పయిన్ = ఉదయపర్వతముపైన, రవి = సూర్యుఁడు, సమధికలీలన్ = సమధిక మైన విలాసముతో, ఇంద్రుని = ఇంద్రునియొక్క, హజారపుమేడకున్ = సభా

సౌధమునకు, పైడికుండయై = బంగారపు బిందెయై, చూడఁగాన్ = చూచుటకు, ఒప్పెన్ = అందగించెను.

తాత్పర్యము :- కమలములు వికసిల్లఁగా సూర్యకాంత శిలాధమనుల యందు అగ్ని రాజుకొనఁగా, చీఁకటి పలపలయై పోఁగా, కుముదములు ముకుళింపఁగా, ఉదయపర్వతముపై సూర్యబింబము ఇంద్రుని సభాసౌధ శిఖరాగ్రమునందలి స్వర్ణకలశమువలె మిక్కిలి దర్శనీయమయ్యెను.

సీ॥ చరమరింఖాపుటాంచల టంకశిఖరంబు
లుదయాద్రి చటి జాఱకుండ మోపి
తీఁగనాఁగిన భంగి దీర్ఘదీర్ఘములైన
యంగకమ్ముల రజ్జు లలిమియొత్త
నుత్తానుఁడై వెన్క కొరగి పిచ్చుకకుంటు
విప్రతీపంబుగా వినుతి సేయ
నపగత వ్యాసంగ మగుటఁ జీకాఁరంబు
వెలిగాఁగఁ జక్రంబు విభ్రమింప

తే॥గీ॥ నభ్రవీథికి లంఘించె నమ్మహాద్రి
గంధవాహ ప్రవాహాభి ఘట్టనమునఁ
గేతనము మీఁది పసిఁడి కింకిణులు మొరయ
మెఱుఁగు మెఱసిన చందాన మిహిరురథము ॥ 126

అర్థము :- 'చరమ....శిఖరంబులు' చరమరింఖా = వెనుకటి కాళ్లగిట్టల. టంక = లాడములయొక్క. శిఖరంబులు = కొనలు, ఉదయాద్రిచటిన్ = ఉదయ పర్వతముయొక్క చటీయపై, జాఱకుండన్ = జాఱిపోకుండఁగా, మోపి = నిలిపి; తీఁగసాఁగిన భంగిన్ = తీఁగప్రాఁకిన విధముగా, దీర్ఘదీర్ఘములైన = మిక్కిలియు పొడవైన, అంగకమ్ములన్ = అవయవములను, రజ్జులు = పగ్గములు. అలమి = అలమికొని, ఒత్తన్ = ఒత్తియుండఁగా, ఉత్తానుఁడై = వెల్లకిలఁబడి, వెన్కకున్ = వెనుకకు, ఒరగి = ఒరగిపోయి, పిచ్చుకకుంటు = అనూరుఁడు,

విప్రతీపంబుగాన్ = తలక్రిందుగా. వినుతిసేయన్ = స్తోత్రముచేయుచుండగా. 'అపగతవ్యాసంగ మగుటన్' అపగత = తొలగిన. వ్యాసంగమగుటన్ = స్థల సంసర్గము కలదియగుటచేత. చీత్కారంబువెలిగాగ = చీత్కారములేకయే. చక్రంబు = రథచక్రము. విభ్రమింపన్ = తిరుగగా. 'గంధవాహ ప్రవాహాభిఘట్టన మునన్' గంధవాహ = ఆవహప్రవహాదివాయువులయొక్క. ప్రవాహ = ప్రవాహ ములయొక్క. అభిఘట్టనమునన్ = సంఘట్టనముచేత. 'కేతనము మీది పసిడికింకి ణులు' కేతనము మీది = ధ్వజము మీదనున్న. పసిడి కింకిణులు = బంగారు చిఱుగంటలు. మొరయన్ = మ్రోగగా, మెఱుగు = మెఱుపు. మెఱసిన చందా నన్ = మెఱసిన విధముగా, మిహిరురథము = సూర్యునిరథము. అమ్మహాద్రిన్ = ఆ యుదయపర్వతము నుండి. అభ్రవీథికిన్ = ఆకాశవీథికి, లంఘించెన్ = దాఁటెను.

తాత్పర్యము :- ఉదయపర్వతముపై నుండి సూర్యరథమాకాశవీథికి నొక్క మాఱుగా నెగురుట యీ పద్యము నందు వర్ణింపఁబడినది. సూర్యుని రథాశ్వములు తమ వెనుకటి కాళ్ళ గిట్టల లాడములు, ఉదయపర్వతము యొక్క చఱియపై జాఱ కుండ మోపి, ఆకాశమునకు ఉన్ముఖములై నిలిచినవి. వెనుకటి కాళ్లపై నిలచి నపుడు సుదీర్ఘములైన ఆ గుఱ్ఱముల ఆకుపచ్చని శరీరములు, అకాశము నందు తీఁగలవలె పొడవుసాఁగుటచేత పగ్గములు బిరుసెక్కి వానిశరీరములను అలమికొని పోయి యొత్తికొనుచున్నవి. అనూరుఁడు పెల్లకిలఁబడి వెనుకకు ఒరగి తలక్రిందై స్తోత్రముచేయుచున్నాఁడు. నిరాలంబమైన ఆకాశమునందు స్థలస్పర్శలేనందున చీత్కారధ్వని లేకయే చక్రము తిరుగుచున్నది. అంతరిక్షవాయు ప్రవాహసంఘట్ట నముచేత ధ్వజాగ్రకింకిణులు గల్లురని మ్రోగుచున్నవి. మెఱపు మెఱసినట్లు సూర్యుని రథము ఆకాశవీథికి దాఁటెను.

విశేషము :- చెప్పుటకు ఒకక్రమమును పాటింపపలయునుగావున ఈ క్రియలు ఒకదానివెంట ఒకటి జరుగుచున్నట్లు తోఁచుచున్నదియేకాని వాస్తమునకు ఇవి యన్నియును ఐకకాలికముగానే (ఒక్కసారియే) జరగినవి. అందువల్లనే

"మెఱపు మెఱసిన చందాన" అనుట

దీనికి మయూరుని శ్లోకము.

'పినోరఃపేశీరితా భ్రేశ్చర మఖురపుటాగ్రస్థితైః ప్రాతరద్రా
వాదీర్ఘాంగై రుదస్తో హరిభి రపగతాసంగ నిశ్శబ్దచక్రః

ఉత్తానానూరు మూర్ధావనతి హరభవద్విప్రతీప ప్రణామః
ప్రాణ శ్రేయోవిధత్తాం సవితురవతరన్వ్యోమవీథీంరథోవః॥' 62

సీ॥ ధూర్దండ ఘట్టన త్రుటితగ్రహగ్రావ
ధూళి సాళీ మిళద్వ్యస్థలములు
ధ్వజపటపల్లవోద్ధత మరుత్సంపాత
పరికంప మానోడు పరివృఢములు
గ్రాసాభి లాషానుగత విధుంతుద పునః
ప్రాప్త చక్రవ్యధోపద్రవములు
శ్రాంతాశ్వ నిబిడ నిశ్వాసధారాధుత
స్వర్ధునీ నిర్ఝర జలచరములు

తే॥గీ॥ గగన పద లంఘనైక జాంఘాలికములు
పద్మవన బాంధవుని రథప్రస్థితములు
సాగెనది దక్షిణాయన సమయమగుట
దర్దురముమీఁద, మలయ భూధరముమీఁద॥ 127

అర్థము :- అది = ఆకాలము, దక్షిణాయన సమయముగుటన్ = దక్షిణాయన సమయమైనందున, దర్దురముమీఁదన్ = దర్దుర పర్వతము మీఁదను, మలయ పర్వతము మీఁదన్ = మలయపర్వతము మీఁదను,

'ధూర్దండ.....ద్యుస్థలములు' ధూర్దండ = పోఁతగట్టియొక్క, ఘట్టన = సంఘట్టనముచేత, త్రుటిత = పగిలిన, గ్రహ = గ్రహములేయనెడి, గ్రావ = శిలలనుండిలేచిన, ధూళిసాళి = దుమారములతో, మిళత్ = మేళగించుచున్న, ద్యుస్థలములు = ఆకాశస్థలములు గలవియును, 'ధ్వజపట.....పరివృఢములు' ధ్వజ = కేతనముయొక్క, పటపల్లవ = అంశుకముయొక్క, ఉద్ధత = ఉద్ధతమైన, మరుత్ = వాయువులయొక్క, సంపాత = డెబ్బచేత, పరికంపమాన = కదలుచున్న, ఉడు పరివృఢములు = ఉడురాజు (చంద్రుఁడు) కలవియును. 'గ్రాసాభిలాష.....ఉపద్రవముఐ' గ్రాస = గ్రసించుటయందలి, అభిలాష = కోరికచేత, అనుగత = వెంటఁబడి వచ్చుచున్న, విధుంతుద = రాహువుచేత,

పునః = తిరిగి. ప్రాప్త = పొందఁబడిన, చక్ర = చక్రమువల్లనైన (రథచక్రము). వ్యథా=బాధరూపమైన. ఉపద్రవములు=ఉపద్రవములకలవియును. 'శ్రాంతాశ్వ..... జలచరములు' శ్రాంత = అలసిన. అశ్వ = గుఱ్ఱములయొక్క. నిబిడ = సాంద్రమైన నిశ్వాసధారా = ధారా రూపములైన నిట్టూర్పులచేత. ధుత = ఎగురఁగొట్టఁబడిన. స్వర్ధునీ = ఆకాశగంగయొక్క. నిర్ఝర = ప్రవాహమునందలి. జలచరములు = జలజంతువులు కలవియును. 'గగన .....జాంఘాలికములు' గగనపథ= అకాశమార్గమునయొక్క. లంఘన = దాఁటుటయందు, ఏక = ప్రసిద్ధములైన, జాంఘాలికములు = పిక్కబలముగలవియునునైన. "పద్మవనబాంధవుని రథప్రస్థితములు" పద్మనన = కమలవనములకు. బాంధవుని = బంధువైన సూర్యునియొక్క, రథప్రస్థితములు = రథప్రయాణములు, సాఁగెన్ = సాఁగెను.

తాత్పర్యము :- అమిత వేగముతో వచ్చుచున్న రవిరథముయొక్క పోలు గట్టితాఁకి గ్రహగోళములు బ్రద్దలై దుమారములురేగి యాకాశ విభాగములయందు వ్యాపించుచుండెను. ధ్వజాంశుకముల కదలకల నుండి పుట్టినగాలులచేత చంద్రబింబము వణఁకిపోవుచుండెను.పట్టికొని మ్రింగవలెనను కోరికచేత వెన్నంటి పరువెత్తికొనివచ్చుచున్న రాహువు. మబుల నింకొక మాఱు చ కవ్యధోపద్రవమునకుఁ బాల్పడుచుండెను. (మబుల ననఁగా పూర్వమొకసారి విష్ణుచక్రము వలని యుపద్రవమును పొంది యుండెననుట. అది విష్ణుచక్రము ఇది సూర్యరథచక్రము. సూర్యుని రథమున కొక్కటియే చక్రము.) అలసిరోజుచున్న రథాశ్వముల నిట్టూరుపుల యురవడిచేత ఆకాశగంగా ప్రవాహ జలములయొక్క యుపరిభాగము విచ్చిపోయి లోపలనున్న జలజంతువు లెగిరి పడుచుండెను. ఈరీతిగా గగనమార్గ లంఘనైక జాంఘాలికములైన పద్మబాంధవుని రథ ప్రస్థానములు - అది దక్షిణాయన సమయమగుటచేత దర్దురపర్వతముమీఁదను, మలయపర్వతము మీఁదను సాఁగెను.

దీనికి మూలమైన మయూరుని శ్లోకము :-

"ధూర్ధ్వస్తాగ్ర్యగ్రహాణీ ధ్వజపట పవనాందోళితేందూని దూరం
రాహూ గ్రాసాభిలాషా దనుసరతి పునర్దత్త చక్రివ్యధాని
శ్రాంతాశ్వ శ్వాసహేలాధుత విబుధ ధునీ నిర్ఝరాంభాంసి భద్రం
దేయా సుర్వాదవీయో దివిదివసపతేః స్యందన ప్రస్థితాని' 66

తే॥గీ॥ నడచెఁ దుండీర దేశంబు నడిమిచాయ
గగన ఘంటా పథంబునఁ గమల హితుఁడు
పాండ్యభూపాల శుద్ధాంత భవన హేమ
దీర్ఘికలయందుఁ దననీడ తేజరిల్ల॥ 128

అర్థము :- కమలహితుఁడు = పద్మబంధువు - సూర్యుఁడు, 'పాండ్య భూపాల....దీర్ఘికలయందున్' పాండ్యభూపాల = పాండ్యరాజులయొక్క, శుద్ధాంత భవన = అంతఃపుర సౌధములకుఁ జేరియున్న, హేమదీర్ఘికలయందున్ = బంగారు వన్నె తామరపూవుల దిగుడుబావులయందు, తన నీడ = తన ప్రతిబింబము, తేజరిల్లన్ = ప్రకాశించుచుండఁగా, తుండీరదేశంబు నడిమిచాయన్ = తుండీర దేశము యొక్క మధ్యభాగముగా, గగన ఘంటాపథంబునన్ = ఆకాశ మను రాజమార్గము నందు, నడచెన్ = నడచెను.

తాత్పర్యము :- పాండ్యరాజుల అంతఃపుర సౌధములకుఁ జేరియున్న కనక కమల దీర్ఘికలయందు తన ప్రతిబింబము ప్రకాశించుచుండఁగా తుండీరదేశము నడిమి త్రోవగా, ఆకాశ రాజవీథియందు కమలబంధువు నడచెను.

విశేషము :- అచ్చు ప్రతులలో 'భాండీర' దేశమని యున్నది. 'తుండీర' దేశము ప్రసిద్ధము. 'భాండీర మెచ్చటను వినఁబడదు. దక్షిణాపథము రెండు భాగములు. పాండ్య, చోళ మండలము లని; చోళమండలమునకు 'తుండీర' దేశ మను వ్యవహారము కలదు. పాండ్య మండలమునకు 'పాండ్య' దేశమనియే వ్యవహారము కాని 'భాండీర' మను ప్రసిద్ధి లేదు. ఉత్తర మధురకుఁ జేరువలోనున్న బృందావనములో 'భాండీర' మని ప్రసిద్ధమైన మట్టిచెట్టు కలదు కాని, ఆ పేరుతో ప్రసిద్ధమైన దేశము లేదు. చోళ పాండ్య మండలములు రెండింటికిఁ గలిపి 'తుండీర' మను వ్యవహారముండి యుండవచ్చును.

సీ॥ ఒక దీవి కొక కొండ యుదయాద్రియై యుండు
నది యొండు దీవికి నస్తశిఖరి
యొక దీవిఁ దొలుసంజ యున్మేషమును బొందు
నుదయించు మలుసంజ యొండు దీవి

నొక దీవి నిండుచంద్రికలు మిన్నులు ప్రాకు
నొక దీవి బీఱెండ యుబ్బికాయు
నొక దీవి రవణిల్లు నొక ఋతు ప్రారంభ
నొక దీవి నిగురొత్తు నొండు ఋతువు

తే॥గీ॥ దక్షిణాయన మొక దీవిఁ దళుకుసూపు
నుత్తరాయణ మొక దీవి నుప్పతిల్లు
నిన్నిటికి యత్ప్రభావంబు హేతుభూత
మట్టి రవితేరు సాఁగె లంకాద్రిమీఁద ॥ 129

అర్థము :- ఒక దీవికిన్ = ఒక ద్వీపమునకు, ఒక కొండ = ఒక పర్వతము, ఉదయాద్రియై యుండున్ = ఉదయపర్వతమై యుండును, అది=ఆ యుదయపర్వతమై యున్న కొండయే, ఒండు దీవికిన్ = మఱియొక ద్వీపమునకు, అస్తశిఖరి = అస్తమయ పర్వతము. ఒక దీవిన్ = ఒక ద్వీపమునందు, తొలిసంజ = ప్రాతస్సంధ్య, ఉన్మేషమును = వికాసమును, పొందున్ = పొందును, ఒండు దీవిన్ = వేఱొక ద్వీపమునందు (అదియే), మలిసంజ = అస్తమయ సంధ్యగా, ఉదయించున్ = ఆవిర్భవించును, ఒక దీవిన్ = ఒక ద్వీపమునందు, నిండుచంద్రికలు = నిండుపెన్నెలలు, మిన్నులు = ఆకాశమునందు, ప్రాఁకున్ = ప్రసరించును, ఒక దీవిన్ = వేఱొక దీవియందు, బీఱెండ = (బీఱ + ఎండ) తీక్ష్ణతపము, ఉబ్బి = ఉల్బణమై, కాయున్ = కాయును, ఒక దీవిన్ = ఒక ద్వీపమునందు, ఒక ఋతు ప్రారంభము = ఒక ఋతువుయొక్క మొదలు, తవణిల్లున్ = ప్రకాశించును, ఒక దీవిన్ = ఇంకొక ద్వీపమునందు, ఒండు ఋతువు=ఇంకొక ఋతువు, నిగురొత్తున్ = చివురించును, దక్షిణాయనము = దక్షిణాయనము, ఒక దీవిన్ = ఒక ద్వీపమునందు, తళుకుఁజూపున్ = ప్రవర్తిల్లును, ఉత్తరాయణము = ఉత్తరాయణము, ఒక దీవిన్ = ఒక ద్వీపమునందు, ఉప్పతిల్లున్ = ఉత్పాదిల్లును-పుట్టును, ఇన్నిటికిన్ = ఇన్నింటని, 'యత్ప్రభావంబు' యత్ = ఏ సూర్యుని రథముయొక్క, ప్రభావంబు = ప్రభావము, హేతుభూతంబు = హేతువై యున్నదో, అట్టి = అటువంటి, రవితేరు = సూర్యరథము, లంకాద్రిమీఁదన్ = లంకామలయ పర్వతము మీఁద, సాఁగెన్ = సాగెను - నడచెను.

తాత్పర్యము :- ఒక ద్వీపమునకు ఏ కొండ యుదయపర్వతమో, ఆ వెనుక నున్న ద్వీపమునకు ఆ కొండయే అస్తమయపర్వత మగుచుండుట; ఒక ద్వీపము నందు ఉదయసంధ్య ప్రకాశించుచుండఁగా, మఱియొక ద్వీపమునందు అస్తమయ సంధ్య యుదయించుచుండుట; ఒక ద్వీపమునందు నిండువెన్నెలలు కాయుచుండఁగా, మఱియొక ద్వీపమునందు మండుటెండలు ప్రజ్వరిల్లుచుండుట; ఒక ద్వీపమునందు ఒక ఋతువు మొదలు కాఁగా, మఱియొక ద్వీపమునందు వేఱొక ఋతువు చివురించుట; ఒక ద్వీపమునందు దక్షిణాయనము ప్రవర్తిల్లుచుండఁగా, మఱియొక ద్వీపమునందు ఉత్తరాయణము నడచుచుండుట; మొదలైన యాశ్చర్యములకు ఏ సూర్యరథముయొక్క ప్రభావమే హేతుభూతమో, అట్టి సూర్యరథము లంకా మలయ పర్వతముపై నడచెను.

దీనికి మూలమైన మయూరుని శ్లోకము :

ద్వీపేయో ఽస్తాచలో ఽస్మిన్ భవతి ఖలు స ఏవా పరత్రోదయాద్రిః
యా, యామిన్యుజ్జ్వలేందు ర్యతిరిహ దివసో ఽన్యత్ర తీవ్రాతపస్సః
యద్వశ్యాదేశకాలావితి; నియమయతోనోతు యం దేశకాలా
వవ్యాత్స స్వప్రభుత్వాహిత భువనహితో హేతురహ్నామినోతః

సీ॥ మలయాచలంబుపై జిలువ యిల్లాండ్రుర
ఫణరత్నములయందుఁ బ్రతిఫలించి
లంకాపురంబున శాంకరీదేవత
మకుటేందు రేఖతో మచ్చరించి
కాంచీపురోపాంత కంపాతరంగిణీ
నాళీకవనరాజి మేలుకొలిపి
ద్రవిళసీమంతినీ స్తనమండలంబుల
నవకంపుఁ జెమట బిందువుల నిలిపి

తే॥గీ॥ సహ్యగిరిరాజ కన్యకా జలనిధాన
సలిలహారి పరస్పరాస్ఫాలనోత్థ
కణ, లవాసార సేహారగంధవాహ
సంగమంబులఁ బథపరిశ్రాంతిఁ దొఱఁగి ॥ 130

అర్థము :- మలయాచలంబుపైన్ = మలయపర్వతముపైన - చందనాచలము పైన, 'చిలువయిల్లాండ్రుర' (చిలుము = వాయు - చిలువ) చిలువ = సర్పముల యొక్క, ఇల్లాండ్రుర = కులస్త్రీలయొక్క, ఫణ = పడగలయందలి. రత్నములన్ = రత్నములయందు, ప్రతిఫలించి = ప్రతిబింబించి; లంకాపురంబునన్ = లంకాపురమునందు, శాంకరీదేవత = శాంకరీదేవియొక్క (అష్టాదశ శక్తి పీఠములలో మొదటి శక్తిపీఠము లంకానగరము. అచ్చటి శక్తి పేరు శాంకరీదేవి. 'లంకాయాం శాంకరీదేవీ'), మకుట = కిరీటమునందలి. ఇందురేఖతోన్ = చంద్రరేఖతో - నెల వంకతో, మచ్చరించి = మాత్సర్యపడి - స్పర్థవహించి; 'కాంచీ....నాళీకవన రాజిన్' కాంచీపుర = కాంచీపురముయొక్క. ఉపాంత = సమీపమునందలి, కంపా తరంగిణీ = కంపానది యందలి, నాళీకవన = పద్మవనములయొక్క, రాజిన్ = శ్రేణిని, మేలుకొలిపి = నిద్రలేపి - వికసింపఁజేసి; 'ద్రవిడ....మండలంబున్' ద్రవిళసీమంతినీ = (సీమంతము = పాపట, సీమంతము కలది సీమంతిని) ద్రవిడ పుణ్యాంగనలయొక్క, స్తనమండలంబులన్ = కుచమండలములయందు. 'నవకంపుఁ జెమట బిందువులన్' నవకంపు = లావణ్యముగల - తళతళలుగల. చెమటబిందువు లన్ = స్వేదబిందువులను, నిలిపి = కుదురుకొనఁజేసి; సహ్యగిరి రాజకన్యా = సహ్యపర్వత నందనయైన కావేరీనది యొక్క. జలనిధాన = దక్షిణసముద్రము యొక్క, సలిల = జలములయొక్క, హారి = మనోహారమైన, పరస్పర = అన్యోన్యముయొక్క, ఆస్ఫాలన = అప్పళింతలనుండి. ఉత్థ = పుట్టిన. కణ = కణరూపములైన, లవ = లవరూపములైన, ఆసార = అన్ని వైపుల ప్రసరించుట లచేత, నీహార = మంచువలెనైన - చల్లనైన, గంధవాహ = వాయువులయొక్క, సంగమంబులన్ = కలయికలచేత, 'పథపరిశ్రాంతిన్' పథ = మార్గముయొక్క - ప్రయాణముయొక్క, పరిశ్రాంతిన్ = బడలికను తొఱఁగి = వీడ్కొని-

తాత్పర్యము :- మలయాచలముపైనున్న సర్పపురంధ్రులయొక్క పడ గలమీది రత్నములయందు ప్రతిబింబించి; లంకానగరమునందలి శాంకరీదేవత యొక్క మకుట శశిరేఖతో ప్రతిఫటించి; కాంచీపుర సమీపమునందలి కంపానది లోని పద్మవనములను ప్రబోధించి; ద్రవిడ యువతీ స్తనమండలములయందు నవ నవ స్వేదబిందువులను నిలిపి; కావేరీ సముద్ర సంగమస్థలమునందలి సలిలముల పరస్పరాస్ఫాలనముల నుండి చింది పడుచున్న బిందువుల సంసర్గముచేత మిక్కిలి చల్లనైన పిల్లగాలులచేత మార్గాయాసమును దీర్చికొని-

వ॥ ఇవ్విధంబున దక్షిణాపథంబునం జనునప్పుడు. 131

అర్థము :- ఇవ్విధంబునన్ = ఈవిధముగా, దక్షిణాపథంబునన్ = దక్షిణా పథమునందు, చనునప్పుడు = వెళ్ళునప్పుడు.

తాత్పర్యము :- సుగమము.

సీ॥ విస్మమరధ్వాంతౌఘ విధ్వంసనక్రియా
పరమదీక్షారంభ గురుమయూఖ
దశశత పరిషదాధార మండలుండైన
చండభానున కధిష్ఠానమగుట
భారంబు భరియింప బరువుపడ్డది వోలె
మూఁపు మూఁపునను౦డి మొక్కలమున
ననిలంబు లేడును నంచెలంచెలు గట్టి
యాకాశవీథి నందంద నడవ

తే॥గీ॥ నడచు రవితేరు మింటి నెన్నడిమి చక్కి-
భగ్ననఁగఁ దాఁకె వింధ్యపర్వతము చఱులఁ
గఱిన నిర్ఘోష నిర్ఘాత ఘుట్టనమునఁ
బంకజాతభవాండ కర్పరము పగుల ॥ 132

అర్థము :- 'విస్మమర....మండలుండైన' విస్మమర = వ్యాపించు స్వభావము గల, 'ధ్వాం తౌఘ' (ధ్వాంత + ఓఘ) ధ్వాంత = చీఁకట్లయొక్క, ఓఘ= సమూహముయొక్క, విధ్వంసన = నశింపఁజేయునట్టి, క్రియా = వ్యాపారమే యనెడి, పరమ = అత్యుత్తమమైన, దీక్ష = దీక్షయొక్క - నియమసహితమైన పూనికయొక్క, ఆరంభ = ప్రారంభమునకు, గురు = ఉపదేశకమైన, 'మయూఖ దశశత' మయూఖ = కిరణములయొక్క, దశశత = వేయింటియొక్క, పరిషత్= సభకు, ఆధార = స్థానమైన, మండలుండైన=మండలము గలవాఁడైన, 'చండభాను నకున్' చండ = తీక్ష్ణములైన, భానునకున్ = కిరణములు గలవానికి-సూర్యునకు, అధిష్ఠానమగుటన్ = నిలయమగుటచేత, భారంబు భరియింపన్ = బరువును మోయఁగా, బరువుపడ్డదివోలెన్ = బరువెక్కినదివలె, మూఁపు మూఁపున నుండి=

ఒక మూఁపునుండి, వేఱొక మూఁపునకు - స్కంధమునుండి స్కంధమునకు, మొక్కలమునన్ = ఉత్సాహముతో. అనిలంబులు = వాయువులు, ఏడును = ఏడును- (ఆవహ, సంవహ, ప్రవహ, పరివహాదులైన సప్త మారుతములు) అంచెలంచెలు గట్టి = వరుసలు వరుసలుగా నేర్పడి, ఆకాశవీథిన్ = ఆకాశవీథియందు, అందంద = మఱిమఱి, నడవన్ = నడవఁగా, నడచు = నడచునట్టి, రవితేరు = సూర్యరథము, 'మింటి నెన్నడిమిచక్కన్' మిఱి = ఆకాశముయొక్క. నెన్నడిమి = (నెఱి + నడిమి) నట్టనడిమి, చక్కన్ = భాగమునందు, వింధ్యపర్వతము చఱులన్ = వింధ్య పర్వతముయొక్క చఱియలను. 'కఠిన.... ఘట్టనమునన్' కఠిన = కఠినమైన. నిర్ఘాత = పిడుగువంటి ఘట్టనమునన్ = సంఘట్టనముతో, 'పంకజాతభవాండ కర్పరము' పంకజాతభవాండ = బ్రహ్మాండముయొక్క. కర్పరము = కటాహము. పగులన్ = పగిలిపోవునట్లు, భగ్గనఁగన్ = 'భగ్గు' మనునట్లు. తాఁకెన్ = తాకెను.

తాత్పర్యము :- క్రమ్మికొను లక్షణముగల చీఁకటి మొత్తములను విధ్వంసనము చేయుట యనెడి మహాదీక్ష ప్రారంభమునకు గురుస్థానమైన సహస్ర కిరణములయొక్క పరిషత్తునకు అధారభూతమైన మండలముగల చండకిరణుని కదిష్ఠానమైనందువలన, ఆ భారమును మోయుటవలన బరువెక్కినదై సప్తవాయువులు వరుసలుకట్టి మూఁపులు మార్చుకొనుచు ప్రయాసపడి నడచుచుండఁగా, నడచుచున్న రవిరథము సరిగా ఆకాశమధ్యము చేరుసరికి బిడుగుచఱచిన మ్రోతతో, బ్రహ్మాండ కటాహము బ్రద్దలగునట్లు వింధ్యపర్వతము చఱియలకు 'భగ్గు' మని తాఁకెను.

ఈపద్యమునకు మూలమైన మయూరుని సూర్యశతక శ్లోకము. (63)

'ధ్వాంతౌఘధ్వంస దీక్షావిధి గురు, వహతా ప్రాక్సహస్రం కరాణా
మర్యమ్ణాయోగరీయః పదమతుల ముపానీయతాధ్యాసనేన
సశ్రాంతానాం వినేతుం భరమివ మరుతా మక్షమాణాంవిసోఢుం
స్కంధాత్ స్కంధం వ్రజన్వోతృజిన విహత యేభాస్వతస్స్యందనోఽస్తు

క॥ తగులు వడి యపుడు వడిసెడి
గగన మణి రథంబు దోరగలు వడి నిలిచెన్
బొగరు మొగకడలి యక్కలి
దగిలి నిలువఁబడిన కలపతియుక్ బోలెన్ ॥ 188

అర్థము :- తగులువడి = తగుల్కొని సంసక్తమై. అపుడు = ఆసమయమునందు, వడిసెడి = వేగముచెడి. గగనమణి = అంబరమణియైన సూర్యుని యొక్క, రథంబు = రథము. దోరగలువడి = [దోర + కల్లు = ఒరగినచక్రము) ఒరగినచక్రము గలదియై-ఒడ్డగెడవై. నిలచెన్ = నిలచెను. 'పొగరు మొగకడలి' పొగరు = ఉద్ధతమైన. మొగకడలిన్ = కడలిమొగయందు సముద్రిముఖమునందు. ఆక్కలిదగిలి = అవరోధము తగిలి. నిలువఁబడిన = నిలిచిపోయిన. కలపతియున్ బోలెన్ = ('కలంపాతి ఇతి కలపః' 'కల' మనఁగా ఓడ. కలమును పాలించువారు కలపులు-సరంగులు) సరంగుల సముదాయమువలె.

శబ్దరత్నాకరపాఠమిట్లున్నది; పొగరు మొగ కడలి యక్కలిదగిలి నిలువఁ ఒడిన యానతరియుం బోలెన్ 'యానతరి' = ప్రయాణపుబోడ - యానపాత్రము.

తాత్పర్యము :- అడ్డుతగిలినదియై వేగముచెడి సూర్యునిరథము 'దోర గల్లు' పడినదియై - ఒఱగిన చక్రము కలదియై, సముద్రముఖమున మహాతరంగాఘాతరూపమైన యవరోధము తగిలి యాగిపోయిన సరంగుల సముదాయమువలె నిలిచిపోయెను. 'యానతరి' అను పాఠమున ఓడవలె.

కం॥ ఒక్క నిమేషము రాహువు
పుక్కిటిలోఁ దగులు వడక పోయెడు భానుం
డిక్కొండ ప్రక్కఁ జిక్కెన్
బెక్కేడులు విధివశంబు పెంపెట్టిదియో? 134

అర్థము :- ఒక్క నిమేషము=ఒక్క నిమేషమైనను, రాహువు పుక్కిటిలోన్= రాహువుయొక్క బుగ్గలోపలిభాగములో, తగులువడక = తగుల్కొనక, పోయెడు= వెళ్ళెడు, భానుండు = సూర్యుఁడు, ఇక్కొండ ప్రక్కన్ = ఈకొండ పార్శ్వమునందు, పెక్కేడులు = (పెక్కు + ఏడులు) పెక్కుసంవవత్సరములు, చిక్కెన్ = నిలిచిపోయెను, విధివశంబు = విధివశము యొక్క, పెంపు = అతిశయము, ఎట్టిదియో = ఎటువంటిదియో!

తాత్పర్యము :- ఒక్క నిమేషమాత్రమైన కాలము గూడ రాహువు పుక్కిలలోఁ జిక్కికొనక పోయెడు సూర్యుఁడు - ఈకొండ ప్రక్కనఁ బెక్కుసంవత్సరములు చిక్కుపడి నివిచిపోయెను. విధివశము యొక్క ప్రభావ మెంతటిదియో కదా!

తే॥గీ॥ రెండు వేలును నిన్నూట రెండు యోజ
నంబు లర్ధనిమేషమాత్రంబునందు
నంబరంబునఁ బాఱు తీవ్రాంశురథము
నిలిచె బహుకాలమిట్టిదే నియతి మహిమ॥ 185

అర్థము :- అర్ధనిమేషమాత్రంబునందున్ = అర్ధనిమేషమాత్ర పరిమితమైన సమయములో, రెండువేలను నిన్నూటరెండు యోజనంబులు = రెండువేల రెండు వందల రెండామడలు, అంబరంబునన్ = ఆకాశమునందు, పాఱు పరువెత్తెడి, తీవ్రాంశురథము = తీక్ష్ణకిరణుఁడైన సూర్యుని రథము, బహుకాలము = అనేక కాలము, నిలిచెన్ = నిలిచిపోయెను, నియతి మహిమ = నియతియొక్క మహిమ, ఇట్టిదే ! = ఇటువంటిదియా ?

తాత్పర్యము :- ఒక అర్ధనిమిసములో రెండువేల రెండువందల రెండు ఆమడల దూరము ఆకాశములో ప్రయాణించెడి సూర్యరథము బహుకాలము నిలిచి పోయెను. నియతియొక్క మహిమ యిట్టిదియా?

కం॥ స్థితిసర్గ విసర్గములకు
గతి, భానుఁడు కేవలంబ కానఁ దదీయ
ప్రతిబంధము త్రైలోక్య
ప్రతిబంధంబై విపత్పరంపరఁ బెనిచెన్ ॥ 186

అర్థము :- స్థితిసర్గ విసర్గములకున్ = స్థితికి, సృష్టికి, ప్రళయమునకు, గతి = పరాయణము, భానుఁడు కేవలంబ = సూర్యుఁ డొక్కఁడే: కానన్ = అందువలన, 'తదీయ ప్రతిబంధము' తదీయ = ఆ సూర్యునకు సంబంధించిన, ప్రతిబంధము = అవరోధము, 'త్రైలోక్య ప్రతిబంధంబై' త్రైలోక్య = ముల్లోకములకును, ప్రతిబంధంబై = అవరోధమై, 'విపత్పరంపరన్' విపత్ = ఆపదల యొక్క, పరంపరన్ = ఎడతెగని వరుసను, పెనిచెన్ = పెంచెను.

తాత్పర్యము :- స్థితి సృష్టి ప్రళయములకు సూర్యుఁ డొక్కఁడే గతి కావున ఆ సూర్యుని ప్రతిబంధము మూఁడు లోకములకు ప్రతిబంధమై విపత్ పరంపరలను పెంచెను.

సీ॥ లేనయ్యో స్వాహాస్వధా వషట్కారంబు
లుడి వోయెఁ త్రేతాగ్ని హోత్ర విధులు
కాలంబు కొల ది లెక్కలువెట్ట నేరక
చిత్రగుప్తాదులు చిక్కువడిరి
యిది సాజ యిదిరాత్రి యిది వాసరం బను
సమయ వర్ష్మములపక్రమములయ్యె
స్రావితో వర్షంబు సమకూర కుండుటఁ
బంట లేబరమయ్యె బాఁడి తోడఁ

తే॥గీ॥ గొన్ని దేశంబు లెండచే గొవరువోయెఁ
గొన్ని దేశంబు లివముచేఁ గొంకువోయెఁ
గొన్ని దేశంబు లిరులచే గ్రుడ్డి వడియెఁ
గొన్ని దేశంబు లివచేత గుత్తివడియె॥ 137

అర్థము :- స్వాహాస్వధావషట్కారంబులు = స్వాహాకార, స్వధాకార. పషట్కారములు, లేపయ్యెన్ = లేనివయ్యెను, త్రేతాగ్ని హోత్రవిధులు = గార్హపత్య ఆహవనీయదక్షిణాగ్నులు. ఉడివోయెన్ = ఉడిగి + పోవు) తొలఁగిపోయెను-ఉపరతములయ్యెను. కాలంబు కొలఁది = కాలపరిమాణమును, లెక్కలువెట్టనేరక = లెక్కపెట్టలేక, చిత్రగుప్తాదులు = చిత్రగుప్తుఁడు మొదలైనవారు. చిక్కువడిరి = తికమకపడిరి, ఇది పంజ = ఇది సంధ్యాసమయము, ఇదిరాత్రి = ఇదిరాత్రిసమయము, ఇది వాసరంబు = ఇది పవలు, అను = అనెడి, సమయవర్ష్మములు = సమయప్రమాణములు, ఆపక్రమములయ్యెన్ = క్రమము తప్పినవయ్యెను, స్రావితోన్ = అదనుతో, వర్షంబు = వాన, సమకూరకుండుటన్ = ఒనగూడక పోవుట వలన, పంట=పంటలు, లేబరమయ్యెన్ = శూన్యమయ్యెను, పాడితోడన్ = పాడితోసహ, కొన్నిదేశంబులు - ఎండచేన్ = ఎండచేత, గొవరువోయెన్ = సంతాపమును పొందెను, కొన్నిదేశంబులు = కొన్నిదేశములు, ఇవముచేన్ = హిమముచేత-మంచుచేత, కొంకువోయెన్ = కొఁకర్లు వోయెను కొన్నిదేశంబులు = కొన్నిదేశములు, ఇరులచేన్ = చీఁకట్లచేత, గ్రుడ్డివోయెన్ =

గ్రుడ్డివై పోయెను. కొన్నిదేశంబులు = కొన్నిదేశములు, ఇవచేతన్ = చలిచేత, గుత్తడియెన్ = ముడుచుకొనిపోయెను.

తాత్పర్యము :- వెనుకటి పద్యములో జెప్పిన ఆ విపత్పరంపరలను వివరించుచున్నాడు: స్వాహాకారముతో దేవతలకు స్వధాకారముతో పితృదేవతలకు హవిస్సులనిత్తురు. వషట్కారముతో గూడ దేవతలకిత్తురు. ఆ శబ్దము లెచ్చటను వినిపించుటలేదు. గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్నులు మూలపడిపోయెను. కాలప్రమాణమును లెక్కలుపెట్టనేరక చిత్రగుప్తుడు మొదలైనవారు చిక్కులు పడజొచ్చిరి. ఇది సంధ్య. ఇదిరాత్రి. ఇదిపవలు, అను సమయ పరిమాణములు క్రిమముదప్పెను, తటితో వానలు పడకపోవుటచేత పంటలు లేవయ్యెను. పంటలతో బాటు పాడికూడ గరవయ్యెను. కొన్ని దేశములు ఎడతెగని యెండచేత దహించిపోయెను. కొన్నిదేశములు మంచుచేత గొంకరలు పోయెను. కొన్నిదేశములు చీకట్లచేత గ్రుడ్డివై పోయెను. కొన్నిదేశములు చలిచేత ముడుచుకొనిపోయెను.

సీ॥ పూచిన కొరవి పూబొదరింటి చందాన
గత్తెర యొక్కచో గదలకుండె
నొకచో దగుల్పడె నుపకారి కొఱటికిఁ (కొరటికి?)
దరమైన రోహిణీ తారకంబు
నొకచో బునర్వసువ్రూగె వృక్షము కొమ్మ
సుడిఁ బడ్డ ముత్యాలసోగువోలె
శయనించె నొకచోట శ్రవణ నక్షత్రంబుఁ
గుంటవిూదటి ప్రత్తికొడుపువోలె

తే॥గీ॥ స్వాతి చిత్తలు తోరణ స్తంభయుగము
ననుకరించుచు నొక్కచో నత్తమిల్లెఁ
జిఱుతవోయిన మూఁకుటి చెలువు దాల్చి
హత్తెనొకచో విశాఖ వింధ్యాద్రియందు॥ 138

అర్థము :- వింధ్యాద్రియందున్ = వింధ్యపర్వతము మీఁద, 'పూచిన కొరవి పూఁబొదరింటి చందానన్' పూచిన = పుష్పించిన, కొరవిపూఁబొదరింటి = (పూవు+

పొదరు - పూఁబొదరు) ఎట్టగోరింట పూవులుగల పొదరిల్లుయొక్క, చందానన్ = విధముగా, కత్తెర = కృత్తికానక్షత్రము, ఒక్కచోన్ = ఒక్కచోట. కదలకుండెన్ = కదలకయుండెను, (సం) ఉపకార్య-ఉపకారి - ఉప్పరిగ = మిద్దెమీఁది కట్టడము) ఉపకారి కొఱటికిన్ = ఉప్పరిగయొక్క స్తంభమునకు (దుంగకుఁ) తరమైన = సాటియైన, రోహిణీ తారకంబు = రోహిణీ నక్షత్రము, ఒకచోన్ = ఒకచోట, తగుల్పడెన్ = (తగులు + పడెన్) అడ్డగింప బడియుండెను, ఒకచోన్ = ఒకచోట, పునర్వసువు = పునర్వసునక్షత్రము, వృక్షము కొమ్మన్ = చెట్టుకొమ్మయందు, 'సుడివడ్డ ముత్యాల సోఁగువోలెన్' సుడివడ్డ = చిక్కుపడిన, ముత్యాల సోఁగువోలెన్ = ముత్యాల సరమువలె, ఱోఁగెన్ = ఱోఁగెను, ఒకచోటన్ = ఒకచోట, కుంట మీఁదటి పత్తికొడుపువోలెన్ = పొలముమీఁది ప్రత్తికాయ కోణమువలె, శ్రవణనక్షత్రంబు = శ్రవణ నక్షత్రము, శయనించెన్ = శయనించెను, స్వాతిచిత్తలు = స్వాతి, చిత్త, అనునక్షత్రములు, 'తోరణస్తంభయుగమున్' తోరణ = బహిర్ద్వారముయొక్క, స్తంభయుగమున్ = స్తంభములజంటను, అనుకరించుచున్ = పోలుచు, ఒక్కచోన్ = ఒకచోట, అత్తమిల్లెన్ = ఒరగెను, ఒకచోన్ = ఒకచోట, చిఱుతవోయిన = చిన్నపోయిన, మూఁకుటి చెలువు = మూఁకుటి విధమును, తాల్చి = ధరించి. విశాఖ = విశాఖానక్షత్రము, హత్తెన్ = హత్తికొనెను.

తాత్పర్యము :- రవిరథప్రతిషంభనము వలన నక్షత్రగమనము కూడ కుంటుపడిన విధమును, ఈ పద్యములో వర్ణించుచున్నాఁడు.

పూచిన యెట్టగోరింట పూలపొదవలె కృత్తికానక్షత్రము ఆ వింధ్యపర్వతముపై నొకచోట కదలక యుండెను. మిద్దెనిట్రిడువలె రోహిణీనక్షత్ర మొకచోట నిరోధింపఁబడి యుండెను. చిక్కుపడిన ముత్యాలహారమువలె పునర్వసు నక్షత్ర మొకచోట చెట్టుకొమ్మకు వ్రేలాడుచుండెను. కొండ్రలోని పత్తికాయకోణమువలె శ్రవణనక్షత్ర మొకచోట శయనించెను. స్వాతియును చిత్తయును తోరణస్తంభముల జంటను అనుకరించుచు నొకచోట ఒరగియుండెను. చిన్నపోయిన మూకుడువలె విశాఖానక్షత్రము ఒకచోట హత్తికొనిపోయెను.

విశేషము :- ఈ పద్యమునందు వర్ణించిన నక్షత్రములయొక్క చెలా చెదరైన సన్నివేశము, హంపి, వరంగల్లు, మొదలైన చరిత్ర స్థలముల యందలి

శిలావశేషములవలె పోల్చికొనుటకు మిక్కిలి చిక్కగానేయున్నను మొత్తము మీఁద నక్షత్రిమండలముయొక్క సంకీర్ణము, విప్రకీర్ణమునైన సంస్థాన విశేషము మనస్సునకు నచ్చునట్లు చేయుచున్నది. ప్రధానముగా నిందలి 'ఉపకారికొఁబడు' 'కుంచె మీఁదటి పత్తికొడుపు'; నేటికిని పండితులకు 'కొఁబపన కొయ్యలై యున్నవి. పాఠాంతరములున్నవేమో పరిశోధింపవలసియున్నది.

సీ॥ నేత్రంబు లున్మేష నిస్పృహత్వము నొంద
శ్రుతిపుటంబుల శక్తి చొక్కుమడఁగ
జ్ఞానేంద్రియ జ్ఞాన కళా లారుసారుగా
జిహ్వావివేకంబు చిఱుతవోవ
నంతరంగమున మహాంధకారమ్ముగ్రమ్మఁ
దనువు చేష్టా దరిద్రత వహింపఁ
బ్రాణముల్ శ్వాసమాత్రమునఁ బర్యవసింపఁ
దలచీర యెఱుఁగని దశఘటిల్లఁ

తే॥గీ॥ బాము గఱచిన మూర్ఛిల్లి పడినయట్లు
వితత నిద్రాసమావేశ వివశులగుచుఁ
దరణి దీధితి లేమిఁ జైతన్య మెడలి
పడిరి పాశ్చాత్యదేశంబు పంచజనులు॥ 139

అర్థము:- నేత్రంబులు = కన్నులు. ఉన్మేష = తెప్పవిప్పునందు, నిస్పృహత్వమున్ = స్పృహలేనితనమును, ఒందన్ = పొందఁగా, "శ్రుతిపుటంబులశక్తి" శ్రుతిపుటంబుల = శ్రవణపుటములయొక్క-చెవిదొప్పలయొక్క, శక్తి = శ్రవణశక్తి-వినఁగలిగిన సామర్థ్యము, చొక్కుమడఁగన్ = మూర్ఛిల్లఁగా, 'జ్ఞానేంద్రియ జ్ఞానకళలు' జ్ఞానేంద్రియ = జ్ఞానేంద్రియములయొక్క - కన్ను, చెవి, ముక్కు, నాలుక, త్వగింద్రియములయొక్క, జ్ఞానకళలు = జ్ఞానకళలు, ఱొరుసారుగా = శిథిలములు కాఁగా, 'జిహ్వావివేకంబు' జిహ్వా=నాలుకయొక్క-రసనేంద్రియముయొక్క, వివేకంబు = రుచులను విడఁబఱచి తెలిసికొనుశక్తి, చిఱుతవోనన్ = తగ్గిపోఁగా, అంతరంగమునన్ = మనస్సునందు, మహాంధకారము = పెద్దచీఁకటి, క్రమ్మన్ = క్రమ్మికొనఁగా, తనువు = శరీరము, చేష్టాదరిద్రతను = చేష్టలులేమిని, వహిం

పన్ = హీనంగా, ప్రాణముల్ = ప్రాణములు, శ్వాసమాత్రమునన్ = శ్వాస యాడుట యందే, పర్యవసింపన్ = మిగిలియుండగా, తలచీక యెఱుగని దశ = తలపై పాగాయున్నదో లేదో తెలియని యవస్థ, ఘటిల్లన్ = సంఘటిల్లగా, పాముగఱచినన్ = పాముకఱవగా, మూర్ఛిల్లిపడినయట్లు = మూర్ఛపచ్చివడిపోయినట్లు, 'విత నిద్రాసమావేశవివశులగుచున్' విత = విస్తృతమైన, నిద్రా = నిద్రయొక్క, సమావేశ = ఆవహించుటచేత. వివశులగుచున్ = పరవశులగుచు, 'పాశ్చాత్యదేశంబు పంచజనులు' పాశాత్యదేశంబు=పడమటిదేశమునకు సంబంధించిన, పంచజనులు = జనులు, 'తరణిదీధితి' తరణి = సూర్యునియొక్క. దీధితి = కాంతి. లేమిన్ = లేకపోవుటచేత, చైతన్యము=చేతనత్వము. ఎడలి = తొలగి. పడిరి = పడిపోయిరి.

తాత్పర్యము :- కన్నులు తెప్పవిప్పుట యంచాశవదలు కొనగా, వీనుల యొక్క శబ్దగ్రహణ శక్తి యుడిగిపోగా, మిగిలిన జ్ఞానేంద్రియములయొక్క జ్ఞానకళలు ప్రశిథిలముకాగా, నాలుకయొక్క రుచులను గ్రహించు శక్తి మందగింపగా, మనస్సునందు పెద్దచీకటి యలమికొనిపోగా, శరీరము చేష్టలుడుగగా, ప్రాణములు శ్వాసమాత్రావశిష్టములుకాగా, తలపై జీరయున్నదో లేదో కూడ దెలియని దశ యావహిల్లగా, పాముకరిచినపుడు మూర్ఛిల్లిపడిపోయినట్లు విస్తృతమైన విద్రా యావేశించి యొడలు తెలియక పాశ్చాత్యదేశప్రజలు సూర్యకాంతిలేమిచే చైతన్యము తొలగి పడిపోయిరి.

విశేషము :- నేత్రములు, శ్రుతి పుటములు, జ్ఞానేంద్రియములలోనివే. మఱల జ్ఞానేంద్రియములయొక్క, జిహ్వాయొక్క ప్రసక్తి తెచ్చుట స్పష్టతకొఱకనియును-'తనువు చేష్టా దరిద్రత వహింప' అనుటచేత కర్మేంద్రియములు కూడ ఆ స్థితిలోనే యున్నవనియు దెలియనగుచున్నది.

వ॥ అనిన విని నైమిశారణ్య ముసీశ్వరులట మీఁది వృత్తాంతం
బెయ్యది యని యడిగిన- 140

అర్థము :- అనినన్ = సూతుఁడిట్లు చెప్పఁగా. విని = ఆకర్ణించి, నైమిశారణ్య ముసీశ్వరులు = నైమిశారణ్యమునందలి ముసీశ్వరులు, అటమీఁది వృత్తాంతంబు = ఆపైన జరగిన విషయము, ఎయ్యది యని = ఎటువంటిదని, అడిగినన్ = అడుగఁగా -

తాత్పర్యము :- సుగమము.

ఆశ్వాసాంతము

శా॥ పారావార పరీత విశ్వవసుధా భారోద్ధృతిప్రక్రియా
ధౌరంధర్య సరోరుహేక్షణ! సమిద్గాండీవ కోదండ! దా
క్షారామ ప్రమదా కఠోర కుచకుంభాభోగ సంక్ష్మ్త, క
స్తూరీ స్థాసక ముద్రిత స్థగిత వక్షోవీథికాభ్యంతరా! 141

ఆర్థము :- పారావార = సముద్రములచేత, పరీత = చుట్టుకొనఁబడిన, విశ్వ = సమస్తమైన, వసుధా=భూమియొక్క, భార = భారముయొక్క, ఉద్ధృతి= (ఉత్ + ధృతి) ఎత్తి ధరించుట యనెడి, ప్రక్రియా = వ్యాపారమునందలి, ధౌరం ధర్య = ధురంధరత్వమునందు-సామర్థ్యము నందు, సరోరుహేక్షణ=(సరోరుహ + ఈక్షణ) కమలాక్షునివంటి వాఁడా! (విష్ణుమూర్తివంటివాఁడా!)

'సమిద్గాండీవకోదండ!' సమిత్ = యుద్ధములయందు, గాండీవ కోదండ!= గాండీవము ధనుస్సుగాఁగల - అర్జునుని వంటివాఁడా. ('సంగ్రామపార్థ!' అని వీర భద్రారెడ్డి బిరుదము.) 'దాక్షారామ....వీథికాభ్యంతరా!' దాక్షారామప్రమదా = దక్ష వాటియందలి స్త్రీలయొక్క-గణికలయొక్క, కఠోర = కఠినములైన, కుచకుంభ = కుంభములవంటి స్తనములయొక్క, ఆభోగ = వైశాల్యమునందు-పరిమాణాహము నందు, సంక్ష్మ్త=రచింపఁబడిన, కస్తూరీ=కస్తూరి యొక్క, స్థాసక=పూఁతచేత-చర్చ చేత, ముద్రిత = అచ్చొత్తఁబడినట్టియు, స్థగిత = పొదువఁబట్టియు, వక్షోవీథికా (వక్షః + వీథికా) విశాలమైన వక్షఃస్థలముయొక్క, అభ్యంతరా! = మధ్యభాగము గలవాఁడా!

తాత్పర్యము :- సముద్రములచేత పరివేష్టింపఁబడిన సమస్త భూమీ భరమును, ఎత్తిధరించుట యందలి సామర్థ్యమునందు శ్రీ మహావిష్ణువువంటి వాఁడా! [ఆదివరాహము], యుద్ధములయందు గాండీవధన్వాని వంటి వాఁడా! (సంగ్రామ పార్థ! యనుట), దక్షారామమునందలి మత్తకాశినులయొక్క కఠిన స్తన కుంభములయందు అనులిప్తమైన కస్తూరి పూఁతలచేత చిహ్నితమును, అచ్చితమునైన విశాలవక్షఃస్థలము కలవాఁడా!

కం॥ వేమాంబా ప్రియనందన!
హేమాచలధీర! భువనహిత చారిత్రా!
వేమాధిపాను స భవ!
రామారతిరాజ! రాజరాజ కిరీటా! 142

అర్థము :- వేమాంబాప్రియనందన : = వేమాంబయొక్క ముద్దుకొడుకు గుట్టా:, హేమాచలధీర: = మేరుధీరుడా:, 'భువన హిత చారిత్రా:' భువనహిత= లోకహితమైన, చారిత్రా: = చరిత్రగలవాడా:, వేమాధిపాను సంభవ: = వేమ భూపాలుని తమ్ముడా:, రామారతిరాజ: = రమణీ మన్మథు డా:, రాజరాజకిరీటా: - రాజ =రాజులలో, రాజకిరీటా: = చంద్ర కిరీటా-పర మేశ్వరా: "రాజపర మేశ్వరా:" అనుట -

తాత్పర్యము :- సుగమము.

భుజంగ ప్రయాతము :

హర శ్రీ పదాంభోరుహ ద్వంద్వ పూజా
పరాధీన! కారుణ్య పాథోనిధానా !
కురంగేక్షణా పుష్పకోదండ మూర్తీ!
శరచ్చంద్రికాస్నిగ్ధ సంసిద్ధ కీర్తీ॥ 143

అర్థము :- హర = పరమశివునియొక్క, పదాంభోరుహ = పాదపద్మముల యొక్క, ద్వంద్వ = జంటకు సంబంధించిన, పూజా = పూజకు, పరాధీన: = పరవశ మైనవాడా: (పరవశమైన చిత్తవృత్తి గలవాడా:), కురంగేక్షణా = హరిణేక్షణ లకు, పుష్పకోదండమూర్తీ: = పుష్పధన్వుని మూర్తివంటి మూర్తికలవాడా: (మన్మ థునివంటివాడా:), శరచ్చంద్రికా = (శరత్ + చంద్రికా) శరత్కాలపు వెన్నెల వలె, స్నిగ్ధ = చిక్కనైన, సంసిద్ధ = సుప్రతిష్ఠితమైన, కీర్తీ: = కీర్తిగలవాడా:

తాత్పర్యము :- సుగమము.

గద్య: ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర సుకవి జనవిధేయ కవిసార్వభౌమ శ్రీనాథ నామధేయ ప్రణీతంబైన కాశీఖండం బను మహాకావ్యంబునందుఁ బ్రథమాశ్వాసము.

అర్థము :- ఇది = ఈ గ్రంథభాగము. శ్రీమత్ = శోభావంతుఁడైన, కమలనాభ = కమలనాభామాత్యునియొక్క. పౌత్ర = మనుమఁడైనట్టియు. మారయామాత్య = మారయమంత్రియొక్క. పుత్ర =పుత్రుఁడైనట్టియు, సుజనవిధేయ = సజ్జనులకు విధేయుఁడైనట్టియు, కవిసార్వభౌమ = కవిసార్వభౌముఁడైన, శ్రీనాథ నామధేయ = శ్రీనాథుఁ డను నామధేయముగల వానిచేత. ప్రణీతంబైన = రచింపఁబడిన, కాశీఖండంబను = కాశీఖండ మను పేరుగల, మహాకావ్యంబునందు=మహాకావ్యమునందు, ప్రథమాశ్వాసము = మొదటిదైన ఆశ్వాసము.

ద్వితీయాశ్వాసము

శ్రీ రాజమహేంద్రవర మ
హారాజ్య శ్రీ స్వయంవరాధీశ్వర! శృం
గారకళా ఝుషకేతన!
యారాధిత భుజగహార! యల్లయవీరా! 1

అర్థము :- శ్రీ = శ్రీయుతమైన, రాజమహేంద్రవర = రాజమహేంద్రవర మను నగరమునకు సంబంధించిన, మహారాజ్యశ్రీ = మహారాజ్యలక్ష్మికి, స్వయం వరాధీశ్వర = తానుగా వరించిన, అధీశ్వర: = (అధి + ఈశ్వర) అధిపతీ:, స్వయంవరప్రాప్తవరుఁడా: 'శృంగారకళా ఝుషకేతన:' శృంగార = శృంగారము యొక్క, కళా = భాగమునందు - శృంగారాంశమునందు, 'ఝుషకేతన' ఝుష = మీనము, కేతన = ధ్వజముగాఁ గలవాఁడా - మన్మథుఁడా:, 'ఆరాధిత భుజగహార:' ఆరాధిత = సంతోషింపఁజేయఁబడిన - పొందఁబడిన, 'భుజగహార' భుజగ = సర్పములు, హార = కంఠహారములుగాఁ గల శివుఁడు గలవాఁడా: 'అల్లయవీరా:' అల్లయ = అల్లాడరెడ్డి కుమారుఁడవైన, వీరా = వీరభద్రభూపాలా: ఆశ్వాసాది పద్యములు - ఆశ్వాసాంత పద్యములు, కృతిపతి సంబోధనాంత విశేషణములతో నుండుట పూర్వాంధ్ర కావ్యములయొక్క సంప్రదాయము.

తాత్పర్యము :- శ్రీనిలయమైన రాజమహేంద్రవర మహారాజ్యలక్ష్మికి స్వయంవరప్రాప్త వరుఁడా: శృంగారాంశమునందు సాకార మన్మథుఁడా: నియమ వేళ నిర్వర్తితములైన శివార్చనములచేత పరమశివునకు పరితోషమును గలిగించిన వాఁడా: అల్లాడవిభుని కుమారుఁడవైన వీరభద్రభూపాలా:

విశేషము :- లక్ష్మి శ్రీమహావిష్ణువును స్వయంవరము చేసినట్లు రాజమహేంద్రవర మహారాజ్యలక్ష్మి 'అనితల్లి' రూపమున వీరభద్రారెడ్డిని స్వయంవరము చేసినది. ఈ వీరభద్రారెడ్డి శృంగారభాగమున మన్మథుఁడేయైనను నిత్యశివపూజా నియమముచేత భుజగభూషణుఁడైన పరమశివునకు పరితోషమును గలిగించినవాఁడు.

— దేవతలును, మునులును బ్రహ్మకడకేగి స్తుతించుట —

వ॥ అక్కథకుండు శౌనకాది మహామునుల కిట్లనియె. ఇవ్విధంబున, నకాండ ప్రళయంబు సంభవించిన ససురాసురోరగంబగు లోకంబు కాందిశీకంబగుటయు **మునులును** దేవతలును గూడి బ్రహ్మలోకంబునకుం బోయి బ్రహ్మ నిట్లని స్తుతియించిరి. 2

అర్థము :- అక్కథకుండు = (ఆ + కథకుండు) ఆ సూతుఁడు 'శౌనకాది ....మునులకున్' శౌనకాది = శౌనకుఁడు మొదలైన, మహామునులకున్ = మహా ముునులకు. ఇట్లనియెన్ = ఇట్లు పలికెను, ఇవ్విధంబునన్ = (ఈ + విధంబు) ఈ విధముగా, 'అకాండప్రళయంబు' అకాండ = సమయముకాని సమయమునందు, ప్రళయంబు = ప్రళయకాలము, సంభవించినన్ = ఏర్పడఁగా, ససురాసురోరగం బగు (సుర + అసుర _ అసుర + ఉరగంబు) దేవతలతోను, రాక్షసులతోను, సర్పములతోను కూడికొన్న. (ఉరసా గచ్ఛతి ఇతి ఉరగః = రొమ్ముతో ప్రాఁకునది. ఉరగము _ పాము) లోకంబు = ప్రాణిసమూహము, 'కాందిశీకంబగుటయున్' కాందిశీకంబు = వెఱచి పాఱిపోయినది, అగుటయున్ = కాఁగా (కాందిశీకుఁడు = భయోద్వేగముచేత తాను పోవుచున్న దిక్కేదియో తనకుకూడఁ దెలియకయే పాఱి పోవువాఁడు). మునులును దేవతలును గూడి = ముునులును, దేవతలును గలసి, బ్రహ్మలోకంబునకున్ = బ్రహ్మదేవునకు నివాసమైన సత్యలోకమునకు, పోయి = వెళ్ళి, బ్రహ్మను = సృష్టికర్తయైన చతుర్ముఖుని, ఇట్లని = ఈవిధముగా, స్తుతిం చిరి = స్తోత్రము చేసిరి.

తాత్పర్యము :- ఆ సూతుఁడు శౌనకాది మహాముునులతో నిట్లు చెప్పెను. ఈవిధముగా మేరువుతో స్పర్ధ వహించి వింధ్యపర్వతము సూర్యుని రథమును నిలిపివేయుటచేత లోకములకు సమయముకాని సమయములో ప్రళయకాలము సంభవించెను. దేవతలనుండి పాములవఱకుఁ గల ప్రాణిలోకమంతయును భయో ద్వేగముచేత తాము పోవుచున్న దిక్కు తామే యెఱుఁగక పాఱిపోయిరి. అప్పుడు ముునులును, దేవతలును గలసి సత్యలోకమునకు పోయి సృష్టికర్తయైన బ్రహ్మ దేవుని నిట్లు స్తోత్రము చేసిరి.

తే॥గీ॥ బ్రహ్మ ! బ్రహ్మస్వరూప ! హిరణ్యగర్భ !
యమృత ! కేవల ! యప్రతర్క్యానుభావ !
వేదవేద్య ! చిదాత్మ ! యనాదినిధన !
చిత్తగింపుము సంస్తుతించెదము నిన్ను ॥ 3

అర్థము :- బ్రహ్మ ! = ఓ సృష్టికర్తవైన చతుర్ముఖుఁడా ! బ్రహ్మ స్వరూప ! = ఓ పరబ్రహ్మ స్వరూపుఁడా !. హిరణ్యగర్భ ! = ఓ ప్రథమ జీవుఁడా !. అమృత !=ఓ యమృత స్వరూపుఁడా !. కేవల ! = కేవలుఁడా !. 'అప్రతర్క్యానుభావ !' అప్రతర్క్య = ఊహించుటకు నలవికాని. అనుభావ !=ప్రభావము గలవాఁడా !, 'వేదవేద్య' వేద = వేదములచేత. వేద్య = తెలియఁదగినవాఁడా !, 'చిదాత్మ' (చిత్ + ఆత్మ) చిత్ = జ్ఞానమయమైన. ఆత్మ ! = స్వరూపము గలవాఁడా !. అనాదినిధన = ఆదియును. అంతమును లేనివాఁడా !. చిత్తగింపుము=అవధరింపుము - అవహితుఁడవై వినుము !. నిన్నున్ = నిన్ను. సంస్తుతించెదము = స్తోత్రము చేయఁబోవుచున్నాము.

తాత్పర్యము :- ఈ స్తోత్రము వేదసారభూతమైన ఆద్యస్తవము. చతుర్ముఖబ్రహ్మ ఆలంబనముగ వేదవేద్యమైన పరతత్త్వ మిందు స్తుతింపఁబడుచున్నది. సృష్టికర్తగా అభివ్యక్తమైన ఓ పరబ్రహ్మమా ! ఓ ప్రథమ జీవుఁడవైన హిరణ్యగర్భుఁడా ! అమృత స్వరూపుఁడా ! కేవలుఁడా ! ఊహింప నలవికాని ప్రభావము గలవాఁడా ! వేదములచేతనే తెలియఁదగినవాఁడా ! జ్ఞానస్వరూపుఁడా ! అనాదినిధనుఁడా ! నిన్ను స్తోత్రము చేయుచున్నాము. అవధరింపుము.

తే॥గీ॥ డెందమును వాక్కు నెవ్వాని నందలేవు
కాంతు రెవ్వాని హృదయ పుష్కరమునందుఁ
బరమయోగీంద్రు లధిక తాత్పర్యలీల
నట్టి నీకు నమస్కార మఖిలవంద్య ! 4

అర్థము :- ఎవ్వానిన్ = ఎవ్వానిని. డెందమును = మనస్సును, వాక్కున్ = మాటయును. అందలేవు = అందికొనలేవు - చేరలేవో. ఎవ్వానిన్ = ఎవ్వానిని. పరమయోగీంద్రులు = పరమ యోగీశ్వరులు. 'అధిక తాత్పర్యలీల అధిక=సమధిక

మైన. తాత్పర్యలీలన్ = తత్పరతాలక్షణముతో తదేకపరత్వముతో. 'హృదయ పుష్కరమందున్' హృదయ = హృదయమే యనెడి. పుష్కరమునందున్ = ఆకాశమునందు - దహరాకాశమునందు. కాంతురు = చూచెదరో, అట్టి నీకున్ = అటువంటి నీకు. అఖిలవంద్యః = అందఱిచేతను నమస్కరింపఁదగినవాఁడా. నమస్కారము = నమస్కారము.

తాత్పర్యము :- మనస్సు, వాక్కు, ఎవ్వానినిఁ జేరికొనలేక మఱలివచ్చునో అయినను పరమ యోగీశ్వరులు సమధికమైన తదేకభావముతో తమ దహరాకాశము నందు ఎవ్వానినిఁ జూచుచున్నారో, అఖిలవంద్యుఁడవైన అట్టి నీకు నమస్కారము.

విశేషము :- 'యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' వాక్కు మనస్సు చేరికొనలేనంత దూరములో నున్నది కావున దవిష్ఠము. హృదయస్థితమై మిక్కిలి సమీపములో నున్నది కావున నేదిష్ఠము. దవిష్ఠము, నేదిష్ఠము కాదు. నేదిష్ఠము దవిష్ఠముకాదు. తత్త్వము నేదిష్ఠము, దవిష్ఠమును; 'నమోనేదిష్ఠాయ ప్రియదవః దవిష్ఠాయచనమో' 'తద్దూరే తదంతికే' (శివమహిమ్నము, ఈశావాస్యము).

తే॥గీ॥ ప్రకృతిరూప! గుణత్రయోపాధియుక్త!
కాల! కాలాతిరిక్త! నిష్కామహృదయ!
సత్త్వగుణమున హరి వై రజస్తమోగు
ణముల శంభుఁడ వగు నీకు నతి విరించి ॥ 5

అర్థము :- ప్రకృతిరూపః = ప్రకృతి-ప్రధానము, స్వరూపముగాఁ గల వాఁడా!, 'గుణత్రయోపాధియుక్త' గుణ = గుణములయొక్క, త్రయ = త్రితయమునకు (సత్వము, రజస్సు, తమస్సు - ఈ మూఁడింటియొక్క చేరిక త్రయము) సంబంధించిన, ఉపాధి = మూర్తులతో, యుక్త = కూడినవాఁడా!. కాలః = భూత భవిష్యద్ వర్తమానములుగా గోచరించుచున్న కాలమే స్వరూపముగాఁ గలవాఁడా!, కాలాతిరిక్త = కాలాతీతుఁడా - కాలమును దాఁటియున్నవాఁడా! 'నిష్కామహృదయ' నిష్కామ = సంకల్ప విరహితమైన, హృదయః = హృదయము గలవాఁడా!, సత్త్వగుణమునన్ = సత్త్వగుణముచేత, హరివై = విష్ణువవై,

రజస్తమోగుణములన్ = రజస్సు, తమస్సు అనుగుణములచేత, విరించి= బ్రహ్మయును, శంభుండవగు=శంకరుఁడవు నగు, నీకు=మూర్తి త్రయాత్మకుఁడవైన నీకు, నతి = నమస్కారము. ('విరించి సంబోధనాంతముగా గ్రహించినచో గుణముల క్రమము తప్పును, శంభుఁడు తమోగుణ ప్రధానుడు, బ్రహ్మ రజోగుణప్రధానుడు. ఈ పద్యములో వీరిరువురు ముందువెనుకగా నున్నారు. రజోగుణప్రధానుఁడైన విరించి వెనుక తమోగుణ ప్రధానుఁడైన శంభుఁడుండవలయును.)

సీ॥ బుద్ధ్యహంకారరూపుని భజింతుము నిన్నుఁ
బంచతన్మాత్ర రూపా! భరింపు
పంచకర్మేంద్రియ పంచ బుద్ధీంద్రియా
త్మక! మనోరూప! యేమఱకు మమ్ము
క్ష్మ్యాదిపంచకాకృతి మమ్ము రక్షింపు
విషయాత్మకా! మమ్ము విడువవలదు
బహ్మాండరూప! మాపాలి పెన్నిధివీవు
పాలింపు మముఁ దదభ్యంతరస్థ!

తే॥గీ॥ కొలుతు మెపు డీశ్వరాకృతిఁగోరి నిన్ను
విశ్వరూపుని నిన్ను సేవింతు మెప్పు
డవధరింపుము నిత్యసత్యస్వరూప!
సదసదీశ్వర! యభయహస్తంబుఁ జూపు. 6

అర్థము :- 'బుద్ధ్యహంకార రూపునిన్ = (బుద్ధి+అహంకార) బుద్ధియొక్క, అహంకారముయొక్క, స్వరూపమైన, నిన్నున్=నిన్ను, భజింతుము=సేవింతుము. 'పంచతన్మాత్రరూపాఃఁ' పంచ=ఐదైన, తన్మాత్రలు-సూక్ష్మభూతములు, పంచమహాభూతములకు పూర్వరూపములు. ఇవి బ్రహ్మాండసృష్టికి సంబంధించినవి, బ్రహ్మ సృష్టికి సంబంధించినపుడు వీనికి "తన్మాత్ర" లని వ్యవహారము, తన్మాత్ర=తన్మాత్రలయొక్క--(శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము), రూపాఃఁ=స్వరూపమైనవాఁడాఃఁ, భరింపు = భరింపుము, 'పంచకర్మేంద్రియ....ఆత్మక' పంచ =

76278

ఐదైన. కర్మేంద్రియముల యొక్క. (వాక్కు. పాణి. పాదము. పాయువు. ఉపస్థ.) పంచ=ఐదైన. బుద్ధీంద్రియ = (బుద్ధి ఇంద్రియ) జ్ఞానేంద్రియముల యొక్క. [త్వక్కు.చక్షుస్సు. శ్రోత్రము. జిహ్వ. ఘ్రాణము] ఆత్మక=స్వరూపమైనవాఁడా! మనోరూప = (మనః + రూప) మనః = మనస్సుయొక్క. రూప=రూపమైనవాడా! మమ్మున్=మమ్ము, ఏమఱకుము = ఏమఱియుండకుము. (మేము నీస్ఫురణను ఏమఱియుండునట్లు చేయకుము.) 'క్షిత్యాది పంచకాకృతి!' (క్షితి+ఆది) భూమిమొద లైన,పంచక = ఐదింటియొక్క. (పృథివి. జలము, అగ్ని. వాయువు. ఆకాశము.) ఆకృతి! = ఆకారమైనవాఁడా!. మమ్మన్ = మమ్ము రక్షింపుము = కాపాడుచుం డుము. 'విషయములు' శబ్దస్పర్శరూపరసంగధములు. పిండాండసృష్టికి సంబం ధించినపుడు వీనికి "విషయములు' అని వ్యవహారము. "విషయాత్మకా" విషయ = విషయములయొక్క. ఆత్మకా!=స్వరూపమైనవాఁడా!. మమ్మున్=మమ్ము. విడువ వలదు = వదలియుండవలదు, (శబ్దము, స్పర్శము. రూపము. రసము. గంధము- అను ఈయైదును విషయములు- వీనిని మేము అనుభవించునపుడు-ఇవి విషయ మాత్రములను తెలివికాక వీనియందు అంతర్నిలీనమైయున్న నీ చైతన్య స్ఫురణ సర్వకాలసర్వావస్థలయందును మమ్ము వదలియుండునట్లు చేయకుము)

బ్రహ్మాండరూప! = బ్రహ్మాండమే నిజరూపముగాఁగలవాఁడా! ఈవు = నీవు. మాపాలి పెన్నిధివి (పెను + నిధి) మాకు లభ్యమైన మహానిధానమవు. తద భ్యంతరస్థ! తద్=ఆ బ్రహ్మాండముయొక్క. అభ్యంతరస్థ = లోపలనున్నవాఁడా!. మమున్=మమ్ము. పాలింపుము=ఇష్టప్రాప్తి-అనిష్టనివృత్తులతో. ఎల్లకాలముకాపాడు చుండుము. మునీశ్వరాకృతిన్=మునీశ్వరుల యాకారములోనున్న. నిన్నున్=నిన్ను. కోరి = కాంక్షించి, కొలుతుము = భజింతుము. విశ్వరూపునిన్=విశ్వస్వరూపునిగా. నిన్నున్=నిన్ను. ఎప్పుడున్=ఎల్లకాలము. సేవింతుము=కొలుతుము. 'నిత్యసత్య స్వరూప!' నిత్య=శాశ్వతమును. సత్యము సత్యమును-సన్మాత్రమునైన. స్వరూప!= నిజరూపముగలవాఁడా!, అవధరింపుము= మాప్రార్థనను అవధరింపుము. సదసదీశ్వర = (సత్+అసత్+ఈశ్వర) సత్తునకు, అసత్తునకు, అంతర్యామివై నియామకుఁడ వైనప్రభువా!" "అభయహస్తంబున్" అభయ=అభయప్రదానరూపమైన హస్తం బున్ = చేతిని, చూపుము = మాకుఁగనిపింపఁ జేయుము.

తాత్పర్యము :- బుద్ధ్యహంకారరూపుఁడా! నిన్ను భజింతుము. పంచ తన్మాత్ర స్వరూపుఁడా! మమ్ము భరింపుము, పంచకర్మేంద్రియములయు పంచ జ్ఞానేంద్రియములయు స్వరూపమైనవాఁడా! మనోరూపుఁడా! మమ్ము ఏమఱి యుండ కుము. పృథివి మొదలైన పంచమహాభూతముల స్వరూపములో నున్నవాఁడా! శబ్దాదివిషయములకు ఆత్మవై యున్నవాఁడా! మమ్ము విడువవలదు. బ్రహ్మాండ స్వరూపుఁడా! నీవు మాపాలి పెన్నిధివి. బ్రహ్మాండము లోపల నున్నవాఁడా! మమ్ము పాలింపుము. ముసీశ్వరుల యాకారములో నున్న నిన్ను కోరి భజింతుము. విశ్వ రూపుఁడవైన నిన్నెప్పుడును సేవింతుము. శాశ్వతము సత్యము నైన స్వరూపము గలవాఁడా! మా ప్రార్థనను అవధరింపుము. సత్తునకు, అసత్తునకును, అంతర్యామివై నియామకుడవైనవాఁడా! అభయప్రదానరూపమైన హస్తమును మాకుఁ జూపుము.

సీ॥ నిగమ త్రయంబు నీ నిశ్వాస పవనంబు
నీ మూర్తి భేదంబు నిఖిల జగము
నీ యంఘ్రి మేదిని నీ మూర్ధ మాకాశ
మంతరిక్షము నాభి యంద్రు నీకుఁ
జంద్రుండు హృదయంబు చక్షు వబ్జహితుండు
తనురుహ వ్రాతంబు దనులు నీకు
నీవు సర్వంబును నీయందు సర్వంబు
స్తోతృ స్తుతి స్తవ్యజాత మీవు

తే॥గీ॥ మొక్కెదము నీకు నని మహామునులు సుకలు
నలిక తలమున సేవాంజలులు ఘటింప
ద్రహిణుఁ డెంతయు నాత్మ సంతోష మంది
యందఱినిఁ జూచి యిట్లని యానతిచ్చె ॥ 7

అర్థము :- 'నిగమత్రయంబు' నిగమ = వేదములయొక్క, త్రయంబు = త్రితయము - మూఁడింటి కూడిక, (ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము - ఈ మూఁడింటికిని 'త్రయి' అని పేరు), నీ నిశ్వాసపవనంబు = నీయొక్క నిట్టూ

రుపు గాలి; (యస్య నిశ్వసితం వేదాః) 'నిఖిల జగము' నిఖిల = అశేషమైన-మిగులలేని-సమస్తమైన, జగము = చరాచరజగత్తు, నీ మూర్తిభేదంబు = నీయొక్క-నానావిధాకృతులు, నీ యంఘ్రి = నీ పాదము, మేదిని = భూమి, నీ మూర్ధము = నీ శిరస్సు, ఆకాశము = ఆకాశము-ద్యులోకము; (శీర్ష్ణోద్యౌ సమవర్తత) అంతరిక్షము = భువర్లోకము, నీకున్ = నీకు, నాభి = నాభి యని, అండ్రు = అందురు, చంద్రుండు = చంద్రుఁడు, హృదయంబు = హృదయము, చక్షువు = కన్ను, అబ్జహితుండు = పద్మబాంధవుఁడు - సూర్యుఁడు; తరులు = చెట్లు, నీకున్ = నీకు, 'తనురుహవ్రాతంబు' తనురుహ = లోమములయొక్క, వ్రాతంబు = సమూహము, సర్వంబును = సమస్తమును; 'స్తోతృ స్తుతి స్తవ్య జాతము' స్తోతృ = స్తుతించువారియొక్క, స్తుతి = స్తోత్రములయొక్క, స్తవ్య = స్తుతింపఁబడువారియొక్క, జాతము = సమూహము, నీవు = నీవు; నీకున్ = నీకు, మ్రొక్కెదము = నమస్కరించెదము, అని = అని పలికి మహాములున్ = మహాములును, సురలున్ = దేవతలును, అలికతలమునన్ = ఫాలస్థలమునందు, సేవాంజలులు = (సేవా+అంజలులు) సేవారూపములైన దోయిళ్ళను, ఘటింపన్ = చేర్పఁగా, ద్రుహిణుఁడు = బ్రహ్మదేవుఁడు, ఎంతయున్ = మిక్కిలియును, ఆత్మన్ = మనస్సులో, సంతోషమంది = సంతోషించి, అందఱినిఁ జూచి = అందఱిని చూచి, ఇట్లని = ఈ రీతిగా, ఆనతిచ్చెన్ = ఆనతి యిచ్చెను-సెలవిచ్చెను. (ఆజ్ఞప్తి ప్రకృతి, ఆనతి వికృతి.)

తాత్పర్యము :- నీ నిట్టూర్పు గాలులే మూఁడు వేదములను; నీ రూపభేదములే నిఖిల చరాచరములను; నీ పాదమే భూమి; నీ శిరస్సే ఆకాశము; అంతరిక్షమే నీ నాభియందురు; చంద్రుఁడే నీ హృదయము; సూర్యుఁడే నీ కన్ను; వృక్షములే నీ లోమములు; నీవే సమస్తమును; నీయందే సమస్తమును ఉన్నది. స్తుతించువారును, స్తోత్రములును, స్తుతింపఁబడువారును నీవే; నీకు నమస్కరించెదము. అని మహాములును, దేవతలును సేవారూపములైన అంజలి పుటములను ఫాలస్థలములయందుఁ గదియింపఁగా, పరమేష్ఠి తన హృదయమునందు మిక్కిలి సంతోషించి అందఱివంకను జూచి, ఈ రీతిగా ఆనతి యిచ్చెను.

తే॥గీ॥ ఆద్య మగునీ స్తవంబున కనఘులార!
యేను బరితుష్టి నొందితి నిచ్చయందు

నేమి వలసిన నట్టిద యిత్తుఁ గాన
నిది యభీప్సిత మనుఁడు మీ రింపు మిగుల ॥ 8

అర్థము :- అనఘులార = పాపవిరహితులారా!, 'ఆద్యమగునీ స్తవంబు నకున్' ఆద్యమగు = మొట్టమొదటిదియైన, ఈ స్తవంబునకున్ = ఈ స్తోత్రము నకు, ఇచ్ఛయందున్ = హృదయమునందు, ఏను = నేను, పరితుష్టినొందితిన్ = పరితోషమును పొందితిని. ఏమి వలసినన్ = ఏది యావశ్యకమైనను, అట్టిదియ= అదియే, ఇత్తుఁగానన్ = ఇచ్చెదను గాఁబట్టి, మీరు = మీరు, ఇంపు=సంతోషము, మిగులన్ = అతిశయించునట్లుగా, అభీప్సితము = (అభి + ఈప్సితము) మిక్కిలి కావలసినది, ఇది = 'ఇది', అనుఁడు = మి నోటితో ననుఁడు!.

తాత్పర్యము :- ఓ నిష్పాపులారా! ఆద్యమై, తత్త్వనిరూపకమైన మీ యీ యథార్థ స్తుతికి నా మనస్సులో నేను మిక్కిలి పరితోషము నందితిని. ఏది కావలసినను ఇచ్చెదను కాఁబట్టి సంతోషముతో మా అభీష్ట 'మిది' యని మీ రడుగుఁడు.

మ॥ నిరవద్య స్థిరభక్తితోడ ననుగానీ శంభుఁగానీ రమే
శ్వరుఁగానీ గుఱియించి యెవ్వరఁట యీసార స్తవంబున్ జపిం
తురు వారందఱి కేము మువ్వురము సంతుష్టిం బ్రసాదింతు మిం
పరుదారన్ ధనధాన్య పుత్ర పశుర శ్మాయుస్సుఖారోగ్యముల్ ॥ 9

అర్థము :- 'నిరవద్య స్థిరభక్తితోడన్' నిరవద్య = అవద్యరహితము . దోషములేని, స్థిర = సుస్థిరమైన, భక్తితోడన్ = భక్తిభావనతో, ననుఁగానీ = నన్నుగానీ, శంభుఁగానీ = శివునిగానీ, రమేశ్వరుగానీ = (రమా + ఈశ్వరు) శ్రీయఃపతినిగానీ . విష్ణువునుగానీ, గుఱియించి = ఉద్దేశించి, ఎవ్వరఁట = ఎవ్వరయినచో, ఈ సార స్తవంబునన్ = ఈ శ్రేష్ఠమైన స్తోత్రమును, జపింతురు = జపించెదరో, వారందఱికున్ = ఆ జపించెడి వారందఱికు, మేము మువ్వురము = బ్రహ్మ విష్ణు మహేశ్వరులమైన మేము ముగ్గురము, సంతుష్టిన్ = సంతోషముతో, ఇంపు = ఆనందము, అరుదారన్ = ఆశ్చర్యమును గలిగించునట్లుగా, ధన..... ఆరోగ్యముల్' ధన = ధనములు, ధాన్య = ధాన్యములు, పుత్ర = పుత్రులు, పశు = ఆవులు, గేదెలు, మేకలు, గొఱ్ఱెలు మొదలైనవియును, రక్ష = సర్వవిధమైన

రక్షణమును, ఆయుః = ఆయుర్దాయమును, సుఖ = సుఖములును, ఆరోగ్యముల్ = రోగములు లేమియును, ప్రసాదింతుము = అనుగ్రహించెదము.

తాత్పర్యము:- దోషవిరహితమై సుందరమైన భక్తితో నన్నుగానీ, శివుని గానీ, విష్ణువునుగానీ గుఱించి ఎవ్వరయినచో యీ వేదసారభూతమైన స్తోత్రమును జపించుచుందురో వారందఱికిని మేము మువ్వురమును పరితుష్టులమై ఆశ్చర్యావహముగ ధన ధాన్య పశు పుత్ర సుఖాయు రారోగ్యములను అనుగ్రహించుచుందుము.

విశేషము:- నామరూపవిహితమై సమస్త శ్రుతిసారభూతమైన యీ స్తోత్రముచేత ఉద్దిష్టమైన అంతర్యామి తత్త్వము త్రిమూర్తి సాధారణము కావుటయే త్రిమూర్తులను పరితుష్టులగుటలోని రహస్యము; ఆ తత్త్వము మయస్కరమేకాక శంకరమును (ఐహికాముష్మిక సుఖములను ప్రసాదించునది).

వ॥ మీకెయ్యది యభీష్టంబట్టి వరంబు గోరుం డిచ్చెద. ఇక్కడికి వచ్చియు నిట్లేటికి నాకులత్వంబు విడువరు? స్వస్థులరుకండు. నా లోకంబునఁ గామ క్రోధ లోభ మోహ మద మాత్సర్య హింసాసూయాదులు లేవు. మూర్తంబులగు నీ యామ్నాయంబులు విద్యలు యజ్ఞంబులు దక్షిణలు సత్య ధర్మ తపో బ్రహ్మచర్య ముఖ్యంబులు నుల్లసిల్లెడుఁ జూడుండని మఱియు నిట్లనియె. 10

అర్థము:- మీకున్ = మీకు, ఎయ్యది = (ఏ + అది - ఏయది-త్రికసంధి ఎయ్యది). అభీష్టంబు = (అభి + ఇష్టంబు) మిక్కిలి ప్రియమో, అట్టి వరంబు= అటువంటి వరమును, కోరుండు = కోరికొనుఁడు, ఇచ్చెదన్ = ఇచ్చెదను. ఇక్కడికి వచ్చియున్ = ఈ సత్యలోకమునకు వచ్చికూడ, ఇట్లు = ఈరీతిగా, ఏటికిన్= ఏ నిమిత్తమువలన, ఆకులత్వంబు = వ్యాకులభావమును, విడువరుఁ = విడిచిపెట్టరుఁ స్వస్థులరు = (స్వస్మిన్ స్థితః స్వస్థః తనయందు నిలుకడగా నున్నవాఁడు. శోక భయాది వికారములు లేని-నైసర్గిక స్థితియందు ఉన్నవాఁడు స్వస్థుఁడు.) స్థిమిత త్వము కలవాఁడు, కండు = అగుఁడు, నా లోకంబునన్ = నా నివాసమైన యీ సత్యభువనమునందు, 'కామ....అసూయాదులు' కామ = కోరికలు-కొఱంతలు,

క్రోధ = దీర్ఘకోపము, లోభ = పిసినిగొట్టుతనము, మోహ = వ్యామోహము, మద = పొగరు, మాత్సర్య = ఈర్ష్య-ఓర్వలేనితనము, హింసా = చంపుట-బాధించుట, అసూయా = గుణములయందు దోషములను ఆరోపించుట, ఆదులు = మొదలైనవి, లేవు = లేవు; మూర్తంబులగు = మూర్తిమంతములైన - ఆకార సహితమునైన, ఈ యామ్నాయంబులు = ఈ వేదములు, విద్యలు = పదునాలుగు విద్యలు, యజ్ఞంబులు = జ్యోతిష్టామాది యజ్ఞములు, దక్షిణలు = యజ్ఞములతో ఋత్విజులకు నిచ్చెడు దక్షిణలు, 'సత్య....ముఖ్యంబులు' సత్య = సత్యము, తపః = తపస్సులు (కాయిక తపస్సు, వాచిక తపస్సు, మానసిక తపస్సు), బ్రహ్మచర్య ముఖ్యంబులు = బ్రహ్మచర్యము మొదలైనవి, ఉల్లసిల్లెడున్ = ఉల్లాసము కలిగి చరించుచున్నవి. చూడుండు = చూడుడు, అని = అని పలికి, మఱియున్ = ఇంకను, ఇట్లనియెన్ = ఇట్లు వలికెను.

తాత్పర్యము :- మీ కేది అభీష్టమో ఆ వరము నిచ్చెదను. ఈ సత్య లోకమునకు వచ్చిన పిమ్మట(గూడ మీ లోకవాసన యైన వ్యాకులపాటును విడువ లేక స్తిమిత మనస్సుతో నుండుడు. నా నివాసమైన యీ సత్యలోకములో మీ మీ లోకములయందు సాధారణములైన కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్య హింసా సూయాదులు ఎక్కడను గానబడవు. ఇక్కడ నున్నవి యివి- సాకారమైన యీ వేదములు. ఈ చతుర్దశ విద్యలు, ఈ యజ్ఞములు, దక్షిణలు, సత్యము, ధర్మము, తపస్సులు, బ్రహ్మచర్యము మొదలైనవి ఎంత యుల్లాసముగా నున్నవో చూడుడు! అని పలికి మఱియు నిట్లనెను.

సీ॥ తల్లిదండ్రులమ నిర్దపు భక్తి శ్రవణుల్ల
శుశ్రూష చేసిన శుద్ధ మతులు
పతులకు నిర్వ్యాజ పరమ తాత్పర్యత(
బరిచర్య సలిపిన పద్మముఖులు
సజ్జనావళికి నిష్కారణంబున నుప
కార మొనర్చిన ధీరగుణులు
తతి దప్పకుండ సంధ్యాజప హోమాది
తంత్రముల్ నెఱపిన ధర్మమతులు (విదులు?)

తే॥గీ॥ బ్రహ్మరతులు తపస్వులు భవ్యతీర్థ
సేవకులును సద్వ్రతులు నిస్పృహులు మొదలు
గాఁగ నొప్పెడు తత్పుణ్య కర్మపరులు
వీరె కనుగొండ్రు సుఖమున్నవార లిందు ॥ 11

అర్థము :- తల్లిదండ్రులకున్ = జనని జనకులకు, నిద్దపుభక్తి = (నిద్దము+భక్తి) స్నిగ్ధము ప్రకృతి. నిద్దము వికృతి-స్నేహయుతమైన భక్తి, శవణిల్లన్=ప్రవర్తిల్లఁగా, శుశ్రూష చేసిన = సేవ చేసిన (శ్రోతుం ఇచ్ఛా శుశ్రూషా - ఎప్పు డేమి చెప్పెదరో వినవలయు ననుశ్రద్ధతోఁ గూడిన కోరిక-శుశ్రూష). శుద్ధమతులు=నిర్మలమైన మనస్సు గలవారు, పతులకున్ = భర్తలకు, 'నిర్వ్యాజ పరమ తాత్పర్యతన్' నిర్వ్యాజ = కపటములేని, పరమ = సర్వోన్నతమైన, తాత్పర్యతన్ = తదేకపరత్వముతో, పరిచర్యన్ = సేవను, సలిపిన = చేసిన, ధీరగుణులు = సుస్థిరమైన సద్గుణము కలవారు, తఱి = సమయము, తప్పకుండ = కడచిపోకుండ, సంధ్యా.... తంత్రముల్' సంధ్యా = సంధ్యా సమయములయందలి, జప = జపము, హోమ= హోమము, ఆది = మొదలైన, తంత్రముల్ = కర్మతంత్రములను, నెఱపిన = తీర్చిన, ధర్మవిదులు = ధర్మము నెఱిఁగినవారు, బ్రహ్మరతులు = బ్రహ్మనిష్ఠులు, తపస్వులు = ప్రశస్తములైన తపస్సులు కలవారు, భవ్య = శుభప్రదములైన, తీర్థ = తీర్థములను, సేవకులును. సేవించినవారును, సద్వ్రతులును = మంచి వ్రతములను ఆచరించినవారును, నిస్పృహులున్ = స్పృహావిరహితులును, దేనియందును కాంక్షలేని వారును, మొదలుగాఁగన్ = మొదలుగా, ఒప్పెడు = యోగ్యులైన, 'తత్పుణ్య కర్మపరులు' తత్ = ఆ, పుణ్యకర్మ = పుణ్యకర్మములయందు, పరులు = పరాయణులు, వీరె = వీరే, కనుగొండ్రు = చూడుఁడు! ఇందున్ = ఈ సత్యలోకమునందు, సుఖమున్నవారలు = సుఖముగా నివసించియున్నవారు.

తాత్పర్యము :- సత్యలోకములో - ఏ యే పుణ్యకర్మలను ఆచరించినవారుందురో యీ పద్యమునందు వివరింపఁబడుచున్నది. బ్రహ్మదేవుఁడు చూసి చెప్పుచున్నాఁడు. వీరు పుడమిపై బ్రదికిన నాళ్ళలో స్థిర ప్రియ భక్తితో తల్లిదండ్రులకు శుశ్రూష చేసినందువలన నిర్మలమైన అంతఃకరణములు గలవారు; వీరు నిర్వ్యాజమైన తదేక తత్పరభావముతో పతి పరిచర్య చేసిన పుణ్యస్త్రీలు; వీరు ఏవిధమైన ప్రయోజనమును అపేక్షింపకయే సజ్జనులకు ఉపకారములు చేసియున్న

ధీరస్వభావులు; వీరు సమయము తప్పకుండ సంధ్యా జప హోమాది తంత్రములను తీర్చిన ధర్మవిదులు; వీరు బ్రహ్మనిష్ఠులు; వీరు తపస్వులు; వీరు తీర్థసేవకులు; వీరు వ్రతస్థులు; వీరు నిస్పృహులు; తాము చేసిన పుణ్యకర్మ ఫలములకు ఫలభూత మైన ఈ సత్యలోకమునందు సుఖనివాసము చేయుచున్నారు. వీరిని గనుగొనుఁడు!

కం॥ నతి చేసి యిష్టధనముల
క్షితిసురులకు నొసఁగినట్టి సిద్ధులు సుండీ!
యతుల హిరణ్మయ హర్మ్య
స్థితు లగుచుఁ జరించువారు చిర శుభలీలన్ ॥ 12

అర్థము :- నతిచేసి = ప్రణామముచేసి, ఇష్టధనములు = అభీష్టధనములను. క్షితిసురులకున్ = భూసురులకు, ఒసఁగినట్టి = సమర్పించినట్టి, సిద్ధులు సుండీ!= సుకృతసిద్ధులు సుఁడీ, 'అతుల....స్థితులగుచున్' అతుల = సాటిలేని, హిరణ్మయ= బంగారుమయములైన, హర్మ్య = మేడలయందు, స్థితులగుచున్ = నివసించిన వారగుచు, 'చిరశుభలీలన్' చిర శుభ = చిరకాలభోగ్యమైన పుణ్యముయొక్క, లీలన్ = విలాసముతో, చరించువారు = సంచరించువారు.

తాత్పర్యము :- ఈ బంగారు మేడలలో నివసించుచు చిరకాలభోగ్యమైన పుణ్యవిలాసముతో సంచరించుచున్న వీరందఱును ప్రణామపూర్వకముగ భూసురులకు అభీష్టధనములను సమర్పించిన సుకృతులే సుమా!

తే॥గీ॥ ఉభయ ముఖలగు గోవుల నొండె నొండె
గపిలలగు ధేనువులఁ బుణ్యకాల తిథుల
దాన మొనరించినట్టి సత్యప్రతిజ్ఞు
లీ మహార్హా పీఠంబుల నొసఁగువారు ॥ 13

అర్థము :- ఉభయముఖలగు = ఉభయతోముఖలైన, ప్రసన సమయములో నున్న, గోవుల నొండెన్ = ఆవులనుగాని, ఒండెన్ = లేక, కపిలలగు = పసపు వన్నియలైన, ధేనువులను = పాడి యావులను, పుణ్యకాల తిథులన్ = సూర్య చంద్ర గ్రహణాది పుణ్యకాలములయందు-ఏకాదశి మొదలైన పుణ్య తిథులయందు, దాన మొనరించినట్టి = దానము చేసినట్టి, సత్యప్రతిజ్ఞులు = సత్యసంధులు, ఈ

మహోర్వీ పీఠంబులన్ = మిక్కిలి వెలగల యీ పీఠములయందు, ఎసఁగువారు = ఒప్పువారు.

తాత్పర్యము :- మిక్కిలి విలువగల పీఠములపై అధిష్ఠించియున్న వీరు ప్రసవ సమయములయందు ఉభయముఖులైన గోవులనుగాని, పసపువన్నె గల పాడియావులనుగాని, పుణ్యకాలములయందు, పుణ్య తిథులయందు దానము నిచ్చిన సత్యసంధులు.

విశేషము :- 'ఉభయముఖ' సంజ్ఞ కావున ఓప్పు రాలేదు.

'నఖముఖాత్ సంజ్ఞాయాం' అష్టాధ్యాయి 4_1_58

— బ్రహ్మ దేవతలకును, మునులకును గోబ్రాహ్మణ ప్రభావంబు చెప్పుట —

వ॥ అని చెప్పి యప్పర మేష్ఠి బ్రాహ్మణుల సామర్థ్యంబును గోవుల మాహాత్మ్యంబును నొక్కించుక వర్ణించు తలంపున నిట్లనియె.14

అర్థము :- అని చెప్పి = ఈ రీతిగా చెప్పి, అప్పర మేష్ఠి = (ఆ+పర మేష్ఠి) ఆ బ్రహ్మ, బ్రాహ్మణుల సామర్థ్యంబును = బ్రాహ్మణులయొక్క ప్రభావమును, గోవుల మాహాత్మ్యంబును = గోవులయొక్క మాహాత్మ్య లక్షణమును, ఒక్కించుక = ఒక కొంత, వర్ణించు తలంపునన్ = వర్ణించు నుద్దేశముతో, ఇట్లనియెన్ = ఇట్లు పలికెను.

తే॥గీ॥ నాకు శంభునకును బద్మనాభునకును
దుష్టి కరములు రెండు వస్తువులు గలవు
విప్రులును గోవులును నన వినుఁడు మొదల
నొక్క కులము ద్విధా భంగి నొందియుండు ॥ 15

అర్థము :- నాకున్ = బ్రహ్మనైన నాకును, శంభునకున్ = శివునకును, పద్మనాభునకును = పద్మము నాభియందు గల విష్ణునకును, తుష్టికరములు=సంతోషమును గలిగించునవి, రెండు వస్తువులు = రెండు వస్తువులు, కలవు = ఉన్నవి, విప్రులను = బ్రాహ్మణులును, గోవులును = గోవులును, అనన్ = అనఁగా; వినుఁడు = వినుఁడు, మొదలన్ = మొదట, ఒక్క కులము = రెండును ఒక్క

టియే కులము, ద్విధాభంగిన్ = రెండు విధములైన రీతిని. ఒందియుండున్ = పొందియుండును.

తాత్పర్యము :- నాకును శివునకును విష్ణువునకును ప్రీతికరములైన వస్తువులు రెండుగలవు. అవి-బ్రాహ్మణులు, గోవులు, ననునవి. మొదటనొక్కటియే కులము; రెండు ప్రకారములనొంది యుండును.

విశేషము :- మూలములో నిట్లున్నది:

'బ్రాహ్మణాశ్చైవగావశ్చ కులమేకం ద్విధాకృతం
ఏకత్ర మంత్రాస్తిష్ఠంతి హవిరేకత్ర తిష్ఠతి'

కాశీఖండం 2 - అధ్యా - 75 వ శ్లోకము.

చం॥ సకలఫలంబులుం గురియు జంగమతీర్థము లెందు బ్రాహ్మణ
ప్రకరములట్లుగాక పెడవాయుట యెట్లు తదీయ భాషణో
దకముల సేవకావళికిఁ దత్క్షణమాత్రన జన్మజన్మబం
ధకత సహాగతంబులగు తత్తదనేక మహాఘసంఘముల్॥ 16

అర్థము :- సకలఫలంబులున్ = ఐహికా ముష్మికరూపములైన సమస్తఫలములను, కురియు = వర్షించునట్టి. జంగమతీర్థములు = సంచరించునట్టి తీర్థములు, ఎందున్ = సర్వస్థలములయందును. బ్రాహ్మణ ప్రకరములు = బ్రాహ్మణసమూహములు, అట్లుగాక = అట్లు కానియెడల, 'తదీయభాషణోదకములన్' తదీయ = ఆ బ్రాహ్మణులపైన, భాషణ = మాటలేయనెడు, ఉదకములన్ = జలములచేత, సేవకావళికిన్ = ఆజలములను సేవించిన వారికి, తత్క్షణమాత్రన = ఆక్షణమాత్రములోనే, జన్మజన్మ బంధకతన్ = జన్మకును జన్మకును అనుబంధము కలిగియుండుటవలన, సహాగతంబులగు = వెంట వచ్చినపైన, 'తత్తదనేక మహాఘసంఘముల్' తత్తత్ = ఆయా, అనేక = బహుసంఖ్యాకములైన, మహాఘ = మహాపాపములయొక్క, సంఘముల్ = సంఘములు, పెడవాయుట = తొలఁగిపోవుట, ఎట్లు? = ఎట్లు సంఘటిల్లును?

తాత్పర్యము :- ఐహికాముష్మిక రూపములైన సమస్తఫలములను వర్షించెడు సంచారతీర్థములు భూసురులు. అట్లుకానినాఁడు-వారి మాటలే యనెడి జలముల

చేత. ఆ జలములను సేవించినవారికి జన్మజన్మానుగతములైన ఆయా మహాపాతక సంఘములు తొలఁగిపోవుట యెట్లు సంఘటిల్లును ?

చం॥ వినుఁడనయంబు గోవులు పవిత్రము; గోవులు మంగళంబు; త
ద్ఘనఖురటంక శృంగపరిఘట్టదళద్ధరణీ రజశ్చటల్
కనుగొని నవ్వుచుండుఁ, బురఘుస్మరమూర్ధ జటాటవీ నట
ద్ఘన పథ సింధు వార్లహరి గర్వ్యభరార్భటిఁ
బావనోన్నతిన్ ॥ 7

అర్థము :- వినుఁడు = వినుఁడు, అనయంబున్ = సర్వకాల సర్వావస్థల యందును. గోవులు = ఆవులు, పవిత్రము = పావనము; గోవులు = గోవులు, మంగళంబు = శుభము; 'తద్ఘన.....రజశ్చటన్' తత్ = ఆ గోవులయొక్క, ఘన = మహిమాన్వితమైన, ఖురటంక = ఉలులవంటి గిట్టలయొక్క, శృంగ = కొనలచేత, పరిఘట్ట = సంఘట్టనముచేత, దళత్ = చీలుచున్న, ధరణీ = భూమి యొక్క, రజశ్చటల్ = పరాగసమూహములు, 'పురఘుస్మర .... భరార్భటిన్' పురఘుస్మర = పురాంతకుని యొక్క - శివునియొక్క, మూర్ధ = శిరస్సు నందలి, జటాటవీ = జడల యడవి యందు, నటత్ = తాండవించుచున్న, ఘన పథ = మేఘమార్గమునందలి, సింధు = నదియొక్క--ఆకాశగంగయొక్క, వార్ల హరిన్ = జలప్రవాహమును, కనుగొని = చూచి, పావనోన్నతిన్ = పావనత్వ లక్షణమునందలి యౌన్నత్యముచేత, నవ్వుచుండున్ = పరిహసించుచుండును.

తాత్పర్యము :- అవహితులై వినుఁడు-సర్వకాలములయందును గోవులు పవిత్రము, గోవులు మంగళము. ఆ గోవులగిట్టల కొనలచే చీల్చిన, నేలనుండి లేచిన రేణువులు-పావనతా విషయమునందలి ఉన్నతిచేత పరమేశ్వరుని జటాటవి యందు నటించుచున్న ఆకాశగంగా జలప్రవాహమును పరిహసించుచుండును.

విశేషము:- విశ్వోన్నతుఁడు శివుఁడు;! శివునియుత్తమాంగము (శిరస్సు) పైనున్నది - గంగానది. గోపాదపరాగములు పావనత్వ లక్షణముచేత - ఆ గంగా నది కంటె-ఉన్నత స్థానమునందు-ఉన్నవికావున-తమకంటె క్రిందనున్న గంగా తరంగములను పరిహసించుచున్నవి. ఉత్తరోత్తరము-ఉత్కర్షవర్ణితము కావున సారాలంకారము.

చం॥ ప్రతివసియించు గోవుల ఖురాగ్రములందు సమస్త తీర్థ సం
తతియును, సర్వపర్వతవితానము; కొమ్మల మధ్యసీమఁ న
ద్భుత చరితుండు శంకరుఁడు భూధర కన్నయుఁదానునుఁడుఁద
ద్వితత కుచేభ కుంభ పరిదిగ్ధ పటీర పవిత్ర వక్షుఁడై॥ 18

అర్థము :- "గోవుల ఖురాగ్రములందున్" గోవుల = ధేనువులయొక్క. "ఖురాగ్రములందున్" ఖుర=గిట్టలయందును అగ్రములందున్ కొనలయందును. "సమస్త తీర్థసంతతియును" సమస్త = సమస్తములైన, తీర్థ = పుణ్యతీర్థముల యొక్క, సంతతియును = కదంబమును, 'సర్వపర్వత వితానము' సర్వ = అన్ని పర్వత = గిరులయొక్క, వితానము = సమూహమును, ప్రతివసియించున్ = నివసించును, కొమ్మల మధ్యసీమన్ = శృంగమధ్య ప్రదేశమునందు. 'అద్భుత చరితుండు, అద్భుత = అశ్చర్యావహమైన, చరితుండు = కృత్యములుగల, శంక రుఁడు = మోక్షసుఖకరుఁడైన పరమశివుఁడు, "భూధరకన్యయున్" భూధర = హిమగిరియొక్క, కన్యయున్ = కూఁతురైన పార్వతీదేవియును, తానున్ = తానును, 'తద్వితత....వక్షుఁడై' తత్ = ఆ పార్వతీదేవియొక్క, వితత = విస్తృ తములైన, కుచ = స్తనములేయనెడి, ఇభకుంభ = కరికుంభములయందు, పరిదిగ్ధ = పూయఁబడిన, పటీర = చందనముచేత, పవిత్ర = పవిత్రమైన, వక్షుఁడై = వక్షఃస్థలముగలవాఁడై, ఉండున్ = ఉండును.

తాత్పర్యము :- గోవుల కాలిగిట్టలయందు, కొనలయందును, సమస్తపుణ్య తీర్థ కదంబమును, సర్వగిరి సమూహమును, నివసించియుండును. కొమ్మలనడిమి భాగమునందు అద్భుతచరిత్రుఁడైన పరమేశ్వరుఁడు పార్వతీ కుచకుంభ చందన చర్చ యంటికొని పవిత్రమైన వక్షస్స్థలముగలవాఁడై. అనఁగా పార్వతీదేవిచేత కౌఁగిలించి కొనఁబడిన సన్నివేశముతో నివసించియుండును.

కం॥ కొనియాడు పితృగణంబులు
కొనియాడు బుుషిప్రజంబు గురుసమ్మదములో
జనియించు వేల్పులకుఁ గం
దని పెంపున నరుఁడు గోవు దానము సేయన్॥ 19

అర్థము :- పితృగణంబులు = పితృదేవతలయొక్క సప్తగణములును, కొనియాడును = కీర్తించును, ఋషివ్రజంబు = ఋషికదంబము, కొనియాడున్ = కీర్తించును, 'గురుసమ్మదముల్' గురు = మోయుటకు బరువైన, సమ్మదముల్ = ఆనందములు, వేల్పులకున్ = దేవగణములకు, జనియించును = ఉద్భవించును, నరుఁడు = మనుష్యుఁడు, 'కందని పెంపునన్' కందని = సంతాపమును పొందని, ఉన్నతిన్ + ఔదార్యముతో, (ఇచ్చి వగవమితో - ఇచ్చిన పిమ్మట పరితాపమును పొందినచో, ఆ దానము నిష్ఫలమగును గనుక) గోవును=గోవును, దానముసేయన్ = దానముసేయఁగా-

తాత్పర్యము :- పురుషుఁడు నిండు మనస్సుతో గోవును దానము చేయునపుడు బర్హిష్మాత్తాదులైన మూర్తామూర్త పితృదేవతా గణము లేడును కీర్తించెదరు. ఋషిగణములు కీర్తించెదరు. దేవగణములకు పట్టలేనంత సంబరము పుట్టికొని వచ్చును.

'గోమయం యమునా సాక్షద్గో మూత్రం నర్మదాళుా
గంగా క్షీరంతు యాసాంవై కింప పవిత్ర మతః పరమ్' 20
'గవా మంగేషు తిష్ఠంతి భువనాని చతుర్దశ
యస్మా త్తస్మాచ్ఛి వం మేస్యాదిహలోకే పరత్రచ.' 21

తాత్పర్యము :- గోమయము సాక్షత్తు యమునానది, గోమూత్రము శర్మదమైన నర్మద. గోక్షీరము గంగానది, గోవులకంటె పవిత్రమైనది వేఱొకటి యేది? గోవుల శరీరావయముల యందు చతుర్దశభువనములు ప్రతిష్ఠితములై యున్నవి కావున నకు - ఇహలోకమునందును పరలోకమునందును శుభమగునుగాక!

కం॥ అనుమంత్రంబులు చెప్పుచు
నొనరించును ధేనుదాన ముర్వీసురవ
ర్యున, కెవ్వఁ డాతఁ డధికత
వినుతులుగను జగమునందు విశ్రుతలీలన్॥

అర్థము :- అను మంత్రంబులు = పై మంత్రములను, చెప్పుచున్ = పఠింపుచు, ఉర్వీసురవర్యునకున్ = భూసురశ్రేష్ఠునకు, ఎవ్వఁడు = ఏమనుష్యుఁడు, ధేనుదానము = గోదానమును, ఒనరించును = చేయునో, ఆతఁడు = ఆ మనుష్యుఁడు

అధికతన్ = ఆధికత్వముతో. జగమునందు = లోకమునందు. విఖ్యత లీలన్ = మహాప్రసిద్ధితో. (విశేషముగా ఖ్యాతుఁడు - నినఁబడినవాఁడు విఖ్యాతుఁడు) వినుతులు గనున్ = పొగడ్త కెక్కును.

తాత్పర్యము :- సుగమము.

కం॥ స్తుతిపూర్వముగఁ బ్రదక్షిణ
మతి భక్తిఁ జరించునప్పుడావుల కతనిన్
ధృతిఁ బొందునపుడు సకల
క్షితికిఁ బ్రదక్షిణము నియతిఁ జేసిన ఫలముల్॥ 23

అర్థము :- స్తుతి పూర్వకముగన్ = స్తోత్రిపూర్వకముగ. ఆవులకున్ = గోవులకు. అతిభక్తిన్ = అధికభక్తితో. ప్రదక్షిణము చరించునపుడు = ప్రదక్షిణము తిరుగునపుడు, అతనిన్ = ఆ గోదానముచేసి ప్రదక్షిణించుచున్న వానిని. అపుడు = ఆ సమయమునందు. సకలక్షితికిన్ = సమస్త భూమికిని. నియతిన్ = నియమముతో. ప్రదక్షిణముచేసిన ఫలమున్ = ప్రదక్షిణముచేసిన పుణ్యములు. పొందున్ = పొందును;

కం॥ ముందటఁ బిఱుఁదన్ ప్రకేవల
డెందమునం గరము సందడిలవలదా! యస్
స్పంద శుభావహములు గో
బృందములని మాకుఁ బుట్టుఁ బ్రియమెల్లపుడున్॥ 24

అర్థము :- 'అస్పంద శుభావహములు' అస్పంద = చలనములేని - సుస్థిరమైన. శుభ = మంగళమును. ఆవహములు = ఆవహింపఁ జేయునట్టి, గోబృందములు = ఆలకదుపులు. ముందటన్ = అగ్రిభాగమునందు. పిఱుఁదన్ = వెనుకభాగమునందు, ప్రకేవలన్ = ఉభయపార్శ్వములయందు, సందడిలవలదాఁ = సందడి చేయుచుండవలదాఁ, అని = అని, మాకున్ = త్రిమూర్తులమైన మాకు. డెందమునన్ = హృదయమునందు. ఎల్లపుడున్ = ఎల్లకాలమును, ప్రియము = ప్రీతి. పుట్టున్ = ఉదయించుచుండును.

తాత్పర్యము :- నిత్యకల్యాణ ప్రదములైన గోబృందములు త్రిమూర్తుల యైన మాకు ముందటి భాగమునను, వెనుకటి భాగమునను.పార్శ్వభాగములయందును ఎల్లకాలము సందడిచేయుచుండ వలదా! యని హృదయమునందు ప్రీతియుదయించు చుండును.

విశేషము :- 'మయా చ విష్ణునాసార్ధం శివేనచ మహర్షిభిః
విచార్య గోగుణాన్నిత్యం ప్రార్ధనేతి విధీయతే
గావోమే పురతః సంతు గావోమే సంతు పృష్ఠతః
గావో మే హృదయే సంతు గవాం మధ్యేవసామ్యహం॥'

అని మూలము.

క॥ నీరాజనంబు నెఱపుము
రారఁగ గోపుచ్చముల నిజాంగంబుల కె
వ్వారలు వారల యఘములు
దూరమునఁ దొలంగు నింట్లు దొరకొనుశుభముల్॥ 25

అర్థము :- ఎవ్వారలు = ఏ వారు, నిజాంగంబులకున్ = తమశరీరములకు, ఆరఁగన్ = నిండుగా, గోపుచ్చములన్ = ఆవులతోఁక కుచ్చులతో, నీరాజనంబున్ = నివాళించుటను-చుట్టును త్రిప్పుటను, నెఱపుదురు = చేయుదురో, 'వారల యఘములు' వారల = ఆ నివ్వాళి నెఱపినవారియొక్క-, అఘంబుల్ = పాపములు, దూరమునన్ = వారిశరీరములనుండి దూరముగా, తొలంగున్ = తొలఁగిపోవును, ఇంట్లన్ = వారియింట్లయందు, శుభములు = మంగళములు-కల్యాణములు, దొరకొనన్ = సంభవించును.

తాత్పర్యము :- ఎవ్వరు ఆవుల తోఁక కుచ్చులతో, తమ శరీరములకు, నివ్వాళులు త్రిప్పుదురో, వారి శరీరములనుండి పాపములు దూరముగా తొలఁగిపోవును. వారి యింట్లలో శుభములు సంభవించును.

తే॥గీ॥ వినుఁడు గోవులు విప్రులు వేదచయము
సతులు లోభవిహీనులు సత్యపరులు
దానశీలురియ్యెడ్వారు దాల్తు రెపుడు
నవని నెంతయు విగత భయంబుగాఁగ॥ 26

అర్థము :- వినుఁడు = అవహితులరై వినుఁడు!, గోవులు = ధేనువులు, విప్రులు = భూసురులు, వేదచయము = వేదములు-వేదరాశి, సతులు=పతివ్రతలు, లోభవిహీనులు = లోభగుణము లేనివారు, సత్యపరులు = సత్యనిష్ఠులు, దానశీలురు= దానము స్వభావముగాఁ గలవారు, ఇయ్యేడ్వురు = ఈ యేడుగురు, అవనిన్ = భూమిని, ఎంతయున్ = మిక్కిలియును, 'విగతభయంబు గాఁగన్' విగత = తొలఁగిన, భయంబుగాఁగన్ = భయోద్వేగము కలఁగునట్లుగా, ఎపుడున్ = ఎల్లకాలమును, తాల్తురు = ధరింతురు.

తాత్పర్యము :- శ్రద్ధాళువులై వినుఁడు! లోకవ్యవస్థ యీ యేడుగురిపై ఆధారపడియున్నది. గోవులు, భూసురులు, వేదరాశి, పతివ్రతలు, లోభగుణము లేనివారు, సత్యనిష్ఠులు, దానశీలురు వీరు అలజడులను దొలఁగించి సమస్త చరాచరములను ధారణ పోషణములతో కాపాడుచున్న యీ సమస్త భూతధాత్రిని సర్వకాలముల యందును నిరుపప్లవముగాఁ గాపాడుచున్న శాశ్వత వ్యవస్థాస్వరూపులు.

విశేషము :- గోవులు ఐహిక సంపత్తికిని, భూసురులు జ్ఞానప్రకాశనమునకు, వేదములు జ్ఞానమునకు, పతివ్రతలు స్త్రీ పురుష సంబంధ వ్యవస్థకును, లోభగుణము లేనివారు కాంతా కనక నిమిత్తములైన కలహములు, యుద్ధములు సంభవింపకుండుటకును సత్యనిష్ఠులు ధార్మిక జీవన ప్రమాణమునకును, దానశీలురు పేదసాదలకును ఆధారభూతులై యున్నారు కావున- ఈ మహావ్యవస్థపై లోకజీవనము నిలిచియున్నది.

తే॥గీ॥ నాదు లోకంబునకు మీఁదు నలిననాభు
లోక, మందూర్ధ్వమగు గుహులోక మవల
భర్గులోకంబుఁ దత్సమీపస్థలమున
గోకులంబను లోకంబుఁ గొమరు మిగులు ॥ 27

అర్థము :- నాదు లోకంబునకున్ = ఊర్ధ్వలోకము లేడింటిలో చిట్టచివరిదియై సృష్టికర్తనై యున్న నాకు నివాసభూతమై యున్న యీ సత్యలోకమునకు, మీఁదు= మీఁద నున్నది, నలిననాభులోకము = నా పుట్టువునకుఁ గారణమైన పద్మము నాభియందుఁ గల శ్రీ మహావిష్ణువుయొక్క నివాసమైనది శ్రీవైకుంఠము, అందున్=

అందునను, గుహలోకము = జ్ఞానస్వరూపుడైన కుమారస్వామియొక్క లోకము, ఊర్ధ్వమగున్ = మీఁదనున్నది యగును, అవలన్ = ఆ కుమారభువనమున కావల. భర్గలోకంబు = పరమశివ స్థానమైన మహాకైలాస మున్నది. 'తత్సమీపస్థల మునన్' తత్ = ఆ మహాకైలాసమునకు. సమీపస్థలమునన్ = చేరువగానున్న ప్రదేశమునందు. 'గోకులంబను లోకంబు' గోకులంబు = 'గోకుల'ము, అను లోకంబు = అను లోకము, కొమరు మిగుఱున్ = ప్రకాశించును.

తాత్పర్యము :- సుగమము.

సీ॥ ప్రవహించు నెచ్చోటఁ బరిపరిపూర్ణ సంపదఁ
దొలుకాడు వీచుల దుగ్ధనదులు
సవరిల్లు నెచ్చోట జర, డగ్గఱఁగనీక
సంతత కౌమార సౌష్ఠవంబు
లలరొందు నెచ్చోట నాజ్య నిర్ఝరులతో
బహుసంఖ్యఁ బాయసపర్వతములు
బెడఁగారు నెచ్చోటఁ గడమ యొంతయు లేక
సామగ్రి శుభవస్తు సంచయంబు

తే॥గీ॥ నట్టి గోలోకమున యందు నధివసింతు
రభవుచే నెల్లప్రొద్దు నెయ్యంబుఁ గనుచు
నలఘుమూర్తులు గోమాతృకలు సుశీల
యాదిగాఁగల పరమ కల్యాణ నిధులు ॥ 28

అర్థము :- ఎచ్చోటన్ = ఏ గోలోకమునందు, 'పరిపూర్ణసంపదన్' పరిపూర్ణ = నెఱనిండిన, సంపదన్ = సమృద్ధిని, తొలుకాడు = వర్షించి ఖేలనము చేయుచున్న (తొలికి + ఆడు_తొలుకాడు _ తొలుకు = వర్షించు_తొలకరి; తొలఁకు = తొలంకు _ చిందు), వీచులన్ = అలలతో, దుగ్ధనదులు = పాలయేరులు _ క్షీరవాహినులు, ప్రవహించున్ = పాఱుచుండునో, ఎచ్చోటన్ = ఏ గోలోకమునందు, జరన్ = ముదిమిని _ ముసలితనమును, డగ్గఱఁగనీక = దగ్గఱకు రానీయకుండ, 'సంతత కౌమార సౌష్ఠవంబులు' సంతత = నిరంతరమైన, కౌమార = బాల్యము

నకుఁ బిమ్మట్టిదియును యౌవనమునకు ముందటిదియు నైన వయోదశయొక్క. సౌష్ఠవంబులు = ససి(లు), సవరిల్లున్ అందగించునో, ఎచ్చోటన్ = ఏ గోలోకము నందు. ఆజ్య నిర్ఝరులతో = ఘృతవాహినులతో. బహుసంఖ్యన్ = బహుళ సంఖ్యతో. 'పాయస పర్వతములు' (పయస్సుతో-పాలతో వండినది, పాయసము). పాయస = పరమాన్నముయొక్క, పర్వతములు = కొండలు, అలరొందున్ = (అలము + ఒందు) ప్రకాశించునో, ఎచ్చోటన్ = ఏ గోలోకమునందు, ఎంత యున్ = ఏమాత్రమును, కడమ = కొఅంత, లేమిన్ = లేకపోవుటతో, 'శుభ వస్తు సంచయంబు' శుభ = శుభప్రదములైన, 'వస్తుసంచయంబు' వస్తు = పదార్థములయొక్క, సంచయంబు = నిలువ, సామగ్రిన్ = సమగ్రభావముతో-పరిపూర్ణతతో, బెడఁగారున్ = (బెడఁగు + ఆరు) మెఱయుచుండునో, అట్టి గోలోకమున యందున్ = అట్టి గోలోకమునందు, అభవుచేన్ = పరమశివునిచేత, ఎల్లప్రొద్దు = ఎల్లకాలము, నెయ్యంబుఁ గనుచున్ = స్నేహమును పొందుచు (స్నేహము ప్రకృతి-నెయ్యము వికృతి). అలఘుమూర్తులు = గౌరవాస్పదములైన యాకృతులు గల, సుశీల యాదిగాఁగల = 'సుశీల' మొదలుగాఁగల, 'పరమ కల్యాణ నిధులు' పరమ = సర్వోన్నతమైన, కల్యాణ = మంగళమునకు, నిధులు = నిధానములైన, గోమాతృకలు = గోమాతలు, అధివసింతురు = నివసింతురు.

తాత్పర్యము :- ఆ గోలోకమునందు పరిపూర్ణ సంపదలను వర్షించు కెరటములతో క్షీరవాహిను లెల్లకాలము ప్రవహించుచుండును. ముసలితనమును దరిదాపులకు రానీయక శాశ్వతములైన కౌమార దశాసౌష్ఠవములు అందగించుచుండును. నేతినదులతో (ఘృతవాహినులతో) బహుళ సంఖ్యలో పాయసపర్వతములు విలసిల్లుచుండును. ఎంతమాత్రమును గొఅంతలేక మంగళ వస్తుసముదాయము, సమగ్రమై మెఱుఁగు లీనుచుండును. మహాకైలాసము ఆ గోలోకమునకు 'ఇరుగు పొరుగు' అగుటచేత పరమశివుని స్నేహసౌఖ్య మనుభవించుచు కల్యాణ నిధులును పరమ గౌరవాస్పదలు నైన 'సుశీల' మొదలుగాఁ గల గోమాతృకలు ఆ లోకము నధివసించి యుందురు.

వ॥ అట్లు కావున గోవులకు మిగిలిన యుపాసనీయంబు లేదు. గోప్రదాతలకు మిగిలిన పుణ్యవంతులు లేరు. వెండియు నాకర్ణింపుఁడు. సరస్వతీతీర్థ మృతులును, మార్తండుండు మకరస్థుండై

యుండఁ బ్రయాగతీర్థంబున మాఘస్నానంబు చేసిన కృతార్థులును, వారణాసియందుఁ బంచనదంబునం గార్తికమాసమందుఁ దీర్థమాడిన విశుద్ధదేహులును, గురుక్షేత్రంబునందుఁగా కిణికామాత్రంబైనను హిరణ్యంబు దానంబిచ్చిన దాతలు మొదలుగాఁ గల నానాధర్మపరు లస్మదీయలోకంబున వీరె నిజకర్మోచిత పదంబులం గల్పస్థాయి సుఖంబు లనుభవించుచున్న వారు; మీకును నింక భయంబు వలదు; మీరు వచ్చిన కార్యంబే నెఱుఁగుదు; వింధ్యం బనంధ్య గరోదయంబున గీర్వాణ భూధరంబుతో మచ్చరించి శృంగోచ్ఛ్రాయంబులఁ బతంగ మార్గంబు నిరోధించు బుధజనంబులకు బాధ సేయుచున్న యది. ఈ యకాండ ప్రళయంబునకు బెగ్గలంబంది యాపత్పరిహారార్థంబు నన్ను శరణు చొచ్చితిరి. అరిష్ట నిరసనంబునకు నుపాయంబు చెప్పెద. మహాముని యగస్త్యుండ విముక్తంబను విముక్తి క్షేత్రంబున విశ్వేశ్వరు విరూపాక్షు భోగ మోక్ష ప్రదాయకు దారకబ్రహ్మోపదేశార్థంబు సేవించుచున్నవాఁడు. అతఁడు మీ కార్యంబు సంఘటింపఁగల వాఁడు. మీరచ్చోటికరిగి యమ్మహాత్మ నభ్యర్థింపుఁడు. 2½

అర్థము :- అటుకావునన్ = గోలోకమునుయుక్క ప్రశస్తి ఆ విధమైనది కాబట్టి. గోవులకున్ = గోవులకంటె, మిగిలిన = మించిన, ఉపాసనీయంబు = ఉపాసింపఁదగినది, లేదు = లేదు, గోప్రదాతలకున్ = గోదానము చేయువారికంటె, మిగిలిన = అతిశయించిన, పుణ్యవంతులు = పుణ్యాత్ములు, లేరు = లేరు, వెండియున్ = మఱియును, ఆకర్ణింపుఁడు = వినుఁడు, "సరస్వతీ తీర్థమృతులును, సరస్వతీర్థ = సరస్వతీర్థమునందు, మృతులన్ను = మరణించినవారును, మార్తాండుండు = సూర్యుఁడు, మకరస్థుండై యుండన్ = మకరరాశిగతుఁడైయుండ గా, ప్రయాగతీర్థంబునన్ = త్రివేణీసంగమతీర్థమునందు, మాఘస్నానంబున్ = మాఘమాసనియమస్నానమును, చేసిన = ఆచరించిన, కృతార్థులును = ధన్యులును, వారణాసియందున్ = వరణా-అసి, నదులు గంగానదితోఁ గలసిన ప్రదేశమునందు,

పంచనదంబునందున్ = 'పంచనద' మనుతీర్థమునందు. (ధర్మనదము, ధూతపాప. కిరణానది గంగాయమునలు. కలసిన కాశీ మహాక్షేత్రమునందలి యొకానొకతీర్థము) కార్తికమాసమందున్ = కార్తికమాసమునందు, తీర్థమాడిన = తీర్థమందాడిన-తీర్థ స్నానముచేసిన, విశుద్ధదేహులను = పాపనిర్ముక్తులైన శరీరములుగలవారును. కురుక్షేత్ర బునందున్ = కురుక్షేత్రమునందు. కాకిణికా మాత్రంబైనను = ఒక గవ్వయెత్తు తూనికగలదైనను. హిరణ్యంబు = బంగారము. దానంబిచ్చిన=దాన మిచ్చిన, దాతలు మొదలుగాఁగల = దాతలు మొదలైన. నానావిధ ధర్మపరులు = పలువిధములైన ధర్మములు చేసినవారు, వీరె = వీరే. అస్మదీయలోకంబునన్ = నాలోకమునందు. నిజకర్మోచితపదంబులన్ = తమపుణ్యకర్మములకుఁ దగిన స్థాన ములయందు, కల్పస్థాయి సుఖంబులు = కల్పముతుది వఱకునుండెడు సుఖములను, అనుభవించుచున్నవారు = అనుభవించుచున్నారు. మీకును = మీకుఁ గూడ. ఇంకన్ = ఇంకమీఁదట, భయంబువలదు = భయమవసరములేదు, మీరు వచ్చిన కార్యంబే నెఱుంగుదున్ = మీరువచ్చిన పని నేనెఱుఁగుదును. వింధ్యంబు = వింధ్య పర్వతము, "అవంధ్య గర్వోదయంబునన్" అవంధ్య = మొక్కవోని. 'గర్వో దయంబునన్' గర్వ = గర్వముయొక్క, ఉదయంబునన్ = ఆవిర్భావముచేత, గీర్వాణభూధరంబుతోన్ = సురగిరియైన మేరువుతో. మచ్చరించి = మాత్సర్యము వహించి, 'శృంగోచ్ఛ్రాయంబులన్' (శృంగ + ఉచ్ఛ్రాయములు) శృంగ = శిఖర ములయొక్క ఉచ్ఛ్రాయంబులన్ = ఔన్నత్యములచేత. 'పతంగ మార్గంబున్' పతంగ = సూర్యునియొక్క. మార్గంబున్ = త్రోవను, నిరోధించి = అడ్డగించి, బుధజనంబులకున్ = పెద్దలకు, బాధసేయుచున్నయది = బాధకల్పించుచున్నది. ఈయకాంతప్రళయంబునకున్ = ఆకాలమునంచు సంభవించిన యీ ప్రళయము నకు, బెగ్గలంబంది = భయమంది. 'ఆపత్పరిహారార్థంబు' ఆపత్ = ఆపదయొక్క, పరిహారార్థంబు = పరిహారము కొఱకు. నన్ను = నన్ను. శరణుచొచ్చితిరి = రక్ష కునిగాఁగోరి వచ్చితిరి 'అరిష్టనిరసనంబునకున్' అరిష్ట = అశుభముయొక్క. నిరస నంబునకున్ = తొలఁగించికొనుటకు, ఉపాయంబు=మార్గము, చెప్పెదన్ = చెప్పె దను, మహాముని యగస్త్యుండు = అగస్త్యమహాముని, అవిముక్తంబను - 'అవి ముక్త' మను పేరుగల, విముక్తిక్షేత్రంబునన్ = మోక్షక్షేత్రమునందు, విశ్వేశ్వరు నిన్ = విశ్వేశ్వరుఁడనుపేరుగల, విరూపాక్షున్ = శివుని. భోగమోక్షప్రదాయకున్ = భోగములకు. మోక్షమునకుఁ బ్రదాతయైన వానిని, 'తారక బ్రహ్మోపదేశార్థంబు'

తారక = సంసారమును తరింపఁజేయునట్టి, బ్రహ్మప్రణవమయొక్క, ఉపదేశార్థంబు = ఉపదేశము కొఱకు, సేవించుచున్నవాఁడు = ఆరాధించుచున్నవాఁడు, అతఁడు = ఆయగస్త్య మహాముని, మీ కార్యంబున్ = మీ ప్రయోజనమును, సంఘటింపంగలవాఁడు = ఒనఁగూర్చుటకు సమర్థుఁడు, మీరచ్చోటికరిగి = మీరచ్చటికి వెళ్ళి, అమ్మహాత్మున్ = ఆ మహాత్ముని, అభ్యర్థింపుఁడు = యాచింపుఁడు.

తాత్పర్యము: సుగమము.

క॥ వాతాపిల్వలీ లనియెడు
దైతేయులఁ గుపితకపటతంత్రోద్ధతులన్
భ్రాతలవధి చెఱివేల్మిడి
నాతండెవ్వరును వెఱతురమ్మునిపతికిన్॥ 10

అర్థము :- ఆతండు = ఆయగస్త్య మహర్షి, వాతాపిల్వలులనియెడు = (వాతాపి + ఇల్వలుఁడు) వాతాపి, ఇల్వలుఁడు, అనెడు, దైతేయులన్ = రాక్షసులను, 'కుపిత ....ఉద్ధతులన్' కుపిత = కోపించినవారును, కపట తంత్ర = కపటోపాయముగలవారును, ఉద్ధతులన్ = గర్విష్ఠులునైన, భ్రాతలన్ = అన్నదమ్ములమ. వ్రేల్మిడిన్ = (వ్రేలు + మిడి) వ్రేళ్ళు మిడిచినంతలో - చిటికవైచినంతటిలో, వధించెన్ = చంపెను, అమ్మునిపతికిన్ = (ఆ + మునిపతి) ఆ మునీశ్వరునకు, ఎవ్వరును = ఎట్టివారును, వెఱతురు = భయపడుదురు.

తాత్పర్యము :- ఆ యగస్త్య మహాముని, కోపస్వభావులును, కపట తంత్రముగలవారును, ఉద్ధతులునగు, వాతాపి, ఇల్వలుఁడు అనెడు దైతేయులను ఇద్ద అన్నదమ్ములను చిటికవైచునంతలో తెగటార్చెను, ఆ మునిరాజునకు భయపడని వారులేరు.

వ॥ పొండు. మీకు మేలయ్యెడుఁగని పుండరీకభవుండు వీడ్కొలిపినవారును మహాప్రసాదంబని ప్రసన్నాంతరంగులై సత్యలోకంబు వెలువడి-వచ్చువారంతరంబుల మూర్తి మతంబులైన వేదంబుల వేదాంగంబుల యజ్ఞంబుల దక్షిణల సత్యంబు

ధర్మంబు తపంబు శ్రుతి స్మృతీతిహాసంబులు బతివ్రతల బ్రహ్మ
చారుల మాతాపిత్రభక్తుల గోగ్రహణహితుల గాయత్రీ జపప
రాయణుల నుభయముఖ గోప్రదాతలఁ గపిలా దానతత్పరుల
బ్రాహ్మణపాదోదక ప్రాశనుల సరస్వతీ తీర్థమృతులమకర
రాశిస్థితుండై మార్తాండుడుండ మాఘస్నానంబు ప్రయాగ
తీర్థంబునం జేసిన కృతార్థుల వారాణాసియందుఁ బంచన
దంబును గార్తిక మాసంబునం దీర్థంబాడిన విశుద్ధ దేహులఁ
గురుక్షేత్రంబునం గాకిణికా మాత్రం బైనను గనకంబు
దానంబుఁ జేసిన దాతలను విలోకించుచుఁ- 31

అర్థము :- పొండు = వెళ్ళరండు, మీకు మేలయ్యెనున్ = మీకు మేలు గలుగు గాక!, అని = అనిపలికి, పుండరీకభవుండు = పద్మభవుడైన బ్రహ్మ, వీడ్కొలిపినన్ = వీడ్కోలు చేయఁగా, వారును = అదేవమునులు కూడ, మహా ప్రసాదంబని = 'మహానుగ్రహము!' అని పలికి, 'ప్రసన్నాంతరంగులై' ప్రసన్న= కలఁత దేరిన, అంతరంగులై = అంతఃకరణము-మనస్సు గలవారై, సత్యలోకంబు వెలువడి = సత్యలోకమునుండి వెలువడి, వచ్చువారు = వచ్చుచుండఁగా, అంతరాం తరంబులన్ = ఎడనెడ, మూర్తిమంతంబులైన = ఆకారసహితములైన, వేదంబు లన్ = వేదములను, వేదాంగంబులను = శిక్ష, వ్యాకరణము, ఛందము, నిరుక్తము, జ్యోతిషము, కల్పము - అను ఆఱంగములను, యజ్ఞంబులన్ = యజ్ఞములను, దక్షిణలన్ = దక్షిణలను, సత్యంబున్ = సత్యమును, ధర్మంబున్ = ధర్మమును, తపంబున్ = తపమును, శ్రుతిస్మృతి పురాణేతిహాసంబులన్ = వేదములను, ధర్మ శాస్త్రములను, పురాణములను, ఇతిహాసములను, పతివ్రతలన్ =పతివ్రతలను, బ్రహ్మ చారులన్ =బ్రహ్మచారులను, మాతాపిత్రభక్తులన్ =మాతాపిత్రభక్తిగలవారిని, గోగ్ర హణహితులను = గోప్రతిగ్రహణహితులను, గాయత్రీజపపరాయణులన్ =గాయత్రీ జపాసక్తులను, ఉభయముఖగోప్రదాతలను=ప్రసవసమయమునందు-ఉభయముఖులైన గోవులను, దానముచేసినవారిని. కపిలాదానతత్పరులను = కపిలగోవులను దానము చేసినవారిని, బ్రాహ్మణ పాదోదకప్రాశనులన్ = విప్రపాదోదకము సేవించినవారిని. సరస్వతీ తీర్థ మృతులన్ = సరస్వతీతీర్థమునందు మరణించిన వారిని, మకరరాశి స్థితుండై మార్తాండుండ మాఘస్నానంబు ప్రయాగ తీర్థంబునం జేసిన కృతార్థు

లన్ = సూర్యుఁడు మకరరాశిగతుఁడై యుండఁగా ప్రయాగతీర్థములో మాఘస్నాన మాచరించిన కృతార్థులను, వారణాసి యందుఁ బంచనదంబునం గార్తికమాసంబునం దీర్థమాడిన విశుద్ధదేహులను = వారణాసియందు పంచనదతీర్థంబునందు కార్తిక మాసమునందు తీర్థస్నానమాచరించి నందువలన పాపనిర్ముక్తములైన విశుద్ధములైన శరీరములు గలవారిని, కురుక్షేత్రంబునంగాకిణీ మాత్రంబైనను గనకంబు దానంబు చేసిన దాతలను = కురుక్షేత్రమునందు, ఒకగవ్వయెత్తైన తూనికగల బంగారమును దానము చేసిన దాతలను, విలోకించుచున్ = దర్శించుచు-

తాత్పర్యము :- సుగమము

తే॥గీ॥ విమలకైవల్య కల్యాణ విత్తనిధికి
విశ్వనాథుని మొదలి శ్రీవేశ్మమునకుఁ
గాశికా క్షేత్రమునకేగఁ గదలి రపుడు
కోర్కులిగురొత్త బృందారకులును మునులు॥ 52

అర్థము :- అపుడు = ఆ సమయమునందు. బృందారకులును = దేవతలును, మునులున్ = మునులును, కోర్కులు = మనోరథములు, ఇగురొత్తన్ = చిగురొత్తఁగా. 'విమలకైవల్య కల్యాణవిత్తనిధికిన్' విమల = నిర్మలమైన, కైవల్య కల్యాణ = కైవల్యశుభమేయనెడి, విత్త = ద్రవ్యమునకు, నిధికిన్ = నిధియైనట్టియు, విశ్వనాథుని = శ్రీ విశ్వేశ్వరస్వామియొక్క. మొదలి = ఆద్యమైన. శ్రీవేశ్మమునకున్ = శ్రీ మందిరమైన. కాశికాక్షేత్రమునకున్ = కాశీక్షేత్రమునకు. ఏగన్ = వెళ్ళుటకై, కదలిరి = ప్రయాణమయిరి.

తాత్పర్యము :- నిర్మలమైన కైవల్య కల్యాణ ధనమునకు మహానిధాన మును, శ్రీ విశ్వేశ్వర స్వామికి ఆద్యభవమునైన, కాశీక్షేత్రమును సేవించుటకై కోరికలు చిగురులొత్తఁగా, దేవతలును మునులును ప్రయాణమయిరి.

వ॥ హర్షోత్కర్షంబునందమలోన- 53

అర్థము :- 'హరోత్కర్షంబునన్' (హర్ష+ఉత్కర్షము) హర్ష =సంతోషము యొక్క. ఉత్కర్షంబునన్ = అతిశయమువలన, తమలోనన్ = తమలోతామే. అనర్గళమై కాశీప్రయాణము సిద్ధించుట వలన.

తాత్పర్యము :- పట్టలేని ఆనందాతిరేకము వలన తమలో తామే యిట్లను కొనుచున్నారు.

సీ॥ మనభాగ్యమునఁగాదె కనకాచలేంద్రంబు
విశ్వాధికౌన్నత్య విభవ మొందె
మనభాగ్యమునఁగాదె మార్తాండమండలి
వినువీథి రోధించె వింధ్యశిఖరి
మనభాగ్యమునఁ గాదె మర్త్యపాతాళ త్రి
విష్టపంబులకు నరిష్ట మొపవె
మనభాగ్యమునఁ గాదె కనక గర్భుండు ప్ర
త్యక్షమై యుపదేశ మానతిచ్చె

తే॥గీ॥ నహహా! మనభాగ్యమునఁ గాదె యమరతటిని
దరి వసించినవాఁడు వాతాపిదమనుఁ
డిన్ని భాగ్యంబులును గూడి యిచ్చె మనకుఁ
గాశికాక్షేత్రరాజ పీఠాశుభంబు॥ 84

అర్థము :- మనభాగ్యమునఁగాదె! = మన యదృష్టమువలననేకదా!, కనకాచలేంద్రంబు = మేరుపర్వతరాజు. 'విశ్వాధికౌన్నత్య విభవము' విశ్వాధిక = సర్వాధికమైన, ఔన్నత్య = ఉన్నత్త్వమునకు సంబంధించిన, విభవమున్ = వైభవమును, ఒందెన్ = పొందెను.

'మనభాగ్యమునఁగాదె!' మన యదృష్టము వలననే కదా!' మార్తాండ మండలిన్ = సూర్యమండలమును, వినువీథిన్ = ఆకాశవీధియందు, వింధ్యశిఖరి= వింధ్యపర్వతము, రోధించెన్ = అడ్డగించెను.

మనభాగ్యమునఁగాదె = మనయదృష్టము వలననే కదా!. 'మర్త్యపాతాళ త్రివిష్టపంబులకున్' మర్త్య = మనుష్యలోకమునకును, పాతాళ = నాగలోకమున కును, అరిష్టము = కీడు, ఒదవెన్ = సంభవించెను,

త్రివిష్టపంబులకున్ = సురలోకమునకును మనభాగమునఁగాదె! = మన యదృష్టమువలననే కదా!కనకగర్భుండు = హిరణ్యగర్భుఁడు-బ్రహ్మ. ప్రత్యక్షమై= సాక్షాత్కారమై, ఉపదేశము = కార్యోపదేశమును, ఆనతిచ్చెన్ = సెలవిచ్చెను.

అహహ: = ఆహాహా:, మనభాగ్యమునఁగాదె = మన యదృష్టమువలననే కదా:, వాతాపిదమనుఁడు = అగస్త్యమహాముని, ('వాతాపి' అనురాక్షసుని చంపిన వాడు). అమరతటినిదరిన్ = గంగానదియొడ్డున (కాశీక్షేత్రమునందు). వసించిన వాఁడు = నివసించియున్నవాఁడు, ఇన్ని భాగ్యంబులును = ఇన్ని అదృష్టములును. కూడి = కలసి. 'కాశికాక్షేత్రరాజవీక్షణభ ంబున్' కాశికా = కాశియనెడి, క్షేత్ర రాజ = క్షేత్రరాజము యొక్క. వీక్ష = దర్శించుటయే యనెడి, శుభంబున్ = మేలును, మనకున్ = మనకు. ఇచ్చెన్ = ఇచ్చెను.

తాత్పర్యము :- మేరువు సర్వోన్నతమైయుండుట వింధ్యముయొక్క మాత్సర్యమునకు హేతువు సూర్యమండలము నికోధింపఁబడుటకు మేరువుపై వింధ్యమునకు ఏర్పడిన మాత్సర్యము హేతువు. సూర్యరథము నిలిచిపోవుట లోక ములయొక్క యుపద్రవమునకు హేతువు. భువనోపద్రవము బ్రహ్మప్రత్యక్షమై యుపదేశించుటకు హేతువు. బ్రహ్మయుపదేశమునకు అగస్త్య మహాముని కాశీమహా క్షేత్రమునందు నివసించుటహేతువు, మనకు కాశీక్షేత్రదర్శన పుణ్యములభించుటకు అగస్త్య మహాముని యచ్చట నివసించుట హేతువు. ఈకారణపరంపరకు మొదటి హేతువు మనయదృష్టము. ఇంతకు మనకుఁ గాశీదర్శనయోగమున్నందువల్లనే పై విషయములన్నియును కార్యకారణ సంబంధముతో - ఇట్లమర్పఁబడియున్నవి.

విశేషము :- ఏ సంఘటన దేనియందు పర్యవసించునో సర్వజ్ఞుఁడైన శివు నకే తేలియును. ఆయా దశలయందు ప్రాప్తములైన ఖేదమోదములకో క్రుంగిపోవు చుండుటయును పొంగిపోవుచుండుటయును జీవులకు పూర్వనిర్ణీతమైన భాగధేయము వల్లనే.

కం|| ఏకక్రియ ఫలయుగ్మము
నాకర్షింపంగఁజాలునది, లోపా ముద్రా
కాంతు గుఱిచి పోవఁగ
శ్రీకాశీదర్శనంబు చేసిద్ధించున్ ||

అర్థము :- ఏకక్రియ = ఒకే క్రియ-ఒకే పని, ఫలయుగ్మమున్ =ఫలముల జంటను, ఆకర్షింపంగఁజాలునది = చేకూర్పఁజాలునది; లోపాముద్రాకాంతుగుఱిచి= లోపాముద్రాదేవికి వల్లభుఁడైన అగస్త్యమహామునిని ఉద్దేశించి, పోవఁగన్ =

వెళ్ళఁగా, 'శ్రీ కాశీదర్శనంబు' శ్రీ = అమృత లక్ష్మీస్వరూపయైన, కాశీ = కాశీ నగరముయొక్క, దర్శనంబు = సందర్శనము, చేన్ = చేతియందు, సిద్ధించున్ = సంప్రాప్తమగును - కరతలామలక మగును.

తాత్పర్యము :- 'ఏకాక్రియాద్వ్యర్థకరీ' రెండు ప్రయోజనములను ఒనఁగూర్చిపెట్టునట్టి ఒకే క్రియ. మనము లోముద్రావల్లభుడైన యగస్త్యమునిని గూర్చి వెళ్ళుచుండఁగా కైవల్య లక్ష్మీప్రదమైన కాశీసందర్శనము స్వయముగా మనకు సంప్రాప్త మగుచున్నది.

విశేషము :- ఇది 'గ్రామం గచ్ఛం స్తృణం స్పృశతి' వంటిది కాదు. 'ఆడఁబోయిన తీర్థ మెదురగుట' వంటిదియును గాదు. మొదటిదానిలో గ్రామ గమనము ప్రధానము. తృణస్పర్శనము - ఆనుషంగికము - అప్రధానము. ఇచ్చట దేవమునులకు కాశీసందర్శనము ఆనుషంగికము కావచ్చును గాని, అప్రధాన మన వీలు లేదు. రెండవది; కాశీతీర్థమును ఆడవలయునని వీరు కాశికి బోవుటలేదు. స్వకార్యార్థమై అగస్త్యమహాముని ని అభ్యర్థించుటకుఁ బోవుచున్నారు. కావున- అదియును గాదు. ఇది ప్రహర్షాలంకారభేదము.

'యత్నాదుపాయసిద్ధ్యర్థాత్ సాక్షాల్లాభః ఫలస్య చ
నిధ్యంజ నౌషధీమూలంఖనతాసాధితో నిధిః'
'వాంఛితాదధికార్థస్య సంసిద్ధిశ్చ ప్రహర్షణం
దీపముద్యోతయే ద్యావత్తావదభ్యుదితో రవిః'

-దేవర్షులు బ్రహ్మనియోగంబున నవిముక్తంబున కేతెంచి యగస్త్యుని దర్శించుట-

వ॥ అనుచు బ్రహ్మలోకంబున నుండి డిగ్గి వారు వారణాసీపురోపకంఠంబున శ్రీకంఠ జటాటవీ కుజటకోరకంబును బరమేష్ఠి కమండలు తీర్థసలిలధారా ధోరణియును గుపిత కపిల ముని పరివృఢ కపిల దృగనల చుళ్ళికిత వపురఖిల సగరసుత స్వర్గారోహణ సోపాన మార్గంబును నగు భాగీరథీయందు మణికర్ణికా కుండంబునఁ దీర్థమూడి తీర్థోపవాసులకు వాసోహిరణ్య గంధ సార కర్పూర కస్తూరికా కుంకుమంబులను ఖండశర్కరా పూప

సూపాజ్య దధిపయఃఫలాది తర్పణ ద్రవ్యంబులను నుపాన
త్పాదుకాచ్ఛత్రంబులను గుండికా దండరల్లక వ్యజన చామ
రంబులఁ గాపీన శాటికా కరండంబులను ధైల లవణోదనంబు
లను గుగ్గులు మహిసాక్షి ప్రముఖ ధూపద్రవ్యంబులను వెండి
యు గ్రియాకాండంబులను బరితోషంబు సంపాదించి విశుద్ధ
హృదయులుఁ బ్రసన్నాత్ములునై శ్రుతి స్మృతి పురాణేతిహాస
ప్రతిపాదిత వేదాను వచన యజ్ఞ దాన తపోవ్రతాదులచేతం
బ్రక్షీణ సకల కల్మషులు భస్మోద్ధూళితాంగులు రుద్రాక్ష
మాలికాలంకృతాంగులునై శంకరు గురంగాంక శేఖరు
నిరస్త సమస్తోపాధిక స్వప్రతిష్ఠాఖండ సచ్చిదానందైక రసా
ద్వితీయ స్వరూపు విరూపాక్షు విశాలాక్షీ హృదయాధీశ్వరు
విశ్వేశ్వర శ్రీ మన్మహాదేవు సందర్శించి ప్రణమిల్లి జగన్ని
ర్మాణ నియమపాలనాది శక్తియుక్తుండగు నద్దేవుం బంచ
బ్రహ్మ పంచాక్షర ప్రణవ మంత్రంబుల నావాహన స్థాపన
సాన్నిధ్య సన్నిరోధన సంకలీకరణాదులగు దశవిధ సంస్కృయా
కలాపంబుల నుపచరించి వెండియు- 86

అర్థము :- అనుచున్ = ఇట్లు పలుకుచు. బ్రహ్మలోకంబున నుండి = సత్యలోకమునుండి. దిగ్గి = అవతరించి. వారు = ఆ దేవతలును, ఆ ఋషులును. 'వారాణసీపురోప కంఠంబునన్' వారాణసీపుర = వారాణసీపురముయొక్క - కాశీ పురముయొక్క, ఉపకంఠంబునన్ = సమీపమునందు, 'శ్రీకంఠ....కోరకంబును' శ్రీకంఠ = శివునియొక్క, (శ్రీ = విషము. కంఠ = కంఠమునందుఁ గలవాఁడు) జటా = జడలే యనెడి, అటవీ = అడవియందలి, కుటజకోరకంబును = అడవి మల్లెమొగ్గయును, 'పరమేష్ఠి....ధోరణియును' పరమేష్ఠి = బ్రహ్మయొక్క, కమండలు = కమండలువునందలి, తీర్థసలిల = తీర్థజలములకు సంబంధించిన, ధారా = ధారయొక్క, ధోరణియును=మార్గమును, 'కుపిత....సోపానమార్గంబును' కుపిత = కోపించిన, కపిల = కపిలుఁడనెడి, ముని పరివృఢ = మునిప్రభువు యొక్క, కపిల = పింగళ వర్ణముగల, దృగనల = (దృక్ + అనల) నేత్రాగ్ని

చేత. చుళుకిత = పుడిసిలింపఁబడిన, వపుః = శరీరములుగల, అఖిల = మిగులు లేని. సగరసుత = సగరపుత్రులయొక్క, 'స్వర్గారోహణ' స్వర్గ = స్వర్గము యొక్క, ఆరోహణ = ఆరోహణార్థమైన - ఎక్కుటకొఱకైన. సోపానమార్గం బును = మెట్లవరుసయును, అగు = అయిన, భాగీరథియందున్ = గంగానది యందును. మణికర్ణికాకుండంబునన్ = మణికర్ణికా కుండమునందును, తీర్థమాడి= తీర్థమందాడి - తీర్థస్నానము చేసి, తీర్థోపవాసులకున్ = (తీర్థ + ఉపవాసి) తీర్థము నందు ఉపవాసము చేయువారలకు, 'వాసో....ద్రవ్యంబులును' వాసః=వస్త్రములు. హిరణ్య = బంగారము, గంధసార = మంచిగంధము, కర్పూర = కర్పూరము, కస్తూరికా=కస్తూరియును, కుంకుమంబులను = కుంకుమయును, ఖండశర్కరా = కండచక్కెర. అపూప = పిండివంటలు, సూప = పప్పు. ఆజ్య = నేయి. దధి= పెరుగు, పయః = పాలు. ఫల = పండ్లు. ఆది = మొదలైన, తర్పణ ద్రవ్యంబు లను = తర్పణ పదార్థములను - దేవతా తర్పణములయందు వినియోగింపఁబడు ద్రవ్యములను. ఉపానత్ = చెప్పులు. పాదుకా = పావలు (మొదటివి చర్మనిర్మిత ములు - రెండవవి దారు నిర్మితములు), ఛత్రంబులను = గొడుగులను, 'కుండికా.... చామరంబులన్' కుండికా = కమండలువులు, దండ = దండములు, కల్లక = కంబ ళులు, వ్యజన = వీవనలు, చామరంబులన్ = చామరములను, కౌపీన = కౌపీనము లను, ఘాటికా = దుప్పటులను, కరండంబులను = బరిణలను, తైల = నూనె, లవణ = ఉప్పు, ఇంధనంబులను = కట్టియలను, గుగ్గులు = గుగ్గులు, మహిసాక్షి= మహిసాక్షి, ప్రముఖ = మొదలైన, ధూపద్రవ్యంబులను = ధూపార్థ ముపయో గించు ద్రవ్యములను, వెండియున్ = మఱియును, క్రియాకాండంబులనున్ = క్రియాసమూహములచేతను, పరితోషంబున్ = పరితుష్టిని, సంపాదించి=ఒదవించి, 'విశుద్ధ హృదయులున్' విశుద్ధ = విశేష బుద్ధినొందిన, హృదయులును=హృదయ ములుగల వారును, ప్రసన్నాత్ములునై = తేటపడిన మనస్సుకలవారునై. 'శ్రుతి.... ఆదులచేతన్' శ్రుతి = వేదములచేత, స్మృతి = ధర్మశాస్త్రములచేత, పురాణ = పురాణములచేత, ఇతిహాస = ఇతిహాసములచేత, ప్రతిపాదిత = నిరూపింపఁబడిన, వేదానువచన = (వేద + అనువచన - గురువు చెప్పిన దానిని అనుసరించి రెండు మారులు చెప్పుట). స్వాధ్యాయము, యజ్ఞ = యజ్ఞము, దాన = దానము, తపః = తపస్సు. వ్రత = వ్రతములు, ఆదులచేతన్ = మొదలైనవానిచేత. 'ప్రక్షీణ సకల కల్మషులును' ప్రక్షీణ = మిక్కిలి సన్నగిలిన, సకల = సమస్తములైన, (మాన

సికములు. వాచికములు. శారీరకములు). కల్మషులును = పాపములు గలవారును. 'భస్మోద్ధూళితాంగులు' భస్మ = భసితముచేత. ఉద్ధూళిత = (ఉత్ + ధూళిత) ఉద్ధూళనము చేయఁబడిన - పూయఁబడిన. అంగులును = శరీరములుగలవారును. 'రుద్రాక్ష మాలికాలంకృతులును' రుద్రాక్షమాలికా = రుద్రాక్ష మాలికలచేత. అలంకృతులును = అలంకరింపఁబడినవారును. ఐ = అయి శంకరున్ = ఆముష్మిక సుఖప్రదాతయును (శంకరోతి ఇతి శంకరః - మయః కరోతి ఇతి మయస్కరః - శంకరుఁడు = అముష్మిక సుఖప్రదాత - మయస్కరుఁడు = ఐహిక సుఖప్రదాత). 'కురంగాంక శేఖరున్' కురంగాంక = హరిణాంకుఁడు. శేఖరున్ = శిరోభూషణముగాఁ గలట్టియును. 'నిరస్త....స్వరూపున్' నిరస్త = నిరసింపఁబడిన. సమస్త = సమస్తములైన, ఉపాధిక = (తొడుగులు - ఆలంబనములు) కలట్టియును. స్వప్రతిష్ఠ = తనయందే నెలకొని యున్నట్టియును. అఖండ = పరిపూర్ణమును, సచ్చిదానంద = (సత్ + చిత్ + ఆనంద) సత్త, జ్ఞానము, ఆనందము - అను స్వరూపలక్షణములుగల, ఏకరస = పరమానుభవముకంటె, అద్వితీయ = అభిన్నమైన, స్వరూపున్ = నిజరూపము గలట్టియును, విరూపాక్షున్ = త్రినేత్రుఁడును, విశాలాక్షీ = విశాలాక్షియను పేరుగల పార్వతీదేవియొక్క. 'హృదయాధీశ్వరున్' హృదయ = హృదయమునకు, అధీశ్వరున్ = అధీశ్వరుఁడైన. 'విశ్వేశ్వర శ్రీమన్మహాదేవున్' విశ్వేశ్వర = విశ్వేశ్వరుఁడను పేరుగల. శ్రీమత్ = మోక్షలక్ష్మి విశిష్టుఁడైన. మహాదేవున్ = శివుని, సందర్శించి = సందర్శనము చేసి. ప్రణమిల్లి = ప్రణామము చేసి, జగన్నిర్మాణ ..శక్తియుక్తుండగు' జగత్ = జగత్తులయొక్క. నిర్మాణ = సృష్టి, నియమ = నియమించుట, పరిపాలన = పరిపాలించుట, ఆది = మొదలైన, శక్తి = శక్తులతో. యుక్తుండగు = సహితుఁడగు, అద్దేవునిన్ = ఆ దేవుని, 'పంచబ్రహ్మ.... మంత్రంబులన్' పంచబ్రహ్మ = సద్యోజాతాది పంచబ్రహ్మ మంత్రములచేతను. పంచాక్షర = పంచాక్షరీ మంత్రముచేతను, ప్రణవ మంత్రంబులన్ = ప్రణవ మంత్రముచేతను, 'ఆవాహన....కలాపంబులన్' ఆవాహన ఆవాహనము. స్థాపన = స్థాపించుట, సాన్నిధ్య = సన్నిధి కల్పించికొనుట. సన్నిరోధ = ఎక్కడకుఁ గదలకుండ నిరోధించుట. సంకలీకరణ = సంకలీకరణము. ఆది = మొదలైన. దశవిధ = పది విధములైన. సంస్క్రియా = సంస్కారములే యనెడి. కలాపంబులన్ = క్రియాకలాపములచేత. ఉపచరించి = ఉపచార మొనరించి, వెండియున్ = మఱియును -

తాత్పర్యము :- ఇట్లనుకొనుచు ఆ దేవర్షులు సత్యలోకము వెలువడి వారా ణసీ నగరముయొక్క సమీపమునందు ఆకాశమార్గమునుండి దిగి ముందుగంగానదియందును మణికర్ణికా కుండమునందును తీర్థస్నానము లాచరించిరి. పిమ్మట అచ్చటి తీర్థోపవాసులకు వలయు పదార్థము లన్నియు నిచ్చిరి. దానధర్ములు చేసిరి. ఆ సంస్కారమువలన పాపములు తొలగి విశుద్ధ హృదయు లైరి. భస్మరుద్రాక్షములు ధరించిరి. విశాలాక్షీ సమేతుడైన శ్రీ విశ్వేశ్వరస్వామిని సందర్శించి ప్రణమిల్లిరి. పంచబ్రహ్మ పంచాక్షరీ మంత్రములతో ఆవాహన, స్థాపన, సన్నిధీకరణ, సన్నిరోధనాదులైన దశవిధ సంస్కార కలాపములతో నుపచరించిరి. మఱియును -

కం॥ ఆడిరి ప్రమోద నృత్తము
పాడిరి మంద్రక మహాప్రబంధంబుల మో
మోడిరి తైర్థికులకుఁ గొ
ల్లాడిరి కైవల్య లక్ష్మి నమరులు మునులున్ ॥ 37

అర్థము :- ప్రమోద నృత్తము = ఆనంద తాండవమును. ఆడిరి = ప్రదర్శించిరి. మంద్రక మహాప్రబంధంబులన్ = మంద్రకము మొదలైన గేయ ప్రబంధములను, పాడిరి = గానము చేసిరి, తైర్థికులకున్ = తీర్థసంవాసులకు. మోమోడిరి = (మోము + ఓడిరి) సంకోచపడిరి, అమరులున్ = దేవతలును, మునులున్ = మునీశ్వరులును, కైవల్య లక్ష్మిన్ = మోక్షలక్ష్మిని, కొల్లాడిరి = (కొల్ల + ఆడిరి) చూఱఁగొనిరి.

తాత్పర్యము :- ఆ దేవతలును మునులును ఆనందాతిశయము పట్టలేక నృత్తము చేసిరి. గేయప్రబంధములను పాడిరి. అచ్చటి తైర్థికులయొక్క సుకృత విశేషమును జూచి 'ఇట్టిది మనకు లేకపోయెనే!' అని మొగము చెల్లనివారయిరి. మోక్షలక్ష్మిని కొల్లలాడిరి.

సీ॥ అందంద చేసిరి యభవు గేహమునకు
ధన్యాత్మ లలరఁ బ్రదక్షిణములు

యోగపీఠారూఢ నుమబోటి నర్చించి
రభ్యర్హితులు సువర్ణాంబుజములఁ
నాడుంఠి విఘ్నేశు నాపూప మోదకా
ద్యుపహారములఁ దృప్తి నొందఁజేసి
రవధరించిరి పురాణాఖ్యాన ముఖముల
సమధికంబగు మహాస్థాన మహిమ

తే॥గీ॥ పీటి పెద్ద తలారి నిస్సాటి కలికి
దిస్సమొలవేల్పుఁ బార్వతీదేవి పట్టిఁ
గాలభైరవుఁ గుక్కురగణ పరివృతు
ననుచరించిరి మునులు నాకౌకసులును ॥ 38

అర్థము:- మునులున్ = ముసీశ్వరులును, నాకౌకసులును = (నాక + ఓకసులు - స్వర్గము నివాసముగాఁ గలవారు) దేవతలును, అభవుగేహమునకున్ = విశ్వేశ్వరస్వామి ఆలయమునకు, ధన్యాత్ములు = సుకృతాత్ములు, అలరన్ = సంతోషించునట్లుగా, ప్రదక్షిణములు = ప్రదక్షిణములు, అందంద = మఱల మఱల, చేసిరి = ఆచరించిరి. సువర్ణాంబుజములన్ = బంగారువన్నె గల తామరపూవులతో, అభ్యర్హితులు = (అభి + అర్హితులు) పూజ్యులైన దేవర్షులు, యోగపీఠారూఢన్ = (యోగపీఠ + ఆరూఢన్) యోగపీఠము నారోహించిన, ఉమబోటిన్ = పార్వతీదేవిని, అర్చించిరి = పూజించిరి. ఆడుంఠి విఘ్నేశున్ = డుంఠి యను పేరుతో ప్రసిద్ధుఁడైన ఆ విఘ్నేశ్వరస్వామిని, 'ఆపూప మోదకాద్యుపహారములన్' ఆపూప = భక్ష్యములు, మోదక = ఉండ్రాళ్ళు, ఆది = మొదలైన, ఉపహారములన్ = నైవేద్యములతో, తృప్తినొందజేసిరి = తృప్తిపడునట్లుగాఁ జేసిరి. పురాణాఖ్యానముఖములన్' పురాణ = పురాణములయందలి, ఆఖ్యానముఖములన్ = కథలద్వారా, సమధికంబగు = మిక్కిలి గొప్పదియైన, మహాస్థాన మహిమన్ = మహా శివస్థానమైన కాశీక్షేత్రముయొక్క, మహిమన్ = మహిమను, అవధరించిరి = మిక్కిలి శ్రద్ధతో వినిరి, 'పీటి పెద్దతలారిన్' పీటి = నగరముయొక్క, పెద్ద తలారిన్ = పెద్ద తలవరిని, సంరక్షకులలో పెద్ద యైనట్టియు, 'నిస్సాటి కలికి దిస్సమొలవేల్పున్' నిస్సాటి = కాటిలేని - వస్త్రములేని (నిస్ + కాటి = నిక్కాటి-ప్రకృతి, నిస్సాటి-

వికృతి) కలికి = సుందరమైన, దిస్నమొల = దిస్న మొలగలి, వేల్పున్ = దైవమైనట్టియు, పార్వతీదేవి పట్టిన్ = పార్వతీదేవి కుమారుఁడైనట్టియు, 'కుర్కుర గణ పరివృతున్' కుర్కురగణ = కుక్కల గుంపుచేత, పరివృతున్ = పరివేష్టింపఁబడిన, కాలభైరవున్ = కాశీక్షేత్ర పాలకుఁడైన కాలభైరవస్వామిని, అనుచరించిరి = అనుసరించి వర్తించిరి.

తాత్పర్యము :- ఆ దేవతలు, మునులు విశ్వేశ్వరస్వామి గుడికి పునఃపునఃప్రదక్షిణములు చేసిరి. యోగపీఠాధిరూఢయైన విశాలాక్షీదేవిని బంగారువన్నె తామర పూవులతో అర్చనము చేసిరి. భక్ష్యములతో, ఉండ్రాళ్ళతో డుంఠి విఘ్నేశ్వరస్వామిని దృప్తిపఱిచిరి. పురాణకథలద్వారా కాశీక్షేత్ర మహిమను మిక్కిలి శ్రద్ధతో వినిరి. కాశీనగర ప్రధాన క్షేత్రపాలకుఁడును, దిగంబరుడును, కుక్కల గుంపుచేత పరివేష్టితుఁడును, పార్వతీదేవి కుమారుఁడు నైన కాలభైరవస్వామిని అనుసరించి వర్తించిరి

వ॥ అనంతరంబ. 39

అర్థము :- అనంతరంబ=(న + అంతరము - అనంతరము) వెనువెంటనే.

సీ॥ పంచాక్షరీ మంత్ర పారాయణమునకు
నెవ్వాని మానసం బేడుగడయు
దరోద్ధతులగు వాతాపి కిల్వలునకు
వధశిలాస్థాన మెవ్వానికుఁ
ఆది నెవ్వాని దివ్యావతారమునకుఁ
పూర్ణాంబు కుంభంబు పురిటియిల్లు
మెఱసి లోపాముద్ర మెఱుఁగుఁ బాలింప్లపై
బవళించు నెవ్వాని భవ్యమూర్తి

తే॥గీ॥ కసరి యెవ్వాని కంఠ హుంకార రవము
కొండపాముల కులములోఁ గూర్చెనహిపు
నట్టి పరమ మహాశైవు నలఘు తేజు
వెదకి రానందవనములో విబుధ మునులు ॥ 40

అర్థము :- ఆనంద వనములోన్ = ఆనంద కాననమునందు (కాశీనగరము నకు ఆనందవన మనియును నామాంతరము). విబుధ మునులు = దేవతలును . మునీశ్వరులును, 'పంచాక్షరీ మంత్ర పారాయణమునకున్' పంచాక్షరీమంత్ర = పంచాక్షరీ మహామంత్రముయొక్క. పారాయణమునకున్ = పునఃపునరావర్తనము నకు. ఎవ్వాని మానసంబు = ఎవ్వనియొక్క మనస్సు ఏడుగడయు=ఆశ్రయమో. ఎవ్వానికుక్షి = ఎవ్వనియొక్క జఠరము, దర్పోద్ధతులగు = (దర్ప + ఉద్ధతులు) 'నే మింతటి వార' మను భావముతో . పొగరెక్కిన, వాతాపికిన్ = వాతాపి యను రాక్షసునకును, ఇల్వలునకున్ = ఇల్వలుఁడను రాక్షసునకును, (వీరిద్దఱు అన్న దమ్ములు - ఇల్వలుఁడు పెద్ద. వాతాపి చిన్న) పృథ శిలాస్థానము = చంపుకు గట్టో. ఆదిన్ = పూర్వకాలమునందు, 'ఎవ్వాని దివ్యావతారమునకున్' ఎవ్వాని = ఎవ్వని యొక్క. దివ్యావతారమునకున్ = దివ్యమైన అవతరణమునకు, 'పూర్ణాంబు కుంభంబు' పూర్ణాంబు = జలముతో నిండిన, కుంభంబు = కలశము, పురిటియిల్లు= ప్రసూతి గృహమో, మెఱసి = దీప్యమానమై, ఎవ్వాని భవ్యమూర్తి = ఎవ్వని యొక్క శుభప్రదమైన శరీరము, లోపాముద్ర = లోపాముద్రాదేవి యొక్క. మెఱుఁగు బాలిండ్లపైన్ = దీప్తిమంతమైన స్తనయుగళముపైన, పవళించున్ = శయనించునో. ఎవ్వాని కంఠ హుంకారరవము = ఎవ్వని కంఠమునుండి వెలు వడిన 'హుం' అను ధ్వని. నహుషున్ = ఇంద్రపదవీస్థితుఁడైన నహుషుని. కసరి = ధిక్కరించి, కొండపాముల కులములోన్ = కొండచిలువల కులములో. కూర్చెన్ = కలసిపోవునట్లు చేసెనో. అట్టి = ఆవిధమైన. పరమ మహాశైవున్ = మహా శివభక్తులలో గొప్పవాఁడును. అలఘుతేజున్ = గొప్ప తేజోవిశేషము గల అగస్త్య మహామునిని, వెదకిరి = అన్వేషించిరి.

తాత్పర్యము :- ఎవ్వని మనస్సు నిత్య పంచాక్షరీ జపమునకు నిలయమో. ఎవ్వని కుక్షిప్రదేశము గర్వోద్ధతులైన వాతాపి ఇల్వలుఁడు. అను రాక్షసులకు వధ్య శిలయో. పూర్వ మెవ్వని అవతారమునకు పూర్ణకలశము పురిటియిల్లో ఎవ్వని కంఠ హుంకారము ఒక్క కసరుతో ఇంద్రపదవీస్థితుఁడైన నహుషుని కొండచిలువల కులములో కలిపివేసెనో. అట్టి మహాతేజశ్శాలియైన పరమ మాహేశ్వరుని కొఱకు దేవతలును, మునులును ఆ యానంద కాననములో అన్వేషించిరి.

సీ॥ డుంఠి విఘ్నేశుడుండు ప్రదేశ మిూక్షించి
లోలార్క్ నగరి మోసాల వెదకి
దండపాణ్యాసవ భాండేశ్వరంబులు
కుక్కుట స్థానంబు గుద్దలించి
కేశవస్వామి లోఁగిలి పరామర్శించి
కాలభైరవుదేవు గవనుఁ జూచి
శ్రీ విశాలాక్షి గోష్ఠి వాటి శోధించి
యపవర్గ మంటపోపాంత మరసి

తే॥గీ॥ విబుధ గంగా తరంగిణీవేణి మధ్య
నైకతోత్సేధ వేదికా సంప్రరూఢ
తరుణ వంజుల కుంజవైతస కుడుంగ
వీథి కలయందు దృష్టి యావిష్కరించి ॥ 41

అర్థము :- 'డుంఠి విఘ్నేశుడుండు ప్రదేశము' డుంఠి విఘ్నేశుఁడు = డుంఠి యను పేరుగల విఘ్నేశ్వరస్వామి, ఉండుప్రదేశము = నెలకొన్నచోటు. ఈక్షించి = చూచి. 'లోలార్క్ నగరి మోసాలన్' లోలార్క్ = లోలార్క్‌ని యొక్క. నగరి = మందిరముయొక్క. మోసాలన్ = ముఖశాలయందు, వెదకి = అన్వేషించి. 'దండపాణ్యాసవభాండేశ్వరంబులు' దండపాణి = 'దండపాణి' యనెడి యక్షరాజు. (ఈయన కాలభైరవుని పిమ్మట కాశీక్షేత్ర పాలకుఁడు) ఆసవ భాండేశ్వరంబులు = సురాభాండేశ్వరస్వామియు నుండు ప్రదేశములును. కుక్కుట స్థానంబున్ = కుక్కుటస్థానమును, గుద్దలించి = పెళ్ళగించి - ప్రయత్నించి వెదకి వెలికిఁదీసి, కేశవస్వామి = ఆదికేశవస్వామియొక్క. లోఁగిలి = మందిరమును, పరామర్శించి = పరిశీలనముచేసి, 'కాలభైరవదేవు గవనుఁజూచి' కాలభైరవదేవు = కాలభైరవస్వామి యుండెడి, గవనున్ = నగరద్వారమును, చూచి = చొచ్చి చూచి. శ్రీ విశాలాక్షి గోష్ఠివాటిన్' శ్రీ విశాలాక్షి = శ్రీ విశాలాక్షీదేవియొక్క. గోష్ఠి వాటిన్ = సభాస్థలమును, శోధించి=పరిశోధనముచేసి. 'అపవర్గమంటపోపాంతము' అపవర్గ = ముక్తి మంటపముయొక్క, ఉపాంతము = సమీప భూమియందు, అరసి = విచారణచేసి. 'విబుధగంగా....వీథికలయందు' విబుధగంగా = సురగంగ యనెడి.

తరంగిణీ = నదియొక్క, వేదిమధ్య = జాలుల మధ్యలో నేర్పడిన, సైకత = ఇసుక నేలలకు సంబంధించిన, ఉత్సేధ = పొడవైన - ఎత్తైన, వేదికా = తిన్నెల యందు, సంప్రరూఢ = ముమ్మరముగా మొలిచిన తరుణ = లేత వయస్సుకల, వంజుల = అశోకవృక్షములకు సంబంధించిన, కుంజ=పొదరిండ్లయొక్క, సైతస= నీటి ప్రవ్వలిచెట్లకు సంబంధించిన, కుడుంగ = పొదలయొక్క, వీధికలయందున్ = వరుసలయందు, దృష్టి = చూపును ఆవిష్కరించి = విప్పి-

తాత్పర్యము :- దేవతలు, మునులు అగస్త్యమహాముని కై అన్వేషించిన ప్రదేశములు వివరింపఁబడుచున్నవి. ఈ వివరములు మూలగ్రంథములో లేవు. సరాసరి వెళ్ళినట్లే యున్నది. ఆయన సుప్రసిద్ధుఁడు. ఇంత శ్రమపడి వెదకి పట్టుకొన వలసరములేదు. మూల కాశీఖండములో-

'జగ్ముః పరోపకారార్థ మగస్తిర్యత్రతిష్ఠతి' అని మాత్రమే యున్నది. తెనుఁగులోని యీ అన్వేషణక్రమమునుబట్టి ఆ దేవమునుల కార్యవ్యగ్రతా లక్షణము లోకస్వభావానుసారముఁగఁ జిత్రింపఁబడిన దనుకొనవలెను. వారు మొట్టమొదట డుంఠి విఘ్నేశ్వరస్వామి యుండు ప్రదేశములోఁ జూచిరి. ఆ పిమ్మట వరుసగా లోలార్కుని నగరి మొగసాల, దండపాణి నిలయము, సురాభాండేశ్వరము, కుక్కుట స్థానము, ఆదికేశవుని మందిరము, కాలభైరవస్వామి యుండెడి కోటతలుపు, విశాలాక్షియొక్క సభావాటిక, ముక్తిమంటపప్రాంతము వెదకి చూచిరి ఇవి ప్రసిద్ధములైన ప్రదేశములు. అగస్త్యమహాముని కనిపించలేదు. తరువాత వారు గంగానది గట్టు పొడవున జీబుగా పెరిగిన పొదరిండ్లన్నియును దమ తమ చూపులతో జల్లెడ పట్టిరి. ఆ నల్లపూస కానిపింపలేదు.

వ॥ కుంభసంభవు నన్వేషించువారు జగద్ధిత కార్యారంభులు జంభ మథన పురోగములైన సురలును గీష్పతిప్రధానులైన మును లును నానంద కాననంబన మహాశ్మశానంబన రుద్రావాసం బనఁ గాశి యన వారణాసి యన నవిముక్తక్షేత్రంబన లోలార్క కేశవులు కోటిద్వ్యయంబును, భాగీరథి నారియు, ధర్మంబు శరంబును, గలిలక్ష్యంబును, విరూపాక్షుండు ధన్వియుంగా ముక్తిపురంధ్రీ భ్రూలతానుకారంబును, జంద్రరేఖాచ్ఛాయా

ప్రకారంబై తాను గోదండంబు భంగి నంగీకరించి విశ్వేశ్వర శ్రీ మహాదేవునకు నిఖిల దేవతా సార్వభౌమునకుఁ ద్రైలోక్య సామ్రాజ్య పట్టాభిషేకంబునకుఁ దగిన హేమపీఠంబునుం బోని యమ్మహాస్థానంబుఁ గలయఁ గ్రుమ్మరి యచ్చోటి పెద్దలనలనం గందువ యెఱింగి చని తత్పుణ్యాశ్రమంబుఁ బ్రవేశించిరందు.42

అర్థము :- కుంభసంభవున్ = అగస్త్య మహాముని (ఆయన కుంభము నుండి పుట్టెను), అన్వేషించువారు=వెదకునట్టినారు, 'జగద్ధితకార్యారంభులు' జగద్ధిత = (జగత్ + హిత) లోకమునకు మేలు కలిగించెడి. కార్య = ఉద్యమము యొక్క. ఆరంభులు = వ్యవసాయము గలవారును. 'జంభమథన పురోగములు జంభమథన = ఇంద్రుఁడు ('జంభుఁ' డను రాక్షసుని సంహరించినవాఁడు) పురోగములు = అగ్రగామిగాఁ గలవారును, ఐన = అయిన, సురలు = దేవతలు, 'గీష్పతి ప్రధానులైన' గీష్పతి = బృహస్పతి, ప్రధానులైన ప్రధానముగాఁ గలవారైన. మునులును = మహర్షులును ఆనంద కాననంబనన్ = 'ఆనందకానన' మనియును, మహాశ్మశానంబనన్ = 'మహాశ్మశాన' మనియును, రుద్రావాసంబనన్ = 'రుద్రావాస' మనియును, కాశియనన్ = 'కాశి' యనియును, వారణాసియనన్ = 'వారణాసి' యనియును, అవిముక్తక్షేత్రంబనన్ = 'అవిముక్తక్షేత్ర' మనియును, (ఇన్ని పేర్లతో ప్రసిద్ధమై) 'లోలార్క కేశవులు' లోలార్క = లొలార్కుఁడును, కేశవులు = ఆదికేశవుఁడును, 'కోటిద్వ్యయంబును' కోటి = ధనుష్కోటులయొక్క - వింటి కొనలయొక్క, ద్వ్యయంబును జంటయును, భాగీరథి = గంగానది, నారియున్ = అల్లెత్రాటును, ధర్మంబు = శాశ్వత ధర్మము, శరంబును = బాణమును, కలి = పాపము, లక్ష్యంబును = గుఱియును-శరవ్యమును. విరూపాక్షుండు =శివుఁడు -త్రినేత్రుఁడు, ధన్వియుంగాన్ =విలుకాఁడునుగా, 'ముక్తిపురంధ్రీ భ్రూరతానుకారంబును' ముక్తి = సంసార విముక్తి యనెడి, పురంధ్రీ = కుటుంబినియొక్క - స్త్రీయొక్క, భ్రూలతా = తీఁగవంటి కన్నుబొమను, అనుకారంబును = పోలునదియును, 'చంద్రరేఖాచ్ఛాయా ప్రకారంబై' చంద్రరేఖా = నెలవంకయొక్క, ఛాయా = ప్రతిబింబముయొక్క, ప్రకారంబై = తీరుకలదై, తాను = తాను (కాశీనగరము) 'కోదండ భంగిన్' కోదండ = ధనుస్సుయొక్క, భంగిన్ = పోలికను, అంగీకరించి = కైకొని, 'విశ్వేశ్వర శ్రీమహాదేవునకున్' విశ్వేశ్వర = విశ్వేశ్వరుఁడనెడి, శ్రీమహాదేవున

కున్ = శివునకు, 'నిఖిలదేవతాసార్వభౌమునకున్' నిఖిలదేవతా = అశేష దేవతలకు, సార్వభౌమునకున్ = చక్రవర్తికి, 'త్రైలోక్య సామ్రాజ్య పట్టాభిషేకంబునకున్' త్రైలోక్య = ముల్లోకములకు సంబంధించిన, సామ్రాజ్య = సామ్రాజ్యమునొక్క-సమ్రాడ్భావమునొక్క, పట్టాభిషేకంబునకున్ = పట్టాభిషేకమునకు, దగిన = యోగ్యమైన. హేమపీఠంబునుంభోని = స్వర్ణ సింహాసనమువంటిదియైన, అమ్మహా స్థానంబున్ = ఆ మహాశివస్థానమును, కలయన్ = అంతటను. క్రుమ్మరి = పరిభ్రమించి, అచ్చోటి పెద్దలవలనన్ = ఆ ప్రదేశమునందలి పెద్దలవలన, కందువ = అగస్త్యమునియున్న స్థానమును, ఎఱింగి = తెలిసికొని, చని = వెళ్ళి. 'తత్ పుణ్యాశ్రమంబున్' తత్ = ఆ. పుణ్యాశ్రమంబున్ = పుణ్యాశ్రమమును ప్రవేశించిరి = చొచ్చిరి, అందున్ = ఆ యాశ్రమమునందు.

తాత్పర్యము :- లోకహితము నెరవేరుటకై అగస్త్యమహాముని అన్వేషించుచు ఇంద్రాది దేవతలను బృహస్పతి ముఖ్యులైన మునులును 'ఆనంద కాననము', 'మహాశ్మశానము', 'రుద్రావాసము', 'కాశి', 'వారణాసి', 'అవిముక్తము' అను నామములతో ప్రసిద్ధమైన ఆ మహాశివస్థానమంతయును కలయఁదిరిగిరి. ఆ నగర సన్నివేశము గంగయొడ్డున ఎక్కుపెట్టిన విల్లువలె నెలవంక యాకారముగా నుండును. ఆ ధనుస్సునకు 'అసి' సంగమమునందు నెలకొనియున్న లోలార్కుఁడు ఒక కోణము. 'వరణా' సంగమమునందు నెలకొనియున్న ఆదికేశవస్వామి యింకొక కోణము. గంగానదియే నారి. ధర్మమే బాణము పాపమే ఆ బాణమునకు గుఱి. శివుఁడే విలుకాఁడు ఇట్టి సన్నివేశముగల ఆ కాశీనగరము మోక్షలక్ష్మియొక్క కనుబొమవలె, నెలవంకయొక్క నీడవలె తాను ధనుస్సుయొక్క పోలికను గైకొని. నిఖిల దేవతాసార్వభౌముఁడైన విశ్వేశ్వర శ్రీమహాదేవుని త్రైలోక్య సామ్రాజ్య పట్టాభిషేకమునకు యోగ్యమైన స్వర్ణపీఠమువలె ప్రకాశించుచుండును. దేవతలు. మునులు స్థానికులైన పెద్దలవలన అగస్త్యమహామునియున్న ప్రదేశము తెలిసికొని ఆ ముని ఆశ్రమమునందు ప్రవేశించిరి. అచ్చట-

సీ॥ కండూయనము సేయుఁ గరటి శుండాదండ
పుష్కరమ్మున సిఁగాపోతకంబు
వాలారు నఖముల వదన మించుక యెత్తి
ముద్దాడుఁ బులిలేటి ముద్దరాలి

నిండు కొఁగిటఁ జేర్చి నెమ్మైమోఁ దోఁడేలు
కొదమ చింబోతును గుస్తరించుఁ
గుంజ మంటపకుటీ క్రోడ మధ్యంబున
నాఖుతోఁ జెఱలాడు నడవి పిల్లి

తే॥గీ॥ యెండ తాఁకక యుండంగ నెత్తిపట్టుఁ
బగలు ముంగికి భుజగంబు పడగ గొడుగు
కోఁతితో మైత్రి పాటించుఁ గొండ గొఱియ
యూర్వ శేయుని పుణ్యాశ్రమాంతరమున ॥ 43

అర్థము :- 'ఔర్వసేయుని పుణ్యాశ్రమాంతరమునన్' ఔర్వశేయుని = ఊర్వశీ నందనుఁడైన అగస్త్యమహాముని యొక్క. (మిత్రా వరుణులను దేవతా ద్వంద్వమునకు ఊర్వశియందుఁ గలిగిన సంతాన మిద్దఱు. వశిష్ఠుఁడు, అగస్త్యుఁడు. వీరిరువురికి ఔర్వశేయులని, మైత్రావరుణులనియును వ్యవహారము) పుణ్యాశ్రమ = పావనమైన ఆశ్రమము యొక్క, అంతరమునన్ = మధ్యప్రదేశమునందు, కరటిన్ = ఏనుఁగును, సింహపోతకంబు = సింహపు పిల్ల, 'ఖండాదండ పుష్కరమ్మునన్' ఖండాదండ = దండాకారమైన తొండము యొక్క, పుష్కరమ్మునన్ =అగ్రభాగము నందు, కండూయనము = తీఁట యొక్క ఉపశాంతిని, చేయున్ = చేయును.

పులి = పెద్దపులి, లేటిముద్దరాలిన్ = ముగ్ధకురంగిని, వాలారునఖములన్ = వాలికలైన గోళ్ళతో, వదనము = నెమ్మొగమును, ఇంచుక = కొంచెము, ఎత్తి = పైకెత్తి, ముద్దాడున్ = ముద్దులు పెట్టుకొనును. తోఁడేలు = తోఁడేలు, కొదమ చింబోతున్ = (చింబు + పోతు) కొదమ మేఁకపోతును. నిండుకొఁగిటన్ = నిండైన కౌఁగిలియందు, చేర్చి = చేర్చికొని, నెమ్మైమైన్ =ప్రేమతో, కుస్తరించున్ = ఊఁబడించును.

'కుంజ....మధ్యంబునన్' కుంజ మంటప మంటపమువంటి పొదరిల్లే యనెడి, కుటీ = కుటీరము యొక్క, క్రోడ మధ్యంబునన్ = నడిమి ప్రదేశమునందు అడవి పిల్లి = అరణ్య మార్జారము, ఆఖుతోన్ = ఎలుకతో, చెఱలాడున్ = చెర్లాట మాడును.

పగలు = పగటివేళయందు. ఎండ తాఁకక యుండంగన్ = ఎండ తగుల

కుండ, ముంగికిన్ = ముంగిసకు, భుజగంబు = పాము. పడగగొడుగు = గొడుగు పడగను, ఎత్తి పట్టున్ = ఎత్తి పట్టుకొనును. కొండ గొఱియ = కొండ గొఱ్ఱె, కోఁతితోన్ = కోఁతితో, మైత్రి = మైత్రీధర్మమును - స్నేమును, పాటించున్ = పాటించును.

తాత్పర్యము :- ఆ ముని ఆశ్రమ భూమియంచు సింహపుపిల్ల ఏనుఁగు నకు సుఖముగా తొండము కొసయందు గోకుచుండును. వాలికలైన గోళ్ళతో పెద్ద పులి లేటిముదరాలి ముఖమును కొంచెము పెకెత్తి ముదాడుచుండును. తోఁడేలు కొదమ మేఁకపోతును ప్రేమతో నిండుకౌఁగిటిలోఁ జేర్చికొని యూఅడించు చుండును. పొదరింటి మధ్యభాగములో అడవిపిల్లి ఎలుకతో చెల్లాటమాడుచుండును. ముంగిసకు పగటివేళయందు ఎండ తగులకుండునట్లు పాము తన పడగను గొడుగు వలె ఎత్తి పట్టుచుండును. కొండగొఱ్ఱె కోఁతితో మైత్రిని పాటించుచుండును.

విశేషము:- ఆ మహాముని సత్వగుణముయొక్క అనుభావము, ఆ ఆశ్రమ భూమియందంతటను వ్యాపించి నైసర్గికమగు జాతివిరోధమునుగూడ మఱపించుట వలన విరోధిజంతువులు కూడ కలసి మెలసి తిరుగుచుండును.

వ॥ వెండియు నవ్వనంబున నీవారోదన మండం బుష్ణ మధురంబుగ, గండూషించి క్రొత్త పురిటాలికిం గురంగికి మెత్తమెత్తన కురంగంబు గ్రోల్చి, ప్రసర్పత్సర్పిరభిఘూర ధారాగంధ పాణిధ మంబై కర్కంధూ ఫలోన్మిశ్ర శాకపాకంబుల తాలింపు కమ్మని కంపు పాధ క్షూణంబుల కింపు సొంపు సపాదించు, సరసీతీరంబున సారసంబు సారస్యంబు పక్ష్మలింప లక్ష్మణా కంఠోపకంఠంబునం గంఠంబుఁ జేర్చి సుఖపారవశ్యంబునం జొక్కెనో! ముక్కంటి లోఁగంటం గనుంగొనుచు నిశ్చల ధ్యాన యోగానుసంధానంబున మాధుర్యంబు భజించెనో! యెఱుఁగరాకుండ నుండు, శ్రుతి స్మృతి పురాణేతిహాస సంహితా తాత్పర్య పర్యాలోచనం బచేళిమంబైన వివేకంబున మత్స్య మాంసం బభ్యర్హితులు గర్హింతురని యెఱింగి గాబోలుఁ బంక

జోత్పల కుముద కల్హార సంకులంబులగు కొలంకులఁ బెద్దమీను కొండుక మీనుం దాఁకదు. దరవికచ వకుళకురవక నాగ కేసర పరాగ ధూసరంబులగు మధుమాస వాసరంబులందును బంచబాణుం డించు విల్లెక్కఁ వెట్ట వెఱచు గావునఁ గొంచి కొంచి యప్పశుపక్ష్మ మృగమిథునంబులు నిధువన క్రీడ లాచ రించు. కంఠగత ప్రాణులగు జంతువులకుం గాలకంఠుండు కరుణా వశం వదుండై కర్ణోపకంఠంబుఁ జేరి తారకబ్రహ్మ మంత్ర రాజంబు నుపదేశింప మంతనంబున మిని యెఱుంగుటం జేసి మధుమదోల్లాసంబున నది వెల్లివిరిసేయుచున్న యవియో యన నిందిందిర బులు మంద్రస్వనంబున ఝుంకారంబుసేయు, నక్త భోజన వ్రతస్థులతోడి సంసర్గంబుననో చకోరవర్గంబు నక్తం బులం జంద్ర చంద్రికాకరంభంబునఁ గాక్షింభర్యంబు సభా వించు నట్టి పుణ్యాశ్రమంబు దరిసి చనునప్పుడు మునులు బృందారకులు నిజాంతర్గతంబున. 44

అర్థము :- వెండియున్ = మఱియును, అవ్వనంబునన్ = ఆ వనమునందు. 'నీవారౌదనమండంబు' నీవారౌదన = (నీవార + ఓదన) నివ్వరియన్నముయొక్క, మండంబు = గంజిని, ఉష్ణమధురంబుగన్ = వేఁడిగా - తీయఁగా, గండూషించి = పుక్కిటఁబట్టి, క్రొత్త పురిటాలికిన్ = అప్పుడే ప్రసవించిన, కురంగికిన్ = ఆడు లేడికి, కురంగంబు = మగలేడి. మెత్తమెత్తనన్ = నెమ్మది నెమ్మదిగా, క్రోల్చున్ = క్రోలునట్లు చేయును - త్రాఁగించును. 'ప్రసర్పత్ ....పాణింధమంబై' ప్రసర్పత్ = వ్యాపించుచున్న, సర్పిః = నేతియొక్క, అభిఘార = తిరుఁగబోఁతకు సంబంధించిన, ధారా = ధారయొక్క, గంధ = సౌరభమునకు, పాణింధమంబై = కొలిమితిత్తియై - ఉబికించునదియై, 'కర్కంధూ....పాకంబుల' కర్కంధూఫల = రేఁగు పండ్లతో, ఉన్మిశ్ర = కలసిన, శాకపాకంబుల = కూర వంటకములకు సంబంధించిన, తాలింపుల = తిరుగుబోఁతలయొక్క, కమ్మని కంపు = ఘ్రాణతర్పణమైన వాసన, పాంథఘ్రాణంబులకున్ = బాటసారులయొక్క ఘ్రాణేంద్రియములకు, ఇంపు సొంపు = సుఖాతిశయమును, సంపాదించున్ = కలుగఁజేయును, సరసీ

తీరంబునన్ = పర స్త్రీరమునందు, సారసంబు = బెగ్గురుపక్షి. సారస్యంబు = సరసత్వము, పక్ష్మలింపన్ = కన్నులకు అరమోడ్పు తెప్పింపఁగా, లక్ష్మణా = ఆడు బెగ్గురుపక్షియొక్క. కంఠోపకంఠంబునన్ = కంఠసమీపమునందు. కంఠంబున్ = తన కంఠమును, చేర్చి = ఆనించి. సుఖపారవశ్యంబునన్ = సుఖము వలనఁ గలిగిన పరవశభావముచేత, చొక్కెనో = మైమఱచెనో, ముక్కంటిన్ = శివుని. లోఁగంటన్ = (లోపలి + కన్ను) లోపలి చూపుతో, కనుంగొనుచున్ = చూచుచు, 'నిశ్చల.... సంధానంబునన్' నిశ్చల = చలనములేని, ధ్యానయోగ = ధ్యానరూపమైన కలయికయొక్క, అనుసంధానంబున్ = చేరికచేత. మాధుర్యంబు = తీయఁదనమును, భజించెనో = అనుభవించెనో, ఎఱుఁగరాకుండ నుండున్ = తెలియుటకు వీలులేకుండ నుండును. 'శ్రుతి....పర్యాలోచనన్' శ్రుతి = వేదముల యొక్క. స్మృతి = ధర్మశాస్త్రములయొక్క, పురాణ = పురాణములయొక్క, ఇతిహాస = ఇతిహాస సంహితలయొక్క, తాత్పర్య = ముఖ్యార్థమునొక్క, పర్యాలోచనన్ = సమగ్ర చింతనముచేత, పచేళిమంబైన = పండఁబాఱిన. వివేకంబునన్ = విజ్ఞతచేత, మత్స్య మాంసంబు = మత్స్య మాంసభక్షణమును, అభ్యర్హ్యాతులు = పెద్దలు, గర్హ్యంతురని = నిందింతురని, ఎటింగి కాఁబోలు = తెలిసి కాఁబోలును, 'పంకజ....సంకులంబులగు పంకజ = తామరపూవులచేత. ఉత్పల = నల్ల కలువలచేత. కుముద = తెల్లకలువలచేత. కల్హార = ఎఱ్ఱకలువలచేత. సంకులంబులగు = సంకులములైన కొలంకులన్ = సరస్సులయందు. పెద్దమీను = పెద్దచేప. కొండుకమీనున్ = చిన్నచేపను. తాఁకదు = ముట్టికొనదు. 'దరవికచ....ధూసరంబులగు దరవికచ = కొంచెముగా వికసించిన - అరవిరిసిన వకుళ = పొగడపూల యొక్క. కురవక = గోరింట పూలయొక్క. నాగకేసర = నాగకేసరపు పూలయొక్క. పరాగ = పుప్పొడులచేత. ధూసరంబులగు = ఇంచుక తెలుపువన్నె కల. మధుమాస = చైత్రమాసమునకు సంబంధించిన, వాసరంబులందును = దినములలోఁ గూడ, పంచబాణుండు = మన్మథుఁడు (పంచబాణములు - అరవిందము, అశోకము, చూతము, నవమల్లిక, నీలోత్పలము). ఇంచువిల్లు = చెఱకు విల్లు, ఎక్కుపెట్టన్ = ఎక్కుపెట్టుటకు, వెఱుఁగావునన్ = భయపడును కావున, కొంచికొంచి = సంకోచించి సంకోచించి. 'అప్పుపక్షి మృగ మిథునంబులు' అప్పుపక్షి = (అ + పశు) ఆ పశుపక్షులయొక్క, మృగ = లేళ్ళయొక్క, మిథునంబులు = జంటలు, నిధువనక్రీడలు = రతిక్రీడలను, ఆచరించున్ = చేయును. కంఠగత

ప్రాణులగు = కంఠములోనున్న ప్రాణవాయువులు గల, జంతువులకున్ = శరీరులకు, కాలకంఠుడు = శివుఁడు (నల్లని కంఠకాంతి గలవాఁడు). కరుణావశంవదుండై ' కరుణా = కారుణ్యమునకు, వశంవదుండై = లోఁబడినవాఁడై, కర్ణోపకంఠంబున్ = చెవి చేరువను, చేరి = సమీపించి, 'తారకబ్రహ్మ మంత్రరాజంబున్' తారక = సంసారమును దాఁటించునట్టి, బ్రహ్మమంత్రరాజంబును = శ్రేష్ఠమైన బ్రహ్మమంత్రమును, ఉపదేశింపన్ = ఉపదేశింపఁగా, మంతనంబునన్ = ఏకాంతముగా - రహస్యముగా, విని యెఱుంగుబంజేసి = విని తెలిసికొన్నవికావున, 'మధుమదోల్లాసంబునన్' మధు = మధుపానమువల్ల కలిగిన, మదోల్లాసంబునన్ = మదాతిశయముచేత, అది = ఆ ప్రణవమంత్రమును, వెల్లి విరిసేయుచున్న యవియో యనన్ = బాహాటించుచున్నవో యన్నట్లు, ఇందిందిరంబులు = తుమ్మెదలు, ఝంకారంబుసేయున్ = 'ఝ'మ్మను నాదము చేయును. 'నక్తభోజనవ్రతస్థులతోడి సంసర్గంబుననో' నక్తభోజన = రాత్రిభోజనమును, వ్రతస్థులతోడి = వ్రతనిష్ఠులతోడి, సంసర్గంబుననో = సహవాసమువల్లనో, చకోరవర్గంబు = వెన్నెల పక్షుల గుంపు. నక్తంబులన్ = రాత్రులయందు, చంద్ర = చంద్రునియొక్క, చంద్రికా = వెన్నెలయే యనెడి, కరంభంబునన్ = పెరుగుతో కలిపిన పేలపిండిలో, కౌక్షింభర్యంబున్ = పొట్ట నింపికొనుటను, సంభావించును = మన్నించును, అట్టి=ఆవిధమైన, పుణ్యాశ్రమంబున్ = పవిత్రమైన ఆశ్రమమును, దరిసి=సమీపించి, చనునప్పుడు= వెళ్ళునప్పుడు, మునులు = మునులును, బృందారకులు = దేవతలును, నిజాంతర్గతంబునన్ = తమ మనస్సులో-

తాత్పర్యము :- ఆ యగస్త్యాశ్రమములోనికి వెళ్ళునప్పుడు దేవమునులకు ఈ దృశ్యములు కనిపింప మొదలిడెను. అప్పుడే వార్చుటవలన నులివెచ్చగా నున్న తీయని నివ్వరియన్నపు గంజిని క్రొత్త పురిటాలైన ఆడులేడిచేత మగలేడి నెమ్మది నెమ్మదిగా త్రాఁగించుచుండెను. రేఁగుపండ్ల గుజ్జుతో కలిపి ఆవునేఁతితోఁ తిరుగఁబోఁతలు పెట్టి వండుచున్న కూరల తాలింపుల కమ్మని వాసనలతో ఆ ప్రాంతమంతయును ఘుమఘుమలాడిపోవుచుండెను. కొలనిగట్టున ప్రియురాలి కంఠమునకు తన కంఠమును ఆనించి అర్ధమూఁత కన్నులతో నున్న బెగ్గురుపక్షి శివధ్యాన సమాధిలోని సుఖపారవశ్యమువలన అర్ధనిమీలితాక్షమైనట్లుండెను. శ్రుతి స్మృతి పురాపేతిహాస తాత్పర్యము మనస్సునకు పట్టుటవల్లనేమో, కొలనిలోని పెద్దచేప చిన్నచేపను పట్టుటలేదు. పువ్వులకారులోఁగూడ మన్మథు డచ్చట తన తీయ విల్లెత్తుటకు వెఱచు

మండును గాన తిర్యగ్జృంభనములుగూడ నిధువనక్రీడలయందు సంకోచముతో ప్రవర్తిల్లుచుండును. కంఠగతప్రాణమైన జంతుకోటికి పరమశివుఁడు ఏకాంతముగ ఉపదేశించుచున్న ప్రణవమంత్రమును పొంచి వినుచున్న తుమ్మెదలు మధుమదమువలన మైమఱచి ఆ మంత్రమును వెల్లివిరి చేయుచున్నట్లు 'జు'మ్మను నాదమును జేయుచుండును. నక్తవ్రతస్థుల సహవాసమువల్లనే చకోరవర్గములు రాత్రులయందు పెరుగుతో కలిపిన పేలపిండిని ఆరగించినట్లు వెన్నెల గుజ్జుతో కడుపు నింపికొనుచుండును.

విశేషము :- అగస్త్యాశ్రమములోని పుణ్యవాసనలవలెనే యీ వచనమునందు అంటికొని కస్తూరి నెత్తావివలె కవిసార్వభౌముని ప్రౌఢసాహిత్య సౌరభములు తెరలుతెరలుగా వ్యాపించుచున్నవి. అవి భవభూతితో మొదలై కాళిదాసునిలో కలిసిపోవుచున్నవి.

'సీవారోదనమండ ముష్ణమధరం సద్యఃప్రసూతప్రియా
పీతాదభ్యధికం తపోవన మృగః పర్యాప్తమాచామతి
గంధేన స్ఫురతా మనాగనుస్యతో భక్తేన సర్పిష్మతా
కర్కంధూ ఫలమిశ్ర శాకపచనామోదః పరిస్తీర్యతే' (ఉత్తర రామచరితము)

'ప్రాయశ్చాపం నవహతి భయాన్మన్మథఃషట్పదజ్యం'. (మేఘసందేశము)

'స్మేరా దిశఃకుముద ముద్భిదురంపిబంతు
జ్యోత్స్నాకరంభ ముదం భరయశ్చకోరాఃం. (మురారి)

తే॥గీ॥ ఎన్నఁడును నేగి లేనట్టి యిమ్మహాశ్మ
శానమునఁ గాఁపురంబున్న జంతువులకు
నేటి నాకంబు? పున్నియంబెడలి నప్పు
డొ అకమునఁ గూలవలయుఁ గీలూడినట్లు ॥ 45

అన్వయము :- ఎన్నఁడును = ఏకాలమునందును, నేగి = ఆపద, లేనట్టి = లేనిదైన. ఈ మహాశ్మశానమునన్ = ఈ కాశీ క్షేత్రమునందు, (కాశికి 'మహాశ్మశాన' మని పేరు.) కాఁపురంబున్న = నివాసమున్న, జంతువులకున్ = ప్రాణులకు - జన్మ యెత్తినవారికి, ఏటి నాకంబు? = దేనికి వచ్చిన స్వర్గము?, పున్ని

యంబు = పుణ్యము. ఎడలినప్పుడు = వికలమైనప్పుడు. కీలు = మఱ-సూత్రము. ఱాడినట్లు = ఱాడిపోయినట్లుగా. ఒరకమునన్ = పల్లమునందు. కూలవలయున్ = కూలిపోవలెను.

తాత్పర్యము :- ఏనాటికిని హానిలేని యీ కాశీక్షేత్రమునందు కాఁపుర మున్న ప్రాణులకు దేనికి వచ్చిన స్వర్గము? పుణ్యము క్షీణించినప్పుడు-ఆ స్వర్గము నుండి కీలూడిన బొమ్మవలె పల్లమునకు కూలి పడిపోవలసియే యుండునుగదా!

విశేషము :- కాశీక్షేత్రము పునరావృత్తి రహితమై నిరపాయమైన మోక్ష స్థానము. కేవల భోగభూమియైన స్వర్గము పుణ్యక్షయమైనప్పుడు తిరిగి రావలసి యున్నచోటు. కాబట్టి ప్రాణులకు స్వర్గముకంటె కాశి నిరపాయమై భద్రమైన ప్రదే శము. 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి'. 'కల్పాంతరేషు నవినశ్యతివారణాసీ.'

తే॥గీ॥ అపునరావృత్తి శంభులోకాధివాస
సౌఖ్య మొనఁగూడు నిచ్చోటి జంతువులకుఁ
గాన మనకంటెఁ గడుమేలు కాశినుండు
కీట పక్షి సరీసృప క్రిమికులంబు ॥ 46

అర్థము :- ఇచ్చోటి జంతువులకున్ = ఈ కాశియందలి జీవులకు. 'అపునరా వృత్తి....సౌఖ్యము' అపునరావృత్తి = పునరావృత్తిలేని - తిరిగి వచ్చుటలేని. (పునః + ఆవృత్తి) శంభులోకాధివాస = శివలోకనివాస రూపమైన. సౌఖ్యము = సుఖము. ఒనఁగూడును = సమకూరును. కానన్ = కాఁబట్టి. మనకంటెన్ = దేవతలమైన మనకంటె. 'కాశినుండు....క్రిమికులంబు' కాశినుండు = కాశియందు నివసించెడి. కీట = తేళ్ళు, సాలీళ్ళు మొదలైనవి. పక్షి = పక్షులు. సరీసృప = ప్రాఁకెడు ప్రాణులు-పాములు. తొండలు మొదలైనవి. క్రిమి = చిన్న పురుగులు. కడుమేలు = మిక్కిలి గొప్పవి.

తాత్పర్యము :- ఇంద్రాది పదవులలో నున్న మనకు స్థానభ్రంశ భయ మున్నది. కాశిలో నుండెడి క్రిమికీటకములకుఁ గూడ మనకున్న పదవీభంగ భయము లేదు. అవి పునరావృత్తిలేని శాశ్వత శివలోక నివాస సౌఖ్యము ననుభవించును. కాఁబట్టి అవి మనకంటె మేలైన స్థితిలో నున్నవి.

సీ॥ కాశికానగరంబు కడసీమమున నున్న
చండాలుఁ బోలఁ డాఖండలుండు
నానంద వనము లో ననశనస్థితి నున్కి
భువన సామ్రాజ్య వైభవముఁ బోలు
నవిముక్త దేశస్థుఁ డయ్యేనేఁ బతితుండు
నశ్వమేధాధ్వరాహర్త దొరయు
వారాణసీ సంభవంబైన మశకంబు
నైరావణముతోడ నవఘళించు

తే॥గీ॥ నాటుకొని శ్రీ మహాశ్మశానమున నున్న
యణుక నగ్నాల? వటుఁడైన నాగ్రహమున
గర్వితోద్ధతి నేతెంచు కాళరాత్రి
మృత్యుదేవత మునిపఁడ్లు మెఱుకఁజాలు ॥ 47

అర్థము :- కాశికానగరంబు = కాశీనగరమునొక్క, కడసీమమున నున్న= పొలిమేరలో నున్న, చండాలున్ = చండాలుని, అఖండలుండు = ఇంద్రుఁడు, పోలఁడు = సరిపోలఁడు, ఆనందవనములోన్ = కాశీనగరమునందు, అనశన స్థితిన్ = పస్తులుండెడి పరిస్థితిలో, ఉన్కిన్ = ఉండుటను, భువనసామ్రాజ్య = సమస్త లోక సామ్రాజ్యముయొక్క, వైభవమున్ = వైభవమును, పోలున్ = సరి పోలును, అవిముక్తదేశస్థుఁడయ్యేనేన్ = అవిముక్త (కాశీ) ప్రదేశ నివాసి యైనచో, పతితుండున్ = భ్రష్టుఁడుకూడ, అశ్వమేధాధ్వరాహర్తన్ = అశ్వమేధ యాగము నిర్వహించినవానిని, దొరయున్ = పోలును, వారాణసీసంభవంబైన = వారాణసి యందు పుట్టువుగల, మశకంబు = దోమ, ఐరావణముతోడన్ = ఐరావణముతో, అవఘళించున్ = సరియగును, నాటుకొని = స్థిరపడి శ్రీ మహాశ్మశానమున నున్న = శ్రీ కాశీనగరములోనున్న (కాశికి మహాశ్మశానమనియును పేరు), అణుక= మిక్కిలి చిన్నవాఁడును, నగ్నాల = దిసమొలలతో నున్న, వటుఁడైనన్ = వటువై నప్పటికిని, ఆగ్రహమునన్ = అగ్రహముతో - పట్టుదలతో, గర్వితోద్ధతిన్ = (గర్విత + ఉద్ధతి) గర్వించిన ఔద్ధత్యలక్షణముతో, ఏతెంచు = వచ్చుచున్న, కాళ

రాత్రి = ప్రళయరాత్రియందలి, మృత్యుదేవత = మృత్యుదేవతయొక్క, ముని పండ్లు = ముందరి పండ్లను, మెఱుకఁజాలున్ = పెళ్ళగింపఁజాలును.

తాత్పర్యము :- కాశికానగరము వెలివాడనున్న పెద్దకులమువానితో త్రిలో కాధిపతియైన యింద్రుఁడుకూడ సరిపోలఁడు. ఆనందవనములో తిండికిలేక పస్తుండు పరిస్థితికూడ సకల భువన సామ్రాజ్యవైభవమును సరిపోలి యుండును. అవిముక్తదేశనివాసి యయ్యెనేని ఎంతటి భ్రష్టుఁడైనను అశ్వమేధయాగము చేసిన పుణ్యపురుషునితో సాటికి వచ్చును. వారాణసిలో పుట్టిన దోమకూడ ఐరావతముతో సరియగును. శ్రీ మహాశ్మశానములో స్థిరనివాసముగానున్న మిక్కిలి చిన్నవయసు గల దిస్సమొల పటువుకూడ ప్రళయరాత్రియందు గర్వోద్ధతితో ఆగ్రహించి వచ్చి మీఁదఁబడుచున్న మృత్యుదేవతయొక్క ముందటి పండ్లను పెరికివేయఁగలఁడు.

తే॥గీ॥ ఎన్ని కల్పంబు లరిగిన నెడలిపోవ
దెందఱింద్రులు గడచిన నెలమి తప్ప
దెన్ని మన్వంతరమ్ములు చన్న నెపుడుఁ
బసిమి తప్పదు కాశికాపట్టణంబు ॥ 48

అర్థము :- కాశికాపట్టణంబు = కాశీపట్టణము. ఎన్ని కల్పంబు లరిగినన్ = ఎన్ని కల్పాంతరములు గడచిపోయినను. ఎడలిపోవదు = వికలముగాదు, ఎంద ఱింద్రులు గడచినన్ = ఎంతమంది యింద్రుల పరిపాలన కాలములు కడచిపోయి నను, ఎలమి తప్పదు = వికాసమును గోలుపోదు, ఎన్ని మన్వంతరంబులు చన్నను = ఎన్ని మన్వంతరములు గంచిపోయినను, ఎపుడున్ = ఏ కాలమునందును, పసిమి తప్పదు = ఆకుపచ్చని వన్నె మాఱదు.

తాత్పర్యము :- కాశికాపట్టణము ఎన్ని కల్పములు గడచిపోయినను 'సికస్తు' పడదు - శిథిలమైపోదు. ఎంద ఱింద్రులు గతించినను తన వికాసమును కోలు పోవదు. ఎన్ని మన్వంతరములు గడచినను ఏ కాలమునందును పసిమి తప్పదు. నిత్యనూతనమై యుండును.

ఉ॥ తత్తరపాటులేక నదిఁ దానమొనర్చి పినాకపాణి దే
వోత్తము విశ్వనాథుఁ గరుణోదధిఁ గమ్మని పూవుగుత్తులన్

బత్తిరిఁ బూజచేసి నుతిపాఠములన్ భవణించువారికిన్
దొత్తులు వోలె నబ్బుదురు దొప్పలు దోరలు
ముక్తికామినులున్ ॥ 49

అర్థము :- తత్తరపాటులేక = సంభ్రమములేక - స్థిమిత మనస్సుతో, నదిన్ = గంగానదియందు, తాన మొనర్చి = స్నానవిధి నాచరించి, పినాకపాణిన్ = పినాక మను ధనుస్సుపాణియందుఁ గలట్టియు, దేవోత్తమున్ = దేవతలలో నుత్తముఁ డైనట్టియు, విశ్వనాథున్ = విశ్వేశ్వరుని, కరుణోదధిన్ = కరుణాసముద్రుని, కమ్మని పూవుగుత్తులన్ = పరిమళభరితములైన పూవు గుత్తులతోను, పత్తిరిన్ = మారేడుపత్రితోను, పూజచేసి = పూజించి, నుతిపాఠములన్ = స్తుతిపాఠములను, భవణించువారికిన్ = అనుసంధానము చేయువారికి, ముక్తికామినుల్ = ముక్తికాంతలు, దొప్పలు దోరలు = దొప్పదోరలుగా - రాసులు రాసులుగా, అబ్బుదురు = లభింతురు.

తాత్పర్యము :- నిశ్చలమైన మనస్సుతో గంగానదిలో స్నాన మాచరించి పినాకపాణి, దేవోత్తముఁడు, కరుణాసముద్రుఁడు నైన విశ్వేశ్వరస్వామిని పరిమళ భరితములగు పుష్పస్తబకములతో బిల్వదళములతో పూజించి శివ మహిమ్నాదులైన స్తోత్రములను పఠించువారికి ముక్తికాంత దొప్పలు దొరలుగా లభింతురు.

సీ॥ ధర్మంబు కాశికాస్థాన మధ్యంబున
నాల్గు పాదంబుల నడచియాడు
నర్థంబు కాశీపురాంగణంబున యందు
నానాప్రకారమైనటన మిగులు
కామంబు కాశికా కటక ఘంటావీథి
గర్వించు రాజలోకంబు తేవ
మోక్షసంపదలు కాశీక్షేత్రమున యందుఁ
ద్రవ్వితండంబులై నివ్వటిల్లుఁ
తే॥గీ॥ కాశి కల్యాణముల కాది కారణంబు
కాశి యణిమాది సిద్ధుల కట్టుపట్టు
కాశి జనలోక సంకల్ప కల్పకంబు
కలుష పిశితంబు మొసవు రాకాసి కాశి ॥ 50

అర్థము :- 'కాశికాఽస్థాన మధ్యంబునన్' కాశికా = కాశికయే యనెడి, ఆస్థాన = ఆస్థానముయొక్క. మధ్యంబునన్ - మధ్యప్రదేశమునందు, ధర్మంబు = ధర్మము. నాల్గుపాదంబులన్ = తపస్సు, శౌచము, దయ, సత్యము అను నాలుగు పాదములతో. నడపియాడున్ = నడయాడుచుండును, అర్థంబు=అర్థపురుషార్థము. కాశీపురాంగణంబునయందున్ = కాశీపురముయొక్క. అంగణంబునయందున్ = ముంగిలియందు, నానాప్రకారమై = బహుప్రకారములు గలదియై, నటనన్ = నాట్యముతో, మిగులున్ = అతిశయించుచుండును, కామంబు = కామపురుషార్థము, 'కాశికా కటక ఘంటావీథిన్' కాశికాకటక = కాశికాపట్టణముయొక్క. ఘంటా వీథిన్ = రాజమార్గమునందు, రాజలోకంబుతేవన్ = రాజసమూహమువలె, గర్వించున్ = గర్వించును, మోక్షసంపదలు = ముక్తిసంపదలు, కాశీక్షేత్రమునయందున్= కాశీ మహాక్షేత్రమునందు, త్రవ్వితండంబులై = త్రవ్వినకొలది తండములుగా వెలువడునవియై, నివ్వటిల్లున్ = వ్యాపించును, కాశి = కాశీనగరము, కల్యాణములకున్ = మంగళములకు, ఆదికారణము = మొదటికారణము, కాశి = కాశీనగరము, అణిమాది సిద్ధుల = అణిమ మొదలైన అష్టసిద్ధులయొక్క. (అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము, వశిత్వము ఇవి అష్టసిద్ధులు.) కట్టుపట్టు = కట్టెడిచోటు, ఆలానభూమి, కాశి = కాశీనగరము, జనలోక=మనుష్యలోకముయొక్క, సంకల్ప = మనోరథములకు, కల్పకంబు = కల్పవృక్షము, కాశి = కాశీనగరము, కలుష = పాపములే యనెడి, పిశితంబు = మాంసమును, మెసవు = భక్షించునట్టి, రాకాసి = రాక్షసి;

తాత్పర్యము :- ధర్మపురుషార్థము కాశికాఽస్థాన మధ్యభూమియందు తప, శౌచ, దయా, సత్యము లనెడు నాలుగు పాదములతోను నడచి యాడుచుండును. అర్థపురుషార్థము కాశీ పురాంగణమునందు బహురూపమై నటించుచుండును. కామపురుషార్థము కాశీనగర ఘంటావీథియందు రాచకీవితో గర్వించి వర్తించుచుండును. మోక్షపురుషార్థము కాశీక్షేత్ర మధ్యమునందు త్రవ్వి తండములై నివ్వటిల్లుచుండును. కాశి కల్యాణములకెల్ల ఆదికారణము. కాశి అణిమాదిసిద్ధు లన్నింటికిని కట్టుగొయ్య; కాశి మానవలోక సంకల్పములకెల్ల కల్పవృక్షము. కాశి కలుషము లనెడి మాంసమును పట్టికొని దిగమ్రింగెడు రాకాసి ;

విశేషము :- ధర్మమునకు ఆస్థానము. అర్థమునకు అంగణము. కామమునకు ఘంటాపథము. మోక్షమునకు క్షేత్రము. కల్యాణములకు ఆదికారణము. అణి

మాదులకు కట్టుగొయ్య. సంకల్పములకు కల్పవృక్షము. కలుషములకు రాకాసి. ఈ పదముల సన్నివేశము ఆచి తూచి నట్లుండుటయే నిష్కర్ష.

సీ॥ ఉర్వీధరశ్రేణు లుట్టూఁత లూఁగంగ
నేడుగాడ్పులు వీచు నెన్నఁడేనిఁ
జండభానుండు పండ్రెండు మూర్తులు దాల్చి
యెసఁగ నెండలు కాయు నెన్నఁడేనిఁ
బుష్కలా వర్తకాంభోధర వ్రాతంబు
లెలగోలు వర్షించు నెన్నఁడేని
భూర్భువ స్స్వర్లోకములు ముంచి జలరాసు
లేకోదకముఁ జూపు నెన్నఁడేని

తే॥గీ॥ నెన్నఁడే నుండుఁ గాలంబు మిన్ను చక్కఁ
భూతములు క్రాలు నెన్నఁడేఁ బుట్టినిండ్లు
నపుడు వారాణసీపుర మైనక్రోసు
లంత మేరయు ద్రవ మడరకుండు ॥ 51

అర్థము :- ఎన్నఁడేనిన్ = ఏ సమయమునందయినచో, 'ఉర్వీధరశ్రేణులు' ఉర్వీధర = కొండలయొక్క, శ్రేణులు = పంక్తులు, ఉట్టూఁతలు = మిక్కిలి ఊఁగిపోవుటలుగా, (వెనుకకు-ఒకసారి, ముందునకు-ఒకసారి తూలిపోవుట. ఊఁగుట: 'ఊఁగు' ధాతువు. 'ఊఁచు' ప్రేరణార్థకము. 'ఊఁత భావార్థకము) ఏడుగాడ్పులన్ = ఆవహ, ప్రవహాది, సప్తమారుతములును, వీచున్ = వీచునో: ఊఁత + ఊఁత - ఉట్టూఁత.) ఎన్నఁడేనిన్ = ఏ సమయమునందయినచో. చండ భానుండు = తీక్ష్ణకిరణుఁడు, పండ్రెండు మూర్తులు = పండ్రెండు రూపములను, తాల్చి = ధరించి, ఎసఁగన్ = విజృంభణముగా, ఎండలు కాయున్ = ఎండ కాయునో; ఎన్నఁడేనిన్ = ఏ సమయ మందయినచో, 'పుష్కలావర్తకాంబోధ రమ్ములు' పుష్కల = 'పుష్కల'ములు, ఆవర్తకమ్ములు = 'ఆవర్తక'ములు అనెడి ప్రళయకాల మేఘములు, ఎలగోలు = ప్రప్రథముగా, వర్షించున్ = వర్షించునో: ఎన్నఁడేనిన్ = ఏ సమయ మందయినచో, 'భూర్భువ స్స్వర్లోకములు' భూః = భూలోకము, భువః = భువర్లోకము - అంతరిక్షము, స్వర్లోకములు = సువర్లోకము-

ద్యులోకము ఈ మూఁడింటిని, ముంచి = మునిఁగిపోవునట్లు చేసి, జలరాసులు = సముద్రములు, ఏకోదకమున్ = సృష్ట్యాదియందువలె - ఏకజలస్థితిని చూపును = ప్రదర్శించునో; ఎన్నఁడేనిన్ = ఏ సమయమునందయినచో, మిన్ను చక్కిన్ = ఆకాశమునందు, కాలము = కాలము, ఉండున్ = ఉండునో; భూతములు = పృథివి, జలాగ్ని, వాయువులు, పుట్టినిండ్లన్ = తమతమ పుట్టిన యిండ్లలో, క్రాలున్ = ఉండునో; అపుడు = ఆ సమయమునందు, 'వారాణసీపురము.... మేర' వారాణసీ పురము = వారాణసియున్న, ఐదుక్రోసులంత మేర = ఐదుకోసులంతటి మేరయందును, ఉపద్రవము = హానివడి - భయావహమైన పరిస్థితి, అమరకుండున్ = కలుగకుండును.

తాత్పర్యము:- ప్రళయకాలమునందు ఆవహప్రవహాదులైన సప్తమారుతములు విజృంభించి వీచును. ఆ మారుతముల విజృంభణమునకు మహాపర్వతములు పెనుకకు ముందునకు ఊగిపోవుచుండును. సూర్యుఁడు తన పండ్రెండు మూర్తులను ధరించి ప్రళయాతపములను కాయుచుండును. పుష్కరావర్తకములను ప్రళయకాల మేఘములు కోలాహలముగ వర్షించును. సముద్రములు లుప్పొంగి భూర్భువస్సువర్లోకములు మూఁడింటిని ముంచివైచి సరిగా సృష్ట్యారంభ సమయమునందువలెనే ఏకార్ణవమొనరించును. ఆ పిమ్మట భూమి జలములలో కరఁగి లీనమైపోవును. జలములు అగ్నిలో ఆవిరియైపోవును. అగ్ని వాయువులో అణఁగిపోవును. వాయువు ఆకాశములో లీనమైపోవును. ఆకాశ మొక్కటియే మిగులును. మాయయొక్క ఆత్మయొక్క సంబంధజనితమైన కాలము ఆ యాకాసముతోసహా ఉండును. అట్టి ప్రళయవేళలో వారాణసియున్న అయిదుక్రోసుల మేరలో ఏ యుపద్రవము సంభవింపదు.

విశేషము:- భూమికి నీరు పుట్టిల్లు. నీటికి అగ్ని పుట్టిల్లు. అగ్నికి వాయువు పుట్టిల్లు. వాయువునకు ఆకాశము పుట్టిల్లు. ఇది ప్రతిలోమక్రమము. సృష్టి అనులోమక్రమమునను, ప్రళయము ప్రతిలోమక్రమమునను జరుగును. ఇట్లు ఆకాశము మినహాగా మిగిలిన భూతములు పృథివ్యప్తేజోవాయువులు తమ తమ పుట్టిండ్లలో కరఁగిపోయిన కాలములో వారాణసి యెచ్చట నుండును? అన్నది ప్రశ్న. పరమేశ్వరుని త్రిశూలాగ్రమునందుండును; 'త్రికంటకాగ్రస్థితే' అని కాశీ సంకల్పము.

తే॥గీ॥ ఉత్తరోత్తర మభివృద్ధి నొందుచుండుఁ
గాశి ధర్మార్థ కామమోక్షములు నాల్గు

సుందరయ్య గ్రంథాలయ సంచిక
16278
హైదరాబాద్-500 044.

చంద్రకళ యట్లు శుక్లపక్షంబు రేలు
నాఁడునాటికి నభివర్ధనంబునొందు ॥ 52

అర్థము :- కాశిన్ = కాశీనగరమునందు, 'ధర్మార్థ కామమోక్షములు' ధర్మ = ధర్మము, అర్థ = అర్థము, కామ = కామము, మోక్షములు = మోక్షము అనెడి, నాల్గు = నాలుగు పురుషార్థములను. శుక్లపక్షంబురేలు = శుక్లపక్షరాత్రులయందు. చంద్రకళయెట్లు = చంద్రకళ ఏవిధముగా, నాఁడు నాటికిన్ = నానాటికిని - దిన దినమునకును, అభివర్ధనంబున్ = పెంపుదలను, ఒందున్ = పొందునో. ఆవిధముగా. ఉత్తరోత్తరము = ఉత్తరోత్తరముగా - (వృద్ధిపై వృద్ధిగా), అభివర్ధనంబున్ = నిరంతరాభివృద్ధిని, ఒందుచుండున్ - పొందుచుండును.

తాత్పర్యము :- శుక్లపక్షరాత్రులలో చంద్రకళ యేవిధముగా నానాటికిని ఉత్తరోత్తరాభివృద్ధి నొందుచుండునో ఆవిధముగా కాశీనగరమునందు ధర్మార్థ కామమోక్షములను నాలుగు పురుషార్థములును నానాటికిని ఉత్తరోత్తరాభివృద్ధి నొందుచుండును.

సీ॥ పాలింద్లు కదలంగఁ బసపుఁ బయ్యెద వీచు
నచలాధిపతి కూర్మి యాడుబిడ్డ
భూలాస్య మొఱఁగించి తొండంబు ముక్కున
శీకరాసారంబుఁ జిలుకు డుంఠి
ప్రత్యక్షమై వచ్చి భాగీరథీ గంగ
మృనుల హస్తము సాఁచి మేను నివురుఁ
బ్రమథోత్తముఁడు భృంగి భయ రక్షణార్థంబు
ఫాలాగ్రమునఁ దీర్చు భసిత రేఖ

తే॥గీ॥ దక్షిణ శ్రుతి మీఁదుగా ధాత్రిఁ ద్రెళ్ళి
పెద్ద నిద్రకు వ్రాఁగన్ను పెట్టువేళఁ
బంచజనులకుఁ దారక బ్రహ్మవిద్య
యభవుఁ డుపదేశ మొనరించునపుడు కాశి. 53

అర్థము :- దక్షిణ క్ష్మతి = కుడిచెవి, మీఁదుగాన్ -మీఁదగునట్లుగా, ధాత్రిన్ = భూమిపై, తెళ్ళి=వ్రాలి, పెద్దనిద్రకున్ =దీర్ఘ నిద్రకు - మరణమునకు, మ్రాఁగన్ను పెట్టువేళన్' మ్రాఁగన్ను = (మ్రాఁగు + కన్ను) సోలిన కన్ను, పెట్టు వేళన్ = పెట్టెడి వేళయందు, పంచజనులకున్ = ప్రాణులకు, అభవుఁడు = శివుఁడు, 'తారక బ్రహ్మవిద్యన్' తారక = సంసారమును తరింపఁజేయునట్టి - ప్రణవమనెడి, బ్రహ్మ విద్యన్ = బ్రహ్మమంత్రమును, ఉపదేశ మొనరించునపుడు = ఇచ్చునపుడు ఉపదేశ శించునపుడు అన్నది (ఉప-దిశ్యతే ఇతి ఉపదేశః - సమీపమునను౦డి యియ్యఁబడు నది) = సమీపమునను౦డి ఇచ్చునపుడు, 'అచలాధిపతి' అచల = పర్వతములకు, అధిపతి=ప్రభువైన హిమాలయముయొక్క, కూర్మి యాడుబిడ్డ=గారాబు కూఁతురు. పార్వతీదేవి, పాలిండ్లు కదలంగన్ =పయోధరములు కదలునట్లు, పసపుఁ బయ్యెదన్= పసపంటిన పయటతో, వీచున్ = విసరును,

డుంఠి = డుంఠి విఘ్నేశ్వరుఁడు, ధూత్కార మొనరించి = 'ఘూ' అని ధ్వనిచేసి, తొండంబు మొక్కునన్ = తొండము కొసతో, 'శీకరాసారంబున్' శీకర = జలకణములయొక్క, ఆసారంబున్ = జల్లును, చిలుకున్ = చిందించును.

భాగీరథీ గంగ = భగీరథునిచేత శివ జటాజూటమునుండి పృథివికిఁ గొని రాబఁడిన దివ్యగంగ, ప్రత్యక్షమై వచ్చి = కరచరణాదులతో సాక్షాత్కారమై వచ్చి. మృదుల హస్తము = సుకుమారమైన చేతిని, చాఁచి = ప్రసరింపఁజేసి, మేను = శరీరమును, నివురున్ = నివురును - (పరిమార్జనము చేయును.)

'ప్రమథోత్తముఁడు' ప్రమథ = పారిషదులలో, ఉత్తముఁడు = శ్రేష్ఠుఁడైన, భృంగి = భృంగీశ్వరుఁడు, 'భయరక్షణార్థంబు భయ = భయమునుండి, రక్షణా ర్థంబు = రక్షించుటకొఱకు, ఫాలాగ్రమునన్ = నొసటిపైన-లలాటముపైన, భసిత రేఖన్ = విభూతి రేఖను-రక్షారేఖను, తీర్చున్ = దిద్దును.

తాత్పర్యము :- కాశిలో ప్రాణ నిర్యాణవేళయందు ప్రాణు లన్నియును కుడిచెవి మీఁదగునట్లు నేలపై వ్రాలిపోయి దీర్ఘ నిద్రకు మ్రాఁగన్ను పెట్టును. ఆ సమయములో పరమశివుఁడు సపరివారముగ విచ్చేసి ఆ ప్రాణుల కుడిచెవియందు ప్రణవోపదేశ మొనర్చును. శివుఁడు దగ్గఱ కూర్చుండి ప్రణవోపదేశము చేయు చుండఁగా అమ్మవారు వాత్సల్య క్షీరభరితములైన పయోధరములు కదలుచుండఁగా తన పసపు పయ్యెదతో ఆ ప్రాణికి అల్లన వీచుచుండును. డుంఠి మృత్యుభయము

పోవునట్లు 'ధూ'త్కరించుచు తన తొండపు కొసతో చల్లని నీటిజల్లు చిలుకుచుం డును. భాగీరథీ గంగ సాకారయై వచ్చి తన మృదుల పాణి తలముతో ఒడలెల్లను కలయ నివురుచుండును. ప్రమథోత్తముఁడైన భృంగీశ్వరుఁడు వచ్చి భయము తీరునట్లు నొసలిపై భసితరేఖను దీర్చుచుండును.

విశేషము :- బ్రదుకులోని యెల్ల అనుబంధములకు చివరి వీడ్కోలై మహా భయంకరమైన మృత్యువును, చరమవిశ్రాంతిని. ఇంత స్పృహణీయముగ చెప్పిన యింకొక కవి సంస్కృతాంధ్ర వాఙ్మయములలో లేఁడు.

మరణమను మలుసంజలో, దీర్ఘనిద్రారంభవేళలో, ప్రాకృతములైన అను బంధము లన్నియును క్రమక్రమముగా పొత మాసిపోవుచుండును. అందు మొద టిది ఈ లోకములో తన అస్తిత్వమునకు మూలకారణమైన తల్లి. ఆ పిమ్మట తోడఁ బుట్టినవాఁడు. ఆపైన పినతల్లి. అటుపైన ఆప్తసఖుఁడు. ఆపై తండ్రి. ఈవిధమైన ప్రాకృతానుబంధము లన్నియును శాశ్వతములైన దివ్యానుబంధములుగా మాఱుచున్న అద్భుత పరిణామము. ఈ పద్యములో మృత్యుభయమును దొలఁగించుచు లోకో త్తరముగ దర్శింపఁజేయఁబడినది. సకల జగజ్జననియైన హిమాచలనందనయే నిక్కమునకు కన్నతల్లి. డుంఠి విఘ్నేశ్వరస్వామియే అన్నగారు. గంగానదియే పినతల్లి. భృంగీశ్వరుఁడే ఆప్తసఖుఁడు. పరమశివుఁడే కన్నతండ్రి.

కాశీఖండముయొక్క పరమార్థమంతయును కావ్యమార్గమున పరమ స్పృహ ణీయముగ ఈ పద్యమునందు కన్నులకుఁ గట్టింపఁబడినది.

వ॥ అని వారణాసీపురంబు వర్ణించుచు. 54

అర్థము :- అని = ఈవిధముగా, వారణాసీపురంబున్ = కాశీనగరమును. వర్ణించుచు = స్తుతించుచు.

తే॥గీ॥ నృక్షశాఖాంచలంబుపై వ్రేలుచున్న
కోటిసంఖ్యల నేర్కావి గోవణములు
విఘ్నమృగములఁ బట్టంగ వేసినట్టి
చీర తెరలను సంస్మృతిఁ జిగురుకొలుపు ॥ 55

అర్థము :- 'వృక్షశాఖాంచలంబుపైన్' వృక్ష = చెట్ల యొక్క. శాఖా = కొమ్మలయొక్క, అంచలంబుపైన్ = అగ్రముపై, ప్రేలుచున్న=ప్రేలాడుచున్న. కోటి సంఖ్యల = అనేకములైన. 'నీర్కావి గోవణములు' నీర్కావి = (నీరు + కావి) ప్రతిదినము తడుపుచుండుటచేత ఎఱుపువన్నె పట్టిన, గోవణములు = కౌపీనములు. విఘ్నమృగములన్ = విఘ్నములే యనెడి లేళ్ళను, పట్టంగన్ = పట్టుకొనుటకుగాను, వేసినట్టి = ప్రేలఁగట్టిన. చీరతెరలను = తెరచీర లనునట్టి, సంస్మృతిన్ = తలఁపును, చిగురుకొలుపున్ = చిగురింపఁజేయును.

తాత్పర్యము :- చెట్లకొమ్మల కొనలపై ప్రేలుచున్న నీర్కావి వన్నెగల పెక్కు కౌపీనములు విఘ్నములను మృగములను పట్టుటకై వేసిన తెరచీరలను తలంపును జిగిరింపఁజేయుచుండెను.

సీ॥ ఎదుర లోపాముద్ర పదపద్మముల ముద్ర
సికతిలంబగునేలఁ జెలువు మిగుల
శ్యామాక మిష్టి యాజ్ఞార్థంబు మృగములు
ఋషికన్యకల రాక కెదురు చూడ
దేవార్చనా ధూప దివ్యగంధములచే
హోమధూమము తావి యుద్దివడయ
వటుఁజన స్వాధ్యాయ వర్ణసందేహంబు[1]
శారీశుకంబులు చర్చచేయఁ

తే॥గీ॥ కాశికా పట్టణమునకుఁ గ్రోశమాత్ర
గగన గంగాప్రవాహ నైకటిక భూమి
బ్రహ్మలోకమునకు ననుప్రాసమైన
కలశజుని పర్ణశాల డగ్గఱిరివారు ॥ 56

అర్థము :- ఎదురన్ = ఎదుట, 'లోపాముద్ర....ముద్ర' లోపాముద్ర = లోపాముద్రాదేవియొక్క. (లోపాముద్ర అగస్త్యమహాముని భార్య) పదపద్మముల ముద్ర = తామరపూవులవంటి అడుగుల జాడ, సికతిలంబగు = సికతామయమగు, (సికత = ఇసుక, సైకతము = ఇసుకతిన్నె) నేలన్ = భూమిపై, చెలువు మిగు

లన్ = అందగింపఁగా, 'శ్యామాకముష్టి యాచ్ఛార్థంబు' శ్యామాకముష్టి = పిడికెడు చామవడ్లను, యాచ్ఛార్థంబు = అడుగుటకొఅకై, మృగములు = లేళ్ళు. ఋషికన్యకల రాకకున్ = ఋషికన్యకలయొక్క రాకడకై. ఎదురుచూడన్ = ప్రతీక్షింపఁగా. 'దేవార్చనా ధూప దివ్యగంధములచేన్' దేవార్చనా = దేవపూజా సమయముల యందలి, ధూప = సాంబ్రాణి, మహిసాక్షి మొదలైన సుగంధధూపములచే. హోమ ధూమము = మేలిమిపొగ, ఉద్దిన్ = జతను, పడయన్ = పొందఁగా, 'వటుజన.... వర్ణసందేహంబు' వటుజన = బ్రహ్మచారులయొక్క. స్వాధ్యాయ = వేదపాఠముల యందలి, వర్ణ = ఉదాత్తానుదాత్తాదులయొక్క, సందేహంబున్ = సంశయమును. 'శారీశుకంబులు' శారీ = గోరింకలు. శుకంబులు = చిలుకలు. చర్చసేయన్ = విచారణ చేయఁగా, కాశికాపట్టణమునకున్ = కాశీపట్టణమునకు. క్రోశమాత్రన్ = కోసుమేరలో. 'గగన....భూమిన్' గగనగంగా = గగనమునుండి దిగివచ్చిన భాగీరథీ గంగయొక్క, ప్రవాహ = ప్రవాహమునకు. సైకటిక = నికటమైన - సమీపమైన, భూమిన్ = ప్రదేశమునందు, బ్రహ్మలోకమునకున్ = బ్రహ్మనివాసమైన సత్యలోకమునకు, అనుప్రాసమైన = పర్యాయమైన - ప్రతియైన, 'కలశజుని పర్ణశాలన్' కలశజుని = కలశమునుండి పుట్టిన అగస్త్య మహాముని యొక్క. పర్ణశాలన్ = పర్ణశాలను - ఆకులచేత కప్పఁబడిన యింటిని, వారు = ఆ దేవమునులు, దగ్గఱిరి = సమీపించిరి. (1 వర్ణసందోహము అని పాఠాంతరము)

తాత్పర్యము :- ఆ యాశ్రమములో ఒక పర్ణశాల యున్నది. ఆ పర్ణశాల ముందు ఒక సికతిలమైన ప్రదేశ మున్నది. ఆ యిసుకనేలపై పరమ సుకుమారములై తామరపూవులవలె నున్న లోపాముద్రాదేవి అడుగులు ఒత్తికొనుటవలన ఏర్పడిన గుర్తులున్నవి. ఆ పర్ణశాల కెదురుగా వచ్చుచున్న దేవమునులకు మునుముందుగా ఆ యడుగు జాడలే కనిపించినవి. ఆ పర్ణశాలముందు రెండువైపులను బారులఁతీర్చి లేళ్ళు ఎవరి రాకకో ఎదురుచూచుచున్నవి. ఆ త్రోవన ఋషికన్యకలు వత్తురు. వారిని శ్యామాకముష్టి (చామవడ్లను) అడుగవలయును. ఈ లేళ్ళ ప్రతీక్ష అందుకోసము. దేవార్చనాసమయ ప్రవర్తితములైన సుగంధ ధూపములతో, ఆజ్యగంధులైన వేలిమిపొగలు, హోమధూమములు, జత కట్టుచున్నవి. అవి ధూపములు. ఇవి ధూమములు. అర్చన ఆగమోక్తము. వేలిమి వేదోక్తము. అందువల్లనే ఈరెంటికిని జత కలుపుట. బ్రహ్మచారులకు స్వాధ్యాయ పాఠమునందు కలుగుచున్న ఉదాత్తాది స్వర సందేహములను గోరింకలు, చిలుకలు, విచారణచేసి తీర్చుచున్నవి.

మనుష్యబుద్ధి భ్రమ ప్రమల మధ్య ఊఁగిసలాడుచుండును. కావ్యన స్వరనిర్ణయ ములో యథాశ్రుతగ్రాహులగు శారీరుకములదే పైచేయి. ఆ యాశ్రమము కాశికా పట్టణమునకుఁ గోసెడు మేరలో గగనగఁగా ప్రవాహమునకు జేరువగా నున్నది. ఆ యాశ్రమము ఇంతకుముందు తాము దిగివచ్చిన బ్రహ్మనివాసమైన సత్యలోకము నకు అనుప్రాసముగా నున్నది. అనఁగా తామింకను సత్యలోకములో నున్నట్లే అనిపించుచున్నది. అట్టి అగస్త్యమహాముని పర్ణశాలను వారు సమీపించిరి.

విశేషము :- శ్రీనాథుని తెనుఁగు పలుకు నుడికారములో కాళిదాస భవ భూతి బాణ మయూరాది సంస్కృత మహాకవుల లలితపదబంధములు, భావములు, పడుగులో (నిలువు దారములలో) పేక (అడ్డదారములు)వలె విడఁదీయుటకు వీలు లేకుండునట్లు అల్లికపడి యుండును. ఈ పద్యములో ప్రకృతము-

'అభ్యున్నతా పురస్తాదవగాఢా జఘనగౌరవాత్పశ్చాత్
ద్వారేఽస్య పాండు సికతే పదపంక్తి ర్దృశ్యతేఽభినవా'

'యస్యత్వయా వ్రణవిరోపణ మింగుదీనాం తైలం న్యషిచ్యతముఖే కుశసూచివిద్ధే
శ్యామాక ముష్టి పరివర్ధితకోజహాతి సోఽయం నపుత్రకృతకః పదవీం మృగస్తే'

అను శాకుంతలములోని పదముద్రలు గోచరించుచున్నవి. మఱియును-

'అభ్యుత్థితాగ్ని పిశునైరతిథీ నాశ్రమోన్ముఖాన్
పునానం పవనోద్ధూతై ర్ధూమై రాహుతిగంధిభిః'

అను రఘువంశ వశిష్ఠాశ్రమములోని ఆజ్యగంధములు గూర్చ ఘ్రాణ తర్పణములగుచున్నవి. ఇంతేకాక- 'వటుజనస్వాధ్యాయ వర్ణసందేహంబు శారీరుకంబులు చర్చచేయఁ' శ్రీనాథుని శిష్యుఁడు తెనాలి రామకృష్ణకవి తన పాండురంగ కృతిలో- 'వీరె చలకాకపక్షమస్తకులు బ్రహ్మచారులు నిజహోమసౌరభేయీ తర్లకముల నీడల నిల్చి కాచి యున్నవారు సామోదిత స్వరసంశయము నొంది చిలుకకోయిల నిదె తేలియనడుగుచున్నవారు.' అన్నది యిచ్చటినుండియే యడిగి తెలిసికొనుచున్నట్లు తేటపడుచున్నది.

వ॥ అప్పుడు. అర్థము : అప్పుడు=ఆ సమయమునందు, 57

మ॥శివుఁడేదాత శివుండెభోక్త శివుఁడే చేయుస్ మఖాది క్రియన్
శివుఁడే విశ్వము నేశివుండ ననుచున్ జింతించుచున్ జాహ్నవీ
సవిధశ్రీఫల వృక్షవాటమున భస్మస్నాన శుద్ధాంగుడై
భవ! కాశీభవ! నీలకంఠ! యనుచున్ భావించుధన్యాత్మునిన్॥ 58

అర్థము:- దాత = ఇచ్చువాఁడు, శివుఁడే = శివునికంటె నింకొకఁడు లేఁడు, భోక్త = అనుభవించువాఁడు, శివుండె = శివునికంటె భిన్నుఁడు కాదు, 'మఖాదిక్రియల్' మఖ = యజ్ఞములు, ఆది మొదలైన, క్రియల్ = క్రియాకలాపములను, శివుఁడే = శివునికంటె వేఱుకానివాఁడే, చేయున్ = చేయును, విశ్వము = వసుధాది శివావసానము-ముప్పదియాఱు తత్త్వములుగా పరిదృశ్యమానమగుచున్న యీ విశ్వమంతయును, శివుఁడే = శివునికంటె వేఱైనదికాదు, నేన్ = 'నేను' అను-అభిజ్ఞకల నేను, శివుండను = శివుఁడను, అనుచున్ = ఈరీతిగా, చింతించుచున్ = నిదిధ్యాసాస్థితికలవాఁడై, 'జాహ్నవీ....వృక్షవాటమునన్' జాహ్నవీ = జహ్నుముని నందనయైన భాగీరథియొక్క, సవిధ = సమీపమునందున్న, శ్రీఫల వృక్ష = మారేడుచెట్లయొక్క, వాటమునన్ = వాటికయందు - తోపునందు, భస్మ స్నాన = భసితమయమైన స్నానముచేత-భస్మోద్ధూళనముచేత, శుద్ధ = పావనమైన, అంగుఁడై = శరీరముకలవాఁడై, భవ! = విశ్వప్రభవ కారణమా!, కాశీభవ!= కాశీవల్లభ డా!, నీలకంఠ! = నీలగ్రీవుఁడా!, అనుచున్ = అని పలుకుచు, భావించు = తన్మయీభావము నొందుచున్న, భవ్యాత్మునిన్ = శుభప్రదమైన ఆకారముగలవానిని, 'కనుంగొనిరి వారు' అను అరువదినాలుగవ పద్యములోని క్రియతో అన్వయము. ఆ పద్యము ఈ పద్యమునుండి ఏడవది కావున ఈ పద్య కదంబము 'కులకము'. సప్తభిఃకులకం'.

తాత్పర్యము:- 'ఇచ్చెడువాఁడు శివునికంటె నింకొకఁడు లేఁడు. అనుభవించెడివాఁడును శివునికంటె భిన్నుఁడు కాఁడు. యజ్ఞాది క్రియాకలాపమును నిర్వర్తించుచున్నదియును శివునికంటె అన్యుఁడు కాఁడు. భూమి మొదలుకొని శివునివఱకు ముప్పదియాఱు తత్త్వములుగా పరిదృశ్యమానమగుచున్న యీ విశ్వమంతయును శివునికంటె వేఱుకాదు. 'నేను' అను అభిజ్ఞతో వ్యవహరించుచున్న యీ నేనుకూడ శివుఁడనే'. ఈవిధమగు శివతత్త్వానుసంధానముతో గంగయొడ్డున నున్న

మారేడుచెట్ల తోపులో - ఓ విశ్వప్రభవ కారణమా! కాశీవల్లభా! నీలగ్రీవా! అని పలుకుచు తల్లీనభవమును భజించుచున్న భవ్యాత్మని- (వారు చూచిరి)

విశేషములు :- ఆగమములు ఇట్లు చెప్పుచున్నవి.

'శివోదాతా శివోభోక్తా శివస్సర్వ మిదంజగత్
శివో యజతి యజ్ఞైశ్చ యశ్శివ స్సోఽహమేవహి.'

తత్త్వము లివి :- పృథివి [1] జలము [2] తేజస్సు [3] వాయువు [4] ఆకాశము [5] గంధము [6] రసము [7] రూపము [8] స్పర్శ [9] శబ్దము [10] ఉపస్థ [11] పాయువు [12] పాదము [13] పాణి [14] వాక్కు [15] ఘ్రాణము [16] రసన [17] చక్షుస్సు [18] త్వచము [19] శ్రోతము [20] బుద్ధి [21] మనస్సు [22] అహంకారము [23] ప్రకృతి [24] పురుషుడు [25] కాలము [26] నియతి [27] రాగము [28] విద్య [29] కళ [30] మాయ [31] శుద్ధవిద్య [32] ఈశ్వరుడు [33] సదాశివుడు [34] శక్తి [35] శివుడు [36]. వీని సమాహారమే 'విశ్వము'.

భస్మస్నానము :- భస్మము రెండు విధములు. 1) మహాభస్మము 2) అల్ప భస్మము - మహాభస్మము - సాక్షాత్తు శివస్వరూపము. మాయావభాసకమైన పరమ శివతత్త్వమే మహాభస్మము.

మహాభస్మ మహాదేవో మహామాయావ భాసకః
భర్సనాత్ సర్వపాపానాం భాసనం తస్యవిద్యయా ॥
యస్య సాక్షాన్మహాభస్మ భాతి స్వాత్మతయా స్వతః
నతస్య భస్మనాకార్యం నజటాభిర్న చీవరైః ॥
యస్య భస్మ స్వతోభాతి స్వాత్మనా మునిపుంగవాః
నతస్య వర్ణ ధర్మేణ కార్యం నాశ్రమధర్మతః ॥
యస్య భస్మాత్మరూపేణ విభాతి పరయోగినః
నతస్య తపసాకార్యం నదానేన నచేజ్యయా ॥
యస్య సాక్షిస్వరూపేణ భస్మభాతి స్వయంప్రభం
నతస్య కార్యం వేదేన నచస్మృతి పురాణకైః ॥
యస్య భస్మద్విజాభాతి ప్రత్యగ్రూపేణ సంతతం
నతస్య కార్యం తీర్థేన నార్చనేన శివస్యతు ॥

భస్మ విజ్ఞాన సంపన్నో మహాయోగీ మహత్తరః
కృత కృత్యశ్చ మేధావీ కాకథా శివ ఏవసః ॥

(సూతసంహిత-యజ్ఞవైభవ ఖండము 30 అధ్యా.)

అల్పభస్మము - మూఁడు విధములు ;

శ్రౌతము (1) స్మార్తము (2) లౌకికము (3).

అగ్నిహోత్రాద్యనుష్ఠానమువలన నిష్పన్నమైనది శ్రౌతభస్మము.

బోధాయనాదిస్మృతి పురాణోక్తము స్మార్తభస్మము.

అన్యము లౌకికభస్మము. శ్రుతి స్మృతిపురాణములయందు భస్మస్నాన వైశిష్ట్యము పలువిధములుగా నిరూపింపఁబడినది.

'భాసకం భసితం చోక్తం భస్మ కల్మషభక్షణాత్
భూతిర్భూతికరం పుంసాం రక్షా రక్షాకరం పరం'. (శివపురాణము.)

భస్మమునకు భసిత మని, భస్మ యని, భూతి యని రక్ష యని నాల్గు పేర్లు. భాసింపఁజేయునది కావున 'భసితము'. కల్మషములను భక్షించును గావున 'భస్మము'. భూతిప్రదము (ఐశ్వర్యప్రదము) కావున 'భూతి'. రక్షాకరము కావున 'రక్ష'.

'భస్మస్నానం పునఃకుర్యాద్విధి వర్దేహశుద్ధయే
శోధ్య భస్మయథాన్యాయం ప్రణవేనాగ్నిహోత్రజం.
ఈశానేన శిరోదేశం ముఖం తత్పురుషేణ తు
ఉరోదేశ మఘోరేణ గుహ్యం నామేనసువ్రతాః
సద్యేనపాదౌ సర్వాంగం ప్రణవే నాభిషించయేత్
భస్మస్నానపరో విప్రో భస్మశాయీ జితేంద్రియః
సర్వపాప వినిర్ముక్త శ్శివసాయుజ్య మాప్నుయాత్ ॥ లింగపురాణము.

కం॥ రుద్రాక్ష భూతిముద్రా
ముద్రిత నిఖిలావయవుని ముక్తిపద శ్రీ
భద్రాసనస్థు లోపా
ముద్రాపరిపూర్ణ పార్శ్వ మునిపుంగవునిన్ ॥ 59

అర్థము :- 'రుద్రాక్షి....అవయవుని' రుద్రాక్ష = రుద్రాక్షములచేతను, భూతిముద్రా = భూతిలాంఛనములచేతను, ముద్రిత = చిహ్నితములైన, నిఖిల = సమస్తములైన, అవయవున్ = అంగములుగలవానిని, 'ముక్తిపదశ్రీభద్రాసనస్థు' ముక్తిపదశ్రీ = మోక్షపదవీలక్ష్మికి సంబంధించిన, భద్రాసనస్థున్=భద్రపీఠమునం దాసీనుఁడై యున్నవానిని, 'లోపాముద్రా పరిపూర్ణపార్శ్వున్' లోపాముద్రా = లోపాముద్రాదేవిచేత, పరిపూర్ణ = సనాథమైన, పార్శ్వున్ = పార్శ్వభాగము గల వానిని, మునిపుంగవునిన్ = మునిశ్రేష్ఠుని-

తాత్పర్యము :- ఆ మహాముని యొక్క సర్వాంగములును రుద్రాక్షముల తోను భసితలాంఛనములతోను ముద్రితములై యున్నవి. ఆయన మోక్షలక్ష్మీభద్రా సనాసీనుఁడై యున్నాఁడు. ఆయన ప్రక్కన లోపాముద్రాదేవి యున్నది. అట్టి ముని పుంగవుని (వారు చూచిరి).

మ॥నిజధామంబున శంభులింగము భవానీ దృక్కరంభంబు నం
బుజ గర్భాది సురేంద్ర వందిత పదాంభోజంబుఁ గల్పించి మం
త్రజపధ్యాన పరాయణుండగుచుఁ దత్పార్శ్వంబునన్ ద్వీపిరా
డజినాగ్రంబున నున్న పాశుపత విద్యారాజ్య పీఠస్థునిన్ ॥ 60

అర్థము :- 'నిజధామంబునన్' నిజ = తనయొక్క, ధామ-బునన్ = నివా సమునందు 'భవానీదృక్కరంభంబు' భవానీ = భవపత్నియైన పార్వతీదేవియొక్క, దృక్ = చూపులకు, కరంభంబున్ = లాజచూర్ణ సమ్మితమైన దధి ఖండమువంటిది యును, 'అంబుజగర్భాది....పదాంభోజంబున్' అంబుజగర్భ = పద్మసూతియైన బ్రహ్మ, ఆది = మొదలుఁగాగల, సురేంద్ర = దేవపతులచేత, వందిత = నమస్క రింపఁబడిన, పదాంభోజంబున్ = పాదపద్మములుగల, శంభులింగమున్ = శివ స్వరూపమేయైన లింగమును, కల్పించి = నిలిపి, 'మంత్ర....పరాయణుండగు చున్' మంత్రజప = మంత్రార్థభావనమును, (తజ్జప స్తదర్థభావనం' పాతంజలయో గ సూత్రము), ధ్యాన=విజాతీయ ప్రత్యయానంతరిత తైలధారావదవిచ్ఛిన్న సజాతీయ ప్రత్యయ పరంపరయును, పరాయణుండగుచున్ = పరాయణముగాఁ గలవాఁడగుచు, 'తత్పార్శ్వంబునన్' తత్ = ఆ శివలింగముయొక్క, పార్శ్వంబునన్ = ప్రక్కనే, 'ద్వీపిరాడజినాగ్రంబున నున్న' ద్వీపిరాట్ = వ్యాఘ్రరాజుయొక్క, అజిన =

చర్మముయొక్క. అగ్రంబునన్ = పైన. ఉన్న = ఆసీనుఁడైన. 'పాశుపత విద్యా రాజ్య పీఠస్థునిన్' పాశుపతవిద్యా = (పశుపతికి (శివునకు) సంబంధించినది పాశుపతము-శైవము) శైవజ్ఞానముయొక్క. రాజ్యపీఠస్థునిన్ = రాజ్యపీఠమునందున్న వానిని-

తాత్పర్యము :- నిజనివాసమునందే శివలింగమును నిలిపి ఆ లింగము ప్రక్కనే పులితోలుపైఁ గూర్చుండి మంత్రజపధ్యానపరాయణుఁడై యున్న శివజ్ఞాన మహారాజ్యపీఠస్థుఁడైనవానిని (ఆ దేవమునులు చూచిరి).

కం॥ పాటల జటాకిరీటు ల
లాటం తప స_ప్త స_ప్తి లలితమనోజ్ఞ
స్ఫాటిక మణిజపమాలా
వ్యాటీకత్క_ర సరోరుహాంగుళి పార్శ్వన్ ॥ 61

అర్థము :- 'పాటల జటాకీరీటు' పాటల = శ్వేతర క్తవర్ణములైన, జటా = జడల ముడియే. కిరీటున్ = కిరీటముగాఁ గలవానిని. 'లలాటం తప స_ప్త స_ప్తిన్' లలాటంతప = నొసలిని తపింపఁజేయుచున్న, స_ప్తస_ప్తిన్ = (స_ప్త = ఏడు. స_ప్తి = గుఱ్ఱములఁగలవాఁడు) సూర్యుఁడుగలవానిని. లలిత....అంగుళిపార్శ్వన్' లలిత = సుందరము, మనోజ్ఞ = మనోహరమునైన. స్ఫాటికమణి = స్ఫటికమణు లతోఁ గూర్చిన. జపమాలా = జపమాలయందు. వ్యాటీకత్ = ప్రసరించుచున్న. కరసరోరుహ = పాణి పద్మముయొక్క. అంగుళి పార్శ్వన్ = వ్రేళ్ళ ప్రక్క భాగము గలవానిని-

తాత్పర్యము :- పాటల వర్ణమైన జటాబంధమే కిరీటముగాఁ గలవాఁడు, ఫాలభాగముపైఁ బ్రసరించుచున్న సూర్యకిరణములు గలవాఁడు. స్ఫటికమణులతోఁ గూర్చిన జపమాలను వ్రేళ్ళతో ఆవర్తించుచున్న లలితములైన పాణి పద్మములు గలవాఁడును (అయిన అగస్త్యమహాముని వారు చూచిరి.)

కం॥ పంచబ్రహ్మాంబును శ్రీ
పంచాక్షరమును నఘోర పాశుపతంబున్

కించిత్ ప్రస్ఫురదధరో
ష్ఠాంచలముగ జపముసేయు నాదిమశైవున్ ॥ 62

అర్థము :- పంచబ్రహ్మంబును = సద్యోజాతాది పంచబ్రహ్మమంత్ర సము దాయమును. శ్రీపంచాక్షరమును = శ్రీ పంచాక్షరీ మంత్రంబును, అఘోర పాశు పతంబున్ = అఘోర పాశుపత మంత్రమును. 'కించిత్ ....అంచలముగన్' కించిత్ = కొంచెముగా. ప్రస్ఫురత్ = కదలుచున్న, అధరోష్ఠ = అధరోష్ఠముల యొక్క - క్రింది-పై పెదవులయొక్క. అంచలముగన్ = అంచులు కలుగునట్లు, జపముసేయు = జపించుచున్న. ఆదిమశైవున్ = ప్రథమ పాశుపతుని (అగస్త్య మహాముని)ని జూచిరి.)

తాత్పర్యము :- ఆ మహర్షి పెదవులు కొంచెము కదలుచున్నవి. ఉపాంశు జపములో నున్నాడు. ఆయన అనుసంధించుచున్నవి పంచబ్రహ్మ మంత్రములు. శ్రీ పంచాక్షరము, అఘోర పాశుపతము.

మ॥ అవధానంబున నప్పటప్పటికి భక్త్యావిష్టుడై పార్వతీ
ధవ! గంగాధర! నీలకంఠ! మదనధ్వంసీ! మహాదేవ! రు
ద్ర! విరూపాక్ష! భుజంగహార! యనుచున్ ధారాధరవ్యూహ సం
భవ గర్జారభటిన్ బఠించు పరమబ్రహ్మర్షి లేఖర్షభున్ ॥ 63

అర్థము :- అవధానంబునన్ = ఏకాగ్రతతో, అప్పటప్పటికిన్ = (అప్పటికిన్ + అప్పటికిన్) అప్పుడప్పుడు, 'భక్త్యావిష్టుడై' (భక్తి + ఆవిష్టుడై) భక్తి= భక్తిచేత, ఆవిష్టుడై = ఆవేశింపబడినవాడై, పార్వతీధవ ! = పార్వతీ వల్లభా !, గంగాధర !- గంగాకపర్దా !, నీలకంఠ ! = నీలగ్రీవా !, మదనధ్వంసీ ! = మదనాంతకా !, మహాదేవ = మహాదేవా !, రుద్ర = రుద్రా !, విరూపాక్ష ! = విరూపాక్షా !, భుజంగహార ! = భుజగభూషణా !, అనుచున్ = అని పలుకుచు, ధారాధర = మేఘములయొక్క. వ్యూహ = కదంబమునుండి, సంభవ = ఉదయించుచున్న, గర్జా= గర్జనముయొక్క, ఆరభటిన్ = ధ్వనితో, పఠించు = చదువుచున్న, పరమబ్రహ్మర్షి= పరములైన బ్రహ్మర్షులలో, లేఖర్షభున్ = ఇంద్రునివంటి వానిని (అగస్త్య మహర్షిని) జూచిరి.)

తాత్పర్యము :- ఆ పరమ బ్రహ్మర్షీంద్రుఁడు ధ్యానమధ్యములో అప్పుడప్పుడు భక్తి వెల్లువలై పొంగఁగా మేఘ స్తనిత గంభీరమైన కంఠధ్వనితో పార్వతీధవా! గంగాధరా! నీలకంఠా! మదనధ్వంసీ! మహాదేవా! రుద్రా! విరూపాక్షా! భుజంగహారా! అని పఠించుచుండెను.

సీ॥ అంతర్విలోకన వ్యాప్తి యుద్వాసించి
బాహ్యంబునకు దృష్టి పాఱవిడిచి
లీల రుద్రాక్షమాలిక దక్షిణశ్రవఃశష్కులీ శిఖయందు సంతరించి
పదిలంబుగా మున్ను పరిధవించిన యట్టి
నలినాసనంబు బంధము వదల్చి
వేదాగమపురాణ విద్యోద్భనములైన
పురమర్దన స్తోత్రములు పఠించు

తే॥గీ॥ యప్పుడప్పుడ యోగసమాధి యుడిగి
యధికశాంతిఁ బ్రసన్నాత్మ్కుఁడైనవానిఁ
బ్రణవ పంచాక్షరీమంత్ర పరమసిద్ధుఁ
గుంభ సంభవ మునిఁ గనుంగొనిరి వారు ॥ 64

అర్థము :- 'అంతర్విలోకనవ్యాప్తి' అంతర్విలోకన = లోఁజూపుయొక్క, వ్యాప్తి = ప్రసరణమును, ఉద్వాసించి = తొలఁగించి, బాహ్యంబురకున్ = వెలుపలికి - విషయ ప్రపంచమునకు, దృష్టి = చూపు, పాఱవిడిచి = ప్రసరించుటకై వదలి, లీలన్ = అలవోకగా, రుద్రాక్షమాలికన్ = రుద్రాక్షమాలను, 'దక్షిణశ్రవశ్శష్కులీ శిఖయందు' దక్షిణ = కుడిదియైన, శ్రవశ్శష్కులీ = (శ్రవః + శష్కులి) చక్కలమువంటి చెవియొక్క, శిఖయందున్ = అగ్రభాగమునందు, సంతరించి = అమరించి, పదిలంబుగా = దృఢముగా, మున్ను = పూర్వమునందు, పరిధవించినయట్టి = కూర్చినట్టి, నలినాసనంబు = పద్మాసనమునొక్క, బంధము= కూర్పును, వదల్చి = వదలించి, 'వేదాగమ... స్తోత్రములు' వేద = వేదములు, ఆగమ = ఆగమములు, పురాణవిద్యా = పురాణసంహితలు - వీనినుండి, ఉద్భవము

లైన = ఉద్భవించిన, పురమర్దన = త్రిపురాంతకునియొక్క, స్తోత్రములు = స్తుతులు, పఠించి, అప్పుడప్పుడు = అపుడపుడే, యోగసమాధి = యోగమునందలి యేకాగ్రతను, ఉడిగి = మాని, అధికశాంతిన్ = అధికమైన శాంతితో, 'ప్రసన్నాత్మకైనవానిన్' ప్రసన్న = నిర్మలమైన, ఆత్మకైనవానిన్ = అంతఃకరణము గలవానిని, 'ప్రణవ పంచాక్షరీమంత్ర పరమసిద్ధున్' ప్రణవ = ప్రణవస్వరూపమైన, పంచాక్షరీమంత్ర = పంచాక్షరీ మంత్రమునందు, పరమసిద్ధున్ = పరమమైన సిద్ధి గలవానిని, కుంభసంభవ మునిన్ = అగస్త్యమహాముని, వారు=ఆ దేవమునులు, కనుంగొనిరి = దర్శించిరి.

తాత్పర్యము :- ఆ మహర్షి సమాధిస్థితినుండియు పరమమును పొందుచున్న స్థితి యిందు వర్ణింపబడుచున్నది. ఆయన లోపలి చూపుయొక్క వ్యాపనమును క్రమముగ దొలగించి వెలుపలికి దృష్టిని పాఱవిడిచెను. రుద్రాక్షమాలికను అలవోకగా కుడిచెవి కొనకు దగిలించెను. మున్ను నిబిడముగా పదిలపఱిచిన పద్మాసన బంధమును నెమ్మెదిగా సడలించెను. వేదాగమపురాణ విద్యాసముద్భవములైన పురశాసనుని స్తోత్రములు పఠించెను. అప్పుడప్పుడే సమాధినుండి అమృతహ్రదమునుండి వలె వెలుపలికి వచ్చుటవలన ఆయన యింద్రియములు, మనస్సు నిర్మలములై పరమ ప్రశాంతములై యుండెను. ప్రణవ పంచాక్షరీమంత్ర పరమసిద్ధుడైన అట్టి యగస్త్యమహాముని వారు కనుగొనిరి.

తే॥గీ॥ జయజయధ్వను లెసఁగంగ సంయములును
నమరులును ప్రొక్కిరపు డమ్మహాత్మునకును
పిన్న పెద్దతనంబు రూపింపనీదు
శాంభవంబైన దివ్యతేజంబు మహిమ ॥ 65

అర్థము :- జయజయధ్వనులు = 'జయ! జయ!' అనెడి శబ్దధ్వనులు, ఎసఁగంగన్ = విజృంభింపఁగా, అపుడు = ఆ సమయమునందు, అమ్మహాత్మునకును = ఆ మహాత్మునకు, సంయములును = మునీశ్వరులును, అమరులును = దేవతలు కూడ, ప్రొక్కిరి = ప్రణామములు చేసిరి. శాంభవంబైన = శంభుసంబంధమైన, దివ్యతేజంబు = దివ్యతేజస్సుయొక్క, మహిమ = గొప్పదనము, పిన్న పెద్ద తనంబున్ = పిన్న-పెద్ద అను వయోభేదమును, రూపింపనీదు = చూడనీయదు - విచారింపనీయదు.

తాత్పర్యము :- ఆ సమయములో మునీశ్వరులు, దేవతలుగూడ జయ జయ ధ్వనులతో ఆ మహాత్ముని పాదములకు మొక్కిరి. శైవమైన తేజోవిశేషము వయోభేదమును ఆలోచనకు రానీయదు.

విశేషము :- విశేషముచేత సామాన్య వమర్థనమను ఈ యర్థాంతరన్యాసము

'నధర్మ వృద్ధేషు వయస్సమీక్షతే' అనెడి కాళిదాసోక్తిని

'గుణాః పూజాస్థానం గుణిషు నచలింగం నచవయః'

అన్న భవభూతి సూక్తిని తలఁపించుచున్నది.

వ॥ అగస్త్యుండును ప్రత్యుత్థానంబు చేసి యందఱకు నాతిథ్యసత్కా
రం బొనరించి సుఖాసీనులైనవారిం గుశలప్రశ్న పూర్వకం
బుగా నాగమనకారణం బడిగిన- 66

అర్థము :- అగస్త్యుండును = అగస్త్యమహర్షికూడ, ప్రత్యుత్థానంబు చేసి = (ప్రతి + ఉత్థానంబు) ఎదురుగా లేచి వెళ్ళి, అందఱకున్ = అందఱికి, ఆతిథ్య సత్కారంబొనర్చి = అతిథిసత్కారము చేసి, సుఖాసీనులైనన్ = సుఖముగాఁ కూర్చుండియుండఁగా, వారిన్ = వారిని, కుశలప్రశ్నపూర్వకంబుగాన్ = కుశల ప్రశ్నము ముందుగా, ఆగమనకారణంబు = వచ్చుటకు నిమిత్తమును, అడిగినన్ = అడుగఁగా-

తాత్పర్యము :- అ మునియును ప్రత్యుత్థానము చేసి వారందఱకు ఆతిథ్య సత్కారములు చేసి కుశలమడిగి వచ్చిన ప్రయోజన మడుగఁగా-

తే॥గీ॥ మునులు నమరులు నత్యంత వినయపరతఁ
దారు వచ్చిన కార్యమంతయును దెలుప
యావదర్థపదోక్తి విద్వాన్నికూథు
నాంగిరసుఁ బ్రార్థనము చేసి రధికభక్తి ॥ 67

అర్థము :- మునులున్ = మునులును, అమరులున్=దేవతలును, 'అత్యంత వినయపరతన్' అత్యంత = మిక్కిలియును, వినయపరతన్ = వినయపరులై, తారు = తాము, వచ్చిన కార్యము = వచ్చిన పని, అంతయున్ = సమస్తమును,

చెప్పన్ = అగస్త్యమునికిఁ జెప్పుటకై, 'యావదర్థ....నిరూఢున్' యావదర్థపద= అర్థమును కొలిచియుండు శబ్దములుగల, ఉక్తివిద్యా = వాక్యవిద్యయందు, నిరూఢున్ = ప్రసిద్ధుఁడైన, ఆంగిరసున్ = బృహస్పతిని, అధిక భక్తిన్ = అత్యంత భక్తితో, ప్రార్థనము చేసిరి = అభ్యర్థించిరి.

తాత్పర్యము :- మునులును, దేవతలును మిక్కిలి వినీతభావముతోఁ దాము వచ్చిన పనిని సమగ్రముగాఁ జెప్పుటకై యావదర్థపదమైన (అర్థమునకు మించని మాటలుగల) వాక్య విద్యయందు ప్రసిద్ధుఁడైన బృహస్పతిని అభ్యర్థించిరి.

విశేషము :- 'అథాంగిరసమగ్రణ్య ముదాహరణవస్తుషు
ఋషయశ్చోదయామాసుః ప్రత్యువాచస భూధరం'
కుమారసంభవము.

వ॥ బృహస్పతియు నమ్మహానుభావు నవలోకించి యిట్లనియె. 68

అర్థము :- బృహస్పతియున్ = బృహస్పతికూడ, అమ్మహానుభావున్ = ఆ మహానుభావుఁడైన అగస్త్యుని, అవలోకించి = చూచి, ఇట్లనియెన్ = ఇట్లు పలికెను.

తాత్పర్యము :- సుగమము.

— బృహస్పతి అగస్త్యునితో సంభాషించుట —

సీ॥ ధన్యాత్మకుండవు మాన్యుండ వెంతయుఁ
గృతకృత్యుఁడవు జగద్ధితకరుఁడవు
ప్రత్యగ్రమంబును బ్రతినగంబును బ్రత్య
రణ్యంబు శంసితవ్రతులు లే రె?
నీప్రతాపంబును నీప్రభావంబును
నీదు నౌదార్యంబు లేదు కానఁ
బ్రణవ పంచాక్షర బ్రహ్మవిద్యా మహో
పనిషత్తు నీపాణిపల్లవాగ్ర

తే॥గీ॥ మిట్టి నినువేఁడ వచ్చితి మిందఱమును
గమలగర్భుని యానతిఁ గాశిపురికి
భువన సంక్షోభకారియై పుట్టె నొక్క-
కడిఁదియుత్పాత మది నీవు గడపవలయు ॥ 69

అర్థము :- ధన్యాత్మకుండవు = పుణ్యాత్ముఁడవు, మాన్యుండవు - పూజింపఁదగినవాఁడవు, ఎంతయున్ = ఎంతైనను, కృతకృత్యుఁడవు = కృతార్థుఁడవు, జగద్ధితకరుఁడవు = లోకహితములను ఆచరించువాఁడవు, ప్రత్యాశ్రమంబును = ఎల్ల యాశ్రమములందును, ప్రతినగంబును = ఎల్లపర్వతములయందును, ప్రత్యరణ్యంబును=ఎల్లయరణ్యములయందును, శంసితవ్రతులు = తీక్ష్ణవ్రతులు, లేరె?= లేరా?, నీప్రతాపంబును = నీయొక్క ప్రతాపలక్షణము, నీ ప్రభావంబును = నీ తేజమును (దండకోశములవలన ఏర్పడు తేజమునకు ప్రభావమని పేరు.), నీదు సౌదార్యంబును = నీ మహత్త్వలక్షణమును, కానన్ = చూడఁగా, లేదు=కనిపించదు, 'ప్రణవ....ఉపనిషత్తు' ప్రణవ = ప్రణవస్వరూపమైన, పంచాక్షర = పంచాక్షరమనెడి, బ్రహ్మవిద్యా = బ్రహ్మవిద్యాప్రతిపాదకమైన, మహోపనిషత్తు = గొప్పయుపనిషత్తు, నీ పాణిపల్లవాగ్రము = నీ యరచేతిలోనిది, ఇట్టి నినున్ = ఇటువంటి నిన్ను, ఇందఱమును = ఇంతమందిమి, కమలగర్భుని యానతిన్ = బ్రహ్మదేవుని ఆజ్ఞచేత, కాశిపురికిన్ = కాశీపురమునకు, వేఁడవచ్చితిమి = వేఁడుకొనుటకై వచ్చితిమి, 'భువనసంక్షోభకారియై' భువన = లోకములకు, సంక్షోభకారియై= సంక్షోభము కలిగించునదియై, పుట్టెన్ = సంభవించెను, ఒక్క = ఒక, కడిఁది యుత్పాతము = గొప్ప యుపద్రవము, (ఉత్పాతము : త్రివిధము దివ్యము, అంతరిక్షము భౌమము, అపూర్వ గ్రహనక్షత్రములు పుట్టుట దివ్యము - ద్యులోకమునకు సంబంధించినది. పరివేషము, ఇంద్రధనుస్సు కలుగుట అంతరిక్షము - అంతరిక్షమునకు సంబంధించినది. అపూర్వములైన చరాచరములు కలుగుట భౌమము - భూమికి సంబంధించినది. ప్రకృతము వింధ్యమువలనఁ గలిగిన యుపద్రవము పృథివ్యంతరిక్ష ద్యులోకములు మూఁడింటికి సంబంధించినది కావున 'కడిఁది యుత్పాతము', అది = దానిని, నీవు = అగస్త్యుఁడవైన నీవు, కడపవలయున్ = కడచిపోవునట్లు చేయవలయును.

తాత్పర్యము :- నీవు ధన్యుఁడవు, మాన్యుఁడవు, కృతకృత్యుఁడవు, జగద్ధితములు చేయువాఁడవు, కొండ కొండకు, అడవి యడవికి, ఆశ్రమము ఆశ్రమము

నకు ఎంతమంది తీక్ష్ణవ్రతులు లేరు? నీ ప్రతాపము, నీ ప్రభావము, నీ యౌదార్యము ఎచ్చట నుండును? ప్రణవ పంచాక్షర బ్రహ్మవిద్యా మహోపనిషత్తు నీ అరచేతికోనిది. (అనఁగా తత్ప్రతిపాద్యుఁడైన శివుఁడు నీ చేతిలో నున్నాఁడని తాత్పర్యము.) ఇట్టి నిన్ను బ్రహ్మ యానతిచేత ఈ కాశికానగరమునకు వేఁడికొనుటకు ఇందఱము కట్టకట్టుకొని వచ్చినాము. సకల భువన సంక్షోభకరమైన ఒక మహోత్పాతము పుట్టుకొని వచ్చినది. అది తొలఁగిపోవునట్లు నీవు చేసిపెట్టవలయును.

విశేషము :- కార్యార్థుల ప్రసంగము లోకములో సరిగా నిట్లే యుండును.

వ॥ అని పలికి వాచస్పతి పుష్పంబునకు వాసనయుంబోలె నవినాభావ సంబంధంబున నమ్మహాముని కి సహధర్మచారిణియై అరుంధతికి సావిత్రికి అనసూయకు శాండిల్యకు సరస్వతికి లక్ష్మికి కుముకు శతరూపకు మేనకకు సునీతికి సంజ్ఞకు స్వాహాకుం దోడిజోడగు లోపాముద్ర వీక్షించి యిట్లనియె. 70

అన్వయము :- అని పలికి = ఇట్లు పలికి, వాచస్పతి = బృహస్పతి, పుష్పంబునకున్ = పూవునకు. వాసనయుంబోలె = పరిమళమువలె, అవినాభావ సంబంధంబునన్ = విభాభావములేని-విడిచియుండని, సంబంధంబునన్ = కలయికతో, అమ్మహాముని కిన్ = ఆ యగస్త్య మహాముని కి. సహధర్మచారిణియై = ధర్మపత్నియై. అరుంధతికి, సావిత్రికి, అనసూయకు, శాండిల్యకు, సరస్వతికి, లక్ష్మికి, ఉమకు, శతరూపకు, మేనకకు, సునీతికి, సంజ్ఞకు, స్వాహాకు, తోడిజోడగు - సమానమగు జతయైన. లోపాముద్రన్ = లోపాముద్రను, వీక్షించి = చూచి, ఇట్లనియెన్ = ఇట్లు పలికెను.

తాత్పర్యము :- సుగమము.

— బృహస్పతి లోపాముద్రతో పతివ్రతాధర్మంబులు ప్రస్తావించుట —

తే॥గీ॥ అమ్మ! కుశలంబె? సాధ్వి! యనామయంబె?
దేవి! భద్రంబె? లెస్సలా? పూవుబోఁడి!
సార పరమ పతివ్రతాచార వైభ
వాధి రాజ్యంబు జరగుచున్నదియె తరుణి? 71

అర్థము :- అమ్మ ! = అమ్మా ! కుశలంబె ? = కుశలమేనా ! సాధ్వి ! = సాధ్వీ !, అనామయంబె ? = (న + ఆమయము - అనామయము) ఆరోగ్యమేకదా ?, దేవీ ! = పూజ్యురాలా !, భద్రంబె ? = మంగళమేకదా ?, పూవుబోఁడి ! = సుకుమారురాలా !, లెస్సలా ? = మేలేకదా ?, 'సార ....రాజ్యంబు' సార = శ్రేష్ఠము, పరమ = సర్వాతిశాయియునైన, పతివ్రతాచార = పతివ్రతాచారముయొక్క, వైభవ = వైభవముతోఁ గూడిన, ఆధిరాజ్యంబు = ప్రభుత్వము, జరగుచున్నదియె = సాఁగుచున్నదా ? తరుణి = తరుణీ !

తాత్పర్యము :- సుగమము. ఇన్ని సంబోధనలు ఆదరాతిశయమును సూచించుచున్నవి.

సీ॥ ప్రాణేశుఁ డారగింపక భుజింపవు భర్త
నిద్రింపకయమున్న నిద్రవోవు
నాథుండు మేలుకొనక మున్న మేల్కాంతు
వైసేయ కెన్నఁడుఁ గదియ వధిపు
ధవుఁడు రోషితుఁడైన తజీవాడి యుండుదు
పతికి నెప్పుడు మాఱుపలుకవీవు
అధిపు నీఁగికి నల్పమనక సంతోషింతు
మొగమె త్తనేరవు మగని యెదురఁ

తే॥గీ॥ జెఱఁగు మాసిన మూన్నాళ్ళ సిగ్గుతోడఁ
బతి విలోకన మార్గంబుఁ బరిహరింతు
సవిత్రీఁ డుదయింప నాలాళ్ళ జలకమాడి
చూడ వెవ్వారిఁ బెనిమిటిఁ జూతుకాని ॥ 72

అర్థము :- ప్రాణేశుఁడు = (ప్రాణ + ఈశుఁడు) భర్త, ఆరగింపక = తినక, భుజింపవు = తినవు, భర్త = పెనిమిటి, (భరించువాఁడు - భర్త, భరింపఁదగినది భార్య) నిద్రింపకయమున్న = నిద్రించుటకు మునుపే, నిద్రవోవు = (నిద్రపోవు - గసడదవాదేశము, నిద్రింపవు, నాథుండు = ప్రాణనాథుఁడు, మేలుకొనక మున్న = మేలుకొనుటకు మునుపే, మేల్కాంతు(వు) = మేలుకొందువు, (హల్లు

పరముగా నున్నది కావున ఇచ్చట మధ్యమపురుష 'వు' వర్ణకమునకు లోపము)
కైసేయక = అలంకరింపక, ఎన్నఁడున్ = ఏనాఁడును, అధిపున్ = భర్తను,
కదియవు = చేరవు, ధవుఁడు = మగఁడు, రోషితుఁడైన తఱిన్ = రోషముగా
నున్న సమయమునందు, వాడియుండుదు = పరిమ్లానవై యుందువు-వడలియుందువు.
పతికిన్ = భర్తకు ఎప్పుడున్ = ఏ సమయమునందును, ఈవు = నీవు. మాఱు
పలుకవు = ఎదురాడవు, అధిపునీఁగికిన్ = భర్త యిచ్చినదానికి, అల్పమనక =
తక్కువ యనక. సంతోషింతు = సంతసింతువు. మగని యెదురన్ = పెనిమిటి
యెదుట, మొగమెత్తనేరవు = మోమెత్తుట యెఱుఁగవు. చెఱఁగు మాసిన మూన్నా
ళ్ళున్ = బహిష్ఠ అయిన మూఁడుదినములును. సిగ్గుతోడన్ = లజ్జతో. పతి = భర్త
యొక్క, విలోకనమార్గంబున్ = దర్శనపథమును. పరిహరింతు(వు) = తప్పించి
కొందువు. సవితృడుదయింపన్ = సూర్యుఁడుదయింపఁగా, నాల్నాళ్ళన్ = (నాలుగు+
నాళ్ళు) నాలుగు దినములకు, జలకమాడి = ఋద్ధిస్నానము చేసి. చూడవెవ్వారిన్ =
ఎవ్వరిని చూడవు, పెనిమిటిన్ = భర్తను, చూతుకాని = చూతువుకాని.

తాత్పర్యము :- లోపాముద్ర ఆలంబనముగా పతివ్రతల నడవళ్ళను ఉప
దేశించుటయే పురాణమునందలి యీ ప్రకరణముయొక్క యుద్దేశము. ఇవియన్ని
యును లోపాముద్రకు తెలియనివని బృహస్పతి నలువురియెదుటఁ జెప్పుటకాదు.

మ॥ పసపుం, గుంకుమ, కజ్జలంబు, నును గూర్పాసంబు, తాంబూలమున్
గుసుమంబుల్, కబరీభరంబు, చెవియాకుల్, మంగళాలంకృతుల్
విసువొక్కింతయు లేక తాల్పవలయున్ వీనిన్ సదాకాలమున్
ససి చక్కంగఁ బ్రియుండు వర్ధిలుటకై నాళీకపత్రాక్షికిన్ ॥ 73

అర్థము :- ససి=ఆరోగ్యము, చక్కంగన్=చక్కనగునట్లుగా, ప్రియుండు=
వల్లభుఁడు, వర్ధిలుటకునై = వృద్ధిపొందుటకై, 'నాళీకపత్రాక్షికిన్' నాళీకపత్ర =
తామరరేకులవంటి, అక్షికిన్ = కన్నులుగల కులస్త్రీకి. పసపున్ = హరిద్రయును,
కుంకుమ = కాశ్మీరజము, కజ్జలంబు = కాటుకయును, నును = మెత్తనైన,
కూర్పాసంబు = అవికయును. తాంబూలమున్ = వీడియమును, కుసుమంబుల్ =
పూవులును, కబరీభరంబు = క్రుమ్ముడియును, చెవియాకుల్ = చెవికమ్మలును,
మంగళాలంకృతుల్ = శుభప్రదములైన నగలును, వీనిన్ = వీనిని, సదాకాలమున్ =

ఎల్లకాలమును, విసుపు = నిర్వేదము, ఒక్కింతయున్ = ఒక కొంచెమైనను, లేక = లేకుండునట్లు, తాల్పవలయున్ = ధరింపవలయును.

తాత్పర్యము :- భర్త ఆరోగ్యవంతుడై పెంపొందుటకు మగనాలు ఏమాత్రమును విసువక పసుపు, కుంకుమ, కాటుక, మెత్తని బవిక, తాంబూలము, పువ్వులు, క్రుమ్మిడి, చెవికమ్మలు శుభప్రదములైన భూషణములు. వీనిని, ఎల్లకాలమును ధరించుచుండవలయును.

తే॥గీ॥ రజకితోడ నుదక్యతో శ్రమణతోడ
విధవతో నాథుతోరాయు వెలఁదితోడఁ
జెడిపితోడఁ బోరాములు సేయవలదు
ప్రాణసంకటములను బుణ్యాంగనలకు ॥ 74

అర్థము :- పుణ్యాంగనలకున్ = మగనాండ్రకు - కులస్త్రీలకు, ప్రాణసంకటములను = ప్రాణమునకు ఇబ్బంది తెచ్చు పరిస్థితులయందుఁగూడ, రజికితోన్ = చాకలిదానితో, ఉదక్యతోన్ = ముట్టుదానితో, శ్రమణతోడన్ = సన్న్యాసినితో, విధవతోన్ = పతివిహీనతో, నాథుతో రాయు వెలఁదితోడన్ = భరతో విరోధించెడు స్త్రీతో, చెడిపెతోడన్ = (చెడిన + ఆపె) చెడిపోయిన స్త్రీతో, పోరాములు= స్నేహములు. ('పోవచ్చు' అను క్రియకు వ్యతిరేకభావార్థకక్రియ 'పోరామి' బహువచనము 'పోరాము'లు) చేయవలదు = చేయరాదు.

తాత్పర్యము :- 'ప్రాణసంకటమైన పరిస్థితులలోఁగూడ' అనఁగా ఇట్టి స్నేహములవల్లనే ఇట్టి పరిస్థితులేర్పడు నని ఆంతర్యము.

సీ॥ పతి పిల్వఁబంచిన బనియేమి యని వచ్చి
చెప్పిన యుడిగంబు చేయవలయు
భర్త యానతి లేక ప్రకృతి బంధునకైన
నే పదార్థంబును నీఁగి చెట్ట
జీవితేశ్వరుఁడు డించిన యోగిరంబులు
కుత్ససేయక భుక్తి గొనఁగఁదగవు

సుఖసుప్తుఁడగు నిజేశునిఁ బ్రబోధ మొనర్పఁ
గా దనుష్ఠానభంగములఁ దప్ప

తే॥గీ॥ నొంటి నెచ్చోట కరుగుట యుక్తికాదు
తడుపు గట్టక నీరాడఁ దగవుకాదు
కడప మీఁదను మఱి సన్నెకంటిమీఁద
జక్కఁమీఁదను గూర్చుండ జాడగాదు ॥ 75

అర్థము :- పతి = పెనిమిటి. పిల్వఁబంచినన్ = పిలుచుటకు పంచినచో. పిలిపించినచో, పనియేమి యని వచ్చి = కృత్యమేమని చేరవచ్చి, చెప్పిన యుడిగంబున్ = చెప్పిన పనిని, చేయవలయున్ = చేయవలెను. భర్త యానతి లేక = భర్త ఆజ్ఞలేక. ప్రకృతిబంధునికైనన్ = జన్మబంధువుకైనను. ఏ పదార్థంబును = ఏ విధమైన పదార్థమును, ఈగి = ఇచ్చుట. చెట్ట = కీడు. జీవితేశ్వరుఁడు = ప్రాణేశ్వరుఁడు, డించిన = భుజించి వదలిన, ఓగిరంబులు=వంటకములు, కుత్ససేయక= ఏవగించికొనక, భుక్తిఁగొనఁగన్ = భుజింపఁగా. తగవు = ధర్మము. అనుష్ఠాన భంగముఁలఁ దప్పన్ = అనుష్ఠానమునకు భంగము కలుగునప్పుడు తప్ప. సుఖసుప్తుఁడగు = సుఖముగా నిద్రించియున్న. నిజేశునిన్ = ఆత్మవల్లభుని. ప్రబోధమొనర్పన్ = నిద్ర మేలుకొలుపుట, కాదు = కానిపని, ఒంటిన్ = ఒంటరిగా. ఎచ్చోటికిన్ = ఏచోటికిని. అరుగుట = వెళ్ళుట. యుక్తిగాదు = యోగ్యముకాదు, తడుపు గట్టక = వస్త్రము ధరింపక - దిగంబరముగా, నీరాడన్ = జలకమాడఁగా, తగవుకాదు = ధర్మముకాదు. కడపమీఁదను = దేహమీఁదను. మఱి=మఱియును. సన్నెకంటిమీఁదన్ = సన్నెకల్లుమీఁదను. జక్కఁమీఁదను = తిరుగలిమీఁదను. కూర్చుండన్ = కూర్చుండుట, జాడగాదు = విధముకాదు.

తాత్పర్యము :- సుగమము. మగనాంద్రు నిత్యజీవితములో పాటింపవలసిన విధులు, నిషేధములు వివరింపఁబడినవి.

కం॥ నాగరికత్వము వాచా
ప్రాగల్భ్యముఁ జూపఁదగదు పతిముందట; సం
భోగక్రీడా విభవో
ద్యోగంబులఁ దక్క సతికి నుత్పలనయనా! 76

అర్థము :- సతికిన్ =పతివ్రతకు, పతిముందటన్ =భర్తయెదుట, 'సంభోగ.... ఉద్యోగంబులఁ దక్క' సంభోగక్రీడా = రతికేళియందు. విభవ = వైభవ ప్రదర్శకములైన. ఉద్యోగంబులన్ = వ్యవసాయములయందు . ఉత్సవాదులయందు, తక్కన్ = తప్పించి, నాగరికత్వము = నాగరికత్వమును, వాచా = మాటలయందు, ప్రాగల్భ్యమున్ = ప్రౌఢతనమును, చూపఁదగదు = ప్రదర్శింపరాదు.

తాత్పర్యము :- రతివేళలయందును. విభవప్రదర్శకములై యింట జరిగెడి పెండ్లిండ్లు మొదలగు సందర్భములయందును తప్ప, పతియెదుట మగనాలు నాగరికత్వమును. మాటలలో ప్రౌఢఁదనమును ప్రదర్శింపరాదు. లోపలి ప్రవర్తనము వెలుపలి ప్రవర్తనము దేశకాలముల ఔచిత్యమునుబట్టి నడుపవలయుననుట;

కం॥ ఇది ధర్మం బిది యీలువు
ఇది వ్రత మిది సద్వివేక మిది యాచారం
బిది దేవపూజ యిది పతి
యుదితంబాలంబు సేయకుండుట సతికిన్ ॥ 77

అరము :- సతికిన్ = పతివ్రతకు, పతి = భర్తయొక్క, ఉదితంబు = మాటను, ఆలంబుసేయకుండుట = ఉపేక్ష చేయకుండుట. ఇది = చెప్పఁబోవునది. ఇది = ఇదియే. ధర్మంబు = ధర్మము. ఇది = ఇదియే. ఈలువు=పాతివ్రత్యము. ఇది = ఇదియే, వ్రతము = వ్రతాచరణము. ఇది = ఇదియే. సద్వివేకము = మేలి వివేకము, ఇది = ఇదియే. ఆచారంబు = సదాచారము, ఇది = ఇదియే, దేవపూజ= దేవతలను పూజించుట-

తాత్పర్యము :- భర్త చెప్పిన మాటను ఉపేక్ష చేయకుండుటయే పతివ్రతయైన స్త్రీకి-ఇదియే ధర్మము. ఇదియే పాతివ్రత్యము. ఇదియే వ్రతాచరణము. ఇదియే సద్వివేకము, ఇదియే సదాచారము, ఇదియే దేవపూజ.

కం॥ కాఁతుఁడు సంతోషించిన
సంతోషింపంగవలయు సతి కతఁడాత్మన్
సంతాపించిన పట్టున
సంతాపింపంగ వలయు జలజేక్షణకున్ ॥ 78

అర్థము :- సతికిన్ = పతివ్రతయైన స్త్రీకి, కాంతుఁడు = ప్రియుఁడు, సంతోషించినన్ = సంతోషించినచో, సంతోషింపంగవలయున్ = సంతోషింప వలయును, అతఁడు = భర్త, ఆత్మన్ = మనస్సునందు, సంతాపించిన పట్టునన్ = సంతాపమునొందిన సందర్భమునందు, జలజేక్షణకున్ = భార్యకు, సంతాపింపంగ వలయు = సంతాపపడవలయును.

తాత్పర్యము :- భర్త సంతోషమే తన సంతోషము, అతని సంతాపమే తన సంతాపముగా, హృదయములొక్కటియై పతివ్రతయైన స్త్రీ మనవలయును.

వ॥ కొందఱు కులటలు పతి దురవస్థఁబొందిన దెవ్వులుపడిన శృం ఖలాబద్ధు డైనను బరిత్యజింతురు. కొందఱు దుష్టమతులగు సతులు లేమింగొతుకుపడిన భర్త నధిక కార్పణ్యంబు పచరించి సర్పిర్లవణ తైలతండులాదులకై సిబ్బితి వఱుతురు. కొంద ఱిచ్ఛావతులు ప్రియుండు తమకు నేమి యిచ్చిన మెచ్చక హెచ్చుకుందాడుదురు. కొందఱు వరాకులు ఏకాకినులై మగని మొఱఁగి యెక్కడికేనియుం జనుదురు. కొందఱు దుశ్శీల లశ్లీల వాక్యంబుల నందందఁ బ్రియుని ముందట మండెమేలుబునం బ్రేలుదురు. ఇందఱు నాథునిం గులుబువారిని నరకంబునం ద్రోచి తారును నంద కూలుదురు. 79

అర్థము :- కొందఱు కులటలు = కొందఱు స్వైరిణులు - స్వేచ్ఛావర్తనలు, పతి = భర్త, దురవస్థఁబొందినన్ = (దుర్ + అవస్థ) దుర్దశను పొందినను, దెవులుపడినను = వ్యాధిగ్రస్తుఁడైనను, శృంఖలాబద్ధుండైననున్ = సంకెళ్ళచేత బంధింపఁబడినను, పరిత్యజించెదరు = విడిచిపెట్టెదరు, కొందఱు దుష్టమతులైన స్త్రీలు = దుర్బుద్ధులైన స్త్రీలు, లేమిన్ = పేదఱికముచేత, కొతుకుపడిన భర్తన్ = సంకోచపడిన భర్తను, అధిక కార్పణ్యంబు = అధికమగు దైన్యమును, పచరించి = ప్రదర్శించి, సర్పిర్లవణ....తండులాదులకై' సర్పిః = నేయి, లవణ = ఉప్పు, తండుల = బియ్యము, ఆదులకై = మొదలగు పదార్థములకై, సిబ్బితి వఱుతురు = సిగ్గుపడునట్లు చేయుదురు, కొంత ఱిచ్ఛావతులు = కొందఱు కాంక్షలుగల స్త్రీలు,

ప్రియుండు = భర్త, తమకున్ = తమకు, ఏమి యిచ్చినను = ఎట్టి పదార్థము లిచ్చినను, మెచ్చక = సంతసింపక, హెచ్చుకుందు = హెచ్చుతగ్గు మాటలను, (ఎక్కువ తక్కువలను మాటలను) ఆడుదురు = పలుకుదురు, కొందఱు వరాకులు = కొందఱు నిర్భాగ్య స్త్రీలు, ఏకాకినులై = ఒంటరులై, మగనిన్ = భర్తను, మొఱంగి = మోసగించి, ఎక్కడికేనియున్ = ఎచ్చటికైనను, చనుదురు = పోయెదరు, కొందఱు దుశ్శీలలు = కొందఱు చెడుస్వభావముగల స్త్రీలు, అశ్లీలవాక్యంబులన్ = అసభ్యపు మాటలతో, అందంద = మాటిమాటికి, ప్రియుని ముందటన్ = ప్రియుని యెదుట, మందెమేలంబునన్ = మితిమీఱిన చనవుతో, ప్రేలుదురు = ప్రలాపములు చేయుదురు - ప్రలాపింతురు, ఇందఱున్ = ఇన్నివిధముల స్త్రీలును, నాథునిన్ = భర్తను, కులంబువారిని = వంశసంజాతులను, నరకంబునన్ = నరకమునందు, త్రోచి = కూలఁదోసి, తారును = తామును, అంద = ఆ నరకమునందే, కూలుదురు = కూలిపోయెదరు.

తాత్పర్యము :- అన్వయమార్గమున పతివ్రతల లక్షణములను నిర్దేశించి వ్యతిరేకమార్గమున ఇతర స్త్రీలక్షణములను గొన్నింటిని చెప్పుచున్నాఁడు. కొందఱు స్వేచ్ఛావర్తనముగల స్త్రీలు భర్త దుర్బలపాలైనంతలో, వ్యాధిగ్రస్తుఁడైనంతలో, చెఱసాలలో నున్నంతలో విడిచిపెట్టుదురు. మఱికొందఱు దుర్బుద్ధులైన స్త్రీలు భర్తలు పేదఱికముతో క్రుంగియున్న పరిస్థితిలో అధిక దైన్యమును ప్రదర్శించి ఉప్పు, పప్పు, బియ్యములకై వేధించి మఱింత సిగ్గుపఱుతురు. కొంకీలు మిక్కుటముగాఁ గల కొందఱు స్త్రీలు భర్త యెంత యిచ్చినను సంతృప్తిపడక ఎక్కువ తక్కువ మాటలు పలుకుదురు. కొందఱు నిర్భాగ్యులు, ఒంటరులై భర్తను వంచించి యెచ్చటికైనను పోవుదురు. మఱికొందఱు దుశ్శీలలైన స్త్రీలు అశ్లీలములు పలుకుటకు మొగమోడక పతులముందు మందెమేలపు మాటలు ప్రేలుచుందురు. ఇన్ని తెగల స్త్రీలును తుదకు భర్తను, ఉభయ కులములవారిని నరకమునఁ గూలఁద్రోసి తామును అందే కూలిపోయెదరు.

సీ॥ చీకటితప్పు చేసిన సరోరుహనేత్ర
గూబయై చరియించుఁ గోటరమున
వింతవానిఁ గటాక్షవీక్షణంబునఁ జూచు
కిసలయోష్ఠి వహించు గిల్లకన్ను

మగఁడు తన్నొత్తిన మార్నొత్తు నలివేణి
వ్యాఘ్రియై చరియించు వనములోనఁ
జిఱుతిండి తనవారి మొఱఁగి యాహారించు
నతివ సూకరజాతియందుఁ బుట్టు
తే॥గీ॥ నధిపుఁ గోపించి హుంకార మాచరించు
పడఁతి మూఁగౌను సవతి సౌభాగ్యలక్ష్మిఁ
జూడఁజాలక మదిలో నసూయసేయు
భామ దుర్భగయగు నన్యభవమునందు ॥ 80

అర్థము :- చీఁకటితప్పు = జారత్వమును, చేసిన = చేసియున్న, సరో రుహనేత్ర = పద్మనేత్ర, గూబయై = గ్రుడ్లగూబయై, కోటరమునన్ = చెట్టు తొఱ్ఱి యందు, చరియించున్ = వర్తించును.

వింతవానిన్ = పరపురుషుని, కటాక్షవీక్షణంబుననన్ = క్రేఁగంటిచూపుతో, వీక్షించు = చూచునట్టి, కిసలయోష్ఠి = (కిసలయ + ఓష్ఠి) చిగురుమోవి గల స్త్రీ, గిల్లకన్ను = మెల్లకన్ను, వహించున్ = తాల్చును.

మగఁడు = భర్త, తన్ = తన్ను, మొత్తినన్ = కొట్టినచో, మార్నొత్తు = తిరిగికొట్టెడి, అలివేణి = భ్రమరవేణి, వ్యాఘ్రియై = ఆడుపులియై, వనములో నన్ = అడవిలోపల, చరియించున్ = తిరుగుచుండును.

తనవారిన్ = స్వజనమును, మొఱఁగి = మోసగించి, చిఱుతిండిన్ = ఉపా హారమును, ఆహారించు = ఆరగించెడి, అతివ = స్త్రీ, సూకరజాతియందున్ = వరాహజాతియందు, పుట్టున్ = జన్మించును. అధిపున్ = భర్తను, కోపించి = కోపపడి, హుంకారమాచరించు='హుం' అని గద్దించెడి, పడతి = స్త్రీ, మూఁగౌను = మూఁగయై పుట్టును, సవతి = సపత్నియొక్క, సౌభాగ్యలక్ష్మిన్ = సౌభాగ్యసంప దను, జూడఁజాలక = చూచి సహింపలేక, మదిలోన్ = మనస్సులో, అసూయ సేయు = గుణములయందు దోషములను ఎక్కించెడి, భామ = కోపస్వభావము గల స్త్రీ, అన్యభవమునందున్ = ఇంకొక జన్మయందు, దుర్భగ యగును దౌర్భాగ్యవతి యగును.

తాత్పర్యము :- దుష్కర్మముల పరిపాకము లెట్లుండునో చెప్పుచున్నాఁడు. చీఁకటితప్పు చేసిన స్త్రీ గ్రుడ్ల గూబయై పుట్టి చెట్టు తొఱటలో వసించును. వింతవానిని

కటాక్షముగా జూచు మెల్లకన్నుతో జన్మించును. మగడు తన్ను కొట్టగా తిరిగి కొట్టెడి స్త్రీ ఆడుపులియై అడవిలో తిరుగును. తనవారికి పెట్టక మోసగించి చిటు తిండి తినెడు స్త్రీ. సూకరజాతిలో పుట్టును. భర్తపై గోపించి హుమ్మని గద్దించెడు స్త్రీ మూగదియై పుట్టును. సవతి సౌభాగ్యసంపద చూచి యోర్వలేక గుణములపై దోషము లారోపించెడు స్త్రీ మఱుజన్మలో దౌర్భాగ్యవతి యగును.

ఉ॥ దూరముపోయి యెండబడి దూసిలివచ్చిన ప్రాణనాథునిన్
ద్వారకవాట దేహళులదాక నెదురొక్కని తీర్థమార్చి యా
హారముపెట్టి వీడ్యము సమర్పణచేసి విహారశయ్యపై
నూరువులొత్తి చిత్తమునకుబ్బినరించుట ధర్మమింతికిన్ ॥ 81

అర్థము :- దూరముపోయి = దూరమువెళ్ళి. ఎండబడి = ఎండలోపడి, దూసిలి = దప్పికగొని, వచ్చిన = ఇంటికి వచ్చిన, ప్రాణనాథునిన్ = ప్రాణవల్లభుని, 'ద్వార....దాక' ద్వార = గృహద్వారము, కవాట = వెలుపలితలుపు-తోరణ ద్వారమునొక్క తలుపు. దేహళులదాక = మండిగములవఱకు, ఎదురొక్కని = ఎదురువెళ్ళి, తీర్థమార్చి = జలకమాడించి, ఆహారము పెట్టి = భోజనము పెట్టి, వీడ్యము = వీడియము, సమర్పణచేసి = సమర్పించి, విహారశయ్యపై = కేళిసెజ్జపై, ఊరువులొత్తి = ఊరుసంవాహనము చేసి, చిత్తమునకున్ = మనస్సునకు, ఉబ్బినరించుట = ఉత్సాహము కలిగించుట, ఇంతికిన్ = ఇల్లాలికి, ధర్మము = విధి.

తాత్పర్యము :- దూరముపోయి యెండలోపడి దప్పికగొని యింటికిఁ జేరిన ప్రాణవల్లభునికి వీధిగడప వఱకు నెదురువెళ్ళి లోనికి తెచ్చి, జలకము లాడించి భోజన మారగింపఁజేసి, మనఃప్రియముగ తాంబూలము సమర్పణచేసి విహార శయ్యపై విశ్రమించుచుండఁగా, ఊరుసంవాహనము చేసి మనస్సున కుత్సాహము కలిగించుట ఇల్లాలికి ధర్మము.

తే॥గీ॥ తగవు పాటించి యల్పంబు తండ్రి యిచ్చు
నల్ప మల్పంబ భ్రాతయు నాత్మజుండు
ప్రార్థితంబైన ధన మెంతయైన నిచ్చు
ప్రాణనాథుని సరియె యేబంధువుల ను? 82

అర్థము :- తగవు = ధర్మమును, పాటించి = పరిగణించి, అల్పంబు = అల్పధనమును, తండ్రి = కన్నతండ్రి, ఇచ్చుక్ = ఇచ్చును, భ్రాతయును = సోదరుఁడును, అత్మజుండున్ = కన్నకొడుకును, అల్పమల్పంబ = అల్పాల్పధనమే. ప్రార్థితంబైన ధనము = కోరిన ధనము, ఎంతయైనన్ = ఎంతైనను, ఇచ్చు = ఇచ్చునట్టి, ప్రాణనాథుని సరియె ? = భర్తకు సమానమా ? ఏ బంధువులును = ఏ బంధువులయినను-

తాత్పర్యము :- స్త్రీకి ధర్మము పాటించి తండ్రి యిచ్చు ధనము స్వల్పము. సోదరుఁడును, కొడుకును అల్పము అల్పముగానే యిత్తురు. కోరిన ధన మెంతయైనను గాదనక యిచ్చు భర్తకు ఏ బంధువులును సరియగుదురా ?

సీ॥ ఓర్పుమై నుప్పిడి యుపవాసముండనీ
మగనాలి సరిపోల్పఁదగదు విధవ
తిరిగి నానా పుణ్యతీర్థంబులాడనీ
మగనాలి సరిపోల్పఁదగదు విధవ
సమధికంబగు నిష్ఠజపములు సేసిన
మగనాలి సరిపోల్పఁదగదు విధవ
సద్భక్తి దేవతార్చనము సేయంగనీ
మగనాలి సరిపోల్పఁదగదు విధవ

తే॥గీ॥ నిద్రమేల్కాంచి రేపాడి నియమపరత
నహిమభానుఁ వీక్షింపని యటకమున్న
తగదు వీక్షింప నరుణకుఁ దల్లివదిని
నత్తగారిని దప్పించి యన్యవిధవ ॥ 83

అర్థము :- ఓర్పుమైన్ = సహనముతో, ఉప్పిడి = (ఉప్పు + ఇడి) ఉప్పును పరిత్యజించి, ఉపవాసము = వ్రతార్థమైన నిరాహారస్థితిలో, ఉండనీ = ఉండనిమ్ము, విధవ = గతభర్తృక, మగనాలిసరి = పుణ్యస్త్రీకి సాటిగా, పోల్పఁదగదు = పోల్చుటకు - అర్హురాలు గాదు.

తిరిగి = పర్యటనముచేసి. 'నానాపుణ్యతీర్థంబుల' నానా = పలువిధములైన, పుణ్యతీర్థంబులు = పుణ్యతీర్థములయందు, ఆడనీ = స్నానమాడనిమ్ము. విధవ = గతభర్తృక. మగనాలిసరి = పుణ్యస్త్రీకి సాటిగా. పోల్పఁదగదు = పోల్చుటకు - అర్హురాలు గాదు.

సమధికంబు = అత్యధికమైన నిష్ఠతో. జపములు = జపములను. చేసినన్ = చేసినప్పటికి. విధవ = గతభర్తృక, మగనాలిసరి = పుణ్యస్త్రీకి సాటిగా. పోల్పఁదగదు = పోల్చుటకు - అర్హురాలు గాదు.

సద్భక్తిన్ = శ్రేష్ఠమగు భక్తితో. దేవతార్చనము = దేవతలయొక్క పూజ, సేయంగనీ = చేయనిమ్ము. విధవ = గతభర్తృక. మగనాలిసరి = పుణ్యస్త్రీకి సాటిగా. పోల్పఁదగదు = పోల్చుటకు - అర్హురాలు గాదు

నిద్రమేల్కాంచి = నిద్ర మేలుకొని, రేపాడి = ప్రొద్దుననే. నియమపరతన్ = నియమనిష్ఠతో. అహిమభానున్ = వేఁడి మయూఖములు గలవానిని - సూర్యుని. వీక్షింపనియటకమున్న = చూడకమునుపే, నరునకున్ = జనునకు. తల్లిన్ = తల్లిని. వదినెన్ = వదినెగారిని. అత్తగారిని = భార్య తల్లిని. తప్పించి= విడిచి. అన్యవిధవన్ = వేఱొక గతభర్తృకను. తగదు వీక్షింపన్ = చూడరాదు.

తాత్పర్యము :- పుణ్యస్త్రీల వైశిష్ట్యమును నిరూపించుటకు ఇది యింకొక వ్యతిరేకమార్గమేకాని గతభర్తృకను కించపఱుచుట తాత్పర్యము కాదని యెఱుఁగుట మేలు.

క్షారలవణములు (ఉప్పు, కారము) పరిత్యజించి యుపవాసములు చేసివను, దేశమంతయును దిరిగి వివిధ పుణ్యతీర్థములలో మునిఁగినను, అత్యధిక నిష్ఠతో జపములు చేసినను, భక్తితో దేవార్చనలు చేసినను భర్తృమతియైన స్త్రీతో గత భర్తృకయైన స్త్రీ సరికాదు.

నిద్రమేల్కొని ప్రాతఃకాలము నియమనిష్ఠలతో సూర్యదర్శనము చేయక మునుపు తల్లి, వదినె, అత్తగారు కాక వేఱొక గత భర్తృకను చూడరాదు. గత భర్తృకను పావనత్వములో 'గంగాసమానురాలు' అనుట ఇచ్చట గుర్తుంచికొన వలయును,

ఉ॥ జీవముతోడఁ బాసి యశుచిత్వముఁ బొందిన మేను గంధతో
యావబృథాభిషేకము సహస్రఘటంబుల నాచరించినన్

బావనమౌనె? యట్లు పతిఁబాసి వితంతున నొందినట్టి రా
జీవదళాయతాక్షి యశుచిత్వము వాయదు వేయిభంగులన్ ॥ 84

అర్థము :- జీవముతోడఁబాసి = ప్రాణముతో నెడఁబాసి, అశుచిత్వము = అపవిత్రతను, బొందిన = పొందిన, మేను = శరీరము, 'గంధ....అభిషేకము' గంధతోయ = సుగంధజలములతో, అవబృథ = దీక్షాంతమునందలి, అభిషేకము = మంత్రపూతమైన స్నానము, సహస్రఘటంబులన్ = వేయి కడవలతో, ఆచరించినన్ = చేసినప్పటికి, పావనమౌనె = పవిత్రమగునా?, అట్లు = ఆవిధముగానే, పతిన్ = భర్తను, పాసి = ఎడఁబాసి, వితంతుతన్ = మంగళసూత్రము లేమిని, ఒందినట్టి = పొందియున్న, 'రాజీవదళాయతాక్షి' రాజివదళ = తామరరేకులవలె, ఆయత = విశాలములైన, అక్షి = కన్నులుగల స్త్రీ, అశుచిత్వమున్ = అపవిత్రతను, వేయిభంగులన్ = వేయి విధములనైనను, పాయదు = విడువదు.

తాత్పర్యము :- జీవ విరహితమైనంతనే అపవిత్రమైన శరీరము సుగంధ సలిలపరిపూర్ణములైన సహస్ర ఘటములతో అవబృథస్నానము చేయించినను పవిత్రమగునా? ఆ రీతిగానే పతివిరహితయై మంగళసూత్రములేని స్త్రీ, వేయివిధములైనను తన అపవిత్రతను పాయనేరదు.

తే॥గీ॥ ప్రియము గలిగిన నంగీకరింపవలదు
ముండదీవన రేపాడి మోముఁజూచి
బైసిమాలిన పరమ నిర్భాగ్యురాలు
విధవ దాని యాశీస్సును విషసమంబు ॥ 85

అర్థము :- ప్రియముగలిగినన్ = ప్రీతి యున్నప్పటికి, రేపాడి = ప్రాతఃకాలమునందు, మోముఁజూచి = ముఖదర్శనము చేసి, ముండదీవనన్ = గతభర్తృక ఆశీర్వాదమును, అంగీకరింపవలదు = కైకొనరాదు, 'బైసి....నిర్భాగ్యురాలు' బైసిమాలిన = గౌరవముమాలిన, పరమ నిర్భాగ్యురాలు = మిక్కిలి భాగ్యహీనురాలు, విధవ = గతభర్తృక; దాని యాశీస్సును = ఆమె ఆశీస్సుకూడ, విషసమంబు = విషముతో పమానమైనది.

తాత్పర్యము :- ఎంతటి ప్రేమయున్నను ప్రొద్దుననే ముఖముచూచి విధవ

ఆశీస్సును అంగీకరింపవలదు. గౌరవములేని భాగ్యహీనురాలు. ఆమె ఆశీస్సుకూడ విషముతో సమానము.

విశేషము :- మూల కాశీఖండములో 'తదాశిషమపి ప్రాజ్ఞః త్యజేదాశీవిషోపమాం' అని యున్నది. కాని ముప్పదియాఱు శ్లోకములుగల (పతివ్రతాధ్యాయము 71_106) ఈ ఘట్టములో ఇట్టివి రెండు మూడు మాత్రమే కలవు. శ్రీనాథుఁడు వానిని తెనిఁగించి మిగిలినవి విడిచిపెఁడు. ఆ మిగిలినవానిలో విధివశమున వైధవ్యము ప్రాప్తించి యనుగమనము చేయని స్త్రీ ఆచరింపవలసిన తీర్థస్నాన, దాన, పూజా, తర్పణాదులు నిర్దేశింపఁబడి యున్నవి. నిషిద్ధములు చెప్పఁబడినవి.

ఆ ఘట్టము ముగింపులో నిట్లున్నది-

'అపృష్ట్వాతు సుతాన్ కించిన్న కుర్యాత్పతిదేవతా
ఏవంచర్యాపరా నిత్యం విధవాపి శుభామతా ॥ అధ్యా. 4 - శ్లో. 104

ఏవంధర్మ సమాయుక్తా విధవాపి పతివ్రతా
పతిలోకానవాప్నోతి నభవేత్ క్వాపిదుఃఖభాక్ ॥ 105

న గంగయా తయాభేదో యానారీ పతిదేవతా
ఉమా శివసమా సాఽత్తస్మాత్తాం పూజయేద్బుధః ॥ 106

ఇంత ముఖ్యములైన శ్లోకములను పూర్తిగా విడిచిపైచి, నీహారలేశములను శ్రీనాథుఁడు హిమాలయములనుగాఁ జేసి చెప్పుటకుఁ గారణము మృగ్యము.

పతిదేవతయైన గతభర్తృక, గంగానదితో భేదము లేనిదనియును, ఆమె శివసమానయైన 'ఉమ'యే యనియును, ఆమెను పూజింపవలయుననియును పై శ్లోకములు కంఠోక్తిగాఁ జెప్పుచున్నవి.

సీ॥ పెండిలినాఁడు భూబృందారకులు కన్య
నప్పగించిరో లేదో యధిపుఁ గూర్చి
సహచారిణివి గమ్మ్ని సకల కాలముఁదు
నిండుఁజందురునిఁ జంద్రికయుఁబోలెఁ
దొలకరి మొగులు విద్యుల్లేఖయును బోలె
ననుగమింపఁగఁ బాడి యతివ మగనిఁ;

బిత్తవనంబున దాఁకఁ బతి విమానము వెంటఁ
గైసేసి కొలనాడఁ గదలు భంగిఁ
తే॥గీ॥ బిఱికికిఁకండ యొకింత లేక కజ్జ వేడ్కఁ
జిచ్చుఱుకఁబోవు వికచరాజీవనేత్ర
కశ్వమేధంబు ఫలము తథ్యంబు కలుగుఁ
బదపదమ్మున కిది వేదభాషితంబు ॥ 86

అర్థము :- పెండిలినాఁడు = పెండ్లియైననాఁడు, భూబ్యందారకులు = భూదేవతలు - బ్రాహ్మణులు, కన్యన్ = కన్నియను, అధిపుఁగూర్చి = భర్తను ఉద్దేశించి, సకల కాలమునందున్ = ఎల్లకాలమును, సహచారిణివి = సహధర్మచారిణివి, కమ్ము = అగుము, నిండుఁజందురునిన్ = పూర్ణచంద్రుని, చంద్రికయుఁబోలెన్ = వెన్నెలవలెను, తొలకరి మొగులున్ = తొలకరి మబ్బును, విద్యుల్లేఖయునుబోలెన్ = (విద్యుత్ + లేఖ) మెఱపుతీఁగవలెను, అతివ = స్త్రీ, మగనిన్ = మగనిని, అనుగమింపఁగన్ = అనుసరింపఁగా, పాడి = ధర్మము; (అని) అప్పగించికొలేదొ ! = అప్పగించిరో లేదో ! (తెలియదు. అంతమాత్రముననే) కొలనాడఁగదలుభంగిన్ = (కొలను + ఆడు) కొలనియందు జలకమాడుటకు బయలుదేరునట్లుగా, కైసేసి = అలంకరించికొని. 'పతి విమానమువెంటన్' పతి = భర్తయొక్క, విమానము వెంటన్ = పాడెవెంట, పిత్తవనంబున దాఁకన్ = శ్మశాన భూమి పర్యంతము, పిఱికికిఁకండ = అధైర్యము, ఒకింత = (ఒక + ఇంత) ఒకయింతైనను, లేక = లేకుండునట్లుగా, అఱిమి = చొరవచేసి, వేడ్కన్ = వేడుకతో, చిచ్చుఱుకన్ = (చిచ్చు + ఱుకన్) అగ్నిలో నుఱుకుటకు, పోవు = వెళ్ళుచున్న, 'వికచరాజీవనేత్రకున్' వికచ = విప్పారిన, రాజీవ = పద్మములవంటి, నేత్రకున్ = కన్నులుగల స్త్రీకి, పదపదమ్మునకున్ = పతి చితికి అభిముఖముగా వేయుచున్న ఒక్కొక్క యడుగునకు, అశ్వమేధఫలము = ఒక్కొక్క అశ్వమేధయాగఫలము, కలుగున్ = ప్రాప్తించును, తథ్యము = సత్యము, ఇది = ఇది, వేదభాషితమ్ము = వేదవాక్కు.

తాత్పర్యము :- పెండ్లినాఁడు బ్రాహ్మణులు వరుని నుద్దేశించి వధువుతో 'సకల కాలమునందు సహచారిణివి కమ్ము. నిండుచంద్రుని వెన్నెలవలె, తొలకరి మబ్బును మెఱపుతీఁగవలె ఆడుది మగనిని అనుగమించుట సృష్టిలోని ధర్మము;'

అని అప్పగించిరొ లేదో. అంతే; జలకమాడుటకు కొలనికి కదలుమాదిరిని అలంకరించి కొని పతి పాడెపెంట శ్మశానపర్యంతము కొంచెమైన అధైర్యము లేకుండ చొరవ చేసి వేడుకతో చిచ్చులో పడిపోవుటకు వెళ్ళుచున్న స్త్రీ వేయుచున్న ఒక్కొక్క అడుగులో ఒక్కొక్క అశ్వమేధ ఫలము ఇమిడియున్నది. ఇది వేదవాక్కు.

విశేషము :- ఆ స్త్రీ అడుగుల స్పర్శచేత భూదేవి గజగజలాడిపోవుచున్నట్లు భావుక హృదయములు కూడ కంపించి తీరును.

'శశినా సహ యాతి కౌముదీ సహ మేఘేన తటిత్ప్రలీయతే
ప్రమదాః పతివర్త్మగా ఇతి ప్రతిపన్నం హి విచేతనైరపి' అను కాళిదాసు శ్లోకార్థమును అనుభవములోనికి తెచ్చుచున్న బరువైన పద్యము. పలనాటి వీరచరిత్ర వ్రాసిన కవియే యిట్టిది వ్రాయగలడు.

తే॥గీ॥ పుట్టలోపలి పామును సముద్ధరించు
వశ్యమంత్రుండు పాములవాడ పోలె
భర్త నభ్యుద్ధరించుఁ బాపంబువలన
నగ్ని నుఱికిన యట్టి పద్మాయతాక్షి ॥ 87

అర్థము :- పుట్టలోపలి పామున్ = పుట్టలోనున్న పామును, అభ్యుద్ధరించు= వెలికిఁదీయు, వశ్యమంత్రుండు = వశీకరణ మంత్రముగల, పాములవాఁడ పోలె= పాములవాఁడే యన్నట్లు, అగ్ని నుఱికిన యట్టి = అగ్నిలో నుఱికినట్టి, పద్మ = తామరపూవులవలె, ఆయత = విశాలములైన, అక్షి = కన్నులుగల స్త్రీ, పాపంబు వలనన్ = పాపమునుండి, భర్తన్ = భర్తను, అభ్యుద్ధరించున్ = పైకెత్తును.

తాత్పర్యము :- వశీకరణ మంత్రముగల పాములవాఁడు, పుట్టలోపలి పామును వెలికిఁదీసినట్లే, అగ్నిలో నుఱికిన స్త్రీ పాపమునుండి తన భర్తను వెలికిఁదీయును - అభ్యుద్ధరించును.

తే॥గీ॥ పెక్కుమాటల నిటు జాలిపెట్టనేల
సాధ్వి గర్హింప నొకఁడెట్లు చాలఁగలఁడు?
గంధవాహంబు వెఱచు నక్కలువకంటి
పసపుఁ బయ్యెద పాలిండ్లఁ బాయఁదట్ట ॥ 88

అర్థము :- పెక్కు-మాటలన్ = పలుమాటలతో. ఇటు = ఈవిధముగా. జాలి పెట్టనేల ? = కష్టపెట్టుట దేనికి ?. సాధ్విన్ = పతివ్రతను, గర్హింపన్ = నింద పెట్టఁగా. ఒకఁడు = ఒకానొకఁడు, ఎట్లు = ఏ రీతిగా. చాలఁగలఁడు = సమర్థుఁడు కాఁగలఁడు ?. అక్క-లువకంటి = (ఆ + కలువకంటి) ఆ కువలయాక్షియొక్క. పాలింట్లన్ = చనుకట్టునుండి, పసపుఁ బయ్యెద = పసపంటిన పయటను, పాయఁ బెట్ట = పాయఁజేయఁగా - తొలగింపఁగా, గంధవాహంబున్ = వాయువుకూడ, వెఱచున్ = భయపడును.

తాత్పర్యము :- పలుమాటలు పనిలేదు. పతివ్రతపై నిందమోప నెవ్వని తరము ? ఆమె యెదపైనుండి పయ్యదను జార్చుటకు వాయుదేవుఁడు కూడ వెఱచుచుండును.

విశేషము :- 'వాతోఽపినాఽఽక్రసంసయదంశుకాని కోలంబయేదాహరణాయ హస్తం' కాళిదాసు. ఇట్లు ప్రతి పద్యమునందును పూర్వకవుల ఉక్తి సౌరభము ఏదో గుబుల్కొనుచునే యుండును.

తే॥గీ॥ ఔర్వ శిఖికంఱె జముకంఱె నర్క-కంఱెఁ
బిడుగుకంఱెను దీవ్రమై బిరుసు చూపు
నాత్మఁ దప్పఁగఁ దలఁచు దురాత్మకులకు
నహహ! పతిదేవత పతివ్రతాతిశయము 11 89

అర్థము :- ఆత్మన్ = మనస్సునందు. తప్పఁగన్ = ధర్మమార్గమును తప్పఁగా, తలఁచు = ఆలోచించుచున్న, దురాత్మకులకున్ = దుర్మనస్కులకు, పతిదేవత = పతివ్రతయొక్క. 'పతివ్రతాతిశయము' పతివ్రత = పతివ్రతము యొక్క. అతిశయము = ప్రభావము. ఔర్వశిఖికంఱెన్ = బడబాగ్నికంఱెను, జముకంఱెన్ = యమునికంఱెను, అర్కకంఱెన్ = సూర్యునికంఱెను, పిడుగు కంఱెన్ = అశనికంఱెను, తీవ్రమై = పెట్టిదమై, బిఱుసు = బిఱుసుదనమును, చూపున్ = ప్రదర్శించును, అహహ ! = ఆశ్చర్యము.

తాత్పర్యము :- మనస్సులో చెడు తలంపుగల దుర్మతులకు పతిదేవతల యొక్క పాతివ్రత్య తేజోవిశేషము బడబాగ్నికంఱెను. యమునికంఱెను. సూర్యుని కంఱెను పిడుగుకంఱెను తీవ్రతను జూపును. ఆశ్చర్యము !

చం॥ తొలఁగుము రంతనంత యమదూత కిరాతులు భీతచిత్తులై
కలుషసమన్వితుండయిన కాంతుని దారుణ లోహపాశ శృం
ఖలికలు విచ్చి పుచ్చుకొని కాంత చితాగ్ని శిఖాముఖంబులన్
వెలువడి యాత్మ భర్త వెనువెంట హుటాహుటిఁ
గూడివచ్చినన్ ॥ 90

అర్థము :- కాంత = స్త్రీ. 'చితాగ్నిశిఖాముఖంబులన్' చితాగ్ని = సొదనిప్పు యొక్క, శిఖాముఖంబులన్ = జ్వాలల అంచులనుండి వెలువడి = నిర్గమించి. 'కలుషసమన్వితుండయిన' కలుష = పాపములతో. సమన్వితుండయిన = కూడి కొనిన కాంతుని = భర్తయొక్క, 'దారుణ..... .....శృంఖలికలు' దారుణ = భయం కరములైన, లోహ = లోహమయములైన, పాశ = బంధరూపములైన, శృంఖలి కలు = సంకెలలు, విచ్చిపుచ్చుకొని = విడఁగొట్టి పుచ్చుకొని, ఆత్మభర్త = తన భర్తయొక్క. వెనువెంటన్ = వెనువెంటనే. హుటాహుటిన్ = సరాసరి, కూడి వచ్చినన్ = కలిసిరాఁగా, భీతచిత్తులై = వెఱచిన మనస్సుగలవారై, యమదూత = యమదూతలేయనెడి, కిరాతులు = కిరాతులు, అంతనంతన్ = దూరదూరముగా. తొలఁగుదురు = తొలఁగిపోవుదురు.

తాత్పర్యము :- చిత్రీ ఆ చిచ్చుటికినతాగ్ని శిఖాగ్నిములనుండి వెలువడి పాపములలో మునిఁగిన భర్తయొక్క భయంకరములైన లోహపాశ రూపములైన సంకెలలు విడిపించికొని తన భర్తవెనువెంటనే సరాసరి కలసివచ్చుచుండఁగా భీత మనస్కులై యమదూత లను కిరాతులు దూర దూరముగా తొలఁగిపోవుదురు.

తే॥గీ॥ ఎన్నికకు రోమకూపంబు లెన్నిగలవు
దివ్యవర్షంబులన్ని మోదించుసాధ్వి
నాకభువనంబునం దాత్మనాథుఁగూడి
వెఱపొకింతయు లేక చిచ్చుటికినేని॥ 91

అర్థము :- సాధ్వి = పతివ్రత, వెఱపు = భయము, ఒకింతయున్ = ఏ మాత్రమైనను, లేక = లేకుండ, చిచ్చుటికినేనిన్ = అగ్నియందుటికినచో, ఎన్నిక

కున్ = లెక్కకు, రోమ కూపంబులు = రోమరంధ్రములు, ఎన్నిగలవు = ఎన్ని యున్నవో, దివ్యవర్షంబులన్ని = అన్నిదేవసంవత్సరములు, నాకభువనంబునం, దున్ = స్వర్గలోకమునందలి, ఆత్మనాథుఁగూడి = నిజవల్లభునిఁగలసి, మోదించున్ = ప్రమోదమును పొందును.

తాత్పర్యము :- ఏమాత్రము వెఱవక పతివ్రత వహ్నియందుఱికినచో, శరీరమునందు రోమరంధ్రము లెన్నియున్నవో, అన్ని దివ్యసంవత్సరములు తన, భర్తతోఁ గలసి స్వర్గలోకమునందు ప్రమోదము ననుభవించును.

తే॥గీ॥ తండ్రివంశ బునం దేడు తరములకును
దల్లి వంశంబునం దేడు తరములకును
ధవుని వంశంబునం దేడు తరములకును
శాశ్వతస్వర్గసౌఖ్యమిూఁజాలు సాధ్వి॥ 92

అర్థము :- సాధ్వి = పతివ్రతయైనస్త్రీ, తండ్రివంశంబునందున్ = తండ్రి వంశమునందు ఏడుతరములకును = ఏడుతరములవారికిని, తల్లివంశంబునందు = తలివంశమునందు, ఏడుతరములకును = ఏడుతరములవారికిని, ధవునివంశంబు నందున్ = భర్తవంశమునందు, ఏడుతరములకును = ఏడుతరములవారికి, 'శాశ్వత స్వర్గసౌఖ్యము', శాశ్వత=శాశ్వతమైన, స్వర్గ = స్వర్గలోకనివాసరూపమైన, సౌఖ్యమును, ఈఁజాలును = ఇయ్యజాలును.

తాత్పర్యము :- అగ్నిప్రవేశముఁ జేసిన పతివ్రత తండ్రి, తల్లి, భర్త ఈమువ్వురి వంశములలో ఏడేడుతరముల వారికి శాశ్వత స్వర్గలోకనివాస సౌఖ్యము లను కల్పింపఁ గలదు.

వ॥ అని పలికి బృహస్పతి లోపాముద్రంగనుంగొని దేవీ! నీ ప్రసంగవశంబునంగొన్ని యోపిద్ధర్మంబులు చెప్పితి. నీవు మహాపతివ్రతవు. నీబోటి పుణ్యవతులు గొందఱు కలుగంబట్టి గదా! వసుంధరతిరంబై యున్న యది. ఇదె నీకు నమస్కారంబు. 93

అర్థము :- అని పలికి = ఇట్లు చెప్పి, బృహస్పతి = దేవగురువు, లోపా ముద్రిన్ = లోపాముద్రను, కనుంగొని = చూచి, దేవీ = పూజ్యురాలా!, నీ ప్రసంగవశంబునన్ = నీపరిసంగవశముగా, కొన్ని = కొన్ని, యోషిద్ధర్మంబులు= (యోషిత్ + ధర్మము) స్త్రీ ధర్మములను, చెప్పితిని = చెప్పినాఁడను, నీవు=నీవు, మహాపతివ్రతవు = గొప్పపతివ్రతవు, నీ బోటిపుణ్యవతుఁ = నీ వంటి పుణ్యము గలవారు, కొందఱు కలుగంబట్టిగదా = కొందఱుండుట వల్లనేకదా, వసుంధర = భూమి, తిరంబై యున్నయది=సుస్థిరమై నిలిచియున్నది; ఇదె నీకు నమస్కారంబు= ఇదిగో నీకు నమస్కారము!

కం॥ మా వచ్చిన కార్యమునకు
నీ వనుకూలత భజించి నిర్మలకరుణా
శ్రీ వెలయఁగఁ బ్రార్థింపుము
నీ వల్లభు భువన కుశల నిర్వాహకునిన్ 94

అర్థము :- మావచ్చిన కార్యమునకున్ = మేమువచ్చిన పనికి, నీవు=నీవు, అనుకూలతన్ = ఆనుకూల్యమును, భజించి = పొంది, నిర్మల = నిర్మలమైన, "కరుణాశ్రీ" కరుణా = దయయొక్క, శ్రీ = సంపద, వెలయఁగన్ = నెలకొను నట్లుగా, 'భువనకుశలనిర్వాహకునిన్' భువన = లోకములయొక్క, కుశల = క్షేమమునకు, నిర్వాహకునిన్ = నిర్వహించువాఁడైన, నెరవేర్చువాఁడైన, నీ వల్ల భున్ = నీప్రియుని, ప్రార్థింపుము = కోరుము.

తాత్పర్యము:- మేము వచ్చినపనికి నీవు అనుకూలురాలివై నిర్మలమైన కరుణాసంపద నెలకొనునట్లుగా లోకక్షేమ నిర్వాహకుఁడైన నీ భర్తనుప్రార్థింపుము.

వ॥ అని యగస్త్యమహాముని జూచి వెండియుఁ బ్రణమిల్లి
యాఖండలగురుండిట్లనియె॥ 95

అర్థము :- అని = అనిపలికి, అగస్త్యమహాముని = అగస్త్యమహా ముని, చూచి = చూచి, వెండియున్ = ఇంకొకమాఱు, ప్రణమిల్లి = ప్రణామము చేసి, ఆఖండలగురుండు = దేవగురుఁడైన బృహస్పతి, ఇట్లనియెన్ = ఇట్లు పలికెను.

తాత్పర్యము :- లోపాముద్రతోనిట్లు పలికి అగస్త్య మహాముననిఁ జూచి యింకొక మాఱు ప్రణామముచేసి బృహస్పతి యిట్లుపలికెను.

— బృహస్పతి యగస్త్యునితోఁ దను వచ్చినకార్యంబు నెఱింగించుట —

సీ॥ ప్రణవంబు నీవు నిర్మల గుణాలంకార!
యామ్నాయ విద్య యీ యలరు బోడి
తప మీవు శశికళో త్తంసభ క్తినిధాన!
శాంతి యీ సంపూర్ణచంద్రవదన
ఫల మీవు వాతాపిఖలదర్పభంజన!
సత్క్రియ యీ గంధసారగంధి
మిహిరుండ వీవు విశ్వాహితప్రవ ర్తక!
చైతన్యలక్ష్మి యీ చపలయన

తే॥గీ॥ బ్రహ్మతేజంబు నీయందుఁ బ్రజ్వరిల్లుఁ
బ్రజ్వరిల్లు బత్రివతా పరమతేజ
మీ లతాతన్వియందు మా కిందఱకును
నుభయ తేజంబులును మహాభ్యుదయ మొసఁగు॥ 96

అర్థము :- 'నిర్మల గుణాలంకార!' నిర్మలగుణ=సత్వగుణమే, అలంకార!= అలంకారముగాఁ గలవాఁడా!, నీవు=నీవు. ప్రణవంబు=ఓంకారమవు, ఈ యలరు బోఁడి = ఈ కుసుమగాత్రి. ఆమ్నాయవిద్య = వేదవిద్య. "శశికళో త్తంసభక్తి నిధాన' 'శశికళో త్తంస, = (శశికళా + ఉత్తంస) శశికళా = చంద్రకళ. ఉత్తంస = శిరోభూషణముగాఁగల శివునియందలి. భక్తి = భక్తికి. నిధాన = గనియైనవాఁడా! తపము = తపస్సు. ఈవు = నీవు. ఈ సంపూర్ణచంద్రివదన = నిండుచందురుని వంటి మోముగల యీ లోపాముద్ర. శాంతి = శాంతి; 'వాతాపి ఖలదర్పభంజన వాతాపి = వాతాపియనెడి, ఖల = దుష్టునియొక్క, దర్ప = గర్వ మును, భంజన = నశింపఁజేసినవాఁడా!, ఈవు = నీవు, ఫలము = ఫలము. ఈ గంధసారగంధి = చందనగంధియైన యీలోపాముద్రి. సత్క్రియ = మంచి అను ష్ఠానవిధి; 'విశ్వహితప్రవర్తక' విశ్వహిత=లోకహితమును, ప్రవర్తక=ప్రవర్తింపఁ

జేయువాఁడా,మిహిరుండవు=నీవు సూర్యుఁడవు,ఈ చపలనయన=ఈ తరళాక్షియైన, లోపాముద్రి, చైతన్యలక్ష్మి = చైతన్యసంపద, నీయందున్ = నీయందు, బ్రహ్మ తేజంబు = బ్రహ్మతేజము, ప్రజ్వరిల్లున్ = మిక్కిలి వెలుఁగును, ఈ లతాతన్వి, యందున్ = తీఁగవలె సన్నని శరీరముగల ఈలోపాముద్రియందు,పతివ్రతా పరమ తేజంబు = పరమమైన పాతివ్రత్యతేజము, ప్రజ్వరిల్లున్ = దేదీప్యమానమైవెలుఁ గును, మా కిందఱికును = మాయీ యందఱికిని, ఉభయతేజంబులును = బ్రహ్మ తేజఃపాతివ్రత్యతేజస్సులురెండును, మహాభ్యుదయమున్ = గొప్ప యభ్యుదయ మును, ఒసఁగున్ = ఇచ్చును.

తాత్పర్యము :- ఓ సత్వగుణభూషణా! నీవు ప్రణవమవు; ఈ లోపా ముద్రి వేదవిద్య. ఓశివభక్తి నిధానా! నీవు తపస్సు; ఈ లోపాముద్రి శాంతి. ఓ వాతాపిగర్వభంజనా! నీవు ఫలము; ఈ లోపాముద్రి సద్విధి. ఓ లోకహితప్రవర్త కుఁడా! నీవు సూర్యుఁడవు; ఈ లోపాముద్రి చైతన్యలక్ష్మి. నీయందు బ్రహ్మ తేజము ప్రజ్వరిల్లుచున్నది. పాతివ్రత్యతేజము ఈమె యందు ప్రజ్వరిల్లుచున్నది ఈ మా యందఱికును - ఈ యుభయతేజములును మహాభ్యుదయము నొసఁగును.

తే॥గీ॥ శక్రుఁడీతండు శిఖివీఁడు జముఁడు వీఁడు
రాక్షసుఁడు వీఁడు పాధోధిరాజువీఁడు
పవనుఁడును వీఁడు కిన్నరపతి యితండు
వృషభవాహనుఁ డీతండు విశ్వవంద్య॥ 97

అర్థము :- ఈతండు = ఇతఁడు, శక్రుఁడు = ఇందుఁడు, వీఁడు = వీఁడు, శిఖి = అగ్ని, వీఁడు = ఈతఁడు, జముఁడు = యమధర్మరాజు, వీఁడు = ఇతఁడు, పాధోధిరాజు = సముద్రములకు ప్రభువైన వరుణుఁడు, వీఁడు=ఇతఁడు పవనుఁడును = వాయుదేవుడును, ఇతండు = ఇతఁడు, కిన్నరపతి = కిన్నరులకు రాజైన కుబేరుఁడు, విశ్వవంద్య! = ఓ లోకవంద్యుఁడా, ఈతండు, వృషభవాహ నుఁడు = వృషభము వాహనముగాఁగల ఈశ్వరుఁడు.

తాత్పర్యము :- సుగమము. పేరుపేరున అష్టదిక్పాలురను పరిచయము చేయుచున్నాడు.

వ॥ వీరె మునులు. వీరె సిద్ధసాధ్య మరుత్కిన్నర కింపురుష గంధర్వ విద్యాధర దేవయోనులు. మా వచ్చిన కార్య మవధరింపుము. విధ్యంబను మహీధరంబు విబుధ శైలంబుతో బ్రతిస్పర్థించి యూర్ధ్వాండ కర్పరంబు నిజశిరః శృంగశృంగాట కంబుల నుద్ఘాటించుచు ననూరు సారథి రథం బవరోధించి ప్రతిబంధించి శిశుమారాకారంబునం దారకావీథిఁ బవ్వడిం చిన పాంచజన్య ధరునొరసి యుత్తానపాది నుత్తరించి గగన గంగ నాలింగనంబుచేసి యురులింగాకారుఁడైన ధూర్జటిం ద్రివిక్రమాకారంబున విరాడ్రూపుం డగు విష్వక్సేను ననుక రించి యున్నయది. తృటి నిమేష కాష్ఠాకళా ముహూర్తాహో రాత్ర పక్షమాస ర్త్వయన సంవత్సరయుగ సంధ్యా సంధ్యాంశ మన్వంతరకల్ప మహాకల్పాదిభేద భిన్న లై పదార్థంబులం బరిచ్ఛేదించుకాలంబు-నిరస్త సమస్తోపాధిక స్వప్రతిష్ఠాఖండ సచ్చిదానందైక రసాద్వితీయస్వరూపుండైన విశ్వాపాశ్రయుండు దప్పించి యన్యుల బరిచ్ఛేదించు. అట్టి కాలంబునకు దపన పరిస్పందంబు మూలంబు. మార్తాండుండు కొండప్రక్కం జిక్కి కడలి మొగ యక్కలిం దగులువడి చిక్కిన జోగునుబోలె నెదురు నడవ మరలం బరవలేక చీకాకుపడియున్నవాఁడు. ప్రాహ్ణోపరాహ్ణ మధ్యాహ్నసమయంబులు గత్తరఁ గలియుటం జేసి నిత్యనైమిత్తికాది క్రియాకలాపంబు లుపసంహృతంబు లయ్యె. ప్రాచ్యోదీచ్య దేశంబులంధకారాతప హిమానిలంబుల చేతం జేతనావైకల్యంబు వహించె. భువనంబుల కకాండ ప్రళయం బావిర్భవించె. కల్పాంత కాలంబునందును గసుగంద కుండుం గావున నవ్వేసవి కాశీక్షేత్రంబునందుపహతి చూపదు. ఏమును నిమ్మహోపద్రవంబునకుం బ్రశాంతిఁ గోరి యబ్రహ్మ ణ్యంబు సేయుచు బ్రహ్మశరణు సొచ్చితిమి. అవ్విరించి కరుణా

కటాక్షంబున నీక్షించి యీ యాపద నపనయింప వాఁడొ
హో రి తాపసుండు తక్కం దక్కినవాఁడు సమర్థుండు కాఁడు.
అతనిఁ బ్రార్థింపుఁడు. పొండని తాన నీ కందువ చెప్పిన
నీ యానందవనంబున కరుదెంచితిమి. ఇంకమీఁదఁ గోపాటో
పావకుంభ కంఠకఠిన హుంకార ధారావష్టంభంబునం ద్రివిష్టప
రాజ్యలక్ష్మీ మదాంధుండైన నహుషుని నిమిషమాత్రంబున
ధాత్రీమండలంబునం బడఁద్రోచిన మహానుభావుండవు నీవ
ప్రమాణంబు. 98

అర్థము :- వీరె = వీరే. మునులు = మునీశ్వరులు, వీరె = వీరే. 'సిద్ధ.... దేవయోనులు' సిద్ధ = సిద్ధులు. సాధ్య = సాధ్యులు. మరుత్ = మరుత్తులు. కింనర = అశ్వముఖము-నరశరీరముగల దేవయోని విశేషములు. కింపురుష = నర ముఖము - అశ్వ శరీరముగల దేవయోని విశేషములు. గంధర్వ = గంధర్వులు. విద్యాధరులగు = విద్యాధరులులనైన. దేవయోనులు = దేవతలనుండి పుట్టినవారు. మావచ్చిన కార్యంబు = మేము వచ్చిన పనిని. అవధరింపుము = అవధానముతో వినుము, విధ్యంబను = 'వింధ్య' మనెడి. మహీధరంబు = భూధరము-పర్వతము. విబుధశైలంబుతోన్ = సురాలయముతో-మేరుపర్వతముతో. ప్రతిస్పర్ధించి = ప్రతిస్పర్ధ వహించి. 'ఊర్ధ్వాండ కర్పరంబున్' ఊర్ధ్వ = మీఁదిదియైన. అండకర్పరంబున్ = బ్రహ్మాండము పైకప్పును. 'నిజ....శృంగాటకంబులన్' నిజ తనయొక్క. కిరశృంగ = చిటారుకొమ్మలకు సంబంధించిన, శృంగాటకంబులన్ = చౌకముల చేత. ఉద్ఘాటించుచున్ = ఘట్టనము చేయుచు. 'అనూరు సారథి రథంబు' అనూరు = అనూరుఁడు-(ఊరువులు లేనివాడు), సారథి = సారథి గాఁగల సూర్యునియొక్క. రథంబు = రథమును, అవరోధించి = అడ్డగించి, 'నక్షత్ర....చక్రంబున్' నక్షత్ర = అశ్విని మొదలైన గ్రహములయొక్క, తారకా = తారకలయొక్క. చక్రంబున్ = మండలమును. చిక్కుపడిచి = చిక్కుపడునట్లుచేసి. సప్త = ఏడైన. సమీరణ = వాయువులయొక్క. స్కంధంబులనున్ = మండలములను, ప్రతిబంధించి = కదలకుండఁజేసి. 'శింశుమారాకారంబునన్' శింశుమార = మొసలియొక్క. ఆకారంబువన్ = ఆకారముతో. తారకావీథిన్ = తారకావీథియందు. పవ్వడించిన = పవళించిన-శయనించిన. పాంచజన్యధరున్ = శ్రీమహావిష్ణువును. ఒరసి=ఒరసికొని-

రాసి. ఔత్తానపాదిన్ = ఉత్తానపాదుని కొడుకైన ధ్రువుని, ఉత్తరించి = దాటి, గగనగంగన్ = మందాకినిని-ఆకాశగంగను. ఆలింగనంబుసేసి = కౌగిలించికొని. ఉరులింగాకారుఁడైన = మహాలింగాకారుఁడైన. ధూర్జటిన్ = ధూర్జటిని - శివుని త్రివిక్రమాకారంబునన్ = త్రివిక్రమాకారముతో, విరాడ్రూపుండగు = విరాట్ స్వరూపుఁడైన, విష్వక్సేనున్ = శ్రీమహావిష్ణువును. అనుకరించియున్న యది = పోలియున్నది. 'తృటి....భేదభిన్నంబై' తృటి = తృటులు, నిమేష=నిమేషములు, కాష్ఠా = కాష్ఠలు, కలా = కలలు, ముహూర్త = ముహూర్తములు, అహోరాత్ర= అహోరాత్రములు, పక్ష = పక్షములు, మాస = మాసములు, ఋతు = ఋతువులు, అయన = అయనములు, సంవత్సర = సంవత్సరములు, యుగసంధ్య = యుగ సంధ్యలు, సంధ్యాంశ = సంధ్యాంశములు, మన్వంతర = మన్వంతరములు, కల్ప= కల్పములు, మహాకల్ప = మహాకల్పములు. ఆది = మొదలైన, భేదములతో, భిన్నంబై = బహుప్రకారమై, పదార్థంబులన్ = పదార్థములను, పరిచ్ఛేదించు = పరిచ్ఛిన్నము చేయునట్టి, కాలంబు = కాలము. 'నిరస్త ...విరూపాక్షుండు' నిరస్త= సమసిపోయిన, సమస్త = సర్వములైన, ఉపాధిక = తొడుగులు-తత్త్వములుగల ట్టియు, స్వప్రతిష్ఠ = తనయందే నెలకొనియున్నట్టియు, సచ్చిదానంద = సత్ + చిత్ + ఆనంద - ఉనికి-ఎఱుక-ఇంపు అనెడి, స్వరూప + నిజరూపమైన, ఏక= అఖండమైన (పరిపూర్ణమైన). రస = రసముకంటె, ఆద్వితీయ = అభిన్నమయిన, రూపుండగు = స్వరూపముగల, విరూపాక్షుండు = శివుఁడు, తప్పించి = తక్క, అన్యులను = ఇతరులను, పరిచ్ఛేదించున్ = పరిమితి చేయును, అట్టి కాలంబున కున్ = ఆ విధమైన కాలమునకు, 'తపన పరిస్పందంబు' తపన = సూర్యునియొక్క, పరిస్పందంబు = కదలిక, మూలంబు = కారణము, మార్తాండుడు=సూర్యుఁడు, కొండప్రక్కన్ = వింధ్య పార్శ్వమునందు, చిక్కి = చిక్కుపడి, కడలిమొగ = సముద్ర ముఖమునందు, అక్కలిన్ = అవరోధముచేత, తగులుపడి = అడ్డేర్పడి, చిక్కిన = ఆగిపోయిన-నిలిచిపోయిన, జోగునుంబోలె = ఓడవలె, ఎదురు = ముందునకు, నడవన్ = నడచుటకును, మరలన్ బడవన్ = వెనుకకు వచ్చుటకు, లేక = చాలక, చీకాకు పడియున్నవాఁడు = బలహీనుఁడై యున్నాఁడు - శ్రమపడ యున్నాఁడు. 'ప్రాహ్ణ....సమయంబులు' ప్రాహ్ణ = లేఁబగలు (ఉదయము మొదలు పది గడియల కాలము), అపరాహ్ణ = పగటి మూఁడవజాము (ప్రాతస్సంగవ మధ్యాహ్న అపరాహ్ణ సాయాహ్నములను - ఐదు దినవిభాగములలో నాలుగవది).

మధ్యాహ్న సమయంబులు = మధ్యాహ్న కాలములు, గత్తర గలయుటంజేసి = సంకీర్ణములై పోవుటవలన-విప్లవము నొందుటవలన. 'నిత్య....కలాపంబులు' నిత్య= నిత్యవిధులు. నైమిత్తిక = నైమిత్తిక విధులు, ఆది = మొదలైన, క్రియాకలాపం బులు = కర్మకలాపములు, ఉపసంహృతంబులు = విడువఁబడినవి, అయ్యెన్ = అయినవి. 'ప్రాచ్య ..వహించె' ప్రాచ్య = తూర్పుదిక్కునందలివి. ఉదీచ్య = ఉత్తర దిక్కునందలివియునైన, దేశంబులు = దేశములు, 'అంధకార....అనిలం బులచేతన్' అంధకార = చీఁకటిచేత, ఆతప = ఎండచేత, హిమానిలంబులచేతన్= మంచుగాలులచేత, 'చేతనావైకల్యంబు' చేతనా = చైతన్యమునందు, వైకల్యంబు= వికలత్వమును, వహించెన్ = పూనెను, భువనంబులకున్ = లోకములకు, 'అకాండ ప్రళయంబు' అకాండ = అసమయమునందు - సమయముకాని సమయమందు, ప్రళయంబు = ప్రళయము, ఆవిర్భవించెన్=పుట్టెను, 'కల్పాంతకాలంబునందున్' కల్ప = బ్రహ్మకల్పముయొక్క. అంతకాలంబునందును = అవసానకాలమునందుఁ గూడ, కనుగందకుండుం గావునన్ = ఇంచుకయైనను వాడకయుండును కాబట్టి, అవ్వేసవి = (ఆ + వేసవి) ఆ వింధ్యోపప్లవరూపమైన వేసవి, కాశీక్షేత్రంబునం దున్ = కాశీక్షేత్రమునందు, ఉపహతి = ఉపద్రవమును, చూపదు = చూపింపదు, ఏమును = మేమును, ఇమ్మహోపద్రవంబునకున్ = ఈ గొప్ప యుపద్రవమునకు, ప్రశాంతిన్ = ఉపశమించుటను కోరి - అపేక్షించి, అబ్రహ్మణ్యంబు సేయుచు = అవధ్యులమని చెప్పుచు, బ్రహ్మన్ = బ్రహ్మదేవుని, శరణుసొచ్చితిమి = శరణా ర్థులమైతిమి. అవ్విరించి = (ఆ + విరించి) ఆ బ్రహ్మ, కరుణాకటాక్షంబునన్ = కరుణతోఁ గూడిన కడకంటితో, ఈక్షించి = చూచి, ఈ యాపద = ఈ హావడిని, అపనయింపన్ = తొలగించుటకు, 'వాతాపిహారి తాపసుండుదక్కన్' వాతాపిహారి = వాతాపిని సంహరించిన, తాపసుండుదక్కన్ = అగస్త్యమహర్షి తప్ప, తకి న వాఁడు = వేఱొకఁడు, సమర్థుండు = చాలినవాఁడు, కాఁడు = కాఁడు, అతనిన్= ఆ యగస్త్యమహర్షిని, ప్రార్థింపుఁడు = ప్రార్థన చేయుఁడు, పొండు = వెళ్ళుఁడు, అని = అని పలికి, నీ కందువ = నీ వున్నచోటు చెప్పినన్ = చెప్పఁగా. ఈ యానంద కాననంబునకున్ = ఈ కాశీనగరమునకు, అరుదెంచితిమి = వచ్చిన వారము, ఇంక మీఁదన్ = ఇటుపైన, 'కోపాటోప....అవష్టంభంబునన్' కోపాటోప= కోపసంభ్రమము, అవకుంఠ = పరివేషముగాఁగల, కఠిన = తీవ్రమైన, కంఠ = కంఠధ్వనియొక్క, హుంకార = హుంకారముయొక్క. ధారా = నైరంతర్యము

యొక్క-కొనసాగుటయొక్క, అవష్టంభంబునన్ = అవలంబముచేత, 'త్రివిష్టప.... మదాంధుండైన' త్రివిష్టప = స్వర్గమునకు సంబంధించిన, రాజ్యలక్ష్మి=రాజ్యలక్ష్మి వలన నేర్పడిన, మద = మదముచేత, అంధుండైన = కన్నుగాననివాఁడైన, నహుషునిన్ = నహుషుని, నిమిషమాత్రంబునన్ = ఒక్క నిమిషములోనే, ధాత్రీ మండలంబునన్ = భూమండలమునందు, పడఁద్రోచిన = పడఁద్రోసిన, మహాను భావుండవు = గొప్ప యను భావముగలవాఁడవు, నీవ = నీవే, ప్రమాణంబు = ఉన్న యథార్థస్థితి తెలిసినవాఁడవు.

తాత్పర్యము :- వీరే ముసీశ్వరులు, ఇరుగో, సిద్ధులు-సాధ్యులు-మరుత్తులు-కిన్నరులు-కింపురుషులు-గంధర్వులు-విద్యాధరులు, మేమందఱము వచ్చిన పని సావధానుఁడవై యాలకింపుము, వింధ్య మను ఒక కొండ, సురనివాసమైన మేరు పర్వతముతో స్పర్ధ వహించి బ్రహ్మాండముయొక్క పైకప్పును తన శిఖరములతో ఘట్టించుచు సూర్యరథమును అడ్డగించి నక్షత్రగ్రహ తారకామండలమును చెల్లా చెదరు చేసి, సప్తమారుతములను బిగించి, శింశుమార రూపముతో నాకాశమున శయనించియున్న శ్రీమహావిష్ణువు నొరసి, ధ్రువుని దాటి, ఆకాశగంగను కౌఁగిలించికొని, మహాలింగాకారము ధరించిన శివుని త్రివిక్రమరూపము ధరించిన విష్ణువును అనుకరించియున్నది. త్యటి, నిమేషము, కాష్ఠ, కళ, ముహూర్తము, అహోరాత్రము, పక్షము, మాసము, ఋతువు, సంవత్సరము, యుగము, యుగసంధ్య, సంధ్యాంశము, మన్వంతరము, కల్పము, మహాకల్పము ఇన్ని భేదములతో విభక్తమై పదార్థములకు పరిమితిని నిర్ణయించుకాలము, కాలము మొదలైన అన్ని ఉపాధులను, తొడుగులను సమయించి తనయందు తానే నెలకొనియున్న సచ్చిదానందస్వరూపము కంటె వేఱుకాని అఖండ స్వరూపుఁడైన ఒక్క పరమశివుఁడు తప్ప ఇతరుల నెల్లరను పరిమితికి లోనుజేయుచుండును. అట్టి కాలమునకు సూర్యుని కదలికయే మూలము. ఆ సూర్యుఁడు నేఁడు వింధ్యపర్వత పార్శ్వమునందుఁ జిక్కుపడి సముద్రములో నడ్డగింపఁబడిన ఓడవలె ముందునకు నడచుటకుఁగాని వెనుకకు మరలుటకుఁగాని చాలని పరిస్థితిలో నున్నాఁడు. ప్రాహ్ణము, అపరాహ్ణము, మధ్యాహ్నము మొదలైన కాలవిభాగములు కలగాపులగమై పోవుటవలన నిత్యనైమిత్తికాదికములైన క్రియాకలాపములన్నియును నిలిచిపోయినవి. ప్రాచ్యములు, ఉదీచ్యములు, నైనదేశములు కొన్ని యెడతెగని చీఁకట్లతో, కొన్ని యెడతెగని యెండలతో, కొన్ని యెడతెగని చలిగాలులతో, నిశ్చేతనములై యున్నవి. లోకములకు అకాండప్రళయము

సంభవించినది. ఈ కాశీమహాక్షేత్రము కల్పాంత సమయములయందుఁ గూ
కసుగందక యుండునుగావున-ఆ యుపద్రవమిచ్చటి వారికి తెలియుటలేదు. మేము-
ఈ మహోపద్రవము ఎట్లుపశమించునా! అని అబ్రహ్మణ్యముచేయుచు బ్రహ్మదేవుని
శరణుచొచ్చితిమి. ఆ బ్రహ్మదేవుఁడు మాపైఁగరుణించి - ఈ యుపద్రవము తొల
గించుటకు అగస్త్యమహాముని యొక్కఁడే సమర్థుఁడు. ఆయన కాశీమహాక్షేత్రములో
మున్నాఁడు. మీరువెళ్ళి ఆ మహామునిని ప్రార్థించి కొనుఁడు! అని - నీవున్నచోట
చెప్పిపంపఁగా మేమిందటమును-ఈకాశీక్షేత్రమునకు వచ్చినాము. ఇపుడాకాఁగల
కార్యమునకు ఒక్క హుంకారముతో స్వర్గసింహాసనస్థితుఁడైన నహుషుని
భూమిపైఁ బడఁద్రోసిన మహాప్రభావసంపన్నుఁడవు నీవే ప్రమాణము.

కం॥ ఎవ్వఁడు నిసర్గకఠినుం
డెవ్వఁడు సన్మార్గరోధి యీర్ష్యాపరుఁడై
యెవ్వఁడు తన కధికునితోఁ
జివ్వకుఁ జేసాచు వాని సిరులభ్రువములే॥ 99

అర్థము :- ఎవ్వఁడు = ఎవఁడు, 'నిసర్గకఠినుండు' నిసర్గ = స్వభావము
చేత కఠినుండు = కఠినుఁడో- శిలయో!, ఎవ్వఁడు = ఎవఁడు, "సన్మార్గరోధి"
సత్ = సజ్జనులయొక్క-(నక్షత్రములయొక్క) మార్గ = మార్గమును, రోధి =
అడ్డగించునో. ఎవ్వఁడు = ఎవఁడు, ఈర్ష్యాపరుఁడై = అసూయాపరుఁడై, తన
కధికునితోన్ = తనకంటె గొప్పవానితో. చివ్వకున్ = కలహమునకు. చేసాఁ
చున్ = (చేయి+చాఁచు) చేయిసాఁచునో, వాని సిరులు = వాని సంపదలు, అభ్రువ
ములే = అశాశ్వతములు - అస్థిరములు-నిలుకడలేనివి.

తాత్పర్యము :- ఎవ్వఁడు స్వభావకఠినుఁడో! - (కఠినస్వభావుఁడు శిలో
చ్చయము కావున) ఎవ్వఁడు సన్మార్గమునకడ్డువచ్చునో (నక్షత్రమార్గమున కడ్డు
వచ్చునో) ఎవ్వఁడు అసూయాపరుఁడై తనకంటె గొప్పవానితో(మేరుపర్వతముతో)
కలహమునకు చేయిసాఁచునో, వాని అభ్యున్నతులు నిలుకడలేనివి. అస్థిరములు.

విశేషము :- సామాన్యములైన నిసరకఠినత్వ, సన్మారరోధిత్వ, ఈర్ష్యా
పరత్వములు ఇచ్చట విశేషించి వింధ్యునియందు సమన్వయించుచున్నవి కావున-
ఇది సామాన్యముచేత విశేషమును సమర్థించు - అర్థాంతరన్యాసాలంకారము.

వ॥ అనిన వాచస్పతి పలుకులా కర్ణించి యమ్మునిపుంగవుం
డిట్లనియె. 100

అర్థము :- అనినన్ = అనిపలుక(గా, వాచస్పతి పలుకులు = బృహస్పతి మాటలు, ఆకర్ణించి = విని, "అమ్మునిపుంగవుండు" (ఆ + మునిపుంగవు(డు) ఆ యగస్త్య మహాముని, ఇట్లనియెన్ = ఇట్లు పలికెను.

తే॥గీ॥ యత్న మొనరింతు నీ కార్యమనువు పడ(గ(
జను(డు మీమీ నివాసదేశముల కర్థి
నున్న వా(డుగదా! వీ(డె యుమయు(దాను
కాశికాభ ర్త మనపాలి కల్పతరువు॥ 101

అర్థము :- ఈకార్యము = మీరువచ్చిన యీప్రయోజనము, అనువుపడ(గన్ = అనుపుపడుటకై, యత్నమొనరింతున్ = ప్రయత్నముచేసెదను, అర్థిన్ = ప్రీతితో, మీమీ నివాసదేశములకున్ = మీమీ నివాసప్రదేశములకు, చను(డు = వెళ్ళు(డు, ఉన్నవా(డు = గదా! ఉన్నాడుగదా!, వీ(డె=ఇడుగో!, ఉమయు(దానున్ = పార్వతీదేవియును తానును, కాశికాభ ర్త=కాశీవల్లభు(డు, మనపాలి = మనపాలిటి, కల్పతరువు = కల్పవృక్షము!

తాత్పర్యము :- ఈపని నెరవేరుటకై ప్రయత్నింతును. మీరు మీమీ నివాసములకు వెళ్ళు(డు. ఉన్నాడుగదా! ఇదుగో - ఉమయును తానును - కాశీవల్లభు(డు! శ్రీ విశ్వేశ్వరస్వామి! మనపాలిటి కల్పవృక్షము!

వ॥ అనిన వారును మహాప్రసాదంబని సముచితప్రకారంబునం
గుంభసంభవుని వీడ్కొని నిజనివాసంబులకుం జనిరి. అనంత
రంబ యగస్త్యుండు లోపాముద్రంజూచి యిట్లనియె. 102

అర్థము :- అనినన్ = అగస్త్యముని యిట్లు పలుక(గా - వారును = ఆ దేవతలును ఋషులును, మహాప్రసాదంబని = మహానుగ్రహమని, సముచితప్రకారంబునన్ = తగిన విధముగా, కుంభసంభవునిన్ = అగస్త్యమహాముని, వీడ్కొని = వీడుకొని - వదలి, నిజనివాసంబులకున్ = తమ నివాసములకు, చనిరి = వెళ్ళిరి, అనంతరంబ = వారువెళ్ళిన పిమ్మట, అగస్త్యుండు = అగస్త్యముని, లోపాముద్రంజూచి = భార్యయైన లోపాముద్రనుచూచి, ఇట్లనియెన్ = ఇట్లు పలికెను.

తాత్పర్యము :- అగస్త్యమహాముని యిట్లు పలుఁకఁగా - ఆ దేవమునులు మహాప్రసాదమని పలికి తగిన రీతిగా ఆ మహామునిని వీడ్కొని తమ యిండ్లకు వెళ్ళిరి.

— అగస్త్యుండు కాశీ వియోగంబునకుఁ బరితపించుట —

తే॥గీ॥ కమలలోచన! మనుజుఁ డొక్కటిఁదలంప
దైవమొక్కటిఁ దలఁచు నెంతయు నిజంబు
కాశిఁ బెడఁ బాయనని యేను గదలకుండఁ
గాశిఁ బెడఁబాపె దైవంబు కరుణ లేక॥ 103

అర్థము :- కమలలోచనఁ = పద్మనయనా! తామరపూవులవంటి కన్నులు గలదానా, మనుజుఁడొక్కటిఁ దలంపన్ = మనుష్యుఁడొకరీతిగా నాలోచింపఁగా, దైవమొక్కటిఁ దలఁచుట = దైవమింకొకరీతిగా నాలోచించుట యనునది, ఎంత యున్ = ఎంతైనను, నిజంబు = వస్తుస్థితియని అనుభవములో తెలియుచున్నది. ఏను = నేను, కాశిన్ = కాశీనగరమును, పెడఁబాయ నని = విడిచివెళ్ళనని, కదలకుండన్ = (కదలక + ఉండన్) కదలకయుండఁగా, దైవంబు = దైవము, కరుణలేక = దయలేక, కాశిన్ = కాశి, పెడఁబాపెన్ = పెడఁబాయునట్లుగాఁ జేసెను.

తాత్పర్యము :- మనుష్యుని సంకల్పమొకరీతిగానున్నచో శివునిసంకల్పము వేఱొకరీతిగానుండు నన్నమాట నేఁడు నానుభవములోనికి వచ్చుచున్నది. నేను కాశిని వదలిపోనని సంకల్పించి యుండఁగా-శివుఁడు నన్ను కాశిని వదలివెళ్ళునట్లు చేయుచున్నాఁడు. శివుని దయయున్ననాఁడుగాని జీవుని సంకల్పము శివునిసంకల్పముగా - పరిణమింపదు. అందువల్లనే -

'తన్మే మనశ్శివ సంకల్పమస్తు' అని జపించుట.

తే॥గీ॥ అప్పటికి నియ్యకొంటిఁ గా కంబుజాక్షి!
ఋషుల పాళంబులే యింత లేసి పనులు?
కొసర కాఁబోతు నాఁబోతు క్రుమ్మ్మలాడ
నడిమి' లేఁబెయ్యగతి వచ్చె నాకు నివుడు॥ 104

అర్థము :- అంబుజాక్షి! పద్మలోచనా!, అప్పటికిన్ = ఆ సమయమునకు. ఇయ్యకొంటిఁగాక = అంగీకరించితినిగాని, ఇంతలేసి పనులు = ఇంతింత పనులు. ఇంతటి పరిమాణముగల పనులు, ఋషుల పాళంబులే = ఋషుల కొలఁదులా? (ఋషులు చేయుటకు వీలైనవా?). కొసరక = సంకోచింపక. ఆఁబోతు నాఁబోతు= ఆఁబోతును, ఆఁబోతును, క్రుమ్ములాడన్ = క్రుమ్ముకొనుచుండఁగా, 'నడిమి లేఁబెయ్య గతి నడిమి = మధ్యలోనికిఁ దూటిన, లేఁబెయ్య = (లేత + పెయ్య) లేఁతదూడయొక్క. గతి = స్థితి, ఇపుడు = ఇప్పుడు, నాకున్ = నాకు, వచ్చెన్= వచ్చెను.

తాత్పర్యము :- ఆ సమయమునకు కాదనలేక ఒప్పికొన్నానుగాని, పద్మనయనా! ఇంతింత పనులు ఋషుల కనువైనవా? కొంకక- ఆఁబోతును ఆఁబోతును క్రుమ్ములాడుకొనుచుండఁగా ఆ రెంటిమధ్యలో చిక్కుకొన్న లేమూడ పరిస్థితి యిపుడు నాకు వచ్చినది.

సీ॥ వివరించి చూడంగ విసుమానములుగాక
గోత్రారి వెఱచునే కుధరములకు?
యుగవిరామమున నుగ్రాత ఘూఁపఁగఁజాలు
గాలి కొండ దమి పఁజాలదెట్లు?
సర్వభూతంబుల శాసింపఁ జాలెడు
జములావు గిరియందు జటులువడునె?
దహనుని దాహకత్వంబు మహీధ్ర సం
స్తంభంబునకు శక్తి చాలదొక్కో?

తే॥గీ॥ రుద్రు లాదిత్య తుషిత మరుద్గణములు
తక్కుఁగల దేవతలు జగత్త్రయము ద్రిమ్మిగి
యుమియఁ జాలుదురట్టివా రోపలేరె?
వింధ్యగిరి గర్వసంరంభ విభవమడఁప ॥ 105

అర్థము :- వివరించి చూడంగన్ = విమర్శించి చూడఁగా, విసుమానములు గాక = విద్దూరములుగాని - ఆశ్చర్యములుగాని. 'గోత్రారి' గోత్ర = కొండలకు, అరి = శత్రువైన యింద్రుఁడు (కొండల ఱెక్కలు నఱికినందువల్ల). కుధరముల

కున్ = కొండలకు. వెఱచునే = భయపడునా ? యుగాంతవేళయందు, ఉట్టూతలూపగజాలు=(కొండలను) ఉట్టూతలూపగలిగిన గాలి= వాయువు. కొండన్ = పర్వతమును, దమింపజాలవెట్లు ?=ఎట్లు దమింపజాలదు ?, సర్వభూతంబులన్ = సర్వప్రాణులను, శాసింపజాలెకు = శాసించుటకు సమర్థమైన, జములావు = యమునియొక్క బలము, గిరియందున్ = కొండయందు, చటులువడునె ? = మొక్కపోవునా ?, దహనుని = అగ్నిహోత్రునియొక్క. దాహకత్వంబు = తగులబెట్టు లక్షణము, మహీధ్ర = కొండయొక్క, సంస్తంభమున కున్ = సంస్తంభింపజేయుటకు, శక్తిచాలదొక్కో ! = శక్తిచాలనిదగునా !, రుద్రులు = ఏకాదశరుద్రులు. ఆదిత్య = పన్నెండుగురు సూర్యులు. తుషిత = ముప్పదియార్గురు తుషితులయొక్క, మరుత్ = నలువది తొమ్మండుగురు మరుత్తులయొక్క, గణంబు = గణము. తక్కగల దేవతలు = వీరుకాక మిగిలిన దేవతలు. జగత్త్రయంబున్ = ముల్లోకములను త్రింగి యుమియజాలుదురు = త్రింగి యుమియవేయగలరు అట్టివారు = అంతటి సామర్థ్యముగలవారు. వింధ్యగిరి = వింధ్యపర్వతముయొక్క. గర్వసంరంభ = గర్వసంరంభముయొక్క. విభవము= వైభవమును, అడపన్ = అణచుటకు, ఓపలేరె = చాలలేరా ?

తాత్పర్యము :- వారు వెళ్ళిన పిమ్మట విమర్శించి చూడగా విడ్డూరముగానున్నది. కొండలపెక్కలు నఱికిన దేవేంద్రుడు కొండలకు భయపడునా? యుగాంతసమయములయందు కొండల నుట్టూతలూగించెడు వాయుదేవుడు ఒక కొండను నిగ్రహింపలేడా ? సకల ప్రాణుల శాసింపజాలిన శమనుని బలము ఒక కొండవిషయమున మొక్కపోవునా ? అగ్నిదేవుని దాహకత్వశక్తి ఒక పర్వతమును సంస్తంభింపజేయుటకు జాలకపోయెనా ? ఏకాదశ రుద్రులు. ద్వాదశాదిత్యులు. షట్త్రింశత్తుషితులు. ఏకోనపంచాశ్మరుత్తులు ఈ గణదేవత లొక్కొక్కరు మూడు లోకములను త్రింగి యుమియజాలుదురే ! అంత సామర్థ్యముగల వీరందఱును గలిసికూడ వింధ్యపర్వతగర్వ సంరంభమును అణంపజాలకపోయిరా ?

తే॥గీ॥ కామధేనువుఁ దనయింటఁ గట్టినాఁడు
కలపు తనతోఁట లోపలఁ గల్పతరులు
అట్టి యింద్రుండు ప్రార్థించెనట్లె ! నన్ను
నింత పనికియ్యకోకుండ నెట్లు నేర్తు? 106

అర్థము :- కామధేనువున్ = కామధేనువును, తనయింటన్ = తనయింటి యందు కట్టినాఁడు = కట్టికొనియున్నవాఁడు, తనతోఁటలోపలన్ = తనతోఁటలో, కల్పతరులు = కల్పవృక్షములు, కలవు = ఉన్నవి, అట్టి యింద్రుండు = అటువంటి యిందుర్కిఁడు, ప్రార్థించెనట్టి = ప్రార్థించెనా, నన్నున్ = నన్ను; ఇంత పనికిన్ = ఈమాత్రపుఁబనికి, ఇయ్యకోక = (ఇయ్యకొను-శబ్దపల్లవక్రియ వ్యతిరేకక్త్వార్థకము ఇయ్యకొనక 'కొను'నకు జీత్తుపరమైనపుడు 'కో' ఆదేశము' ఇయ్యక అంగీకరింపక, ఉండన్ = ఉండుటకు, ఎట్లునేర్తున్ = ఏ విధముగా నేరుతును ?

తాత్పర్యము :- కామధేనువును తనయింటిలోఁ గట్టినవాఁడు, తనతోఁటలోనే కల్పవృక్షములన్నియునున్నవి, అటువంటి యిందుర్కిఁడు నాయింటికి వచ్చి ప్రార్థించినాఁడా ఇంతమాత్రపుఁబనికి నేనంగీకరింపక ఎట్లుండఁగలను?

సీ॥ మాట నిల్కడఁగాదె మధుకైటభులు తొల్లి
హరిచేతఁ జచ్చి రేకార్ణవమున?
గరుడుండు మోమోటఁ గాదె వాహనమయి
వనజాక్షు నెక్కించికొనియెపీఁపు?
సాకతంబునఁ గాదె చక్రాయుధుఁ డడంపఁ
బాతాళబిలములో బలియడంగె?
విశ్వాసమునఁగాదె వృత్రాసురేంద్రుండు
సమసె నంబుధి వార[I] శక్రుచేత?

తే॥గీ॥ మెఱసి యుపకార మొనరింప మేలువచ్చు
కీడువచ్చు మనంబులో నోడవలదు
వాఁడుచేసిన ధర్మంబువానిఁ గాచుఁ
గీర్తియొక్కటి చాలదే కేవలంబ? 107

అర్థము :- మాటనిల్కడఁగాదెఁ = మాట నిలుకడవల్లనే కదా, మధుకైటభులు = మధువు, కైటభుఁడు, అనురాక్షసులు, తొల్లి = పూర్వము, ఏకార్ణవము

నన్ = ఏకార్ణవమునందు, (ప్రళయకాలములో. అంతయు జలమైయున్నపుడు). హరి చేతన్ = విష్ణువుచేత, చచ్చిరి = మరణించిరి.

గరుడుండు = గరుత్మంతుఁడు, వాహనమయి = వాహనమై. మోమోటఁ గాదెఁ = మొగమోటమువల్లనేకదా!. వనజాక్షున్ = విష్ణువును. వీఁపు = వీఁపు మీఁద, ఎక్కించుకొనియెన్ = ఎక్కించుకొన్నాఁడు.

సాకతంబునఁగాదెఁ = ఊఁబడింపు మాటవలననేకదా!, చక్రాయుధుఁడు = విష్ణువు, అడంపన్ = అణఁగింపఁగా, పాతాళ బిలములో = పాతాళవివరములో. బలి = బలిచక్రవర్తి, అడంగెన్ = అణఁగియుండెను.

విశ్వాసమునఁగాదెఁ = నమ్మికమువలననేకదా!, 'వృత్రాసురేంద్రుండు' వృతగ్ని = వృత్రుఁడనెడి, అసురేంద్రుండు = రాక్షసేంద్రుఁడు, 'అంబుధివార' అంబుధి = సముద్రముయొక్క, వారన్ = ఓర యందు-అచునందు తీరమునందు. శక్రిచేతన్ = ఇంద్రునిచేత, సమపెన్ = చచ్చెను.

మెఱసి = ముందునకువచ్చి, ఉపకారమొనరింపన్ = ఉపకారముచేయఁగా, మేలువచ్చు- కీడువచ్చున్ = మేలైన రావచ్చును. కీడైనారావచ్చును, మనంబు లోన్ = మనస్సునందు, ఓడవలదు = జంకవలదు. వాఁడుచేసిన ధర్మంబు = వాఁడుచేసిన ధర్మము, వానిన్ = వానిని. కాచున్ = కాపాడును, కేవలంబు = కేవలమును, కీర్తియొక్కటి = కీర్తియొక్కటియే, చాలదేఁ = చాలదా? (1 అంబుధి వాక అని పాఠాంతరము)

తాత్పర్యము :- తొల్లి ఏకార్ణవమైననాఁడు మధుకైటభులు తామాడిన మాటకు నిఱచియేకదా! విష్ణువుచేతమరణించిరి. గరుత్మంతుఁడు వాహనమైవిష్ణువును తనవీఁపుపైనెక్కించికొనుట మొగమోటమువల్లనేకదా! ఊఁబడింపువల్లనే (సామ వచనము) కదా! విష్ణువు అణఁగఁద్రొక్కఁగా బలిచక్రవర్తి పాతాళ వివరములో అణఁగియుండుట! నమ్మిక వల్లనేకదా! సముద్రపుటోరను వృత్రాసురుఁడు. ఇంద్రునిచేతఁ జచ్చిపోవుట! కావున-చొరవచేసి ముందునకు వచ్చి యితరులకు - ఉపకారముచేయునప్పుడు తనకు మేలైన రావచ్చును. కీడైననురావచ్చును. దేనికిని మనస్సులో జంకకూడదు. ఎప్పుడును వాఁడుచేసిన ధర్మము వానిని కాపాడుచునే యుండును. పరమార్థమునకు కీర్తియొక్కటిచాలదా?

చం॥ ప్రతిదివసంబు విందుము పురాణముఖంబునఁ గాశియందు సం
తతముగ నంతరాయములు దాఁకుచునుండుననంగ, నిప్పుడా
శ్రుతి నిజమయ్యె, నేనిదె యశోక మనస్కత నుండఁగా నత
ర్కిత గతి వచ్చెఁ జూడుమిదె కిన్నరకంఠి! మహాంతరాయ
ముల్. 108

అర్థము :- కాశియందున్ = కాశీకానగరమునందు, అంతరాయములు = విఘ్నములు, సంతతముగన్ = ఎడతెగకుండ, తాఁకుచునుండుననంగన్ = తగులుచుండునని యనఁగా, పురాణముఖంబునన్ = పురాణములద్వారా, ప్రతిదివసంబున్ = ప్రతిదినమును, విందుము = వినుచుందుము, ఇప్పుడు = ఇప్పుడు, ఆశ్రుతి = ఆ విన్నమాట, నిజమయ్యెన్ = వాస్తవమయ్యెను, నేను = నేను, ఇదె = ఇట్లే, ఆశోకమనస్కతన్ = శోకములేని మనస్థితితో, ఉండఁగాన్ = కాలముపుచ్చుచుండఁగా, ఇదె = ఇదిగో!, అతర్కితగతిన్ = ఊహింపనిరీతిగా, మహాంతరాయముల్ = (మహత్ + అంతరాయములు) గొప్పవిఘ్నములు, వచ్చెన్ = వచ్చెను, కిన్నరకంఠి! = కిన్నరవీణవంటి కంఠ ధ్వని గలదానా! చూడుము.

తాత్పర్యము:- ఓ కిన్నరకంఠీ! మనము ప్రతిదినము పురాణములద్వారా కాశిలో ఎప్పుడును ఏవో విఘ్నములు తగులుచుండునని వినుచునేయున్నాము గదా! అ విన్నమాట యిప్పుడు మనయనుభవములోనికేవచ్చినది. నేను నిర్విచారమైన మనస్సుతో - ఈ మహాక్షేత్రమునందు స్వస్థుఁడనైయుండఁగా - అనుకోనిరీతిగా- ఈ మహావిఘ్నములు వచ్చి మీఁదపడినవి చూడుము! మనకాశీనివాసమునకిట్టి యంతరాయములు కలుగునని నేనెన్నఁడును ఊహింపనైనను లేదు.

తే॥గీ॥ విముఖుఁడయ్యెఁజుమీ! నాకువిశ్వభర్త
కాకయూరక యేభంగిఁ గలుగనేర్చు
సకలకైవల్య కల్యాణ జన్మనిలయ
కాశికాక్షేత్ర విప్రయోగవ్యథార్తి॥ 109

అర్థము :- విశ్వభర్త = శ్రీ విశ్వేశ్వరస్వామి, నాకున్ = నాకు, విముఖుఁడయ్యెఁజుమీ! = పెడమొగముపెట్టెనుసుమా!, కాక = విముఖుఁడు కానిపక్షము

వందు, ఊరక = మిన్నక, 'సకల....ఆర్తి' సకల = సమస్తప్రాణులకు, కైవల్య కల్యాణ = ముక్తి కల్యాణమునకు, జన్మనిలయ = పుట్టినిల్లైన, కాశీకాక్షేత్ర = కాశీక్షేత్రముయొక్క, విప్రయోగవ్యథా = వియోగ దుఃఖరూపమైన ఆర్తి = పీడ, ఏభంగిన్ = ఏ విధముగా, కలుగనేర్చున్ = సంభవింపఁగలదు?

తాత్పర్యము :- శ్రీ విశ్వేశ్వరస్వామి నాయందు వైముఖ్యము భజించె నని నిశ్చయముగాఁ దెలియుచున్నది ఆయననాయందు సౌముఖ్యముకలవాఁడే యైన వాఁడు సకల జీవులయొక్క ముక్తి కల్యాణమునకు పుట్టినిల్లైన కాశీక్షేత్రము యొక్క వియోగదుఃఖమైన యీపీడ నాకే విధముగా సంభవింపఁగలదు?

తే॥గీ॥ పాణి యాహారకబళంబుఁ బాఱవైచి
కూర్పరమునాకు పిసవెట్టి కూళవోలె
భోగమోక్షములకు జన్మభూమియైన
కాశిఁబిడిచి నరుండన్యదేశ మరుగు॥ 110

అర్థము :- 'పాణియాహారకబళంబున్' పాణి = చేతిలోనున్న, ఆహారకబళం బున్ = అన్నపుముద్దను, పాఱవైచి = విసరివైచి, కూర్పరమున్ = మోచేతిని, నాకు=నాకునట్టి, 'పిసవెట్టి కూళ వోలెన్' పిస = అవివేకముగల, వెట్టి = పిచ్చివాఁడైన, కూ వోలెన్ = మూఢునివలె, భోగమోక్షములకు = ఐహికాముష్మికములకు, జన్మభూమి యైన = పుట్టినిల్లైన, కాశిన్ = కాశీప్రదేశమును, విడిచి = వదలిపెట్టి, నరుండు = మనుష్యుఁడు, అన్యదేము = వేఱొకదేశమునుగూర్చి, అరుగున్ = పోవును.

తాత్పర్యము :- తనచేతిలోనున్న యన్నపు ముద్దను దూరముగా విసరి వైచి, తనమోచేతిని నాకికొనెడి వివేకములేని యున్మత్తుఁడైన మూఢునివలె ఐహి కాముష్మిక సుఖములకు పుట్టినిల్లైన కాశీప్రదేశమును విడిచి మనుష్యుఁడన్య దేశము నకు బోవును.

విశేషము :- ఉపమాలంకారము, ఐక్యారోపముకాక - 'పోలెన్' అను ఉప మావాచకము ప్రయోగింపఁబడియున్నది కావున నిదర్శనాలంకారముకాదు.

చం॥ తటుకున నియ్యకొంటి మతి తప్పి మరుద్గురుఁడంత వానితో
యట మట మింకఁ బోఁక యడియాసలనుండుట; పాప
మైవమా!
యిటు ననుఁ జిక్కఁ వెట్టుదె? యనేక విధంబుల నెట్లు చెప్పినన్
గటకట! యెట్లుపాయనగుఁ గాశిక మోక్షపదప్రకాశికన్ ॥111

అర్థము :- మతితప్పి = మతిచెడి, రానున్నది యూహింలేపక, మరుద్గురుఁడంత వానితో = దేవగురుఁడైన బృహస్పతి యంతటి పెద్దవానితో, తటుకునన్ = తటుక్కున-వెనువెంటనే, ఇయ్యకొంటిన్ = అంగీకరించితిని-ఒప్పుకొంటిని, ఇంకన్ = ఇటుపైన, పోక = వెళ్ళక, అడియాసలన్ = రిత్తయాసలతో-వ్యర్థమనోరథములతో, ఉండుట = కాశిలోనేయుండుట, అటమటము = మోసము-వంచన, అసత్యము, (నగును), పాపదైవమా! = ఓ పాపపుదైవమా! వెనుకటి జన్మములలోని పాపఫలముగా ప్రాప్తించిన దురదృష్టమా!, ఇటు = ఈ విధమైన - ఏమి చేయుటకు పాలుపోని పరిస్థితి కల్పించుటగా, ననున్ = నన్ను, చిక్కఁవెట్టుదె? = చిక్కుపఱుతువా!, అనేక విధంబులన్ = ఎన్నోవిధములుగా, ఎట్లుచెప్పినన్ = ఏ విధముగా చెప్పినను, మోక్షపదప్రకాశికన్ = మోక్షపదమును ప్రకాశింపఁజేయు నట్టి, కాశికన్ = కాశీనగరమును, ఎట్లు = ఏ విధముగా, పాయనగున్ = విడువ శక్యమగును?

తాత్పర్యము :- నేను ముందరి యాలోచన లేక బృహస్పతి యంతటి వానితో, తటుక్కున ఒప్పుకున్నాను. ఇటుపైన వెళ్లక రిత్తయాసలతో నిచ్చటనే యున్నచో, మోసముచేసినట్లగును. అసత్యమాడినట్లగును. ఓ నా దురదృష్టమా! ఇట్టి పరిస్థితిని కల్పించి నన్నెన్నివిధములఁ జిక్కఁపెట్టుచున్నావు! ఎంత సమాధానపఱిచికొన్నను మోక్షపదప్రకాశికయైన కాశికను ఎట్లు విడువనగును? అయ్యయ్యో!

విశేషము :- 'స్మృతి' భూతవిషయిక జ్ఞానము. 'మతి' భవిష్యద్విషయములకు సంబంధించిన జ్ఞానము. 'బుద్ధి' వర్తమాన విషయములకు సంబంధించిన జ్ఞానము. 'ప్రజ్ఞ' మూఁడు కాలములకు సంబంధించిన జ్ఞానము.

'స్మృతి ర్వ్యతీతవిషయా మతిరాగామిగోచరా
బుద్ధి స్తత్కాలికీ ప్రోక్తా ప్రజ్ఞా త్రైకాలికీ నుతా.'

సీ॥ పాయంగ వచ్చునే ప్రాలేయగిరికూట
సమవతీర్ణ జలౌఘజహ్నుకన్య?
మఱువంగ వచ్చునే మందార మధురసా
స్వాద ఘూర్ణిత నేత్ర వటుకనాథు?
విడువంగ వచ్చునే విఘ్నాంధకారార్క-
డుంఠివిఘ్నేశు మండూకజఠరు?
మానంగవచ్చునే మధ్యాహ్న కాలంబు
శ్రీ విశాలాక్షి కెంజేతిభిక్షు?

తే॥గీ॥ సురలు ప్రార్థింపఁగాఁ బ్రతిశ్రుతము చేసి
యెట్లు పోకుండనేర్తునే నింత వాఁడ?
నెట్లు వోనేర్తుఁగాశిఁ బుణ్యైకరాశిఁ
బ్రకట గుణ రత్న దుగ్ధాంబురాశిఁ బాసి॥ 112

అర్థము :- 'ప్రాలేయగిరి .... జలౌఘున్' ప్రాలేయగిరి = మంచుకొండ యొక్క, కూట = చటీయనుండి, సమవతీర్ణ = (సమ్ + అవతీర్ణ) దిగిన, జలౌఘున్ = (జల + ఓఘు) జలములయొక్క ప్రవాహములుగల, జహ్నుకన్యన్ = జాహ్నవిని-గంగానదిని, పాయంగవచ్చునేఁ = ఎడఁబాయుటకు శక్యమగునా?, 'మందార .... నేత్రున్' మందార = మందారపుష్పములనుండి తీసిన, మధురస = మధిరారసముయొక్క, అస్వాద = ఆనుటచేత, ఘూర్ణిత = తిరుగుడు పడుచున్న, నేత్రున్ = కన్నులుగల, వటుకనాథున్ = కాలభైరవస్వామిని, మఱువంగ వచ్చునేఁ = మఱుచుటకు శక్యమగునా?, విఘ్నాంధకారార్కున్" విఘ్న = అంతరాయములేయనెడి, అంధకార = చీఁకటులకు, అర్కున్ = సూర్యుఁడైనట్టియు, 'మండూకజఠరున్' మండూక = కప్ప యాకారముగల, జఠరున్ = బొజ్జగల, "డుంఠి విఘ్నేశున్' డుంఠి = డుంఠి నామకుఁడైన, విఘ్నేశున్ = విఘ్నేశ్వరుని, విడువంగవచ్చునే = విడువశక్యమగునా?, మధ్యాహ్నకాలంబు = మధ్యాహ్న వేళయందలి, శ్రీ విశాలాక్షి = శ్రీ విశాలాక్షీదేవియొక్క, 'కెంజేతి భిక్షున్' కెంజేతి = (కెంపు + చేయి) ఎఱ్ఱని పాణితలముతో వడ్డింపఁబడిన, భిక్షున్ = భిక్షను, మానంగవచ్చునేఁ = మానుటకు శక్యమగునా?, సురలు = దేవతలు, ప్రార్థింపఁగాన్ = ప్రార్థనచేయఁగా, ప్రతిశ్రుతముచేసి = వాగ్దానముచేసి, నేనింత

వాఁడన్ = ఇంతవాఁడనైన నేను. ఎట్లు = ఏరీతిగా, పోకుండ నేర్తున్ = వెళ్లక యుండఁగలను?, ఎట్లు = ఏరీతిగా, పోనేర్తున్ = వెళ్లఁగలను:, 'పుణ్యైకరాశిన్' పుణ్య = పుణ్యములయొక్క, ఏకరాశిన్ = ఒకేరాశియైనట్టియును, 'ప్రకట.... అంబురాశిన్' ప్రకట = ప్రసిద్ధములైన, గుణరత్న = గుణములే యనెడి రత్నములకు, దుగ్ధాంబురాశిన్ = పాలసముద్రమైన, కాశిన్ = కాశీనగరమును. పాసి = ఎడఁబాసి;

తాత్పర్యము :- ఒకే స్థలములో చిరకాలము నివసించి దానిని విడిచి పోవలసి వచ్చినపుడు, ఆస్థలానుబంధము ప్రాణులనుమిక్కిలి బాధించు చుండును. వృక్షమును తీఁగ అల్లుకుపోయినట్లు మనమున్న పరిసరములను మన జీవిత మల్లుకొని పోయియుండును. ఇంక-పరమైవుఁడైన అగస్త్యమహామునికి కాశీక్షేత్రముతోడి యనుబంధములను గూర్చి చేఱుగఁ జెప్పవలయునా? ఇంకఁ గొన్నిక్షణములలోఁ గాశీమహాక్షేత్రమును దేవహితమునకై విడిచిపోవలసియున్నది. ఆయన కాశీవియోగ దుఃఖమిట్లు తరంగితమగుచున్నది - చలికొండ చటీయలనుండి జాలువాటిన జల ప్రవాహములఁగల చల్లనితల్లి యీ జాహ్నవిని వదలిపోవుటయెట్లు?

మందార మదిరా రసాస్వాదమునన్నెఱ్ఱవారి తిరుగుడుపడుచున్న కన్నులతో రేలు కాశీమహానగరమునకుఁ బ్రహరి తిరుగుచుఁ బ్రాణప్రదముగా కాపాడికొని యుండెడి యీ వటుకనాథుని మఱువఁగలనా?

ఆశ్రితుల విఘ్నాంధకారములను ఉదయకాల సూర్యబింబమై పటాపంచలు చేసి కాపాడెడి మండూక జఠరుని కాశీయువరాజును, ఈడుంటి విఘ్నేశ్వరస్వామిని పట్లు విడిచిపోఁగలనుఁ?

ఎవరిమాట యెట్లున్నను మధ్యాహ్నమగునప్పటికి బిడ్డలయాఁకలి ప్రొద్దెటిఁగి కడుపారసి అమ్మ విశాలక్షీ మహాదేవి తన యరుణ పాణితలముతో వడ్డించెడి ఆ యమృతాన్నభిక్షమును మానుకొని బ్రదుకుట యెట్లుఁ? అదేనతలందఱు కట్ట కట్టుకొని యింటికివచ్చి ప్రాయోపవేశముచేసినంత పనిచేయఁగా మాటయిచ్చి పరువు ప్రతిష్ఠలతో బ్రదుకుచున్న నేను పోకుండుటయెట్లుఁ? సకల ప్రాక్తన పుణ్యములకును-ఏకరాశియును, సకలగుణ రత్నములకు క్షీరవారాశియునైన యీకాశినిఁ బాసి నేనెట్లు పోనేర్తునుఁ?

కం: కాశీక్షేత్రము పంచ
క్రోశము కైవల్యలక్ష్మి కులగృహమని యా
కోర్కిం చు శ్రుతులు వినియును
దేశాంత మరుగ సమ్మతింతురభాగ్యుల్ 113

అర్థము :- కాశీక్షేత్రము = కాశిపొలము, పంచక్రోశము = ఐదుకోసులమేర యును, కైవల్యలక్ష్మి = మోక్షలక్ష్మియొక్క, కులగృహమని = కాణాచియని. ఆకోర్కించు = బగ్గఱగా నరచుచున్న. శ్రుతులు = వేదములు, వినుకలులు. వినియును = వి కూడ, అభాగ్యుల్ = భాగ్యహీనులు, దేశాంతరము = అన్యదేశమును గూర్చి. అరుగన్ = వెళ్ళుటకు. సమ్మతింతురు = ఒడఁబడుదురు.

తాత్పర్యము :- కాశికాక్షేత్రము ఐదుకోసులమేరయును మోక్షలక్ష్మికిఁ గాణాచి యని బిగ్గఱగా నరచుచున్న వేదముల ఘోషవిని కూడ భాగ్యహీనులైన జనులు, అన్యదేశమునకు పోవుట కొడఁబడుచుందురు.

తే॥గీ॥ కాశిఁబాయుదుఁ గాకేమి కలువకంటి!
యంతరవిముక్త తీర్థంబు నాశ్రయింతు
నంతరవిముక్త తీర్థ మెయ్యదియొ యనిన
వరణయును ససియును నైనవారణాసి॥ 114

అర్థము :- కలువకంటిఁ = ఓ ఉత్పలనయనా!, కాశిన్ = కాశి. పాయుదుఁగాక = విడిచిపెట్టెదనేయనుము. ఏమిఁ = అయిననేమి, 'అంతరవిముక్తతీర్థంబు' (అంతఃఁ + అవిముక్తము), అంతఃఁ = లోపలిదియైన. అవిముక్తతీర్థమును = కాశీక్షేత్రమును. ఆశ్రయింతున్ = ఆశ్రయించెదను, అంతరవిముక్తతీర్థము = అంతఃకాశీతీర్థము, ఎయ్యదియొయనినన్ = ఏదియో? అని యందువేని, వరణయును = వరణయును, అసియును = అసియును, ఆయిన = ఒకటియైన - సమ్మేళనమైన వారణాసి = వారణాసి.

తాత్పర్యము :- ఓసి యుత్పలనయనా! నేను కాశిని వదలెదనే యనుము. అయిననేమిఁ ఆంతరమైన అవిముక్త తీర్థమునాశ్రయించెదను. అంతరమైన ఆయవిముక్త తీర్థమేదిఁ అని యందువేని, 'వరణ'యును, 'అసి'యును గలిసిన 'వారణాసి, దీనిని వెనువెంటనే వివరించుచున్నాఁడు.

విశేషము:- ఈ 114 వ పద్యమునుండి యీ ఆఖ్యానము 133 వ గద్యము వఱకుఁ గల విషయమంతయును సూత సంహితనుండి గ్రహింపఁబడినది. సంస్కృతకాశీఖండములోనిదికాదు.

తీర్థముల బాహ్యాభ్యంతర విభాగము యోగశాస్త్రవిషయము మొదలైనవన్నియును సూతసంహితనుండి - దానికి వ్యాఖ్యయైన విద్యారణ్యుల తాత్పర్యదీపికనుండి సంగ్రహింపఁబడిన గ్రంథము.

వ॥ భ్రూఘ్రాణంబుల సంధి యవిముక్తస్థానంబు. అది యభ్యంతర తీర్థంబు. తీర్థంబులు బాహ్యాభ్యంతర భేదంబునద్వివిధంబులై యుండు. 115

అర్థము :- 'భ్రూ' ఘ్రాణంబుల సంధి' భ్రూ = రెండు కనుబొమ్మల యొక్క, ఘ్రాణంబుల = నాసాగ్రముయొక్క, సంధి = సంధిప్రదేశము. అవిముక్త స్థానంబు = 'అవిముక్త' ప్రదేశము. అది = ఆ,యవిముక్తస్థానము. అభ్యంతరతీర్థంబు = లోపలి తీర్థము, తీర్థంబులు = తీర్థములు, బాహ్యాభ్యంతర భేదంబునన్ = బాహ్యములు, ఆభ్యంతరములు. అనుభేదముచేత. ద్వివిధంబులై = రెండువిధములు కలవియై, ఉండున్ = ఉండును.

తాత్పర్యము :- భ్రూమధ్యప్రదేశము - నాసాగ్రప్రదేశము- అనునీ రెండు ప్రదేశములు కలియు ప్రదేశమే అవిముక్తస్థానము. అది ఆభ్యంతరతీర్థము (లోపలి తీర్థము) తీర్థములు - బాహ్యములని, ఆభ్యంతరములని. రెండువిధములుగా నుండును.

తే॥గీ॥ ఎల్లవియు బాహ్యతీర్థంబులిందువదన!
యరయబాహ్యాంబులయ్యు నాభ్యంతరములు
కాశికాతీర్థ మాదిగాఁ గలవు కొన్ని
వాని వినిపింతుఁ బరిపాటి వనిత! వినుము॥ 116

అర్థము :- ఇందువదన! = చంద్రుని వంటి ముఖముకలదానా!, ఎల్లవియున్ = అన్నియును, బాహ్యతీర్థంబులు = వెలుపలి తీర్థములే, అరయన్ = విచారింపఁగా, బాహ్యంబు లయ్యున్ = వెలుపలి వయ్యును, ఆభ్యంతరములు = లోపలివి కూడనైనవి, కాశికాతీర్థమాదిగా = కాశీతీర్థముమొదలైనవి, కొన్ని = కొన్ని.

కలవు = ఉన్నవి. వానిన్ = అట్టివానిని, పరిపాటిన్ = క్రమముగా, వినిపింతున్ = వినిపింతును, వనితఃలు = వనితాఃలు, వినుము = ఆలకింపుము.

తాత్పర్యము :- అన్నియును వెలుపలి తీర్థములేకాని విచారింపగా కొన్ని వెలుపలివయ్యును లోపలివి కూడ నైయున్నవి కాశిమొదలైనవి అట్టివి. వానినన్నిం టిని చరుసగా వినిపింతును వినుము. ఈ చెప్పఁబోవుతీర్థములు బాహ్యములగు టతోఁ బాటుగ ఆభ్యంతరములు కూడ నయియున్నవి. ఇవి మానవశరీరమునందే నెలకొనియున్నవి. వానిని, లోఁజూపుతో అనుసంధానము చేయఁగలిగినప్పుడే బాహ్యతీర్థసేవనము వీర్యవంతమగును.

సీ॥ శీర్షంబు నందలి శ్రీశైలతీర్థంబు
మల్లికార్జున దేవు మనికిపట్టు
ఫాలభాగమునందుఁ బ్రాలేయమయమైన
విమల కేదారతీర్థము వసించుఁ
గుచచూచుకములందుఁ గురుజాంగలమ్ములఁ
తీర్థరాజము సంప్రతిష్ఠ నొందు
భూపల్లలీ యుగ్మమున కు మధ్యంబున
నానందవనతీర్థ మధివసించు

తే॥గీ॥ నంతరంగమ్మునఁ బ్రయాగమాశ్రయించు
నిమ్నహాతీర్థములు పార్వతీశ్వరునకు
విహరణ స్థానములు వేదవిశ్రుతములు
వెలుపలను లోపలనునుండుఁ దలిరుఁబోడి॥ 117

అర్థము :- శీర్షంబునందలి = శీర్షప్రదేశమునందలి, శ్రీ శైలతీర్థంబు = శ్రీశైలతీర్థము. మల్లికార్జునదేవు = మల్లికార్జునస్వామియొక్క. మనికి పట్టు = నివాసస్థానము. ఫాలభాగమునందున్ = లలాటప్రదేశమునందు - నొసలియందు. ప్రాలేయమయమైన = మంచు మయమైన, 'విమల కేదారతీర్థము' విమల = నిర్మలమైన, కేదారతీర్థము = కేదారతీర్థము. వసించున్ = ఉండును, కుచచూచుకములందున్ = చనుమొలయందు, కురుజాంగలమ్ముల తీర్థరాజము = కురుదేశము

లకు సంబంధించిన తీర్థరాజము – "కురుక్షేత్రము", సంప్రతిష్ఠన్ = సమ్యక్ ప్రతిష్ఠను, ఒందున్ = పొందును, భ్రూవల్లరీయుగ్మమునకున్ = తీగలవంటి కనుబొమల జంటకు మధ్యంబునన్ = మధ్యభాగమునందు, అనందవనతీర్థము = కాశీతీర్థము. అధివసించున్ = నివసించును, అంతరంగమ్మునన్ = హృదయము నందు, ప్రయాగము = ప్రయాగతీర్థము, ఆశ్రయించున్ = ఆశ్రయించి యుండును, ఇమ్మహాతీర్థములు = ఈ మహాతీర్థములు, పార్వతీశ్వరునకున్ = పార్వతీ వల్లభునకు. విహరణస్థానములు = విహారప్రదేశములు, వేదవిశ్రుతములు = వేదము లలో ప్రసిద్ధములైనవి. తలిరుబోడి = చిగురుబోడీ-పల్లవగాత్రి, వెలుపలను = భూమియందును, లోపలను = మానవశరీరములోపలను. ఉండున్ = నివసించి యుండును.

తాత్పర్యము :- బాహ్యస్థితములై ఆభ్యంతరస్థితములుకూడనైన తీర్థ ముల స్థానములను మానవశరీరమునందు నిర్దేశించుచున్నాడు. మల్లికార్జున మహా లింగమునకు నిలయమైన శ్రీశైలమహాతీర్థము మనశీర్షప్రదేశమునందున్నది. అచ్చట శివునిఁ జూచుటయే శిరదర్శనము. మన ఫాలప్రదేశమునందే ప్రాలేయావృతమైన కేదారతీర్థమున్నది. చనుమఱులయందు కురుక్షేత్రము నెలకొనియున్నది. కనుబొమల నడుమ కాశీమహాక్షేత్రమున్నది. మనహృదయమునాశ్రయించికొని ప్రయాగతీర్థ మున్నది. ఈ మహాతీర్థములయందు పార్వతీసహాయుఁడై పరమశివుఁడెల్లపుడును గ్రీడించుచుండును. వేదప్రసిద్ధములైన యీ తీర్థములు వెలుపలి భూమిపైనున్నట్లే మానవశరీరము లోపలకూడ నుండును.

వ॥ బాహ్యాభ్యంతరంబులయందును **నవిముక్త**తీర్థంబుత్తమోత్త మంబు. అట్టి తీర్థంబు**ననుండి** యఖండంబు. సచ్చిదా**నం**దైక రసంబు. నద్వితీయంబునగు నిష్కలస్వరూపంబును **నర్ధనారీ** శ్వరాదిరూపంబైన సకలస్వరూపంబు**ను**. నగు విశ్వనాథు నుపా సింప నొడఁ గూడదయ్యెంగావున నింక నేను భావతీర్థంబునన యాభర్గు నుపాసించెద. సంసార**సాగ**రంబుఁ దరియింప సాధనం బగుటం దీర్థంబయ్యె. ఆభ్యంతరంబైన యవి**ముక్త**తీర్థంబు బ్రహ్మ విష్ణుమహేశ్వరుల కుపలబ్ధి స్థానంబగుటంద్రి**మూర్తుల**కు సాధార ణంబయ్యును మహేశ్వరునకుం బ్రధా**న**స్థానంబైయుండు. 118

అర్థము :- "బాహ్యాభ్యంతరంబులయందును" బాహ్య = వెలుపల. ఆభ్యంతరంబులయందును = లోపల. అనురెండింటియందును. అవిముక్తతీర్థంబు = అవిముక్తతీర్థము. ఉత్తమోత్తమంబు=(ఉత్తమ+ఉత్తమ) ఉత్తమములలో-ఉత్తమమైనది. అట్టి = అ విధమైన. తీర్థంబునన్ = తీర్థమునందు. ఉండి = నివసించి. అఖండంబు = పరిపూర్ణమును. 'సచ్చిదానందైకరసంబు" (సత్ + చిత్ + ఆనంద + ఏకరసంబు). సత్ = సత్తాస్వరూపము ఉనికియే స్వరూపముగా గలది యును. చిత్ = చిత్స్వరూపము - ఎఱుకయే స్వరూపముగా గలదియును. అనంద = ఆనందమే స్వరూపముగాగలదియును, ఏకరసంబును = ఈమూడును - ఒకటియేయైన అఖండరసస్వరూపమును. అద్వితీయంబును = తనకంటె రెండవది లేనిదియును. నిష్కలస్వరూపంబును = నిష్కలమైనదియును - అనా విష్కృతకళమైన కేవలమును. 'అర్ధనారీశ్వరాదిరూపంబైన' అర్ధనారీశ్వర = శరీర సగము స్త్రీ యైన రూపముమొదలైన. సకలస్వరూపంబును. ఆవిష్కృతమైన కళ వెలువరింపఁబడిన కళగల స్వరూపమును. అగు = ఐన. విశ్వనాథున్ = విశ్వేశ్వరుని. ఉపాసింపన్ = ఉపాసించుటకు. ఒడఁగూడదయ్యెన్ = ఒనఁగూడదయ్యెను. కావునన్ = కాబట్టి, ఇంకన్ = ఇటుపైన, నేను = నేను. భావతీర్థంబునన్ = భావస్వరూపమైన తీర్థమునందే, అ భర్గున్ = ఆ తేజస్వరూపుని. ఉపాసించెదన్ = ఉపాసింపఁగలను. సంసారసాగరంబున్ = సంసారమేయనెడి సముద్రమును. తరియింపన్ = దాఁటుటకు. సాధనంబు = ఉపకరణము. అగుటంజేసి = అయినందు వలన. "తీర్థంబయ్యెన్ =" తీర్థ" మను పేరుగలది-అయ్యెను. ఆభ్యంతరంబైన = లోపలిదియైన. అవిముక్తతీర్థంబు = కాశీతీర్థము, బ్రహ్మవిష్ణుమహేశ్వరులకున్ = బ్రహ్మకును, విష్ణువునకు. మహేశ్వరునకు. 'ఉపలబ్ధిస్థానము' ఉపలబ్ధి = ప్రాప్తికి, స్థానంబు = నెలవు. అగుటన్ = అయినందువలన. త్రిమూర్తులకున్ = మువ్వురు మూర్తులకును. సాధారణంబయ్యును = సమానమే అయినను, మహేశ్వరునకున్ = మహేశ్వరునకు, ప్రధానస్థానంబై = ముఖ్యస్థానమై. ఉండును = ఉండును.

తాత్పర్యము :- ఈ చెప్పిన బాహ్యాభ్యంతర తీర్థములలో - 'అవిముక్త తీర్థము' ఉత్తమములైన వానిలో నుత్తమము, అట్టి అవిముక్త తీర్థమునందు నివసించి పరిపూర్ణము, సచ్చిదానందములు మూఁడును, ఒక్కటియే యైన - అఖండ రసస్వరూపము, తనకంటె రెండవది లేనిదియు, నగు నిష్కలస్వరూపమును, అర్ధనారీశ్వరుఁడు మొదలైనరూపములుగల-సకల స్వరూపమునైన విశ్వనాథుని

ఉపాసించుటకు వీలుపడదయ్యెను. కాబట్టి ఇఁక మీఁదట నేను భావస్వరూపమైన లోపలితీర్థమునందే తేజఃపుంజమైన అ పరమశివుని ఉపాసించెదను. సంసారమను సాగరమును తరించుటకు సాధనభూతము కావున-దానికి-'తీర్థ'మను సార్థకసంజ్ఞకలిగినది. ఆభ్యంతరమైన యీ 'అవిముక్తతీర్థము' బ్రహ్మవిష్ణుమహేశ్వరులకు ప్రాప్తిస్థానమైనందువలన-త్రిమూర్తులకును సమానమే అయినను మహేశ్వరునకు ప్రధానస్థానమైయుండును. ఆవతారిక = ఎందువలన మహేశ్వరునకు ప్రధానస్థానమో సప్రమాణముగ నిరూపించుచున్నాఁడు—

సీ॥ ఏ విధంబున నాత్మ నెఱుఁగుదు నేనంచు
యాజ్ఞవల్క్యని నత్రియడిగెఁ దొల్లి;
అవిముక్తమున యందుపాస్యుఁడాత్ముఁడటంచు
యాజ్ఞవల్క్యండతిఁకానతిచ్చె
నాయవిముక్త మెందాశ్రయించినది యం
చడిగెఁ గ్రమ్మఱ నత్రియాజ్ఞవల్క్య
నినుపారి వరణయందును నసియందు
నదియుండునని యత్రికానతిచ్చె

తే॥గీ॥ యాజ్ఞవల్క్యండు; భ్రూమధ్య మాస్థలంబు
వరణ సంసారదోష నివారణంబు
నాశి యింద్రియదోష వినాశనంబుఁ
జేయుచుండుట యిటు నిర్వచింపఁబడియె॥ 119

అర్థము :- ఏ విధంబునన్ = ఏ రీతిగా, అత్మన్ = ఆత్మపదార్థమును, ఎఱుఁగుదు నేనంచున్ = నే నెఱుఁగఁగలనని, యాజ్ఞవల్క్యనిన్ = యాజ్ఞవల్క్య మహర్షిని, తొల్లి = పూర్వము, అత్రి = మహర్షియైన అత్రి, అడిగెన్ = పరిప్రశ్నముచేసెను, ఆత్ముఁడు = ఆత్మ, అవిముక్తమునయందున్ = 'అవిముక్త' స్థానమునందు, ఉపాస్యుఁడటంచున్ = ఉపాసింపఁదగినవాఁడని, యాజ్ఞవల్క్యండు = యాజ్ఞవల్క్య మహర్షి, అత్రికిన్ = అత్రిమహర్షికి, ఆనతిచ్చెన్ = ఆనతియిచ్చెను, ఆ యవిముక్తము = ఆ యవిముక్తస్థానము, ఎందున్ = ఏ ప్రదేశమునందు

ఆశ్రయించినది యంచున్ = నెలవుకొనియున్నదిఁ అని, క్రమ్మఱన్ = తిరిగి, అత్రి = అత్రి మహర్షి, యాజ్ఞవల్క్యున్ = యాజ్ఞవల్క్యుని, అడిగెన్ = అడిగెను, వరణయందును = 'వరణ' యందును, అసియందును = 'అసి' యందును, నినుపారి = (నినుప + అరి) నిండారి, అది = ఆ "అవిముక్తము' ఉండునని = ఉండునని, అత్రికిన్ = అత్రిమహర్షికి, యాజ్ఞవల్క్యుఁడు = యాజ్ఞవల్క్యమహర్షి, ఆనతిచ్చెన్ = ఆనతియిచ్చెను, ఆ స్థలంబు = ఆ 'అవిముక్త'ము ఉండుస్థలము, భ్రూమధ్యము = రెండుకనుబొమల నడిమి ప్రదేశము, వరణ = "వరణ" యను నది, "సంసారదోషనివారణంబు" సంసార = సంసారము నందలి, దోష = దోషముల యొక్క, నివారణంబు = నివారించుటను, నాశి = 'నాశి' అనునది, 'ఇంద్రియ దోషనివారణంబు' ఇంద్రియ = వెలుపలి-లోపలి-యింద్రియముల యొక్క, దోష = దోషములయొక్క నివారణంబు = నివారించుటను, చేయుచుండుటఁజేసి = చేయుచుండుటనుబట్టి, ఇటు = ఈ విధముగా, నిర్వచింపఁబడియెన్ = నిర్వచనము చేయఁబడినది.

తాత్పర్యము :- ఏ రీతిగా - "ఆత్మ" పదార్థమును నే నెటిఁగెదనని - పూర్వము యాజ్ఞవల్క్యుని అత్రిమహర్షి, పరిప్రశ్నము చేసెను. "ఆత్మ" అవిముక్త మునందు ఉపాస్యమని, అత్రికి యాజ్ఞవల్క్యుఁడానతి యిచ్చెను. ఆ 'అవిముక్త' మెచ్చట నుండునని అత్రి మఱల యాజ్ఞవల్క్యుని నడిగెను. 'వరణ' యందును 'అసి' యందును - అది నిండారియుండునని యాజ్ఞవల్క్యుఁడు అత్రికానతిచ్చెను. కనుబొమల నడిమిప్రదేశమే ఆ స్థలము, "వరణ" సంసారదోషనివారణమును, "నాశి" ఇంద్రియదోషనాశనమును చేయుచుండుటనుబట్టి యిట్లు నిర్వచింపఁబడినది.

వ॥ అభ్యంతరావిముక్త క్షేత్ర దర్శనంబు బ్రహ్మనాడీ పవమాన జయంబునంగాని సిద్ధింపదు. 20

అర్థము :- "అభ్యంతర .... దర్శనంబు" అభ్యంతర = లోపలిదైన, అవిముక్త క్షేత్ర = అవిముక్తక్షేత్రముయొక్క, దర్శనంబు = దర్శనము, బ్రహ్మనాడీ = సుషుమ్నా నాడియందలి, పవమాన = ప్రాణవాయువుయొక్క, జయంబునంగాని = విజయము వల్లఁగాని, సిద్ధింపదు = సిద్ధింపదు.

తాత్పర్యము :- అభ్యంతరమైన ఆ 'యవిముక్తక్షేత్రము' యొక్క సందర్శనము సుషుమ్నా నాడియందు ప్రాణపవమానము యొక్క ప్రవేశరూపమైన

విజయమువలనఁ గాని సిద్ధింపదు. 'సుషుమ్నయందు ప్రాణవాయువును ప్రవేశింపఁ జేయుట' అనెడి ప్రసక్తివలన-ఇటుపై యోగశాస్త్రవిషయము ప్రపంచింపఁబడు చున్నది.

సీ॥ ప్రకృతి రూపిణియైన పాఁప పూఁబోడికి
మహదాది వికృతులు మలఁక లేడు
మొగము విచ్చి సుషుమ్న మూలరంధ్రముఁ గప్పి
వంశాస్థి సంబంధవలన లీల
నది మీఁదు ప్రాఁకి మధ్యమ నాడితోఁ గూడి
ద్రుహిణ రంధ్రముఁ గప్పుఁ దోఁక చివరఁ
జక్రచాయఁ జరింప సమకూరకుండుట
నిడఁబింగళనుగాలియెక్కఁడిగ్గుఁ

తే॥గీ॥ గెలని వాఁకిళ్లు రెండు వేగిరము మూసి
నడిమి వాఁకిలిఁ దెఱువ నెన్నండు నేర్చు
సాధకుఁడు నాఁడుగాని వశ్యంబుగాదు
పవన విజయంబు వానికి బద్మ నయన! 121

అర్థము:- ప్రకృతిరూపిణియైన=ప్రకృతి స్వరూపయైన, పాఁపపూబోడికిన్ (పాము + పూఁబోఁడి - పాఁపపూబోఁడి పూవు + మేను, పూబోఁడి.) కుండలినీ శక్తికి, 'మహదాది వికృతులు' మహత్ = మహత్తత్వము - బుద్ధితత్వము. ఆది = మొదలైన, వికృతులు = వికారములేయనెడి మలఁకలు = చుట్టలు, ఏడు = ఏడుకలవు. (బుద్ధి, అహంకారము, అను రెండు శబ్ద స్పర్శ, రూప, రస, గంధము లైదు-వెరసి ఏడు.)

మొగము విచ్చి = పాము ఆకృతిగల ఆ కుండలిని నోరువిప్పి, సుషుమ్న= సుషుమ్నా నాడియొక్క, మూలరంధ్రమున్ = మూలమునందుఁ గల రంధ్రమును, కప్పి = మూసి, 'వంశాస్థి....లీలన్' వంశాస్థి = వెన్నెముకయొక్క, సంబంధ = సంబంధముతోఁ గూడిన, వలన లీలన్ = పెనవైచికొనుటద్వారా, అది = ఆ కుండ లిని, మీఁదు ప్రాఁకి = పైకి ప్రాఁకి, మధ్యమనాడితోన్ = సుషుమ్నా నాడితో,

కూడి = కలసి, బ్రహిణరంధ్రమున్ = బ్రహ్మరంధ్రమును, తోఁకచివరన్ = తనతోఁకచివరిభాగముతో, కప్పున్ = మూసివేయును, చక్కఁబాయన్ = సూటిగ, చరింపన్ = సుషుమ్నయందు సంచరింపఁగా, సమకూరకుండుటన్ = వీలుపడ నందువలన, గాలి = ప్రాణవాయువు, ఇడన్ = ఇడానాడియందు, పింగళన్ = పింగళానాడియందును, ఎక్కున్ = ప్రవేశించును, డిగ్గున్ = వెలిపలికివచ్చును. కెలని = సుషుమ్నయొక్క-ఉభయపార్శ్వములయందలి, వాఁకిళ్లు = ఇడాపింగళ లనెడు ద్వారములు, రెండున్ = రెంటిని, వేగిరమ = శీఘ్రముగా. మూసి = కప్పి, నడిమి వాఁకిలిన్ = మధ్యదియైన సుషుమ్నాద్వారమును, తెఱవన్ = తెఱ వఁగా, సాధకుఁడు = సాధకుడు, ఎన్నండునేర్చున్ = ఏనాఁడు నేర్చునో. నాఁడు గాని = ఆనాఁడుగాని. వానికిన్ = ఆ సాధకునకు, పద్మనయనఁ = ఓ పద్మముల వంటి కన్నులుగల లోపాముదాఁ, పవనవిజయంబు = ప్రాణవాయువుమీఁది విజ యము, వశ్యంబుగాదు = స్వాధీనముగాదు.

తాత్పర్యము :- సర్పాకారముగల కుండలినీశక్తియే యీ సమస్త ప్రకృతి యును. ఆ పామునకు - ఏడు చుట్టలుగలవు. అవి - వరుసగా మహత్తు, (అనఁగా బుద్ధితత్వము) అహంకారము, (ఇది - సాత్వికము, రాజసికము, తామసికము అని మూఁడు విధములఁ) శబ్ద స్పర్శరూప రసగంధములు. (వీనినే సూక్ష్మభూతములని, పంచతన్మాత్రలనియు వందురు.) వెరసి యీ యేడు వికారములేయనెడి యేడు వలయములుగలవు. ఈయేడు చుట్టలుగల యీ పాము తన, నోరువిప్పి సుషుమ్నా నాడియొక్క మూలరంధ్రమును గబళించి వెన్నెముకను పెనవైచికొని పైకి ప్రాఁకి తనతోఁక చివరిభాగముతో బ్రహ్మరంధ్రమును గప్పియుంచును. ఈరీతిగా సుషుమ్న యొక్క మూలరంధ్రము, పైరంధ్రము, కుండలినియొక్క తలచేతను. తోఁక చేతను, మూయఁబడియుండుటచేత - ప్రాణవాయువు నూటిగా సుషుమ్నలో ప్రవే శించుటకు వీలుపడక - సుషుమ్నయొక్క వామ దక్షిణ పార్శ్వములలోనున్న ఇడా నాడి యందు - పింగళా నాడియందుఁ ప్రవేశించుచు నిర్గమించుచు నుండును. సుషుమ్నా నాడికి నెడమవైపున-ఇడానాడియును, కుడివైపున పింగళానాడియును. ఉండునుగావున సాధకుఁడు వాని వాకిళ్లు రెండును శీఘ్రముగా మూసి మధ్యనున్న సుషుమ్నా ద్వారమును దెఱచుట యెన్నటికి నేర్వఁగలుగునో, ఆనాటికిఁ గాని వానికి ప్రాణవాయువును లోఁబఱిచి కొనుట సాధ్యముకాదు.

విశేషము :- మూలప్రకృతి రవికృతి ర్మహదాద్యాః ప్రకృతివికృతయస్సప్త
షోడశకస్తువికారః నప్రకృతి ర్న వికృతిః పురుషః
అని సాంఖ్య కారిక. సాంఖ్యుల ప్రకృతినే యోగులుకుండలినియందురు.

కం: ఇడ వామనాడి పింగళ
కుడినాడి సుషుమ్న మధ్య గోచరయగునీ
కుడి యెడమ మధ్యనాడుల,
కుడు రాజానన! త్రిమూర్తులొగిదైవతములు॥ 122

అర్థము :- ఉడురాజాననః = ఓ చంద్రవదనా (ఉడు = నక్షత్రములకు. రాజు = ప్రభువు చంద్రుడు). ఇడ = ఇడయన్నది వామనాడి = సుష్మ్నమ్న కెడమవైపున నుండెడి నాడి, పింగళ = పింగళయన్నది, కుడినాడి = కుడివైపున నుండెడి నాడి సుషుమ్న = సుషుమ్నయన్నది మధ్యగోచర = పై రెంటికి మధ్యలోనుండునది. ఈ కుడియెడమ మధ్యనాడులకున్ = కుడి యెడమలయందును మధ్యలోనగల యీనాడులకు. ఒగిన్ = వరుసగా, దైవతములు = దేవతలు. త్రిమూర్తులు = త్రిమూర్తులు.

తాత్పర్యము :- సుగమము.

కం॥ హరి యిడకు నలువ పింగళ
కరవిందదళాయతాక్షి! యమృతాంశుకళా
ధరుడు సుషుమ్నా నాడికిఁ
బరిపాటి నధీశులనుచుఁ బలుకుదురార్యుల్ 123

అర్థము :- హరి = విష్ణువు. ఇడకున్ = ఇడానాడికిని, నలువ = నాలుగు+వాయి నలువ = నాలుగు ముఖములుగలవాడు.) బ్రహ్మ, పింగళకున్ = పింగళానాడికిని, అరవిందదళాయతాక్షిః = తామర తేకుల వలె విశాలములైన కన్నులుగల ఓ లోపాముద్రాః, అమృతాంశుకళాధరుడు = చంద్రకళను ధరించిన శివుడు. సుషుమ్నానాడికిన్ = సుషుమ్నా నాడికిని, పరిపాటిన్ = వరుసగా, అధీశులనుచున్ = అధిపతులని, ఆర్యుల్ = పెద్దలు. పలుకుదురు = వచింతురు.

తాత్పర్యము :- విష్ణువు (ఇడానాడికిని. బ్రహ్మ పింగళానాడికిని, శివుడు సుషుమ్నా నాడికిని, అధీశ్వరులని పెద్దలు చెప్పుదురు.

వ: పవనంబునకు సుషుమ్నాప్రవేశలక్షణంబైన యోగంబు వివరించెద. బ్రహ్మలోకప్రాప్తిద్వారంబగుట సుషుమ్న బ్రహ్మనాడి యనంబరగు. షణ్ణవత్యంగుళప్రమాణంబైన దేహంబునట్ట నడుమఁ ద్రికోణాకారంబై కుక్కుటాండంబు చందంబున నుండునది కందస్థానంబు. 24

అర్థము :- పవనంబునకున్ = ప్రాణవాయువునకు. సుషుమ్నా=సుషుమ్నానాడియందిలి, ప్రవేశ = ప్రవేశించుట. లక్షణంబైన = లక్షణముగాఁగల, యోగంబున్ = యోగవిద్యను, వివరించెదన్ = వివరము చేయుదును. 'బ్రహ్మలోకప్రాప్తిద్వారంబగుటన్' బ్రహ్మలోక = బ్రహ్మలోకమునొక్క. ప్రాప్తి = పొందుటకు, ద్వారంబగుటన్ = ద్వారమగుటచేత. సుషున్న = సుషుమ్నానాడి, 'బ్రహ్మనాడి యనన్ = 'బ్రహ్మనాడి' అనఁగా, పరగున్ = వ్యవహరింపఁబడుచుండును. 'షణ్ణవత్యంగుళ ప్రమాణంబైన 'షణ్ణవతి = తొంబదియాఱు, అంగుళ = అంగుళములయొక్క, ప్రమాణంబైన = కొలఁతగల, దేహంబు = శరీరమునొక్క, నట్టనడుమన్ = మధ్యభాగమునందు, త్రికోణాకారంబై = త్రికోణమునొక్క ఆకృతి కలదియై, కుక్కుటాండంబు చందంబునన్ = కోడిగ్రుడ్డువలె. ఉండునది = ఉండెడిది, కందస్థానంబు = కందమునొక్క స్థానము.

తే॥గీ॥ నాభి కందంబు క్రిందట నలినగంధి!
కుండలీశ క్తి దేవతయుండు నెలవు
కుండలీశ క్తినాఁగఁ జకోర నేత్ర
పాము చందాన నుండెడి ప్రథమధమని 125

అర్థము :- నాభికందంబు క్రిందట = బొడ్డు దుంపకు దిగువభాగము, నళిననేత్రి = ఓ పద్మనయనా! కుండలీశ క్తి దేవత = దేవతయైన కుండలీశ క్తి, ఉండునెలవు = ఉండెడిస్థానము, చకోరనేత్ర = చకోర పక్షులవంటి కన్నులుగలదానా! కుండలీశ క్తి నాఁగన్ = కుండలీశ క్తి యనఁగా, పాముచందానన్ = పామువలె, ఉండెడు = ఉండునట్టి, ప్రథమధమని = మొదటినాడి.

తాత్పర్యము :- నాభి కందమునకుఁ గ్రిందుగా నుండెడు స్థానము కుండలీశ క్తి నివాసభూమి. కుండలీశ క్తియనఁగా సర్పాకారమైన ప్రథమనాడి.

వ॥ అది మూలప్రకృతి. మహదాది ప్రకృతి వికారంబు లేడును దానిమేని మలఁకలు. అప్పాఁపచేడియయు సుషుమ్నానాడి తోడం బెనంగొని యుండు. 126

అర్థము :- అది = ఆ కుండలీశక్తి, మూలప్రకృతి = మూలభూతమైన ప్రకృతి, మహదాది = మహత్తత్వము మొదలైన, ప్రకృతి వికారంబులు = ప్రకృతి యొక్క పరిణామములు, ఏడును = ఏడును, దాని మేనిమలఁకలు = అకుండలీ శక్తి యొక్క శరీరమునకు సంబంధించిన వలయములు, అప్పాఁపచేడియయున్ = (ఆ + పాఁపచేడియ) ఆ సర్పపురంధ్రియును, సుషుమ్నానాడితోడన్ = బ్రహ్మ నాడితో, పెనంగొనియుండు = పెనవైచికొనియుండును.

తాత్పర్యము :- ఆ కుండలీశక్తియే మూలప్రకృతి. మహత్తు, అహంకా రము, పంచతన్మాత్రలు మొదలైన ప్రకృతి పరిణామవికారము లేడును. ఆ కుండలీ శక్తియొక్క శరీరమునకు సంబంధించించిన వలయములు-చుట్టలు; సర్పాకృతియైన ఆ కుండలీశక్తియును బ్రహ్మనాడియైన సుషుమ్నను పెనవైచికొనియుండును.

క॥ గిట గిట నెనిమిది మలఁకలఁ
గుటిలీ భావము భజించి కుండలిప్రాకున్
నిటలాంతము దాఁకను గ్రిం
దటి మొగమై వ్రేలునండ్రు తద్జ్ఞులుదానిన్ ॥ 127

అర్థము :- కుండలి = కుండలీశక్తి, ఎనిమిది చుట్టలతో, కుటిలీభావమున్ = వంకటింకరతనమును, భజించి = పొంది, గిటగిటన్ = గిటగిటలాడుచు, నిటలాం తము దాఁకను = ఫాలప్రదేశము వఱకును, ప్రాఁకును=ప్రసరించును. తద్జ్ఞులు= అ విషయము నెటిఁగిన పెద్దలు, దానిన్ = ఆ కుండలీశక్తిని, క్రిందటి మొగమై= అధోముఖమై, వ్రేలునండ్రు = వ్రేలాడుచుండునని యందురు.

తాత్పర్యము:- ఆ కుండలీశక్తి తాను, తనవికారము లేడు, వెరసి యెని మిది చుట్టలతో గిటగిటలాడుచు నిటలప్రదేశము వఱకు ప్రాఁకును. ఆ నిటలప్రదే శమునుండి అది క్రిందు ముఖమై వ్రేలాడుచుండునని యోగవిదులైన పెద్దలు చెప్పు చుందురు.

తే॥గీ॥ దాని చుట్టును నుండు లేఁదలిరుబోఁడి!
డెబ్బదియు రెండువేలు నాడికలు మేన
ముఖ్యనాడులు వానిలో ముద్దరాల!
పదియు నాలుగు ననుచుఁ జెప్పుదురు బుధులు. 128

అర్థము :- లేఁదలిరుబోఁడి! = (లేఁత + తలిరుఁబోఁడి!) లేత చిగురు టాకు వంటి శరీరముగలదానా!, దానిచుటును = ఆ కుండలిని చుటును, మేనన్ = శరీరమునందు. డెబ్బది రెండువేలు నాడికలు = డెబ్బది రెండువేల నాడులు కలవు. ముద్దరాల! = ముద్దియా!, వానిలోన్ అ డెబ్బది రెండువేలలో, ముఖ్యనాడులు = ముఖ్యమైన నాడులు, పదియునాలుగు ననుచున్ = పదునాలుగని, బుధులు = తెలిసినవారు, చెప్పుదురు = చెప్పుచుందురు.

తాత్పర్యము :- మానవశరీరములో ఆ కుండలినీశక్తి చుట్టును డెబ్బది రెండువేలనాడులు, అల్లికొనియున్నవి. వానిలో ముఖ్యమైనవి పదునాలుగని పెద్దలు చెప్పుదురు.

వ॥ ఇడానాడియందుఁ జంద్రుండధివసించియుండుంగావున నందుఁ బవనంబుద్గమించు కాలంబురాత్రి. ప్రవేశించు కాలంబు పగలు. పింగళానాడియందు సూర్యుండధివసించి యుండుఁ గావున నందుఁ బవనంబుద్గమించు కాలంబు దివంబు. ప్రవేశించు కాలంబురాత్రి. ప్రాఙ్ముఖస్థితుఁడగు పురుషునకుఁ బింగళా నాడి దక్షిణ దిక్కున, నిడానాడి యుత్తరదిక్కున నుండుఁ గావున, మకరాయన సమయంబున దక్షిణదిగవస్థితుండైన సూర్యుండు కర్కటాయన పర్యంతంబు నుత్తరంబు నడచుటం జేసి యుత్తరాయణంబయ్యె. ఈ చందంబునం బింగళా స్థితుండగు పవనుండు యావత్కాలంబు నిడయందు సంక్రమించు నంతకాలం బుత్తరాయణంబు. ఈ ప్రకారంబున దక్షిణాయనంబు నెఱుంగునది. 129

అర్థము :- ఇడానాడియందున్ = వామనాడియందు, చంద్రుండు = చంద్రుడు, అధివసించి యుండుంగావునన్ = నివసించియుండును గనుక, అందున్ =

ఆ యిడానాడియందు, పవనంబు = ప్రాణవాయువు, ఉద్గమించుకాలంబు = వెలువడుకాలము. రాత్రి = రాత్రిసమయము; ప్రవేశించుకాలంబు = ప్రాణవాయువు ప్రవేశించుకాలము, పగలు = పగటిసమయము; పింగళా నాడియందున్ = పింగళా నాడియందు, పవనంబు = ప్రాణవాయువు, ఉద్గమించు కాలంబు = వెలువడుకాలము, దివంబు = పగలు, ప్రవేశించుకాలంబు = ప్రవేశించు సమయము, రాత్రి = రాత్రి; ప్రాఙ్ముఖస్థితుఁడగు పురుషునకున్ = (ప్రాక్ + ముఖ) తూర్పుముఖముగా నిలఁబడిన పురుషునకు. పింగళానాడి దక్షిణదిక్కునన్ = పింగళానాడి దక్షిణదిక్కువైపునను. ఇడానాడి యుత్తరదిక్కునన్ = ఇడానాడి యుత్తరదిక్కువైపునను, ఉండుఁగావునన్ = ఉండునుగనుక, మకరాయన సమయంబునన్ = మకరరాశియందు ప్రవేశించు సమయమునందు, దక్షిణ దిగవస్థితుండగు + (దక్షిణ దిక్ + అవస్థితుఁడు.) దక్షిణదిక్కునందున్న, సూర్యుండు = సూర్యుఁడు, కర్కటకాయనపర్యంతంబున్ = కర్కాటకరాశియందు ప్రవేశించునంత కాలము, ఉత్తరంబునడచుటంజేసి = ఉత్తరదిక్కువైపునకు నడచుటనుబట్టి, ఉత్తరాయణంబయ్యెన్ = ఉత్తరాయణ సమయమైనది, ఈచందంబునన్ = ఈవిధముగా. పింగళాస్థితుండగు పవనుండు = పింగళానాడియందుఁగల ప్రాణవాయువు, ఇడయందు సంక్రమించునంతకాలంబు = ఇడానాడియందు సంక్రమించు నంతకాలము, ఉత్తరాయణంబు= ఉత్తరాయణ సమయము. ఈప్రకారంబునన్ = ఈవిధముగా, దక్షిణాయనంబున్= దక్షిణాయన సమయమునుగూడ. ఎఱుంగునది = తెలిసికొనవలసినది

తాత్పర్యము :- వామనాడియైన యిడయందు, చంద్రుఁడు నివసించియుండును. గనుక ఆ నాడినుండి శ్వాసవెలువడుకాలమురాత్రి, ప్రవేశించుకాలముపగలు. దక్షిణనాడియైన పింగళయందు సూర్యుఁడు నివసించి యుండునుగనుక ఆనాడినుండి శ్వాసవెలువడుకాలము పగలు, ప్రవేశించుకాలమురాత్రి. తూర్పుముఖముగా నిలఁబడియున్న పురుషునకు దక్షిణముపైపున పింగళానాడియును, ఉత్తరముపైపున ఇడానాడియును. ఉండునుగనుక మకరసంక్రమణ సమయమున దక్షిణమున నున్న సూర్యుఁడు కర్కాటక సంక్రమణసమయమువఱకు ఉత్తరముపైపుగా నడచును గనుక, ఉత్తరాయణమయ్యెను. ఈరీతిగనే పింగళానాడి యందున్న ప్రాణవాయువు ఎంతవఱకు-ఇడానాడియందు సంక్రమించుచుండునో అంతవఱకు ఉత్తరాయణము. ఇట్లే దక్షిణాయనమును దెలిసికొనవలయును. అనఁగా; కర్కాటక సంక్రమణ సమయమునందు-ఉత్తరమునన్నున్న సూర్యుఁడు - తిరిగి మకర సంక్రమణ సమ

యము వఱకు దక్షిణమువైపుగా నడచును గనుక - దక్షిణాయనమగును. ఈరీతిగనే యిడానాడియందున్న ప్రాణవాయువు. ఎంతవఱకు పింగళా నాడియందు సంక్రమించుచుండునో అంతవఱకు - దక్షిణాయనమని తాత్పర్యము.

చం॥ సమగతి నేకకాలమున సంగతి యామవతీ కళత్రుఁడుఁ
గమల హితుండు ప్రాణమనుగాడ్పులు తారటు కూడి పింగళా
ధ్వమునిని డాసి తీవ్రగతిఁ దారొక్కనిక్రుంకుదురుద్గమింతురే
సమయమునందుఁ దాల్చునది చంద్రనిభాస్యయ
మాభిధానమున్ ॥ 180

అర్థము :- సమగతిన్ = సమానగమనముతో. ఏకకాలమునన్ = ఒకే కాలమునందలి, సంగతిన్ = కలయికతో. యామవతీ కళత్రుఁడున్ = నిశావల్లభుఁడైన చంద్రుఁడును, కమలహితుండు = పద్మబంధువైన సూర్యుఁడును, ప్రాణమనుగాడ్పులు = ప్రాణసంజ్ఞగల వాయువులు, తారు = తాము, అటు = ఆ ప్రకారమే కలిసి, పింగళాధ్వమునిని = పింగళానాడిని. డాసి = సమీపించి, తీవ్రగతిన్ = తీవ్రగమనముతో, తారొక్క = తారసిల్లి, క్రుంకుదురు అస్తమింతురు ఉద్గమింతురు = ఉదయింతురో, ఏ సమయనందున్ = ఏకాలమునందు, అది = ఆ సమయము. చంద్రనిభాస్య! = ఓ చంద్ర సమానవదనా! అమాభిధానమున్ = అమావాస్యయను పేరును, తాల్చున్ = ధరించును,

తాత్పర్యము :- ఓ చంద్రవదనా! సమానగమనముతో ఒకే సమయమువందు కలసి చంద్రుఁడు సూర్యుఁడు ప్రాణసంజ్ఞగలవాయువులు ఆ రీతిగనే కలసి, తీవ్రగమనముతో పింగళానాడియందు తారసిల్లి, క్రుంకుట - ఉదయించుట- అను కృత్యములను ఏ సమయమునందుఁ జేయుదురో, ఆ సమయము 'అమ' అను పేరును (అమావాస్య) దాల్చును.

తే॥గీ॥ పాము కొండలి చంద్రుండు ప్రాణపవన
మాసిరావల్లి యెప్పుడయ్యనిలుఁగోరిలు
నది యశేషాంగకగ్రాసమైన యట్టి
గ్రహణకాలంబుసుమ్ము సారంగనయన! 181

అర్థము :- కుండలి = కుండలిశక్తి, పాము = రాహువు, ప్రాణపవనము శ్వాస, చంద్రుఁడు = చంద్రుఁడు, ఆసిరావల్లి = ఆ కుండలిసీనాడి, ఎప్పుడు = ఏ సమయమునందు, అయ్యనిలున్ = ఆశ్వాసానిలమును, క్రోలున్ = గ్రసించునో, అది = ఆ సమయము, సారంగనయన! = ఓ చకోరనయనా!, "అశేషాంగకగ్రాసమైనయట్టి' అశేష = మిగులులేకుండునట్లు, అంగక = శరీరాంగకములను. గ్రాసమైనయట్టి = గ్రసించునట్టి, గ్రహణకాలంబు సుమ్ము! = గ్రహణకాలమునుమా!

తాత్పర్యము :- కుండలినియే రాహువు; ప్రాణపవనమే చంద్రుఁడు! ఆ కుండలిని - ప్రాణపవనమును, ఏ సమయమునందు గ్రసించునో, నిశ్శేషాంగక గ్రాసమైన ఆ సమయమే గ్రహణకాలము!

వ॥ ప్రాణంబ యాదిత్యుండు. ఆదిత్యుండ చంద్రుండు. ఆ ప్రాణానిలంబు మూలాధార ప్రవేశానంతరంబుదయించు. మూర్థ ప్రవేశానంతరం బస్తమించు. దేవతలకు మొదలి విషువంబైన మేషాయనంబున సూర్యుండుదయించు. విషువాంతరంబైన తులాయనంబున నస్తమించు. ప్రాణోదయాస్తమయ సమయంబులు విషువద్వ్యయంబు. 182

అర్థము :- ప్రాణంబు = ప్రాణమే. అదిత్యుండు = సూర్యుఁడు, ఆదిత్యుండ = సూర్యుఁడే. చంద్రుండు = చంద్రుఁడు, ఆ ప్రాణానిలంబు = అ ప్రాణవాయువు. 'మూలాధార ప్రవేశానంతరంబు' మూలాధార = మూలాధారమనెడి కుండలినీ నివాసమైన మొదటి చక్రమునందలి, ప్రవేశ=ప్రవేశముకంబె, అనంతరంబు = పిమ్మట, ఉదయించు = పుట్టును, "మూర్థప్రవేశానంతరంబు" మూర్థ = బ్రహ్మరంధ్రముయొక్క, ప్రవేశముకంబె, అనంతరంబు = పిమ్మట, అస్తమించు = అస్తమించును, దేవతలకున్ = దేవతలకు, మొదలివిషువంబైన = సమానమైన రాత్రిందివపరిమాణముగల మొదటి విషువమైన, మేషాయనంబునన్ = మేషసంక్రాంతియందు, సూర్యుండు = సూర్యుఁడు, ఉదయించున్ = ఉదయించును, విషువాంతరంబైన = రెండవసమరాత్రిం దివప్రమాణమైన, తులాయనంబు

నన్ = తులాసంక్రాంతియందు, అస్తమించున్ = అస్తమించును, " పాణోదయా స్తమయంబులు' ప్రాణ = ప్రాణపవనముయొక్క, "ఉదయాస్తమయ సమయంబులు" ఉదయ = ఉదయముయొక్క, అస్తమయ = అస్తమయముయొక్క. సమయంబులు = కాలములు, విషువద్ద్వయంబు = విషువములయొక్క జంట, ('విషువ' 'విషువత్' రెండురూపములుగలవు)

తాత్పర్యము :- మన శరీరములయందలి ప్రాణమే యాదిత్యుడు. ఆదిత్యుడే చంద్రుడు. ఆ ప్రాణవాయువు మూలాధారమునందు ప్రవేశించుచునే పుట్టును. బ్రహ్మరంధ్రమునందుపరివేశించుచునే అస్తమించును. మానవులకి ఒక సంవత్సరము దేవతలకు ఒక అహోరాత్రము. సమానములైన రాత్రిందివ పరిమాణములుగల దినమునకు "విషువ" మనిపేరు. అట్టి విషువములు మానవుల సంవత్సరమునందు రెండుసార్లు వచ్చును. మేషసంక్రాంతి తులాసంక్రాంతి, దేవతలకు మేషసంక్రాంతి యందు సూర్యుడు ఉదయించును. తులాసంక్రాంతియందు అస్తమించును. ప్రాణవాయువుయొక్కఉదయాస్తమయ సమయములే విషువములు.

చం॥ మొదల సుషుమ్నఁ జొచ్చు నిడబుట్టినగాడ్పులు కొంతసేపునన్
బిదప సుషుమ్నఁబుట్టిన సమీరము చొచ్చు నిడాఖ్యనాడికన్
మొదటనుబిమ్మటం బవనముల్ తిరుగంబడి చొచ్చుఁగాన, న
య్యదనులు సంక్రమంబులని యాడుదురాగమతత్త్వకోవిదుల్॥

133

అర్థము :- ఇడన్ = ఇడానాడియందు. పుట్టినగాడ్పులు = ఉదయించిన ప్రాణవాయువులు, మొదలన్ = మొదట, సుషుమ్నన్ = సుషుమ్నానాడియందు, చొచ్చున్ = ప్రవేశించును, పిదపన్ = పిమ్మట, సుషుమ్నన్ = సుషుమ్నయందు. పుట్టిన సమీరము = ఉదయించిన ప్రాణవాయువు, ఇడాఖ్యనాడికన్ = ఇడయను పేరుగల నాడియందు, చొచ్చున్ = పరివేశించును, మొదలను = మొదటను, పిమ్మటన్ = తరువాతను, పవనముల్ = ప్రాణవాయువులు, తిరుగంబడి=పర్యాయక్రమముగా సీరీతిని, చొచ్చుఁగానన్ = పరివేశించును గనుక, అయ్యదనులు = (అ = అదను) ఆ సమయములు, సంక్రమంబులని = సంక్రమణ కాలములని, ఆగమతత్త్వకోవితుల్ = ఆగమముల తత్త్వము నెఱిఁగిన సెద్దలు, ఆడుదురు = పలుకుదురు.

తాత్పర్యము :- ఇడానాడియందు ఉదయించిన శ్వాసానిలములు మొదట సుషుమ్నానాడియందు ప్రవేశించును. పిమ్మట సుషుమ్నానాడియందు ఉదయించిన స్వాసానిలయములు ఇడానాడియందు ప్రవేశించును. ఈరీతిని పర్యాయక్రమముగా ఇడనుండి సుషుమ్నకును సుషుమ్ననుండి యిడకును ప్రవేశించును గనుక, ఆ ప్రవేశసమయములను సంక్రమములని ఆగమత త్త్వవే త్తలు వ్యవహరింతురు.

వ॥ అని యవిముక్తక్షేత్ర వియోగ దుఃఖంబున మానసాంతర విముక్తక్షేత్రమాహాత్మ్యంబుపన్యసించి యనంతరంబ కాశికా విరహవేదనా భరంబు దుస్సహం బగుట నౌర్వశేయుండు కాశిని లక్ష్యంబుచేసియిట్లనియె. 114

అర్థము :- అని = ఈరీతిని, 'అవిముక్త .... దుఃఖంబునన్' అవిముక్త క్షేత్ర = కాశీక్షేత్రమునకు సంబంధించిన, వియోగ దుఃఖంబునన్ = వియోగము వలనఁ గలుగుచున్న దుఃఖముచేత, "మానసాంత ....మాహాత్మ్యంబు" మానసాంతఃమనస్సులోపలి, అవిముక్తక్షేత్ర = కాశీక్షేత్రముయొక్క, మాహాత్మ్యంబు=మహిమను, ఉపన్యసించి = వివరించి, ఆనంతరంబ=వెనువెంటనే, "కాశికా .... భరంబు" కాశికా = కాశీక్షేత్రముయొక్క, విరహ = విడుచుటవల్ల కలుగుచున్న, వేదనా = బాధయొక్క, భరంబు = భారము, దుస్సహంబగుటన్ = సహింపరానిదగుటవల్ల, ఔర్వశేయుండు = ఊర్వశీనందనుఁడైన అగస్త్యుఁడు, కాశిని = కాశీనగరమును, లక్ష్యంబుచేసి = ఉద్దేశించి, ఇట్లనియె = ఇట్లు పలికెను.

తాత్పర్యము :- ఈరీతిని కాశీక్షేత్రమును విడిచిపోపలసి వచ్చినందువల్ల కలిగిన దుఃఖముచేత మానసాభ్యంతరస్థితమైన కాశీక్షేత్ర మాహాత్మ్యమును గూర్చి యుపన్యసించి, వెనువెంటనే ఆ గుణస్మరణముచేత ఇనుమిక్కిలి యగుచున్న కాశీ వియోగదుఃఖభారము సహింపలేక, ఊర్వశీనందనుఁడైన అగస్త్య మహాముని కాశీ నగరము నుద్దేశించి మఱల నిట్లుపలుకఁ జొచ్చెను.

కం॥ అ మచ్చిక యాచనవా
ప్రేమాతిశయంబు విస్తరింపఁగ వశమే?

భూమండల తిలకమ! పర
భూమికి నిన్నెట్లు పాసిపోవుమఁగాశీ! 135

అర్థము :- ఆ మచ్చిక = ఆవిధమైన వ్యామోహము, ఆచనవు = ఆ విధ మైన చెల్లుబడి, ఆ ప్రేమాతిశయంబు = ఆ విధమైన అనురాగాతిశయము, విస్త రింప గ వశమే = వివరించి చెప్పి భరింపఁగలనా, 'భూమండలతిలకమ! భూమం డల = భూమండలమునకు, తిలకమ! - తిలకమవైనదానా!, పరభూమికిన్ = పర దేశమునకు, నిన్నెట్లుపాసిపోవుదున్ = నిన్నెట్లు విడిచిపో గలను! కాశీ! = ఓ కాశీనగరమా!

తాత్పర్యము :- ఆ విధమైన వ్యామోహము, ఆ విధమైన చనవు. ఆ విధమైన ప్రేమతిశయము. వివరించుటకు వశమగునా! అనఁగా వివరించి చెప్పి నందువల్ల పెరిగెడి దుఃఖమును భరింపవశమా! సమస్త భూమండలమునకు తిలక ప్రాయమవైన - ఓ కాశీనగరమా! పరదేశమునకు నిన్నేరీతిగా విడిచిపోఁ గలఁగుదును!

మ॥ నిజమేఁ బలెఁ దబాహులెత్తి ప్రతివాణీ జాహ్నవీ గోపతి
ధ్వజడుంఠీశగణేశ్వరుల్ గుటిగ నోవారాణసీదేవి! యో
గజచర్మాంబరుకూర్మపట్టణమ! యోకల్యాణి! నిన్ బోల, నం
బుజగర్భాండమునందు లేవు నగరంబుల్ తీర్థరాజంబులున్! 136

అర్థము :- 'నిజమేఁ బలెఁ దబాహులెత్తి = రెండు చేతులు పైకెత్తి నేను నిజమును ఉద్ఘోషించుచున్నాను. 'శ్రుతివాణీ.... గణేశ్వరుల్ గుటిగన్,' శ్రుతివాణీ= వేదసరస్వతియును, జాహ్నవీ = జహ్నునందనయైన గంగానదియును, గోపతి ధ్వజ = వృషభధ్వజుఁడైన పరమశివుఁడును, డుంఠీశ = డుంఠి విఘ్నేశ్వరస్వామి యును. గణేశ్వరున్ = ప్రమథగణాధీశ్వరులును, గుటిగన్ = సాక్షిగా, ఓ వారా ణసీదేవి! = ఓ వారాణసీదేవీ! 'ఓగజచర్మాంబరుకూర్మ పట్టణమ!' ఓ = ఓ, గజ చర్మ = ఏనుఁగుతోలు, అంబరు = వస్త్రముగాఁగల పరమేశ్వరునియొక్క, కూర్మ పట్టణమ! ప్రియనగరమా!, ఓ కల్యాణి! = ఓ కైవల్య కల్యాణ స్వరూపిణీ!, నిన్బోలన్ = నిన్ను బోలఁగా, అంబుజగర్భాండమునందున్ = బ్రహ్మాండము

నందు, నగరంబుల్ = నగరములును, తీర్థరాజంబులున్ = తీర్థరాజములును. లేవు = లేవు.

తాత్పర్యము :- ఊర్ధ్వబాహుఁడనై నేను సత్యమును పలుకుచున్నాను. నేనుపలికెడి సత్యమునకు వేదసరస్వతియును. గంగానదియును. వృషభధ్వజుఁడైన శివుఁడును, డుంఠి విఘ్నేశ్వరస్వామియును. ప్రమథగణాధీశ్వరులును సాక్షులు: ఓ వారాణసీదేవతా! ఓ గజచర్మధరుఁడైన శివుని గారాబు నగరమా! ఓ కైవల్య కల్యాణ స్వరూపిణీ! ఈ సమస్త బ్రహ్మాండమునందును, నిన్ను బోలగలనగరములు, తీర్థరాజములును లేవు,

తే॥గీ॥ లేవు లింగఁబు లవిముక్త లింగమునకు
సాటిసేయంగ భూర్భువః స్వస్త్రయమున
రావు తక్కటి పుణ్యతీర్థములు నీకు
సాటి సేయంగ భూర్భువః స్వస్త్రయమున॥ 187

అర్థము :- అవిముక్తలింగమునకు = ('అవి ముక్త లింగ'మన్న పేరుతో శ్రీవిశ్వేశ్వరస్వామి మందరపర్వతమునకు బోవునపుడు కాశీనగరములోఁ బ్రతిష్ఠించిన లింగము. ఆ లింగమును స్పృశించిన వారికి పునఃకాశీప్రాప్తి కలుగును. శివునిచేత విముక్తముకాదుగావున-కాశికి-అవిముక్త మనిపేరు. 'విశ్వేశ్వరస్వామి ప్రతిష్ఠించిన 'అవిముక్త' లింగము-ఆయనకు ప్రతినిధియే కనుక-'అవిముక్తలింగ' మునకు శ్రీవిశ్వేశ్వరలింగ మనియే యర్థము చెప్పవలయును) శ్రీవిశ్వేశ్వరలింగమునకు. సాటిసేయంగన్ = సాటియని చెప్పుటకు, 'భూర్భువః స్వస్త్రయమునన్' భూలోక, భువర్లోక, స్వర్లోకములు మూడింటియందును. లింగంబులు = ఇతరలింగములు, లేవు = లేవు, నీకుసాటి సేయంగన్ = నీకుసాటియని చెప్పుటకు 'భూర్భువఃస్వస్త్రయమునన్ = భూలోక, భువర్లోక, సువర్లోకములు మూడింటియందును, తక్కటి = ఇతరములైన, పుణ్యతీర్థములు = పుణ్యతీర్థములు, రావు = పనికిరావు.

తాత్పర్యము :- భూర్భువఃస్వర్లోకములు మూడింటి యందును అవిముక్త లింగమునకు సాటియైన లింగములులేవు. భూర్భువఃస్వర్లోకములు మూఁడింటియందును పుణ్యతీర్థములేవియును నీకు సాటిరావు.

వ॥ అని యెట్టకేలకుం గదలి విరాళింగొన్న చందంబున మరులు గుడిచిన పోల్కి- నపస్మారంబెత్తిన పగిది నన్నుకొన్న విధం బున దూపటిల్లిన తెఱంగునఁ దూలపోయినరీతి విషంబెక్కి-న లీల భ్రూఁగన్ను వెట్టినలాగున లాహిరి పట్టినభాతి మదం బెక్కి-న మాడ్కి- నుంగిడిగొన్న భంగి నూసరిల్లుచు నుస్సుర నుచు నుమ్మలించుచు నుదిలగొనుచు నుపతాపం బందుచు నూటాడుచు నూర్వశీనందనుం డూర్ధ్వబాహుండై యుచ్చై స్స్వనంబున. 188

అర్థము :- అని=ఇట్లుపలికి. ఎట్టకేలకున్ = (ఎట్టకన్+ఏలకు) ఆతిప్రయాస పడినపిమ్మట, కదలి = అడుగుకదపి, విరాళిన్ = విరహమును, కొన్నచందంబు నన్ = కొన్నవిధముగా, మరులుగుడిచిన పోల్కిన్ = వెఱ్ఱులెక్కించు. ద్రవ్యము లను తిన్నమాదిరిగా, అపస్మారంబెత్తినపగిదిన్ = అపస్మారవ్యాధి సోకినరీతిగా, అన్నుకొన్నవిధంబునన్ = మత్తెక్కినట్లు, దూపటిల్లిన తెఱంగునన్ = దప్పికగొన్న విధముగా, తూలపోయినరీతిన్ = దూదివలెతేలికయై పోయినట్లు-చిన్నపోయినట్లు, విషంబెక్కినలీలన్ = శరీరమునందు విషముప్రసరించిన మాదిరిగా, భ్రూఁగన్ను వెట్టిన లాగున్ = (భ్రూఁగు + కన్ను) సోలినకన్ను పెట్టినట్లు, లాహిరిపట్టినభాతి= గంజాయి పొగతాగినట్లు, మదంబెక్కిన మాడ్కిన్ = మదము ప్రసరించిన రీతిగా, ఉంగిడిగొన్న భంగిన్ = 'ఉంగిడి' యను వ్యాధిసోకినట్లు, ఊసరిల్లుచున్ = చిక్కిపోవుచు 'ఉస్సు'రనుచున్ = 'ఉస్' అని నిట్టూర్చుచు, ఉమ్మలించుచున్ = దుఃఖించుచు, ఉదిలగొనుచున్ = పరితపించుచు, ఉపతాపంబందుచున్ = ఉప తపించుచు, ఊటాడుచున్ = చలించుచు, ఊర్వశీనందనుండు = అగస్త్యమహా ముని, ఊర్ధ్వబాహుండై = పైకెత్తిన చేతులుగలవాడై, ఉచ్చైస్స్వనంబునన్ = బిగ్గఱయైన కంఠస్వరముతో-

తాత్పర్యము :- అగస్త్య మహాముని యొక్క సంతాపావస్థలోని పలువిధము లైన దశాభేదములను పెక్కు ఉపమానములతోను, పిమ్మట పెక్కుక్రియలతోను వర్ణించుటచేత కవి, పాఠకులకుఁ కూడ అవి, కల్పించువానివలె నున్నాఁడు.

విశేషము:- ఒకానొక మానసికవశను చిత్రించునపుడు వివిధములైన అను భావములు స్ఫురించునట్లు, దాదాపు ఒకేమాదిరి క్రియలు పెక్కింటిని గుస్పించుట తిక్కనగారి పద్ధతి: 'రసాభ్యుచిత బంధము'లోని ఒక యంశము.

సీ॥ పరమకల్యాణి! యో భాగీరథీగంగ!
వార్ధిభామిని! పోయివత్తునమ్మ!
అమరేంద్రులార! లోలార్క కేశవులార!
వనజసంభవ! పోయివత్తునయ్య!
శ్రీవిశాలాక్షి! దాక్షిణ్య పుణ్యకటాక్ష!
వాసవార్చిత! పోయి వత్తునమ్మ!
శ్రీ పూర్ణభద్ర పారిషద నాయకులార!
వటుకభైరవ! పోయివత్తునయ్య!

తే॥గీ॥ తీర్థ సంవాసులార! కృతార్థులార!
పాశుపతులార! భాగ్యసంపన్నులార!
మందిరోద్యాన వాటికా మఠములార!
పోయివచ్చెద మీకాశిపురము విడిచి॥

అర్థము :- పరమకల్యాణీ!=ఓ పరమ శుభస్వరూపురాలా!, ఓ భాగీరథీ= ఓ భగీరథరాజనందనా!, గంగ!=గంగానదీ!, వార్ధిభామిని! = సముద్రునియిల్లాలా!, పోయివత్తునమ్మ! = అమ్మా! వెళ్ళి వచ్చెదను.

అమరేంద్రులార! = ఓ దేవతాధిపులారా!, లోలార్క-కేశవులార! = ఓ లోలార్కా!, ఓ ఆదికేశవస్వామీ!,వనజ సంభవ! = ఓ తమ్మిచూలీ!, పోయివత్తునయ్య! = అయ్యా! వెళ్ళివచ్చెదను.

శ్రీవిశాలాక్షి! = ఓ శ్రీవిశాలాక్షీదేవీ!, దాక్షిణ్యపుణ్యకటాక్ష! = కృపాపరిపూర్ణములైన, పుణ్యకటాక్షములుగలతల్లీ!, వాసవార్చిత = ఇంద్రునిచేత అర్చింపఁబడినదానా!. పోయివత్తునమ్మ!=అమ్మా! వెళ్ళివచ్చెదను,శ్రీపూర్ణభద్రపారిషదనాయకులారా' శ్రీపూర్ణభద్ర = శ్రీ పూర్ణభద్రుఁడు మొదలైన, పారిషదనాయకులార! = పర్శిమథనాయకులారా!, పోయివత్తునయ్య! = అయ్యా! వెళ్ళివచ్చెదను.

తీర్థసంవాసులార! = ఓ తీర్థనివాసులారా!, కృతార్థులార = అదృష్టవంతులారా! పాశుపతులార! = ఓ పాశుపతవ్రతస్థులారా!, భాగ్యసంపన్నులార!=మంది

రోద్యానవాటికామఠములార!=మందిరములారా! ఉద్యానవాటికలారా! మఠములారా!. మీ కాశివురమువిడిచి = మీకాశీపురమునువిడిచి. పోయవచ్చెదన్ = వెళ్ళివచ్చెదను.

విశేషము :- ఈ పద్యము, దీని తరువాతి పద్యము, రసధ్వనికి శిఖరాయ మాణములు. కాశీక్షేత్రవియోగ జన్యమై ముని ఆలంబినముగాగల శోకము-విభావాది సామగ్రీ విశేషముచేత కరుణరసముయొక్క- పరాకాష్ఠనదిరోహించినది.

సీ॥ కలహంసి! రారాదె కదలి నాతోఁ గూడి
నీవేల వత్తమ్మ నెమ్మినుండి
కదళికాకాంతార! కదలి రాననుగూఁడి
నీవేల వత్తమ్మ నెమ్మినుండి
శ్రీవిశాలాక్షి! విచ్చేయు నాతోఁ గూడి
నీవేల వత్తమ్మ నెమ్మినుండి
నాతోడఁ గూడి యంతర్గేహ! యేతెమ్మ
నీవేల వత్తమ్మ నెమ్మినుండి

తే॥గీ॥ రండు ననుఁగూడి మోపరివ్రాట్టులార!
వత్సలత గల్గి మీశేల వత్తురయ్య!
పరమ నిర్భాగ్యుఁడైన నాపజ్జఁబట్టి
కటకటా! సౌఖ్యజలరాశిఁ గాశిఁ బాసి. 140

అర్థము :- కలహంసి! = ఓసి కలహంసీ!, కదలి=కాశినుండి కదలి, నాతోఁ గూడి = నాతోఁగలసి, రారాదె = వచ్చుటకు వీలులేదా! - రారాదా! నెమ్మినుండి = (నెమ్మిన్ + ఉండి) నెమ్మదియైనుండి, నీవు = భాగ్యవంతురాలవైన నీవు, ఏల వత్తమ్మ = ఎందుకు వచ్చెదవమ్మా! (నిస్పృహ)

కదళికాకాంతార!=ఓ కదళీవనమా!, ననుఁగూడి = నన్నుగలసి, కదలిరా!= కదలిరమ్ము,నెమ్మినుండి = స్థిమితముగానుండి,నీవు=చీఁకు చింతలులేని నీవు, ఏల వత్తమ్మ!=ఎందుకు వచ్చెదవులే! (ఉపాలంభము) శ్రీవిశాలాక్షి!=శ్రీవిశాలములైన అక్షులుగలఓ విశాలాక్షీ!, నాతోఁ గూడి=నాతోఁగలసి,విచ్చేయు=విజయంచేయుము-దయచేయుము - రమ్ము!. నెమ్మినుండి = ప్రేమతో కాశీనగరమునందు నివసించి.

నీవు = సకలలోకేశ్వరివైన నీవు, ఏలవత్తమ్మ!=ఏలాగునవత్తువమ్మా!(దైన్యము). అంతర్గేహ! = అంతర్గేహమా! (శ్రీవిశాలాక్షీవిశ్వేశ్వరులుండెడి నెలవు), నాతోడఁగూడి = నాతోఁగూడి. ఏ తెమ్ము = ఏతెంచుము!, నీవు = కైవల్యనిలయమవైన నీవు, నెమ్మినుండి = నిరాపాయస్థితియందుండి, ఏలవత్తమ్మ! = దేనికివత్తువమ్మా! (ఆక్రోశము)

ఓ పరివ్రాట్టులార! = ఓ పరివ్రాజకులారా!. రండు ననుఁగూడి = రండి నావెంట, వత్సలతగల్గి = కాశీనగరమును వదలి నావెంటరాఁ గలిగినంతటి వాత్సల్యము నాపైఁగలిగి. మీరు = బంధములులేని మీరు. పరమనిర్భాగ్యుఁడైన = భాగ్యహీనులలో పరముడనైన. నాపజ్జెఁబట్టి = నా పార్శ్వమును బట్టి. సౌఖ్యజలరాశిన్ = సౌఖ్యసముద్రమైన, కాశిఁబాసి = కాశినివిడిచి. ఏలవత్తురయ్య = దేనికివత్తురయ్యా! = దేనికివత్తురయ్య!. కటకటా!=అయ్యయ్యో!

తాత్పర్యము :– సుగమము.

విశేషము:– తిరిగి తిరిగి ఆవృత్తమగుచున్న – 'నీవేల వత్తమ్మ! నెమ్మినుండి' అను వాక్యముతో అగస్త్యుని కరుణరసవాహిని సుడులు తిరుగుచు చేతనాచేతనములను ఆప్లావితముచేయుచున్నది.

వ॥ అని యెట్టకేలకుఁ గాశీనగరంబు వెలువడి కొంతదవ్వు నడచి కాశీ విప్రయోగ తీవ్రవేదనా దూయమానమానసుండై వదనంబు వఱువట్లు పట్టఁబాదంబులు గుదివడ 'ను' హ్లానుచునొక వటవిటపి నీడ నజ్జటాధరుండు చదికిలంబడి లోపాముద్ర కిట్లనియె. 141

అర్థము :– అని = ఇట్లుపలికి. ఎట్టకేలకున్ = అతిప్రయాస మీఁద. కాశీనగరంబు = కాశికానగరము నుండి. వెలువడి = వెలుపలికి వచ్చి. కొంతదవ్వు = కొంతదూరము, నడచి = ప్రయాణముచేసి. 'కాశీ విప్రయోగ....మానసుండై' కాశీ = కాశీనగరమునొక్క, విప్రయోగ = వియోగమునకు సంబంధించిన, తీవ్రవేదనా = యాతనచేత, దూయమాన = బాధింపఁ బడుచున్న, మానసుండై = మనస్సుగలవాఁడై. వదనంబు = నోరు. వఱువట్లుపట్టన్ = (వట్టులు + వట్టులు–వఱువట్లు) మిక్కిలి తడియాఱిపోఁగా. పాదంబులు = కాళ్లు, గుదివడన్ కట్టుపడఁగా. ఉహ్లానుచున్ = 'ఉహ్' అని యనుచు. ఒక = ఒక్క. వటవిటసి = మఱ్ఱిచెట్టుయొక్క.

సీడన్ = నీడయందు. ఆజ్జటాధరుండు = (ఆ + జటాధరుండు) ఆ జడదారి-
ఆ మహర్షి. చదికిలంబడి = చతికిల్లఁబడి-పిట్టలునేలపై . ఆనునట్లు కూలఁబడి.
లోపాముద్రకున్ = లోపాముద్రతో. ఇట్లనియె = ఇట్లుపలికెను.

తాత్పర్యము:- సుగమము.

తే॥గీ॥ భూమిపతిపుత్రి! చెప్పుమా బుద్ధిమతిని
కాశి వెడలఁగ వలసె నే కారణమున
గారణము లేక యూరక కలుగునెట్లు
సుఖము దుఃఖ బు నరునకు సులభలీల? 142

అర్థము:- భూమిపతి పుత్రీ! = ఓ రాజపుత్రీ!(లోపాముద్ర ఉశీనరరాజు కూఁతురు). చెప్పుమా! = చెపుమా!. బుద్ధిమతివి = బుద్ధిమంతురాలవు. ఏకారణమునన్ = ఏ కారణమువలన, కాశి = కాశినుండి, వెడలంగవలసెన్ = వెళ్లవలసి వచ్చినదిఁ కారణములేక = కారణములేకుండ, నరునకున్ = మనుష్యునకు. సులభలీలన్ = అనాయాసముగా. సుఖము దుఃఖంబు = సుఖము, దుఃఖము, ఊరక = నిష్కారణముగా, కలుగునెట్లు? = ఎట్లుకలుగును?

తాత్పర్యము:- ఓ రాజపుత్రీ! నీవు బుద్ధిమంతురాలవు. ఏ కారణము వలన కాశినుండి రావలసివచ్చెనో చెప్పరాదా! నిష్కారణముగ మనుష్యునకు సుఖముగాని, దుఃఖముగాని. తనంతట నెట్లు కల్గును?

వ॥ కాశ్మీరంబులయంద కుంకుమంబనునది దేశాపేక్ష; దివంబునంద కమల వికాసంబు, రాత్రియంద యుత్పల వికాసంబనునది కాలాపేక్ష: పుణ్యవంతునకు సుఖంబు, పాపిష్ఠునకు దుఃఖంబు ననునది యదృష్టాపేక్ష; సర్వంబును నీశ్వరాయత్తంబనువది యీశ్వరాపేక్ష; విశ్వంబును గ్రహవశంబనునది గ్రహాపేక్ష; మాకుఁ జూడ నీశ్వరప్రేరణంబునం గర్మంబు సుఖదుఃఖంబుల నాపాదించు; ఈశ్వరుం డెవ్వని రక్షింపవలసె వానిచేఁ బుణ్యకర్మంబులు చేయించు. నెవ్వనిం జెఱుపవలసె వానిచేఁ పాపకర్మంబులు చేయించు, అవిద్యాస్మితారాగద్వే

పాభినివేశలక్షణ క్లేశపంచక మూలంబునఁగదా కర్మాశ
యంబు? ఆకర్మఫల విహలోక పరలోకంబులం బ్రాణులనుభ
వింతురు. కర్మంబునకు మూలభూతంబైన క్లేశపంచకం బెంత
కాల బనువర్తించు, నంతకాలంబునకుఁ ద్రివిధంబు పరిపా
కంబు. నానావిధయోని జన్మప్రాప్తియు, నాయువు, సుఖదుఃఖ
ఫలోపభోగంబును,జన్మంబున జన్మహేతుకర్మంబు చరితార్థం
బయ్యేనేనియు నవశిష్టంబులై యాయుర్హేతువులు భోగహేతు
వులు నైన కర్మంబులకు ఫలానురూపంబులైన భోగంబులు
పరమేశ్వరుండు కల్పించుచుండు. 143

అర్థము :- కాశ్మీరంబులయంద = కాశ్మీరదేశమునందే, కుంకుమంబనునది= కుంకుమపువ్వు పుట్టుననన్నవిషయము, దేశాపేక్ష;=దేశమునందు-అధీనమైయున్నది, దివంబునంద = పగటియందే. కమల వికాసంబు = తామరపువ్వులు విచ్చుట,రాత్రి యంద = రాత్రిసమయమందే, ఉత్పలవికాసంబనునది = కలువపువ్వులు విచ్చుట యన్నది. కాలాపేక్ష; =కాలమువందు-ఆధీనమైన విషయము, పుణ్యవంతునకున్ = పుణ్యముగలవానికి, సుఖంబు = సుఖము, పాపిష్ఠునకున్ = పాపముగలవానికి, దుఃఖంబునన్నది = దుఃఖము, అనునది. అదృష్టాపేక్ష = అదృష్టమునందు-అధీనమై యున్నవిషయము, సర్వంబును = సమస్తమును, ఈశ్వరేచ్ఛాయత్తంబనునది - ఈశ్వరేచ్ఛ = ఈశ్వరుని యిచ్ఛ యందు, ఆ యత్తంబనునది = ఆధారడిపయున్న దనుట. ఈశ్వరాపేక్ష = ఈశ్వరుని యందు - అధీనమైయున్నది, విశ్వంబును = సమస్తవిశ్వమును, గ్రహవశంబనునది = గ్రహముల వశములోనున్నదనుట.గ్రహా పేక్ష = గ్రహములపై - అధీనపడియున్నది, మాకుఁజూడన్ = మాకు-చూడఁగా. ఈశ్వరప్రేరణంబునన్ = ఈశ్వరప్రేరణముచేత, కర్మంబు = శుభాశుభకర్మము, సుఖదుఃఖంబులన్ = సుఖదుఃఖములను, ఆపాదించు = కలుగునట్లుచేయును; ఈశ్వ రుండు = ఈశ్వరుఁడు, ఎవ్వని రక్షింపవలసెన్ = ఎవ్వనిని రక్షింపవలసియు న్నదో. వానిచేన్ = వానిచేత. పుణ్యకర్మంబులు = పుణ్యకార్యములు, చేయించు= చేయించును. ఎవ్వనిం జెఱుపవలసెన్ = ఎవ్వనినిఁజెఱుసవలసియున్నదో, వాని చేన్ = వానిచేత, పాపకర్మంబులు = పాపకృత్యములను, చేయించు, = చేయిం

చును, కర్మాశయంబు = కర్మముల గూడు, 'అవిద్యా .... మూలంబునంగదా' అవిద్యా = అవిద్యయును, అస్మితా = అస్మితయును, రాగ = రాగమును, ద్వేష= ద్వేషమును, అభినివేశ = అభినివేశము ననెడి, లక్షణ = లక్షణములుగల, క్లేశపం చక = అయిదుక్లేశముల, మూలంబునఁగదా। = దుంప వలనఁగదా। ఏర్పడుట, అక్కర్మఫలంబు = ఆ కర్మఫలమును, ఇహలోక పరలోకంబులన్ = ఈలోకము నందును, పరలోకమునందును, ప్రాణులు=జీవులు, అనుభవించు చుందురు, కర్మంబునకున్ = శుభాశుభకర్మమునకు, మూలభూతంబైన=దుంపయైన, క్లేశపంచకము = అవిద్యాదిపంచకము,ఎంతకాలంబు = ఎన్నాళ్ళు, అనువర్తించున్= వెన్నంటి నడచుచుండునో, అంతకాలంబునకున్=అన్నాళ్ళ వఱకును,పరిపాకంబు= కర్మ పరిపాకము, త్రివిధంబు = మూఁడు విధములు గలదియై యుండును. (అవి. జాత్యాయుర్భోగములని మూఁడు విధములు. వానిని వివరించుచున్నాఁడు) నానావిధ= పలువిధములైన, యోని=జాతులయందు, జన్మప్రాప్తియున్=పుట్టువొందుటయును, ఆయువున్ = ఆయుర్దాయమును, 'సుఖదుఃఖఫలోపభోగంబును'; సుఖ దుఃఖఫల= సుఖములు, దుఃఖములు ననెడి పండ్లయొక్క, ఉపభోగంబును = అనుభవము.అని మూఁడు విధములు. జన్మంబునన్ = జన్మచేత, జన్మహేతుకర్మంబు = జన్మ హేతు వైన కర్మము, చరితార్థంబయ్యెనేనియును = తీఱిపోయినప్పటికిని, అవశిష్టంబులై = మిగిలియున్నవై, ఆయుర్హేతువులు = ఆయుర్దాయమునకు హేతువులును, భోగహేతు వులును = సుఖదుఃఖానుభవములకుఁ గారణములనైన, కర్మంబులకున్ = కర్మ లకు, ఫలానురూపంబులైన = ఫలములకుఁ దగిన, భోగంబులు = అనుభవములు, పరమేశ్వరుండు = పరమేశ్వరుఁడు, కల్పించుచుండున్ = కల్పనచేయుచుండును,

తాత్పర్యము :- నియతదేశమునందే కొన్ని యుండుట, దేశాపేక్ష; నియత కాలమునందే కొన్నిజరగుచుండుట, కాలపేక్ష: పుణ్యముచేసినవానికి సుఖము.పాపము చేసిన వానికి దుఃఖము కలుగుట, అదృష్టాపేక్ష: సర్వమును ఈశ్వరసంకల్పాధీన మనుట; ఈశ్వరాపేక్ష; సమస్త విశ్వము గ్రహములపై ఆధారపడియున్నదనుట. గ్రహాపేక్ష; ఈరీతిగా ఇందఱిన్ని విధములుగాఁ జెప్పుచున్నారు; మాకుమాత్రమిట్లు తోఁచుచున్నది; ఈశ్వరుఁ డెవ్వని రక్షింపవలసియున్నదో, వానిచేత - పుణ్యములు చేయించును, ఎవ్వనిని శిక్షింపవలసియున్నదో వానిచేతపాపములుచేయించును. కర్మా శయమునకు మొదలిదుంప-క్లేశపంచకము. అవి-అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము, అనునవి; ఈక్లేశపంచకమను దుంపనుండి తీఁగలుసాగిన

కర్మాశయము ఎన్నాళ్లవెంట బడివచ్చుచుండునో, అన్నాళ్లను, కర్మలకు మూడు విధములైన పరిపాకము ఉండనేయుండును, అవి జన్మము, ఆయుర్దాయము, సుఖ దుఃఖానుభవము ఆనునవి; జన్మచేత-జన్మహేతువైన కర్మ తీతిపోయినను, మిగిలి యున్న ఆయుర్దాయహేతువులు, సుఖదుఃఖహేతువులునైన కర్మలకుఫలానురూపము లైన భోగములను పరమేశ్వరుడు కల్పించుచునేయుండును.

విశేషములు:- 'సతి మూలే తద్విపాకో జాత్యాయుర్భోగాః'

'క్లేశమూలః కర్మాశయో దృష్ట దృష్ట జన్మవేదనీయః'

'అవిద్యాస్మితారాగద్వేషాభినివేశాః పంచక్లేశాః'

ఇత్యాది పాతంజల దర్శనమునను సరించి శ్రీ నాథుడీ విషయమును ప్రపంచించె నని తోచుచున్నది. మూలములో ఈ ప్రకరణముసందు దీని ప్రసక్తి ఏమియును లేదు.

దాదాపుగా, ఈప్రకరణమంతయును శ్రీనాథుడు తన పురాణ విజ్ఞానమాధార ముగా ప్రపంచించి వ్రాసినదే. మూలములో అగస్త్య మహర్షి కాశిని విడచుట, తెనుగు శ్రీనాథుడు వ్రాసినదానికన్న మిక్కిలి సంగ్రహముగానున్నది. ఈప్రకర ణము తెనుగులో నున్నంత రసవంతముగా సంస్కృతములోలేదు. పురాణమును 'కావ్యముగా నొనర్చుట ఎట్టిదో దీనిని బట్టి యవగాహనము చేసికొనుటకు కొంత వీలగుచున్నది. స్కాందమునందలి యితర సంహితలనుండి తెచ్చిన శాస్త్రవిషయ లను బట్టి చూచినను-అగస్త్యుడాలంబనముగా. కాశీవియోగజమైనశోకముస్థాయిగా, కరుణరసమును సమృద్ధిగా నావిష్కరించిన యీ సంవిధానమునుబట్టిచూచినను.కాశీ ఖండమునందలి ద్వితీయాశ్వాసమంతయును, దాదాపుగా శ్రీనాథుని యుపజ్ఞయే యని యిచ్చటి మూలగ్రంథప్రకరణమును శ్రీనాథుని రచనాసరణితో బోల్చి పరిశీలించి నప్పుడు గోచరింపక మానదు. శ్రీనాథుడు ఈ ప్రకరణమునింతవిస్తరించి, మిగి లిన ప్రకరణములను జాల సంగ్రహించెను.

తే॥గీ॥ ఏమి చెప్పగనున్నది? యేవిధమునఁ
గాశివెడలించుచున్నాఁడు కాలగళుఁడు
మనములోఁ గిరి మేనిలోఁగునె శివాజ్ఞ?
యుడుము నడిఁకిన నడుఁకునే బడియపెట్టు? 144

అర్థము :- ఏమిచెప్పఁగనున్నది = చెప్పటకేమియున్నది, ఏ విధమునన్ = ఏ విధముననైనను, కాలగళుఁడు = నీలకంఠుఁడైన శివుఁడు, కాశి వెడలించుచున్నాడు = కాశినుండి వెళ్ళునట్లు చేయుచున్నాఁడు. మనము = మనము, లోఁగితిమేనిన్ = వెనుదీసినంతమాత్రమున, శివాజ్ఞ = శివుని యాజ్ఞ, లోఁగునె? = వెనుదీయునా? ఉడుము = ఉడుము-గోధిక, నడిఁకినన్ = భయపడినచో, బడియపెట్టు = బడియ దెబ్బ, నడుఁకునే? = భయపడునా?

తాత్పర్యము :- చెప్పవలసినదేమున్నది? ఏ విధముగానైన నేమి? కాశినుండి శివుఁడు వెళ్ళఁగొట్టుచున్నాఁడు, మనము వెనుదీసితిమికదా! అని శివాజ్ఞ వెనుదీయునా? ఉడుమునకు భయముగాని బడియపెట్టునకు భయమేమి యుండును?

వ: అని వెండియును 145

అర్థము :- అని = పలికి, వెండియును = మఱియును,

సీ॥ వక్షస్థలంబున వైచు మంత్రము చెప్పి
జమిలి పాముల రాచజన్నిదంబు
జడలల్లి చొల్లియంబిడి యొక్క-సకెముగా
బాలేందు శకలంబు పదిలపఱచు
గంధమూలమునందుఁ గస్తూరిమూఁటుగాఁ
గాలకూట విషంబుఁ గీలుకొలుపుఁ
గటిభారమునయందుఁ గట్టురిఁగులువాఱ
మెఱుఁగారు మువ్వన్నె మెకముతోలు

తే॥గీ॥ గట్టువాలు పడంతి చక్కటికిఁ దోఁపఁ
దఱుచు గైసేయుచుండు నాతల్లి కాశి
యయిదు కోశ్రిసులపొలములో నంతనంతఁ
జావకుండంగఁ జచ్చిన జంతువులకు॥ 146

అర్థము:- నాతల్లి = నాతల్లియైన, కాశి = కాశీనగరము, గట్టువాలు = అలంకరించునదియైన, పడంతి = స్త్రీయొక్క-సైరంధ్రియొక్క, చక్కటికిన్ = ధర్మము

నకు. తోఁపన్ = కనిపించునట్లుగా, అయిదుక్రోసుల పొలములోన్ = పంచక్రోశ పరిమితమైన క్షేత్రములో. చావకుండంగన్ = చావకుండుటకై - శాశ్వతత్వమునకై - అపునరభవమునకై. చచ్చిన = శరీరమును విడిచిన. జంతువులకున్ = ప్రాణులకు. అంతనంతన్ = అప్పటికప్పుడే. మంత్రముచెప్పి = యజ్ఞోపవీతధారణ మంత్రమునుజెప్పి. "జమిలి .... జన్నిదమ్ము" జమిలి = జంటగా పెనగొన్న. పాముల రాచజన్నిదమ్ము = నాగరాజయజ్ఞోపవీతమును. వక్షస్థలంబునన్ = తొమ్మునందు, సైచున్ = వేయును - అమర్చును.

జడల్లి = జడలుగానల్లి, చొళ్ళియంబిడి = చుట్టగానమర్చి. ఎక్క-సకెము గాన్ = వికటముగా-ఏటవాలుగా, 'బాలేందు శకలంబు' బాలేందు = (బాల+ఇందు) లేఁత చందరునియొక్క. శకలంబున్ = తునుకను-నెలవంకను. పదిలపఱచు = జాఱిపోకుండనిలుపును.

'కంఠమూలమునందున్'. కంఠ = కుత్తుకయొక్క. మూలమునందున్ = మూలభాగమునందు కస్తూరి మాఱుగాన్ = కస్తూరికి బదులుగా. కాలకూట విషంబు = కాలకూట మనువిషమును. కీలుకొలుపున్ = తగుల్చును.

కటిభాగమునయందున్ = మొలయందు, మెఱుఁగారు కాంతులీనెడి 'మువ్వన్నెమెకముతోలు.' మువ్వన్నెమెకము = (మూఁడు+వన్నె-మువ్వన్నె) (మూఁడు వన్నెలు-పసపు. నలుపు, తెలుపు.) పెద్దపులియొక్క. తోలు = చర్మమును. రింగులు వాఱన్ = కుచ్చెలు తీరునట్లుగా. కట్టున్ = కట్టును. తఱచు = తఱచుగా. సేకైయుచుండున్ = అలంకరించుచుండును.

తాత్పర్యము:- నాతల్లియైన కాశికానగరి సైరంధ్రివలెఁ శాశ్వతపదవికై - అయిదుక్రోసుల-ఆ పొలములో మేనులుఱాల్చిన ప్రాణులకు. అప్పటికప్పటికేమంత్ర పూర్వకముగా జమిలిపాములయజ్ఞోపవీతమును తొమ్మున వేల్రిలాడఁదీయును.

జుట్టు జడలుగానల్లి, చుట్ట చుట్టి చొళ్ళియ మమర్చి దానిపై నేటవాలుగా నెలవంకను జాఱకుండ పదిలపఱచును. కుత్తుక కుదుట-కస్తూరికి బదులుగా కాలకూటమును తగిలించును. మొలయందు మెఱుఁగులీనెడు మూఁడు వన్నెల పులితోలును కుచ్చెలు తీర్చి కట్టును. ఇంకను సొగసులు దిద్దుచుండును.

విశేషము:- 'చావకుండఁగఁ జచ్చిన జంతువులకు' విరోధాభాస. పంచక్రోశియందు జంతువులు చావకుండుటకై చచ్చుచున్నవి. ఇవి విరోధము. దీని పరి

హారము; 'చావకుండుటకై అనఁగా - మృత్యువును జయించుటకై మృత్యువు ఏవ్వరికిఁ జన్మించినవారికి. జన్మలేనిచో - మృత్యువులేదు అనఁగా - తిరిగిజన్మించకుండుటకై - అపునర్భవమునకు - శాశ్వతత్వమునకు - అని తాత్పర్యము.

చం॥ అని యెదురుండిమ్రొక్కి నయనాంబురుహాంబుల బాష్ప
బిందువుల్
చినుకఁగ వెక్కివెక్కి కలశీసుతుఁ డోయన నేడ్చి నిరేలుం
గున నొక కొంత కొంత మఱి గ్రుమ్మరు మిన్ననమ్రమోవనుద్ధుర
ధ్వనిఁ బఠియింపఁ జొచ్చెఁ బ్రణవంబునఁగూర్చిన మంత్ర
రాజమున్॥ 47

అర్థము :- అని = పలికి, ఎదురుండి = కాశీనగరమున కెదురుగా నిలువఁబడి, మ్రొక్కి = నమస్కరించి, నయనాంబురుహంబులన్ = కన్నుదామరలయందు, బాష్ప బిందువుల్ = కన్నీటిబిందువులు, చినుకఁగన్ = కురియఁగా, వెక్కివెక్కి = పొంగివచ్చుచున్న యేడ్పును నిలిపి నిలిపి, కలశీసుతుఁడు = కలశసంభవుఁడైన యగస్త్యుఁడు, 'ఓ' యన నేడ్చున్ = 'ఓ' యని యేడ్చును, ఈరేలుంగునన్ = హీనస్వరముతో, ఒక కొంత కొంత = ఇంచుకించుకసేపు, మఱి = మఱల, క్రుమ్మరున్ = ఇటునటు తిరుగును. మిన్ననమ్రోతన్ = ఆకాశమునందు ప్రతిధ్వనించునట్లు, ఉద్ధురధ్వనిన్ = బరువైన కంఠధ్వనితో, ప్రణవంబునన్ = ఓంకారముతో, కూర్చిన - ఘటించిన, మంత్రరాజమున్ - శ్రీపంచాక్షరీ మంత్రమును, పఠియింపఁజొచ్చెన్ = పఠింపమొదలిడెను.

తాత్పర్యము :- ఇట్లుపలికి కాశీనగరమున కెదురుగా నిలఁబడి నమస్కరించి కన్నుల నుండి బాష్పములు చినుకుచుండఁగా ఏడ్పును. నిలిపి నిలిపి, ఇఁక వశముగాక - అగస్త్యమహాముని 'ఓ' యని యేడ్చెను. మఱికొంతసేపు హీనస్వరముతో నిటునటు తిరిగి మనస్సు దిటవు పఱుచుకొని బరువైన కంఠధ్వనితో ప్రణవసహితమైన పంచాక్షరీ మంత్రమును పఠింప మొదలిడెను.

వ: అచ్చోటు గదలి కతిపయ ప్రయాణంబుల వింధ్యాచలంబుడాయంజను దెంచి విషమ దృషత్ ఖండ విలసన్నస్థలంబును, జరత్తరుకోటరలుఠదజగరగళ గుహానిష్ఠ్యూత నిష్ఠుర పవన సంధు

క్షమాణదవదహన శిఖాకలాపంబును నుగ్రతరశరభ చటుల
చపేట పాతమోహితరోహితంబును సముద్ధత స్తబ్ధ మ క ర
కఠోర ఘుర్ఘుర్ధ్వాన ఘుమఘుమాయమాన దిక్కుంజరక్రోడం
బును గ్రీడచ్చిక్రోడ శిశుచరణ నఖశిఖాశిఖర విశీర్యమాణ
శిఖర శేఫాలికా కుసుమ కేసరరజః ప్రసరధూసర వాసర కర
కర వ్రాతంబును బరుషతరు పవన బిలపతితపచేళిమ దధిఫల
భక్షణ ఫుల్లగల్లభల్లూకప్రకరంబును నగు మహా గహన
మధ్యంబున. 148

అన్వయము:- అచ్చోట = (ఆ + చోటు-అచ్చోట) అ ప్రదేశమునుండి, కదలి = నడచి. కతిపయప్రయాణంబులన్ = కొన్ని మజిలీలతో, వింధ్యాచలం బున్ = వింధ్యపర్వతమును. డాయంజనుదెంచి = చేరవచ్చి, 'విషమ .... స్థలం బును' విషమ = సమతలముకాని, దృషత్ఖండ = శిలాఖండములయొక్క, విల సన = సన్నివేశముగల, స్థలంబును = ప్రదేశములుగలదియును, జరత్తరు....కలా పంబును' జరత్ = ముదిసిన, తరు = చెట్లయొక్క, కోటర = తొఱ్ఱలనుండి, లఠత్ = దొరలుచున్న, అజగర = కొండ చిలువలయొక్క, గళగుహా = కంఠ గుహలనుండి, నిష్క్రాంత = ఉమియబడిన, నిష్ఠురపవన = తీవ్రమారుతముచేత, సం ఘుక్షమాణ = రెక్కొలపబడుచున్న, దవదహన = కార్చిచ్చులయొక్క, శిఖాకలా పంబును = శిఖాసమూహములు గలదియును 'ఉగ్రతర .... రోహితంబును' ఉగ్ర తర = మిక్కిలి భయంకరములైన, శరభ = శరభ మృగములయొక్క, చటుల = తీవ్రములైన, చపేట పాత = చెంపపెట్లుచేత, మోహిత = మూర్ఛిల్లిన, రోహితం బును = రోహిత మృగములు కలదియును, 'సముద్ధత .... క్రోడంబును' సము ద్ధత = మిక్కిలి పొగరెక్కిన, స్తబ్ధలోమ = వనవరాహములయొక్క, కంఠ = కంఠములకు సంబంధించిన, కఠోర = కఠినములైన, ఘుర్ఘుర్ధ్వాన = ఘుర్ఘుర ధ్వనులుచేత, ఘుమఘుమాయమాన = గుబగుబలాడుచున్న, దిక్కుంజర = దిగ్గజ ములయొక్క, క్రీడంబును = దొక్కులుగలదియును, "క్రీడచ్చిక్రోడ .... కర వ్రాతంబును' క్రీడత్ = ఆడుచున్న, చిక్రోడ శిశుపడుత పిల్లలయొక్క, చరణ నఖ = కాలిగోళ్ళ యొక్క, శిఖాశిఖర = అంచు కొనలచేత, విశీర్యమాణ = శిథిల

ములుగాఁ జేయఁబడుచున్న. శిఖర = కొనలుగల. శేఫాలికాకుసుమ = నల్లవావిలి పూవులయొక్క, కేసర = అకరువులకు సంబంధించిన. రజఃప్రసర = పుప్పొడి వ్యాపించుటచేత. ధూసర = బూఁది వన్నె కలవైన, వాసరకర = దినకరుని యొక్క (సూర్యుఁడు). కరవ్రాతంబును = కిరణ సమూహముకలదియును, 'పరుష .... ప్రకరంబును' పరుష = తీవ్రమైన. తరుపవన = చెట్లగాలుల చేత. బిలపతిత = కలుగులోపడిన. పచేళిమ = పండఁబాటిన, దధిఫల = వెలఁగ పండ్లను, భక్షణ = తినుటచేత. ఫుల్లగల్ల = వికసించెక్కళ్లుగల, భల్లూకప్రకరంబును = ఎలుఁగుబంట్ల గుంపులుగలదియునైన. మహాగహన = మహారణ్యము యొక్క, మధ్యంబునన్ = మధ్యభాగమునందు.

తాత్పర్యము :- వింధ్యారణ్యవర్ణనము.

సీ॥ యక్షరాజుఁ దలంచి యక్షీ గోళంబుల
నశ్రు పూరము నించు నర్మ మిగిలి
పలుమాఱునట దండపాణి సౌహార్దంబు
భావించి భావించి పలవరించు
సంభ్రమోద్భ్రమముల విశ్వాసపాత్రంబుల
సోవిదల్లులనర్థి సంస్మరించు
దిగ్గజాఘోర సిద్ధి వినాయక కపర్ది
చింతామణీ గణేశతలఁ బొగడు

తే॥గీ॥ జ్యేష్ఠసౌభాగ్యసుందరి చిత్రఘంట
వికట దుర్గామహాదేవి విశ్వవాహ
శాటికా రేవతల నిజస్వాంత వీథిఁ
గాంచి గణుదాల్చు సర్వాంగకములఁ దపసి॥

అర్థము :- యక్షరాజుల్ = యక్షరాజును, తలంచి = సంస్మరించి, అర్మి= ప్రేమ. మిగిలి = అతిశయించి. అక్షిగోళంబులన్ = నేత్రగోళములయందు, అశ్రు పూరమున్ = బాష్పప్రవాహమును. నించున్ = నింపును.

పలుమాఱు = పెక్కుసార్లు, అట = ఆ కాశీనగరమునందలి. దండపాణి= దండపాణియొక్క, సౌహార్దంబున్ = ప్రేమను, భావించి భావించి = తలఁచికొని పలవరించున్ = పలవరించును.

విశ్వాసపాత్రంబులన్ = విశ్వాసయోగ్యులైన, సౌవిదల్లులన్ = కంచుకులైన, సంభ్రమోద్భ్రములన్ = సంభ్రమఁడు, ఉద్భ్రమఁడు, ననువారిని, అర్థిన్= ప్రీతితో సంస్మరించున్ = తలంచికొనును.

"దిగ్గజాఘోర .... గణేశతలన్" దిగ్గజ = దిగ్గజవినాయకుని, అ ఘోర = అఘోర వినాయకుని, సిద్ధి వినాయక = సిద్ధి వినాయకుని, కపర్ది = కపర్దివినాయకుని. చింతామణీగణేశతలన్ = చింతామణి వినాయకుని, పొగడున్ = పొగడును. (వీరే పంచ వినాయకులు.)

జ్యేష్ఠన్ = జ్యేష్ఠాదేవిని, సౌభాగ్యసుందరీ = సౌభాగ్యసుందరిని, చిత్రఘుంటన్ = చిత్రఘుంటాదేవిని, వికట = వికటాదేవిని, దుర్గా = దుర్గామహాదేవిని, విశ్వవాహన్ = విశ్వవాహాదేవిని, కాటికాదేవతలన్=కాటికాదేవతలను, 'నిజస్వాంతవీథిన్ , నిజ=తనయొక్క, స్వాంతవీథిన్ = మనోవీథియందు, కాంచి = చూచి, తపసి = అగస్త్య మహాముని, సర్వాంగకములన్ = సర్వావయవములయందును, గఱుదాల్చున్ = గగుర్పాటుచెందును.

తాత్పర్యము :- మఱల - కాశీనగరములోని దేవతలందఱును దలంపునకు వచ్చుచున్నారు.

కం॥ త్రిణయనుని రాణివాసము
నణిమాద్యైశ్వర్యవితరణా మరతరువున్
మణికర్ణిక ముక్తి వధూ
మణి కర్ణికఁ దలఁచుఁ దపసి మానసవీథిన్ ॥ 150

అర్థము :- తపసి = తపస్వియైన అగస్త్య మహాముని, త్రిణయనునిరాణివాసము' త్రిణయనుని = శివునియొక్క, రాణివాసము = భార్యయైనట్టియు, "అణిమాద్యైశ్వర్యవితరణామరతరువున్" అణిమాది = అణిమమొదలైన, ఐశ్వర్య = అష్టైశ్వర్యములయొక్క, వితరణ = ప్రదానమునందు, అమర తరువున్ = కల్పవృక్షమైనట్టియు, 'ముక్తి వధూ మణికర్ణికన్' ముక్తివధూ = మోక్ష

కాంతయొక్క, మణికర్ణికన్=మణిమయ తాటంకమైన. మణికర్ణికన్ = 'మణికర్ణిక' యనెడి తీర్థమును, మానసవీథిన్ = మనోవీథియందు, తలచున్ = స్మరించును.

తాత్పర్యము :- అగస్త్యమహాముని తన మానసవీథియందు శివుని భార్య యును, 'అణిమ' మొదలైన అష్టసిద్ధుల నిచ్చుటయందు కల్పవృక్షమైనట్టి. ముక్తి వధువునకు మణిమయ కర్ణికయైన మణికర్ణికను ధ్యానించును.

విశేషములు:- అణిమ, మహిమ, గరిమ లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశత్వము. వశిత్వము, అనునవి. ఎనిమిది విభూతులు-ఐశ్వర్యములు.

సీ॥ కఠవల్లిఁ బఠియించుఁ గంఠము సంశోధించుఁ
ప్రాణోపనిషదభిప్రాయ మరయుఁ
బరిపాటి ముండకోపనిషత్తుఁ దాపసీ
యోపనిషత్తు నభ్యుపగమించుఁ
దటియు నథర్వవేదశిరఃప్రపంచంబు
లారణ్యక ముఖోవలరసి చూచుఁ
బ్రశ్నోపనిషదర్థ పరిమళంబు గ్రహించు
శ్రీ భగవద్గీతఁ జిత్తగించుఁ

తే॥గీ॥ దలవకారంబు శ్వేతాశ్వతరము ననెడు
నుపనిషత్తులు తలపోయు నొయ్య నొయ్యఁ
గాశికాక్షేత్ర విప్రయోగ ప్రభూత
హృదయ సంతాపశాంతికై యిల్వలారి॥ 151

అర్థము-: కఠవల్లి = కఠివల్లిని. పఠియించున్ = పఠించును. కఠము = కఠోపనిషత్తు. సంశోధించున్ = సంశోధనముచేయును. "ప్రాణోపనిషదభిప్రాయము". ప్రాణోపనిషత్ = ప్రాణోపనిషత్తుయొక్క. అభిప్రాయము = ఆశయమును. అరయన్ = విచారించును, పరిపాటిన్ = వరుసగా, ముండకోపనిషత్తున్ = ముండకోపనిషత్తును, తాపసీయోపనిషత్తున్ = తాపసీయోపనిషత్తును, అభ్యుపగమించున్ = (అభి + ఉపగమించున్) ప్రవేశించును, అథర్వ వేదశిరఃప్రపంచంబులు = అథర్వశిరస్సు మొదలైన వానిని, దటియున్ = సమీపించును,

ఆరణ్యకము తోఁవలు = బృహదారణ్యక మార్గములను. అరసి చూచున్ = విచారించి చూచును. ప్రశ్నోపనిషదర్థ పరిమళంబు' ప్రశ్నోపనిషత్ = ప్రశ్నోపనిషత్తుయొక్క. అర్థపరిమళంబు = ఆశయసౌరభమును. గ్రహించున్ = గ్రహించును, శ్రీ భగవద్గీతన్ = సర్వోపనిషత్సారమైన భగవద్గీతను. చిత్తగించున్ = చిత్తమునకుఁ దెచ్చికొనును. తలవకారంబు శ్వేతాశ్వతరము ననెడి = తలవకారము. శ్వేతాశ్వ తరమునఁనెడి. ఉపనిషత్తులు = ఉపనిషత్తులను. ఒయ్యనొయ్యన్ = నెమ్మది నెమ్మదిగా. తలపోయున్ = మననమునకుఁ దెచ్చికొనును, ఇల్వలారి = ఇల్వలాసురుని తన జఠరాగ్ని యందు భస్మము చేసిన – అగస్త్యమహాముని. "కాశికా....శాంతికై" కాశికాక్షేత్ర = కాశీక్షేత్రముయొక్క. విప్రయోగ = ఎడబాటువలన. సంప్రభూత=పుట్టిన. హృదయసంతాప=హృదయసంతాపముయొక్క. శాంతికై = ఉపశమనార్థమై.

తాత్పర్యము:-కాశీక్షేత్రవియోగము వలన కలిగిన హృదయ సంతాపము ఉపశమించుటకై అగస్త్యమహాముని వివిధములైన యుపనిషత్తుల యొక్కయు. సకలోపనిషత్సారమైన శ్రీ భగవద్గీతయొక్కయు సారమును మననారూఢము చేసికొనుచుండును.

విశేషము:- ఈ యుపనిషత్తులన్నియును శ్రీనాథుఁడు చదివినవి. మూలకాశిఖండములో – ఈ ప్రకరణమునందు వీనిప్రసక్తి లేశమునులేదు. మూలములోఁగాశీవిప్రలంభము – ఇంతసుదీర్ఘముగా లేదు. అగస్త్య మహర్షి నడచివెళ్ళినట్లుకూడలేదు. (ఆకాశగమనముతో నేగెను.)

'తపోయానమివారుహ్య నిమేషార్ధేనవై మునిః
అగ్రేదదర్శతం వింధ్యం రుద్ధాంబర మధోన్నతం.'

అని మిక్కిలి సంక్షేపముగా ఇంతమాత్రమే యున్నది. ఈ ఘట్టమంతయును శ్రీనాథుఁడు యోగశాస్త్రాది విషయములతో ప్రపంచించి వ్రాసెను. ఈ ప్రకరణము ఆయన శాస్త్రవిజ్ఞానమునకు దార్శనికతకు దృష్టాంతముగా నున్నది.

వ: అప్పుడు. 152

అర్థము :- ఆ సమయమునందు.

మ. క్షితిపాలోత్తమ వంశభూషణము లక్ష్మీభారతీ పార్వతీ
ప్రతిబింబంబు సమగ్రకాంతిమతి లోపాముద్ర నీక్షించి య
ద్భుతముంబొందుచు వింధ్యనామక మహాభూమిధరారణ్యదే
వత లందంద నమస్కరింతురు మనోవాత్సల్య మొప్పారఁగన్ ॥153

అర్థము :- 'క్షితిపాలోత్తమ పంశభూషణము' క్షితిపాలోత్తమ = రాజోత్తములయొక్క, వంశ = పంశమునకు. భూషణము = అలంకారమైనదియును. 'లక్ష్మీ.... ప్రతిబింబంబు' లక్ష్మీ=లక్ష్మీదేవికి. భారతీ = సరస్వతీదేవికి, పార్వతీ= పార్వతీదేవికి. ప్రతిబింబంబు = ప్రతిబింబ భూతయును; సమగ్రకాంతిమతి = సమగ్రకాంతిగల. లోపాముద్రను = లోపాముద్రాదేవిని. ఈక్షించి = చూచి, అద్భుతముంబొందుచు = ఆశ్చర్యమును భజింపుచు. "వింధ్య.... దేవతలు" వింధ్య నామక=వింధ్యమను పేరుగల, మహాభూమీధర = మహాపర్వతముయొక్క, అరణ్య దేవతలు = వనదేవతలు, మనోవాత్సల్యము = మనస్సులయందలి వాత్సల్యము. ఒప్పారఁగన్ = ఒప్పునట్లు. అందంద = మాటిమాటికి. నమస్కరింతురు = నమస్కరించెదరు.

తాత్పర్యము :- అగస్త్య మహాముని వెంట లోపాముద్రాదేవి వింధ్యపర్వతారణ్య భూములలో నడచి వచ్చుచున్నది. ఆమె సాక్షాత్తుగా జగజ్జననులైన లక్ష్మీ భారతీ పార్వతీ దేవులకు ప్రతిబింబమా; అన్నట్లు వనదేవతలు ఆశ్చర్యచకితలై చూడసాఁగిరి. రాజపుత్త్రియయ్యును భర్తవెంట ఘోరదుర్గములలోఁ బడి నడచి వచ్చుచున్నదే; అని వనదేవతలు మనస్సులు వాత్సల్యముతో నిండిపోయినవి. కాని, ఆమె - అనుభవతేజోవిశేషములచేత తమకుఁ దెలియకయే మాటిమాటికి నమస్కరింప సాఁగిరి.

మ. నలి వింధ్యాచలకాననాంతరమునన్ వారాణసీ త్యాగ వి
హ్వల భావంబున నిల్చి నిల్చి హర! నీహారాంశు మూర్ధన్య ని
ర్మల! కాశీశ్వర! నీలకంఠ! యనుచున్ ప్రూఁగన్ను వాటిల్లదత్
కలశీశానుఁడు మూర్ఛఁగైకొనుఁ గ్రమక్రీమాశురోల్లాపియై ॥154

అర్థము :- నలిన్ = కృశత్వముతో, 'వింధ్యాచలకాననాంతరమునన్' వింధ్యాచల = వింధ్యపర్వతముయొక్క, కాననాంతరమునన్ = అరణ్య మధ్యమునందు,

'వారాణసీత్యాగ విహ్వల భావంబునన్' వారాణసీ = వారాణసీక్షేత్రముయొక్క త్యాగ = విడిచివచ్చుటచేత, విహ్వల = వశము తప్పిన అవయవములుగల, భావంబునన్ = పరిస్థితితో, నిల్చినిల్చి = ఆఁగి,యాగి, హర! = సంసార హరుఁడా!, 'నీహారాంశు మూర్ధన్య!' నీహారాంశు = మంచుకిరణములుగల చంద్రుఁడు, మూర్ధన్య! = తలపూవుగాఁగల స్వామీ!, నిర్మల! మాలిన్యము లేని అచ్చపు వేలుపా!!కాశీశ్వర! = కాశీవల్లభా!, నీలకంఠ! = నీలకంఠా!, అనుచున్ = పలుకుచునే, క్రమాఁగన్ను = సొలినకన్ను, పాటిల్లన్ = ఏర్పడఁగా, "క్రమక్షమాక్షరోల్లాపియై' క్రమక్షమ = క్రమముగా సన్నగిలుచున్న, అక్షర = వర్ణములను, ఉల్లాపియై = పలుకుచున్న వాఁడై, తత్ = ఆ, కలశీసూనుఁడు=కలశసంభవుఁడైన యగస్త్యుఁడు, మూర్ఛన్ = ఇంద్రియ నిమీలన స్థితిని, కైకొనున్ = స్వీకరించును.

తాత్పర్యము :- కాశిని వదలివచ్చిన మనోవ్యథతో అగస్త్యుని అవయములు పట్టుతప్పుచున్నవి, అందువలన అరణ్యమధ్యములో అచ్చటచ్చట ఆయన నిలఁబడిపోవుచుండెను, ఆ రీతిగా నిలిచినప్పుడు, హర! నీహారాంశుమూర్ధన్య! నిర్మల! కాశీశ్వర! నీలకంఠ! అన్నశబ్దములలోని అక్షరములను క్రమముగా సన్నగిలుచున్న ధ్వనితో పలుకుచు సొలినకన్ను పెట్టి మూర్ఛావస్థలోనికి ప్రవేశించుచుండెను, ఇంద్రియవ్యాపారములు నిమీలితములగుటయే మూర్ఛ!

విశేషము:- ఈపద్యము చివరనున్న 'క్రమక్షమాక్షరోల్లాపి' అన్నపద బంధము-

'మామా మానద ముంచ మామితి క్రమక్షమాక్షరోల్లాపినీ
సుప్తా కింను! మృతనుకిం! మనసి మేలీనా లిలీనాను కిం!'

(అమరుకం) అమరుక కావ్యములోనిది

శ్రీనాథుఁడు తనకిష్టములైన పదబంధములను సంస్కృత కవులనుండి యథేచ్ఛముగాఁ దీసికొనును. అదిగ్రంథచౌర్యముకాదు, ఆయన 'రసప్రలుబ్ధధీ' లక్షణము. చిత్రమేమనఁగా-ఇటీవలపరిష్కర్తలు ఇట్టి పాఠములను దీసివైచి నిస్సారములును, పేలవములు నైన పాఠములను చేర్చుట.

రెండుపర్యాయములు శ్రీ ప్రభాకరశాస్త్రిగారిచేత పాఠములు సమకూర్పించి వావిళ్ళవారు ప్రచురించిన కాశీఖండములో - అనర్ఘమైన - ఈ పాఠము తొలగింపఁబడి - 'సమగ్రంబైన తద్వేదనన్' అను నిస్సారమయిన - పద్యపూరణార్ధ మాత్రప్రయోజనమైన పాఠము, నెలకొల్పఁబడినది.

1865 వ సంవత్సరములో - చెన్నపురి ప్రెసిడెన్సీ కళాశాలలో ఆంధ్ర ప్రథమ పండితులైన శ్రీ రేకము రామానుజ సూరిగారిచేత పరిష్కరింపించి నాయని రామయ్య నాయని వారిచేతను. కోకా పుండరీకాక్షుడు నాయనివారిచేతను ప్రచురింపబడిన ప్రాచీన కాశీఖండములో "క్రమకొమాక్షరోల్లాపియై" అను పాఠమున్నది. దీనిని పట్టియే పెద్దనగారు మనుచరిత్రములో - వరూథినీరతివర్ణనములో ప్రకరణము వేఱైనను - 'ఆక్రమక్షీణనుతివర్ణము' అను సమాసమును గూర్చిరి.

అర్థము :- వెండియున్ = మఱియును, కుంభసంభవుండు=అగస్త్యుఁడు

చం॥ దురితములెన్ని చేసితినొ! తొల్లిటి జన్మమునందుఁ గాశికా
పురమున సర్వజంతువులు భూరి సుఖంబులు కొల్లలాడఁగా;
హర హర! నెత్తిఁ జేతులిడి యశ్రులు కన్నుల నుప్పతిల్లఁగా
గరి నిభయాన తోనిదె పొకాలెద మిన్నులు పడ్డచోటికిన్ ॥ 156

అర్థము :- తొల్లిటి జన్మమునందు = వెనుకటి పుట్టువునందు, దురితములెన్ని చేసితినొ = ఎన్నిపాపములు చేసియున్నానో!, కాశికాపురమునన్ = కాశికాపట్టణమునందు, సర్వజంతువులు = ఎల్ల ప్రాణులు, 'భూరివిముక్తు' భూరి = అధికమైన, విముక్తులు-మోక్షములను, కొల్లలాడఁగాన్ = కొల్లగొట్టుకొనుచుండఁగా, నెత్తిన్ = తలపై, చేతులకి = చేతులు పెట్టుకొని, కన్నులన్ = కన్నులనుండి, అశ్రులు = బాష్పములు, ఉప్పతిల్లఁగాన్ = ఉదయించుచుండఁగా, కరినిభయాన తోన్ = ఏనుఁగువలె మందగమనముగల-ఈలోపాముద్రతో, మిన్నులుపడ్డచోటికిన్ = ఆకాశము వ్రాలినచోటికి సుదూరదేశమునకు, ఇదె = ఇదిగో, పొకాలెదన్ = పోవుచున్నాను, హరహర! = శివశివా!

తాత్పర్యము :- కాశికా పురమునందు, ఎల్లప్రాణులును అధికమైన మోక్ష సంపదలను తమ యిచ్ఛవచ్చినట్లు కొల్లఁగొట్టుకొను చుండఁగా, వెనుకటి జన్మములో ఎన్ని పాపములు చేసితినో! నెత్తినఁ చేతులుపెట్టుకొని, కన్నులవెంట నీరు గార్చుచు భార్యతో, మిన్నులు వ్రాలిన సుదూరదేశములకు ఈరీతిగా! పోవుచున్నాను హరహరా!

తే॥గీ॥ ఏల క్రమింగితి వాతాపి నిల్వాలు? నిల
నేలఁద్రోచితి దివినుండి యోలినహుషు?
నాప్రభావంబుగాదె నన్నదిరిపాటు
కాశివెడలంగఁ ద్రోచె నిష్కారణముగ॥ 157

అర్థము :- వాతాపిన్ = వాతాపిని, ఇల్వలున్ = ఇల్వలుని, ఏలక్రమింగి తిన్ = దేనికిక్రమింగితిని, దివినుండి = స్వర్గమునుండి, నహుషున్ = నహుషుని, ఓలిన్ = సరాసరి, ఇలన్ = భూమిపై, ఏలఁద్రోచితిన్ = ఎందుకు త్రోసినాను, నాప్రభావంబకాదె = నాసామర్థ్యమేకదా! అదిరిపాటు = ఆకస్మికముగ, నన్ను = నన్ను, నిష్కారణంబ = కారణము లేకయే, కాశివెడలంగఁ ద్రోచెన్ = కాశినుండి వెడపట్టి గెంటినది!

తాత్పర్యము :- మిగిలినమునులవలె నేను ఉన్నట్లుండక ఆవాతాపిని, ఇల్వలుని దేనికిఁ క్రమింగినాను, స్వర్గమునుండి ఆ నహుషుని సరాసరి భూమి మీఁదికి దేనికిఁ ద్రోసినాను? ఇట్లు ఆకస్మికముగా, నిష్కారణముగా, కాశినుండి నన్నువెళ్లఁ ద్రోసినది నా ప్రభావమేకదా!

సీ॥ ఎన్నఁడు చూతునో యింకొక్క మాటేను
బ్రకటకైవల్యాంబురాశిఁ గాంతి?
ఎన్నఁడు చూతునో? యింకొక్క మాటేను
జగదేక పావని జహ్ను కన్య?
నెన్నఁడు చూతునో! యింకొక్క మాటేను
మహిమాస్పదము ముక్తిమంటపంబు?
నెన్నఁడు చూతునో యింకొక్కమాటేను
విశ్వలోకారాధ్యవిశ్వనాథు

తే॥గీ॥ నింక నెన్నఁడు చూతునో యేనుడుంతి?
నింక నెన్నఁడు చూతునో యేనదుర్గ?

నింక నెన్నఁడు చూతునో యేను వటుకు?
నింక నెన్నఁడు చూతునో యేనుగుహుని? 158

అర్థము :- "ప్రకట కైవల్యాంబు రాశిన్' ప్రకట = ప్రసిద్ధమైన. కైవల్యాంబురాశిన్ = మోక్షసముద్రమైన. కాశిన్ = కాశీనగరమును. ఏను = నేను. ఇంకొక్కమాటు = ఇంకొక్క పర్యాయము. ఎన్నఁడు చూతునో! = ఎప్పుడు చూతునో!, జగదేకపావనిన్ = లోకైక పావనియైన. జహ్నుకన్యన్ = జాహ్నవిని, ఏను = నేను, ఇంకొక్కమాటు = ఇంకొక్కసారి. ఎన్నఁడు చూతునో!= ఎప్పుడు చూతునో!

'మహిమాస్పదము' మహిమ = మహిమకు. ఆస్పదము = నెలవైన, ముక్తి మంటపంబున్ = ముక్తి మంటపమును, ఏను = నేను, ఇంకొక్కమాటు = ఇంకొక్కసారి, ఎన్నఁడుచూతునో = ఎప్పుడుచూతునో!. 'విశ్వలోకారాధ్యునన్' విశ్వలోక = షట్త్రింశత్తత్వాకమైన సమస్తలోకమునకు, ఆరాధ్యున్ = ఆరాధనీయుఁడైన. విశ్వనాథున్ = విశ్వేశ్వరస్వామిని, ఏను = నేను. ఇంకొక్కమాటు= ఇంకొక్కసారి, ఎన్నఁడు చూతునో = ఎప్పుడుచూతునో!

ఏను = నేను, డుంఠిన్ = డుంఠి విఘ్నేశ్వరుని. ఇంకన్ = ఇఁకమీఁదట, ఎన్నఁడు చూతునో! ఎప్పుడు చూతునో!

ఏను = నేను, దుర్గన్ = దుర్గను, ఇంకన్ = ఇఁక మీఁదట. ఎన్నఁడు చూతునో = ఎప్పుడు చూతునో!

ఏను = నేను, వటుకున్ = వటుకభైరవుని, ఇంకన్ = ఇకమీఁదట, ఎన్నఁడు చూతునో! = ఎప్పుడుచూతునో!

ఏను = నేను, గుహునిన్ = కుమారస్వామిని. ఇంకన్ = ఇంకమీఁదటను, ఎన్నఁడు చూతునో = ఎప్పుడుచూతునో!

తాత్పర్యము :- సుగమము.

వింధ్య గర్వాపహరణము

వ: అనుచునల్లనల్లనవచ్చు కుంభ సంభవు దవ్వుదవ్వులంగాంచి కాం
చన శిరశ్శృంగ శృంగాటకంబులంగ మలభ వాండ కటాహంబు

ఉద్ఘాటించు తన మేటి పొడవు నేలసపాటంబుగా వంచివింధ్య
చలంబమ్మహానుభావు నెదురొక్కనియె. అప్పు డరుక్కని రథంబు
చక్కఁజాయ నడచె. పవనస్కంధంబుల నిర్బంధంబు లుడిగె.
ఇందుండు చిందిలి పడసాఁగె. మంగళ బుధ బృహస్పతి శుక్ర
శనైశ్చర రాహుకేతువులు తమ తమ తానకంబులు తప్పక
చరింపందొడంగిరి. విశ్వప్రపంచంబు సర్వంబును క్రమంబున
యథాపూర్వంబునం బ్రవర్తిల్లె. కాలంబు లేర్పడియె. అనంత
రంబ పురుషాకారంబు దాల్చి యజ్జగతీధరంబు కొన్ని యజ్జలం
బత్యుద్గమించె. 159

అర్థము :- అనుచున్ = అని పలుకుచు, అల్లనల్లనన్=నెమ్మది నెమ్మదిగా, వచ్చు = వచ్చుచున్న, కుంభసంభవున్ = అగస్త్యుని, దవ్వుదవ్వులన్ = మిక్కిలి దూరమునుండియే, కాంచి = చూచి, 'కాంచన.... శృంగాటకంబులన్' కాంచన= బంగారు వన్నెగల, శిఃశృంగ = చిట్టచిటారు శిఖరములయొక్క, శృంగాటకంబులన్ = చౌకములచేత, కమలభవాండ = బ్రహ్మాండమయొక్క, కటాహంబులన్ = పైకప్పులను, ఉద్ఘాటించు = తెలుచుచున్న, తన = తనయొక్క, మేటిపొడవు = అధికమైన యున్నతిని, నేల సపాటంబుగాన్ = నేలతో సమానమగునట్లు, వంచి= తగ్గించి, వింధ్యాచలంబు = వింధ్యపర్వతము, అమ్మహానుభావున్ = ఆ మహానుభావుని, ఎదురొక్కనియెన్=ప్రత్యుద్గమనము చేసెను-ఎదురుగా వెళ్ళెను, అప్పుడు= ఆ సమయమునందు, అరుక్కని రథంబు = సూర్యుని రథము, చక్కఁజాయన్ = సరాసరిగా, నడచెన్ = నడచెను. పవనస్కంధంబుల = ఏడు వాయుస్కంధముల యొక్క, నిర్బంధంబులు = నిరోధములు, ఉడిగెన్ = ఉపశమించెను. ఇందుండు= చంద్రుఁడు, చిందిలిపడసాఁగెన్=సంభ్రమింపఁదొడఁగెను. 'మంగళ.... కేతువులు' మంగళ = అంగారకుఁడు, బుధ = బుధుఁడు, బృహస్పతి = గురుఁడు, శుక్ర = శుక్రుఁడు, శనైశ్చర = శని, రాహుకేతువులు = రాహువు, కేతువు, తమతమ తానకంబులు = తమతమ స్థానములు, తప్పక = అతిక్రమింపక. చరింపదొడంగిరి= సంచరింపసాఁగిరి. విశ్వప్రపంచంబు = షట్త్రింశత్తత్వాత్మకమైన ప్రపంచము, సర్వంబును = సమస్తమును, యథాపూర్వంబునన్ = వెనుకటి మాదిరిగానే, ప్రవర్తిల్లెన్ = ప్రవర్తించెను. కాలంబులు = అహోరాత్ర సంధ్యాదులైన కాలవిభాగ

ములు. ఏర్పడియెన్ = తేటపడెను. అనంతరంబు=పెనువెంటనే. పురుషాకారంబు= పురుషాకృతిని, తాల్చి = ధరించి, ఆజ్జగతీధరంబు = ఆ పర్వతము. కొన్ని అజ్జ లన్ = కొన్ని పాదన్యాసములతో, ప్రత్యుద్గమించి = (ప్రతి + ఉద్గమించి) ఎదురు నడచి-

తాత్పర్యము :- ఇట్లు పలుకుచు నెమ్మది నెమ్మదిగా వచ్చుచున్న. అగస్త్య మహాముని ని దూరమునుండియే చూచి, బ్రహ్మాండము పైకప్పుతో ఒరసికొనుచున్న తన యెత్తును నేలతో సమతలముగా వంచి, వింధ్యపర్వతము ఆ మహానుభావునకు ఎదురు వెళ్ళెను. అప్పుడు సూర్యుని రథము సరాసరి నడచెను. వాయుస్కంధముల బిగింపులు సడలెను. చంద్రుడు చిందిలిపడసాగెను. కుజ, బుధ, గురు, శుక్ర, శని, రాహు, కేతువులు తమతమ స్థానములు తప్పక సంచరింపసాగిరి. విశ్వ ప్రపంచమింతయును క్రమముగా వెనుకటివలెనే ప్రవర్తిల్ల మొదలిడెను. కాలవిభాగము లేర్పడెను. పిమ్మట పురుషాకారమును ధరించి ఆ పర్వతము కొన్ని యడుగులు- ఎదురు నడచి-

సీ॥ ప్రణవ పంచాక్షరోపనిషత్ప్రపంచంబుఁ
గడదాఁక నెఱిఁగిన కఱుదలాని
వాతాపి దైత్య నిల్వాలునితోఁ గూడంగ
జఠరాగ్ని వేల్చిన సవనకర్తఁ
గోపించి నహుషునిఁ గుంభీనసంబుగా
హుంకార మిచ్చిన యుగ్రతేజు
వానకాలమునాఁడు వఁడు పట్టిన నీటి
కాలుష్య ముడిపిన కతకఫలముఁ
తే॥ బాండు భసిత త్రిపుండ్రాంక ఫాలభాగు
భద్ర రుద్రాక్షమాలికా భరితవక్షు
భార్యయను దాను నేతెంచు పరమశైవుఁ
గాంచె వింధ్యాచలేంద్రంబు కలశభవుని ॥ 160

అర్థము :- 'ప్రణవ.... ప్రపంచంబు' ప్రణవ = ప్రణవసహితమైన, పంచా క్షర = పంచాక్షరముయొక్క, ఉపనిషత్ = ఉపనిషత్తులయొక్క, ప్రపంచంబున్ =

విస్తరమును. కడదాఁక = తుదివఱకు. ఎఱిఁగిన = తెలిసికొన్న. కఱుదలానిన్ = బుద్ధిశాలిని. వాతాపిద్వైత్యున్ = వాతాపి యనెడి రాక్షసుని. ఇల్వలునితోఁ గూడంగన్ = ఇల్వలునితోసహ, జఠరాగ్నిన్ = జఠరాగ్నియందు. వేల్చిన = హోమము చేసిన. సవనకర్తన్ = యజ్ఞకర్తను. కోపించి = కోపగించి. నహుషు = నహుషుని. కుంభీనసంబుగాన = సర్పమగునట్లుగా, హుంకారమిచ్చిన హుంకరించిన, ఉగ్ర తేజున్ = భయంకరమైన తేజస్సుగలవానిని, వానకాలయినాఁడు = వర్షాకాలమునందు. వండుపట్టిన = వండ్రుమట్టిపట్టిన. నీటి = జలముయొక్క. కాలుష్యము = కలఁతను. ఉడిపెడు = పోఁగొట్టెడి. కతకఫలమున్ = ఇందుపగింజను. 'పాండు .... ఫాల భాగున్' పాండు = తెల్లని., భసిత త్రిపుండ్ర = భస్మముయొక్క మూఁడురేఖలు. అంక = చిహ్నముగాఁగల, ఫాలభాగున్ = ఫాలప్రదేశము . లలాటపట్టిక గల వానిని. 'భద్ర .... వక్షు' భద్ర = శుభకరములైన, రుద్రాక్షమాలికా = రుద్రాక్ష మాలలతో. భరిత = నిండిన. వక్షున్ = వక్షఃప్రదేశముగలవానిని. భార్యయును దానున్ = భార్యాసమేతముగా. ఏ తెంచు = వచ్చుచున్న, పరమశైవున్ = పరమ శైవుఁడైన, కలశభవునిన్ = అగస్త్య మహాముని ని. వింధ్యాచలేంద్రంబు = వింధ్య పర్వతరాజు, కాంచెన్ = చూచెను.

తాత్పర్యము:- అగస్త్య మహాముని ని వింధ్యపర్వతరాజు చూచెను. ఆయనభార్యాసమేతముగా వచ్చుచున్నాఁడు. వక్షస్థ్సలమునిండ రుద్రాక్షమాలలు, నొసటిపై మూఁడు భస్మరేఖలు, మూర్తీభవించిన శైవతేజమువలె నుండెను. ఆయన-ప్రణవముయొక్క పంచాక్షరముయొక్క విస్తరరూపములైన, ఉపనిషత్తుల ప్రపంచముయొక్క పారమెఱిఁగిన పండితుఁడు. ఇల్వలునితో సహవాతాపి అనెడి రాక్షసుని జఠరాగ్ని యందు హోమముచేసిన (యజ్ఞకర్త) వేలిమికాఁడు. ఒక్క క్రోధహుంకారముతో, నహుషుని సర్పముగా మార్చిన ఉగ్రతేజుఁడు. వానకాల ములో వండ్రుపట్టిననీ టిని తేటలార్చెడి యిండుప గింజ,

విశేషములు:-శరత్కాలమున-అగస్త్యనక్షత్ర ముదయించి నంతనే కలఁక నీరు తేట పడును. సంస్కృతాంధ్రకవులు శరద్వర్ణనములో అగస్త్యోదయమును వర్ణించుట పరిపాటి. 'ప్రససాదోదయాదంభః కుంభయోనేర్మహౌజసః' అని కాళిదాసు . 'అతిగాంభీర్యవిభూతి' అన్నపద్యములో - ఎఱ్ఱన్నయును అగస్త్యోదయమును వర్ణించిరి.

76278

కం: కాశీనగరీ విరహ
కేశభవకోధవహ్ని కీలల నాశా
కాశధరిత్రీ వలయము
లాశుగతింగాల్పఁ గడఁగునట్టి మహోగ్రుక్ ॥ 161

అర్థము :- 'కాశీ....కీలలన్' కాశీనగరీ = కాశికానగరమునొక్క, విరహ క్లేశ = ఎడఁబాటనెడి కష్టమునుండి, భవ = పుట్టిన, కోధవహ్ని = క్రోధమేయ నెడి అగ్నియొక్క, కీలలన్ = జ్వాలలయందు, 'ఆశా....వలయములు' ఆశా = దిక్కులయొక్క, ఆకాశముయొక్క, ధరిత్రీ = భూమియొక్క, వలయములు = మండలములను, ఆశుగతిన్ = శీఘ్రగతితో, కాల్పన్ = తగులఁబెట్టుటకు, కడఁగు = సన్నద్ధుఁడగుచున్న, మహోగ్రున్ = మహాభయంకర రూపముగలవానిని-

తాత్పర్యము :- కాశీవియోగక్లేశమునుండి పుట్టిన తన క్రోధాగ్ని జ్వాలలయందుఆశామండలమును, ఆకాశమండలమును, భూమండలమును, దగ్ధముచేయుటకు సన్నద్ధమగుచున్న మహాభయంకర రూపముగలవానిని-

విశేషములు:- 'తపః క్రోధసముత్థాభ్యాం కాశీవిరహజన్మనాఁ ప్రళయానల వత్తీవ్రంజ్వలంతంత్రిఖరగ్నిభిః' అని మూలము

వ: కాంచి యక్కుంభినీ ధరంబు కుంభసంభవు నతిథి సత్కార సంభావనా విశేషంబులం బరితోషంబు సంపాదించి కరాంభోరుహంబులు మోడ్చి 'మహానుభావా! నీ యాజ్ఞాప్రసాదంబున నన్నుంగృతార్థం జేయుమని పలికిన- 162

అర్థము:- కాంచి = చూచి, అక్కుంభినీధరంబు = (ఆ+కుంభినీధరము). ఆ = ఆ వింధ్యమునెడి, కుంభినీ = భూమిని, ధరంబు = ధరించినది - పర్వతము, కుంభసంభవున్ = కుంభమునుండి పుట్టిన అగస్త్య మహాముని ని, 'అతిథి....విశేషంబులన్' అతిథిసత్కార = అతిథిసత్కారమునందలి, సంభావనా = గౌరవమునందలి, విశేషంబులన్ = విశేషములతో, పరితోషంబు = ఆ యగస్త్యముని యొక్క పరితోషమును, సంపాదించి = సంపాదించి, కరాంభోరుహంబులు = కర

పద్మములను, మోడ్చి = ముడిచి, "మహానుభావా! = గొప్ప - అను భావములుగల వాఁడా!, 'నీ యాజ్ఞాప్రసాదభావంబునన్' నీ = నీయొక్క, ఆజ్ఞా = ఆనయేయనెడి, ప్రసాదభావంబునన్ = అనుగ్రహ భావముచేత, నన్నున్ = నన్ను, కృతార్థుం జేయుము = కృతకృత్యుని జేయుచు, ధన్యునిఁ జేయుము' అని పలికినన్ = అని పలుకఁగా-

తాత్పర్యము:- చూచి-ఆ వింధ్యపర్వతము ఆ యగస్త్య మహాముని ని ఆతిథ్యసత్కార మునందలి సంభావనావాక్యముల యందలి విశేషములచేత ప్రసన్నునిఁ జేసికొని చేతులు మోడ్చి, "ఓ మహానుభావా! నీయాజ్ఞయేయనెడి ప్రసన్నభావముచేత వన్ను ధన్యునిఁజేయుము' అని విన్నవించినంతనే-

సీ॥ వింధ్యాచలేంద్ర! పృథ్వీభృత్కులశ్రేష్ఠ!
దక్షిణాపథము తీర్థంబులాడఁ
బోవుచున్నాఁడ నీ పువ్వుబోఁడియు నేను
బెద్దకాలమునాటి పెరువఁగాన
లావు చాలదు జరాక్లైబ్యంబుకతమునఁ
బొడ వెక్కినపుడు డిగ్గెడినపుడు
నభ్రంకషములైన యానీ శిరశ్శృంగ
శృంగాటకములిట్లు చిఱుత పఱిచి

తే॥గీ॥ యనఘ! నేఁగ్రమ్మఱఁగ వచ్చునంతదాఁక
నుండవలయు ధరిత్రిలో నొదిగి నీవు
చేయు నాయాజ్ఞ లెస్సయౌ చేయకున్న
నెటిఁగెదవుగాక రజ్జాడనేల యిపుడు? 163

అర్థము:- 'వింధ్యాచలేంద్ర' వింధ్య = వింధ్య మనెడి, అచలేంద్ర = (అచల + ఇంద్ర)పర్వతరాజా!, 'పృథ్వీభృత్కులశ్రేష్ఠ!' పృథ్వీభృత్ = కొండల యొక్క, కుల = వంశములో, శ్రేష్ఠ! = మిన్నయైనవాఁడా!, దక్షిణాపథము = దక్షిణదేశమునందలి. తీర్థంబులాడన్ = తీర్థములయందు క్రుంకులిడుటకు, ఈపువ్వు బోఁడియున్ = ఈలోపాముద్రయును, నేనున్ = నేనును, పోవుచున్నాఁడన్ = వెళ్ళుచున్నాను 'పెద్దకాలమునాటి పెరువన్' పెద్దకాలమునాటి = చిరకాలమునాటి, పెరు

వన్ = ఏండ్లు మీఱినవాఁడను-వృద్ధుఁడను, కానన్ = కనుక, 'జరాక్లేబ్యంబుకత మునన్ జరా=ముదిమివలనకలిగిన క్లేబ్యంబు = అశక్తత. కతనన్=కారణముగా, లావుచాలదు=బలముచాలదు. పొడవెక్కినపుడు = ఎత్తుఎక్కినపుడు, డిగ్గెడునపుడును=దిగునపుడును. అభ్రంకషములైన = ఆకాశమునొరసికొనుచున్న. ఆ ఆపైనున్ననీ = నీయొక్క. శిరఃశృంగ = చిట్టచిటారు శిఖరములయొక్క. శృంగాటకములు=చౌకములు, ఇట్లు=ఈ మాదిరిగానే. చిఱుతపఱిచి = చిన్నవిగాచేసి, అనఘ!= పాపరహితుఁడా!. నేను=నేను, క్రమ్మఱఁగన్=తిరుగుమొగమై,వచ్చునంతదాఁకన్= వచ్చునంతవఱకును. నీవు = నీవు. ధరిత్రిలోనొదిగి = భూమిలోనొదిగి. ఉండవలయున్=ఉండవలెను. నాయాజ్ఞన్ = నా యానతిని, చేయుము = నిర్వర్తింపుము, లెస్సయౌన్ = మేలుకలుగును. చేయకున్నన్ = చేయకపోయినచో ఎఱిఁగెదవుగాక=చేయనందువలనఁ గలిగెడు ఫలము తెలిసికొందువుగాక, ఇపుడు = ఇప్పుడు, రజ్జు = రిత్తపలుకు, ఆడనేల! = పలుకనేల!

తాత్పర్యము :- వింధ్యపర్వతరాజా! పర్వతకులశ్రేష్ఠుడా! ఈమెతో నేను దక్షిణాదికి తీర్థము లాడఁబోవుచున్నాను. పెద్దకాలమునాటి పెరువను! కనుక ఎత్తెక్కినపుడు, దిగునపుడు,ముదిమివలన కలిగిన అశక్తత కారణముగా ఓపికచాలదు. మిన్నులొరసికొనుచున్న - ఆ - నీ చిట్టచిటారు శిఖరముల చౌకములను ఇట్లే కొంచెపఱిచి, నేను తిరిగి వచ్చునంతవఱకును భూమిలో ఒదిగియుండవలయును. చేయుము నాయాజ్ఞ! మేలుకలుగును. చేయకున్నచో నీకే తెలియుఁగలదు. ఇపుడు రిత్తమాట పలుకుట దేనికి?

వ: అనిన వింధ్యంబు మహాత్మా! చరాచరంబైన జగంబునందు నీ యాజ్ఞఁ జేయని వారునుంగలరె? నీవు మఱల విచ్చేయునంత దాఁకను నిట్లయుండెద ననినఁ గుంభసంభవుండతని దీవించి నిజపాదాంభోరుహావిన్యాసంబుల విశ్వంభరాభాగంబు భాగ్యవంతంబు గావించుచు దక్షిణదిశాభిముఖుండయి చనియె ననిచెప్పిన విని నైమిశారణ్యవాసు లటమీఁది వృత్తాంతంబెయ్యది యనుటయు. 64

అర్థము:- ఆనినన్ = అని పలుకఁగా, వింధ్యంబు = వింధ్యపర్వతము, మహాత్మ! = ఓ మహాత్ముఁడా!, చరాచరంబైన = స్థావరజంగమాత్మకమైన.

జగంబునందున్ = జగత్తునందు. నీ యాజ్ఞన్ = నీయానతిని, చేయనివారున్ = చేయనివారుకూడ, కలరె? = ఉన్నారా?, నీవుమఱలి విచ్చేయునంతదాఁకను = నీవు తిరిగి దయచేయునంతవరకును. ఇట్ల యుండెదనని పలుకఁగా, కుంభ సంభవుండు= అగస్త్యమహాముని. ఆతనిన్ = ఆ వింధ్యుని. దీవించి = ఆశీర్వదించి. నిజ = తన యొక్క. పాదాంభోరుహ = పాదపద్మములయొక్క. విన్యాసంబులన్ = నిలుపుటల చేత. విశ్వంభరాభాగంబున్ = భూభాగమును. భాగ్యవంబుగావించుచున్ = భాగ్యవంతమును జేయుచు. దక్షిణదిశాభిముఖుండై = దక్షిణదిక్కుమొగమై. చనియె నని చెప్పినన్ = వెళ్లెననిచెప్పఁగా. నైమిశారణ్యవాసులు = నైమిశారణ్యమునం దలి మునులు. అటమీఁది వృత్తాంతంబు = ఆ పైని జరగినది. ఎయ్యది=ఏ యది: అనుటయున్ = అనఁగా-

తాత్పర్యము:- అని పలుకఁగా - వింధ్యపర్వతము; "ఓ మహాత్మా! స్థావర జంగమాత్మకమైన యీ జగత్తులో నీ యాజ్ఞచేయని వారు కూడ నున్నారా? నీవు తిరిగి దయచేయునంత వఱకును, ఇట్లే యుండెదననఁగా, ఆ మహాముని ఆత నిని దీవించి తన పాదన్యాసములచేత భూమిని భాగ్యవంతముగఁ జేయుచు దక్షిణాభి ముఖుండై వెళ్లెను. అని సూతుఁడు చెప్పఁగా నైమిశారణ్యమునులు ఆ పైనేమి జరగినదని యడుగఁగా-

* ఆశ్వాసాంతము *

మ. బలవద్బారహతిం బొంది మన్నె ధరణీపాలావరోధాంగనా
విలసన్మంగళసూత్రరక్షణ కళావిఖ్యాత కారుణ్య! యు
త్కల కర్ణాట తురుష్క రాట్పురమిత్రా! కుండలిస్వామి కుం
డల పూజాపరతంత్ర ధీవిభవ! పంటక్ష్మాప చూడామణీ! 165

అర్థము :- 'బలవత్ .... కారుణ్య' బలవత్ = బలవంతులైన, బారహ తిన్ = పరాభవము వరుసగానున్న, మన్నెపర్వతారణ్య = ప్రాంతములకుఁ జెందిన. ధరణీపాల = రాజులయొక్క, అవరోధాంగనా = అంతఃపురస్త్రీలయొక్క, విల సత్ = ప్రకాశించుచున్న, మంగళసూత్ర = మాంగళ్యములయొక్క, రక్షకళా = రక్షణ కళచేత, విఖ్యాత = ప్రసిద్ధమైన, కారుణ్య = కరుణా స్వభావముకలవాఁడా!

'ఉత్కళ.... పరమమిత్త్రి:' ఉత్కళ = ఓడ్రరాజులకు, కర్ణాటరాజులకు, తురుష్క-రాట్ = తురుష్కరాజులకు, పరమమిత్త్రి: = పరమ మిత్త్రిఁడా:, కుండలి స్వామి .... ధీవిభవ:' కుండలిస్వామి = సర్వరాజైన శేషు డు, కుండల = కుండల ములఁగాఁగల శివునియొక్క. పూజా = అర్చనయందు, పదతంత్ర = పరాధీనమైన. ధీవిభవ = బుద్ధివైభవము కలవాఁడా:, పంటక్ష్మాప = పంటవంశపురాజులకు. చూడా మణి: = శిరోమణివంటి వాఁడా:

తాత్పర్యము :- బారహదొంతి మన్నెరాజుల యంతఃపుర స్త్రీల మంగళ సూత్రములను కాపాడినవాఁడా: ఉత్కళ. కర్ణట. తురుష్కరాజులకు పరమ మిత్త్రిఁడా: ఫణిరాజకుండలుఁడైన శివునిఁ బూజించుటయందు పరాధీనమైన బుద్ధి విభవము కలవాఁడా: పంట రాజులకు చూడామణివంటివాఁడా:

కం: భూపాల మదన! జంబూ
దీ్వపేశ్వర విమతరాయవేశ్యావిట! ధా
టీ పటహాధాం నినాదా
టోప ప్రక్షుభిత దిక్కుడుంగకోత్రిడా! 166

అర్థము :- భూపాల మదన: = రాజరూపములోనున్న మన్మథుఁడా:, జంబూ దీ్వపేశ్వర: = జంబూద్వీపప్రభువా:. 'విమతరాయవేశ్యావిట:' విమతరాయ = శత్రురాజులేయనెడి. వేశ్యా = వేశ్యలకు. విట: = భుజంగుఁడా:. ధాటీ = జైత్ర యాత్రిల యందలి. పటహ = పటహవాద్యములయొక్క. "ధాం" నినాద = ధాం కార ములయొక్క. ఆటోప = సంరంభముచేత. ప్రక్షుభిత = సంక్షోభపెట్టబడిన. దిక్కుడుంగ = (దిక్ + కుడుంగ) దిక్కులనెడి పొదరిండ్లయొక్క. కోత్రిడా: = మధ్యభాగములు గలవాఁడా:

తాత్పర్యము :- రాజరూపములోనున్న మన్మథుఁడా: జంబూద్వీపాధిపతీ: శత్రిరాయ వేశ్యా భుజంగా: దండయాత్రిలయందలి పటహవాద్యములయొక్క "ధాం" నినాదములచేత సంక్షుభితములైన దిక్కులనెడి పొదరిండ్లయొక్క మధ్య భాగములుగలవాఁడా:

ఉత్సాహ: బంధులోక పారిజాత! పంట వంశపావనా!
సంధి విగ్రహప్రధాన షడ్గుణీ విశారదా!

గంధవాహ భుక్కలాప కంఠ కోణ నాభి ని
ర్గంధనక్రియా మహాప్రగల్భ కీర్తివైభవా! 167

అర్థము:- బంధులోక పారిజాత: = బంధువర్గమునకుఁ గల్పవృక్షమా: పంట వంశపావనా: = పంటవంశమును పవిత్రము చేసినవాఁడా:, సంధి విగ్రహ పరిధాన = సంధి, విగ్రహము, మొదలైన, షడ్గుణే = ఆఱుగుణముల సమాహారము నందు, విశారదా: = నేర్పరితనము గలవాఁడా: 'గంధవాహ .... కీర్తి వైభవా:' గంధవాహ = వాయువును, భుక్ = భుజించెడి సర్పములు, కలాప = భూషణములుగాఁగల శివునియొక్క, కంఠకోణ = కంఠముయొక్క కొనయందున్న, నాభి = విషమును-హాలాహలమును, నిర్గంధన=రూపుమాఁపుట యనెడి, క్రియా= పనియందు, మహాప్రగల్భ = గొప్పపొగ్గిడిగల. కీర్తివైభవా: = కీర్తివైభవముగల వాఁడా:,

తాత్పర్యము :- బంధు పారిజాతమా! పంటవంశపావనుఁడా: సంధి, విగ్రహ, యాన, ఆసన, ద్వైధీభావ, సమాశ్రయములనెడి ఆఱుగుణములను దేశ కాలముల నెఱిఁగి ప్రయోగింపఁ గలిగిన నైపుణ్యము గలవాఁడా: శివుని కంఠ మూలమునందలి హాలాహలనీలి మను రూపు మాఁపుట యందు మహాప్రగల్భమైన కీర్తివై భవముగలవాఁడా:

గద్య: ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్య పుత్ర సుకవి జన విధేయ శ్రీనాథ నామధేయ ప్రణీతంబైన కాశీ ఖండంబను మహాకావ్యంబు నందు ద్వితీయాశ్వాసము.

తృతీయాశ్వాసము

క: శ్రీ మద్దేసటి వంశ
గామణి! మూర్ధాభిషిక్త కంఠీరవ! సు
త్రామ నిభ వైభవోన్నత!
భామాపాంచాల! వీరభద్ర నృపాలా! 1

అర్థము:- శ్రీమత్ = శ్రీమంతమైన. దేసటి వంశ = 'దేసటి' అనురెడ్డి వంశమునకు, గ్రామణీ:=ముఖ్యుడా:. 'మూర్ధాభిషిక్త కంఠీరవ:' మూర్ధాభిషిక్త = రాజన్యులలో, కంఠీరవ: = సింహము వంటివాడా:, 'సుత్రామనిభవైభవోన్నత:' సుత్రామనిభ = ఇంద్రునివంటి, వైభవ = వైభవముచేత. ఉన్నత:= సమున్నతుడా:, 'భామాపాంచాల:' భామా = మానవతులైన స్త్రీలకు, పాంచాల: = పాంచాల జాతిపురుషుడా:. వీరభద్రనృపాలా: = వీరభద్రుడను పేరుగల భూపాలా:

తాత్పర్యము:- శ్రీమంతమైన 'దేసటి' అనురెడ్డి వంశములో శ్రేష్ఠుడా: మూర్ధాభిషిక్తులైనరాజులలో సింహమువంటివాడా: ఇంద్రసమాన వైభవముతో సమున్నతుడా: భామాజనములకు పాంచాల జాతి పురుషుడా: వీరభద్రుడను పేరు గల భూపాలుడా:

విశేషము:- స్త్రీలలో పద్మినీజాతికి సరిపోవు పురుషజాతి, పాంచాలజాతి,

వ: అక్కథకుడు శౌనకాది మహాములకు కిట్లనియె. 2

అర్థము:- ఆక్కథకుండు = ఆ కథకుడైనసూతుడు. శౌనకాది = శౌనకుడు మొదలైన, మహాములకున్ = మహాములకు, ఇట్లనియెన్=ఇట్లు పలికెను.

ఉ: ఆ పృథివీధరంబు హృదయంబున సంతస మందె నెంతయున్
గోపనుడెల్ల కాలమును గుంభభవుండతడిప్పుడుగ్రుడై

శాపవిషప్రయోగమునఁ జంపఁ దలంచిన నడ్డ మెవ్వర
ష్టాపదశైల మిప్పటికి శంక వహింపక యుండుఁగావుతన్॥ 3

అర్థము :- అ పృథివీధరంబు = ఆ వింధ్యవర్వతము, హృదయంబునన్ = మనస్సు లోపల, సంతసమందెన్ = సంతోషించెను. కుంభసంభవుండు = అగస్త్యుఁడు, ఎల్లకాలమును = ఎల్ల ప్రొద్దును, ఎంతయున్ = మిక్కిలియును, కోపనుఁడు = కోపస్వభావముగలవాఁడు. అతఁడు = అటువంటివాఁడు, ఇప్పుడు = ఈసమయమునందు, ఉగ్రుఁడై = ఉగ్రుఁడై -సంహారకర్తయైన రుద్రునివంటి వాఁడై, 'శాపవిషప్రయోగమునన్' శాపవిష = శాపమేయనెడి విషయయొక్క, ప్రయోగమునన్ = ప్రయోగించుటచేత, చంపదలచినన్ = చంపఁదలచినచో, అడ్డ మెవ్వరు? = ఎవ్వరడ్డము! ' ఇప్పటికిన్ = ప్రస్తుతమునకు, అష్టాపదశైలము = బంగారుకొండ-మేరువు, శంకన్ = 'నేనేమి చేయుదునో? అన్నభయమును. వహింపక యుండుఁగావుతన్ = పూనకుండునుగాక.

తాత్పర్యము :- ఆ వింధ్యపర్వతము-జరగినదానికి మనస్సులో సంతోష పడెను, "ఈయగస్త్యమహర్షి యెప్పుడును కోపధారి, ఇప్పుడాయన ఉగ్రుఁడై శాపవిషముతోఁ జంపదలంచినచో నాకెవ్వరడ్డము వత్తురు! ప్రస్తుతమునకు మేరువు భయములేక నిశ్చింతగా నుండుగాక!

వ: అని కుంభ సంభవుని ప్రత్యాగమనంబుఁ గోరుచు వింధ్యాచలంబు వంధ్యోదయంబై వసుంధరాగర్భంబున నడంగి యుండె. 4

అర్థము:- అని = ఇట్లుపలికి, కుంభసంభవుని = అగస్త్యునియొక్క, ప్రత్యాగమనంబు = తిరిగి వచ్చుటను, కోరుచున్ = కోరుకొనుచు, వింధ్యాచలంబు = వింధ్యపర్వతము, "వంధ్యోదయంబై" వంధ్య = నిష్ఫలమైన, ఉదయంబై = పెరుగుట కలదియై, 'వసుంధరాగర్భంబునన్' వసుంధరా = భూమియొక్క, గర్భంబునన్ = గర్భమునందు. అడంగి యుండెన్ = అణఁగియుండెను.

తాత్పర్యము :- అని పలికి అగస్త్యుని ప్రత్యాగమనమును గోరి కొనుచు వింధ్యవర్వము నిష్ఫలారంభమై నాటికిని నేటికిని అట్లే భూగర్భమునందు అణఁగి యుండెను.

తే॥గీ॥ ముని జటాధారి శివభక్తుఁ డనఘమూర్తి
యెవ్వఁ డేతెంచునప్పు డట్లైత్తి చూచుఁ
గుంభ సంభవుఁ డనుకోర్కి- గొనలుసాఁగ
వసుమతీధర; మతఁడేల వచ్చు మరల? 5

అర్థము:- ముని = ముని, జటాధారి = జడలు ధరించినవాఁడు, శివ భక్తుఁడు=శివునియందు భక్తికలవాఁడు, అనఘమూర్తి = పుణ్యమూర్తి,ఎవ్వఁడు= ఎవ్వఁడు, ఏతెంచున్ = వచ్చునో. అప్పుడు = ఆ సమయమునందు, వసుమతీ ధరము = వింధ్యపర్వతము, కుంభసంభవుఁడనుకోర్కి- = అగస్త్యుఁడను - ఆశ, కొనలుసాఁగన్ = కొనలెత్తఁగా, అట్లైత్తి = (అట్లు + ఎత్తి) మెడయెత్తి. చూచున్ = చూచును; అతడు = ఆ యగస్త్యమహర్షి, మరలి = తిరిగి, ఏల వచ్చున్? = ఎందుకు వచ్చును?

తాత్పర్యము:- మునికాని, జటాధరుఁడుకాని, శివభక్తుఁడు కాని, పుణ్యా త్ముఁడు కాని వీనిలో-ఏఒక్క-లక్షణముకల యెవ్వఁడు వచ్చినను 'అగస్త్యుఁడేమో!' అన్నకోరిక కొనలు సాగఁగ వింధ్యపర్వతము మెడయెత్తిచూచుచునే యుండును. కాని - అతఁడు తిరిగి ఎందుకు వచ్చును?

తే॥గీ॥ మొదలఁగల పెక్కు-వయుఁ బోయి ముడిఁగె నద్రి
కలశజుని నేత్రముల కెంపు గానన్నైన
నొరుని యైశ్వర్య మీక్షించి యుపతపించు
నట్టి ఖలునకు నిది పెద్దయౌనె తలఁప?

అర్థము:- మొదలఁగల పెక్కు-వయును = మొదటనున్న యున్నతికూడ, పోయి = నశించి, కలశజుని = అగస్త్యమహర్షి యొక్క, నేత్రములన్ = కన్నుల యందలి, కెంపు = ఎఱ్ఱఁదనము, కాననైనన్ = కనిపించినంతనే, అద్రి = వింధ్యాద్రి, ముడిఁగెన్ = ముడిచికొనిపోయెను. ఒరుని యైశ్వర్యము = ఇతరుని యైశ్వర్యమును, ఈక్షించి = చూచి, 'ఉపతపించునట్టి ఖలునకున్' ఉపతపించునట్టి= ఉపవాసమును పొందునట్టి, ఖలునకున్ = దుర్జనునకు, ఇది = ఇట్లు జరగుట, తలఁపన్ = విచారింపఁగా, పెద్దయౌనె? - పెద్ద విషయమా?

తాత్పర్యము :- అగస్త్యమహర్షి కంటియెఱుపు కనిపించినంతనే వింధ్య పర్వతమునకు మొదటనున్న యున్నతికూడ లేకుండఁ బోయెను. ఒరుని యైశ్వర్యమునకు ఉపవాసమును బొందు దుర్జనునకు ఇట్లు జరగుట విశేషముకాదు. ఇట్లే జరగుట సాధారణమైన విషయము.

విశేషము :- విశేషముచేత సామాన్యమును సమర్థించుట యనెడి అర్థాంతరన్యాస విశేషము.

కం॥ సిద్ధింప వీప్సితంబులు
సిద్ధించెన యేనిఁ బిదపఁ జెడు; నన్యుని సం
వృద్ధిఁ గనుంగొని యెవ్వని
బుద్ధి నసూయాగ్రహంబుఁ బొందు నతనికిన్ ॥ 7

అర్థము :- అన్యుని సంవృద్ధిఁ గనుంగొని = ఇతరుని అభ్యుదయమును జూచి, ఎవ్వని బుద్ధిన్ = ఎవ్వని బుద్ధిని, 'అసూయాగ్రహంబు' అసూయా = అసూయ యనెడి, గ్రహంబు=దయ్యము, పొందున్ = ఆవేశించునో, అతనికిన్ = అట్టివానికి, ఈప్సితంబులు = కోరికలు, సిద్ధింపవు = ఫలింపవు, సిద్ధించెన యేనిన్ = మొదట సిద్ధించినను, పిదపఁ జెడున్ = పిమ్మటఁ జెడిపోవును.

తాత్పర్యము :- ఇతరుని వృద్ధినిఁ జూచినంతనే ఎవ్వని బుద్ధిని అసూయ అనెడి గ్రహము ఆవేశించునో, అట్టివాని కోరికలు సిద్ధింపనే సిద్ధింపవు. ఒకవేళ సిద్ధించినను పిదపఁ జెడిపోవును.

తే. అప్రయోజన మభివృద్ధి నతిశయిల్లు
నప్రయోజన మడఁగుఁ గాలాంతరమున
నకట! యీర్ష్యాగ్రహగ్రస్తుఁడైన యట్టి
ఖలుని సంపద విధవ చన్నులుబోలె ॥ 8

అర్థము :- 'ఈర్ష్యాగ్రహగ్రస్తుఁడైన యట్టి ఖలునిసంపద' ఈర్ష్యా = ఈర్ష్యయే యనెడి. గ్రహ = గ్రహముచేత, గ్రస్తుఁడైన యట్టి = పట్టుకొనఁబడిన,

ఖలుని సంపద = దుర్జనుని సంపద, విధవచన్నులనుబోలె = విధవా స్తనములవలె, అప్రయోజనము = ప్రయోజనము లేకయే, అభివృద్ధిన్ = పెంపుదలతో, అతిశయిల్లును = అతిశయించును, అప్రయోజనము = ప్రయోజనము లేకయే, కాలాంతరమునన్ = కాలాంతరమునందు, అడఁగున్ = అణఁగును, అకట! = అక్కటా!

వ॥ ఆ సమయమునం బాకశాసన పావక పరేతరాజ పలలాశి పాశి పవన పౌలస్త్య పశుపతులు పరమ హర్షోత్కర్షంబున నగస్త్య మహర్షిం బ్రస్తుతించిరి. పతంగుండు పసిండికొండ నెత్తంబు చక్కటి వియత్తలంబున నడనందొడంగె. 9

అర్థము :- ఆ సమయంబునన్ = ఆ సమయమునందు, 'పాకశాసన... పశుపతులు' పాకశాసన = ఇంద్రుఁడు, పావక = అగ్నిహోత్రుఁడు, పరేతరాజ = యముఁడు, పలలాశి = రాక్షసుఁడు (నిర్ఋతి). పాశి = వరుణుఁడు, పవన = వాయువు, పౌలస్త్య = కుబేరుఁడు, పశుపతులు = ఈశానుఁడు, 'పరమ హర్షోత్కర్షంబునన్, పరమ = మిక్కుటమైన, హర్షోత్కర్షంబునన్ = హర్షాతిశయముచేత, అగస్త్యమహర్షిన్ = అగస్త్యమహర్షిని, ప్రస్తుతించిరి = స్తోత్రము చేసిరి. పతంగుండు = సూర్యుడు, పసిండికొండ = మేరుపర్వతముయొక్క, నెత్తంబు = చక్కటిన్ = చటియ త్రోవగా, వియత్తలంబునన్ = (వియత్ + తలము) ఆకాశతలమునందు, నడవందొడంగెన్ = నడవసాఁగెను.

తాత్పర్యము :- అప్పుడు- ఇంద్రాదులైన అష్టదిక్పాలురును, అధిక హర్షముతో అగస్త్యమహర్షిని పస్తుతించిరి. సూర్యుఁడు సుమేరువు చటియ త్రోవఁగా నడవసాగెను.

సీ॥ స్ఫటిక భూములయందుఁ బ్రతిబింబములు చూచి
యితరాశ్వబుద్ధి హేషిత మొనర్చుఁ
బద్మరాగోపల ప్రస్థభాగములందుఁ
జరమసంధ్యాశంక జాడ్యమందుఁ
మరకత మణిశిలా మధ్యంబునందు దృ
శ్యాదృశ్యమూర్తులై యలఁచు సూతు

వైదూర్యమణిమయ వప్రాంతములయందు
సలిలాభిలాషనౌదలలు వాంచుఁ

తే॥గీ॥ కిన్నరస్త్రీలఁ జూచి లంఘింపఁబాఱుఁ
గావరంబెత్తి యుద్దామకామ వికృతి
వాయుజవములు రవితేరి వారువములు
వేల్పుగుబ్బలి ప్రస్థానవీథియందు ॥ 10

అర్థము :- వేల్పుగుబ్బలి = మేరుపర్వతమునందలి, ప్రస్థానవీథియందున్= ప్రయాణవీథియందు, వాయుజవములు = వాయువుయొక్క వేగమువంటి వేగము గల, 'రవితేరివారువములు' రవి = సూర్యునియొక్క, తేరివారువములు = రథాశ్వ ములు, స్ఫటికభూములయందున్ = స్ఫటికమణిమయములైన ప్రదేశములయందు, ప్రతిబింబములు చూచి = తమ నీడలను జూచి, ఇతరాశ్వబుద్ధిన్ = వేఱొకగుఱ్ఱముల తలంపుతో, హేషితమొనర్చున్ = సకిలించును.

'పద్మరాగోపల ప్రస్థభాగములందున్' పద్మరాగోపల=(పద్మరాగ + ఉపల) పద్మరాగమణిమయములైన, ప్రస్థ = చఱియలయొక్క, భాగములందున్ = ప్రదేశ ములయందు, 'చరమసంధ్యాశంకన్' చరమసంధ్య=సాయంకాల సంధ్య యనెడి, ఆశంకన్ = సందేహముచేత, జాడ్యము = మాంద్యమును - నెమ్మదితనమును, ఒదున్ = పొందును.

'మరకత మణిశిలామధ్యంబునందున్' మరకతమణిశిలా = ఆకుపచ్చ మణి శిలలయొక్క, మధ్యంబునందున్ = నడిమి ప్రదేశమునందు, దృశ్యాదృశ్య = ఒకమాఱు కనిపించి - ఒకమాఱు కనిపించని, మూర్తులై = ఆకారములు కలవియై, సూతున్ = సారథియైన అనూరుని, అలఁచున్ = శ్రమపెట్టును, 'వైదూర్యమణి మయ వప్రాంతములయందున్' వైదూర్యమణి మయ = వైదూర్య మణులతో నిండిన, వప్రాంతముల యందున్ = సానుమధ్యస్థలములందు, 'సలిలాభిలాషన్' సలిల = జలములయందలి, అభిలాషన్ = వాంఛతో, ఔదలలు = శిరస్సులను, వాంచున్ = వంచును.

కిన్నరస్త్రీలన్ = గుఱ్ఱపుముఖములును మానవశరీరములుగల స్త్రీలను (అశ్వ ముఖులను) చూచి, 'ఉద్దామకామవికృతిన్' ఉద్దామ = కట్టులేని, కామవికృతిన్ =

కామవికారముతో, కావరంబెత్తి=మదమెత్తి, లంఘింపన్ = దాఁటుటకై పాఱున్=పఱువెత్తును,

తాత్పర్యము:- వింధ్య నిరోధము తొలఁగినంతనే సూర్యుని గుఱ్ఱములు మేరువు చరియలపై నడవసాఁగెను. మేరువు రత్నసానువు, అనఁగా-రత్నమయము లైన చటీయలుగఁ బర్వత నిరోధమువలన ఇన్నాళ్ళును పనిలేక ఆ గుఱ్ఱములకు శిక్షణము తప్పినది. అవి అనూరుని యదుపాజ్ఞలో నిలుచుటలేదు. మేరువుయొక్క స్ఫటిక మణిమయ సానుభూములయందు ఆ గుఱ్ఱములు తమప్రతిబింబములనే చూచి యితరాశ్వములను తలంపుతో సకిలించుటలు మొదలు పెట్టెను పద్మరాగమణిమయ ములైన చటీయలపై నడచునప్పుడు ఆ మణులయెఱ్ఱని కాంతిఁజూచి మలుసం జయని భ్రమసి పెండ్లి నడకలు సాఁగించెను. మరకతమణులవన్నె అకుపచ్చ. సూర్యుని గుఱ్ఱముల వన్నెయు నదియే. రంగులోరంగు కలసిపోయి ఓకసారి కని పించి - ఒకసారి కనిపించక ఆచటీయలపై వెళ్ళునపుడు అనూరుని అవస్థపెట్టుచుం డెను. వైఢూర్యమణులుగల చరియలపైఁ బోవుచు. అ మణులకాంతులు జల ములను కొని త్రాఁగుటకై తలలు వంచుచుండెను. గుఱ్ఱపుముఖములు. మానవశరీర ములుగల కిన్నరస్త్రీలను జూచి కట్టులేని కామవికారముతో మదమెత్తి లంఘింపఁ బోవుచుండెను.

విశేషములు:- ఈ పద్యమునకు మూలమైన మయూరుని శ్లోకము -

'మత్వాన్యాన్ పార్శ్వతోఽశ్వాన్ స్ఫటిక మణి దృషద్దృష్టదేహాద్రవంతీ
వ్యక్తేఽహన్యక్త సంధ్యేయమితి మృదు పదా, పద్మరాగోపలేషు
సా దృశ్యాదృశ్యమూర్తి ర్మరకత కటకే క్లిష్టసూతా, సుమేరోః
మూర్ధ వ్యావృత్తి లబ్ధద్రుతగతి, రవతాద్బ్రిధ్నవాహావశిర్వ్యః॥

ఈశ్లోకము నాలుగవపాదమును వదలి-ఇటుపైన రెండవ శ్లోకము రెండవ పాదము-"వీక్ష్యవ్రీడావతీనాం ప్రతికుహరముఖం కిన్నరీణాం ముఖాని" అను దాని పైకి - శ్రీనాథుని గుఱ్ఱములు లంఘించినవి.

సీ: తమ తనుచ్ఛాయ మేఘములు పచ్చని వన్నె
నుభయ పక్షములునై యూఁగి యాడఁ

గళ్యాలఁ దెగిన సృక్వముల క్రొన్నెత్తురు
లాననంబులకుఁ గెంపావహింప
నుడుపథంబున యందు నుండిన గతిధార
గమన వేగంబునఁ గానఁబడఁగ
శుకముఖద్విజకోటి సులభ కౌతూహల
వ్యతి షంగమునఁ జేరి యనుసరింపఁ

తే॥గీ॥ జిలుకలును బోలె హేమాద్రి శిఖర శృంగ
కల్పవృక్షాటవీ వాటికలఁ జరించె
మహిధరము సేయునంకిల మానుటయును
వనజవన బాంధవుని తేరి వారువములు॥ 11

అర్థము :- "మహిధరము సేయునంకిల" మహిధరము = వింధ్యపర్వతము, చేయుచున్న. అంకిల = అడ్డు. మానుటయును = మానిపోఁగా. 'వనజవన బాంధవుని తేరి వారువములు' వనజవన = పద్మవనములకు, బాంధవుని = బంధువైన సూర్యునియొక్క, తేరి = రథమునియొక్క. వారువములు = గుఱ్ఱములు. చిలుకలును బోలె = చిలుకలవలె, (సూర్యుని గుఱ్ఱములు పచ్చనివిగనుక) తమ = తమయొక్క. చనుచ్ఛాయన్ = శరీరకాంతిచేత, మేఘములు = మబ్బులు, పచ్చని వన్నెన్ = పచ్చనికాంతితో. ఉభయపక్షములునై = ఇరుప్రక్కలయందలి ఱెక్కలై, ఊఁగి యాడన్ = ఊఁగియాడుచుండఁగా.

'కళ్యాలఁతెగిన సృక్వముల క్రొన్నెత్తురులు' కళ్యాలన్ = కళ్లెములచేత, తెగిన = తెగిపోయిన సృక్వముల = నెలవులయొక్క - ఓష్ఠమూలములయొక్క, క్రొన్నెత్తురులు=(క్రొత్త+నెత్తురులు) క్రొత్తనెత్తురులు. ఆననంబులకున్ = ముఖములకు. కెంపు = ఎఱ్ఱదనమును. ఆవహింపన్ = ఆవహింపఁజేయఁగా-పూన్పఁగా.

ఉడుపథంబునయందున్ = నక్షత్రమార్గమునందు-ఆకాశమునందు, ఉండిన = ఉన్న, గతిధార = త్రోవచార, గమనవేగంబునన్ = గమనవేగముచేత, కానఁబడఁగన్ = కనిపింపఁగా,

'శుకముఖద్యిజకోటి' శుకముఖ = శుకమహర్షి మొదలైన. ద్విజకోటి = విప్రకోటి, శుకముఖ = చిలుకలుమొదలైన. ద్విజకోటి = పక్షులగుంపు, 'సులభ

కౌతూహల వ్యతిషంగమునన్' సులభ = జాతిసులభమైన కౌతూహల = ఉబలాటము యొక్క, వ్యతిషంగమునన్ = సంబంధముచేత, చేరి = సమీపించి. అనుసరింపన్ = వెన్నంటిరాగా. హేమాద్రి = మేరువుయొక్క, శిఖరశృంగ = చిటారు కొమ్మలయందలి, కల్పవృక్ష = కల్పవృక్షములకు సంబంధించిన. అటవీవాటికలన్ = వనవాటికలయందు, సంచరించెన్ = తిరిగెను.

తాత్పర్యము :- సూర్యుని గుఱ్ఱములను చిలుకలతో బోల్చుచున్నాడు: ఆకుపచ్చని, ఆ గుఱ్ఱముల కాంతులు ప్రక్కలకు ప్రసరించి మబ్బులకూడ పచ్చనివై యిరువైపులను, ఆ చిలుకల తెక్కలవలెనే యూగియాడుచుండెను. కళ్ళెముల యెరపిడిచే తెగిన సెలవులనుండి కారుచున్న క్రొత్తనెత్తురులు ఆ గుఱ్ఱముల ముఖములకు ఎఱ్ఱదనాలు పూయుచుండెను. గమనవేగముచేత నిరాలంబమైన యంబరము నందుగూడ చార యేర్పడుచున్నట్లు కనపడుచుండెను. జాతిమచ్చికచేత వెన్నంటి వచ్చుచున్న శుకాది ద్విజకోటివలెనే శుక ముఖద్విజశ్రేణి చేరి యనుసరించు చుండెను. (శ్లేష) చిలుకలు తోటలలో దిరుగుచుండును, ఈ గుఱ్ఱములు మేరుశిఖరముల మీది కల్పవృక్షవాటికలలో అంకిలి లేక తిరుగుచుండెను.

విశేషములు :- ఈ పద్యమునకు మూలమైన మయూరుని శ్లోకము.

'ధున్వంతోసీరదాశీర్నిజరుచిహరితాః పార్శ్వయోః పక్షతుల్యా
స్తాలూత్తాన్తైః ఖలీనైః ఖచిత ముఖరుచశ్చ్యోతతా లోహితేన
ఉడ్డీయేవ వ్రజంతో వియతి జవవశాదర్క వాహాః క్రియాసుః
క్షేమంహేమాద్రి హ్యద్యద్రుమశిఖర శిరశ్రేణి శాఖశుకావః.'

సీ. ఆకాశవాహినీ నైకతంబుల ఖురాం
చలటంకములు క్రుంగి జడను వడిన
శాతకుంభాచల స్థపుట స్థలంబునఁ
బ్రక్కాభిహతి వడి చాలకున్న
బహుళ దూర్వాశంకఁ బ్రణత దేవకిరీట
మరకత ద్యుతులకై మరులుగొన్న
నిందుబింబముఁ జూచి చెందుప్పుగలు సావి
యటులె త్తి నాకంగ నాసపడినఁ

తే॥గీ॥ బసిఁడి గిలుకల చేరోక్కలఁ బరిఢవించి
కఠినహుంకార మొనరించి కనకరథము
వారువంబుల బఱపె దుర్వార లీల
బిరుసు తహతహ వినువీథిఁ బిచ్చకుంటు॥ 12

అర్థము :- 'ఆకాశవాహినీ సైకతంబులన్' ఆకాశవాహినీ = ఆకాశగంగా నదియొక్క. సైకతంబులన్ = ఇసుకతిన్నెలయందు. 'ఖరాంచలటంకములు'- ఖరాంచల = గొరిజల-అంచులేయనెడి, టంకములు = ఉలులు. కుర్రంగి = దిగఁబడి. జడను వడినన్ = నడక ఆలస్యముకాఁగా, నిలిచిపోఁగా . 'శాతకుంభాచలస్థపుటస్థలంబునన్' శాతకుంభాచల = బంగారుకొండయొక్క. స్థపుటస్థలంబునన్ = మధ్య పల్లమును పార్శ్వములయందు మెఱకయునైన ప్రదేశమునందు. 'చక్రాభిహతిన్' చక్ర = చక్రమునయొక్క. అభిహతిన్ = ఎదురుదెబ్బచేత.వడి = వేగము. చాలకున్నన్ = చాలకపోయినను, 'బహుళ దుర్వాశంకిన్' బహుళ = తఱచైన, దూర్వా = గరికయనెడి, శంకన్ = తలంపుచేత. "ప్రణతదేవకిరీట మరకత ద్యుతులకై' ప్రణత = ప్రణమిల్లిన, దేవ = దేవతలయొక్క. కిరీట = కిరీటముల యందలి, మరకత = పచ్చలయొక్క. ద్యుతులకై = కాంతులకై, మరులుగొన్నన్ = మోహపడినను, ఇందుబింబముఁ జూచి = చంద్రబింబమునుజూచి, చెందుప్పుగలు= సైంధలవణ శిలాఖండము, సాని = అని, (సవియొక్క రూపాంతరము) అఱులెత్తి = మెడలెత్తి, నాకంగన్ = ఆస్వాదించుటకు, ఆసపడినన్ = ఆశపడినను, 'పసిఁడి గిలుకల చేరోక్కలన్' పసిఁడిగిలుకల = బంగారు గిలకలుగల, చేరోక్కలన్ = చెర్నాకోలను, (కశను) పరిఢవించి = ధరించి, "కఠినహుంకార మొనరించి" = కఠినముగా 'హుం' అని కసరి, కనకరథము=బంగారు రథముయొక్క. వారువంబులన్ = గుఱ్ఱములను, వినువీథిన్ = ఆకాశవీథియందు, బిరుసు తహతహన్ = బిగువైన త్వరతో, పిచ్చుకుంటు = అనూరుఁడు, దుర్వారలీలన్= ఆపనలవికాని రీతిగా, పఱపెన్ = తోలెను - పరువులెత్తించెను.

తాత్పర్యము :- ఆకాశగంగ యిసుక తిన్నెలలో గిట్టల ఉలులవంటి కొనలు, దిగఁబడి, గుఱ్ఱములు నడివలేకుండెను. మేరువుచళియలలోని ఎగుడు దిగుళ్లలో-ఎదురు దెబ్బలు తగిలి చక్రము తిరుగుటలేదు ప్రణమిల్లిన దేవతల కిరీటములలో-పొదిగిన పచ్చలకాంతులను జూచి-దూర్వాంకురములని గుఱ్ఱములు వ్యామోహ

పడుచుండెను. ఆకాశాంచలమునందున్న చంద్రబింబము సైంధవలవణ శిలాఖండ మనుకొని మెడలుసాచి గుఱ్ఱములు నాకుటకెగబడుచున్న ఎ. ఇన్నివిధముల-ఆటంక ములలో పిచ్చుకుంటైన-ఆ సారథి తహ తహ బిరుసెక్కి- హుంకరించి-పసిడి గిల కలచేర్కొల విపరి - కసరి - వినువీథిలో - బంగారురథము గుఱ్ఱములను ఆప రాని వేగముతో బడబ్రోలు చుండెను.

విశేషములు :- దీనిమూలమైన మయూరుని శ్లోకము:

'సీతంతోంతర్ని మజ్జజడ ఖురముసలాస్సైకతే నాకనద్యాః
స్కందంతః కందరాళీ కనక శిఖరిణో మేఖలాసుస్ఖలంతః
దూరం దూర్వాస్తలోత్థా- మరకత దృషదిస్థాస్నవో యన్న యాతాః
పూష్ణోశ్వాన్ పూరయన్ యస్తదవతు జవనైర్హ్రాంకృతేనాగ్రగోవః

వ : ఇవ్విధంబునన్ భువనోపద్రవంబు బ్రశాంతిం బొందించిదక్షిణ కాశీసందర్శనంబునంగాని, కాశీవియోగవేదనాభారంబు డింపు వడదని డెందంబున నిశ్చయించి మందమంద ప్రయాణంబులఁ గెందలిరాకుఁబోడి యాకులతం బొందికసుగందకుండ, ము దలఁ బిఱుంద నడపించుచు నెడనెడఁ బుణ్యావాహపీ తీర్థంబులఁ గ్రుంకులు వెట్టి యష్టమూర్తి నభ్యర్చించుచుంగొన్ని వాసరం బులకుం గుంభ సంభవుండు గోదావరి నొరసికొనుచు నాంధ్ర దేశంబున నరుగునప్పుడు- 13

అర్థము :- ఇవ్విధంబునన్ = ఈరీతిగా, 'భువనోపద్రవంబున్' భువన = లోకములయొక్క, ఉపద్రవంబున్ = హావడిని, ప్రశాంతింబొందించి = ప్రశాంత పఱిచి, దక్షిణకాశీ = దక్షిణకాశియైన దక్షారామమునొక్క, సందర్శంబునంగాని = సందర్శనము వలనఁగాని, కాశీవియోగవేదనాభారంబు' కాశీ = కాశీక్షేత్రముయొక్క, వియోగవేదన = వియోగబాధయొక్క, భారంబు = బరువు, డిందువడదని = ఉపశమిల్లదని, డెందబునన్ = హృదయమునందు, నిశ్చయించి = నిశ్చితముచేసికొని, మంద మంద ప్రయాణంబులన్ = నెమ్మది నెమ్మది ప్రయాణములతో, కెందలిరాకుబోడీ = లేత చిగురుటాకువంటి శరీరముగల లోపాముద్ర, ఆకులతం బొంది = అలజడిపడి, కసు

గందకుండన్ = కొంచమైనను కందిపోనిరీతిగా, ముందఱన్ తనకు ముందుగాను, పిఱుందన్ = వెనుకగాను, నడపించుచున్ = నడచునట్లు చేయుచు, ఎడనెడన్ = మధ్య మధ్య, పుణ్యవాహినీ తీర్థంబులన్ = పుణ్యనదుల యందు - పుణ్యతీర్థముల యందు, కుశంకులుపెట్టి = మునుకలు పెట్టి, అష్టమూర్తిన్ = శివుని, (పంచభూతములు - సూర్యచంద్రులు - యజమానుఁడు - ఇవి శివుని యెనిమిది శరీరములు,) అభ్యర్చించుచున్ = (అభి + అర్చించు - అభ్యర్చించు.) పూజించుచు, కొన్నివాసరంబులకున్ = కొన్నిదినములకు, కుంభసంభవుండు = అగస్త్యమహాముని, గోదావరి నొరసికొనుచున్ = గోదావరీతీరమునఁబట్టి, ఆంధ్రదేశంబునన్ = ఆంధ్రదేశమున దు, అరుగునప్పుడు = వెళ్ళుచున్నప్పుడు.

తాత్పర్యము :- సుగమము.

విశేషములు :- ఇక్కడినుండి కొల్లాపురీ మహాలక్ష్మిని సందర్శించు నంతవఱకు తెనుఁగు కాశీఖండమునందు వర్ణింపఁబడిన యగస్త్యుని యాంధ్రదేశ సంచారమునకు మూలమైన గ్రంథము సంస్కృత కాశీఖండమునందు లేదు. ఈ గ్రంథభాగము శ్రీనాథుని స్వస్థానవేష భాషాభిమానమునకు దృష్టాంతముగనున్నది.

మ. అహరారంభములందుఁ బ్రస్రవణశైలాధిత్యకా కందరా
కుహర క్రోడకటాహ గద్గదనద ద్గోదావరీ సింధువా
ర్లహరీ శీకర మాలికా శిశిరముల్ పంపాసఖుల్ దండకా
గహనగ్రాహులు వాయువుల్ తపసికిం గల్పించె
నాహ్లాదమున్ ॥ 14

అర్థము :- 'అహరారంభములందున్' (అహః + ఆరంభములు) దినారంభవేళలయందు-ప్రాతఃకాలములందు, ప్రస్రవణశైల = ప్రస్రవణపర్వతమునొక్క-. అధిత్యకా = పైభాగమునందలి, కందరకుహర = గుహాకుహరములయొక్క-. క్రోడ = మధ్యప్రదేశములేయనెడి, కటాహ = బానలయందు, గద్గద = డగ్గుత్తికతో, నదత్ = నందించుచున్న, గోదావరీ సింధు = గోదావరీ నదియొక్క-. వార్లహరీ = (వాః + లహరీ) జలతరంగములయొక్క-, శీకర = సూక్ష్మజలకణముల యొక్క-, మాలికా = మాలలచేత, శిశిరముల్ = ఇవతళించునవియును - చల్లనివియు, పంపాసఖుల్ = పంపాసరస్సునకు, మిత్త్రములును, (ఆ సరస్సుతోఁ జేరిక

కలవనుట) 'దండకా గహన గ్రాహులు' దండకాగహన = దండకారణ్యమును. గ్రాహులు = పట్టినవైన. వాయువుల్=గాలులు, తపసికిన్ = అగస్త్యమహాముని కి. ఆహ్లాదమున్ = ఆనందమును. కల్పించెన్ = కల్పించెను.

తాత్పర్యము :- ప్రస్రవణపర్వతము, ఆ పర్వత మొరసి ప్రవహించు చున్న గోదావరీనది, పంపాసరోవరము దండకారణ్యములోనివి. ఇపుడు గోదావరి ననుసరించి అగస్త్య మహాముని ఆంధ్రదేశములో ప్రయాణించుచున్నాడు. ప్రస్ర వణపర్వతమునొక్క- యుపరి గుహలలో ప్రవేశించి గుబగుబలాడుచున్న గోదావరీ తరంగశీకరములచేత చలువలూరుచున్నవియును, పంపాసరస్సు మీదుగా వీచుచు న్నవియునగు దండకారణ్య వాయువులు ప్రాతఃకాలముల యందు అగస్త్యమహర్షికి ఆహ్లాదమును గల్పించెను.దండకారణ్యము సువిశాలమైనది. ప్రస్రవణపర్వత సమీప మున లేకున్నను పంపాసరోవరముకూడ దండకారణ్యములోనేయున్నది.

విశేషములు:- ఈ పర్వత నదీసరస్సన్నివేశములను భవభూతి తన యుత్తరరామచరితములో వర్ణించియున్నాడు.ఈ పద్యమునందలి గద్గదనదద్గోదావరీ అన్నపదబంధము భవభూతి శ్లోకమునుండి గ్రహించినది. 'ఏతేతే కుహరేషుగద్గదనద ద్గోదావరీవారయః'

తే॥గీ॥ ఋషికిఁ బంపాసరోవీచి పృషత శిశిర
గంధవాహ ప్రవాహ సంబంధములను
గాశికాక్షేత్ర విప్రయోగ ప్రభూత
తాపశాంతి యొనర్పంగ నోపవయ్యె॥ 15

అర్థము:- ఋషికిన్ = ఋషికి. 'పంపా.... సంబంధములను' పంపా = 'పంప'యనెడి, సరః = సరస్సుయొక్క, వీచి = తరంగములయొక్క, పృషత = జలబిందువులచేత, శిశిర = చల్లనైన, గంధవాహ = వాయువులయొక్క, ప్రవాహ= ప్రవాహముతోడి, సంబంధములను = సంబంధములుకూడ, 'కాశికాక్షేత్ర .... తాప శాంతి' కాశికాక్షేత్ర=కాశీక్షేత్రమునొక్క.విప్రయోగ=వియోగమువలన, ప్రభూత= పుట్టిన, తాప = సంతాపమునకు, శాంతి = ఉపశాంతిని, ఒనర్పంగన్ = చేయు టకు, ఓపవయ్యెన్ = చాలవయ్యెను.

తాత్పర్యము :- పంపాసరస్సు కెరటములు చిందించిన బిందువులచేత చల్లనైన వాయువులుకూడ ఋషికి కామవియోగ జనిత తాపమును శాంతింపఁజేయఁ జాలక పోయెను.

సీ. పట్టస శ్రీవీరభద్రేశు సేవించి
తిలసోమనాథు నంఘ్రులకు నెరఁగి
పురశాసను ననంత భోగేశ్వరస్వామి
హిమశైల కన్యకాధీశుఁ గొలిచి
పద్మాద్రిపై రుద్రపాదంబు లర్చించి
చేరి మార్కండేయ శివు భజించి
కోటిపల్లీ తీర్థ కుండలాముఖముల
నర్ధేందు ధరు విరూపాక్షుఁ దలఁచి

తే॥గీ॥ పల్వల స్థానమున భూతభర్త నిలిపి
కొంతమున వృద్ధగంగను గ్రుంకువెట్టి
దక్షవాటిక సప్త గోదావరమున
మునిఁగి భీమేశ్వరునిఁ గాంచె మునివరుండు॥ 16

అర్థము:- "పట్టస శ్రీవీరభద్రేశు సేవించి" పట్టన = పట్టపాద్రిపై నెలకొనియున్న, శ్రీ వీరభద్రేశున్ = శ్రీ వీరభద్రేశ్వరస్వామిని, సేవించి = కొలిచి, "తిలసోమనాథు నంఘ్రులకున్" తిలసోమనాథు = తిలసోమేశ్వరుని, అంఘ్రులకున్ = అడుగులకు, ఎరఁగి = నమస్కరించి, పురశాసనున్ = పురశాసనుఁడైన, అనంతభోగేశ్వరస్వామిన్ = అనంతభోగేశ్వరుడనెడి, హిమశైలకన్యకాధీశున్ = పార్వతీ వల్లభుని, కొలిచి = సేవించి, పద్మాద్రిపైన్ = కమలాచలముపైన, రుద్ర పాదంబులు = రుద్రపాదములను, అర్చించి = పూజించి, చేరి = సమీపించి, మార్కండేయ శివునిన్ = మార్కండేయ మహాముని కి-పూజాలింగమైన శివుని, భజించి, 'కోటిపల్లీతీర్థ కుండలాముఖములన్' కోటిపల్లి, కుండలా ముఖము, అను తీర్థస్థానములలోనున్న, అర్ధేందుధరున్ = చంద్రార్ధ ధరుఁడైన, విరూపాక్షున్ = త్రినేత్రుని - (శివుని) తలఁచి = ధ్యానించి, పల్వలస్థానమునన్ = పలివెలక్షేత్రము నందు, భూతభర్తన్ = ప్రమథాధిపతిని, నిలిపి = ప్రతిష్ఠించి, కొంతమునన్ = కొంతమను స్థానమున, వృద్ధగంగలోన్ = వృద్ధగంగయందు, క్రుంకువెట్టి = మునుకవెట్టి

దక్షవాటికన్ = దక్షారామమునందు,=సప్తగోదావరతీర్థమునన్=సప్తగోదావరతీర్థము నందు, మునిఁగి= మజ్జనముచేసి. మునివరుండు = మునిశ్రేష్ఠుఁడైన యగస్త్య మహర్షి. భీమేశ్వరునిఁగాంచెన్ = భీమేశ్వరస్వామిని సందర్శించెను.

తాత్పర్యము :- పట్టసము మొదలుకొని దక్షారామము వఱకుఁగల శివ స్థానముల నన్నింటిని వరుసగా-అగస్త్యమహర్షి సందర్శించెను.

శా. ప్రాతఃకాలము తీవ్రభానుఁ డుదయింపన్ సప్తగోదావర
ప్రోతఃపూరమునన్మునింగి యభవున్ సోమార్ధ చూడామణిన్
జ్యోతిర్లింగమయ స్వరూపుఁ గొలిచెన్ శుద్ధాంతరంగంబునన్
బాతివ్రత్య మహాప్రభావ నిధి లోపాముద్ర భీమేశ్వరున్॥ 17

అర్థము :- "పాతివ్రత్య మహాప్రభావనిధి" పాతివ్రత్య = పతివ్రితమునకు సంబంధించిన, మహాప్రభావ = మహామహిమకు, నిధి = గనియైన, లోపాముద్రా= లోపాముద్రాదేవి. 'సంశుద్ధాంతరంగంబునన్' సంశుద్ధ = మిక్కిలి పరిశుద్ధమైన, అంతరంగంబునన్ = అంతఃకరణముతో, ప్రాతఃకాలము = ప్రభాతవేళయందు, తీవ్రభానుఁడు = తీక్ష్ణకిరణుఁడు, ఉదయింపన్ = ఉదయింపఁగా, "సప్తగోదావర స్రోతఃపూరమునన్" సప్తగోదావర = సప్తగోదావర తీర్థముయొక్క, స్రోతఃపూరమునన్ = జలప్రవాహమునందు, మునింగి = నిమజ్జనము చేసి, 'సోమార్ధ చూడామణిన్' సోమార్ధ = చంద్రుని అర్ధభాగము, చూడామణిన్ = శిరోమణిగాఁ గలట్టియును, జ్యోతిర్లింగమయ స్వరూపున్ = జ్యోతిర్లింగమయమైన స్వరూపము గల, అభవున్ = శివుని, కొలిచెన్ = సేవించెను,

తాత్పర్యము:- పాతివ్రత్య మహాప్రభావమునకు నిధియైన లోపాముద్రాదేవి పరిశుద్ధమైన యంతఃకరణముతో, ప్రాతఃకాలమునందు సప్తగోదావర తీర్థమునందు నిమజ్జనముచేసి - జ్యోతిర్లింగస్వరూపుఁడును, చంద్రార్ధశేఖరుఁడునైన శ్రీ భీమ నాథుని సేవించెను.

మ. మునిచూడామణి యెల్ల సత్కళలకున్ మూర్ధాభిషిక్తుండుగా
వునఁ జారీకరణాంగహారముల రావుల్ మెచ్చి కీర్తించుచున్

శనివారోత్సవవేళ గన్గొనియె నాస్థానంబునన్ రాజనం
దనయుండానును దేశిమార్గముల గంధర్వాప్సరోనృత్యముల్॥ 18

అర్థము:- ముని చూడామణి = మునులకు చూడామణియైన యగస్త్యమహా ముని, ఎల్ల సత్కళలకున్ = సంగీత నాట్యాదులైన సమస్తకళలకును, అనఁగా- ఆ కళావిజ్ఞానమునకు, మూర్ధాభిషిక్తుండు = పట్టాభిషిక్తుఁడు, కాపునన్ = కాఁబట్టి, చారీ = నృత్యసంచారములు, కరణ = నాట్యకరణములు, అంగహారముల = అంగ విక్షేపములయొక్క, తావుల్ = సముచిత స్థానములను, మెచ్చి=మెచ్చికొని, రాజ నందనయున్ దానును = రాజపుత్రియైన లోపాముద్రయును దానును, కీర్తించు చున్ = ప్రశంసించుచు, ఆ స్థానంబునన్ = భీమనాథుని ఆస్థానమునందు, శని వారోత్సవవేళన్ = శనివారోత్సవసమయమునందు, దేశిమార్గములన్ = దేశి, మార్గ, విధానములలోని, గంధర్వాప్సరోనృత్తముల్ = గంధర్వాప్సరసలయొక్క నృత్తము లను, కన్గొనియెన్ = కన్గొనెను.

తాత్పర్యము:- మునిచూడామణియైన యగస్త్యమహర్షి నృత్తగీత వాద్యాది సకల కళావిజ్ఞానమునకు పట్టాభిషిక్తుఁడు; అందువలన- చారీ, కరణ, అంగహార ముల సముచితస్థాన విశేషములను మెచ్చి రాజనందనయైన లోపాముద్రయును దానును ప్రశంసించుచు భీమనాయకుని యాస్థానమునందు శనివారోత్సవ వేళయందు, దేశి, మార్గ, విధానములలోని గంధర్వాప్సరస నృత్తములను వీక్షించెను.

వ. అంత. 19

తే. కుంభజుఁడు దక్షిణాభిముఖుండగుటయు
నదను వీక్షించి వచ్చెనో యనఁగ వచ్చె
శంబరారి ప్రతాపాగ్ని సామిధేని
నవశరద్వేళ శ్రీభీమనాథుఁ గొలువ. 20

అర్థము:- కుంభజుఁడు = అగస్త్యుఁడు. 'దక్షిణాభిముఖుండగుటయును' దక్షిణా = దక్షిణ దిక్కునకు. అభిముఖుండగుటయును = అభిముఖుఁడు కాఁగా. అదను = సమయమును, వీక్షించి = చూచి, వచ్చెనో యనఁగన్ = వచ్చెనో యన్న మాదిరిగా. 'శంబరారిప్రతాపాగ్నిసామిధేని' శంబరారి = మన్మథునియొక్క ప్రతాపాగ్ని = ప్రతాపమే యనెడి యగ్నికి, సామిధేని=ప్రజ్వలింపజేసెడి ఋగ్వేద

మంత్రమైన, 'నవశరద్వేళ' నవ = సుందరమైన, శరద్వేళ = శరత్కాలము, శ్రీ భీమనాథున్ = శ్రీ భీమేశ్వరస్వామిని, కొలువన్ = సేవింపఁగా, వచ్చెన్ = వచ్చెను.

తాత్పర్యము :- అగస్త్యమహర్షి దక్షిణదిశకు అభిముఖుఁడైనంతనే, సమయమును జూచి వచ్చెనా యన్నట్లు, మన్మథుని ప్రతాపాగ్నికి, సామిధేనీబుకైక్కొన రమ్యమైన శరత్కాలము, శ్రీ భీమేశ్వరస్వామిని సేవింపవచ్చెను.

విశేషము :- శరదృతువు ఆరంభసమయములోనే- అగస్త్యనక్షత్రము దక్షిణ దిక్కునం దుదయించును. అగస్త్యనక్షత్ర ముదయించినంతనే వంద్రు విరిగి నీరు తేటపడును. శరదృతువు మొదలగుట- దక్షిణదిక్కున అగస్త్యనక్షత్ర ముదయించుట దాదాపుగ ఒక్క సమయములోనే జరగును. దేవీనవరాత్రములలో అగస్త్యనక్షత్ర ముదయించును. పంచాంగములలో ఆశ్వయుజ శుక్లపక్షములో- 'అగస్త్యోదయః' అని వ్రాయుదురు.

తే. జిగురుకొన్న రజఃస్ఫూర్తి జెఱఁగుమాసి
జలద కుంభోదకంబున జలకమాడి
మలయజాచ్ఛ పయోధరమండలలగు
దిగ్వధువులందు రుచి ప్రవర్తించె నినుఁడు. 21

అర్థము :- 'జిగురుకొన్నరజఃస్ఫూర్తిన్' జిగురుకొన్న = జిగురెక్కిన, రజః = 'రజస్సు' అనెడి రజస్సుయొక్క శ్లిష్టరూపకము. బుతురక్త మనెడు పరాగముయొక్క. స్ఫూర్తిన్ = స్ఫురణముచేత. చెఱఁగుమాసి = అంచులు మాసి (రజస్వలలై), 'జలదకుంభోదకంబులన్' జలద = మేఘములే యనెడి. కుంభ = బిందెలయొక్క. ఉదకంబులన్ = జలములతో (వర్షములతో), జలకమాడి = శుద్ధిస్నానము చేసి, 'మలయజాచ్ఛపయోధరమండలలు' మలయజ = చందనమువలె, అచ్ఛ = స్వచ్ఛములైన, పయోధరమండలలు = మేఘమండలములు కలవి.

మలయజ = గంధపుఁ బూఁతచేత, అచ్ఛ = తెలుపారిన, పయోధరమండలలు = కుచమండలములు గల, 'దిగ్వధువులందు' దిక్ = దిక్కులే యనెడి, వధువులందున్ = స్త్రీలయందు, రుచిన్ = రుచితో-కాంతితో, ఇనుఁడు - సూర్యుఁడే

యనెడి భర్త-(ఇనుఁడే యనెడి యినుఁడు-శ్లిష్టరూపకము). ప్రవర్తించెన్ = ప్రవర్తించెను (ఋచి ప్రవర్తించె నినుఁడు అని పాఠాంతరము).

తాత్పర్యము :- వానకాలమునందు- తడిసి జిగురెక్కిన రజస్సు-ధూళి-ఋతురక్తము యొక్క స్ఫురణముతో చెఱఁగుమాసి, అంచులు మాసి, రజస్వలలై, ఆ పిమ్మట మేఘ కుంభోదకములతో జలకమాడి, స్నానమాడి, ఋచిస్నానము చేసి, చందనమువలె తెల్లనైన చందనపు పూఁతచేతఁ దెల్లనైన, పయోధరములే యనెడి (మేఘముల) పయోధరముల (స్తనములు) యొక్క, మండలములుగల దిక్కులే యనెడి స్త్రీలయందు రుచితో, ఆసక్తితో, కాంతితో ఇనుఁడు-సూర్యుఁడే యనెడు భర్త ప్రవర్తించెను.

విశేషము :- రజస్సు పయోధరములు ఇనుఁడు రుచి అను పదములలో శ్లేష మొత్తము అలంకారము రూపకము. శ్లేషానుప్రాణితమైన రూపకాలంకారము.
'జలజకుండోదకములు' అని వావిళ్ల వారి పాఠము.

సీ. అభినవోన్మేషచిహ్నంబైన తొలుచూపు
కౌస్తుభాలోక రేఖలకు నలఁగ
సాంగభంగంబైన యావులింతకు వేల్పు
లంగుళి స్ఫోటనం బాచరింప
సౌఖశాయనికులై సంవర్త భృగ్వాది
మునులు హస్తాంభోజములు మొగుడ్పఁ
ధృతచేతనంబులై దివ్యాయుధంబులు
జయజయ ధ్వనులతో సంస్తుతింప

తే. నలరు తేకులువోని పెంజిలువ తేని
యరఁటి కుబుసంపుఁ బొరలు మైనంటియుఁడ
నిదుర మేల్కాంచి కూర్చుండె నుదధి నడుమ
విష్ణుఁ డఖిలేశ్వరుఁడు శరద్వేళయందు! 22

అర్థము :- 'అభినవోన్మేషచిహ్నంబైనతొలుచూపు' అభినవ = కొంగ్రొత్తయైన, ఉన్మేష = తెప్పవిప్పునకు, చిహ్నంబైన = గుఱుతైన, తొలుచూపు =

మొదటిచూపు. 'కౌస్తుభాలోకరేఖలకున్' కౌస్తుభ = కౌస్తుభమణియొక్క. ఆలోక= కాంతియొక్క. రేఖలకున్ = రేకలకు, వలఁగన్ = కొనసాఁగక యుండఁగా.

'సాంగభంగంబైన యావులింతకున్' సాంగభంగంబైన = ఒడలు విఱిచి కొనుటతోఁ గూడికొన్న, ఆవులింతకున్ = జృంభణమునకు, వేల్పులు = దేవతలు, అంగుళిస్ఫోటనంబు=చిట్టమిడుచుటను-చిటికెవేయుటను, ఆచరింపన్=ఆచరింప గా. (అవులింత వచ్చినపుడు చిటికె వేయుచు 'చిరంజీవ' అని దీవించుట పెద్దల యాచారము) సౌఖశాయనికులై = (సుఖముగా నిద్ర పట్టినవా ! అని యడుగువారిని 'సౌఖశాయనికులు' అని యందురు. సుఖముగా స్నానమైనదా! అని యడుగువారిని 'సౌస్నాతికులు' అని యందురు. నిద్రలేచిన శ్రీ మహావిష్ణువునకు మునులు- అట్టి సౌఖశాయనికులు.) సుఖశయనమును ప్రశ్నించువారై, 'సంవర్తభృగ్వాదిమునులు' సంవర్త = సంవర్తనుడు. భృగు = భృగువు, ఆది = మొదలైన, మునులు = మునులు, హస్తాంభోజములు = పాణిపద్మములను, మొగుడ్పన్=మోడ్పఁగా.

'ధృతచేతనంబులై' ధృత = ధరింపఁబడిన, చేతనంబులై = చైతన్యము కలవియై, దివ్యాయుధంబులు = శార్ఙ్గ, సుదర్శన, కౌమోదకీ, నందక, పాంచజన్య ములు. జయజయ ధ్వనులతోన్ = 'జయ' 'జయ' అను నాదములతో. సంస్తుతింపన్ = స్తోత్రము చేయుచుండఁగా, అలరుఱేకులవోని = పూలఱేకులవంటి. పెంజిలువఱేని = (పెను + చిలువఱేఁడు-పెంజిలువఱేఁడు) పురాణ సర్పరాజైన ఆదిశేషునియొక్క, ఆరఁటి = అరఁటిపొరలవంటి. కుబుసంపుఁబొరలు = కూసపుఁ బొరఁ, మైన్ = శరీరమునందు, అంటియుండన్ = అంటికొనియుండఁగా, ఉదధి నడుమన్ = సముద్ర మధ్యమునందు, శరద్వేశయందున్ = శరత్కాలమునందు. అఖిలేశ్వరుండు = సకల జగదధీశ్వరుఁడైన. విష్ణుఁడు=విష్ణువు. నిదుర మేల్కొంచి= నిద్రలేచి. కూర్చుండెన్ = కూర్చుండెను.

తాత్పర్యము :- ఉత్థానైకాదశినాఁడు శ్రీమహావిష్ణువు నిద్రలేచుట వర్ణించుచున్నాఁడు. కార్తికశుద్ధములో- ఏకాదశినాఁడు క్షీరాబ్ధిమధ్యమున శేషతల్పమునుండి శ్రీమహావిష్ణువు నిద్రలేచును. ఆషాఢశుద్ధైకాదశినాఁడు శయనించును. అది శయనైకాదశి. ఇది ఉత్థానైకాదశి. ఈ నాల్గు నెలలను యతులు చాతుర్మాస్యలుందురు. అగస్త్యోదయముతోఁబాటు విష్ణువు నిద్రలేచుటకూడ శరత్కాల లక్షణములుగా కవులు వర్ణింతురు.

విష్ణువు నిద్రనుండి కన్ను విప్పెను. వక్షస్థలమునందలి కౌస్తుభమణి కాంతులకు ఆ తొలిచూపు తట్టుకొనలేక నలగిపోవుచుండెను. విష్ణువు ఒడలు విటిచికొని యావులించెను. దేవతలు చిటికెలు వైచుచుండిరి. సంవర్తుడు, భృగువు మొదలైన మహామునులు సౌఖశాయనికులై హస్తాంబుజములు మోడ్చుచుండిరి. సచేతనములై శార్జ, సుదర్శన, నందక, కౌమోదకీ, పాంచజన్యములు- 'జయజయ' నినాదములతో స్తోత్రములు చేయుచున్నవి. ఆయన నీలతనువుపై తెల్లని శేషుని కుబుసపు బొరలంటికొని యున్నవి. స్వామి శేషతల్పముపై లేచి కూర్చుండెను.

విశేషము :- కాళిదాసు రఘువంశము పదియవ సర్గలో విష్ణువు నిద్రలేచుట వర్ణించెను. 'హేతిభిశ్చేతనావద్భిరుదీరితజయస్వనం'

'యోగనిద్రాంతవిశదైః పావనైరవలోకనైః
భృగ్వాదీ ననుగృహ్ణంతం సౌఖశాయనికాన్ మునీన్'-
ఈ మాటలన్నియును శ్రీనాథుడచ్చటినుండి తెచ్చెను.

వ: వెండియుం బాకదశావిశీర్ణ శాల్మలీగుల్మ తూలరాశి దేశీయంబులు వియదురగ నిర్మోక శకల విభ్రమంబులు నభ్రముపతి శరీరశుభ్రంబులు నగు సితాభ్రంబులభ్రంబునం బరిభ్రమించి ఖండ ఖండంబులై యాఖండల కోదండ దండంబుల గగన మండలంబు నలంకరించె.కొదమ మొగిళ్ళు దొరలును,దడంబడు వలద వడగండ్లు పుష్పాంజలులును నుఱుము చప్పుళ్లు మర్దల ధ్వనులుగా గగనరంగస్థలంబునం గ్రొమ్మెఱుంగు మెఱుంగు బోడి గొండ్లి పరిఢవించె. మత్తవనమయూర మత్తకాశిని సకల మధుర కంఠకేకాగీతికావసానంబునంగాసించె. కుంభ ద్రోణంబు లంభోధరంబులు గురిసి వెలిచిన యనంతరంబ యంతంత నుట్టిపడునట్లు సలిలి బిందువులునుంబోలె రజనీశు క్తి ముక్తాఫలంబులు నక్షత్రంబు లంతరిక్షంబున సంప్రేక్షణీయంబులయ్యె. దక్షారామకటకాప్సరస్తటంకినీ వదనారవింద లావణ్య బిందు నిష్యందంబు చందురుండు కందర్ప దిగ్విజయ కీర్తి స్ఫూర్తియుం బోని యచ్చ వెన్నెల విచ్చల విడిం గాయం

దొడంగె. కుముదంబులు ముదంబందె. లాంగలిచెం గలించె. ఱెల్లుల్లసిల్లెఁ గాసర గాఁచె. దోసదోరఁగిలంబాఱె. పయ్యెర విసరె. వారి వండటియె. కరి, మదంబుగురిసె. నందిపోతు పోతరించి ఖణిల్లున అంకెవై చె. నసలడుగుపడియె. నెటి నిసుక దిబ్బచూపె: నిద్ర చవియయ్యె. నేడాకుల పొన్న క్రొన్నన పెరిగె, వరిగ విరిగె, గసగస యెసక మెసఁగె. పెసరు సురు కొనియె. తవిద పొదలె. ఱెక్క ప్రాసంగు దొండ ముక్కు వడియె. మదకల కల హంస సంసత్సల్లాప కోలాహల వ్యాబ్ధృంభ కరంభిత కకుబంతంబులైన విహార వేశంతంబులు కాంతా కుచద్వయ ద్వయస వాఃపూర వంతంబులయ్యె నయ్యవసరం బున—

23

అర్థము :- వెండియున్ = మఱియును, 'పాకదళా .... దేశీయంబులు' పాకదళా = పండినదళయందు, విశీర్ణ = పగిలిన, శాల్మలీ = బూరుగుచెట్టుయొక్క గుల్మ ; (గుల్మ మనఁగా బోదలేనిచెట్టు. బూరుగుచెట్టు గుల్మముకాదు. శాల్మలికి- అనుప్రాసముగా గుల్మమును వాడినట్లున్నది) తూలరాశి దేశీయంబులు = దూది పోగులతో సమానములైనవి, 'వియదురగ .... విభ్రమంబులు' వియత్ = ఆకాశమేయనెడి, ఉరగ = పాముయొక్క, నిర్మోక = కూసముయొక్క. శకల = ఖండములయొక్క, విభ్రమంబులను = విలాసములు కలవియును. అభ్రముపతి = ఐరావతముయొక్క, శరీర = శరీరమువలె. ఋభ్రంబులున్ = తెల్లనివియు. అగు= అయిన. సితాభ్రంబులు = తెల్లమబ్బులు. అభ్రంబునన్ = ఆకాశమునందు. పరి భ్రమించి = కలయఁదిరిగి, ఖండ ఖండంబులైన = ముక్కలు ముక్కలైన. "ఆఖండల కోదండ దండంబులన్" ఆ ఖండల = ఇంద్రుని యొక్క, కోదండ దండంబులన్ = ధనుర్దండములతో-ఇంద్రధనుస్సులతో. గగన మండలంబులన్ = ఆకాశమండలమును, అలంకరించెన్ = అలంకరించెను, కొదమమొగిళ్ళు = తరుణ మేఘములు, దొరలు = ప్రభువులును. తడంబడు = వ్యత్యస్తముగా పడుచున్న. వలుద వడగండ్లు = పెద్దవడగళ్లు, పుష్పాంజలులును = పూలదోయిళ్లను, ఉఱుము చప్పుళ్లు = ఉఱుములధ్వనులు. మర్దళధ్వనులుగాన్ = మృదంగధ్వనులుగా, గగన

రంగస్థలంబునన్ = ఆకాశమేయనెడి రంగస్థలమునందు. క్రొమ్మెఱుంగుబోఁడి = మెఱుపు తీఁగయేయనెడి నాట్యకత్తె. గొండ్లిన్ = కుండలాకార నృత్యమును, పరిథవించెన్ = చేసెను 'మత్త వనమయూర మత్తకాశిని' మత్త = మదించిన. వనమయూర = అడవి నెమలియే యనెడి. మత్తకాశిని = మదముచేత ప్రకాశించెడి నట్టువ. 'సకల మధుర కంఠకేకా గీతికావసానంబునన్' సకల మధురకంఠ = కల మధుర కంఠధ్వనితోఁగూడికొనిన, కేకా = మయూరవాణియే యనెడి. గీతికా = పాటయొక్క. అవసానంబునన్ = విరామమునందు. కళాసించెన్ = నృత్యమును విరమించెను, అంభోధరంబులు = మేఘములు. కుంభద్రోణంబులు = కుంభములను, ద్రోణములునుగా, కడవలతో = దోనెలతోఁ ద్రిమ్మరించిన రీతిగా, కురిసి= వర్షించి. వెలిచిన యనంతరంబ = వెలిసిన వెంటనే. అంతంతన్ = అంతనంత, ఆఁగియా గి, ఉట్టిపడు = ఊరిపడు, నట్టు = ధారాళములుకాని, సలిలబిందువులు నుంబోలె = నీటి బొట్టులవలె. 'రజనీముక్తి ముక్తాఫలంబులు' రజనీ = రాత్రియే యనెడి, ముక్తి = ముత్యపుఁజిప్పయందలి. ముక్తాఫలంబులు = ముత్తియములైన. నక్షత్రంబులు = నక్షత్రములు. అంతరిక్షంబునన్ = ఆకాశమునందు, సంప్రేక్షణీయంబులు దర్శనీయములు. అయ్యెన్ = అయ్యెను, "దక్షిరామ....బిందునిష్యందంబు" దక్షిరామ = దక్షిరామమనెడి. కటక = నగరమునందలి, అప్సరస్తాటంకినీ= అప్సరఃస్త్రీలయొక్క. వదనారవింద=ముఖపద్మముల యందలి. లావణ్య = లావణ్యముయొక్క, బిందునిష్యందము = బిందురూపనిష్యందమైన, చందురుండు = చంద్రుఁడు, "కందర్ప .... కీర్తిస్ఫూర్తియగు" కందర్ప = మన్మథునియొక్క. దిగ్విజయ = దిక్కులను జయించుట వలన కలిగిన. కీర్తియుంబోని = కీర్తిస్ఫురణమువంటి, అచ్చవెన్నెల = అచ్చమైన వెన్నెలను, విచ్చలవిడిన్ = విశృంఖలముగా, కాయందొడంగెన్ = కాయుటకు మొదలుపెట్టెను, కుముదంబులు = కలువలు, ముదంబందె = మోదమును పొందెను, లాంగలి = శరత్కాలమునందు పూచెడి ఒకానొక పువ్వు, చెంగలించెన్ = విజృంభించెను. ('లాంగలీ శారదీతోయ పిప్పలీ శకులాదనీ.' అమరము; నీరుపిప్పలి.) తెల్లు = తెల్లుపువ్వు, ఱల్లసిల్లెన్ = ప్రకాశించెను, కాసర = కాసరచెట్టు. కాఁచెన్ = కాఁచెను, దోస = దోసకాయ. దోరగిలం బాఱెన్ = ఎఱ్ఱఁబాఱెను, పయ్యెర = దక్షిణపుగాలి. విసరెన్ = వీచెను. వారి = నీరు. వండటియెన్ = (వండు + అటు-వండటు) వండు విటిగెను. కరి= ఏనుఁగు. మదంబు గురిసెన్ = మదజలమును వర్షించెను. నందిపోతు = ఆఁబోతు.

పోతరించి = పొగరెక్కి. ఱణిల్లునన్ = 'ఱణిల్లు' మని, అంకెపై చెను = అంకె వేసెను, ఆసలు = బురద, అడుగుపడియెన్ = అడుగునకుఁ బోయెను, నెఱిన్ = అందముగా, ఱసుక = ఱసుక, దిబ్బచూపెను = తిన్నెకట్టెను, నిద్ర = విద్దుర, చవియయ్యెన్ = రుచియయ్యెను, ఏడాకులపొన్న = ఏడాకుల పొన్నచెట్టు (సప్తపర్ణి), క్రొన్ననన్ = క్రొత్తపూవుతో, పెరిఁగెన్ = వృద్ధిపొందెను, వరిగ=వరిఁ, పెరిఁగెన్ = వృద్ధిపొందెను, గసగస = (ఒకదినుసువిత్తులు - (గసగసాలు) ఎనక మెసఁగెన్ = పెంపొందెను, పెసర = పెసరపైరు, ఉసురుకొనియెన్ = ప్రాణము పోసికొనెను, దవనిక = దవనము-సువాసనగల ఒక మూలిక, పొదలెన్ = పెంపొందెను, ఱెక్కఁపాసఁగు = ఒకరకము వరిపైరు, దొండముక్కపడియెన్ = దొండపండువలె - తొడిమెపగ్గఱ-ఆకుపచ్చ, నడిమిభాగములో పసపు కొసయందు-ఎఱుపు అను మూఁడువన్నెలు కలదయ్యెను, 'మదకల ..... కకుబంతంబులైన' మద = మదముచేత, కల = అవ్యక్త మధురములైన, కలహంస = కలహంసలయొక్క, (నల్లనిముక్కు, కాళ్ళు గల, హంస కలహంస.) సారస=బెగ్గురుపక్షులయొక్క, కలాలాప = (కల + ఆలాప) మధురాలాపములయొక్క, కోలాహల= కలకలముచేత, వ్యాజృంఢత (వి + ఆజృంభిత=వ్యాజృంభిత) అంతటను వ్యాప్తములైన, కకుబంతంబులై = (కకుప్ + అంతటము-కకుబంతము) దిఙ్మంతములు కలవియై, 'విహారవేళంతంబులు' విహార = విహారార్థమైన, వేళంతంబులు = అల్పసరస్సులు, 'కాంతా .... వాఃపూరవంతంబులయ్యెన్' కాంతా = జవరాండ్రయొక్క, కుచద్వయద్వయస = చనుదోయిబంటియైన - తొమ్మిబంటియైన, వాఃపూరవంతంబులు = జలసమృద్ధికలవి, అయ్యెన్ = అయినవి, అయ్యవసరంబున్ = ఆ సమయమునందు.

తే॥గీ॥ కార్తికికవేళ భీమశంకరుని నగర
వింధ్య సంస్తంభయిత దూరె విమలబుద్ధిఁ
దొయ్యలియుఁ దాను జిచ్చఱతోరణంబు
కలుషసంహతి సంహారకారణంబు. 24

అర్థము :- కార్తికికవేళన్ = కార్తికమాసమునందు, 'భీమశంకరుని నగరన్' భీమశంకరుని = భీమేశ్వరస్వామియొక్క, నగరన్ = నగరునందు-ఆలయమునందు, వింధ్యసంస్తంభయిత = వింధ్యపర్వతమును స్తంభింపఁజేసిన అగస్త్య

మహర్షి, తొయ్యలియుఁదాను=లోపాముద్రయును, తానును, విమలబుద్ధిన్ = నిర్మలమైన అంతఃకరణముతో, 'కలుష.... సంహారకారణంబు' కలుషసంహతి = పాపసమూహమునొక్క-. సంహార = సంహారమునకు, కారణంబున్ = కారణమైన, విచ్చరతోరణంబున్ = జ్వాలాతోరణమును, దూరెను = దూరి వెళ్ళెను.

తాత్పర్యము :- కార్తికమాసములో- భీమేశ్వరస్వామి ఆలయములో అగస్త్యమహర్షి భార్యయైన లోపాముద్రతోసహ పాపసంహార కారణమైన జ్వాలాతోరణము క్రిందినుంచి దూరి వెళ్ళెను.

విశేషము :- కార్తికమాసములో జ్వాలాతోరణము దూరుదురు.

కం. దక్షిణ వారాణసియగు
దక్షారామంబు సొచ్చి తరుణేందుధరున్
వీక్షించిన గొలెను గా
శీక్షేత్రాలోక సుఖమ చేకుఱె ఋషికిన్. 25

అరము :- దక్షిణవారాసియగు = దక్షిణకాశియైన, దక్షారామంబు = దక్షారామమును, చొచ్చి = ప్రవేశించి, తరుణేందుధరున్ = బాలచంద్రధరుఁడైన శివుని, వీక్షించిన గొలెను = చూచిన మొదలుగా, 'కాశీక్షేత్రాలోకసుఖమ' కాశీక్షేత్ర = కాశీక్షేత్రమునొక్క-, ఆలోకసుఖమ = దర్శనసౌఖ్యమే, ఋషికిన్=ఋషికి, చేకుఱెన్= చేకూరెను.

తాత్పర్యము :- దక్షిణకాశియైన దక్షారామము ప్రవేశించి భీమేశ్వరస్వామినిఁ జూచినది మొదలు కాశీక్షేత్ర సందర్శనానందమే అగస్త్యమునికిఁ గల్గెను.

కం. క్లేశంబును సౌఖ్యంబును
నాశువునను గుంభజన్ముఁ డభిమర్శించెన్
కాశీవిరహము దక్షిణ
కాశీసంగమము వరుసఁ గలిగినకతనన్. 26

అర్థము :- క్లేశంబును = దుఃఖమును, సౌఖ్యంబును = సౌఖ్యమును, ఆశువునను = శీఘ్రముగా, కుంభజన్ముఁడు = అగస్త్యమహర్షి, అభిమర్శించెన్ =

స్పృశించెను. కాశీవిరహము = కాశీనగరముతో నెడఁబాటు, దక్షిణకాశీసంగము = దక్షిణకాశియైన దక్షారామముతో సమాగము, వరుసన్ = క్రమముగా, కలిగిన కతనన్ = కలిగినందువలన_

తాత్పర్యము :- కాశీక్షేత్రముతో విరహము, దక్షిణకాశియైన దక్షారామముతో సమాగమము, వరుసగా కలిగినందువలన అగస్త్యునకు దుఃఖస్వరూపము, సుఖస్వరూపము తెలిసెను.

వ. పరోపకారపరుండయినవానికిఁ బుంఖానుపుంఖంబు సంపదలు సంభవించు. తీర్థ స్నాన దాన జప హోమ దేవతార్చనాదులు పరోపకారంబునుం బోలనేరవు. పరోపకారంబుకంటెఁ ధర్మంబు లేదు. లోకోపకార పరాయణుండైన వాతాపిదమనున కింత లేసి ప్రయోజనంబులు సమకూరకుండునె? ఇవ్విధంబున భోగ మోక్ష నివాసంబైన దక్షారామంబునం గొన్ని దినంబులుండి కొల్లాపురంబునకు శ్రీమహాలక్ష్మి దర్శింపం బోఁదలంచి యమ్మైత్రావరుణుండు. 27

అర్థము :- పరోపకారపరుండైనవానికిన్ = ఇతరులకు మేలుచేయు స్వభావము గలవానికి, పుంఖానుపుంఖంబు = (పుంఖ + అనుపుంఖంబు - పుంఖానుపుంఖంబు) ఒకదానివెంట-ఒకటిగా, సంపదలు = శుభములు, సంభవించున్ = కలుగుచుండును. 'తీర్థస్నాన.... దేవతార్చనాదులు' తీర్థస్నాన = పుణ్యతీర్థములయందు మునుకలు పెట్టుట, దాన = దానములు, జప = మంత్రజపములు, హోమ = హోమములు, దేవతార్చనా = దేవతలను పూజించుటలు, ఆదులు = మొదలైనవి, పరోపకారంబునున్ = ఇతరుల కుపకారము చేయుటను, పోలనేరవు = పోలఁజాలవు, పరోపకారంబునకంటెన్ = ఇతరులకు మేలు చేయుటకంటె, ధర్మంబు లేదు = పుణ్యము లేదు, లోకోపకారపరాయణుండైన = లోకోపకారమునం దాసక్తుఁడైన, వాతాపిదమనునకున్ = వాతాపిని నిగ్రహించిన అగస్త్యునకు, ఇంతలేసి ప్రయోజనంబులు = ఇంతింతటి లాభములు, సమకూరకుండెనె? = ఒనఁగూడకుండునా?, ఇవ్విధంబునన్ = ఈవిధముగా, 'భోగమోక్షనివాసంబైన' భోగమోక్ష = భోగమునకు, మోక్షమునకు, నివాసంబైన = స్థానమైన, దక్షారామంబునన్ = దక్ష

రామమునందు, కొన్ని దినంబులుండి = కొన్నినాళ్ళుండి, కొల్లాపురంబునకున్ = కొల్లాపురమునకు. శ్రీమహాలక్ష్మిన్ = శ్రీమహాలక్ష్మిని, దర్శింపన్ = దర్శించుటకు, పోఁదలంచి = వెళ్ళఁదలఁచి, అమ్మైత్రావరుణుండు = మిత్రావరుణనందనుఁడైన ఆ యగస్త్యమహాముని–

తాత్పర్యము :– సుగమము.

సీ॥ అంతఃప్రవాహాయై యావిర్భవించె, నే
ధరణీధరము పొంతఁ దల్లిబావి
పాఱెనే శైలంబు పాదమూలంబునఁ
గల్లేటితో వృద్ధగంగవారి
యువయించె నేకొండ యుత్తరాశారసా
తల కుక్షి సప్తగోదావరంబు
జనియించె నేశిలోచ్చయము దక్షిణమునఁ
గణ్వావాహిని యుప్పొంగడలి కొమ్మ

తే. పద్మగిరి తోడఁబుట్టు వేపర్వతంబు,
బలిసియుండు నేయద్రికిఁ బంచలింగి
యట్టి వీరభద్రాఖ్య మహాచలమున
కరుగుదెంచెను వింధ్యమదాపహారి. 28

అర్థము :– 'వింధ్యమదాపహారి' వింధ్య = వింధ్యపర్వతముయొక్క, మదాపహారి = మదమును తొలఁగించిన యగస్త్యమహర్షి; ఏ ధరణీధరము పొంతన్ = ఏ కొండదగ్గఱ, అంతఃప్రవాహాయై = లోపలి ప్రవాహములు కలదియై, తల్లిబావి= 'తల్లిబావి' అను ప్రసిద్ధమైన బావి, ఆవిర్భవించెన్ = ఆవిర్భావమును పొందెనో, ఏ శైలంబు పాదమూలంబునన్ = ఏ కొండయొక్క అడుగునందు, కల్లేటితోన్= కల్లేటితోఁ గలసి, వృద్ధగంగ = వృద్ధగంగయొక్క, వారి = నీరు; పాఱెన్ = ప్రవహించెనో, ఏకొండ = ఏ పర్వతముయొక్క, 'ఉత్తరాశారసాతలకుక్షిన్' ఉత్తరాశా = ఉత్తరదిక్కునందలి, రసాతల = భూమియొక్క, కుక్షిన్ = గర్భమునందు, సప్తగోదావరంబు = సప్తగోదావర తీర్థము, ఉదయించెన్ = పుట్టెనో,

ఏ శిలోచ్చయము దక్షిణమునన్ = ఏ కొండ దక్షిణ దిక్కునందు. ఉప్పొంగదలి కొమ్మ = లవణ సముద్రపత్నియైన. కణ్వవాహిని = కణ్వనది. జనియించెన్ = పుట్టెనో. ఏ పర్వతంబు = ఏ కొండ. పద్మగిరి = కమలాద్రియొక్క. తోడం బుట్టువు = తోబుట్టువో. ఏ యద్రికిన్ = ఏ కొండను. పంచలింగి = ఐదు లింగ ముల సమాహారము. బలసియుండున్ = చుట్టియుండునో. అట్టి = అటువంటి, శ్రీ వీరభద్రమహాచలమునకున్ = శ్రీ వీరభద్రాచలమునకు (పట్టిసమునకు). అరుగు దెంచెను = వచ్చెను.

తాత్పర్యము :- సుగమము.

వ. ఇట్లరుగుదెంచి లోపాముద్ర కిట్లనియె. 29

అర్థము :- ఇట్లరుగుదెంచి = ఇట్లు వచ్చి. లోపాముద్రకున్ = లోపా ముద్రకు. ఇట్లనియెన్ = ఇట్లు పలికెను.

తాత్పర్యము :- సుగమము.

తే. దక్షిణానంద విపినమధ్యంబునందుఁ
క్రతు విధిధ్వంసవేళ దేవతల నుటిపి
వీరభద్రేశుఁ డీయద్రి వెన్నుదన్ని
గౌతమీవారిఁ దరవారిఁ గడిగినాఁడు. 30

అర్థము :- దక్షిణానంద విపిన మధ్యంబునందున్ = దక్షిణకాశియైన దక్షా రామ మధ్యమునందు. క్రతువిధిధ్వంసవేళన్ = దక్షాధ్వరధ్వంసవేళయందు, దేవత లన్ = దేవతలను, నుటిపి = ఖండించి, వీరభద్రేశుఁడు = వీరభద్రేశ్వరస్వామి. ఈ యద్రి = ఈ కొండయొక్క, వెన్నుదన్ని = పృష్ఠము నధిష్టించి. గౌతమీ వారిన్ = గౌతమీ జలమునందు. తరవారిన్ = ఖడ్గమును, కడిగినాఁడు = ప్రక్షాళి తముఁ జేసెను.

తాత్పర్యము :- దక్షిణకాశియైన దక్షారామమునందు దక్షాధ్వరధ్వంసము చేసి దేవతలను ఖండించి వీరభద్రస్వామి యీ పర్వతముపై నిలచి. గౌతమీ జలముల యందు తన మహాఖడ్గమును కడిగెను.

తే. పంకజక్ష్మాధరము వీరభద్రగిరియు
నంధ్రభూమికి వక్షోరుహద్వయంబు
భువనచక్షుఃకరంభ మంభోరుహాక్షి!
గౌతమీగంగ ముక్తాల కంఠమాల. 31

అర్థము :- పంకజక్ష్మాధరము = కమలాద్రి, వీరభద్రగిరియున్ = పట్టసాద్రి యును, ఆంధ్రభూమికిన్ = ఆంధ్రభూమికి, వక్షోరుహద్వయంబు = చనుదోయి, అంభోరుహాక్షి! = ఓ పద్మాక్షీ! 'భువనచక్షుఃకరంభము' భువన = లోకముల యొక్క, చక్షుః = కన్నులకు, కరంభము = పెరుగుతో కలిపిన పేలపిండి ముద్ద యైన, గౌతమీగంగ = గౌతమీగంగ, ముక్తాల కంఠమాల = ముక్తాల కంఠమాలఁ

తాత్పర్యము :- ఆంధ్రభూమికిఁ గమలాద్రియును, బట్టసాద్రియును స్తన ద్వయము. భువన, నయన, కరంభమైక గౌతమీగంగ ముక్తాల కంఠమాలఁ

సీ॥ ఎవ్వాఁడు డాచేతి క్రొవ్వాడి నఖమునఁ
జిదిమె భాషాదేవి చిగురుముక్కుఁ
గనక మేఖలఁ గ్రుచ్చికట్టె నెవ్వాఁడులీలఁ
జెఱఁగుపైఁ బూపారుఁ మెఱుఁగుపండ్లు
కొసరకెవ్వాఁడు పదాంగుష్ఠభాగంబున
నుడురాజు పొట్ట గుజ్జుఱుకనూఁదెఁ
దటిగె నెవ్వాఁడు ఖడ్గధారాంచలంబున
నగ్ని నాలుక లేడు నంటఁబట్టి

తే. మోఁదె నెవ్వాఁడు ముప్పదిమూఁడుకోట్ల
వేలుపులఁ బారఁబార వెన్వెంటఁ దటిమి
యట్టి శ్రీ వీరభద్రుఁ డీయద్రిమీఁద
భద్రకాళియుఁ దానుండుఁ బద్మనయన! 32

అర్థము :- ఎవ్వాఁడు = ఎవ్వఁడు. 'డాచేతిక్రొవ్వాఁడి నఖమునన్' డాచేతి= ఎడమచేతియొక్క, క్రొవ్వాఁడి=(క్రొత్త + వాడి-క్రొవ్వాఁడి) నూత్న నైశిత్యము

గల,నఖమునన్ = గోటితో, భాషాదేవి చిగురు ముక్కున్ - భాషాదేవి = సరస్వతీదేవియొక్క, చిగురుముక్కున్ = ముక్కుకొసను, చిదిమెన్ = కోసెనో,

ఎవ్వఁడు = ఏ వీరుఁడు, లీలన్ = విలాసముతో, 'పూషార్కు మెఱుఁగు పండ్లు' పూషార్కు = పూషయను సూర్యునియొక్క, మెఱుఁగుపండ్లు=మెఱుఁగుపండ్లను, కనకమేఖలన్ = బంగరు మొలనూలియందు,గ్రుచ్చి = గుంపించి, చెఱుఁగు పైన్ = వస్త్రముపై, కట్టెన్ = కట్టెనో,

ఎవ్వఁడు = ఎవ్వఁడు, కొసరక = సంకోచింపక, పదాంగుష్ఠభాగంబునన్ = కాలిబొట్టనవ్రేలితో, ఉడురాజు = నక్షత్రములకు రాజైన చంద్రునియొక్క, పొట్ట గుజ్జు = పొట్టలోని సారము, ఉఱుకన్ = వెలుపలి కుఱుకునట్లు, ఱోఁదెన్ = నొక్కెనో.

ఎవ్వఁడు = ఎవఁడు, 'ఖడ్గధారాంచలంబునన్' ఖడ్గ = కత్తియొక్క, ధారా = వాదరయొక్క, అంచలమ్మునన్ = అంచుతో, అగ్నినాలుకలేడున్ =అగ్నిదేవుని సప్తజిహ్వాలను. అంటఁబట్టి = సాఁగలాఁగి, తటిఁగెన్ = తటిఁగెనో.

ఎవ్వాఁడు = ఎవఁడు, పారఁబారన్ = పరువెత్తి పరువెత్తిపోవుచుండఁగా, వెన్వెంటఁదగిలి = వెంట వెంటఁబడి, ముప్పదిమూఁడుకోట్ల వేలుపులను = ముప్పదిమూఁడుకోట్ల దేవతలను, మోఁదెన్ = పసరములను మోదినట్లు మోఁదునో, అట్టి= అటువంటి వీరాధి వీరుఁడైన, శ్రీవీరభద్రుఁడు = శ్రీవీరభద్రస్వామి. ఈయద్రి మీఁదన్ = ఈ పట్టసాచలముమీఁద, పద్మనయనఁ = ఓ తామరపువ్వుల వంటి కన్నులు గలదానా!, భద్రికాళియుఁ దానుండున్ = భద్రకాళియుఁ దానును నివసించును.

తాత్పర్యము:- ఏ మహావీరుఁడు తన యెడమచేతి గోటి కొసతో సరస్వతీదేవి ముక్కుకొనను జిదిమెనో, ఎవ్వఁడు పూషాదిత్యుని తళతళలాడెడి పండ్లను తనబంగారు మొలనూలికిఁ గ్రుచ్చి కట్టి చెఱుఁగుపైఁ గట్టికొనెనో, ఎవ్వఁడు తన కాలి బొట్టన వ్రేలితో-పొట్టగుజ్జుటకి వెలుపలికి వచ్చునట్లు సంకోచించక చంద్రుని నొక్కెనో, ఎవ్వఁడు తన కత్తివాదరయంచుతో అగ్నిదేవుని యేడు నాలుకలను అంటఁగోసెనో, ఎవ్వఁడు పరువులు వారుచున్న ముప్పది మూఁడుకోట్ల దేవతలను వెంట వెంటఁబడి - పఱువులను మోఁదినట్లు మోఁదెనో, అట్టి శ్రీవీరభద్రస్వామి భద్రికాళితోఁ గలసి యీ యద్రిపై నివసించును.

తే॥గీ॥ బ్రహ్మసంవేద్య మాదిగాఁబట్టి సాంత
మతివ! గోదావరీ నదీహారమునకు
నడుము నాయక రత్నమై నలువు మిగులుఁ
బంచలింగాశ్రయము వీరభద్రశిఖరి॥ 33

అర్థము :- బ్రహ్మసంవేద్య మాదిగాన్ = బ్రహ్మసంవేద్యము మొదలుగా. పట్టి సాంతం = పట్టిసము తుదిగా, అతివ ! = తరుణీ!. 'గోదావరీనదీహారమున కున్' గోదావరీనదీ = గోదావరీనదియనెడి. హారమునకున్ = హారమునకు. నడుమన్ = మధ్యభాగమునందు. పంచలింగాశ్రయము = ఐదులింగములకు నిలయమైన. శ్రీవీరభద్రశిఖరి=శ్రీవీరభద్రాచలము. నాయకరత్నమై=హారమధ్యస్థితమగు నాయకమణియై. నలువుమిగులున్ = ప్రకాశించును.

తాత్పర్యము :- బ్రహ్మసంవేద్యము మొదలు - పట్టిసము తుదిగా-గోదావరీ నదియనెడి హారమునకు నడుమ పంచలింగాశ్రయమైన వీరభద్రాచలము నాయకమణియై ప్రకాశించుచుండును.

వ: అని చెప్పి యచ్చోటు గదలి ప్రతిదిన ప్రయాణంబుల 34

అర్థము :- అని చెప్పి = ఇట్లు వివరించి, అచ్చోటుగదలి = ఆ పట్టిసము నుండి కదలి, ప్రతిదినప్రయాణంబులన్ = అనుదినప్రయాణములతో —

తాత్పర్యము :- సుగమము.

కం. క్షీరారామంబునఁ బా
ర్శ్యారామంబునను నాది మారామమునన్
దారాధిప చూడామణి
నారాధించెను ముసీంద్రుఁ డతివయుఁదానున్. 35

అర్థము :- ముసీంద్రుఁడు = ముసీంద్రుఁడైన యగస్త్యమహర్షి. అతివయు దానున్ = భార్యయైన లోపాముద్రయును దానును, క్షీరారామంబునన్ = పాలకొలని యందును, పార్శ్యారామంబునన్ = సామర్లకోట యందును, ఆదిమారామమునన్ = అమరావతియందును, 'తారాధిపచూడామణిని' - తారాధిప = చుక్కల

రాజైన చంద్రుఁడు, చూడామణిని = శిరోమణిగాఁగల చంద్రుని, ఆరాధించెను = ఆర్చించెను.

తాత్పర్యము :- అగస్త్యమహర్షి భార్యయైన లోపాముద్రయును దానును, క్షీరారామమైన పాలకొలని యందును, ప్రాచ్యారామమైన కుమారారామమైన సామర్ల కోట యందును, ఆదిమారామమైన యమరావతియందును, చంద్ర చూడామణియైన శివుని సేవించెను.

వ: అనంతరంబ యమ్మునిసింహంబు సహ్యగిరికన్యకాప్రవాహం బునఁ గృతావగాహనుండై కదలి పశ్చిమాంభోనిధి తీరంబున సౌరాష్ట్ర సోమనాథేశ్వర శిరశ్చంద్ర చంద్రికా ధౌత కల ధౌత సౌధ వీథికాసముల్లిఖిత గగన మండలంబయి పదునెని మిది యోగపీఠంబులందును సుప్రసిద్ధంబైన కొల్లాపురంబు నకుం జని యందు. 86

అర్థము :- అనంతరంబ = వెనువెంటనే, అమ్మునిసింహంబు = ఆ ముని శ్రేష్ఠుఁడు, 'సహ్య .... ప్రవాహంబునన్' సహ్యగిరి కన్యకా = సహ్యగిరి నందన యైనకృష్ణానదియొక్క, ప్రవాహంబునన్ = ప్రవాహమునందు, 'కృతావగాహనుండయి', కృత = చేయఁబడిన, అవగాహనుండయి = స్నానముగలవాఁడై, కదలి = నడచి, పశ్చిమాంభోనిధి తీరంబునన్ = పడమటి సముద్రతీరమునందు, 'సౌరాష్ట్ర .... గగనమండలంబయి' సౌరాష్ట్ర = సౌరాష్ట్రమునందలి, సోమనాథేశ్వర = సోమనాథేశ్వరునియొక్క, శిరః = శిరస్సుమీఁది, చంద్ర = చంద్రుని యొక్క, చంద్రికా = వెన్నెలలచేత, ధౌత = కడుగఁబడిన, కలధౌత = వెండి మయములైన, సౌధవీథికా = మేడల వరుసలచేత, సముల్లిఖిత = ఒరయఁబడిన, గగనమండలంబయి = ఆకాశమండలముకలదియై, పదునెనిమిది యోగపీఠంబుల యందును = అష్టాదశయోగపీఠములందును, సుప్రసిద్ధంబైన = మిక్కిలిప్రసిద్ధ మైన, కొల్లాపురంబునకుంజని = కొల్లాపురమునకు వెళ్ళి, అందున్ = అచ్చట.

తాత్పర్యము :- అమరావతిని సేవించిన పిమ్మట అగస్త్య మహాముని కృష్ణానదిలో స్నానముచేసి కదలి పశ్చిమసముద్రతీరమునకుఁ బోయెను, అచ్చటి నుండి సౌరాష్ట్ర సోమనాథేశ్వరుని యౌదల జాబిల్లి వెన్నెలలచేతఁ దెలుపారిన

వెండి మేడల శిఖరములతో-మిన్నులొరయుచు - అష్టాదశయోగపీఠములలో సుప్ర
సిద్ధమైన కొల్లాపురమునకుఁబోయి యచ్చట-

ఉ॥ శ్వేతవరాహకల్పమున వెన్నుఁడు సూకరవేషధారియై
యాతత దంష్ట్రికాంకురమునందు ధరిత్రి నహించి యుండఁగా
నాతనిమీఁద లేఁతపొలయల్క వహించి తొలంగివచ్చెనో
యీతరళాక్షి? యంద్రు బుధులెప్పుడు నాజగదేకమాతృకన్. 37

అర్థము:- శ్వేతవరాహకల్పమునన్=శ్వేతవరాహకల్పమునందు, వెన్నుఁడు=
విష్ణువు, సూకరవేషధారియై = వరాహవేషమును ధరించినవాఁడై, ఆతతదంష్ట్రి
కాంకురమునందున్' ఆతత = విశాలమైన, దంష్ట్రికా = కోరయొక్క. అంకు
రమునందున్ = మొలకయందు, ధరిత్రిన్ = భూమిని. వహించియుండఁగాన్ =
మోచియుండఁగా, ఆతనిమీఁదన్ = ఆ విష్ణువుమీఁద. 'లేఁత పొలయల్కన్' లేఁత=
సుకుమారమైన, పొలయల్కన్ = ప్రణయకలహమును, వహించి = పూని.
వచ్చెనో! = వచ్చెనేమో!, "ఈతరళాక్షి" = 'ఈ చంచలాక్షి!', అంద్రు = అనె
దరు, బుధులు = తెలిసినవారు, ఎప్పుడున్ = ఎప్పుడును, ఆ జగదేకమాతృకన్ =
ఆ సకలలోక జననిని.

తాత్పర్యము :- తెలిసిన పురావిదులు-ఆ కొల్లాపురీ మహాలక్ష్మిని గూర్చి
యిట్లందురు. శ్వేతవరాహ కల్పమునందు విష్ణువు వరాహరూపమును ధరించి తన
దృంష్ట్రాంకురముపై భూదేవిని ధరించియున్నందు వలన-ఆయనపై సుకుమార
మైన ప్రణయకలహమును బూని యీ మహాలక్ష్మి కొల్లాపురమునకు వచ్చెనేమో
యని యందురు.

తే॥గీ॥ భద్రకాళికయై ఘోరపరశుధారఁ
గ్రూరదైత్యునిఁ బొరిగొన్న ఘోరమూర్తి
శౌరివక్షస్థలీ నభశ్చంద్రరేఖ
శ్రీమహాలక్ష్మి భక్తి వీక్షించెఁదపసి॥ 38

అర్థము :- భద్రకాళికయై = భద్రకాళీస్వరూపమును ధరించి, 'ఘోరపర
ధరన్' ఘోర = భయంకరమైన, పరశు = గండ్రగొడ్డలియొక్క, ధరన్-వాద

రతో, "క్రూరదైత్యునిన్" క్రూర = క్రూరుఁడైన. దైత్యునిన్ = రాక్షసుని. పొరిగొన్న = సంహరించిన. ఘోరమూర్తి = భయంకరమూర్తి. 'శౌరి వక్షస్థ్సలీ వభశ్చంద్రరేఖన్' శౌరి = విష్ణువుయొక్క. వక్షస్థ్సలీ = వక్షఃప్రదేశమే యనెడి. నభః = ఆకాశమునందలి. చంద్రరేఖ = చంద్రకళయైన. శ్రీమహాలక్ష్మిన్ = శ్రీ మహాలక్ష్మిని. తపసి = తపస్వియైన అగస్త్యుఁడు. భక్తిన్ = భక్తితో. వీక్షించెన్ = సందర్శించెను.

తాత్పర్యము:- భద్రికాశ్రమమై గంద్రగొడ్డలి వాదరతో క్రూరరాక్షసుని సంహరించిన భయంకర మూర్తియును, విష్ణువక్షస్థ్సలమే యనెడి గగనతలము నందు చంద్రరేఖయైన ప్రసన్నమూర్తియునుగల శ్రీమహాలక్ష్మిని అగస్త్యమహర్షి భక్తితో సందర్శించెను.

కం. కొల్లాపురి లక్ష్మికిఁ బ్రణ
మిల్లిరి పులకాంకురములు మేనులఁ బొడమన్
హ్రల్లేఖా మంత్రోపని
షల్లతికా కుసుమమునకు సతియుం బతియున్. 39

అర్థము :- సతియును బతియున్ = లోపాముద్రయును, అగస్త్య మహా మునియును, మేనులన్ = శరీరములయందు, 'పులకాంకురముల్' పులక = గగు ర్పాటుయొక్క, అంకురముల్ = మొలకలు, పొడమన్ = ఉదయించఁగా, 'హ్రల్లేఖా.... కుసుమమునకున్' హ్రల్లేఖామంత్ర = హ్రీంకార మంత్రమే యనెడి, 'ఉపనిషల్ల తికా' (ఉపనిషత్ + లతికా - ఉపనిషల్లతికా) ఉపనిషత్ = ఉపనిషత్తనెడి, లతికా = తీఁగకు, కుసుమమునకున్ = పుష్పమయిన, కొల్లాపురి లక్ష్మికిన్ = కొల్లాపురము నందు వేంచేసియున్న శ్రీ మహాలక్ష్మికి, ప్రణమిల్లిరి = ప్రణామములు చేసిరి.

తాత్పర్యము:- భార్యాభర్తలైన లోపాముద్రాగస్త్యులు తమశరీరముల నుండి పులకలు మొలకలెత్తునట్లుగా, "హ్రీం" కార మంత్రమేయనెడి యుపనిష ద్వల్లికిఁ గుసుమమైన కొల్లాపురీ లక్ష్మికిఁ బ్రణామములు చేసిరి.

వ: అనంతరంబ కుంభసంభవుం డాత్మగతంబున. 40

అర్థము :- అనంతరంబి = వెనువెంటనే, కుంభసంభవుండు = అగస్త్య మహర్షి, ఆత్మగతంబునన్ = మనోగతముగా.

తాత్పర్యము:- ప్రణామానంతరము మహర్షి మనస్సులో నిట్లు దల పోసెను.

సీ. క్షీరోదకన్యకు శ్రీమహాలక్ష్మికిఁ
గమలాయతాక్షికిఁ గంబుకంఠి
కఖిల లోకేశ్వరి కామ్నాయ వినుతకుఁ
గనక కేతక పుష్ప గర్భగౌరి
కరుణా ధరోష్ఠికి నమర కోటి కిరీట
కోటి విటంక సంఘూట ఘటిత
రత్నాంకుర ప్రభా రాజి నీరాజిత
శ్రీపాదపద్మ పీఠోపకంఠ

తే॥గీ॥ కంబురుహా నాభు దేవికి నాదిశ క్తి
కిందిరకు లోకమాతకు నిగురు బోఁడి
కలరు విల్కాని తల్లికి నాశ్రితార్థ
కల్పవల్లికి ప్రొక్కంగఁ గంటి మంటి. 41

అర్థము :- 'క్షీరోదకన్యకున్' క్షీరోద=క్షీర సముద్రము యొక్క. కన్యకున్= కుమారికకు, శ్రీమహాలక్ష్మికిన్ = శ్రీమహాలక్ష్మికిని. 'కమలాయతాక్షికిన్' కమల= పద్మములవలె, ఆయత = విశాలములైన. అక్షికిన్ = కన్నులు గలదానికిఁ. 'కంబు కంఠికిన్' కంబు=శంఖమువంటి, కంఠికిన్=కంఠముగలదానికి, 'అఖిలలోకేశ్వరికిన్' అఖిలలోక=అశేషలోకములకును, ఈశ్వరికిన్=నియామకురాలైన దానికి, 'ఆమ్నాయవినుతకున్' ఆమ్నాయ = వేదములచేత, వినుతకున్ = నుతింపఁబడినదానికి. 'కనకకేతకపుష్పగర్భగౌరికిన్' కనకకేతక పుష్ప = పసిఁడిగేదఁగి పువ్వుయొక్క, గర్భ = లోపలిభాగమువలె, గౌరికిన్ = పచ్చని వన్నెకలదానికి. 'అరుణాధరోష్ఠికిన్' అరుణ = ఎఱ్ఱని, అధరోష్ఠికిన్ = క్రిందిమీఁది పెదవులుగలదానికి. "అమరకోటి .... ఉపకంఠకున్" అమరకోటి = దేవతాకోటులయొక్క, కిరీటకోటి = కిరీటశ్రేణులయొక్క, విటంక=కొనగలయొక్క, సంఘూట = అగ్రిములయందు, ఘటిత = కూర్పఁబడిన, రత్నాంకుర = రత్నపుమొలకలయొక్క, ప్రభారాజి =

కాంతిశ్రేణులచేత, నీరాజిత = నివ్వాళలెత్తఁబడిన, శ్రీ = శోభాయుక్తమైన, పాద పద్మపీఠ = పాదపద్మములు నిలిపెడు పీఠమొక్క, ఉపకంఠకున్ = సమీపభూమి కలదానికి, అంబురుహనాభు = కమలనాభునియొక్క, దేవికిన్ = పట్టపుదేవికి, ఆదిశక్తికిన్ = ఆదిశక్తికి, ఇందిరకున్ = ఇందిరాదేవికి, లోకమాతకున్ = లోక జననికి, ఇగురుబోఁడికిన్=పల్లవగాత్రికి, అలరువిల్కానితల్లికిన్ = మరునితల్లికి, "ఆశ్రితార్థకల్పవల్లికిన్" ఆశ్రిత = ఆశ్రితులయొక్క, అర్థ = అర్థప్రయోజనము లకు, కల్పవల్లికిన్ = కల్పలతయైన దానికి, మ్రొక్కఁగగంటిన్ = ప్రణమిల్లి భాగ్యమును గంటిని, మంటిని = బ్రదికితిని.

తాత్పర్యము :- క్షీరాబ్ధికన్యకు, శ్రీమహాలక్ష్మికి, కమలాయతాక్షికి, కంబు కంఠికి, అఖిలలోకేశ్వరికి, ఆమ్నాయవినుతకు, కనకకేతక పుష్పగర్భవర్ణకు, అరుణా ధరోష్ఠికి, అమరకోటి కిరీట రత్నాంకురకాంతిరాజి నీరాజిత పాదపీఠకు, కమల నాభుని పట్టపుదేవికి, ఆదిశక్తికి, ఇందిరాదేవికి, లోకమాతకు, మన్మథునిఁ గన్న తల్లికి, ఆశ్రితకల్పవల్లికిఁ బ్రణమిల్లెడి భాగ్యమును గంటిని. కృతార్థుఁడనైతిని.

వ. అని యనంతరంబ. 42

అర్థము :- అని = అని పలికి అనంతరంబ = వెంటనే.

తే. చంద్రముఖియందు జ్యోత్స్నపు చంద్రవదన!
ప్రభవు వాసరకరునందుఁ బద్మనయన!
దాహశక్తివి పూబోఁడి! దహనునందు
మ్రొక్కెదను నీకుఁ గల్యాణమూర్తి! లక్ష్మి! 43

అర్థము :- చంద్రవదన ! చంద్రుని పోలికగల ముఖము గలదానా!, చంద్ర ముఖియందున్ = చంద్రముసునియందు, జ్యోత్స్నవు = వెన్నెలవు, పద్మనయన!= పద్మములవంటి కన్నులు గలదానా!, వాసరకరునందున్ = సూర్యునియందు, ప్రభవు = ప్రభాస్వరూపిణివి, పూబోఁడి!= పుష్పమువంటి శరీరము గలదానా!, దహనునందున్ = అగ్నియందు, దాహశక్తివి = దహించెడి శక్తివి, కల్యాణ మూర్తి! = శుభమూర్తీ!, లక్ష్మి!=లక్ష్మీ!, నీకున్ = నీకు, మ్రొక్కెదను = ప్రణమిల్లెదను.

తాత్పర్యము :- నీవు చంద్రునియందు వెన్నెలవు. సూర్యునియందు ప్రభవు. దహనునియందలి దాహశక్తివి. కల్యాణమూర్తి! లక్ష్మి! నీకు మ్రొక్కెదను.

తే. బ్రహ్మపుట్టించు మనుచు నారాయణుండు
హరుఁడు హరియించు భువనంబు లవసరమున
నెందు సమకూరు వీరికి నీప్రభావ
మీవు కలుగంగఁబట్టి కాకిందువదన! 44

అర్థము :- బ్రహ్మ = బ్రహ్మదేవుఁడు, పుట్టించును = సృష్టించును. నారాయణుండు = విష్ణువు. మనుచున్ = పరిపాలించును. అవసరమునన్ = సమయమునందు, భువనములు = లోకములను. హరుఁడు = రుద్రుఁడు, సమయించును = సంహరించును, వీరికిన్ = ఈ మువ్వురకును. ఈ ప్రభావంబు = ఈ సామర్థ్యము. ఈవుకలుగంగబట్టికాక = నీవుండుటనుబట్టికాని (లేనిచో), ఇందువదన! = ఓ చంద్ర వదనా!, ఎందు సమకూరున్ = ఎచ్చట సమకూరును?

తాత్పర్యము :- బ్రహ్మ సృష్టించుచున్నట్లు, విష్ణువు పరిపాలించుచున్నట్లు, లయసమయమునందు రుద్రుఁడు సమయించుచున్నట్లు కనిపించుచున్నది. వాస్తవము నకు అన్నింటికి నీవున్నావు కనుక! నీవే లేనినాఁడు వీరికి సామర్థ్యము ఎచ్చట నుండి రాఁగలదు? ఓ చంద్రవదనా!

ఉ. పండితుఁ డాతఁడాతఁడు ప్రభావసమగ్రుఁ డతండు శూరుఁడా
తండు వివేకి యాతఁడు వదాన్యుడతండు మహాకులీనుఁడా
తండు కళావిదుండతఁడు ధన్యుడతండు మనోజ్ఞమూర్తి, యె
వ్వండు భవత్కృపాకలన వైభవలక్ష్మికిఁ బాత్రుఁడింది రా! 45

అర్థము :- ఇందిరా! = ఓ పరమైశ్వర్యస్వరూపిణీ!, ఎవ్వండు=ఎవ్వఁడు, 'భవత్... లక్ష్మికిన్' భవత్ = నీయొక్క, కృపా = కృపయొక్క. కలన = విలసనమే యనెడి, వైభవలక్ష్మికిన్ = వైభవాతిశయమునకు. పాత్రుఁడు = పాత్ర భూతుఁడో, ఆతఁడు = అట్టివాఁడే, పండితుఁడు = పండితుఁడు, ఆతఁడు = అతఁడు, ప్రభావసమగ్రుఁడు = సమగ్రమైన ప్రభావము గలవాఁడు, అతండు = వాఁడు, శూరుఁడు = శౌర్యశాలి, ఆతండు = అతఁడు, వివేకి = వివేకముగల

వాఁడు, ఆతఁడు=అతఁడు, వదాన్యుఁడు = దాత, అతండు = అతఁడు, మహా కులీనుఁడు = గొప్ప కులమునందు పుట్టినవాఁడు, ఆతండు=అతఁడు, కళావిదుండు= చతుష్షష్టి కళలను దెలిసినవాఁడు, అతండు = అతఁడు, ధన్యుఁడు = ధన్యుఁడు. కృతార్థుఁడు, అతండు = అతఁడు, మనోజ్ఞమూర్తి = మనోహరమైన యాకారము గలవాఁడు.

తాత్పర్యము :- ఓ పరమైశ్వర్య స్వరూపిణీ! నీ కృపావిలసనమున కెవ్వఁడు పాత్రభూతుఁడగుచున్నాఁడో, వాఁడు పండితుఁడగుచున్నాఁడు. వాఁడు ప్రభావసమగ్రుఁడగుచున్నాఁడు. వాఁడు శూరుఁడగుచున్నాఁడు. వాఁడు వివేకి యగుచున్నాఁడు. వాఁడు దాత యగుచున్నాఁడు. వాఁడు కులీనుఁడగుచున్నాఁడు. వాఁడు కళావేత్త యగుచున్నాఁడు. వాఁడు ధన్యుఁడగుచున్నాడు. వాఁడు మనోజ్ఞాకారుఁడగుచున్నాఁడు.

విశేషము :- నీ కళలే సమస్త సృష్టిని విభూతిమంతమును, గొంతి మంతమును, సమృద్ధిమంతమును జేయుచున్నవి. త్రిమూర్తులయందును, చంద్ర సూర్యాగ్నులయందును, నీప్రభావ మేవిధముగా అభివ్యాప్తమై యున్నదో ఆవిధముగనే సృష్టిజీవులయందు అనేక కళలతో అది అభివ్యక్తమగుచున్నది.

చ. పురుషునియందు భాగ్యమును బొల్తుకయందు విలాసరేఖయున్
గరిహరులందుఁ బక్షిభుజంగములయందు మహీరుహావళీ
హరిత తృణంబులందుఁ బసులందును బెయ్యలయందుఁ, గుక్కలం
దరుదగు పెంపునొప్పు భవదంశమకాదె! తలంప నిందిరా! 46

అర్థము :- పురుషునియందున్ = మగవానియందు, భాగ్యమును = అదృష్టమును, పొల్తుకయందున్ = ఆడుదానియందు, విలాసరేఖయున్ = రేఖగా అభివ్యక్తమగుచున్న విలాసమును, గరిహరులందున్ = గజాశ్వములయందును, పక్షి భుజంగములయందున్ = పక్షులయందు, పాములయందు, 'మహీరుహావళీహరిత తృణంబులందున్' మహీరుహావళీ = వృక్షశ్రేణులయందు, హరిత = ఆకుపచ్చని, తృణంబులందున్ = తృణాంకురములందును, పసులందును = పశువులయందును, పెయ్యలయందున్ = పెయ్యదూడలయందు, కుక్కలంచున్ = శ్వానములయందును, అరుదగు = అసాధారణమైన, పెంపున్ = పుష్టియును, ఒప్పున్ = అందమును,

తలంపన్ = విచారింపఁగా, ఇందిరా ! = ఓ సమృద్ధిరూపిణీ !, 'భవదంశమె కాదె?' భవత్ = నీయొక్క, అంశమకాదె ? = అంశమేకదా !

తాత్పర్యము :- మగవానియందలి భాగ్యలక్షణము నీయంశము; ఆతడాని యందలి విలాసలక్షణము నీయంశము: కరితురగములయందు, పక్షివ్యాళముల యందు భాసించు విశిష్టలక్షణములు నీయంశము; చెట్లు, చేమలు, పచ్చికబీళ్ళు, పళువులు, పెయ్యలు, కుక్కలు-వీనియందు ఒక్కొక్కదానిలో అసాధారణమై గోచరించునట్టి పెంపు సొంపులన్నియును విచారించి చూడఁగా నీయంశలేకాని అన్యములు కావు.

ఉ. ఎవ్వనినేని నీవు దయ నించుకఁజూచిన; వానిఁజూతు ర
ప్పువ్విలుకానిఁ గాసతులు, భూపతిగాఁ బ్రజ, కల్పకంబుగా
నవ్విబుధాశ్రితప్రతతి, యంబుధిగాఁ గులగోత్రగోత్రముల్
కవ్వడిఁగాఁ బరద్విషులు కర్ణునిఁగాఁ గవులెల్ల, శ్రీసతీ! 47

అర్థము :- శ్రీసతీ! = ఓ శ్రీదేవీ !, నీవు = నీవు. ఎవ్వనినేనిన్ = ఎవనినైనను, దయన్ = దయతో, ఇంచుకన్ = కొంచెముగా, చూచినన్ = చూచినచో, వానిన్ = వానిని, సతులు = స్త్రీలు, అప్పువ్విలుకానిఁగాన్ = ఆ మన్మథునిఁగా, చూతురు = చూచెదరు. ప్రజ = ప్రజలు, భూపతిఁగా = రాజునుగా, చూతురు. అవ్విబుధాశ్రితప్రతతి = ఆ పండిత సంఘము, ఆశ్రితవర్గము. కల్పకంబుగాన్ = కల్పవృక్షమునుగా, చూతురు. కులగోత్రగోత్రముల్ = కులపర్వత సంఘము. అంబుధిఁగాన్ = సముద్రునిఁగా, చూతురు. పరద్విషులు = ఇతరులైన శత్రువులు. కవ్వడిఁగాన్ = అర్జునునిగా, చూతురు, కవులెల్లన్ = కవులందఱును, కర్ణునిఁగా= రాధేయునిఁగా, చూతురు.

తాత్పర్యము :- సుగమము.

విశేషము :- ఏదో ప్రాస్తావిక పద్యమును దీనిలోఁ ప్రక్షిప్తము చేసినట్లు తోఁచుచున్నది. సూచనగానైన దీనికి మూలము లేదు.

ఆ.వె. కమలనయన! నీవు కలచోటు సరసంబు
నీవులేని చోటు నీరసంబు

కంబుకంఠి! నీవు కలవాఁడు కలవాఁడు
లేనివాఁడు నీవు లేనివాఁడు. 48

అర్థము :- కమలనయన ! = కమలలోచదా !, నీవు కలచోటు = నీవున్న చోటు, సరసంబు = రసవంతము, నీవు లేనిచోటు = నీవు లేని తావు, నీరసంబు= రసవిహీనము. కంబుకంఠి ! = శంఖమువంటి కంఠము గలదానా! 'కలవాఁడు'= 'కలవాఁడు' అన్న మాటకు నీవు (లక్ష్మి) కలవాఁడని. 'లేనివాఁడు' = 'లేనివాఁడు' అన్న మాటకు. నీవు (లక్ష్మి) లేనివాఁడు = నీవు లేనివాఁడని యర్థము.

తాత్పర్యము :- లోకములో నీవున్నచోటు సరసము. నీవు లేనిచోటు నీరసము. 'కలవాఁడు' అను శబ్దమునకు నీవు కలవాఁడు అని 'లేనివాఁడు' అను శబ్దమునకు. నీవు లేనివాఁడని అర్థములు.

సీ॥ పరిపూర్ణ హేమకుంభములు హస్తంబుల
ధరియించి యిరువంక గరులు కొలువఁ
బగళ్ళమై (బలఁగమై?) వరశంఖపద్మ మహాపద్మ
మకరాది నిధులు నేమమునఁ గొలువఁ
వింజామరలు దాల్చి వెనుకదిక్కున దేవ
గంధర్వ గుహ్యకాంగనలు కొలువ
నెలవంక బలువంక నింద్రాది దివిజులు
సేవాంజలులు మోళిఁ జేర్చి కొలువ

తే. భర్మపంకజ కర్ణికా భద్రపీఠి
కాగ్రమున నిండుకొలువుండి యఖిలలోక
రక్షణము సేయు నిన్నేను బ్రస్తుతించు
నసమసౌభాగ్యగుణధన్య ! యబ్ధికన్య ! 49

అర్థము :- 'అసమసౌభాగ్యగుణధన్య' అసమ = సాటిలేని, సౌభాగ్యగుణ ! = ఆకర్షకమైన- ప్రలోభనీయమైన గుణముచేత, ధన్య ! = ధన్యురాలవైన, అబ్ధికన్య ! = ఓ సముద్రుని కూఁతురా! 'పరిపూర్ణహేమకుంభములు' పరిపూర్ణ = సలిలపరిపూర్ణము

లైన, హేమకుంభములు = బంగారు బిందియలు, హస్తములన్ = తొండములతో, తాల్చి = ధరించి, ఇరువంకన్ = రెండు ప్రక్కలను, కరులు = ఏనుఁగులు, కొలువన్ = సేవింపఁగా. బిగళమై = 'పాయు', 'తొలఁగు' అను హెచ్చరికలు చేయునట్టి పరివారమై. 'వరశంఖ, పద్మ, మహాపద్మ, మకరాది నిధులు. వర = శ్రేష్ఠములైన, 'శంఖ' = శంఖ మను పేరుగల, 'పద్మ' = పద్మ మను పేరుగల, 'మహాపద్మ' = మహాపద్మ మను పేరుగల, 'మకరా'ది = మకర మను పేరుగల దియు మొదలైన, నిధులు = నవనిధులు, నేమమునన్ = నియమముతో, కొలువన్ = సేవింపఁగా, వింజామరలు దాల్చి = వింజామరలు ధరించి, వెనుకదిక్కునన్ = వెనుక భాగమునందు, 'దేవగంధర్వ గుహ్యకాంగనలు' దేవ = దేవతలయొక్క, గంధర్వ = గంధర్వులయొక్క, గుహ్యక = గుహ్యకులయొక్క, (కుబేరుని నవనిధులలో అధిక్యతులు గుహ్యకులు). అంగనలు = స్త్రీలు, కొలువన్ = సేవింపఁగా, ఎలవంకన్ = (ఎల్లవంకన్ ?) ఎల్లదిక్కులయందును-ప్రాక్, దక్షిణ, పశ్చిమ, ఉత్తర దిక్కులయందును), పలువంకన్ = విదిక్కులయందును, ఇంద్రాది దివిజులు = ఇంద్రు డు మొదలైన దేవతలు, సేవాంజలులు = సేవారూపమైన దోసిలులు, మౌళిన్ = తమ శిరస్సునందు, చేర్చి = చేరిచి, కొలువన్ = సేవింపఁగా, 'భర్మ.... అగ్రమునన్' భర్మపంకజ = బంగారు తామరపూవుయొక్క, కర్ణికా = దుద్దే యనెడి, భద్రపీఠికా = సింహాసనమునయొక్క, అగ్రమునన్ = అగ్రమునందు, నిండుకొలువుండి = నిండుసభ దీర్చి. 'అఖిల లోకరక్షణము' అఖిలలోక = అశేష లోకముల యొక్క, రక్షణము సేయు = రక్షణకార్యమును నిర్వర్తించుచున్న, నిన్ను = నిన్ను, ఏను = నేను, ప్రస్తుతింతున్ = స్తోత్రము చేయుదును.

తాత్పర్యము:- అసమాన సౌభాగ్య గుణధన్యురాలవైన ఓ యబ్ధికన్యా: సలిలపరిపూర్ణములైన స్వర్ణకలశములను తొండములతో ధరించి యిరువైపుల నిలిచి యేనుఁగులు సేవించుచుండఁగా; మూర్తిమంతములై శంఖ, పద్మ, మహాపద్మ, మకరాది నిధులు సమ్మర్దము జడియుచు పరిజనమువలె బిగళము సేయుచుండఁగా: వింజామరలు దాల్చి వెనుకదిక్కున దేవ, గంధర్వ, గుహ్యకాంగనలు సేవించుచుండఁగా, అన్నివైపులను-ఇంద్రాది దేవతలు ఔదలలపై సేవాంజలులు నిలిపి సేవించుచుండఁగా: బంగారు తామరపూవు దుద్దు సింహాసనముపై నధిష్ఠించి సకల భువన రక్షణము సేయు నిన్ను నేను ప్రస్తుతించెదను.

వ॥ పరమార్థవస్తు విచారంబు చేయవచ్చిన శక్తిమంతుఁడైన
యీశ్వరునకు శక్తియగు నీకు భేదంబులేదు గావున శక్తి
యుక్తుఁడయిన యీశ్వరునకుఁ గల సృష్టి, స్థితి, సంహృతి,
తిరోభావానుగ్రహ రూపంబులయిన కృత్యంబు లయిదును
నీయవి; దహనునకు దాహశక్తియు నుష్ణాంశునకు దీధితియుఁ
జంద్రునకుఁ జంద్రికయునుంబోలె నీశ్వరునకు నీవు సహజవు,
ధ్రువవునై యుండుదువు. ఇహ జన్మజన్మాంతరంబుల విహి
తంబులైన వ్రత దానాదులచేత సంచితంబులైన దురితంబులు
నిరసింపఁబడుటంజేసి యస్త రజస్తమస్తనులైన యుత్తములు
విశుద్ధసత్త్వాలయి నీ తత్త్వంబుఁ జింతింతురు. భోగాపవర్గలక్ష
ణంబైన ఫలంబు పరమేశ్వరుండు పశుగణంబున కిచ్చునపుడు
నిన్ను మున్నిడికొనికాని యీఁజాలఁడు. శబ్దబ్రహ్మంబు కారణ
బిందాత్మకంబై బిందు నిష్పందత్వంబునకుం బురుడేచ్ఛా
ప్రయత్నంబున మూలాధారావస్థిత పవన సంఘుక్షణంబునం
జేసి యభివ్యక్తంబై పరావాక్కనంబడు. ఆ బ్రహ్మంబు
నాభిపర్యంతంబు, ఆ వాయువుచేత నభివ్యజ్యమానంబై వివర్త
రూపంబైన మనంబుతోడంగూడి సామాన్య స్పందప్రకాశ
రూపిణియుఁ గార్యబిందు తత్త్వాత్మకయు నిశ్వరాధిదేవతయునై
పశ్యంతీవాక్కనంబడు. ఆ బ్రహ్మం బా వాయువుచేత హృదయ
పర్యంతం బభివ్యజ్యమానంబై నిశ్చయాత్మకబుద్ధియుక్తంబై
విశేష స్పందరూపయు నాదబిందుమయియు హిరణ్యగర్భాధి
దేవతయునై మధ్యమవాక్కనంబడు. ఆ బ్రహ్మంబాస్యపర్యం
తం బా వాయువుచేతన కంఠాదిస్థానంబుల నభివ్యజ్యమానంబై
అకారాది ఱకారాంత వర్ణమాలారూపంబై నిశ్చయాత్మయై
శ్రోత్రగ్రహణయోగ్యంబై వైఖరీవాక్కనంబడు. ఈ చతు
ర్విధ నూక్ష్మ స్థూల మాతృకా స్వరూప విట్టిదేవీ! నీకు
నమస్కారంబు.

అర్థము :- 'పరమార్థనస్తు విచారంబున్' పరమార్థ = పరమార్థభూతమైన, వస్తు = వస్తువుయొక్క, విచారంబున్ = విమర్శమును. చేయవచ్చినన్ = చేయఁబూనినచో, శక్తిమంతుండయిన = 'శక్తి'గల, ఈశ్వరునకున్ = ఈశ్వరునకును, శక్తియగు = శక్తియైన, నీకున్ = నీకును. భేదంబు = 'వేఱు'తనము, లేదుగావునన్ = లేదుగనుక, శక్తియుక్తుఁడయిన = 'శక్తి'తోఁగూడిన, ఈశ్వరునకుఁగల= ఈశ్వరునకున్న, 'సృష్టి....అనుగ్రహరూపంబులైన' సృష్టి = పుట్టించుట, స్థితి = పాలించుట, సంహృతి = చంపుట, తిరోభావ = కనుపడనీయకుండుట, అనుగ్రహ = కైకొనుటయను, రూపంబులైన = రూపములుగల. కృత్యంబులు = పనులు, ఐదును = అయిదును, నీయవి = నీకు సంబంధించినవి. దహనునకున్ = అగ్నికి, దాహశక్తియున్ = దహించు శక్తియును, ఉష్ణాంశునకున్ = వేఁడి కిరణములు గలవానికి-సూర్యునకు, దీధితియును = తేజస్సును-ప్రభయును, చంద్రునకున్ = చంద్రునకు, చంద్రికయుంబోలె = వెన్నెలవలె, ఈశ్వరునకున్ = ఈశ్వరునకు, నీవు = నీవు, సహజవు = నిసర్గసిద్ధవు, ధ్రువవు = తొలఁగనిదానివియును, అయియుండుదు = అయియుందువు. ఇహజన్మ = యిచ్చటి జన్మయందును, జన్మాంతరంబులన్ = వేఱుజన్మలయందును, విహితంబులైన = ఆచరింపఁబడిన, 'వ్రతదానాదులచేతన్' వ్రత = వ్రతములు-దానములు, ఆదులచేతన్ = మొదలైనవానిచేత, సంచితంబులైన = అనేక జన్మలనుండి ప్రోగుచేసుకొనఁబడిన, దురితంబులు = పాపములు, నిరసింపంబడుటంజేసి = తొలఁగింపఁబడుటవలన, 'అస్తరజస్తమస్తనులైన' అస్త = అస్తమించిన, రజః = రజోగుణమునకు, తమః = తమోగుణమునకు సంబంధించిన, తనులైన = శరీరములుకలవారైన, ఉత్తములు = మేలిరకపు జీవులు. విశుద్ధ = రజస్తమస్సులతో సంకీర్ణముకాని, సత్వులయి = సత్వగుణము కలవారై, నీతత్త్వంబున్ = నీతత్త్వమును. చింతింతురు = ధ్యానింతురు. భోగాపవర్గలక్షణంబయిన = భోగస్వరూపము, మోక్షస్వరూపమునైన, ఫలంబున్ = కర్మఫలమును, పరమేశ్వరుండు = పరమేశ్వరుఁడు, పశుగణంబునకున్ = జీవగణమునకు, ఇచ్చునపుడు = ఇచ్చు సమయమునందు, నిన్ను మున్నిడికొనికాని = నిన్ను ముందుంచికొనికాని, ఈఁజాలండు = ఇచ్చుటకు సమర్థుఁడు కాడు. శబ్దబ్రహ్మంబు - సర్వవ్యాపకమైన శబ్దబ్రహ్మతత్త్వము. కారణబిందాత్మకంబై = కారణరూపమైన బిందుస్వరూపము కలదియై, నిష్పందత్వంబునన్ = స్పందములేనిదగుటవలన, 'పురుషేచ్ఛాప్రయత్నంబునన్'

పురుష = పురుషు యొక్క, ఇచ్ఛా = సంకల్పరూపమైన, ప్రయత్నంబునన్ = ప్రయత్నముచేత, 'మూలాధారావస్థిత పవన సంధుక్షణంబునంజేసి' మూలాధార = మూలాధారచ కమునందు. అవస్థిత=ఉన్న. పవన = గాలియొక్క, సంధుక్షణంబునంజేసి = ఎగసనఁద్రోయుటచేత, అభివ్యక్తంబై = అభివ్యక్తి పొందినదై, పరావాక్కు = పరావాక్కని. అనంబడున్ = వ్యవహరింపఁబడును. ఆ బ్రహ్మంబు= ఆ శబ్దబ్రహ్మము. నాభిపర్యంతంబు = నాభిస్థానమువఱకు. ఆ వాయువుచేతన్ = ఆ మూలాధారస్థితమైన వాయువుచేత, అభివ్యజ్యమానంబై = అభివ్యకిపొందింపఁబడుచున్నదై, వివర్శరూపంబైన = వివర్శరూపమైన, మనంబుతోడఁగూడి = మనస్సుతో కలిసి, సామాన్య స్పందప్రకాశరూపిణియున్ = సామాన్య స్పందముతోఁగూడిన ప్రకాశరూపము కలదియును, కార్యబిందుతత్త్వాత్మికయు = కార్య బిందు తత్త్వస్వరూపిణియును, ఈశ్వరాధిదేవతయునై = ఈశ్వరుఁడు - అధిదేవతగాఁ గలదియునై, 'పశ్యంతీవాక్కు' = పశ్యంతీవాక్కని, అనంబడున్ = వ్యవహరింపఁబడును. ఆ బ్రహ్మంబు = ఆ శబ్దబ్రహ్మము, ఆ వాయువుచేతన్ = ఆ వాయువుచేతనే, అభివ్యజ్యమానంబై = అభివ్యక్తి పొందింపఁబడుచున్నదియై, నిశ్చయాత్మకబుద్ధియుక్తంబై = నిశ్చయాత్మకమైన బుద్ధితోఁ గలసినదియై, విశేష స్పందరూపయున్ = విశేషస్పందమే స్వరూపముగాఁ గలదియును, నాదబిందుమయియును = నాద, బిందు, మయమును, హిరణ్యగర్భాధిదేవతయును = హిరణ్యగర్భుఁడు అధిదేవతగాఁ గలదియునై, మధ్యమావాక్కు = మధ్యమవాక్కని, అనంబడు వ్యవహరింపఁబడును. ఆ బ్రహ్మంబు = ఆ శబ్ద బ్రహ్మము, ఆస్యపర్యంతంబు = ముఖమువఱకు, ఆ వాయువుచేతనే, 'కంఠాదిస్థానంబులన్' కంఠ = కంఠము, ఆది = మొదలైన, స్థానంబులన్ = తాలువులు, ఓష్ఠములు, దంతములు, మూర్ధము మొదలైన ప్రదేశములయందు, అభివ్యజ్యమానంబై = అభివ్యక్తి పొందింపఁబడుచున్నదియై, 'అకారాదిక్షకారాంత' అకారాది = అకారము మొదలు, క్షకారాంత = క్షకారము తుదిగాఁగల, 'వర్ణమాలారూపంబై' వర్ణమాలా = పంచాశద్వర్ణమాలయొక్క, రూపముగలదియై, నిశ్చయాత్మయై = నిశ్చయస్వరూపిణియై, 'శ్రోత్రగ్రహణయోగ్యంబై' శ్రోత్ర = శ్రవణేంద్రియముచేత, గ్రహణ = అందికొనుటకు, యోగ్యంబై = తగినదియై, వైఖరీవాక్కు = వైఖరీవాక్కని, అనంబడు = వ్యవహరింపఁబడును. 'ఈ చతుర్విధ సూక్ష్మ స్థూల మాతృకాస్వరూపవు' ఈ = ఈ, చతుర్విధ = పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరులను నాలుగు విధము

లైన, సూక్ష్మ = సూక్ష్మము, స్థూల = స్థూలమునైన, మాతృక = మాతృకయే, స్వరూపవు = నిజరూపముగాఁగలదానవు, ఇట్టి = ఈవిధమైన, దేవీ ! = ప్రకాశ మానమైన లక్షణము గలదానా !, నీకు నమస్కారంబు = నీకు నమస్కారము.

అవతారిక :- ఈ వచనములోని శాస్త్రవిషయ మంతయును సూతసంహిత లోని శివమాహాత్మ్య ఖండము - ఆయిదవ యధ్యాయము శక్తిపూజాకథన మను దానినుండి, దానికి విద్యారణ్యులు వ్రాసిన 'తాత్పర్య దీపిక' అను వ్యాఖ్యానము నుండియును సంగ్రహింపఁబడినది. సంస్కృత కాశీఖండములో దీని ప్రసక్తి లేశమైనను లేదు.

తాత్పర్యము :- పరమార్థభూతమైన వస్తువుయొక్క కలరూపు విచారణ చేయఁబూనినచో, శక్తిమంతుఁడైన యీశ్వరునకు - శక్తివైన నీకు - వేఱులేదు. కనుక శక్తుఁడైన యీశ్వరునకుఁగల సృష్టి, స్థితి, సంహార, తిరోభావ, అనుగ్రహము లను-అయిదు పనులను నీయవియే. దహనునకు-దాహశక్తియును, సూర్యునకు ప్రభయును, చంద్రునకు వెన్నెలయునువలె-ఈశ్వరునకు నీవు సహజ సిద్ధవును, ధ్రువవునై యుందువు. ఇప్పటి-వెనుకటి-జన్మములలోఁ జేసిన వ్రత, దాన దిసుకృతములచేత-పూర్వసంచితములైన పాపములు తొలఁగిపోవుట వలన రాజస, స్వభావము లస్తమించి శుద్ధసత్త్వులైన యుత్తమ జీవులు నీతత్త్వమును ధ్యానగోచరము చేసికొనఁ గలుగుదురు. పరమేశ్వరుఁడు పశుగణమునకు (జీవులకు) భోగ-అపవర్గ లక్షణమైన ఫలమును నిన్నుముందుపెట్టికొనికాని యీయఁజాలఁడు, శబ్ద బ్రహ్మము కారణ బిందు స్వరూపమై - ఆస్థితిలో నిష్పందమగుట వలన - పురుషుని-ఇచ్ఛారూపమైన ప్రయత్నమువలన మూలాధారమునందున్న వాయువు ఎగసనఁ ద్రోయుటచేత-అభివ్యక్తిపొంది 'పరావా'క్కని వ్యవహరింపఁబడుచున్నది. ఆ శబ్ద బ్రహ్మము - ఆ వాయువుచేత - నాభిప్రదేశమువఱకు అభివ్యక్తి పొందింపఁ బడుచున్నదియై, విమర్శరూపమైన మనస్సుతోఁగలసి, సామాన్యస్పంద మనెడి ప్రకాశము స్వరూపముగాఁ గలదియై, కార్యబిందు తత్త్వాత్మికయును, ఈశ్వరుఁడు-అధిదేవతగాఁగలదియునై 'పశ్యంతీ' వాక్కని వ్యవహరింపఁబడుచున్నది, ఆ శబ్ద బ్రహ్మము - ఆ వాయువుచేత-హృదయమువఱకు-అభివ్యక్తి పొందింపఁబడుచున్నదియై, నిశ్చయాత్మికయైన బుద్ధితోఁ గలసి-విశేషస్పంద రూపమును, నాద, బిందు మయియును, హిరణ్యగర్భుఁడు-అధిదేవతగాఁ గలదియునై, మధ్యమ వాక్కని

వ్యవహరింపఁబడుచున్నది. అ శబ్దబ్రహ్మము ఆ వాయువుచేత_ముఖమువలకు _ కం ఠము మొదలైన స్థానములయందు_అభివ్యక్తి పొందింపఁబడుచున్నదియై అకారము మొదలు ఱకారము తుదిగాఁగల వర్ణమాలారూపమై, నిశ్చయాత్మయై శ్రవణేంద్రియ గ్రహణ యోగ్యమై 'వైఖరీ' వాక్కని వ్యవహరింపఁబడును ఈ నాలుగువిధము లైన సూక్ష్మస్థూల మాతృకలే నిజరూపముగాఁగల దానవు. ఇట్టి దేవీ! నీకు నమస్కారము.

తే॥గీ॥ అని నుతించినఁ బ్రియమంది యబ్ధికన్య
కలశజునిఁ జూచి యిట్లను గారవమున
ననఘ! నీ స్తోత్రమునకు నాయాత్మమెచ్చె
నీవు కోరిన వరమిత్తు నెమ్మిఁగొనుము॥ 51

అర్థము :- అని = ఈ విధముగా, నుతించినన్ = స్తోత్రముచేయఁగా, అబ్ధి కన్య=సముద్రనందనయైన లక్ష్మీదేవి, కలశజునిన్ = అగస్త్యుని, చూచి = చూచి, గారవమునన్ = గౌరవముతో ఇట్లనున్ = ఇట్లు పలుకుచున్నది. అనఘ! = పాప విరహితుఁడా!, నీ స్తోత్రమునకున్ = నీ స్తోత్రమునకు, నా యాత్మ = నా మనస్సు, మెచ్చెన్ = సంతోషించెను, నీవు కోరినవరము = నీవు అభిలషించిన వరమును, ఇత్తున్ = ఇచ్చెదను, నెమ్మిన్ = ప్రీతితో, కొనుము = స్వీకరింపుము.

తాత్పర్యము :- సులభము.

వ: ఇంక రాఁగల యిరువై తొమ్మిదవ ద్వాపరంబున నీవు వ్యాసుండవై వారణాసీపురంబున వేదపురాణ సంహితా ధర్మ శాస్త్రంబులు వక్కాణింపఁగలవాఁడవు. ఇప్పుడొక్కహితంబు సెప్పెదఁ దుంగభద్రాతీరంబునఁ గిష్కింధాచలోపాతంబున స్వామిమలయను కాననంబునం గుమారస్వామి యధివసించి యున్నవాఁడు. నీవాచక్కటి కరిగి యతనివలన వారాణాసీ స్థాన మాహాత్మ్యంబు వినుమని పలికి లోపాముద్రంగనుంగొని యక్కాంతకు ముద్రికా కటకహార కేయూరాదులగు దివ్యా

భరణంబులం బ్రసాదించె. ఇవ్విధంబునం గొల్లాపుర మహా
లక్ష్మీచేతం బ్రసాదంబు వడసి దంపతులు చరితార్థులయి సము
చిత ప్రకారంబున నమ్మహాదేవి వీడ్కొని స్వామి మలకుం
జనువాఁడై కొన్నిపయనంబులరిగి ముందఱఁ గఠోరమదపరి
ణతి దశావష్టంభ సంరంభ సముజ్జృంభమాణ హేరంబ దశన
కులిశ కఠోరకోటిభిద్యమాన హాటక కటక ఠంకార ఘుట్టిత
తారాంగణంబై చతుర్ద్వారంబులను జతురంతర చతుష్పథ
ద్వారంబుల పోడశగవాక్షంబుల ద్వాత్రింశన్మకర తోరణం
బుల ఒతుష్షష్టి నాట్యకూటంబులను బంచాశ దుత్తర సహస్ర
దీర్ఘికలను శతసహస్ర కోటిలింగంబులను దశసహస్ర కోటిశ క్తు
లనుం గోటి తీర్థంబులను గలిగి వరాహకుండ మల్లికాకుండ
క్షీర కుండాది కుండంబులచేతను గదళీవన బదరీవన గౌరీవన
బిల్వవనాది ముఖ్యవనంబులచేతను హాటకేశ్వర గుప్తమా హే
శ్వర, నందిమండల, నివృత్త్యాదులైన దివ్యస్థానంబులచేతను
రససిద్ధి రసాయనసిద్ధి మూలికాసిద్ధి, పాదుకా సిద్ధ్యాదులగు
సిద్ధిక్షేత్రంబులచేతను శోభితంబై దివ్యామృత నిర్మలశ్రీస్వయం
భూ జ్యోతిర్లింగమూర్తి యగు మల్లికార్జున శ్రీ మన్మహా
దేవునకు నిజనివాసంబై దివ్యంబునగు శ్రీశైలంబుఁ జేరవచ్చె
నయ్యవసరంబున. 52

అర్థము:- ఇంకన్ = ఇఁకమీఁదట, రాఁగలి = రానున్న, ఇరువైతొమ్మి
దవ ద్వాపరంబునన్ = ఇరువది తొమ్మిదవ ద్వాపరమునందు, నీవు = నీవు,
వ్యాసుండవై = కృష్ణద్వైపాయనుఁడవై, వారణాసీ పురంబునన్ = వారణాసీపురము
నందు, 'వేద పురాణ సంహితా ధర్మశాస్త్రంబులు' వేద=వేదసంహితలను, పురాణ
సంహితా = పురాణసంహితలను, ధర్మశాస్త్రంబులను = ధర్మశాస్త్రములను, వక్తా
ణింపఁగలవాఁడవు = వాక్రువ్వఁగలవాఁడవు, ఇప్పుడు = ప్రస్తుతము, ఒక్క-
హితంబు = ఒక్కమేలు, చెప్పెదన్ = చెప్పుదును. తుంగభద్రాతీరంబునన్ =

తుంగభద్రానదియొడ్డున, కిష్కింధాచలోపాంతంబునన్ = కిష్కింధాచలము దగ్గఱ, స్వామి మలయకాననంబునన్ = 'స్వామిమల' అను నరణ్యములో, కుమారస్వామి = కుమారస్వామి, అధివసించియున్న వాఁడు = నివసించియున్నాఁడు, నీవాచక్రటికిన్ = నీవాప్రవేశమునకు, అరిగి = వెళ్ళి, అతనివలనన్ = ఆ కుమారస్వామి వలన, "వారాణసీ స్థాన మాహాత్మ్యంబు = వారణాసియొక్క, స్థలమాహాత్మ్యమును, వినుమని పలికి = వినుమనిచెప్పి, లోపాముద్రన్ = లోపాముద్రను, కనుంగొని = చూచి, అక్కాంతకున్ = ఆ కాంతివతికి, 'ముద్రికాకటక కేయూరాదులగు' ముద్రికా = ఉంగరములు, కటక = హస్తాంఘ్రి భూషణములు, హార = హారములు, కేయూర = బాహూపురులు, ఆదులు = మొదలైన, 'దివ్యాభరణంబులు' దివ్య = దివ్యములైన, ఆభరణ బులు = ఆభరణములను, ప్రసాదించెన్ = ప్రసాద చిహ్నములుగా నిచ్చెను. ఇవ్విధంబునన్ = ఈవిధముగా, కొల్లాపురమునందు వేం చేసియున్న మహాలక్ష్మిచేత, ప్రసాదంబు వడసి = ప్రసాదమును పొంది, దంపతులు = భార్యాభర్తలు, చరితార్థులయి = ధన్యులై, సముచిత ప్రకారంబునన్ = తగినరీతిగా, అమ్మహాదేవిన్ = ఆ మహాదేవిని, వీడ్కొని = ఆ మంత్రిణముచేసి. స్వామిమలకున్ = కుమారస్వామి నివాసమునకు, చనువారై = పోవువారై, కొన్ని పయనంబులరిగి = కొన్ని ప్రయాణములుచేసి, ముందఱన్ = ఎదుట. 'కఠోర.... తారాంగణంబై' కఠోర = పరిపూర్ణమైన, మదపరిణతిదశా = మదపరిణామదశ యొక్క. అవష్టంభసంరంభ = గర్వసంరభముచేత, సముజ్జృంభమాణ = విజృంభించుచున్న, హేరంబ = వినాయకునియొక్క. దశన కులిశ = దంతమేయనెడి వజ్రాయుధముయొక్క, కఠోర = కఠినమైన, కోటి = అంచుచేత, భిద్యమాన = బ్రద్దలు చేయఁబడుచున్న హాటక కటక = బంగారు చఱియయొక్క, హాటకకటక = 'హాటక' మనుసంజ్ఞగల శ్రీశైల పర్వతముయొక్క ఒకానొక చఱియ; 'హాటకేశ్వర' మను చఱియ-సాక్షిగణపతి ఆ సమీపములోనే ఉన్నాఁడు, ఠంకార = ఠంకార ధ్వనిచేత, ఘట్టిత = చలువఁబడిన, తారాంగణంబై = నక్షత్రముల వాఁకిలి కల దియై - అంతరిక్షముకలదియై, చతుర్ద్వారంబులను = నాలుగుద్వారములతోను, (త్రిపురాంతకము తూర్పుద్వారము, సిద్ధవటము దక్షిణద్వారము, అలంపురము పడమటి ద్వారము, మాహేశ్వరము - ఉత్తరద్వారము.) చతురంతర (? చతుష్పథ ద్వారంబులన్ = నాలుగు పథద్వారములతో, షోడశగవాక్షంబులన్ = పదునాఱు గవాక్షములతో, ద్వాత్రింశన్మకర తోరణంబులన్ = ముప్పది రెండు

మకర తోరణములతో. చతుష్షష్టినాట్య కూటమ్ములను = అరువదినాలుగు నాట్యకూట ములతోను, పంచాశదుత్తర సహస్రదీర్ఘికలను = పదినూర్లయేబది దీర్ఘికలతోను. శతసహస్రకోటి లింగంబులను = లక్షకోట్లలింగములతోను, దశసహస్ర కోటిశక్తు లను = పదివేలకోట్లశక్తులతోను, కోటితీర్థంబులను = కోటితీర్థములతోను. తోను. కలిగి = సంయుతమై. 'వరాహకుండ. మల్లికాకుండ. క్షీరకుండాది కుండంబులచేతను' వరాహకుండ = వరాహకుండము, మల్లికాకుండ = మల్లికా కుండము, క్షీరకుండాది = క్షీరకుండము మొదలైన, కుండంబులచేతను = కుండ ములచేతను. 'కదళీవన, బదరీపన. గౌరీతన. బిల్వవనాది ముఖ్యవనంబులచేతను' కదళీవన = కదళీవనము, బదరీవన = బదరీవనము, గౌరీవన = గౌరీవనము. బిల్వ వనాది = బిల్వవనము మొదలైన. ముఖ్యవనంబులచేతను = ప్రధానవనములచేతను. 'హాటకేశ్వర. గుప్తమాహేశ్వర, నంది మండల నివృత్త్యాదులయిన దివ్యస్థానం బుల చేతను' హాటకేశ్వర = 'హాటకేశ్వర'ము. గుప్తమాహేశ్వర = 'గుప్తమా హేశ్వర ము. నందిమండల = 'నంది మండల'ము. నివృత్యాది = (నివృత్తి + ఆది) 'నివృత్తి' మొదలైన. దివ్యస్థానంబులచేతను = దివ్యస్థానములచేతను, 'రస సిద్ధి. మూలికాసిద్ధి, పాదుకాసిద్ధ్యాదులగు సిద్ధిక్షేత్రంబులచేతను' రససిద్ధి = రససిద్ధి. రసాయనసిద్ధి = రసాయనసిద్ధి. మూలికాసిద్ధి = మూలికాసిద్ధి, పాదుకాసిద్ధి=పాదుకా సిద్ధి. ఆదులైన = మొదలైన. సిద్ధిక్షేత్రంబులచేతను = సిద్ధిక్షేత్రములచేతను. శోభి తంబై = ప్రకాశింపఁ చేయఁబడినదై. 'దివ్యామృత నిర్మల శ్రీ స్వయంభూజ్యోతి ర్లింగమూర్తి యగు మల్లికార్జున శ్రీమన్మహాదేవునకున్' దివ్య = దివ్యము. ఆమృత = అమృత స్వరూపము. నిర్మల = స్వచ్ఛమునైన. శ్రీ = కైవల్యలక్ష్మి నంపన్నమైన. స్వయంభూ = తనంతట నావిర్భవించిన. జ్యోతిర్లింగమూర్తి యగు = జ్యోతిర్లింగాకారుఁడైన. మల్లికార్జున = మల్లికార్జునుఁ డనెడి. శ్రీమన్మహాదేవున కున్=శ్రీమహాదివ్యంబు దేవునకు. నిజవాసంబై = నిజస్థానమై. అభిరామంబై = సుందరమై.నగు = దివ్యమునగు. శ్రీశైలంబున్ = శ్రీశైలమును. చేరవచ్చెను= డాయవచ్చెను, అయ్యవసరంబునన్ = ఆ సమయమునందు.

అవతారిక :- మూలములో శ్రీశైల సందర్శనము ప్రస్తావనామాత్రమై లోపాముద్ర సంప్రశ్నమునకు నిమిత్తమాత్రముగా నున్నది. ఈవి స్తరమంతయును శ్రీనాథుఁడు చేసినది.

తాత్పర్యము :- ఇట మీఁదట రానున్న యిరువది తొమ్మిదవ ద్వాపరము నందు నీవు వ్యానుఁడవై వారణాసి యందు వేదపురాణ సంహితా ధర్మశాస్త్రములను

వ్యాఖ్యానింపఁగలవు. ఇప్పుడొకమేలు చెప్పెదను.తుంగభద్రాతీరమునందు కిష్కింధా చలముదగ్గఱ 'స్వామిమల' అను వనమును_ఆధివసించి కుమారస్వామియున్నాఁడు. నీ వచ్చటికి వెళ్ళి - ఆయన వలన వారణాసీస్నానమాహాత్మ్యమును వినుము; అని పలికి _ లోపాముద్ర వంకఁ జూచి - ఆమెకు_ఉంగరములు, బంగరుటందెలు, గాజులు, హారములు, బాహుపురులు, మొదలైన దివ్యాభరణములను ప్రసాదించెను. ఈరీతిని కొల్లాపురీ మహాలక్ష్మి యనుగ్రహమును బడసి ఆ దంపతులు కృతార్థులై సముచితరీతిగా ఆ మహాదేవిని వీడుకొని, స్వామిమలకుఁ బోవువారై కొన్ని మజిలీలుచేసి - ఎట్ట యెదుట శ్రీశైల మహాపర్వతమును జూచిరి. ఆ శ్రీశైలవైభవమిట్లున్నది. సాక్షి విఘ్నేశ్వరస్వామి వజ్రాయుధమువంటి తన ఏకదంతముతో_ఆకొండ 'హాటక'మను చఱియను బద్దలు కొట్టుచుండగా - ఆ తంకారధ్వనులతో ఆకాశము ప్రతిధ్వనించుచుండెను. ఆ మహాశైలమునకు నాలుగుద్వారములు. తూర్పు వాఁకిలి త్రిపురాంతకము. దక్షిణపువాఁకిలి సిద్ధవటము. పడమటి వాకిలి బ్రహ్మేశ్వరము (అలంపురము) ఉత్తరపువాఁకిలి మాహేశ్వరము. పక్షిద్వారములునాల్గు గవాక్షములు పదహారు. మకరతోరణములు ముప్పదిరెండు. నాట్యకూటములు అరువది నాలుగు. దీర్ఘికలు వేయుననేఁబది. లింగములు నూఱువేలకోట్లు, శక్తులు పదివేల కోట్లు, తీర్థములు కోటి. పరాహకుండము మల్లికాకుండము క్షీరకుండము మొదలైన కుండములనేకములు. కదళీవనము, బదరీవనము, గౌరీవనము, బిల్వవనము మొదలైనవి ప్రధానవనములు. హాటకేశ్వరము, గుప్తమాహేశ్వరము, నందిమండలము, నివృత్తి, మొదలైన దివ్యస్థానములు పెక్కులు. రససిద్ధి, రసాయనసిద్ధి, మూలికాసిద్ధి, పాదుకాసిద్ధి, మున్నగు సిద్ధిస్థానములు - అసంఖ్యాకములు. ఆ పర్వతము దివ్యామృత నిర్మల శ్రీస్వయంభూజ్యోతిర్లింగమూర్తియగు మల్లికార్జున శ్రీమన్మహాదేవునకు నిజనివాసము. అట్టి శ్రీశైలమును ఆ మునిదంపతులు డాయఁబోవుచుండఁగా;

మ. పరిరంభం బొనరించెఁ గుంభభవునిం మత్తాళగంగాంబు ని
ష్ఝర కల్లోల ఘటా పృషద్వ్యతికర ప్రాలేయముల్ హాటకే
శ్వర జటీకృత మాల్యకేసర రజస్సారభ్య నంపన్నముల్
కరి వక్త్రాభరణాహి పీత పరిముక్తంబుల్ వనీ వాయువుల్. 53

అర్థము :- కుంభభవునిన్ = కుంభసంభవుఁడైన,అగస్త్య మహాముని ని, 'పాతాళగంగాంబు .... వ్యతికరప్రాలేయముల్' పాతాళగంగా = పాతాళగంగా నదియొక్క. అంబు నిర్ఝర=జల ప్రవాహముల యందలి. కల్లోల = మహాతరంగ ములయొక్క. ఘటా = సమూహములకు సంబంధించిన. పృషత్ = బిందువుల యొక్క, వ్యతికర = సంసర్గముచేత, ప్రాలేయముల్ = చల్లనివియును, 'హాట కేశ్వర ..... సంపన్నముల్' హాటకేశ్వర = హాటకేశ్వరునియొక్క, జూటీకృత= జటాజూటియందు-అమర్పఁబడిన, మాల్య = పూవుదండలయొక్క. కేసర=కేసర ములకు సంబంధించిన, రజః = పుప్పొడులయొక్క, సౌరభ్య = సౌరభ్యములతో, సంపన్నముల్ = నిండినవియును, కరివక్త్రాభరణ .... పరిముక్తంబుల్' కరి వక్త్రా = గజాననునియొక్క. ఆభరణ = నగలైన, అహి = సర్పములచేత,పీత= ఆస్వాదింపఁబడినవియును, పరిముక్తంబుల్ = విడువఁబడినవియునైన, వనీవాయు వుల్ = అడవిగాలులు, పరిరంభం బొనరించెన్ = కౌఁగిలించికొనెను,

తాత్పర్యము:- పాతాళగంగాజలప్రవాహమునందలి పెద్ద యలల గుంపుల నుండి చిందిపడుచున్న జల, లవములచేత చలువలూఱుచున్నవియును, హాటకేశ్వర జటాజూటాగ్రమునందలి పుష్పమాలలకేసరములలోని పుప్పొడుల సౌరభములతో సంపన్నములైనవియును, సాక్షి విఘ్నేశ్వరస్వామియొక్క- అభరణములైనపాముల చేతఁ గ్రోలి విడువఁబడినవియునైన యడవిగాలులు కుంభసంభవునిఁ బరిరంభణము చేసికొనెను,

విశేషములు:- శ్రీశైలముచేరఁ బోవునపుడు కొండలోయలలోనుండిముందు పాతాళగంగయునుఁ బిమ్మట హాటకేశ్వరమును - ఆ పిమ్మట సాక్షిగణపతియును గనిపింతురు, ఇచ్చటి వనీవాయువుల విశేషణములు - ఆక్రమమును సూచించు చున్నవి.

శా. ఆ మిత్రావరుణాంశ సంభవుని వింధ్యాటోపవిధ్వంసి, లో
పాముద్రాసహితుం గనుంగొనిరి యుత్పన్న ప్రమోదంబునన్
వ్యామగ్రీహ్య పయోధరల్ కుటిల నీలాగ్రాలకల్ తధ్యమి
ధ్యామధ్య స్థిత మధ్య లాటవిక సేనాధీశసీమంతినుల్ ॥ 54

అర్థము :- 'వింధ్యాటోప విధ్వంసిన్' వింధ్య = వింధ్యపర్వతముయొక్క, ఆటోప = వేగిరపాటును. గర్వమును, విధ్వంసిన్ = ధ్వంసముచేసిన వానిని, లోపాముద్రాసహితున్ = లోపాముద్రతో గూడికొనిన, ఆ మిత్రావరుణాంశసంభవునిన్ = మిత్రావరుణదేవతలయొక్క - అంశమువలన బుట్టిన ఆ యగస్త్య మహాముని, 'వ్యామగ్రాహ్యపయోధరల్' వ్యామ = బారలచేత, గ్రాహ్య = పట్టదగిన, పయోధరన్ = స్తనభరముగలవారును, 'కుటిల నీలాగ్రాలకల్' కుటిల = నొక్కులుదేటినవియును, నీల = నల్లని, అగ్ర = కొనలుగల, అలకల్ = ముంగురులు గలవారును, "తథ్య మిథ్యా మధ్య స్థిత మథ్యలు' తథ్య మిథ్యా = తథ్యమిథ్యలకు (అస్తినాస్తులకు-కలుగుటకు-లేకుండుటకు) మథ్యస్థిత = వడిమిదశలోనున్న, మధ్యలు = నడుములుగల. "ఆటవికసేనాధీశసీమంతినుల్', ఆటవికసేనాధీశ = కోయదొరలయొక్క, సీమంతినుల్ = స్త్రీలు, 'ఉత్పన్నప్రమోదంబునన్' ఉత్పన్న = ఉదయించిన, ప్రమోదంబునన్ = సంతోషముతో, కనుంగొనిరి = చూచిరి.

తాత్పర్యము:- చెంచుజాతులకు నెలవైన ఆ శ్రీశైలమహారణ్య వీథులలో లోకోత్తరసౌందర్య నిధానమైన రాజనందనలోపాముద్రాదేవిని వెంటబెట్టుకొని నడచి వచ్చుచున్న, ఆ మహామునిని వింధ్యగర్వాపహారిని, మిత్రావరుణ దేవతాంశ సంభవుని కుంభసంభవుని - చెంచెతలు కౌతుహలముతో నివ్వెరవోయిచూచుచుండిరి. ఆ చెంచు సానులెట్టివారనగా: బారలతో-పట్టదగిన స్తనభారములుగలవారు. నొక్కులు నొక్కులు దేటిన నల్లని ముంగురులుగలవారు. కలవా: లేవా: అన్న సందేహమునకు నడుమనున్న నెన్నడుములుగలవారు. వారు-ఆటవిక సేనాధీశ్వరులయొక్క రాణివాసములవారు

విశేషము :- 'వ్యామగ్రాహ్యపయోధరల్' అన్నపదబంధము మీది మక్కువతో శ్రీనాథుడీ పద్యమును రచించెను. తాను వల్లభమంత్రిపేర వెలయించిన క్రీడాభిరామములో దీనిని బాహాటముగా-ఉపయోగించినాడు తనకు మక్కువయైన యొక్కొక్కపదబంధమును జొప్పించుటకై యొక్కొక్క పద్యమును వ్రాయుచుండుట ఈయన లక్షణము. ఇంతకు - ఈపదబంధము శ్రీనాథుని 'సొంతము' కాదు. మురారి అనర్ఘ రాఘవమునుండి తెచ్చినది.

'తీర్త్వాభూతేశ మౌళిస్రజ మమరధునీ మాత్మనాసౌ తృతీయః
తస్మై సౌమిత్రి మైత్రీమయ ముపహృతవానాతరం నావికాయ

వ్యామగ్రాహ్యాస్తనీభిః శబర యువతిభిః కౌతుకోదంచదక్షం
కృచ్ఛ్రాదన్వీయమానః క్షణమచల మధోచిత్రకూటం ప్రతస్థే'.

అనర్ఘ రాఘవమ్-అంకం 5. శ్లో. 2

సీ॥ వాతాపి దమనుండు పాతాళగంగయం
దఘమర్షణ స్నాన మాచరించె
హాట కేశ్వర దేవు నారగ్వధంబుల
నర్చించె వింధ్య దర్పాపహారి
గగనర్షి పృషభుండు కంఠీరవాననుు
వైకుంఠబిల మధ్యవాసుఁ గొలిచె
నేకాంత రామేశు నిందు శేఖరుని ద
ర్శించె నీవార ముష్టింపచుండు

తే. కూర్మ రంభోరువును దానుఁ గుంభ భవుఁడు
కుంభినీధర దుహిత్ర వక్షోజ శాత
కుంభకుంభికా పరిరంభణోంభితాత్మ్న
శంభు శ్రీమల్లికార్జును సంభజించె. 55

అర్థము :- వాతాపిదమనుండు = 'వాతాపి' అను రాక్షసుని దమించిన మహాముని. పాతాళగంగయందున్ = పాతాళ గంగానదియందు. అఘమర్షణ స్నానము = అఘమర్షణ స్నానమును. (పాపములను పోగొట్టు సమంత్రకమైన స్నానములు) యథావిధిగ నాచరించెను. 'వింధ్యదర్పాపహారి' వింధ్య = వింధ్య పర్వతముయొక్క, దర్పాపహారి = గర్వము నపహరించిన ఋషి, ఆరగ్వధంబులన్= ఆరగ్వధ కుసుమములతో - రేల పూవులతో, హాటకేశ్వరదేవున్ = హాటకేశ్వర దేవుని, అర్చించెన్ = పూజించెను. 'గగనర్షి వృషభుండు' గగనర్షి = ఆకాశమున నక్షత్రరూపములో నున్న ఋషులలో, వృషభుండు = శ్రేష్ఠుఁడైన అగస్త్యుఁడు, 'వైకుంఠబిలమధ్యవాసున్' వైకుంఠబిల = వైకుంఠగుహయొక్క. మధ్యవాసన్= మధ్యనివాసుఁడైన, కంఠీరవాననున్ = సింహముఖము గలవానిని - నరసింహ స్వామిని, కొలిచెన్ = సేవించెను. నీవారముష్టింపచుఁడు = పిడికెడు నివ్వరివడ్లు

వండికొని తినువాఁడు (వన్యాహారమును దినువాఁడు) ముని, ఏకాంతరామేశున్ = ఏకాంతరామేశ్వరుఁడను, ఇందుశేఖరుని = శివుని, దర్శించెన్ = దర్శనము చేసెను. కూర్మిరంభోరువును దానున్ = ప్రియభార్యయైన లోపాముద్రయును దానును (రంభా + ఊరువు-రంభోరువు). అరటిస్తంభములవంటి తొడలుగల స్త్రీ). కుంభభవుఁడు = అగస్త్యమహాముని, 'కుంభినీధరదుహిత్య....ఉంభితాత్మున్' కుంభినీధర = భూమిని ధరించిన హిమవంతునియొక్క (కుంభిని = భూమి, కుంభినీధరము-కొండ), దుహిత్య = కుమార్తెయైన పార్వతీదేవియొక్క, వక్షోజ = స్తనములేయనెడి, శాతకుంభకుంభికా = స్వర్ణకుంభములయొక్క, పరిరంభణ = కౌగిలించికొనుటచేత, ఉంభిత = పరిపూర్ణమైన, ఆత్మున్ = స్వరూపముగల, శంభున్ = శంభుఁడైన శ్రీ మల్లికార్జునదేవుని, సంభజించెన్ = సంసేవించెను.

తాత్పర్యము :- వాతాపిదమనుఁడు పాతాళగంగలో అఘమర్షణ స్నానము చేసెను. అగస్త్యమహర్షి అరగ్వధ కుసుమములతో హాటకేశ్వరదేవు నర్చించెను. దివ్యశ్రీ వైకుంఠగుహానిలయుఁడైన నరసింహస్వామిని సేవించెను. నీవారముష్టింపమఁడు-ఏకాంతరామేశ్వరునిఁ గొలిచెను. లోపాముద్రయును దానును పార్వతీపరిరంభ పరిపూర్ణహృదయుఁడైన శంభుని శ్రీ మల్లికార్జునస్వామిని సంసేవించెను

మహాప్రసిద్ధ :-

యము హ్మల్లేఖాది మ త్రాభ్యసన నిరతుఁడై యాగమో క్తప్రకార
క్రమయుక్తిం గంధపుష్పాక్షితదళముల శ్రీకంఠ నర్థాంగలక్ష్మిన్
భమరాంబాదేవి నంతర్భ్రమర ఫలభర ప్రహ్వాత్రి పుణ్య
శ్రమవాటీ హేమసింహాసన విలసదధిష్ఠాన నర్చించినిష్ఠన్. 56

అర్థము :- యమి = సంయమవంతుఁడైన యగస్త్యుఁడు (యమము కలవాఁడు-యమి-సంయమి), హ్మల్లేఖాది = 'హ్రీం'కారాదులైన, మంత్ర = మంత్రములయొక్క, అభ్యసన = అభ్యాసమునందు, నిరతుఁడై = ఆసక్తికలవాఁడై, ఆగమోక్తప్రకార క్రమయుక్తిన్' ఆగము = శాస్త్రాగమములచేత, ఉక్త = చెప్పఁబడిన ప్రకారక్రమయుక్తిన్ = పద్ధతియొక్క క్రమము ననుసరించి, గంధ పుష్పాక్షిత దళములన్ = గంధము, పుష్పములు, ఆక్షితలు, దళములతో, శ్రీకంఠునర్థాంగలక్ష్మిన్ = శివునియొక్క అర్థాంగలక్ష్మియైన, భ్రమరాంబాదేవిన్ = భ్రమరాంబా

దేవిని. 'అంతర్భ్రమర .... విలసదధిష్ఠానన్' అంతర్భ్రమర = లెంకలోపల తుమ్మెద లలుగల, ఫల = తుమ్మెద మామిడిపండ్లయొక్క. భర = బరువుచేత, ప్రహ్వా = వంగిన. చూతద్రు = చూతద్రుములుగల - మామిడిచెట్లుగల, పుణ్యాశ్రమవాటీ = పుణ్యాశ్రమవాటిక యందలి, హేమసింహాసన = బంగారు సింహాసనమే యనెడి, విలసత్ = ప్రకాశించుచున్న, అధిష్ఠానన్ = అధిష్ఠానముగలదానిని, నిష్ఠన్ = నిష్ఠతో, కొలిచెన్ = సేవించెను.

తాత్పర్యము :- అగస్త్య సంయమీంద్రుడు - హ్రీంకారాది మంత్రాభ్యాస పరాయణుడై. శాక్తాగమోక్త ప్రకారముగా గంధ. పుష్ప. అక్షత, దళములతో - లెంకలోపల తుమ్మెదలుగల - తుమ్మెద మామిడిపండ్లబిరువుతో వ్రాలిన మామిడిచెట్లుగల పుణ్యాశ్రమ వాటికయందలి హేమ సింహాసనమునందధిష్ఠించియున్న శివుని యర్ధాంగలక్ష్మియైన భ్రమరాంబాలేవిని నిష్ఠతోసమర్చనచేసెను.

తే॥గీ॥ చెలువనయును దాను నారీతి బిలసహస్ర
మార్గ శాఖోపశాఖల మాని వరు డు
విధుకిరీటులఁ బూజిం చె వెదకి వెదకి
యమృతమయలి గమూర్తుల నధికభ క్తి॥ 57

అర్థము :- మౌనివరుఁడు = మౌనిశ్రేష్ఠుఁడైన యగస్త్యుఁడు. చెలువయుఁ దానున్ = భార్యయు, దానును, ఆరీతిన్ = ఆరీతిగా, 'బిలసహస్రమార్గశాఖోపశాఖలన్' బిలసహస్రము = గుహాసహస్రములయొక్క, మార్గ = తోవలయొక్క, శాఖోపశాఖలన్ = చిలకలపలవలయందు. అమృతమయ లింగమూర్తులన్ = అమృతలింగాకారులైన, విధుకిరీటులన్ = చంద్రకిరీటులను, వెదకి వెదకి = అన్వేషించి యన్వేషించి, అధికభక్తిన్ = మిక్కిలి భక్తితో, పూజించెను.

తాత్పర్యము: - ఆ రీతిగా భార్యయుఁ దానును గుహలకు వెళ్ళు చిలవలు పలవలునైన తోవలలో - అమృతమయ లింగమూర్తులైన చంద్రకిరీటులను వెదకి వెదకి - అధిక భక్తితో-అగస్త్యమహర్షి పూజించెను.

వ: వెండియు నయ్యిల్వలమథనుండు యథావిధి మభూకకుండంబు
నం గ్రుంకె. పంచాక్షరీ మంత్ర సిద్ధుండు పంచధారాపల్లధార

లను నిర్ఝ్ఝరప్రవాహంబులఁ గృతావగాహావగాహనుండయ్యె. పాటలజటాకిరీటుండు హాటకకూట శిరఃశృంగ శృంగాటకా ఘాటంబునఁ గోటిలింగంబులన్ భజించె. లోపాముద్రాధిపతి యదిృకటక భద్రాసనంబున సమున్నద్ధ ప్రతాప ముద్రా విద్రావితాక్షుద్రోపద్రవుండగు నుద్యాన వీరభద్రు భద్ధ్ర శ్రీద్రవహరిద్రాక్షితంబుల భద్రదారుద్రు పారిభద్ర ద్రుమ స్తారకంబుల నారాధించె. బ్రహ్మ పాదారవింద ద్వంద్వంబు హరిచందన చర్చా మచర్చికల నర్చించె. సిద్ధతాపస మూర్ధా భిషిక్తుండు ఘంటా సిద్ధేశ్వరుని వలన మంత్రసిద్ధి వడసె. మహా భాగుండు భోగవతీ తీరంబున భోగేశ్వరు భోగాపవర్గప్రదు భుజంగభూషణు భూషించె. నీవారముష్టింప కామేశ్వరు నకుం బటిష్ఠ నిష్ఠా విశేషంబులందుష్టిఁగావించె. భువనగోప్త సప్తమాత్మికలఁ దలంచె. నహుషదమనుండు ముషిత సకల కలుషంబగు కదళీవన విషమ భువి విగమభషక పరిషదనుగత వృషభగమనుం గపట శబర వటు నచల దుహిత్ృ పరివృఢు నశశమతిఁ గొలిచె. అనంతరంబ యొక్క వివిక్త ప్రదేశం బున సుఖాసీనుండై.

58

అర్థము :- వెండియున్ = మఱియును, అయ్యిల్వల మథనుండు=ఆ యిల్వ లాసుర సంహారి, యథావిధిన్ = శాస్త్రప్రకారముగా, మధూకకుండంబునన్ = మధూకకుండమునందు, కుర్ృంకెన్ = మునుకపెట్టెను, పంచాక్షరీమంత్రసిద్ధుండు= పంచాక్షరీమంత్ృము సిద్ధించినమువి, పంచధారాపల్లవరలను = పంచధార, పాలధార లనెడి, నిర్ఝర ప్ృవాహంబులన్ = సెలయేటి ప్రవాహములయందు, 'కృతావగా హుండు' కృత = చేయఁబడిన, అవగాహుండు = స్నానముగలవాఁడు, అయ్యెన్ = అయ్యెను, 'పాటల జటాకిరీటుండు' పాటల = శ్వేతరక్తవర్ణమైన, జటా = జడ లేయనెడి, కిరీటుండు = కిరీటముగలవాఁడు, 'హాటకకూట .... ఆఘాటంబు నన్' హాటకకూట = 'హాటక' మనుపేరుగల సానువుయొక్క, శిరఃశృంగ = చిటారు కొమ్మలయొక్క, శృంగాటక = చౌకములయొక్క, ఆ ఘాటంబునన్ =

మేర యందు. కోటిలింగంబులన్ = కోటిసంఖ్యాకములైన లింగములను, భజిం చెన్ = సేవించెను, లోపాముద్రాధిపతి = లోపాముద్రభర్త. 'అద్రికటక భద్రా సనంబునన్' అద్రికటక = కొండచరియే యనెడి, భద్రాసనంబునన్ సింహాసనము నందు, 'సమున్నిద్ర.... వీరభద్రున్ సమున్నిద్ర = మిక్కిలి వికసించిన, ప్రతాప ముద్రా ప్రతాపముద్రచేత. విద్రావిత=పాఱద్రోలఁబడిన. అక్షుద్ర = గొప్పవియైన. ఉపద్రవుండగు=ఉపద్రవములుగలవాఁడైన. ఉద్యానవీరభద్రున్=ఆరామవీరభద్రుని. భద్రశ్రీ ద్రవ = మంచిగంధపు నీటితోను, హరిద్రాక్షతంబులన్ =పసపు అక్షతలతో. భద్రదారుద్రు=దేవదారు ద్రుమములయొక్క, క్షీరకంబులన్=మొగ్గలతో. ఆరాధిం చెన్=పూజించెను. బ్రహ్మర్షి=బ్రహ్మర్షి. 'బ్రహ్మపాదారవింద ద్వంద్వంబు' బ్రహ్మ= బ్రహ్మయొక్క. పాదారవింద=పాదపద్మములయొక్క. ద్వంద్వంబు=జంటను. హరి చందన=హరిచందనమునొక్క చర్చామచర్చికలన్=మేలిపూఁతలతో. అర్చించెన్= అర్చించెను. 'సిద్ధతాపసమూర్ధాభిషిక్తుండు' సిద్ధతాపస = సిద్ధతాపసులలో. మూర్ధాభి షిక్తుండు = పట్టాభిషిక్తుఁడు, ఘంటాసిద్ధేశ్వరునివలనన్ = ఘంటాసిద్ధేశ్వరునివలన. మంత్రసిద్ధి వడసె = మంత్రసిద్ధిని పొందెను. మహాభాగుండు = మహాభాగుఁడు. భోగవతీ తీరంబునన్ = భోగవతీ తీరమునందు, భోగేశ్వరున్ = భోగేశ్వరుఁడనెడి, భోగాపవర్గప్రదున్ = భోగమోక్షప్రదాతయైన, భుజంగభూషణున్=నాగభూషణుని. భజించెన్ = సేవించెను. నీవారమృష్టింపచుండు = ముని. ఇష్టకామేశ్వరునకున్ = ఇష్టకామేశ్వరునకు. 'పటిష్ఠనిష్ఠావిశేషంబులన్' పటిష్ఠ = మిక్కిలి దృఢమైన, నిష్ఠా విశేషంబులన్ = విశేషనిష్ఠలతో. తుష్టిఁగావించెన్ = పరితుష్టికలిగించెను. భువన గోప్త = లోకసంరక్షకుఁడు. సప్తమాతృకలన్ = సప్తమాతృకలను. తలంచెన్= ధ్యానించెను. నహుషదమనుండు = నహుషుని శిక్షించినవాఁడు. కదళీవన విషమ భువిన్ = కదళీవనమునందలి నిమ్నోన్నత ప్రదేశమునందు. నిగమభక్షక=వేదములే యనెడు కుక్కలయొక్క. పరిషత్ = గుంపుచేత, అనుగత = అనుసరింపఁబడిన. వృషభగమనున్ = వృషభవాహనుని, కపట శబరవటు = మాయా కిరాత బ్రహ్మ చారిని, అచలదుహితృ = పర్వతకన్యయొక్క. పరివృఢున్ = పతియైన శివుని. అశఠమతిన్ = కపటముకాని బుద్ధితో. కొలిచెన్ = సేవించెను. అనంతరంబ = పిమ్మట. ఒక్క వివిక్తప్రదేశంబునన్ = ఏకాంతప్రదేశమునందు, సుఖాసీనుండై = సుఖముగాఁ గూర్చున్నవాఁడై -

తాత్పర్యము :- శ్రీశైల క్షేత్రమునందలి ప్రధాన స్థానములు- మధూక కుండము, పాలధార. పంచధారలు, హాటకేశ్వరము, ఆరామవీరభద్రస్థానము. బ్రహ్మ గిరి. ఘంటాపిడ్డేశ్వరము, భోగేశ్వరము, ఇష్టకామేశ్వరము. సప్తమాతృకలు. కదళీ వనము మున్నగువానిని అగస్త్యముని దంపతులు సేవించిరి.

తే. అర్థిఁ గుంభోద్భవుం డిట్టులనియె సతికిఁ
బద్మలోచన! చూడు శ్రీపర్వతంబు
పాయకిందుండు పార్వతీ ప్రాణవిభుఁడు
మల్లికార్జున దేవుండు మదనవైరి. 59

అర్థము :- అర్థిన్ = ప్రీతితో, కుంభోద్భవుండు = అగస్త్యమహాముని, సతికిన్ = భార్యయైన లోపాముద్రకు, ఇట్లనియెన్ = ఇట్లు చెప్పెను. పద్మలోచన! = పద్మనయనా!, శ్రీపర్వతంబు = శ్రీశైలమును, చూడు = చూడుము, పార్వతీ ప్రాణవిభుఁడు = పార్వతికి ప్రాణవల్లభుఁడు, మదనవైరి = మదనాంతకుఁడైన, మల్లికార్జునదేవుండు = మల్లికార్జునస్వామి, పాయక = విడువక, ఇందున్ = ఈ పర్వతమునందు, ఉండున్ = నివసించియుండును.

తాత్పర్యము :- సుగమము.

తే. ధవళలోచన! శ్రీపర్వతంబు మహిమఁ
బ్రస్తుతింపంగ శక్యమే బ్రహ్మకైనఁ
గండశిలలెల్ల శంభులింగంబు లిందు
సిద్ధ మునులిందు వసియించు చెంచులెల్ల. 60

అర్థము :- ధవళలోచన! = ఓసితవిలోచనా!, శ్రీపర్వతంబు మహిమ = శ్రీశైలక్షేత్ర మహాత్త్వము, బ్రహ్మకైనన్ = చతుర్ముఖునికైనను, ప్రస్తుతింపంగన్ = ప్రస్తుతి సేయఁగా, వశమే? = సాధ్యమా? ఇందున్ = ఈ పర్వతమునందు, గండశిలలెల్లన్ = గండశిలలన్నియును, శంభులింగంబులు=శివలింగములు, ఇందు వసియించు చెంచులెల్లన్=ఈ పర్వతమునందు నివసించు చెంచులందఱును, సిద్ధమునులు = సిద్ధులైన మునులు.

తాత్పర్యము :- ఓ ధవళాక్షీ ! శ్రీశైలక్షేత్ర మహిమమును ప్రస్తుతించుట బ్రహ్మకైనను వశముకాదు. ఈ కొండయందలి గండశిల లన్నియును శివలింగములు. ఇచ్చటి చెంచులందఱును సిద్ధమునులు.

కం. చాకున్న నీదు ముక్తులు
శ్రీకాశీక్షేత్ర మెవ్వరికి నిది నిక్కం
బీకుధర మిచ్చు శిఖరా
లోకన మాత్రమున ముక్తులు కురంగాక్షీ ! 61

అర్థము :- కురంగాక్షీ ! = ఓ హరిణలోచనా !, శ్రీకాశీక్షేత్రము = శ్రీకాశీక్షేత్రము, ఎవ్వరికిన్ = ఎవ్వరికిని, చాకున్నన్ = చావకున్నచో, ముక్తులు = మోక్షములను, ఈఁజాలదు = ఈయఁజాలరు, ఇది = ఈ విషయము, నిక్కంబు = ఖాయము, ఈ కుధరము = ఈ శ్రీపర్వతము, శిఖరాలోకనమాత్రమునన్ = శిఖర సందర్శనమాత్రముననే, ముక్తులు = మోక్షములను, ఇచ్చున్ = ఇచ్చును.

తాత్పర్యము :- ఓ మృగాక్షీ ! చావనిదే యెవ్వరికిని కాశీక్షేత్రము ముక్తులనీయదు. ఈ శ్రీశైలము శిఖరసందర్శన మాత్రముననే ఎల్లరకును ముక్తులనిచ్చును.

విశేషములు :- 'కురంగాక్షీ !' కౌ-రంగతి-ఇతి కురంగః. కౌ = భూమియందు, రంగతి = చొకళించునది. నాలుగు కాళ్ళతో ఒకేసారి పైకెగురునది. ఆ రీతిని జీవులు ముక్తిశిఖరముపైకి ఒకేసారిగా నెగురుదురని సాభిప్రాయమైన సంబుద్ధి:

ప. అనియె నప్పుడు లోపాముద్ర ముద్రికామణి మయూఖ రేఖలు
నఖరశిఖరంబులం జిగురులొత్త విద్రుమప్రవాళంబుల యుల్లా
సంబు నుల్లసం బాడెడు పాణిపల్లవంబులు మోడ్చి ఫాల
భాగంబునం గీలించి, వినయ వినమితోత్తమాంగయై యున్నం
గనుంగొని సస్నేహంబును, సబహుమానంబును, సానురాగం
బును, సాభిప్రాయంబును, సమర్మంబును, సవిభ్రమంబును,
సోపాలంభంబునుగాఁ గుంభసంభవుం డమ్మహా దేవి కిట్లనియె. 62

అర్థము :- ఆనియెన్ = అగస్త్య మహర్షి యిట్లు పలికెను. అప్పుడు = ఆసమయమునందు, లోపాముద్ర = లోపాముద్రాదేవి. 'ముద్రికామణిమయూఖ రేఖలు' ముద్రికా - అంగుళీయకములందలి, మణి = మణులయొక్క, మయూఖ రేఖలు = కిరణరేఖలు. నఖరశిఖరంబులన్ = గోటి కొనలయందు, చిగురు లొత్తన్ = చిగురింపఁగా, 'విద్రుమప్రవాళంబులయుల్లాసంబున్' విద్రుమ = పగడ ములయొక్క, ప్రవాళంబుల = చిగురాకులయొక్క, ఉల్లాసంబున్ = నికాసమును. ఉల్లసంబాడెడు = పరిహాసములాడెడు, పాణిపల్లవంబులు = మెత్తని చేతులు, మోడ్చి = ముడిచి ముకుళీభవింపఁజేసి, ఫాలభాగంబునన్ = లలాట పట్టికయందు, కీలించి = కీలుగొలిపి, 'వినయ వినమి తోత్తమాంగయైయున్నన్' వినయ = వినయముచేత, వినమిత = వ్రాల్పఁబడిన, ఉత్తమాంగయై = శిరస్సుకలదియై, ఉన్నన్ = ఉండగా, కనుంగొని = చూచి, సస్నేహంబును = స్నేహపూర్వకము గను, సబహుమానంబును = గౌరవపురస్సరముగను సానురాగంబును = అను రాగసంహితముగను, సాభిప్రాయంబును = అభిప్రాయగర్భితముగను, సవిభ్రమం బును = విలాసయుతముగను, సోపాలంభంబునుంగాన్ = ఎత్తిపొడుపుతోఁచు నట్లుగను, కుంభసంభవుండు = అగస్త్యమహాముని, ఆమ్మహాదేవికిన్ = మహాదేవి యైన యా లోపాముద్రకు, ఇట్లయెన్ = ఇట్లు పలికెను.

తాత్పర్యము :- 'చావనిదే యెవ్వరికిని గాశిముక్తినీయదు. శిఖరదర్శన మాత్రమునసనే శ్రీశైలముముక్తి నెవ్వరికైనిచ్చును.' అను పెనిమిటి మాట విన్నం తనే లోపాముద్రరెండుచేతులు మోడ్చి నొసలిపైఁ గీలుకొలిపి వినయ భరముచేత మోము నొంచి యుండెను. అప్పుడు- స్నేహ, బహుమాన, అనురాగ, అభిప్రాయ, మర్మ, విభ్రమ, ఉపాలంభములు తోఁచునట్లుగా - ఇట్లనెను.

సీ॥ హృదయంబులో సంశయించి నిగూఢార్థ
మిద మిత్థమని నిశ్చయింప లేక
యది తేఁట తెలివిగా నడుగంగఁ దలఁచి, ల
జ్జా సాధ్వసంబులు సందడింప
నవ నవ్రము ముఖపద్మమై యున్న దానవు
ప్రాగల్భ్యసరణి యేర్పడునొ యనుచు

మాటాడనేరని మాఁటినంగవు నీవు
సకల కాలంబునో సరసిజాక్షి!

తే॥గీ॥ కాంత! యేకాంత వేళలఁ గాంతునెదుర
నగుచుఁ దెగడుచు నుండుట తగవుసూవె
వలని సిగ్గున వెఱపునఁ గలసి బెరసి
యుండకుండుట మా బోఁటు లోర్వఁగలరె? 63

అవతారిక :- సరసిజాక్షి! = ఓ సరసిజనయనా!. హృదయంబులోన్ = హృదయమునందు, సంశయించి = సందేహమునుపొంది. నిగూఢార్థము = మిక్కిలి డాఁగియున్న విషయమును. 'ఇద మిత్థ మని' 'ఇదం - ఇది. ఇత్థం- ఈరీతిది' అని = అని, నిశ్చయింపలేక = నిశ్చయజ్ఞానమును పొందలేక. అది = ఆ విషయమును, తేఁటతెలివిగాన్ = తేఁటగాఁ దెలియునట్లు, అడుగంగఁ దలఁచి= అడుగఁ దలంచి, 'లజ్జాసాధ్వసంబులు' లజ్జా = సిగ్గు. సాధ్వసంబులు = వెఱపు, (సిగ్గు వెఱపులు). సందడింపన్ = సందడిపడునట్లుచేయఁగా, 'అవనమ్రముఖ పద్మవై' అవనమ్ర = క్రిందికి వ్రాలిన. ముఖపద్మవై = మోముదామరకలిగి,ఉన్న దానవు = ఉన్నావు, 'ప్రాగల్భ్యసరణి' ప్రాగల్భ్య=ప్రౌఢతనముయొక్క. సరణి= త్రోవ. ఏర్పడునో! = స్పష్టమగునేమో!, అంచున్=తలంచుచు. మాటాడనేరని= మాటాడుట నెఱుఁగని' మాఁటినంగవు = (మాఁటిన+నంగ-మాఁటినంగ) నిగూఢ హృదయవు. నీవు = నీవు, సకలకాలంబున్ = ఎల్లవేళల యందును; (ఎప్పుడు వింతే. యనుట.), కాంత = కామినీ!, ఏకాంత వేళలన్ = ఏకాంతసమయముల యందు, కాంతునెదురన్ = వల్లభుని యెదుట. నగుచున్ = నవ్వుచు. తేగడుచున్= తిరస్కరించుచు-నిందించుచు, ఉండుట = ప్రవర్తించుట. తగవుసూవె = ధర్మము సుమా!, వలని = వలవని-అనవసరమైన. సిగ్గునన్ = సిగ్గుతోను, వెఱపునన్ = భయముతోను. కలసి బెరసి యుండకుండుట = కలసిమెలసియుండకపోవుటను, మా బోఁటులు = మావంటివారు, ఓర్వఁగలరె! = ఓర్చికొనఁ గలరా!

తాత్పర్యము :- కవి వాచ్యముగా నిర్దేశించిన - స్నేహ, బహుమాన అనురాగ, అభిప్రాయ. విభ్రమ. మర్మ, ఉపాలంభములను - పైయగస్త్యుని మాటలలో - అరసికొని - ఊహించునది.

వ॥ అనిన విని లోపాముద్రి మౌనముద్ర దిగద్రావి ముసీంద్రున కిట్లనియె. 64

అర్థము :- అనినన్=వతి యిట్లనఁగా. విని = ఆకర్ణించి, మౌనముద్రిన్= మౌనముద్రను, దిగదార్చివి = దిగవిడిచి, లోపాముద్ర - లోపాముద్రాదేవి, ముసీం ద్రునకున్ = అగస్త్య ముసీంద్రునకు. ఇట్లనియెన్ = ఇట్లుపలికెను.

తాత్పర్యము :- సుగమము.

సీ॥ చతురశీత్యాయామ సంపన్నమై యోజ
నోత్సేధవైభవాభ్యుద్గతమయి
ముప్పది యోజనంబుల వెడల్పునుగల్గి
సార్ధత్రికోటి తీర్థాన్వితమయి
సమధికాష్టాశీతి సాహస్ర సంయమి
జన సమాకులమయి సప్తకోటి
మంత్రాశ్రయంబయి మహనీయ మహిమమ్మై
తనరారు నీపర్వతంబు నందు

తే॥గీ॥ శిఖర మీక్షించు నంతన చేరునట్లె!
ముక్తి జంతువులకు; జీవములు దొరంగఁ
జచ్చినప్పుడుగాని మోక్షంబు లేని
కాశి కరుగంగ నేటికిఁ గాళ్లు జాలి? 65

అర్థము:- 'చతురశీత్యాయామ సంపన్నమై' చతురశీతి = ఎనుబదినాల్గు (యోజనముల), ఆయామ = చుట్టుకొలఁతతో. సంపన్నమై =కూడినదియై. 'యోజ నోత్సేధవైభవాభ్యుద్గతమయి' యోజన = యోజన మాత్రమైన, ఉత్సేధవైభవ = ఎత్తుయొక్క- వైభవముతో, అభ్యుద్గతమయి = పైకి లేచినదై. 'ముప్పదియోజనం బుల వెడల్పును' ముప్పది యోజనంబుల = ముప్పది యామడల. వెడల్పును=అడ్డ కొలఁత. కల్గి = కలిగి. 'సార్ధత్రికోటి తీర్థాన్వితమయి' సార్ధత్రికోటి = మూఁడు కోట్ల యేఁబది లక్షల. తీర్థాన్వితమయి=తీర్థములతో కూడుకొన్నదై' 'సమధిక.... సమాకులమయి' సమధిక=అత్యధికులైన. అష్టాశీతిసాహస్ర = ఎనుబది యెనిమిది

వేల సంఖ్యగల, సంయమిజన = మునిజనములతో, సమాకులమయి = నందడి కలదియై, సప్తకోటి = ఏడుకోట్ల. మంత్రాశ్రయంబయి = మహామంత్రములకు నెలవై, మహనీయ మహిమమై = పూజ్యమహిమ కలదియై, తనరారు = ప్రకాశించునట్టి, ఈ పర్వతంబునందున్ = ఈ శ్రీశైలపర్వతమునందు, శిఖర మీక్షించునంత = శిఖరమును జూచినంతమాత్రనే, చేరునట్టిః = సిద్ధించునటీ:, ముక్తి = మోక్షము:, జంతువులకున్ = శరీరవంతులకు-ప్రాణులకు, జీవములు దొరంగన్ = ప్రాణములు విడిచిపోఁగా, చచ్చినప్పుడుగాని = మరణించినప్పుడుగాని, మోక్షంబు లేని = మోక్షములేని, కాశికిన్ = కాశీక్షేత్రమునకు. అరుగంగ నేటికిన్ = వేళ్ళ నేటికి:, కాళ్ళజాలి = కాళ్ళకు శ్రమ:

తాత్పర్యము:- లోపాముద్రాదేవి అగస్త్యమహాముని ని ట్లడుగుచున్నది- ఎనుబదినాలు గామడలకైవారము, ఒక ఆమడ యెత్తు, ముప్పది యామడల వెడల్పును గలిగి; మూఁడుకోట్ల యేఁబదిలక్షల తీర్థములతో, ఎనుబదియెనిమిదివేల మునీంద్రులతో కిటకిటలాడుచు; ఏడుకోట్ల మహామంత్రములకు నెలవైయున్న ఈ శ్రీశైల పర్వతమునందు శిఖరదర్శన మాత్రముననే జీవులకు ముక్తిసిద్ధించుట ఆశ్చర్యము. ఆ పక్షమున ప్రాణములు పోయినప్పుడుగాని మోక్షములేని కాశీక్షేత్రమునకు వెళ్ళుట దేనికి: కాళ్ళను శ్రమపెట్టుటకా:

వ. మఱికొందఱు కేవల విజ్ఞానంబుఁ బ్రశంసింతురు. కొందఱు విజ్ఞాన సముచ్చితంబైన కర్మంబు సేసింతురు. కొందఱు దానంబులు గొనియాడుదురు. కొందఱు వ్రతంబులు సెప్పుదురు. కొందఱు యజ్ఞంబులు మెత్తురు. కొందఱు తపంబులు గోరుదురు. కొందఱు బ్రహ్మచర్యం బభినందింతురు. కొందఱు గార్హస్థ్యంబుఁ బ్రశంసింతురు. కొందఱు వానప్రస్థాశ్రమంబు మన్నింతురు. కొందఱు సన్న్యాసంబుఁ బ్రసంగింతురు. కొందఱు తీర్థసేవ యావిష్కరింతురు. కొందఱు స్వాధ్యాయంబు నధికరింతురు. కొందఱు శ్రీపర్వతాదు లభ్యర్థింతురు. ఇన్నియు ముక్తిసాధనంబులు. అందులోన సులభంబగు ముక్తిసాధనం బెయ్యది? వినవలతు నానతిమ్ము! సంశయబీజ భూతంబు

లయిన యా విప్రతిపత్తి వచన సహస్రంబులు వినంగ నా
డెందంబు డోలాందోళనంబందుచుండు. 66

అర్థము :- మటికొందఱు = మఱికొందఱు బుద్ధిమంతులు, కేవల విజ్ఞానం బున్ = విజ్ఞానమొక్కటానినే, ప్రశంసింతురు = మేలైనదని యుందురు కొందఱు= వేఱొక కొందఱు, విజ్ఞానసముచ్చితంబైన కర్మంబున్ = విజ్ఞానసహితమైన కర్మ మును, సేవింతురు = భజింతురు, కొందఱు = ఇంక కొందఱు, దానంబులు = దానములను, కొనియాడుదురు = ప్రశంసింతురు, కొందఱు = మఱికొందఱు, వ్రతంబులు = వ్రతాచరణములు, చెప్పుదురు = శ్రేష్ఠములని చెప్పుదురు. కొందఱు= వేఱొక కొందఱు, యజ్ఞంబులు = యజ్ఞములను, మెత్తురు = శ్లాఘింతురు. కొందఱు = మఱికొందఱు, తపంబులు = తపస్సులను, కోరుదురు = అభిలషిం తురు. కొందఱు = కొంతమంది, బ్రహ్మచర్యంబు = బ్రహ్మచర్య వ్రతమును, అభినందింతురు = మెలందురు, కొందఱు = మఱికొంతమంది, గార్హస్థ్యంబు = గృహస్థాశ్రమ ధర్మమును, ప్రశంసింతురు = మెచ్చెదరు. కొందరు = కొంత మంది, వానప్రస్థాశ్రమంబున్ = వానప్రస్థమును, మన్నింతురు = గౌరవింతురు. కొందఱు = కొంతమంది, సన్న్యాసంబున్ = సన్న్యాసాశ్రమమునుగూర్చి, ప్రసం గింతురు = చెప్పెదరు. కొందఱు = కొందఱు, తీర్థసేవన్ = తీర్థసంసేవనమును. ఆవిష్కరింతురు = ప్రకటింతురు. కొందఱు = మఱికొందఱు, స్వాధ్యాయంబున్= వేదాధ్యయనమును, అధికరింతురు = మొదలుపెట్టెదరు. కొందఱు = కొంతమంది. కాశీ శ్రీపర్వతాదులు = కాశి, శ్రీశైలము మొదలైనవానిని, అభ్యర్థింతురు = ప్రార్థిం తురు. ఇన్నియున్ = ఇవియన్నియును, ముక్తిసాధనంబుల = ముక్తిసాధనములే. అందులోనన్ = అందులోఁగూడ, సులభంబగు = సుళువైన. ముక్తిసాధనంబు = మోక్షసాధనము, ఎయ్యది = ఏయది ?, వినవలతున్ = వినఁగోరుదును. ఆనతిమ్ము = సెలవిమ్ము, సంశయబీజభూతంబులైన = సంశయములకు విత్తనములైన, అ = ఆవిధములైన, విప్రతిపత్తి = పరస్పర విరుద్ధములైన, వచన సహస్రంబులు = వాక్యసహస్రములు, వినంగన్ = వినఁగా, నాడెందంబు = నా హృదయము, 'డోలాందోళనంబున్' డోలా = ఉయ్యాలవలె, ఆందోళనంబున్ = ఊగిసను, అందుచుండును = పొందుచుండును.

తాత్పర్యము :- కొందఱు కేవల విజ్ఞానమే మోక్షసాధనమని, మఱికొందఱు

విజ్ఞాన సముచ్చితమైన కర్మమని. వేఱొక కొందఱు దానములని. వ్రతములని. యజ్ఞములని, తపస్సులని, బ్రహ్మచర్యమని, గార్హస్థ్యమని. వానప్రస్థమని. సన్న్యాసమని. తీర్థసంసేవనమని, స్వాధ్యాయమని, కొందఱు కాశీ శ్రీశైలాదులని చెప్పుచున్నారు. ఇన్నియును ముక్తిసాధనములే. వీనిలో సులభమైనదానిని వినవలయునని యున్నది. సంశయ బీజభూతములైన యిన్ని విప్రతిపత్తి వచనములతో నా మనస్సు ఉయ్యాలవలె ముందువెనుకలకు ఊగిసలాడుచున్నవి.

విశేషము :- ఈ విప్రతిపత్తి వచనములన్నియును శ్రీనాథుని పాండిత్య విలసితములు. మూలగ్రంథములో లోపాముద్ర ఇంత మాటాడనేలేదు. ఆమె సూటిగా ఒక్క మాటయే యడిగినది.

'శ్రీశైలశిఖరందృష్ట్వా పునర్జన్మ నవిద్యతే'
ఇదమేవహిసత్యంచేత్ కిమర్థం కాశిరిష్యతే' :

ఇంతవఱకే మూలము. మిగిలినదంతయును శ్రీనాథుఁడు చేసిన విస్తరము.

కం. అని యడిగిన గలశసుతుం
డను మోద రసార్ద్రహృదయుఁడై దేవికి ని
ట్లను, నడుగవలయు నర్థమ
వనజానన! యడిగి తుక్తివైభవ మలరన్. 61

అర్థము :- అని యడిగినన్ = అని యడుగఁగా. కలశసుతుండు=అగస్త్య మహర్షి. 'అనుమోదరసార్ద్రహృదయుఁడై' అనుమోద = అంగీకారముచేతను. రస = అనురాగరసముచేతను, ఆర్ద్ర = తడిసిన, హృదయుఁడై = హృదయము గలవాఁడై, దేవికి నిట్లనున్ = లోపాముద్ర కిట్లనును. వనజానన! = వద్మాననా!. అడుగవలయునర్థమ = అడుగవలసిన విషయమే, ఉక్తివైభవ మలరన్=వాగ్వైభవము ప్రకాశించునట్లుగా. అడిగితివి = అడిగినావు.

తాత్పర్యము :- అని యడిగిన ప్రశ్నమునకు అంగీకార, అనురాగరసములతో ఆర్ద్రహృదయుఁడై అగస్త్యమహాముని ఆమెతో 'అడుగవలసిన విషయమే అడితి'వని అభినందించి ఇట్లు చెప్పుటకు మొదలుపెట్టెను.

— అగస్త్యుఁడు లోపాముద్రకు బాహ్యాభ్యంతర తీర్థమాహాత్మ్యము చెప్పుట —

శా. శ్రీశైలాదులు ముక్తికారణములై చెప్పంబడుం దీర్థముల్;
ప్రాశస్త్యంబును సర్వతీర్థముల కప్రత్యూహమై వర్తిలున్
గాశీప్రాప్తికరంబులైన కతనం గైవల్యలక్ష్మీప్రదముల్
కాశీక్షేత్రము గైకొనుం దరుణి! సాక్షాన్ముక్తి హేతుత్వమున్. 68

అర్థము :- శ్రీశైలాదులు = శ్రీశైలము మొదలైన. తీర్థముల్=తీర్థములు, ముక్తికారణములై = మోక్షకారణములై, చెప్పఁబడున్ = చెప్పఁబడుచున్నవి. సర్వతీర్థములకున్ = అన్నితీర్థములకును. ప్రాశస్త్యంబును = ప్రశస్తికూడ. అప్రత్యూహమై = (ప్రతి + ఊహము–ప్రత్యూహము.) రెండవ యభిప్రాయము లేనిదై, వర్తిలున్ = చెల్లుబడియగును. (ఆ శ్రీశైలాదులు) 'కాశీప్రాప్తి కరంబులైనకతనన్' = కాశీక్షేత్ర ప్రాప్తిని కలిగించుటకు కారణములైనందువల్లనే. కైవల్యలక్ష్మీదముల్=కైవల్య లక్ష్మీప్రదములని చెప్పఁబడినవి. తరుణీ! = ఓ తరుణీ!. కాశీక్షేత్రము=కాశికాక్షేత్రము, సాక్షాన్ముక్తి హేతుత్వమున్ – సాక్షాత్=సాక్షాత్తుగా, ముక్తి హేతుత్వమున్ = ముక్తికిఁ గారణమగుటను. కైకొనున్ = స్వీకరించును.

తాత్పర్యము:- శ్రీశైలాది తీర్థముల వలన ముక్తికలుగునని పురాణములు చెప్పుచున్నవి. అట్లు-ముక్తికారణములని చెప్పఁబడిన సకలతీర్థములయొక్క ప్రశస్తి విషయములో రెండవయూహలేదు. నిస్సంశయముగా ఆవి యన్నియును ముక్తి ప్రదములు; ఎట్లనఁగా వానిని సేవించినందువలన కలిగెడు సుకృతఫలమువల్లనే కాశీప్రాప్తికలుగును. ఇట్లు కాశీప్రాప్తికిఁ గారణములైనందువల్లనే వానిని పురాణములు కైవల్యప్రదములని వర్ణించినవి. అవి కాశీప్రాప్తిద్వారా - పరంపరాసంబంధముచేత ముక్తిప్రదములు. కాశీక్షేత్రము సాక్షాత్తుగా మోక్షకారణము. వాని ముక్తి ప్రదత్వమునకును - కాశియొక్క ముక్తిప్రదత్వమునకునుగల భేదమిది - సాక్షాత్తుగా మోక్షహేతువు కాశి;

వ॥ ప్రయాగ, నైమిశంబు, కురుక్షేత్రంబు, గంగాద్వారంబు, నవంతిక, యయోధ్య, మధుర, ద్వారక, సరస్వతి, సహ్యాంబు, గంగాసాగర సంగమంబు, కాంచి, త్ర్యంబకంబు, సప్తగోదా

వరంబు, కాలంజరంబు, పర్ణాసంబు, బదరికాశ్రమంబు, మహా
లయంబు, ఓంకారంబు, పురుషోత్తమంబు, గోకర్ణంబు, భృగు
తీర్థంబు, ఆంబు పుష్కరంబు, శ్రీపర్వతంబు, నానివి మోక్ష
కారణంబులైన మహాతీర్థంబులు. 69

అర్థము :- ప్రయాగ=త్రివేణీసంగమము, నైమిశంబు = నైమిశారణ్యము. కురుక్షేత్రము = సరస్వతీనది ప్రవహించిన ప్రదేశము. గంగాద్వారము = హిమాలయమునుండి గంగానది దిగినచోటు, అవంతిక = ఉజ్జయిని. అయోధ్య=ఆయోధ్యా నగరము. మధుర = ఉత్తర మధుర. బృందావనప్రాంతము శ్రీకృష్ణజన్మస్థానము. దక్షిణ మధుర=పాండ్యులరాజధాని శ్రీమీనాక్షీ సుందరేశ్వరుల నివాసము, ద్వారక= సముద్రములో విలీనమైనది, సరస్వతి=సరస్వతీనది-అంతఃప్రవాహిని, సహ్యంబు= సహ్యపర్వతము-కృష్ణానది పుట్టిన పర్వతము. గంగా సాగర సంగమము = గంగా నది సముద్రములోఁ గలసినచోటు. కాంచి = కామాక్షీ విలయము. త్ర్యంబికము= నాసికాత్ర్యంబకము - గోదావరి పుట్టినచోటు, సప్తగోదావరము = దక్షారామము. కాలంజరము = ఎక్కడిదో విచారింపవలెను. పర్ణాసము = బదరికాశ్రమము = నరనారాయణులు తపస్సుచేసినచోటు. హిమాలయములలోనిది; మహాలయంబు = ఎక్కడిదోఁ ఓంకారంబు = నర్మదాతీరములోనిది. పురుషోత్తమంబు = పూరీజగన్నాథము, గోకర్ణము = దక్షిణసముద్రతీరములోనిది. భృగుతీర్థము = ఎచ్చటనోఁ అంబు పుష్కరము = ఎచ్చటనోఁ శ్రీపర్వతంబునాన్ = శ్రీశైలమునన౯గా. ఇవి= ఈ చెప్పినవి. మోక్షకారణంబులైన = మోక్షహేతువులైన, మహాతీర్థములు = గొప్ప తీర్థములు.

తాత్పర్యము :- సుగమము.

సీ॥ శంభు ప్రసాదంబు సమకూరకుండిన౯
దీర్థయాత్రికు సమ్మతింపదాత్మ
తీర్థంబు లాడంగ౯ దివుట లేకుండిన౯
బ్రతిబంధ దురితంబు పాసిపోదు
ప్రతిబంధ దురితంబు పాసిపోకుండిన౯
గాశికేగెడి నట్టి కడ౯క లేదు

కాశీపుర క్షేత్ర వాసంబు లేక యే
విజ్ఞాన దీపంబు విస్తరిలదు

తే॥గీ॥ జ్ఞానమునఁగాని మోక్షంబు సంభవింప
దతివ జ్ఞానంబనంగ వేదాంత వాక్య
సంభవంబైన దదియపో జ్ఞానమంద్రు
తరుణి విజ్ఞాన మీసూక్ష్మ మెఱిఁగికొనుము. 70

అర్థము :- శంభు ప్రసాదంబు = శివుని యనుగ్రహము. సమకూరకుండినన్ = సమకూరకపోయినచో. ఆత్మ = మనస్సు. తీర్థయాత్రకున్ = తీర్థయాత్రకు, సమ్మతింపదు = అంగీకరింపదు,

తీర్థంబు లాడంగన్ = తీర్థములయందు మునుఁగుటకు, తివుట = ఆసక్తి. లేకుండినన్ = లేకపోయినచో. 'ప్రతిబంధదురితంబు' ప్రతిబంధ=ప్రతిబంధరూపమైన. దురితంబు = పాపము. పాసిపోదు = తొలఁగిపోదు.

ప్రతిబంధ దురితంబు పాసిపోకుండినన్ = ప్రతిబంధ రూపమైన పాపము తొలఁగిపోవనిచో. 'కాశికేగెడు నట్టి కడఁక' కాశికేగెడునట్టి = కాశికి వెళ్ళునట్టి, కడఁక = ఉత్సాహము, లేదు = సంభవింపదు,

'కాశీపుర క్షేత్రవాసమ్ము లేకయే' కాశీపుర క్షేత్ర = కాశీపురమను క్షేత్రమునందు, వాసమ్ము లేకయే = నివాసములేనిదే. 'విజ్ఞాన దీపంబు' విజ్ఞాన = విజ్ఞానమేయనెడి. దీపంబు = దీపము. విస్తరిలదు = తనకాంతిని విస్తరింపఁ జేయదు.

జ్ఞానమునఁగాని = జ్ఞానమువలనఁగాని, మోక్షంబు = కైవల్యము. సంభవింపదు = సంభవముకాదు, అతివ! = అతివా!, జ్ఞానంబనంగన్ = జ్ఞానమనఁగా. 'వేదాంత వాక్య సంభవంబైనది' వేదాంతవాక్య = ఉపనిషద్వాక్యములచేత, సంభవంబైనది = పుట్టినది, అదియపో = అదియేసుమా!, జ్ఞానము = జ్ఞానము, విజ్ఞానమందు = ఆ జ్ఞానమే విజ్ఞానమనియందురు. తరుణి!=ఓ తరుణీ! ఈ సూక్ష్మము= ఈసూక్ష్మవిషయమును, నెఱిఁగికొనుము = తెలిసికొనుము.

తాత్పర్యము :- శివానుగ్రహము సమకూరని నాఁడు మనస్సులో-తీర్థ యాత్ర చేయవలయుననెడి సంకల్పమేయుదయింపదు, తీర్థయాత్రియందు శ్రద్ధలేని నాఁడు ప్రతిబంధకములైన పాపములు తొలఁగిపోవు ప్రతిబంధకములైన పాప ములు తొలఁగిపోవనినాఁడు కాశికిఁ బోవలయుననన్న యుత్సాహమే పుట్టదు. కాశీ క్షేత్ర నివాసము లేనినాఁడు జ్ఞానదీవము తన కాంతిని విస్తరింపఁజేయదు. జ్ఞానము వలనఁగాని కైవల్యము సంభవింపదు. జ్ఞానమనఁగా ఉపనిషద్వాక్యములచేత సంభ వించునది. దానినే విజ్ఞానమని యందురు. తరుణీ! ఈ సూక్ష్మమును దెలిసికొనుము.

విశేషము :- కారణ మాలాలంకారము. ఉత్తరోత్తరమునకు పూర్వ పూర్వము కారణమగుచుండుట కారణమాలాలంకారము

'గుంఫః కారణమాలాస్యాత్ యథా ప్రాక్ ప్రాంతకారణైః'.

ఈ పద్యమునకుమ క్రింది పద్యమునకును మూలములో నాధారములేదు.

కం. ధారా తీర్థంబనఁగాఁ
దారాధిపవదన! ఖడ్గధారాంచల మ
ద్ధారాంచలమునఁ ద్రెవ్విన
వీరాగ్రేసరుఁడు ముక్తివిభవము గాంచున్. 71

అర్థము :- తారాధిపవదన! = చంద్రవదనా!, ధారాతీర్థంబనగాన్ = ధార తీర్థమనఁగా, ఖడ్గధారాంచలము = కత్తివాదరయొక్క యంచు; అద్ధారాంచలమునన్= ఆ ధారయొక్క యంచునందు, త్రెవ్వినన్ = త్రెగిపోయిన, వీరాగ్రేసరుఁడు = వీరులలో మొదటివాఁడు, ముక్తివిభవమున్ = ముక్తివైభవమును, కాంచున్ = పొందును,

తాత్పర్యము :- కత్తివాదర యంచునకు 'ధారాతీర్థ' మనిపేరు. ఆ, ధారాం చలమునందు తెగిన వీరాగ్రేసరుఁడు ముక్తివైభవమును గాంచును.

తే. తీర్థములు మానసములు ముక్తిప్రదములు
తరుణి! యివి మేలు బాహ్యతీర్థములకంటె
మానవుం డివి యేమఱి మధురవాణి!
బాహ్యతీర్థంబులాడ నిష్ఫలమసూవె. 72

అర్థము :- తీర్థములు మానసములు = మానసములైన తీర్థములు. ముక్తి ప్రదములు = మోక్షప్రదములు. తరుణీ! = ఓ తరుణీ!, ఇవి = ఈ మానస తీర్థములు. బాహ్యతీర్థములకంటె = బాహ్యతీర్థములకంటె, మేలు = శ్రేష్ఠమైనవి. మధురవాణీ! = మధురసరస్వతీ!, ఇవి యేమఱి = వీనియందు ఏమఱుపాటు పహించి. బాహ్యతీర్థంబులాడన్ = వెలుపలి తీర్థములయందు మునుఁగఁగా. నిష్ఫలమునూవె! = ప్రయోజనము లేదునుమా!

తాత్పర్యము :- ఓ తరుణీ! మానసతీర్థములు ముక్తిప్రదములు. బాహ్య తీర్థములకంటె ఇవి మేలు. వీనియం దశ్రద్ధ వహించి మానవుఁడు బాహ్యతీర్థము లాడినచో అది నిష్ఫలము.

సీ॥ తీర్థంబుసత్య, మింద్రియనిగ్రహము తీర్థ,
మనసూయ తీర్థంబు, వనరుహాక్షి!
తీర్థంబు దానంబు, తీర్థంబు సంతోష,
మనుకంప తీర్థంబు, కనకగౌరి!
బ్రహ్మచర్యంబు తీర్థంబు, తీర్థముధృతి,
యమము తీర్థము, విద్రుమాధరోష్ఠి!
సమత తీర్థంబు, విజ్ఞానంబు తీర్థంబు,
పుణ్యంబు తీర్థంబు, పువ్వుబోఁడి!

తే. తీర్థములు మానసంబులు ధీవిశుద్ధి
యతిశయిల్లంగ నివియాడ కాడినట్టి
పంచజనులకుఁ గలహంస పక్షిగమన!
బాహ్యతీర్థావళులు తీర్థఫలము నీవు! 75

అరము :- వనరుహాక్షీ! = పద్మలోచనా!, సత్యము=సత్యము, తీర్థంబు=తీర్థము, ఇంద్రియనిగ్రహము = ఇంద్రియములను ఒడుచుట, తీర్థము = తీర్థము, అనసూయ = అసూయ లేకుండుట, తీర్థంబు = తీర్థము. కనకగౌరి! = బంగారు వంటి శరీరచ్ఛాయకలదానా!, దానంబు = ఈఁగి, తీర్థంబు = తీర్థము, సంతోషము = సంతుష్టి, తీర్థంబు = తీర్థము, అనుకంప = ప్రాణులయందు కనికరము,

తీర్థంబు = తీర్థము, విద్రుమాధరోష్ఠి = పవడములవంటి పెదవులు గలదానా!, బ్రహ్మచర్యంబు = బ్రహ్మచర్యము, తీర్థంబు = తీర్థము, ధృతి = ధైర్యము, తీర్థము = తీర్థము, యమము = నియమము, తీర్థము = తీర్థము, పువ్వుబోఁడిఁ = పువ్వువంటి శరీరముగలదానా!, సమత = సమత్వము, తీర్థంబు = తీర్థము, విజ్ఞానంబు = విజ్ఞానము, తీర్థంబు = తీర్థము, పుణ్యంబు = పుణ్యము, తీర్థంబు = తీర్థము, తీర్థములు మానసంబులు = ఇవి మానసములైన తీర్థములు, ధీవిశుద్ధి = బుద్ధియొక్క, విశుద్ధి = పరిశుద్ధి, అతిశయిల్లంగన్ = పెంపొందునట్లుగా, ఇవి యాడక = ఈ మానస తీర్థములయందు మునుఁగక, ఆఁచినట్టి = మునిఁగినట్టి, బాహ్యతీర్థావలులు = బాహ్యతీర్థములయొక్క వరుసలు, కలహంసపక్షి గమన! = కలహంసయానా!, పంచజనులకున్ = మానవులకు, తీర్థఫలము = తీర్థఫలమును, ఈవు = ఈయవు.

తాత్పర్యము :- సత్యము, ఇంద్రియ నిగ్రహము, అసూయ లేకుండుట, దానము, సంతోషము, భూతదయ బ్రహ్మచర్యము, ధృతి, యమము, సమత, విజ్ఞానము, పుణ్యము-అనునవి మానసములైన తీర్థములు అనఁగా: మనస్సులోపలనే నెలకొనియున్న తీర్థములు. వీనియందు మునుఁగుటకు దూరదేశములకుఁ బోనవసరములేదు. ముందు వీనియందు మునిఁగినచో రజస్సువలన, తమస్సువలన ఏర్పడిన బుద్ధిదోషములు కడిగివేయఁబడి సత్వశుద్ధి యేర్పడును. ఇవి యాడనిదే బాహ్యతీర్థములెన్ని యాడినను నిష్ఫలము. అప తీర్థఫలము నీయవు. ఈ మానసతీర్థము లాడినవానికే బాహ్యతీర్థసేవ ఫలవంతమగును.

చం. బిసరుహపత్రలోచన! కృపీటములందు మునింగియాడవే
మొసళులుమీలు కర్క-టకముల్ కమఠంబులు వానికబ్బనే?
యసదృశమైన తీర్థఫల; మట్టివిధంబు సుమీ! తలంప, మా
నసమగు తీర్థమాడని జనంబులకున్ బహుబాహ్యతీర్థముల్. 74

అర్థము :- 'బిసరుహపత్త్రిలోచన!' బిసరుహ = తామరపూవుయొక్క. పత్త్రి = ఱేకులవంటి, లోచన = కన్నులుగలదానా!, కృపీటములందున్ = జలములయందు, మునింగియాడవే? = మునిఁగియాడవా?, మొసళులు = మొసళ్ళు, మీలు = చేపలు, కర్కటకముల్ = ఎండ్రకాయలు, కమఠంబులు = తాబేళ్ళు,

వానికిన్ = వానికి. అబ్బునే = లభించునా ? 'అసదృశమైన తీర్థఫలము' అసదృశ మైన = సాటిలేని. తీర్థఫలము = తీర్థస్నానఫలము, అట్టివిధంబుసుమీ = అట్టి విధమే యగును సుమా!, 'మానసమగు తీర్థమాడని జనంబులకున్' మానసమగు= మనస్సునకు సంబంధించినదైన. తీర్థము = తీర్థమందు, ఆడనిజనంబులకున్ = మునుఁగనివారికి. 'బహుబాహ్యతీర్థముల్' బహు = అనేకములైన. బాహ్యతీర్థ ముల్ = వెలువలి తీర్థములు.

తాత్పర్యము :- జలరుహదళలోచనా! నీళ్ళలో ఎన్ని మొసళ్ళు. చేపలు, ఎండ్రకాయలు. తాబేళ్ళు మునిఁగియాడుటలేదు! వాని కన్నింటికిని నిరుపమానమైన తీర్థఫలము లభించునా ? ఆ విధముగనే మానసతీర్థముల యందాడక బాహ్యతీర్థము లెన్ని యాడినను జనులకు తీర్థస్నానఫలము లభింపదు.

విశేషములు :- దృష్టాంతాలంకారము.

'చేద్బింబ ప్రతిబింబత్వం దృష్టాంత స్తదలంకృతిః'

'ఇచ్చట మొసళ్ళు. చేపలు మొదలైన జలచరములు నిరంతరమును గంగాది జలాధివాసమే చేయుచున్నను వానికిఁ దీర్థఫల మేరీతిగా లభించుటలేదో'- అన్న బింబమునకు 'మానసతీర్థములాడక బాహ్యతీర్థములయందే మునుకలు పెట్టుచున్న జనములకును తీర్థస్నానఫలము లభింప'దన్న విషయము ప్రతిబింబభూతముగా దృష్టాంతీకరింపఁబడినది. కావున దృష్టాంతము.

తే. సుదతి! యేటికి నంతర్విశుద్ధి లేని
బాహ్యసంశుద్ధి? బహుతీర్థపరిచయమున;
వేయుఁ గడవల జలముల వెలిఁగడిగినఁ
గలుగునే శుద్ధి? వారుణీకలశమునకు? 75

అర్థము :- సుదతి !=శుభలక్షణాన్వితమైన పలువరుసలు గలదానా!, 'బహు తీర్థపరిచయమునన్, బహుతీర్థ = పెక్కు-తీర్థములతోడి. పరిచయమునన్ = సంస ర్గముపలన. 'అంతర్విశుద్ధిలేని బాహ్యసంశుద్ధి' అంతర్విశుద్ధి = అంతఃకరణ విశుద్ధి లేని-చిత్తశుద్ధిలేని. బాహ్యసంశుద్ధి = వెలుపలి సంశుద్ధి-దేహసంశుద్ధి, ఏటికిన్ = ఎందుకుఁ బనికివచ్చును ! (నిష్ప్రయోజనమనుట) వేయుఁగడవల జలమునన్ =

వెయ్యికడవల నీళ్ళతో. వెలిన్ = వెలుపలి భాగమునందు. కడిగినన్ = కడిగినప్పటికిని. వారుణీకలశమునకున్ = కల్లుకుండకు, కలుగునే శుద్ధి? = శుద్ధి కలుగునా?

తాత్పర్యము :- చిత్తశుద్ధిలేని శరీరశుద్ధి నిష్ఫలము. వెలుపలి తీర్థములెన్ని యాడినను మానసతీర్థము లాడనిదే ఆ చిత్తశుద్ధి కలుగనేరదు. వెయ్యికడవల నీళ్ళతోఁ గడిగినను లోపల కల్లున్న కుండ పవిత్రముకాదు.

విశేషము :- మీఁది పద్యమునందువలెనే దృష్టాంతాలంకారము.

తే. రాగదోష మలాపహారక్షమంబు
మానసంబైన తీర్థంబు మందగమన!
అవనిఁ బంకరజోవ్యపాయక్షమంబు
బాహ్యతీర్థంబు మేచకోత్పలదళాక్షి! 75

అర్థము :- మందగమన! = మందగామినీ!, మానసంబైన తీర్థంబు = మానసికమైన సత్య, శమ, దమాది తీర్థము, 'రాగదోషమలాపహారక్షమంబు' రాగ= రాగమువలన నేర్పడిన, దోషము = దోషకాలుష్యముయొక్క. అపహార = తొలగిం చుటయందు, క్షమంబు = సమర్థమైనది. 'మేచకోత్పలదళాక్షి!' మేచకోత్పల = నల్లగలువపూవుయొక్క, దళ = రేకులవంటి, అక్షి! = కన్నులు గలదానా!, అవనిన్ = భూమియందు, బాహ్యతీర్థంబు = వెలుపలి తీర్థము, 'పంకరజోవ్యపాయక్షమంబు' పంక = బురదయొక్క రజః = ధూళియొక్క. వ్యపాయ = తొలఁగిం చుటయందు, క్షమంబు = సమర్థమైనది.

తాత్పర్యము :- మందగమనా! మానసమైన సత్య, శమ, దమాది తీర్థావగాహనము, రాగ, ద్వేష, జనితములైన చిత్తమాలిన్యములను ప్రక్షాళితములను. నిర్మోతములను జేయుటకు సమర్థమైనది.

ఇందీవరాక్షీ! వెలుపలి నదీ, హ్రదాదితీర్థములు, బురదను, ధూళిని మాత్రమే కడిగివేయుటకు సమర్థములైనవి.

విశేషము :- ప్రతివస్తూపమాలంకారము.

'వాక్యయోరేక సామాన్యే ప్రతివస్తూపమానుతా'

సీ॥ దర్శించినపుడ చిత్తము నిర్నిబంధనం
బగు ప్రసాదగుణంబు నందునేనిఁ
గలుషంబుగాని దుర్గంధంబుఁ బొరయని
సలిలంబు నెరపుగాఁ గలుగునేని
పావనక్షేత్ర పుణ్యావనీధర తపో
వన సన్నివేశంబు తనరునేనిఁ
సంశితవ్రతులైన సంయమిశ్రేష్ఠుల
యధిక పరిగ్రహంబబ్బునేనిఁ

తే. దీర్థములు; పెక్కులాడిన, దీర్థమగునె?
ధవళలోచన! సలిలమాత్రమునఁ జేసి
ముదిత! దేహమునం దంగములకుఁ బోలె
దారతమ్యంబు కలదు తీర్థముల కతివ! 77

అర్థము :- దర్శించినపుడ = చూచినంతనే. చిత్తము = మానసము, నిర్ని బంధనంబగు = నిర్హేతుకమైన. ప్రసాదగుణంబు = ప్రసాదగుణమును. అందు నేనిన్ = పొందినట్లయ్యేనేని. కలుషంబుగాని = కలఁకలుగాని. దుర్గంధంబుఁబొర యని = దుర్వాసనయంటని. సలిలంబు = స్వచ్ఛజలము. నెరవుగాన్ = పుష్కల ముగా, కలుగునేనిన్ = ఒదవినట్లయ్యేనేని. 'పావన.... సన్నికర్షంబు' పావనక్షేత్ర= పావనములైన క్షేత్రములయొక్క. పుణ్య = పవిత్రములైన. అవనీధర = పర్వత ములయొక్క. తపోవన = తపోవనములయొక్క. సన్నికర్షంబు = సామీప్యము. తనరునేనిన్ = కలిగినట్లయ్యేనేని. సంశితవ్రతులైన = ధృతవ్రతులైన, 'సంయమి శ్రేష్ఠుల యధిక పరిగ్రహంబబ్బునేనిన్' సంయమిశ్రేష్ఠుల = మునిశ్రేష్ఠులయొక్క. అధిక = గొప్పదియైన, పరిగ్రహంబు = స్వీకారము, అబ్బునేనిన్ = లభించినట్ల య్యేనేని, పెక్కులాడినన్ = పెక్కింటియందాడినను, తీర్థములు = ఆ తీర్థములు తీర్థములు; ధవళలోచన ! = సితవిలోచనా !, సలిలమాత్రమునఁజేసి = జలము లన్నంత మాత్రములో, తీర్థమగునె ? = తీర్థమగునా ?, ముదిత ! = లలనా !, దేహంబునందున్ = శరీరమునందు, అంగములకుఁబోలెన్ = అవయవములకు

వలెనే, అతివ = అతివా!. తీర్థములకున్ = తీర్థములకుఁగూడ, తారతమ్యంబు= తరతమభేదము, కలదు = ఉన్నది.

తాత్పర్యము :- చూచినంతనే నిర్హేతుకముగా చిత్తము ప్రసన్నత నంద వలయును. కలఁకలేని, దుర్వాసనలేని సలిల మెల్లయెడల పుష్కలముగా నుండవల యును. పుణ్యక్షేత్రములకు, పుణ్యపర్వతములకు, తపోవనములకు సమీపమై యుండ వలయును. ధృతవ్రతులైన మునిశ్రేష్ఠులచేత పరిగ్రహింపఁబడి యుండవలయును. ఈ లక్షణములుగల తీర్థము లనేకము లాడినచో తీర్థములాడినట్లగును. జలము లున్నంతమాత్రమునఁ దీర్థముకాదు. దేహమునందలి అవయవములకువలెనే భూమి యందలి తీర్థములకుఁగూడ వానిలో వానికిఁ దరతమభావము గలదు.

వ. సారంగనయన! తీర్థాంగంబు లప్రతిగ్రహం, బనహంకారం, బకోపనత్వం, బనాలస్యం, బహేతునిష్ఠ, సూనృతంబు, సమాధానంబు, శ్రద్ధానత్వంబు, క్షేత్రోపవాసంబు, పితృతర్పణంబు, బ్రాహ్మణ భోజనంబు, పితృశ్రాద్ధంబు, పిండప్రదానంబు, శిరోముండనంబు మొదలుగాగల యవి సాంగోపాంగంబులై ఫలంబు నీఁజాలు. మఱి య తీర్థ తారతమ్యంబు వివరించెద. 78

అర్థము :- సారంగనయన = మృగనయనా!. 'తీర్థాంగంబులు' తీర్థ = తీర్థసంసేవనమునకు, అంగంబులు = అవయవభూతములైన. అప్రతిగ్రహంబు = దానములు పట్టకుండుట. అనహంకారంబు=అహంకారము లేకయుండుట, అహేతునిష్ఠ = హేతువాదమును పట్టికొనియుండుట, అనాలస్యంబు = అలసత్వము లేకయుండుట-సోమరితనము లేకయుండుట, సూనృతంబు = సత్యప్రియ వచనములు గలిగియుండుట, సమాధానంబు = మానసికమైన వ్యగ్రత లేకయుండుట. శ్రద్ధాన త్వంబు = శ్రద్ధ కలిగియుండుట. క్షేత్రోపవాసంబు = క్షేత్రమునం దువవసించి యుండుట, పితృతర్పణంబు = పితృదేవతలకు తర్పణములు విడుచుట. బ్రాహ్మణ భోజనంబు = బ్రాహ్మణులను భుజింపఁజేయుట, పితృశ్రాద్ధంబు = పితృదేవతలకు శ్రాద్ధము పెట్టుట. పిండప్రదానంబు = పిండములు పెట్టుట, శిరోముండనంబు = శిరోముండనము, మొదలుగాఁగల యవి = మొదలైనవి. సాంగోపాంగములై =

అంగములతో. ఉపాంగములతో గూడుకొన్నవియై. ఫలంబున్ = తీర్థసేవాఫలమును. ఈఁజాలున్ = ఇయ్యఁజాలును. మఱి - ఇఁక, అ త్తీర్థతారతమ్యంబు = (ఆ + తీర్థ - అ త్తీర్థ) ఆ తీర్థములకుఁగల తరతమభావమును, వివరించెదన్ = వ్యాఖ్యానించెదను.

తాత్పర్యము :- అప్రతిగ్రహము. అనహంకారము. అకోపనత్వము. అనాలస్యము. అహేతునిష్ఠ. సూన్యతము. సమాధానము. శ్రద్ధానత్వము, క్షేత్రోపవాసము, పితృతర్పణము, బ్రాహ్మణభోజనము. పిత్యశ్రాద్ధము, పిండప్రదానము, శిరోముండనము మొదలుగాఁగల తీర్థాంగములు. సాంగోపాంగములై తీర్థఫలమునీయఁగలవు. ఇఁక ఆ తీర్థముల తారతమ్యమును వివరించెదను.

సీ॥ చెలువ! శ్రీగిరియందు శిఖరేశ్వరంబను
శిఖరంబుఁ జూచినఁ జేరు ముక్తి
కాంత! శ్రీశైలంబుకంటె వేగంబునఁ
గేదార మీఁజాలు కేవలత్వ
మంతకంటెను వేగ మరవిందలోచన!
యమృత మీనోపుఁ బ్రయాగతీర్థ
మాప్రయాగముకంటె నతివేగమునఁ జేయు
నపవర్గ మింతి! మహాస్మశాన
తే. మతివ! యానందకానన ప్రాప్తికరము
లఖిల తీర్థంబులును సందియంబులేదు
కాశికాతీర్థ మాడక కదియరాదు
లక్షతీర్థంబులాడిన మోక్షములక్ష్మి॥ 19

అర్థము :- చెలువ ! = చెలువము గలదానా !, శ్రీగిరియందున్=శ్రీశైలమునందు, శిఖరేశ్వరంబను = 'శిఖరేశ్వర' మను పేరుగల, శిఖరంబున్ =శిఖరమును. చూచినన్ = చూచినచో. ముక్తి = కైవల్యము. చేరున్ = సమీపించును.

కాంత ! = కమనీయురాలా!, శ్రీశైలంబుకంటెన్ = శ్రీశైలమునకంటె, వేగంబునన్ = శీఘ్రముగా, కేదారము = కేదారక్షేత్రము, కేవలత్వము = కైవల్యమును, ఈఁజాలను = ఇయ్యఁజాలును.

అరవిందలోచన ! = తామరపువ్వులవంటి కన్నులు గలదానా!, అం కంచెను = ఆ కేదారముకంచెఁగూడ. వేగము = తొందరగా. ప్రయాగతీర్థము= త్రివేణీ సంగమము. అమృతమున్ = మోక్షమును. ఈ నోపున్ = ఇచ్చుటకు సమర్థమగును.

ఇంతి !=వనితా !, ఆ ప్రయోగముకంచెన్=ఆ ప్రయాగతీర్థమునకంచెను. అతివేగమునన్ = అతిశీఘ్రముగ, అపవర్గమును=మోక్షమును, మహాస్మశానము = కాశిక్షేత్రము, చేయున్ = చేయును. అతివ ! అతివా !, అఖిలతీరంబులును = సకల తీర్థములును, 'ఆనందకానన ప్రాపికరములు' ఆనందకానన = కాశీక్షేత్రము యొక్క. ప్రాప్తికరములు = ప్రాప్తిని కలిగించునవి. సందియంబులేదు = సందేహము లేదు. కాశికాతీర్థమాదక = కాశీక్షేత్రమును సేవింపక. లక్షతీర్థంబులాడినన్= లక్షతీర్థములను సేవించినప్పటికిని, మోక్షలక్ష్మి = కైవల్యలక్ష్మి, కదియరాదు = చేరరాదు.

తాత్పర్యము :- శ్రీశైలమునందలి 'శిఖరేశ్వర' మనుపేరు కలిగిన శిఖరమును జూచినచో ముక్తి చేరువయై వచ్చును. శ్రీశైలముకంచెను శీఘ్రముగా కేదారము కైవల్యము నియ్యఁజాలును. ఆ కేదారముకంచెను వేగముగా ప్రయాగము ఆమృతత్వము నీయఁగలదు. ఆ ప్రయాగముకంచెను అతివేగముగాఁ గాశీక్షేత్రము అపవర్గమును జేయఁగలదు. సకలతీర్థ సేవాఫలములును గాశీక్షేత్ర ప్రాప్తియందు పర్యవసించును. ఈ విషయమునందు సందేహములేదు. లక్షతీర్థములను సేవించినను కాశీతీర్థమును సేవింపనిదే కైవల్యలక్ష్మి కదియరాదు.

విశేషము :- ఇచ్చట తీర్థములయొక్క ఉత్తరోత్తరోత్కర్ష వర్ణింపఁబడినది కావున సారాలంకారము.

'ఉత్తరోత్తరమున్కర్షస్సార ఇత్యభిధీయతే'.

— శివశర్మోపాఖ్యానము —

వ. ఈ యర్థంబు తేటపడ నొక్క యితిహాసంబు చెప్పెద వినుము. మధుర యను పట్టణంబున శివశర్మ యను విప్రోత్తముండు గలఁడు. అతఁడు వేదంబులు చదివి, తదర్థంబు లెఱింగి, ధర్మశాస్త్రంబులు పఠించి, పురాణంబు లధిగమించి, యంగంబు

లభ్యసించి, తర్క–ంబులాలోడించి, మీమాంసాద్వయం బాలో
చించి, ధనుర్వేదంబగావహించి, యాయుర్వేదంబు విచారించి.
నాట్యవేదంబు గ్రహించి, యర్థశాస్త్రంబులు ప్రాపించి, మంత్ర
శాస్త్రంబులు దెలిసి, భాషలు గఱచి, లిపులు నేర్చి, యర్థంబు
లుపార్జించి, ధర్మంబులు చేపట్టి, భాగ్యంబు లనుభవించి
పుత్త్రుల నుత్పాదించి, వారి కర్థంబు విభజించి యిచ్చి, యీవ
నంబు పోకకు ముదిమి రాకకు శోకించి వ్యాకులుండయి నిజాం
తర్గతంబున. 80

అర్థము:– ఈ యర్థంబు = ఈ విషయము - ఈ కాశీక్షేత్రము యొక్క పారమ్యము, తేటపడన్ = స్పష్టపడునట్లుగా. ఒక్క యితిహాసంబున్ = ఒక పూర్వ పృత్తాంతమును. చెప్పెదన్ = చెప్పెదను. వినుము = ఆకర్ణింపుము !, మధుర యను పట్టణంబునన్ = మధుర యను నగరమునందు. శివశర్మ యను = 'శివశర్మ' అను పేరుగల. విప్రోత్తముండు = బ్రాహ్మణోత్తముఁడు. కలఁడు = ఉండెను. అతండు = ఆ శివశర్మ, వేదంబులు చదివి = వేదములు అధ్యయనము చేసి. తదర్థంబులు = ఆ వేదార్థములను, ఎఱింగి = తెలిసికొని, ధర్మశాస్త్రంబులు = మన్వాది ధర్మశాస్త్రములను, పఠించి = చదివి. పురాణంబులు = అష్టాదశపురాణములను, అధిగమించి = వాని తాత్పర్యార్థమును దెలిసికొని. అంగంబులు = శిక్ష, వ్యాకరణాదులైన వేదాంగములను, అభ్యసించి = నేర్చి, తర్క–ంబులు = న్యాయ వైశేషికములను, లేక షట్తర్క–ములను, అలోడించి = కలఁచియాడి - నిర్మథనము చేసి. మీమాంసాద్వయంబు = పూర్వోత్తర మీమాంసాశాస్త్రముల జంటను, ఆలోచించి = విచారణముచేసి. ధనుర్వేదంబు = ధనుర్వేదమును. అవగాహించి = అవగాహనముచేసి, ఆయుర్వేదంబు = ఆయుర్వేదమును, విచారించి = ఆలోచించి. నాట్యవేదంబు = నాట్యవేదమును, గ్రహించి = తెలిసికొని, అర్థశాస్త్రంబులు = అర్థశాస్త్రములను, ప్రాపించి = పొంది, మంత్రశాస్త్రంబులు = మంత్రశాస్త్రములను, తెలిసి = తెలిసికొని, భాషలు = భాషలను, కఱచి = నేర్చి, లిపులను = లిపులను, నేర్చి = అభ్యసించి, అర్థంబులు = ధనములను, ఉపార్జించి = సంపాదించి, ధర్మంబులు = ధర్మకార్యములను, చేపట్టి = ఆచరించి, భోగంబులు = భోగములను, అనుభవించి = అనుభవించి, పుత్త్రులను = కుమారులను, ఉత్పా

దించి = కలిగించి, వారికిన్ = వారలకు, అర్థంబు = ధనమును, విభజించియిచ్చి= పంచియిచ్చి. యౌవనంబుపోకకున్=యౌవనము కడచిపోవుటకు, ముదిమిరాకకు= వార్ధక్యము వచ్చుటకు. శోకించి = దుఃఖపడి, వ్యాకులపాటు కలవాఁడై. నిజాంతర్గ తంబునన్ = తనమనస్సులో.

తాత్పర్యము:- మధురానగరములో శివశర్మయను బ్రాహ్మణోత్తముఁడు కలఁడు. ఆయన వేదములు చదివెను. వేదార్థము లెఱిఁగెను. ధర్మశాస్త్రములు చదివెను. అష్టాదశపురాణముల తాత్పర్యార్థము తెలిసికొనెను. వేదాంగము లభ్యసించెను. తర్కశాస్త్రములను మథించెను. పూర్వోత్తర మీమాంసలను ఆలోచించెను. ధనుర్వేదము నవగాహించెను. ఆయుర్వేదమునువిచారించెను. నాట్యవేదమునుగ్రహించెను. అర్థశాస్త్రము లరసెను. మంత్రశాస్త్రములు తెలిసికొనెను. భాషలు గఱచెను. లిపులునేర్చెను. ధనములఁ బార్జించెను. ధర్మములు చేపట్టెను. భాగ్యము లనుభవించెను, కొడుకులను బడసెను. వారికి ధనములు పంచియిచ్చెను. యౌవలముకడచిపోవుటకు వార్ధకము ప్రత్యాసన్నమగుటకు దుఃఖించి పర్యాకులత్వమును భజించి- ఆశివశర్మ తనమనస్సులో నిట్లువిచారించెను.

శా.నానాశాస్త్రము లభ్యసింపఁగ, ననంతద్రవ్యమార్జింప, సం
తానంబుం బడయంగఁ బుత్త్రులకు నర్థంబుల్ విభాగించి యీఁ,
బోనఃపున్యమునన్ సుఖం బనుభవింపన్, బోయెఁగాలంబు, గౌ
రీనాథున్ భజియింప నేరనయితిన్ శ్రీకాశికావల్లభున్॥ 81

అర్థము:- నానాశాస్త్రములు = బాహుశాస్త్రములను, అభ్యసింపఁగన్ = వ్యాసంగము చేయఁగాను, 'అనంతద్రవ్యము' అనంత = అంతులేని. ద్రవ్యము = ధనమును. ఆర్జింపన్ = సంపాదింపగాను, సంతానంబున్ = సంతతిని, పడయంగన్ = పడయఁగాను, పుత్త్రులకున్ = కుమారులకు. అర్థంబుల్ = ధనములను, విభాగించి = పంచి. ఈన్ = ఇయ్యఁగాను. పోనఃపున్యమునన్ = మరల మరల, సుఖంబు = సుఖమును, అనుభవింపన్ = అనుభవింపగాను, పోయెన్ = కడచిపోయెను, కాలంబు = కాలము, గౌరీనాథున్ = గౌరీనాథుఁడైన, శ్రీకాశికావల్లభున్ = శ్రీకాశీవల్లభుని, భజియింపన్ = సేవింపఁగా, నేరనయితిన్ = తెలియకపోయితిని.

తాత్పర్యము:- పుట్టినది మొదలు విసువక వేదశాస్త్రములభ్యసించితిని. అనంతధనము సంపాదించితిని. సంతానవంతుఁడనైతిని. సంపాదించిన ధనమును వారికి పంచియిచ్చితిని. అనుభవించిన సుఖమునే తిరిగి తిరిగి అనుభవించితిని. దినితోనే కాలము చెల్లిపోయినది. నేనుచేయనిది - ఒక్కటే; అది గౌరీనాథుఁడైన శ్రీకాశీవల్లభుని సేవింపవలయునని ఎఱుఁగుట.

సీ॥ కొలువంగ లేనైతి గోపాలకృష్ణుని
నర్చింప లేనైతి హస్తి వదను
మ్రొక్కంగ లేనైతి మునిజనశ్రేణికి
సేవింప లేనైతిఁ జిత్రభానుఁ
యజియింప లేనైతి నమర సంఘాతంబుఁ
బూజింప లేనైత్తి భూదివిజులఁ
గట్టింప లేనైతిఁ గమలకాసారంబు
నిలుపంగ లేనైతిఁ దులసి వనము

తే॥గీ॥ పేరటాండ్రను నర్చింప నేరనైతి
సలిలసత్రింబు సాఁగింపఁ జాలనైతి
నాజ్యతిల హోమ విధులు మంత్రాన్వితముగ
హుతవహునియందుఁ జేయంగనోపనైతి॥ 82

అర్థము :- గోపాలకృష్ణునిన్ = గోపాలుఁడైన విష్ణువును, కొలువంగలేనైతిన్ = సేవింపలేనివాఁడనైతిని. హస్తివదనున్ = గజవదనుఁడైనవిఘ్నేశ్వర స్వామిని. అర్చింపలేనైతిన్ = అర్చింపలేనివాఁడనైతిని-'మునిజనశ్రేణికిన్' మునిజన = మునిజనులయొక్క, శ్రేణికిన్ = పరంపరకు. మ్రొక్కంగలేనైతిన్=ప్రణమిల్లనివాఁడనైతిని. చిత్రభానున్ = అగ్నిహోత్రిని-సూర్యుని. సేవింపలేనైతిన్= సేవింపలేనివాఁడనైతిని. అమరసంఘాతంబున్ = దేవతాసమూహమును. యజియింపనైతిని, కమలకాసారంబున్ = తామరకొలనును. కట్టింపలేనైతిన్ = కట్టింపలేనివాఁడనైతిని. తులసివనము=తులసీవనమును. నిలుపంగలేనైతిన్ = ప్రతిష్ఠింపలేనివాఁడనైతిని, పేరంటాండ్రను = పుణ్యస్త్రీలను. అర్చింపనేరనైతిన్=అర్చింప

లేనివాఁడనైతిని. సలిలసత్రంబున్ = చలివేంద్రమును. సాగింపఁజాలనైతిన్ = నడపింపఁ జాలనివాఁడనైతిని. ఆజ్య తిల హోమవిధులు = ఆజ్యహోమవిధిని, తిల హోమవిధిని, మంత్రాన్వితముగన్ = మంత్రసహితముగా, హుతవహునియందున్ = అగ్నిహోత్రునియందు, చేయంగనోపనైతిన్ = చేయుటకు సమర్థుఁడను కాక పోయితి.

తాత్పర్యము:- ఐహికాభ్యుదయ పరిపూర్ణుఁడైనను వార్ధకము ప్రత్యాసన్న మయినంతనే శివశర్మ ఆముష్మికమునందు తాను పొందిన యేమఱుపాటునుగూర్చి అనుతాపమును పొందుచున్నాఁడుఁ

చేయవలసిన దానిని - ఎన్నింటిని తాను చేయలేదో, ఒక్కొక్కటి ఆదకు వచ్చుచున్నవి.

అయ్యో! ఒక్కనాఁడైనను గోపాలకృష్ణునిఁ గొలిచియుండకపోతిని. విశ్వేశ్వర స్వామిని అర్చింపలేనైతిని. మునిజనులకు మ్రొక్కనైతిని. సూర్యుని, అగ్ని, దేవుని, సేవింపలేనైతిని. అమరసంఘమును యజియింపలేనైతిని. భూసురులను పూజింపలేనైతిని. తామరకొలను కట్టింపలేనైతిని. తులసీవనమును నిలుపలేనైతిని. పేరంటాండ్రను పూజింపనేరనైతిని. చలివేంద్రము సాఁగింపలేనైతిని. సమంత్రకముగ అగ్నిహోత్రునియందు-ఆజ్యతిలహోమ విధులనునిర్వర్తింపఁ జాలకపోతిని.

తే॥గీ॥ పురుష సూక్తము శ్రీసూక్తమును జపింపఁ
బావమాని జపింపఁ దత్పరత మీఱి
సద్ధి శతరుద్రియంబు పంచాక్షరంబు
ప్రణవమంత్రంబు జపియింపఁ బ్రతిదినంబు॥ 88

అర్థము:- తత్పరత = శ్రద్ధాతిశయము, మీఱిన్ = అతిశయించునట్లుగా, పురుషసూక్తమున్ = పురుషసూక్తమును, శ్రీసూక్తము=శ్రీసూక్తమును, జపింపన్ = జపింపను, ప్రతిదినంబున్ = దినదినము, శతరుద్రియంబున్ = శతరుద్రీయమును, పంచాక్షరంబు = పంచాక్షరమును, ప్రణవమంత్రంబున్ = ప్రణవమంత్రమును, జపియింపన్ = జపింపను.

తాత్పర్యము:- శ్రద్ధా తాత్పర్యములతో - పురుషసూక్తమును శ్రీసూక్త

మును జపించలేదు. పావమానిని జపింపలేదు. ప్రతిదినము శతరుద్రీయమును పంచాక్షరమును పణవమును జపింపలేదు.

కం॥ ఈహార్మ్యము లీతురగము
లీ హేమము లీ భుజిష్య లీధాన్యము లీ
దేహము నాతో వచ్చునె?
యూహింపఁగఁ బుణ్యకర్మ మొక్కటితక్కన్॥ 84

అర్థము :- ఊహింపఁగన్ = ఆలోచింపఁగా. పుణ్యకర్మము = పుణ్యమునకుఁ గారణమైన కర్మము; ఒక్కటితక్కన్ = ఒక్కటితప్ప. ఈ హార్మ్యములు= ఈమిద్దెలు, ఈతురగములు = ఈగుఱ్ఱములు, ఈ హేమములు = ఈ బంగారునాభరణములు, ఈభుజిష్యలు = ఈదాసీలు, ఈధాన్యములు = ఈధాన్యములు. ఈదేహము= పీనిసంపాదనకు సాధనమైన - ఈనాశరీరము, నాతోన్ = ఈలోకమువిడిచిపోవుచున్ననాతో, వచ్చునెఁ = వచ్చునా?

తాత్పర్యము :- విచారింపఁగా - చేసిన ధర్మమొక్కటి తప్ప-ఈమేడలు, ఈగుఱ్ఱములు, ఈస్వర్ణరజతములు, ఈదాసీదాసము, ఈధాన్యములు - కనీసము పీనివన్నిటిని సంపాదించుటకు సాధనమైన యీ శరీరమైనను పరలోకమునకుఁ బోవువప్పుడు నాతోవచ్చునా?

సీ॥ పొడిదగ్గు కంఠంబుఁ బొరి పుచ్చకయమున్న
తల ప్రకంపంబుఁ బొందకయమున్న
బొమలు కన్నుల మీఁదఁ బొదివి వ్రాలకమున్న
పరనేత్రముల కడ్డుపడక మున్న
శ్రుతిపుటంబులశక్తి సురిగి పోవకమున్న
వళులాననమునఁ బర్వకయమున్న
హృదయంబులోఁ జేగ పదను తప్ప మున్న
గాత్రంబు శిథిలంబు కాకమున్న

తే॥గీ॥ పండ్లు వేర్వాసి కదలు చూపకయమున్న
కాకికడకంటి చూపుపై రాకమున్న
కాలుసేయాడు కాలంబె కదలవలయుఁ
దీర్థసేవకు దేహమస్థిరముకాన. 85

అర్థము :- పొడిఁగ్గు = శుష్కకాసము, కంఠంబు = కంఠధ్వనిని, పొరి వుచ్చకయమున్న = నశింపఁజేయకమునుపే, తల = శిరస్సు, ప్రకంపంబున్ = వణఁకుటను, పొందకయమున్న = పొందుటకు ముందే, బొమలు = కనుబొమలు, కన్నులమీఁదన్ = నేత్రములమీఁద, పొదివి = పొదివికొని, ప్రాలకమున్న = ప్రాలుటకు మునుపే, పర = పొర, నేత్రములకున్ = కన్నులకు, అడ్డుపడక మున్న = ప్రతిరోధకము కాకమునుపే, శ్రుతిపుటంబుల శక్తి = శ్రవణ సంపుట ములయొక్క శక్తి - శబ్దమును గ్రహింపఁగలిగిన శక్తి, సురిగిపోవకమున్న = క్షీణింపకమునుపే, వడులు = ముడుతలు, ఆననమునన్ = ముఖమునందు, పర్వ కయమున్న = వ్యాపింపకమునుపే, హృదయంబులోన్ = గుండెలోపల, చేగ = చేవ, పదను తప్పకమున్న = దిటవుతప్పక మునుపే, గాత్రంబు = శరీరము, శిథిలంబుకాకమున్న = సడలిన సంధులు గలిసి కాకమునుపే, పండ్లు=దంతములు, వేర్వాసి = (వేఱు + వాసి = వేర్వాసి) కుదుళ్ళుతప్పి, కదలుచూపకయమున్న = కదలిక చూపకమునుపే, కాకి కడగంటి చూపు = కాకివలె కడకన్ను ప్రక్కకువంచి చూచెడి చూపు, పైరాకమున్న = పైఁబడక మునుపే, కాలుసేయి = కాలు, చేయి, అడుకాలంబె = కదలుచున్నప్పుడే, తీర్థసేవకున్ = తీర్థములను సేవించుటకు, కదల వలయున్ = బయలుదేరవలెను, దేహము = శరీరము, అస్థిరముకానన్ = శాశ్వ తముకాదు కనుక.

తాత్పర్యము :- పొడిదగ్గు కంఠధ్వనిని మార్చివేయక మునుపే, తల వణఁకకముండే, కనుబొమలు కన్నులుమీఁద పొదివికొని ప్రాలిపోకముండే, కన్ను లకు పొర యడ్డు రాకమునుపే, వీనులకు వినుకలిగి శక్తి తగ్గకముండే, ముడుతలు ముఖముపై వ్యాపింపకమునుపే, గుండెబలము తగ్గకముండే, శరీర సంధులు సడలి పోకముండే, పలువరుస కుదుళ్ళు తప్పి కదలుట మొదలిడక మునుపే, 'కాకిచూపు' రాకమునుపే కాలు చేయి ఆడుచున్నప్పుడే తీర్థసేవకుఁ గదలవలయును, శరీరము అస్థిరము కనుక.

విశేషములు :- ముదిమి వర్ణనము-ఇన్ని వివరములతో మూలములోలేదు.

'యావత్ స్వస్థోస్తిదేహోమే యావన్నేంద్రియ విక్లబః
తావత్ స్వశ్రేయసాంహేతుం తీర్థయాత్రాం కరోమ్యహం'

అన్నంతవఱకే యున్నది.

వ. అని తీర్థాయాత్రాపరాయణుండై యిల్లు వెడలి రెండు మూఁడు పయనంబులకొలఁది తెరవున నొక వటవృక్షంబు క్రిందఁ బరిశ్రమాపనోదార్థంబు విశ్రమించి యంతరంగంబున నిట్లని వితర్కించె. 86

అర్థము :- అని = ఇట్లు, 'తీర్థాయాత్రాపరాయణుండై' తీర్థయాత్రా = తీర్థయాత్రయందు, పరాయణుండై = ఆసక్తికలవాఁడై, ఇల్లువెడలి = ఇంటినుండి బయలుదేరి, రెండు మూఁడు పయనంబుల కొలఁదిన్ = రెండు మూఁడు మజిలీల మేర లో, తెరవునన్ = త్రోవయందు, ఒక వటవృంషంబుక్రిందన్ = ఒక మఱ్ఱి చెట్టుక్రింద, 'పరిశ్రమాపనోదార్థంబు' పరిశ్రమ = బడలికయొక్క, అపనోదార్థంబు = తీర్చుకొనుటకొఱకు, విశ్రమించి = పరుండి, అంతరంగంబునన్ = మనస్సులో, ఇట్లని = ఈ రీతిని, వితర్కించెన్ = పరిపరివిధములుగా నూహించెను.

మ. కరికర్ణాంత విలోల మాయువు; శరత్కాంబినీ చంచలా
తరళంబాత్మ; పయస్తరంగచలముల్ తారుణ్యముల్ తీర్థముల్
పరిపాటిన్ జతురంతధాత్రిఁ జరియింపన్ వచ్చునే? యైనఁ నే
బురముల్ నాలుగుమూఁడు ముక్తిజనకంబుల్ మున్ను వీక్షించెదన్.

అర్థము :- ఆయువు = ఆయుర్దాయము, 'కరికర్ణాంతవిలోలము' కరి = ఏనుఁగుయొక్క, కర్ణాంత = చెవియంచువలె, విలోలము = మిక్కిలి నిలుకడ లేనిది, ఆత్మ = మనస్సు. 'శరత్కాదంబినీ చంచలాతరళంబు' శరత్ = శరత్కాలము వందలి, కాదంబినీ = మేఘమాలయందలి, చంచలా = మెఱపుతీఁగవలె, చంచలంబు = చంచలమైనది; తారుణ్యముల్ = యౌవనములు, 'పయస్తరంగచలముల్' పయస్తరంగ = నీటి యలలవలె, చలముల్ = అస్థిరములైనవి, తీర్థముల్ = తీర్థములను, పరిపాటిన్ = వరుసగా, చతురంతధాత్రిన్ = నాలుగు అంచులు గల

భూమియందు-సమస్త భూమియందును, చరియింపన్ వచ్చునే ? = చరియించుట సాధ్యపడునా ?, ఐనన్ = అయినప్పటికిని. నేన్ = నేను, 'నాలుగు మూఁడు' నాలుగు = నాలుగును, మూఁడున్ = మూఁడునైన - ఏడైన, ముక్తిజనకంబుల్ = మోక్షజనకములైన. పురంబుల్ = పురములను-సప్తపురములను. మున్ను = ముందుగా, వీక్షించెదన్ = చూచెదను.

తాత్పర్యము :- ఆయుర్దాయము-ఏనుఁగు చెవియంచువలె నిలుకడలేనిది. మనస్సు శరత్కాలమేఘమునందలి మెఱుపుతీఁగవలె చంచలమైనది. యౌవనములు సీటియలలవలె అస్థిరములు. కావుననే నేలనాలుగుచెఱఁగులమధ్య నున్న సకలతీర్థము లను వరుసగా తిరుగుట సాధ్యపడునా? అయినను, నేను ముక్తహేతువులని ప్రసిద్ధ ములైన సప్తపురములను ముందుదర్శించెను.

* సప్త పురీ ప్రశంస *

తే॥గీ॥ ఉజ్జయిని కాశి మాయ యయోధ్య కాంచి
మధుర ద్వారక యనెడి నామములు గలిగి
పట్టణము లేడుఁ గీర్తి సంపద వహించు
మహిత కైవల్య లక్ష్మికి మందిరములు॥ 88

అర్థము :- ఉజ్జయిని, కాశి, మాయ, అయోధ్య, కాంచి, మధుర, ద్వారక, ఆనెడి, నామములు గలిగి = పేర్లుగలిగి, పట్టణములేడు = ఏడుపట్టణములు, కీర్తి సంపదన్=కీర్తిసంపదను, వహించున్ = వహించును. 'మహితకైవల్య లక్ష్మికిన్' మహిత = పూజ్యమైన. కైవల్యలక్ష్మికిన్=కైవల్యలక్ష్మికి, మందిరములు = నివాస మందిరములు.

తాత్పర్యము :- సుగమము.

వ॥ అని నిశ్చయించి 89

అర్థము :- అని = ఇట్లు, నిశ్చయించి = నిశ్చయముచేసి-

సీ॥ సాకేతమున కేగి సరయూతరంగణి
నభిషేక మొనరించి యధిక భక్తి

నల్వఁదెల్వైనునైన నదుల కూటము ప్రయా
గాఖ్యంబునందు దేహంబు దోఁచి
గంగలో మణికర్ణి కా తీర్థమున యందు
సంకల్ప పూర్వంబు గ్రుంకు వెట్టి
కైవల్య కల్యాణ ఘుంటాపథంబైన
యానంద విపినంబు నాశ్రయించి
తే॥గీ॥ తీర్థదైవతకోటిఁ బ్రార్థించి పలికి
యఖిలమును నాచరించి తీర్థాంగకములఁ
దీర్థములయందు శ్రీమహాదేవుఁ గొలిచెఁ
బావనాచార నిరతుండు బ్రాహ్మణుండు॥ 90

అర్థము :- సాకేతమునకున్ = అయోధ్యానగరమునకు. ఏఁగి = వెళ్ళి. సరయూతరంగణిన్ = సరయూనదియందు. అధికభక్తి = అధికమైనభక్తితో. అభిషేకము స్నానము. ఒనరించి = చేసి. నల్వఁదెల్వైనునైన = నలుపును. దెలుపును నైన, నదుల = యమున, గంగ, యనెడి నదులయొక్క కూటము=సంగమమైన, ప్రయాగాఖ్యంబునందున్ = 'ప్రయాగ' మనెడి తీర్థమునందు, దేహంబున్ = శరీరమును. తోఁచి = తోఁగునట్లుచేసి. గంగలోన్ = గంగానదియందు. మణికర్ణికాతీర్థమున యందున్ = మణికర్ణికాతీర్థమునందు. సంకల్పపూర్వంబు = సంకల్ప పూర్వకంముగా. గ్రుంకువెట్టి = మునుకవెట్టి. 'కైవల్య కల్యాణ ఘుంటాపథంబైన' కైవల్య = మోక్షమేయనెడి. కల్యాణ = మంగళమునకు. ఘుంటాపథంబైన = రాజవీథియైన, ఆనందవిపినంబున్ = ఆనందకాననమును (కాశిని), ఆశ్రయించి = ఆశ్రయించి. తీర్థదైవతకోటిన్ = దేవతాకోటిని. ప్రార్థించి పలికి = ప్రార్థనాలాపములాడి. తీర్థాంగకములన్ = తీర్థాంగములను. అఖిలమున్ = సమస్తమును. ఆచరించి = నిర్వర్తించి, తీర్థములయందున్ = ఆయాతీర్థములయందు, శ్రీమహాదేవున్ = శ్రీవిశ్వేశ్వరమహాదేవుని, కొలిచెన్ = సేవించెను. 'పావనాచార నిరతుండు' పావనాచార = పుణ్యాచారమునందు, నిరతుండు = శ్రద్ధాళువైన. బ్రాహ్మణుండు = శివశర్మ.

తాత్పర్యము :- పుణ్యాచారపరిపణుఁడైన శివశర్మ - అయోధ్యానగరమువకుఁబోయి - అధికభక్తితో సరయూనదీ యందు స్నానమాచరించెను. సితాసితనదీ

సంగమస్థలమైన ప్రయాగమునందు దేహమును-ఆప్లావితముఁజేసెను. గంగలోను-మణికర్ణికాతీర్థమునందు. సంకల్పపూర్వకముగా కుంకులుపెట్టెను. కైవల్య కల్యాణము వడచి వచ్చెడి రాజవీథియైన ఆనందకాననము నాశ్రయించెను. తీర్థదైవతముల నందరిని ప్రార్థనలచేత పరితుష్టులనుజేసెను. తీర్థాంగముల నన్నంటివి యథావిధిగా నాచరించెను. ఆయాతీర్థములయందు శ్రీవిశ్వేశ్వర శ్రీమన్ మహాదేవునిసేవించెను.

సీ॥ బ్రహ్మలోకోన్నత ప్రాసాద నిశ్రేణి
యాజవంజవభీతి కభయపాణి
కలుష కంఠచ్ఛేద కాలాయసకృపాణి
కైవల్య నవ మూక్తికమున కాణి
తీరావనీ సమధిష్ఠితాంతర్వాణి
చక్షురుత్సవ గంధసారశోణి
చేతఃప్రసాద లక్ష్మీవిహార క్షోణి
కల్పాంత కాలంబుగల పురాణి

తే॥గీ॥ పరమకల్యాణి యాపగాంభస్త్రివేణి
రాజరేఖావతంసు గారాపురాణి
సమధిక బ్రీతిఁ దేలి యాసత్యవాణి
కేవలత్వ శుభశ్రేణి శ్రీకేణి వట్టె॥ 91

అర్థము :- 'బ్రహ్మలోకోన్నత ప్రాసాద నిశ్రేణి' బ్రహ్మలోక = బ్రహ్మలోక మనెడి. ఉన్నత = ఎత్తైన, ప్రాసాద = మేడకు, నిశ్రేణి = నిచ్చెన. 'ఆజవంజవ భీతికిన్' ఆజవంజవ=సంసారమువలని, భీతికిన్ = భయమునకు, అభయపాణి = అభయహస్తము, 'కలుషకంఠచ్ఛేదకాలాయసకృపాణి' కలుష = పాపములయొక్క, కంఠచ్ఛేద = కంఠమును గోయుటకు, కాలాయస = ఇనుముతోఁజేసిన. కృపాణి = కత్తి, 'కైవల్యనవమూక్తికమునకున్' కైవల్య = ముక్తియనెడి, నవమూక్తికమునకు = కొత్తముత్తైమునకు, ఆణి=వర్తులత్వము; 'తీరావనీసమధిష్ఠితాంతర్వాణి' తీరావనీ = తీరభూములయందు. సమధిష్ఠిత = అధిష్ఠించిన. అంతర్వాణి = విద్వాంసులుగలది. 'చక్షురుత్సవగంధసారశోణి' చక్షురుత్సవ = నేత్రోత్స

వమునకు, గంధసార = మంచి గంధముయొక్క. శోణి = ఎఱుపు. 'చేతః ప్రసాద లక్ష్మి విహారకోణి' చేతః = మనస్సుయొక్క. ప్రసాదలక్ష్మి = ప్రసన్నతాలక్ష్మి యొక్క. విహారకోణి = విహారభూమి, కల్పాంతకాలంబు = కల్పాంతకాలమువర కును. కల = ఉన్న. పురాణి = పురాతని, పరమకల్యాణి = పరమశుభప్రదురాలు. ఆపగాంభస్త్రివేణి' ఆపగాంభః = నదీజలములయొక్క. త్రివేణి = మూఁడుప్రవాహములుకలది. 'రాజరేఖావతంసు' రాజరేఖా = చంద్రరేఖ. అవతంసు = శిరోభూషణముగాఁగల శివునియొక్క. గారాపు = గారామైన. రాణి=రాణియైనకాశివి (గంగా నదిని). ఆసత్యవాణి = సత్యవచనుఁడైన ఆ శివశర్మ. సమధిక = అత్యధికమైన, ప్రీతిన్ = సంతోషమునందు. తేలి = తేలియాడి, 'కేవలత్వశ్రేణి' కేవలత్వ = కైవల్యమునకు సంబంధించిన. శుభశ్రేణి = శుభపరంపర యనెడి. క్రేణిన్ = సమున్నతపదవిని. పట్టెన్ = ఆలంబించెను.

తాత్పర్యము :- బ్రహ్మలోక మనెడి యున్నత ప్రాసాదమునకు నిచ్చెన యును, భయమున కభయహస్తమును, పాపకంతచ్ఛేదమునకు ఖడ్గమును, కైవల్య మౌక్తికముయొక్క వట్రువదనమును. తిరభూములయందు మహర్షులు నివసించి నదియును, నయనోత్సవమునకు గంధసారచర్చయును. మనఃప్రసాదలక్ష్మికి విహార స్థానమును, కల్పాంతకాలపురాతనియును. పరమకల్యాణియును, నదీజలముల యొక్క - (గంగా, వరణా, అసి, నదులు) కూడలియును, చంద్రరేఖావతంసుఁడ యిన శివునకు గారాపురాణియునునైన కాశీనగరము నాశ్రయించి-ఆనందసముద్ర మునఁ దేలియాడి - సత్యవచనుఁడైన యా శివశర్మ కైవల్యశుభశ్రేణులచేత సము న్నతమైన స్థానము నాలంబించెను.

తే॥ అఖిల తీర్థంబులనునాడి యవనిసురుఁడు
కోర్కిమైఁ బుణ్యలక్ష్ములఁ గొల్లవెట్టె
నటు విశేషించి గంగాప్రయాగ తీర్థ
మధిక తాత్పర్య నిష్ఠతోనాడఁ దొడఁగె; 52

అర్థము :- అవనిసురుఁడు=శివశర్మ, కోర్కిమైన్ = పుణ్యకాంక్షతో, అఖిల తీర్థంబులను = సమస్తతీర్థములయందును, ఆడి = మునిఁగి, పుణ్యలక్ష్ములు=పుణ్య సంపదలను, కొల్లవెట్టెన్ = కొల్లఁగొనియెను, ఆటు = ఆరీతిగా, విశేషించి =

విశేషముగా, గంగాప్రయాగతీర్థము = గంగయను (కాశి) ప్రయాగము (త్రివేణీ సంగమము) అనెడి. తీర్థమునందు, 'అధికతాత్పర్య నిష్ఠతో' అధిక = సమధికమైన. తాత్పర్య = తత్పరభావమునందలి. నిష్ఠతో = నిలుకడతో. ఆడఁదొడఁగెన్ = మునుఁగఁ జొచ్చెను.

తాత్పర్యము :- శివశర్మ పుణ్యకాంక్షతో సకలతీర్థములయందును మునిఁగి పుణ్యసంపదలను కొల్లగొట్టుకొనెను. ఆ విధమైన శ్రద్ధాతిశయముతో విశేషించి గంగయందును-ప్రయాగతీర్థమునందును మునుఁగజొచ్చెను.

సీ॥ వైకుంఠమునఁనుండి వచ్చి వైకుంఠుండు
దేవీ సహాయుఁడై తీర్థమాడు
గోలోకమునఁనుండి గోమాత్మకలు వచ్చి
తీర్థమాడుదురతి స్థిరమనీషఁ
గాశికాపురి నుండి కాలకంఠుఁడు వచ్చి
దివసంబు దివసంబు తీర్థమాడు
వరుసదిక్కులఁ నుండి వచ్చి దిక్పాలురు
త్రిదశేశ్వరాదు లాడుదురు తీర్థ

తే॥గీ॥ మమర గంధర్వసిద్ధ విద్యాధరర్షి
గరుడ కిన్నర యక్షరాక్షస పిశాచ
భూతములు తీర్థమాడు వేఁబోక చివరఁ
బూషమకరస్థుఁడైన యప్పుడు ప్రయాగ॥ 93

అర్థము :- పూష = సూర్యుడు, మకరస్థుఁడైన యప్పుడు = మకరరాశియందున్నప్పుడు, 'వేఁబోక చివరన్' వేఁబోక = (వేఁగు + పోక-వేఁబోక) తెల్లవారు జాముయొక్క. చివరన్ = చివరిభాగమునందు - ఉషఃకాలమునందు, ప్రయాగన్ = ప్రయాగయందు-త్రివేణీసంగమమునందు.

వైకుంఠుండు = శ్రీమహావిష్ణువు, దేవీసహాయుఁడై = లక్ష్మీద్వితీయుఁడై. వైకుంఠమునఁనుండివచ్చి = వైకుంఠమునుండివచ్చి. తీర్థమాడున్ = తీర్థస్నానమాచరించును.

'అతిస్థిరమనీషన్' అతిస్థిర = ఆత్యంత నిశ్చలమైన, మనీషన్ = బుద్ధితో, గోలోకమున నుండి = గోలోకమునుండి. గోమాతృకలువచ్చి = గోమాతృకలు 'సురభి' మొదలైనవారువచ్చి, తీర్థమాడుదురు = తీర్థస్నానము చేయుదురు.

కాశికాపురినుండి = కాశీపురమునుండి, కాలకంఠుడు వచ్చి శివుడువచ్చి, దివసంబు దివసంబు = దినదినము-ప్రతిదినమును. తీర్థమాడున్ = తీర్థస్నాన మాచరించును.

వరుసన్ = వరుసగా, దిక్కులనుండి=తూర్పు మొదలైన యెనిమిది దిక్కుల నుండి, దిక్పాలురు = దిక్పాలకులైన, త్రిదశేశ్వరాదులు = ఇంద్రుడు మొదలైన వారు, వచ్చి = వచ్చి. ఆడుదురు తీర్థము = తీర్థమాడుదురు. 'అమర ..... భూతములు' అమర = దేవతలు, గంధర్వ = గంధర్వులు, సిద్ధ = సిద్ధులు, విద్యాధర = విద్యాధరులు, ఋషి = ఋషులు, గరుడ = గరుడులు, కిన్నర = కిన్నరులు, యక్ష = యక్షులు. రాక్షస = రాక్షసులు, పిశాచ = పిశాచములు, భూతములు = భూతములు, తీర్థమాడుదురు = తీర్థస్నానమాచరింతురు.

తాత్పర్యము :- సూర్యుడు మకరరాశిస్థుడైనప్పుడు ప్రయాగ-త్రివేణీ సంగమమునందు దెల్లవారకముందే వైకుంఠమునుండి శ్రీమహావిష్ణువులక్ష్మీదేవితో సహకదలివచ్చి తీర్థస్నానమాచరించుచుండును. గోలోకమునుండి గోమాతృకలు వచ్చి - అత్యంత నిశ్చలమైన భక్తిభావనతో తీర్థస్నానమాచరించుచుందురు. కాశీ కాపురి నుండి సాక్షాత్తుగా పరమశివుడు కదలి వచ్చి దినదినము తీర్థమాడిపోవుచుండును. వరుసగా - ఎనిమిది దిక్కులనుండి ఇంద్రాది దిక్పాలకులు వచ్చి తీర్థస్నానమాచరించుచుందురు, దేవతలు, గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు, ఋషులు, గరుడులు, కిన్నరులు, యక్షులు, రాక్షసులు, పిశాచములు, భూతములు-వచ్చి తీర్థస్నానమాచరించి పోవుచుందురు.

వ॥ అది ప్రజాపతి క్షేత్రంబు, యాగంబులకంటెను బ్రకృష్టంబగుటం జేసి దానికిఁ బ్రయాగ సమాహ్వాయంబన్వర్థ నామంబై యుండు. మార్తాండుండు మకరరాశిస్థుండై యుండ మాఘ మాసంబున మధువ మణి శిలా శకల విసర విస్ఫురిత కిరణ సందోహ సందేహదాన దీక్షాధురంధరంబులగు కాళిందీసింధు కబంధంబులతో సంధించి కర్పూరగంధసార తారహార నిర్జరా

హార నీహారక్షీర ధారాక్షేణి పాణింధమంబైన సౌరసైంధ
వవాఃప్రవాహంబు ప్రవహింప సితాసితచ్ఛాయాచ్ఛటాగు
ళుచ్చ వ్యతికరంబునంజేసి మోక్ష లక్ష్మీకటాక్ష వీక్షణంబు
నుం బోని యమ్మహాతీర్థరాజంబునం గ్రుంకి బ్రాహ్మణుండు
కృతార్థుండయ్యె, వెండియు. 94

అర్థము:- ఆది = ఆ ప్రయాగము. ప్రజాపతిక్షేత్రంబు = బ్రహ్మక్షేత్రము యాగంబులకంటెనున్ = యాగములకంటెగూడ, ప్రకృష్టంబగుటంజేసి = ప్రకర్షకలదగుటనుబట్టి. దానికిన్ = ఆక్షేత్రమునకు, 'ప్రయాగసమాహ్వాయంబు' ప్రయాగ= 'ప్రయాగ' అనెడి. సమాహ్వాయంబు = పేరు, 'అన్వర్థనామంబై' అన్వర్థ= సార్థకమైన, నామంబై = పేరై. యుండున్ = చెల్లుచుండును, మార్తాండుండు = సూర్యుడు. మకరరాశిస్థుండయియుండన్ = మకరరాశిగతుడైయుండగా, మాఘ మాసంబునన్ = మాఘమాసమునందు, 'మఘవమణి .... ధురంధరంబులగు' మఘవమణిశిలా = ఇంద్రనీలమణి శిలలయొక్క. శకల=తునుకలయొక్క, విసర = సమూహమునుండి, విస్ఫురిత = ప్రసరించుచున్న. కిరణసందోహ = కిరణముల గుంపులనెడి, సందేహ = సంశయముయొక్క, దానదీక్ష = ఇచ్చుటయనెడి పూనిక యొక్క, ధురంధరంబులగు=భారమును వహించినవైన. 'కాళిందీసింధుకబంధంబులతో' కాళిందీసింధు = యమునానదియొక్క, కబంధంబులతోన్ = సలిలములతో. సంధించి = కలసికొని. 'కర్పూర .... పాణింధమంబైన' కర్పూర= కర్పూరముయొక్క, గంధసార = మంచిగంధముయొక్క. తార = వెండియొక్క. హార = ముత్యాలహారములయొక్క. నిర్జరాహార = అమృతముయొక్క. నీహార= మంచుయొక్క, క్షీరధారా = పాలధారలయొక్క. కాంతులకు. పాణింధమంబైన= సముద్దీపకమైన. సౌరసైంధవ = సురసింధువునకు - (గంగానదికి) సంబంధించిన. "ధవళవాఃప్రవాహంబు' ధవళ = తెల్లని. వాః = జలములయొక్క ప్రవాహంబు= ప్రవాహము. ప్రవహింపన్ = జాలువాఱుచుండగా. 'సితాసితచ్ఛాయాచ్ఛటాగుళుచ్ఛ వ్యతికరంబునంజేసి' సిత = తెల్లనైన, అసిత = నల్లనైన. ఛాయాచ్ఛటా=కాంతి సమూహములయొక్క. గుళుచ్ఛ = గుత్తులతోనైన, వ్యతికరంబునంజేసి = సంబంధమునుబట్టి, "మోక్షలక్ష్మీ కటాక్షంబునుంబోని" మోక్షలక్ష్మీ = కైవల్యలక్ష్మియొక్క. కటాక్షవీక్షణంబునుంబోని=కడకంటి చూపువంటిదియైన, అమ్మహాతీర్థ

రాజంబునన్ = ఆ మహాతీర్థరాజమునందు, కుర్కింకి = మునిఁగి, బ్రాహ్మణుండు = శివశర్మ. కృతార్థుండయ్యెన్ = ధన్యుఁడయ్యెను, వెండియును = మఱియును-

తాత్పర్యము :- ఆ ప్రయాగ బ్రహ్మక్షేత్రము-యాగములకంటెను ప్రకర్ష కలదగుటచేత - ఆక్షేత్రమునకు 'ప్రయాగ' అను పేరు సార్థకమై చెల్లుచుండును. సూర్యుఁడు మకరరాశిలోనున్నప్పుడు మాఘమాసమునందు-ఇంద్రనీలమణి శకలకాంతులా? అన్నట్లు మిలమిలలాడి పోవుచున్న నల్లనియమునానీలిలములతో - కలసి పోయి-కర్పూరతారహార నీహారక్షీరధారలవలె తెల్లనైన గంగాప్రవాహజలములు జాలువాఱుచుండఁగా-గుత్తులుగుత్తులై నల్లని తెల్లని కాంతులతో ఆమహాతీర్థరాజము సాక్షాత్తుగా మోక్షలక్ష్మి కడకంటి చూపులవలెనేయుండును. శివశర్మ అట్టి తీర్థరాజమునందు క్రుంకులుపెట్టి కృతార్థుఁడయ్యెను. మఱియును-

తే॥గీ॥ కాశి కేతెంచు మఱిఁ బ్రయాగమున కేఁగు
గాశి కేతెంచు మఱిఁ బ్రయాగమున కేఁగు
మునుఁగు మణికర్ణికా తీర్థమున మఱియు
మునుఁగు మణికర్ణికాతీర్థమునను మఱియు॥ 95

అర్థము :- కాశికిన్ = కాశినగరమునకు. ఏతెంచున్ = వచ్చును, మఱిన్ = మరల. ప్రయాగమునకున్ = ప్రయాగకు. ఏగున్ = వెళ్ళును, కాశికేతెంచున్ = కాశినగరమునకు వచ్చును. మఱిన్ మరల, ప్రయాగమునకేగున్ = ప్రయాగకు వెళ్ళును మునుఁగున్ = మునుఁగును. మణికర్ణికాతీర్థమునను = మణికర్ణికాతీర్థమందు. మఱియున్ = మఱల. మునుఁగున్ మునుఁగును. మణికర్ణికాతీర్థమునను = మణికర్ణికాతీర్థమందు, మఱియున్ = మఱల,

తాత్పర్యము :- ఆశివశర్మ కాశికి వచ్చును. మఱల ప్రయాగకుపోవును. మఱల కాశికి వచ్చును. మఱల ప్రయాగకుఁ బోవును. కాశికివచ్చి మఱలమణికర్ణికాతీర్థమందు మునుఁగును. మణికర్ణికాతీర్థమందు మఱలమునుఁగును.

శా.కింకుర్వాణ పురందరాదిక మహాగీర్వాణ కోటీ కిరీ
టంక స్థాపిత నూత్నరత్న రుచిధారాశ్లేషకిమ్మీరపత్
పంకేరుండు హరుండు జంతువులకున్ బ్రాణాంత కాలంబునం
దోంకారాక్షర మంత్ర రాజమువినన్ యోజించుఁగాశీస్థలిన్ ॥96

అర్థము :- "కింకుర్వాణ .... పత్పంకేజుండు" కింకుర్వాణ=కింకరులగుచున్న సేవాకరులగుచున్న (కిం సేవాం, కరోతి = ఇతి, కింకరః). పురందరాదిక = ఇంద్రుఁడు మొదలైన, మహాగీర్వాణ = పెద్దవేల్పులయొక్క, కిరీటాంక = కిరీటముల - అంకతలములయందు, స్థాపిత = పొదుగఁబడిన, నూత్న రత్న = క్రొత్త రత్నములయొక్క, రుచిచారా = కాంతిధారలయొక్క, ఆశ్లేష = కౌఁగిళ్ళచేత, కిమ్మీర = శబలవర్ణములగుచున్న, 'పత్పంకేజుండు' పత్ =పాదములే యనెడి. పంకేజుండు = పద్మములుగల, హరుండు = శివుఁడు, జంతువులకున్ = శరీరులకు, ప్రాణాంతకాలంబులన్ = ప్రాణావసాన వేళలయందు, 'ఓంకారాక్షర మంత్రరాజము' ఓంకారాక్షర = ప్రణవమే యనెడి, మంత్రరాజము = మంత్ర సార్వభౌమమును, చెవిన్ = కుడిచెవియందు, కాశీస్థలిన్ = కాశీప్రదేశమునందు, యోజించున్ = సంధానించును.

తాత్పర్యము :- కింకరులగుచున్న యింద్రాది బృందారక కోటులయొక్క కిరీటములయందు పొదుగఁబడిన నూత్న రత్నకాంతులచేత శబలవర్ణము లగుచున్న పాదాంభోరుహములుగల పరమశివుఁడు ప్రాణావసాన వేళలయందు ప్రాణుల చెవి యందు ప్రణవమంత్రమును కాశికాస్థలియందుఁ జొనుపుచుండును.

తే. కర్ణికాంతముసేరి యేకతమ శివుఁడు
మునుకు మోక్షచింతామణి జనున కెపుడుఁ
గాన మణికర్ణికాసమాఖ్యత వహించె
నమ్మహాతీర్థ మమర గంగాంతరమున. 97

అర్థము :- కర్ణికాంతముసేరి = చెవిసమీపము చేరి, ఏకతమ = ఏకాంతముగా, శివుఁడు = శివుఁడు, జనునకున్ = జీవునకు, ఎపుడు = ఎల్లకాలము 'మోక్ష చింతామణిన్' మోక్ష = మోక్షమునకు, చింతామణిన్ = చింతామణియైన ప్రణవమును, మునుకుఁగానన్ = వలుకును గనుక, అమరగంగాంతరమునన్ = గంగా సమీపమునందు, అమ్మహాతీర్థము = ఆ మహాతీర్థమూ, మణికర్ణికా సమాఖ్యతన్ = 'మణికర్ణిక' అను పేరు గలిగియుండుటను, వహించెన్ = తాల్చెను.

తాత్పర్యము :- చెవియొద్దకుఁ జేరి యేకాంతముగా శివుఁడు జీవునకు మోక్ష చింతామణియైన ప్రణవము నుపదేశించును గావున గంగాతీరమునందలి యా మహా తీర్థము 'మణికర్ణిక' అను పేరు దాల్చెను.

కం. ఉద్భిజ్జములు జరాయు
ప్రోద్భూతము లండజాతములు స్వేదజముల్
తద్భూమండలిఁజచ్చి మ
హాద్భుతముగఁ బుట్టు హాలహాలకంధరులై. 98

అర్థము :- ఉద్భిజ్జములు = గింజను - ఉద్భేదించికొని పుట్టునవి (తరులతాదులు). జరాయుజములు = మావితో పుట్టునవి (ద్విపాత్తులు చతుష్పాత్తులు). అండజాతములు = గ్రుడ్డులనుండి పుట్టునవి (పక్షులు, పాములు). స్వేదజముల్ = చెమట నుండి పుట్టునవి (పేలు మొదలైనవి). 'తద్భూస్థలిన్' తత్ = ఆ కాశీనగరమునకు సంబంధించిన, భూస్థలిన్ = భూమితలమునందు, చచ్చి = మరణించి, మహాద్భుతముగన్ = గొప్ప ఆశ్చర్యముగ, హాలహాలకంధరులై = నీలగ్రీవులై - శివులై, పుట్టున్ = ఆవిర్భవించును.

తాత్పర్యము :- ఉద్భిజ్జములవి, జరాయుజములవి, అండజములని, స్వేదజములని ప్రాణులు నాలుగు విధములుగా బుట్టుచున్నవి. వానిలో ఉద్భిజ్జములు- చెట్లు, చేమలు; జరాయుజములు-మనుష్యులు, పశువులు; అండజములు-పాములు, పక్షులు; స్వేదజలములు-నల్లులు, పేలు మొదలగునవి. ఈ నాలుగు రకముల జీవములును కాశీలో జచ్చి, ఆ మట్టిమహిమ యెట్టిదోకాని మహాద్భుతముగా అన్నియును హాలాహలగ్రీవులై మొలిచికొని వచ్చును. శివునితో సమానరూపము కలవగును.

విశేషములు :- సాలోక్య సామీప్య సారూప్య సాయుజ్యము లని ముక్తి నాలుగు విధములు. కాశీలో మరణించిన జీవులకు సారూప్యముక్తి సిద్ధించును. ఒకే లోకమందుండుట సాలోక్యము. సమీపమందుండుట సామీప్యము. సమానరూపము నందుండుట సారూప్యము. ఎప్పుడును గలిసియుండుట సాయుజ్యము.

తే. ఎడమ్రక్కయి కాశిలో నీల్గునట్టి
మశకశిశువున కోంకార మంత్రరాజ
మభవుఁ డుపదేశ మొనరింప నమరకోటి
సిగ్గువడుచుండుఁ దమ వృథాజీవములకు. 99

అర్థము :- ఎడమ్రక్కయి = ఎడమవైపునకు వ్రాలి. కాశిలోన్ = కాశీస్థలమునందు, ఈల్గునట్టి = మరణించుచున్నట్టి, మశకశిశువునకున్ = దోమపిల్లకు,

అభవుఁడు = శివుఁడు, ఓంకార మంత్రరాజము = మంత్రరాజమైన ప్రణవమును. ఉపదేశమొనరింపన్ = ఉపదేశమిచ్చుచుండఁగా. అమరకోటి = దేవతాసంఘము. తమ వృథాజీవములకున్ = వ్యర్థమైన తమ జన్మములను దలంచికొని. సిగ్గువడు చుండున్ = లజ్జించుచుండును.

తాత్పర్యము :- ప్రాణావసాన వేళలయందు కాశీలో ఎడమవైపున కొత్తి గిలి కుడిచెవి మీఁదగునట్లుగా ప్రాణములను విడుచుచున్న దోమపిల్లకు శివుఁడు మంత్రరాజమైన ప్రణవమును ఉపదేశమిచ్చుచుండఁగా దేవతాసంఘములు వ్యర్థము లైన తమ యుత్తమ జన్మముల నుద్దేశించి సిగ్గుపడుచుండును.

చం.కటకట! కాశికాపురి నొకానొక నిద్దురఁ గన్ను మోడ్చి య
ప్పటఁ గనువిచ్చి చూచి కుడిభాగముఁ గన్గొని చోద్యమందు దా
పట దెసఁజూచి యచ్చెరువుపాటు వహించు; మనస్సరోజ సం
పుటమున నాఁడులాగు, మగపోడిమియుంగల జంతుసంతతుల్ .100

అర్థము :- కాశికాపురిన్ = కాశికాపురమునందు, ఒకానొక నిద్దురన్ = ఒకానొకవిధమైన, నిద్దుర యందు = నిడుపు నిద్దుర యందు (దీర్ఘ నిద్ర-మరణమునందు), కన్ను మోడ్చి = కన్ను మూసి. అప్పటన్ = అంతలోనే. కనువిచ్చి చూచి = కన్ను విప్పి చూచి. 'మనస్సరోజసంపుటమునన్' మనః = మనస్సే యనెడి, సరోజ సంపుటమునన్ = పద్మసంపుటమునందు. ఆఁడులాగు = ఆఁడుతెఱఁగు, మగ పోడిమియున్ = మగతనమును, కల = కలిగిన. జంతుసంతతుల్ = ప్రాణిసంత తులు, కుడిభాగముఁ గన్గొని=తన శరీరమునందలి కుడిభాగమును గనుగొని. చోద్య మందున్ = చోద్యపడును-ఆశ్చర్యపడును. దాపటిదెసఁ జూచి=ఎడమవైపు చూచి, అచ్చెరువుపాటు = అచ్చెరుపాటును, వహించున్ = పూనును. కటకటా ! = అదిరదిరా !

తాత్పర్యము :- కాశీనగరమున ఒకనొక తీరైన నిద్దురలోఁ గన్నుమూసి. అంతలోనే కన్నుదెఱచి, తమ మనస్సంపుటములో ఒకేసారి ఆఁడుతెఱఁగును, మగ వాని లక్షణమును సంతరించుచున్న ప్రాణిసమూహములు తమ శరీరమునందలి కుడి భాగమును జూచి చోద్యపడుచుండును. ఇంతలోనే ఎడమవైపుఁ జూచికొని అచ్చెరు పాటు వహించుచుండును. ఆ ప్రాణుల కెంతటి విచిత్రదశ ఘటిల్లినది ! కటకటా !

విశేషము :- సారూప్యముక్తియందు అర్ధనారీశ్వరత్వము సంప్రాప్తమైనది యనుట ఆ ప్రాణుల కింకను ఆ విషయము తెలియలేదను విషయమును 'కటకట' అన్నది సూచించుచున్నది.

మ. గృహమేధి ప్రవరుండు విప్రుఁడమృతక్షేత్రంబు వారాణసిన్
ద్రుహిణక్షేత్రము వాసి పోవ దలఁచెన్ దూరంబుగా వెండియున్
మహిఁ గైవల్యదతీర్థముల్ గలిమి సంభావించి శాస్త్రజ్ఞతన్;
బహుధా విప్రతిపత్తి ధీవిషయముల్ పాడైన శాస్త్రార్థముల్.101

అర్థము :- శాస్త్రజ్ఞతన్ = శాస్త్రజ్ఞుఁడై యుండుటవలన. గృహమేధి ప్రవరుండు = గృహస్థులలో శ్రేష్ఠుఁడైన. విప్రుఁడు = బ్రాహ్మణుఁడైన శివశర్మ (మతీయును-విప్రుఁడు; పశ్చిమబుద్ధియైన శివశర్మ). 'అమృతక్షేత్రంబు' అమృత= కైవల్యమునకు, క్షేత్రంబు = స్థానమైన, వారాణసిన్ = వారాణసిని, ద్రుహిణ క్షేత్రము = బ్రహ్మక్షేత్రమైన ప్రయాగను, పాసి = విడిచి, మహిన్ = భూమియందు, 'కైవల్యదతీర్థముల్' కైవల్యద = కైవల్యదప్రదములైన, తీర్థముల్ = తీర్థములు, కలిమి = కలిగియుండుటను, సంభావించి = సంభావనముచేసి, వెండియున్ = మతీయును, దూరంబుగాన్ = దూరముగా, పోవఁదలఁచెన్ = పోనెంచెను. 'పాడైనశాస్త్రార్థముల్' పాడైన = భ్రష్టు పట్టించెడు, శాస్త్రార్థముల్ = శాస్త్ర విషయములు, బహుధా = అనేకవిధములుగా, 'విప్రతిపత్తి ధీవిషయముల్' విప్రతిపత్తిధీ = విరుద్ధబుద్ధిని, విషయముల్ = గోచరింపఁజేయునవి.

శాత్పర్యము :- శాస్త్రజ్ఞుఁడైయున్న దోషమువలన ఆ శివవర్మ భూమియందింకను కైవల్యప్రదములైన తీర్థములుండి యుండున్న భావనతో అమృతక్షేత్రమైన వారాణసిని, బ్రహ్మక్షేత్రమైన ప్రయాగను విడనాడి దూరదేశములకు పోవలయునని తలంచెను. అది ఆతని దోషముకాదు. ఆతఁడు చదువుకొన్న శాస్త్రముల దోషము. బహుశాస్త్రవిజ్ఞానము మనస్సునకు ఏకాగ్రతను నిలువనీయదు; ఒక దానిలో ఒకవిధముగా నుండును. ఇంకొకదానిలో ఇంకొకవిధముగా నుండును. కనుక అవి నిశ్చయజ్ఞానమును గలిగించుటకు మాఱుగా పరస్పరవిరుద్ధములైన ఆలోచనములను ప్రభవింపఁజేసి స్తిమితత్వమును పాడుచేయును - కనుక 'పాడైన' అనుట;

విశేషములు :- ఇచ్చట 'పాడైన శాస్త్రార్థముల్' అనుటలో శాస్త్రవిషయములను పరమార్థతః నిందించుట కవిహృదయము కాదు. శివశర్మకు నిశ్చయజ్ఞానము లేకపోవుటకు శాస్త్రవిషయములు కారణము కాదు. అతనికి సంభవింపనున్న నష్టమునకు జాలిపడి కవి అతని బుద్ధిదోషమును శాస్త్రములయందు ఆరోపించుచున్నాఁడని మాత్రం గ్రహించుట యుక్తము.

అలంకారము :- అర్థాంతరన్యాసము. విశేషముచేత సామాన్యము సమర్థింపఁబడినది.

సీ॥ ఆనంద విపిన పుణ్యానుభావాధిక్య
మెఱుఁగడా తానేమి యెల్ల యదియు
తెలియఁడా తానేమి దేవలోకారోహ
నిశ్రేణియగు గంగ నిత్యమహిమ
మణికర్ణికాతీర్థ మాహాత్మ్య విభవంబుఁ
జూడఁడా తానేమి సూక్ష్మదృష్టి
నరయఁడా తానేమి యామ్నాయములఁ బురా
ణేతిహాసముల విశ్వేశు గరిమ

తే. నకట! పుణ్యప్రమాణాంత రానువృత్తి
నుదక మున్నత భూమియందుఁడ లేక
పల్లమున కోడిగిల్లిన పగిది నతఁడు
కదలెఁ దీర్థాంతరములకుఁ గాశినుండి. 102

అర్థము :- తాను = ఆ శివశర్మ 'ఆనందవిపిన పుణ్యానుభావాధిక్యము' ఆనందవిపిన = ఆనందకాననమైన కాశీనగరముయొక్క, పుణ్యానుభావ=పవిత్రానుభావముయొక్క, ఆధిక్యము = గొప్పఁదనము. ఎల్ల యదియున్ = సమస్తమును. ఎఱుఁగడా యేమి ? = తెలియఁడా యేమి ?

తాను = ఆ శివశర్మ, 'దేవలోకారోహనిశ్రేణియగు' దేవలోక = స్వర్గలోకముయొక్క, ఆరోహ = ఎక్కుటకు, నిశ్రేణియగు = విచ్చేనయైన, గంగ =

గంగానదియొక్క. నిత్యమహిమన్ = శాశ్వతమహిమను. తెలియఁడా యేమి ? = తెలియనివాఁడా యేమి ?

తాను = ఆ శివవర్మ, 'మణికర్ణికాతీర్థ మాహాత్మ్యవిభవంబున్' మణికర్ణికా తీర్థ = మణికర్ణికా తీర్థముయొక్క, మాహాత్మ్య విభవంబున్ = మాహాత్మ్య వైభవమును, సూక్ష్మదృష్టిన్ = సూక్ష్మదృష్టితో, చూడఁడా యేమి ? = విచారింపఁడా యేమి ?

తాను = ఆ శివశర్మ, ఆమ్నాయములన్ = వేదములయందును. పురాణేతిహాసములన్ = పురాణములయందు . ఇతిహాసములయందు. విశ్వేశుగరిమన్ = విశ్వేశ్వరస్వామి గొప్పఁదనమును, అరయఁడాయేమి ? = చూడఁడాయేమి ?

'నానాప్రమాణాంతరానువృత్తిన్' నానా = నానావిధములైన.పలురకములైన. ప్రమాణాంతర = అన్యప్రమాణములయొక్క, అనువృత్తిన్ = అనుసరించుటచేత. ఉదకము = నీరు. ఉన్నతభూమిపైన్ = మెట్టప్రదేశముపై. ఉండలేక = నిలువలేక. పల్లమునకున్ = పల్లపుభూమికి, ఓడిగిల్లినపగిదిన్ = జాతీనమాదిరిగా, అతఁడు = ఆ శివశర్మ, కాశినుండి = కాశీక్షేత్రమునుండి, తీర్థాంతరములకున్ = అన్యతీర్థములకు, కదలెన్ = కదలెను. ఆకట ! = అయ్యో !

తాత్పర్యము :- ఆ శివశర్మ ఆనందకాననమైన కాశీక్షేత్రము యొక్క పవిత్రానుభావమంతయును ఎఱుఁగనివాఁడా యేమి ?

స్వర్గసోపానపంక్తియైన గంగానదియొక్క శాశ్వతమహిమ తెలియనివాఁడా యేమి ?

మణికర్ణికాతీర్థముయొక్క మాహాత్మ్యవైభవమును సూక్ష్మదృష్టితో విచారింపఁడా యేమి ?

వేదములలో, పురాణములలో, ఇతిహాసములలో విశ్వేశ్వరస్వామి గొప్పఁదనమును జూడనివాఁడా యేమి ?

నానావిధములైన యితర ప్రమాణముల ననుసరించి నీరు మెట్టప్రదేశముపై నిలువలేక పల్లపునేలకు జాతిపోయినట్లు కాశినుండి అన్యతీర్థములకుఁ గదలిపోయెను. అయ్యో !

వ. కదలికతిపయ ప్రయాణంబుల. 103

అర్థము :- కదలి=కదలి. కతిపయప్రయాణంబులన్ = కొన్ని మజిలీలలో.

సీ॥ ఏవీటి శృంగార మెల దోఁటలోనుండుఁ
గదలకెప్పుడుఁ గాలకంధరుండు
ప్రతియుగంబునను నేపట్టణంబునకును
దివ్యాభిధానంబుఁ దిరుగుచుండు
జేనంట జేనంట శివలింగములు గోటి
సంఖ్య నేపురమునఁ జాలనొప్పి
కల్పాంతవేళ నేకటకంబు మునుఁగదు
నింగితోరాయు మున్నీటివెల్లి

తే. నట్టి మహిమల యుజ్జని కరుగుదెంచి
కాళి దర్శించి శ్రీమహాకాళుఁ గొలిచి
యుండె శివశర్మ హరరాజయోగపరత
నిఖిల ముక్తుల కచ్చోటు నెలవుగాన. 104

అర్థము :- 'ఏవీటి శృంగార మెలదోఁటలో నుండున్' ఏవీటి = ఏ నగరము శృంగార మెలదోఁటలోన్ = శృంగారపు మెలదోఁటలో. [ఉండున్ = ఉండునో. కదలక = అచ్చటనుండి కదలక. కాలకంధరుండు = శివుఁడు: [మహాకాలశివుఁడు: ప్రతియుగంబునను = ప్రతి యుగమునందును, [ఏ పట్టణంబునకును = ఏ పట్టణమునకు. దివ్యాభిధానంబు = దివ్యనామధేయము, తిరుగుచుండున్ = మాఱుచుండునో.

జేనంట జేనంటన్ = జేనెడు జేనెడు మేరకు. శివలింగములు = శివలింగములు. కోటిసంఖ్యన్ = కోటి సంఖ్యతో. ఏ పురమునన్ = ఏ పురమునందు, చాలన్ = సమృద్ధిగా. ఒప్పున్ = ప్రకాశించుచుండునో. కల్పాంతవేళన్ = కల్పాంత కాలమునందుఁగూడ. ఏ కటకంబు = ఏ నగరము. నింగితోన్ = ఆకాశముతో. రాయు = ఒరయుచున్న, మున్నీటివెల్లిన్ = సముద్రపువెల్లిలో, మునుఁగదు = మునిఁగిపోదో, 'అట్టి మహిమల యుజ్జనికిన్' అట్టి మహిమల = అటువంటి మహిమలు గల, ఉజ్జనికిన్ = ఉజ్జయినీ నగరమునకు, అరుగుదెంచి = వచ్చి, కాళిన్ = మహాకాళిని. దర్శించి = దర్శనముచేసి. శ్రీమహాకాళున్ = శ్రీమహాకాళనాథుని, కొలిచి = సేవించి, అచ్చోటు = ఆ ప్రదేశము. నిఖిల ముక్తులకున్ = సకల

ముక్తులకును. నెలవుగానన్ = నిలయము గనుక. శివశర్మ = శివశర్మ. హఠరాజ యోగపరతన్ = హఠయోగమునందును - రాజయోగమునందును. ఆసక్తుఁడై, ఉండెన్ = ఉండెను.

తాత్పర్యము:- శృంగారరసమునకు విడిదిపట్టైన యే వీటితోఁటలోఁ గాల కంఠు డెప్పుడును కదలకయుండునో, యుగయుగమునకు ఏ పట్టణము పేరు పరి వృత్తి నొందుచుండునో, జేనంట జేనంట శివలింగములు కోటిసంఖ్యలో ఏవీట మిక్కిలి ప్రకాశించుచుండునో, కల్పాంత ప్రళయములలో మిన్నులతో రాయు ముస్సీటి వెల్లిలో సైతము ఏ పట్టణము మునిఁగిపోదో అట్టి మహిమలుగల యుజ్జయినికి వచ్చి శివశర్మ కాశికను దర్శించి మహాకాలనాథుని సేవించి ఆ ప్రదేశము నిఖిల ముక్తుల కును నెలవు కనుక హఠయోగమును, రాజయోగమును అభ్యసించుచు నచ్చట వివసించెను.

ఆ. హాటకేశ్వరుఁడు మహాకాలనాథుండుఁ
దారకేశ్వరుండుఁ దలిరుబోఁడి!
ఉబ్బి లింగములయి యున్నారు పాతాళ
మర్త్య నాక భువనమండలముల. 105

అర్థము :- తలిరుపోఁడి ! = చిగురుటాకువంటి శరీరము గలదానా ! హాట కేశ్వరుఁడు = హాటకేశ్వరుఁడును, మహాకాలనాథుండున్ = మహాకాలనాథుఁడును, తార కేశ్వరుండున్ = తార కేశ్వరుఁడును, 'పాతాళ మర్త్యనాక భువనమండలములన్' పాతాళ = పాతాళ భువనమండలమునందును, మర్త్య = మర్త్య భువనమండలము వందును, నాక = నాకభువన మండలమునందును. ఉబ్బి = ఆవిర్భవించి, లింగము లయి = లింగాకారులై, ఉన్నారు = ఉన్నారు.

తాత్పర్యము :- పరమశివుఁడు పాతాళ భువనవలయమునందు హాటకేశ్వర లింగముగను, మర్త్య భువనవలయమునందు మహాకాల లింగముగను, నాకభువన వలయమునందు తారకేశ్వరలింగముగను ఉబ్బియున్నాఁడు.

విశేషము :- 'హాటకేశో మహాకాల స్తారకేశ స్తథైవచ
ఏకలింగం త్రిధాభూత్వా త్రిలోకీం వ్యాప్యసంస్థితం జ్యోతిః'
అని మూల కాశీఖండములో నున్నది.

ఉ. కందవు గాజుపాఱవు వికారమునొందవు పూతిగంధమున్
జెందవు వాడవప్పురము సీమల నెల్లెడ వామకర్ణముల్
క్రిందుగ దీర్ఘనిద్రలు ధరించి శయించిన జంతుదేహముల్
సుందరి! యిట్టి చోద్యములు చూడము తక్కిన తీర్థభూములన్. 106

అర్థము :- 'అప్పురము సీమలనెల్లెడన్' అప్పురము = ఆ యుజ్జయినీ పురముయొక్క, సీమలన్ = పొలిమేరలయందు, ఎల్లెడన్ = అన్ని ప్రదేశముల లోను వామకర్ణముల్ = ఎడమ చెవులు, క్రిందగునట్లుగా. దీర్ఘనిద్రలు = పెద్ద నిద్దురలను, ధరించి = తాల్చి, శయించిన = పరుండిన, జంతుదేహముల్ =ప్రాణుల శరీరములు. కందవు = నలుపెక్కవు, గాజువాఱవు (గాజు+పారవు -గాజువాఱవు)= కాంతివిహీనములు కావు, వికారము నొందవు = మార్పును పొందవు, పూతిగంధమున్ = దుర్గంధమును, చెందవు = కాంచవు, వాడవు = వాడిపోవు, సుందరి ! = ఓ సుందరీ !, తక్కిన తీర్థభూములన్ = మిగిలిన తీర్థప్రదేశములలో, ఇట్టి చోద్యముల్ = ఈ మాదిరి ఆశ్చర్యములను, చూడము = చూడఁబోము.

తాత్పర్యము :- ఆ యుజ్జయినీపురము నాల్గు పొలిమేరలలో నెచ్చటఁ జూచినను ఎడమ చెవులు క్రిందుగా దీర్ఘనిద్రలు పూని శయనించియున్న ప్రాణుల శరీరములు నలుపెక్కవు. కాంతివిహీనము కావు, మార్పును పొందవు. దుర్గంధమును బొరయవు, చక్కనిదానా ! తక్కిన తీర్థస్థలములలో ఈ రీతి చోద్యములు చూడఁబోము.

కం. లీల! మహాకాల! మహా
కాల మహాకాల! యనుచుఁ గడుభక్తి మహా
కాల స్థానాధీశ్వరుఁ
గాలగళున్ సంస్మరింపఁ గాంతురు ముక్తుల్. 107

అర్థము :- 'మహాకాల ! మహాకాల ! మహాకాల !' అనుచున్ = అని పలుకుచు, కడుభక్తిన్ = సమధికమైన భక్తిభావముతో, 'మహాకాలస్థానాధీశ్వరున్' మహాకాలస్థాన = ఉజ్జయినీ క్షేత్రమునకు అధీశ్వరుఁడైన, కాలగళున్ = కాలకంఠుడైన శివుని, సంస్మరింపన్ =తలఁచికొనఁగా, లీలన్ = అనాయాసముగా, ముక్తుల్ = కైవల్యమును, కాంతురు = కాంచెదరు.

తాత్పర్యము :- నిశ్చల భక్తితో 'మహాకాల ! మహాకాల ! మహాకాల !' అని ముమ్మారు మహాకాలస్థానాధీశ్వరుఁడైన కాలకంఠుని సంస్మరించినంతమాత్రనే అలవోకగా ప్రాణులు కైవల్యపదము నొందెదరు.

విశేషములు :- ఉజ్జయినికి 'మహాకాల' మనియును పేరు.

'అప్యన్యస్మిన్ జలధర! 'మహాకాల' మాసాద్యకాలే (మేఘసందేశము).

తే. భవు మహాకాలు సేవించి బ్రాహ్మణుండు
కదలెఁ గాంచికి నక్కాఁంచికాపురమునఁ
గలిమి వేడుకక త్తె శ్రీకామకోటి
గవయు నేకామ్రనాథునిఁ గరిగిరీశు. 108

అర్థము :- బ్రాహ్మణుండు = శివశర్మ, భవున్ =శివుఁడైన. మహాకాలున్= మహానాథుని. సేవించి = ఆరాధించి. కాంచికిన్ = కాంచీపురమునకు. కదలెన్ = బయలుదేరెను, అక్కాఁంచిపురమునన్ = ఆ కాంచిపురమునందు. కలిమి వేడుకక త్తె= లక్ష్మివిలాసిని. కరిగిరీశున్ = హస్తిశైలాధీశ్వరుఁడైన వరదరాజస్వామిని, శ్రీకామకోటి = శ్రీకామాక్షీదేవి, ఏకామ్రనాథునిన్ = ఏకామ్రేశ్వరుని. కవియున్= పైకొనును. ('కలిమి వేడుకక త్తె శ్రీకరిగిరీశుఁ గవయు నేకామ్రనాథు శ్రీకామకోటి' అని యుండఁదగును.)

తాత్పర్యము:- ఆ బ్రాహ్మణుఁడు మహాకాలశివుని సేవించి కంచికి కదలెను. ఆ కాంచీనగరమునందు కలిమిచేడియ కరిగిరీశ్వరుని శ్రీకామాక్షి యేకామ్రనాథుని ఎనసియుందురు.

ఉం.కంచికిఁబోయి బ్రాహ్మణుఁడు కాంచెమదావళ భూమిభృచ్చిరఃకాంచనకందరా నిలయుఁ గైటభమర్దనుఁ, గామకోటి, దర్శించి భజించె బాలశశిరేఖరు నేకరసాల నాయకున్
దంచె ననేక పూర్వాజననంబులఁ బుట్టిన పాతకౌఘముల్. 109

అర్థము :- బ్రాహ్మణుఁడు = శివశర్మ. కంచికిఁబోయి = కాంచీనగరము వకు వెళ్ళి, 'మదావళ.... నిలయున్' మదావళభూమిభృత్ = హస్తిశైలమునియొక్క

శిరః = శిరఃప్రదేశమునందలి. కాంచనకందరా = బంగారు గుహ. నిలయున్ = నెలవుగాఁగల. కైటభమర్దనున్ = విష్ణువును, కాంచెను = చూచెను, కామకోటిన్ = కామాక్షిని. దర్శించి = దర్శనముచేసి, బాలశశిశేఖరున్ = బాలచంద్రధరుఁడైన, ఏకరసాల నాయకున్ = ఏకామ్రనాథుని, భజించెన్ = సేవించెను.' అనేక పూర్వ జననంబులన్ = పూర్వజన్మములయందు, పుట్టిన = పుట్టుటకుఁ గారణమైన. పాత కౌఘముల్ = పాపసమూహములను, దంచెన్ = చూరము చేసెను.

తాత్పర్యము :- శివశర్మ కంచికిఁపోయి కరిగిరి శిరంః కాంచన కందరా నివాసియైన వరదరాజస్వామిని గాంచెను, శ్రీకామకోటిని దర్శించి, బాలశశాంకధరుఁడైన యేకరసాలేశ్వరుని సేవించెను. అనేక జన్మసంచితములైన పాపసంఘాతములను చూర్ణీకరించెను.

సీ॥ ముడువంగ నేర్తురు మూల దాఁపటికిరాఁ
జికురబంధము లీఁగ జీరువాఱఁ
బొన్నపువ్వులఁ బోలు పొక్కిళ్ళు బయలుగాఁ
గట్టనేర్తురు చీరఁ గటిభరమునఁ
దొడువంగనేర్తురు నిడుఁవేలుఁ జెవులయం
దవతంసకంబుగా నల్లిపువ్వు
పచరింప నేర్తురు పదియాఱు వన్నియ
పసిఁడి పాగడలిలఁ బట్టు వెంపఁ

తే. బయ్యెదయు సిగ్గుఁ బాలిండ్లఁ బ్రాఁకనీక
తఱచు పూయుదురోల గందంపుఁ బసపు
బండెకత్తెలు సురత ప్రపంచవేళఁ
గంచి యఱవత లసమాస్త్ర ఖడ్గలతలు. 110

అర్థము :- మూల = కోణము. దాఁపటికిరాన్ = ఎడమవైపునకు వచ్చు రీతిని ఈఁగ = ఈగ, జీరువాఱన్ = జాఱిపోవుమాదిరిగా, చికురబంధము=క్రుమ్ముడిని. ముడువంగన్ = ముడిచికొనఁగా, నేర్తురు = నేర్పుగలిగియుందురు, పొన్న పువ్వులఁబోలు = పొన్నపువ్వులనుపోలునట్టి, పొక్కిళ్ళు = ఆవర్తనాభులు. సుడుల

వంటి నాభులు, బయలుగాన్ = బయలగురీతిని. కటిభరమునన్ = జఘనచక్రభరమునందు. చీరన్ = చీరను, కట్టనేర్తురు = ధరించునేర్పుగలిగి యుందురు. నిడుప్రేలుఁజెవులందున్ = నిడుపుగావేర్లు చెవులయందు. అవతంసకంబుగాన్ = కర్ణావతంసముగా. అల్లిపువ్వున్ = కలువపువ్వువంటి యొకజలపుష్పమును. తొడువంగన్ = తొడిగికొనఁగా, నేర్తురు = నేర్పుగలిగి యుందురు. 'పదియాఱువన్నియ పసిఁడి పాగడలు' పదియాఱువన్నియ = పదునాఱవ వన్నెగల, పసిఁడి పాగడలు = బంగారు పాగడలను - పాదభూషావిశేషములను, ఇలన్ = నేలయందు, పట్టువెంపన్ = ఆలంబనమును పెంచురీతిని, పచరింపనేర్తురు = అమరించు నేర్పుగలిగియుందురు, పాలిండ్లన్ = స్తనమండలమలందు, పయ్యెదయును = పయటయును, సిగ్గును = లజ్జను, ప్రాఁకనీక = ప్రసరింపనీక, ఓలగంధంపుఁబసపున్ = గంధసారమిశ్రిత మైన పూఁతపసపును, తఱచు పూయుదురు = దట్టముగాఁ బూయుదురు. 'సురత ప్రపంచవేళన్' సురత = రతియొక్క, ప్రపంచ = విస్తరించునట్టి, వేళన్ = సమయమునందు. బండెకత్తెలు = చెఱలో వేయువారు. కంచి యబలతలు = కంచిలోని అవస్త్రీలు. అసమాస్త్రి ఖడ్గలతలు = మన్మథునిఖడ్గవల్లికలు.

తాత్పర్యము :- కంతుని ఖడ్గవల్లికలైన కాంచీనగరములోని-అబలస్త్రీలు-ఎడమవైపునకుఁ గోణము వేలునట్లు-ఈఁగలు వ్రాలినచో జాఱిపోవునంత నునుపు దేలునట్లు కేశబంధము మఁడిచికొనునేర్పు గలిగియుందురు. పొన్నపువ్వులవంటి బొడ్డుసుడులు బయలువడురీతిని - జఘనభరమునందు. చీరకట్టనేర్తురు. నిడుపుగా వేర్లు చెవులయందు-అవతంసకముగా అల్లిపువ్వును అమర్చి కొనునేర్పు గలిగి యుండుదురు. పదునాఱవ వన్నె పసిఁడిపాగడలను (మట్టెలను)నేలపై పట్టుచిక్కనట్లు ధరింపనేర్తురు. వారు ద్రవిడస్త్రీలు కనుక కంచుకము దాల్పరు. దళముగా-ఓలగందంపుఁబసపు స్తనమండలముపైఁ బూసికొందురు. ఆ దట్టపుఁబసపుఁబూఁతయే వారికి అవికకుఁ బ్రత్యామ్నాయము. వారు - ప్రపంచించు సురత సమయముల యందు చెఱసాలలో నుంచినట్లు మగలను నిర్బంధములో నుంచెదరు.

తే॥ కాంతియందురు కొంద ఱక్కాంచిపేరు
కమ్రకురువింద రత్న సత్కాంతి కలిమి
నప్పురంబున నేడు నాళ్లధివసించి
బ్రాహ్మణుఁడు సర్వదేవతాప్రతిఁ గొలిచె. 111

అర్థము :- కొందఱు = కొందఱు విద్వాంసులు, అక్కాంచిపేరు = ఆ కాంచీనగరముపేరు, కాంతి యందురు = 'కాంతి' అనియందురు. 'క్రమకురువింద రత్నసత్కాంతి కలిమిన్' క్రమ = ఇంపైన, కురువింద రత్న = (పసుపుదాళగల-కాలపురమునందు పుట్టిన-మధ్యమజాతి మాణిక్య విశేషము) కురువిందరత్నములయొక్క,సత్కాంతి = శ్రేష్ఠమైనకాంతి, కలిమిన్=కలిగియుండుటచేత: ఆప్పురమునన్=అట్టికాంచీపురమునందు, బ్రాహ్మణుండు = శివశర్మ, ఏడునాళ్లు = ఏడు దినములు, అధివసించి = నివసించి, సర్వదేవతాప్రతతిన్ = సర్వదేవతా సమూహమును, కొలిచెన్ = సేవించెను.

తాత్పర్యము :- ఇంపైన కురువిందరత్నములకాంతి-ఆనగరమున సమృద్ధిగా నుండుటవలన-కొందఱు విద్వాంసులు-ఆ కాంచీనగరము పేరు 'కాంతి' అని యందురు. శివశర్మ ఆనగరములో ఏడునాళ్లుండి ఆచ్చటి సర్వదేవతలను సేవించెను.

విశేషములు :- సంస్కృత కాశీఖండములో-'కాంచి' అనుపేరే లేదు. "కాంతీ" అని కాంతీ శబ్దము-ఈకారాంతముగా నున్నది.

'జగామ నగరీం కాంతీం కాంతాం త్రిభువనాదపి' అని మాత్రమేయున్నది. మఱియును-కామాక్షి ప్రసక్తికాని. ఏకామ్రనాథుని ప్రసక్తికాని-అందులో లేదు.

వ॥ అందుండి ప్రభాస క్షేత్రంబు మీఁదుగాఁ జని. 112

అర్థము :- అందుండి=ఆకాంచీసగరమునుండి, ప్రభాసక్షేత్రంబు మీఁదుగాఁ జని = పశ్చిమసముద్రతీరస్థమైన ప్రభాసతీర్థముమీఁదుగావెళ్ళి.

కం. ద్వారవతీ నగరంబునఁ
గోరిక శివశర్మయుండి కొన్నిదినంబుల్
నారాయణ పుణ్యకథా
పారాయణుఁ డయ్యెఁ బరమభాగవతులతోన్. 113

అర్థము :- ద్వారవతీనగరంబునన్ = ద్వారకానగరమునందు, కోరికన్ = ప్రీతితో, శివశర్మ = శివశర్మ, ఉండి = నివసించి, పరమభాగవతులతోన్ = పరమభాగవతులతోఁ గలసి, 'నారాయణ పుణ్యకథా పారాయణుఁడు' నారాయణ = శ్రీమన్నారాయణునియొక్క, పుణ్యకథా = పావనకథలయొక్క, పారాయణుఁడు=

పారమునందు = అయనముకలవాఁడు – ప్రయాణించినవాఁడు–లేక–పారాయణము చేసినవాఁడు, అయ్యెన్ = అయ్యెను.

తాత్పర్యము :– శివశర్మ ద్వారకకు వెళ్ళి ప్రీతితో నచ్చటఁ గొన్ని నాళ్లుండి నారాయణ పుణ్యకథా పారాయణుఁడయ్యెను,

తే॥ ధవళలోచన! యొక్క– చోద్యంబు వినుము
ద్వారవతియందుఁ జచ్చినవారి యెముడలి
యస్థిశకలంబులం దంతరాంతరములఁ
దనరు శ్రీపాంచజన్య సుదర్శనములు. 114

అర్థము :– ధవళలోచన !=ఓ సితవిలోచనా !, ఒక్క– చోద్యంబు వినుము= ఒక యాశ్చర్యమును వినుము. ద్వారవతియందున్ = ద్వారవతీనగరమునందు. 'చచ్చినవారి యెముడల యస్థిశకలంబులందున్' చచ్చినవారి = మరణించినవారి యొక్క–, అస్థిశకలంబులందున్ = ఎముకల ముక్క–లలో, అంతరాంతరములన్= లోపల లోపల, శ్రీపాంచజన్య సుదర్శనములు = శ్రీమహావిష్ణువుయొక్క–, శంఖ చక్రములైన పాంచజన్య సుదర్శనముల ముద్రలుండును.

తాత్పర్యము :– ధవళవిలోచనా! ఒక్క– చోద్యమును వినుము. ద్వారవతిలో మరణించినవారి అస్థిశకముల అంతరాంతరముల లోపల శ్రీమహావిష్ణువుయొక్క– దివ్యాయుధములలో ప్రప్రథమములైన శ్రీపాంచజన్య సుదర్శనముల ముద్రలు హత్తికొని యుండును.

ఉ. కాంచన కేతకీ కుసుమ గర్భదళోదర సోదరప్రభా
భ్యంచితమై పటీర ఘుసృణాగురు సారభలత్కృతోఁ బిసా
ళించుచుఁ గమ్మనై పరిమళించు సముజ్జ్వలగోపిచందనం
బించిన వేడ్క–తోడ ధరియింతురు భాగవతోత్తముల్ పురిన్ .115

అర్థము :– పురిన్ = ద్వారకాపురియందు, భాగవతోత్తముల్ = భాగవత శ్రేష్ఠులు, కాంచన.... అభ్యంచితమై' కాంచన కేతకీ కుసుమ = పసిఁడి గేదంగి పూవుయొక్క–, గర్భదళ = నడిమి పేకుయొక్క–, ఉదర = మధ్యభాగమునకు,

సోదర = అన్నదమ్ములవంటిదైన, ప్రభా = కాంతితో, అభ్యంచితమై (అభి + అంచితమై) = మిక్కిలియు నొప్పినదియై, 'పటీర .... లక్ష్మితో' పటీర = మంచి గంధముయొక్క, ఘుస్మృణ = కుంకుమముయొక్క, అగురు = అగురు ద్రవ్యము యొక్క, సౌరభలక్ష్మితోన్ = సౌరభసంపదతో, పిసాళించుచున్ = వ్యాపించుచు, కమ్మనై = ఘ్రాణతర్పణమై, పరిమళించు = సువాసనలీనుచున్న, గోపిచంద నంబు = గోపిచందనమును, ఇంచిన = సమ్మతమైన, వేడ్కతోన్ = కుతూహల ముతో, ధరియింతురు = తాల్చెదరు.

తాత్పర్యము :- పసిఁడి గేదగి పూవు నడిమిపేకుయొక్క కాంతికి అన్న దమ్ములవంటి కాంతితో, చందన, కుంకు, మాగురు, సౌరభసంపదతో వ్యాపించు నట్టి సువాసనలుగల గోపిచందనమును ద్వారవతియందలి భాగవతులు మిక్కిలి మక్కువతో ధరింతురు.

తే॥ రమణి! ధరియింతు రూర్ధ్వపుండ్రములు మెఱయ
ఫాలతలమున నవ్వీటభాగవతులు
కఠిన పాపపరంపరా కంఠనాళ
ఖండన ప్రక్రియా క్రూరఖడ్గలతలు॥ 113

అర్థము :- రమణి ! = రమణీ !, అవ్వీటన్ = ఆ ద్వారవతియందు, భాగవతులు = భాగవతులు, ఫాలమునన్ = నొసటియందు, 'కఠిన.... ఖడ్గలతలు' కఠిన = కఠినములైన, పాపపరంపరా = పాపపరంపరలయొక్క, కంఠనాళ = కంఠనాళములయొక్క, ఖండన ప్రక్రియా = ఖండన వ్యాపారమునందు, క్రూర= క్రూరములైన, ఖడ్గలతలు = ఖడ్గలతలైన, ఊర్ధ్వపుండ్రములు = ఊర్ధ్వపుండ్రము లను, మెఱయన్ = మెఱయునట్లుగా, ధరియింతురు = తాల్తురు.

తాత్పర్యము :- రమణీ ! ఆ ద్వారవతియందలి భాగవతోత్తములు తమ నొసలులపై పాపపరంపరా కంఠనాళముల నుత్తరించు విచ్చుకత్తులవలె తళతళ మెఱయుచున్న ఊర్ధ్వపుండ్రములను ధరియింతురు.

సీ॥ కమనీయ గోపికాగంధసారంబున
నూర్ధ్వపుండ్రములు బాగొప్పఁ దీర్చి

వక్షస్థలంబుల వనజాక్షీ మాలికా
చారునై పథ్యంబు సంతరించి
దక్షిణ శ్రవణ రంధ్రములఁ గోమలకృష్ణ
తులసీప్రవాళంబు లలవరించి
నలినలోచన దివ్యనామ సంకీర్తనా
భంగికి జిహ్వాలఁ బాలుఁ వెట్టి

తే॥ ద్వారవతియందు ముక్తికాంతావిహార
మంటపమ్ముల నుండ్రు నిర్మల వివేక
నిరభిసంధి కృపాగుణ నిర్ణిరోధ
పరమభాగ్యాన్వితులు మహాభాగవతులు. 117

అర్థము :- 'కమనీయ గోపికాగంధసారంబునన్' కమనీయ = ఇంపైన, గోపికాగంధసారంబునన్ = గోపీచందనముతో, ఊర్ధ్వపుండ్రములు = పంగనామములు. బాగొప్పన్ = అందమొలుకు రీతిని, తీర్చి = తీరిచి దిద్ది; వక్షస్థలంబులన్ = తొమ్మి పట్టెలమీఁద. వనజాక్షమాలికా = తామర పూసల మాలలతో. చారు = రమ్యమైన, నైపథ్యంబు = అలంకరణమును, సంతరించి = రచించి, దక్షిణ శ్రవణ రంధ్రములన్ = కుడిచెవి రంధ్రములయందు, కోమల = మెత్తని, కృష్ణ తులసీ = కృష్ణతులసియొక్క. ప్రవాళంబులు = చివుళ్ళను, అలవరించి = అలవరిచి. 'నలినలోచన దివ్యనామ సంకీర్తనాభంగికిన్' నలినలోచన = కమలాక్షునియొక్క- విష్ణువుయొక్క, దివ్యనామ = దివ్యనామములయొక్క, సంకీర్తనాభంగికిన్ = సంకీర్తనాప్రకారమునకు. జిహ్వాలన్ = నాలుకలను, పాలువెట్టి = పాలుపఱిచి, ద్వారవతియందున్ = ద్వారవతీనగరమునందు, 'నిర్మల వివేక....భాగ్యాన్వితులు' నిర్మల = రజస్తమస్సుల మాలిన్య మంటని స్వచ్ఛమైన, వివేక = వివేకముయొక్క, నిరభిసంధి=కపటములేని, కృపాగుణ = కృపాగుణముయొక్క, నిర్ణిరోధ= అడ్డులేని, పరమభాగ్య = పరమభాగ్యముతో, అన్వితులు = కూడికొనిన. మహాభాగవతులు = పరమభాగవతులు, 'ముక్తికాంతా విహారమంటపమ్ములన్' ముక్తికాంతా = ముక్తికాంతయొక్క, విహారమంటపమ్ములన్ = క్రీడామంటపమ్ములయందు, ఉండ్రు = ఉందురు.

తే॥ ప్రతి యుగంబును ద్వారకాపట్టణంబు
ముంచి రత్నంబులెల్లను ద్రుచ్చిలించి
కొంచుఁ బోయెడి కతమునఁ గువలయాక్షి!
యబ్ధికొడఁగూడె రత్నాకరాహ్వయంబు. 118

అర్థము :- కువలయాక్షి! = కలువకంటీ!, ప్రతి యుగంబును = యుగ యుగమునందు, ద్వారకాపట్టణంబున్ = ద్వారకాపట్టణమును, ముంచి = ముంచి, రత్నంబులెల్లను = రత్నములన్నియును, ద్రుచ్చిలించి = దొంగిలించి, కొంచుఁ బోయెడి కతమునన్ = తీసికొనిపోవుచున్నందువలన, అబ్ధికిన్ = సముద్రమునకు, 'రత్నాకరాహ్వయంబు' రత్నాకర = రత్నాకరమనెడి, ఆహ్వయంబు = పేరు, ఒడఁగూడెన్ = ఒడఁగూడెను.

తాత్పర్యము :- ప్రతి యుగమునందును ద్వారకానగరమును ముంచి యందలి రత్నములన్నియును సముద్రుఁడు దొంగిలించి తీసికొని పోవుచున్నందు వల్లనే రత్నాకరుఁ డనుపేరు ఆ సముద్రున కొనఁగూడెను.

విశేషములు :- కావ్యలింగాలంకారము.
'సమర్థనీయస్యార్థస్య కావ్యలింగం సమర్థనం'.

సీ॥ కట్టురింగులు వాఁగటిభాగమునయందుఁ
బసిఁడి కమ్ముల పచ్చపట్టుచేల
వక్షస్థలంబున వనమాల ధరియించుఁ
గౌస్తుభగ్రైవేయకమునఁ గూర్చి
సేసకొప్పునఁ జుట్టు శిఖిపించ ధరించోళి
మక్కళించిన జిల్లు మడుగు పాగ
గొజ్జంగి పూనీరు కులికి మేదించిన
కమ్మకస్తురి మేనఁ గలయ నలఁదు

తే॥ ద్వారకాపట్టణము పొలిమేర సీమఁ
గాలవశమున నీల్గిన ఋణమునందుఁ

అర్థము :- ద్వారకాపట్టణము=ద్వారకాపట్టణముయొక్క, పౌలిమేరసీమన్= పౌలిమేర భూమియందు, కాలవశమునన్ = కాలవశమగుటవలన, ఈల్గిన క్షణము నందున్ = మరణించిన క్షణమునందు, కైటభారాతి = విష్ణువుయొక్క, సారూప్య గరిమన్ = సమాన రూపము గలిగియుండుట యను సిద్ధిని, కన్న = పొందిన, 'కీటపక్షి సరీసృప క్రిమికులంబు' కీట = పురుగులు, పక్షి = పక్షులు, సరీసృప = సర్పములు, క్రిమి = సూక్ష్మజీవులు-వీనియొక్క, కులము = సమూహము, కటి భాగమునయందున్ = కటి ప్రదేశమునందు, 'పసిఁడికమ్మల పచ్చ పట్టుచేల' పసిఁడి కమ్మల = బంగారుటంచులుగల, పచ్చపట్టు చేలన్ = పసుపుపచ్చని పట్టుబట్టను, రింగులువారన్ = కుచ్చెలువారునట్లు, కట్టున్ = ధరించును, వక్షస్థలంబునన్ = వక్షస్థలమునందు, వనమాలన్=వనమాలను, 'కౌస్తుభగైరవేయకమునన్' కౌస్తుభ= కౌస్తుభ మనెడి, గైరవేయకమునన్ = కంఠభూషణముతో, కూర్చి = ఘటించి, ధరియించున్ = ధరించును, సేసకొప్పునన్ = కొండెసిగయందు, శిఖిపింఛ రింఛో ళిన్ = నెమలికన్నుల సమూహముతో, మక్కళించిన = సరిపఱిచిన, జిగ్గి = సన్నని, మడుగుపాగన్ = పరిశుద్ధ వస్త్రముతోఁ దీర్చిన తలపాగను, చుట్టున్ = చుట్టును, గొజ్జంగి పూనీరు = గొజ్జఁగి పన్నీరు, కులికి = పూసి, మేదించిన = కలిపిన, కమ్మకస్తురిన్ = పరిమళించుచున్న కస్తూరిని, మేనన్ = శరీరమునందు, కలయనలఁదున్ = నిండారనలఁదును.

తాత్పర్యము :- ద్వారకాపట్టణము పౌలిమేరలో కాలవశమున మరణించి విష్ణుదేవునితో సారూప్యసిద్ధినందిన కీటపక్షి క్రిమిసరీసృపాదులు ఆ క్షణమందే కటి ప్రదేశమునందు బంగరుటంచుల పచ్చ పట్టుబట్ట కుచ్చెలువార్చి ధరించును. కౌస్తుభ రత్నముతోఁ గూర్చి వనమాలను వక్షస్థలమునందుఁ దాల్చును. కొండెసిగపై నెమలి పింఛముతో సరిపఱిచిన సన్నని తెల్లని వస్త్రముతోఁ దలపాగఁ జుట్టును. గొజ్జఁగి వన్నీరు పోసి కలిపిన కమ్మకస్తూరిని శరీరమంతటను గలయనల దును.

ఉ॥ ఆ పృథివీ సుపర్వుఁడు ప్రియంబున ద్వారకయందుఁ దీర్థ సే
వాపరతంత్రుఁడై యదువాసరముల్ వసియించిపోయె మా

యాపురి కమ్మహానగర మంబుజపత్ర విశాలనేత్ర! దు
ష్ప్రాపము పూర్వజన్మమునఁ బాపముచేసిన యట్టివారికిన్. 120

అర్థము :- ఆ పృథివీ సుపర్వుఁడు = ఆ భూమిసురుఁడు, ప్రియంబునన్ = ప్రీతితో, ద్వారకయందున్ = ద్వారకానగరమునందు, తీర్థసేవాపరతంత్రుఁడై = తీర్థసేవాపరుఁడై, అయిదువాసరముల్ = అయిదు దినములు, వసియించి = నివసించి, మాయాపురికిన్ = మాయాపురికి, పోయెన్ = వెళ్ళెను. అమ్మహానగరము = ఆ మాయాపురము, అంబుజపత్ర విశాలనేత్ర ! = పద్మదళ విశాలనయనా !, పూర్వజన్మమునన్ = వెనుకటి జన్మలో, పాపముచేసిన = పాపము చేసిన, మర్త్య కోటికిన్ = మనుష్యులకు, దుష్ప్రాపము = పొందరానిది.

తాత్పర్యము :- ఆ శివశర్మ ప్రియముతో ద్వారకయందలి తీర్థములను సేవించుచు అయిదు దినములుండి, మాయాపురికిఁ బోయెను. అంబుజదళ విశాలనయనా ! ఆ మాయానగరము వెనుకటి జన్మములో పాపము చేసియున్న మర్త్యులకు దుర్లభము సుమా !

వ. అన్నగరంబును గొందఱు హరిద్వారంబంద్రు. గొందఱు మోక్షద్వారంబంద్రు. కొందరు గంగాద్వారంబంద్రు. అవ్వలనన, నిర్గమించికదా! భాగీరథి భువనపావని భవ జటాజూటా టవీ కుటజకోరకంబు, మున్నీటం బెక్కి ముఖంబులం గలసె. అట్టి మాయాపురంబునందు. 121

అరము :- అన్నగరంబును = ఆమాయానగరమును, కొందఱు = కొంతమంది. హరిద్వారం బంద్రు = 'హరిద్వార' మని యందురు. కొందఱు = కొంతమంది, మోక్షద్వారం బంద్రు = మోక్షద్వారమనియందురు. కొందఱు = కొంతమంది. గంగాద్వారం బంద్రు = గంగాద్వారమని యందురు. అవ్వలనన = ఆ ప్రదేశమునుండియే, నిర్గమించికదా = వెలువడికదా. భాగీరథి = భగీరథానీతమైన గంగానది. భువన పావని = లోకములను పావనముచేయుచున్నదియై, 'భవజటా టవీ వాటికా కుటజకోరకంబు' భవ = శివునియొక్క. జటా = జడలేయనెడి = అటవీవాటికా = అరణ్యవాటికయందలి. కుటజకోరకంబు = కొండమల్లెమొగ్గ:

మున్నీటన్ = సముద్రమునందు. పెక్కుముఖంబులన్ = అనేక ముఖములుగా. కలసెన్ = కలసెను, అట్టి మాయాపురంబునందున్ = ఆటువంటి మాయాపురమునందు-

తాత్పర్యము :- ఆ. మాయానగరమును గొందఱు హరిద్వారమని. కొందఱు మోక్షద్వారమని. కొందఱు గంగాద్వారమనియు నందురు. అచ్చట నుండియే వెలువడి - శివుని జడల యడవిలోని గిరిమల్లెమొగ్గ లోకపావని. భాగీరథి. అనేక ముఖములుగా సముద్రములోఁ గలసినది. అటువంటి మాయాపురమునందు-శివశర్మ-

సీ. తీర్థోపవాసంబుఁ దీర్చి జాగరముండి
తెల్లవాఱఁగ, గంగఁ దీర్థమాడి
పితృతర్పణముఁ జేసి పిండప్రదానంబు
యవసక్తు చరువున నాచరించి
యగ్నికార్యముఁ దీర్చి హరుని నభ్యర్చించి
ములు మోదుగాకులఁ బులియఁగుట్టి
రాగి లోహండి నన్ బ్రాయి లేకుండంగ
వండి దించిన యివుర్వ్యంటకంబు

తే. కుడువఁ గూర్చుండి వడ్డించుకొనఁ దలంచు
నంతలోన శిరస్తాప మావహిల్లె,
మేనుగరు దాల్చెఁ, జలివచ్చె, మెడలు నొచ్చె,
వేఁకి తలచూపె. దాహమావిర్భవించె॥ 122

అర్థము :- తీర్థోపవాసంబున్ = తీర్థోపవాసమును.(తీర్థమునందుఁ జేయవలసిన యుపవాసమును.) తీర్చి = నిర్వర్తించి. జాగరముండి=తెల్లవార్లు మేలఁకువగా నుండి. తెల్లవాఱఁగన్=తెల్లవాఱఁగనే. గంగన్=గంగయందు, తీర్థమాడి - తీర్థస్నానమాచరించి, పితృతర్పణమున్=పితృతర్పణమును. చేసి=చేసి, యవసక్తుచరువునన్=యవలతోను, పేలపిండితోను-లేక-యవల పిండితో-వండిన హవ్యముతో. పిండప్రదానంబున్ = పిండప్రదానమును. ఆచరించి = నిర్వర్తించి, అగ్నికార్యమున్ =

హోమమును, తీర్చి = పూర్తిచేసి, హరునిన్ = శివుని. అభ్యర్చించి = పూజించి. ములు మోదుగాకులన్ = ముల్లుమోదుగాకులతో. పులియన్ = విస్తరిని. కుట్టి=కుట్టి. రాగిలోహండిన్ = తామ్రస్థాలియందు_రాగిపాత్రమునందు. నన్నాళ్ళయి = (నాను+ ప్రాయి - నన్నాళ్ళయి) పలుకు - పక్వముకామి). లేకుండంగన్ = లేకుండునట్లు. వండి = పక్వముచేసి, దించిన = ప్రొయ్యి నుండి డించిన, ఇవుర్వంటకంబున్ = (ఇవురు + వంటకము _ ఇవుర్వంటకము) తడియిగిరిన యన్నమును, కుడువఁ గూర్చుండి = తినుటకుఁ గూర్చుండి, వడ్డించుకొనన్ = వడ్డించుకొనఁగా, తలంచు వంతలోనన్ = తలఁచునంతలోనే, శిరస్తాపము = తలయేరు - తలమంట, ఆవహిల్లెన్ = క్రమ్మికొనెను, మేను = శరీరము. గరుదాల్చెన్ = గగుర్పొడిచెను_చలి వచ్చెన్ = చలిపేసెను, మెడలనొచ్చెన్ = మెడలు నొప్పులు పుట్టెను, వేఁడి = జ్వరము, తలచూపెన్ = మొదలయ్యెను. దాహము = దప్పిక. ఆవిర్భవించెను = పుట్టెను.

తాత్పర్యము:- తీర్థోపవాసముచేసి జాగరముండి_తెల్లవాఱఁగనే గంగలో తీర్థమాడి_పితృతర్పణముచేసి_యవసక్తువుతో వండిన చరువుతో పిండప్రదానము చేసి_వేలిమితీర్చి_శివార్చనముచేసి_ముల్లుమోదుగాకులతో_తళియ కుట్టికొని _ రాగి పాత్రిములో పలుకులేకుండ వండి డించిన యిగిరిన యన్నమును వడ్డించుకొనవలె ననుకొనుచుండఁగనే తలమంటవచ్చెను. ఒళ్లుపులకరము చూపెను. చలివచ్చెను. మెడలు నొప్పులు పెట్టెను. జ్వరముమొదలయ్యెను. దప్పిక పుట్టెను.

వ: అప్పుడు శివశర్మ నిజాంతర్గతంబున. 123

అర్థము:- అప్పుడు = ఆసమయమునందు, శివశర్మ = శివశర్మ. నిజాంతర్గతంబునన్ = (నిజ + అంర్గతంబున నిజాంతర్గతంబున) నిజ = తనయొక్క. అంతర్గతంబునన్ = మనస్సులోపల_

ఆ.వె: బ్రబుకు మీఁది యాసపాయంగఁ బెట్టితిఁ
జిచ్చువంటి వేఁకి వచ్చినపుడ
జలధి నట్ట నడుమ సాంయాత్రికుఁడు, కలం
బవిసి నపుడు ధనమునాసవోవె॥ 124

అర్థము:- చిచ్చువంటి వేఁడి = నిప్పువంటి జ్వరము, వచ్చినపుడ=వచ్చి

నప్పుడే. జలధి నట్ట నడుమన్ = నముద్రము నడిమధ్యలో. కలంబు=ఓడ. ఆవిసి నపుడు = పగిలినపుడు. సాంయాత్రికుఁడు = ఓడవర్తకుఁడు. ధనమునాసవోలెన్ = ఆ యోడలోనున్న ధనముమీఁది ఆశనువలె, బ్రదుకుమీఁది యాసన్ = జీవితము మీఁది యాశను, పాయయంగఁ బెట్టితిన్ = పాయఁ ద్రోసిని.

తార్పర్యము :- దావాగ్ని వంటి యీజ్వరమునన్ను చుట్టుముట్టినప్పుడే. నముద్రము నడిమధ్యలో_ఓడపగిలి పోయినంతనే యోడవర్తకుఁడు ధనముమీఁది యాశను వలె_బ్రదుకు మీఁది యాశ వదలికొన్నాను.

విశేషము :- ఉపమాలంకారము.

సీ॥ ప్రతివాసరము గృహారామసస్యక్షేత్ర
పశుపీక్షణము సేయఁ బ్రాప్తుఁ డెవ్వఁ?
డిటు మీఁదనేభంగి నిందు బింబానన
విధవ, సంసారంబు వెడలఁద్రోయుఁ?
దనయు లింకేభంగి ధన విభాగమలకై
పోరితంబులు లేక పొసఁగి యుందు?
రఖిల పురాణేతిహాసశాస్త్రాగమ
గ్రంథ సంరక్షి యెక్కఁడిది యింక?

తే॥గీ॥ నకట! మిన్నులు వడ్డచో ననదవోలె
దిక్కుమాలిన ప్రేతనై తీఱవలసె
శిరసుపై మృత్యువాడెడు శీఘ్రమునను
చావు నిక్కంబు బ్రతుకుట సంశయంబు. 125

అర్థము :- ప్రతివాసరము = ప్రతిదినము. 'గృహారామ సస్యక్షేత్ర పశువీక్షణము' గృహ = ఇండ్లు. ఆరామ = తోఁటలు. సస్యక్షేత్ర = పైరుపొలములు. పశు = జీవధనములు – (వీనియొక్క)వీక్షణమున్ = పైపరామరికను, చేయన్ = చేయఁగా, ప్రాప్తుఁడు = పనిపడినవాఁడు. ఎవ్వఁడు = ఎవ్వఁడు?, ఇటమీఁదన్ = ఇటుపైన. ఏభంగిన్ = ఏవిధముగా. ఇందుబింబానన = చంద్రబింబాననయైన

యిల్లాలు. విధవసంసారంబున్ = నాథుఁడులేని సంసారమును. వెడలఁద్రోయున్= వెళ్ళఁద్రోయును;

ఇంకన్ = ఇంకమీఁదట. ఏభంగిన్ = ఏరీతిగా. తనయులు = కొడుకులు, ధనవిభాగములకై = సొమ్ముపంపకములకై. పోరితంబులులేక = పోట్లాటలులేకుండ, పొసఁగియుందురు = పొందు పొసఁగియుందురు; 'ఆఖిల .... సంరక్ష' అఖిల = సమస్తములైన. పురాణ = పురాణములకు, ఇతిహాస = ఇతిహాసములకు, శాస్త్ర= శాస్త్రములకు. ఆగమ=ఆగమములకు సంబంధించిన. గ్రంథ=గ్రంథములయొక్క. సంరక్ష = కాపాడుడుట. ఇంకన్ = ఇంక. ఎక్కడిది = ఎక్కడిది? అకట! = అయ్యో!. మిన్నులు పడ్డచోటన్ = ఆకాశమునేలపై వ్రాలినచోట–సుదూరదేశమునందు. అనదవోలె = అనాథవలె. దిక్కుమాలినప్రేతనై =దిక్కుమాలినప్రేతమనై, తీఱవలసెన్ = మరణింపవలసివచ్చెను. శిరసుపైన్ = తలపై మృత్యువు=మృతుదేవత. ఆడెడున్ = ఆడుచున్నది. శీఘ్రమునను = శీఘ్రముగా. చావు = మరణించుట, నిక్కంబు = నిక్కువము. బ్రతుకుట = జీవించుట. సంశయము.

తాత్పర్యము :– ప్రతిదినము – ఇళ్ళు, వాకిళ్ళు, తోఁటలు, దొడ్లు, పైరుపచ్చలు, పశువులు, మొదలగువానిని పైపరామరిక చేయుట కెవరుందురు? ఇంకమీఁదట ఇందు బింబాననయైన యిల్లాలు భర్తృవిహీనమైన సంసారమును ఏరీతిని వెళ్ళఁద్రోయఁ గలదు? డబ్బుపంచుకొనుటకై తగాదాలు పడకుండ కొడుకులు ఏరీతిగా పొందు పొసఁగి యుందురు? సకలపురాణేతిహాస శాస్త్రగ్రంథములను సంరక్షించు దిక్కెక్కడ?అయ్యో ! మిన్నులుపడ్డచోట ఎవ్వరులేనివానివలె దిక్కుమాలిన ప్రేతమనై తీఱిపోవలసెవచ్చెను. శిరస్సుపై మృత్యుదేవత యాడుచున్నది.త్వరలో మరణించుట నిక్కము, బ్రతుకుట మాత్రముసంశయము.

శా. సంతాపంబునఁ బొందనేమిటికి నీ సంసారయాత్రా వ్యథా
చింతాభారము పూని జూర్తి దహనార్చిర్దాహముల్ చాలవే?
చింతుంతున్ మది విశ్వనాయకు శివున్ శ్రీకాశికావల్లభున్
జింతింతున్ సరసీరుహాక్షుని హరిన్ ద్వారకావల్లభున్. 126

అర్థము :– 'ఈ సంసారయాత్రా వ్యథా చింతాభారము పూని' ఈ=ఈవిధమైన, సంసార = సంసారమే యనెడి, యాత్రా = ప్రయాణమునందలి, వ్యథా=

బాధలకు సంబంధించిన, చింతాభరము = విచారముయొక్క బరువును, పూని = మోసి, సంతాపంబునఁ బొందనేమిటికిన్ = సంతాపముతోఁ గూడికొనుట దేనికి?, 'జ్వార్తిదహనార్చిర్దాహములాల్చలవే?' జ్వార్తి = జ్వరమే యనెడి, దహన = అగ్ని యొక్క, అర్చిః = జ్వాలలయొక్క, దాహముల్ = కాల్చుటలు, చాలవే=చాలవా?, చింతింతున్మదిన్ = మతియందు ధ్యానింతును, విశ్వనాయకు శివున్ = విశ్వేశ్వరుఁడైన శివుని, శ్రీకాశికావల్లభున్ = శ్రీకాశికాపురీవల్లభుని; చింతింతున్ = ధ్యానింతును, సరసీరుహాక్షుని హరిన్ = కమలాక్షుఁడైన శ్రీమహావిష్ణువును, శ్రీద్వారకా వల్లభున్ = శ్రీద్వారకానాథుని:

తాత్పర్యము :- ఈ రీతియైన సంసారయాత్రల యందలి బాధలకు సంబంధించిన చింతాభరమును మోసి సంతాపమును బొందుట దేనికి? ఈ జ్వర మనెడి కార్చిచ్చుయొక్క మంటలు చాలవా? మనస్సులో శ్రీ విశ్వనాయకుని, శివుని, శ్రీకాశికావల్లభునిఁ జింతించెదను. సరసీరుహాక్షుఁడైన శ్రీహరిని శ్రీద్వారకా వల్లభునిఁ జింతించెదను;

ఉపశేషములు :- సంతాపహేతువులైన యీ సంసార చింతలకంటె అంతశ్శాంతిహేతువులైన శివచింతనము, విష్ణుచింతనము మేలు. రెండును చింతలే అయినను మొదటి చింతకంటె రెండవ చింత సుఖావహము కనుక ఈ చింత మాని ఆ చింతఁ జేసెద ననుట. ప్రాణనిర్యాణ వేళయందు జీవులకు దుర్లభమైన యిట్టి వివేకము శివశర్మకుఁ గలిగినది.

తే. ఏల చింతింప నిహమునందెల్ల సుఖము
లనుభవించితి మధురామహాపురమునఁ;
బరమునందును ముక్తిసంపదయుఁ గలిగె
నేడు పురములఁ దీర్థంబు లాడఁగనుట. 127

అర్థము :- ఇహమునందున్ = ఈ లోకమునందు, మధురామహాపురమున్ = మధురామహానగరములో, ఎల్లసుఖములు = సమస్త సుఖములను అనుభవించితిన్ = అనుభవించితిని. ఏడు పురములన్ = కైవల్యహేతువులైన యేడు మహానగరములయందును, తీర్థంబులాడఁ గనుటన్ = తీర్థములాడఁగలుగుటవలన,

పరమునందును = పరలోకమునందుఁగూడ, ముక్తిసంపదలు = మోక్షసంపదలు. కలిగెన్ = ప్రాప్తించెను. ఏల చింతింపన్ = ఎందుకు చింత వహించుట ?

తాత్పర్యము :- మధురా మహానగరములో ఇహలోక సౌఖ్యములన్నియును జూఅలాడితిని. ముక్తి హేతువైన సప్తపురీయాత్రవలన పరలోకమునందు సైతము ముక్తిసంపద లభించినది. ఎందుకు చింతించుట ?

వ. అని వితర్కించుచుండ. 128

అర్థము :- అని = ఈ రీతిని, వితర్కించుచుండన్ = పరిపరివిధములుగా, ఊహించుచున్న సమయములో-

శా. పాటిల్లెన్ ధరణీసురోత్తమున కప్పాటన్ విదాహజ్వరో
ష్మాటోపంబున నత్యుపద్రవముమై నాపాదమస్తంబుగాఁ
గోటీవృశ్చిక కీటపుచ్ఛలతికా కోటీశిఖాకంటక
త్రోటీకుట్టన సంప్రభూత విషధూర్దుర్వారదాహోద్ధతిన్. 129

అర్థము :- 'ధరణీసురోత్తమునకున్' ధరణీసుర=భూమిసురులలో, ఉత్తమునకున్ = శ్రేష్ఠుడైన శివశర్మకు, విదాహజ్వర = విదాహజ్వరమునకు సంబంధించిన. ఊష్మ = వేఁడియొక్క, ఆటోపంబునన్ = విజృంభణమువలన, మైన్ = శరీరమునందు, ఆపాదమస్తంబుగాన్ = కాళ్ళనుండి తలవఱకు, 'కోటీ....దాహోద్ధతిన్' కోటీ = కోటిసంఖ్యగల, వృశ్చికకీట = తేళ్ళయొక్క, పుచ్ఛలతికా = తీఁగవంటి తోఁకలయొక్క, కోటీ = అగ్రములయందలి, శిఖాకంటక = శిఖారూపములైన ముళ్ళయొక్క, త్రోటీ = ముక్కులతో, కుట్టన = కుట్టుటవలన-పొడుచుటవలన, సంప్రభూత = పుట్టిన, విషధూ = విషభరముయొక్క, దుర్వార = వారింపనలవికాని, దాహ = మంటలయొక్క, ఉద్ధతిన్ = ఔద్ధత్యముతో, అప్పాటన్ = ఆవిధముగా, అత్యుపద్రవము (అతి + ఉపద్రవము - అత్యుపద్రవము) అధికమైన హావడి, పాటిల్లెన్ = సంభవిల్లెను.

తాత్పర్యము :- శివశర్మకు విదాహజ్వరము విజృంభించుటవలన కాళ్ళనుండి తలవఱకును ఒక కోటి సంఖ్యగల తేళ్ళు తమ కొండెపుఁ బూసలలోఁ జివరి పూస కొసనున్న ముండ్లతో ఒకసారిగా అంటఁబొడిచినట్లు శరీరమునందు అత్యధికమై ఓర్వనలవికాని యుపద్రవము-హావడి ఘటిల్లెను.

కం. తన్నెఱుఁగ కెదిరి నెఱుఁగక
కన్నులు తెఱవంగ నెఱుఁగక వసుంధరపైఁ
గొన్నిదినంబులు బ్రాహ్మణు
డున్నట్లున యుండె నోటి యూరుపుతోడన్. 180

అర్థము :- బ్రాహ్మణుఁడు = శివశర్మ. తన్నెఱుఁగక = తన యొడలు తెలియక, ఎదిరి నెఱుఁగక = ఎదుటనున్నవారి నెఱుఁగక (శివశర్మ యెదుట నప్పు డెవ్వరును లేరు), కన్నులు తెఱవంగ నెఱుఁగక = కన్నులు తెఱచుటగూడ తెలియక, వసుంధరపైన్ = కటికనేలపై, నోటి యూరుపుతోడన్ = తెఱచిన నోటినుండి వెలువడుచున్న శ్వాసతో, కొన్ని దినంబులు = కొన్నినాళ్ళు, ఉన్నట్లనయుండెన్ = ఉన్నవాఁడున్నట్లే యుండెను - కదలక మెదలక యుండెను;

తాత్పర్యము :- ఆ బ్రాహ్మణుఁడు తన యొడలు తనకుఁ దెలియని స్థితిలో కన్నులు తెఱచుటకూడ తెలియక (మూసిన కన్నులు తెఱవక) తెఱచిన నోటినుండి వెడువడుచున్న యూరుపుతో (నోటి శ్వాసతో) కటికనేలపై ఉన్నవాఁడున్నట్లే కొన్ని దినములు పడియుండెను.

కం. ఇటు బహువిధములఁ గడుస
కటపడి మాయాపురోపకంఠమున మరు
త్తటినీతట నికటమునం
దటుకున శివశర్మ కాలధర్మము నొందెన్. 181

అర్థము :- ఇటు = ఈరీతిగా, బహువిధములన్ = పలువిధములుగా, కడున్ = మిక్కిలియును, సంకటపడి = ఇబ్బందిపాట్లుపడి, 'మాయాపురోపకంఠమునన్' మాయాపుర = మాయాపురముయొక్క, ఉపకంఠమునన్ = సమీపమునందు, 'మరుత్తటినీ తటనికటమునన్' మరుత్తటినీ = దేవనదియైన గంగయొక్క, తట = ఒడ్డునకు, నికటమునన్ = చేరువలో, శివశర్మ = శివశర్మ, తటుకునన్ = తటుక్కున - తటాలున, కాలధర్మమున్ = కాలముయొక్క ధర్మమును-మరణమును, ఒందెన్ = పొందెను.

తాత్పర్యము :- ఇట్లు పలువిధములయిముకుపాట్లుపడి మాయాపుర సమీపయున గంగయొడ్డునకు, జేరువలో శివకర్మ తటాలున, 'జిటుక్కు' మనెను (మరణించెను).

వ. అంత. 132

అర్థము :- అంతన్ = అంతలో-

మ.అసితాంభోధర నీలవర్ణు, లురుభద్రాకారు, లాజాను దీ
ర్ఘసముత్తుంగ భుజాచతుష్టయు, లలంకారాన్వితుల్, పుణ్యశీ
ల సుశీలాఖ్యులు విష్ణుకింకరులు లీలం బక్షీరాట్కేతనో
ల్లసితంబైన రథంబుఁ దెచ్చిరి ప్రభల్ నల్దిక్కులంబర్వఁగన్ ॥133

అర్థము :- 'అసితాంభోధర నీలవర్ణులు' అసితాంభోధర = నీటిమబ్బువలె నీలవర్ణులు = నీలవర్ణములుగలవారు, 'ఉరుభద్రాకారులు' ఉరు = గొప్పదైన. భద్రాకారులు = శుభాకారములుగలహరు, 'ఆజాను.... చతుష్టయులు' ఆజాను= మోఁకాళ్ళవఱకును, దీర్ఘ = పొడవు నట్టియును. సముత్తుంగ = మిక్కిలియెత్తైన. భుజా = బాహువులయొక్క, చతుష్టయులు = చతుష్కము-(నాలుగు మొత్తము) అలంకారాన్వితుల్ = అలంకారములతోఁ గూడినవారు, పుణ్యశీల సుశీలాఖ్యులు= 'పుణ్యశీలుఁడు', 'సుశీలుఁడు' అనుపేర్లుగలవారు, విష్ణుకింకరులు = విష్ణువుయొక్క సేవకులు, ప్రభల్ = కాంతుల్, నల్దిక్కులన్ = నాలుగు దిక్కులయందును, పర్వఁగన్ = ప్రసరింపఁగా, 'పక్షిరాట్ .... రథంబున్' పక్షీరాట్కేతన = గరుడధ్వజముతో, ఉల్లసితంబైన = ఉపరిభాగమునందు ప్రకాశితమైన. రథంబున్ = రథమును, లీలన్ = విలాసముగా - అలవోకగా, తెచ్చిరి = తీసికొనివచ్చిరి.

తాత్పర్యము :- నీలమేఘశ్యామలులు, ఉన్నత శుభాకారులు, ఆజానుబాహులు. చతుర్భుజులు, అలంకార భూషితులు, పుణ్యశీల-సుశీల-నామధేయులునైన విష్ణుకింకరులు నాల్గుకెలఁకుల వెలుఁగులు విందునట్లు గరుడధ్వజోల్లాసభాసురమైన దివ్యరథమును సలీలముగాఁ దెచ్చిరి.

సీ॥ వెలిదామరలఁబోలు వెడఁద కన్నులతోడఁ
గౌస్తుభగ్రైవేయకంబుతోడఁ

బసిఁడికమ్మల పచ్చపట్టుఁ బుట్టమ్మ్రొతో
మెఱుఁగుఁ జామనచాయ మేనితోడఁ
దళుకొత్తు పసిఁడి గేదంగి తేకులతోడఁ
గస్తూరికాంగ రాగంబుతోడ
నటవీ మయూర పించావతంసంబుతోఁ
జిగురొత్తు మొలక లేనగవుతోడ

తే॥ నపుడ సాక్షాత్కరించిన హరియుఁ బోలె
నెక్కొ శివశర్మ గాంభీర్య మెసక మెసఁగఁ
గింకిణీ జాలమాలికాలంకృతంబు
గరుడ కేతన సహితంబు కనకరథము. 134

అర్థము :- వెలిదామరలఁబోలు = తెల్లదామరపువ్వులను బోలెడి, వెడఁద కన్నులతోడన్ = విశాల విలోచనముతోను, 'కౌస్తుభ గ్రైవేయకంబుతోడన్' కౌస్తుభ = కౌస్తుభాలంకృతమైన, గ్రైవేయకంబుతోడన్ = కంఠహారముతోను, 'పసిఁడికమ్మల పచ్చపట్టుఁ బుట్టంబుతోన్' పసిడికమ్మల = బంగారుటందులుగల, పచ్చపట్టుఁబుట్టంబుతోన్ = పీతాంబరముతోను, 'మెఱుఁగుఁ జామనచాయ మేనితోడన్' మెఱుఁగు = తారళ్యముగల, చామనచాయ = నీలవర్ణమైన, మేనితోడన్ = శరీరముతోను, 'తళుకొత్తు పసిఁడిగేదంగి తేకులతోడన్' తళుకొత్తు = కాంతులు ప్రసరింపఁజేయుచున్న, పసిఁడిగేదంగి తేకులతోడన్ = బంగారుగేదంగి తేకులతోను, 'కస్తూరికాంగరాగంబుతోడన్' కస్తూరికా = కస్తూరిమయమైన, అంగరాగంబుతోడన్ = మైపూఁతతోను, 'అటవీమయూర పించావతంసంబుతోన్' అటవీ మయూర = అడవి నెమలియొక్క, పించ = బర్హమైన, అవతంసంబుతోడన్ = శిరోభూషతోను, చిగురొత్తు = పల్లవించుచున్న, మొలక లేనగవుతోడన్ = నవమందహాసముతోను, అపుడ సాక్షాత్కరించిన హరియుఁ బోలెన్ = అప్పుడే సాక్షాత్కరించిన శ్రీమహా విష్ణువువలె, శివశర్మ = శివశర్మ, గాంభీర్యము = దొరతనము, ఎసకమెసఁగన్ = అతిశయిల్లునట్లుగా, 'కింకిణీజాలమాలికాలంకృతంబున్' కింకిణీజాల = బంగారు చిఱుగంటలు గ్రుచ్చిన, మాలికా = మాలికలతో, అలంకృతంబున్ = అలంకరింపఁబడినదియును. గరుడకేతన సహితంబుల్ = గరుడకేతనముతోఁ గూడికొనిన, కనకరథముల్ = బంగారు రథమును, ఎక్కొన్ = ఎక్కెను.

తాత్పర్యము :- తెల్లఁదామరపూవులను బోలు విశాలములైన కన్నుల తోను, కౌస్తుభము ప్రేలుచున్న కంఠహారముతోను, పసిఁడి యంచులుగల పీత కౌశేయకముతోను, మిలమిలలాడుచున్న నీలవర్ణముగల నెమ్మేనితోడను, తళుకు లీనుచున్న పసిఁడిగేదంగి పేకులతోడను, కస్తూరి మేదించిన మైపూఁతతోను, అడవి నెమలి పురితోఁ దీర్చిన యవతంసకముతోడను, చిగురొత్తుచున్న మొలక లే తనవ్వు తోను, అప్పుడే సాక్షత్కరించిన శ్రీహరివలె శివశర్మ దొరతనపు శీవితో కనకింకి ణులు ప్రేలాడఁదీసిన మాలలతో అలంకరింపఁబడి గరుడకేతనోల్లాసముగల కాంచన రథము నధిరోహించెను.

వ. ఇట్లు దివ్యవిమానారోహణం బొనర్చి శివశర్మ విష్ణుకింకరులఁ జూచి యిట్లనియె. 135

అర్థము :- ఇట్లు = ఈరీతిగా, దివ్యవిమానారోహణంబు = దివ్యవిమానము నెక్కుటను, ఒనర్చి = చేసి, శివశర్మ = శివశర్మ, విష్ణుకింకరులన్ = విష్ణుకింకరు లను, చూచి = చూచి, ఇట్లనియెన్ = ఇట్లు పలికెను.

తే. విష్ణుభక్తులఁ జెప్పంగ విందు నెపుడు
నేఁ బురాణేతిహాస సంహితలయందుఁ
బుణ్యశీల సుశీలురన్ పుణ్యపురుషు
లచ్యుతుని సమ్ముఖమున నుండ్రధికులనుచు. 136

అర్థము :- నేను = నేను, 'పురాణేతిహాస సంహితలయందున్' పురాణ = పురాణసంహితలయందు, ఇతిహాస = ఇతిహాస సంహితలయందును, 'పుణ్యశీల సుశీలురన్' = పుణ్యశీలుఁడు, సుశీలుఁడు ననెడి, పుణ్యపురుషులు = పుణ్యపురు షులు, అచ్యుతుని సమ్ముఖమునందున్ = అచ్యుతుని సన్నిధానమునందు, ఉండ్రు= ఉందురు, అధికులనుచున్ = గొప్పవారని, విష్ణుభక్తులన్ = విష్ణుభక్తులను గూర్చి, చెప్పంగన్ = చెప్పఁగా, విందునెపుడున్ = ఎప్పుడును వినుచుందును.

తాత్పర్యము :- నేను పురాణేతిహాస సంహితలలో ఇరువురు విష్ణుభక్తులు పుణ్యశీల, సుశీలు రనువారు పుణ్యపురుషులు. వారు శ్రీహరి సమ్ముఖములో నుందు రనియును, అధికులనియును చెప్పుచుండఁగా నెప్పుడును వినుచుందును.

తే. వారలేకద మీరలు వనజనేత్రు
లంబుధర నీలవర్ణులు కంబుగళులు
భద్రదివ్యాకృతులు చతుర్బాహుదండు
లసిత తులసీ పలాశమాల్యాభరణులు. 137

అర్థము :- వనజనేత్రులు = పద్మనేత్రులు, అంబుధర నీలవర్ణులు = మబ్బు వలె నీలవరముగలవారు, కంబుగళులు = శంఖములవంటి కంఠములు గలవారు, 'భద్ర దివ్యాకృతులు' భద్ర = శుభప్రదములైన, దివ్యాకృతులు = దివ్యాకారములు గలవారు, చతుర్బాహుదండులు = నాలుగేసి బాహుదండములు గలవారు, 'అసిత తులసీ పలాశమాల్యాభరణులు' అసితతులసీ = కృష్ణతులసియొక్క, పలాశ = దళములతో గట్టిన, మాల్య = దండలే, ఆభరణులు = ఆభరణములుగా గలవారలు నైన, మీరలు = మీరు, వారలేకద ! = వారేకదా !

తాత్పర్యము :- జలజనయనులు, జలద విసీల దేహవర్ణులు, శంఖసుందరములైన కంఠములు గలవారు, భద్రాకారులు, దివ్యపురుషులు, చతుర్భుజులు, కృష్ణతులసీ పల్లవ మాలికాలంకారులును నైన మీరిరువురును వారిరువురేకదా !

ప. అనినవారు మహాత్మా! నీ యట్టి మహానుభావు లెఱుంగని యర్థంబులు గలవె? ఏము నీవు పెద్దలవలనం బురాణేతిహాస సంహితాముఖంబుల విన్న పుణ్యశీల సుశీలుర మగుదుము. అనేక లోకంబులు గడచికాని, వైకుంఠపురంబునకుం బోవరాదు. అయ్యయి లోకంబుల విశేషంబులు నీకుం జెప్పెదము. సావధానమతివై యవధరింపుము. ఈవును నడుగవలసిన యర్థంబు లడుగుమనిన నట్లకాక యనుచుం జనువాఁడు ముందట. 138

అర్థము :- అననన్ = అని యడుగఁగా, వారు = ఆ పుణ్యశీల సుశీలురు, మహాత్మా ! = గొప్పదియైన ఆత్మలక్షణము గలవాఁడా ! నీయట్టి మహానుభావులు= నీవంటి మహానుభావులు, ఎఱుంగని యర్థంబులు=ఎఱుఁగని విషయములు, కలవె?= ఉన్నవా ?, ఏము = మేమిరువురము, నీవు పెద్దలవలనన్ = నీవు, పెద్దలవల్ల,

'పురాణేతిహాస సంహితాముఖంబులన్' పురాణ = పురాణములు, ఇతిహాససంహితా = ఇతిహాససంహితలు, ముఖంబులన్ = మొదలైనవానివలన. విన్న = వినిన. పుణ్య శీల-సుశీలురము = పుణ్యశీల-సుశీలురము, అగుదుము = అవుదుము. అనేక లోకం బులు = పెక్కు లోకములను. కడచికాని = దాటికాని, వైకుంఠపురంబునకున్ = వైకుంఠపురమునకు. పోవరాదు = పోవుటకు వలనుపడదు, అయ్యయి లోకంబుల = ఆయా లోకములయొక్క, విశేషంబులు = విశేషములను, నీకుం జెప్పెదము = నీకుఁ జెప్పెదము, సావధానమతివై = అవధానసహితమైన మనస్సు కలవాఁడవై ఏకాగ్రమైన మనస్సు గలవాఁడవై. అవధరింపుము = చెప్పిన విషయములను ధారణ చేయుము. ఈవునున్ = నీవుకూడ, అడుగవలసిన యర్థంబులు = అడుగవలసిన విషయములను, అడుగుమనినన్ = అడుగుమనఁగా. అట్లకాక యనుచున్ = అట్లే యనుచు, చనువాఁడు = పోవువాఁడు-పోవునప్పుడు, ముందటన్ = ఎదుట.

తాత్పర్యము :- శివశర్మ యిట్లడుగఁగా ఆ విష్ణుకింకరు లనుచున్నారు - 'ఓ మహాత్మా ! నీవంటి మహానుభావు లెఱుఁగని విషయములుండునా ? నీవు పెద్దల వలన, పురాణేతిహాసములలో వినియున్న ఆ పుణ్యశీల సుశీలురము మేమే. అనేక లోకములను గడచిన పిమ్మటగాని వైకుంఠపురమునకు పోవుటకు వీలుపడదు. ఆయా లోకముల విశేషములు నీకుఁ జెప్పుచు వచ్చెదము. సావధానముగా వివి గుర్తిడికొనుము. అడుగవలసిన విషయములను నీవుకూడ అడుగుచుండుము !' అని వాడు పలుకఁగా శివశర్మ అట్లే యని వారితోఁ గలసి పోవుచున్నప్పుడు ఎదుట.

— పిశాచలోకము —

సీ॥ కఱకులై వీడిన కుఱుచ జుంజుఱు వెండ్రు
కలును గండెన చాయ కాయములును
గలివోసి నాన్చిన గ్రచ్చకాయల భంగిఁ
గొఱమాలి నట్టి దృగ్గోళకములు
తొట్ట వాతెరలపై దూరంబు సాఁగిన
గొగ్గిపండుల తోడి కుముఖములును
గూని వీఁపుల మీఁద గోడియై బోకెత్తి
తఱివడ్డ కంకాళ తండములును

తే. రాసభ క్రూర కంఠ నిర్ఘ్రాదకఠిన
ఘుర్ఘురావంక్త భాషితోద్గారములును
గలిగియిదె కొందఱున్నారు గగనవీథి
నొరిమ గెడఁగూడుకొని యెవ్వరొక్కవీరు? 139

అర్థము :- కటకుల్లై = కఠినస్పర్శగలవియ్యై. వీడిన=విడివడిన. కుఱుచ = పొట్టివియ్యైన, జుంజురు వెండ్రుకలను = చింపిటి వెండ్రుకలను. కందెనచాయ= బండియిరుసునకుఁ బూసెడి మసివంటి రంగుగల, కాయములను = శరీరములను;

కలివోసి = గంజిపోసి. నాన్చిన = నానఁబెట్టిన.గచ్చకాయలభంగిన్ =గచ్చ కాయల మాదిరిగా, కొఱమాలినట్టి = ప్రయోజనముమాలినట్టి దృగ్గోళములను = నేత్రగోళములను;

'తొట్ట వాతెఱలపై' తొట్ట = స్థూలములైన, వాతెఱలపై = (వాయి+తెఱ–వాతెఱ) పెదవులపై, దూరంబు సాఁగిన = పొడవుసాఁగిన, "గొగ్గిపండులతోడి" గొగ్గి = హెచ్చు తగ్గులైన. పండులతోడి = పండ్లతోడి, కుమ్ముఖములను = వికారముఖములను.

గూనివీఁపులమీఁదన్ = గూనిగల వీఁపులమీఁద – వంగినవీఁపుల మీఁద. గోడియ్యై = అణఁగియుండి. బోఁత్తి = ఉబ్బి. తటీవడ్డ = ఒత్తుడువడ్డ. కంకాళ= అస్థిపంజరములయొక్క. తండములను = సమూహములను.

'రాసభక్రూర .... ఉద్గారములను' రాసభ = గాడిదకంఠధ్వనులవలె. క్రూర = పరుషములైన, కంఠనిర్ఘ్రాద = కంఠధ్వనితో. కఠిన = కఠినములను, ఘుర్ఘుర = 'ఘుర్ఘుర' ధ్వనులుగలవియును, అవ్యక్త = అస్పష్టములునైన. భాషితో ద్గారములను = ఉద్గారములవంటి-డోకులవంటి, భాషితములు = మాటలను,గలిగి= కలిగియుండి, యిదె = ఇదిగో!, కొందఱు = కొంతమంది, గగనవీథిన్ = ఆకాశ వీథియందు. ఒరిమన్ = ఒద్దికతో, కెడఁగూడుకొని ఒకరిప్రక్క నొకరు గదిసి యుండి, ఉన్నారు = ఉన్నారు, వీరు = వీరు, ఎవ్వరొక్కో!=ఎవ్వరై యుందురో!

తాత్పర్యము :- కటకెక్కి విడివడిన కుఱుచచింపిటి వెండ్రుకల తలలతో, బండియిరుసునకుఁ బూసిన మసివంటి శరీరచ్ఛాయతో, గంజిపోసి నానఁబెట్టిన గచ్చ కాయలవలె పనికిరాని కనుగ్రుడ్డులతో, మొద్దుపెదవులపై పొడవుసాఁగిన గొగ్గి

పండ్లతో. వికారముగానున్న ముఖములతో, గూనివీఁపులపై అణఁగి - ఉబ్బెత్తి-ఒత్తుడుపడిన అస్థిపంజరముల తండములతో. గాడిద ఓండ్రవలె పరుషమైన కంఠ ధ్వనినుండి ఘర్ష రావ్యక్తవర్ణములతో వమనము చేసికొను మాదిరిగానున్న మాట లతో - అకాశవీథిలో - ఒకరినొకరు రాచికొనుచు గుంపుకట్టి కొందఱు కనిపించు చున్నారు. వీరెవ్వరైయుందురో :

విశేషములు :- బీభత్సము పుట్టించెడి యీస్వభావ వేషభాషా పరిశీలనము తోడి చిత్రణమంతయును దెనుఁగుకవి యుపజ్ఞ యే. మూలములోనిదికాదు.

వ: అనిన నద్దివ్య పురుషు లిట్లనిరి. 140

అర్థము :- అనినన్ = అని శివశర్మ యడుగఁగా. అద్దివ్యపురుషులు = ఆ దివ్యపురుషులు. ఇట్లనిరి = ఇట్లు బదులు చెప్పిరి.

ఆ॥వె॥ ఇది పిశాచలోక మీధూమ్రవర్ణులు
వినుఁ పిశాచరాజు లనఘు! వీరు
చంద్రశేఖరునిఁ బ్రసంగ వశంబునఁ
గొలిచినారు భక్తిఁ గొంచియంబు॥ 141

అర్థము :- ఇది = ఇది, పిశాచలోకము = పిశాచములలోకము, ఈ ధూమ్ర వర్ణులు = ఈ పొగవన్నెగలవారు, పిశాచరాజులు = పిశాచరాజులు, అనఘుఁ = పాపరహితుఁడా!, వీరు = ఈపిశాచరాజులు, ప్రసంగ వశంబునన్ = ప్రాసంగిక ముగా (అప్రధానముగా), చంద్రశేఖరునిన్ = శివుని, భక్తిన్ = భక్తితో. గొంచి యము = కొంచెముగా. కొలచినారు = సేవించినారు.

తాత్పర్యము :- అయ్యా! ఇదిపిశాచలోకము, ఈ పొగరంగుగలవారు పిశాచరాజులు. వీరు ప్రాసంగికముగా భక్తితోశివునిఁ గొంచెముసేవించినారు.

వ: అని యిట్లు క్రమంబునఁ బ్రశ్నోత్తర రూపంబునఁ గర్మాను రూపంబులైనఁగర్మాను రూపంబులైనఫలంబు లనుభవించుచు నుండఁ దరనిన నమరభావంబుల నుత్తరోత్తరాభ్యున్నతంబులగు నాయాయి లోకంబుల వసియించియున్న పుణ్యపురుషులం

గను గొనుచు శివశర్మ గుహ్యకలోకంబును గంధర్వ లోకం
బును విద్యాధరలోకంబును నతిక్రమించి యప్సరోలోకంబున
కుం బోవు నవసరంబున. 142

అర్థము :-అనియిట్లు=అని యీరీతిగా. ప్రశ్నోత్తరరూపంబునన్=ప్రశ్నలు-సమాధానములునుగా, 'కర్మానురూపంబులగు' కర్మ=కర్మలకు, అనురూపంబులగు=అనురూపములైన, ఫలంబులు=ఫలములను. అనుభవించుచుందురనినన్=అనుభవించుచు నుందురనిచెప్పగా. అమరభావంబులన్=దేవభావములయందు. 'ఉత్తరోత్తరాభ్యున్నతంబులగు' ఉత్తరోత్తర = ఒకదానికంటె నొకటిగా. అభ్యున్నతంబులైన=మీది మీదివియైన. ఆయాయి లోకంబులన్ = ఆయాలోకములయందు. వసించియున్న = నివసించియున్న. పుణ్యపురుషులన్ = పుణ్యపురుషులను, కనుంగొనుచున్ = చూచుచు, శివశర్మ = శివశర్మ. గుహ్యకలోకంబును = గుహ్యకలోకమును. గంధర్వ లోకంబును = గంధర్వలోకమును, విద్యాధరలోకంబును = విద్యాధరలోకమును, అతిక్రమించి = దాటి, అప్సరోలోకంబునకున్ = అప్సరసలోకమునకు, పోవునవసరంబునన్ = పోవుసమయమునందు-

తాత్పర్యము :- అని యీరీతిని-శివశర్మ ప్రశ్నించుటయును. విష్ణుకింకరులు సమాధానములు చెప్పుటయునుగా జీవులు కర్మలకనురూములైన ఫలములనుభవించుచునుందురని చెప్పగా దేవభావములయందుగూడ పుణ్యతారతమ్యమునుబట్టి ఉత్తరోత్తరాభ్యున్నతములైన-ఆయాలోకములలో నివసించియున్న పుణ్యపురుషులను జూచుచు శివశర్మ గుహ్యకలోకమును, గంధర్వలోకమును, విద్యాధరలోకమును గడచి - అప్సరోలోకమునకు పోవుసమయమునందు-యమలోకము.

విశేషము :- గుహ్యక, గంధర్వ, విద్యాధరలోకముల వర్ణనలను శ్రీనాథుడు విడిచిపెట్టెను.

చం॥ఎదురుగవచ్చె హేమరథమెక్కి కృతాంతుడు సౌమ్యమూర్తియై
పదురునిజాప్తకింకరులు పార్శ్వయుగంబున భక్తిగొల్చి రా
ముదిర నినాదముం జఱచి ముందటి చక్కటి దివ్యదుందుభుల్
మృదుల గభీరనాదములు మిన్నులుముట్టగ జెలంగుచుండగన్ ॥143

అర్థము:- పార్శ్వయుగంబునన్ = ఇరుపైపులను, 'నిజాప్త కింకరులు' నిజ = తనకు. ఆప్త = ఆప్తులైన, కింకరులు = సేవకులు. పదురు = పదిమంది. భక్తిన్ = భక్తితో, కొల్చిరాన్ = కొలిచిరాఁగా. 'ముదిర నినాదమున్' ముదిర = సజలమేఘముయొక్క. నినాదమున్ = గర్భితమును, చఱచి = ఆపళించి. ముందటి చక్కటిన్ = ముందుభాగమునందు, "మృదుల గంభీరనాదములు" మృదుల= మెత్తనివియును, గభీర = గంభీరములునైన, నాదములు = ధ్వనులు, మిన్నులు ముట్టన్ = ఆకాశమునంటుకొనురీతిని, చెలంగుచుండఁగన్ = ప్రోఁగుచుండఁగా, కృతాంతుఁడు = ధర్మదేవత, 'సౌమ్యమూర్తియై' సౌమ్య = ప్రశాంతమైన, మూర్తియై = ఆకారముగలవాఁడై, హేమరథమెక్కి బంగారురథమెక్కి, ఎదురుగన్ = శివశర్మ కెదురుగా, వచ్చెన్ = వచ్చెను.

తాత్పర్యము:- ఇరుపైపులను పదిమంది యాప్తకింకరులు కొలిచి వచ్చుచుండఁడగా. నీటిమబ్బు - ఉరుములనుఁ జఱచి కొట్టుచున్న మాదిరి తనముందు దిక్కున దివ్యదుందుభుల మృదుగంభీర నాదములు మిన్నుముట్టి ప్రోఁగుచుండఁగా, ధర్మదేవతయైన యముఁడు సౌమ్యాకారుఁడై హేమరథమెక్కి శివశర్మ కెదురు వచ్చెను.

తే. ఎదురుగా వచ్చి దక్షిణం బేలురాజు
ధర్మరాజు కరంబు సంతసమెలర్ప
సాధు! సాధు! మహాబుద్ధి! బోధమహిత!
మేలు మేలని శివశర్మ మెచ్చి పొగడె. 144

అర్థము:- ఎదురుగావచ్చి = ఎదురుకోలుగాలచ్చి, దక్షిణంబేలురాజు = దక్షిణదిశాధిపతియైన, ధర్మరాజు = యమధర్మరాజు, కరంబు = మిక్కిలి, సంతసము = సంతోషము, ఎలర్పన్ = వికసింపఁగా, "సాధుఃసాధుఃమంచిది మంచిది, మహాబుదిఃమహామతీఃమహామతీ, 'బోధమహిత' బోధ=జ్ఞానముచేత, మహిత=పూజ్యుఁడాఃమేలుఃమేలుఃమేలు మేలు, అని = అని, శివశర్మన్ = శివశర్మను. మెచ్చి = మెచ్చికొని. పొగడెన్ = స్తుతించెను.

తాత్పర్యము:- దక్షిణదిశాధిపతియైన ధర్మరాజు శివశర్మకుఁ బ్రత్యుత్థా

నముగావచ్చి, మహాబుద్ధీ! బోధమహితా! సాధు! సాధు! శివశర్మా! మేలు! మేలు! అని స్తుతించెను.

విశేషము :- 'సాధు' అన్నది ప్రశంసావాచకమైన సంస్కృతా వ్యయము. "సాధు" అను సంస్కృతావ్యయమునకు సరిగా తెనుఁగులో 'మేలు' అన్నదే పర్యాయపదము. ప్రశంసకనుక-కవి, రెండింటిని ద్విరుక్తిగాఁ బ్రయోగించెను. దీనికి - సంస్కృతమూలము-

'సాధుః సాధుః మహాబుద్ధేః శివశర్మన్ ద్విజోత్తమః'

సీ: అభ్యసించితి వేదమాఅంగములతోడఁ
బరిచర్య చేసితి గురుజనులకు;
ఆదిపురాణేతిహాసంబులఁను ధర్మ
శాస్త్రంబు చదివితి సారధిషణ
సమబుద్ధివై మహేశ్వరుఁ బుండరీకాక్షు
సేవించి తేకాంత శీలమునను
గైవల్య కల్యాణ ఘుంటాపథములైన
తీర్థంబు లాడితి తిరిగియేడు

తే: ననఘ! నీ భాగ్యమునకు నియత్త కలదె?
చూడుమా! యెంతటిదియొ నీ సుకృత గరిమ;
భూసురోత్తమ! మాయంత లేసి వారి
చే నమస్కారములు కొనఁ జెల్లెనీకు॥ 145

అర్థము :- ఆఅంగములతోడన్ = శిక్ష, వ్యాకరణ, చ్ఛందో. నిరుక్త. జ్యోతిష. కల్పము, లనెడి యాఅంగములతో. వేదము = వేదమును, అభ్యసించితివి = అధ్యయనము చేసితివి:

'సారధిషణన్' సార = సారభూతమైన. ధిషణన్ = మనీషతో, "ఆదిపురాణేతిహాసంబులను" ఆదిపురాణ = అష్టాదశమహాపురాణములను, ధర్మశాస్త్రంబులను = ధర్మశాస్త్రములను, చదివితివి = పఠించితివి:

ఏకాంతశీలమునను = ఏకాంతభక్తి శీలముతో, సమబుద్ధిమై = సమబుద్ధితో, మహేశ్వరున్ = శివుని, పుండరీకాక్షున్ = విష్ణువును, సేవించితివి = భజించితివి;

తిరిగి = దేశసంచారముచేసి. 'కైవల్యకల్యాణ ఘంటాపథములైన' కైవల్య కల్యాణ = కైవల్యశుభమునకు, ఘంటాపథములైన = రాజమార్గములైన, ఏడు తీర్థంబులాడితివి = సప్తపురీతీర్థములాడితివి;

అనఘ! = పాపవిరహితుడా!, నీ భాగ్యమునకున్ = నీపుణ్యభాగ్యమునకు, "ఇయత్త" = 'ఇంతటిది' అను 'కొలత', కలదె? = ఉన్నదా?. 'నీసుకృతగరిమ' నీ = నీయొక్క, సుకృతగరిమ = పుణ్యముయొక్క గొప్పదనము, ఎంతటిదియొ = ఎంతటిదో!, చూడుమా! = చూడుమా!. భూసురోత్తమ! = బ్రాహ్మణోత్తమా, మాయంతలేసి వారిచేన్ = మాయంతటివారిచేత, నీకున్ = నీకు, నమస్కారములు గొనన్ = నమస్కారములను స్వీకరింపగా, చెల్లెన్ = చెల్లెను.

తాత్పర్యము :- పాపరహితుడవైన ఓ విప్రోత్తమా! నీవు షడంగ వేదాధ్యయనము జేసితివి. గురుజనమును శుశ్రూషించితివి. అష్టాదశమహాపురాణ ములను ధర్మశాస్త్రములను బుద్ధివైభవముతో జదివితివి ఏకాంతభక్తి శీలముతో శిపకేశవులను సమబుద్ధితో నారాధించితివి. కైవల్య ఘంటాపథములైన సప్తపురీ తీర్థములాడితివి. నీ యదృష్టమునకు బరిమితికలదా? నీ పుణ్యగరిమ యెంతటిదియో చూడుమ! మాయంతటి వారిచేత నమస్కారములను గొనుట నీకు జెల్లుబడియైనది.

ష: అని ధర్ముండు శివశర్మ నభినందించి నిజనివాసంబునకు బోయె
దదనంతరంబ 146

అర్థము :- ఆని = ఇట్లు, ధర్ముండు = ధర్మదేవత, శివశర్మన్ = శివ శర్మను, అభినందించి = అభినందనముచేసి, నిజనివాసంబునకున్ = నిజనివాసము నకు చనియెన్ = వెళ్ళెను.

తాత్పర్యము :- ఈరీతిగా ధర్మదేవత శివశర్మనభినందించి నిజవాసమున కేగెను.

తే: విప్రకుల ముఖ్యు డంతట వినయ పరత
నిటులననియె హృషీకేశహితులఁ జూచి

యనఘులార! యతికూ్రరుఁడంఁడ్రు జముఁడు
సౌమ్యుఁడై యున్నవాఁడేమి చంద మొక్కొ! 147

అర్థము :- ఆంతటన్ = ధర్మదేవత వెళ్ళినంతనే. వినయపరతన్ = వినయముతో. హృషీకేశహితులఁజూచి = విష్ణున. కనుగలమైన పుణ్యశీల సుశీలురును జూచి, ఇటులనియెన్ = ఇట్లుపలికెను. అనఘులారా! = అనఘులారా! జముఁడు = యముఁడు, అతిక్రూరుఁడండు్ర = మిక్కిలి క్రూరుఁడనియందురు, సౌమ్యుఁడైయున్నవాఁడు = సౌమ్యస్వభావము కలవాఁడైయున్నాఁడు, ఏమిచంద మొక్కొ = ఏ ప్రకారమునఁనోకదా!

తాత్పర్యము :- యముఁడు వెళ్లినంతనే నెమ్మదిగా శివశర్మ విష్ణుకింకరుల, నిట్లడిగెను. అనఘులారా! యముఁడు-అతిక్రూరస్వభావుఁడని యందురు. సౌమ్యస్వభావుఁడైయున్నాఁడే! ఏమికారణమునఁనో? నాకుఁ దెలియఁజెప్పుడు!

తే: యమునిరూపంబు వర్ణింతు రఖిల మునులు
గుండె ఝల్లను నట్లుగా ఘోరలీల
జమునిఁ జూడఁగఁ గన్నులు చల్లనయ్యె
నిప్పుడారౌద్ర రసరేఖ లెందుఁబోయె? 148

అర్థము :- అఖిలమునులును = ఆందఱు మునులును, యమునిరూపంబున్ = యమునిరూపమును, గుండెఝల్లనునట్లుగాన్ = గుండె 'ఝల్లురుమను' రీతిని. ఘోరలీలన్ = భయంకరముగా, వర్ణింతురు = చెప్పుదురు, జమునిఁ జూడఁగ=జమునిఁ జూచినంతనే, కన్నులుచల్లనయ్యెన్ = కన్నులుచల్లఁబడెను, ఇప్పుడు = ఇపుడు. ఆరౌద్రరసరేఖలు = ఆరౌద్రరస లక్షణములు. ఎందుఁబోయెన్ = ఎక్కడికిఁ బోయినవి!

తాత్పర్యము :- ఏ మునీశ్వరులు చెప్పినను గుండె "ఝల్లు" మనిపించునటు యమునిరూపమును భయంకరముగావరింతురు. నాకు జమునిఁ జూడఁగాఁ గన్నులు చల్లపడినవి. ఇప్పుడు-ఆరౌద్రాకారరేఖ లెచ్చటికిఁ బోయినవి!

తే: ఇదియ రూపంబొ? యీతని కింక నొక్క-
రూపమున్నదియో? మహాక్రోధమునకు;

నెఱుఁగ నాఁతి యిండు నాకీరహస్య;
మనఘ మతులార! సందేహ మావహిల్లెఁ॥ 149

అర్థము :- ఇదియ రూపంబొ? = ఇదియే రూపమా? మహాక్రోధమునకున్ = మహాక్రోధస్వభావముగల, యీతనికిన్ = యీయమునకు, ఇంకనొక్క రూపమున్న దియో? = ఇంకొకరూపమున్నదా?, అనఘమతులారా! = విమలమతులారా!, ఈరహస్యము = ఈకీలును, నాకున్ = నాకు. ఎఱుఁగనానతియిండు = వివరించి చెప్పుఁడు, సందేహము = సంశయము. ఆవహిల్లెన్ = ఆవహించినది.

తాత్పర్యము :- ఇదియే నిజస్వరూపమా? మహాక్రోధస్వభావుఁడైన యీ యీతనికి ఇంకొకరూపముకూడ నున్నదా? నాకు తెలియఁజెప్పుడు, ఓ విమలమతు లారా! నన్ను సందేహ మావహించినది.

వ: అనిన వారలిట్లనిరి. 150

అర్థము :- అనినన్ = అనియడుఁగగా, వారలు = ఆ విష్ణుకింకరులు, ఇట్ల నిరి = ఇట్లు సమాధానపరిచిరి.

కం. నినుబోఁటి పుణ్యవంతుల
కనఘా! శమనుండు సౌమ్యమగునాకారం
బున నుండు దుర్జనులకీ
యన రౌద్రాకారుఁడై యుదగ్రతఁ జూపున్; 151

అర్థము :- అనఘా! = పాపములులేనివాఁడా!, వినుబోఁటి పుణ్యవంతుల కున్ = నీ వంటిపుణ్యముగలవారికి, శమనుఁడు = యముఁడు. సౌమ్యమగు నాకా రంబునన్ = సౌమ్యమయిన యాకారముతో, ఉండును = కనపడును, దుర్జనుల కున్ = దుర్జనులకు, ఈయన = ఈయముఁడే, రౌద్రాకారుఁడై = సంహారక ర్త ఆకారమువంటి యాకారముగలవాఁడై, ఉదగ్రతన్ = భయంకరత్వమును, చూపున్ = ప్రదర్శించును,

తాత్పర్యము :- నీ వంటి పుణ్యవంతులకు యముఁడు సౌమ్యమగు రూప రూపముతో నుండును. దుర్జల కీయనయే భయంకరాకారుఁడై తోఁచుచుండును,

విశేషము :- సమవర్తియగు ధర్మదేవతకు ఒక స్వరూపమని నిర్ణీతమై యుండదు. అది పుణ్యవంతులకు సౌమ్యమై చంద్రునివలె నయనాహ్లాదకరమై యుండును. అదియే పాపాత్మలకు వారు చేసిన పాపములను బట్టి భయంకరముగా నున్నట్లు గోచరించును.

వ. ఈ దండధరుండు దంష్ట్రాకరాళవదనుండు, క్రోధరక్తాంతలోచనుండును, ఊర్ధ్వకేశుండును, కృష్ణాంగుండును, ప్రళయాంబుదనిస్వనుండును, పరిభ్రమద్భ్రుకుటీ కుటిల నిటల తట విటంకుండును, విశంకట వికటాకారుండునునై దుర్వృత్తుల నీరీతి శాసించు: 152

అర్థము :- ఈ దండధరుండు = ఈ యముఁడు (శిక్షాధికారమును ధరించిన వాఁడు). 'దంష్ట్రాకరాళవదనుండు' దంష్ట్రా = కోరలతో. కరాళ = క్రిక్కిరిసిన-భయంకరమైన. వదనుండు = నోరుగలవాఁడు. 'క్రోధరక్తాంతలోచనుండును' క్రోధ = క్రోధముచేత. రక్తాంత = ఎఱ్ఱనైన కోణములుగల. లోచనుండును = కన్నులుగలవాఁడును. ఊర్ధ్వకేశుండును = నిటారులైన కేశములు గలవాఁడును. కృష్ణాంగుండును = నల్లని శరీరముగలవాఁడును (విష్ణువు నీలవర్ణుఁడు-యముఁడు కృష్ణవర్ణుఁడు). 'ప్రళయాంబుదనిస్వనుండును' ప్రళయాంబుద = ప్రళయకాల మేఘముయొక్క. నిస్వనుండును = ధ్వనివంటి ధ్వనికలవాఁడును. 'పరిభ్రమద్భ్రుకుటీ కుటిల నిటలతట విటంకుండును' పరిభ్రమత్ = తిరుగుడుపడుచున్న. భ్రుకుటీ = కనుబొమ ముడిచేత. కుటిల = వక్రమైన. నిటలతల = నొసటిప్రదేశమే యనెడి. విటంకుండును = గువ్వగూడు గలవాఁడును. 'విశంకట వికటాకారుండునునై' విశంకట = విశాలమును. వికట=వికటమునైన. ఆకారుండునునై = ఆకారముగల వాఁడునై. దుర్వృత్తులను = చెడునడత గలవారిని. ఈ రీతిన్ = ఈ రీతిగా. శాసించున్ = ఆజ్ఞాపించును (శిక్షలకై ఆజ్ఞలిడును).

తాత్పర్యము :- పాపులకు శిక్షలను విధించునప్పటి యముని యాకారమును విష్ణుకింకరులు వర్ణించుచున్నారు: దండధరుఁడైన యముఁడీ రీతి నుండును. కోరలతో భయంకర ముఖము, క్రోధముతో నెఱ్ఱఁబాఱిన కంటికొసలు, నిట్టనిటారుగా నిలిచిన కేశములు, నల్లని శరీరము, ప్రళయకాల మేఘగర్జనమువంటి కంఠధ్వని,

తిరుగళ్ళుపడుచున్న బొమముడితో కుటిలమై దుర్నిరీక్ష్యమైన ఫాలప్రదేశము, విశాల మును వికటమునై న యాకారముతో దుశ్చరిత్రుల కీరీతిని శిక్షలు విధించుచుండును.

సీ॥ పాదంబు లిరుకేలఁ బట్టి గుంజుండు జ
ర్జరితంబుగా వీనిఁ జట్టు ఱాఁత
మెడమెట్టి గోర్గొండి మెఱికి పుచ్చుఁడు వీని
గ్రుడ్లు నెత్తురులు చెక్కిల స్రవింపఁ
గడికండలుగ వీనికంఠంబు ద్రెవుండు
కరసానఁ బట్టిన ఖడ్గధార
బలుత్రాళ్ళ బంధించి తలక్రిందుగా ద్రేలఁ
గట్టుఁడు వీని వృక్షంబుకొమ్మ

తే॥ అంపమున వీని కంఠంబుఁ ద్రెంపి విడుఁడు
మడమ తాఁపుల వీని మర్మముల నొంపుఁ
డెట్టిఁగా నగ్నిఁ గ్రాఁచిన యినుప యిసుకఁ
గులికిపోయుఁడు వీని ముక్కునను జెవుల. 153

అర్థము :- వీనిన్ = వీనిని. పాదంబులు = కాళ్ళు. ఇరుకేలన్ = రెండు చేతులతో. పట్టి = పట్టికొని. జర్జరితంబుగాన్ = పింజ పింజలగునట్లుగా. చట్టు ఱాఁతన్ = చట్రాతిమీఁద. గుంజుఁడు = ఉతుకుఁడు ! (ఉతకండి !). మెడన్ = కంఠమును, మెట్టి = కాళ్ళతోఁ ద్రొక్కిపట్టి. వీని గ్రుడ్లు = వీని కంటిగ్రుడ్లు, గోర్గొండిన్ = గోరుగల్లుతో, నెత్తురులు = నెత్తురులు, చెక్కిల స్రవింపన్ = చెక్కిళ్ళయందు జాఱఁగా. మెఱికిపుచ్చుఁడు = పెళ్ళగించి తీయుఁడు. గడికండలు గన్ = రెండేసి రెండేసి కండలు తెగిపడునట్లు. వీని కంఠంబున్ = వీని కంఠమును, కరసానన్ = చక్రాకారమైన సానయందు. పట్టిన = పదునెక్కించిన. ఖడ్గధారన్ = కత్తివాదరతో. ద్రేయుఁడు = కొట్టుఁడు. బలుత్రాళ్ళన్ = బలమైన త్రాళ్ళతో. బంధించి = కట్టి. వీనిన్ = వీనిని. వృక్షంబు కొమ్మన్ = చెట్టు కొమ్మయందు. ద్రేలఁగట్టుఁడు = ద్రేలాడఁదీయుఁడు. అంపమునన్ = అంపముతో. వీని కంఠంబున్ = వీని కంఠమును, ద్రెంపి విడుఁడు = ద్రెంపి విడువుఁడు. మడమతాఁపు

లన్ = పార్శ్వభాగములతో. వీని మర్మములన్ = వీని రహస్యావయవములను. నొంపుడు = నొచ్చునట్లుచేయుఁడు, ఎట్టఁగాన్ = ఎఱుపువన్నె వచ్చునట్లు. అగ్నిన్ = అగ్నియందు. క్రాఁగిన = వేఁడియెక్కిన. ఇనుప యిసుకన్ = ఇనుపఁ బొడిని, కులికి = చల్లి, వీనిముక్కునను. జెవులన్ = వీనినాసాకర్ణమునయందు. పోయుఁడు = పోయుఁడు.

తాత్పర్యము :- వీనికాళ్ళు, రెండు చేతులతోపట్టుకొని శరీరసంధులు శిథిలమై పోవునట్లు చర్మాంతరమునఁ జొఱకలి బట్టలుతికినట్లుతుకుఁడు. కాళ్ళతో వీని మెడఁ ద్రొక్కిపట్టి గోరుగల్గుతో చెక్కిళ్ళయందు నెత్తురులు చాఁకిలు కట్టునట్లు కనుగ్రుడ్లుపెఱికి వెలికిఁ దీయుఁడు. కరసాన పట్టించి పదునెక్కించిన కత్తివాదనతో వీని కంఠమును గడికండలుగాఁ దెగవ్రేయుఁడు. బలువైనత్రాళ్ళతో వీనిని బంధించి చెట్టుకొమ్మనుండి తలకిందుఁగా వ్రేలాఁదీయుఁడు. అంవముతో వీని కంఠమును దెర్రింపిపాఁపవేయుఁడు. మడమ తన్నులతో వీని మర్మస్థానములను నొంపుఁడు. నిప్పుపై నెఱ్ఱగాఁగ్రాఁచిన యినుప యిసుకజల్లించి వీని ముక్కుఁజెవులలోఁ బోయుఁడు.

తే: పరకళత్రంబు కుచకుంభపాళియందు
నఖము దివిచిన పాపాత్మ నఖము నందు
నెఱ్ఱఁగా నగ్నిఁ గ్రాఁచిన యినుప సూదు
లుగ్రదృష్టినిఁ జొన్పుఁ డత్యాగ్రహమున. 151

అర్థము :- పరకళత్రంబు = పరస్త్రీయొక్క, కుచకుంభపాళిన్ = కుచకుంభప్రదేశమునందు, నఖమున్ = గోటిని, దిగిచిన = దిగునట్లుచేసిన, పాపాత్మనఖమునందున్ = పాపాత్మని గోటియందు, ఎట్టఁగా = ఎట్టపడునట్లు, అగ్నిఁగ్రాఁచిన = అగ్నిలోఁ గాల్చిన, ఇనుపసూదులు = ఇనుపసూదులు, అత్యాగ్రహమునన్ = (అతి + ఆగ్రహమునన్-అత్యాగ్రహము) మిక్కిలిపట్టుదలతో, ఉగ్రదృష్టిన్ = భయంకరమైన చూపుతో, చొనుపుఁడు = దిగునట్లు చేయుఁడు.

తాత్పర్యము :- పరస్త్రీయొక్క కుచకుంభముపై గోరునాటిన యీ పాపాత్ముని గోటియందు మిక్కిలి పూనికతో - అగ్నిలో నెఱ్ఱఁగాఁ గాల్చిన యినుప సూదులను క్రూరములైన చూపులతో దిగఁబొడువుఁడు.

వ: పరదార ముఖాఘ్రాణంబు చేసిన పాపిష్ఠు వదనంబున నిష్ఠుర నిష్ఠీవనం బొనర్పుఁడు. పరదార భవన గమనం బొనర్చిన కర్మచండాలుని పాదంబులు ప్రచండ ఖడ్గంబున ఖండంబులుగా ఖండింపుఁడు. పరదారాధరోష్ఠ బింబంబు చుంబించు నయ్యసంబంధు మూర్ధం బుద్ధత చపేటంబునం దాటింపుఁడు. పరాపవాదపరుని వక్షుంబు లక్ష్యంబుసేసి తీక్ష్ణముఖ నిశిత శూరప్రంబునఁ జేయుఁడు. పరసంతాపకారికటుక వచనుండగు కుటిలబుద్ధిని నింగలంబునం గ్రాఁగిన మంగలంబునఁ బ్రేల్చుఁడు. పరునియందు మిథ్యాదోషంబారోపించు నిర్దయుఁ బ్రతర్దన పూయశోణిత కర్దమంబున ముంపుఁడు. గురునిందా కర్తయగు భూర్తునోర సంవర్తిత, తప్తలోహంబు పోయుండు పరకళత్ర నాశకుండగు సంకుసుకు చెవుల నిశ్శంక కాలాయస, శంకువులు గూర్పుఁడని దండధరుండు ప్రచడకోపాటోపంబునఁ గింకరులం జూచి పలుకు వెండియు. 155

అర్థము :- 'పరదార ముఖాఘ్రాణంబుచేసిన' పరదార = పరస్త్రీయొక్క. ముఖ = ముఖమును, ఆ ఘ్రాణంబుచేసిన = మూర్కొనిన, 'పాపిష్ఠు వదనంబునన్' పాపిష్ఠు = పరమపాపాత్మునియొక్క, వదనంబునన్ = మోముపై - నోటియందు, నిష్ఠుర నిష్ఠీవనంబున్ = కఠినముగా ఉమియుటను. ఒనర్పుఁడు = చేయుఁడు-(కాంక్రించి యుమ్మివేయుఁడు.) 'పరదార భవన గమనం బొనర్చిన' పరదార = పరస్త్రీయొక్క. భవన = ఇంటికి, గమనం బొనర్చిన = రాకపోకలు చేసిన. కర్మచండాలుని = చండాలకర్మ చేసిన వానియొక్క. పాదంబులు = కాళ్ళు. ప్రచండఖడ్గంబునన్ = మిక్కిలి వాడియైన కత్తితో. ఖండంబులుగా = గడికండలుగా. ఖండింపుఁడు = ముక్కలు చేయుఁడు. పరదారాధరోష్ఠబింబంబున్ = పరధార = పరస్త్రీయొక్క, అధరోష్ఠమేయనెడి-కెమ్మోవియే యనెడి. బింబంబున్ = దొండపండును, చుంబించు = ముద్దిడుకొను, అయ్యసంబంధు = ఆ సంబంధవిరహితుని. మూర్ధంబున్ = నడునెత్తిని, 'ఉద్ధత చపేటంబునన్' ఉద్ధత=బెడిదమైన, చపేటంబునన్=చాచినప్రేళ్లుగల యఱచేతితో 'చపట'తో, తాటింపుఁడు=కొట్టుఁడు,

'పరాప వాదపరుని వక్షంబున్' పరాపవాద = పరనిందయందు. పరుని = అసక్తుఁ డైన వానియొక్క. వక్షంబున్ = తొమ్మును. లక్ష్యంబుసేసి = గురిచేసి, తీక్ష్ణ ముఖ = వాఁడిమొనలుగల. నిశితక్షుర ప్రంబున్ = పదునైన అర్ధచంద్రబాణముతో. ఏయుఁడు = ప్రయోగింపుఁడు. 'పరసంతాపకారి కటుక వచనుండగు' పర = ఇతరులకు, సంతాపకారి = వేఁడిమిపుట్టించెడి, కటుక వచనుండగు = చేఁదుమాటలుగల. కుటిలబుద్ధిని = వక్రబుద్ధిని. ఇంగలంబునన్ = పండుబొగ్గునందు, క్రాఁగిన = వేఁడి యెక్కిన. మంగలంబునన్ = భ్రాష్ట్రమునందు. పేర్చిల్చుఁడు = పేలాలు ప్రేల్చినట్లు ప్రేల్చుఁడు. పరునియందున్ = ఇతరునియందు, మిథ్యా దోషంబున్ = లేనితప్పును. ఆరోపించు = ఎక్కించునట్టి. నిర్దయున్ = దయావిరహితుని. 'ప్రతర్దన పూయశోణితకర్దమంబునన్' ప్రతర్దన = భయంకరమైన, పూయ = చీమునకు, శోణిత = నెత్తుటికి సంబంధించిన, కర్దమంబునన్ = బురదయందు-ఊబియందు, ముంపుఁడు = మునిఁగి పోవునట్లుచేయుఁడు. గురునిందాకర్తయగు = గురువులను నిందించువాఁడైన. ధూర్తునోరన్ = మోసకానినోటియందు, 'సంతర్తిత ప్రలోహంబున్' సంవర్తిత = కలియఁబెట్టిన. తప్తలోహంబున్ = కాఁచినయినుమును, పోయుండు = పోయుఁడు. 'పరకళత్ర నాశకుండగు' పరకళత్ర = పరస్త్రీలను. నాశకుండగు = చెఱచినవాఁడగు, సంకుసుకు = తిరుగుఁబోతుయొక్క. ('సంకసుకోఽస్థిరే' అని అమరములో-ఈశబ్దము 'సంక సుకుఁడు' అనియున్నది. శబ్దరత్నాకరములో 'సంకుసుకుఁడు' అని గ్రహింపఁబడినది. సంకుసుకుఁడు = ఒకచోట నిలుకడలేక తిరుగువాఁడు) చెవులన్ = చెవులయందు. నిశ్శంక = శంకావిరహితముగా - సంశయింపక, కాలాయుసశంకువులు = ఇనుపమేకులు. కూర్పుఁడని = తూర్పుఁడని. దండధరుండు = యముఁడు. 'ప్రచండ కోపాటోపంబునన్ = సంరంభముతో, కింకరులం జూచి = ఆజ్ఞాకర్తలను జూచి. పలుకున్ = పలుకును. వెండియున్ = మఱియును,

తాత్పర్యము :- పెఱతెఱవల మోములు మూఱుకొను పాపిష్ఠుని మోముపైఁ గాంద్రించి యుమియుఁడు ; పరస్త్రీల యిండ్లకు రాకపోకలు చేయు చండాలకర్ముని కాళ్ళు వాఁడికత్తితో గడికండలుగా ముక్కలు చేయుఁడు ; పర వనితల కెమ్మోవులను ఆనెడు అసంబంధుని నడునెత్తిపైఁ జాఁచిన వ్రేళ్ళుగల అబ్బచేతితోఁ జఱచుఁడు ; పరనిందాపరాయణుని తొమ్ము గురిచేసి అర్ధచంద్ర బాణము ప్రయోగింపుఁడు ; ఇతరుల మనస్సులకు సంతాపము గలిగించు పరుసపు మాటలాడు కుటిల

బుద్ధిని పండుబొగ్గులపై గ్రాగిన మంగలముపైన బెట్టి పేలాలు ప్రేల్చినట్లు ప్రేల్చుడు ; ఇతరులయందు లేనిపోని నేరముల నారోపించు నిర్దయుని, భయంకరమైన చీము నెత్తురుల యూబిలో ముంచివేయుడు ; గురునింద చేయు ధూర్తుని నోటిలో 'సలసల' క్రాగుచున్న యినుము కరగించి పోయుడు ; పరకళత్ర దూషకుడైన అస్థిరచిత్తుని చెవులలో శంకింపక ఇనుపమేకులు దూర్చుడని ప్రచండ కోపాటోపముతో దండధరుడు తన కింకరులను జూచి పలుకుచుండును. మఱియును.

తే॥ రౌరవంబనఁగను మహారౌరవ మనఁ
గాలసూత్రంబు కుంభిపాకంబనంగ
నంధతామిస్రమనఁగ సంహార మనఁగ
నారకంబులు మఱియు నెన్నంగఁ గలవు. 56

అర్థము :- రౌరవంబనఁగను = 'రౌరవ' మని. 'మహారౌరవ' మనన్ = 'మహారౌరవ'మని, కాలసూత్రంబు = 'కాలసూత్రము', కుంభిపాకంబనంగన్ = 'కుంభిపాక'మని, అంధతామిస్రమనఁగన్ = 'అంధతామిస్ర'మని, సంహారమనఁగన్ = 'సంహార'మని, నారకంబులు = నరలోకములు, మఱియును = ఇంకను, ఎన్నంగన్ = పరిగణింపఁగా, కలవు = ఉన్నవి.

తాత్పర్యము :- రౌరవమని, మహారౌరవమని, కాలసూత్రమని, కుంభిపాకమని, అంధతామిస్రమని, సంహారమని ఇంకను పెక్కు నరకములు గలవు.

వ. ఈ నరకంబులయందు దేవస్వాపహర్తల, బ్రహ్మస్వాపహారుల, శిశుహంతలఁ, గృతఘ్నుల, గురుతల్పగుల, గోఘ్న స్త్రీఘ్న మిత్రఘ్నులఁ, బరక్షేత్ర పరాలయాపహర్తలఁ, గూటసాక్షుల, గర్భఘ్నులఁ, బ్రజాపీడాకరుల, సురాపులఁ, గూటశాల్మలిం
ద్రాఁకించియుఁ, బట్టుగార్లం బట్టించియుఁ దలక్రిందుగా వ్రేలఁ
గట్టించియు, నిక్షుయంత్రములఁ బీడించియు, నంధకూపంబునం
ద్రోపించియు, నినుపముక్కు-ల కాకులం గఱపించియు యమ
కింకరులు పెక్కు- విధంబుల బాధలు వెట్టుదురు. 157

అర్థము :- ఈ నరకంబులయందున్ = ఈ రౌరవాది నరకములయందు. 'దేవస్వభోక్తలన్' దేవస్వ=దేవ. ధనమును. భోక్తలన్ = తిన్నవారిని, 'బ్రహస్వ భుజులన్' బ్రహస్వ = విప్రధనమును, భుజులన్ = తిన్నవారిని, శిశుహంతలన్= పసిపిల్లలను జంపినవారిని. కృతఘ్నులన్ = చేసిన మేలు మఱచినవారిని. గురు తల్పగులన్=గురుపత్నీ సంగమము చేసినవారిని, గోఘ్న=గోహంతలను, స్త్రీఘ్న= స్త్రీహంతలను. మిత్రఘ్నులను = మిత్రహంతలను, పరక్షేత్ర = ఇతర పొలము లను. పరాలయ = ఇతరుల యిండ్లను. అపహర్తలన్ = అపహరించినవారిని. కూటసాక్షులన్ = కపటసాక్ష్యము చెప్పినవారిని. గర్భఘ్నులన్ = భ్రూణ హత్య చేసినవారిని, ప్రజాపీడాకరులన్ = ప్రజలకుఁ బీడావహులైనవారిని, సురాపులన్= కల్లుఁ ద్రాగువారిని. కూటశాల్మలిన్ = కొండబూరుగుమీఁదికి. ప్రాఁకించియున్ = ప్రాఁకునట్లు చేసియును. పట్టుకార్లన్ = పట్టుకార్లయందు, పట్టించియున్ = బిగించి యును, తలకిందుగాన్ = తల కిందగునట్లుగా, వ్రేలగట్టించియున్ = వ్రేలాడఁ దీసియును, ఇక్షు యంత్రంబులన్ = చెఱకు గానుగలయందు, పీడించియున్ = ఆడించి-పీడించియును, అంధకూపంబునన్ = చీఁకటి నూఁతియందు, త్రోపించి యున్ = త్రోయఁబడునట్లు చేసియును, ఇనుపముక్కుల కాకులన్=ఇనుపముక్కులు గల కాకులచేత, కఱిపించియున్ = కఱిపించియును, యమకింకరులు = యమ భటులు, పెక్కువిధంబులన్ = పలువిధములుగా. బాధలు పెట్టుదురు=బాధించెదరు.

తాత్పర్యము :- ఈ నరకములలో దేవధనాపహారులను. విప్రధనాపహారు లను, శిశుహంతలను, గురుభార్యాసంగము చేసినవారిని. గోహంతలు, స్త్రీహంతలు. మిత్రహంతలు నైనవారలను; ఇతరుల యిళ్ళు, పొలములు నపహరించినవారిని. కపటసాక్షులను. భ్రూణహంతలను (గర్భస్థశిశువులను జంపినవారిని). ఇంకను ప్రజలకు పలువిధములైన పీడలు కలుగునట్లుగా చేయువారిని, యమకింకరులు కొండమీఁది బూరుగుచెట్టున కెగఁబ్రాఁకించియును, పట్కారులలో పట్టించియును. తలక్రిందుగా వ్రేలాడఁదీయించియును. చెఱకు గానుగలలోఁ బెట్టి యాడించియును, చీఁకటి నూతులలోఁ ద్రోయించియును, ఇనుపముక్కులు గల కాకులచేత కఱిపించి యును, ఎన్నో విధముల బాధ లనుభవింపఁజేయుదురు.

కం. హరినామ కీర్తనంబును
హరనామజపంబు నెవ్వఁ డాత్మఁ బఠించున్

నరక మహావేదన య

న్నరునకుఁ బ్రాపింపకుండు నయతత్త్వనిధీ! 158

అర్థము :- హరి = విష్ణువుయొక్క, నామకీర్తనంబును = నామసంకీర్తన మును, 'హరనామజపంబున్' హర = శివునియొక్క. నామ = పేరుయొక్క. జపంబున్ = అర్థభావనమును. ఎవ్వఁడు = ఏ నరుఁడు, ఆత్మన్ = ఆత్మయందు. పఠించున్ = పఠించునో, అన్నరునకున్ = ఆ నరునకు, 'నరక మహావేదన' నరక = నరకమునందలి, మహావేదన = మహాయాతన. ప్రాపింపకుండున్ = కలుగకుండును. నయతత్త్వనిధీ ! = నయతత్త్వమునకు నిధియైనవాఁడా !

తాత్పర్యము :- ఏ నరుఁడు విష్ణుసంకీర్తనమును, శివధ్యానమును జేయు చుండునో, అట్టివానికి నరకలోకమునందలి మహాయాతనలు కలుగకుండును.

వ. ఈ యర్థంబు నీకుఁ దేటతెల్లంబుఁ గావించెద మాకర్ణింపుము.

ఆదికాలంబునన్ గృతాంతుండు నిజకింకరులతో నిట్లనియె. 159

అర్థము :- ఈ యర్థంబున్ = ఈ విషయమును, నీకున్ = నీకు, తేట తెల్లంబున్ = విస్పష్టము, కావించెదము = చేసెదము. ఆకర్ణింపుము = వినుము. ఆదికాలంబునన్ = ఆదికాలమునాఁడు, కృతాంతుండు = యముఁడు, నిజకింకరుల తోన్ = తన కింకరులతో, ఇట్లనియెన్ = ఇట్లు పలికెను.

తాత్పర్యము :- ఈ విషయము నీకుఁ దేటపఱిచెదము. వినుము. ఆదికాల మందే యముఁడు తన కింకరులను బిలచి వారితో నిట్లు హెచ్చరించెను.

సీ॥ గోవింద! భూతేశ! గోప! గంగాధర!
చాణూర మర్దన! చండికేశ!
కంసప్రణాశన! కర్పూరగౌర! గో
పీపతి! శంకర! పీతవసన!
గిరిశ! గోవర్ధనోద్ధరణ! బాలమృగాంక
వర్ణ! మాధవ! భవ! వాసుదేవ!
విషమేక్షణ! మురారి! వృషభధ్వజ! హృషీక
పతి! భూతపతి! శౌరి! ఫాలనేత్ర!

తే: కృష్ణ! హర! గరుడధ్వజ! కృత్తివసన!
కల్మషారి! గౌరీపతి! కమఠ! శూలి!
యనుచుఁబఠియింతు రెవ్వారా ఘనులు మీకు
వందనీయులు చెనకంగవలదు వారి. 160

అర్థము :- గోవిందఁ = గోవిందుఁడా, భూతేశ = భూతపతీ, గోప = గోపాలకా, గంగాధర = గంగానదిని ధరించిన వాఁడా. చండికేశ = (చండికా + ఈశ–చండికేశ). చండికా = పార్వతీదేవికి, ఈశ = వల్లభు డా, కంసప్రణాశన= కంసునిఁ జంపినవాఁడా. కర్పూరగౌర = కర్పూరమువలె తెల్లని వన్నెగలవాఁడా, గోపీపతి = గోపికావల్లభా. శంకర = ఆ ముష్కిక సుఖము నుగలిగించు వాఁడా. పీతవసన = పీతాంబరుఁడా, గిరిశ = పర్వతమునందు శయనించువాఁడా, గోవర్ధనోద్ధరణ = గోవర్ధన పర్వతమును పైకెత్తినవాఁడా. బాలమృగాంకవర్ణ = బాల చంద్రునివంటి వర్ణముగలవాఁడా. మాధవ = లక్ష్మీధవా, భవ = సమస్త జగత్తు వకుఁ గారణమైనవాఁడా, వాసుదేవ = సర్వము నీయందును, నర్వమునందు వీవును, నివసించువాఁడా. విషమేక్షణ = విరూపాక్షా, మురారి = మురాసురుని సంహరించినవాఁడా, వృషభధ్వజ = వృషభాంక! హృషీకపతి=ఇంద్రియాధ్యక్షా, భూతపతి = ప్రమథపతీ, కౌరి = 'కూర' వంశమునందు పుట్టిన వాఁడా. హర= సంహారకర్తా! పాపములను హరించువాఁడా, గరుడధ్వజ = గరుడాంకా! కృత్తివసన = కృత్తివాసా! గజచర్మమును ధరించినవాఁడా. కల్మషారి = (కల్మష + అరి - కల్మషారి) పాపములకు శత్రువా! - అఘహారీ. గౌరీపతి = గౌరీవల్లభా, కమఠ = కుర్మావతారా! శూలి = శూలపాణీ. నుచున్ = అనుచు, ఎవ్వరు పఠియింతురు = ఎవ్వరు పఠించుచుందురో. ఆఘనులు = ఆ పెద్దలు, మీకున్ మీకు, వందనీయులు = నమస్కరింపఁదగినవారు. వారిన్ = అట్టివారిని, చెనకంగవలదు= ఎదిరింపవలదు – తాఁకవలదు.

తాత్పర్యము :- సుగమము.

సీ॥ హరి! రజనీశ కళావతంస! రమేశ్వ
ర! పినాకపాణి! శ్రీరామ! భర్గ!

యనిరుద్ధ! శూలపాణి! నృసింహ! త్రిపథగా
ర్ద్రిజటాకలాప! మురహర! యీశ!
రాఘవ! యురగా భరణ! పద్మనాభ! యు
గ్ర! మధుసూదన! పినాకపతి! యాద !
ప్రమథాధి నాథ! నారాయణ! మృత్యుంజ
య! పురుషో త్తమ! త్రిదశైక నాథ!

తే॥గీ॥ యచ్యుతా! కామశత్రువ! యబ్జపాణి!
దిగ్వసన! చక్రపాణి! భూతేశ! యనుచుఁ
దలఁతురెవ్వారు వారలు త్తములు భువన
పావనాత్మకు లందఱు ప్రభులుమీకు॥ 161

అర్థము :- అనుచున్ = అనుచు. తలఁతురెవ్వారు = ఎవ్వరు తలంతురో వారలు = అట్లు తలంచువారు, భువనపావనాత్మకులు = తాముపవిత్రులగుటయేకాక లోకములను గూడఁ బవిత్రములనుజేయువారు. అందఱున్ = వారందఱును, మీకున్ = మీకు. ప్రభులు=ప్రభువులు.

తాత్పర్యము :- సుగమము.

సీ॥ బ్రహ్మణ్యదేవ! శర్వ! ముకుంద! విశ్వేశ్వ
ర! సనాతన! త్రిణేత్ర! రావణారి!
శ్రీకంఠ! ధర్మధురీణ! శంభువ! కమ
లాధీశ! యీశాన! యదుపతి! మృడ
ధరణీధర! హర! యంధకహార! శార్ఙ్గ పా
ణి! పురారి! విష్ణువ! నీలకంఠ!
వైకుంఠ! దేవదేవ! మధురిపుఁడ! త్రిలో
చన! కైటభరిపుండ! చంద్రచూడ!

తే॥గీ॥ కేశినాశ! గిరీశ! లక్ష్మీపతి! త్రిపు
రారి! వసుదేవ సూనుఁడ! త్ర్యక్షు! యనుచు

జపము చేయుదురెవ్వరవ్విపుల పుణ్య
ఘనులఁ గదిసి నప్పుడ మీకుఁ గల్లవచ్చు. 162

అర్థము :- అనుచున్ = అనుచు, జపముచేయుదురెవ్వరు = ఎవ్వరు జపము చేయుచుందురో, 'అవ్విపులపుణ్యఘనులన్' అవ్విపులపుణ్య = ఆవిధమైన విస్తృత పుణ్యముచేత, ఘనులన్ = పెద్దలైనవారలను, కదిసినప్పుడ = చేరినప్పుడే, మీకున్ = మీకు, కల్ల = మోసము, వచ్చున్ = వచ్చును.

తాత్పర్యము :- ఇట్లు పర్యాయముగ శివకేశవనామములను ఎవ్వరు జపింతురో అట్టి మహాపుణ్యాత్ములతోఁ గదియఁబడినప్పుడే మీకుఁ జేటుమూడును.

వ. మఱియు వినుఁడు. శ్రీకాంత! శివ! యసురనిబర్హణ! మన్మథరిపుఁడ! జనార్దన! ఖండపరశుఁడ! శంఖపాణి! శశిశేఖర! దామోదర! త్రిపురసూదన! యంబుధరనీల! స్థాణువ! యానందకంద! సర్వేశ్వర! యను నీ దివ్యనామంబులు భావించు కృతార్థులు మీకు మాననీయులు సుండియని యివ్విధంబున నంతకుండు కింకరవర్గంబు ననుశాసించ. ఈ హరిహరనామంబుల యష్టోత్తర శతంబు విన్నను బఠించిన జనులకు నాయురారోగ్యైశ్వర్యంబులు సంభవించు. 163

అర్థము:- అను నీ దివ్యనామంబులు = అనెడి యీ శివకేశవ దివ్యనామములను, భావించు=జపించు.తదర్థభావనమూ చేయునట్టి. కృతార్థులు=ధన్యులు.మీకున్ = మీకు, మాననీయులు = పూజ్యులు, సుండీ=సుండీ!, అని యివ్విధంబునన్ = అని యీరీతిని. అంతకుండు = యముఁడు. కింకరవర్గంబున్ = కింకరవర్గమును, అనుశాసించెన్ = అనుశాసనము చేసెను, ఈ హరిహరనామంబుల=ఈ శివకేశవనామములయొక్క, అష్టోత్తరశతంబున్ = నూటయెనిమిదింటిని. విన్ననున్ = విన్నను. పఠించినన్ = పాఠముచేసినను, జనులకున్ = జన్మవంతులకు, 'ఆయురారోగ్యైశ్వర్యంబులు' ఆయుః = ఆయుర్దాయము, ఆరోగ్య = ఆరోగ్యము, ఐశ్వర్యంబులు = ఐశ్వర్యములు, సంభవించున్ = కలుగును.

తాత్పర్యము :- ఈనూట యెనిమిది నామములు విన్నవారికిని, పఠించిన వారికిని. ఆయురారోగ్యైశ్వర్యములు సంభవించును.

విశేషములు :- ఈ ప్రకరణమున మూలకాశీఖండములో నిట్లున్నది:

'అష్టోత్తరాధికశతేన సుచారునామ్నాం। సందర్భితాంబలితరత్నకదంబకేన
సన్నాయకాం దృఢగుణాం నిజకంఠగాయఃకుర్వాదిమాం స్రజ
మహోసయమం నవన్యేత్
యోధర్మరాజరచితాంలలిత ప్రబంధాం నామావళీం సకలకల్మషబీజహంత్రీం
ధీరోఽత్రకౌస్తుభభృతఃశశిభూషణస్య నిత్యంజపేత్
స్తనరసంసపిచేన్నమాతుఃం'

ధర్మరాజ విరచితమైన యీ శివకేశవనామముల అష్టోత్తర శతమాలికను కంఠస్థముచేసికొన్నవారికి యమసందర్శనమును. పునర్జన్మ భయమును, ఉండవు. ఈ విషయమును శ్రీనాథుడు విడిచియుండరాదు.

చం.శమనుని రాజధానియగు సంయమనీ నగరంబునం గరం
ధమ కురు ధర్మసేన దృఢ ధన్వాజయ ద్రథులాదిగా న్నృపో
త్తములు నితాంతనిర్మలిన ధర్మధుర ధరు లుండ్రు నిర్వ్యాపా
యమున ననర్ఘ్య రత్నమయహారి హిరణ్మయ హర్మ్యవీథులన్.

అర్థము :- 'శమనుని రాజధానియగు' శమనుని = యమునియొక్క, రాజ ధానియగు = రాజధానియైన, సంయమనీ నగరంబునన్ = సంయమనీ నగరము నందు, 'కరంధమ.... లాదిగాన్' కరంధమ = కరంధముఁడు, కురు = కురుఁడు, ధర్మసేన = ధర్మసేనుఁడు, దృఢధన్వ = దృఢధన్వుఁడు, జయద్రథులు = జయ ద్రథులు, ఆదిగాన్ = మొదలుగా, నృపోత్తములు = ఉత్తమ నృపులు, 'నితాంత.... లుండ్రు' నితాంత = మిక్కిలి, నిర్మలిన = మాలిన్యములేని, ధర్మ = ధర్మము యొక్క, ధురంధరులు = భారమువహించినవారు, ఉండ్రు = ఉందురు, నిర్వ్యాపా యమునన్ = (నిర్ + వి + అపాయమునన్ –నిర్వ్యాపాయమునన్) స్థానభ్రంశము లేనివారై, 'అనర్ఘ్య.... వీథులన్' అనర్ఘ్య = వెల చెప్పనలవికాని, రత్నమయ = రత్నమయములైన, హారి = మనోహరములైన, హిరణ్మయ = స్వర్ణమయము లైన, హర్మ్యవీథులన్ = ప్రాసాదముల వరుసలయందు.

తాత్పర్యము :- ధర్మదేవతయైన యముని రాజధానియైన సంయమనీ నగరమునందు మిక్కిలి నిర్మలములైన ధర్మవర్తనములతో జీవితములను గడపిన, కరంధముఁడు, కురుభూపాలుఁడు, ధర్మసేనుఁడు, దృఢధన్వుఁడు, జయద్రథుఁడు మొదలైన రాజశ్రేష్ఠులు అనర్ఘ్యరత్నమయములు, స్వర్ణమయములు మనోహరములైన ప్రాసాదమాలలయందు, శాశ్వతులై నివసించియుందురు.

వ. అని యివ్వ్యధంబున- 165

అర్థము :- అని = అని చెప్పి, యివ్విధంబునన్ = ఈ రీతిగా,

తే॥ శమన లోకాభివర్ణన శ్రవణపరత
నుబుసుపోవఁగ శివశర్మ యొయ్యఁజేరె
నప్సరోలోకమది ప్రసూనాశుగునకు
లోక విజయైక పట్టాభిషేకభూమి. 166

అర్థము :- 'శమనలోకాభివర్ణన శ్రవణపరతన్' శమనలోక=యమలోకమునకు సంబంధించిన, అభివర్ణన = విపుల వర్ణనముయొక్క, శ్రవణ = వినుటయందలి, పరతన్ = ఆసక్తి కలిగియుండుటవలన, ఉబుసుపోవఁగన్ = కాలము గడచిపోఁగా, ఒయ్యన్ = నెమ్మదిగా, శివశర్మ = శివశర్మ, అప్సరోలోకము = అప్సరసల లోకమును, చేరెన్ = చేరుకొనెను. అది = ఆ యప్సరసలలోకము, ప్రసూనాశుగునకున్ = (ప్రసూన + ఆశుక-ప్రసూనాశుగ) పూవులు బాణములుగాఁ గలవానికి - మన్మథునకు, 'లోకవిజయైక పట్టాభిషేకభూమి' లోక = లోకముల యొక్క, విజయ = గెలుపునకు సంబంధించిన, ఏక = అద్వితీయమైన, పట్టాభిషేక = పట్టాభిషేకమునకు, భూమి = స్థానము.

తాత్పర్యము :- యమలోకమునకు సంబంధించిన విశేషాంశములను వినుటయందలి యాసక్తిలో శివశర్మ నిమగ్నుఁడై యుండఁగనే ఆతడెక్కిన దివ్య విమానము అప్సరోలోకమును జేరెను, ఆ యప్సరోలోకము పుష్పబాణునకు అఖిలలోకైక విజయ పట్టాభిషేక భూమి; అన్ని లోకములు గెలిచి పట్టాభిషేకమును పొందిన చోటు.

వ॥ అప్పుడు శివశర్మ పుణ్యశీల సుశీలుర కిట్లనియె. 167

అర్థము :- అవ్వుడు = ఆ సమయమునందు, శివశర్మ = శివశర్మ, పుణ్య శీల సుశీలురకున్ = పుణ్యశీల సుశీలురతో, ఇట్లనియెన్ = ఇట్లు పలికెను.

— అప్సరోలోకము —

తే. ఎవ్వరొకో! పీరు? విమల పూర్ణేందు ముఖులు
దివ్యభూషా మహారత్న దీప్తిజాల
పరిధి చక్రావరణ మధ్య భాసమాన
భువన మోహన మూర్తు లిప్పురమునందు; 168

అర్థము :- ఇప్పురమునందున్ = ఈ పురమునందు, 'విమలపూర్ణేందు ముఖులు' విమల = కళంకములేని, పూర్ణేందు = పూర్ణిమాచంద్రునివంటి, ముఖులు= ముఖబింబములు గలవారు, 'దివ్యభూషా.... భువనమోహనమూర్తులు' దివ్యభూషా= దివ్యాభరణములయందలి, మహారత్న = మహారత్నములయొక్క, దీప్తిజాల = వెలుఁగు వలలకుఁ జెందిన, పరిధిచక్ర = వలయాకార పరివేషమే యనెడి, ఆవరణ మధ్య = ఆవరణ మధ్యభాగమునందు, భాసమాన = ప్రకాశించుచున్న, భువన = లోకసంమోహనములైన, మూర్తులు = ఆకారములు గలవారు, ఎవ్వరొకో పీరు ?= వీరెవ్వరై యుందురో ?

తాత్పర్యము :- ఈ నగరములో అకలంక పూర్ణిమాచంద్రబింబములవంటి ఆననబింబములు గలవారు, దివ్యాభరణ మహారత్నములయొక్క దీప్తిజాలమే యనెడి పరివేష చక్రావరణ మధ్యమునందు భాసమానములై భువనసంమోహనమువలె మూర్తులుగల వీరెవ్వరై యుందురోకదా ?

విశేషము :- 'చక్రావరణము' 'భువనమోహనత్వ'ము 'మధ్యభాసమానత్వము' శ్రీదేవి యంశలక్షణమును సూచించుచున్నవి.

వ. అనిన వార లిట్లనిరి. 169

అర్థము :- అనినన్ = అని శివశర్మ యడుగఁగా, వారలు = విష్ణుకింకరులు, ఇట్లనిరి = ఇట్లు పలికిరి.

451 76278

సీ॥ ఏ యిందు బింబాస్య లిఱుకోదండుని
త్రైలోక్యరాజ్యాధి దైవతంబు
లేయింతులకుఁ బుట్టినిల్లు దుగ్ధాంభోధి
మధుకైటభారాతి మడుగుఁ బాన్పు
ఏ చకోరాక్షుల కింద్ర చంద్ర జయంత
నలకూబరాదులు ననుపుమిండ
లేపువ్వుబోఁడుల యిసిరింత చూపుల
బుుషుల గట్టి మనంబు లిగురు వెట్టు

తే. మహితభక్తినే భామల మనుమరాంద్ర
దక్షిణానందవన మహోస్థానపతికి
భీమనాథేశ్వరునకు సుత్రామునిచ్చె
ననఘ వీరు సుమ్మయ్య! యయ్యప్పనరసలు. 170

అర్థము :- ఏ యిందు బింబాస్యలు=ఏ చంద్ర బింబాననలు. ఇఱుకోదండుని= చెఱకు విల్లుగా గల మన్మథుని యొక్క. 'త్రైలోక్య రాజ్యాధి దైవతంబులు' త్రైలోక్య = ముల్లోకములకు సంబంధించిన, రాజ్య = సామ్రాజ్యమునకు, అధి దైవతంబులు = అధిదేవతలో.

ఏ యింతులకున్ = ఏ వనితలకు. మధుకైటభారాతి = మధుకైటభులను సంహరించిన శ్రీమహావిష్ణువునకు, మడుగుఁబాన్పు = తెల్లని పానుపైన. దుగ్ధాంభోధి = పాలసముద్రము. పుట్టినిల్లు = పుట్టినిల్లో।

ఏ చకోరాక్షులకున్ = ఏ చకోరనేత్రలకు - చకోరపక్షులవంటి కన్నులుగల వారికి. 'ఇంద్ర చంద్ర జయంత నలకూబరాదులు' ఇంద్ర = ఇంద్రుఁడు, చంద్ర= చంద్రుఁడు. జయంత = జయంతుఁడు, నలకూబరాదులు = నలకూబరుఁడు మొదలైనవారు. ననుపుమిండలు = అనురాగముగల విటులో.

ఏ పువ్వుఁబోడుల = ఏ కుసుమకోమలులయొక్క (పువ్వువంటి శరీరము గల వారు), ఇసిరింత చూపులన్ = చంచలములైన చూపులచేత, 'బుుషుల గట్టిమనంబులు' బుుషుల = బుుషీశ్వరులయొక్క, గట్టి మనంబులు = కఠినములైన మనస్సులు. ఇగురువెట్టును = చిగురులొత్తునో, మహితభక్తిన్ = గొప్పదియైన భక్తి

భావము తో. ఏ భామలన్ = ఏ కాంతిమతులయొక్క. మనుమరాండ్రన్ = మనుమరాండ్రను, 'దక్షిణానందవన మహాస్థానపతికిన్ = దక్షిణకాశీ మహాక్షేత్రాధిపతియైన, భీమనాథేశ్వరునకున్ = భీమనాథేశ్వరస్వామికి, సుత్రాముఁడు = ఇంద్రుఁడు, ఇచ్చెన్ = కానుకగా నిచ్చెనో, అయ్యప్సరసలు = ఆ యప్సరసలు, అయ్యా = అయ్యా!, అనఘ ! = నిష్పాపుఁడా !. వీరుసుమ్ము ! = వీరు సుమా !

తాత్పర్యము :- అయ్యా ! ఏ చంద్రబింబాననలు మధుర ధనుష్కుని త్రైలోక్య సామ్రాజ్యమునకు అధిదేవతలో, ఏ వనితలకు వెన్నుని వెల్లపానుపైన పాలవెల్లి పుట్టిన యిల్లో, ఏ చకోరనయనలకు ఇంద్రుఁడు, చంద్రుఁడు, జయంతుఁడు, నలకూబరుఁడు మొదలైనవారు ననుపుగాండ్రో, ఏ కుసుమ కోమలుల యిపరింత చూపులు ఋషీశ్వరుల గట్టి మనస్సులను చిగురులెత్తించునో, ఏ భామినుల మనుమరాండ్రను దక్షిణకాశీ మహాక్షేత్రాధిపతియైన భీమేశ్వరస్వామికి మహాభక్తితో దేవేంద్రుఁ డిచ్చెనో, అట్టి యప్సరసలు వీరే సుమా !

వ. ఊర్వశి, మేనక, రంభ, ఘృతాచి, చంద్రరేఖ, తిలోత్తమ, వపుష్మతి, కాంతిమతి, లీలావతి, ఉత్పలావతి, యంబుస, గుణవతి, స్థూలకేశి, కళావతి, కళానిధి, గుణనిధి, కర్పూరతిలక, యుర్వర, యనంగతిలక, మదనమోహిని, చకోరాక్షి, చంద్రకళ, మునిమనోహర, చారునాస, సుకర్ణిక, దారుసంజీవని, క్రతుశుల్క, శుభానన, తపశ్శుల్క, తీర్థశుల్క, దానశుల్క, హేమావతి, పంచాశ్వమేధిక, రాజసూయార్థిని పేరు మొదలుగా గల నఱువదివేలు దివ్యాప్సర లీలోకంబునం దధివసింతురు.

తాత్పర్యము :- అఱువదివేల దివ్యాప్సరసలలో ముప్పదినలువుర పేర్లు మాత్రమే యిందుఁ బేర్కొనఁబడినవి. వీరందఱు నివసించు లోకము అప్సరోలోకము.

అవతారిక :- అప్సరసయై పుట్టుటకుఁ గారణభూతములైన కర్మవిశేషములను ఈ క్రింది పద్యములోఁ గొన్నింటిని వివరించుచున్నాఁడు :

సీ॥ బ్రహ్మచర్యం బొక్కరాత్రి దైవికమున
మఱచి తప్పిన యట్టి మాచకమ్మ
కలకాలమెల్లను గామిత వ్రతములు
సలిపినట్టి చకోరశాబనయన
బలిమి నొక్కనికి లోఁబడి వానినవ్వేళఁ
బతిగాఁ దలంచిన పద్మగంధి
పురుషుండు లేని యప్పుడు ప్రమాదంబున
మోసపోయిన యట్టి ముద్దరాలు

తే. భోగ దాన వ్రతంబులఁ బూని యెపుడు
మకర కేతను నర్చించు మాఁటి నంగ
కన్నె వయసునఁ గన్నెటికంబుఁ దప్పి
పిదపఁ బతిభక్తియగు నాతి త్రిదశవేశ్య! 172

అర్థము :- బ్రహ్మచర్యంబు = మాసోపవాస వ్రతమునకు సంబంధించిన బ్రహ్మచర్యవ్రతమును. ఒక్కరాత్రి = ఒకరాత్రి. దైవికమునన్ = దైవికము వలన, మఱచి = విస్మరించి. తప్పినయట్టి = వ్రితమునుండి జాఱిన, మాచకమ్మ = స్త్రీ పుంస లక్షణములుగలస్త్రీ (పోట) యును, కలకాలమెల్లను = జీవితకాలమంత యును, కామిత వ్రతములు = కోరికలతోఁ గూడిన వ్రతములను, సలిపినట్టి = ఆచరించియున్న, చకోరశాబనయన = చకోర శిశువులవంటి కన్నులుగలస్త్రీయును, బలిమిన్ = బలాత్కారమువలన, ఒక్కనికిన్ = ఒకపురుషునికి. అవ్వేళన్ = ఆసమయ మునందు, పతిఁగాఁదలంచిన = భర్తగాఁ దలఁచిన. పద్మగంధి = తామరపూవు వంటి శరీరసౌరభముగల స్త్రీయును.

పురుషుండు తనభర్త, లేనియప్పుడు = ప్రవాసగతుడైనప్పుడు. ప్రమాదంబునన్ = అనవధానమువలన. మోసపోయిన యట్టి = వంచనకు లోనైన, ముద్దరాలు = అమా యకురాలును. ఎపుడున్ = ఎల్లకాలమును, 'భోగదానవ్రతంబులు' భోగ = భోగేచ్ఛతోఁ గూడికొనిన. దానవ్రతంబులు = దానములను, నోములను, పూని = వహించి, మకర కేతనున్ = మన్మథుని. అర్చించు = పూజించినట్టి. మాఁటినంగ = కాముకి యును. కన్నెవయసునన్ = లేఁతవయస్సునందు. కన్నెటికంబుఁదప్పి = కన్యాత్వము

నుండి చ్యుతినిపొంది. పిదపన్ = అనంతరకాలమునందు. పతిభక్తయగు నాతి = పతియందు భక్తికలిగిన స్త్రీయును. త్రిదశవేశ్య = దేవవేశ్యయగును.

తాత్పర్యము :- మాసోపవాసవ్రతములోనుండి మఱుచియొక్కరాత్రి బ్రహ్మచర్యవ్రతము తప్పిన మాచకమ్మయును, జీవితకాలమంతయునుగామ్య వ్రతములు సలిపినస్త్రీయును, ఒకని బలాత్కారమునకు లొంగిపోయి - ఆ సమయమున వానిని పతిగాఁ దలంచినస్త్రీయును, పురుషుఁడు ప్రవాస గతుఁడైనవేళ ప్రమాద వశమున మోసపోయిన ముద్దరాలును. భోగార్థమైన వ్రతములు దానములును జేసి యెల్లప్పుడును మన్మథునిఁ బూజించుమాటినంగయును, కన్నెవయసునఁ గన్యాత్వమును గోల్వడి పిదపఁ బతిభక్తురాలైన స్త్రీయును ద్రిదశ వేశ్యయగును.

తే. మాంత్రికుండైన యొక సిద్ధమౌని నొండె
నొక్కవేలుపు నొండె ప్రియుండు పనుపఁ
బుత్త్రిసంతానలబ్ధికై పొందినట్టి
లోలలోచన కప్సరో లోకమబ్బు, 173

అర్థము :- ప్రియుండు పనుపన్ = భర్త ఆజ్ఞాపింపఁగా, పుత్త్రిసంతాన లబ్ధికై = పుత్త్రిసంతానలాభమునకై. మాంత్రికుండైన = మంత్రవేత్తయైన, ఒక సిద్ధమౌనినొండె = ఒకసిద్ధమౌనినిఁగాని, ఒక్కవేలుపునొండె = ఒకదేవతనుగాని, పొందినట్టి = పొందియున్న, లోలలోచనకున్ = చంచలనయనకు. అప్సరో లోకము = అప్సరోలోకము. అబ్బున్ = లభించును.

తాత్పర్యము :- భర్తయానతినిఁబడి-పుత్త్రిలాభార్థమై మాంత్రికుఁడైన యొక సిద్ధమౌనివి గాని, ఒకదేవతనుగాని, పొందియున్న స్త్రీకి, అప్సరోలోకము లభించును.

విశేషము :- దీనికి మూలము లేదు.

* సూర్యలోకము *

వ. అని చెప్పిన నప్సరాలోకంబుఁ గనుంగొనుచు భాస్కర లోకంబు చేరంజని యేకచక్రంబును సప్త సప్తియు ననూరు

సారథికంబును నప్సరోమునిగంధర్వామరోరగ సమన్వితం
బును నగు రథంబుమీఁదఁ గరధృతారవిందద్వయుండయి
నభోమార్గంబునం జను కమలబాంధవునిఁ జూపి విష్ణుకింకరు
లిట్లనిరి. 174

అర్థము :- అని చెప్పినన్ = విష్ణుకింకరులిట్లు చెప్పఁగా. అప్సరోలోకం బున్ = అప్సరోలోకమును. కనుంగొనుచున్ = చూచుచు. భాస్కర లోకంబున్ = సూర్యలోకమును. జేరంజని = సమీపించి. ఏకచక్రంబును = ఒకేచక్రముగల దియు. 'సప్తసప్తియున్' సప్త = ఏడు. సప్తియున్ = గుఱ్ఱములుగలదియు. 'అనూరు సారథికంబును' అనూరు = అనూరుఁడు (న + ఊరు - అనూరు = అరుణుఁడు) సారథికంబును = సారథిగాఁ గలదియును. 'అప్సరోమునిగంధర్వామ రోరగ సమన్వితంబును' అప్సరః = అప్సరసలతో. ముని=మునులతో. గంధర్వ= గంధర్వులతో. ఆమర = దేవతలతో. ఉరగ = ఉరగులతో. సమన్వితంబును = కూడుకొనినదియును. ఆగు = అయిన. రథంబుమీఁదన్ = రథముపైన. 'కర ధృతారవిందద్వయుండయి' కర = చేతులతో. ధృత = ధరింపఁబడిన. అరవింద= పద్మములయొక్క. ద్వయుండయి = రెండు (జంట) కలవాఁడై. నభోమార్గంబు వన్ = ఆకాశమార్గమునందు. చను = వెళ్లుచున్న. కమలబాంధవునిన్ = పద్మ బంధువును - (తామర పూవులచుట్టము) సూర్యుని. చూపి = చూపించి. విష్ణుకింక రులు = విష్ణుసేవకులు. ఇట్లనిరి = ఇట్లు పలికిరి.

తాత్పర్యము :- అని వివరింపఁగా - అప్సరోకమును జూచుచు సూర్య లోకమును సమీపించి ఏకచక్రము, సప్తాశ్వమును, అనూరు సారథికమును, అప్స రసలతో. మునులతో. గంధర్వులతో. అమరులతో ఉరగులతో, సమన్వితమైన రథముపై చేతులతో రెండుతామరపూవులను దాల్చి-ఆకాశమార్గమునఁ బోవుచున్న సూర్యునిఁ జూపి శవశర్మతో-పుణ్యశీల సుశీలు రిట్లనిరి.

సీ. సిద్ధాంత సంసిద్ధి సిద్ధ సంఘంబును
విధ్వక్త పరిపాటి విబుధకోటి
చాటుధారా ప్రౌఢిఁ జారణవ్యూహంబు
కిన్నర వ్రాతంబు గీత సరణి

ఖచర సంఘము విశృంఖల వచోవైచిత్రి
యాతుధాన శ్రేణి యధిక భక్తి
గరుడలోకము నమస్కార వాక్యంబున
నేకాగ్రమతి దందశూక సమితి

తే. ప్రతిదినంబును ప్రాతరారంభవేళ
నిర్ణిబంధన నిరుపాధి నిరవగాథ
నిర్ణిరోధ నిరాఘాట నిగుపమాన
భక్తి సంభజియింతురీ పద్మబంధు, 175

అర్థము :- 'సిద్ధాంతసంపిద్ధిన్' సిద్ధాంత = శ్రుతిసిద్ధాంతములయొక్క. సం పిద్ధి = సమ్యక్‌సిద్ధి కలగునట్లు. సిద్ధసంఘంబును=సిద్ధసమూహమును. 'విధ్యుక్త పరిపాటిన్' విధ్యుక్త = (విధి + ఉక్త - విధుక్త) శాస్త్రముచేత చెప్పబడిన. పరి పాటిన్=క్రమముతో, విబుధకోటి = దేవకోటియును.'చాటుధారాప్రౌఢిన్ 'చాటు= ప్రియవాక్యములయొక్క. ధారా = పరంపర యందలి, ప్రౌఢిన్ = ప్రౌఢితో. చారణ వ్యూహంబున్ = చారణసమూహమును, కిన్నరవ్రాతంబు = కిన్నరసంఘము. గీతసరణిన్ = గానసరణితోను, 'ఖచర నంఘము' ఖచర = ఆకాశచరులయొక్క. సంఘము = బృందము, "విశృంఖలవచోవైచిత్రిన్" విశృంఖల = అడ్డులేని, వచో వైచిత్రిన్ = వాగ్వైచిత్రితోను. యాతుధానశ్రేణి = రాక్షసశ్రేణి. అధికభక్తిన్ = అధికమైన భక్తితోను, గరుడలోకము = గరుడుల సమూహము, నమస్కారవాక్యం బునన్=నమస్కారవాక్యముతోను, దందశూకసమితి = సర్పసమితి.ఏకాగ్రమతిన్ = ఏకాగ్రమైనబుద్ధితోను.ప్రతిదినంబును అనుదినమును.ప్రాతరారంభవేళన్=(ప్రాతఃఆరంభవేళ = ప్రాతరారంభవేళ). ప్రాతః = ఉదయముయొక్క. ఆరంభవేళన్= ఆరంభకాలమునందు, "నిర్ణిబంధన .... భక్తిన్." నిర్ణిబంధన=సాష్కారణ మైన, నిరుపాధి = వ్యాజములేని, నిరవగాధ = తలస్పర్శములేని, నిర్ణిరోధ=అడ్డు లేని. నిరాఘాట = మేరలేని, నిరుపమాన = సాటిలేని. భక్తిన్ = భక్తితో. ఈ పద్మబంధున్ = ఈ పద్మబాంధవుని, సంభజియింతురు = సంసేవింతురు.

తాత్పర్యము :- సిద్ధాంత సమ్మిశ్రముగా సిద్ధులును, విధివిధానముతోవిబు ధులును, చాటుప్రౌఢితో చారణులును, గీతములతో కిన్నరులును. విశృంఖల

వచోవైచిత్రితో [ఖచరులను, అధిక భక్తితో, యాతుధానులను, నమస్కార వాక్యములతో గరుడులను, ఏకాగ్రమతితో దందశూకములను ప్రతి దినమును ప్రాతఃకాలారంభమునందు నిర్హేతుకము, నిర్వ్యాజము, అగాధము, అడ్డులేని, మేర లేని, సాటిలేని భక్తితో ఈ కమలబాంధవుని భజియింతురు.

విశేషము :- మయూరుని శ్లోకమున కిది అనుసరణ మాత్రము. అమ వాదము కాదు.

"సిద్ధై స్సిద్ధాంతమిశ్రం శ్రుతవిధి విబుధై ర్ఘ్చారణై ర్ఘ్చాటుగర్భం
గీత్యా గంధర్వముఖ్యై ర్మహురహిపతిభిర్యాతుధానైర్యతాత్మ
సార్ష్యం సాధ్యైః మునీంద్రై ర్మదిత తమమనో మోషిభిః పక్షపాతాత్
ప్రాతః ప్రారభ్యమాణ స్తుతిరవతు రవిర్విశ్వవంద్యోదయోవః"

సీ॥ సంచారశీలుఁడౌ జగదుపక్రియకునై
సమధికస్థైర్యంబు జరుపుఁగాని
జనులదృష్టికి వెక్కసంబై విభాసిల్లు
లోనఁ జైతన్యంబు నీనుఁగాని
సంతాపహేతువౌ సంయమిశ్రేణికి
నిర్వాణలీల యానేర్చుఁగాని
ఖరరుచిత్వముఁ బూనుఁ గాలక్రమంబున
శీతలామృతము వర్షించుఁగాని

తే. ప్రాగవస్థా భ్యుదికరోపర్యవస్థ
నతిశయిల్లుచు భువనంబు లఖిలములును
వారకత్యంత సత్కృపావైభవమున
ననఘ! రక్షించుచుండు నీయబ్జహితుఁడు. 176

అర్థము :- అనఘ ! = పాపరహితుఁడవైన ఓ శివశర్మా !, ఈ యబ్జ హితుఁడు = పద్మహితుఁడైన యీ సూర్యుఁడు; జగదుపక్రియకునై = (జగత్ + ఉపక్రియ-జగదుపక్రియ). జగత్ = లోకమునొక్క, ఉపక్రియకునై = ఉపకా

కార్థమై; సంచారలోలుఁడౌను = సంచరించుటయందు లోలత్వము కలవాఁడగును. రాని = అయినప్పటికిని, సమధికస్థైర్యంబున్ = మిక్కిలి సుస్థిరత్వమును, జరుపును = నిర్వహించును.

జనులదృష్టికిన్ = లోకుల దృష్టికి, వెక్కసంబై = దుస్సహమై, విభాపిల్లున్ = ప్రజ్వరిల్లును, కాని = అయినను, లోనన్ = లోపల, చైతన్యంబును = ప్రాణశక్తిని, ఈనున్ = ప్రభవించును - ప్రసవించును. (సవిత) 'సంతాపహేతువౌన్' సంతాప = సంతాపమునకు, హేతువౌన్ = కారణమగును, కాని = అయినను, సంయమిశ్రేణికిన్ = మునిశ్రేణికి, నిర్వాణలీలన్ = ముక్తిసౌఖ్య జనితమైన శాంతిని - చల్లఁదనమును, ఈనేర్చున్ = ఈయనేర్చును.

ఖరరుచిత్వమున్ = తీవ్రకాంతి కలిగియుండుటను, పూనున్=వహించును, కాని = అయినను, కాలక్రమమునన్ = కాలక్రమముచేత, 'శీతలామృతమున్' శీతల = చల్లని, అమృతమున్ = జలమును, వర్షించున్ = కురియును.

'ప్రాగవస్థాభ్యధికతరోపర్యవస్థన్' ప్రాగవస్థా = (ప్రాక్ + అవస్థా - ప్రాగవస్థ) తొలుతటి యవస్థకంటె, అభ్యధికతర = మిక్కిలి యధికమైన, ఉపర్యవస్థన్ = మీఁదటి యవస్థతో, అతిశయిల్లుచున్ = పెంపొందుచు, భువనంబులఖిలము లను = అఖిల లోకములను, 'అత్యంత సత్కృపావైభవమునన్' అత్యంత = మిక్కిలి, సత్కృపా = సత్కృపయొక్క, వైభవమునన్ = వైభవముతో, వారక = మానక, రక్షించుచుండున్ = కాపాడుచుండును.

తాత్పర్యము :- అపాపుఁడవైన ఓ శివశర్మా ! యీ సూర్యుఁడు జగదుపకారార్థమై నిరంతర సంచారశీలుఁడైనట్లు కానిపించును. అయినను ఈయనకంటె స్థిరత్వము కలవాఁడు వేఱొకఁడుండఁడు.

లోకులదృష్టికి దుస్సహముగా ప్రకాశించును. అయినను లోపల చైతన్యమును ఆవిర్భవింపఁజేయుచుండును.

సంతాపమునకుఁ గారణమై యుండును. అయినను మునిశ్రేణికి నిర్వాణశాంతిని ప్రసాదించుచుండును.

తీక్ష్ణతేజమును బూనును. అయినను కాలక్రమమునఁ జల్లని నీటిని వర్షించుచుండును.

తొలితటి దళలకంబె మిక్కిలి సుఖావహములైన సమధికములైన మీఁదటి దళలతో అతిశయిల్లుచు సమస్త లోకములను అత్యంతమైన కృపావైభవముతోఁ గాపాడుచుండును.

విశేషము :- ఇది మయూరుని శ్లోకమున కనువాదము.

'క్రామన్‌లోలోఒపి లోకాంస్తదుపకృతి కృతావస్థితః స్థైర్యకోటిం
వ్యాఘ్రాం దృష్టిం ఏజిహ్మాం విదధదపి కరోత్యంత రత్యంతభద్రాం
యస్తాపస్యాపి హేతుర్భవతి వియమినామేక నిర్వాణదాయీ
భయాత్స ప్రాగవస్థాధికతర పరిణామోదయోఒర్కః శ్రియైవః'

వ. అని రప్పుడు శివశర్మ తానొనర్చు నమస్కారంబు లంగీకరించుచు నిమేషార్థమాత్రంబున రెండువేలు నిన్నూటరెండు యోజనంబు లతిక్రమించినం జూచి యాశ్చర్యంబొంది గోవింద కింకరుల కిట్లనియె. 177

అర్థము :- అనిరి = అనిపలికిరి. అప్పుడు = ఆ సమయమునందు. శివ శర్మ = శివశర్మ. తానొనర్చు నమస్కారంబులు = తానుజేయుచున్న నమస్కారములను. అంగీకరించుచున్ = స్వీకరింపుచు, నిమేషార్థమాత్రంబునన్ = అర్థనిమేషములోనే. రెండువేలు నిన్నూటరెండు యోజనంబులు = రెండువేల రెండువందల రెండు-ఆమడలదూరమును, అతిక్రమించినన్ = దాటిపోఁగా. చూచి = చూచి, ఆశ్చర్యంబందింది = అచ్చెరువంది. గోవిందకింకరులకున్ = విష్ణుకింకరులకు, ఇట్లనియెన్ = ఇట్లుపలికెను.

తాత్పర్యము :- విష్ణుకింకరులు పైరీతిని వివరించుండఁగనే శివశర్మ సూర్యునకు నమస్కారములుచేసెను. శివశర్మ నమస్కారములను స్వీకరించుచునే సూర్యుఁడు అర్థనిమేషమాత్రములో రెండువేలరెండువందలి రెండులమడలదూరము దాటిపోయెను. అప్పుడచ్చెరువందిశివశర్మ గోవింద కింకరులతోనిట్లనియెను.

తే. అనఘులార! ఖరాంశు బింబాంతరమునఁ
బురుషునొక్కని నుండఁ జెప్పుదురు బుధులు

పరమ తాత్పర్యగరిమ నప్పురుషు నెట్లు
సేవ సేయుదురొక్కొ- సంసిద్ధి పరులు? 178

అర్థము :- అనఘులారా! = పూజ్యులారా, 'ఖరాంశుబింబాంతరమునన్' ఖరాంశు = తీక్ష్ణకిరణుడైన సూర్యునియొక్క. బింబాంతరమునన్ = బింబము లోపలి భాగమునందు. పురుషునొక్కనిన్ = ఒకానొక పురుషుని. ఉండఁ జెప్పుదురు బుధులు = ఉండునని తెలిసినవారు చెప్పుదురు. 'పరమ తాత్పర్యగరిమన్' పరమ= పరమమైన, తాత్పర్యగరిమన్ = తత్పరతా విశేషముతో. అప్పురుషున్ = ఆపురుషుని. సంసిద్ధి పరులు = సంసిద్ధియందు ఆసక్తిగలవారు. ఎట్లు = ఏ విధముగా. సేవసేయుదురొక్కొ = సేవింతురో? వివరింపవలనది.

తాత్పర్యము :- శివశర్మ యడుగుచున్నాఁడు:

అయ్యలారా! సూర్యబింబములోపల ఒకానొక పురుషుఁడుండునని పెద్దలు చెప్పుదురు. సిద్ధికాములు శ్రద్ధాతాత్పర్యములతో ఆ పురుషుని ఏవిధముగా సేవింతురోకదా!

వ. అనిన వారలిట్లనిరి. 179

అర్థము :- అనినన్ = అనఁగా, వారలు = ఆవిష్ణుకింకరులు. ఇట్లనిరి = ఇట్లు పల్కిరి.

సీ. ఆకాశమధ్యస్థమగు భానుబింబంబు
వినులక్షయోజన విస్తృతంబు
తన్మధ్య మందున ధవళాంశుశేఖరు
నుద్దీథవిద్యా ప్రయోగసరణి
హైమహూపుఁడు హిరణ్యశ్మశ్రుకేశుండు
హస్తప్రముఖ హిరణ్యావయవుఁడు
గాఁగభావించి యాకమలలోచనుఁడుండు
నతఁడ యేనని సదాధ్యాన పరత

తే. విమలమానసుఁడగుచు భావింపవలయు
బ్రహ్మవిద్వాంసుఁడగువాఁడు ప్రాజ్ఞవేళ

నర్కు-నర్ధోదయమున గాయత్రిఁ గూర్చి
యర్ఘ్యమెత్తిన యాసమయంబునందు! 180

అర్థము :- 'ఆకాశమధ్యస్థమగు భానుబింబంబు ఆకాశమధ్యస్థమగు = ఆకాశమధ్యములోనున్న, భానుబింబము = సూర్యబింబము, విను = వినుము, లక్షయోజన పరిమితంబు = లక్షయోజనముల పరిమితిగలది, తన్మధ్యమందునన్ = ఆబింబమధ్యమునందు, ధవళాంశుశేఖరున్ = చంద్రశేఖరుని, ఉద్గీథవిద్యా = సామ విద్యయొక్క, ప్రయోగసరణిన్ = ప్రయోగపద్ధతితో, హైమరూపుఁడు = హిరణ్య రూపుఁడు, హిరణ్యశ్మశ్రుకేశుండు' హిరణ్య = హిరణ్యవర్ణములైన. శ్మశ్రు = మీసములు, గడ్డము, కేశుండు = కేశములు గలవాఁడును. హస్తప్రముఖ=చేతులు మొదలైన, హిరణ్య = హిరణ్మయములైన, అవయవుఁడు = అవయవములుగల వాఁడు, కాఁగన్ = అగునట్లుగా, భావించి = భావనచేసి, అతఁడ = అహిరణ్మయ పురుషుఁడే, ఏనని = నేనని, సదాధ్యాన పరతన్ = నిరంతర ధ్యానపర్వతముతో, ఆ కమలలోచనుఁడు = ఆ విష్ణువు, ఉండున్ = ఉండును, బ్రహ్మవిద్వాంసుఁడగు వాఁడు = బ్రహ్మమును దెలిసికొనుచున్నవాఁడు, ప్రాహ్ణవేళన్ = ప్రాతఃకాలము నందు అర్కనర్ధోదయమునన్ = సూర్యునియొక్క అర్ధోదయమునందు-బింబము నగముదయింపఁగా, గాయత్రిఁ గూర్చి = గాయత్రీ మంత్రముతో ననుసంధించి, 'అర్ఘ్యమెత్తిన యా సమయంబునందున్ = అర్ఘ్యప్రదానపుదోసిలయెత్తిన-ఆవేళ యందు, విమలబుద్ధిన్ = నిర్మలమైన బుద్ధితో, భావింపవలయున్ = ఆవిష్ణువును భావింపవలెను.

తాత్పర్యము :- అయ్యా ! వినుము. ఆకాశమధ్యములోనున్న ఆ సూర్య బింబముయొక్క పరిమాణము లక్ష యోజనములు. ఆ బింబ మధ్యమందుఁ జంద్ర శేఖరుని సామవిద్యానుసంధానముతో హిరణ్మయునిఁగా, హిరణ్మయ శ్మశ్రుకేశు నిగా. హిరణ్మయ సకలావయవునిగా భావించి, ఆ శివుఁడే నేనని నిరంతర ధ్యాన పరుఁడై విష్ణువుండును. బ్రహ్మవిదుఁడగుచున్న బ్రాహ్మణుఁడు ప్రాతఃకాలమున సూర్యబింబము సగముదయించినప్పుడు గాయత్రీ మంత్రముతో ననుసంధించి అర్ఘ్యసలిలాంజలి నెత్తినపుడు నిర్మలమైన బుద్ధితో ఆ విష్ణువును భావింపవలయును.

వ. కాలలోపంబు చేయవలదు. కాలంబు ప్రతీక్షించునట్టిది.
కాలంబునంగదా యౌషధులు ఫలించు. కాలంబునంగాక

పాపపంబులు పూచునే? కాలంబుననే మేఘుంబులు వర్షించు. మందేహదేహనాశార్థం బుదయాస్తమయంబుల బ్రాహ్మణోత్సృష్టంబగు గాయత్రీమంత్ర తోయాంజలిత్రయంబు చిత్ర భానుం డపేక్షించుచుండు. కాలంబు తప్పకుండ సదుపాస్యమానుండయి భానుండాయురారోగ్యైశ్వర్యంబులు ప్రసాదించు. 181

అర్థము :- కాలలోపంబు = తఱితప్పుటను. చేయవలదు = చేయవద్దు. కాలంబు = సమయము. ప్రతీక్షించునట్టిది = ఎదురుచూచి - ఎఱుఁగవలపినది. 'కాలంబునంగదా యోషధుల ఫలించు' కాలంబునంగదా = కాలమునందేకదా, ఓషధులు = ఫలపాకాంతములైన పైరులు. ఫలించున్ = పండును. కాలంబునంగాక = కాలమునందుకాక. పాదపంబులు = చెట్లు. పూచునే = పుష్పించునా ?, కాలంబుననే = కాలమునందే, మేఘములు = మబ్బులు, వర్షించు = వానలు కురియును. 'మందేహదేహనాశార్థంబు' మందేహ = మందేహులను రాక్షసులయొక్క, దేహ = శరీరములయొక్క. నాశార్థంబు = నాశముకొఱకు. ఉదయాస్తమయంబులన్ = ఉదయాస్తమయ వేళలయందు, 'బ్రాహ్మణోత్సృష్టంబగు' బ్రాహ్మణ = బ్రాహ్మణులచేత, ఉత్సృష్టంబగు = విడువఁబడిన. 'గాయత్రీమంత్ర తోయాంజలిత్రయంబు' గాయత్రీమంత్ర = గాయత్రీమంత్ర సహితములైన, తోయాంజలి = జలాంజలుల యొక్క, త్రయంబున్ = మూఁడింటి సమాహారమును చిత్రభానుండు = సూర్యుఁడు, అపేక్షించుచుండున్ = కోరుచుండును. కాలంబు తప్పకుండన్ = తఱితప్పకుండ, 'సదుపాస్యమానుండయి' సత్ = సజ్జనులచేత, ఉపాస్యమానుండయి = ఉపాసింపఁబడుచున్నవాఁడై, భానుండు = సూర్యుఁడు, 'ఆయురారోగ్యైశ్వర్యంబులు' ఆయుః = ఆయుర్దాయమును, ఆరోగ్యమును, ఐశ్వర్యంబులు = ఐశ్వర్యములను, ప్రసాదించున్ = ప్రసాదముగా నిచ్చును.

తాత్పర్యము :- తఱి తప్పనీయరాదు, కన్నుపెట్టుకొని పట్టుకొనవలసినది కాలము. కాలమునందేకాని ఓషధులు ఫలింపవు. కాలమునందేకాని చెట్లు పుష్పింపవు. కాలమునందేకాని మబ్బులు కురియవు. చరాచరలోకప్రవృత్తి యంతయును కాలము మీఁదనే ఆధారపడి నడచుచున్నది. మందేహులను కోట్లకొలది రాక్షసులు ఉదయాస్తమయ వేళలయందు సూర్యుని త్రోవ నడ్డగించి నిలచియుందురు. వారి నిరోధము

నుండి బయటపడుటకై సూర్యుడు బ్రాహ్మణులు విడిచెడి గాయత్రిమంత్ర సహిత మైన జలాంజలిత్రియము నపేక్షించుచుండును. తటి తప్పకుండగ ఉపాసింపబడుచు సజ్జనులకు ఆయురారోగ్యైశ్వర్యములను సూర్యుడు సంప్రసాదించుచుండును.

సీ॥ మేలైన రెండు తొమ్మిదులు విద్యలలోన
మహనీయ మగుచు మీమాంస వెలయు
మీమాంసకంచెను మిగులు ప్రాభవమునఁ
దర్క-శాస్త్రము శుభోదర్క-గరిమఁ
దర్క-శాస్త్రముకంచెఁదా,సమభ్యధికంబు
వివరించి చూడంగ వేదరాశి
యమ్నాయములకంచె నభ్యర్హితంబులుఁ
చర్చింప నుపనిషత్సముదయములు

తే. నుపనిషత్తులకంచెను నూర్ధ్వపదవి
మంత్రరాజంబు గాయత్రిమహిమఁ గాంచుఁ
బ్రణవమను క్రేపుతోఁగూడి పాఁడిఁబిదుకు
నవనిసురులకు గాయత్రి యనెడి సురభి! 182

అర్థము:- మేలైన = శ్రేయఃప్రదములైన, రెండు తొమ్మిదులు విద్యలలోన్ = అష్టాదశ విద్యలయందును, మహనీయమగుచున్ = పూజింపఁదగిన దగుచు, మీమాంస = మీమాంసాశాస్త్రము - వేదవాక్యార్థ విచారణాత్మకమైనశాస్త్రము, వెలయున్ = ప్రసిద్ధమగును. 'శుభోదర్క-గరిమన్' శుభ=శుభప్రదమైన, ఉదర్క=భవిష్యత్తుయొక్క, గరిమన్ = గొప్పఁదనముచేత, తర్క-శాస్త్రము=తర్క-శాస్త్రము, మీమాంసకంచెను = మీమాంసశాస్త్రముకంచెఁగూడ, ప్రాభవమునన్ = ప్రాభవమునందు, మిగులున్ = అధికమగును. తర్క-శాస్త్రముకంచెన్=తర్క-శాస్త్రముకంచెఁగూడ, వివరించి చూడంగన్ = విచారించి చూడఁగా, వేదరాశి = వేదసమూహము, తాన్ = తాను, సమభ్యధికంబు = మిక్కిలియును గొప్పది, అమ్నాయములకంచెన్ = వేదములకంచెను, చర్చింపన్ = విమర్శింపఁగా, ఉపనిషత్సముదయములు = ఉపనిషత్తులు, అభ్యర్హితములు = పూజ్యములు, ఉపనిషత్తులకంచెను = ఉపనిషత్తులకంచెఁగూడ, ఊర్ధ్వపదవి = పైస్థానమునందు, మంత్రరాజంబు =

మంత్రిరాజమైన, గాయత్రి=గాయత్రి, మహిమన్ = గొప్పదనమును, కాంచును= పొందును, గాయత్రి యనెడి సురభి = గాయత్రి యనెడి కామధేనువు, ప్రణవ మను క్రేపుతోఁగూడి = ఓంకారమను దూడతోఁ గలసి, అవనిసురులకున్ = విప్రులకు, పాఁడిన్ = క్షీరమును, (పాడి = ధర్మమనెడి, పాఁడిన్ = క్షీరమును, పిదుకున్ = పిండును) ధర్మమను నర్థములో అటసున్న యుండదు. క్షీర మను నరములోఁ గలదు. 'పాఁడి' అనుచోట శిష్టరూపకాలంకారము. 'పాడియే యనెడి పాఁడి.' 'శ్లేషేసంబిందు నిర్బిందోర్మోక్షనం క్వచిదిష్యతే' అధర్వణుఁడు–

తాత్పర్యము :– అష్టాదశ విద్యలలో మీమాంసగొప్పది. తర్కశాస్త్రము మీమాంసకంటె గొప్పది. తర్కశాస్త్రముకంటె వేదరాశి గొప్పది. వేదరాశికంటె ఉపనిషత్తులుగొప్పవి. ఉపనిషత్తులకంటెను గాయత్రిగొప్పది. గాయత్రియనెడి కామధేనువు ప్రణవమను దూడతోఁ గూడి విప్రులకు 'పాడి' యను.'పాఁడి'నిఁబిదుకును.

తే. మంత్రములలోన గాయత్రి మహిమఁ గాంచు
నగరములలోనఁ గాశి యున్నతి వహించు
దైవతంబులలోనఁ సుధాధామమౌళి
విశ్వనాథుండు ప్రాధాన్య విభవమొందు. 183

అర్థము :– మంత్రములలోనన్ = తంత్రములలోపల. గాయత్రి=గాయత్రీ మంత్రము, మహిమన్ = గొప్పదనమును. కాంచును = పొందును. నగరముల లోనన్ = నగరములలోపల, కాశి = కాశికానగరము, ఉన్నతిన్ = ఔన్నత్యమును వహించున్ = పూనును, దైవతంబులలోన = దైవతములలోపల, సుధాధామమౌళి= చంద్రమౌళియైన, విశ్వనాథుండు = శ్రీవిశ్వేశ్వరస్వామి, ప్రాధాన్యవిభవము = ప్రాధాన్యవైభవమును, ఒందున్ = పొందును.

తాత్పర్యము :– మంత్రములలోగాయత్రి, నగరములలో కాశి, దైవతము లలో శ్రీవిశ్వనాథుఁడు. ప్రాధాన్యము వహింతురు.

ప్రస్తర :

గాతారం త్రాయతేనాఁ గలిగిన తెలివిన్ గాయత్రి కర్థా
న్వితంబై నామధేయంబితర మనుపులందీ ప్రభావంబు లేదీ

ప్రాతర్మధ్యాహ్న సాయోపగమములఁ బరబ్రహ్మవిద్వాంసులార్యుల్
జ్యోతిర్మూర్తిన్ భజింతురుర్వరగణ వినుతున్ సూర్యునిన్ సిద్ధవిద్యన్.

అర్థము:- గాయత్రికిన్ = గాయత్రికి. 'గాతారంత్రాయతే' గాతారం = తనమంత్రమును గానముచేయువానిని, త్రాయతే = కాపాడుచున్నది.' నాన్=అనెడి. తెలివిన్ = వ్యుత్పత్తిచేత. అర్థాన్వితంబై = (అర్థ + ఆన్వితంబై-అర్థాన్వితంబై.) అర్థసహితమై-సార్థకమై, నామధేయంబు = పేరు, కలిగెన్ = కలిగెను. ఇతర మనువులందు = ఇతరమంత్రములయందు. ఈప్రభావంబు = ఈవిధమైనమహిమ, లేదు=లేదు.' ఈప్రాతర్మధ్యాహ్న సాయోపగమములన్' ఈ=ఈవిధముగ.ప్రాతః= ఉదయము. మధ్యాహ్న=మధ్యాహ్నము. సాయ = సాయములయొక్క. ఉపగమము లన్ = రాకడలయందు, పరబ్రహ్మవిద్వాంసులు = పరబ్రహ్మవేత్తలైన. అర్యుల్= పెద్దలు. సిద్ధవిద్యన్ = సిద్ధవిద్యయైన గాయత్రి మంత్రముతో. జ్యోతిర్మూర్తిన్= జ్యోతిస్వరూపుఁడు. 'సురగణ వినుతన్' సురగణ=దేవగణములచేత. వినుతున్= కొనియాడఁబడిన. సూర్యునిన్ = సూర్యుని. భజింతుర్ = భజింతురు.

తాత్పర్యము :- 'గాతారం త్రాయతే ఇతిగాయత్రీ'. గానముచేయు వానిఁ గాపాడునది'. అను వ్యుత్పత్తి ననుసరించి సార్థకమైన నామధేయముగలది 'గాయత్రి'ఁ ఇతర మంత్రముల యందిట్టి ప్రభావములేదు. ఈసిద్ధ విద్యతో పర బ్రహ్మవేత్తలైన పెద్దలు త్రిసంధ్యలయందును. జ్యోతిస్వరూపుఁడును. సురగణ వినుతుఁడునైన సూర్యుని సేవింతురు.

కం. గాయత్రి పరబ్రహ్మము
గాయత్రి కధీశ్వరుండు కమలా ప్తుఁడు (శ్రీ)
గాయత్రీ మంత్రమునకు
నేయవియును సాటివచ్చునే? మంత్రమ్ములో! 185

అర్థము :- గాయత్రి = గాయత్రీ మంత్రము. పరబ్రహ్మము = పర బ్రహ్మ ప్రతిపాదకమైన మంత్రము. గాయత్రికిన్ = గాయత్రీ మంత్రమునకు. అధీశ్వ రుండు = అధిదేవత. కమలా ప్తుఁడు = సూర్యుఁడు. శ్రీగాయత్రీ మంత్రమున కున్ = శ్రీగాయత్రీ మంత్రమునకు. ఏయవియును మంత్రమ్ములో = ఏమంత్రము లును, సాటివచ్చునే? = సాటికివచ్చునా?

తాత్పర్యము :- గాయత్రియే పరబ్రహ్మము. గాయత్రి కధిదేవత సూర్యుడు. శ్రీగాయత్రీ మంత్రమునకే మంత్రములైనను సాటిపచ్చునా;

వ. ఈవేదమూర్తి హంసుండు, భానుండు, సహస్రాంశుండు, తపనుండు, తాపనుఁడు, రవి, వికర్తనుండు, వివస్వంతుండు, విశ్వకర్మ. విభావసుండు, విశ్వరూపుండు, విశ్వకర్త, మార్తాండుండు, మిహిరుం, డంశుమాలి, యాదిత్యుం, డుష్ణగుండు, నూర్యుం, డర్యముఁండు, బ్రధ్నుండు,దివాకరుండు, ద్వాదశాత్ముండు, సప్తహాయుండు, భాస్కరుం, డహస్కరుండు, ఖగుండు, సూరుండు, ప్రభాకరుండు, శ్రీమంతుండు, లోకచక్షువు, గ్రహేశ్వరుఁడు, త్రిలోకేశ్వరుండు, లోకసాక్షి, తమోరి, శాశ్వతుండు, శుచి, గభస్తిహస్తుండు, తీవ్రాంశుండు, తరణి, కళిందుండు, తార్క్ష్యవాహనుండు, దిక్పతి, పద్మినీనాయకుండు, కుశేశయకరుండు, హరి, మహోఽరణి, ద్యుమణి, హరిదశ్వ , డర్కుండు, భానుమంతుండు, భయనాశకుండు, ఛందోశ్వుండు, వేదవేద్యుండు, భాస్వంతుండు, పూష, వృషాకపి, యేకచక్రరథుండు, మిత్రుండు, మండేహరి, తమిస్రహుండు, దైత్యహుండు, పాపహర్త, ధర్మ్ముండు, ధర్మ్మప్రకాశకుండు, హేళి, చిత్రభానుండు, కలిఘ్నుండు, ఘర్మ్మరశ్మి, దుర్నిరీక్ష్యుండు, అరుణుండు, కశ్యపాత్మజుం డను నీ డెబ్బది నామంబులు గలిగియుండు. 186

అర్థము :- వేదమూర్తియైన యీ సూర్యుఁడు పై డెబ్బదిపేరులను గలిగియుండును.

సీ॥ మోఁకాళ్ళు భూమిపై మోపి హస్తాంబుజ
ద్వయమునఁ దామ్రపాత్రము ధరించి
యర్ఘ్యోదకంబులయందు దూర్వాంకురా
క్షతలును నవరక్త చందనంబు

కరవీర ముఖ్య రక్తప్రసూనంబులు
వైచియొక్కొక్క పేర్వరుసతో, న
మోంతంబుగాఁ జతుర్థ్యంతంబుగాఁ బ్రణ
వాదిగాఁ బఠియించు చర్ఘ్యపాత్ర

తే. మూళి పర్యంత మెత్తుచు మాటిమాటి
కర్ఘ్యమిచ్చినఁ బ్రీతుఁడై యర్కుఁ డొసఁగు
సేవకుల కాయురారోగ్యధీ వివేక
భాగ్య సౌభాగ్య వైభవ ప్రాభవములు. 187

అర్థము :- మోఁకాళ్ళు = జానుద్వయము, భూమిపైన్ = భూమిమీఁద, మోపి = ఆనించి, హస్తాంబుజద్వయమునన్ = రెండు చేతులతో. తామ్రపాత్రము= రాగిచెంబును, ధరించి = తాల్చి. అర్ఘ్యోదకంబులయందున్ =అర్ఘ్యజలములయందు. 'దూర్వాంకురాక్షతలను' దూర్వాంకుర = గరికమొలకలును. అక్షతలును, 'నవర క్త చందనంబు' నవ = నూతనమైన. ర క్తచందనంబు = ర క్తచందనమును. 'కరవీర ముఖ్య ర క్తప్రసూనంబులు' కరవీరముఖ్య = ఎఱ్ఱగన్నేరు మొదలైన. ర క్తప్రసూనంబులు = ఎఱ్ఱని పూవులను. వైచి = ఉంచి, ఒక్కొక్క పేరు = పై డెబ్బది పేర్లలో-ఒక్కొక్క పేరు, వరుసతోన్ = క్రమముతో. నమోంతంబుగాన్ ='నమః' అనునది చివరకు వచ్చునట్లు. చతుర్థ్యంతంబుగా-చతుర్థీ విభక్త్యంతముగా, ప్రణ వాదిగాన్ = ప్రణవము మొదట నుండునట్లుగా. పఠియించుచున్ = చదువుచు, అర్ఘ్యపాత్రన్ = పూజాపాత్రమును. మౌళిపర్యంతము = సిగవఱకును. ఎత్తుచున్ = ఎత్తుచు, మాటిమాటికిన్ = తడవతడవకు. అర్ఘ్యమిచ్చినన్ = అర్ఘ్యమిచ్చినచో, ప్రీతుఁడై = ప్రియమును పొందినవాఁడై, అర్కుఁడు = సూర్యుఁడు, సేవకుల కున్ = సేవించువారికి, 'ఆయురారోగ్య.... ప్రాభవములు' ఆయుః = ఆయుర్దా యము, ఆరోగ్య = ఆరోగ్యము. ధీ = బుద్ధిని. వివేక = వివేకమును. భాగ్య = భాగ్యమును, సౌభాగ్య = సౌభాగ్యమును. వైభవ = వైభవమును, ప్రాభవములన్ = ప్రాభవములను, ఒసఁగున్ = ఇచ్చును.

తాత్పర్యము :- సూర్యుని కభిముఖముగ మోఁకరిల్లి నిలిచి రెండు చేతులతో రాగిపాత్రను ధరించి, ఆ పాత్రయందలి యర్ఘ్యజలములలో గరికమొలకలు, అక్ష తలు, ర క్తచందనము, ఎఱ్ఱగన్నేరు మొదలైన ర క్తవర్ణ కుసుమము లుంచి,

పై దెబ్బది నామములలో పరుసగా ఒక్కొక్క నామమును చతుర్థీ విభక్త్యంతము చేసి దాని కొసను 'నమః' పదముఁ జేర్చి ప్రణవమును ఆదియందు నిలిపి పఠించుచు ఆ యర్ఘ్యపాత్రమును మౌళిపర్యంతము పైకెత్తి మాటిమాటికిని అర్ఘ్యమిచ్చినచోఁ సూర్యుఁడు ప్రియమునొంది. సేవించినవారికి ఆయువు, ఆరోగ్యము, బుద్ధి, వివేకము, భాగ్యము, సౌభాగ్యము, వైభవము, ప్రాభవము ప్రసాదించును.

సీ॥ అతి గుహ్యమై యకారాది క్షకారాంత
పంచాశదక్షర ప్రకృతియైన
మాత్రుకయా మహామంత్రరాజంబునై
దవయవంబులఁ బుట్టె నంబకార
మునకు మటి యుకారమునకు మకారంబు
నకు బిందువునకును నాదమునకుఁ
బ్రత్యేక మపదేసి పదియేసి వర్ణంబు
లనఘు! జన్యంబులై యతిశయిల్లు

తే. నట్టి ప్రణవంబు హేమసింహాసనమున
భాస్కరుండను మాణిక్యపదక భూష
యమిత ధరియించి దేవిగాయత్రి యొప్పుఁ
గడుపు చల్లంగ వేదాళిఁ గన్నతల్లి. 188

అర్థము :- అతిగుహ్యమై=పరమరహస్యమై. 'అకారాదిక్షకారాంత పంచాశదక్షర ప్రకృతియైన' అకారాది=అకారము ఆదియందు, క్షకారాంత=క్షకారము, అంతమందుఁగల, పంచాశదక్షర=ఏబది యక్షరములకును ప్రకృతియైన=మూలమైన.మాతృకయొ=తల్లియైన, మహామంత్రరాజంబు=మహామంత్రరాజమైన ప్రణవముయొక్క. ఐదవయవంబులన్ = ఐదు అవయవములనుండి, పుట్టెన్ = పుట్టెను. అందున్= అందులో, అకారమునకున్=ఆకారమునకును, మటి=మటి, ఉకారమునకున్=ఉకార మునకును, మకారంబునకున్=మకారమునకును, బిందువునకున్ = బిందువునకును, నాదమునకున్=నాదమునకును, ప్రత్యేకమ = ఒక్కొక్కదానికిని, పదేసి పదియేసి= పదేసిపదేసి, వర్ణంబులు=అక్షరములు, అనఘ !=నిష్పాపుఁడా !, జన్యంబులై=పుట్టిన వియై. అతిశయిల్లున్=అతిశయిల్లును, అట్టిప్రణవంబు హేమసింహాసనమునన్=ప్రణవ

మను స్వర్ణసింహాసనమునందు, 'భాస్కరుండను మాణిక్యపదకభూషన్' భాస్కరుండను = సూర్యుడనెడు. మాణిక్యపదకభూషన్ = మాణిక్యస్థగితమైన పతకమును. అఱుతన్ = కంఠమునందు. ధరియించి = తాల్చి. కడుపుచల్లంగన్ = కడుపు చల్లగా. వేదాలిన్ = వేదములను, కన్నతల్లి = కన్నతల్లియైన. దేవిగాయత్రి = గాయత్రీదేవి, ఒప్పున్ = ప్రకాశించును.

తాత్పర్యము :- అతిరహస్యమై; అకారముమొదలు షకారము తుదివఱకుఁ గల ఏఁబదియక్షరములకు మూలమైన మాతృకయగు ప్రణవమంత్ర రాజమునందు- అయిదవయవములు పుట్టెను. అందలి ఆకారమునకు, ఉకారమునకు, మకారమునకు, నాదమునకు-ఒక్కొక్క- దానికి పదేసిపదేసి వర్ణములు జన్యములై యొప్పును. అట్టి ప్రణవమనెడి హేమసింహాసనమునందు సూర్యుఁడను మాణిక్యపతకమును కంఠమువందుదాల్చి కడుపుచల్లఁగ వేదములనుగన్నతల్లి, గాయత్రీదేవి ప్రకాశించును. ఇది సూతసంహితనుండి గ్రహించిన విషయము.

క. సంశిత విజ్ఞాన! చతు
ర్వింశతి తత్త్వంబులకును నివేశనమగు నీ
యంశు మదధిపతి మంత్ర మ
సంశయముగ నెపుడు మన కొసఁగు నభిమతముల్. 189

అర్థము :- సంశిత విజ్ఞాన = ధరింపఁబడిన విజ్ఞానముగలవాఁడా!. లేక- సూక్ష్మమైన విజ్ఞానము గలవాఁడా! చతుర్వింశతి తత్త్వంబులకును = అవ్యక్తము మొదలైన యిరువదినాలుగు తత్త్వములకును, నివేశనమగు = స్థానమైన. 'ఈ యంశుమదధిపతి మంత్రము' ఈ = ఈ, అంశుమత్ = సూర్యుఁడు, అధిపతి = అధిదేవతగాఁగల, మంత్రము, అసంశయముగన్ = నిస్సంశయముగ, ఎపుడు = ఎల్లకాలము, అభిమతమున్ = అభీప్సితములను - కోరికలను, మనకున్ = మనకు. ఒసఁగున్ = ఇచ్చును.

తాత్పర్యము :- ఓ నిశితమైన విజ్ఞానముగలవాఁడా! (శివశర్మా!) మూలప్రకృతి మొదలైన యిరువది నాలుగుతత్త్వములకును, స్థానమై సూర్యుఁడధిదేవతగాఁగల యీ గాయత్రీ మంత్రము నిస్సంశయముగా నెల్లకాలము మన కభిమతముల నొసఁగుచుండును.

సీ. మూఁడు వేదంబులు మూఁడుపాదంబులు
నాభి యాదిమ పురాణవ్రజంబు
క్రిందు మీఁదును జతుర్దిశలు నార్కు-ట్లులు
భువనంబు దేహంబు దివి యుదరము
ధర్మశాస్త్రంబు హృత్సరసీజముకుళంబు
ఛందోవితతి కుచ స్తబక యుగము
సాంఖ్యశాస్త్రంబులు శ్రవణపాశంబులు
జాతవేదుఁడు వక్త్రచంద్రబింబ

తే. మైదు తలలును శిక్షాదు లంగకములు
చేష్టయాధర్వణశ్రుతి శిఖశివుండు
బ్రహ్మ మూర్ధంబు హరియాత్మ భావలక్ష
ణములు మీమాంస సావిత్రి కమలచరిత! 190

అర్థము :- అమలచరిత: = అమలాచారుఁడా: - నిర్మలమైన యాచారము గలవాఁడా, సావిత్రికిన్=గాయత్రికి, మూఁడు వేదంబులు = ఋగ్యజుస్సామములు మూఁడును, మూఁడు పాదములు = త్రిపదములు, ఆదిమపురాణ వ్రజంబు = అష్టాదశపురాణవర్గము, నాభి = నాభి, క్రిందు మీఁదును చతుర్దిశలు = భూమ్యాకాశములును నాలుగుదిక్కులును, ఆర్కు-ట్లులు=ఆరుకుట్లు-షట్కుట్లు, భువనంబు = సమస్త భువనము. దేహంబు = శరీరము, దివి = ఆకాశము-లేక-ద్యులోకము, ఉదరము = ఉదరము, ధర్మశాస్త్రంబు = ధర్మశాస్త్రము, హృత్సరసీజముకుళంబు= హృదయపద్మకోశము, ఛందోవితతి = ఛందస్సుల సమూహము, కుచ స్తబకయుగము = స్తనద్వంద్వము, సాంఖ్యశాస్త్రంబులు = సాంఖ్యము. యోగము, శ్రవణ పాశంబులు = వీనుదోయి, జాతవేదుఁడు=అగ్ని, వక్త్ర చంద్రబింబము=ముఖము, శిక్షాదులు = శిక్షమొదలైన. అంగకములు = వేదాంగములు, ఐదుతలలును = ఐదు శిరస్సులు, (శిక్ష) వ్యాకరణము. నిరుక్తము. జ్యోతిషము. కల్పము -ఇవి యైదును శిరస్సులు-ఛందము. స్తనయుగమగ పూర్వముచెప్పబడినది కనుక మిగిలినఅయిదు-అంగములను-అయిదు శిరస్సులుగా నెఱుఁగునది.)

అధర్వణశ్రుతి = అధర్వవేదము, చేష్ట = కదలిక, శివ = శివ, శివుండు= శివుఁడు. బ్రహ్మ = బ్రహ్మ, మూర్ధంబు = శిరస్సు, హరి = విష్ణువు. ఆత్మ, భావ లక్షణములు = అగాయత్రియొక్క తటస్థలక్షణములు. మీమాంస=పూర్వమీమాంస.

తాత్పర్యము :- ఈపద్యమునందలి విషయము సూత సంహితంనుండి తీసినది. మూల కాశీఖండములోనిది కాదు;

జపకాలమునందు ధ్యానింపవలసిన సావిత్రియొక్క విరాడ్రూప మిందు వర్ణింపఁబడినది.

ఋగ్యజుస్సామములను మూఁడువేదములును మూఁడుపాదములు. భూమి. ఆకాశము. నాలుగు దిక్కులు-వెరసి ఆఱుకుక్షులు, సమస్త భువనము శరీరము, దివి. యుదరము. ధర్మశాస్త్రము హృదయపద్మకోశము. ఛందస్సమితి స్తనద్వయము, సేశ్వరనిశీశ్వరసాంఖ్యములు రెండును, రెండుచెవులు. అగ్నిముఖము. శిక్షావ్యాకరణ నిరుక్తజ్యోతిషకల్పములైదును - అయిదుతలలు. అధర్వణవేదము, చేష్ట, శివ. శివుఁడు. బ్రహ్మ. శిరస్సు. విష్ణువు, ఆత్మ, భావలక్షణము తటస్థలక్షణము పూర్వ మీమాంస (సూక్ష్మశరీరము వేదాంతశాస్త్రము.)

: శేషములు .- సూతసంహిత యజ్ఞవైభవఖండ పూర్వభాగము షష్ఠాధ్యాయము.

'సావిత్రీ త్రిపదాజ్ఞేయా షట్కుక్షిః పంచశీర్షకా
అగ్నివర్ణ ముఖాషట్కా పుండరీకదశేక్షణా
ఋగ్యజు స్సామ రూపాశ్చ పాదా అస్యాః ప్రకీర్తితాః
పూర్వాదిక్ప్రథమాకుక్షి ర్ద్వితీయాదక్షిణామతా
పశ్చిమాదిక్ తృతీయాచ చతుర్థీచోత్తరా మతా
ఊర్ధ్వా దిక్పంచమీకుక్షి రధషష్ఠీ ప్రకీర్తితా
అష్టాదశ పురాణాని నాభిరస్యా ముసీశ్వరాః
జగచ్ఛరీరం సావిత్ర్యా ఆకాశముదరాంతరం
స్తనౌఛందాంసి హృదయం ధర్మశాస్త్ర మకల్మషం
బాహవోన్యాయశాస్త్రంతు కర్ణౌసాంఖ్యద్వయంతథా
శివద్యంగావి శీర్షాణి వక్త్రిమగ్నిర్మహాద్యుతిః
మీమాంసాలక్షణం తస్యాశ్చేష్టాశ్చాధర్వణీ శ్రుతిః

బ్రహ్మ మూర్ధ శిఖారుద్రో విష్ణురాత్మా ప్రకీర్తితః
తస్యాస్సూక్ష్మ శరీరంతు శాస్త్రం వేదాంత సంజ్ఞితం
అంతర్యామీ శివస్సాక్షాత్ సాంబశ్చంద్రార్ధ శేఖరః'

క0. వ్యాహృతులతోడఁ బ్రణవో
ద్గ్రీహముతో శిరముతోడఁ గమలా ప్త మనః
ప్రాహుణికంబై యీ మను
వాహుతిఁ గొనుఁ బాతకముల నగ్నియుఁ బోలెన్ 191

అర్థము :- వ్యాహృతులతోడన్ = 'భూః' 'భువః' 'సువః' అనెడు ఋక్. సామ. యజుస్సులకుఁ బ్రతినిధులైన వ్యాహృతులతోను. 'ప్రణవోద్గ్రీహముతోన్' ప్రణవ = ప్రణవమనెడి. ఉద్గ్రీహముతోన్ = ఉగ్గుతోను. శిరముతోడన్ = 'ఓమాపోజ్యోతీరసోఽమృతం బ్రహ్మ'-ఇత్యాది శిరోమంత్రముతోను, 'కమలా ప్త మనః ప్రాహుణికంబై' కమలా ప్త = సూర్యునియొక్క మనః = మనస్సునకు, ప్రాహుణికంబై = ప్రియాతిథియై, ఈమనువు = ఈమంత్రము, ఆగ్నియుబోలెన్ = అగ్నిహోత్రునివలె, పాతకములన్ = పాపములను, ఆహుతిఁగొనున్ = అహుతిగా స్వీకరించును.

తాత్పర్యము :- 'భూః' మొదలైన మూఁడు వ్యాహృతులతోను. ప్రణవమనెడి యుగ్గుతోను- 'ఓమాపోజ్యోతీరసః' అనెడి శిరోమంత్రముతోను, సూర్యునకు మనఃప్రియమైన యీ మంత్రము అగ్నివలె - పాపములను ఆహుతిగా స్వీకరించును.

మ. క్షితిదేవోత్తమ! బ్రాహ్మణుండు వెలిగా జిహ్మాభిచారక్రియా
క్రతు తంత్రంబున, శాత్రవున్ గుటిచియీగాయత్రి వర్ణావళిన్
ప్రతిలోమంబున నుచ్చరించి విడువన్ బ్రహ్మాస్త్రమై తాఁకి యా
ప్రతిపక్షుం దెగటార్చు నంగుళి శిఖాప్రస్ఫోటమాత్రంబునన్ .192

అర్థము :- క్షితిదేవోత్తమ! = భూసురోత్తమ, బ్రాహ్మణుండువెలిగాన్ = బ్రాహ్మణుని విడిచి, 'జిహ్మాభిచారక్రియాక్రితు తంత్రంబునన్' జిహ్మ = కుటిలమైన, అభిచారక్రియా = ప్రయోగములకు సంబంధించిన, క్రితుతంత్రంబునన్ =

యాగతంత్రమునందు, శాత్రవున్ గుఱిచి = శత్రువునుద్దేశించి. ఈగాయత్రివర్ణావళిన్ = ఈగాయత్రీ మంత్రమునందలి వర్ణములను, ప్రతిలోమంబునన్ = తుదినుండి మొదలుగా, ఉచ్చరించి = ఉచ్చరించి, విడువన్ = మంత్రజలములను విడువఁగా. బ్రహ్మఘ్నుమై = బ్రహ్మఘ్నముగఁ బరిణమించి. తాఁకి = తగిలి. ఆప్రతివఱున్ = ఆశత్రువును, అంగుళికాగ్రస్పోటమాత్రంబునన్ = ఁటికమిడిచినంతటిలో-చిటికెవేసినంతకాలములో, తెగటార్చున్ = సంహరించును.

తాత్పర్యము :- భూసురోత్తమా! బ్రాహ్మణుని విడిచి - అభిచారిక క్రతుతంత్రమునందు-శత్రువు నుద్దేశించి ఈగాయత్రీ మంత్రాక్షరములను తుదినుండి మొదలువఱకు ప్రతిలోమముగా నుచ్చరించి మంత్రజలమును విడిచినచో ఆది బ్రహ్మఘ్నమై శత్రువును దాఁకి చిటికవేయు నంతకాలములోఁ దెగటార్చి విడుచును.

విశేషము :- ఈ విషయము మూలములో లేదు. సూతసంహిత నుండి గ్రహింపఁబడినది.

"సావిత్రీ ప్రతిలోమాస్యా దభిచారేషు కర్మసు
మారణే వర్ణశః శత్రోః బ్రహ్మఘ్నం ప్రతిలోమతః" యజ్ఞ. 6-504
'ప్రతిలోమేన వర్ణానా మఘ్నమాహుర్మనీషిణః' (వ్యాఖ్య)

సీ॥ గాయత్రి విష్ణుండు గాయత్రి శంభుండు
గాయత్రి పరమేష్ఠి కర్మనిష్ఠ !
గాయత్రి శివవిష్ణు కమలసంభవమూర్తి
యైన మార్తాండుండు మౌనివర్య !
గాయత్రి జపియించి గాయత్రిఁ గొనియాడి
కాంచు విప్రుఁడు ముక్తి కలితపుణ్య !
గాయత్రి సేవించు కాలంబు కాలంబు
మంత్ర తంత్రముల నిర్మల వివేక !

తే. యనఘ! సావిత్రి యనఁగ గాయత్రి యనఁగ
విశ్వజనయిత్రి యనఁ జతుర్వేద మాత

యనఁ బరాపర బ్రహ్మాద్వయం బనంగ
నమ్మహాదేవికి సమాహ్వయాంతరములు. 193

అర్థము :- కర్మనిష్ఠ = కర్మనిష్ఠుఁడనైన ఓ శివశర్మా ! గాయత్రి = గాయత్రియే. విష్ణుండు = విష్ణువు. గాయత్రి = గాయత్రియే. శంభుండు=శివుఁడు. గాయత్రి=గాయత్రియే. బ్రహ్మ=పరమేష్ఠి, మౌనివర్య=మౌనిశ్రేష్ఠుఁడా ! 'శివ.... మూర్తియైన' శివ=శివుఁడు. విష్ణు=విష్ణువు, కమలసంభవ=బ్రహ్మ. (వీరియొక్క) మూర్తి=మూర్తియైన, మార్తాండుండు = సూర్యుఁడు, గాయత్రి = గాయత్రి, కలిత పుణ్య=పుణ్యసంపన్నుఁడా!, గాయత్రిన్=గాయత్రీ మంత్రమును, జపియించి = జపించి, గాయత్రిన్=గాయత్రిని, కొనియాడి=ప్రశంసించి, విప్రుఁడు=విప్రుఁడు, ముక్తిగాంచున్=ముక్తి నిపొందును. నిర్మలవివేక=విమలమైనవి వేకముగలవాఁడా !, మంత్రితంత్రిములన్=మంత్ర తంత్రిములతో, గాయత్రిన్=గాయత్రిని, సేవించు కాలంబు = సేవించు కాలమే, కాలంబు=కాలము. అనఘ ! = పాపవిరహితుఁడా!, సావిత్రి యనఁగన్ = సావిత్రియనఁగా, గాయత్రి యనఁగన్=గాయత్రి యనఁగా, విశ్వజనయిత్రి = విశ్వజనని, అనన్ = అనఁగా, 'చతుర్వేద మాతయనన్' చతుర్వేద = నాలుగు వేదములకు, మాతయనన్ = తల్లి యనఁగా, పరాపరబ్రహ్మ ద్వయంబు = క్షరాక్షరబ్రహ్మముల యొక్క జంట. యనఁగన్ = అనఁగా, అమ్మహాదేవికిన్ = ఆ మహాదేవికి, సమాహ్వయాంతరములు = నామాంతరములు.

తాత్పర్యము :- గాయత్రియే విష్ణువు. గాయత్రియే శివుఁడు. గాయత్రియే బ్రహ్మ. శివ విష్ణు బ్రహ్మల సమాహారరూపమైన మార్తాండుడు. గాయత్రిని జపించి గాయత్రిని కీర్తించి, విప్రుఁడు ముక్తిపదము నొందును. మంత్ర తంత్రిములతో గాయత్రిని సేవించు కాలమే కాలము. అనఘుఁడా ! సావిత్రి, గాయత్రి, విశ్వజనయిత్రి, చతుర్వేద మాత, పరబ్రహ్మము. ఆ పరబ్రహ్మము - ఆ మహాదేవికి నామాంతరములు.

వ. అని పుణ్యశీల సుశీలురు సూర్యలోక మాహాత్మ్యం బభివర్ణింప నాకర్ణింపుచు, శివశర్మ ముందట నయనానంద సందోహ సంధాయి యగు నొక్క పట్టణంబుఁ గనుంగొని యవ్విష్ణు కింకరుల కిట్లనియె. 194

అర్థము :- అని = ఇట్లు. పుణ్యశీల సుశీలురు = పుణ్యశీలుఁడు సుశీలుఁడు అను విష్ణుకింకరులు. సూర్యలోకమాహాత్మ్యంబున్ = సూర్యలోకముయొక్క మహిమను. అభివర్ణింపన్ = వర్ణింపఁగా. ఆకర్ణించుచున్ ఆలకింపుచు. శివశర్మ = శివశర్మ. ముందటన్ = ఎదుట. 'నయనానందసందోహ సంధాయియగు' నయనానంద = నేత్రానందములయొక్క. సందోహ = సమూహమును. సంధాయియగు = సంధావించునట్టైన. ఒక్క పట్టణంబున్ = ఒక పట్టణమును. కనుంగొని = చూచి. యవ్విష్ణుకింకరులకున్ = ఆ విష్ణుకింకరులకు. ఇట్లనియెన్ = ఇట్లు పలికెను.

తాత్పర్యము :- అని యీ రీతిగా విష్ణుకింకరులు సూర్యలోక మాహాత్మ్యమును వర్ణింపఁగా నాకర్ణించుచు శివశర్మ తన యెదుట నయనానందకరమైన యొకానొక నగరమును జూచి విష్ణుకింకరులైన ఆ పుణ్యశీల సుశీలురతో నిట్లు పలికెను.

తే. పుండరీకాక్షులార! యీపురవరంబు
నెఱియ నుత్సవ మొనరించె నేత్రములకు
నెఱుఁగ జెప్పుఁడు నాకదియే భువనమొ!
శోభితంబైన కారుణ్య వైభవమున॥ 195

అర్థము :- 'పుండరీకాక్షులారా!' పుండరీక = తెల్లఁదామర పువ్వులవంటి. అక్షులార = నేత్రములుగల_ఓ విష్ణుకింకరులారా! (విష్ణువునందే రూఢమైన 'పుండరీకాక్ష' శబ్దము సారూప్యముక్తివి బట్టి యిచ్చట విష్ణుకింకరులకు వాడఁబడినదని తెలియవలయును.) ఈపురవరంబు = శ్రేష్ఠమైన యీపట్టణము, నేత్రములకున్ = కన్నులకు, నెఱియన్ = పరిపూర్ణముగా, ఉత్సవము = పండుగను, ఒనరించెన్ = చేసెను, అది = అది, ఏ భువనమొ = ఏ లోకమో!, నాకున్ = నాకు, శోభితంబైన = ప్రకాశితమైన, కారుణ్యవైభవమునన్ = దయాసమృద్ధితో, ఎఱుఁగ జెప్పుఁడు = తెలియఁజెప్పుఁడు.

తాత్పర్యము :- సితకమలముల వంటి కన్నులుగల_ఓ విష్ణుకింకరులారా! ఈ యెదుట కనిపించుచున్న గొప్పనగరము_సంపూర్ణమైన నేత్రానందమును కలిగించుచున్నది. అది ఏలోకమో! ప్రకాశితమైన దయతో నాకుఁ దెలియఁ జెప్పుఁడు.

తే. అనిన వారిది నముచి మర్దనుని వీడు
కనక గోపుర, కనకాట్ట, కనక సౌధ,
కనక కుట్టిమ వేదికా, కనక భి_త్తి,
కనక రాజీవ, సరసీ ప్రకాశితంబు. 196

అర్థము :– అనినన్ = శివశర్మ యట్లడుగఁగా. వారు = ఆ విష్ణుకింకరులు ఇది = ఇది, నముచిమర్దనుని =ఇంద్రునియొక్క. ('నముచి' అను రాక్షసునిసంహరించెను గనుక–ఇంద్రునకు నముచి మర్దనుఁడనిపేరు.) వీడు = నగరము. 'కనక గోపుర .... ప్రకాశితంబు' కనక = బంగారుమయములైన, అట్ట = వాఁకిలి మండపములమీఁద నిర్మింపఁబడిన యిండ్లతోను, కనక = బంగారుమయములైన, సౌధ = మేడలతోను, కనక = బంగారు మయములైన, కుట్టిమ = నెలకట్టుల తోను–'చప్టా' చేసిననేల, కనక = బంగారుమయములైన, భి_త్తి = గోడలతోను. కనకరాజీవసరసీ = బంగారు తామరపూవులుగల సరస్సులతోను, ప్రకాశితంబు = జేయఁబడినది.

తాత్పర్యము :– శివశర్మ యిట్లడుగఁగా విష్ణుకింకరులిట్లు చెప్పిరిः బంగారుమయములైన పురద్వారములతో–మంటపములపైనఁ గట్టిన యిండ్లతో, మేడలతో, నెలకట్టులతో, గోడలతో, కమలకాసారములతో, ప్రకాశించుచున్న యీ నగరము దేవేంద్రుని రాజధానియైన ఆమరావతిः

సీ. చీకిలించుకయుండుఁ జిగురు తెప్పలలోనఁ
గుసుమ సాయకవైరి నొసలికన్ను
పద్మనాభుని కౌస్తుభము కాంతి వెలిపోయెఁ
బద్మచన్నులమీఁది పసుపు తాఁకి
ధళుధళుక్క–న నింగిఁ దాటించి చనుఁగాని
నిలువ నేరదు హరిదినీ ప్రకాశ
మ_స్తి నా_స్తి ప్రకాశాను సారంబున
మినుమినుక్క– మనుచుండు ననలుదీ_ప్తి

తే. పగలు పగలయ్యె శశివిభా ప్రసరమునకుఁ
దానపో దిక్కు దీప్తి సంతానమునకు
ననఁగఁ, గనఁగఁ గనక వర్ణాభుఁడైన
భానుఁ డేతత్పురీ సమీపమున నడచు॥ 197

అర్థము :- 'కుసుమసాయకవైరి. కుసుమ = పూవులు, సాయక = బాణము లుగాఁగల మన్మథునకు, వైరి = శత్రువైన శివునియొక్క. నొసలికన్ను = ఫాల నేత్రము. చిగురుఱెప్పలలోనన్ = ఱెప్పతుదివెండ్రుకలలోపల - పక్ష్మములలోపల. చీకిలించుకయుండున్ = మిఱుమిట్లుగొనియుండును.

'పద్మచన్నుల మీఁది పసుపుతాఁకి' పద్మ = లక్ష్మీదేవియొక్క. చన్నుల మీఁది స్తనములమీఁది. పసుపు = పసుపు. తాఁకి = తగిలి. 'పద్మనాభుని కౌస్తుభము కాంతి' పద్మనాభుని=విష్ణువుయొక్క. కౌస్తుభముకాంతి = కౌస్తుభముయొక్క కాంతి. వెలిపోయెన్ = వెలిసిపోయెను. 'హ్రాదినీ ప్రకాశము' హ్రాదినీ=మెఱుపుఁదీఁగెయొక్క. ప్రకాశము = వెలుఁగు. ధళుధళుక్కనన్ = 'ధళుధళుక్క' మని. వింగిన్ = ఆకాశమును, తాటించి = కొట్టి, చనుఁగాని = వెళ్లనుగాని, నిలువ నేరదు = నిలిచి ప్రకాశింపలేదు. 'అనలు దీప్తి' అనలు = అగ్నియొక్క. దీప్తి= వెలుఁగు. 'అస్తినాస్తి ప్రకాశానుసారంబునన్' అస్తినాస్తి = కలదు లేదు - అను మాదిరిగానున్న. ప్రకాశానుసారంబునన్=ప్రకాశముననుసరించి. "మినుమిన్నక్క" మనున్ = 'మినుకు' 'మినుకు' మనుచుండును.

'శశివిభా ప్రసరమునకున్' శశి = చంద్రునియొక్క. విభా = కాంతియొక్క. ప్రసరమునకున్ = ప్రసారమునకు, పగలు = పగటికాలము. పగలయ్యెన్=శత్రువయ్యెను (పగటివేళ వెన్నెల ప్రకాశింపదనుట) "దీప్తి సంతానమునకున్" దీప్తి = వెలుఁగులయొక్క. సంతానమునకున్ = సమూహమునకు. దిక్కు=ఆశ్రయము. తానపో = తనకంటె వేఱుగాలేదు. అనఁగన్ = అనఁగా. కనఁగన్ = చూడఁగా. కనక వర్ణాభుఁడైన = బంగారు రంగు కలవాఁడైన. భానుఁడు = సూర్యుఁడు. 'ఏతత్పురీ సమీపమునన్' ఏతత్పురీ = ఈ పురముయొక్క. సమీపమునన్ = సమీపమునందు. నడచున్ = నడచును.

తాత్పర్యము :- శివుని ఫాలనేత్రము కనుఱెప్ప వెండ్రుకలలోపల మిఱుమిట్లుగొనుచుఁ జెదలియుండును. లక్ష్మీదేవి స్తనమండలముల మీఁది పసుపు అంటు

కొని విష్ణువుయొక్క కౌస్తుభకాంతి కగ్గియుండును - (వెలిసిపోయియుండును) మెఱు పులకాంతి - 'ధఖధఖక్క-'మని యాకాశమును మోఁది పోవునేకాని నిలిచివెలుఁగ లేదు. అగ్నిదేవుని దీప్తి 'కలదాఁ లేదాఁ' అన్నట్లు మినుకు మినుకు మనుచుండును. ఇఁక వెలుఁగులకు తానుగాక దిక్కెవ్వరుఁ అన్నమాదిరిగా - చూఁచుటకు బంగారు వన్నెగలవాఁడై, సూర్యుఁడు-ఈపుర సమీపమున నడచుచుండును,

చం. అమవసలందు నాసరసి జాప్తుని గర్భము దూఱఁబోవు నా
సమయమునన్ స్వకీయమగు చంద్రిక నిల్లడవెట్టెనోసుమీ!
యమృత మయూఖుఁడీ నెలవునందను సంశయమావహించెను
త్తమకుల! చూడుమిప్పురి సుధాధవళోన్నత సౌధవీథికల్॥ 198

అర్థము :- అమవసలందున్ = అమావాస్యలయందు, 'అసరసిజాప్తుని.... .... సమయమునన్' ఆ సరసిజాప్తుని = ఆ సూర్యునియొక్క, గర్భము = గర్భ ప్రదేశమునందు, తూఱఁబోవు = ప్రవేశింపఁబోయెడి, ఆసయమునన్ = ఆవేశ యందు, స్వకీయమగు = తనదైన, చంద్రికన్ = వెన్నెలను, 'ఇల్లడవెట్టెనో సుమీఁ' ఇల్లడ = న్యాసముగా, పెట్టెనో సుమీఁ = పెట్టియుండెనో సుమాఁ అమృత మయూఖుఁడు = అమృతకిరణుఁడైన చంద్రుఁడు; ఈనెలవునందున్ = ఈ యమ రావతి యందు. అనుసంశయము = అనెడి సందేహము. ఆవహించెన్ = ఆవ హిల్లెను, ఉత్తమకులఁ = ఉత్తమవంశజుఁడాఁ. ఇప్పురి = ఈ నగరముయొక్క, సుధాధవళ = అమృతమువలె తెల్లనైన, ఉన్నత = ఎత్తైన. సౌధవీథికల్ = మేడల వరుసలను, చూడుము = చూడుము.

తాత్పర్యము :- 'అమా' అను సంస్కృతా వ్యయమునకు 'కలసియుం డుట' అని యర్థము. కనుక 'అమావాస్య' అనఁగా సూర్యచంద్రులు కలసియుండు దినమని యర్థము. "దర్శస్సూర్యేందు సంగమఃఁ సూర్యేందు సంగమకాలము 'దర్శనము', దర్శనమనఁగా-అమావాస్య. దీనికి-తద్భవము 'అమవస' ('అమాత్య' శబ్దము కూడ నిట్టిదియే - రాజుతోఁగలిసియుండు వాఁడని యర్థము.)

ప్రకృతము :- అమావాస్య వేళలయందు - చందుర్ఁడు సూర్యునిగర్భ ములోఁ జొఱఁబోవుముందు తన వెన్నెలను ఈనెలవునందు న్యాసముగా నిలిపి

యుండునుసుమా! అన్నమాదిరిని_ఈ యమరావతీనగరమునందలి సుధాధవళములై పమున్నతములైన సౌధపీఠులుగానవచ్చుచున్నవి. చూడు మని విష్ణుకింకరులు శివ శర్మతో ననుచున్నారు.

శా. పౌనఃపున్యమునన్ ఘటింపఁ దొడఁగెన్ బ్రహ్మాన్వయో త్తంస! గౌ
ష్ఠీనాగ్రంబున వేఁగపెయ్య యిదికంటే! కామధేనూద్భవం;
బానందంబున డెందముబ్బఁగజనన్యా పీనవాపీ సుధా
పానోత్పుచ్ఛ మనూనమౌ చటుల రుంపాతాండవాటోపమున్.

అర్థము :- 'బ్రహ్మాన్వయోత్తంస!' బ్రహ్మాన్వయ - బ్రహ్మవంశమునకు, ఉత్తంస = శిరోభూషణమువంటివాఁడా!. 'గౌష్ఠీనాగ్రంబునన్' గౌష్ఠీన = ఒకనాటి యావులకొట్టముయొక్క, అగ్రంబునన్ = ముందరిభాగమునందు, 'కామధేనూద్భవంబు' కామధేను = కామధేనువునుండి, ఉద్భవంబు = పుట్టిన. వేఁగపెయ్య=వేఁగదూడ, ఇది = ఇది, 'జనన్యాపీనవాపీసుధాపానోత్పుచ్ఛము' జననీ = తల్లియొక్క, ఆపీన = పొదుగేయనెడి, వాపీ = బావియందలి, సుధా = అమృతక్షీరముయొక్క, పాన = పానవేళయందు, ఉత్పుచ్ఛము = ఎత్తినతోకకుచ్చు గలదియై, ఆనందంబువన్ = ఆనందముచేత, డెందము = హృదయము, ఉబ్బఁగన్=పొంగఁగా, అనూనమౌ = (న + ఊనము అనూనము) తక్కువదికాని. చటులరుంపాతాండవాటోపమున్' చటుల = మిక్కిలి లాఘవముగల. రుంపా = దూఁకుళ్లతో కూడుకొన్న, తాండవాటోపమున్ = తాండవసంరంభమును, పౌనఃపున్యమునన్ = మాటిమాటికిని. ఘటింపఁ దొడఁగెన్ = కూర్ప మొదలిడెను, కంటే = చూచితివా!

తాత్పర్యము :- ఓ బ్రాహ్మణోత్తంసమా! ఈప్రాఁతకొట్టము ముంగిటిలో కామధేనువు బిడ్డయైన యీ లేఁగదూడ తోఁకకుచ్చు పైకెత్తి తల్లిపొదుగులోని పాలు కడుపునిండఁ ద్రాఁగి ఆ యానందమును పట్టలేక యెట్లు చిందులుత్రొక్కు చున్నదో చూచితివా!

విశేషము :- 'గౌష్ఠినం భూత పూర్వకం' అమరము.

ఒకప్పుడు - ఆవులకొట్టమున్నచోటు

శా. కంటే!స్వఃకరికంతపీత విలుత ద్రైవేయ లోహార్గళా
ఘంటాటాంకృతిఁ దార సౌధవలభీ గర్భంబులం దార్కొనన్
ఘంటావీథిఁ జరించుచున్నది పురిం గారామువాటించి వెన్
వెంటన్ దివ్యక రేణువభ్ర. ముపధావింపంగ దర్పోద్ధతిన్॥ 200

అర్థము :- 'కంత పీత .... ఘంటాటాంకృతి' కంతపీత = కుత్తుక పట్టెయందు. విలుతత్ = కదలుచున్న. గ్రైవేయ = కంఠాభరణమునందమర్పఁ బడిన. లోహార్గళా = ఇనుపగడియకుఁ దొడిగిన. ఘంటా = గంటయొక్క. 'టాంకృతి' = టాంకారము, 'తారాసౌధవలభీగర్భంబులన్' తారసౌధ = పెండిమేడలయొక్క. వలభీ = ముంజూరులయొక్క, గర్భంబులన్ = లోపలి ప్రదేశములయందు. తార్కొనన్=ప్రసరింపఁగా, గారాము = ప్రేమను. పాటించి=మన్నించి. వెన్వెంటన్ = వెనువెంట. "దివ్యకరేణువు ' దివ్య=దేవలోకమునందలి. కరేణువు= పిడియేనుఁగైన (ఆడుఏనుఁగు) అభ్రము = 'అభ్రిము' అనుపేరుగల-ఐరావత పత్ని. ఉపధావింపంగన్ = అనుసరించి పరువెత్తుచుండఁగా. పురిన్ = పట్టణమునందు. ఘంటావీథిన్ = రాజవీథియందు. దర్పోద్ధతిన్ = గర్వమువలనఁ గలిగిన అడరిపాటుతో, చరించుచున్నది = సంచరించుచున్నది, కంటేః = చూచితివాఃస్వఃకరిన్ = ఐరావతమును-

తాత్పర్యము :- మెడపట్టెయందు దొరలియాడుచున్న కంఠభూషయందమర్పఁబడిన యినుపగడియకుఁ దొడిగిన ఘంటయొక్క-ఠంకార ధ్వని మేడల ముంజూరులలోఁ బ్రవేశించుచుండ. వెనువెంటఁ బ్రేమతోఁ బిడి ఏనుఁగు 'అభ్రిము' పరువెత్తుకొనిరాఁగా. నగరరాజవీథియందు-గర్వోద్ధతమై ఐరావతము నడచుచున్నది. చూచితివాఃసి

విశేషము :- 'అభ్రిము' శబ్దములోని ము వర్ణము ప్రకృతిలోనిదేకాని ప్రత్యయమునకు సంబంధించినదికాదు. 'అభ్రము' శబ్దము సంస్కృతము ఉకారాంతము. తెనుఁగులోదీనికి-'ఉకారాంత గోశబములకంతట వువరకంబగు' అను విధిచే 'వు' వర్ణకముచేరి 'అభ్రమువు' అని యుండవలెను. కవి దీనికి 'వు' వర్ణకమును జేర్పక సంస్కృత ప్రాతిపదికయైన 'అభ్రము' ను ప్రత్యయ విరహితముగావాడుట చింత్యము, "అభ్రమువు" ఐరావతము భార్య.

కం. నందనవన మిదె ధరణీ
బృందారక! యల్ల పెద్ద పృథివీరుహము ల్
మందార కల్పతరు హరి
చందన సంతాన పారిజాతాహ్వయము ల్. 201

అర్థము :- ధరణీబృందారక ! = భూమిసురుఁడా !, నందనమిదె = నందన వన మిదియే. అల్ల = ఆ కనిపించునట్టి, పెద్ద పృథివీరుహములు = పెద్ద చెట్లు, మందార. కల్పతరు. హరిచందన. సంతాన, పారిజాతము లనెడి, ఆహ్వయములు = పేరులు గలవి.

తాత్పర్యము :- ఓ భూసురుఁడా ! ఇదియే నందనవనము. ఆ కనిపించు చున్న పెద్ద చెట్లే దివ్యవృక్షములు. అవి- అయిదు తెగలివి. మందారము, కల్ప కము, హరిచందనము, సంతానము, పారిజాతము అని వాని పేర్లు.

మ. దివిజాధీశు సుధర్మయన్ సభ సముద్వీక్షింపు భూదేవ! రెం
డవ కైలాసమువోలె నున్న యది; !బ్రహ్మాండంబుతో రాయుచున్
ధవళాహీశ ధరాట్టహాస విమలద్రాఘిష్ఠ శృంగాగ్రమై
యవదాతధ్వజ శాటికాంచల చపేటాధూత జీమూతమై. 202

అర్థము :- భూదేవ ! = భూసురుఁడా !, 'దివిజాధీశు సుధర్మయన్ సభ' దివిజ = దేవతలకు, అధీశు = అధిపతియైన యింద్రునియొక్క, సుధర్మయన్ = సుధర్మ యనెడి, సభన్ = సభను. సముద్వీక్షింపు = తలయెత్తి సమగ్రముగాఁ జూడుము. 'ధవళాహీశ .... శృంగాగ్రమై' ధవళ = తెల్లని వర్ణముగల, అహీశ = పాములకు రాజైన శేషుని, ధర = ధరించిన హరునియొక్క, అట్టహాస = పెద్ద నవ్వువలె, ద్రాఘిష్ఠ = మిక్కిలి పొడవైన, శృంగ=శిఖరముల యొక్క, అగ్రమై= అగ్రభాగములు కలదియై, 'అవదాత .... జీమూతమై' అవదాత = తెల్లని, ధ్వజ శాటికా = జెండాకు కట్టిన వస్త్రముయొక్క, అంచల = అంచులే యనెడి, చపేట= చెంపదెబ్బలచేత-చఱపులచేత. ఆధూత=చెదరఁగొట్టఁబడిన, జీమూతమై=మేఘములు గలదియై, బ్రహ్మాండంబు లోరాయుచున్ = బ్రహ్మాండము పైకప్పు నొరసికొనుచు. రెండవ కైలాసము వోలెన్ = ద్వితీయ కైలాసమువలె, ఉన్నది = పెలుఁగు చున్నది.

తాత్పర్యము :- ఓ భూదేవుఁడా ! తెల్లని యాదిశేషుని ధరించిన పరమ శివుని పెద్ద నవ్వువలె - మిక్కిలి పొడవైన శిఖరాగ్రములతో, ఆ శిఖరముల పై తమ యంచులతో మేఘములను చెదరగొట్టుచున్న ధ్వజాంశుకములతో, బ్రహ్మాండము పైకప్పును ఒరసికొనుచు, రెండవ కైలాసమువలె నున్న దేవేంద్రుని సభా భవనమైన ఈ సుధర్మను తలయెత్తి చూడుము.

సీ. చెఱువు లేటికి రేలు శిశిరాంశుకరములఁ
గరఁగు చంద్రోపలగిరులు గలుగఁ ?
గల్పవృక్షంబులు గలుగం నేటికి
వలువలకై తంతువాయ సమితి ?
గణకు లేమిటికి సంకల్పార్థ చింతకుఁ
జింతామణీ శిలాశ్రేణి కలుగఁ ?
గామధేనువులు కల్గఁగ నేమిటికి మఱి
యోదనంబునకునై యూదనికులు !

తే. నాఁగ సర్వపదార్థ జన్మస్థలంబు
భూరి కల్యాణవైభవ కారణంబు
విశ్వభువనైక వినుతంబు విబుధరాజ
పట్టణంబిది పంకజ ప్రభవ వంశ్య ! 203

అర్థము :- రేలు = రాత్రులయందు, 'శిరాంశుకరములన్' శిరాంశు = చల్లని అంశువులు (కిరణములు) గల చంద్రునియొక్క, కరములన్ = కిరణముల చేత, కరఁగు = కరఁగిపోవుచున్న, 'చంద్రోపలగిరులు' (చంద్ర + ఉపల_చంద్రోపల) చంద్రోపల = చంద్రకాంతమణుల యొక్క, గిరులు = కొండలు, కలుగన్ = ఉండఁగా, చెఱువు లేటికిన్ = సరస్సులు దేనికి ?, కల్పవృక్షంబులు కలుగంగన్ = కల్పవృక్షములుండఁగా, వలువలకై = వస్త్రములకై, తంతువాయసమితి = సాలెవాండ్ర సంఘము, ఏటికిన్ = దేనికి ?, 'సంకల్పార్థచింతకున్ సంకల్పార్థ = కోరిన విషయములయొక్క, చింతకున్ = విచారణకు, చింతామణీశిలాశ్రేణి = చింతామణులయొక్క పరంపర, కలుగన్ = ఉండఁగా, గణకులు = లెక్కలు కట్టువారు,

ఏమిటికిన్ = దేనికి ?, కామధేనువులు గల్గఁగన్ = కామధేనువులుండఁగా. ఓదనంబు వకునై = వంటకమునకయి. ఔదనికులు = వంటచేయువారు - పాచకులు. మఱి యేమిటికిన్ = మఱిదేనికి ?, నాఁగన్ = అనఁగా. 'సర్వపదార్థ జన్మస్థలంబు' సర్వపదార్థ = సకల పదార్థములకు. జన్మస్థలంబు = జన్మభూమి. 'భూరికల్యాణ వైభవకారణంబు' భూరి = భూరిసంఖ్యాకములైన. కల్యాణవైభవ = శుభవైభవములకు. కారణంబు = ప్రభవము. 'విశ్వభువనైకవినుతంబు' విశ్వభువన = సకల లోకములయందును. ఏక = అద్వితీయమని. వినుతంబు = పొగడఁబడిన. ఇది = ఈ పట్టణము. పంకజప్రభవవంశ్యుఁ = బ్రహ్మవంశమునందు జన్మించినవాఁడా ?. 'విబుధరాజ పట్టణంబు' విబుధరాజ = దేవతలకు రాజైన యింద్రునియొక్క. పట్టణంబు = పట్టణమైన అమరావతీ నగరము.

తాత్పర్యము :- బ్రహ్మవంశమునందు పుట్టిన ఓ శివశర్మా ! ఈ యెదుటఁ గనిపించుచున్న నగరములో చెఱువులు లేవు. రాత్రివేళల వెన్నెలలలోఁ గరఁగిపోయెడి చంద్రకాంతమణి శైలము లిచ్చట నున్నవి కనుక;

ఈ యూరిలో బట్టలు నేయువారు లేరు. కోరిన అన్నిరకముల వస్త్రములను కల్పవృక్షములే యిచ్చుచున్నవి కనుక;

ఈ యూరిలో వంటవాండ్రు లేరు. సకల రసరసాన్నములను కామధేనువులే సమకూర్చుచున్నవి గనుక;

ఇట్లు సకల పదార్థములకు జన్మస్థలమై, సకల కల్యాణవైభవములకుఁ గారణమై, సర్వలోకములయందును అద్వితీయమని వినుతికెక్కిన యీ నగరము దేవేంద్రుని రాజధానియైన అమరావతి ;

శా. క్షీరాంభోనిధి సంభవించిన ఘృతాచీ మేనకా మంజుఘో
షారంభా హరిణీతిలోత్తమలు విశ్వాచీచకోరాక్షులున్
స్వారాజప్రియ వారభామినులు నానాభూషణాలంకృతల్
గారామారఁగఁ జూచె దర్మనలనీకఁజాక్షులన్ జూడుమా! 204

అర్థము :- క్షీరాంభోనిధిన్ = పాలసముద్రమునందు, సంభవించిన - పుట్టిన, 'ఘృతాచీ.... తిలోత్తమలు' ఘృతాచి. మేనక, మంజుఘోష, రంభ, హరిణి, తిలోత్తమలను. విశ్వాచియును, చకోరాక్షియును. అనెడి, 'నానాభూషణాలంకృతల్'

నావా = పలువిధములైన, భూషణ = నగలచేత, అలంకృతల్ = అలంకృతలైన, 'స్వారాజప్రియ వారభామినులు' స్వారాజ = (స్వర్ + రాజ–స్వారాజ) స్వర్గాధిపతియైన యింద్రునకు, ప్రియ = ప్రియురాండ్రైన, వారభామినులు = వేశ్యలు, మనలన్ = మనలను, గారామారఁగన్ = గారాము నిండారునట్లుగా, చూచెదర్ = చూచుచున్నారు. ఈ కంజాక్షులన్ = ఈ పద్మాక్షులను. చూడుమీ! = చూడుమా!

తాత్పర్యము :– ఇరుగో వీరు అమృతాంబుధినుండి యవతరించిన అప్సరసలు. త్రిలోకాధిపతియైన దేవేంద్రుని ప్రియురాండ్రు. నానాభూషణ విభూషితలు. ఈమె ఘృతాచి! ఈమె మేనక! ఈమె మంజుఘోష! ఈమె రంభ! ఈమె హరిణి! ఈమె తిలోత్తమ! ఈమె విశ్వాచి! ఈమె చకోరాక్షి! మనవంక నెంతో గారాముగాఁ జూచుచున్నారు. ఒక్కసారి నీవు వీరివంకఁ జూడుము!

వ. ఈ యింద్రలోకంబునందుఁ దరురత్నంబు పారిజాతంబు, కాంతారత్నంబూర్వశి, వనరత్నంబు నందనంబు, తురగ రత్నం బుచ్చైశ్శ్రవంబు, గజరత్నం బైరావతంబు, రత్న రత్నంబు చింతామణి, సప్తర్షిప్రభృతులగు సప్తలోక పాలురు, నారదాదిమునులు, దనుజమనుజదైత్యులు, గంధర్వ యక్ష కిన్నర కింపురుషులు, సగర నలనహుషమాంధాతృ దుంధుమారాది వసుంధరాధిపతులు, జ్యోతిష్టోమాది యాగం బులు చేసిన సోమయాజులుం, దులాపూరుషాది మహాదానంబు లొనర్చిన దాతలు, సంగ్రామంబుల నపరాఙ్ముఖులై యక్లీ బాదులై యీల్గిన వీరులు వసియింతురని యనంతరంబ యగ్ని లోకంబున నర్చిష్మతీపురంబు చేరం గొనిపోయి శివశర్మకుఁ బుణ్యశీల సుశీలు లిట్లనిరి. 205

అరము :– ఈ యింద్రలోకంబునందున్ = ఈ యింద్రలోకములో. పారిజాతంబు = పారిజాత మను దివ్యవృక్షప్రభేదము, తరురత్నంబు = చెట్లలో శ్రేష్ఠమైనది. ఊర్వశి = ఊర్వశి యను నప్సరస, కాంతారత్నంబు = స్త్రీలలో శ్రేష్ఠురాలు, నందనంబు = నందననము, వనరత్నంబు = ఉద్యానవనములలో శ్రేష్ఠ

మైసది. ఉచ్చైశ్శ్రవంబు = ఉచ్చైశ్శ్రవము. తురగరత్నంబు = గుఱ్ఱములలో శ్రేష్ఠమైనది, ఐరావతంబు = ఐరావతము, గజరత్నము = ఏనుఁగులలో శ్రేష్ఠమైనది. చింతామణి = చింతామణి, రత్నరత్నంబు = రత్నములలో శ్రేష్ఠమైనది, సప్తార్చిః ప్రభృతి = అగ్ని మొదలైన, లోకపాలురు = లోకపాలకులు, నారదాది మునులు = నారదుఁడు మొదలైన మునులు, దనుజ మనుజ దైత్యులు=దనుజులు, మనుజులు, దైత్యులు, గంధర్వ యక్ష కిన్నర కింపురుషులు = గంధర్వులు, యక్షులు, కిన్నరులు, కింపురుషులు, సగర నల నహుష మాంధాతృదుంధుమారాది వసుంధరాధిపతులు = సగరుఁడు, నలుఁడు నహుషుఁడు, మాంధాత, దుంధుమారుఁడు మొదలైన రాజులును, జ్యోతిష్టోమాది యాగంబులు చేసిన సోమయాజులు= జ్యోతిష్టోమము మొదలైన యాగములు చేసిన సోమయాజులును, తులాపూరుషాది= మహాదానంబు లొనర్చిన దాతలు = 'తులాపురుషము' మొదలైన గొప్ప దానములు చేసిన దాతలును. సంగ్రామంబులన్ = యుద్ధములయందు, అపరాఙ్ముఖులై = మాఱుమొగము పెట్టనివారై, అక్లీబాదులై = క్లీబాదులు కానివారై, ఈల్గిన వీరులు= మరణించిన వీరులును, వసియింతురని, = నివసింతురని చెప్పి, అనంతరంబ = వెనువెంటనే. అగ్నిలోకంబునన్ = అగ్నిలోకమునందు, అర్చిష్మతీపురంబు = అర్చిష్మతీపురము, చేరంగొనిపోయి = సమీపమునకుఁ దీసికొనిపోయి, శివశర్మకున్ = శివశర్మకు, పుణ్యశీల సుశీలు రిట్లు పలికిరి.

తాత్పర్యము :- సుగమము.

సీ. అమరావతీపురం బమరవల్లభుఁడేలు
నర్చిష్మతీపురం బగ్ని యేలు
శ్రాద్ధదేవుండేలు సంయమనీపురం
బసుర నాయకుఁడు పుణ్యావతి నేలు
నమలావతీపురం బంబు నాయకుఁడేలు
వాయువేలును గంధవతిపురంబు
నలకాపురంబు యక్షాధీశ్వరుండేలు
నైశాని యేలుఁ జంద్రార్థమౌళి

తే. యనిరి; దిక్పాలపురములం దవని సుగుఁడు
రెండవ పురంబు నీక్షించి ప్రీతినుండె
నపుడు వర్ణింపఁ దొడఁగి రయ్యగ్ని లోక
మహిమ సంపద గోవింద మాన్యహితులు. 206

అర్థము :- అమరావతీపురంబు = అమరాతీపురమును. అమరవల్లభుఁడు = ఇంద్రుఁడు. ఏలున్ = పరిపాలించును. అర్చిష్మతీపురంబు = అర్చిష్మతీపురమును, అగ్ని = అగ్నిదేవుఁడు. ఏలున్ = పాలించును. ధ్రాద్ధదేవుండు = యముఁడు. సంయమనీపురంబు = సంయమనీపురమును, ఏలున్ = పరిపాలించును. అసుర నాయకుఁడు = నిర్ఋతి. పుణ్యవతిన్ = పుణ్యవతీపురమును, ఏలున్ = పరిపాలించును. అమలావతీపురంబు = అమలావతీపురమును. అంబునాయకుఁడు = వరుణుఁడు. ఏలున్ = పాలించును. వాయువు = వాయుదేవుఁడు. గంధవతిన్ = గంధవతీ పురమును. ఏలున్ = పాలించును. అలకాపురంబు = అలకాపురమును, యక్షాధీశ్వరుండు = కుబేరుఁడు, ఏలున్ = పాలించును. ఐశాని = ఐశానీపురమును, చంద్రార్ధ మౌళి = చంద్రఖండము కిరీటమందుగల యీశానుఁడు. ఏలున్ = పరిపాలించును. అనిరి = అనిపలికిరి. అవనిసురుఁడు = శివశర్మ. దిక్పాలపురములందున్ = దిక్పాలపురములలో, రెండవపురంబున్ = రెండవదియైన యర్చిష్మతీ నగరమును. ఈక్షించి = చూచి, ప్రీతిన్ = ప్రియముతో, ఉండెన్ = ఉండెను. అపుడు=అప్పుడు. అయ్యగ్ని లోకమహిమన్ =ఆయగ్నిలోకమహిమను,' గోవింద మాన్యహితులు' గోవింద = విష్ణువుయొక్క. మాన్య=మాననీయులైన, హితులు= ఆప్తులు, వర్ణింపఁ దొడఁగిరి = వర్ణింపమొదలుపెట్టిరి.

- అగ్నిలోకము -

సీ. శిఖి కర్మఠులకు నిశ్రేయస శ్రీదాత
ధరణీసురులకుఁ దీర్థంబు వహ్ని
యాశుశుక్షణి గురుం డవని నిర్జరులకు
నగ్రవర్ణుల కగ్ని యాశ్రయంబు
దహనుఁ డేడ్డడయు నుత్తమ వర్ణభవులకుఁ
బావకుం డీశుండు బ్రాహ్మణులకుఁ

బ్రత్యయాబు తనూనపాత్తు బాడబులకుఁ
బాఱుల కనలుండు పారిజాత

తే. మాశ్రయాశుండు ప్రాణులకంతరాత్మ
చంద్రశేఖర మూర్తి యుషర్బుధుండు
సకల జగదుద్భవస్థితిసంహృతులకుఁ
గేవలము హేతుభూతుండు కృష్ణవర్త్మ. 207

అర్థము :- కర్మఠులకున్=కర్మశూరులకు-(ఫలోదయపర్యంతము కర్మచేయు వారికి.) శిఖి=శిఖగలవాఁడు-అగ్నిహోత్రుఁడు. 'నిశ్రేయసశ్రీదాత' నిశ్రేయసశ్రీ= మోక్షలక్ష్మికి, దాత = ఇచ్చువాఁడు, ధరణీసురులకున్ = భూదేవులకు, వహ్ని = అగ్ని. తీర్థంబు = తీర్థముఁబుషినిషేవితజలము.) అవని నిర్జరులకున్ = భూసుర లకు. ఆశుశుక్షణి = (శీఘ్రముగా ప్రకాశించులక్షణము గలవాఁడు) అగ్ని. గురుండు = ఉపదేష్ట. అగ్రవర్ణులకున్ = మొదటివర్ణువారికి, అగ్ని = (దేవత లలో మొదటివాఁడు) వహ్ని, ఆశ్రియాబు = ఆశ్రయింపఁ దగిన స్థానము. ఉత్తమవర్ణభవులకున్ = ఉత్తమవర్ణమందు పుట్టినవారికి, వహానుఁడు = అగ్ని, ఏర్గ డయున్=ఏడునిధముల సంరక్షకుఁడు. (గురువు తల్లి. తండ్రి, పురుషుఁడు. విద్య, దైవము. దాత) బ్రాహ్మణులకున్ = బ్రాహ్మణులకు, పావకుండు = అగ్ని. ఈశుండు = ప్రభువు, బాడబులకున్ = విప్రులకు, తనూనపాత్తు = అగ్ని.(తనూం వ పాతయతి ఇతి - తనూనపాత్ - శరీరమును రాలిపోనీయని వాఁడు) ప్రత్య యంబు = విశ్వాసస్థానము, పాఱులకున్ = బ్రాహ్మణులకు. అనలుండు = అగ్ని. పారిజాతము = కల్పవృక్షము. ప్రాణులకున్ =ప్రాణవంతులకు. ఆశ్రయాశుండు = అగ్ని. (అశ్రయ మశ్నాతి ఇతి ఆశ్రయాశః - అశ్రయమును భక్షించువాఁడు) అంతరాత్మ = లోపలియాత్మ. ఉషర్బుధుండు = (ఉషఃకాలమునందు మేలుకొను వాఁడు) "చంద్రశేఖరమూర్తి" 'చంద్రశేఖర = శశిశేఖరునియొక్క. మూర్తి = మూర్తిభేదము(మూర్తులలో నొకఁడు-అష్టమూర్తులలో-ఒకఁడు.) 'సకలజగదుద్భవ స్థితి సంహృతులకున్' సకలజగత్=సకలజగత్తుయొక్క ఉద్భవ=పుట్టుటకు, స్థితి= విలుచుటకు సంహృతులకున్ = సంహారములకు కృష్ణవర్త=అగ్ని,నల్లనితోఁవగల వాఁడు, కేవలము = తానొక్కఁడే. హేతుభూతుండు=కారణభూతుఁడు.

తాత్పర్యము :- కర్మశూరులకు శివ-కైవల్య లక్ష్మీప్రదాత-భూసురులకు వహ్ని-ఋషినిషేవితమైన తీర్థజలము. పుడమివేల్పులకు - ఆహుతిక్షణి-గురువు. తొలివర్ణమువారికి, అగ్ని యాశ్రయము. అగ్రవర్ణజులకు దహనుఁడు - ఏడుగడ. బ్రాహ్మణులకు పావకుఁ డీశ్వరుఁడు బాడబులకు తనూనపాత్తు - ప్రత్యయము. పాఱులకు-అనలుఁడు పారిజాతము. ప్రాణులకు - ఆశ్రయాళుఁడంతరాత్మ - ఉష ర్బుధుఁడు శివునిమూర్తిభేదము, సకలజగత్తులయొక్క సృష్టిస్థితిలయములకు కృష్ణ వర్ముఁడు మాత్రమేకారణభూతుఁడు.

విశేషము :- ఒక్కనిచే బహువిధములుగా నుల్లేఖింపఁబడుట యనెడి యుల్లేఖా లంకార భేదము.

మ. వివిధాజ్యాహుతి ధూపదీపములు నై వేద్యంబు నీయగ్నిమున్
జవిగొన్ బిమ్మట ముక్తభుక్తుల నవశ్యప్రీతిగా నెప్పుడున్
జవిగొంఁడంబుజ సంభవాచ్యుత మహేశానాది బృందారక
ప్రవరుల్ సర్వహృషీక తర్పణముగా బ్రహ్మార్థపారంగతా ! 208

అర్థము :- 'బ్రహ్మార్థపారంగతా !' బ్రహ్మార్థ = వేదార్థముయొక్క. పారం గతా ! = పారమును జూచినవాఁడా ! 'అంబుజ సంభవాచ్యుత మహేశానాది బృంద రకప్రవరుల్' అంబుజసంభవ = పద్మసంభవుఁడైన బ్రహ్మయును, అచ్యుత = విష్ణువు. మహేశాన = మహేశ్వరుఁడు, ఆది = మొదలైన, బృందారకప్రవరుల్= దేవముఖ్యులు, 'వివిధాజ్యాహుతి ధూపదీపములు' వివిధ = పలువిధములైన, ఆజ్యా హుతి = ఆజ్యరూపములైన అహుతులు. ధూప = ధూపములు. దీపములు = దీప ములు, నై వేద్యంబు=నై వేద్యమును, ఈ యగ్ని =ఈ యగ్నిదేవుఁడు. ముందుగా, చవిగొన్ బిమ్మటన్ = రుచిచూచిన పిమ్మట, 'ముక్తభుక్తులన్' ముక్త = విడువఁ బడిన, భుక్తులన్ = భోజనములను. 'సర్వహృషీక తర్పణముగాన్' సర్వహృషీక= సర్వేంద్రియములకు. తర్పణముగాన్ = సంతర్పణముగా. అవశ్యప్రీతిగాన్ = తప్పనిసరియైన ప్రీతితో. ఎప్పుడున్ = ఎల్లకాలమును, చవిగొంఁడు = రుచి చూచెదరు.

తాత్పర్యము :- వేదార్థమును దుదిముట్ట నెఱిఁగిన ఓ శివశర్మా! బ్రహ్మ విష్ణు మహేశ్వరాదులైన దేవముఖ్యులందఱును పలువిధములైన ఆజ్యాహుతులు.

ధూపదీప నైవేద్యములును. ఈ యగ్ని మునుముందు రుచిఁజూచిన పిమ్మటనే మిగిలిన భోజనములను సకలేంద్రియ సంతర్పణముగా, తప్పని ప్రీతితో రుచిఁ జూతురు.

విశేషము :- అగ్ని స్వీకృతమైనదానికి ఉచ్ఛిష్టదోషము లేదు.

వ. అనిన విని శివశర్మ వైశ్వానరుండనంగ నెవ్వం? డెవ్వనితనూ జుం? డేప్రకారంబున నాగ్నేయంబైన తేజంబతనికి సంభవించె? మహాత్ములారా! యెఱింగింపు డనినవారు వైశ్వానర మాహాత్మ్యంబు వివరింపఁదొడంగి యిట్లనిరి. 209

అర్థము :- అనినన్ = అని విష్ణుకింకరులు చెప్పఁగా. విని = ఆకర్ణించి. శివశర్మ = శివశర్మ. వైశ్వానరుండనంగన్ = వైశ్వానరుఁ డనఁగా, ఎవ్వండు = ఎవ్వఁడు ?, ఎవ్వని తనూజుండు ? = ఎవ్వని కుమారుఁడు ?. ఏ ప్రకారంబునన్ = ఏ రీతిగా. ఆగ్నేయంబైన తేజంబు = అగ్నికి సంబంధించిన తేజస్సు. అతనికిన్ = ఆ వైశ్వానరునకు. సంభవించెన్ = కలిగెను ?, మహాత్ములారా ! = గొప్ప యాత్మ లక్షణముగల విష్ణుకింకరులారా ! ఎఱింగింపుడనినన్ = ఎఱిఁగింపుఁ డనఁగా. వారు = ఆ విష్ణుకింకరులు. వైశ్వానరమహాత్మ్యంబు = వైశ్వానరుని మాహాత్మ్యమును, వివరింపన్ = వివరించుటకు. తొడఁగి = మొదలుపెట్టి. ఇట్లనిరి = ఇట్లు పలికిరి.

తాత్పర్యము :- ఈ రీతిని విష్ణుకింకరులు అగ్నిమాహాత్మ్యమును వ్యాఖ్యా నింపఁగా విని శివశర్మ వైశ్వానరుఁడనువాఁ డెవ్వఁడు ? ఎవ్వని కుమారుఁడు ? ఆగ్నేయమైన తేజమాతని కేరీతిగా సంభవించినదని యడుఁగఁగా వారు వైశ్వానర మాహాత్మ్యమును జెప్ప మొదలిడి యిట్లనిరి.

— వైశ్వానర మాహాత్మ్యము —

సీ॥ విశ్వానరుండు నా నీశ్వరభక్తుండు
శాండిల్యగోత్ర సంజాతుఁ డనఘుఁ
డభినుత బ్రహ్మచర్యాశ్రమనిష్ఠుండై
బ్రహ్మయజ్ఞములు తప్పక యొనర్చు

నిరతుఁడై విజ్ఞాత నిఖిలశాస్త్రార్థుఁడై
లోకతత్త్వజ్ఞుఁడై యేకతమున
నొకనాఁడు చింతించుచుండె నేయాశ్రమం
బొక్కో నాల్గింటిలో నుత్తమంబు?

తే. భక్తి నేయాశ్రమంబు చేపట్టినప్పు
డైహికాముష్మిక ఫలంబు లందవచ్చు?
నిదియ మేలన్న యట్లుండు నిదియ లెస్స
యన్నయట్లుండు నొక్కొక్క యాశ్రమంబు. 210

అర్థము :- విశ్వానరుండునాన్ = 'విశ్వానరుఁడు' అను పేరుగల, ఈశ్వర భక్తుండు = శివభక్తుఁడు. కాండిల్యగోత్ర సంజాతుఁడు = కాండిల్య గోత్రమునందు పుట్టినవాఁడు, అనఘుఁడు = పాపములు లేనివాఁడు, 'అభినుత బ్రహ్మచర్యాశ్రమ నిష్ఠుఁడై' అభినుత=అందఱిచేత నుతింపఁబడిన, బ్రహ్మచర్యాశ్రమ=బ్రహ్మచర్యాశ్రమమునందు, నిష్ఠుఁడై = నిష్ఠగలవాఁడై, బ్రహ్మయజ్ఞములు = బ్రహ్మయజ్ఞములను, తప్పక = మానక, ఒనర్చున్ = చేయుచుండును, నిరతుఁడై = శ్రద్ధగలవాడై, 'విజ్ఞాత నిఖిలశాస్త్రార్థుఁడై' విజ్ఞాత = ఎఱుఁగఁబడిన, నిఖిల = సమస్తములైన, శాస్త్రార్థుఁడై = శాస్త్రార్థములు గలవాఁడై, లోకతత్త్వజ్ఞుఁడై=లోకతత్త్వము నెఱిఁగినవాఁడై, ఏకతమునన్ = ఏకాంతమునందు, ఒకనాఁడు = ఒక దినమునందు, చింతించుచుండెన్ = ఆలోచించుచుండెను, నాల్గింటిలోన్=నాలుగాశ్రమములలో, ఉత్తమంబు = ఉత్తమము, ఏ యాశ్రమంబొక్కో = ఏ యాశ్రమమగునో, భక్తిన్ = భక్తితో, ఏ యాశ్రమంబు = ఏ యాశ్రమమును, చేపట్టినప్పుడు = ఆవలంబించినప్పుడు, ఐహికాముష్మికఫలంబులు = ఇహలోక పరలోక సుఖములను, అందవచ్చున్ = పొందవచ్చును; ఒక్కొక్క యాశ్రమంబున్ = ఒక్కొక్క యాశ్రమమును, ఇదియ మేలన్న యట్లుండున్ = 'ఇదియే మేలు' అన్నట్లుండును, 'ఇదియ లెస్స' యన్న యట్లుండున్ = ఇదియే అన్నింటికన్న మంచిదన్నట్లుండును.

తాత్పర్యము :- విశ్వానరుఁ డనుపేరుగల యీశ్వరభక్తుఁడు, కాండిల్య గోత్రజుఁడు. పాపవిరహితుడు, బ్రహ్మచర్యాశ్రమస్థుఁడై బ్రహ్మయజ్ఞములు తప్పక చేయుచుండెను. ఆయన సకల శాస్త్రార్థముల నెఱిఁగి లోకతత్త్వ మెఱిఁగి యొకనా

డేకాంతమున నిట్లాలోచింప మొదలుపెట్టెను. బ్రహ్మచర్య గార్హస్థ్య వానప్రస్థ సన్న్యాసములను నాలుగాశ్రమములలో ఉత్తమమేది ? దేనిని స్వీకరించినప్పుడు ఐహికాముష్మిక ఫలముల నందుటకు వీలున్నది ? ఈ నాల్గింటిలో ఏ యాశ్రమమున కా యాశ్రమమే మిగిలినవానికంటె మేలైనదిగా దోచుచుండును. నిజముగా సర్వోత్తమమైనది యేది ?

వ. అది యెట్లనిన వర్ణాశ్రమాచారంబు శివప్రసాద ద్వారంబున జ్ఞానసాధనంబు. అందు వర్ణధర్మములు : బ్రాహ్మణుండు బృహస్పతి సవనంబునను, రాజు, రాజసూయంబుననను, వైశ్యుండు వైశ్యసోమంబుననను యజియింతురు. ఇవి యాదిగాఁగల యవి; మఱి యాశ్రమధర్మంబు లధ్యయనాదులు బ్రహ్మచారి ధర్మంబులు గృహస్థధర్మంబు లగ్న్యాధానాదులు. వానప్రస్థ ధర్మంబు లరణ్యవాసాదులు. యతిధర్మంబులు శ్రద్ధాదులు. బ్రహ్మచారి గృహస్థవానప్రస్థ భిక్షుకుల యాశ్రమంబు లుత్త రోత్తరంబు లుత్కృష్టంబు రోలీచతురాశ్రమంబులవారును నిజ కర్మానుష్ఠానంబులు తప్పక యీశ్వరపూజాతత్పరులై సంసిద్ధి పడయుదురు. నాకుంజూడ నన్ని యాశ్రమంబులకు నాధార భూతంబైన గృహస్థధర్మంబు ముక్తిసాధనంబై తోఁచుచున్న యది. సర్వాశ్రమంబులకు స్వరూపలాభంబు గృహస్థాశ్రమ నిబంధనంబ. కొందఱు 'వర్ణాశ్రమాచార నిషునకు బ్రహ్మనిష్ఠ సిద్ధింపదు. బ్రహ్మనిష్ఠ యన సర్వవ్యాపార పరిత్యాగంబున ననన్య చిత్తంబునంజేసి బ్రహ్మంబు నెఱుంగుట, యది కర్మానుష్ఠాన కర్మత్యాగంబులకుఁ బరస్పర విరోధంబు కావునఁ గర్మ ఘూరునియందు సంభవింప'దండ్రు. కర్మానుష్ఠానవంతునకు యథావకాశంబున బ్రహ్మనిష్ఠా తాత్పర్యంబు సుకరంబు. కావునఁ గర్మపరుండు బ్రహ్మంబు నెఱుంగండను నిషేధోక్తికిం బనిలేదు. పరదార పరిత్యాగంబునను నాత్మదార పరితో

షంబునను ఋతుకాలాభిగమనంబుననను బ్రహ్మచారియు, రాగ
ద్వేష కామక్రోధ వర్జనంబున వానప్రస్థుండును, నయాచితో
పస్థిత దేహమాత్రా మాత్రంబున భిక్షుకుండును నై గృహస్థుం
డఖిలాశ్రమంబులు తానకైకొను. దేవ యజ్ఞంబు పితృ
యజ్ఞంబు, భూతయజ్ఞంబు, మనుష్యయజ్ఞంబు, బ్రహ్మయజ్ఞం
బను పంచమహాయజ్ఞంబులంజేసి వివిధపాముఖంబున గృహ
స్థుండు ముక్తుండగు. కావున గార్హస్థ్యంబగు ధర్మంబునం
గైవల్యంబు పడసెద. 211

అర్థము :- అదియెట్లనినన్ = ఆ విషయమెట్లనఁగా. 'వర్ణాశ్రమాచారంబు' వర్ణ = నాల్గువర్ణములకు, ఆశ్రమ = నాలుగాశ్రమములకు సంబంధించిన. ఆచారంబు = ధర్మాచరణము, "శివప్రసాదద్వారంబునన్" శివప్రసాద = శివానుగ్రహమేయనెడి, ద్వారంబునన్ = ద్వారమువలన. జ్ఞానసాధనంబు' జ్ఞాన=జ్ఞానమునకు. సాధనంబు = కరణము-కార్యసిద్ధి కుపయోగించునది, అందున్ = వానిలో. వర్ణ ధర్మంబులు = చతుర్వర్ణ ధర్మములు; బ్రాహ్మణుండు = బ్రాహ్మణుఁడు. బృహస్పతి సవనంబునను = బృహస్పతి యాగముతోను. రాజు = క్షత్రియుఁడు, రాజసూయంబుననను = రాజసూయ యాగముతోను, వైశ్యుండు = వైశ్యుఁడు, వైశ్యసోమంబునను = వైశ్యసోమయాగముతోను, యజియింతురు = యజ్ఞముచేయుదురు, ఇవి యాదిగాఁగలయవి = ఇవిమొదలుగాఁగలవి; మఱి = ఇంక, ఆశ్రమ ధర్మంబులు = ఆశ్రమధర్మములు, అధ్యయనాదులు = వేదాధ్యయనముమొదలైనవి, బ్రహ్మచారిధర్మంబులు = బ్రహ్మచారి యనుష్ఠింపవలసిన ధర్మములు. "గృహస్థధర్మంబులు' గృహస్థ = గృహస్థులయొక్క, ధర్మంబులు = ధర్మములు, అగ్న్యాధానాదులు = అగ్నిసాధానము చేయుట మొదలైనవి. అరణ్యవాసాదులు = అరణ్యవాసము మొదలైనవి, వానప్రస్థ ధర్మంబులు = వానప్రస్థునిధర్మములు. యతి ధర్మంబులు = యతియొక్క ధర్మములు. శ్రద్ధాదులు = శ్రద్ధమొదలైనవి. "బ్రహ్మచారి గృహస్థ వానప్రస్థ భిక్షుకుల యాశ్రమంబులు త్తరోత్తరంబు లుత్కృష్టంబులు' బ్రహ్మచర్యాశ్రమము కంటె గృహస్థాశ్రమము. దానికంటె వానప్రస్థము. దాని కంటె సన్న్యాసాశ్రమము ఒకదానికంటె-ఒకటి గొప్పవి. ఈచతురాశ్రమంబుల

వారును = ఈనాలుగాశ్రమములవారును, నిజకర్మానుష్ఠానంబులు = తమ తమ యాశ్రమములకు విధింపబడిన కర్మల యనుష్ఠానము తప్పక. "ఈశ్వర పూజాతత్పరులై' ఈశ్వరపూజా = శివపూజయందు, తత్పరులై = తాత్పర్యముగల వారై, సంసిద్ధిపడయుదురు = సంసిద్ధి పొందుదురు. నాకుం జూడన్ = నాకుఁ జూడఁగా, అన్నియాశ్రమంబులకున్ = మిగిలిన యాశ్రమములు మూఁడింటికిని. ఆధారభూతంబైన = ఆశ్రయభూతమైన, గృహస్థధర్మంబు = గృహస్థధర్మము. ముక్తిసాధనంబై = మోక్షసాధనమై, తోఁచుచున్నయది = తోఁచుచున్నది సర్వాశ్రమంబులకున్ = అన్ని యాశ్రమములకు. స్వరూపలాభంబు = స్వరూపసిద్ధి. "గృహస్థాశ్రమ నిబంధనంబ" గృహస్థాశ్రమ=గృహస్థాశ్రమము, నిబంధనంబ = కారణముగాఁ గలదియే, కొందఱు = కొంతమంది. వర్ణాశ్రమాచార నిష్ఠునకున్ = వర్ణాశ్రమాచారములయందు నిష్ఠ గలవానికి. బ్రహ్మనిష్ఠ = బ్రహ్మమునందలి నిష్ఠ. విలుకడ. సిద్ధింపదు = సిద్ధింపదు, బ్రహ్మనిష్ఠయనన్ = బ్రహ్మనిష్ఠ యనగా. 'సర్వవ్యాపారపరిత్యాగంబునన్ సర్వ = సమస్తములైన వ్యాపార = వ్యాపార ములయొక్క. పరిత్యాగంబువన్ = విడుచుటచేత, అనన్యచిత్తంబునం చేసి = వేఱొక దానియందు చిత్తము లేకుండుట కారణముగా. బ్రహ్మంబు నెఱుంగుట = బ్రహ్మమును దెలిసికొనుట, అది = ఆ బ్రహ్మనిష్ఠ, కర్మానుష్ఠాన కర్మత్యాగంబులకున్ = కర్మలనాచరించుటకును కర్మలను విడుచుటకును. పరస్పర విరోధంబు కావునన్ = ఒకదానితో నొఁదానికి విరోధము కనుక. కర్మశూరునియందున్ = కర్మఠునియందు. సంభవింపపదంబ్రు = సంభవింపదని యందురు. వర్ణాశ్రమ కర్మానుష్ఠానవంతునకున్ = వర్ణాశ్రమ ధర్మములయనుష్ఠానము కలవానికి. యథావకాశంబునన్ = వీలునుబట్టి. బ్రహ్మనిష్ఠాతాత్పర్యంబు = బ్రహ్మనిష్ఠ యందలి తత్పరభావము, సుకరము = సులభముగాఁ జేయుటకు వీలైనది. కావునన్ = కాఁబట్టి. కర్మపరుండు = కర్మఠుఁడు. బ్రహ్మంబు నెఱుంగండు = బ్రహ్మంబు నెఱుగడు. అను = అనెడి, నిషేధోక్తిన్ = నిషేధ వాక్యముతో. పనిలేదు = పనిలేదు. పరదార పరిత్యాగంబునను=పరస్త్రీలను విడుచుటచేతను, ఆత్మదారపరితోషంబునను = తన భార్యతో పరితుష్టినొందుటచేతను, ఋతుకాలాభిగమనంబునను = ఋతుకాలములయందు మాత్రమే, పొందుటచేతను బ్రహ్మచారియును = బ్రహ్మచర్యము గలవాఁడును. 'రాగద్వేష కామక్రోధ వర్జనంబునన్' రాగద్వేష = రాగద్వేషములను కామక్రోధ = కామక్రోధములను, వర్జనంబునన్ = విడుచుటచేత, వానప్రస్థుండును =

వానప్రస్థుఁడును, "ఆయాచితోపస్థితదేహయాత్రామాత్రంబునన్' ఆయాచిత=అడుగ కయే, ఉపస్థిత=చేపడినదానితో, దేహయాత్రా మాత్రంబునన్ = దేహయాత్రనడపుటి మాత్రముననే. భిక్షుకుండునునై, గృహస్థుండు=గృహస్థుఁడు, అఖిలాశ్రమంబులు= అన్నియాశ్రమధర్మములను, తానకై కొనున్=తానేస్వీకరించును. దేవయజ్ఞము,పిత్ర యజ్ఞము,భూతయజ్ఞము, మనుష్యయజ్ఞము, బ్రహ్మయజ్ఞము అనెడి, పంచమహాయజ్ఞ ములచేత వివిధిషాముఖంబునన్ = జిజ్ఞాసాముఖమున, గృహస్థుండు=గృహస్తుఁడు, ముక్తుండగున్ = ముక్తిపొందిన వాఁడగును. కావునన్ = కాఁబట్టి,గార్హస్థ్యంబగు ధర్మంబునన్=గార్హస్థ్యధర్మముచేత,కైవల్యంబు పడసెదన్=కైవల్యమునుపొందెను.

తాత్పర్యము :- ఆ నిర్ణయ మెట్లనగా : వర్ణధర్మములను, ఆశ్రమధర్మము లను చక్కఁగా నాచరించినందువలన పరమేశ్వరునకు ప్రియము కలుగును. ఆప్రి యమువలన పరమేశ్వరుఁడు మనయందు ప్రసన్నత కలిగియుండును. పరమేశ్వ రుఁడు ప్రసన్నుఁడగుట మనకు జ్ఞానము కలుగుటకు సాధన మగును. వర్ణధర్మ ములఁ: బృహస్పతి సవనముతో బ్రాహ్మణుఁడును, రాజసూయముతో క్షత్త్రియుఁ డును, వైశ్యసోమముతో వైశ్యుఁడును యజింతురు. ఆశ్రమ ధర్మములు: అధ్యయ నము మొదలైనవి బ్రహ్మచారి ధర్మములు. అగ్నిని ఆధానము చేయుట, ప్రతిష్ఠించుట మొదలైనవి గృహస్థధర్మములు. అరణ్యమునందు నివసించుట మొదలైనవి వాన ప్రస్థుని ధర్మములు. శ్రద్ధ మొదలైనవి యతి ధర్మములు. బ్రహ్మచారి, గృహస్థ, వానప్రస్థ, భిక్షుకాశ్రమములలో ఒకదానికంటె ఒకటి గొప్పది. ఈ నాలుగాశ్రమ ములవారును తమ తమ యాశ్రమములకు విహితములైన ధర్మములను తప్పి చరింపక ఈశ్వరుని పూజించుటయందు తత్పరులై యున్నచో సంసిద్ధిని బడయు దురు. నా బుద్ధికిఁ జూడఁగా మిగిలిన అన్ని యాశ్రమములకును ఆధారభూతమైన గృహస్థధర్మము ముక్తికి సాధనమని తోఁచుచున్నది. అన్ని యాశ్రమములకును స్వరూపసిద్ధి యేర్పడుటకు గృహస్థాశ్రమమే కారణము. అనఁగా గృహాశ్రమము మీఁదనే మిగిలిన యాశ్రమములన్నియును ఆధారపడియున్నవి. అన్నింటికిని ఉపక రింపఁగలిగిన సామర్థ్యము దానికే యున్నది. కొందఱు వర్ణాశ్రమధర్మముల నాచ రించుటయందే నిష్ఠగలవానికి బ్రహ్మమునందు నిష్ఠ సిద్ధింపదు. 'బ్రహ్మనిష్ఠ' యనఁగా సర్వవ్యాపార పరిత్యాగమువలనఁగాని అనన్యమైన చిత్తస్థితి యేర్పడదు. అనన్యమైన చిత్తస్థితి యేర్పడినప్పుడుగాని బ్రహ్మము స్వానుభవములోనికి వచ్చుట సంభవిం పదు. కర్మములను జేయుటకు, కర్మములను విడుచుటకు పరస్పర విరోధము గనుక కర్మశూరునియందు ఆ బ్రహ్మానుభవము సిద్ధింపదని యందురు. కావి వర్ణాశ్రమ

కర్మానుష్ఠానముగలవానికి యథావకాశముగా బ్రహ్మనిష్ఠయందు తత్పరత్వము గలుగుట సుకరమేకాని దుష్కరమైన విషయము కాదు. కనుక కర్మపరుఁడైనవాఁడు బ్రహ్మము నెఱుఁగఁడని నిషేధించుటకు వీలులేదు. గృహస్థునియందు పరకళత్ర బుద్ధిని విడిచి స్వకళత్రమునందే పరితుష్టినందుట. ఋతుకాలములయందే కలియుట. అనువానివలన బ్రహ్మచారి ధర్మము సిద్ధించుచున్నది. రాగద్వేషములను. కామక్రోధములను విడచుట వలన వానప్రస్థధర్మము సిద్ధించుచున్నది. అడుగకయే కలిగిన దానితో శరీరయాత్రను నిర్వర్తించుట మాత్రముచేతనే యతిధర్మము సిద్ధించుచున్నది. ఈరీతినిగృహస్థునియందు అన్ని యాశ్రమములును, అయత్నముగ సిద్ధించుచున్నవి. దేవయజ్ఞము. పితృయజ్ఞము, భూతయజ్ఞము. మనుష్యయజ్ఞము, బ్రహ్మయజ్ఞము, అనెడి పంచ మహాయజ్ఞములను నిర్వర్తించుటచేత వివిదిష-జిజ్ఞాసలుదయించి గృహసుఁడు ముక్తుఁడగును కనుక గార్హస్థ్య ధర్మమును చేపట్టి నేను కైవల్యమును బడసెదను.

మ. అని యత్యుత్తమ వంశసంభవ వివాహంబయ్యె శాస్త్రోక్త వి
ధ్యనురూపంబుగ భాగ్యలక్ష్మినతికల్యాణిన్ గుణాన్వితశో
భనపుణ్యాకృతి విప్రకన్యక మహాభాగుండు విశ్వానరుం
డనురూపస్థిర పుణ్యలగ్నమున వంశానంద సంధాయియై. 212

అర్థము :- అని = ఇట్లునిశ్చయించి. 'అత్యుత్తమ వంశసంభవన్' అత్యుత్తమ = (అతి + ఉత్తమ - అత్యుత్తమ.) పరమోత్తమమైన. వంశ = వంశమునందు, సంభవన్ = పుట్టుకగలదియును, భాగ్యలక్ష్మిన్ = భాగ్యలక్ష్మిస్వరూపిణియును, అతికల్యాణిన్ = మిక్కిలి కల్యాణస్వభావముగలదియును, గుణాన్వితన్ = గుణవతియును, శోభనపుణ్యాకృతిన్ = శుభలక్షణముగల పవిత్రమైన యాకారముగలదియును నైన, విప్రకన్యకన్ = విప్రకన్యకను. మహాభాగుండు = మహాభాగ్యమేయముగలవాఁడైన, విశ్వానరుండు = విశ్వానరుఁడు, 'వంశానంద సంధాయియై, వంశ = వంశమునకు. ఆనందసంధాయియై = ఆనందమును గలిగించువాఁడై' 'అనురూపస్థిరపుణ్యలగ్నమునన్' అనురూప = తగిన. స్థిరపుణ్య=సుస్థిరపుణ్యములుగల. లగ్నమునన్=లగ్నమునందు. 'శాస్త్రోక్తవిధ్యనురూపంబుగన్' శాస్త్రోక్త= శాస్త్రమునందుఁ జెప్పఁబడిన, విధి = విధానమునకు, అనురూపంబుగన్ = తగినట్లుగా, వివాహంబయ్యెన్ = పెండ్లియయ్యెను.

తాత్పర్యము :- ఇట్లనిశ్చయించి మహాభాగధేయుఁడైన విశ్వానరుఁడు వంశానందకరుఁడై అత్యుత్తమవంశమునందు పుట్టి సకలశుభలక్షణాన్వితయును, గుణవతియును, భాగ్యదేవతయునైన, విప్రకన్యను, తగినశుభలగ్నమునందు శాస్త్రోక్తముగఁ బెండ్లియాడెను.

ఉ. చేడియ నామధేయము శుచిష్మతి యాచిగురాకు బోఁడికిన్
వ్రీడయుఁ గేశభారమును వృత్తపయోధరముల్ నితంబమున్
బాడబు నెమ్మనంబు రతిభావము తోడన నాఁడు నాఁటికిన్
వీడఁగ జొచ్చె బాల్యమును వీడఁగ జొచ్చెఁ
దదీయచింతతోన. 213

అర్థము :- చేడియ నామధేయము = వధువుపేరు, శుచిష్మతి = 'శుచిష్మతి', ఆచిగురాకు బోఁడికిన్ = చిగురాకువంటి ఆ కన్యకు, 'బాడబు నెమ్మనంబు రతిభావముతోడన' బాడబు = బ్రాహ్మణునియొక్క (విశ్వానరునియొక్క), నెమ్మనంబు = (నెఱ + మనము-నెమ్మనము) నిండు మనస్సునందలి, రతిభావము తోడన = శృంగారస్థాయియైన రతిభావముతోనే వ్రీడయున్ = సిగ్గును, కేశభారమును = వేనలియును, 'వృత్తపయోధరముల్' వృత్త = వర్తులమైన, పయోధరముల్ = చన్నులును, నితంబమున్ = పిఱుందును, నాఁడునాఁటికిన్ = నానాఁటికిని, వీడఁగఁజొచ్చెన్ = ఏర్పడమొదలిడెను, తదీయచింతతోన్ = ఆ బ్రాహ్మణుని చింతతోసహ, బాల్యమును = బాల్యదశకూడ, వీడఁదొడంగెన్ = వదలఁజొచ్చెను.

తాత్పర్యము :- వధువుపేరు శుచిష్మతి, చిగురాకు వంటి నెమ్మేనుగల-ఆ కన్నియకు విశ్వానరుని మనస్సులోని యనురాగముతోసహ లజ్జాభరమును, కేశభరమును, స్తనభరమును, నితంబభరమును, నానాఁటికిఁ బరిస్ఫుటముకాఁజొచ్చెను, ఆతని మనస్సులోని చింతతో సహ ఆమె బాల్యదశయును క్రమముగా వదలజొచ్చెను.

విశేషములు :- 'దేవకీ సుతుకోర్కి- తీఁగలువీఁగవెలఁదికి మైతీఁగవీడఁదొడఁగె, అన్న పోతన్నగారి 'బాణీ' కిది వలెవడి యని తేటపడుచున్నదిగదా! 'సహోక్తి' అలంకారము, పోతన్నది శ్రీనాథునితోసహోక్తి!

సీ. అనుదినంబును ప్రాతరారంభవేళల
నోలగందంబుతో నుదక మూడి
యంచ వన్నియతోడ నందమైన మడుంగు
నిద్దంపుఁ బుట్టంబు నెఱికె గట్టి
నెఱియంగఁ గూడని నెఱికూఁకటుల దాఁచి
పొంకంబుగాఁ గమ్మపూలు దుఱిమి
కాశ్మీర తిలక రేఖా మధ్యమున యందుఁ
బుణ్యంపుఁ జిటి బొట్టు పొందుపఱిచి

తే. విసువులే కగ్ని హోత్రంబు వేల్వఁ బెట్టు
దీపధూపంబు లొడఁ గూర్చు దేవపూజ
కోగిరంబులు కావించు నొప్పుగాఁగ
చాలప్రాణేశు హృదయంబు పల్లవింప; 214

అర్థము :- అనుదినంబును = ప్రతి దినమును, 'ప్రాతరారంభవేళలన్' (ప్రాతః + ఆరంభవేళ - ప్రాతరారంభవేళ) ప్రాతః = వఱువాతయొక్క, ఉదయముయొక్క, ఆరంభవేళలన్ ఆరంభసమయములయందు, ఓలగందంబుతోన్ = పూఁత పసుపుతో, ఉదకమాడి = జలకమాడి,

అంచవన్నియతోడన్ = హంసవర్ణముతో, అందమైన = అందమైన, మడుంగు = తెల్లని, నిద్దంపు = నున్నని, పుట్టంబు = చీరను, నెఱికగట్టి = ముచ్చెపోసి కట్టి,

నెఱియంగఁగూడని = పూర్తిగా ముడికిఁ గలసిరాని, నెఱి = అందమైన, కూఁకటులన్ = కేశములయందు, దాఁచి = కప్పి, పొంకంబుగాన్ = పొందికగా, కమ్మపూలు=(కమ్మని + పూలు - కమ్మపూలు) సురభిళ కుసుమములను, తుఱిమి= దోపి ముడిచి,

'కాశ్మీరతిలకరేఖా మధ్యమునయందున్' కాశ్మీరతిలక = కుంకుమతిలకము యొక్క, రేఖామధ్యమునయందున్ = రేక నడిమిభాగమునందు, పుణ్యంపు జిటి బొట్టున్ = పవిత్రమైన చిట్టి బొట్టును, పొందుపఱిచి = పొందుపఱునట్లు చేసి,

ప్రాణేశహృదయంబు = పతిహృదయము, పల్లవింపన్ = చిగుర్చురీతిగా, విసువు లేక = అలసటలేక. అగ్నిహోత్రంబున్ = అగ్నిహోత్రమును. వేల్వన్ = హోమము చేయుట కనుకూలముగా. పెట్టున్ = సిద్ధపఱచును. దేవపూజకున్ = దేవపూజకొఱకు, దీపధూపంబులు = దీపధూపములను, ఒడఁగూర్చున్ = ఒనఁగూర్చును, ఒప్పుగాఁగన్ = స్వాద్యములుగా. ఓగిరంబులు = వంటకములు, కావించున్ = చేయును.

తాత్పర్యము :- ఆ శుచిష్మతి పతి డెందము కందళించునట్లు ప్రతిదినమును ప్రాతర్వేళయందే పూత పసుపుతో జలకమాడి. హంసవలె స్వచ్ఛమైన నున్నని వెలిపట్టుచీర కుచ్చెపోసి ధరించి. క్రుమ్ముడి లోపల కమ్మపూవులు పోసి ముడిచికొని, కుంకుమ తిలకరేఖ నడుమ చిట్టిబొట్టు పొందుపఱిచి. అలసటలేక - అగ్నిహోత్రము లను వేలిమి కనువుగా నేర్పఱిచి, దేవపూజకు దీపధూపము లొనఁగూర్చి, స్వాద్యము లగురీతిని వంటకములను జేయుచుండును.

వ. అనంతరంబ యౌవనారంభంబున నారంభోరువు వినయవతియు, వివేకవతియు, విలాసవతియు, విభ్రమవతియు, శాంతిమతియు, సౌజన్యవతియు, సౌహార్దవతియునై శుశ్రూషా తాత్పర్యంబునం బతి డెందంబున కానందంబు సంపాదించుచుండం బెద్దకాలం బరిగిన.

అర్థము :- అనంతరంబ = వెనువెంటనే. యౌవనారంభంబునన్ = యౌవన ప్రారంభమునందు. ఆరంభోరువు = (రంభా + ఊరువు - రంభోరువు) అరఁటి కంబములవంటి తొడలుగల. ఆ శుచిష్మతి. వినయవతియున్ = వినయము గలదియును. వివేకవతియున్ = వివేకము గలదియును, విలాసవతియున్ = విలాసము గలదియును. విభ్రమవతియున్ = భూషణములను నెలవు మీర్చి ధరించినందువలనఁ గలిగిన సమధికకాంతి విశేషముతోఁ గూడిన శృంగారచేష్ట గలదియును, శాంతిమతియును = అంతశ్శాంతి గలదియును, సౌజన్యవతియును = మంచితనము గలదియును, సౌహార్దవతియును = ప్రేమగలదియును. నయి, 'శుశ్రూషాతాత్పర్యంబునన్' శుశ్రూషా = సేవించుటయందలి, తాత్పర్య = తదేకపరత్వమునందలి, విశేషంబునన్ = విశేషలక్షణముచేత. పతి డెందంబునకున్ = పతి హృదయమునకు,

అనందంబున్ = ఆనందమును. సంపాదించుచుండన్ = సంపాదించుచుండఁగా, పెద్దకాలంబు = చిరకాలము, అరిగినన్ = కడచిపోఁగా-

తాత్పర్యము :- యౌవనారంభవేళయందు-ఆమె శరీర లక్షణములతోఁ బాటుగా, ఆత్మగుణములైన వివేకాదులుగూడ సమగ్రవికాసమును పొంది, అన్నింటి కన్న మించి-పతి శుశ్రూషాభావమునందలి తదేకపరత్వమువలప-నతి హృదయమున కానందము వినుమడింపఁజేయుచుండఁగాఁ జిరకాలము గడచిపోయెను.

తే. కానరాదయ్యెఁ బుత్రసంతానలబ్ధి
యెన్ని నోములు నోఁచిన నిందుముఖికి
నంత నొకనాఁడు తరుణి యేకాంతవేళ
విభుని పాదంబులకు ప్రొక్కి- విన్నవించె. | 216

అర్థము :- ఎన్ని నోములు నోఁచినన్=ఎన్ని నోములు నోచినను, ఇందుముఖి కిన్ = చంద్రబింబమువంటి మోముగల-ఆ శుచిష్మతికి. పుత్త్రిసంతాన లబ్ధి=పుత్త్రి సంతానలాభము, కానరాదయ్యెన్=కనిపించదాయెను. అంతన్=అంతట, ఒకనాఁడు= ఒకనాఁడు, తరుణి = శుచిష్మతి. ఏకాంతవేళన్ = ఏకాంతసమయమునందు, విభుని= ప్రాణవల్లభునియొక్క, పాదంబులకున్ = పాదములకు. ప్రొక్కి= ప్రణమిల్లి, విన్నవించెన్ = విన్నపము చేసెను.

తాత్పర్యము :- ఆమె యెన్ని నోములు నోఁచినను పుత్త్రిసంతానలాభము కానరాదయ్యెను. అంత నొక్క- డేకాంతమునందు పతి పాదములకుఁ బ్రణమిల్లి యిట్లు విన్నవించెను.

ఉ. కట్టితిఁ బట్టుఁ బుట్టములు కాంచనభూషణముల్ ధరించితిన్
బెట్టితి బంధుకోటికి నభీప్సిత వస్తుచయంబు; కీర్తి చే
పట్టితి మీపదాబ్జములు పాయక నిచ్చలు సేవసేయఁగాఁ
బట్టి; వసుంధరం గలరె? భామలు నాసరిభాగ్యసంపదన్. 217

అర్థము :- పట్టుఁబుట్టములు = పట్టుచీరలు. కట్టితిన్ = తాల్చితిని. కాంచన భూషణముల్ = బంగారు నగలు. ధరించితిన్ = తొడిగితిని, 'అభీప్సితవస్తు చయంబు' అభీప్సిత = కోరిన. వస్తుచయంబున్ = వస్తుసామగ్రిని. బంధుకోటి

కిన్ = బంధువర్గమునకు, పెట్టితిని = ఇచ్చితిని, కీర్తిచేపట్టితిన్ = పేరుప్రతిష్ఠలు గాంచితివి, పాయక = విడువక, నిచ్చలున్ = ఎల్లవేళలయందును, మీ పదాబ్జములు = మీ పాదపద్మములను, సేవసేయఁ గాఁబట్టి = సేవించుటనుబట్టి; భాగ్య సంపదన్ = భాగ్యసంపదయందు, నాసరి = నాకు సమానులైన, భామలు=స్త్రీలు, వసుంధరన్ = భూమియందు, కలరె ? = ఉన్నారా ?

తాత్పర్యము :- ఎన్నడును విడువక మీ యడుగుదమ్ములను సేవించు చుండుటనుపట్టి పట్టుచీరలు కట్టితిని బంగారు నగలు పెట్టికొన్నాను. బంధువర్గము నకుఁ గోరిన పదార్థము లేదనకుండఁ బెట్టితిని. కీర్తిని చేపట్టితిని. భాగ్యసంపద యందు నాకు సాటి రాఁగల భామినులు ఈ భూమిపై నెవ్వరైన నున్నారా ?

కం. సకలైశ్వర్య సమృద్ధులు
నొక తల, సంతానలాభ మొక తల, యిదియే
టికిఁ దడసె? నిందురేఖా
మకుటుని కృపయేల లేదు మన కిప్పాటన్ ? 218

అర్థము :- 'సకలైశ్వర్య సమృద్ధులును' సకల=సమస్తములైన, ఐశ్వర్య= ఐశ్వర్యములు, సమృద్ధులున్ = సంపదలును, ఒక తల = ఒక యెత్తు, సంతాన లాభము = పుత్త్రిలాభము, ఒక తల = ఒక యెత్తు, అది = ఆ పుత్త్రిలాభము, ఏటికిన్ = ఏ నిమిత్తమువలన, తడసెన్ = ఆలస్యమయ్యెను ?, ఇప్పాటన్ = ఈ విషయమునందు, మనకున్=మనకు, 'ఇందురేఖామకుటుని కృప' ఇందురేఖా= చంద్రరేఖ, మకుటుని = శిరోభూషణముగాఁ గల శివునియొక్క, కృప = దయ, ఏలలేదు = ఎందువలన లేదు ?

తాత్పర్యము :- సకలైశ్వర్యములు, సకల సంపదలు కలిగియుండుట ఒక యెత్తు, పుత్త్రిసంతానము కలిగియుండుట యొక్కటియును నొక్క యెత్తు, ఈ భాగ్యము మన కాలస్యమైన కారణమేమి ? శివుని కృప మన కేల లేదు ?

కం. చింతించి చూడవచ్చిన
సంతానము వంశమునకు సకలంబునకున్

76278

సంతానము; సురధేనువు;
చింతామణి; సిద్ధరసము; చిరపుణ్యనిధీ! 219

అర్థము :- చింతించి చూడవచ్చినన్ = విచారించి చూడఁబోయినచో. సంతానము = సంతానము, వంశమునకు సకలంబునకున్ = వంశమంతటికిని, సంతానము = కల్పవృక్షము; సురధేనువు = కామధేనువు; చింతామణి = చింతామణి; సిద్ధరసము అమృతము; 'చిరపుణ్యనిధీ' చిరపుణ్య = శాశ్వత పుణ్యమునకు. నిధీ = నిధివంటివాఁడా;,

తాత్పర్యము :- ఓ శాశ్వత పుణ్యనిధీ ! విచారించి చూడఁబోఁగా వంశమంతటికిని సంతానమే సంతానము ! (కల్పవృక్షము) కామధేనువు ! చింతామణి ! అమృతరసము !

వ. సంతానంబు కలుగునట్టి యుపాయంబు చింతింపుమని ప్రార్థించిన- 220

అర్థము :- సంతానంబు కలుగునట్టి యుపాయంబున్ = సంతానము కలిగెడి యావిధమైన యుపాయమును. చింతింపుమని = ఆలోచింపుమని, ప్రార్థించినన్ = ప్రార్థింపఁగా.

తాత్పర్యము :- ఆవిధమైన సంతానము మనకుఁ గలిగెడి యుపాయమాలోచింపవలసినదని ప్రార్థింపఁగా.

ఉ. ఇంత విచార మేమిటికి నిందు నిభానన! నెమ్మనంబులో
సంతతి లబ్ధికై; విడువు శంక శశాంక కళాకిరీటుఁగా
లాంతకుఁ గాశికానగర హాటక నిర్మల హర్మ్యమాలికా
భ్యంతరవర్తి విశ్వపతి నాశ్రితవత్సలు నాశ్రయించెదన్. 221

అర్థము :- 'ఇందునిభానన !' ఇందునిభ = చంద్రసమానమైన, ఆనన = ముఖముగలదానా !, సంతతి లబ్ధికై = సంతాన లాభమునకై, నెమ్మనంబులోన్ = విండుమనస్సులో, ఇంత విచారము = ఇంతటి యాలోచనము, ఏమిటికిన్ = దేనికి, విడువు శంకన్ = సంశయమును వదలుము. 'శశాంక కళాకిరీటున్' శశాంకకళా =

చంద్రకళ, కిరీటున్ = కిరీటముగా గలవానిని, 'కాలాంతకున్' కాల = మృత్యువు నకు. అంతకున్ = మృత్యువైనవానిని, 'కాశికా....అభ్యంతరవర్తిన్' కాశికానగర = కాశికానగరమునందలి, హాటక = బంగారుమయమైన, నిర్మల = విమలమైన. హర్మ్యమాలికా = ప్రాసాదమాలికయొక్క. అభ్యంతర = లోపలి భాగమునందు, వర్తిన్ = వర్తించువానిని. 'ఆశ్రితవత్సలున్' ఆశ్రిత = ఆశ్రితులయందు. వత్సలున్ = వాత్సల్యముగల, విశ్వపతిన్ = విశ్వనాథుని, ఆశ్రయించెదన్ = ఆశ్రయింతును.

తాత్పర్యము :- ఓ చంద్ర నిభాననా ! పుత్త్రిలాభమునకై నీ మనస్సులో నింతటి చింత దేనికి ? సందేహము మానుము, శశాంకకిరీటుడును, మృత్యువునకు మృత్యువైన శాశ్వతుడును, కాశికానగరమునందలి కాంచనసౌధ మాలికల లోపల నుండెడి యాశ్రితవత్సలుడైన శ్రీ విశ్వనాథు నాశ్రయించెదను.

వ. అనిన విని శుచిష్మతీదేవి యర్చిష్మత్ప్రిభావుండగు భర్తకు వెండియుం బ్రణమిల్లి పాణిపల్లవంబులు మొగిడ్చి వినయ వినమితోత్తమాంగయై యార్య పుత్త్రి! పుత్త్రి సంతాన లాభంబు నాయందుం బడయ నభిమతంబయేని నేనుం బ్రసాద భాజనంబనగుదునేని నిందు శేఖరసదృశుండైన నందనుం బ్రసా

దింపుమనుటయు.

అర్థము:- అనిన విని = అని పలుకగా విని, శుచిష్మతీదేవి = శుచిష్మతీ దేవి, 'అర్చిష్మత్ప్రిభావుండగు' అర్చిష్మత్ = అగ్నియొక్క. ప్రభావుండగు = ప్రభావమువంటి ప్రభావముగలవాడైన, భర్తకున్ = భర్తయైన విశ్వానరునకు. వెండియున్ = మఱల, ప్రణమిల్లి = ప్రణామముచేసి, పాణిపల్లవంబులు = చిగురాకులవంటి చేతులు, మొగిడ్చి = మోడ్చి. 'వినయ వినమితోత్తమాంగయై' వినయ= వినయముచేత, వినమిత = వ్రాల్పబడిన, ఉత్తమాంగయై = శిరస్సుగలదియై, ఆర్యపుత్త్రి ! = ఆర్యపుత్త్రిడా !, పుత్త్రిసంతానంబున్=పుత్త్రిరూపమైన సంతానమును, నాయందున్ = నాయందు, పడయన్ = పొందుటకు. అభిమతంబయేనిన్= అభిమతమే అయినచో, నేనున్ = నేనుగూడ, 'ప్రసాదభాజనంబన్' ప్రసాద = అనుగ్రహమునకు, భాజనంబన్ = పాత్రమును, అగుదునేనిన్ = అయినచో, ఇందు

శేఖరసదృశుండైన = చంద్రశేఖరునితో సమానుఁడైన, నందనున్ = కుమారుని, ప్రసాదింపుము = అనుగ్రహింపుము, అనుటయున్ = అనఁగా.

తాత్పర్యము :- విశ్వానరుఁ డిట్లు పలుకఁగా, విని శుచిష్మతీదేవి -అగ్ని, దేవునితో సమానమైన ప్రభావముగల భర్తకు మఱల ప్రణామముచేసి చేతులుమోడ్చి విసయభరమువలన మోమువంచికొని, నాయందు వుత్పత్తినిఁబడయుట నీ కభిమతమే యైనచో-నేనుఁగూడ నీయనుగ్రహమునకు పాత్రభూతురాలినే యైనచో చంద్రశేఖరుఁడైన పరమశివునితో సమానుఁడైన పుత్త్రునిఁ బ్రసాదింపుమనెను. అని యడుగఁగా;

తే. ధర్మగేహినిపైఁగల కూర్మి పేర్మి
సంశిత వ్రతుఁడైన విశ్వానరుండు
వనరుహాయత నేత్రకోరిన వరంబు
మునికులశ్రేష్ఠుఁ డిచ్చితి ననుచుఁ బలికె. 223

అర్థము :- సంశిత వ్రతుఁడైన=ధరింపఁబడిన వ్రతముగల-విశ్వానరుండు= విశ్వానరుఁడు, 'ధర్మగేహినిపైఁగల కూర్మిపేర్మిన్' ధర్మగేహినిపైన్ = ధర్మపత్నిపై, కల = ఉన్న, కూర్మిపేర్మిన్=ప్రేమాతిశయముచేత, మునికుల శ్రేష్ఠుఁడు= మునికులములో శ్రేష్ఠుఁడైన యతఁడు, 'వనరుహాయతనేత్ర' వనరుహ = తామర పూవులవలె, ఆయత = విశాలములైన, నేత్ర = కన్నులుగలశుచిష్మతీదేవి, కోరిన వరంబు = అడిగినవరమును, ఇచ్చితిననుచున్ = ఇచ్చితినని యనుచు, పలికెను.

తాత్పర్యము :- వ్రతస్థుఁడైయున్న యా విశ్వానరుఁడు ధర్మపత్నిపైఁగల ప్రేమాతిశయముచేత పద్మాయతనయన కోరిన వరమును "ఇచ్చితి' నన్న పలుకు- అవశముగాఁ బలికెను.

సీ. ఇది మనోరథవీథి నెట్లు చొరఁగవచ్చు?
నేయింతి పతి వేఁడె నిట్టి వరము?
వరము వేఁడిన వేఁడవచ్చుఁగాకిబ్భంగి
నీనేరవచ్చునే యీప్సితార్థ?

మాగమంబులు సమానాధికరహితుఁగా
శీతాంశు శేఖరుఁ జెప్పుచుండు
నతఁడ లీలావతారార్థ మీచపలాక్షి
తనకుఁ గారణముగాఁ దలఁచెనొక్కొ!

తే. కానినాఁ డిట్టి తలఁపెట్లు కలుగనేర్చుఁ
దరుణికించు వితర్కించి తరతరంబ
యొక ముహూర్తంబు తడవున్నైష్ఠికతఁ బూని
శంభు భక్తిపరుండు విశ్వానరుండు; 224

అర్థము :- ఇది = ఈవిషయము, మనోరథవీథిన్ = మనోరథ మార్గము వందు, ఎట్లు = ఏవిధముగా, చొరఁగవచ్చున్ = ప్రవేశించుటకు వీలుకలుగును?. ఇట్టివరమున్ = ఇటువంటి వరమును, ఏ యింతి = ఏభార్య, పతిన్ = భర్తను, వేఁడెను = ప్రార్థించెను?

వరము = వరమును, వేఁడిన వేఁడవచ్చుఁగాక = అడిగిననడుగవచ్చుగాక? ఇబ్భంగిన్ = ఈ రీతిగా, ఈప్సితార్థము = కోరిన విషయమును, ఈనేరవచ్చునే? = ఇచ్చుటకు వీలుపడునా?

అగమంబులు = శాస్త్రములు, సమానాధికరహితుఁగాన్ = దనతోసమానుఁడును తనకంటె నధికుఁడును లేని వానినిఁగా, శీతాంశుశేఖరున్ = చంద్రశేఖరునిఁగూర్చి, చెప్పుచుండున్ = చెప్పుచుండును, అతఁడ = ఆ శివుఁడే, లీలావతారార్థము = లీలావతారముకొఱకు, ఈచపలాక్షిన్ = తరళనేత్రను, తనకున్ = తనకు, కారణముగాన్ = కారణమగుటకు, తలఁచెనొక్కొ? = సంకల్పించెనేమో?, కానినాఁడు = కానియెడల, తరుణికిన్ = ఈమెకు, ఇట్టితలఁపు = ఇట్టి యాలోచన, ఎట్లు = ఏవిధముగా, కలుగనేర్చున్? = కలుఁగఁగలదు?, అంచు = అనుచు; తరతరంబ = మాటిమాటికి, వితర్కించి = వివిధరీతులఁగా నూహించి, ఒక ముహూర్తంబుతడవు = ఒక ముహూర్తమాత్రము, నైష్ఠికతఁబూని = ధ్యాననిమగ్నుఁడై, శంభుభక్తిపరుండు = శివభక్తిపరుఁడైన, విశ్వానరుండు = విశ్వానరుఁడు-

తాత్పర్యము :- అసలిట్టిదికోరవలెనని అనిపించుటయెట్లు? లోకములో ఏ భార్యయైన - ఏభర్తనైనను పూర్వమిట్టిది కోరియుండెనా? అడిగిన నడిగి యుంద

వచ్చునుగాక; ఇట్టివరము నీయఁగల గుటయెట్లు? శాస్త్రములు శివుని సమానాధికవిర హితునిఁగాఁ జెప్పుచుండును, ఆ శివుఁడే లీలావతారార్థమై తనకీమె కారణముగా వలయునని తలంచెనేమొ? లేనిచో – ఈమె కిట్టి తలంపెట్లు కలుగఁగలదు; అని పరిపరివిధముల నూహించుచు శివభక్తిపరుఁడైన విశ్వానరుఁడు ఒక ముహూర్త మాత్రము ధ్యాననిమగ్నుఁ డయ్యెను.

వ. అనంతరంబ యమ్మునీశ్వరుండు తపఃప్రభావంబున భవుని ఫాలలోచను భర్గు భాగీరథీ తీరభవను భక్తనిధి భక్తిభావను భావనా సులభ స్వభావు భజింతుంగాకయని భవభయోదన్వ దుత్తార యానపాత్రంబైన కాశీక్షేత్రంబునకుంజని 225

అర్థము :- అనంతరంబి = వెంటనే. అమ్మునీశ్వరుండు = ఆ ముసీశ్వ రుఁడు, తపఃప్రభావంబునన్ = తపస్సుయొక్క ప్రభావముచేత, (యద్దుష్కరం తత్తపసాసాధ్యం – ఏదిదుష్కరమో దానిని తపస్సుచేత సాధింపనగు ననుటచేత) భవునిన్ = సమస్త ప్రపంచకారణుని, ఫాలలోచనునిన్ = నొసటియందు కన్ను గలనానిని (జ్ఞాననేత్రిని). భర్గున్ = తేజఃస్వరూపుని, భాగీరథీ తీరభవనున్ = భాగీ రథి యొడ్డున నివాసముగలవానిని. భక్తనిధిన్=భక్తులకు పెన్నిధియైన వానిని. భక్తి భావనున్ = భక్తిచేత రూపొందువానిని, 'భావనా సులభ స్వభావునిన్' భావనా = భావనకు. సులభ = సుఖముగా లభించెడి. స్వభావునిన్ = తనలక్షణముగలవానిని. భజింతుం గాకయని = భజించెదనుగాక; యని. 'భవభయోదన్వ దుత్తార యాన పాత్రంబైన' భవభయ = సంసార భయమే యనెడి. ఉదన్వత్ = సముద్రము యొక్క, ఉత్తార = దాఁటుటకు, యానపాత్రంబైన = ఓడయైన, కాశీక్షేత్రంబున కున్ = కాశీక్షేత్రమునకు. చని = వెళ్ళి.

తాత్పర్యము :- వెనువెంటనే ఆ ముసీశ్వరుఁడు. తపఃప్రభావముచేత భవుఁడు, ఫాలలోచనుఁడు, భర్గుఁడు. భాగీరథీతీరభవనుఁడు. భక్తనిధి, భక్తిభావ నుఁడు. భావనాసులభ స్వభావుఁడునైన పరమశివుని భజించెదనుగాక; అని సంసార భయమను మహాసముద్రమును దాఁటించుటకు నావయైన కాశీక్షేత్రమునకు బోయి.

విశేషము :- 'భవభయోదన్వదుత్తరనావోగావౌవః పావనానాం'
ఈపదబంధము మయూరుని సూర్యశతకమునుండి సంగ్రహించినది.

సీ. మందాకినీ వారి మణికర్ణికాంబువు
వాపికా కూప పల్వల జలంబు
కుండికాసలిలంబు కుల్యాంబు పూరంబు
సెలయేటి పాథస్సు చెలమ నీరు
ధారాకృపీటంబు తమ్మిబావిపయస్సు
కాసార నీరంబు క్రయ్య తోయ
మూటకాండము, బుగ్గ యుదకంబు జెల, పుష్క-
రము నదహ్రదశంబరంబు లివియు

తే. మొదలుగా సర్వ సర్వతో ముఖము కాశి
తీర్థరాజంబులుగ సమర్థించు శ్రుతులు
కాన నిన్నింటియందు విశ్వానసుండు
దేవసంకాశుఁ డతిభక్తి దీర్థమాడె. 226

అర్థము :- "మందాకినీవారి" మందాకినీ=గంగానదియొక్క, వారి=జలము, మణికర్ణికాంబువు - మణికర్ణికా = మణికర్ణిక యొక్క, అంబువు = సలిలము. వాపికా = బావులు, కూప = నూతులు. పల్వల = పడియలయందలి, జలంబు కుండికాసలిలంబు = కుండికలయందలినీరు, 'కుల్యాప్రపూరంబు' కుల్యా = పిల్ల కాలువలయందలి, ప్రపూరంబు = పుష్కలమైన ప్రవాహము, 'సెలయేటి పాథస్సు' సెలయేటి = సెలయేటికి సంబంధించిన, పాథస్సు = జలము, చెలమనీరు = చెల మల యందలినీరు, 'ధారాకృపీటంబు' ధారా = ధారారూపమైన, కృపీటంబు = జలము, తమ్మిబావి = తామరపూవులుగల బావిలోని, పయస్సు = నీరు, 'కాసార తీరంబు' కాసార=చెరువులలోని, నీరంబు = నీరు, 'క్రయ్యతోయము' క్రయ్య= కాలువలయందలి, తోయము = జలము, 'ఊటకాండము' ఊట = ఊటకు సంబం ధించిన, కాండము=నీరు, బుగ్గయుదకంబు' బుగ్గ=నీటిబుగ్గకు జెందిన, ఉదకంబు= నీరు, జెలపుష్కరంబు' జెల = భూమిలోపలనుండి పైకుబికెడు సంతత జలధారకు సంబంధించిన, పుష్కరంబు = నీరు, 'నదహ్రద శంబరంబులు' నద = నదము లకు, హ్రద = మడుగులకు జెందిన, శంబరంబులు = జలములు, ఇవియుమొద లుగా = ఇవిమొదలుగా, "సర్వసర్వతోముఖము" సర్వ = అన్నిస్థలములయం

దును, సర్వతోముఖము = అన్నివైపులను ముఖములుగల, కాశి = కాశియందు, తీర్థరాజంబులుగన్=తీర్థరాజములనుగా, శ్రుతులు = వేదములు, సమర్థించున్ = ప్రతిపాదించును, కానన్ = కనుక, ఇన్నింటియందున్ - దేవసంకాశుఁడు = దేవసమానుఁడైన, విశ్వానరుఁడు = విశ్వానరుఁడు, అతిభక్తిన్ = అతిభక్తితో, తీర్థమాడెన్ = తీర్థస్నానము చేసెను.

తాత్పర్యము :- వేదములు కాశి యెల్లయెడలను సర్వతోముఖములైన తీర్థరాజములు గల దానినిగా ప్రతిపాదించుచున్నవి కావున విశ్వానరుఁడు, మొదట మందాకినీ వాహియందు మజ్జనమాడెను. పిమ్మట మణికర్ణికాంబువుల యందు మునిఁగెను. ఆ పిమ్మట కాశియందలి దిగుడుబావులు, నూతులు, పడియలు, కుండికలు, కుల్యలు, సెలయేళ్ళు, చెలమలు, ధారలు, కమలదీర్ఘికలు, కాసారములు, క్రయ్యలు, ఊటలు, బుగ్గలు, జెలలు, నదములు, హ్రదములు - ఇన్నింటియందును తీర్థమాడెను.

తే. అవని దివిజుండు మణికర్ణికాది పుణ్య
తీర్థములయందు దేహాంబుఁ దేల్చి తేల్చి
శాంతిఁ బొందించెఁ బ్రాగ్జన్మ శతసహస్ర
పరిచితంబైన బహుళ తాపత్రయంబు. 227

అర్థము :- అవని దివిజుండు = భూసురుఁడైన విశ్వానరుఁడు, మణికర్ణికాది = మణికర్ణిక మొదలైన, పుణ్యతీర్థములయందున్ = పుణ్యతీర్థములందు, దేహంబు = శరీరమును, తేల్చితేల్చి = తేలించి తేలించి, ప్రాగ్జన్మ=పూర్వజన్మల యొక్క, శతసహస్ర = లక్షలయందు, పరిచితంబైన = సంపాదితమైన, బహుళ= సాంద్రమైన, తాపత్రయంబు = ఆధ్యాత్మికము, ఆధిదైవికము, ఆధిభౌతికము అనెడి తాపములయొక్క, త్రితయమును, శాంతిన్ = ఉపశమమును, పొందించెన్= పొందునట్లు చేసెను.

తాత్పర్యము :- భూసురుఁడైన విశ్వానరుఁడు మణికర్ణికాది పుణ్యతీర్థజలములలో తనువును దేలించి తేలించి లక్షలాది పూర్వజన్మములకు సంబంధించిన ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతిక, తాపత్రయమును శాంతింపఁజేసెను.

సీ॥ భద్రేభముఖులకు భద్రకాళికలకుఁ
గాలభైరవులకు గణపతులకు
నాదికేశవ ముఖ్యులైన కేశవులకు
లోలార్కముఖులైన హేళులకును
ప్రణమిల్లి సురనదీ మణికర్ణికాది తీ
ర్థములఁ బిండప్రదానములు చేసి
పాయసాపూపాది బహువిధాన్నంబుల
జగతీ మరుత్సహస్రములఁ దనిపి

తే. కానవచ్చిన యుబ్బు లింగంబులకును
గానరాని నిగూఢ లింగంబులకును
బుణ్యావాసరముల మహాపూజచేసి
యాతఁ డిట్లు విచారించె నాత్మలోన. 228

అర్థము :- భద్రేభముఖులకున్ = (భద్ర + ఇభముఖ–భద్రేభముఖ) భద్ర జాతి గజముయొక్క ముఖముగల సప్తావరణములలోని వినాయకులకును, భద్ర కాళికలకున్ = శుభప్రదలైన కాళికామూర్తులకును, ఆదికేశవముఖ్యులైన=ఆదికేశవుఁడు మొదలైన, కేశవులకున్ = కేశవమూర్తులకును, లోలార్కముఖులైన = లోలార్కుఁడు మొదలైన, హేళులకును = సూర్యులకును, ప్రణమిల్లి = ప్రణామములు చేసి, 'సురనదీ మణికర్ణికాది తీర్థములన్' సురనదీ = గంగ, మణికర్ణిక = మణికర్ణిక, ఆది = మొదలైన తీర్థములన్ = తీర్థములయందు, పిండప్రదానములు చేసి=పితృదేవతలకు పిండప్రదానములు చేసి, 'పాయసాపూపాది బహువిధాన్నంబులన్' పాయస = పరమాన్నము, అపూప = అప్పములు, ఆది = మొదలైన, బహువిధ = పలువిధములైన, అన్నంబులన్=అన్నములతో, 'జగతీమరుత్సహస్రములన్' జగతీమరుత్ = భూమిసురులయొక్క, సహస్రములన్ = వేలసంఖ్యలను, తనిపి = తృప్తి పొందించి, కానవచ్చిన = కంటికిఁ గనిపించుచున్న, ఉబ్బులింగంబులకును = స్వయంభూలింగములకును, కానరాని = కంటికిఁ గనిపించని, నిగూఢ లింగంబులకును = అంతర్హితములైయున్న లింగములకును, పుణ్యావాసరములన్= పుణ్యతిథులయందు, మహాపూజన్ = మహాశివపూజను, చేసి = చేసి, ఆతఁడు =

ఆ విశ్వానరుఁడు, ఆత్మలోనన్ = మనస్సులోపల, ఇట్లు = ఈ రీతిని, వితర్కించెన్ = ఆలోచించెను.

తాత్పర్యము :- తీర్థములాడినపిమ్మట దేవతాదర్శనమును జెప్పుచున్నాఁడు: ఏఁబదియారుగురు సప్తావరణ వినాయకులకును, కాళీమూర్తులకును, కాలభైరవులకును, ప్రమథగణాధీశ్వరులకును, ఆదికేశవుఁడు మొదలైన కేశవమూర్తులకును, లోలార్కుఁడు మొదలైన ద్వాదశాదిత్యులకును ప్రణమిల్లి; గంగ యొడ్డునందు, మణికర్ణికయొద్ద పితృదేవతలకు పిండప్రదానములు చేసి; పాయసములతో, అపూపములతోఁ గూడిన పలువిధములైన వంటకములతో వేలకొలఁది విప్రులకు సంతృప్తి కలిగించి, అభివ్యక్తములైన స్వయంభూలింగములకును కానరాని నిగూఢలింగములకును పుణ్యతిథులయందు మహాపూజలు చేసి ఆతఁడు మనస్సులో నిట్లాలోచించెను.

వ. ఓంకారేశ్వరుండు, కృత్తివాసేశ్వరుండు, కాళేశ్వరుండు, వృద్ధకాళేశ్వరుండు, కలశేశ్వరుండు, కేదారేశ్వరుండు, కామేశ్వరుండు, చంద్రదేశ్వరుండు, త్రిలోచనేశ్వరుండు, జ్యేష్ఠేశ్వరుండు, జంబుకేశ్వరుండు, జైగీషవ్యేశ్వరుండు, దశాశ్వమేధేశ్వరుండు, ద్రుమిచండేశ్వరుండు, దృక్కర్ణేశ్వరుండు, గరుడేశ్వరుండు, గోకర్ణేశ్వరుండు, గణేశ్వరుండు, డిండీరేశ్వరుండు, గజసిద్ధేశ్వరుండు, ధర్మేశ్వరుండు, తారకేశ్వరుండు, చండికేశ్వరుండు, మోక్షేశ్వరుండు, గంగేశ్వరుండు, అత్రీశ్వరుండు, వ్రీహికేశ్వరుండు, త్రిపురేశ్వరుండు, మార్కండేయేశ్వరుండు, మణికర్ణికేశ్వరుండు, యమునేశ్వరుండు, లాంగలీశ్వరుండు, శ్రీవిశ్వేశ్వరుండు, అవిముక్తేశ్వరుండు, విశాలాక్షీశ్వరుండు, వ్యాఘ్రేశ్వరుండు, వారాహేశ్వరుండు, వ్యాసేశ్వరుండు, వృషభధ్వజేశ్వరుండు, వరుణేశ్వరుండు, విధీశ్వరుండు, వసిష్ఠేశ్వరుండు, సోమేశ్వరుం, డింద్రదేశ్వరుండు, సంగమేశ్వరుండు, హరిశ్చంద్రదేశ్వరుండు, త్రిసంధ్యేశ్వరుండు, భవానీశ్వరుండు, కపర్దీశ్వరుండు, కందుకేశ్వరుండు, మఖేశ్వరుండు, మిత్రావరుణేశ్వరుం డన-

సిద్ధామృత జ్యోతిర్లింగాదులగు మహేశ్వరులు శతసహస్ర సంఖ్యలం గలరు. ఈ మహేశ్వరుల సిద్ధస్థానంబుల నెందేని దివ్యస్థానంబునం దపం బాచరించి శీఘ్రు సంతాన లాభంబు నొందుదురు. 229

తాత్పర్యము :- ఓంకారేశ్వర లింగమునుండి మిత్రావరుణేశ్వరలింగము వఱకు 52 లింగము లిందు పేర్కొనఁబడినవి వీనిలోఁ గొన్ని సిద్ధలింగములు, కొన్ని అమృతలింగములు, కొన్ని జ్యోతిర్లింగములు. ఇట్టివి లక్షలకొలఁది కాశిలో నున్నవి. ఈ లింగముల సిద్ధస్థానములలో ఎచ్చటనైన ఒక దివ్యస్థానమునందు తపస్సుచేసి శీఘ్రసంతానలాభము నొందెదనని విశ్వానరుఁడు స్థిరనిర్ణయమునకై యాలోచించుచుండెను.

తే. అహహా! తెలిసితి విస్మయంబైన యర్థ
మేల సందేహ మందంగ హృదయవీథి?
సిద్ధసంసేవితము సర్వసిద్ధికరము
దర్శన స్పర్శనములఁ దీర్థముల రాజు. 230

అర్థము :- అహహా ! = ఆహాహా. తెలిసితి విస్మయంబైన యర్థము = విస్మయమును గలిగించు విషయమును దెలిసికొన్నాను. హృదయవీథిన్ = మనస్సువందు, ఏల సందేహమందంగన్ = సందేహపడుట దేనికి ?, సిద్ధసంసేవితము = సిద్ధపురుషులచేత సేవింపఁబడినది, సర్వసిద్ధికరము = సకల సిద్ధులను కలిగించునది, 'దర్శన స్పర్శనములన్' = దర్శన-స్పర్శనముల మాత్రముననే; తీర్థముల రాజు = తీర్థముల కన్నింటికి రాజు.

తాత్పర్యము :- ఆహా ! ఆశ్చర్యకరమైన విషయము తెలిసినది. ఇంక హృదయములో సందేహపడుట దేనికి ? సిద్ధపురుషులచేత సంసేవింపఁబడినదియును, దర్శన స్పర్శన మాత్రమునననే సకల సిద్ధిప్రదమైన తీర్థరాజు శ్రీ కాశికాక్షేత్రము !

సీ॥ ఉష్ణాటితంబులై యుండు రేలువగళ్ళు
గవని తల్పులు నాకకటకమునకు

సర్వజంతువులకు సంసిద్ధి సంపద
కరతలామలకమై కానవచ్చు
వికటామహాదేవి విశ్వనాథుని భాము
పర్వతాధిపు పుత్రి పాయదెపుడు,
సిద్ధి వినాయకక్షేత్ర పాలకులుంద్రు
పరిరక్షణైక తత్పరతఁ బూని

తే. భూమి తిలమాత్రమును నుడిమోవకుండ
నమృతలింగంబు లర్బుదన్యర్బుదములు
కలవు తీర్థరాజంబులు కాశియందు
మహిమకావాస, మవిముక్త మండలంబు. 231

అర్థము :- రేలువగళ్ళున్ = రాత్రులును పగళ్ళును. అహోరాత్రములును. నాకకటకమునకున్ = స్వర్గపురమునకు. గవనితల్పులు కోటతలుపులు. ఉద్ఘాటిత ములై యుండున్ = తెఱచియుండును.

సర్వజంతువులకున్ = సకల ప్రాణులకును, సంసిద్ధి సంపద = సంసిద్ధిరూప మైన సంపద, 'కరతలామలకమై' కరతల = అఱచేతియందలి. ఆమలకమై=ఉసిరిక కాయయై, కానవచ్చున్ = కంటికి గోచరించును. విశ్వనాథునిభామ = విశ్వనాథుని భార్యయైన, వికటా మహాదేవి = వికట దుర్గామహాదేవి యను పేరుగల, పర్వతాధిపు పుత్రి = పార్వతీదేవి, ఎపుడున్ = ఎప్పుడును, పాయము = విడిచియుండదు.

సిద్ధివినాయక క్షేత్రపాలకులు = సిద్ధివినాయకుఁడును. క్షేత్రపాలకుఁడైన కాల భైరవుఁడును. 'పరిరక్షణైకతత్పరతన్' పరిరక్షణ = అన్నివైపులనుండి కాపాడుట యందలి, ఏకతత్పరతన్ = ఏకతాత్పర్యమును, పూని = వహించి. ఉంద్రు = ఉందురు. కాశియందున్ = కాశీనగరమునందు, భూమి=నేల. తిలమాత్రమును = మువ్వుగింజంతయైనను, ఉడివోవకుండన్ = వ్యర్థము కాకుండ, అమృతలింగంబులు= అమృతలింగములును, తీర్థరాజంబులు = తీర్థరాజములును, అర్బుదన్యర్బుదములు= అర్బుదన్యర్బుద సంఖ్యాకములు, కలవు = కలవు, అవిముక్తమండలంబు = అవి ముక్త మండలము, మహిమకున్ = మహిమకు, అస్పదము = స్థానము.

తాత్పర్యము :- పగలనక రాత్రియనక స్వర్గనగర ద్వార కవాటములు బారగా దెఱచియుండును. సకల జంతువులకును సిద్ధిసంపద అఱచేతిలోని యుసిరిక కాయయై కట్టెదుట గానిపించును. 'వికటామహాదేవి' యను పేరుతో సిద్ధిస్వరూపి ణియై విశ్వేశ్వరుని భార్యయైన పార్వతీదేవి యెల్లకాలమును పాయకయుండును. సిద్ధివినాయకుడును, గాలభైరవస్వామియును పరిరక్షకై క తత్పరులై యుందురు. నువ్వుగింజంత మేర నేలయైనను వ్యర్థపోకుండ కాశీక్షేత్రములో అమృతలింగము లును. తీర్థరాజములును అర్బుదన్యర్బుద సంఖ్యాకములై నిండియుండును.

కం. ఎందుండును విశ్వేశ్వరుఁ
డిందుకళాధరుఁడు గిరిదుహిత్ర సహితుండై
యందుండు భుక్తిముక్తులు
సందేహము లేదు తపమచట నొనరింతున్. 232

అర్థము :- 'గిరిదుహిత్రసహితుండై' గిరిదుహిత్ర = గిరిదుహిత - కొండ కూఁతురైన పార్వతీదేవితో. సహితుండై = కూడికొనినవాఁడై, 'ఇందుకళా ధరుఁడు' ఇందు = చంద్రునియొక్క. కళా = కళను. ధరుండై = ధరించిన. విశ్వేశ్వరుఁడు = విశ్వేశ్వరస్వామి, ఎందుండున్ = ఎచ్చట నుండునో, భుక్తి ముక్తులు = భోగమోక్షములు. అందుండున్ = ఆ ప్రదేశమందుండును. సందే హము లేదు = సంశయములేదు, అచటన్ = ఆ ప్రదేశమునందు, తపము = తపస్సును, ఒనరింతున్ = చేయుదును.

తాత్పర్యము :- పార్వతీసమేతుఁడై చంద్రకళాధరుఁడైన శ్రీ విశ్వేశ్వర స్వామి యేప్రదేశమందుండునో, భోగమోక్షము లాప్రదేశమందుండును. ఈ విష యములో సందేహము లేదు. నేనాప్రదేశమునందు తపస్సు చేసెదను.

విశేషము :- 'సాద'ఖ్యమైన షోడశకళతో శక్తి విశిష్టుఁడైన శివుఁడు భుక్తిముక్తి ప్రదాత:

సీ. అప్సరోంగన లెల్ల నాట పాటల వెంటఁ
బ్రాపించిరి మనోరథార్థ సిద్ధి

గంధర్వుఁ డొక్కఁడు గానవిద్యాప్రౌఢి
శీఘ్రంబునంద సంసిద్ధిఁ గాంచె
యక్షపుంగవుఁడు విద్యాధర శ్రేష్ఠుండు
కోకిలాలాపయన్ కోమలియును
శతరుద్ర్య మంత్రైక జపపరాయణుఁడైన
వేదశిరుండను విప్రవరుఁడు

తే. చంద్ర మౌళి భరద్వాజ సంయములును
హంస పదియను నొక కిన్నరాంగనయును
ప్రవాళోష్ఠి మగఁడు వేణుప్రియుండు
సిద్ధిఁ బొందిరి యవిముక్త సీమయందు. 258

అర్థము :- అప్సరోఽంగనలెల్లన్ = (అప్సరః + అంగనలు . అప్సరోఽంగనలు.) అప్సరస్త్రీలందఱును, ఆటపాటలవెంటన్ = నృత్యగీతములనుపట్టి, మనోరథార్థసిద్ధిన్ = కోరిన విషయములయొక్క లాభమును, ప్రాపించిరి = పొందిరి, 'గానవిద్యా ప్రౌఢిన్' గానవిద్యా = సంగీత విద్యయందలి, ప్రౌఢిన్ = ప్రౌఢిచేత, గంధర్వుఁడొక్కఁడు = ఒకగంధర్వుఁడు. శీఘ్రంబునంద = శీఘ్రకాలమందే, సంసిద్ధిన్ = సంసిద్ధివి, కాంచెన్ = పొందెను (పంచస్వరుఁడు) యక్షపుంగవుఁడు = 'పనుపూర్ణుఁడ'ను యక్షరాజు, విద్యాధరశ్రేష్ఠుండు = "స్వచ్ఛవిద్య"ఁడను విద్యాధరుఁడును, కోకిలాలాపయన్ = 'కోకిలాలాప' యనెడి, కోమలియును = ఆచ్చరయను, 'శతరుద్ర్యమంత్రైక జపరాయణుఁడైన' శతరుద్ర్యమంత్ర = శతరుద్రీయ మంత్రమయొక్క, ఏకజప = ఒక జపమనందే పరాయణుఁడైన=ఆసక్తుఁడైన. వేదశిరుండను=వేదశిరుఁ'డనెడు. విప్రవరుఁడు, 'చంద్రమౌళి భరద్వాజసంయములను' చంద్రమౌళి = 'చంద్రమౌళి' అనుపేరుగల యతఁడును. భరద్వాజ= 'భరద్వాజు' డనెడి సంయములను = మునీశ్వరులను, హంసపదియను = 'హంసపది' యనెడి, ఒక కిన్నరాంగనయును = ఒకకిన్నరస్త్రీయును. ప్రవాళోష్ఠి = (ప్రవాళ + ఓష్ఠి = ప్రవాళోష్ఠి) పగడమువంటి పెదవిగల_ఆ హంసపదియొక్క, మగఁడు = భర్తయైన. వేణుప్రియుండు=వేణుప్రియుఁడనువాఁడును. అవిముక్త సీమయందున్=అవిముక్త క్షేత్రమునందు. సిద్ధిఁబొందిరి = కైవల్యసిద్ధిఁబొందిరి.

తాత్పర్యము :- "అవిముక్త" మనుపేరుగల కాశీక్షేత్ర సీమయందు- మునుపు అప్సరసలందును . ఆది-పాది-అభీప్సిత లాభమును బడసిరి. 'పంచస్వరుఁ'డను గంధర్వుఁడొకఁడు తన సంగీత విద్యాప్రౌఢిచేత పరమమైన సిద్ధిని పొందెను. 'స్వచ్ఛవిద్యుఁ' డను విద్యాధరుఁడును, 'వసుపూర్ణుఁ' డను యక్ష రాజును, 'కోకిలాలాప' యను అప్సరసయును, శతరుద్రీయజపైకపరాణుయఁడైన విప్రుఁడును, 'చంద్రమౌళి', భరద్వాజుఁడు, అనెడి సంయమీశ్వరుఁడును, 'హంసపది' యనునొక కిన్నరస్త్రీయును ఆ విద్యామోహి ప్రియుఁడైన 'వేణుప్రియుఁ' డను వాఁడును కైవల్య సిద్ధినొందిరి.

విశేషములు .- ఇచ్చట-దెనుఁగులో సంగ్రహముగానున్నది. మూలములో వివరముగా విట్లున్నది.

•పంచస్వరోఽత్ర గంధర్వః పరాంసిద్ధి మగాత్పురా
విద్యాధరః స్వచ్ఛవిద్యో వసుపూర్ణశ్చ యక్షరాట్
నృత్యంతీ నిజభావేన పురాహ్యత్రాప్సరోవరా
సదేహా కోకిలాలాపా లింగమధ్యే లయంగతా
ఋషిర్వేదశిరానామ జపన్వై శతరుద్రియం
మంత్రజ్యోతిర్మయేలింగే సశరీరోఽవిశత్పురా
చంద్రమౌళి భరద్వాజావుభౌపాశుపతోత్తమౌ
వీరేశ్వరంసమభ్యర్చ్య గాయమానౌలయంగతౌ
శంఖచూడోహినాగేంద్రః స్వఫణామణిభర్నిశి
షణ్మాసాత్సిద్ధి మగమ దబహునీరాజనై రిహ
కిన్నరీ హంసపద్యత్ర భర్తా వేణుప్రియేణవై
గాయంతీ సుస్వరం యాతా పరాం నిర్వాణభూమికాం
అసంఖ్యాతాస్సహస్రాణి సిద్ధాస్సిద్ధి మిహాగతాః'

కం. సిద్ధ మరుత్సాధ్యాదులు
సిద్ధిం బ్రాపింతురంద చిరకాలమునన్
సిద్ధమతి యగుట శంభుం
డద్ధరణిని సిద్ధ లింగ మనఁగా వెలయున్. 234

అర్థము :- 'సిద్ధమరుత్సాధ్యాదులు' సిద్ధ = సిద్ధులు. మరుత్ = దేవతలు, సాధ్యాదులు = సాధ్యులు మొదలైనవారు. అందున్ = ఆ వీరేశ్వరసన్నిధియందు. అచిరకాలమునన్ = శీఘ్రకాలమునందే. సిద్ధిన్ = సిద్ధిని. ప్రాపింతురు = పొందెదరు. సిద్ధమతియగుటన్ = సాధకులకు మతిసిద్ధిని ప్రసాదించుటవలన అద్ధరణిని= ఆ ప్రదేశమునందలి. శంభుఁడు = వీరేశ్వరుఁడు. సిద్ధలింగమనఁగాన్ = 'సిద్ధలింగ' మని. వెలయున్ = ప్రసిద్ధివహించును.

తాత్పర్యము :- వెనుకఁ జెప్పిన_ఓంకారాదులైన యేఁబది రెండులింగ ములును గాక.కాశీలో_ 'వీరేశ్వరు'ఁడను సిద్ధలింగమొకఁడు గలదు. అది సర్వసిద్ధి ప్రదమగుటవలన - ఆ లింగసాన్నిధ్యమును విశ్వనరుఁడు తన తపస్సునకు స్థాన ముగా నిర్ణయించెను. వస్తుస్థితికి కాశీలోని అన్నిలింగములయందును విశ్వేశ్వరుని సాన్నిధ్యమేకలదు. శ్రీనాథుఁ డందువలన - వీరేశ్వర_విశ్వేశ్వరుల కభేదముగా వీరేశ్వరుఁ డనుటకు విశ్వేశ్వరుఁ డనును. మనము. నష్లేభావించిన చిక్కులుండవు. మూలములో నిచ్చట వీరేశ్వరుఁ డనియే కథనడచుచుండును.

విశేషములు:- 'అవిముక్తే మహాక్షేత్రే సిద్ధిక్షేత్రంహి తత్పరం
యత్ర వీరేశ్వరం లింగం మహాగుహ్యతమం మతం
తిలాంతరాపినోకార్యం భూమిర్లింగంవినాక్వ చిత్
పరంవీరేశసదృశం నలింగంత్వాభు సిద్ధిదం
ధర్మదంచార్థదం సమ్యక్కామదం మోక్షదంతథా
యథా వీరేశ్వరం లింగం కార్యాంనాన్యత్రభాద్రువం'
(సంస్కృతకాశీఖండము 10 అధ్యా. 103.)

- వీరేశ్వర ప్రభావ వర్ణనము -

వ. మహాజ్యోతిర్లింగమూర్తి విశ్వేశ్వరుం డనం బ్రసిద్ధి వహించె. అమ్మహేశ్వరుండు జయద్రథునకు, విదూరథునకు, మగధాధిపతికి, వసుదత్తునకు, మనోరథార్థంబు లచిరకాలమునం బ్రసాదించె. నేను విశ్వేశ్వర మహాదేవునారాధించి యభిమతార్థంబులు పడసెదంగాక యని చంద్రకూపజలంబున నభిషేకం బొనరించి సంకల్ప పూర్వకంబుగా నియమంబు

వహించి యొక్క మాసం బేకాహారుండును, నొక్కమాసంబు నక్తాశనుండును,నొక్కమాసంబయాచితాశనుండును, నొక్క మాసంబు నిరశనుండును, నొక్కమాసంబు పయోవ్రతుండును, నొక్కమాసంబు శాకఫలాశనుండును, నొక్కమాసంబు ముష్టితిలాహారుండును, నొక్కమాసంబు పానీయభోజనుండును, నొక్కమాసంబు పంచగవ్యాశనుండును, నొక్కమాసంబు చాంద్రాయణ వ్రతుండును, నొక్కమాసంబు కుశాగ్రజలపాయియు,నొక్కమాసంబు వాయుభక్షకుండునునై సంవత్సరంబుగడపి త్రయోదశమాసంబునంబ్రథమ దివసంబున.

అర్థము :- అమ్మహాజ్యోతిర్లింగమూర్తి = ఆ మహాజ్యోతిర్లింగము, వీరేశ్వరుండనన్ = వీరేశ్వరుఁడనగా, ప్రసిద్ధి వహించె = ప్రసిద్ధిపొందెను, అమ్మహేశ్వరుండు = ఆమహేశ్వరుఁడు. జయద్రథునకున్ = జయద్రథునకును. విదూరథునకును, మగధాధిపతికిన్ = మగధేశ్వరునకును. వసుదత్తునకున్ = వసుదత్తునకును,మనోరథార్థంబులు = కోరినవిషయములను. అచిరకాలమునన్=శీఘ్రకాలములోనే, ప్రసాదించెన్ = అనుగ్రహించెను. నేనును = నేనుగూడ, వీరేశ్వరమహాదేవున్ = వీరేశ్వరుఁడనెడి విశ్వేశ్వరమహాదేవుని. ఆరాధించి = సేవించి. 'అభిమతార్థంబులు' అభిమత = అభీప్సితములైన. అర్థంబులు = విషయములు, వడసెదంగాక యని = పొందెదనుగాకయని, చంద్రికూపజలంబునన్ = 'చంద్రికూప'మను నూతియందలి. జలంబునన్ = నీటియందు, అభిషేకంబొనరించి = స్నానముచేసి. సంకల్ప పూర్వకంబుగాన్ = సంకల్పముచెప్పి, నియమంబున్ = వ్రతనియమమును, వహించి = పూని, ఒక్కమాసంబు = ఒక్కనెల. ఏకాహారుండును= ఒక్కపర్యాయమే యాహారమును దీసికొనువాఁడును, ఒక్కమాసంబు = ఒకనెల. 'నక్తాశనుండును' నక్త = రాత్రులయందు. ఆశనుండును = భుజించువాఁడును, ఒక్కమాసంబు = ఒకనెల. "అయాచితాశనుండును" అయాచిత = యాచింపకయే-ఒనఁగూడిన దానిని, ఆశనుండున్ = భుజించువాఁడును. ఒక్కమాసంబు = ఒకనెల, నిరశనుండును = భుజింపనివాడును, ఒక్కమాంసంబు = ఒకనెల. 'ప్రయోవ్రతుండును' పయః = పాలే, వ్రతుండును = వ్రతాహారముగాఁ గలవాఁడునై, ఒక్కమాసంబు = ఒకనెల, 'శాకఫలాశనుండును' శాక = కూరలు.

ఫల = పండ్లును. అశనుండును = తినువాఁడును, ఒక్క-మాసంబు = ఒకనెల. 'ముష్టితిలాహారుండును' ముష్టితిల = పిడికెడు నువ్వులు, ఆహారుండును = ఆహారముగాఁ గలవాఁడును, ఒక్క-మాసంబు = ఒకనెల, 'పానీయభోజనుండును' పానీయ = పానీయమే, భోజనుండును = భోజనముగాఁ గలవాఁడును. ఒక్క-మాసంబు = ఒకనెల. 'పంచగవ్యాశనుండును' పంచగవ్య = గోక్షీర. దధి, ఘృత. గోమూత్ర గోమయ. వ్యతికరము, అశనుండును = ఆహారించువాఁడును, ఒక్క-మాసంబు = ఒకనెల, చాంద్రాయణవ్రతుండును=చంద్రుని వృద్ధిక్షయములననుసరించి వృద్ధిక్షయములుగల భోజనమును భుజించువాఁడును. ఒక్క-మాసంబు = ఒకనెల. కుశాగ్రజలపాయియున్ = దర్భకోసల యందలి జలమును ద్రాగువాఁడును, ఒక్క-మాసంబు = ఒకనెల, వాయుభక్షుండునునై = గాలని మాత్రమేసోపడువాఁడునయి. త్రయోదశమాసంబునన్=పదుమూఁడవ నెలయందు, ప్రథమదివసంబునన్= మొదటిదినమునందు,

తాత్పర్యము :- ఆ మహాజ్యోతిర్లింగము వీరేశ్వరుఁడను ప్రసిద్ధి వహించెను. ఆ మహేశ్వరుఁడు జయద్రథునకు, విదూరథునకు, మగధాధిపతికి, వసుదత్తునకు. శీఘ్రకాలమునందే మనోరథార్థసిద్ధిని ప్రసాదించెను. నేనును ఆ మహాదేవుని నారాధించి, అభీష్టార్థసిద్ధిని పొందితీరెదనని. చంద్రకుండికాజలములతో నభిషేకము చేసి, సంకల్పపూర్వకముగా వ్రతదీక్షను వహించి ఒక నెల ఏకాహారుఁడు, ఒక నెల రాత్రులయందు మాత్రమే భుజించి, ఒక నెల తనంతట నొనఁగూడిన పదార్థమునే భుజించి. ఒక నెల ఏమియు భుజింపక, ఒక నెల పయోవ్రతుఁడై ఒక నెల-శాకములు, ఫలములు నుపయోగించి. ఒక నెల పిడికెడు నువ్వులు మాత్రమే తిని, ఒక నెల పానీయమాత్ర భోజనుఁడై ఒక నెల పంచగవ్యము తిని. ఒక నెల చంద్రుని వృద్ధిక్షయానుసారముగ తన యాహారమునందుఁగూడ వృద్ధిక్షయములను పాటించి. ఒక నెల వాయుభక్షుఁడై ఇట్లొక సంవత్సరము గడిపి పదుమూఁడవనెల మొదటి దినమునందు-

సీ॥ హరులేడు నేడు కష్ట్యాంతరంబులు కాఁగ
నియమంబుమై నాజ్ఞ నిలుపువాఁడు
వెండికట్టులతోడి వేత్రంబు మూఁపుగా
బంగారు మునికోల పట్టువాఁడు

ఝంకించి పరపృథగ్జన కోటిచందావఁ
గఁకు చీఁకటి వెన్ను చఱచువాఁడు
వసుమతీభృచ్ఛ్రేణి వరుసతో గుఱిచూపి
యొండొండఁ గాన్పించుచుండువాఁడు

తే. త్రిభువనాస్థానపతియైన దివసకరుని
ప్రాక్ప్రతీహారపాలుండు ప్రాచినొసలి
ఘుసృణలీలా లలామంబు బిసరుహాప్తు
తేరిసారథి యెట్టనై తీఁడిరించె. 286

అర్థము :- హరులేడును = ఏడుగుఱ్ఱములును, ఏడు కక్ష్యాంతరంబులుగాఁ గన్ = ఏడు వాకిళ్ళుగాఁగా, నియమంబుమైన్ = నియమము ననుసరించి. ఆజ్ఞన్= ఆజ్ఞను, నిలుపువాఁడు = నెలకొలుపువాఁడు, వెండికట్టులతోడి = వెండివలయముల తోడి, వేత్రంబు మాఱుగాన్ = బెత్తము బదులుగా. బంగారు మునికోలన్ = వసిఁడి చేరోకలను, పట్టువాఁడు = ధరించెడివాఁడు.

ఝంకించి = జంకు కలుగునట్లు చేసి; 'పరపృథగ్జనకోటిచందానన్' పర= ఇతరులైన, పృథగ్జనకోటి = (పృథక్ + జనకోటి - పృథగ్జనకోటి) సామాన్య జనసమూహమును, చందానన్ = వలె, కటుకఁ జీఁకటిన్ = గాఢాంధకారమును, వెన్నుచఱచువాఁడు = వీఁపును మోదువాఁడు.

వసుమతీభృచ్ఛ్రేణిన్ = (వసుమతీభృత్ + శ్రేణి - వసుమతీభృచ్ఛ్రేణి) వసుమతీభృత్తులే యనెడి వసుమతీ భృత్తులయొక్క వరుసను. శ్లిష్టరూపకమ. భూధరములే యనెడి భూపతుల వరుసను (కొండలే యనెడి సామంతరాజుల వరుసను) ఒండొండన్ = ఒక్కొక్కటిగా. గుఱిచూపి = నిర్ణయించి. కాన్పించుచుండువాఁడు=ప్రభుదృష్టి వారిపైఁ బ్రసరించుచుండునట్లు నిర్వాహముచేయువాఁడు.

'త్రిభువనాస్థానపతియైన' త్రిభువన = భూర్భువస్సువర్లోకములను-మూఁడు భువనములకు సంబంధించిన, ఆస్థాన = కొలువుకూటమునకు, పతియైన=ప్రభువైన, దివసకరుని = దినకరునియొక్క - సూర్యునియొక్క. 'ప్రాక్ప్రతీహారపాలుండు' (ప్రాక్ + ప్రతీహార - ప్రాక్ప్రతీహార) ప్రాక్ప్రతీహార = తూఱుపు వాఁకిలికి, పాలుండు = కావలివాఁడైనట్టియును, ప్రాచి = తూర్పు దిక్కనెడి స్త్రీయొక్క.

నొసలి = నుదుటియందలి, ఘుసృణ = కుంకుమముతో దీర్చిన, లీలా = విలాస యుతమైన, లలామంబు = తిలకమైన. 'బిసరుహాప్తతేరి సారథి' బిసరుహాప్త = పద్మబంధువుయొక్క, తేరి = రథముయొక్క, సారథి = సారథి, ఎట్టనై = ఎట్టని వన్నియయై, తీఁడిరించెఁ = తీండ్రించెను - ప్రకాశించెను.

తాత్పర్యము :- ఏడు గుఱ్ఱములును ఏడు కక్ష్యాంతరములుగా తీర్చిదిద్ది తన యానతిలో నిలుపువాఁడును, వెండికట్లతోడి బెత్తమునకు బదులుగా బంగారు మునికోల పట్టినవాఁడును, జంకు పుట్టునట్లుచేసి ప్రాకృత సామాన్య జనులనువలె గాఢాంధకారము వెన్నుపైఁ బడమోఁదువాఁడును, ఒక్కొక్క భూధరమును, ఒక్కొక్క భూపతినివలె ప్రభువైన సూర్యుని దృష్టిప్రసారమునకు పాత్ర మొనరించువాఁడును, భూర్భువస్స్వర్లోకము లనెడి మూఁడు లోకములకు సంబంధించిన కొలువుకూటమున కధిపతియైన త్విషాంపతియొక్క (సూర్యుడు) తూఁపుపువాఁకిలి కావలివాఁడును, తూఁపుపుదెస యను జవరాలి నొసటి ఘుసృణ లీలాతిలకమునైన సూర్యరథసారథి యెట్టని వన్నియయై ప్రకాశించెను.

విశేషములు :- ఈ పద్యమునకు మూలమైన మయూరుని శ్లోకము :

'సీత్వాశ్వాం స్తప్తకక్ష్యా ఇవని యమవశం ఇవేత్రకల్పప్రతోద
స్తూర్ణం ధ్వాంతస్యరాశా వితరజన ఇవోత్సారితే దూరభాజి
పూర్వం ప్రష్ఠోరథస్య క్షితిభృదధిపతీన్దర్మయంస్త్రీయతాద్వ:
త్రైలోక్యస్థాన దానోద్యత దివసపతేః ప్రాక్ప్రతీహారపాలఃʼ

'బిసరుహాపు కుంటుసారథి తీండ్రించెఁ గొమరుమిగుల వావిళ్ళవారి పాదము 'బిసరుహాప్తు తేరిసారథి యెట్టనై తీఁడిరించె' అన్నది శబ్దరత్నాకరము గ్రహించిన పాఠము.

సీ॥ ప్రథమ సంధ్యాకాల బలిశంఖనినదంబు
ప్రభవించె శ్రీవిశ్వవిభుని నగరఁ
గదిసె నంగుళి యుగ్మకంబంతరము కాఁగ
గగనగంగా రథాంగద్వయంబు
నెఱియంగఁ గై సేసి నిలువుటద్దము చూచె
నవిముక్తమున విశాలాక్షి గౌరి

'కొక్కెరోకో' యని కుక్కుటంబులు గూసెఁ
గడఁగి కుక్కుట చతుష్కంబు నడుమఁ

తే. బ్రహరిఁ దిరుగుట చాలించి భైరవుండు
గవని మొగసాల యరుగుపైఁ గన్ను మొగిచె
డుంఠివిఘ్నేశుఁ డొనరగండూష సేసి
యుమిసె వినువీథిఁ జంద్రకుండోదకములు. 237

అర్థము :- 'ప్రథమ సంధ్యాకాల బలిశంఖ నినదంబు' ప్రథమసంధ్యాకాల= ప్రాతస్సంధ్యాకాలమునందలి. బలిశంఖ = పూజాశంఖములయొక్క, నినదంబు= ధ్వని శ్రీవిశ్వవిభుని నగరన్ = శ్రీవిశ్వనాయకుని యంతఃపురమునందు. ప్రభవించెన్ = ఉదయించెను.

అంగుళియుగ్మకంబు = రెండు వ్రేళ్ళు, అంతరముకాఁగన్ = వ్యవధానముగా. 'గగనగంగా రథాంగద్వయంబు' గగనగంగా = ఆకాశగంగ యందలి. రథాంగ = చక్రవాక పక్షులయొక్క, ద్వయంబు = జంట. కదిసెన్ = ఒకదాని కొకటి దగ్గఱ యయ్యెను.

అవిముక్తమునన్ = అవిముక్తస్థానమునందు, విశాలాక్షి = శ్రీవిశాలాక్షి యనెడి, గౌరి = పార్వతీదేవి. నెఱయంగన్ = నిండారఁగా, కైసేసి = అలంకరించికొని. విలువుటద్దమున్ = విలువుటద్దమునందు, చూచెన్ = తన సీడను జూచెను.

కుక్కుట చతుష్కంబు నడుమన్ = కోళ్ళచౌకము మధ్యలో - (కుక్కుట మంటప మధ్యమునందు). కడఁగి = పూనికొని. 'కొఁక్కొక్కరోఁకోఁఁ' యని = 'కొక్కొక్కరోఁకోఁఁ' అని హ్రస్వదీర్ఘప్లుతములు విస్పష్టముగా భాసించునట్లు. కుక్కుటంబులు = కోళ్ళు, కూసెన్ = కూసెను.

ప్రహరిఁ దిరుగుట = గస్తీ తిరుగుట, చాలించి = నిలిపి, 'గవనిమొగసాల యరుగుపైన్' గవని = కోఁట వాఁకిటనున్న, మొగసాల = ముఖశాలయొక్క. అరుగుపైన్ = అరుగుమీఁద, భైరవుండు = క్షేత్రపాలకుఁడు. కన్నుమొగిచెన్= కన్నుమూసెను. డుంఠివిఘ్నేశుఁడు = డుంఠివిఘ్నేశ్వరస్వామి. చంద్రకుండోదకములన్ = చంద్రకుండికా జలములను, ఒనరన్ = ఇంపగురీతిని. గండూషసేసి= పుక్కిట బట్టి. వినువీథిన్ = ఆకాశవీథియందు. ఉమిసెన్ = ఉమిసెను,

తాత్పర్యము :- శ్రీవిశ్వనాయకుని నగరినుండి ప్రథమ సంధ్యాకాల శంఖ విధ్వానము లుదయింపఁ దొడఁగెను. అకాశగంగా సైకతములమీఁద చక్రవాకములు తమ నడుమ రెండు వ్రేళ్ళు మాత్రమే యెడము కలుగునట్లు డాసి జతకట్టెను. అవి ముక్తసీమలో శ్రీవిశాలాక్షీదేవి నిండార నలంకరించికొని, నిలువుటద్దములోఁ దన పిడఁ జూచికొనెను. కుక్కుట మండపము నడుమ మెడలు రిక్కించి 'కొఁక్కొరోఁ! కోఁ!!' యని హ్రస్వదీర్ఘప్లుతకాలములు విస్పష్టముగా భాసించునట్లు కోళ్లు కూసెను. ప్రహరి తిరుగుట విలిపి గవని మొగసాల యరుగుమీఁద క్షేత్రపాలకుఁడైన భైరవుఁడు కన్ను మొగిచెను. చంద్రకుండికాసలిలములను తనివార గండూషించి శ్రీ రుంతి విశ్వేశ్వరస్వామి వినువీథిపై కెగఁజిమ్మెను.

విశేషములు :- జాతి వార్తానుభగమైన యీ ప్రభాతవర్ణనము శ్రీనాథ కవి సార్వభౌముని యుపజ్ఞ; దీనికి మూలము లేదు.

సీ. ముక్తిప్రయోజనంబుసఁ గుటీచకకోటి
సావిత్రి తత్త్వంబు సంగ్రహించె
పరమహంసలు పరబ్రహ్మార్థ తత్త్వంబు
శోధించి రుపనిషద్వీథులందు
నిగమాంత వాసనా నిర్వృత స్వాంతులై
హంసులు డిరి దృష్టై కాంత పరతఁ
ప్రత్యగ్రగోవాల రజ్జు సంబంధంబు
దండత్రియము బహూదకుఁడు దాల్చె

తే. భసిత ముద్ధూళనము చేసి పాశుపతుఁడు
దీర్ఘ పాటల జటల బంధించె మఱిఁ
గలు మఠంబుల మీఁద శృంగములనడుమఁ
గో! క్కొక్కో!! కో!!! యనుచుఁ గోడికూయుటయును. 238

అర్థము :- కలుమఠంబులమీఁదన్ = శిలామఠముల మీఁద, శృంగముల నడుమన్ = శిఖరముల నడుమ. 'కొ! క్కొక్కొరో!! కో!!' అనుచున్=కొక్కొక్కొరో!! కో!!' అనుచు, కోడి = కోడి. కూయుటయునున్ = కూయఁగనే, కుటీపకకోటి=

"కుటీచకు' లను సన్న్యాసివర్గము. ముక్తిప్రయోజనంబునన్' = ముక్తి నుద్దేశించి. సావిత్రి తత్త్వంబున్ = గాయత్రీ మంత్రముయొక్క యథాస్వరూపమును, సంగ్రహించెన్ = అనుసంధానము చేసెను.

పరమహంసలు = 'పరమహంస' లను సన్న్యాసులలోని ఒక వర్గము. "పరబ్రహ్మార్థ మీమాంసన్' పరబ్రహ్మార్థ = పర బ్రహ్మస్వరూపనిర్ధారణముము కొఱకైన. మీమాంసన్ = శ్రుతివాక్యములయొక్క అర్థవిచారణముతో, ఉపనిషద్వీథులందున్ = ఉపనిషద్వీథులయందు. శోధించిరి = తత్త్వమును వెదకిరి.

హంసులు='హంసు' లనెడి యతివర్గము, 'నిగమాంతవాసనా నిర్వృతస్వాంతులై' నిగమాంత = వేదాంతములయొక్క వాసనా = సంస్కారములచేత. నిర్వృత = స్వాస్థ్యమును పొందిన. స్వాంతులై. హృదయములు గలవారై 'దృఢైకాంతపరతన్' దృఢ = సుస్థిరమైన. ఏకాంత పరతన్' ఏకాంత = ఏకాంతభావమునందలి. పరతన్ = పరాయణత్వముతో. ఉండిరి = ఉండిరి. బహూదకుఁడు = 'బహూదకు'ఁ డనుయతి. 'ప్రత్యగ్రగోవాలరజ్జు సంబంధంబున్' ప్రత్యగ్ర = క్రొత్తదియైన. గోవాల = ఆవుతోఁక వెండ్రుకలతోనేసిన. రజ్జు = త్రాటియొక్క. సంబంధంబు = సంబంధముగల. దండత్రయమున్ = త్రిదండిని. తాల్చెన్ = ధరించెను, పాశుపతుఁడు = పాశుపతవ్రతస్థుఁడు. భసితమున్ = భస్మమును. ఉద్ధూళనముచేసి = మీఁదఁజల్లుకొని, మౌళిన్ = సిగయందు. "దీర్ఘపాటలజటలన్" దీర్ఘ = నిడుదలును. పాటల = ఎఱ్ఱనివియునైన. జటలన్ = జడలను. బంధించెన్ = కట్టెను.

తాత్పర్యము :- శిలామఠముల మీఁదికెక్కి శిఖరముల మధ్య మెడలు రిక్కించి నిలిచి కుక్కుటములు 'కొఁ కొక్కరో!! కో!!!' యని కూయఁగనే కుటీచకులు ముక్తి నుద్దేశించి సావిత్రీ తత్త్వమును అనుసంధానము చేసిరి. పరమహంసలు పరబ్రహ్మ స్వరూప నిర్ధారణము కొఱకై శ్రుతివాక్యములయొక్క తాత్పర్యార్థ విచారరణతో ఉపనిషద్వీథుల యందు తత్త్వమును అన్వేషించిరి. హంసులు వేదాంతవాసనలచేత స్వాస్థ్యమును పొందిన స్వాంతములతో సుస్థిరమైన యేకాంతభావమునందు తత్పరులై యుండిరి. బహూదకుఁడు ఆవుతోఁక వెండ్రుకలతోక్రొత్తగానేసిన తాటితోఁ గట్టిన త్రిదండిని ధరించెను. పాశుపతుఁడు సర్వాంగముల యందును భస్మోద్ధూళనముచేసి, నిడుదలై యెఱ్ఱనైన జడలను కిరీటముగాఁ గట్టికొనెను.

విశేషము :- కుటీచకాది లక్షణము : సూతసంహిత జ్ఞానయోగఖండము ఆఅవయధ్యాయములోనిట్లున్నది

"చతుర్విధాస్తు విజ్ఞేయాభిక్షవో వృత్తిభేదతః

– కుటీచకుడు –

కుటీచకో మునిశ్రేష్ఠ: తధైవచ బహూదకః
హంసః పరమ హంసశ్చ తేషాంవృత్తిం వదామితే
కుటీచకశ్చ సన్న్యాసీ స్వేస్వేవర్త్మని నిత్యశః
భిక్షామాదాయ భుంజీత స్వంధూనాం గృహేగృహే
శిఖాయజ్ఞోపవీతీస్యాత్త్రిదండీ సకమండలుః
సపవిత్రశ్చ కాషాయీ గాయత్రీంచ జపేత్సదా
సర్వాంగోధ్ధూళనం కుర్యాత్ త్రిపుండ్రం చత్రిసంధిషు
శివలింగార్చనం కుర్యాత్ శ్రధ్ధయైవ దినేదినే.'

– బహూదక లక్షణము –

'బహూదకశ్చ సన్న్యాసీ బంధుపుత్ర్తి వివర్జితః
సప్తాగారంచరేద్భైక్షం, ఏకాన్నం పరివర్జయేత్
గోవాలేన సమున్నద్ధం త్రిదండం శిక్యమద్భుతం
పాత్రంజల పవిత్రంచ కాఫీంచకమండలుం
ఆచ్ఛాదనం తథా కంధాం పాదుకాం ఛత్రమద్భుతం
పవిత్ర మజినం సూచీం రక్షణించాక్ష సూత్రకం
యోగపీఠం బహిర్వస్త్రం మృత్ఖనిత్రంక్యపాణికాం
సర్వాంగోధ్ధూళనంత ద్వత్ త్రిపుండ్రం చైవధారయేత్
శిఖాం యజ్ఞోపవీతంచ దేవతారాధనేరతః
స్వాధ్యాయే సర్వదా వాచ మత్స్పృజేత్ ధ్యానతత్వరః
సంధ్యాకాలే చ సావిత్ర్తిం జపన్ కర్మ సమాచరేత్.'

– హంస లక్షణము –

"హంసః కమండలు శిక్యం భిక్షపాత్రంత థైవచ
కథాం కౌపీన మాచ్ఛాద్యాప్యంగవస్త్రం బహిఃపటం

ఏకంతు వైణవం దండం ధారయేన్నిత్యమాదరాత్
త్రిపుండ్రోద్భూళనం కుర్యాచ్ఛివలింగం సమర్చయేత్
అష్టౌగ్నిసాంత్సకృన్నిత్యం అశ్నీయా త్సశిఖం వపేత్
సంధ్యాకాలేతు సావిత్రీ జప మధ్యాత్మచింతనం
మౌనసేవాంతథా కృచ్ఛ్రం తథా చాంద్రాయణాదికం
కుర్యాద్గ్నిమైక రాత్రేణ న్యాయేనైవ సమాచరేత్.'

– పరమహంస లక్షణము –

"పరహంసత్రిదండం చ రజ్జుం గోవాల నిర్మితం
శిక్యం జల పవిత్రంచ పవిత్రంచ కమండలుం
పక్షిణామజినం సూచీం మృత్ఖనిత్రం కృపాణికాం
శిఖాం యజ్ఞోపవీతంచ నిత్య కర్మ పరిత్యజేత్
కాపీనాచ్ఛాదనం పత్రంకంధాంశీతనివారికాం
యోగపట్టం బహిర్వత్రం పాదుకాం ఛత్రిమమ్బుతం
అక్షిమాలాంచగృహ్ణీయా ద్వైణవం దండమవ్రణం
అగ్నిరిత్యాదిభిర్మంత్రైః కుర్యాదుద్భూళనం ముదా
ఓమిత్యేవ తతః ప్రోచ్య సహంసేన త్రిపుండ్రకం
మృత్సాత్రిం కాంస్యపాత్రింవా దారు పాత్రంచ వైణవం
పాణిపాత్రం చ గృహ్ణీయాదామ్యేవ తథోదకం
ప్రణవాద్యాత్రయో వేదాః ప్రణవే పర్యవస్థితాః
తస్మాత్ప్రణవమేవైకం పరహంసన్సదాజపేత్.'

– పాశుపత లక్షణము –

విమృజ్యమం త్రైర్జలాలై రగ్నిరిత్యాది సప్తభిః
సమాహితధియశ్భద్ధాః శివంధ్యాత్వాశివామపి
సముద్భూళ్యమునిశ్రేష్ఠా ఆపాదతల మస్తకం
సితేన భస్మనాతేన బ్రహ్మభూతేన భావనాత్
లలాటే హృదయేకుక్షౌ దోర్ద్వంద్వేచ సురోత్తమాః
త్రిపుండ్ర ధారణంకృత్వా బ్రహ్మవిష్ణుశివాత్మకం
ఏవంకృత్వావ్రతం దేవా ఆధర్వశిరసిస్థితం

శాంతా దాంతా విరక్తాశ్చ త్యక్త్వాకర్మాణి సువ్రతాః
వాలాగ్ర మాత్రం విశ్వేశం జాతవేదస్వరూపిణం
హృత్పద్మ కర్ణికా మధ్యే ధ్యాత్వా వేదవిదాం వరాః
సర్వజ్ఞం సర్వకర్తారం సమస్తాధార మద్భుతం
ప్రణవేనైవ మంత్రేణ పూజయామాసురీశ్వరం,

పాశుపత వ్రతమునకు 'శిరోవ్రత' మనియునుపేరు.

'వ్రతం పాశుపతం చీర్ణం యైర్ద్వి జైరాదరేణతు
తేషామేవోపదేష్టవ్య మితి వేదానుశాసనం"

సూతసంహిత ప్రథమఖండ. 2. అ.

- శ్రుతి -

"తేషామే వైతాం బ్రహ్మవిద్యాం వదేత శిరోవ్రతం నిధివద్వైస్తుచీర్ణం' ఈ శుటీచక. బహూదక. హంస. పరమహంస. పాశుపత ప్రస క్తి మూలకాశీఖండ ములో లేదు. సూతసంహితనుండి గ్రహించినది.

వ. అంత నూర్యోదయంబున. 239

అర్థము :- అంతన్ = అంతట. సూర్యోదయంబునన్ = సూర్యోదయ వేళయందు.

సీ. ధరణీధరములందు ధాతు పాషాణంబు
పాదపంబులయందుఁ బల్లవంబు
పాధో నిధులయందుఁ బవడంపు లేఁదీఁగ
కాలాభ్రములయందుఁ గోలమెఱపు
హరిదంత నాగంబులందు సిందూరంబు
భూమియెుడలి యందు హేమభూష
యాకాశవీధి యందబ్జవద్వన మాల
యబ్జ భవాండంబు నందు దివయ

తే. యగుచు బాలాతపము జగంబాక్రమింప
నంధకారము దిక్కుల నస్తమింప

భానుబింబంబు దోఁచెఁ బ్రభాత లక్ష్మి
కబరి భారంబు మీఁది చెంగలువకచ్చు. 240

అర్థము :- ధరణీధరములందున్ = కొండలయందు. ధాతుపాషాణంబు = గైరిక ధాతువు - జేగుఱు రాయియు. పాదపంబులయందున్ = చెట్లయందు. పల్లవంబు = చిగురుటాకు. పాథోనిధులయందున్ = సముద్రములయందు, పవడంపు లేఁదీఁగ = విద్రుమలతయు, కాలాభ్రములయందున్ = కాఱుమబ్బులయందు. కోలమెఱపు = సన్నని విద్యుల్లతయు. హరిదంతనాగంబులందున్ = (హరిత్ + అంత - హరిదంత). హరిదంత = దిగంతములయందలి, నాగంబులందున్ = ఏనుఁగులయందు - దిగ్గజములయందు, సిందూరంబు = చెందిరయు, భూమియొడలి యందున్ = భూదేవి శరీరమునందు. హేమభూష = బంగారు నగయు, ఆకాశవీధి యందున్ = ఆకాశవీథియందు, అబ్జవత్ = విష్ణువుయొక్క. వనమాల = వన మాలయు, అబ్జాండ గృహంబునందున్ = బ్రహ్మాండమందిరమునందు, దివియ= దివ్వెయు. అగుచున్ = అగుచు, బాలాతపము = లేఁత యెండ, జగంబు = లోక మును. ఆక్రమింపన్ = లోఁగొనఁగా, అంధకారంబు = చీఁకటి, దిక్కులన్ = దిక్కులయందు. అస్తమింపన్ = అస్తమింపఁగా, ప్రభాతలక్ష్మి = ఉదయలక్ష్మి యొక్క, కబరిభారంబుమీఁది = కబరీభరముమీఁది, చెంగలువకచ్చు = ఎఱ్ఱకలువ తేకులతోఁ దీర్చిన సిగబంతియైన, భానుబింబంబు = సూర్యబింబము. తోచెన్ = ఉదయించెను.

తాత్పర్యము :- కొండలమీఁద జేగుఱు రాయియును. చెట్లమీఁద చిగురా కును, కడలిలో పగడాల తీఁగయును. కాలమేఘములలోఁ గోలమెఱపును. దిగ్గజ కుంభస్థలములయందు సిందూరమును, భూదేవి శరీరమునందు బంగారు నగయును, ఆకాశవీథియందు విష్ణుదేవుని వనమాలయును. బ్రహ్మాండ మందిరమునందలి దివ్వె యునై, లేఁతయెండ, లోకమంతయు నాక్రమించికొనఁగా, దిగంతములయందలి చీఁకటి యస్తమింపఁగా, ప్రభాతలక్ష్మి సిగమీఁది చెంగలువ పూబంతివలె సూర్య బింబ ముదయించెను.

విశేషములు :- ఉల్లేఖాలంకారము.

'ఏకేన బహుధోల్లేఖేప్యసా వేషయభేదతః'

దీనికి మూలమైన మయూరుని శ్లోకము—

మూర్ధ్న్యద్రేర్ధాతురాగస్తరుషుకిసలయో విద్రుమో ఘస్సముద్రే
దిజ్మాతంగోత్తమాంగేష్వభినవ నిహితస్సాంద్ర సింధూర రేఖః
సీమ్ని వ్యోమ్నశ్చ హేమ్ను స్సురశిఖరిభువో జాయతేయుః ప్రకాశః
కోణిమ్నాసాంధకారాంకోరుషసి దిశతువశ్శర్మ శోభైకదేశః

ష. అయ్యవసరంబున విశ్వానరుండు సకల కలి కలుష విషభం గజాంగలికంబగు గగనగంగా ప్రవాహంబున నఘమర్షణ స్నానంబొనర్చి వైదికానల సంభవంబైన భస్మంబున సర్వాంగోద్ధూళనం బొనర్చి తిర్యక్ పుండ్రంబు లురశ్శిరోబాహు మూలంబుల ధరియించి, రుద్రాక్షమాలికాధరుండయి సరస్వతీ స్కందవిఘ్నేశ్వరులకు, నాదిత్యానిలాగ్నులకు ప్రమొక్కి పుండరీక చర్మాసనంబునం బునంబ్రొజ్మ్మఖుండై దక్షిణ జానూరు మధ్యంబున వామపాదంబును వామజానూరు మధ్యంబున దక్షిణ పాదతలంబును విన్యసించి సమగ్రీవా మూర్ధకాయుండును, సంవృతాస్యుండును నిశ్చలుండును నై నాసాగ్రంబున సుధాధారాబిందు నిష్యందంబునందు నిందుబింబంబు విక్షించుచుం బ్రాణాయామంబు సేసి ప్రాణాయామంబువలన జిత్త శుద్ధి వడసి చిత్తశుద్ధివలన వేదాంతజ్ఞానంబు విశదీకరించి విశుద్ధ వేదాంతజ్ఞాన వాసనావశంబున శ్రోతవ్యుండును మంతవ్యుండును నిదిధ్యాసితవ్యుండును, నిరస్త సమస్తోపాధిక స్వప్రతిష్ఠాఖండ సచ్చిదానందైక రసాద్వితీయస్వరూపుండును పరమశివ పరంజ్యోతిర్లింగమూర్తియైన యపముక్త విశ్వేశ్వర శ్రీమన్మహాదేవునందు భావించి భావించి చూచుచుండం బ్రాచీనంబై పచేలిమంబైన భాగ్యాతిశయంబున. 241

అర్థము :- అయ్యవసరంబునన్ = ఆ సమయమునందు, విశ్వానరుండు = విశ్వానరుడు, 'సకల కలి కలుష విభంగజాంగలికంబగు' సకల = సమస్తములైన,

కలి కలుష = కలిదోషములేయనెడి. విష = విషముయొక్క, విభంగ = విఱుచుట యందు, జాంగలికంబగు = విషవైద్యుని వంటిది యగు, "గగన గంగాపరివాహంబు నన్" గగనగంగా = ఆకాశగంగయొక్క. పరివాహంబునన్ = పరివాహజలము నందు, "అఘమర్షణ స్నానంబు' ఆఘ = పాపములను, మర్షణ = తుడిచిపెట్టునది యైన.(మంత్రపూతమైన) స్నానంబు = స్నానమును ఆచరించి = నిర్వర్తించి, 'వైదికానల సంభవంబైన' వైదికానల = వైదికాగ్నినుండి, సంభవంబైన = సంభవించిన. భస్మంబునన్ భస్ముతో, 'సర్వాంగోద్భూళనంబొనర్చి' సర్వాంగ= అన్నియవయవముల యందును, ఉద్భూళనంబు = (ఉత్ + భూళనము-ఉద్భూళనము) ఎగఁబూసికొనుటను, బొనర్చి = చేసి. తిర్యక్పుండ్రంబులు = అడ్డురేఖలను-విభూతి రేఖలను, "ఉరశ్శిరోబాహుమూలంబులన్' 'ఉరః = పక్షస్థలమునందు, శిరః = శిరస్సునందు, బాహుమూలంబులన్ భుజమూలములయందును, ధరియించి; రుద్రాక్ష మాలికాధరుండయి = రుద్రాక్షమాలలను ధరించినవాఁడై, "సరస్వతీస్కంద విఘ్నేశ్వరులకున్" సరస్వతీ = సరస్వతీదేవికి, స్కంద = కుమారస్వామికి, విఘ్నేశ్వరులకున్ = విఘ్నేశ్వరస్వామికి. మొర్రికి = పరిణమిల్లి. పుండరీక = పెద్దపులియొక్క, చర్మ = అజినరూపమైన (తోలు) ఆసనంబునన్ = ఆసనము నందు, ప్రాఙ్ముఖుండై = (ప్రాక్ + ముఖుండై -ప్రాఙ్ముఖుండై -అనునాసిక సంధి) తూఱుపు ముఖముగలవాఁడై, 'దక్షిణ జానూరు మధ్య బునన్' దక్షిణ = కుడిదియైన, జాను = మోఁకాలియొక్క, ఊరు = తొడయొక్క. మధ్యంబునన్ = మధ్యభాగమునందు, వామపాదంబును = ఎడమకాలిని. 'వామజానూరు మధ్యంబు నన్' వామ = ఎడమదియైన, జాను = మోఁకాలియొక్క, ఊరు = తొడయొక్క, మధ్యంబునన్ = మధ్యప్రదేశమునందు. దక్షిణ పాదతలంబును = కుడియఱికాలిని, విన్యసించి = నిలిపి, 'సమగ్రీవా మూర్ధకాయుండును' సమ = సమరేఖలోనున్న, గ్రీవా = కంఠము, మూర్ధ = శిరస్సు. కాయుండును = శరీరముగలవాఁడునునై. "సంవృతాస్యుండును" సంవృత = మూయఁబడిన, ఆస్యుండును = నోరుగలవాఁడును, నిశ్చలుండునునై = చలనములేని వాఁడునునై. నాసాగ్రంబునన్ = కను బొమల నడిమి భాగమునందు. "సుధాధారా బిందు నిష్యందంబు నందున్" సుధా ధారా = అమృతధారయొక్క. బిందు = బిందువులయొక్క. నిష్యందంబునన్ = ఓడిక యందు, ఇందు బింబంబున్ = చంద్రబింబమును, వీక్షించుచున్ = చూచుచు, 'ప్రాణాయామంబు' ప్రాణ=ఉచ్ఛ్వాసనిశ్వాసములయొక్క, ఆయామంబు = నియమనమును, చేసి = చేసి, చిత్తశుద్ధి పడసి = చిత్తశుద్ధిని పొంది. 'వేదాంతజ్ఞానం

బున్' వేదాంత = ఉపనిషత్తులయొక్క, జ్ఞానంబున్ - జ్ఞానమును. విశదీకరించి= అనుభవగోచరముచేసికొని. 'విశుద్ధ వేదాంత జ్ఞానవాసనావశంబునన్' విశుద్ధ = విర్మలమైన, వేదాంతజ్ఞాన = ఉపనిషత్ జ్ఞానమునకు సంబంధించిన. వాసనావశంబు వన్ = సంస్కార వశమున. శ్రోతవ్యుండును = వినవలసినవాఁడును. మంత వ్యుండును = మననము చేయవలసినవాఁడును. నిదిధ్యాసితవ్యుండును = తిరిగి తిరిగి యనుసంధానము చేయవలసిన వాఁడును. 'నిరస్త .... స్వరూపుండును' విరస్త = తొలఁగింపఁబడిన. సమస్త = సకలమునైన, ఉపాధిక = తత్త్వముల పొరలుగలదియును. స్వప్రతిష్ఠ = తనయందే నెలవుకొన్నదియు, అఖండ = పరిపూర్ణమును సచ్చిదాండ = (సత్+చిత్+అనంద-సచ్చిదానంద) ఉనికి=ఎఱుక = ఇంపు, ఏకరస=మూఁడును ఒక్కటియైన పరమానుభవముకంటె, అద్వితీయ-రెండవదిలేని, స్వరూపుడును=విజరూపము గలవాఁడును. "పరమశివ పరంజ్యోతి ర్లింగమూర్తియునైన" "పరమశివ = పరమశివస్వరూపమును. పరఁజ్యోతిః = పరంజ్యోతిస్వరూపము, లింగమూర్తియునైన = లింగాకృతియునైన. అవిముక్త = అవిముక్తక్షేత్రమునందలి. విశ్వేశ్వర=విశ్వేశ్వరుఁడనెడి. శ్రీమన్మహాదేవున్=శ్రీమన్మహాదేవుని, అందున్=అనిటలతట చంద్రబింబమునందు, భావించి భావించి = మిక్కిలిభావించి, చూచుచుండన్=చూచుచుండఁగా. ప్రాచీనంబు=వెనుకటి జన్మలలోనిదియు. పచేళిమంబు = పండఁబాతినదియు. భవ్యంబు = శుభప్రదమును. ఐన = అయిన, "భాగ్యాతిశయంబునన్" భాగ్య = అదృష్టముయొక్క, అతిశయంబునన్ = పెంపుచేత.

తాత్పర్యము :- అట్టి ప్రభాత సమయమునందు విశ్వానరుఁడు సకలకలిదోషవినాశనమైన గంగాప్రవాహ జలమునందు మంత్రపూతమైన అఘమర్షణస్నానముచేసి-శివాగ్ని సంభూతమైన విభూతితో సర్వాంగములను-ఉద్భూళితములనుజేసి. వక్షస్థలమునందు, శిరస్సునందు. బాహామూలముల యందు భస్మత్రిపుండ్రములను ధరించి రుద్రాక్షమాలికలనుదాల్చి. సరస్వతికి. కుమారస్వామికి. విఘ్నేశ్వర స్వామికిఁ బ్రణమిల్లి. సూర్యుఁడు, వాయువు. అగ్ని-వీరికిమ్రొక్కి, పులిచర్మముపై తూఱుపుమొగమై పద్మాసనమునందుఁ గూర్చుండి సమగ్రశిరశ్శరీరుఁడును. సంవృతముఖుఁడును. నిశ్చలుఁడనునై నాసాగ్రమునందు-భ్రూమధ్యమునందు,ఆమృతబిందుపులు చిందుచున్న చంద్రబింబమును జూచుచు ప్రాణగమనమును నియమించి. దానివలనఁ జిత్తశుద్ధిని సంపాదించి. చిత్తశుద్ధివలన వేదాంతజ్ఞానమును. అనుభవ

గోచరముచేసికొని, నిర్మలమైన వేదాంత జ్ఞానవాసనలవలన శ్రోతవ్యుఁడును, మంతవ్యుఁడును, నిదిధ్యాసి తవ్యుఁడును, సకలోపాధులను దొలఁగించి తనయందే ప్రతిష్ఠితమై పరిపూర్ణమై సచ్చిదానందైకరసముకంటె రెండవదిలేనిదియై పరమశివమును పరఁజ్యోతియునైన లింగాకృతిగలిగిన - అవిముక్త విశ్వేశ్వరశ్రీమన్మహాదేవుని - ఆ-అంతర్నిటల చంద్రబింబమునందు భావించి భావించి చూచుచుండఁగా, పరిపాకోన్ముఖమైన వెనుకటి జన్మలలోని శుభప్రదమైన అదృష్టముయొక్క సంవ ద్విశేషమువలన.

సీ॥ శ్రీపాదమునఁ బైడి చిఱుగజ్జియలతోడ
తవణిల్లు గండపెండార మమర
వెలిదామరలఁబోలు వెడఁద క్రాల్గన్నులు
మద్దికాయలతోడ నుద్దివడయఁ
మొలక కూఁకటిఁ గ్రాలు(ముక్తాలలామంబు)ముత్యాలరవి రేక
భసితంపు బొట్టుతో బాదరింపఁ
బాలబుగ్గల కాంతి పల్లవంబులతోడఁ
జిన్ని లేనగవులు చెలిమిసేయ

తే. లజ్జ యెఱుఁగని కటిమండలంబుఱూఁది
వలుద వజ్రాల కమకు గర్వంబు సూప
దివ్య బాలకుఁ డొకరుండు తేజరిల్లెఁ
గాశివిశ్వేశ శంభులింగంబు నడుమ. 242

అర్థము :- 'శ్రీపాదమునన్' శ్రీ = శ్రీనిధానమైన, పాదమునన్ = పాదమునయందు, పైఁడి చిఱుగజ్జియలతోడన్ = బంగారు చిఱుగజ్జెలతో, తవణిల్లు = మ్రోఁగుచున్న, గండపెండారము = గండపెండెరము, అమరన్ =ఆమరియుండఁగా.

వెలిఁదామరలఁబోలు = తెల్లఁదామర పూవులను బోలునట్టి, 'వెడఁద క్రాల్గన్నులన్' వెడఁద = విశాలములైన, క్రాల్గన్నులు = మెఱపులీనుచున్న కన్నులు, మద్దికాయలతోడియుద్దిన్ = మద్దికాయలతోడి సామ్యమును, పడయన్ = పొందఁగా.

మొలక కూఁకటిన్ = మొలకయైన పిల్ల జుట్టునందు, క్రాలు = ప్రకాశించుచున్న, ముత్యాల రవిరేక = ముత్యాలతోఁ గ్రుచ్చిన 'రవిరేక అను శిరోభూష,

భసితంపు బొట్టుతోన్ = నొసటి భస్మముపై దీర్చిన తిలకముతో. బాదరింవన్= సమానము కాఁగా.

'పాలబుగ్గల దీప్తి పల్లవంబులతోడన్' పాలబుగ్గల = పాలుగారెడి చెక్కిళ్ళ యొక్క. దీప్తిపల్లవంబులతోడన్ = చిగురుటాకులవంటి వెలుఁగులతో. 'చిన్ని లేనగవులు' చిన్ని = అందమైన. లేనగవులు = (లేఁత - నగవు_లేనగవు) లేఁత నవ్వులు _ చిఱునవ్వులు. చెలిమిసేయన్ = స్నేహము సేయఁగా.

లజ్జ యెఱుఁగని = సిగ్గెఱుఁగని . దిస్సయైన. కటిమండలంబు మీఁదన్ = మొలయ దు, 'వలదవజ్రాలకమరు' వలద = పెద్దవియైన. వజ్రాల = వజ్రము లతోఁ గూర్చిన కమరు = మేఖల. గర్వంబుసూపన్ = మెఱయుచుండఁగా, కాశి విశ్వేశ శంభులిఁగంబు నడుమన్ = కాశీవిశ్వేశ్వర శివలింగ గర్భమునందు. దివ్య బాలకుఁ డొకరుండు = ఒక దివ్యబాలకుఁడు. తేజరిల్లెన్ = ప్రకాశించెను.

తాత్పర్యము :- శ్రీపాదమునందు బంగారు చిఱుమువ్వలతోడి గండపెండే రము 'గల్లు గల్లు' రని మ్రోగుచుండఁగా. తెల్లదామరపూవులవంటి విశాలములైన కన్నులు మద్దికాయలతోడి సౌమ్యమును బడయఁగా. మొలక కూఁకటిమీఁది ముత్యాల 'రవిరేక' నొసటి భస్మరేఖపై దీర్చిన బొట్టుతో సాటికి రాఁగా, పాలుగారెడి లేఁత బుగ్గల కాంతులతోఁ జిఱునవ్వులు చెలిమి సేయుచుండఁగా, దిస్సమొలపై వజ్రాల మొలనూలు ధగధగ మెఱయుచుండఁగా, కాశీవిశ్వేశ్వర శివలింగము నడుమ ఒక దివ్యబాలకుఁడు తేజరిల్లుచుండెను.

చం. ప్రవిశదభంగి దివ్యశిశురత్నము సప్రణవాక్షరంబుగా
శ్రవణ మనోహరంబుగఁ బ్రసన్నముగాఁ బఠియింపజొచ్చె మూ
డవ సవనంబునన్ శ్రుతి; సమభ్యధికంబుగఁ దత్ప్రతిస్వనం
బవిరతలీల గర్భభవనాంతర భూముల నుద్భవింపఁగానన్ . 243

అర్థము :- సప్రణవాక్షరంబుగాన్ = ప్రణవసహితముగా, శ్రవణమనోహ రంబుగన్ = వీనుల విందుగా, లేక చెవులను, మనస్సును ఆకర్షించు రీతిగా, ప్రసన్నముగాన్ = ప్రసాదగుణసహితముగా, మూఁడవ సవనంబునన్ శ్రుతి = మూఁడవ సవనమునకు సంబంధించిన వేదమును, ప్రవిశదభంగిన్ = మిక్కిలి విస్పష్టమైన రీతిగా, దివ్యశిశురత్నము = దివ్యబాలకుఁడు, పఠియింపఁజొచ్చెన్ =

పఠింప మొదలిడెను. గర్భభవనాంతరభూములన్ = లోపలి లోగిళ్ళలో. అవిరత లీలన్ = ఎడఁదెగని మాదిరిగా. 'తత్ప్రతిస్వన-బు' తత్ = ఆ యధ్యయనము యొక్క, ప్రతిస్వనంబు = ప్రతిధ్వనము. సమభ్యధికంబుగన్ = (సమ్ + అభి + అధికంబు - సమభ్యధికంబు) మిక్కిలి పైస్థాయికో. ఉద్భవింపగాన్ = ఉదయింపఁగా.

తాత్పర్యము :- ప్రణవసహితముగా, శ్రవణమనోహరముగా, ప్రసన్నముగా. మూఁడవ సవనమునకు సంబంధించిన శ్రుతిని ఆ దివ్యశిశువు పఠింప మొదలిడెను. భవనగర్భాంతరాళములనుండి ఆ యధ్యయన ప్రతిధ్వనములు ఎడఁదెగని మాదిరిగా మిక్కిలియును పైస్థాయిలో నుదయించుచుండెను.

వ. అప్పుడు విశ్వానగుం డానందాశ్రు పూర్ణలోచనుండును, రోమాంచ కంచుకితాఖిలావయవుండును, గద్గదికానిరుద్ధకంఠధ్వనియును, నయి యంజలిపుటంబు లలాటతటంబున ఘటియించి యేకతంబుగా బ్రహ్మంబద్వితీయంబు నిత్యంబు సత్యంబొక్కఁడుండ రుద్రుం డొక్కఁడుండ కర్త యెవ్వఁ డట్టి నీకు నమస్కారంబు రజ్జువందు సర్పంబును శుక్తియందు రౌప్యంబును మరుమరీచికయందు సలిలంబును బోలె నెవ్వానియందుఁ బ్రపంచంబు కానంబడు నట్టి నీకు నమస్కారంబు తోయంబునందు శైత్యంబును, వహ్నియందు దాహకత్వంబును, దపనునందుఁ దాపంబును, జంద్రునందుఁ బ్రసాదంబును, బుష్పంబునందు సుగంధంబును, దుగ్ధంబునందు ఘృతంబునుం బోలె సర్వంబునఁ దెవ్వం డంతరాత్మండై యుండునట్టి నీకు నమస్కారంబు. శబ్దంబు గ్రహించు నశ్రవణుండు, గంధంబాఘ్రాణించు నఘ్రాణుండు, దూరంబు నడచు ననంఘ్రి, చూచు నలోచనుండు, రసంబుఁగొను నరసజ్ఞుం డెవ్వం డట్టి నీకు నమస్కారంబు. నిజభక్తుండు దక్క విష్ణు విరించి పురందరాది బృందారకు లెవ్వానికందువ యెఱుంగ రట్టి నీకు నమస్కారంబు.

గోత్రంబు, జన్మంబు, నామంబు, రూప బు, శీలంబుఁ దెలియ రాకుండియు నిజభక్తులకు నభీప్సితంబు లొసంగు నెవ్వం డట్టి నీకు నమస్కారంబు. ఎవ్వనివలన సర్వంబును, నెవ్వండు సర్వంబును గనుంగొను, నెవ్వండు సంపన్నుం, డెవ్వండు దరిద్రుం, డెవ్వండు వృద్ధుం, డెవ్వండు యువ, యెవ్వఁడు బాలుం డట్టి నీకు నమస్కారంబు. అని సంస్తుతించి సాష్టాంగ దండ ప్రణామంబుచేసిన నతనిం గరుణాతరంగితంబగు నపాంగ వీక్షణంబునం గనుంగొని వృద్ధవృద్ధుండగు నబ్బాలుండు ముగ్ధ స్మితజ్యోత్స్న చిన్నిబుగ్గలం జిగురొత్త నిట్లని యానతిచ్చె.

అర్థము :- అప్పుడు = ఆసమయమునందు, విజ్ఞానరుండు = విజ్ఞానరుఁడు. ఆనంద = ఆనందమువలన పుట్టిన. అశ్రు = బాష్పములచేత, పూర్ణ = నిండిన. లోచనుండును = కన్నులుగలవాఁడును. రోమాంచ = గగుర్పాటుచేత, కంచుకిత = కప్పఁబడిన, అఖిల-సమస్తములైన, అవయవుండును = అవయవములుగలవాఁడును, గద్గదికా = దగ్గుతికచేత, నిరుద్ధ = నిరోధింపఁబడిన. కంఠధ్వనియున్ = కంఠధ్వనిగలవాఁడును, అయి = అయి, అంజలి = దోయిలియొక్క. పుటంబున్ = వంపుటమును, లలాట = నొసలియొక్క. తటంబునన్ = ప్రదేశమునందు. ఘటియించి = కదియించి. ఏకతంబుగాన్ = ఏకారణమువలన బ్రహ్మాండంబు = బ్రహ్మపదార్థము. అద్వితీయంబు = రెండవది లేనిదియును. నిత్యంబు = శాశ్వతమును, సత్యంబు = సత్యస్వరూపమునై. ఒక్కరుండ = ఏకమో. రుద్రుండొక్కరుండ = రుద్రుఁడు-ఒక్కఁడే, కర్త = జగత్కర్త. ఎవ్వఁడు = ఎవ్వఁడో. అట్టినీకు = అట్టివాఁడవైనినీకు. నమస్కారంబు = నమస్కారము. రజ్జువందున్ = త్రాటియందు, సర్పంబును = పామును, శుక్తియందున్ = ముత్యపుఁ జిప్పయందు. రౌప్యంబును = వెండియును, మరు=ఎడారియందలి, మరీచికయందు = మృగతృష్ణయందు-(ఎండమావియందు). సలిలంబునుబోలెన్ = జలమువలె. ఎవ్వానియందున్ = ఎవ్వనియందు. ప్రపంచంబు = విశ్వము. కానంబడున్ = గోచరించునో. అట్టినీకున్ = అట్టి యధిష్ఠానమైన నీకు, నమస్కారంబు = నమస్కారము. శీతయంబునందున్ = నీటియందు. శైత్యంబును = చల్లదనమును, వహ్ని యందున్=అగ్నియందు, దాహకత్వంబును = కాల్చులక్షణమును, తపనమండున్ = చంద్రునియందు, ప్రసాదదంబును = ప్రసన్నతయును, పుష్పంబునం

దున్ = పువ్వునందు, సుగంధంబును = నెత్తావియును, దుగ్ధంబునందున్ = క్షీర మునందు, ఘృతంబునుంబోలె = నేయియువలె, స్వరంబునందున్ = సకలము నందును, ఎవ్వండు = ఎవ్వాడు, అంతరాత్ముడై యుండున్ = అంతర్యామియై యుండునో, అట్టినీకున్ = ఆ విధముగనున్ననీకు, నమస్కారంబు = నమస్కారము, శబ్దంబు గ్రహించునశ్రవణుండు = శబ్దమును వినునట్టి ఆశ్రవణుడును, గంధం ఘ్రాణించు నఘ్రాణుండు = తావిమూర్కొను ముక్కుడియును, దూరంబు నడచుననంఘ్రి = దూరగామియగు-అపాదుడు, చూచునలోచనుండు=చూచునట్టి-అచక్షువు,రసంబు గొనురసజ్ఞుడు=రసము నాస్వాదించు అ జిహ్వాడు,ఏవ్వండు = ఎవ్వడో,అట్టి నీకునమస్కారంబు=అ విధమైన నీకు నమస్కారము .నిజభక్తుండు తక్కున్=నిజభక్తుడు తప్ప. విష్ణు = విష్ణువు. విరించి = బ్రహ్మ. పురందరాది= ఇంద్రుడు మొదలైన. బృందారకులు = దేవతలు, ఎవ్వానికందువన్ = ఎవ్వని జాడను, ఎఱుంగరు = తెలియరో, అట్టినీకు నమస్కారంబు = ఆ విధమైన నీకు నమస్కారము. గోత్రంబు = గోత్రము, జన్మంబు = పుట్టువు, నామంబు=పేరు. రూపంబు = రూపము, శీలంబున్ = స్వభావమును, తెలిరాకుండియున్ = తెలిసి కొనుటకు-అశక్యమైయుండియును. నిజభక్తులకున్ = నిజభక్తులకు, ఎవ్వండు = ఎవ్వడు, అభీప్సితంబులు = కోరికలను, ఒసంగున్ = ఇచ్చునో, అట్టి నీకు నమస్కారంబు = ఆటువంటి నీకు నమస్కారము, ఎవ్వనివలనన్ = ఎవ్వనివలన, సర్వంబును=సకలమును, కనుంగొనున్=చూచుచుండునో, ఎవ్వండు = ఎవ్వడు, సంపన్నుండున్ = సంపన్నుడో, ఎవ్వండు=ఎవ్వడు, దరిద్రుడు = దరిద్రుడో, ఎవ్వండు = ఎవ్వడు, వృద్ధుండు=ముదుసలియో, ఎవ్వండు = ఎవ్వడు, యువ= పడుచువాడో, ఎవ్వడు = ఎవ్వడు, బాలుండు = బాలుడో, అట్టి నీకునమస్కారంబు = అట్టినీకునమస్కారము, అని = ఇట్లు, సంస్తుతించి = సంస్తుతిచేసి, సాష్టాంగ దండప్రణామంబు చేసినన్ = అష్టాంగములు నేలపై మోచు నట్టి- దండాకారమైన ప్రణామమును జేయగా, అతనిన్ = ఆవిశ్వానరుని, కరుణా = కృపతో, తరంగితంబగు = కెరటములుగలదియైన, అపాంగ వీక్షణంబునన్ = కడకంటి = చూపుతో, కనుంగొని = చూచి, వృద్ధవృద్ధుండగు = ముదుసలులలో ముదుసలియగు ఆబ్బాలుండు = ఆబాలుడు, 'ముగ్ధస్మితజ్యోత్స్న' మగ్ధ = అమాయికమైన, స్మితజ్యోత్స్న = నవ్వువెన్నెల, చిన్నిబుగ్గలన్ = చిన్నిబుగ్గలయందు, చిగురొత్తన్ = చిగురింపగా, ఇట్లని = ఈరీతిగా, అనతిచ్చెన్ = అనతియిచ్చెను,

తాత్పర్యము :- ఆ సమయమందు విశ్వానరుఁడానందబాష్పములతో, గగుర్పాటుతో, దగ్గుత్తికతో, నొసటిపై దోసిలి ఘటించి-ఏకారణమున-అద్వితీయము నిత్యము సత్యస్వరూపములైన బ్రహ్మపదార్థమొక్కటియో, ఏ యొక్కరుద్రుఁడే కర్తయో, అట్టి నీకు నమస్కారము. రజ్జువునందు సర్పమువలె, శుక్తి యందు రజతమువలె. ఎండమావులయందు జలములవలె-ఏ యధిష్ఠానమునందు-ఈసకల ప్రపంచముభాసించుచున్నదో, అట్టి నీకునమస్కారము. నీటియందుఁ జల్లఁదనము. విప్పునందుఁ గాల్చెడు లక్షణము, సూర్యుని యందుతపింపఁజేయు లక్షణము, చంద్రునియందు ప్రసాదగుణము. పూవునందు, తావి, పాలలో నేయియువలె-ఈ సకలమునందు-ఎవఁడు శ్రోత్రవ్యతిరిక్తుఁడై శబ్దమును వినునో, ఏవ్వఁడు ఘ్రాణ వ్యతిరిక్తుడై గంధము మూర్కొనునో, ఎవ్వఁడు పాదవ్యతిరిక్తుఁడై దూరము వడచునో, ఎవ్వఁడు నేత్రవ్యతిరిక్తుఁడై చూచునేమో ఎవ్వఁడు జిహ్వావ్యతిరిక్తుడై రుచుల లెఱుఁగునో, అట్టినీకునమస్కారము, నిజభక్తునకుఁ దప్ప విష్ణు బ్రహ్మ పురందరాదుల కెవ్వని జాడ తెలియరాదో, అట్టి నీకు నమస్కారము. గోత్రము, జన్మము, నామము, రూపము, శీలము, తెలియరాకయే-ఎవ్వఁడు తనభక్తుల కోరికలు దీర్చుచుండునో, అట్టి నీకునమస్కారము. ఎవ్వని వలన సకలము చూడఁగలుగుచున్నదో, ఎవ్వఁడు సకలమును జూచుచుండునో, అట్టినీకునమస్కారము, ఎవ్వఁడు సంపన్నుఁడై యుండియును దరిద్రుఁడో, ఎవ్వఁడు వృద్ధుఁడయ్యును తరుణుఁడో, ఎవ్వఁడు బాలుఁడో, అట్టినీకునమస్కారము. అని సంస్తుతించి సాష్టాంగ దండప్రణామముచేసిన-ఆ విశ్వానరునిఁ గృపారసము కడలొక్కను కడఁగంటఁ జూచి వృద్ధ వృద్ధుఁడగు-ఆబాలుఁడు ముద్దునవ్వు చిన్ని బుగ్గలపైఁ జివురులొత్తఁగా నీవిధముగా-ఆనతియిచ్చె.

విశేషము :- ఉపనిషత్తుల సారాంశమైన యీ సంస్తుతి-మూలములో-ఎనిమిది శ్లోకములలో నున్నది. "అభిలాషాష్టక" మని దానిపేరు. అది ఫలశ్రుతి సహితమైన గొప్పమహిమగల స్తోత్రము, దానిని శ్రీనాథుఁ డీవచనములో కుదించెను.

మ. ఋతిదేవోత్తమ! నీ మనోరథము సంసిద్ధిన్ వహింపన్ బతి
వ్రతకున్ శోభన పుణ్యలక్షణకు విశ్వస్తుత్య చారిత్ర క
ప్రతిమప్రాభవ భాగ్యవైభకళాపారీణకున్ మీశుచి
స్మితకిం బుట్టెదఁ గాశికాపుర తపశ్చర్యా ఫలంబల్పమే? 245

అర్థము :- క్షితిదేవోత్తమ! = భూసురోత్తముఁడా!, నీ మనోరథము=నీ కోరిక, సంసిద్ధి వహింపన్=సంసిద్ధిని పొందునట్లుగా, పతివ్రతకున్=పతివ్రతయును, శోభన=శుభప్రదములైన, పుణ్య = పవిత్రములైనఁ లక్షణకున్ = లక్షణములుగల దియు, విశ్వస్తుత్య=సకలప్రపంచముచేతఁ గొనియాడఁదగిన, వారిత్రకున్ -నడవడికల దియు, అప్రతిమ = సాటిలేని, ప్రాభవ = ప్రభుత్వలక్షణము, భాగ్య = భాగ్యలక్షణము, వైభవలక్షణము గలదియు, కళా = విద్యలయందు, పారీణకున్=పారంగతురాలైన, మీశుష్మతికిన్ = మీశుచిష్మతికి, పుట్టెదన్ = కొడుకునై జన్మించెదను, కాశికాపుర = కాశికానగరమునందలి, తపశ్చర్యా = తపశ్చర్యయొక్క ఫలంబు = ఫలము, అల్పమే? = తక్కువదియా?

తాత్పర్యము :- ఓ భూసురోత్తముఁడా! నీ మనోరథము సిద్ధించునట్లుగా సకలసద్గుణశుభలక్షణ సమన్వితయైన మీశుచిష్మతికిఁ గుమారుఁడనై జన్మించెదను, కాశికాపురమునందుఁ చేసిన తపస్సు యొక్క ఫలము సామాన్యమైనదా?

తే. అచిరకాలమునంద యేనవతరింతుఁ
బరమపావనియైన నీభార్యయందుఁ
జను నిజాశ్రయమునకు సంశయము మాని
విమలపుణ్య! విశ్వానర! విప్రముఖ్య! 246

అర్థము :- విమలపుణ్యా! = నిర్మలమైనపుణ్యముగలవాఁడా!, విప్రముఖ్య = బ్రాహ్మణశ్రేష్ఠుఁడా!, విశ్వానర! = విశ్వానరుఁడా!, అచిరకాలమునంద = శీఘ్రముగనే, పరమ పావనియైన = పరమపవిత్రురాలైన, నీభార్యయందున్ = నీ భార్యయైన యీశుచిష్మతీదేవియందు, ఏన్ = నేను, అవతరింతున్ = అవతరించెను, సంశయము మాని = సందేహము మానుకొని, నిజాశ్రయమునకున్ = నిజనివాసమునకు, చనుము = వెళ్ళుము.

తాత్పర్యము :- విమలపుణ్యుఁడనైన యో విశ్వానరుఁడా! నేను పరమ పావనియైన నీభార్యయందు అచిరకాలములోనే యవతరింతును. సంశయముమాని నీ యింటికిఁ బొమ్ము!

వ. అని చూడంజూడ నయ్యందు చూడుండానందా క్రీడవాటికా
క్రీడ విహార హేలా చిక్రీడం బద్దంబులోని నీడయుం క్రీడా

బోలెఁ బొడచూపి యవిముక్త క్షేత్రాపీడంబగు వీరేశ్వర
లింగంబు నందుఁ గుడుంగంబునందు నుంబోలె డాఁగియుండె.
విశ్వానరుండును విశ్వాస భక్తి తాత్పర్యంబులు మనంబునఁ
బెనంగొన నయ్యనంగ మథనుం దలంచి తలంచి శుచిష్మతి
యుందానుఁ దమ యంజలి పుటంబులు లలాటతటంబులన్
ఘటియించి పస్తుతించుచుం బ్రమోదించుచు నిజనివాసంబున
కుం జనిరనిన విని నైమిశారణ్యవాసులు - ఈశ్వరుండెబ్భంగి
శుచిష్మతికిం, జన్మించెనని యడిగిన-

అర్థము :- అని = పలికి, చూడంజూడన్ = చూచుచుండ గనే, అయ్యిందు చూడుండు = (అ + యిందు చూడుండు-అయ్యిందు చూడుండు) ఆ చంద్రుఁడు చూడాపాశముపైఁ గల యాళివుఁడు, 'ఆనందాక్రీడ .... చిక్రోడంబు' అనంద = 'అనంద' మనెడి, ఆక్రీడవాటికా = ఉద్యానవాటికయొక్క, క్రోఁడ = ఒడియందు, క్రీడావిహార=ఆడుచు విహరించుటయే, హేలా=విలాసముగాఁగల, చిక్రోడంబు= ఉడుత, అద్దంబులోని = అద్దములోపలి, నీడయుంబోలెన్ = నీడవలెనే. పొడ చూపి = కానపచ్చి, 'అవిముక్తక్షేత్రాపీడంబగు అవిముక్త = అవిముక్తక్షేత్రము నకు, ఆ పీడంబగు = అలంకారమైన, వీరేశ్వర లింగంబునందున్ = వీరేశ్వర లింగమునందలి, కుడుంగంబునందునుంబోలెన్ = పొదరింటియందువలె, డాఁగి యుండెన్=నిలీనమై యుండెను, విశ్వానరుండును = విశ్వానరుఁడుకూడ, 'విశ్వాస భక్తితాత్పర్యంబులు' విశ్వాస = నమ్మిక. భక్తి = భక్తి, తాత్పర్యంబులు=తత్ప రత్వములు, మనంబునన్ = మనస్సునందు, పెనంగొనన్ = పెనఁగొనఁగా, అయ్యనంగ మథనున్ = (ఆ+అనంగమథనున్-అయ్యనంగమథనున్) ఆ మన్మథ మథనుని (శివుని). తలంచి తలంచి = ధ్యానించి ధ్యానించి, శుచిష్మతియున్ = శుచి ష్మతియును, తానును = తానును, తమయంజలి పుటంబులు = తన దోయిళ్ల సం పుటములు, లలాటతటంబులన్ = నొపటలయందు, ఘటియించి=కూర్చి, ప్రస్తు తించుచున్ = స్తోత్రముచేయుచు, ప్రమోదించుచున్ = ప్రమోదమునొందుచు, నిజ నివాసంబునకున్ = తమనివాసమునకు. చనిరి = వెళ్ళిరి, అనినన్=అనిచెప్పఁగా. విని = ఆకర్ణించి, నైమిశారణ్యవాసులు = నైమిశారణ్యము నివాసస్థానముగాఁ గల ఋషులు, ఈశ్వరుండు = శివుఁడు, ఎబ్భంగిన్ = (ఎ + భంగిన్-ఎబ్భంగిన్) ఏ

రీతిగా. ఋచిష్మతికిన్ = ఋచిష్మతికిన్. జన్మించెన్ = పుట్టెను, అని యడిగినన్ = అనియడుగఁగా.

తాత్పర్యము :- అని ఆనంద వనవాటిక యొడిలో నాడుకొనెడి యుడుత యగు శివుఁడు అద్దములో నీడవలె నొక్క- క్షణము పొడచూపి, చూచుచుండగనే పీరేశ్వరలింగమునందు పొదరింటిలోవలె దూఱి డాఁగియుండెను. విశ్వానరుఁడును తన మనస్సులో విశ్వాస భక్తి తాత్పర్యములు పెనఁగొనఁగా, అనంగమథనుఁడైన శివునిఁ దలఁచి తలఁచి ఋచిష్మతియును, దానును నొసటిపై దోయిళ్ళు కీలించి స్తుతించుచు, ప్రమోదించుచుఁ దమ యింటికి వెళ్ళిరి. అని సూతుఁడు చెప్పఁగా విని నైమిశారణ్యమునులు శివుఁడు ఋచిష్మతి కేరీతిగా జన్మించెనని యడుగఁగా-

- ఆశ్వాసాంతము -

శా. కర్ణాటోత్కల పారశీక నృపసఖ్య ప్రాభవ శ్రీనిధీ!
యర్ణోరాశి పరీత భూభువన మధ్యాంధ్ర క్షమాధీశ్వరా!
కర్ణాభ్యర్ణ విశాలనేత్ర జగదేకప్రాజ్య సామ్రాజ్య! దృ
క్కర్ణాధీశ్వరహార భక్తి నిరత క్ష్మాపాలచూడామణీ! 248

అర్థము :- 'కర్ణాట....శ్రీనిధీ!' కర్ణాట = నరపతులు, ఉత్కల = గజపతులు, పారశీకర = అశ్వపతులునైన రాజులతోడి సఖ్య = స్నేహసంబంధము, ప్రాభవ = ప్రభుత్వ లక్షణము, శ్రీ = సంపదలు, అను వీనికి. నిధీ! = నిధానమైనవాఁడా! 'అర్ణోరాశి = జలరాసులచేత, పరీత = చుట్టుకొనఁబడిన, అంధ్రక్షమా = ఆంధ్ర భూమికి, అధీశ్వరా! = ప్రభువైనవాఁడా!, 'కర్ణాభ్యర్ణవిశాలనేత్ర!' కర్ణ = వీనుల యొక్క, అభ్యర్ణ = సమీపమువఱకు, విశాల = వెడఁదలైన, నేత్ర! = కన్నులు గలవాఁడా!, 'జగదేకప్రాజ్య సామ్రాజ్య!' = (జగత్ + ఏక - జగదేక) జగదేక = జగత్తు మొత్తముమీఁద, ప్రాజ్య = గొప్పదియైన, సామ్రాజ్య! = సమ్రాడ్భావముగలవాఁడా!, 'దృక్కర్ణ.... చూడామణీ!' దృక్కర్ణ = (దృక్ + కర్ణ - దృక్కర్ణ) దృక్కులే (కన్నులే) కర్ణములు (వీనులు) గాఁగల పాములకు, అధీశ్వర = అధిపతియైన శేషుఁడు, హార = హారముగాఁగల శివునియందలి, భక్తి = భజించుట యందు, నిరత! = శ్రద్ధగలవాఁడా!, క్ష్మాపాలచూడామణీ! = భూపాలురకు శిరోమణియైనవాఁడా!

తాత్పర్యము :- 'నరపతు'లైన కర్ణాటరాజులతోను, 'గజపతు'లైన ఓడ్ర రాజులతోను, 'అశ్వపతు'లైన తురుష్కరాజులతోను, సఖ్యసంబంధము, ప్రాభవము, వైభవము గలవాఁడా !, జలరాశి పరివేష్టితమైన భూ భువన మధ్యమునందలి యాంధ్రభూమికి నధీశ్వరుఁడైనవాఁడా ! ఆకర్ణాంత విశాలములైన కన్నులుగలవాఁడా ! జగత్ప్రసిద్ధమైన సామ్రాజ్యము గలవాఁడా ! శేషవిభూషణుఁడైన శివుని యందు భక్తిశ్రద్ధ గలవాఁడా ! భూపాలురకుఁ జూడామణివంటివాఁడా !

కం. పంచారామవధూటీ
పాంచాల ! త్రిలింగరాజపరమేశ్వర ! య
భ్యంచిత దయాధురంధర
చెంచూమల చూరకార ! చిరపుణ్యనిధీ ! 249

అర్థము :- పంచారామ = అమరారామ, సోమారామ, క్షీరారామ, కుమారారామ, దక్షారామము లనెడి అయిదు శివక్షేత్రములయందు. వధూటీ = భోగయువతులకు. పాంచాల ! = పాంచాలజాతి పురుషుఁడా !, త్రిలింగరాజపరమేశ్వర ! = శ్రీశైల, కాళేశ్వర, దక్షారామలింగముల నడిమిదేశములో నున్న రాజులలో పరమేశ్వరనివంటివాఁడా !, అభ్యంచిత ! దయాధురంధర ! = (అభి + అంచిత - అభ్యంచిత) అభ్యంచిత = మిక్కిలి పూజ్యుఁడా !. 'దయాధురంధర !' దయా = కృపాభావముయొక్క, దురంధర ! = భారమును మోసినవాఁడా !. చెంచూమల చూరకార ! = చెంజి దుర్గమును కొల్లగొట్టినవాఁడా !, ఇది రెడ్డిరాజులందఱికి సాధారణమైన బిరుదము. ఇది వారికేకాక, వారి మంత్రులకుగూడ రాజప్రసాద చిహ్నముగా అతిదేశింపఁబడిన బిరుదలాంఛనము. శృంగారనైషధ కృతిపతియైన మామిడి పింగయామాత్యునిఁగూడ శ్రీనాథుఁడీ 'చెంచుమలచూరకార' బిరుదముతో లాంఛితునిఁ జేసెను.

కం. 'చెంచుమల చూరకారున
కంచితకరుణా తరంగితాపాంగునకున్'

-శృంగారనైషధావతారిక

– భుజంగ ప్రయాతము –

త్రిలోకీ నికాయ్య ప్రదీపప్రతాపా!
కలాభోజ! ఔదార్య కల్పావనీజా!
నలేక్ష్వాకు దుష్యంత నాభాగలీలా
కలా! రెడ్డి! భూపాల కల్పాంతకాలా! 250

అర్థము :- 'త్రిలోకీనికాయ్య ప్రదీపప్రతాపా!' త్రిలోకీ = ముల్లోకమే యనెడి, నికాయ్య = మందిరమునకు, ప్రదీప=పెద్ద దీపమువంటిదియైన, ప్రతాపాఃఁ= ప్రతాపముగలవాఁడా!, కలాభోజఃఁ = విద్యలయందు భోజమహారాజువంటివాఁడాఃఁ. ఔదార్యకల్పానీజాఃఁ=దాతృత్వమునందు కల్పవృక్షమువంటివాఁడా!, 'నలేక్ష్వాకు.... కలా!' నల = నలమహారాజుయొక్క, ఇక్ష్వాకు = ఇక్ష్వాకుమహారాజుయొక్క, దుష్యంత = దుష్యంతమహారాజుయొక్క. నాభాగ = నాభాగునియొక్క. లీలా = అనుకరణమునందలి, కలాఃఁ= షోడశాంశముగలవాఁడా!, రెడ్డి = వీరభద్రరెడ్డీఃఁ, భూపాల = శత్రురాజులకు. కల్పాంతకాలాఃఁ = కల్పాంతమునందలి యమునివంటి వాఁడాఃఁ

తాత్పర్యము :- త్రైలోక్యమే యనెడి మహామందిరమునకుఁ బ్రదీపాయిత మైన ప్రతాపము గలవాఁడా; కలలయందు భోజుఁడాఃఁ ఔదార్యలక్షణమునందు కల్ప వృక్షమువంటివాఁడాఃఁ నలమహారాజు, ఇక్ష్వాకుమహారాజు, దుష్యంతమహారాజు. నాభాగుఁడు మొదలైన ఆదినృపాలురలీలలో షోడశాంశముగలవాఁడాఃఁ శత్రురాజుల పాలిటికి కల్పాంతయముఁడాఃఁ వీరభద్రరెడ్డీఃఁ

గద్యము :- ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర సుకవి జన విధేయ శ్రీనాథనామధేయ ప్రణీతంబైన కాశీఖండం బను మహాప్రబంధంబు వందుఁ తృతీయాశ్వాసము.

76278

శ్రీ కాశీఖండము

మణికర్ణికా వ్యాఖ్యానము

❋ గద్య పద్య సూచిక ❋

(ప్రథమాశ్వాసము నుండి తృతీయాశ్వాసము వరకు)

అ

ఆ-ప-పు

అంత	1-120_119
అంత	3-19_323
అంత	3_132_425
అంతర్విలోకన	2_64_214
అంత సూర్యోదయం	3_239_526
అంతఃప్రవాహమై	3_28_333
అందంద చేసిరి	2_38_181
అందగ్రజుండు	1_32_38
అందుండి ప్రభాస	3_112_411
అందు	1_27_33
అంబోధి	1_63_68
అక్కథకుండు	3_2_308
అక్కథకుండు	2_2_148
అఖిల తీరంబులను	3_92_394
అగస్త్యుండును	2_66_216
అచిరకాలము నంద	3_246_537
ఆచ్ఛోటు గదలి	2_148_288
అట్టిదివోపురాణము	1_76_78
అట్టి యనితల్లి	1_44_49
అట్లు గావున	2_29_169
అడుసులోపల	1_114_114
అడ్డపెట్టెద గాక	1_116_116
అతని యర్ధాంగలక్ష్మి	1_24_31
అతిగుహ్యమై	3_188_469
అతిథి గడునల్పుడైన	1_98_98
అది ప్రజాపతిక్షేత్రంబు	3_94_396
అది మూలప్రకృతి	2_126_269
అది యెట్లనిన	3_211_492
అనంతరంబ	2_39_183
అనంతరంబ కుంభసంభవుం	3_40_340
అనంతరంబ యమ్ముని	3_36_338
అనంతరంబ యమ్మునీశ్వరుండు	3_224_504
అనంతరంబ యౌపనారంభమున	3_215_449
అనఘులార	3_178_460
అనవేమక్షితిపాలు	1_31_37
అవి అనంతరంబ	3_42_342
అవి కుంభసంభవుని	3_4_309
అవి చూడంజూడ	3_247_538

అని చెప్పిన నప్పర 3_174_455
అని చెప్పి యచ్చోటు 3_34_337
అని చెప్పి యప్పరమేష్ఠి 2.14_160
అని తన్మహాప్రబంధ 1_18.25
అనితల్లి వల్లభునకున్ 1_66_70
అని తీర్థయాత్రా 3_86_390
అని ధర్మ్మంబు 3_146_435
అనిన నద్దివ్యపురుష 3_140_431
అనిన యిట్లు 3_142_431
అనిన వాచస్పతి 2_100_247
అనిన వారల్లినిరి 3_150_437
అనిన వారల్లినిరి 3_169_451
అనని వారల్లినిరి 3_179_461
అనిన వారిని 3_196_477
అనిన వారును 2_202_247
అనినవారు మహాత్మా ! 3_138_428
అనిన విధ్యంబు 2-164 304
అనిన విని నైమిశారణ్య 1_140_143
అనిన విని లోపాముద్ర 3_64_368
అనిన విని శివశర్మ 3_209_490
అనిన విని శుచిష్మతి 3_222_503
అని నిశ్చయించి 3_89_391
అని నుతించిన 3_51_352
అని పలికి బృహస్పతి 2_93_237
అని పలికి వాచస్పతి 2_70_219
అని పుణ్యశీల సుశీలురు 3_194 475
అని యగస్త్యమహాముని 2_95 238
అని యడిగినఁ గలశసుతుం 3_67_371
అనియత్యుత్తమ 3_212_466
అని యనంతరంబ 1_15_22
అని యవష్టంభ 1_117_117
అని యవష్టంభ 1_101_104
అని యవిముక్తక్షేత్ర 2_134_275
అని యిట్లు క్రమంబున 3_142_431
అని యివ్విధంబున 3_165_450
అని యెట్టకేలకుం గదలి 1_138_278
అని యెట్టకేలకు 2_141_281
అని యెయరుండి 2_147_288
అనియె నప్పుడు 3_62_365
అని రప్పుడు 3_177_460
అని వారజాసీపురంబు 2_54_204
అని వితర్కించుచుండ 3_128_423
అని వెండియు 2_145_286
అని సముచిత 1_6_10
అనుచు నల్లనల్లన 2_159_298
అనుచు బ్రహ్మలోకంబున 2_36_177
అనుదినంబును 3_214_498
అను మత్రంబులు 2_22_164
ఉన్నగరంబును 3_120_416
అపునరావృత్తి 2_46_195
అప్పటికి నియ్యకొంటి 2_104_248
అప్పుడు 1_96 97
అప్పుడు 2_57_207
అప్పుడు 2_152_293
అప్పుడు నన్నుం 1_1_16
అప్పుడు విఖ్యానరుండు 3_241_533
అప్పుడు శివశర్మ 3_123_419
అప్పుడు శివశర్మ 3_167_450

అప్రయోజన మభివృద్ధి 3_8_311
అప్సరోంగనలెల్ల 3_233_513
అభినవోన్మేషజంబై నట్టి 3_22_325
అభ్యసించితి 3_145_434
అభ్యుదయ పరంపరాభివృద్ధిగా 1_70_72
అమరావతీపురం 30_206_436
అమవసలందు 3_198_479
అమ్మకుశలంబెఁ సాధ్విఁ 2_71_219
అమ్మహాజ్యోతిర్లింగమూర్తి 8_25_516
అయ్యవసరంబున 3_241_528
అర్థిఁ గుంభోద్భవుండిట్టు లనియె 3 59_364
అవధానంబున 2_63_213
అవని దివిజుండు 3 227_508
అవనిభారధురీణ 1_25_31
అవరోధించెను 1_148-117
అసితాంభోధర 3_133_425
అహరారంభము 3_14_319
అహహ తెలిసితి 3_230_511

ఆ

ఆంధ్రక్షిమా మండలా 1_16_23
ఆకాశ మధ్యస్థ మగు 3_180_461
ఆకాశ వాహినీ 3_12_316
ఆచందంబున 1_110_111
అదిరి ప్రమోద నృత్తము 2_37_181
ఆది మనోమయ.బగు 1_77_79
ఆద్యమగు నీ స్తవంబున 2_8_154
ఆనంద విపిన 3_101_102
ఆ పృథివీ ధరంబు 8_3_308
ఆ పృథివీ సుపర్వుఁడు 3_120_416
ఆభ్యంతరవిముక్త 2_120_264
ఆ మచ్చిక యాయనువా 2_135_275
ఆమిత్రావరుణాంశ 3_54_357
ఆవర్ణంబున 1_23_29
ఆశాస్యంబులు 1_83_85
ఆ సత్క్రియాగంబు 1_78_81
ఆ సమయంబునం 3_9_312

ఇ

ఇంకఁరాఁగల 3_52_352
ఇంత విచారమేమిటికి 3_221_502
ఇటు బహువిధములి 3_131_424
ఇఱ్ఱుగుదెంచి 3_29_334
ఇట్లు దివ్యవిమానారోహణం 3_135_427
ఇడ వామనాడి 2_122_267
ఇడా నాడి యందు 2_129_270
ఇది ధర్మం బిది 2_77_224
ఇది పిశాచలోక 3_141_431
ఇది మనోరథంబెట్లు 3_224_505
ఇదియ రూపంబొఁ 3_149 436
ఇమ్మహా ప్రబంధ 1_9_13
ఇమ్మహాస్కాందమ్మునకు 1_80_82
ఇవ్విధంబునం 3_13_318
ఇవ్విధంబునఁ దీర్థంబు 1_85_88
ఇవ్విధంబున దక్షిణాపథ 1_131_135

ఈ

ఈ కాశీఖండంబు 1_82_84
ఈ కోణిన్నినుఁబోలు 1_14_19
ఈ దండ ధరుండు 3_152_438
ఈ దృదళగుఱవిఢికిన్ 1_61_67
ఈ నరకంబుల 3_157_443
ఈ యర్థంబు దేటపడ 3_80_383
ఈ యింద్రలోకంబు 3_205_485
ఈ యైశ్వర్యముఁ జూడ 1_115_115
ఈ వేదమూర్తి 3_186_467
ఈశ్వరుడింటి వేల్పు 1_50_55
ఈహార్మ్యములీ 3_84_388

ఉ

ఉండు నేవీట 1_58_63
ఉజ్జయిని. కాశి. మాయ 3_88_391
ఉత్తరోత్తర మభివృద్ధి 2_52_201
ఉద్భాటితంబులై 3_230_511
ఉద్భిజ్జములు 3_98_400
ఉప్పర మెగసి 1_112_113
ఉభయముఖలగు 2_13_159
ఉర్వీధర శ్రేణులు 2_51_200

ఊ

ఊర్వశీ. మేనక. రంభ 3_17_453

ఋ

ఋషికిఁ బంపాసరోవీచి 3_15_320

ఎ

ఎందుండును 3_232_513
ఎడపుప్రక్కయి 3_99_400
ఎదురలోపాముద్ర 2_56_205
ఎదురుగ వచ్చె 3_143_432
ఎదురుగా వచ్చి 3_144_433
ఎన్నఁడు చూతునో 2_158_297
ఎన్నఁడును 2_45_194
ఎన్నికకు 2_91_236
ఎన్నికల్పంబు 2_48_197
ఎల్లవియు బాహ్యతీర్థంబు 2_116_259
ఎవ్వఁడు నిసర్గ 2_99_246
ఎవ్వనితో నెచ్చోటం 1_109_110
ఎవ్వని నేని 3_47_345
ఎవ్వరొకొ వీరు 3_168_451
ఎవ్వాఁడు డాచేతి 3_32_335

ఏ

ఏకక్రియ ఫలయుగ్మము 2_35 176
ఏమి చెప్పగ 2_144_285
ఏ యిందు బింబాస్య 3_170_452
ఏల చింతింప 3_127_422
ఏల క్రమ్మింగితి 2_157_297
ఏ విధంబున నాత్మ 3_119_263
ఏవీటి శృంగార 3_104_405

ఒ

ఒకదీవి కొకకొండ 1_129_131

ఒక్కఁడు మాకులంబున 1_113_114
ఒక్క నిమేషము 1_134_137

ఓ

ఓంకారేరేశ్వరుండు 2_229_510
ఓర్పుమై నుప్పింది 2_83_229

ఔ

ఔరా యల్లయరెడ్డి 1_52_57
ఔర్వశి కంచె 2_89_235

క

కంటికి నిద్రవచ్చునెఁ 1_108_109
కంచేస్వఃకరికంత పీఠ 3_200_481
కంఠపీఠిక 1_5_9
కంఠాగ్ర కరిరాజు 1_2_4
కండూయనము 2_43_188
కందవు గాజు పాఅవు 3_106_407
కట కటఁ కాశికాపురి 3_100_401
కట్టితిఁ బట్టుఁ బుట్టములు 3_217_500
కట్టురింగుఁ వార 3_119_415
కఠవల్లిఁ బఠియించు 2_151_292
కదలి కతిపయ 3_103_404
కబరికా భారంబు 1_3_6
కమనీయ గోపికా 3_117_413
కమలనయనఁ నీవు 3_48_345
కమలము లుల్లసిల్ల 1_125_126
కమలలోచనఁ 2_103_248
కరికార్ణాంతవిలోల 3_87_390
కర్ణాటోత్కల 3_248_539
కర్ణికాంతముసేరి 3_97_399
కర్పూర కదలికా 1_91_91
కఱకుఁబై వ్రేలిన 3_139_429
కలపుం బోకిల 1_59_65
కలశాబ్ధి కన్యకా 1_22_28
కలహంసిఁ రారాదె 2_140_280
కలిగెఁ బది యాఱు 1_17_24

కొ

కాంచన కేతకీ 3_115_412
కాంచికిఁ బోయి 3_109_408
కాంచి యక్కుఁంభినీ 2_162_302
కాంచెన్ గాంచన 1_87_87
కాంతి యందురు 3_111_410
కాంతుఁడు సంతోషించిన 2_78_224
కానరాదయ్యెఁ 3_216_500
కామధేనువు 2_106_250
కార్తికపుపేళ 3_24_330
కాలలోపంబు 3_181_462
కాఁ బాయుదుఁ 2_114_258
కాశికా నగరంబు 2_47_196
కాశీ కేతెంచు మటి 3_95_398
కాశీక్షేత్రము 2_113_258
కాశీనగరీ 2_161_302
కాశ్మీరంబుల 2_143_282

కి

కింకుర్వాణ పురందరాదిక 3_98_398

కు

కుంభజుఁడు 3_20_323
కుంభసంభవు నన్వేషించు 2_42_186
కుటిలారి రాట్కంఠ 1_28_33

కొ

కొందఱు కులటలు 2_79_225
కొనియాడు బిత్తగణములు 2_19_163
కొనియెం గంచుకముల్ 1_33_38
కొలువంగ లేనైతి 4_82_386
కొల్లాపురి లక్ష్మికి 3_39_340

క్లే

క్లేశంబును సౌఖ్యంబును 3_26_331

గ

గజదళ విభాళ 1_69_72
గవా మజ్జేపు 2_21_164

గా

గాతారం త్రాయతే 2_184_465
గాయత్రి పరబ్రహ్మము 3_185_466
గాయత్రి విష్ణుండు 3_193_474

గి

గిటగిట నెవిమిది 2_127_269

గృ

గృహమేధి ప్రవరుండు 3_101_402

గో

గోదావరీ పావనోదకంబులు 1_48_52
గోమయం యమునా 2_20_164
గోవిందఃభూతేశఃభూ 2_160_466

గ్ర

గ్రంథ పరిసంఖ్య 1_75_77

చ

చంచల్లీలల 1_40_46
చంద్రముని 3_43_342
చటులత నల్లయవేమన 1_36_42
చతురశీత్యామ్నాయ 3_65_368
చరమ రింఖాపుటాంచల 1_126_127

చా

చాకున్న 3_61_365

చి

చింతించి చూడవచ్చిన 3_219_501
చికిలించికొని 3_997_477
చిన్నారి పొన్నారి 1_7_10
చిఱుసానఁ బట్టించి 1_121_119

చీ

చీకటితప్పు చేసిన 2_80_226

చే

చెఱువులేటికిఁ బోలు 3_203_483

చెలువయును దాను 3_57_361
చెలువ: శ్రీగిరియందు 3_79_79

చే

చేడియనామధేయము 3_213_497

జ

జంభారాతీభ 1-46_51
జయ జయధ్వను 2_65_215
జయధాటీ విజయంబు 1_29_35

జి

జిగురుకొన్న భజస్ఫూర్తి 3_21_324
జిష్ణుచైభవ రేఖ 1-55_60

జీ

జీవముతోడ 2_84_230

డు

డుంఠి విఘ్నేశుడు 2_41_185

డె

డెందమును వాక్కు 2_4_149

త

తండ్రి వంశంబునం 2_92_237
తగవు పాటించి 2_82_228
తగులు వడియపుడు 1_133_186
తటుకున నియ్యకొంటి 2_111_255
తత్తరపాటులేక 2_49_197
తదను సంభవుండు 1_41_47
తన్నెఱుగ కెదిరి 3_130_424
తమ తనుచ్ఛాయ 3_11_314
తటిపి వెన్నెలలోని 1_123_122
తల్లి దండ్రులకు 2_11_157

తా

తాపస కులాగ్ర గణ్య 1_89_89

తీ

తీర్థంబు సత్య 3_73_376
తీర్థములు మానసములు 3_72_375
తీర్థోపవాసంబుఁ 3_122_410

తె

తెంచు నెవ్వని హేతి 1_51_56

తొ

తొలఁగుదు రంత 2_90_236

త్ర

త్రసరేణు పరిమాణ 1_90_89

త్రి

త్రిణయనుని 2_150_290
త్రిలోకీ వికాయ్య 3_250_541

త్రై

త్రైలోక్య విజయ 1_65_69
త్రైలోక్య విజయాభిధం 1_10_15

త్ర్య

త్ర్యంబకాచల 1_39_45

ద

దక్షిణ వారణాసి 2_25_331
దక్షిణానంద విపిన 3_30_334
దర వికచ వకుళ 1_92_93
దర్శించి నపుడ 3_77_79

దా

దాని చుట్టును 2_128_270

ది

దివిజమునీ 1_95_97
దివిజాధీశు 3_202_482

దు

దురితము లెన్ని 2_156_296

దూ

దూరము పోయి 2_81_228

ద్వా

ద్వారవతీ నగరంబున 3_113_411

ధ

ధన్యాత్మకుండవు 2-69_218
ధరణీ ధరము 3_240_526
ధరియింప నేర్చిరి 1_37_43
ధర్మగేహినిపై 3_223_504
ధవళలోచనుఁ 3_60_364

ధా

ధారాతీర్థంబనగా 4_71_371

ధూ

ధూర్జండ ఘట్టన 1_127_129

న

నందన వనమిదె 3_201_482
నడచె భాండీరదేశంబు 1_128_138
నతిచేసి 2_12_151
నవి వింధ్యాచలం 2_154_294

నా

నాకు శంభునకు 2_15_160
నాగరికత్వము 2_76_223
నాతో నీవిపుడెట్టులాడితి 1_103_105
నాదు లోకంబునకు 2_27_167
నానాశాస్త్రము 3_81_385
నాభి కందంబు 2_125_268

ని

నిగమ త్రయంబు 2_7_153
నిజధామంబున 2_60_211
నిజమేఁ బల్కెద 2_136_276
నినుబోటి పుణ్యవంతుల 3_151_432
నిరవద్య స్థిర 2_9_155
నిర్ఘృణ నిర్ఘాత 1_67_71

నీ

నీరాజనంబు 2_25_166
నీవెఱుంగుదు 1_104_106

నే

నేత్రంబులున్మేష 1-139_140

ప

పంకజ క్ష్మాధర 3_31_335
పంచ బ్రహ్మంబు 2_62_212
పంచాక్షరీమంత్ర 3_40_133
పంచారామ 3_249_540
పటకులరాజు 1_26_33
పండితుడాతడా 3_45_343
పండువా సురధాని 1_35_41
పట్టస శ్రీ నీరభద్రేశు 3_16_312
పతి పిల్వబంచిన 2_75_222
పదంపడి నిలింపమౌని 1_102_104
పద్మాదికంబులు 1_71_73
పరకళత్రింబు 3_154_440
పరదారాముఖా 3_155_441
పరమకల్యాణీ: 2_139_279
పరమార్థవస్తు 3_50_348
పరిపూర్ణహోమ 3_49_346
పరిరంభం బొనరించె 3_53_356
పరోపకార పరుండ 3_27_332
పవనంబునకు 2_124_268
పసుపుం గుంకుమ 2_73_221

పా

పాటల జటాకిరీటు 2_61_212
పాటిల్లెం ధరణీ 3_129_428
పాణీ యూహార 2_110_254
పాదంబు లిరుకేల 3_153_439
పాము కుండలి 2_131_272
పాయంగ వచ్చునే 2_112_256
పాయక నిర్నిరోధ 1_4_8
పారావార పరీత 1_141_144
పాలిండ్లు గదలంగ 2_53_202

పు

పుండరీకాక్షులార: 3_195_476
పుట్టలోపలి పాము 2_87_234
పురుషసూక్తము 3_83_387
పురుషునియందు 3_46_344

పూ

పూచిన కొరవి 1_138_140
పూర్వఖండంబున 1_84_86

పె

పెండిలినాడు 2_86_232
పెక్కుమాటల 2_88_234

పొ

పొండు మీకు యేలయ్యెడు 2_31_172
పొడిదగ్గు కంఠంబు 3_85_388

పౌ

పౌనఃపున్యము 3_199_480

ప్ర

ప్రకట శాఖోప 1_38_44

ప్రకృతి రూపిణీ 2_121_265

ప్రకృతి స్వరూపఁ 2-5_150

ప్రణవంబునీవు 2_96_239

ప్రణవ పంచాక్షర 2_160-300

ప్రతిదివసంబు 2_108_253

ప్రతియుగంబును 3_118_415

ప్రతివసియించు 2_18_163

ప్రతివాసరము 3_125_420

ప్రథమ సంధ్యా 3_237_520

ప్రయాగ. నైమిళంబు 3_69_372

ప్రవహించు నెచ్చోటు 2_28_168

ప్రవిశదభంగి 3_243_532

ప్రా

ప్రాకట విక్రమ 1_60_66

ప్రాగ్గిరికాంత 1_124_125

ప్రాణాంబ యాదిత్యుండు 2_132_273

ప్రాణేశుఁడారగింపక 2_72_220

ప్రాతఃకాలము 3_17_322

ప్రాలేయ కిరణంబు 1_122_121

ప్రాశ్త్యంబు వహించు 1_81_83

ప్రి

ప్రియముఁ గలిగిన 2_85_231

బ

బంధులోక పారిజాతఁ 2_167_306

బలవద్వైరహదొంతి 2_165_305

బా

బాదరాయణ 1_19_26

బాహ్యాభ్యంతరంబుల 2_118_261

బి

బిసరుహ పత్రలోచన 3_74_377

బు

బుద్ధ్యహంకార 2_6_151

బృ

బృహస్పతియు 2_68_217

బ్ర

బ్రతుకు మీఁదీ 3_124_419

బ్రహ్మచర్యం బొక్కరాత్రి 3_172_454

బ్రహ్మణ్యదేవ 3_162_447

బ్రహ్మపుట్టించు 3_44_343

బ్రహ్మ బ్రహ్మస్వరూప 2_3_149

బ్రహ్మలోకోన్నత 3_91_393

బ్రహ్మ సంవేద్య 3_33_337

భ

భద్రికాళికయై 3_38_339

భద్రేభముఖులకు 3_228_509

భవు మహాకాళు 3_108_408

భూ

భూగ్రహణంబుల 2_118_259

భూపాల మథన 2_176_306

భూమిపతి పుత్త్రి 2_142_282

భై

భేషఁ బెద్దని 1_111_112

మ

మంత్రములలోన 4_183_465

మందాకినీ వారి 3_226_507

మకర కుండల 1_45_50

మత్పితామహా 1_20_27

మనశాగ్యమున 2_34_175

మనుతుల్యండగు 1_43_48

మఱి కొందఱు 3_66_369

మఱియు వినుండు 3_163-448

మలయాచలంబు 1_130_133

మహానుభావా 1_100_100

మా

మాంత్రికుండైన 3_173_455

మాట నిల్కడగాదె 2_107_251

మార్కండేయ 1_57_62

మావచ్చిన 2_94_238

మీ

మీ కెయ్యది 2_10_156

ము

ముందటఁ బిఱుదం 2_24_165

ముందట 1_86_87

ముక్తి ప్రయోజనంబున 3_338_522

ముదువంగ నేర్తురు 3_110_409

మునిచూడామణీ 3_18_322

మునులు నమరులు 2_67_216

మూ

మూఁడు లక్షలు 1_72_75

మూఁడు వేదంబులు 3_190_471

మే

మేదినీ ధర 1_119_118

మేలైన రెండు 3_182_464

మొ

మొగులు ముట్టిన 1_99_98

మొదలుగల 3-6_310

మొదల సుషుమ్న 2_133_274

మో

మోకాళ్ళు భూమిపై 3_187_467

య

యక్షరాజుఁ దలంచి 2_149_290

యత్నమొనరింతు 2_101_247

యమి హ్యల్లేఖాది 3_58_360

యమువి రూపంబు 3_148_346

ర

రజకితోడ నుదక్యతో 2_74_222

రమణీ ధరియింతు 3_116_413

రా

రాగదోషమలాపహార 3_76_379

రాయవేశ్యాభుజంగ 1_12_16

రు

రుద్రాక్షభూతి 2_59-210

రె

రెండువేలును 1_135_138

రే

రేవాతరంగ శీకర 1_88_88

రౌ

రౌరవంబనఁగ 3_158_443

ల

లలితా హంక్యతి 1_30_36

లీల మహాకాల 3_107_407

లే

లేరీ ధరణిపు 1_47_52

లేవయ్య స్వాహా 1_137_139

లేవు లింగరబు 2_137_277

వ

వక్షస్థలంబున 1_146_286

వచియింతు వేములవాడ 1_13_17

వరుస నెనిమిది 1_73_75

వల్లకి చక్కి 1_56_61

వా

వాతాపి దమనుండు 3_55_359

వాతాపిల్వలు 2_30_172

వారలేకద 3_137_428

వి

విండ్యాచలేంద్రః 2_163_303

వినుఁడనయంబు 2_17_162

విను(డు గోవులు 2_26_166

విప్రకుల ముఖ్య 3_147_435

విబుధమని మాట 1_106_108

విమలకైవల్య 2_32_174

విముఖుఁడయ్యె 2_109_253

విలసిత కీర్తిశాలి 1_49_59

వివరించి చూడంగ 2_105_249

వివిధాజ్యాహుతి 3_208_489

విశ్వానరుండు 3_210_491

విష్ణుభక్తులఁ 3_136 437

విస్మయర ద్వాంతౌఘ 1_32_135

వీ

వీరెమునులు 2_98_241

వృ

వృషీశాశాంచలంబు 2_55 204

వె

వెండియుఁ గర్కరేటు 1_93_93

వెండియుఁ గుంభసంభవుండు 2_155_297

వెండియు బాకదళావిశీర్ణ 3_23_237

వెండియు నయ్యాల్వాల 3_58_361

వెండియు నవ్వనంబున 2_44_190

వెలిదామరల 3_134_425

వే

వేమాంబాప్రియ 1_142_145
వేమాధిపానుజున 1_64_69

వై

వైకుంఠమున 3_93_395

వ్యా

వ్యాహృతులతోడ 3_191_473

శ

శంభు ప్రాసాదంబు 3_70_373
శమనలోకాభివర్ణన 3_166_450
శమనుని రాజధాని 3_164_449

శా

శాత్రమాచార్య 1_107_109

శి

శిఖ కర్మ కంతులకు 3_207_487
శివుడే దాత 2_58 208

శీ

శీర్షంబు నందలి 2_117_260

శు

శుక్రుడితండు 2_97_240

శ్రీ

శ్రీకాశీ నగరాధిరాజ్య 1_1_1

శ్రీపాదముల 3_242_531
శ్రీమద్దేసటి 3_1_308
శ్రీరాజమహేంద్రవర 2_1_147
శ్రీశైల వేంకటాహోబల 1_105_107
శ్రీశైలాదులు 3_68_372

శ్వే

శ్వేత వరాహకల్పము 3_37_339

స

సంచార శీలుడౌ 3_176_458
సంతానంబు 3_220_502
సంతాపంబున 3_126_421
సంశిత విజ్ఞాన 3_189_470
సకల ఫలంబులుం 2_16_161
సకలైశ్వర్య 3_218_501
సప్తమాడియ 1_34_39
సమగతి నేకకాల 2_130_272
సరవి సర్గంబు 1_74_76
సరివేరీ జలరాశి 1_54_59

సా

సాకేతమున కేగి 3_90_391
సారంగనయన 3_78_381

సి

సిద్ధమరుత్సాధ్య 3_234_515

సిద్ధాంత సంసిద్ధి 3_175_456
సిద్ధింప వీప్సితంబు 3_7_311

సు

సుదతిఁ యేటికి 3_75_378

స్కం

స్కంద పురాణ 1_8_12

స్కా

స్కాంద మందుల 1_79_82

స్తు

స్తుతిపూర్వకంబుగ 2_23_165

స్థా

స్థావరంబైన 1_97_97

స్థి

స్థితి సర్గ 1_136_138

స్వ

స్వటిక భూముల 3_10_312

హ

హరశ్రీ పదాంభోరుహ 1_143_145
హరిదాటించె 1_53_58
హరినామ సంకీర్తనంబును 3_158_444
హరి యిడకు 2_123_267
హరిఁ రజనీ 3_161_446
హరులేడ నేడు 3_236_518
హర్షోత్కర్షంబు 2_33_174

హా

హాటక భృద్ధనుర్ధర 1_68_71
హాటకేశ్వరుఁడ 3_105_406

హృ

హృదయంబులో 3_63_366

క్షి

క్షితిదేవో త్తమ 3_245_536
క్షితిదేవో త్తమ 3_191_473
క్షితిపాలో త్తమ 2_153_294

క్షీ

క్షీరాంభోనిధి 3_204_484
క్షీరారామంబున 3_35_337
క్షీరోద కన్యకు 3_41_341

క్షు

క్షురికాకర బేతాళున 1_62_68

సుందరయ్య గ్రంథాలయ
A C. No.....
7628
హైదరాబాద్-500 044.

BEQ

SVKA172B1145

BBU

ముద్రణ : బి. వి. అండ్ కో. ప్రెస్, టి. నగర్, రాజమండ్రి-533 101.

మువను ఫౌండేషన్ పుస్తకాల పంపిణీవాహిక

పుస్తకం సంఖ్య	SVKA172B145
పుస్తకం పేరు	కాశీఖండము
తారీఖు	20 November 2025
ముందు అట్ట	
వెనుక అట్ట	
మొత్తం పేజీలు	
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	
లేవి పేజీలు	
తయారు చేసినది	
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	NAZMA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపినది	